చరిత్ర

# ఆంధ్రుల చరిత్ర



ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్

www.freegurukul.org



సదాశివ సమారంభాం
గురు దక్షిణామూర్తి
గురు వేదవ్యాస మహర్షి
గురు శుక మహర్షి
గురు నారద మహర్షి
గురు వాల్మీకి మహర్షి
గురు శ్రీకృష్ణ
శంకరాచార్య మధ్యమాం
గురు దత్తాత్రేయ
గురు బాబాజి
గురు గౌతమ బుద్ధ
గురు ఆదిశంకరాచార్య
గురు రామానుజాచార్యులు
గురు జ్ఞానేశ్వర్
గురు రవిదాస్
గురు కబీర్ దాస్
గురు చైతన్య మహా ప్రభువు
గురు నానక్
గురు రాఘవేంద్ర స్వామి
గురు వీరబ్రహ్మేంద్ర స్వామి
యోగి వేమన
అస్మదాచార్య పర్యంతాం
గురు త్రైలింగ స్వామి
గురు లాహిరి మహాశయ
గురు రామకృష్ణ పరమహంస
అమ్మ శారదా దేవి
గురు వివేకానంద
గురు సాయిబాబా
గురు అరబిందో
గురు రమణ మహర్షి
గురు యోగానంద
గురు భక్తివేదాంత ప్రభుపాద
గురు మళయాళ స్వామి
గురు విద్యాప్రకాశానందగిరి
గురు చంద్రశేఖర పరమాచార్య
వందే గురుపరంపరాం..

Free Gurukul

"ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్" ద్వారా విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందించే సేవా కార్యక్రమంలో బాగంగా ఈ పుస్తకాన్ని భారత ప్రభుత్వపు వెబ్ సైట్( డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా) నుంచి సేకరించి అందిస్తున్నాము. ఇందుకు మేము వారికి కృతజ్ఞత తెలియచేసుకుంటున్నాము.

సాయి రామ్ వారి సేవల విస్తరణలో బాగంగా ఈ ఫౌండేషన్ స్థాపించబడినది. ఈ స్వచ్ఛంద సంస్థ ద్వారానే అన్ని సేవలు అందించబడును. ఇటువంటి పుస్తకాలు మీరు వ్రాసినట్లయితే (లేక) సేకరిస్తే మాకు తెలియచేయండి. మేము ప్రతి విద్యార్థికి ఉచితంగా అందేలా చేస్తాము, తద్వారా ఉన్నత విలువలు, నైపుణ్యాలు కలిగిన విద్యార్థులను మన దేశానికి అందించవచ్చు. మాతో కలిసి నవ భారత నిర్మాణ కార్యక్రమంలో పనిచేయుటకు, భాగస్వామ్యం అగుటకు ఆసక్తి ఉంటే సంప్రదించగలరు.

ఈ గ్రంధాలను ఉచితంగా ఆన్ లైన్ లో చదువుటకు, దిగుమతి(డౌన్లోడ్) చేసుకొనుటకు గల మార్గాలు:

1) భారత ప్రభుత్వపు వెబ్ సైట్: http://www.new.dli.ernet.in
2) ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ వెబ్ సైట్ : www.freegurukul.org
3) సాయి రామ్ వెబ్ సైట్ : https://sites.google.com/site/sairealattitudemanagement
4) మొబైల్ ఆప్: Free Gurukul

గమనిక: భక్తి,జ్ఞాన,ధర్మ ప్రచారార్ధం ఉచితంగా eBook రూపంలో భారత ప్రభుత్వపు డిజిటల్ లైబ్రరీ సహాయంతో ఇవ్వడం జరిగింది. ఇది లాభార్జన దృష్టిలేని ఉచిత సేవ. ఈ సేవలో అంతర్జాలంలోని(ఇంటర్నెట్) లైసెన్సు / కాపీరైటు అభ్యంతరాలు లేనివి అనుకొన్న పుస్తకాలను గ్రహించటం జరిగినది. అనుకోకుండా ఏవైనా అభ్యంతరకరమైనవి ఉన్నచో మాకు తెలుప మనవి, వాటిని తొలగించగలము అని మనవి చేసుకొంటున్నాము.

Website: www.freegurukul.org Mobile App: Free Gurukul email: support@freegurukul.org
Facebook: www.facebook.com/freegurukul Help Line / WhatsApp: 904 202 0123


" మన లక్ష్యం: విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య అనేది ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందరికి అందించబడాలి "

ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ – Free Gurukul Education Foundation

సర్వం పరమాత్మ పాద సమర్పణమస్తు

## భారత ప్రభుత్వపు వెబ్ సైట్ - డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా

**http://www.new.dli.ernet.in**



# అతి విశిష్టం ఈ దానం!

స్వామి వివేకానంద

"దానాలలోకెల్లా ఆధ్యాత్మిక విద్యాదానం చాలా శ్రేష్ఠమైంది! దాని తరువాతిది లౌకిక జ్ఞానదానం, ప్రాణదానం, అన్నదానం" అని వ్యాసమహర్షి చెప్పారు.

మన ఆధ్యాత్మిక జ్ఞానం భారతదేశ హద్దులలో నిలిచి పోకూడదు. లోకమంతటినీ ఆవరించాలి! ఇలా లోకవ్యాప్తమైన ధర్మప్రచారాన్ని మన పూర్వులు చేశారు. హైందవ వేదాంతం ఎన్నడూ ఈ దేశం దాటి పోలేదని చెప్పేవారూ, మతప్రచారార్థం తొలిసారిగా, పరదేశాలకు వెళ్ళిన సన్న్యాసిని నేనే అని చెప్పేవారూ, తమ జాతిచరిత్ర నెరుగని వారే! ఇలాంటి సంఘటనలు ఎన్నోసార్లు జరిగాయి. అవసరమైనప్పుడల్లా, భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానప్రవాహం వెల్లువలా లోకాన్ని ముంచెత్తుతూ వచ్చింది.

రాజకీయ ప్రచారాన్ని రణగొణధ్వనులతో, యోధులతో సాగించవచ్చు. అగ్నిని కురిపించి, కత్తిని ఝళిపించి, లౌకిక జ్ఞానాన్నీ, సంఘనిర్మాణ విజ్ఞానాన్నీ విరివిగా ప్రచారం చేయవచ్చు. కానీ ఆధ్యాత్మిక జ్ఞానదానం కళ్ళకు కనిపించకుండా, చెవులకు వినిపించకుండా కురుస్తూ, రోజా పువ్వుల రాసుల్ని వికసింపజేసే మంచులాగా నిశ్శబ్దంగా జరగవలసి ఉంది. భారతదేశం నిరాడంబరంగా, లోకానికి మళ్ళీ మళ్ళీ చేస్తూ వచ్చిన దానమిదే!

మిత్రులారా! నేను అవలంబించే విధానాన్ని తెలియజేస్తాను వినండి. భారతదేశంలోనూ, ఇతర దేశాల్లోనూ మన పారమార్థిక ధర్మాలను బోధించడానికి తగినవారుగా మన యువకుల్ని తయారు చేయడానికై భారతదేశంలో కొన్ని సంస్థలను నెలకొల్పాలి! ఇప్పుడు మనకు కావలసింది బలిష్ఠులు, జవసంపన్నులు, ఋజువర్తనులు, ఆత్మ విశ్వాసపరులు అయిన యువకులు. అలాంటి వారు నూరుమంది దొరికినా, ప్రపంచం పూర్తిగా పరివర్తన చెందగలుగుతుంది!!

ఇచ్ఛాశక్తి తక్కిన శక్తులన్నిటి కన్నా బలవత్తరమైంది. అది సాక్షాత్తూ భగవంతుని దగ్గరి నుండి వచ్చేదే కాబట్టి దాని ముందు తక్కినదంతా లొంగిపోవలసిందే. నిర్మలం, బలిష్ఠం అయిన 'ఇచ్ఛ' (సంకల్పం) సర్వశక్తిమంతమైంది. దానిలో మీకు విశ్వాసం లేదా? ఉంటే మీ మతంలోని మహోన్నత ధర్మాలను ప్రపంచానికి బోధించడానికై కంకణం కట్టుకోండి. ప్రపంచం ఆ ధర్మాల కోసమై ఎదురుచూస్తోంది. అనేక శతాబ్దాలుగా ప్రజలకు క్షుద్రసిద్ధాంతాలు నేర్పడం జరిగింది. వారు వ్యర్థులని ప్రపంచమంతటా బోధలు జరిగాయి. ఎన్నో శతాబ్దాల నుండి వారు ఈ బోధనల వల్ల భయభ్రాంతులై, పశుప్రాయులైపోతున్నారు. తాము ఆత్మస్వరూపులమనే మాటను వినడానికైనా వారెన్నడూ నోచుకోలేదు. "నీచాతినీచుడిలో కూడా ఆత్మ ఉంది. అది అమృతం, పరమ పవిత్రం, సర్వశక్తిమంతం, సర్వవ్యాపకమైనది" అని వారికి ఆత్మను గురించి చెప్పండి. వారికి ఆత్మవిశ్వాసాన్ని ప్రసాదించండి. ❖



మూలం: శ్రీ రామకృష్ణ ప్రభ - ఫిబ్రవరి 2014

# ఆంధ్రుల చరిత్ర



# ఆంధ్రుల చరిత్ర

(ప్రాచీన, మధ్య, ఆధునిక యుగాలు)

డాక్టర్ బి. యస్. యల్. హనుమంతరావు

విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్
విజ్ఞాన భవన్, 4-1-435 బ్యాంక్ స్ట్రీట్
హైదరాబాద్-500 001

# కృతజ్ఞతలు

చరిత్ర అధ్యయన అధ్యాపనాలే ఉచ్ఛ్వాస నిశ్వాసాలుగా జీవించిన వారు నా భర్త శ్రీ హనుమంతరావుగారు. కదిలిస్తే కథలు చెప్పే కాగితాలు, పుస్తకాలు, చరిత్రను నిక్షిప్తం చేసుకున్న శిలామూర్తులు. చివరి వరకూ వారి చేయి వీడని సహచరులు. అందరికీ కనపడేది వారి మౌన గంభీరమూర్తి. ఆప్తులకు అనుభవమయ్యేది మానవత్వపుమమత. చరిత్రకారునిగా అందుకున్న ప్రశంసలు, విమర్శలు ఎన్నెన్నో .... అన్నిటినీ సమదృష్టితో స్వీకరించి అవిశ్రాంతంగా పరిశోధన సాగిస్తూ సమావేశాలు, సమ్మేళనాలు అంటూ ఉత్సాహపడే అలసట తెలియని ఆ హృదయం ఎందుకో అలిగింది. చరిత్రకారుని చరిత్రపుటగా మార్చింది. పుస్తక భాండాగారాన్ని స్మృతి చిహ్నంగా నాకు మిగిల్చింది.

సన్మానాలు, సత్కారాలను సున్నితంగా తిరస్కరించే శ్రీ హనుమంతరావుగారు ఇండోరులోని జైన సంస్థ కుందకుంద జ్ఞానపీఠంవారి పురస్కారాన్ని అందుకోవటానికి సమ్మతించారు. ఆ సందర్భంగా 1993 జూన్ 6 వ తేది సమాజంలోని నిమ్నోన్నతాలను సరిచేయడంలో బౌద్ధజైన మతాలు నిర్వహించిన పాత్రను విశ్లేషిస్తూ చేసిన ప్రసంగమే వారి రచనా వ్యాసంగానికి, ప్రసంగాల పరంపరకు అనుకోకుండా అయిన ముగింపు.

ఆంధ్రుల చరిత్రకు, వారు ఒక నిఘంటువు లాంటివారని వారి శిష్యులు, సహోద్యోగులు, నాతో అనటం కేవలం ముఖప్రీతి కోసం కాదని నా నమ్మకం. ప్రామాణిక పరిశోధనకు, నిశిత విశ్లేషణకు పలువురి మన్ననలను పొందిన వారి కృషి ఫలితం ఈ ఆంధ్రుల చరిత్ర.

శ్రీ హనుమంతరావుగారు రాసిన 'ఆధునిక యుగం' చరిత్రను కూడా ఈ గ్రంథంలో రెండో భాగంగా చేర్చి ప్రచురించటం జరిగింది.

ఆంధ్రుల చరిత్రను ప్రచురించటానికి సహృదయంతో ముందుకు వచ్చిన విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్‌వారికి నా కృతజ్ఞతలు. ముఖ్యంగా శ్రీ ఏటుకూరి బలరామమూర్తి, శ్రీ రాజేశ్వరరావు గార్లకు నా కృతజ్ఞతలు.

—బి. ప్రియంవద

## మొదటి ముద్రణకు

# ముందు మాట

'ముక్కోటి ఆంధ్రులు ఒక గొడుగు నీడకు వచ్చి', 1956 లో ఆంధ్ర ప్రదేశ్ అవతరించిన ఉత్సాహంలో, 'ఆంధ్రుల చరిత్ర'ను రచించి ప్రచురించిన సందర్భంలో ఆచార్య మామిడిపూడి వెంకట రంగయ్యగారు, ఉన్నవ లక్ష్మీనారాయణ పంతులుగారు నన్ను అభినందిస్తూ ఆంధ్రుల చరిత్రను విపులంగా రచించవలసిందని సలహా ఇచ్చినారు. గడచిన ఇరవైఐదు సంవత్సరాల్లో ఆంధ్రుల చరిత్రలో విశేషంగా పరిశోధనలు జరిగినాయి. కొత్త పురావస్తు సాక్ష్య సమాచారం లభ్యమయింది. పెద్దల సలహాను పాటిస్తూ, నూతన పరిశోధనా ఫలితాలను పొందుపరుస్తూ, సాధ్యమైనంత సమగ్రంగా ఈ ఆంధ్రుల చరిత్రను రచించడమయింది.

చరిత్ర కేవలం రాజకీయ సంఘటనల పట్టిక కాదు. భిన్న రంగాల్లో మానవ కృషి, ఆ కృషి ఫలితంగా మానవ జీవితంలో, దృక్పథంలో వచ్చిన పరిణామాలు-అంటే నాగరికతా సంస్కృతుల కథనం. అందుచేత రాజకీయ సంఘటనల నేపథ్యంలో పాలన విధానంలో, ఆర్థిక కృషిలో, మత సాంఘిక సారస్వత లలితకళా రంగాల్లో ఆయా యుగాల్లో వచ్చిన మార్పులు సమీక్షించబడినాయి. ఆంధ్రుల చరిత్రలో అనేక అంశాలపై తీవ్ర అభిప్రాయభేదాలున్నాయి. ఆ సందర్భాల్లో భిన్న వాదాలను సమగ్రంగా చర్చించడం, ఋజు దృష్టితో నిర్ణయాలు చేయడం జరిగింది.

ఆంధ్రుల చరిత్ర సంస్కృతుల్లో ఆసక్తి ఉన్న వారందరికీ ఈ గ్రంథం ఉపకరిస్తుందని నా విశ్వాసం.

ఈ గ్రంథానికి రెండో సంపుటంగా 'ఆధునిక ఆంధ్ర చరిత్ర' త్వరలో అందించగలనని ఆశిస్తున్నాను.

ఈ గ్రంథాన్ని అచ్చొత్తి తయారు చేసిన వెల్‌కమ్ ప్రెస్ ప్రయివేట్ లిమిటెడ్ యజమానులకు, సిబ్బందికి, ఇందలి దేశ పటాలను వ్రాసి ఇచ్చిన మిత్రులు బి. నాగవర్ధనరావుగారికి నా కృతజ్ఞతలు.

—రచయిత

# ప్రముఖుల అభిప్రాయాలు

"....చారిత్రక ఆధారాలతో విమర్శల విపులీకరణతో నిష్పాక్షికంగా వ్రాయడం మీ చారిత్రక దృష్టికి మచ్చుతునక. (ఇది) అన్ని వివరాలతో నిండిన చారిత్రక ప్రమాణాలతో ఉన్న చరిత్ర.... "

– శ్రీ రావిలాల గోపాలకృష్ణయ

"....I am impressed by the original and objective way you treated the origins of Satavahanas, the Ikshvakus and the Pallavas. ....You have brought out well the Ja'na contribution to the development of the Telugu.

I note that caste conflicts raised their head in medie·al Andhra itself .... What you said about the tension between the movement for the revival of Vedism and the opposition to Brahmana supremacy in the Vijayanagar period is significant. ....The religious tolerance of the Qutubshahis, their identity with this country and their effort to promote culture and develop economy are admirable. As a humanist and rationalist you have rightly ended your work with a loud of Vemana, whom you consider to be a humanist and rationalist.

Yours is on the whole and excellent and important work in Telugu on Andhra History ..

– Prof. K. Satchidananda Murthy. Andhra University
Waltair, dt. 19th Feb. 1984. (Private letter)

....The Author rightly points out due agricultural expansion and its thrust began after the fall of the

Satavahanas. which also coincided with the fall in the Roman trade. This factor, coupled with the rise of agraharas, led to the rise of new class of land owners and also to the rise of brahmanas in polit cal and economic spheres. The economy during this period is rightly termed as rural economy........ The growth of economy during 11th and 12th centuries, witnessed the rise of agricultural and artisan classes. Attendant social changes, religious conflicts between Saivas and Jainas, impact of Virasaivism and Viravaisnavism, growing importance of village deities and deities of the artisans are explained in a suceinet manner.... ...

Rational attitude and discerning judgement in the clarification of issues such as identity or the origin of either the Satavahanas or the famous poets like Nannaya or Srinatha or in tbe analysis of Vijayanagara founders or Vidyaranya's role are notable and free from Chauvinism. The author has utilised recent epigraphical and archae. logical discoveries and the extensive use of literary data is remarkable. This work is lucidly written and the author deserves congratulations for this outstanding work on Andhra History."

— Dr. B. Rajendra Prasad. Professor : Nagarjuna University - (at present S. V. University, Tirupati) Journal of Andhra Historical Research Society Vol. XXXIX 1995. Govt of Andhra Pradesh, Hyderabad.

"....'మంచి గతమున కొంచెమేనోయ్' అనే విమర్శనాత్మక దృష్టిని, భవిష్యత్తు పట్ల ఆశాభావాన్ని పెంచడం చరిత్ర రచన ధ్యేయంగా వుండాలి. అట్టి రచనలలో ప్రస్తుత గ్రంథం ఒకటి. ఈ రచనలో గ్రంథకర్త ప్రధానంగా

రాజకీయ సామాజిక సాంస్కృతిక చరిత్రపై దృష్టిని కేంద్రీకరించారు........ ఆంధ్రుల చరిత్రపై శాస్త్రీయ దృష్టితో వెలువడుతున్న గ్రంథాలలో ఈ రచన ప్రముఖ స్థానం వహిస్తుంది. ప్రవాహ సదృశమైన తెలుగులో రచన చేయడంలో తమ సామర్థ్యాన్ని రచయిత నిరూపించుకున్నారు."

—శ్రీ బలరామమూర్తి "విశాలాంధ్ర" 7.8.83

[చరిత్ర పరిశోధనలో శ్రీ హనుమంతరావుగారి ప్రత్యేకతను విశదీకరిస్తూ శ్రీ బలరామమూర్తిగారు "విశిష్ట విశ్లేషణ" అన్న గ్రంథం వెలువర్చారు.

— ప్రచురణకర్తలు]

"....ఆంధ్రుల చరిత్రను సమగ్రంగా అందించిన రచయితలు కొద్దిమందే. అందులో డా. బి. యస్. యల్. హనుమంతరావు ప్రముఖులును సత్యాన్వేషణను ఊపిరిగా భావించే మనీషీనూ. చరిత్రలో ఏ యుగం స్వర్ణయుగమైనా, అంధయుగమైనా అది మన చరిత్ర. దాన్ని పాక్షిక రాజకీయ దృక్పథంతో వ్యాఖ్యానించకూడదు అనే సంకల్పం కలవారు. హేతువాద దృష్టితో సత్యావిష్కరణకు పూనుకొనే తత్వం వారిది........తెలుగు భాషా సాహిత్యంలో విశేషమైన కృషి చేసిన శ్రీ హనుమంతరావు ఆంధ్రుల చరిత్రను ప్రామాణిక చారిత్రక రచనగా, ఉత్తమ సాహిత్య గ్రంథంగా వెలువరించి ఆంధ్రుల కృతజ్ఞతలకు పాత్రులవుతున్నారు."

— రామమోహనరాయ్ "ఆంధ్రజ్యోతి" 9.9.1984

"సుప్రసిద్ధ చరిత్రకారులైన డాక్టరు హనుమంతరావు పెరుగుతున్న పరిశోధన ఫలితంగా వెలువడుతున్న నూతన సత్యాలన్నింటినీ వినియోగించుకొని స్వయంశోధిత విషయాలను చేర్చి, తమకు సమ్మతం కాని యితరుల అభిప్రాయాలను కూడా చిత్తశుద్ధితో ఉటంకిస్తూ ఈ 'ఆంధ్రుల చరిత్ర'ను రచించిన తీరు గణనీయంగా వుంది. ముఖ్యంగా సాహిత్యాది విషయాలవల్ల లభించే చారిత్రకాంశాలను ఇందులో చేర్చటం ముదావహం. వీరి గ్రంథం విద్యార్థులకు విద్వాంసులకు సామాన్య పఠితలకు ఉపయోగకరమయిన రీతిలో ఉండటం ముదావహం."

— ఆంధ్రవ్యాస శ్రీ ఏలూరిపాటి అనంతరామయ్య, (ప్రిన్సిపాల్)
డా॥ కె.వి.కె. సంస్కృత కళాశాల, గుంటూరు.

# విషయసూచిక

## (ప్రాచీన మధ్య యుగాలు)


| అధ్యాయాలు | పుటలు |
|---|---|
| 1. పరిచయము | 1 |
| 2. ప్రాచీన చరిత్ర | 26 |
| 3. శాతవాహన యుగము | 42 |
| 4. శాతవాహన అనంతరీకులు | 87 |
| 5. చాళుక్య యుగము | 140 |
| 6. చాళుక్య - చోళయుగం | 194 |
| 7. కాకతీయ యుగము | 225 |
| 8. రెడ్డి - నాయకయుగము | 272 |
| 9. విజయనగర యుగం | 329 |
| 10. కుతుబ్‌షాహీ యుగం | 417 |


# రెండవ భాగం

## (ఆధునిక యుగము)


| | |
|---|---|
| 11. ఆధునిక యుగారంభం | 455 |
| 12. పాశ్చాత్యుల ఆగమనం | 477 |
| 13. రాజ్యస్థాపన - విస్తరణ | 490 |
| 14. సాంఘిక సాంస్కృతిక పరిస్థితులు | 521 |
| 15. హైదరాబాద్ సంస్థానం | 533 |
| 16. జాతీయోద్యమం | 545 |
| 17. ఆంధ్రదేశంలో సంస్కరణోద్యమాలు | 552 |

# ప రి చ య ము

## ఆంధ్రప్రదేశ్ భౌతిక స్వరూపం

### ఉ ని కి

ఆంధ్రుల ప్రత్యేకరాష్ట్రమే ఆంధ్రప్రదేశ్. ఈ రాష్ట్రం 12°4′ - 19°52′ ఉత్తర అక్షాంశాలకు, 76°50′-84°50′ తూర్పు రేఖాంశాలకు మధ్య విస్తరించి వుంది. తూర్పున బంగాళాఖాతము, దక్షిణాన తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలు, పశ్చిమాన కర్నాటక మహారాష్ట్రాలు, ఉత్తరాన మహారాష్ట్ర, ఒరిస్సాలు ఆంధ్రప్రదేశ్ సరిహద్దులు. ఈ ఎల్లల మధ్య విస్తీర్ణం దాదాపు 275 వేల కి. మీటర్లు. ఆంధ్ర రాష్ట్రానికి వెలుపల ఒరిస్సాలోని గంజాం, బరంపురం ప్రాంతాల్లో, మధ్యప్రదేశ్‌లోని బస్తర్ ప్రాంతంలో, కర్నాటకలో బళ్ళారి కోలార్ ప్రాంతాల్లో, తమిళనాడులో చెంగల్‌పట్టు, తంజావూరు జిల్లాల్లో ఆంధ్రులు అధిక సంఖ్యలో ఉన్నారు. ఆంధ్రుల జనాభా ప్రస్తుతం 6.64 కోట్లు.

భారత ఉపఖండంలో ఆగ్నేయభాగంలో దక్కన్‌కు మధ్యగా తూర్పు తీరాన్ని అనుకొని ఆంధ్రప్రదేశ్ ఉంది; పౌరాణిక వాఙ్మయం పేర్కొనే దక్షిణా పథంలో ఆగ్నేయ భాగాన్ని ఆక్రమించి ఉంది. అయితే దక్షిణాపథం ఉనికిని గురించే చరిత్రకారుల్లో ఏకాభిప్రాయం లేదు. ప్రాచీన వాఙ్మయంలో కొన్ని చోట్ల 'దక్షిణాపథ' పదాన్ని వింధ్య పర్వతాలకు కన్యాకుమారికి మధ్యప్రాంత మనే అర్థంలో వాడివారు. భరతుని నాట్యశాస్త్రం "దక్షిణస్య సముద్రస్య తథా వింధ్యస్య చాన్తరే" అంటూ దక్షిణా పథాన్ని నిర్వచించింది. కల్యాణి చాళుక్య శాసనాల్లో "సేతునర్మద మధ్యమ్ సన్నిత సప్తలక్షణం దక్షిణాపథం" అనే వాక్యం కన్పిస్తుంది. కాని దక్షిణాపథ ఉత్తర సరిహద్దులను మత్స్యపురాణం 'కరూశ' దేశం దాకా తీసుకుపోయింది. 'కరూశ' వింధ్య పర్వతం తూర్పు అంచుల్లో ఉంది. జాతక కథల ప్రకారం అవంతి దక్షిణా పథానికి ఉత్తర సరిహద్దు. అవంతి వింధ్యకు పశ్చిమోత్తర దిశనున్న జనపదం. ఏమైనప్పటికీ వింధ్య కన్యాకుమారిల మధ్యస్థదేశమే దక్షిణాపథమనడానికి 'సాక్ష్యం' బలంగా ఉంది. దక్షిణాపథానికి హ్రస్వరూపమే దక్కన్.

కాని ప్రాచీన కాలం నుండి దేశీయులు విదేశీయులు కూడ దక్కన్‌లో ఒక నియమిత నిర్దిష్ట ప్రాంతాన్నే దక్షిణాపథం అని వ్యవహరించినట్లు కన్పిస్తుంది. మహాభారతం దక్షిణాపథ ద్రావిడ దేశాలను ప్రత్యేకించి పేర్కొన్నది. రాజసూయయాగ సందర్భంలో సహదేవుడు పాండ్య రాజ్యం జయించి దక్షిణా పథంపై పురోగమించినట్లు సభాపర్వం వర్ణిస్తున్నది. పేరుతెలియని గ్రీకు నావి కుని 'ది పెరిప్లస్ ఆఫ్ ది ఎరిత్రియన్ సీ" (ఎర్ర సముద్రంపై దినచర్య) కూడ దక్షిణాపథ (దచినబదేశ్), తమిళకము (దమిరిక)లు వేరువేరు రాజ్యాలే. ఈ నావికుడు క్రీ.శ. మొదటి శతాబ్దానికి చెందినవాడు. ఈతడు దమిరిక దచిన బదేశ్‌లలోని వాణిజ్య కేంద్రాలను సయితం విడివిడిగా పేర్కొన్నాడు. ప్రాకృత సాహిత్యం కూడ దమిళ విషయాన్ని ప్రత్యేకంగా పేర్కొన్నది. కాబట్టి ద్రావిడ దేశం - తమిళకం - రాజకీయంగా, సాంస్కృతికంగా చిరకాలం వరకూ తన వ్యక్తిత్వాన్ని నిలుపుకున్నందువల్ల దక్షిణాపథం నుండి ప్రత్యేకంగా వ్యవహృత మైనదని చెప్పవచ్చు.

కాగా, కొందరు చరిత్రకారుల దృష్టిలో దక్షిణాపథ పదం నేటి మహారాష్ట్ర ప్రాంతానికి మాత్రమే వర్తిస్తుంది. దక్షిణాపథం అన్నమాటకు 'దక్షిణ దిక్కుకు మార్గం' అని అర్థమనీ అత్యంత ప్రాచీన కాలంలో ఉత్తర దక్షిణా పథాల మధ్య బహుజనామోదమైన మార్గం మహారాష్ట్రగుండా ఉండేదనే నిర్ణయమే ఈ వాదానికి ఆధారం. భరతుడు కూడ నాట్యశాస్త్రంలో ఒకచోట దక్షిణాపథ, ద్రావిడ ఆంధ్రప్రాంతాలను వేరువేరుగా పేర్కొన్నమాట కూడ వాస్తవమే. కాని వాఙ్మయ శాసనాధారాలు ఆ వాదానికి విరుద్ధంగా ఉన్నాయి. మత్స్యపురాణం దక్షిణాపథ ప్రజల్లో ఆంధ్రులను సయితం పేర్కొంటున్నది:

ఆంధ్రాః శకాః పుళిందాశ్చమూలికా యవనాస్తథా
తేషాం పరేజనపదః దక్షిణాపథ వాసినః

నదులను వర్ణిస్తూ—

గోదావరీ భీమరథీ కృష్ణవేణ్యాచవఙ్జులా
తుంగభద్ర సుప్రయోగా బాహ్యా కావేరిచైవతు
దక్షిణాపథనద్యస్తు సహ్యా పాదాత్ వినిస్సృతాః

అంటున్నాయి పురాణాలు. వాత్స్యాయన కామసూత్రాలకు వ్యాఖ్య వ్రాసిన జయమంగళుడు—

నర్మదాయా దక్షిణేనదేశో దక్షిణాపథః
తత్ర కర్ణాటవిషయాత్ పూర్వేణాంధ్రవిషయః
నర్మదో కర్ణాటవిషయోర్మధ్యే మహారాష్ట్ర విషయః
కర్ణాట విషయే దక్షిణేన ద్రవిడ విషయః

అంటాడు. శాసనాలు ఈ అభిప్రాయాన్ని బలపరుస్తున్నాయి. రుద్రదాముని జునాగడ్ శాసనం శివశ్రీశాతకర్ణిని దక్షిణాపథపతి అని వర్ణిస్తున్నది. శివశ్రీనాటికి శాతవాహనాధికారానికి తూర్పు ఆంధ్రప్రాంతమే కేంద్రమయింది. సముద్రగుప్తుని అలహాబాద్ ప్రశస్తి తూర్పు తీర రాజ్యాలను దక్షిణాపథంలో చేర్చి పేర్కొంటున్నది. అందుచేత 'దక్షిణాపథం' మహారాష్ట్రకే పరిమితమనడం సమంజసం కాదు.

దక్షిణాపథ దక్షిణ సరిహద్దు ఏది? అనేది కూడ ఒక సమస్యయే. అలహాబాద్ ప్రశస్తి కాంచీపురాన్ని సయితం దక్షిణాపథంలోనిదిగా పేర్కొన్నది. కాని రామాయణం కిష్కింధను అంటే తుంగభద్రానదిని, ప్రాచీన తమిళ వాఙ్మయం వెంగడాన్ని తమిళానికి ఉత్తర సరిహద్దుగా సూచిస్తున్నాయి. వెంగడం అంటే నేటి తిరుపతి. వెంగడం అంటే ఉత్తర పళ అని అర్థం. వెంగడేశ్వరుడు తమిళకం ఉత్తర సరిహద్దులను కాచే ఈశ్వరుడని తెలుస్తుంది. దీన్నిబట్టి స్థూలంగా నర్మదా తుంగభద్రల మధ్యప్రాంతం దక్షిణాపథంగానూ దానికి దక్షిణంగా ఉన్న భూమిని ద్రావిడం లేక తమిళకంగానూ వ్యవహారంలో ప్రసిద్ధమైనట్లు స్పష్టమవుతున్నది.

అందుచేత ఆంధ్రదేశం దక్షిణాపథంలో ఆగ్నేయ ప్రాంతంలో ఉన్నదనడంలో పొరబాటులేదు. ప్రాచీన వాఙ్మయంలోని ఆంధ్రదేశమే ఇంచుమించు నేటి ఆంధ్రప్రదేశ్.

## సహజ మండలాలు

నైసర్గిక పరిస్థితులను బట్టి ఆంధ్రప్రదేశ్‌ను మూడు సహజమండలాలుగా విభజించవచ్చును : (1) తూర్పు పశ్చిమ కనుమల ప్రాంతము. (2) పీఠభూమి ప్రాంతము. (3) తూర్పుతీర మైదానము.

**పర్వత ప్రాంతము :**

తూర్పుతీర మైదానం మినహాయిస్తే ఆంధ్రప్రదేశ్ పర్వతాలు, గుట్టలు, పీఠభూములే. తూర్పు పశ్చిమకనుమలు రెండూ ఆంధ్రప్రదేశ్‌లోనికి వ్యాపించినాయి. కాని ప్రధాన పర్వతశ్రేణులు మాత్రం తూర్పుకనుములే. పేరునుబట్టి ఇవి ఏకశ్రేణిగా ఉండక గుట్టలు గుట్టలుగా వేరువేరు పేర్లతో ఉన్నాయి శ్రీకాకుళంలో వీనికి మహేంద్రగిరులని పేరు. తూర్పుకనుమలు ఇక్కడే చాల ఎత్తయినవి. విశాఖపట్టణం జిల్లాలోని బాలకొండల్లోనే ప్రకృతి సౌందర్యానికి ఆటపట్టయిన అరకులోయ వుంది. గోదావరినది కిరువైపుల మనోహర దృశ్యాలతో నిండిన పాపికొండలున్నాయి. ఈ జిల్లాలోని కొండలు వానినంటి పెరుగుతున్న దట్టమైన అడవులు సవరులు, గదబులు, కోయలు మొదలైన కొండజాతులకు

ఆశ్రయంగా ఉన్నాయి. కృష్ణాజిల్లాలో కొండపల్లి, సీతానగరం కొండలు, గుంటూరు జిల్లాలోని కొండవీడు, కోటప్పకొండ, నాగార్జున కొండలు సుప్రసిద్ధములు. సీతానగరం కొండను చీల్చుకొని విజయవాడ దగ్గిర కృష్ణానది ప్రవహిస్తున్నది. కృష్ణకు దక్షిణంగా తూర్పుకనుమలు నల్లమలలు, ఎర్రమలలు అనే రెండు శ్రేణులుగా విస్తరించినాయి. నల్లమలలు కర్నూల్, మహబూబ్‌నగర్ జిల్లాల్లోనికి విస్తరించినాయి. నల్లమలలోని రెండు శ్రేణులకు మధ్య సారవంతమైన నంద్యాల లోయ ఏర్పడింది. నల్లమల శ్రేణుల్లో కూడ దట్టమైన అడవులున్నాయి. వీనిలో చెంచులనే కొండజాతి వారున్నారు. నల్లమలకు సమానాంతరంగా కడప, నెల్లూరు, చిత్తూరు జిల్లాలలోని వెలిగొండలు, పాలకొండలు, శేషాచలం కొండలు ఉన్నాయి. కర్నూల్ జిల్లాలో నల్లమలల మీద శ్రీశైలం, అహోబిల క్షేత్రాలు, చిత్తూరు జిల్లాలో శేషాచలం కొండలపై తిరుపతి క్షేత్రము ఉన్నాయి.

ఇక, పడమటి కనుమలకు చెందిన సహ్యాద్రి శ్రేణి అజంతా శ్రేణినుండి విడివడి ఆగ్నేయదిశగా ఆదిలాబాద్ జిల్లాలోనికి వ్యాపించింది. ఇచ్చట వీనిని నిర్మల్ గుట్టలంటారు. కరీంనగర్ జిల్లాలో రాఖీగుట్టలనీ, వరంగల్, ఖమ్మం జిల్లాల్లో కందికల్ గుట్టలనీ వీనికి పేర్లు. హైదరాబాద్, మహబూబ్‌నగర్ జిల్లాలోనివి బాలఘాట్ శ్రేణినుండి విడివడిన కొండలు. బాలఘాట్ తూర్పు అంచునే గోల్కొండ దుర్గాన్నీ హైదరాబాద్ నగరాన్నీ నిర్మించినారు.

**పీఠభూమి :**

తూర్పు కనుమలకు పశ్చిమంగా సువిశాలమైన దక్కన్ పీఠభూమివుంది. ఇది అగ్నిపర్వత సంబంధమైన ప్రాచీన కఠిన శిలానిర్మితం. రాయలసీమ తెలంగాణా ప్రాంతాలు ఇంచుమించు ఈ పీఠభూమిలోనే వున్నాయి. సగటున ఈ పీఠభూమి సముద్ర మట్టానికి 480-600 మీటర్ల ఎత్తున వుంది. భీమా గోదావరీ నదుల మధ్య అంటే హైదరాబాద్ - వరంగల్ - ఖమ్మం మధ్య ప్రాంతంలో దీనిఎత్తు 730 మీ దాకా ఉంటుంది. కృష్ణా తుంగభద్రా నదీలోయ ప్రాంతంలో 300-450 మీటర్లు మాత్రమే. దక్కన్ పీఠభూమి సమతలంగా ఉండక గుట్టలు, వాగులు; లోయలతో నిండివుంది; సర్నపల్లి, దేవరకొండ, భువనగిరి, పాఖాల గుట్టలు ప్రసిద్ధములు; వీని ఉపరి తలాలు చదునుగా ఉన్నందున ప్రాచీనకాలంలో వీనిపై దుర్గాలు నిర్మించినారు. కృష్ణా గోదావరీ నదులు వాని ఉపనదులు పీఠభూమిని చీల్చి లోయలేర్పరచినాయి. రాతిలోను నేల స్వభావంలోను పీఠభూమిలో ఎక్కువ వైవిధ్యం కన్పిస్తుంది. బస్తర్ ప్రాంతంలో ఇనుప ఖనిజంతో కూడిన గోండ్వానా శిలలు, మధ్య పీఠభూమిలో నల్లనీసపురాయి; శ్రీకాకుళం, నెల్లూరు, కర్నూలు, జిల్లాల్లో పలుగురాయి; కడప, కర్నూలు, గుంటూరు జిల్లాల్లో

సున్నపురాయి దొరుకుతుంది. నల్లసీసపురాయి సుందర శిల్పాలు మలచడానికి అనువైనది. పీఠభూమిలో అనేక ఖనిజాలు లభిస్తున్నాయి. బొగ్గు (తాండూరు, ఆదిలాబాద్, సింగరేణి, కొత్తగూడెం - ఖమ్మం), ఇనుము (ఖమ్మం, వరంగల్, కర్నూలు-కడప), మాంగనీస్ (శ్రీకాకుళం, విశాఖ), అభ్రకం (నెల్లూరు), రాగి (అగ్నిగుండాల - గుంటూరు), యాస్‌బెస్టాస్ (కడప, కర్నూలు, అనంతపురం), వజ్రాలు (అనంతపురం) ఉత్పత్తికి ఆంధ్రదేశం పేరొందింది. ఇవిగాక రంగు రంగుల పాలరాళ్ళు అనేక ప్రదేశాల్లో కన్పిస్తున్నాయి.

పీఠభూమి చాలభాగం ఎర్రరాతినేల. వాయవ్య దక్షిణ ప్రాంతాల్లో నల్లరేగడి భూములున్నాయి. తెలంగాణంలో పలుచోట్ల ఇసుకగులక కలసిన నిస్సారమైన చల్కాభూములు కన్పిస్తాయి. నదీతీరాలలోనివి లోయలోనివి ఒండ్రు భూములు. దక్కన్ పీఠభూమి వాయవ్య దిశనుండి ఆగ్నేయదిశకు వాలుగా ఉన్నందున గోదావరి కృష్ణ మొదలైన నదులన్నీ తూర్పుగా ప్రవహించి బంగాళా ఖాతంలో కలుస్తున్నాయి.

**నదులు :**

ఆంధ్రప్రదేశ్‌కి 'నదుల రాష్ట్రమ'ని పేరు; చిన్న పెద్దనదులు 30 కి పైగా ప్రవహిస్తున్నాయి. వానిలో గోదావరి పెద్దది. ఈ నది మహారాష్ట్రలో నాసిక్ సమీపంలో త్రియంబకం దగ్గిర పుట్టింది. ఆంధ్రదేశంలో సుమారు 400 కి.మీ. ప్రవహించి బంగాళాఖాతం చేరుతున్నది. ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, వరంగల్, గోదావరి జిల్లాలీ నదిపరీవాహ ప్రదేశంలో ఉన్నాయి. గోదావరి ఉపనదుల్లో మంజీర, ప్రాణహిత, శబరి, ఇంద్రావతి అనేవి ముఖ్యమైనవి. కూనవరం దగ్గర శబరీనదిని కలుపుకొన్న తరువాత పాపికొండల గుండా ప్రవహించి ఏడు పాయలుగా చీలుతున్నది. అవి : తుల్యభాగ, ఆత్రేయ, గౌతమి, వృద్ధగౌతమి, భరద్వాజ, కౌశిక, వశిష్ఠ. ఈ ఏడుపాయలను కలిపి 'సప్తగోదావరం' అంటారు. వీనిలో గౌతమి, వశిష్ఠ పెద్దవి. గౌతమి యానాం వద్దను వశిష్ఠ నర్సాపురం చెంత అంతర్వేది దగ్గిర సముద్రం చేరుతున్నాయి. గోదావరీ డెల్టా రాజమహేంద్రవరం చెంత ప్రారంభమయింది. ఆ సమీపంలోనే గోదావరిపై ధవళేశ్వరం దగ్గిర ఆనకట్ట ఉంది. మంజీరా నదిపై నిజాంసాగర్ ప్రాజెక్టు నిర్మాణమయింది. గోదావరిలోయ పొడవునా మంచి కలపనిచ్చే దట్టమైన 'మన్యం' అడవులున్నాయి. పాపికొండల ప్రాంతంలోని మనోహర దృశ్యాలవల్ల గోదావరికి 'భారతదేశపు రైన్ నది' (The Rhine of India) అనే పేరువచ్చింది.

కృష్ణానది కూడ మహారాష్ట్రలోని మహాబలేశ్వరం వద్ద పుట్టి సిద్దేశ్వరం దగ్గిర ఆంధ్రప్రదేశ్‌లో ప్రవేశించి సుమారు 450 కి.మీ. ప్రవహించి హంసలదీవి

దగ్గిర సముద్రంలో కలుస్తున్నది. మహబూబ్‌నగర్, కర్నూలు, నల్గొండ, కృష్ణా, గుంటూరు జిల్లాలు ఈ నదీపరీవాహ ప్రాంతాలు, తుంగభద్ర, మూసీ, భీమరథి, ఘటప్రభ, మలప్రభ దీని ఉపనదులు. కృష్ణానది డెల్టా బెజవాడ దగ్గిర ప్రారంభమయింది. అక్కడనే ఈ నదిపై ఆనకట్ట, రైలు, రోడ్డు వంతెనలు ఉన్నాయి నందికొండ సమీపంలో నాగార్జునసాగర్ నిర్మాణం జరిగింది. శ్రీశైలం దగ్గిర మరొక ప్రాజెక్టు పూర్తయింది. తుంగభద్రపై బళ్లారి దగ్గిర ప్రాజెక్టువల్ల ఆంధ్ర కర్ణాటక రాష్ట్రాలకు నీటిపారుదల జరుగుతున్నది. హైదరాబాద్ దగ్గిర మూసీనదిపై ఉస్మాన్‌సాగర్ నిర్మించినారు.

పెన్నానదికి మైసూర్ రాష్ట్రంలోని నందిదుర్గం దగ్గిర చెన్నకేశవగిరి జన్మస్థానం. ఈ నదికి పినాకిని అని మరో పేరు. ఈ నది పొడవు 570. కి మీ. అనంతపురం, కడప, కర్నూల్, నెల్లూరు జిల్లాలీ నదీపరీవాహప్రాంతం. దీని ఉపనదుల్లో ముఖ్యమైనవి జయమంగళ, కుందేరు, పాపఘ్ని, చిత్రవతి. నెల్లూరు, సంగమముల చెంత పెన్నపై ఆనకట్టలున్నాయి ఈ నది ప్రవహించే ప్రాంతమంతా కొండలు గుట్టలు ఉన్నందున హటాత్తుగా వరదలు వస్తుంటాయి. అందుచేతనే 'పెన్నదాటితే పెరుమాళ్ళ సేవచేసినంత ఫలం' అనే సామెత వచ్చింది. నెల్లూరుకు దక్షిణంగా ఊటుకూరు దగ్గిర పెన్న సముద్రంలో కలుస్తున్నది.

తూర్పుకనుమల్లో పుట్టి బంగాళాఖాతం చేరేనదుల్లో వంశధార పెద్దది. ఇది ఒరిస్సాలో నిమ్మగిరి కొండల్లో పుట్టి శ్రీకాకుళం జిల్లాగుండా ప్రవహించి కళింగ పట్టణం సమీపంలో సముద్రం చేరుతున్నది. కర్నూలు జిల్లాలో నల్లమల కొండల్లో పుట్టి గుండ్లకమ్మ గుంటూరు ప్రకాశం జిల్లాలగుండా 235 కి. మీ. ప్రవహించి కొత్త పట్టణం దగ్గిర సముద్రాన్ని చేరుతున్నది. ఇవిగాక చిన్నచిన్న నదులు చాలా ఉన్నాయి. శ్రీకాకుళం విశాఖపట్టణం జిల్లాలోని 17 నదుల్లో బహుదా, లాంగుల్య, శారదా ఎన్నదగినవి. విశాఖజిల్లాలో మాడుగుల కొండల్లో పుట్టే ముచికుంద ఉత్తరంగా ఒరిస్సాలోకి ప్రవహిస్తున్నది. దీనిపైని డుడుమా జలపాతం దగ్గిర ప్రాజెక్టు నిర్మించి, ఉభయరాష్ట్రాలకు విద్యుత్తు సరఫరా చేస్తున్నారు. తరువాత చెప్పదగినవి ఖమ్మం జిల్లాలోని కిన్నెరసాని, నెల్లూరు జిల్లాలోని స్వర్ణముఖి.

**తీరమైదానము :**

తూర్పుకనుమలకు తీరానికి మధ్య ఇరుకైన మైదానం ఉంది. ఉత్తరాన ఈ మైదానం వెడల్పు 60 కి. మీ. మాత్రం ఉంది. దక్షిణానికి పోయేకొలది విశాలమవుతుంది. గోదావరీ కృష్ణా పెన్నానదుల డెల్టాలీమైదానంలో ఉన్నాయి. తూర్పుకనుమల్లో పుట్టే నదులన్నీ ఈ మైదానంలో ప్రవహిస్తున్నాయి. అందుచేత ఈ మైదానం చాలా భాగం సారవంతమైన ఒండ్రు నేల. ముఖ్యంగా

'సప్తగోదావరి' ప్రాంతం చాల సారవంతమైనది. దీన్నే 'కోనసీమ' అంటారు పోక, అనాస, పనస, కొబ్బరి, అరటి తోటలతో వంటపొలాలతో కన్నుల పండుగ చేసే కోనసీమను 'ఆంధ్రదేశపు ఉద్యానవనం' అంటారు. తీరంవెంబడి మాత్రం ఇసుక మేటలు, ఊబినేలలు, ఉప్పునీరు నిల్వవుండే పల్లపుప్రాంతాలు కన్పిస్తాయి. ఇట్టివి శ్రీకాకుళం, విశాఖ, నెల్లూరు జిల్లాల్లో ఎక్కువ. అక్కడక్కడ పీనినాను కొని ఉన్న సారవంతమైన ప్రదేశాల్లో జీడిమామిడి తోటలు పెంచుతున్నారు. వర్షపాతం కూడ ఈ మైదానంలో సమృద్ధిగా పడుతుంది. ఇన్ని కారణాలవల్ల తూర్పుతీరమైదానం సస్యశ్యామలమై జనసమర్ధమై భారతదేశంలో ఐశ్వర్యవంతమైన ప్రాంతాల్లోనిదిగా ప్రసిద్ధి చెందింది ఇటీవల తీరం వెంబడి పెట్రోలియం సహజవాయువులు విశేషంగా లభ్యమౌతున్నాయి.


తూర్పుతీర మైదానంలో అక్కడక్కడ పెద్ద సరస్సు లేర్పడినాయి. వీనిలో కొల్లేరు, పులికాట్ సరస్సులు పెద్దవి. కృష్ణా గోదావరి డెల్టాల మధ్యలో ఉన్న కొల్లేరు మంచినీటిసరస్సు.బుడమేరు తమ్మిలేరు మొదలైన వాగులు ఇందులో కలుస్తున్నాయి. వర్షాకాలం కొల్లేరు విస్తీర్ణం 250 చ. కి. మీ వరకు ఉంటుంది. ఇది ఎన్నో రకాల పక్షులకు ఆశ్రయంగా వుంది. 'కొల్లేటికొంగ' అనే నానుడి ప్రసిద్ధము. నెల్లూరు జిల్లాలోని పులికాట్ సరస్సు ఉప్పునీటి సరస్సు. ఈ సరస్సును సముద్రం నుండి వేరుచేస్తున్న శ్రీహరికోట దీవిపై కృత్రిమ ఉపగ్రహ ప్రయోగశాలను నెలకొల్పినారు.

ఆంధ్రప్రదేశ్‌కి సుమారు 960 కి. మీ. తీరరేఖ ఉంది. కాని తీరం చీలిలేనందున సహజమైన ఓడరేవులు తక్కువ. డాల్ఫిన్స్‌నోస్ అనే అందమైన కొండచాటున ఉన్న విశాఖపట్టణం రేవు ఒక్కటే ప్రకృతిసిద్ధమయింది. ఆంధ్ర తీరం కృష్ణాముఖ ద్వారంలో ఈశాన్యదిశకు వంపుతిరిగింది. అందుచే గోదావరీ జిల్లాలు కృష్ణాగుంటూరు జిల్లాలకు తూర్పుప్రాంతం అవుతున్నవి. ఇది చాల చరిత్ర ప్రసిద్ధమైన అంశం. నెల్లూరుజిల్లా మినహాయించి మిగిలిన ఆంధ్రతీరాన్ని గోల్కొండతీరం అనేవారు. నెల్లూరు కోరమండల తీరంలో చేరుతుంది. కోస్తా జిల్లాల ప్రజలు ప్రాచీనకాలంనుండి నౌకాయానంలో ఆరితేరి విదేశాలతో వాణిజ్యం జరుపుతూ భారతీయ సంస్కృతిని విస్తరింపజేసినారు.

**భూగోళ పరిస్థితులు – చరిత్ర :**

ఉత్తర దక్షిణాపథాలను కలుపుతూ ఆంధ్రదేశం భారత ఉపఖండంలో విశిష్ట స్థానం ఆక్రమించింది. ఆంధ్ర జాతీయ సంస్కృతీ పరిణామానికి ఈ ఉనికి చాల వరకు కారణం. ఉత్తర పశ్చిమ దక్షిణ ప్రాంతాల సంస్కృతీ ప్రభావాలకు ఆంధ్రదేశం త్రివేణీసంగమమయింది. ముఖ్యంగా ఉత్తర ఆర్య రాజ్యాలకు చాల సన్నిహితంగా ఉన్నందున ఆర్యమత సాంస్కృతిక ప్రభావం బలీయమై ప్రాచీన

ఆంధ్ర నాగరికతా స్వరూపం పూర్తిగా మాసిపోయింది. ఆర్య అనార్య సంస్కృతీ స్రవంతులకు కూడలియై వాని సమ్మేళనంద్వారా హైందవ సంస్కృతిని రూపొందించడంలో ఆంధ్రదేశం ప్రముఖపాత్ర నిర్వహించింది. ఈ సంస్కృతీ సమ్మేళనంతోబాటు తీరాంధ్రం సాగించిన విదేశ వాణిజ్యంద్వారా విదేశ సంస్కృతీ ప్రభావం కూడ ప్రసరించి ఆంధ్రులలో ఉదారబుద్ధి, సమరస సమన్వయ దృష్టి కలిగించాయి. ఈ దృక్పథమే ఆంధ్రలో జరిగిన మత భాషా ఉద్యమాల్లోను ఆంధ్ర శిల్పంలోను ప్రతిఫలిస్తుంది.




దక్షిణాపథంలో ఆంధ్రదేశం కీలకస్థానంలో ఉంది. దానికితోడు తూర్పు తీరమైదానం సారవంతమైన పంటభూమి. అచటి రేవుపట్టణాలు దూరదేశాలతో వాణిజ్యం సాగించి ఐశ్వర్యవంతమైనాయి. అందుచేతనే కాకతీయులు విజృంభించే వరకు తీరాంధ్రమే ఆంధ్రదేశ రాజకీయాధికారానికి కేంద్రమై సాంస్కృతిక ఉద్యమాలకు పుట్టినిల్లయింది. అంతేగాక దక్షిణాపథంలో పశ్చిమ ప్రాంతంలో

విజృంభించిన రాజవంశాలు తీరాంధ్రాన్ని ఆక్రమించడానికి ప్రయత్నించాయి.
ఆంధ్రదేశాన్ని ఆక్రమించినవారు సులభంగా దక్షిణాపథ ఆధిపత్యం సాధించ
గలరు. ముఖ్యంగా కృష్ణా తుంగభద్రా నదుల అంతర్వేదిపై ప్రతి రాజవంశం దృష్టి
ఉండేది. అందుచే దాన్ని వశపరచుకోడానికై పల్లవులు - చాళుక్యులు, రాష్ట్ర
కూటులు-చోళులు, చోళులు-కల్యాణి చాళుక్యులు, విజయనగర-బహమనీ రాజుల
సంఘర్షణలు యావద్భారత చరిత్రలోనే ఆసక్తిదాయకమైనవి. తత్ఫలితంగా
ఈ రాజ వంశాలకు యుద్ధరంగమై ఆంధ్రదేశం అశాంతికి బాధలకు గురి
అయింది. ఈ దండయాత్రల ద్వారా ద్రావిడులు, కన్నడిగులు, మరాటీలు,
(కాయస్థులు) కాళింగులు అధిక సంఖ్యలో ఆంధ్ర దేశానికి వచ్చి నిలిచిపోయి
నారు. అందుచేతనే భారతజాతిలో వలెనే ఆంధ్రజాతిలో భౌతికమైన వైవిధ్యం
కనిపిస్తుంది.

ఉత్తరాపథం నుండి దక్షిణదేశంపై జరిగిన దాడులను ఎదుర్కొనే
బాధ్యతను సయితం ఆంధ్రదేశం నిర్వహించింది. ప్రాచీన యుగంలో శాతవాహ
నులు శకయవనదాడుల నరికట్టడంలోను మధ్య యుగంలో తురుష్క దాడులను
నిలుపుటలో కాకతీయులు శ్రద్ధ వహించినారు. కృష్ణానదికి దక్షిణంగా హిందూ
మతం మతసంస్థలు తమ ఔన్నత్యాన్ని కోల్పోవకుండడానికి విజయనగర
రాజుల దేశభక్తి ధైర్యసాహసాలే కారణం.

ఆంధ్రదేశంలో వర్షపాతం తక్కువ. ఆ లోపాన్ని ఇచట ప్రవ
హించే నదులు పూర్తిచేస్తున్నాయి కాని నదులవల్ల దేశానికి పూర్తిగా మేలే జరి
గిందని చెప్పలేము. నదులవల్లనే ఆంధ్రదేశం సహజ సరిహద్దులున్న ప్రాంతా
లుగా విభజితమయింది. కళింగ, వేంగి, వెలనాడు, పాకనాడు, రేనాడు, సబ్బి
నాడు మొదలైన నాడు లేర్పడి ప్రతి నాడులోను స్వతంత్రరాజ్యం వెలసి రాజ
కీయైక్యానికి భంగం వాటిల్లింది; రాజకీయంగానేగాక, ప్రతివర్ణంలోను 'నాడీభేదం'
ఏర్పడి సాంఘిక అనైక్యానికి కారణమై జాతీయభావం దుర్బలమయింది. రేనాడు
తెలంగాణా ప్రాంతాలు చిరకాలం ఆంధ్రేతర రాజవంశాల పాలనలోనే ఉండడం
జరిగింది. సుదీర్ఘమైన తమ చరిత్రలో ఆంధ్రులు అత్యల్పకాలం మాత్రమే ఏక
ఛత్రాధిపత్యం కింద మనగలిగినారు. చారిత్రకమైన ఈ రాజకీయ అనైక్యా
నికి తోడు భౌతిక భిన్నత్వంవల్ల ఆర్థిక వ్యత్యాసాలు కూడ ఏర్పడి సర్కారులు,
రాయలసీమ, తెలంగాణము అనే ప్రాంతీయభావం ఆంధ్రుల్లో నిలిచిపోవడం
విచారకరము.

ఈ ప్రభావానికి కొంత విరుగుడుగా పర్వతాలు పనిచేసినాయని చెప్ప
వచ్చు. ఆంధ్రలోని పర్వతాలపై గోల్కొండ, కొండపల్లి, కొండవీడు, దేవర
కొండ, గుత్తి, పెనుగొండ మొదలైన దుర్గాలు వెలసి మధ్యయుగ రాజకీయా

లకు కేంద్రాలై అనైక్యానికి కొంతవరకు దోహదం చేసినమాట నిజమే. కాని శాతవాహన యుగం నుండి పుణ్యక్షేత్రాలు చాలవరకు పర్వతాల మీదనే వెలసి నాయి. శ్రీపర్వతం, సింహాచలం, యాదగిరి, విజయవాడ, శ్రీశైలం, అహోబలం, తిరుపతి మొదలుగా హిందువు లందరికి పవిత్రములైనవి పర్వత క్షేత్రాలే. ఈ క్షేత్రాలు దేశవ్యాప్తంగా వుండడం ఆంధ్ర ప్రజానీకంలో భావ సమైక్యానికి బలమయిన కారణమయింది.

## చారిత్రక ఆధారాలు

ఆంధ్రదేశ చరిత్ర రచనకు, భారతదేశ చరిత్రకువలెనే వాఙ్మయ, పురావస్తు సంబంధమైన సాక్ష్యాలు ఆధారము దేశచరిత్రను స్థూలంగా చరిత్రపూర్వ యుగం, చారిత్రక యుగం అని విభజించడం కద్దు. లిఖితపూర్వకమైన వాఙ్మ యాధారాలు లభ్యంకానిది చరిత్ర పూర్వ యుగం ఈ యుగచరిత్రకు నాటి మానవుడుపయోగించి విడిచివెళ్ళిన భౌతికావశేషాలే ఆధారం దీన్నే శిలాయుగం అనికూడ వ్యవహరించవచ్చు. మన దేశ చరిత్రకు మొదటి వాఙ్మయాధారం ఋగ్వేదం (క్రీ పూ. 2000) కాని ఋగ్వేదం అవతరించినప్పటి నుండి లిఖిత పూర్వకంగా లేదు. ఆ గ్రంథం ఎప్పుడు వ్రాతరూపం ధరించిందో చెప్పడం కష్టం. బౌద్ధయుగారంభానికి దేశంలో లిపి వాడుకలోనికి వచ్చినట్లు తెలుస్తున్నది. అందుచేత క్రీ.పూ. 2000-600 మధ్యయుగాన్ని పురాచారిత్రక యుగం అంటారు. వైదిక వాఙ్మయంలోని శ్రౌత స్మార్త గ్రంథాల కాలం నిర్ణయించడం సాధ్యంకాదు. అవి ప్రక్షిప్తాలకు లోనయి మార్పు చెందుతూ పెరుగుతూ వచ్చి నాయి. ఇక రాజాస్థానాలలో తయారైన కావ్యప్రబంధాది సారస్వతంలో రాజ పోషకులపట్ల పక్షపాతబుద్ధితో వారి ఘనతను ఉత్ప్రేక్షించి వ్రాయడం జరుగు తుంది. అందుచేత వాఙ్మయసాక్ష్యాన్ని విమర్శనాదృష్టితో పరిశీలించి ఉపయో గించవలె. వాఙ్మయాధారాలకంటే పురావస్తు ఆధారాలే ఎక్కువ విశ్వాస యోగ్యాలని, వాఙ్మయ పురావస్తు ఆధారాలు పరస్పర విరుద్ధంగా ఉన్న సంద ర్భాలలో పురావస్తు ఆధారాలే అంగీకార యోగ్యమని చారిత్రకుల అభిప్రాయము.

## వాఙ్మయాధారాలు

**దేశీయ రచనలు :**

వాఙ్మయాధారాలలో పలు విభాగాలున్నాయి. దేశీయ విదేశీయ రచనలని వానిని స్థూలంగా విభజించవచ్చు. దేశీయ రచనలు మత, మతేతరములని, తిరిగి వానిని సంస్కృత, ప్రాకృత దేశభాషా విభాగాలుగా చేయవచ్చు. మతసంబంధ మైన రచనల్లో వైదిక, తదితర అంటే జైన బౌద్ధ సారస్వతాలు చేరుతాయి. వైదిక వాఙ్మయం సంస్కృతభాషలో ఉంది. జైన బౌద్ధవాఙ్మయాలు క్రీ.శ. 3 వ

శతాబ్ది వరకు ప్రాకృత భాషల్లోను అనంతరం ఎక్కువగా సంస్కృతం లోను ఉన్నాయి. వైదికమైన శ్రుతి స్మృతి వాఙ్మయాలలోను ప్రాచీన జైన బౌద్ధగ్రంథాల్లోను ఆంధ్రులను గురించిన ప్రస్తావనలున్నాయి. నాగార్జునాచార్యుని సుహృల్లేఖ రత్నావళీరాజపరికథ అనే సంస్కృత గ్రంథాల్లో నాటి బౌద్ధుల లౌకిక ముఖ్యంగా రాజకీయ ఆలోచనా విధానం తెలుస్తుంది. మతేతర ప్రాచీన ప్రాకృత రచనల్లోని గాథాసప్తశతి, సంస్కృత రచనల్లో వాత్స్యాయనుని కామ సూత్రాలు శాతవాహనయుగ ఆంధ్ర సాంఘిక సాంస్కృతిక జీవనానికి దర్పణం పట్టినట్లుంటాయి.

తూర్పు చాళుక్యయుగం నుండి దేశీయ భాషల్లో సారస్వత సృష్టి జరిగింది. తెలుగులో కంటే కన్నడంలో సుమారొక శతాబ్దం ముందునుండి కావ్యరచన జరిగింది. పంపకవి గదాయుద్ధ, విక్రమార్జున విజయాది కావ్యాల్లో రాష్ట్రకూట వేంగిచాళుక్య సంఘర్షణలను గురించిన వివరాలు లభిస్తున్నాయి. అనంతరకాలంలో వెలసిన కాకతీయ, రెడ్డి, విజయనగరాది రాజాస్థానాల్లో సంస్కృతాంధ్ర భాషల్లో అసంఖ్యాకంగా రచనలు వెలువడినాయి. వీని లోని అవతారికలు ఆశ్వాసాంత భాగాలలో అనేక చారిత్రక సంఘటనలను గురించిన వర్తమానం ఉంది. నరపతివిజయం, వెలుగోటివారి వంశావళి వంటివి ప్రత్యేకంగా రాజవంశాలను గురించి వ్రాసిన కావ్యాలున్నాయి. ముస్లిం దాడుల్లో కాకతీయ సామ్రాజ్యం పతనమైన అనతికాలంలో జీవించిన శ్రీనాథ మడికి సింగనలవంటి కవుల రచనల్లో సాధారణ చరిత్రగ్రంథాల్లో కన్పించే ముస్లిం దురాగతాలను గురించిన వివరాలు లేకపోవడం వింతగా తోస్తుంది. కాకతీయ యుగంలో ప్రారంభమైన శతకప్రక్రియ విజయనగర యుగానంతరం విపరీతంగా పెరిగింది. శతకాలకు నీతి, భక్తి, శృంగారాలు వస్తువులయినా వానిలో నాటి రాజకీయ ఆర్థిక సాంఘిక పరిస్థితులు ప్రతిఫలిస్తాయి.

ఢిల్లీలో సల్తనత్ స్థాపన జరిగినప్పటినుండి ముస్లిం రచనలు అధికంగా లభ్యమవుతున్నాయి. హిందువులకంటె ముస్లిములలో చరిత్రపట్ల శ్రద్ధాసక్తులు ఎక్కువగా కన్పిస్తాయి. సుల్తానులు సూతులను (Chroniclers) పోషించి వారిచే తమ వంశ చరిత్రలు వ్రాయించినారు. అల్లాఉద్దీన్‌ఖిల్జీ ఆస్థాన కవియైన అమీర్ ఖుస్రూ రచనల్లో తారీఖ్-ఇ-అలై ముఖ్యమయింది. మొహమ్మద్ బిన్ తుగ్లక్, ఫిరోజ్‌షాతుగ్లక్ కాలాల్లోని ఇసామీ రచించిన ఫుతూహ్-ఉస్-సలాతీ, జియాఉద్దీన్‌బరనీ రచించిన తారీఖ్-ఇ-ఫిరోజ్ షాహి గ్రంథాలు నాటి దక్షిణాత్య హిందూరాజ్యాలను గురించి ఢిల్లీ సల్తనత్ దక్షిణ విస్తరణను గురించి వివరాలిస్తున్నాయి. ముస్లిం రచయితలందరిలో ఫెరిస్టా సుప్రసిద్ధుడు. 'భారతదేశంలో ఇస్లాం విజృంభణ'ను గురించి ఫెరిస్టా రచించిన గ్రంథం విజయనగర బహమనీ

రాజ్యాల మధ్య సంబంధాలకు ముఖ్యమైన ఆధారం. గోల్కొండ సుల్తానుల చరిత్రకు అజ్ఞాత రచయిత తారీఖ్–ఇ–ముహమ్మద్ కుల్లీకుతుబ్ శాహ గ్రంథం చాలా ఉపకరిస్తుంది. అయితే ముస్లిం రచయితలు స్వీయ మతాధిక్యంలో ఆ మత అంతిమ విజయంలో నమ్మకంవుంచి సుల్తానులపట్ల విశ్వాసంతో పక్షపాతంతో గ్రంథరచన సాగించినారు అందుచే వారి గ్రంథస్థ సమాచారం చాలా జాగ్రత్తగ ఉపయోగించుకోవలె

'కైఫీయత్తులు' లేక 'దండకవిలెలు' అనే పేర గ్రామాధికారుల చెంత స్థానిక చరిత్రలు లభ్యమవుతున్నాయి. వీనిని 19వ శతాబ్దంలో కల్నల్ కాలిన్ మెకంజీ అనే కంపెనీ ఉద్యోగి కావలి బొర్రయ్య సోదరుల సహాయంతో సేకరించి భద్రవరచినాడు. కైఫీయత్ అంటే వాఙ్మూలము అని అర్థం. దేశం ముస్లిముల వశమైన తరువాత గ్రామాల్లోని మిరాశీలను గురించి గ్రామాధికారుల నుండి ముస్లిం ప్రభువులు తీసుకొన్న వాఙ్మూలాలని చెప్పవచ్చు. విజయనగర కాలం నుండి దేశకాల పరిస్థితులను గురించి తెలుసుకోడానికి వీని సహాయం అమూల్యం.

**విదేశీ రచనలు :**

అనాదిగా భారతదేశాన్ని దర్శించడానికి వివిధ జాతుల యాత్రికులు వచ్చినారు. వారు ఇచటి పరిస్థితులను గురించి తమ అనుభవాలు అభిప్రాయాలు గ్రంథస్థం చేసినారు. అట్టి రచనలు గ్రీకులతో ప్రారంభమవుతున్నాయి. మెగస్తనీస్, ఏరియన్, టాలెమీల గ్రంథాల్లో ఆంధ్రుల ప్రస్తావనలున్నాయి. పేరు తెలియని గ్రీకు నావికుని 'ఎర్ర సముద్రంపై దినచర్య' (The Periplus of the Erythrean Sea) నాడు (క్రీ. శ. 60 ప్రాంతం) దక్షిణదేశంలోని రేవు పట్టణాలను అవి సాగిస్తున్న విదేశ వాణిజ్యాన్ని వర్ణించడమే గాక శక - శాతవాహనకాల నిర్ణయానికి సయితం ఉపకరిస్తున్నది చైనా యాత్రికులైన ఫాహియాన్ (క్రీ. శ. 400), యువాన్‌చాంగ్ (క్రీ శ. 640), ఇత్సింగ్ (క్రీ. శ. 670) రచనలనుండి నాటి బౌద్ధమత స్థితిగతులు గ్రహిస్తున్నాము. మధ్య యుగారంభం నుండి ముస్లిం యాత్రికుల సంఖ్య ఎక్కువయింది. వారిలో మొహమ్మద్ బిన్ తుగ్లక్ కాలంలో వచ్చిన ఇబిన్‌బతూతా రచనల్లో నాటి రాజకీయాలేగాక ఆర్థిక సాంస్కృతిక అంశాలుకూడ ప్రతిఫలిస్తున్నాయి. పారశీక చక్రవర్తి షారూక్ రాయబారిగా విజయనగరాన్ని దర్శించిన (క్రీ. శ. 1442-48) అబ్దుర్ రజాక్ ఆ నగర వైభవాన్ని రాజ్య ఐశ్వర్యాన్ని కన్నులకు గట్టినట్లు వర్ణించినాడు. విజయనగర కాలం నుండియే పాశ్చాత్య యాత్రికులు వర్తకుల రాక ఎక్కువయింది. కాని వీరిలో ఆద్యుడు వెనీసు బాటసారి మార్కో–పోలో. ఈతడు క్రీ. శ. 1292 ప్రాంతంలో తూర్పుతీర రేవుపట్టణం మోటుపల్లి దగ్గర దిగి కాకతీయ సామ్రాజ్య పరిస్థితుల్ని వివరించినాడు. విజయనగరాన్ని దర్శించిన

పాశ్చాత్య యాత్రికుల్లో ప్రథముడు నికోలోకాంటీ (క్రీ. శ. 1442), అనంతరం పేస్ (క్రీ. శ. 1520-22), న్యూనిజ్ (క్రీ. శ. 1535-37). బర్రాడస్ (క్రీ శ. 1616) మొదలైనవారు విజయనగరం దర్శించినారు. వీరి రచల్లో విజయనగర చరిత్రలోని అనేక సంఘటనలను గురించిన వివారాలు లభిస్తున్నాయి. క్రమంగా పాశ్చాత్య రచనల సంఖ్య ఎక్కువ అయింది. పోర్చుగీస్, డచ్చి, ఫ్రెంచి, ఇంగ్లీషు వర్తకుల, పాదిరీల 'దినచర్య'లు, లేఖలు, వారివారి కుంఫినీల పత్రాల నుండి ఆధునిక యుగ ఆంధ్ర చరిత్రను రచించడానికి సామాగ్రి అధికంగా లభిస్తున్నది.

## పురావస్తు ఆధారాలు

పురావస్తు ఆధారాలలో శాసనాలు, నాణేలు, నిర్మాణాలు అనేవి ప్రధాన విభాగాలు. శిల్ప చిత్రలేఖనాలను నిర్మాణాల విభాగాలలోనే చేర్చవచ్చు.

**శాసనాలు :**

భారతదేశంలోని మొట్టమొదటి శాసనాలు అశోకుని 'ధర్మలిపులు'; వానితోనే ఆంధ్రదేశంలోని శాసనాల చరిత్ర ప్రారంభమవుతున్నది. అశోకుని శాసనాలు (క్రీ. పూ. 250 ప్రాంతం) ప్రధానంగా శిలలపై, శిలా స్తంభాలపై వ్రాసినారు. ఆంధ్రదేశంలో ఎర్రగుడి, రాజులమందగిరు (కర్నూలు)లలో అశోకుని శిలాశాసనాలు బయల్పడినాయి. ఇటీవల ధాన్యకటకంలో స్తంభశాసన శకలం దొరికింది. వీని తరువాత చెప్పదగినవి భట్టిప్రోలు స్తూపంలోని కరండశాసనాలు (క్రీ. పూ. 200) శాతవాహనుల కాలంనాటి శాసనాలు చాలాభాగం మహారాష్ట్ర ప్రాంతం గుహలలో ఉన్నాయి వానిలో రాజవంశానికి చెందిన ఐదారు శాసనాల్లో నాగనికా నానాఘట్ శాసనం బాలశ్రీనాసిక శాసనం చాలా ముఖ్యమైనవి. శాతవాహనవంశ చరిత్రకు ఖారవేలుని హతిగుంఫ శాసనం, రుద్రదాముని జునాగడ్ శాసనం ఉపకరిస్తున్నాయి. ఇక్ష్వాకుల శాసనాల్లో కూడ చాలా భాగం పౌర శాసనాలే. అశోక, శాతవాహన, ఇక్ష్వాకు శాసనాలు ప్రాకృత భాషలో బ్రాహ్మి లిపిలో ఉన్నాయి. అశోక బ్రాహ్మినుండి పరిణామం చెందినప్పటికి ఇక్ష్వాకులకాలం నాటి లిపి చాల అందంగా రూపొందింది. బ్రాహ్మిలిపియే తెలుగులిపికి మాతృక. మూడో శతాబ్దం చివరిదశలో శాసనభాష ప్రాకృతంనుండి సంస్కృతానికి పరివర్తన చెందింది శిలలపైగాక తామ్రపట్టికలపై శాసనాలు లిఖించే ఆచారం కూడ ఏర్పడింది. ఇక్ష్వాకులను మినహాయించి ప్రాచీన పల్లవ, బృహత్పలాయన, ఆనందగోత్ర, శాలంకాయన, విష్ణుకుండిన, మాఠర తూర్పుగాంగాది శాతవాహన అనంతర రాజవంశాల శాసనాల్లో అధికభాగం తామ్ర పట్టికలే! తూర్పుచాళుక్య యుగంనుండి శిలా, తామ్ర శాసనాల సంఖ్య అధికమయింది. భాషలో కూడ మార్పువచ్చి సంస్కృతాంధ్రాలు రెండూ వాడినారు. చెదురుమదురుగా కన్పించే

కృతక శాసనాలను మినహాయిస్తే రాజుల గుణగణాలు, రాజ్యాల విస్తీర్ణం, నాటి ఆర్థిక సాంఘిక సాంస్కృతిక పరిస్థితులు మొదలైన చారిత్రకాంశాలను గ్రహించడానికి శాసనాలే అత్యంత ప్రామాణికమైన ఆధారము.

**నాణేలు :**

పురావస్తు చారిత్రక ఆధారాలలో శాసనాల తరువాత చెప్పదగినవి నాణేలు. మౌర్యయుగం నుండి ఆంధ్రదేశంలో నాణేలు వాడుకలో ఉన్నట్లు తెలుస్తుంది. నాటివి చాలావరకు విద్ధాంక (punch marked) నాణేలు. వీనినే పురాణాలు అంటారు. అమరావతిలో వెండి విద్ధాంక నాణేలు వేలసంఖ్యలో ఉన్న పెద్దనిధి దొరికింది. శాతవాహన వంశ ప్రారంభంనుండి నాణేలు ముద్రించినారు. వీరి నాణేలకు వెండి, రాగి, సీసం, సీసం రాగి తగరాల మిశ్రమం (Potin) వాడినారు; వీటిలో సీసపు నాణేలు వేలసంఖ్యలోను వెండినాణేలు అరుదుగాను మాళవనుండి మద్రాస్‌వరకు దక్షిణ దేశంలో పలుచోట్ల దొరికినాయి. వీరి నాణేలలో శాతవాహనుని నాణేలు, శాతకర్ణి అశ్వమేధ నాణెం, పులోమావి యజ్ఞశ్రీల నౌకాచిహ్నం ఉన్న నాణేలు, జోగెల్‌తంబి నిధిలోని గౌతమీపుత్రుడు తిరిగి ముద్రించిన నహపాణుని నాణేలు వెండి ద్విభాషా నాణేలు చాల ముఖ్యమైనవి. వీనిపై ఒకవైపున ఉజ్జయినీ చిహ్నం, మరొకవైపున వృషభ, అశ్వ, గజ, మేరు, కల్పవృక్ష నౌకాదులతో ఒక చిహ్నంగానీ ఉండి, ఆ చిహ్నంపై రాజుపేరు ప్రాకృతంలో ఉంటుంది. మేరుపర్వత చిహ్నాన్నే చైత్యం అనడం వాడుకగా ఉంది. వెండినాణేలపై ఉజ్జయినీ చిహ్నం స్థానంలో రాజప్రతిమ ఉంది. ఇక్ష్వాకుల సీసపు నాణేలు శాతవాహన నాణేలను అనుసరించి ఉంటాయి. శాతవాహన-ఇక్ష్వాకు యుగానికి చెందిన రోమన్ బంగారు నాణేలు ఆంధ్రదేశంలో పలుచోట్ల దొరకినాయి. విష్ణుకుండినులవి రాగిమలామా చేసిన ఇనుపనాణేలు. వీనిపై ఒకవైపున సింహ, వృషభ, లాంఛనాలు మరొకవైపున దీపస్తంభం, శంఖం మొదలైన చిహ్నాలున్నాయి. నాణేలకు ఇనుము వాడడం నాటి ఆర్థిక దైన్యతకు నిదర్శనం కావచ్చు. తూర్పుచాళుక్యుల నాణేలు ఎక్కువగా లభించ లేదు. మొదటిదశలో వీరు విష్ణుకుండిన నాణేల ననుకరించినట్లు కన్పిస్తుంది. చాళుక్యచోళ యుగంలో గద్యాణం, మాడ, రూక, చిన్నం అనే నాణేల పేర్లున్నాయిగాని వాని స్వరూపాన్ని గ్రహించడానికి ఆధారాలు లేవు. కాకతీయుల నాణేలు కూడ ఎక్కువగా లభించకపోవడం దురదృష్టకరం 'దాయగజకేసరి' అనే లేఖనం ఉన్న ప్రతాపరుద్రుని బంగారు నాణేలు స్వల్పంగా దొరికాయి. ఇటీవల తెలంగాణంలో కాకతీయుల వరాహచిహ్నం ఉన్న యాదవరాజుల వెండి నాణేలు దొరకడం విశేషం. విజయనగర రాజుల నాణేలు ఎక్కువగానే దొరుకుతున్నాయి. వానిలో వైవిధ్యం కన్పిస్తుంది. నాణేలవల్ల నాటి ఆర్థిక పరిస్థితులే

గాక ఆయారాజుల గుణగణాలు, రాజ్యవిస్తీర్ణం, మతాభినివేశము మొదలైన అంశాలు గ్రహించవచ్చు.

**నిర్మాణాలు :**

ప్రాచీన మానవుడు విడిచివెళ్ళిన భౌతికావశేషాల్లో కుండపెంకులు, రాతి పనిముట్లు, ఇటుకలవంటివి కూడ నాగరికతా పరిణామంలో భిన్నదశల క్రమాన్ని వాటి స్వభావాన్ని తెలియజేస్తాయి. ఇక ఆంధ్రదేశంలో నిర్మాణాల చరిత్రకూడ శిలా యుగాంతంలోనే ప్రారంభమవుతున్నది. 'రాక్షస గుళ్ళు' అనే నాటి సమాధులు ఆంధ్రుల మొదటి కట్టడాలు. రాక్షస గుళ్ళ ద్వారా ఆ యుగంలోని నాగరికతా స్వభావము, మతవిశ్వాసాలు ఆచారాలేగాక వానిలోని అస్థికలు, కళే బరాలవల్ల అవి నిర్మించిన ప్రజల జాతీయతను గ్రహించవచ్చు. తరువాతవి బౌద్ధనిర్మాణాలు. క్రీ. శ. మూడో శతాబ్దినుండి దేవాలయ నిర్మాణం ఆంధ్ర దేశంలో ముమ్మరంగా సాగింది. చోళ - చాళుక్యయుగంనుండి ఆంధ్ర దేవాలయాల్లో అక్కడక్కడ చిత్రలేఖనాలు కన్పిస్తున్నాయి. స్తూపాలను ఆలయా లను అలంకరించిన శిల్పాలు, చిత్రలేఖనాల ద్వారా నాటి గృహోపకరణాలు, కేశాలంకరణ, వస్త్రధారణ, ఆభరణాలు, వినోదాలు, వాద్యాలు, ఆయుధాలు మొదలుగా నాటి సాంఘిక జీవితంలోని అనేకాంశాలను గురించి వివరాలు లభిస్తున్నాయి.

## ఆంధ్రదేశం

ఆంధ్రులు నివసించే దేశం కాబట్టి ఆంధ్రదేశం అనే పేరు వచ్చినట్లు స్పష్టంగా తెలుస్తున్నది. ఐతరేయ బ్రాహ్మణం (క్రీ.పూ. 1500) ఆంధ్ర పదాన్ని జాతివరంగానే వాడింది. ఇతిహాస పురాణాలు దాక్షిణాత్య జాతులతో కలిపి ఆంధ్రులను ప్రస్తావించినాయిగాని వారి నివాసాన్ని నిర్దేశించి చెప్పలేదు. అశోకుని 13 వ శిలాశాసనం (క్రీ.పూ. 256) ఆంధ్రులు 'రాజవిషయం' అంటే మౌర్య సామ్రాజ్యంలో నివసించే వారుగా మాత్రమే చెప్పింది. క్రీ.పూ. 4 వ శతాబ్దిలో మౌర్య ఆస్థానానికి గ్రీకురాయబారిగా వచ్చిన మెగస్తనీస్ ఆంధ్రులు గొప్ప సైనిక బలం ఉన్న వారని వర్ణించినాడు; ప్లినీ కూడా ఆంధ్రులకు ముప్పై రాజ్యాలున్న వన్నాడు. కాని వీరెవరూ ఆంధ్రులు ఏ ప్రాంతంలో ఉన్నారో చెప్పలేదు.

ఆంధ్రుల నివాసం గురించిన మొదటి సూచన బౌద్ధ జాతక కథలలో లభిస్తున్నది. భీమసేన జాతకం ఆంధ్రాపథాన్ని ప్రస్తావించగా సెరివణిజ జాతకం తేలివాహానదిపై నున్న ఆంధ్రనగరిని పేర్కొన్నది. తేలివాహానది ఒరిస్సాలో ప్రవహిస్తున్న మహానదికి ఉపనదియని కొందరి (కె.పి. జయస్వాల్) అభిప్రాయం. కాని నల్లగా ప్రవహిస్తున్నందున కృష్ణానదియే 'తైలవాహ' అని

మరికొందరి (పి. సి. రాయ్ చౌధురి) సూచన, అయినచో కృష్ణానదిపై నున్న ధాన్యకటకమే ఆంధ్రనగరి అయి వుంటుంది. బౌద్ధ వాఙ్మయంలో స్థానం పొందింది కాబట్టి సాధారణంగా ఆంధ్రనగరి బౌద్ధక్షేత్రమై యుండవలె. ధాన్య కటకం అశోకుని పూర్వం నుండి బౌద్ధ క్షేత్రమైనట్లు ఇటీవలి త్రవ్వకాలవల్ల తెలుస్తున్నది అంతేగాక ఆంధ్రదేశాన్ని గురించిన మొదటి శాసన ప్రమాణం మహారాజ శివస్కందవర్మ మైదవోలు తామ్రశాసనం (క్రీ.శ. 300). అది ధన కటకాన్ని ఆంధ్రపథానికి రాజధానిగా పేర్కొంటున్నది. పూర్వకాలంలో రాజ్యాన్నిబట్టి రాజధానికి, రాజధానీనగరాన్నిబట్టి రాజ్యానికి పేర్లుపెట్టే ఆచారం ఉంది. అందుచేత ధనకటకానికి ఆంధ్రనగరి అనే మరోపేరుండడంలో ఆశ్చర్యం లేదు. కాబట్టి మైదవోలు శాసనంలోని ఆంధ్రపథము, భీమసేన జాతకంలోని ఆంధ్రాపథము ఒకటేనని దాని రాజధానియైన ధనకటకమే సెరివణిజ జాతకం లోని ఆంధ్రనగరమని నిర్ణయించవచ్చు. ఈ ఆంధ్రాపథకమే ఆంధ్రదేశానికి బీజప్రాయం.

అయితే ఆంధ్రులు దక్షిణాపథంలో సువిశాల ప్రాంతాన్ని ఆక్రమించి వున్నట్లు వాఙ్మయంలో సూచనలున్నాయి. ఐతరేయ బ్రాహ్మణం ప్రకారం ఆంధ్రులు విదర్భకు దక్షిణ భూముల్లో నివసిస్తున్నట్లు ఉంటే మహాభారతం వారిని వనవాస (బనవాసి-మైసూర్) ప్రాంతవాసులైనట్లు చెబుతున్నది. పౌరాణిక వాఙ్మ యంలో ఆంధ్రులు తూర్పు భారతంలోని శబర గుహాది జాతులతో కలిసివున్నట్లు ఉంది. సుత్తనిపాతంపైని వ్యాఖ్యాన గ్రంథంలో అస్సక ములకలను ఆంధ్రజన పదాలుగా పేర్కొన్నారు. వీనిలో అస్సక జనపదం నేటి నిజామాబాద్ జిల్లాగా గుర్తిస్తున్నారు. అస్సక రాజధాని పౌదన్యపురమే నేటి బోధన్. ఏరియన్ పేర్కొన్న ముప్పై రాజ్యాలలో అస్సక ఒకటి అయివుంటుంది.

**త్రిలింగదేశం :**

ఆంధ్రదేశం, త్రిలింగదేశం అనేవి పర్యాయపదాలుగా వాడుతున్నాం. త్రిలింగ పదం ఆంధ్ర పదం అంతటి ప్రాచీనం కాకపోయినా పదస్వరూపం, ఉత్పత్తి, అర్థాలను గురించి వాదోపవాదాలతో కూడిన పెద్ద చరిత్రే వుంది.

శ్రీశైల భీమ కాళేశ మహేంద్రగిరి సంయుతం
ప్రాకారాతుమహత్ కృత్వా త్రీణిద్వారా మపాకరోత్....

అంటూ స్కాందపురాణం శ్రీశైలం, దాక్షారామం, కాళేశ్వరం (కరీంనగర్ జిల్లా), మహేంద్రగిరి ప్రాకారంగా ఉన్నదేశం త్రిలింగ దేశమని నిర్వచిం చింది. కాని ఏ విధంగా ఆలోచించినా ఈ క్షేత్రాలను ఆంధ్రదేశానికి ఎల్లలుగా అంగీకరించలేము. ఇంతకంటే మెరుగైన అర్థాన్ని విన్నకోట పెద్దన సూచించి నాడు.

"ధర శ్రీపర్వత కాళేశ్వర దాక్షారామ సంజ్ఞవరలు త్రిలింగా
కరమగుట నంధ్రదేశం బరుదార త్రిలింగ దేశమనజనుకృతులన్"

మూడు శైవ క్షేత్రాలున్నందున త్రిలింగ దేశం అయిందంటారు. కాని ఆంధ్ర దేశంలో ప్రసిద్ధమైన శైవక్షేత్రాలు మూడేకాదుగదా! వాస్తవానికి ఈ క్షేత్రాల కంటే మిక్కిలి ప్రాచీనమైనది త్రిలింగ లేక తిలింగ పదం. కాబట్టి శైవక్షేత్రాం పరంగా త్రిలింగకు అర్థం సాధించబూనడం చరిత్ర సిద్ధంకాదు.

త్రిలింగ పదం 'త్రికళింగ' నుండిగాని 'తెన్‌కళింగ' నుండి గానీ వచ్చి వుంటుందనే వాదాలున్నాయి. గంగా గోదావరీముఖద్వారాల మధ్య విస్తరించిన కళింగ రాజ్యంలో ఉత్తర, మధ్య, దక్షిణకళింగలనే మూడు విభాగాలున్నాయి. ఉత్తర కళింగే ఉత్కళ అయింది. మధ్యకళింగనే 'టాలెమీ' 'మోడోకళింగ్' అని వ్యవహరించివుంటాడు. దక్షిణకళింగనే,'తెన్‌కళింగ్'అన్నారని అదే తెనుగుగా అనంతరం తెలుగుగా మారివుంటుందని ఒక అభిప్రాయం. అయితే 'తెన్‌కళింగ' పదం ఎన్నడూ వాడుకలో ఉన్నట్లు తెలియదు; అదీగాక 'తెనుగు' కంటే తెలుగే ప్రాచీనతర రూపం. ఇక మహేంద్రగిరి నుండి గోదావరీ ముఖద్వారం వరకు విస్తరించిన దక్షిణ కళింగ మూడవ కళింగ. అదే సంస్కృతంలో త్రికళింగ అయి వుంటుంది. కాని మూడవ కళింగను తృతీయ కళింగ అని సంస్కృతీకరించవలె; త్రికళింగ అనికాదు. క్రీ. శ. 6, 7 శతాబ్దాలలో దక్షిణ కళింగాధిపులైన గంగ, తూర్పు చాళుక్యరాజ వంశాలవారు 'త్రికళింగాధీశ్వర' బిరుదం ధరించినారు. త్రికళింగ పదంలోని 'క' అక్షరం క్రమంగా లుప్తమై త్రిలింగ అయిందని ఈ వాదం సారాంశం. ఈ వాదంలోని ఇతర లోపాలెట్లా ఉన్నా తిలింగ (త్రిలింగ) పదం త్రికళింగ పదంకంటే ప్రాచీనమైనందున త్రికళింగ నుండి త్రిలింగ జన్మించినదనడం సబబుకాదు.

'ఆంధ్ర' పదం వలెనే త్రిలింగకూడా మొదట్లో తెలుంగు లేక తిలింగ అనే ప్రజలను సూచించిన పదమై ఉన్నట్లు కన్పిస్తుంది. క్రీ.శ. 130 ప్రాంతానికి చెందిన టాలెమీ రచనలో ట్రిలింగాన్, ట్రిలిప్టాన్ అనే పదాలు కన్పిస్తున్నాయి. ఐదో శతాబ్దానిదిగా చరిత్రకారులు భావిస్తున్న 'అగత్తియమ్' అనే తమిళ వ్యాకరణ గ్రంథంలో "కొంగణం, కన్నడం, కొల్లం, తెలుంగం" అని భాషా పరంగా 'తెలుంగు' కన్పిస్తున్నది. వాయు, మార్కండేయ పురాణాల్లో "అర్థ పాశ్చాతిలింగాశ్చ మగధాశ్చ వృకైః సహ" అనీ "తిలింగా కుంజరదరీకచ్ఛ వాసాశ్చమేజనాః'' అని ప్రజాపరంగా రేఫ రహితంగా తిలింగ పదం వాడినారు. అయితే ఈ పురాణాలకాలం నిర్ణయించడం గానీ వానిలోని ప్రక్షిప్తాలను పరిశీలించడం గానీ సాధ్యం కానిపని. క్రీ.శ. పదోశతాబ్ది వాడైన రాజశేఖరుడు

'త్రిలింగాధిపతి' అని ప్రయోగించినాడు. కాకతీయులు 'త్రిలింగదేశ పరమేశ్వర' బిరుదు ధరించారు. వారి సమకాలికులైన యాదవరాజుల మంత్రి హేమాద్రి తన 'వ్రతఖండం'లో 'తిల్లింకాధిపతి' 'తైలింగ క్షితపాల' అనే ప్రయోగించినాడు. దీనివల్ల ఒకే కాలంలో తిలింగ త్రిలింగ రూపాలు రెండూ వాడుకలో నున్నట్లు స్పష్టమవుతుంది.

ముండారీ భాషల్లో 'కళింగ' పదానికి తీరప్రజలు అనీ 'త్రిలింగ' (తిలింగ) పదానికి 'దేశస్థప్రజలు' అనీ అర్థం ఉంది. మన దేశంలో నదీ, పర్వత ప్రాంతాలకు వ్యవసాయ ఉత్పత్తులకు ఉన్న పేర్లు ముండారీజాతులు పెట్టినవేనని చారిత్రకుల అభిప్రాయం. కాళింగులకు పశ్చిమాన తైలింగులు పొరుగువారై వుంటారు క్రీస్తుపూర్వం నాలుగో శతాబ్దికే బర్మాలో తలైంగ్ అనే ప్రజలు ఉన్నారని తెలుస్తుంది. ప్రాచ్యాంధ్రంలోని తైలింగ్‌లు బర్మాలోని తలైంగ్‌లు ఒక జాతి శాఖలేననడం సమంజసం. కోలామీ భాషలో 'తలైంగ్'పదానికి నాయకత్వం వహించినవారని అర్థం. బహుశా కోలామీ ప్రజలను తలైంగు లొకప్పుడు జయించి వుండవచ్చు. క్రమంగా క్రీ.శ. తొమ్మిదో శతాబ్దానికి శైవం విజృంభించి తిలింగ త్రిలింగగా సంస్కృతీకరింపబడి శైవపరమైన అర్థం కల్పితమై కాకతీయయుగంలో బహుళ ప్రచారం సాధించింది. ఆంధ్రదేశానికి త్రిలింగదేశం పర్యాయపద మయింది.

కాకతీయుల అనంతరం ముస్లిం దండయాత్రికులు, పాలకులు, 'తెలంగాణా' పదానికి ప్రచారం తెచ్చినారు. క్రమంగా ఆపదం నేటి తెలంగాణాకు పరిమితమై పోవడం విశేషం. కాని ఓరుగల్లునుండి పాలించిన కాపయనాయకుడు 'ఆంధ్రసురత్రాణ' బిరుదం ధరించగా కృష్ణాముఖద్వారంలోని శ్రీకాకుళాంధ్ర విష్ణువు కృష్ణదేవరాయలుతో "దేశంబు తెలుగు ఏను తెలుగు వల్లభుండ" అని చెప్పుకొన్నాడు.

## ఆంధ్రజాతి

ఆంధ్రుల జాతీయతను గురించి భిన్న అభిప్రాయాలున్నాయి. ఐతరేయ బ్రాహ్మణంలో ఆంధ్రజాతిని గురించి ప్రస్తావించిన వాక్యానికి వ్యాఖ్యానం సంశయాస్పదంగా ఉంది. ఆ బ్రాహ్మణంలోని కథ ఇది:యజ్ఞపశువుగా కొంపోబడుచున్న బ్రాహ్మణయువకుడు శునస్సేపుని రక్షించి విశ్వామిత్రుడు తన ఆశ్రమానికి తీసుకు వెళ్ళి తన కుమారులను శునశ్శేపుని సోదరునిగా స్వీకరించమనగా వారిలో కొందరు నిరాకరించినారు. విశ్వామిత్రుడు కోపించి అవిధేయులైన వారిని ఆర్యభూముల నుండి బహిష్కరించగా వారే ఆంధ్ర, పుళింద, శబర, మూతిబాది జాతులయినారు. ఈ కథను బట్టి ఆంధ్రులు విశ్వామిత్రుని సంతతివారు. విశ్వామిత్రుడు ఆర్యర్షి. అవిధేయత వల్ల పతితులైన ఆర్యులు ఆంధ్రులని ఒక వ్యాఖ్యానం.

ఈ బ్రాహ్మణంలోని 'ఏతేంధ్రాః పుండ్రాః శబరాః పుళిందామూతిబా ఇత్యుదంత్యా బహవోభవంతి' అనే వాక్యానికి విశ్వామిత్రుని కుమారులు పైశాచులలో కలసిపోయినారు అనే వ్యాఖ్యానం కొందరు చేస్తున్నారు; ఇది యిట్లుంచి విశ్వామిత్రుని జాతీయతే అనుమానాస్పదంగా వుంది. విశ్వామిత్రుడు ఆర్యేతరుడని ఆర్య దండయాత్రికులలో మొట్టమొదట చేరిన స్థానికుడని ఒకరి పరిశీలన. స్వర్గంపై ఇంద్రుని గుత్తాధిపత్యంమీద, బ్రాహ్మణాధిపత్యంమీద, రక్తసిక్తమైన వైదికక్రతు కాండమీద విశ్వామిత్రుడు విప్లవధ్వజం ఎత్తినాడు. వశిష్ఠునితో సుదీర్ఘ సంఘర్షణ అనంతరం బ్రహ్మత్వం సాధించినాడు. ఆర్య దేవతాగణంలో తాను జేరడానికి ప్రతిఘటించిన దక్షుని నిర్జించిన శివునివలె విశ్వామిత్రుని జీవితంలోని ఈ సంఘటనలు పై అభిప్రాయాన్ని బలపరుస్తున్నాయి. శునశ్శేఫుని కథ కూడ పై అభిప్రాయాన్నే సూచించవచ్చు. ఆర్యులతో చేరిన విశ్వామిత్రుడు తనవారిని సయితం ఆర్యాధిపత్యం అంగీకరించవలసిందని కోరగా అందుకు అంగీకరించనివారు ఆర్యాధికారాన్ని ప్రతిఘటించే శక్తి చాలక ఆర్యాక్రమిత భూముల నుండి నిర్గమించారనేదే ఆ సూచన.

భాగవతాది పురాణాల్లో అంధకులే ఆంధ్రులని యదువృష్ణి భోజ కుమారాది ఆర్యజాతులలోని వారైన ఆంధ్రులు ఆర్యులని ఒక వాదం. ప్రాకృత వాఙ్మయం ఆంధ్రులను అంధకులని వ్యవహరిస్తున్నది. ప్రాకృతాంధకులు పౌరాణికాంధకులు ఒకరేననేది కూడ వీరి వాదంలో ఒక భాగం. పౌరాణిక అంధకులను ఆంధ్రు లనడానికి వీలులేదు. ఆంధ్రశబ్దం ప్రాకృతంలో అంధ అవుతుంది. 'క' అనేది నివాస స్థలాన్ని సూచించే ప్రత్యయం. ప్రాకృతంలోని బౌద్ధవాఙ్మయం ఆంధ్ర భిక్షువులను అంధకులు అని వ్యవహరించింది. పురాణాలు అంధకులను వృష్ణి భోజాది ఔత్తరాహజాతులతో కలిపి చెప్పినాయి గాని దాక్షిణాత్యులైన శబర పుళిందాదులతో చెప్పలేదు. మరొక విశేషం; వృష్ణి భోజాంధక అని చెప్పిన భాగవత పురాణానికి ఆంధ్ర పదంతో పరిచయం వుంది. అందుచేత భాగవతకారునకు అంధక, ఆంధ్ర అనే రెండు భిన్న జాతులున్నట్లు తెలుసునడం స్పష్టం, కాబట్టి అంధకులే ఆంధ్రు లనడం సరియైన వాదం కాదు.

ఆంధ్రుల అనార్యత్వానికి ఆర్యవాఙ్మయంలో సందేహానికి తావులేదు. ఐతరేయబ్రాహ్మణం ఆంధ్రులను శబరజాతితో కలిపి చెప్పింది కదా! నేటికీ శబరులు ఆంధ్ర ఉత్కళ రాష్ట్రాల్లో ఉన్నారు. వారి శరీర నిర్మాణాన్ని గాని సంస్కృతిని గాని పరిశీలించినవారు వారిని మంగోలు జాతివారిగా నిర్ణయిస్తున్నారు. అయినచో శబరుల సోదరులైన ఆంధ్రులు ఆర్యజాతివారని చెప్పడం సమంజసం కాదు. ఇక మహాభారతం ఆంధ్రులను దక్షిణాపథవాసులైన చేర,

చోళ, పాండ్యాదులతో గలిపి చెప్పింది మత్స్య, భాగవతాది పురాణాలు కూడా వారిని మ్లేచ్ఛులుగా వర్ణిస్తున్నాయి. ఆంధ్రులు గ్రామబహిప్రదేశాల్లో మాత్రమే నివసించడానికి యోగ్యులు అని మనుధర్మశాస్త్రం శాసించింది. అయితే ఈ స్మృతి వాఙ్మయం తయారైన రోజుల్లో ఆంధ్రులు బౌద్ధమతాభిమానులైనందున ఆ వాఙ్మయం వారిని మ్లేచ్ఛులుగా చిత్రించిందని ఒక ఊహ (డా. డి. సి. సర్కార్). కాని బౌద్ధమత చరిత్రలో రెండో అశోకుడుగా ప్రసిద్ధుడై కనిష్కుని ఆస్థానవైద్యుడు, బౌద్ధుడునైన చరకుడు తన సంహితలో—

"గృధ్రోలూ కశ్వాకాకాద్యైః స్వప్నే యః పరివార్యతే
రక్షః ప్రేత పిశాచ స్త్రీ చండాల ద్రవిడాంధ్రకైః"

అంటూ ఆంధ్రుడు కలలోకి వస్తే ప్రాయశ్చిత్తం చేసుకోవాలని సూచించి నాడు. అందుచేత ఆంధ్రుల మ్లేచ్ఛత్వానికి వారి బౌద్ధమతం కారణం కాదని తెలుస్తున్నది.

జాతీయతను నిర్ణయించడానికి అవయవ నిర్మాణ పరిశీలన ఒక ముఖ్య సాధనం. అయితే శతాబ్దాల తరబడి ఒకే ప్రాంతంలో కలసివున్నందున, యుగయుగాలుగా భిన్న ఆర్థిక రాజకీయ కారణాల ఫలితంగా జరిగే సామాజిక పరివర్తనా ఫలితంగాను జాతి సాంకర్యానికి అవకాశం ఉంది ఒకే వ్యక్తిలో భిన్న జాతుల లక్షణాలు కన్పించడం సంభవం కాని స్థూలంగా ఆంధ్ర ప్రజలను పరిశీలిస్తే వారిలో మధ్యధరా, ఆస్ట్రిలాయిడ్, మంగోలాయిడ్ జాతుల లక్షణాలు కన్పిస్తాయి. వీరందరూ ఆర్యేతర జాతులే. మధ్యధరా జాతికి మధ్యస్థమైన దేహ ప్రమాణం, వెడల్పుగా పొట్టిగా ఉండే ముఖాలు, వంకరులు ఎక్కువగా లేని జుట్టు, గోధుమవర్ణం ముఖ్య లక్షణాలు. ముఖ్యంగా తీరమైదానంలోని అగ్ర వర్ణాల్లో ఈ లక్షణాలు ఎక్కువగా కన్పిస్తాయి. అదీగాక ఆంధ్రదేశంలో ''రాక్షస గుళ్ళు'' అనే ప్రాచీన సమాధు లున్నాయి. వీరిలో లభించిన అస్థిపంజ రాల్లో మధ్యధరా జాతుల లక్షణాలు స్పష్టం. ఒకప్పు డీ జాతులు ఆసియామైనర్ నుండి గంగా మైదానం వరకు విస్తరించివుండేవారని పారశీక గ్రంథమైన అవేస్తా లోని 'దాహదహ్యులు' ఋగ్వేదంలో దాసదస్యులు వీరేనని చరిత్రకారుల నిర్ణయం. కాబట్టి ఆర్య ద్రావిడ సంఘర్షణ భారతదేశానికి వెలుపలే ప్రారంభ మయింది. ఉత్తరాపథంలో ద్రావిడు లొకప్పుడుండేవా రనడానికి బలూచిస్తాన్ లోని బ్రహూయీ భాషను నిదర్శనంగా ఉదాహరిస్తారు. ఇక దక్షిణ పీఠభూమి లోని ఆదివాసులు ఆస్ట్రిలాయిడ్, మంగోలాయిడ్ జాతులకు చెందినవారు. నల్లమలారణ్యాల్లోని చెంచులు, కోయలు ఆస్ట్రిలాయిడ్ జాతివారు. వీరివి పొట్టి దేహాలు, పొడవైన తలలు, చప్పిడి ముక్కులు. మన్యప్రాంతారణ్యాలలోని సవరలు, గదబలు మంగోలాయిడ్‌లు. వీరిది నల్లని దేహకాంతి, బొద్దు

పెదవులు, చప్పిడి ముక్కులు. క్రమంగా ఈ జాతులవారు సమీప నాగరికతా సంస్కృతు లలవరచుకొని సమాజంలో కలిసిపోతున్నారనవచ్చు.

వాయు బ్రహ్మాండాది పురాణాల్లో హిమాలయాల కావలి ఉత్తర భూముల్లో వక్షు నదీతీరంలో ఆంధ్రులొకప్పుడు నివసించిన సూచనలున్నాయి. మధ్య ఆసియాలోని ఆక్సస్ నదియే పురాణాల్లోని వక్షు (చక్షు) నది. ములకలు, దరదులు, పారదులు, పహ్లవులు మొదలైన తెగలు ఆంధ్రుల ఇరుగుపొరుగున ఉన్నట్లు పురాణాలు చెబుతున్నాయి.

"అథచీనమ రూంశ్చైవ సణ్గణాన్ సర్వమూలికాన్
సాన్ధ్రాం స్తుషారాం స్తంపాకాన్ పహ్లవాన్ దరదాన్ శకాన్
ఏతాని జనపదాన్ చక్షుః ప్లావయ స్తీ గతోదధిమ్"

అని వాయుపురాణము. నేటికీ మధ్యఆసియాలో బలక్ పశ్చిమాన నూరుమైళ్ళ దూరంలో "అన్ధకుయి" అనే ప్రాంతం వుంది. ఆఫ్ఘనిస్థాన్‌లో యుద్ధప్రియులైన ఒక జాతి పేరు అన్ద్రి లేక అందేరి. వక్షు (చక్షు) నదీతీర వాసులుగా పురాణాలు పేర్కొంటున్న దరద, పహ్లవ, ములక, పారదాది తెగలు చారిత్రక కాలంలో తిరిగి ఆంధ్రులకు పొరుగువారుగా దక్షిణా పథంలో కనిపిస్తున్నారు. ములకు లాక్రమించిన ప్రాంతమే ములక రాష్ట్రమయింది. పహ్లవులు స్థిర పడిన ప్రదేశం పల్లవ భోగ్య (బొగ్గ)మై నేటి పలనాడయింది. ఆంధ్రుల నివాస స్థలమే ఆంధ్రాపథంగా జాతక కథలలో ప్రవేశించింది. అశోకుని శాసనాలు పారదులను దాక్షిణాత్యులుగా పేర్కొన్నాయి. దరదులను పిశాచులని, వారిది పైశాచీభాష అనీ ఆర్యులు నిందించినారు. పైశాచీ భాషకు సంస్కృతానికి పోలిక లున్నవని పండితుల అభిప్రాయం. కథా సరిత్సాగరంలోని గుణాఢ్యుని కథ శాతవాహనుల కాలంలో పైశాచీ భాష మాతృభాషగా ఉన్నవారు ఆంధ్రుల్లో ఉన్నట్లు సూచిస్తుంది. కథా సరిత్సాగరాన్ని గుణాఢ్యుడు పైశాచీభాషలో వ్రాసినాడట! కారణాంతరాల వల్ల, బహుశా ఆర్యదండయాత్రల తాకిడివల్ల చక్షునదీ వాసులైన ఈ జాతులన్నీ వలసవచ్చి దక్షిణా పథంలో స్థిరపడినారని భావించవచ్చు. ఈ జాతులన్నింటిని స్మృతివాఙ్మయం మ్లేచ్ఛులని పేర్కొంటున్నది.

ఈ మహాప్రస్థానంలోనూ దక్షిణా పథంలోను ఆంధ్రులకు మరికొన్ని తెగలతో సంబంధం ఏర్పడింది.వారిలో నాగులు, యక్షులు,అశ్మకులు, మహిషకులు, తెలుగులు ముఖ్యులు. పేర్లను బట్టి వీరిలో చాలభాగం చిహ్నారాధకులైన తెగలని చెప్పవచ్చు. బౌద్ధ వాఙ్మయంలోను సింహళ, సయాం దేశాల ప్రాచీన సాహిత్యంలోను కృష్ణా ముఖద్వారాన్ని నాగభూమిగా వర్ణించినారు. ఋగ్వేద కాలంలో (క్రీ.పూ. 2000) నాగులు పంజాబు ప్రాంతంలో నివసిస్తూ ఆర్య దండయాత్రలను తీవ్రంగా ప్రతిఘటించినారు. వీరిని శిశ్నదేవులని ఆర్యకర్మలకు

విరోధులని ఋగ్వేదం వర్ణిస్తున్నది. వీరు మదనోత్సవాలలో ప్రధానాంశమైన లింగారాధకులయినట్లు గ్రహించవచ్చు, నాగులకు, ఆర్యులకు జరిగిన తీవ్ర సంఘర్షణలో "ఖాండవ దహనం", జనమేజయ "సర్పయాగం" రెండు ముఖ్య ఘట్టాలు. ఈ ప్రమాదం నుండి తప్పించుకొన్న నాగులు దక్షిణంగా వలసవచ్చి కృష్ణా ముఖద్వారంలో స్థిరపడి ఉంటారు. అమరావతీ శిల్పాలలోని రాజులకు రాణులకున్న సర్పకిరీటాలు వారి జాతీయతకు చిహ్నాలే!

ఆంధ్రులకు సంబంధించిన అనేక గాథల్లో యక్షుల ప్రసంగం కన్పిస్తున్నది. వీరుకూడ ఆర్యేతరులే. శాతవాహన వంశ మూలపురుషుడు సాతుడనే యక్షుని కొడుకైనట్లు తెలుస్తుంది. యక్షులే నేటి జక్కులయి వుంటారు. 'యక్ష గాన' మనే పేరు యక్షుల సంగీతాభినివేశానికి నిదర్శనం. నేటికీ జక్కుల వాండ్రు నాటకాలాడడంలో ఆరితేరినవారు. నాగులు, యక్షులు ఆదిమ శైవాన్ని అనుసరించినారని చెప్పవచ్చు. శివుడు నాగభూషణుడు; యక్షగణాధ్యక్షుడు. క్రమంగా వీరు బౌద్ధాన్ని ఆదరించినారు బౌద్ధవాఙ్మయంలో నాగులు, యక్షులు పెద్ద కట్టడాలు నిర్మించడంలో సిద్ధహస్తులనే వర్ణనలున్నాయి. ఆంధ్రదేశంలోని ప్రాచీన స్తూపాలు వీరి నిర్మాణాలే అయివుంటాయి.

ఇక అశ్మక మహిషకులు. అశ్మక పదం అశ్వకరూపంలో కూడ కన్పిస్తున్నది. నాగులవలె వీరు అశ్వమహిష చిహ్నారాధకులైన తెగలని భావించవచ్చు. శాతవాహన పదానికి ప్రిజులస్కీ పండితుఁడు ముండారీ భాషలో అశ్వసంతతి (సత=అశ్వము, పహన్=కొడుకు) అనే అర్థం వుందని చెప్పినాడు. ఈ నిర్వచనం శాతవాహనులు అశ్వక తెగకు చెందినవారనినప్పుడు సరిపోతుంది. గుంటుపల్లి శాసనంలోని కళింగాధిపతికి"మహిషకాధిపతి" అనే బిరుదుంది. ఆంధ్ర కర్ణాటక సరిహద్దు ప్రాంతాల్లో (మెదక్, నల్గొండ, ధార్వాడ్ జిల్లాలలో) మహిషకులుండినట్లు పురావస్తు ఆధారాలవల్ల తెలుస్తున్నది. ఆంధ్రజాతిలో లీనమైన మరొక తెగ తెలుగులు.

ఆహార సంపాదనలోని కష్టనిష్ఠూరాలు, ఇతర జాతులవల్ల కలిగే భయాందోళనలు వంటి కారణాల ఫలితంగా పరస్పర సహకార ఆవశ్యకత గుర్తించి ఈ జాతులన్నీ క్రమంగా ఐక్యమయినాయి. జాతి సాంకర్యం సాంస్కృతిక సమ్మేళనం దక్షిణాపథంలో శిలాయుగంలోనే కన్పిస్తున్నది. ఈ జాతులలో సాహసోపేతులు యుద్ధప్రియులైన ఆంధ్రులు రాజకీయాధిక్యం సాధించడంతో వారి ఆధిపత్యం కిందికి తెచ్చిన తెగలన్నీ స్వీయవ్యక్తిత్వం కోల్పోయి ఆంధ్రులయినారు. భిన్న జాతుల సమ్మేళనం ద్వారా ఆంధ్రజాతి ఏర్పడిందని సూచించడానికే బహుశా "ఆంధ్రాశ్చ బహవః" అంటూ

మహాభారతం నిర్వచించింది. వాసిష్టీపుత్రపులోమావికి 'నవనరస్వామి' అనే బిరుదు వుంది.

**ఆంధ్రభాష :**

ఆంధ్రులు మాట్లాడే భాషకు ఆంధ్రము, తెలుగు, తెనుగు అనే పేర్లున్నాయి. తెలుగుకు రూపాంతరమే తెనుగు అని అంగీకరించవచ్చు. తెనుగు రూపాన్ని మొట్ట మొదటిసారిగా ప్రయోగించింది పదకొండో శతాబ్దంలో నన్నయ భట్టారకుడు. తెనుగు ఉత్పత్తి అర్థాన్ని గురించి పండితుల్లో అనేక ఊహాపోహ లున్నాయి. ఇక ఆంధ్ర, తెలుగు అనేవి ఆంధ్రజాతిలో జీర్ణించుకుపోయిన రెండు ముఖ్య తెగలని తెలుస్తుంది. అయితే తెలుగుతెగ ఆంధ్రజాతిలో సమైక్య మైనపుడు ఇతర తెగల భాషలవలె తెలుగుభాష సయితం వ్యక్తిత్వం కోల్పోయి వుండవలసింది. ఆ విధంగా జరగలేదు. అందుకు కారణం ఊహించడం కష్టం కాదు. వైదిక వాఙ్మయం ఆంధ్రులు సాహసోపేతులయిన సంచారకజాతి అని సూచిస్తున్నది. ఇక తెలుంగులు తీరమైదాన ప్రాంతాల్లో కళింగులకు పొరుగున వ్యవసాయాది వృత్తులవలంభించిన స్థిరనివాసులు. కళింగ పదానికి వరిధాన్యం తినేవారనే అర్థం కూడా ఉంది. తెలుగులువారి సోదరులే! అందువల్ల తెలుంగుల భాషా సంస్కృతులు ఆంధ్రుల భాషాసంస్కృతుల కంటె కొంత పరిణతి చెంది వుండటంలో ఆశ్చర్యం లేదు, కాబట్టి సైనికంగా విజేత లయినప్పటికీ ఆంధ్రులు విజితులైన తెలుంగుల భాషను అనుసరించక తప్పలేదు. అదే కారణంగా తెలుంగులు ఆంధ్రజాతిలో జీర్ణమైపోయినప్పటికీ తెలుగుభాష వ్యక్తిత్వం నిలబడింది. విజితుల సంస్కృతి విజేతలను నిర్జించిన సంఘటనలు చరిత్రలో లేకపోలేదు. రాజకీయాధికారం నెరపుతున్నది ఆంధ్రులయినందున వారు వాడుతున్న తెలుగు భాషకే ఆంధ్రభాష అని వ్యవహారం ఏర్పడింది.

ఆంధ్రభాష సంస్కృత లేక ప్రాకృతజన్యం అనే వాదంలో సత్యంలేదు. ఆంధ్రభాష సంస్కృతం, తెలుగుభాష ఆర్యేతరం; రెండింటి మిశ్రమమే నేటి ఆంధ్ర లేక తెలుగు భాష అని మరికొందరు వాదిస్తారు. ఆంధ్రులు కూడ అనార్యతెగయే అనే పరిశీలనతో ఆ వాదం కూడ నిలవదు. ఈ వాదనలన్నీ ఆర్యసంస్కృతి అనార్య సంస్కృతి కంటె ఉదాత్తమైనదనే అభిప్రాయం వల్ల, మన సనాతన పండితుల్లో సంస్కృతం పట్ల ఉన్న అభిమానంతో "తల్లి సమస్త భాషలకు దైవత భాష" అనే భావం నుండి బయలుదేరినాయి. ఇటీవలి పరిశోధ నలు ఆర్య సంస్కృతి గొప్పదనే అభిప్రాయాన్ని తొలగిస్తున్నాయి. హైందవ నాగరికతా పరిణామంలో ఆర్యేతర సంప్రదాయాలు సంస్థలు ప్రధానపాత్ర వహించినట్లు స్పష్టంగా తెలుస్తున్నది. వైదిక భాషలోనే అసంఖ్యాకంగా ఆర్యేతర భాషా పదాలున్నాయని కిట్టెల్, గుండెర్ట్ మొదలైన పండితులు పరిశీలించినారు.

ఆర్యేతర భాషాపదాలు మార్పులు పొందిన సంస్కృతంలో చేరినట్లు క్రీ.శ. 8 వ శతాబ్దివాడైన కుమారిలభట్టు వంటి సనాతన పండితులు అంగీకరించినారు. కొన్ని పదాలను (కావేరి, మందిర, బలాక) తమ కనుకూలమైనట్లు సంస్కృతీకరించినారు. కొన్నింటికి (మైసోలియా=కృష్ణా, చేబ్రోలు=తామ్రపురి; ముడియనూరు=చూడాగ్రామం) సమానార్థకాలైన సంస్కృత పదాలు సృష్టించి పూర్వ పదాలను రూపుమాపినారు. ఈ పద్ధతుల్లో సంస్కృత పదజాలం పెరిగింది. అందుచే దేశీయ భాషల్లో తద్భవాలుగా వ్యవహారంలో ఉన్న పదాలే వాని మాతృకలుగా భావిస్తున్న సంస్కృత పదాలకు మాతృకలై వుండవచ్చు.

కుమారిలభట్టు ఆంధ్రుడే అయినా ఆంధ్ర ద్రావిడ భాషలను మ్లేచ్ఛ భాషలనినాడు. గోండ్, కుయి, కోలామి మొదలైన ఆదిమ జాతుల భాషల్లో తెలుగు పదాలకు మౌలికరూపాలున్నట్లు భాషాశాస్త్రవేత్తల పరిశీలన. తలైంగ్ అనే కోలామీ పదమే తెలుగుకు మూలమై యుండవచ్చునని పేర్కొన్నాముగదా! ఒంగోలు, మద్రాస్ నగరాల మధ్య తీరాంధ్రాన్ని 'అరువావదతలై' అనేవారు. ప్రకాశం జిల్లా కందుకూరు సమీపంలోని మాలకొండలోని గుహాముఖంపైని శాసనం క్రీ పూ. 2వ శతాబ్దం నాటిది. ఆ శాసనం 'అరవకుల'జాడైన వీరిసెట్టిని పేర్కొంటున్నది. మైసోలియా (కృష్ణా)కు దక్షిణంగా 'అరువర్నా' అనే ప్రజలున్నట్లు టాలెమీ వ్రాసినాడు. ఈ ప్రాంతం ప్రజలు "కొడుందమిళం" మాట్లాడతారని 'తొల్కాప్పియం' పేర్కొన్నది. ఈ విధంగా ఆంధ్రజాతితో లీనమైన భిన్న తెగలు మాట్లాడే అనేక భాషాస్రవంతులు కలసి ఆంధ్రభాషా మహానది అయింది. సంస్కృత భాషాప్రాంతానికి సమీపంలో ఉన్నందున, చిరకాలం ప్రాకృతం (క్రీ.పూ. 300-క్రీ త 300) అనంతరం సంస్కృతం (క్రీ.శ. 300-600) రాజభాషలుగా ఉన్నందున ఆ భాషల పదాలు అసంఖ్యాకంగా ఆంధ్రభాషలో చేరినాయి. క్రీ.శ. మూడో శతాబ్ది ప్రాంతానిదైన అమరావతీ శాసనంలో 'నాగబు' అనే పదం ఉంది. సంస్కృత పదాల ఆంధ్రీకరణను ఈ పదం సూచిస్తుంది. ఈ విధంగా పరిణామం చెందిన ఆంధ్రభాషకు సంస్కృతానికి జన్య జనక సంబంధం స్థాపించబూనడం వ్యర్థప్రయత్నం.

సంస్కృత ప్రాకృతాలకు భిన్నమైన భాష ఆంధ్రులకు ఉన్నదనటానికి నిదర్శన లున్నాయి. ఆర్యేతర జాతుల్లో బౌద్ధమత ప్రచారానికి వారి వారి భాషలే (అనరియకో అంధదమిలాది) వాడవలెనని గౌతమ బుద్ధుడు ఆదేశించినాడని బుద్ధఘోషుడు (క్రీ.శ. 5 వ శతాబ్ది) వ్రాసినాడు. ఆంధ్రదేశంలో లభ్యమైన అశోకుని ధర్మలిపులు ప్రాకృతంలో ఉన్నమాట నిజమే! అంతమాత్రం చేత ప్రజలకు ప్రాకృతం మాతృభాష అనడం అసమంజసం. ధర్మలిపులు దేశంలోని విద్యావంతులనుద్దేశించినవి; భారతదేశంలో సాంస్కృతిక సమైక్యసాధనకు

లక్ష్యంగా వేసినవి. నాటక భాషా లక్షణాలు వివరిస్తూ ఆంధ్ర కిరాత ద్రావిడాది ప్రాంతాలకు వారివారి భాషలుగాక శౌరసేని ప్రాకృతం ప్రయోగించాలని భరతుడు శాసించినాడు. భరతుడు క్రీస్తుపూర్వం వాడని, క్రీ శ. 5, 6 శతాబ్దాల వాడని భిన్నవాదాలున్నాయి.సంస్కృత ప్రాకృతాలతోబాటు 'దేశి' భాషనుకూడా త్యజించి తన బృహత్కథను పైశాచీ భాషలో గుణాఢ్యుడు వ్రాసినాడని ఐతిహ్యం. ఇందలి దేశిభాష సంస్కృత ప్రాకృతాలకు భిన్నమై నేటి తెలుగు భాషకు తల్లి అని భావించవచ్చు. ఇక, హాలుని (క్రీ శ. 100) గాథా సప్తశతి లోని తెలుగు పదాలు ఒక పెద్ద పట్టిక అవుతాయి. శాతవాహనుల ద్విభాషా నాణెంలోని ఒక భాష ప్రాకృతం; మరొకటి దేశి; 'గోతమిపుతస సిరిసతకణిస' అని ప్రాకృతంలో ఉన్న శాసనం దేశిలో 'గోతమి మగకు తిరుహత కణికు' అని వుంది. 'మగ' అంటే కొడుకు అని అర్థం. 'కు' షష్ఠి విభక్తి ప్రత్యయం. ఈ శాసనంలోనే దేశీయమైన తెలుగు రగడ ఛందానికి ఛాయలున్నాయని ఒక పండితుని అభిప్రాయం. ఈ శాసనంలో ప్రాచీన తెలుగు భాషా స్వరూపం ప్రతిఫలిస్తున్నదని డా॥ డి. సి. సర్కార్‌వంటి చారిత్రకుల తీర్మానం. క్రీస్తుకు పూర్వం నాటి శాసనాల్లో కూడ గ్రామాల పేర్లు తెలుగులో ఉన్నాయి. కాబట్టి సంస్కృత ప్రాకృతాలకు భిన్నమై స్వతంత్రమైన భాష తెలుగువారికి ఉన్నదనడానికి ఇంతకు మించిన సాక్ష్యం అక్కరలేదు. క్రమంగా ఆరో శతాబ్దికి తెలుగు చోడులు, చాళుక్యులు తమ శాసనాల్లో తెలుగు వాడసాగినారు. ఆ శాసనాలనుండి కొంతగా ప్రాచీన తెలుగు స్వరూపం గ్రహించవచ్చు. ప్రజల భాషలో మత ప్రచారం చేయాలన్న జైనుల విధానం కూడ తెలుగు భాషకు ప్రోత్సాహం కలిగించి వుంటుంది. కాని జైన ప్రచారకులు సయితం సంస్కృత పండితులయినందున, జైనంకంటె ప్రాబల్యం వహించిన బ్రాహ్మణ-మత గ్రంథాలు సంస్కృతంలో ఉన్నందున, ఆ మత గ్రంథాలను అనువదించినవారు సంస్కృత భాషాధిక్యంలో విశ్వాసం ఉన్న వారైనందున క్రమంగా తెలుగుభాష సంస్కృతీకరణకు గురియై స్వస్వరూపాన్ని కోల్పోయింది.

## కొన్ని ఉపయుక్త గ్రంథాలు


1. Arudra — సమగ్ర ఆంధ్ర సాహిత్యం
2. Isvara Dutt — ప్రాచీనాంధ్ర చారిత్రక భూగోళం
3. Majumdar R.C. (ed) — The Vedic Age
4. Rama Krishnaiah K. — భాషా చారిత్రక వ్యాసములు
5. Sastry A.M. (ed) — Coinage of the Satavahanas
6. Somasekhara Sarma(ed) — ఆంధ్ర విజ్ఞాన సర్వస్వము, III
7. Yazdani — Early History of the Deccan

# ప్రాచీన చరిత్ర

## చరిత్ర పూర్వయుగం

భారత దేశంలో ప్లాస్టోసీన్ అనే హిమయుగంలో ఉష్ణ అంతర్దశల కాలంలో అంటే సుమారు మూడులక్షల ఏండ్ల క్రితం మానవుడు ఉదయించి వుంటాడు. వాతావరణం అనుకూలమై ఆహార సంపాదనావకాశాలు ఎక్కువగా ఉన్నందున ఆదిమ మానవుడు దక్షిణాపథం తూర్పు ప్రాంతంలో అవతరించి ఉత్తరావథానికి వలస వెళ్ళివుంటాడని శాస్త్రజ్ఞుల పరిశీలన. మానవోదయం నుండి నడిచిన చరిత్రను చరిత్ర పూర్వయుగం,చారిత్రకయుగం అని విభజిస్తారని చెప్పినాము. పురాచరిత్ర (Proto - history - క్రీ. పూ. 1500 ప్రాంతం.) ప్రారంభమయ్యే వరకు సుదీర్ఘమైన చరిత్ర పూర్వయుగంలో మానవ జీవితం వశుప్రాయమై నిరాసక్తంగా ఉండేదనటంలో అతిశయోక్తి లేదు. కాని ఆ దశలో సైతం సహజ లక్షణమైన సుఖజీవనాసక్తి మానవునిలో ఉన్నందున పరిశీలన అనుకరణలద్వారా అనుభవ గుణపాఠాలు నేర్చుకొంటూ లభ్యమైన సాధనలు సామగ్రితో జీవితపోరాటం సాగించినాడు. ఆ కారణంగానే నాగరికతా పురోగమనం సాధ్యమయింది. కొన్నివేల సంవత్సరాలు జరిగిన ఈ దశనే చారిత్రకులు శిలా, తామ్ర, కాంస్య, అయో యుగాలుగా విభజిస్తారు. శిలాయుగంలో ప్రాచీన, నవీన యుగాలనే విభజన వుంది. తిరిగి ప్రాచీన శిలాయుగంలో ఎగువ (Upper) మధ్య (Middle) దిగువ (Lower or Later) యుగాలనే అంతర్దశలున్నాయి. దిగువయుగాన్నే సూక్ష్మరాతియుగం అనడం కద్దు. ఈ యుగవిభజన ఆయాకాలాల్లో సాధనసామాగ్రికై మానవుడు వాడిన 'ముడి సరుకు'ను బట్టి పరికరాల స్వభావాన్ని బట్టి జరిగిందని వేరుగా చెప్పనక్కరలేదు.

**పాత రాతియుగం :**

భారతదేశంలో చరిత్ర పూర్వయుగ - ముఖ్యంగా శిలాయుగ - పరిశోధన ఆశించినంత శాస్త్రీయంగా జరుగలేదు. ఈ పరిశోధన చరిత్ర క్రీ.శ. 1892 లో 'బ్రూస్ ఫూట్' అనే శాస్త్రజ్ఞునకు మద్రాసు సమీపంలో పల్లావరం చెంత రాతి పనిముట్లు దొరకడంతో ప్రారంభమయింది. బ్రూస్‌ఫూట్, కమియోడ్‌ల పరిశోధనల ఫలితంగా పాత రాతియుగ మానవుడు ఆంధ్రదేశంలో భిన్నప్రాంతాల్లో నివసించినాడని తెలుస్తున్నది.

పాత రాతియుగ మానవుడు నదీతీరాలలో ప్రకృతి సిద్ధంగా ఏర్పడిన కొండ గుహల్లో నివసించేవాడు. అతని జీవితమంతా ఆహారాన్వేషణలోను సంపాదనలోను గడచిపోయింది. నాటి పరికరాల్లో రాళ్ళనుచీల్చి తయారుచేసిన చేతిగొడ్డళ్ళు, బొరిగెలు ముఖ్యమైనవి. కడప, కర్నూలు, గుంటూరు, నెల్లూరు, అనంతపూర్, నల్గొండ, వరంగల్, కరీంనగర్ జిల్లాలలో పాత రాతి పనిముట్లు అసంఖ్యాకంగా దొరికినాయి. స్థానికంగా లభ్యమైన పదార్థంతో వీనిని తయారు చేసినారు. కడప, కర్నూలు ప్రాంతాల్లో పలుగురాయి, కృష్ణానదికి ఉత్తరంగా సున్నపురాయి వాడినారు. డోర్నకల్ సమీపంలోని నందికనుమ (గిద్దలూరు) ప్రాంతం పాత రాతి పనిముట్ల పరిశ్రమకు కేంద్రమయినట్లు కన్పిస్తుంది.

పాత రాతి మానవునకు ఆహారం పచనం చేయడం గానీ, ఆహారాన్ని నీటిని నిల్వవుంచుకోవడం గాని తెలియదు. అయితే నాటి పనిముట్లలో గీకుడు రాళ్ళు దొరికినందున వేటాడిన జంతువుల చర్మాలను మాంసం గీకివేసి దుస్తులుగా ధరించినాడని చెప్పవచ్చు. కర్నూలు జిల్లాలో భిల్లసుర్గం (భిల్లసొరంగం) మరొక పాత రాతియుగ స్థావరంగా కన్పిస్తుంది. ఇచటి గుహలో అనేక రకాల జంతు కళేబరాలు తలలు లేకుండా దొరికినాయి. అందువల్ల నాటికే మత విశ్వాసాలు ప్రారంభమై వుండవచ్చుననే అభిప్రాయం వుంది. దక్షిణాపథంలో దొరికిన పాతరాతి పనిముట్లకు ఆఫ్రికాలో దొరికిన పాతరాతి పనిముట్లకు పోలికలున్నాయి. పాత రాతియుగ మానవులు నీగ్రిటో తెగల వారై వుండవచ్చును.

పాత కొత్త రాతియుగాల మధ్య సుదీర్ఘమైన పరివర్తన కాలమే సూక్ష్మ రాతియుగం. ఈ కాలంలో స్వల్ప పరిమాణం ఉన్న పనిముట్లు వాడుకలో వున్నందున దీనికి పేరు వచ్చింది. నాటి ప్రజలు ఎత్తైన ప్రదేశాల్లో నివసిస్తూ జంతువులను చేపలను వేటాడటం ద్వారా ఆహారం సంపాదించేవారు. చెకుముకి రాయి, స్ఫటికం, కురువిందం వంటి అమూల్య శిలలతో చిన్నచిన్న పనిముట్లు చేసుకున్నారు. వీనిలో కత్తులు, బొరిగెలు, గీకుడురాళ్ళు, బాణముఖాలు ముఖ్య మైనవి. కొడవళ్ళుగా అంబులుగా శక్తివంతంగా ప్రయోగించడానికై వీనిని కర్రకుగాని ఎముకకుగాని తాపడం చేసేవారు. దీన్నిబట్టి విల్లంబులు వాడినారని స్పష్టమవుతున్నది పశువులతోబాటు ఖడ్గమృగం, దుప్పి, పంది, ముంగిస, ఎలుకలనుగూడ ఆహారానికి ఉపయోగించినట్లు తెలుస్తుంది. ఈ యుగం చివరి దశలో చేతితో కుండలు తయారుచేసుకున్న జాడలు కన్పిస్తున్నాయి. మృత దేహాలను భూస్థాపితంచేసే ఆచారం కూడా ప్రారంభమయింది. గిద్దలూరు, నాగార్జునకొండ, కొండాపూర్ ప్రాంతాల్లోను ఆదిలాబాద్ జిల్లాలోను సూక్ష్మశిలా పరికరాలు ఎక్కువగా దొరికినాయి. గిద్దలూర్ దగ్గర లభించిన సాక్ష్యాన్నిబట్టి ఈ యుగం క్రీ. పూ. 8000 - 6000 మధ్య విస్తరించిందని ఒక అభిప్రాయం.

దక్షిణ భారతంలోని సూక్ష్మశిలా పరికరాలకు కాస్పియస్ సముద్ర ప్రాంతాల్లో లభించిన వానికి పోలికలున్నాయి.

**నవ శిలాయుగం :**

గిద్దలూరులో, బళ్ళారిజిల్లా సంగనకల్లులో ఆహారాన్వేషణ దశనుండి ఆహారోత్పత్తి దశకు పరివర్తన చెందిన అంటే పాత శిలాయుగం నుండి క్రొత్త శిలాయుగావతరణకు సాక్ష్యం లభిస్తున్నది. ఆంధ్రప్రదేశ్‌లో ఇంచుమించు అన్ని జిల్లాల్లోను నవ శిలాయుగ పరికరాలు దొరికినాయి. ఈ దశకు అనుగుణంగా పరికరాల సంఖ్యలో స్వభావంలో మార్పులు వచ్చినాయి, నవ శిలాయుగ పని ముట్లలో దాదాపు నలభై రకాలున్నట్లు కనుగొన్నారు. పరికరాల తయారీలో కూడ మంచి నైపుణ్యం కన్పిస్తుంది. రాళ్ళను పగులగొట్టి పనిముట్లుగా రూపొందించి నున్నగా మెరిసేటట్లు రాళ్ళపై రుద్దేవారు నాటి పరికరాలలో గొడ్డలి, రెండు వైపులా పదును ఉన్న ఉలి, సుత్తి, బొరిగె, నాగటికర్రు ముఖ్యమైనవి. మొన ఉన్న ఈ కర్రును కర్రకు బిగించి భూమిని దున్నేవారు. ఇట్టి కర్రులు నాగార్జునకొండ లోయలో దొరికినాయి. రాగులు, పెసలు, ఉలవలు ఈ యుగంలోని పంటలైనట్లు కొన్ని శిలాయుగ స్థావరాలనుండి సాక్ష్యం లభిస్తున్నది. ఆహారోత్పత్తితోబాటు స్థిరనివాసాలు ఏర్పడినాయి. గట్టి కలప ఉన్న తుమ్మ వంటి చెట్లను గుంజలుగా పాతి దానిచుట్టూ జమ్ము వంటిదాన్ని నిలిపి మట్టిపూసి గుండ్రని గుడిసెలు నిర్మించుకున్నారు. పశువుల పేడను వంటచెరకుగా వాడడం జరిగింది. పశువులను మందలుగా పెంచేవారు. మందచుట్టూ కంచె వేసేవారు. ఉట్నూరు (మహబూబ్‌నగర్ జిల్లా) దగ్గిర పేడకుప్పలను తగులబెట్టిన మసి దిబ్బలు కన్పించినాయి. శాస్త్రీయపద్ధతి ననుసరించి (Carbon 14) చేసిన నిర్ణయం ప్రకారం ఈ మసిదిబ్బలు క్రీ. పూ. 2000 సం॥ నాటివని తెలుస్తున్నది.

**తామ్రయుగం :**

దక్షిణదేశంలో రాగియుగం లేదని నవ శిలాయుగం నుండి మానవుడు ఇనుప యుగంలోనికి నేరుగా ప్రవేశించినాడని చిరకాలంగా భావించినారు. కాని బ్రహ్మగిరి, పుదుచ్చేరి మొదలైనచోట్ల దొరికిన రాగి, కంచు పనిముట్లు ఈ అభిప్రాయాన్ని పూర్తిగా తొలగించినాయి. నవ శిలాయుగం చివరిదశల్లో దక్షిణాత్యులకు ఉత్తర దేశంలోని తామ్ర-శిలా (Chalcolithic) యుగంతో పరిచయం ఏర్పడినదనడానికి బలమైన సాక్ష్యం లభిస్తున్నది. కర్నూలు జిల్లాలో పాతపాడు మొదలైనచోట్ల చిత్రాలంకృత మృణ్మయపాత్రలు లభించినాయి. కృష్ణాజిల్లా కీసరపల్లిలో రాగిపనిముట్లు దొరికినాయి. అయితే, నవశిలా తామ్రయుగాలలో ఆంధ్ర కర్ణాట ప్రాంతాల ప్రజల సంస్కృతిలో చాల పోలికలు కన్పించినా ఎవరి

వ్యక్తిత్వం వారిదేననడానికి కూడా ఆధారాలున్నాయి. బహుశా ఆంధ్ర కర్ణాటక ప్రాంతాలకు ఒకే కేంద్రాల నుండి ఈ సంస్కృతి విస్తరించి వుంటుంది.

**ఇనుప యుగం - రాక్షసి గుళ్ళు :**

ఆంధ్రదేశంలో ఇనుపయుగం 'రాక్షసిగుళ్ళు' (Megaliths) అనే సమాధులతో ముడిపడినట్లు కన్పిస్తుంది. ఈ మాటకు 'పెద్దరాళ్ళు' అని అర్థం. ఇట్టి సమాధులు దక్షిణాపథం అంతటా మాత్రమేగాక మధ్య, పశ్చిమ ఆసియాల్లో అనేకచోట్ల కన్పిస్తున్నాయి. దక్షిణదేశంలోని సమాధులు దాదాపు క్రీ. పూ. 500 సం॥ల నాటివిగా నిర్ణయిస్తున్నారు. ఈ సమాధుల్లో అస్థికలుగాని, మృతదేహాలుగాని ఉంచి వానితోబాటు ఆ వ్యక్తికి సంబంధించిన వస్తు సామాగ్రిని పూడ్చేవారు. వీనిలో ఇనుప పనిముట్లు బంగారు ఆభరణాలు లభించడం విశేషం.

రాక్షసిగుళ్ళలో దాదాపు పన్నెండు రకాలున్నాయి. వానిలో చనిపోయిన వారి స్మృతి చిహ్నంగా శిలా స్తంభం నిలపడం ఒకటి. ఇట్టి వాన్నే 'మెన్‌హిర్' అంటారు. కృష్ణాజిల్లా రేవరాల ప్రాంతంలో ఇట్టివి కన్పించినాయి. మధ్య ఇండియాలో గదబులు నేటికి 'ఉరసకల్' అనేవి నిలుపుతారు. 'కల్' అంటే తెలుగులో కూడ శిల అనే అర్థం కదా! బహుశా ఛాయా స్తంభాలు నిలిపే ఆచారం దీనినుండి వచ్చింది. నాగార్జునకొండలో ఇక్ష్వాకుల నాటి ఛాయా స్తంభాలు బయల్పడినాయి.

రాతి పలకలతో పెట్టెవలె నిర్మించి దానిపై మూతగా రాతిపలకను ఉంచడం మరొకరకం. వీనిలో ఒకవైపు పలకకు పెద్ద రంధ్రం ఉంటుంది. పెట్టె భూమిమీదవున్న సమాధిని 'డాల్మెన్' అనీ, పెట్టెను భూస్థాపితం చేసి చుట్టూ వృత్తాకారంలో రాతి గుళ్ళు పేర్చిన సమాధిని 'సిస్ట్' అనీ అంటారు. డాల్మెన్‌లు గోదావరి, కృష్ణా, చిత్తూరు జిల్లాల్లో ఎక్కువ; సిస్ట్‌లు ఆంధ్రదేశమంతటా (విశాఖ మినహా) కన్పిస్తున్నాయి.

మట్టి శవపేటికల్లో (Sarcophagus) అస్థికలుగానీ మృతదేహాలు గానీ ఉంచి పాతిపెట్టే సమాధులు మరొకరకం. ఇట్టివి చిత్తూరు, అనంతపురం జిల్లాల్లో ఎక్కువ. ఈ పెట్టెల్లో పలురకాలు వుంటాయి; వానికి కాళ్ళుకూడా అమర్చేవారు. కర్నూలు జిల్లా శంఖవరంలో గొర్రె ఆకారం పెట్టె, నల్గొండజిల్లా ఏలేశ్వరంలో ఏనుగు ఆకారం పెట్టె దొరికినాయి.

రాక్షసిగుళ్ళ ప్రజలు వ్యవసాయం చేశారా? దక్షిణదేశంలో ప్రథమంగా వరి పండించి ఆహారంగా వాడింది వీరే. ఇనుము, బంగారం వంటి ఖనిజాలు తవ్వి తీశారు. దాక్షిణాత్యులు ఔత్తరాహులతో ప్రమేయం లేకుండానే స్వతంత్రంగా ఇనుప పనిముట్లు ఉక్కు తయారుచేయడం నేర్చుకున్నారని శాస్త్రజ్ఞుల అంచనా. చాల ప్రాచీనకాలంలో ఇనుముతో పనిముట్లు తయారుచేసిన ఛాయలు

తెలంగాణంలో పెక్కుచోట్ల బయల్పడినాయి. ఇనుప పనిముట్లు వాడుకలోనికి రావడంతో వ్యవసాయ పరిశ్రమ చురుకుగా సాగింది. ఆహారోత్పత్తి అధికం గావడంతో జనాభా పెరగడానికి, వాణిజ్య సంబంధాలు ఏర్పడడానికి గ్రామాలు పెద్దవై నగరాలు రూపొందినారు. నగరాలు ఐశ్వర్యానికి నిదర్శనాలు.

రాక్షసిగుళ్ళలోని వైవిధ్యాన్ని బట్టి మౌలికంగా ఒకే విశ్వాసం ఉండి భిన్న ఆచారాలు అనుసరించిన వేరువేరు తెగలు వీనిని నిర్మించి వుంటారు. అయితే ద్రావిడ భాషలు మాట్లాడే ప్రాంతాల్లో ఇవి విస్తారంగా ఉన్నందున వీని నిర్మాతలు మధ్యధరా జాతులవారు అనే అభిప్రాయాన్ని వీనిలో కన్పించిన మానవ అవశేషాలు బలపరుస్తున్నాయి. ఏలేశ్వరం దగ్గిర ఒకే సమాధిలో స్త్రీపురుష కళేబరాలున్నాయి. ఇది సతీసహగమనాన్ని సూచించవచ్చు. లేదా వ్యభిచారనేరానికి ఉభయులకు మరణశిక్ష విధించి వారికి ఒకే సమాధిని ఏర్పాటు చేసి వుండవచ్చు. ఈ ప్రజలకు మరణానంతర జీవితంలో విశ్వాసం ఉన్నదనడం నిర్వివాదాంశం. ఈ విశ్వాసం పునాదిగా పితృదేవతారాధన ప్రారంభమై శ్రాద్ధ కర్మను ఆచరించిన నిదర్శనలున్నాయి. సిస్త్, డాల్మెన్‌ల లోని పలకల్లోని రంధ్రాలనుబట్టి జీవి (ప్రేతం?) భూమిపైకి రాకపోకలు జరుపుతుందనికూడ విశ్వాసం ఉన్నట్లు కన్పిస్తుంది. పితృదేవతారాధన, సమాధి నిర్మాణ సంప్రదాయాలకు బౌద్ధ యుగంలోని చైత్యకవాదానికి సంబంధం ఉండవచ్చని కొందరి అభిప్రాయం. కొన్ని రాక్షసిగుళ్ళలో త్రిశూలాలు దొరకినందున ఆ ప్రజలు శివారాధకులని శివుడు జననమరణాలకు అధిదేవుడని వారి భావమై వుండవచ్చు. భిన్న ఆర్థిక రంగాలలో అభివృద్ధి నైతిక మతాచారాల పెరుగుదల ఫలితంగా వృత్తిపరమైన సాంఘిక వర్గీకరణను, ఆర్థిక సామాజిక శ్రేయస్సుల పరిరక్షణకు రాజకీయాధికార నిర్మాణానికి అనుకూల పరిస్థితు లేర్పడినాయి.

## వైదిక సంస్కృతి విస్తరణ

క్రీ.పూ. 2000 - 1500 మధ్యకాలంలో ఇండో- యూరోపియన్ జాతుల వారు వాయవ్యసరిహద్దులగుండా దేశంలో ప్రవేశించసాగినారు వీరినే 'ఆర్యులు' అనడం పరిపాటి. ఆర్యపదం జాతిపరమైనదీ కాదు; భాషా పరమైనదీ కాదు. ఆ మాటకు పూజ్యుడు అని అర్థం. శ్వేతవర్ణులు, దృఢకాయులు, యుద్ధ ప్రియులునై భయంకరులైన వీరిని స్థానికులు ఆర్యులని వ్యవహరించి వుంటారు. (ప్రతి మొహమ్మదీయుని సాహెబ్ అనడం, ప్రతి తెల్లవానిని దొర అనడం మనలో మామూలే గదా!) స్థానికులను ఆగంతుకులు దాసిదస్యులని వ్యవహరించారు. నేడు ఈ పదాలను బానిస అనే అర్థంలో వాడుతున్నాారని అగంతకులను ప్రతిఘటించి పోరాడిన జాతుల పేర్లయి వుంటాయి. వీరే హరప్పా సంస్కృతి నిర్మాతలని చెప్పవచ్చు. క్రమంగా 'ఆర్యులు' దేశంలో స్థిరపడటంతో సంఘర్షణ తీవ్రత

తగ్గి వారికీ స్థానికులకు మధ్య అవగాహన స్నేహ సంబంధాలు ఏర్పడినాయి. నాటివరకూ "ఆర్యులు" సంచారజీవనులయినందున వారిలో సుస్థిర సామాజిక వ్యవస్థగానీ సంస్థలుగానీ ఏర్పడే అవకాశం లేదు. వ్యవసాయంతో సహా వృత్తి పరమైన సామాజిక విభజన, పురోహిత వ్యవస్థ, పూజా విధానమూ మొదలైనవి 'ఆర్యులు' 'దాసిదస్యుల' నుండి గ్రహించారు. చిరకాలం జరిగిన ఆర్య ఆర్యేతర జాతుల సంస్కృతుల సమ్మేళన ఫలితంగానే వైదిక వాఙ్మయం రూపొందిందని ప్రాచ్య పాశ్చాత్య విద్వాంసుల నిర్ణయం. విశ్వామిత్ర, వశిష్ఠ, అగస్త్య భరద్వాజాదు లెవ్వరూ 'ఆర్య' జాతీయులు కాదు. బహుశా 'వ్రాత్యస్తోమం' ద్వారా 'ఆర్యుల'లో జేరి వైదిక ఆలోచనావిధానాన్ని, మత ఆచారాలను రూపొందించి వుంటారు. ఈ విధమైన జాతి-సంస్కృతీ సమన్వయం ఉత్తరాపథం ఆర్యావర్తంగా పరిగణన పొందే వరకూ జరిగింది. నాటినుండి ఔత్తరాహులు తమ దృష్టిని దక్షిణదేశంపై మరలించారు.

ఋగ్వేద ప్రజలకు దక్షిణాపథం గురించి స్పష్టమైన పరిజ్ఞానం లేదు. దేశ బహిష్కృతులను పంపే భూములుగా మాత్రమే వారు దక్షిణాపథాన్ని గుర్తించి నారు. మధ్యదేశం వారి కార్యక్రమాలకు కేంద్రమైన తరువాతనే దక్షిణదేశా క్రమణపై వారు శ్రద్ధవహించినారు. అయినా చాలకాలం వరకు వింధ్యాద్రులే ఆర్యావర్తానికి సరిహద్దుగా ఉండేవి. 'ఆ సముద్రాత్తువై పూర్వాదా సముద్రాత్తు పశ్చిమా తయోరేవాంత రంగిర్యో ఆర్యావర్తం విదుర్బుధాః' అనీ "తంమ్లేచ్ఛ విషయం ప్రాహుదార్యావర్తాదనన్తరమ్" అనీ సూత్రకారులు నిర్వచించినారు. అయితే బ్రాహ్మణాల కాలంనుండి దక్షిణాపథం ఔత్తరాహుల దృష్టి నెక్కువగా ఆకర్షించింది. ఐతరేయ బ్రాహ్మణం (క్రీ పూ. 800) విదర్భ రాజ్యాన్ని, విదర్భేశుడు భీముని పేర్కొంటున్నది. వారి రాజ్యాలలో మిక్కిలి దాక్షిణాత్య రాజ్యమైన విదర్భ దక్షిణాపథంలో ఔత్తరాహుల విస్తరణకు కేంద్రంగా ఉపక రించింది; అదే బ్రాహ్మణంలోని శునస్సేపదేవరాతుని కథ ఆర్యావర్తం సరిహద్దుల్లో నివసిస్తున్న ఆంధ్ర, శబర, మూతిబ, పుళింద, పుండ్ర తెగలతో పరిచయాన్నే గాక వారు దక్షిణంగా వలస రావడాన్ని సూచిస్తున్నది. క్రీ. పూ. 600 సం॥ ప్రాంతం వాడైన వయ్యాకరణి పాణిని తన 'అష్టాధ్యాయి'లో దక్షిణాపథంలోని కళింగ, అశ్మక రాజ్యాలను పేర్కొన్నాడు.

ఇతిహాస బౌద్ధవాఙ్మయాలలో దక్షిణాపథాన్ని గురించిన పరిజ్ఞానం ఎక్కువగా కన్పిస్తుంది. మహాభారతంలో అగస్త్యుని కథ ఉంది. ఇందులో అగస్త్యుడు వింధ్యాద్రుల గర్వం అణచడమేగాక వాతాపి ఇల్వలులను సయితం అణచినట్లు ఉంది. చిరకాలంగా ఉత్తర దక్షిణాపథాలకు మధ్య తీవ్ర ఆటంకంగా ఉన్న వింధ్యాద్రుల గుండా దక్షిణానికి మార్గం కనుగొని 'ఆర్య' విస్తరణకు దక్షిణా

పథంలో ఉన్న ప్రతిఘటనను నిర్మూలించిన గొప్ప సాహసికుడు, వీరుడు అగస్త్యుడని ఈ కథలోని చారిత్రకాంశం. తమిళ దేశంలోను హిందూ మహా సముద్ర దీవుల్లోను అగస్త్యునకు ఆలయాలు నిర్మించి పూజిస్తున్నారు. "అగ త్త్రియం" అనే పేర తమిళ భాషలోని ప్రథమ వ్యాకరణ గ్రంథానికి అతడే కారణమనే సంప్రదాయం ఉంది. ఇది బహుశా స్థానిక భాషలు అభ్యసించి తద్వారా స్వీయమత సంస్కృతులను వ్యాపింపజేసే ప్రయత్నమేమో! ఆధునిక యుగంలో పాశ్చాత్యులనుసరించింది ఈ పద్ధతే గదా! అగస్త్యుని సాహస కృత్యాలేగాక మహాభారతంలో శూర్పారక, కిష్కింధ, దండక, కరహాట అనే ప్రదేశాలను గురించి ద్రావిడ, పాండ్య, కేరళ, ఆంధ్ర, ఉత్కళ ప్రజలనుగురించి ప్రస్తావన ఉంది.

ఇక రామాయణంలో దక్షిణాపథంతో మరికొంత ఎక్కువ పరిచయం కన్పిస్తుంది. అందులో విదర్భ, దశార్ణ, దండకారణ్య, కళింగ, ఉత్కళ రాజ్యాలను గురించి; రిచిక, మహిషక, ఆంధ్ర, పాండ్య, చోళ, కేరళ ప్రజలను గురించి ప్రస్తావన ఉంది. పంచవటి, ఋష్యమూక పంపాసరోవరాది ప్రాంతాల గుర్తింపు గురించి పేచీలున్నాయి. పంచవటి నాసిక్ సమీపంలో ఉందని మహారాష్ట్రుల వాదంకాగా భద్రాద్రి సమీపంలోని పర్ణశాలే పంచవటి వర్ణనకు సరిపోతుందని ఆంధ్రపండితులు, పంపాసరోవరం ఋష్యమూకం బళ్ళారి సమీపంలో వున్నాయని కన్నడిగులు వాదిస్తున్నారు. రామాయణం పేర్కొంటున్న శబర, గుహ అనే జాతులు తూర్పు భారతంలోనే వున్నట్లు మహాభారతం చెబుతున్నది. అందుచేత రామాయణం తూర్పు భారతంతో ఆస్ట్రిక్ ప్రజల సంస్కృతి నేపథ్యంతో జరిగిందని చాలమంది నిర్ణయం. అయితే దశకంఠుడైన రావణాసురుని రాజ్యంలో రాముని సాహస కృత్యాలు చారిత్రకంగా అంగీకరింపజాలమని ఆర్. సి. మజుందార్ వంటి చారిత్రకుల అభిప్రాయం. సుప్రసిద్ధ పండితులైన పురాతత్వవేత్త హెచ్. డి. సంకాలియా అభిప్రాయంలో కూడ నేటి రూపంలో రామాయణం ఒక అభూతకల్పన. కాని రామాయణానికి మౌలికమైన సంఘటన చోటా నాగపూర్ ప్రాంతంలో జరిగివుంటుందనే ఈ పరిశోధనబట్టి గూడా రామాయణకథ తూర్పు భారతంలోనే జరిగింది. ఏమైనా వైదిక జనుల దక్షిణాపథ విస్తరణను, అది సాధించడంలో రాజులు, పూజారులు పరస్పర సహకారంతో వ్యవహరించిన విధానాన్ని సూచన ప్రాయంగా రామాయణం చెబుతున్నదని అంగీకరించవచ్చు. రామాయణంలో కణ్వ, భరద్వాజాది ఆశ్రమాల ప్రస్తావన వుంది. ఈ మహర్షులంతా అగస్త్యుని అడుగుజాడలలో దక్షిణానికి వచ్చివుంటారు. వీరి ఆశ్రమాలు వైదిక మత సంస్కృతీ ప్రచార కేంద్రాలని చెప్పవచ్చు. వీరికి అనార్యుల బెడద తప్పించడానికే రాముడు దక్షిణానికి వచ్చివుండవచ్చు. తమ సంస్కృతీ వ్యాప్తికి

తోర్పడినందువల్లనే వైదిక ఋషుల దృష్టిలో రాముడు అవతార పురుషుడు అయినాడు.

క్రీ. పూ. 6 శతాబ్దిలో జాతి కుల వివక్షతలను ఖండిస్తూ జైన బౌద్ధాలు విజృంభించినాయి. ఇవి ప్రచారకమతాలు కావడంవల్ల ఉత్తర దక్షిణాపథాల మధ్య రాకపోకలు ఎక్కువ కావడమేగాక వాని ప్రచారంతో సంస్కృతీ సమైక్యానికి అవకాశం కలిగింది. బౌద్ధ గ్రంథమైన 'సుత్తనిపాత'లో బావరి అనే బ్రాహ్మణాచార్యుని వృత్తాంతం వుంది. కోసలరాజు కులగురువైన బావరి దక్షిణదేశానికి వచ్చి అస్సకములక రాజ్యాల సరిహద్దుల్లో గోదావరీనది మీద ఆశ్రమం నిర్మించుకొని విద్యాబోధన చేసేవాడు. కళింగ మొదలైన దూర ప్రాంతాలకు సయితం అతని కీర్తి వ్యాపించేంది. బావరి బుద్ధుని సమకాలికుడు. అనంతరం బౌద్ధమతాన్ని అవలంబించినాడు. "విమానవత్తు" భాష్యం ప్రకారం బుద్ధుని ప్రధాన శిష్యుల్లోని వాడైన మహాకాత్యాయనుడు అస్సక రాజుకు బౌద్ధమతం ఇచ్చినాడు. జాతక కథలలో అస్సక, ములక, కళింగ రాజ్యాల ప్రసక్తి, అస్సక రాజులైన అరుణ, బ్రహ్మదత్తుల ప్రస్తావనలు ఉన్నాయి భీమసేన జాతకం ఆంధ్రా పథాన్ని, సెరివణిజ జాతకం ఆంధ్రనగరిని పేర్కొంటున్నాయి. 'ఆంధ్రనగరి' ధాన్యకటకం అయివుండవచ్చని చెప్పినాముగదా!

ఈ విధంగా భాష్యకారుడైన కాత్యాయనుని కాలానికి (క్రీ. పూ. 400) ఔత్తరాహులకు దక్షిణదేశంలో మంచి పరిచయం ఏర్పడి రాకపోక లెక్కువయినాయి. ఉత్తరాపథం నుండి దక్షిణానికి ప్రజలు, రాకుమారులు వలసవచ్చినారనడానికి చాల ఆధారాలున్నాయి దక్షిణాపథంలోని యదు భోజతెగలు తాము పాత్వత, ఐల తెగల సంతతి వారమని చెప్పుకున్నారు. ఐలవంశస్థులు గంగా యమునా సంగమస్థలంలో ఉండేవారు వారి రాజధాని ప్రతిష్ఠానం; అలహాబాదుకు ఎదురుగానున్న శిధిలాలను ప్రతిష్ఠానంగా గుర్తిస్తున్నారు. అది నమూనాగానే ములకరాజ్యంలో ప్రతిష్ఠానం ఏర్పడిన తర్వాత శాతవాహనుల రాజధాని అయి వుంటుంది. విష్ణుపురాణాన్ని అనుసరించి కోసల రాజ్యానికి చెందిన ఇక్ష్వాకు రాకుమారులు అశ్మక, ములక రాజ్యాలు స్థాపించినారు. జైన కావ్యం ధర్మామృతంలోని ప్రాచీన సంప్రదాయాన్నిబట్టి యశోధర్ముడనే మరొక ఇక్ష్వాకు రాకుమారుడు దక్షిణాదికి వలసవచ్చి ప్రతీపాలపురరాజ్యం స్థాపించుకున్నాడు. ప్రతీపాలపురాన్నే నేటి భట్టిప్రోలుగా గుర్తిస్తున్నారు. తమిళ దేశంలోని పాండ్యులు తాము పాండవుల సంతతి అని చెప్పుకున్నారు. ప్రాచీన గ్రీకు రచనలను బట్టికూడ పాండ్యులు ఉత్తరాపథంనుండి వలస వచ్చినవారే. వారి మదురై శూరసేన రాజ్యంలో మధుర నమూనాగా ఏర్పడింది. కాత్యాయనుడు

పాండ్యులు 'పాండు' తెగకు చెందినవారనగా వరాహమిహిరుడు 'పాండు' జాతి మధ్యదేశంలో ఉన్నట్లు చెప్పినాడు. తమిళ బ్రాహ్మణుల్లో బృహచ్చరణశాఖ ఉంది. బహుశా ఉత్తరాపథం నుండి సుదీర్ఘ ప్రయాణం తరువాత దక్షిణాదిన స్థిరపడిన బ్రాహ్మణుని సంతతి అయినందున వారికా పేరు వచ్చి వుంటుంది.

ఔత్తరాహులు రెండు మార్గాల ననుసరించి దక్షిణానికి వచ్చినట్లు కన్పిస్తుంది. వారి 'వాస్కోడగామా' అయిన అగస్త్యుడు వింధ్యాద్రులమీదుగా ఒక మార్గాన్ని పరిశోధించినాడు. బావరి శిష్యులు ఈ మార్గాన్నే అనుసరించి నారని చెప్పవచ్చు. వీరు అస్సక ములక, విదర్భ, అవంతీలగుండా శ్రావస్తి చేరినారు. ఆ రోజుల్లో బహుజనాదరణ పొందింది ఈ మార్గమే జైన 'ఆవశ్యక సూత్రాన్ని' బట్టి మగధనుండి కళింగద్వారా కృష్ణాముఖద్వారానికి ఒక మార్గం ఉన్నట్లు తెలుస్తుంది. ఈ మార్గాన్నే చారిత్రకయుగంలో మహాపద్మనంద, అశోక, సముద్రగుప్తులు తమ దక్షిణాపథ దండయాత్రల్లో అనుసరించివుంటారు.

పెద్దయెత్తున సైన్యాలతో ఉత్తరాదివారు దండెత్తివచ్చి దక్షిణాపథంలో రాజ్యాలు స్థాపించిన నిదర్శనాలు లేవు. స్థానిక జాతులను వారి సంస్కృతులను నిర్మూలించడం ద్వారా వారు విస్తరించలేదు. వాతాపి ఇల్వలుల కథలవంటివి వారి విస్తరణకు స్థానిక ప్రతిఘటనను సూచిస్తాయి. భిన్నజాతులు సంస్కృతులు తారసిల్లినపుడు అమాత్రం సంఘర్షణ తప్పదు. అట్టి సంఘర్షణలు లేవనుకోవడం పొరబాటు. అయితే ఈ సంఘర్షణ అనతికాలానికే వీగిపోయింది. ఆశ్రమాలు స్థాపించిన ఋషులు సహనంతో పట్టుదలతో ప్రచారం సాగించి స్థానికుల్లో వైదిక సంస్కృతిపట్ల ఆదరం కలిగించినారు. చాల సందర్భాలలో స్థానిక మత విశ్వాసాలతో ఆచారాలతో వైదికమతం సమాధానపడింది. అది కారణంగా జాతి సమ్మేళనం సాంస్కృతిక సమన్వయంద్వారా శాంతియుతంగా విస్తరణ జరిగింది. జాతకకథలవల్ల వైదికక్రతువులపట్ల స్థానిక ప్రజలకు ఆసక్తి జనించినట్లు దక్షిణ దేశంలో వర్ణవ్యవస్థ ఏర్పడినట్లు తెలుస్తున్నది. స్థానిక ప్రభువులు క్షత్రియు లయినారు. పూజారులు బ్రాహ్మణులయినారు. వారికి మహర్షుల గోత్రప్రవరలలో స్థానం ఏర్పడింది.

ఈ సమాధాన సమన్వయఫలితంగా ఏర్పడిన కొత్త సాంఘిక సంబంధాల సంస్థల మనుగడకై ఆచరణసూత్రాలను రూపొందించాల్సిన అవసరం ఏర్పడింది. ఆ అవసరాన్ని ఆంధ్రదేశంలో ఆపస్తంబుడు తీర్చినాడు. క్రీ.పూ. 500 ప్రాంతంలో ఈతడు గోదావరీ ముఖద్వారంలో నివసిస్తూ తన సూత్రాలను ప్రవచించినాడని బూలర్, కాణే మొదలైన పండితులు నిర్ణయించినారు; వేదాధ్యయన అధ్యాపనలకు వైదిక క్రతుకాండకు నియమావళిని నిర్దేశించడమేగాక స్థానిక మతవిశ్వాసాలను ఆచారాలను అథర్వణవేదంలో చేర్చి వానికి ఉన్నత

ప్రతిపత్తిని చేకూర్చినాడు. మతవిషయాలపై పురాణాలను ప్రామాణిక గ్రంథాలుగా అంగీకరించినాడు. ఈ చర్యలన్నింటిలో నాటి సమన్వయ సామరస్య దృష్టి ప్రతిఫలిస్తుంది. కాత్యాయనుడు, కౌటిల్యుడుకూడ దాక్షిణాత్యులేనని సంప్రదాయం ఉంది. అది నిజమే అయితే క్రీస్తుపూర్వం నాలుగో శతాబ్దినాటికే దక్షిణదేశంలో సంస్కృత సంస్కృతీ ప్రమాణ స్వభావాలు గ్రహించవచ్చు.

## మగధ సామ్రాజ్యము - ఆంధ్రదేశము

క్రీస్తు పూర్వం ఆరో శతాబ్దికో భారతదేశంలో మహత్తరమైన మత సాంఘిక రాజకీయ విప్లవాలు సంభవించినాయి. వేద ప్రజలలో విజృంభించిన రక్తసిక్తము ఆడంబరమునైన పూజావిధానాన్ని వర్ణవ్యత్యాసాలను జాత్యహంకారాన్ని నిరసించి వర్ధమాన మహావీరుడు, గౌతమ బుద్ధుడు కొత్త మతాలు స్థాపించినారు. సంస్కృతీ సమన్వయానికి తద్వారా జాతి సమ్మేళనానికి ప్రయత్నం ఈ మతాల్లో కన్పిస్తుంది. అచిరకాలంలోనే జైన బౌద్ధాలు స్థానిక జాతుల్లో విశేష జనాదరణ పొందినాయి. గౌతమబుద్ధుడే స్వయంగా ధాన్యకటకం దగ్గిర 'కాలచక్ర తంత్రం' ప్రవర్తింపజేసినాడనీ 'ధారణుల' నాతడు నిక్షేపం చేసినాడు కాబట్టి ధా(ధ)రణికోట అయిందనే గాథలు, మహావీరుడు మగధనుండి తోసలి, అటునుండి మోసలి (మైసోలియా) వెళ్ళి జైనధర్మం బోధించినాడనీ ఉన్న గాథలు విశ్వాసయోగ్యాలు కావు. అయినా బౌద్ధధర్మ ప్రచారంలో మొదటినుండి ఆంధ్రదేశం అగ్రగామిగా వుంటూ వుంది. బౌద్ధ గ్ర[illegible]స్తోని బావరి, మహాకాత్యాయన వృత్తాంతాలను బట్టి బుద్ధుని కాలంలోనే [illegible] ఆంధ్రంలో ప్రవేశించింది. భట్టిప్రోలు శాసనలిపి అశోకుని కాలంనాటి దక్షిణాది బ్రాహ్మి అని బలమైన అభిప్రాయం ధాన్యకటకంలో అశోకుని స్తంభ శాసన శకలం దొరికింది. నాటికే ప్రసిద్ధములైన బౌద్ధక్షేత్రాలలో అశోకుడు స్తంభాలు ప్రతిష్ఠించినాడు అందుచేత భట్టిప్రోలు ధాన్యకటకాలలో లభించిన సాక్ష్యంవల్ల అశోకుని కాలానికే ఆంధ్రదేశంలో బౌద్ధం వ్యాప్తి చెందినదని చెప్పవచ్చు. ఇక కళింగదేశ ప్రజలు జైనమతాభిమానులయినారు. క్రీ.పూ. 450 ప్రాంతంలో మహాపద్మనందుడు కళింగ నుండి విజయచిహ్నాలుగా జైనప్రతిమలను తీసుకువెళ్ళినాడని ఖారవేలుని హాతిగుంఫ శాసనం (క్రీ.పూ. 185) చెబుతున్నది. జైన బౌద్ధమతాల వ్యాప్తితో ఉత్తర దక్షిణ దేశాల మధ్య సంబంధాల్లో నూతనాధ్యాయం ప్రారంభమయింది.

నూతన మత వ్యాప్తితోబాటు నూతన రాజకీయ పరిణామాలు జరిగినాయి. కొత్త మతాల ఆశయం జాతి సమ్మేళనం అయితే ఈ రాజకీయ పరిణామాల లక్ష్యం దేశాన్ని ఒకే ప్రభుత్వం కింద సమైక్యం చేయడమైనట్లు కన్పిస్తుంది.

నాటివరకు పరస్పరం అంతఃకలహాల్లో మునిగియుండిన పదహారు మహాజన పదాలు జలహీనం కావడంతో వాటిని మగధ ఆక్రమించింది. హర్యంకులు మగధ స్వామ్రాజ్యానికి పునాదులు వేసినారు. శిశునాగులు హర్యంకుల రాజ్యవిస్తరణ విధానాన్నే అనుసరించినారు. శిశునాగులను తుదముట్టించి శూద్రవంశజులైన నందులు మగధసింహాసనం ఆక్రమించినారు.

**నందవంశం :**

నందవంశ స్థాపకుడైన మహాపద్మనందుడు గొప్ప విజేత. అజ్ఞాత కులజుడని, సరక్షత్రాంతకుడని, ఏకరాట్ అని పురాణా లతనిని వర్ణిస్తున్నాయి. ఉగ్రసేనుడని గ్రీకు రచయితలు శ్లాఘించేవారు. మన చరిత్రలో నంద విప్లవానికి చాల ప్రాముఖ్యం ఉంది. నాటివరకు రాజకీయాధికారంలో అగ్రవర్ణాల గుత్తాధిపత్యాన్ని శూద్రుడైన మహాపద్మనందుడు ఛేదించినాడు. ఒకవైపున క్షత్రియులను నిర్మూలించడమేగాక బ్రాహ్మణులను సయితం బాధించినాడని కౌటిల్యుని కథ సూచిస్తున్నది. శిశునాగుల తరువాత దేశాన్ని పాలించిన వారందరు క్షత్రియేతర రాజవంశాలేనని పురాణాల నుండి తెలుస్తున్నది. మహాసైన్యాన్ని కూర్చుకుని మహాపద్మనందుడు దేశాక్రమణకు పూనుకున్నాడు. కళింగను ఆక్రమించినట్లు హాతిగుంఫ శాసనం, అశ్మక నాక్రమించినట్లు పురాణాలు చెబుతున్నాయి గోదావరీ నదిపైనున్న నాందేడ్ (నవనందధేర) అనే నగరం నంద స్వామ్రాజ్యానికి దక్షిణ సరిహద్దును సూచిస్తుంది. ప్రాచీన తమిళ సారస్వతంలో విస్తారంగా కన్పించే నందరాజుల ప్రస్తావన కూడ నందుల దక్షిణదేశ ఆక్రమణకు సాక్ష్యంగా ఉదాహరిస్తారు. ఈ విధంగా సింధు గోదావరీ నదుల మధ్య విస్తరించిన మహాస్వామ్రాజ్యాన్ని మహాపద్మనందుడు స్థాపించినాడు ఇది అంతకు పూర్వం క్షత్రియు లెవ్వరూ సాధింపలేకపోయిన ఘనవిజయం. బహుశా జైన, బౌద్ధాల ప్రచార ఫలితంగా కలిగిన చైతన్యంతో కింది వర్ణా లాతని పతాకం కింద చేరి అతనికి చేకూర్చిన బలప్రోత్సాహాలే మహాపద్మనందుని విజయాలకు కారణాలు.

మహాపద్మని వారసులు దురాశాపరులై ప్రజలను పీడించడంతో జనాదరణ కోల్పోయినారు. వారి స్వామ్రాజ్యం అనతికాలంలోనే విచ్ఛిన్నమయింది. మౌర్యులు మగధ నాక్రమించినారు. తిరిగి మౌర్యులు దక్షిణాపథ దండయాత్రలు చేసివున్నందున నందరాజుల చివరికాలంలో ఆంధ్ర కళింగాది రాజ్యాలు స్వతంత్రము లయినట్లు భావించవచ్చును

**మౌర్యులు :**

క్రీ.పూ. 322 లో చాణక్య చంద్రగుప్తులు - అంటే బ్రాహ్మణ క్షత్రియులు శూద్రాధిపత్యం కూలదోసే ఆశయంతో ఏకమయినారు. పురాణాలు మౌర్యులను

సయితం శూద్రులనే చెబుతున్నాయిగాని జైనగ్రంథాల్లోవారు క్షత్రియులుగానే ప్రసిద్ధులు. జైన బౌద్ధ మతాభిమానులైనందున బహుశా పురాణాలు మౌర్యుల నా విధంగా వర్ణించివుంటాయి. మౌర్యులు శూద్రులే అయితే చాణక్యుడు వారి పక్షం వహించేవాడే కాదు. అగ్రవర్ణాల సమైక్యంతో నందవంశం పతనమయింది. మగధ సింహాసనం అధిష్ఠించిన మౌర్యులు భారతదేశాన్ని ఏకచ్ఛత్రాధిపత్యం కిందికి తీసుకురాగలిగినారు. కాని వారు కూడానూతన మతాభిమానులే!

ఆంధ్రప్రాంతాన్ని జయించిన మౌర్య చక్రవర్తి ఎవరు? అనేది ఒక సమస్య. దక్షిణదేశంలో సిద్ధపురము, జైతుంగ రామేశ్వరము, మస్కి (కర్ణాటకము) యర్రగుడి రాజుల మందగిరి (కర్నూలు) మొదలైన ప్రాంతాల్లో బయల్పడిన అశోకుని శాసనాలు అతని ఆధిపత్యం ఆయా ప్రాంతాల్లో చెల్లుతున్న దనటానికి రుజువు. అతని 13 వ శిలాశాసనం ఆంధ్రులు మౌర్యసామ్రాజ్యంలో (రాజవిషయే) నివసిస్తున్నట్లు చెబుతున్నది. అయితే అశోకుడు చేసింది కళింగ యుద్ధం ఒక్కటే. ఆ యుద్ధబీభత్సాన్ని చూసిన అనంతరం అతడు యుద్ధ విధానాన్ని త్యజించి ధర్మప్రచారానికి బద్ధకంకణుడయినాడు. కాబట్టి ఆంధ్ర దేశాన్ని అశోకుడు జయించలేదు. అతని తండ్రి బిందుసారుడో తాత చంద్ర గుప్తుడో జయించి యుండవలె!

టిబెట్ చరిత్రకారుడు తారానాథుని రచన ఆధారంగా కొందరు చరిత్ర కారులు అశోకుని తండ్రి బిందుసారుడే దక్షిణదేశాన్ని జయించినాడనుచున్నారు. చాణక్యుని సాయంతో బిందుసారుడు తూర్పు పశ్చిమ సముద్రాల మధ్య తన సామ్రాజ్యాన్ని విస్తరింపచేసినాడని తారానాథుడు వ్రాసినాడు. ఈ రచనకు బలంగా బిందుసారుని "అమిత్రఘాత" అనే బిరుదాన్ని ఉదాహరిస్తారు. తారా నాథుని రచనలో సత్యం కన్పించదు. రుద్రదాముని జూనాగడ్ శాసనం (క్రీ. శ. 150) ప్రకారం సౌరాష్ట్రాన్ని అంటే పశ్చిమ సముద్రప్రాంతాన్ని చంద్రగుప్తుడే జయించినాడు ఆ శాసనంలో చంద్రగుప్తుని రాజప్రతినిధి సురాష్ట్ర ప్రాంతంలో సుదర్శనతటాకం తవ్వించినట్లు ఉంది. ఇక కళింగను జయించినవాడు అశోకుడు కదా! అందుచేత తారానాథుని రచన యదార్థం కాదు. గ్రీకు రచనలనుబట్టి బిందుసారునకు మత్తుపదార్థాలపట్ల, పండిత గోష్ఠులయందు ఉన్న ఆసక్తి యుద్ధాల్లో ఉన్నట్లు కన్పించదు. బిందుసారుని కాలంలో తక్షశిల మొదలైనచోట్ల తిరుగుబాట్లు జరిగినాయి. వాని నణచటానికి అశోకుడు మొదలైన తన కొడుకు లను పంపినాడుగాని అతడు వెళ్ళలేదు. బహుశా ఈ తిరుగుబాటుల నణచడం వల్లనే బిందుసారునకు 'అమిత్రఘాత' బిరుదం వచ్చివుంటుంది. ఆ బిరుదానికి శత్రు విధ్వంసుడనే అర్థమేగాని రాజ్యవిజేత అనే అర్థంలేదు. క్రీ. శ. 19 వ శతాబ్దివాడైన తారానాథుని రచన మినహాయించి భారతదేశ వాఙ్మయంలో

బిందుసారుని దక్షిణ దిగ్విజయ ప్రస్తావన ఎక్కడా కన్పించదు. అందుచేత చంద్రగుప్తమౌర్యుడే దక్షిణదేశాన్ని జయించినాడని నిర్ణయించడం యుక్తం. ఈ క్రింది అంశాలీ నిర్ణయాన్ని బలపరుస్తున్నాయి: (1) ప్రాచీన జైన గాథలాధారముగా హరిసేనుడు రచించిన 'బృహత్కథాకోశం' లో చంద్రగుప్త మౌర్యుడు అతని జైనాచార్యుడైన భద్రబాహునితో మైసూరులోని శ్రావణబెళగొళకు వెళ్ళినాడని ఉంది. 'రాజావళికథ' సైతం పై కథను పేర్కొనడమేగాక శ్రావణబెళగొళలో చంద్రగుప్తుడు జైన సంప్రదాయాన్ని అనుసరించి సల్లేఖన వ్రతదీక్షతో ప్రాణాలు వదిలినాడని వ్రాసింది కాబట్టి శ్రావణబెళగొళ ప్రాంతం చంద్రగుప్తుని సామ్రాజ్యాంతర్భాగం అయివుండవలె. (2) దక్షిణ దేశంలో చంద్రగుప్త పట్టణ, చంద్రగిరి, చంద్రగుప్తబస్తి మొదలైన ప్రదేశాలు చంద్రగుప్తునకు దక్షిణదేశంతో సంబంధం సూచిస్తున్నాయి. శ్రావణబెళగొళ దేవాలయ తోరణాలపై చంద్రగుప్తుని జీవితంలోని పై కథాఘట్టాలను శిల్పీకరించినారు. (3) గ్రీకు చరిత్రకారుడైన ప్లూటార్క్ రచనలవల్ల చంద్రగుప్తుడు ఆరు లక్షల సైన్యం కూర్చుకొని భారతదేశం అంతటిని జయించినట్లు తెలుస్తున్నది (4) సంగం యుగానికి చెందిన ప్రాచీన తమిళకవి మామూల్‌వార్ వ్రాసినదాన్ని బట్టి 'వోంబమోరియగర్' తిరునల్వేలి జిల్లాలోని పొదియిల్ కొండవరకు దండయాత్ర నడిపినట్లును ఆ సందర్భంలో వడుగార్ (ఆంధ్ర) సైనికులు చంద్రగుప్తుని సైన్యానికి అగ్రగాములై మోహూరును ముట్టడించినట్లు, ఆంధ్రధానుష్కులు అద్భుత ప్రతాపం చూపినట్లును తెలుస్తున్నది. 'వోంబమోరియర్' అనే మాటకు 'అనామకుడై హఠాత్తుగా పైకి వచ్చినవాడని' అర్థం. మౌర్యుల్లో ఈ వర్ణన వంశస్థాపకుడైన చంద్రగుప్తునకు వర్తిస్తుంది.

నందవంశ నిర్మూలనంలో, మౌర్యవంశాన్ని సుస్థిరం చేయడంలో-అంతకంటే ముఖ్యంగా వాయవ్యప్రాంతం నుండి గ్రీకుల దండయాత్రల భయంతో వున్న చంద్రగుప్తమౌర్యుని దృష్టి ఉత్తరదేశ రాజకీయాలలో కేంద్రీకృతమైయున్నందున దక్షిణదేశాన్ని అతడు జయించలేదని కొందరు చరిత్రకారుల వాదము. కాని నాటి రాజకీయ పరిణామాలు చంద్రగుప్తుని దక్షిణ దిగ్విజయ యాత్రకు చాల అనుకూలంగా ఉన్నాయి. అలెగ్జాండర్ క్రీ పూ 325 లో భారతదేశాన్ని వీడిన వెంటనే భారతీయులు విజృంభించి గ్రీకు సైన్యాలను మట్టుబెట్టినట్లు గ్రీకు చరిత్రకారులు వ్రాసినారు. చంద్రగుప్తుడే ఈ స్వాతంత్ర్యోద్యమానికి నాయకుడు. క్రీ పూ. 324 లో అలెగ్జాండర్ మరణం భారతీయులకు మరింత ప్రోత్సాహం ఇచ్చింది. అలెగ్జాండర్ మరణానంతరం అతని సేనాపతులు చేసుకొన్న ద్వితీయ విభాజక సంధిలో భారతదేశ ప్రసక్తి కన్పించదు. క్రీ. పూ. 317 లో గ్రీకు సేనాని యూడిమస్ భారతదేశాన్ని విడిచి వెళ్ళినాడు. దీనితో

భారతదేశంలో గ్రీకు అధికారం అస్తమించింది. అందుచే క్రీ.పూ. 317 తర్వాత వాయవ్య ప్రాంతం నుండి మౌర్య సామ్రాజ్యానికి భయాందోళనలు తొలగి చంద్రగుప్తుని రాజ్యాక్రమణ కార్యక్రమానికి ఆటంకం లేకపోయింది. అంతేగాక దక్షిణదేశ ప్రాంతాలు నందసామ్రాజ్యాంతర్భాగాలై అనంతరం స్వతంత్రములు అయినాయి. అందుచే వాటిని జయించి ఆక్రమించనిచో మగధ సామ్రాజ్య ఆక్రమణ పూర్తి కానేరదు. కాబట్టి సమర్థుడు రాజనీతి దురంధరుడునైన చాణక్యు నకు పరిపాలనాభారం వదలి చంద్రగుప్తుడు దక్షిణదేశ దండయాత్ర సాగించి నాడు. నాటి రాజకీయ పరిస్థితుల్లో "అసంతుష్టాద్విజానష్టా సంతుష్టా ఇవ పార్థివా" అనే నీతి ననుసరించి నిరంతర సామ్రాజ్య విస్తరణ విధానమే ఒక రాజవంశ గౌరవ ప్రతిష్ఠల నిలకడకు, అభివృద్ధికి సాధనము. కాని క్రీ.పూ. 305 లో తిరిగి గ్రీకు సేనాని సెల్యూకస్ భారతదేశంపై దండెత్తి వచ్చినాడు. చంద్రగుప్తుడు అతణ్ణి ఓడించి అరోకోషియా, గెడ్రోషియా మొదలైన ప్రాంతాలు పుచ్చుకున్నాడు. కాబట్టి క్రీ.పూ. 317-305 సం॥ల మధ్యకాలం చంద్రగుప్తుని దక్షిణ యాత్రకు అనుకూలంగా వుంది. బహుశా క్రీ.పూ. 310-305 మధ్యకాలంలోనే చంద్రగుప్తుడు దక్షిణదేశాన్ని జయించి వుంటాడు.

**మౌర్యులకాలంలో ఆంధ్రదేశం :**

ఆంధ్రదేశం చంద్రగుప్తుని కాలంలో (క్రీ.పూ. 310) మౌర్య సామ్రాజ్యంలో చేరింది. అశోకుని 13 వ శిలాశాసనం ఆంధ్రులు మౌర్యసామ్రాజ్యంలోని ప్రజలుగా పేర్కొంటున్నది. అశోకుని సామ్రాజ్యం దక్షిణభాగంలో మూడు రాష్ట్రాలున్నట్లు తెలుస్తున్నది. పశ్చిమ రాష్ట్రానికి సొపారా (శూర్పారక) కళింగ రాష్ట్రానికి తోసలి (ధౌళి) దక్షిణ రాష్ట్రానికి సువర్ణగిరి రాజధానులు. బ్రహ్మగిరి గౌణశాసనం పేర్కొన్న సువర్ణగిరిని చరిత్రకారులు భిన్నంగా గుర్తిస్తున్నారు కొందరు మస్కి (రాయచూర్ జిల్లా) సమీపంలోని కనకగిరి అన్నారు. కాని అనంతపురం జిల్లా జొన్నగిరియే సువర్ణగిరి కావడానికి ఎక్కువ అవకాశం వుంది. యర్రగుడి శాసనాలకు జొన్నగిరి ఎంతో దూరంలో లేదు. ఈ రాజధానీ నగరాల్లో ఆర్యపుత్రులు మహామాత్రులు పరిపాలన నిర్వహించేవారు. మౌర్యులు, ముఖ్యంగా అశోకుడు కేంద్రీకృత రాచరికం నిర్మించడానికి ప్రయత్నించినట్లు కన్పిస్తుంది. కాని ఆ ప్రయత్నం విజయవంతం కాలేదు. సామ్రాజ్యం పలుప్రాంతాల్లో స్వతంత్ర ప్రతిపత్తి ననుభవిస్తున్న జాతులున్నట్లు తెలుస్తుంది. రాక్షసి గుళ్ళ ప్రజలు 'నాగరకులై' గణరాజ్య నిర్మాణానికి తగిన హంగులన్నీ ఏర్పరచుకొన్నట్లు పరిశీలించాము. ఆంధ్ర ప్రాంతంలో మౌర్య ప్రతినిధులున్న సూచనలు లేవు. అదిగాక చంద్రగుప్తుని ఆస్థానంలోని గ్రీకు రాయబారి మెగస్తనీస్ ఆంధ్రులకు 30 దుర్గాలున్నవని, లక్ష కాల్బలం, మూడువేల గుర్రాలు,

రెండువేల ఏనుగులతో పెద్ద సైనికబలం ఉన్నదనీ వర్ణించినాడు. ఏరియన్ అనే మరొక గ్రీకు చరిత్రకారుడు ఆంధ్రులకు ముప్పది రాజ్యాలున్నవనినాడు. మెగస్తనీస్ 30 దుర్గాలు ఏరియన్ ముప్పది రాజ్యాలకు కేంద్రాలై వుంటాయి. ఆంధ్రదేశం అంతటా ప్రాచీన నగరాల శిథిలాలు బయల్పడుతున్నాయి. ప్రతిష్ఠానం, పౌదన్యపురం, కోటిలింగాల, ధూళికట్ట, పెదబంకూరు, కొండాపురం, వణిగిరి, గాజులబండ, వీరాపురం, సాతాని కోట, భట్టిప్రోలు, ధాన్యకటకం, తాంబ్రాప (చేబ్రోలు), నరసాల, విజయపురి మొదలయినవి ఆ 30 నగరాల లోనివని చెప్పవచ్చు. ఇవి అన్నీ చిన్న చిన్న గణరాజ్యాలయి వుంటాయి. కరీంనగర్ ప్రాంతంలో సేబక, నల్గొండ ప్రాంతాలలో మహిషక రాజ్యాలు ఏర్పడి నట్లు తెలుస్తుంది. వారి నాణేలు లభించినాయి. భట్టిప్రోలు స్థూపశాసనాలను బట్టి సవేరుని కొడుకు కుబిరకుడనే రాజు క్రీస్తుపూర్వం మూడో శతాబ్ది చివర్లో 'నిగమ సభ' 'గోష్ఠి'ల సహాయంతో అచట పరిపాలన సాగిస్తున్నట్లు తెలుస్తుంది. నిగమసభ అంటే నగరశ్రేష్ఠుల సభ. ఇతర నగరాల్లో సైతం ఇట్టి పాలన విధానమే అమలులో వుండివుంటుంది. వడ్డమానులో రాజా సోమకుని ప్రసక్తి నిగమ ప్రసక్తి కన్పిస్తుంది. ప్రాచీన అమరావతీ శాసనాలు రాకుమారులను పేర్కొంటున్నాయి. రాజనీతిపరులైన చంద్రగుప్త అశోకమౌర్యులు ఈ స్థానిక గణరాజ్యాల స్వాతంత్ర్యాన్ని అంగీకరించి బహుశా కప్పం వసూలు చేయడంతో తృప్తి వహించినారు. ఈ రాజ్యాలన్నింటిలో ప్రతిష్ఠానం రాజధానిగా ములక, అశ్మక రాజ్యాలను శాతవాహనులు పాలించేవారు. ఈ వంశానికి మూలపురుషుడని భావిస్తున్న శాతవాహనుడు అశోకుని సమకాలికుడై తన రాజ్య బల గౌరవ ప్రతిష్ఠలను పెంపొందించి ఆంధ్రసామ్రాజ్యానికి పునాదులు కల్పించినాడు.

మౌర్య యుగానికి ఆంధ్ర ప్రాంతంలో ఇనుము బాగా వాడుకలోనికి వచ్చింది. బంగారం మొదలైన లోహాల వాడకం కూడా ఎక్కువయింది. కొండాపూర్‌లో బయల్పడిన నేలమాళిగలలో ఇనుప ఖార్ఖానాల సూచనలు వున్నాయి ఇనుప పనిముట్ల వాడకంతో వ్యవసాయం శక్తివంతంగా సాగింది. వరి, పత్తి మొదలైన పంట లెక్కువగా పండించినారు. ఆంధ్రదేశం వస్త్రపరిశ్రమకు ప్రసిద్ధి చెందినట్లు భీమసేన జాతకం నుండి తెలుస్తున్నది. వ్యవసాయం, ఇనుప, వస్త్రపరిశ్రమ లెక్కువగా సాగడంతో దేశం సుభిక్షమై ఉత్తరదేశం తోనూ బహుశా సింహళంతోనూ వాణిజ్యం సాగించింది. సింహళంలో ప్రచారంలో ఉన్న బుద్ధుని దంతగాథలవల్ల ఉత్తరదేశం నుండి సింహళానికి వెళ్ళే నౌకా మార్గంలో ఆంధ్రదేశం మజిలీ స్థలంగా ఉన్నట్లు తెలుస్తుంది. మెగస్తనీస్ పేర్కొన్న ముప్పై నగరాలు వృద్ధిచెందడానికి పరిశ్రమలు, వాణిజ్యం పెరిగి దేశం ఐశ్వర్యవంతం కావడమే కారణం పశ్చిమతీర రేవుపట్టణాలు నాటికే రోమ్

మొదలైన దూరదేశాలతో వాణిజ్యం సాగిస్తున్న నిదర్శన లున్నాయి. ఆ రేవు పట్టణాల నుండి దేశాంతర్యాగానికి వెళ్ళే మార్గంలో ఉన్నందున ములకరాజ్యం చాలా ఐశ్వర్యవంతమై శాతవాహనుల బలగౌరవాలకు కారణమయింది.

మూడో బౌద్ధ సంగీతికి (క్రీ.పూ. 251) పూర్వమే ఆంధ్రదేశంలో బౌద్ధం జనాదరణ పొందినట్లు ధాన్యకటకం దగ్గర ఇటీవలి త్రవ్వకాల్లో లభించిన పురా వస్తు సాక్ష్యం సూచిస్తుంది. అశోకుని 13 వ శిలాశాసనం ఆంధ్రులు నాటికే 'ధర్మాన్ని' అనుసరిస్తున్నట్లు చెబుతున్నది. ధాన్యకటకంలో ఇటీవల బయల్పడిన శాసనాన్నిబట్టి అచట బౌద్ధభిక్షకులు 'వందనామగోష్ఠి'గా ఏర్పడినారని తెలుస్తు న్నది. అదే శిలపైని శిల్పాన్ని విమర్శిస్తూ ఘోష్, సర్కారుల వంటి ప్రము ఖులు అది సాంచీ, బార్హుత్ శిల్పాలకంటే ప్రాచీనమైనదని చెప్పినారు. మూడో బౌద్ధ సంగీతిలో 'ఆంధకులు' ప్రముఖ పాత్ర నిర్వహించినారని 'కథావత్తు' నుండి తెలుస్తున్నది. భట్టిప్రోలు శాసనాలనుబట్టి అచటి బౌద్ధులు 'సింహగోష్ఠి'గా నేర్పడినారు. ఎర్రగుడి గౌణశాసనంలో విద్యార్థులలో కూడ ధర్మాసక్తి కలిగించ వలెనని అశోకుడు ఉపాధ్యాయుల నుద్బోధించినాడు. మహిష మండలానికి అశో కుడు మహాదేవభిక్షును పంపినాడు. మహిష మండలం నేటి ఆంధ్రదేశంలోని భాగమే. అనూరాధా పురంలోని 'సువణ్ణమలికిస్తూప' ఆవిష్కరణకు మహాదేవుడు 'పల్లవబొగ్గ' నుండి అసంఖ్యాక బౌద్ధభిక్షువులతో హాజరయినట్లు సింహళగ్రంథం 'మహావంశ' వర్ణిస్తున్నది. పల్లవబొగ్గ వర్ణన పలనాటికి సరిపోతున్నది. దీన్నిబట్టి ఆంధ్ర ప్రజానీకం బౌద్ధాన్ని ఎంతగా అభిమానించారో స్పష్టమవుతున్నది. బౌద్ధమత వ్యాప్తివల్ల క్రమంగా తెగలతత్త్వం నశించి ఆంధ్ర తెగలన్నీ శాతవాహన నాయకత్వంలో సమైక్యమై సామ్రాజ్య నిర్మాణానికి సుగమ మార్గం కలిగింది.

## కొన్ని ఉపయుక్త గ్రంథాలు


1. Alchin and Bright : Birth of Indian Civilization.
2. Gupta, P. L. : Punch Marked Coins in the Govt. Museum.
3. Gururaja Rao B. K. : The Megalithic Culture in South India.
4. Romila Thaper : Asoka and the Decline of Mauryan Empire.
5. Sankalia H D. : Indian Archaeology Today.
6. Sastri K.A.N. : The Age of Nandas and Mauryas.

# శాతవాహన యుగము

శాతవాహన రాజవంశ స్థాపనతో ఆంధ్రుల చరిత్రలోనేగాక దక్షిణ భారత చరిత్రలోనే నూతన అధ్యాయం ప్రారంభమయింది. దక్షిణదేశ రాజకీయ చరిత్ర శాతవాహనుల తోడనే ప్రారంభమైనదనడం అతిశయోక్తికాదు. ఉత్తరాపథం శక యవన పహ్లవాది విదేశీయుల దాడులతో సంక్షుభిత మవుతున్న సమయంలో దక్షిణాపథాన్ని సమైక్యంచేసి శాంతి భద్రతలు ప్రసాదించిన కీర్తి శాతవాహనులకు దక్కింది. ఆర్యావర్తంనుండి ద్రావిడ భూములలోనికి విస్తరించి ఉభయ ప్రాంతాలమధ్య వారధియైన సువిశాల సామ్రాజ్యాన్ని స్థాపించి తద్వారా భారతదేశంలో సాంస్కృతికంగా ఏకత్వాన్ని సాధించడంలో చరిత్రాత్మకమైన పాత్రను,శాతవాహనులు నిర్వహించినారన్న సర్దార్ పణిక్కర్ అభిప్రాయంలో ఎంతో సత్యం ఉంది. సుదీర్ఘమైన వారి పాలనకాలంలో ప్రాకృత సంస్కృత వాఙ్మయంలో వినూతన సాహిత్య సంప్రదాయాలు నెలకొన్నాయి. స్థాపత్యంలో శిల్పంలో మహత్తర విజయాలను ప్రజలు సాధించినారు; ఖండ ఖండాంతరాలలో ప్రశంసాపాత్రమైన శిల్పాల్ని సృష్టించినారు. సర్వతో ముఖాభివృద్ధిని సాధించిన దక్షిణ భారతం దూరదేశాల్లో భారతీయ సంస్కృతీ పతాకాన్ని ప్రతిష్టించడం ప్రారంభించింది.

## శాతవాహనులు - ఆంధ్రులు

పురాణాలు ముప్పదిమంది ఆంధ్రులు సుమారు నాలుగున్నర శతాబ్దాల కాలం రాజ్యం చేసినట్లు చెబుతున్నాయి. కొన్ని పురాణాలు ఈ రాజులనే ఆంధ్ర భృత్యులని వ్యవహరిస్తున్నాయి. ఈ రాజులపేర్లు ప్రాచీన శాసనాల నుండి, నాణేలనుండి ఉద్ధరించిన శాతవాహన రాజుల పేర్లతో చాలవరకు సరిపోతున్నాయి. అందుచేత భండార్కర్, విన్‌సెంట్ స్మిత్, బర్జెస్; రాప్సన్ వంటి పండితులు శాతవాహనులు ఆంధ్రులేనని మగధలో శుంగవంశం విజృంభించిన సమయంలోనే వారు కృష్ణా గోదావరి మండలంలో విజృంభించి (రాప్సన్) పశ్చిమోత్తర సీమలకు విస్తరించినారనీ, శ్రీకాకుళ, ధాన్యకటక నగరాలు వారి మొదటి రాజధానులనీ (బర్జెస్, బార్నెట్) తీర్మానించినారు. ఇటీవలి పండితులు కొందరు ఆంధ్ర శాతవాహన సామ్యమును తిరస్కరించినారు. వారిలో ప్రథముడు ఆచార్య వి. యస్. సుక్తంకర్. అతని వాదన సారాంశం : (1) పురాణాలు ఆంధ్ర,

ఆంధ్రభృత్య పదాలనేగాని శాతవాహన పదాన్ని వాడలేదు; శాసనాలలో శాతవాహన పదమేగాని ఆంధ్రపదం కన్పించదు. తాము ఆంధ్రులే ఐనచో శాతవాహనులా విషయాన్ని తమ శాసనాలలో స్పష్టంగా చెప్పుకొనేవారే. సమకాలిక శాసనాలలో-ముఖ్యంగా ఖారవేలుని హాతిగుంఫ శాసనంలోను, రుద్రదాముని జూనాగడ్ శాసనంలోను శాతకర్ణి పదమేగాని ఆంధ్రపదాన్ని వాడలేదు. (2) శాతవాహన వంశంలోని మొదటి రాజుల శాసనాలు, నాణేలు మహారాష్ట్రలోనేగాని ఆంధ్ర దేశంలో లభించలేదు. అందుచేత శాతవాహనులు మహారాష్ట్రలో విజృంభించి, తరువాతి కాలంలోనే ఆంధ్రదేశాన్ని జయించినారనేది స్పష్టమవుతున్నది. ఈ కారణాలవల్ల శాతవాహనులు ఆంధ్రులు కారు, కొన్ని పురాణాలు వర్ణిస్తున్నట్లు ఆంధ్రభృత్యులు మాత్రమే; అనగా ఆంధ్రులకు సామంతులుగా నుండి స్వతంత్రాధికారాన్ని సాధించినవారు. ఈ వాదాన్ని ఆచార్య రాయచౌధురి, శ్రీనివాస శాస్త్రి మున్నగువారు బలపరచినారు. శాతవాహనులు ఆంధ్రదేశాన్ని పాలిస్తున్న కాలంలో సంకలనమైనందున పురాణాలు వారిని ఆంధ్రులని వర్ణించియుండవచ్చునని రాయ్‌చౌదురి సూచన. ఆంధ్రుల భాష తెలుగు; కాని శాతవాహనులు వాడినది ప్రాకృత భాష, అందుచేత శాతవాహనులు ఆంధ్రేతరులేనని శ్రీనివాస శాస్త్రి వాదము.

సుక్తంకర్ వాదము పూర్తిగా భ్రమ ప్రమాదజనితంగా కన్పిస్తుంది. డాక్టర్ గోపాలాచారి మాటల్లో అది కేవలం 'గాలివాదం' (shot in air). శాతవాహన పదం రాజవంశ నామము. కన్హేరీ శాసనంలోను, పులోమావి కాలంలో గౌతమీబాలశ్రీ వేయించిన నాసిక్ శాసనంలోను 'శాతవాహనకుల' అనేమాట కన్పిస్తున్నది. గౌతమీపుత్ర శాతకర్ణి 'శాతవాహనకుల యశఃప్రతిష్ఠాకరు'డట! ఇక ఆంధ్ర శబ్దం జాతిని సూచిస్తున్నది. శాతవాహనుల జన్మభూమి ఆంధ్రదేశమైనందున పురాణాలు వారిని ఆంధ్రులని పేర్కొన్నాయి. ఆంధ్రదేశాన్ని పాలించిన ఇక్ష్వాకు శాలంకాయన విష్ణుకుండిన రాజవంశముల వారెవ్వరును తాము ఆంధ్రులమని చెప్పుకోలేదు. ఆంధ్రభృత్య పదాన్ని ఆంధ్రులయొక్క భృత్యులు అంటూ తత్పురుష సమాసంగాకంటే భృత్యులుగా నుండిన ఆంధ్రులు అని కర్మధారయ సమాసంగానే అంగీకరించడం యుక్తం అని భండార్కర్ అభిప్రాయము. భాగవత పురాణంలోని-

"హత్వాకాణ్వం సుశర్మాణం తద్భృత్యో వృషలోబలీ
గాం భోక్ష్యత్యన్ధ్ర జాతీయః కంచిత్కాల మసత్తమః

అనే శ్లోకాన్ని బట్టి శాతవాహన వంశస్థాపకుడు ఆంధ్రజాతీయుడని, మొదట్లో భృత్యుడుగా ఉండేవాడని స్పష్టమవుతున్నది. మత్స్యపురాణం కూడా 'శిశు(ము)కోఽన్ధ్రః సజాతీయః' అంటూ వర్ణిస్తున్నది మత్స్యపురాణమే ఆంధ్రుల చరిత్రకు

ఎక్కువ ప్రామాణికమైనదని చరిత్రకారుల అభిప్రాయము. శాతవాహనులతో శ్రీయజ్ఞ శాతకర్ణి కాలంలోనే మత్స్యపురాణ సంకలనం జరిగిందని నిర్ణయిస్తున్నారు. యజ్ఞశ్రీ సామ్రాజ్యం ఆంధ్ర ప్రాంతాలకు మాత్రమే పరిమితంకాక మహారాష్ట్ర, విదర్భ, కోసల, కర్ణాటక ప్రాంతాలకు విస్తరించింది. అంటే పురాణాల సంకలనం జరిగినప్పుడు శాతవాహనులు ఆంధ్రదేశాన్ని మాత్రమే పాలించడంలేదు; మహారాష్ట్ర, కర్నాటక ప్రాంతాలను సైతం పాలిస్తున్నారు. ఐనప్పుడు రాయ్‌చౌధురి వాదంలో బలం లేనట్లు స్పష్టమవుతున్నది.

శాతవాహనులు ప్రాకృతాన్ని వాడటానికి కారణం- మౌర్యులకాలంనుండి ప్రాకృతం సామ్రాజ్యభాష కావడమే, రాజకీయాధికారంతోబాటు ప్రాకృతభాష మౌర్యులనుండి శాతవాహనులకు సంక్రమించిన వారసత్వం! అంతేగాక శాతవాహనులు తమ మాతృభాషను వాడలేదని చెప్పడం నేడు సాహసమవుతున్నది. ఇటీవల లభించిన శాతవాహనుల వెండినాణేలు కొన్నింటిపై రాజులపేర్లు రెండు భాషల్లో ఉన్నాయి. అందొకటి ప్రాకృతం; మరొకటి గుణాఢ్యుడు 'బృహత్కథ'లో పేర్కొన్న 'దేశీ' అనే భాషగా చెప్పవచ్చు. ప్రాచీన తెలుగు భాషే ఆ భాషయని డాక్టర్ దినేశచంద్ర సర్కార్‌వంటి పండితుల అభిప్రాయము. సమకాలికులైన శకరాజులను అనుకరిస్తూ శాతవాహనులు అధికారభాషయైన ప్రాకృతంలోను తమ మాతృభాషయైన తెలుగులోను తమ పేర్లను ముద్రించిన నాణేలను తమ సామ్రాజ్యంలోని ఆంధ్రేతర ప్రాంతాల్లో ప్రచారం చేసినారు.

ఈ అంశాలవల్ల పురాణాలు స్పష్టీకరించినట్లు శాతవాహనులు ఆంధ్రులనడంలో సందేహం లేదు, శాతవాహనులు ఆంధ్రులుకాక వారి భృత్యులనే వాదం వల్ల ఒక విపరీత సమస్య బయలుదేరుతుంది. నేటివరకు లభిస్తున్న ఆధారాలను బట్టి శాతవాహనులు వినా ఆంధ్రులు మరొకరు రాజ్యం చేసినట్లు తెలియడంలేదు. ఐనచో శాతవాహనులు ఎప్పుడు, ఎక్కడ ఆంధ్రులకు భృత్యులై యుండిరో చెప్పజాలము శాసనాలలోని శాతవాహనులు పురాణములలోని ఆంధ్రులు ఒకరు కాదు అన్నచో ఏకనామధేయులైన రాజులు ఇంచుమించు ఒకేసమయంలో, ఒకే ప్రాంతంలో రాజ్యమేలు చుండిరని చెప్పవలసి వస్తుంది. ఇది అసంభవము!

## శాతవాహనుల జన్మస్థలం

సాధారణంగా జాతీయతకు సంబంధించినదే జన్మస్థల సమస్య. శాతవాహనులు ఆంధ్రులని అంగీకరించినప్పుడు వారి జన్మస్థలం ఆంధ్రదేశమనడం సహేతుకం. కాని శాతవాహనులు ఆంధ్రేతరులనే సిద్ధాంతం వల్ల వారి జన్మస్థలాన్ని గురించి వాదోపవాదాలు బయలుదేరడం సహజం శాతవాహనుల జన్మభూమి కర్ణాటకమని, విదర్భయని, మహారాష్ట్రమని పండితులలో భిన్నాభిప్రాయాలు ఉన్నాయి మరికొందరు శాతవాహనుల జన్మభూమి ఆంధ్రదేశమేగాని వారు

స్వతంత్రాధికారాన్ని స్థాపించినది మాత్రము మహారాష్ట్రమునందే అని భావిస్తున్నారు.

**కర్ణాటక వాదం :**

శాతవాహనులు ఆంధ్రేతరులని నిర్ణయించిన సుక్తంకర్ పండితుడే కర్ణాటకము వారి జన్మభూమి అనే వాదం ప్రతిపాదించినాడు. ఈ వాదానికి మూడో పులోమావి మ్యాకదోని శాసనము, పల్లవ శివస్కందవర్మ హిరహడగల్లి శాసనములు ఆధారములు. మ్యాకదోని, హిరహడగల్లి బళ్ళారి జిల్లాలో ఉన్నాయి. ఆ ప్రాంతాన్ని ఈ శాసనాలు క్రమంగా సాతవాహనిహార (అహార=రాష్ట్ర) సాతవాహనిరట్ట (రాష్ట్ర) అని వ్యవహరించినాయి. ఈ వ్యవహారము శాతవాహనుల కాప్రాంతంతో సాన్నిహిత్యాన్ని సూచిస్తున్నదని, అందుచే బళ్ళారి లేక కర్ణాటకమే శాతవాహనుల జన్మస్థలమని, కర్ణాటకము నుండి మహారాష్ట్రమునకు విస్తరించి, తమ పాలన అంతిమ దశలో ఆంధ్రదేశాన్ని జయించి శాతవాహనులు ఏలినారని సుక్తంకర్ తీర్మానించాడు.

మ్యాకదోని శాసనానికి కారకుడైన మూడోపులోమావి శాతవాహనులలో చివరివాడు. శాతవాహన వంశ కర్తకు, అతనికి నాల్గువందల సంవత్సరాల కాలవ్యవధి వుంది; అంతేగాక వంశకర్తయైన సాతవాహనునకు లేదా శ్రీముఖునకు బళ్ళారి ప్రాంతానికి సంబంధాన్ని సూచించే సాక్ష్యాలు లేవు. సాతవాహన నామాంకితములైన ప్రదేశాలు అనేకములున్నట్లు తెలుస్తున్నది. సాతానికోట (సాతవాహనుని కోట - కర్నూలు జిల్లా, నందికొట్కూరు తాలూకా), సత్తెనపల్లి (గుంటూరుజిల్లా), సాతునూరు (అదోని తాలుకా), సాతవాహని శిఖరం (చాందాజిల్లా, పరిజాగడ) మొదలైనవి. ఈ వివరణనుబట్టి సాతవాహనిహార నామమున్నంత మాత్రాన బళ్ళారి ప్రాంతమును శాతవాహనుల జన్మభూమియని నిర్ణయించడం సముచితం కాదు.

**విదర్భవాదం :**

ఖారవేలుని హాతిగుంఫా శాసనము, గౌతమీపుత్రశాతకర్ణి నాసిక శాసనము ఆధారంగా శ్రీ వి. వి. మిరాసీ పండితుడు విదర్భ రాజ్యమే శాతవాహనుల జన్మస్థలమని తీర్మానించినాడు హాతిగుంఫాశాసనం ''శాతకర్ణిని లక్ష్యము చేయక ఖారవేలుడు తన సైన్యాలను పశ్చిమ దిక్కునకు పంపగా నవి కణ్ణబెణ్ణానది వరకు నడిచి మసిక (లేక ముసిక) నగరాన్ని హడలగొట్టినవి" అని చెబుతున్నది. నాసిక శాసనం గౌతమీపుత్ర శాతకర్ణిని 'బెణాకటస్వామి' అనే బిరుదంతో వ్యవహరిస్తున్నది. ఈ రెండు అంశాలపై మిరాసీ పండితుడు నిర్మించిన సిద్ధాంత సారాంశం: కళింగ నుండి బయలుదేరిన ఖారవేలుని సైన్యాలు పశ్చిమంగా పురోగమించి శాతకర్ణి రాజ్యంపై దండెత్తినవి కావున శాతకర్ణి రాజ్యం కళింగకు

పశ్చిమ దిక్కునందే ఉన్నది, కళింగకు దక్షిణ దిక్కు నందున్న ఆంధ్రదేశము శాతకర్ణి రాజ్యంలో చేరలేదు; కణ్ణబెణ్ణానది వైన్ గంగకు ఉపనదియైన కన్హాన్ నది. ఇది నాగపూర్‌కు ఉత్తర దిశలో పదిమైళ్ళ దూరంలో ప్రవహిస్తున్నది. అందుచేత శాతకర్ణి రాజ్యం విదర్భయే అగుచున్నది. నాసిక శాసనంలోని బెణాకటము వైన్ గంగకు ఉభయ పార్శ్వములందున్న భూమియే మహాభారతంలోను వాకాటక శాసనాలలోను దీని ప్రసక్తి ఉంది. కావున బెణాకటము ప్రాచీన రాజ్య విభాగాలలో ఒకటి; గౌతమీపుత్రుని పైతృకమై వుంటుంది. అందుచేత ఆ ప్రాంతమే శాతవాహనుల జన్మభూమిగా నిర్ణయించవచ్చును.

శ్రీ మిరాసీ పండితుని వాదంలో అనేక లోపాలున్నాయి : (1) ఆంధ్ర దేశము కళింగకు దక్షిణ దిక్కున మాత్రమే ఉన్నదనుట సరికాదు. కృష్ణానదీ ముఖద్వారం నుండి తూర్పుతీరము తూర్పునకు వంగియున్నందున కళింగము ఆంధ్రదేశమునకు తూర్పుదేశమగుచున్నది. గుంటూరు కృష్ణామండల వాసులు గోదావరీ మండల ప్రజలను 'తూర్పువారు' అనుట సర్వసామాన్యము. రెడ్డి విజయనగరాధీశులు కళింగపై జరిపిన దండయాత్రలను తూర్పు దిగ్జయ యాత్రలుగా శాసనములు సైతము పేర్కొంటున్నవి. అందుచే పశ్చిమంగా పురోగ మించిన కళింగ సైన్యాలు ఆంధ్రదేశము పైనే దండెత్తివవడానికి సంశయించ నక్కరలేదు; ఖారవేలుడు 'సద' వంశస్థుడు; ఇటీవల బయల్పడిన కళింగ - మహిషకాధిపతి శ్రీసద గుంటుపల్లి శాసనమూ తీరాంధ్రంలో పెక్కుచోట్ల దొరికిన సదరాజుల నాణేలూ ఖారవేలుడు ఆంధ్రదేశంపై దండెత్తిన అంశాన్ని రుజావు పరుస్తున్నవి. (2) కన్హాన్ నదిపై మునికనగరం ఉన్న జాడలులేవు. మునిక నగరాన్ని రాయచూరు జిల్లాలోని మస్కిగా కొందరు గుర్తిస్తున్నారు. మరి కొందరానగరం మూసీ కృష్ణానదుల సంగమ స్థలంలో ఉండియుండవలెనను చున్నారు. మునికనగరం మహిషకుల ముఖ్య పట్టణమైయుండవచ్చునని కొందరి అభిప్రాయం; నల్గొండ, మెదక్ జిల్లాలలో మహిషకులనే జాతి పరిపాలన చేసినట్లు చెప్పినాము. గుంటుపల్లి శాసనంలోని రాజుకు 'మహిషకాధిపతి' అనే బిరుదం ఉంది. ఇన్ని కారణాలవల్ల ఖారవేలుని పశ్చిమదిగ్జయయాత్ర ఆంధ్ర దేశ కృష్ణానదీ ప్రాంతం మీదనే జరిగిందనీ కణ్ణబెణ్ణానదీ కృష్ణవేణీ నదియేనని నిర్ణయించడం సమంజసంగా కన్పిస్తున్నది. బౌద్ధ ప్రాకృత వాఙ్మయంలో కృష్ణానదికి కణ్ణబెణ్ణా అనే వ్యవహారం ఉన్నట్లు తెలుస్తుంది. (3) కటక్, కళ్యాణ కటకము, ధాన్యకటకము అనే పేర్లు ఉదాహరణగా బెణాకటము ఒక రాజ్యము, రాష్ట్రముగాగాక నగరముగా గ్రహించడం యుక్తం. ఐనచో-బెణాకటము వేణా నదిపైనున్న నగరమనే అర్థము వస్తుంది. బెణా అనేది కణ్ణబెణ్ణాకు సంక్షిప్త రూపమని గ్రహిస్తే ఆ నగరము ధాన్యకటకముగా గుర్తించడం సమంజసము.

(4) బాలశ్రీ నాసిక్ శాసనాన్నిబట్టి విదర్భ ప్రాంతమును గౌతమీ పుత్రుని పైతృకముగా అంగీకరించుటకు వీలుకాదు. అతడు జయించిన రాజ్యములలో నొకటిగా విదర్భను ఆ శాసనం పేర్కొంటున్నది. కాబట్టి గౌతమీపుత్రుడు తన విజయ యాత్రలను విదర్భనుండికాక మరొకప్రాంతమునుండియే ప్రారంభించి ఉంటాడు. కాబట్టి కణ్ణబెణ్ణా, బెణాకటములనుగురించి మిరాసీపండితుని సూచనలను అంగీకరింపజాలము; ఆ సూచనలలో సత్యము ఉన్నదని అంగీకరించినను వానివల్ల విదర్భ శాతవాహనుల జన్మస్థలమని నిర్ధారణకాదు; మొదటి శాతకర్ణి, గౌతమీపుత్ర శాతకర్ణి విదర్భ నేలినారనుటకు మాత్రమే ఆ శాసనాలనుండి సాక్ష్యం లభిస్తుంది.

**మహారాష్ట్రవాదం :**

ప్రాకృత భాషను వాడినందున శాతవాహనులు మహారాష్ట్రులన్న శ్రీ పి.టి. శ్రీనివాసయ్యంగారి వాదాన్ని పైన పేర్కొన్నాము. వీరి భావానికి జొగెల్కార్ మొదలైన పండితులు మరికొన్ని అంశాలు జతపరచి శాతవాహనుల ఆదిమనివాసము మహా రాష్ట్రమనే వాదాన్ని రూపొందించినారు. ఈ వాదం సారాంశం : ఆంధ్రులు అనాదిగా వింధ్యపర్వత ప్రాంతీయులు; బొంబాయి సమీపంలో ఆంధ్రీనది ఉంది; ఆ నదీతీరంలో నివసించి నందునే వారు ఆంధ్రులైనారు. ఐతరేయబ్రాహ్మణం పుళింద, మూతిబ, శబర జాతులతో కలిపి ఆంధ్రులను చెప్పింది. వీరందరూ మహారాష్ట్ర ప్రాంత వాసులు; ఆంధ్రులు సైతము వారిలోనివారే; ఆంధ్రులలో ఒక తెగ శాతవాహనులు. ప్రాచీన రాజ్యాలను పేర్కొంటూ వ్యాకరణవేత్త పాణిని అవంతి కోసల కరూశ కళింగములను మాత్రమే పేర్కొన్నాడు. దీన్నిబట్టి పాణిని కాలంలో ఆంధ్రదేశం రాజకీయ వ్యక్తిత్వం లేక కళింగరాజ్య అంతర్గతమై ఉండేది. అనంతరం మహారాష్ట్ర, మహాభోజ, పిటెనిక, పుళింద, పుండ్ర, శబర, మూతిబ మొదలైన జాతులను సమైక్యం చేసి ఆంధ్ర శాతవాహనులు సామ్రాజ్యం స్థాపించినారు. అందుచేత పులోమావికి 'నవనరస్వామి' అనే బిరుదు సార్థకము. శాతవాహనులు వాసిష్ఠీపుత్ర, గౌతమీపుత్ర అనే మాతృసంజ్ఞలను వాడినారు. ఇది మహారాష్ట్రములోని ఆచారము. అందుచేత మహారాష్ట్రమే శాతవాహనుల జన్మభూమి.

ఇది చాల లోపభూయిష్టమైన వాదమని వేరే చెప్పనక్కరలేదు. శాతవాహనులు ప్రాకృతభాష వాడడానికిగల కారణాన్ని, వారికి ప్రాచీన తెలుగు మాతృభాష అనడానికి లభిస్తున్న ఆధారాలను పైన పేర్కొన్నాము. ఇక ఆంధ్రీనది మహారాష్ట్రలో ఉన్నంతమాత్రాన శాతవాహనుల జన్మస్థలి మా ప్రాంతమని నిర్ణయించడం ప్రమాదకరము. అదే పేరుగల నది బళ్ళారి ప్రాంతంలో కూడ ఉంది. దక్షిణాపథ వాసులుగా ఐతరేయ బ్రాహ్మణం పేర్కొంటున్న జాతు

లన్నింటిని మహారాష్ట్రలోనే ఇరికెంచవలసిన పనిలేదు. ఇతిహాస వాఙ్మయంలో ఆంధ్ర శబరాదులు తూర్పుభారతంలోని జాతులుగా కన్పిస్తున్నారు. నేటికి శబరులు ఆంధ్ర, ఒరిస్సా ప్రాంతాల్లో ఉన్నారు. పాణిని ఆంధ్రదేశాన్ని పేర్కొనకపోయినంత మాత్రాన ఆంధ్రదేశం లేదనడం సాహసం. బౌద్ధ వాఙ్మయం ఆంధ్ర కళింగ జనపదాలను, ఆంధ్రనగరిని పేర్కొనడం విస్మరించ రాని చారిత్రకాంశము. అశోకుని పూర్వం నుండి అంధక బౌద్ధభిక్షువులు ఆంధ్ర దేశ ప్రత్యేకతను నిలిపినారు. 'నవనరస్వామి' బిరుదం ఉన్న పులోమావి పౌరాణిక వంశక్రమాన్నిబట్టి ఇరవై మూడో రాజు. వాస్తవానికి మహారథులు మొదలైన వారిని జయించి వారితో వైవాహిక సంబంధాలు చేసినవారు శ్రీముఖుడు, అతని కుమారుడు మొదటి శాతకర్ణి. 'నవనరస్వామి' బిరుదానికి జోగేల్కర్ పండితుడు చెప్పిన అర్థమే సరియైనచో ఈ ఇరువురికి మాత్రమే ఆ బిరుదం అర్థవంతమౌతుంది. కాని వారికి ఈ బిరుదం లేదు. మాతృసంజ్ఞలను వాడిన మొట్టమొదటి శాతవాహన చక్రవర్తి గౌతమీపుత్ర శాతకర్ణి, వంశ పట్టికల్లో ఇరవై రెండవవాడు. శ్రీముఖాదుల జన్మస్థలం మహారాష్ట్రమే ఐనచో ఈసాంఘిక సంప్రదాయప్రభావము వారిపై బలంగా ఉండియుండవలసింది. కాని వారెవ్వరూ మాతృసంజ్ఞలను వాడలేదు. కాబట్టి మాతృసంజ్ఞలు ఆధారంగా శాత వాహనుల జన్మభూమి మహారాష్ట్రమని నిర్ణయించలేము.

డాక్టర్ కె. గోపాలచారి మొదలైనవారు మరొక వాదాన్ని ప్రారంభిం చారు. శాతవాహనులు ఆంధ్రులే; ఆంధ్రదేశమే వారి జన్మభూమి ఐయుండ వచ్చును; కాని ప్రథమంగా స్వతంత్ర రాజ్యాధికారాన్ని ఆంధ్రులు మహారాష్ట్ర ప్రాంతంలోనే స్థాపించినారు. తర్వాత చాలా కాలానికి, గౌతమీపుత్ర శాతకర్ణి కుమారుడైన పులోమావి కాలంలో ఆంధ్రదేశాన్ని జయించి పాలించసాగారు. వీరి వాదానికి ముఖ్యమైన ఆధారం శాతవాహన చక్రవర్తులలో మొదటివారి శాస నాలు, నాణేలు మహారాష్ట్రంలో లభించడమే. బాలశ్రీ నాసిక్ శాసనంలో ఆంధ్ర దేశ ప్రసక్తి లేకపోవడం తమ వాదాన్ని బలపరుస్తుందని వీరి భావన. గోపాలా చారి వాదంలో కొంత నిజం వున్నట్లు ముందు పరిశీలిద్దాం. అయితే ఆచార్య గొర్తి వెంకటరావుగారు "శాతవాహనులు ఆంధ్రులని అంగీకరిస్తే వారి సామ్రాజ్యం తూర్పునుండి పశ్చిమానికి విస్తరించిందని చెప్పడమే సమంజసము వాఙ్మయ పురావస్తు సాక్ష్యాలు ఈ వాదాన్నే బలపరుస్తున్నవి'' అంటారు.

(1) ప్రాకృత భాషలోని 'లీలావతీ' కావ్యం హాలచక్రవర్తికి గోదావరీ నదీ ముఖద్వారంతో సంబంధాన్ని సూచిస్తున్నది. పౌరాణిక పట్టికలలో హాలుడు పదిహేడవ వాడు; గౌతమీపుత్ర శాతకర్ణికి ఐదుతరములు ముందువాడు. హాలుడే సంకలనం చేసిన 'గాథాసప్తశతి'లో పెక్కు తెలుగు మాటలున్నాయి; ఆంధ్రుల

సాంఘిక సంప్రదాయాలు ఉన్నాయి. ఈ అంశాలు ఆంధ్రదేశంపై హాలుని పరిపాలనకు తార్కాణాలు.

(2) బాలశ్రీ నాసిక శాసనంలో ఆంధ్రదేశ ప్రసక్తి లేదనడం నిజంకాదు. గౌతమీపుత్రుని సామ్రాజ్యంలోని పర్వతాలలో మహేంద్ర, సిరితన, సెటగిరులను ఆ శాసనం పేర్కొంటున్నది. ఇవి తూర్పు కనుమలలోని కొండలే. మహేంద్రగిరి విశాఖపట్టణం జిల్లాలో ఉంది. సెటగిరి శ్రీపర్వత - నాగార్జునకొండ సమీపంలోనిది. సెటగిరి మీది ఆలయంలో అష్టభుజస్వామి ప్రతిష్ట జరిగినట్లు శాసన సాక్ష్యం లభిస్తున్నది. ఇక సిరితనను సంతృప్తికరంగా గుర్తించినవారు లేరు. ఇది శ్రీ స్థానమనీ కర్నూలు జిల్లాలోని శ్రీశైలానికి అన్వయిస్తుందని చాలమంది చరిత్రకారులు భావించినారు. కాని ధాన్యకటకమే సిరితన అయి వుంటుంది. ధమ్మకడ, ధనకడ, ధాన్యకటక, ధనకటక, ధారణికోట మొదలైన పేరులేగాక ధాన్యకటకానికి క్లుప్తంగా శ్రీధాన్య శ్రీస్థాన అనే పేర్లుకూడ ఉన్నట్లు తెలుస్తున్నది. ఐతే ఇది పర్వతం కాదనే అభ్యంతరం చెప్పవచ్చు. కాని బౌద్ధ వాఙ్మయంలో ధాన్యకటకానికి పూర్వశైలమనే పేరు చాలా ప్రసిద్ధము. చైనా యాత్రికుడైన యువాన్‌చాంగ్ ధాన్యకటకం తూర్పు దిక్కున ఒక పర్వతం ఉందనీ అక్కడ వజ్రపాణి ఆలయం ఉందనీ వ్రాసినాడు. సింహళ బౌద్ధ గ్రంథాలలో వజ్రపర్వత వాసీనికాయమనే బౌద్ధసంఘం పేరు కన్పిస్తుంది ఈ 'వజ్రపర్వతం' యువాన్‌చాంగ్ వర్ణించిన పర్వతము పూర్వశైలము ఒకటేఐయుండవచ్చు. అదే నాసిక్ శాసనంలోని సిరితన అని చెప్పవచ్చు. గౌతమీపుత్రుని వాహనాలు మూడు సముద్రాలలో నీరుత్రావెనట! తూర్పు తీరం వరకు నాతని సామ్రాజ్యం విస్తరించినప్పుడే అది సంభవమౌతుంది. కాబట్టి గౌతమీపుత్రుని సామ్రాజ్యంలో ఆంధ్రదేశం చేరియున్నదనుట స్పష్టము. ఐతే నాసిక్ శాసనంలో ఆంధ్రదేశం పేరు లేనిమాట వాస్తవమే. ఆ శాసనంలోని అస్సక, ములక, కుకుర, అపరాంత మొదలైనవి అతడు యవన పహ్లవ షహరాటుల నుండి జయించిన రాజ్యాలుగా కన్పిస్తున్నాయి. ఆంధ్రదేశం అతడు జయించినది కాదు. అది అతని పైతృకం; అందుచేతనే ఆంధ్రదేశం నుండియే గౌతమీపుత్రుడు విజృంభించి ప్రాగుత్తర రాజ్యాలను జయించినాడు. ఈ విషయాన్నే నాసిక్ శాసనం సూచిస్తున్నది. గౌతమీపుత్రుని నాణేలు అసంఖ్యాకంగా ఆంధ్రదేశంలో అనేక ప్రాంతాలలో దొరికినాయి. నాగార్జున కొండలో జరిగిన ఇటీవలి త్రవ్వకాలతో గౌతమీపుత్రుని నాణేలతో బాటు నాణెములు ముద్రించే దిమ్మలు దొరకడం ఒక విశేషం. ఈ దిమ్మలు నాడు శ్రీపర్వతంలో శాతవాహన

టంకసాల ఉండేదని సూచిస్తున్నాయి. అంటే ఆ ప్రాంతం శాతవాహన సామ్రాజ్యాంతర్భాగమై యుండవలె!

మరొకముఖ్యవిషయం-గౌతమీపుత్రుడు గొప్పవిజేత; సువిశాల సామ్రాజ్య నిర్మాత; మాళవ వరకు అతని సామ్రాజ్యం విస్తరించిందని అందరూ అంగీక రిస్తున్నారు. నాడు ఆంధ్రదేశంలో పటిష్టమైన ప్రభుత్వం ఉన్నదనడానికి ఆధారం లేదు. అట్టి పరిస్థితుల్లో గౌతమీపుత్రుడు ఆంధ్రదేశాన్ని జయించక విడిచిపెట్టినాడనే వాదంలో అర్థం అన్పించదు.

(3) మెగస్తనీస్ వ్రాసినదాన్ని బట్టి చంద్రగుప్తుని కాలానికే ఆంధ్రులకు పెద్ద సైనికబలం ఉంది; బలిష్ఠములయిన ముప్పయి దుర్గాలు ఉన్నాయి. తమిళంలోని 'అహనానూర్'ను బట్టి ఆంధ్రులు మంచి ధానుష్కులు; శౌర్య ధైర్యాలు గలవారు. అంతటి సైనికబలం, ఆర్థికసౌష్ఠవం ఉండడం కేంద్రీ కృతాధికారం ఉన్న సువిశాల రాజ్యంలోనే సాధ్యం అవుతుంది. దాక్షిణాత్య జాతులుగా అశోకుని శాసనాలు పేర్కొంటున్న రథిక, పిటినిక, భోజక, పుళింద, ఆంధ్రజాతులన్నీ మహారాష్ట్రంలో నివసించేవారని ఊహించడంలో అర్థం కన్పించదు. అశోకుని 13 వ శిలాశాసనంలో ఆంధ్రులు బౌద్ధమతాన్ని అనుసరిస్తున్నారని ఉంది. అశోకుని ఎర్రగుడి, రాజులమందగిరి శాసనాలు ఆ విషయాన్ని బలపరుస్తున్నాయి. అమరావతీ, భట్టిప్రోలు స్తూపాల ప్రాచీనత అశోకుని కాలంలో ఆంధ్రులు కృష్ణా గోదావరీ ప్రాంతాల్లో నివసిస్తున్నారని సూచిస్తున్నది.

(4) శాతవాహన వంశానికి మూలపురుషుడుగా చారిత్రకులు భావిస్తున్న సాతవాహనుని నాణెములు కొండాపూర్, వరంగల్లు ప్రాంతాలలో దొరికినాయి; కరీంనగర్ జిల్లా కోటి లింగాలలో చిముఖ (శ్రీముఖు)ని నాణేలు దొరికినాయి. అందుచేత ఆ ప్రాంతంలోనే శాతవాహన స్వతంత్రాధికారానికి అంకురార్పణ జరిగిందని చాలమంది అభిప్రాయం.

(5) శాతవాహనునికి బహుశా పౌత్రుడైన మొదటి శాతకర్ణికి 'దక్షిణాధి పతి' అనే బిరుదం ఉంది. 'దక్షిణాపథం' అంటే నర్మదా, కావేరీ నదుల నడిమి దేశం అని పైన వివరించినాము.

పై అంశాలవల్ల ప్రప్రథమం నుండి శాతవాహనుల అధికారం ఆంధ్ర దేశంపై చలామణి జనట్లు తెలుస్తున్నది. 'ఇంటగెలచి రచ్చగెలువు'మన్న సామెత ప్రకారం అపారమైన సైనికబలంతో మౌర్యులకు నామమాత్ర సామం తులుగా ఉంటున్న శాతవాహనులు తమ మాతృభూమియైన ఆంధ్రదేశంలోనే స్వతంత్రాధికారాన్ని స్థాపించి, అనంతరం విజృంభించి మహారాష్ట్ర ప్రాంతాలను

జయించినారనడమే ఉచితమైన నిర్ణయం. అయితే, ఆంధ్రదేశం తూర్పుతీరానికే మాత్రమే పరిమితం కాదు.

(6) మొదటి శాతవాహనుల శాసనాలు మహారాష్ట్ర ప్రాంతంలో లభించుటకు కారణం లేకపోలేదు. శ్రీముఖుని కాలం నుండి ఆంధ్రులకు మహారాష్ట్ర ప్రాంతాలతో సంబంధం ఏర్పడింది. శక యవనాదులు మధ్యభారతాన్ని ఆక్రమించి దక్షిణంగా విస్తరించడానికి ప్రయత్నిస్తున్నారు. వారి నరికట్టడానికై మహారథులతో చేతులు కలిపి శాతవాహనులు కృషిచేసినట్లు కన్పిస్తుంది. అందుచేతనే మహారాష్ట్ర ప్రాంతాలపై శాతవాహనులు తమదృష్టిని కేంద్రీకరించవలసి వచ్చింది. అదీగాక ఆ కాలంలో బలవంతులైన రాజులదృష్టి భారత సామ్రాజ్యాధికార పీఠమైన మగధపై ఉండేది. మగధ నాక్రమించాలని ఆశించిన దాక్షిణాత్య రాజవంశాలు మధ్య, పశ్చిమ భారత ప్రాంతాల నాక్రమించి, అక్కడ తమ అధికారాన్ని సుస్థిరం చేసుకోవలసిన అవసరం ఉండేది. ఈ ఆశయమే శాతవాహనుల శాసనాలు మహారాష్ట్రంలో ఎక్కువగా కన్పించడానికి కారణం.

## శాతవాహనుల తొలి అధికారపీఠం

ఆంధ్రప్రాంతాలు ఆదినుండి శాతవాహన రాజ్యంలో చేరియుండినట్లు పై చర్చవల్ల స్పష్టమవుతున్నది. అయితే శాతవాహనులు, ఆంధ్రులు ఒకరే అన్నచో వారి రాజ్యం తూర్పు ఆంధ్రనుండి పశ్చిమానికి విస్తరించిందనడం సహజం, సమంజసం అనే ఆచార్య గొర్తి వెంకట్రావుగారి వాదంలో ఒక లోపం వుంది. ప్రాచీనకాలంలో ఏ రాజవంశం కూడ తమ స్వస్థలంలో సామ్రాజ్యాధిపత్యం వహించినట్లు కన్పించదు. మౌర్యుల జన్మస్థలం మగధ కాదు. కాంచీపురంలో విజృంభించిన పల్లవులు తొండైమండలానికి ఆగంతుకులు, బాదామిప్రాంతం చాళుక్యుల ఆదిమనివాసం అనడం అనుమానాస్పదం. కాబట్టి ఒక రాజవంశం విజృంభించిన ప్రాంతమే దాని జన్మభూమి అనడం సమంజసమైన దృష్టికాదు. అదీగాక నేటి ప్రాంతీయ భాషా సరిహద్దులు ప్రాచీన జాతుల సరిహద్దులు ఒకటిగావు.

ప్రాచీన వాఙ్మయాన్ని బట్టి ఆంధ్రజాతి నేటి ఆంధ్రప్రదేశ్‌కు మాత్రమే పరిమితం కాదు. 'మజ్ఝిమదేశ' సరిహద్దుల్లో 'శతకణ్ణిక' నగరాన్ని వినయపిటక పేర్కొంటున్నది. అస్సక, ములక జనపథాలను ఆంధ్రరాజ్యాలుగా 'సుత్తనిపాత' పై వ్యాఖ్య పేర్కొంటున్నది. ములక ఔరంగాబాద్ జిల్లాగాను అస్సక నిజామాబాద్ జిల్లాగాను ప్రతిష్ఠాన (పైఠాన్) బోధన్ నగరాలు వాని రాజధానులుగాను గుర్తించడమయింది గదా! జైన వాఙ్మయం ప్రతిష్ఠానాన్ని శాతవాహనుల రాజధానిగా పేర్కొంటున్నది. శాతకర్ణి పాలిస్తున్నందున ప్రతిష్ఠానాన్నే

'శతకర్ణిగా' వినయపిటక వ్యవహరించివుండవచ్చు. జైన వాఙ్మయ సాక్ష్యాన్ని పైఠాన్ పరిసర ప్రాంతాలలో జరిగిన పురావస్తు ఖనన ఫలితాలు బలపరుస్తున్నాయి. ముఖ్యంగా నెవాసా దగ్గిర శాతవాహన వంశంలోని తొలి రాజులైన కన్హ (కృష్ణ) సిరిసాతకణి, సిరిసాతవాహనుల నాణేలు, ముద్రలు లభించినాయి. సిరిసాదవాహన అనే లేఖనం ఉన్న నాణేలు పూనా, వరంగల్, హైదరాబాదు, కొండాపూర్‌లలో దొరికినాయి. ఇటీవల కరీంనగర్ జిల్లాలో కోటిలింగాలచెంత శ్రీముఖుని (చిముఖుని) నాణేలు లభించినట్లు చెప్పినాము. ఈ మొదటి రాజుల నాణేలు తీరప్రాంతంలో గానీ, బిరార్, మాళవ, కర్ణాటకలలో గాని లభించలేదు. అందుచేత ఆ ప్రాంతాలు సరిహద్దులుగా ప్రథమ శాతవాహనరాజ్యం ఉన్నట్లు నిర్ణయించడం సమంజసం. మహారాష్ట్రప్రాంతంలో బలవంతులైన అంగీయులరాజ్యానికి శాతవాహనరాజ్యం భిన్నంగా ఉండియుండవలె. మహారథి ఆంగీయులతో తొలి శాతవాహనులు వివాహ సంబంధాలు చేసినారు. ఈ సంబంధాలు శాతవాహన రాజ్యవిస్తరణోద్యమంలో ఉపకరించినాయి.

ఖారవేలుని హాథిగుంఫ శాసనము మొదటి శాతకర్ణి రాజ్యం కళింగరాజ్య సరిహద్దుల్లో ఉన్నట్లు సూచిస్తున్నది. 'చుళ్ళకళింగ' జాతకం ప్రకారం దంతపురం రాజధానిగా ఉన్న కళింగాధీశుడు అస్సకరాజైన అరుణునితో పోరాడి పరాజయం పొందినాడు. శాతకర్ణి ఖారవేలుల మధ్య సంఘర్షణను ఈ కథ సూచిస్తున్నదని భావించవచ్చు.

పై చర్చవల్ల పశ్చిమాంధ్రప్రాంతము ఆగ్నేయ మహారాష్ట్రప్రాంతము కలిసిన రాజ్యమే శాతవాహనుల తొలి అధికారపీఠమని, దీనికి ప్రతిష్ఠానము రాజధాని అని తేలిన సారాంశము ఆ రోజుల్లో ప్రతిష్ఠానం కీలకస్థానంలో ఉండేది. ఉత్తర దక్షిణాపథాలను కలిపే రహదారిపైనేగాక పశ్చిమతీర రేవులను దక్షిణాపథంతో కలిపే కనుమల ముఖద్వారంలో పైఠాన్ ఉంది. ఈ మార్గాల గుండా ఎంతో దేశీయ విదేశీయ వాణిజ్యం జరిగేది. ఆ వాణిజ్యమే ప్రతిష్ఠాన రాజ్య ఐశ్వర్యానికి, శాతవాహనవంశ బలగౌరవాలకు మూలమయింది. మెగస్తనీస్ బలవంతమైనదిగా వర్ణించిన అంధ్రరాజ్యం బహుశా ములక - అస్సక లేక ప్రతిష్ఠాన రాజ్యమే అయివుంటుంది.

## వంశ నామము

శాతవాహన పదానికి ప్రాకృతరూపమే సాతవాహన. శాతవాహన, సాతవాహన, శాతకర్ణి పదాలు సమానార్థకాలుగా కన్పిస్తాయి. సత, శతి, సద అనే హ్రస్వరూపాలు నాణేలమీద ఉన్నాయి. ప్రాకృత వయ్యాకరణి హేమచంద్రుని ప్రకారం 'శాలివాహన' అనేది శాతవాహనకు మరొక ప్రాకృతరూపం.

శాతవాహనపదానికి పలువురు పలు అర్థాలు సూచించినారు. జినప్రభసూరి అనే జైనరచయిత ప్రకారం వందలకొలది (శతాని) వాహనాలను (వాహనాని) దానం చేసినందున శాతవాహను లయినారు. వాహనాన్ని పొందిన వారైనందున శాతవాహను లయినారని అంటే మౌర్య సార్వభౌముల సైన్యంలో ఉన్నత పదవులు బడసినందున ఆ పేరు పొందినారని మరొకరి వ్యాఖ్యానం. ప్రాచీన తమిళ కావ్యమైన శిలప్పదికారంలో 'నూర్‌వార్‌కన్నార్' అను పేరుంది. ఇది 'శతకర్ణి'కి తమిళరూపం. గోకర్ణ, ఘంటాకర్ణ పేర్లవలె శతకర్ణి అనేది వ్యక్తి నామమని, అతని కుమారుడే శాతకర్ణి అయినాడని మరొక సూచన.

ముండారీ భాషలో 'శాత' అంటే గుర్రం అనీ హాన్, కర్ణి, పహన్ మాటలకు కొడుకు అని అర్థం; అందుచేత అశ్వమేధం చేసిన రాజు సంతతి శాతవాహను లయినారని ప్రిజులుస్కీ పండితుని అభిప్రాయం. కాని ఈ వంశ కర్త అశ్వమేధం చేసినట్లు రుజువు లేదు. అశ్వమేధం చేసిన వంశాలన్నీ శాత వాహన వంశాలు కావలె. కాని చరిత్రలో ఒకే శాతవాహన వంశం ఉంది. కాబట్టి ప్రిజులుస్కీ వ్యాఖ్యానము అంగీకరించలేము. అయితే ఆంధ్రజాతిలో అశ్వకగణం ఉన్నట్లు వారిపేరనే అస్సక (అశ్వక) జనపదం ఏర్పడి వుంటుం దని పరిశీలించినాము. ఆ జనపద ప్రాంతంలోనే శాతవాహన విజృంభణ జరిగింది. అందుచేత అశ్వకులకు శాతవాహనులకు సన్నిహితసంబంధం వుండియుండవలె. పురాణాల సంకలనం నాటికి శాతవాహన పద ఉత్పత్తి, నిజస్వరూపము అర్థము విస్మృతిపథంలో పడిపోవడంతో సారస్వతంలో శతకర్ణి, శాతకర్ణి, స్వాతికర్ణ, సాతకర్ణ, సాతవాహన అనే భిన్నరూపాలు కన్పిస్తున్నాయి.

## కులము

శాతవాహనులు బ్రాహ్మణులు, క్షత్రియులు, శూద్రులు అనే భిన్న వాదా లున్నాయి. మొదటి శాతకర్ణి అనేక వైదిక క్రతువులు చేసినాడు. గౌతమీ పుత్ర శాతకర్ణిని అతని తల్లి ఆగమనిలయుడని, క్షత్రియదర్పమానమర్దనుడని, ఏకబ్రాహ్మణుడని వర్ణించింది. వాసిష్ఠ గౌతమాది ఉన్నత గోత్రాల బ్రాహ్మ ణులు శాతవాహనులకు తమ కుమార్తెల నిచ్చి పెండ్లిచేసినట్లు తెలుస్తున్నది. అందుచేత శాతవాహనులు బ్రాహ్మణులేననే గట్టి అభిప్రాయం ఉంది. గౌతమీ బాలశ్రీ తాను రాజర్షి పత్నినని ఒప్పుకొన్నందున శాతవాహనులు క్షత్రియులని కొందరి వాదము. అయితే వైదిక వాఙ్మయం ఆంధ్రులు అనార్యులని ముక్త కంఠంగా చాటుతున్నది. శాతవాహనులు అశ్వచిహ్నం ఉన్న ఆదిమజాతి అయి వుండవచ్చునని పరిశీలించినాము ప్రాచీన వాఙ్మయంలో వీరు శూద్రులనే సూచన ఉంది. జైన వాఙ్మయంలో వీరి మూలపురుషుడు బ్రాహ్మణ యువతునకు శూద్ర

స్త్రీయందు జన్మించినట్లుంది; కాని కథాసరిత్సాగరంలోని దీపకర్ణి కథనుబట్టి సాతుడనే యక్షునకు బ్రాహ్మణియందు జన్మించినాడు.* ఈ కథలు జాతిసాంకర్యాన్ని సూచిస్తున్నాయి. దక్షిణాపథంలో ఆర్యవిస్తరణ సంస్కృతీకరణక్రమాల్లో ఇట్టి సంఘటనలనేకం జరిగి స్థానిక తెగల పూజారులు బ్రాహ్మణులయినారు. పాలకులు క్షత్రియులయినారు. వర్ణవ్యవస్థకు నిర్దుష్టమైన సరిహద్దు లేర్పడని ఆ రోజుల్లో- ముఖ్యంగా జైన బౌద్ధమత ప్రభావంవల్ల-రాజకీయావసరాల కనుగుణంగా అంతర్వివాహాలు జరగడంలో ఆశ్చర్యం లేదు. ఇటీవలి రచయిత 'శాత' అనే మాటకు కన్నడంలో 'హాలికుడు' అనే అర్థం ఉన్నట్లు సూచిస్తున్నాడు. శాలి (వరి) వాహన (బండి) అనే మాటసైతం హాలికునే సూచిస్తుంది. అందుచేత శాతవాహనులు స్థానిక అనార్యజాతివారై వ్యవసాయవృత్తి నవలంబిస్తూ బలవంతులై పాలకవర్గంలో ప్రవేశించి ఉంటారు జైన బౌద్ధాలు అవలంబించి రాజకీయాధికార ప్రాప్తితో సాంఘికంగా ఉన్నత ప్రతిపత్తి నాశించి, ఆ ప్రతిపత్తినిచ్చే అధికారం ఉన్న పూజారివర్గ ఆదరాభిమానాలు బడసి అశ్వమేధాది వైదిక క్రతువులు చేసి ద్విజవర కుటుంబ వివర్ధనులైనట్లు కన్పిస్తుంది. ఏమైనా జాతివర్ణసాంకర్యం

* దీపకర్ణి కథలో సాతవాహనుల జన్మస్థలాన్ని కులాన్ని గురించిన చారిత్రకాంశం లేకపోలేదనే భావం ఇటీవలి పరిశోధనలవల్ల కలుగుతున్నది. తీరాంధ్రంలో సదనామాంతంవున్న శాసనాలు నాణేలు విరివిగా లభిస్తున్నాయి. శివమక సద శాసనం అమరావతిలోను నాణేలు బ్రోలు, వడ్డమానులలోను, ముద్రిక రామతీర్థంలోను దొరికినాయి. శ్రీ సద శాసనం గుంటుపల్లిలో బయల్పడింది. హారీతిపుత్ర మానసద శాసనం వేల్పూరులో వుంది మానసద, మహాసద నాణేలు వడ్డమానులో లభించినాయి. ఈ రాజులు బహుశా వేంగి, వర్ధమానపురం రాజధానులుగా కొంత కాలం తీరాంధ్రాన్ని స్వతంత్ర ప్రతిపత్తితో పాలించినారని పై సాక్ష్యం సూచిస్తున్నది. వీరిలో శ్రీ సదకు మహామేఘ వాహన, కళింగ- మహిషకాధిపతి బిరుదులున్నాయి. కావున వీరు ఖారవేలుని వంశంవారని స్పష్టమవుతున్నది. వీరి నాణేల మీద వృక్ష చైత్యము, సింహమూ ఉన్నాయి. ఇక, శాతవాహనుల ప్రాచీన నాణేల మీద సదవాహన, సాదవాహన రూపాలు, వృక్ష చైత్యమూ అశ్వమూ కన్పిస్తాయి. వృక్ష చైత్యము యక్షారాధనకు నిదర్శనం. కాబట్టి సదరాజులు, సాదవాహనాలు వుభయులు యక్షారాధకులు, బహుశా యక్షజాతీయులు. దీపకర్ణి కథలోని సాతుడే వుభయుల మూల పురుషుడు; కృష్ణా ముఖద్వార భూమి వీరి జన్మస్థలం. కారణాంతరాలచే వీరు రెండు శాఖలై కళింగ, అశ్వకజనపదాలకు వలస వెళ్ళినారు.

జరుగుతున్న ఆ రోజుల్లో వర్ణాన్ని స్పష్టంగా నిర్ణయించబూనడం ఎండమావుల వేట వంటిది.

## కాలనిర్ణయం

శాతవాహన వంశాన్ని గూర్చిన సమస్యలలో వారి కాలనిర్ణయం చాల జటిలమయింది. దీన్ని గురించి చరిత్రకారులలో ఏకాభిప్రాయం లేదు. అందుకు కారణం పురాణాల సమాచారంలోని వైరుధ్యాతే. శాతవాహనుల అనంతరం దక్షిణాపథ రాజకీయాల పరిణామాల దృష్ట్యా శాతవాహనాస్తమయం క్రీ॥శ॥ 225 తర్వాత జరగలేదని నిశ్చయంగా చెప్పవచ్చు. కాని శాతవాహన యుగారంభాన్ని గురించి అంగీకారం లేదు. శాతవాహనులు దాదాపు 456 సంవత్సరాలు పాలించినట్లు పురాణాల మధ్య స్థూలమైన అంగీకారం ఉంది; కాని వివరాలలో మాత్రం ఐక్యం లేదు. అందుచేత శాతవాహన యుగారంభం గురించి భిన్న సిద్ధాంతా లేర్పడినాయి.

ఆచార్య గొ_ర్తి వెంకటావుగారి సిద్ధాంతం ప్రకారం శాతవాహనులు క్రీ.పూ. 271 లో రాజ్యం స్థాపించినారు. మత్స్య పురాణాన్నిబట్టి శాతవాహనుల్లో 15 వ రాజైన పులోమావి కాణ్వాయన సుశర్మను క్రీ.పూ. 30 లో వధించినాడు. పులోమావి క్రీ.పూ. 43 లో సింహాసనం ఎక్కివుంటాడు. పులోమావికి రాజ్య స్థాపకుడైనే శ్రీముఖునకు మధ్య 228 సంవత్సరాల వ్యవధి ఉంది కాబట్టి రాజ్య స్థాపన క్రీ.పూ. 271 లో జరిగింది. కాని క్రీ.పూ. 256 ప్రాంతంలో ఇచ్చిన అశోకుని 13 వ శిలాశాసనం ఆంధ్రులు 'రాజవిషయం' లో అంచే

---

రెండవ శాఖ స్థానికులైన అశ్వకులతో చేరి, వారి సాయంతో అధికారం లోనికి వచ్చి అశ్వచిహ్నాన్ని స్వీకరించివుంటారు. కళింగ శాఖ ఖారవేలుని నాయకత్వంలో పెద్ద రాజ్యం స్థాపించారు. ఖారవేల (కారు = నల్లని; వేల్ = వాళ్లె) అనేది తెలుగు పదం అని కొందరు పండితులు సూచించడం కూడ గమనించదగివుంది. ఖారవేల శాతకర్ణుల మధ్య వైరం జ్ఞాతి వైరమును సూచిస్తుంది. ఖారవేలుడు కృష్ణా ముఖద్వారంపై పలుమార్లు దండెత్తినాడు; మాతృభూమిని ఆక్రమించాలనే సంకల్పం అయివుండ వచ్చు. ఖారవేలుని అనంతరం మేఘవాహనులకు కళింగలో బలం క్షీణించి తీరాంధ్రానికి మరలి చిన్న రాజ్యాలు స్థాపించి పాలించినారు. గౌతమీపుత్రుడీ ప్రాంతాలను స్వాధీనం చేసుకున్నాడు కాని, స్థానిక ప్రభువులను తొలగించలేదు; పులోమావి, శివశ్రీ శాతకర్ణి సదరాజులను తుదముట్టించి సాదవాహన అధికారాన్ని తీరాంధ్రంలో బలపరచుకొన్నట్లు కన్పిస్తుంది.

మౌర్యసామ్రాజ్యంలో నివసిస్తున్నట్లు చెబుతున్నది. అందుచే అశోకుకున పూర్వమే ఆంధ్రులు స్వతంత్ర రాజ్యస్థాపన చేసినారనడం సమంజసం కాదు.

ఆంధ్రులు క్రీస్తుపూర్వం 73 లో స్వతంత్రులయినారని ఆర్.డి. భండార్కార్ సూచన. చివరి కాణ్వాయనునీ శుంగవంశ శేషాన్ని నిర్మూలించి ఆంధ్రులు విజృంభించినారన్న పౌరాణిక సమాచారం భండార్కార్‌కు ఆధారం. మౌర్యులు క్రీ.పూ. 322లో ప్రారంభించి 137 సంవత్సరాలు పాలించినారు. అనంతరం శుంగులు కణ్వులు ఏకకాలంలో 112 సంవత్సరాలు ఏలినారు కాబట్టి (322-(137 + 112 =) 73 లో ఆంధ్రరాజ్యం ప్రారంభమయినదని భండార్కార్ లెక్కగట్టినాడు. కాని చివరి శుంగుడైన దేవహూతిని వాసుదేవకాణ్వాయనుడు వధించినాడని పురాణాలే చెబుతున్నందున శుంగ కాణ్వ వంశాలు ఏకకాలంలో రాజ్యం చేసినవనడం పొసగదు. శాతవాహన విజృంభణ సందర్భంలో శుంగులను పేర్కొనడం ఉభయులకు మధ్య జరిగిన సంఘర్షణను మాత్రమే సూచిస్తుంది. శాతవాహన రాజ్యస్థాపకుడైన శ్రీముఖుడు చివరి కాణ్వాయనుడైన సుశర్మను చంపినాడని పురాణాల్లో ఉన్నందున శాతవాహనులు క్రీస్తుపూర్వం 30/28 లోనే విజృంభించినారని డి. సి. సర్కార్ అభిప్రాయము.

భండార్కార్, సర్కార్‌ల సిద్ధాంతాల్లో చాల లోపాలున్నాయి. సాధారణంగా పురాణాలు సమకాలిక రాజవంశాలను ఒకరి అనంతరం మరొకరిని పేర్కొంటాయి. ఆ సత్యాన్ని వారు గుర్తించరు. వాయుపురాణం 15 మంది రాజులను పేర్కొని, వారికి 300 సంవత్సరాలిస్తున్నది అదే ప్రామాణికంగా ఈ పండితులు అంగీకరిస్తూ ఆ పురాణాల్లోలేని రాజులు శాఖావంశాల సభ్యులుగా సూచిస్తున్నారు. వాయు పురాణమే తాను ముఖ్యులైన రాజులను మాత్రమే పేర్కొంటున్నట్లు చెబుతున్నది. (ప్రాధాన్యతః ప్రవక్ష్యామి.) ముప్పదిమంది రాజుల్లో శాఖావంశాలవారు ఉన్నారన్నచో నాణేలనుండి లభ్యమవుతున్న కౌశికీ పుత్ర, కర్ణ, కుంభ, శివమకాది పేర్లు సయితం పురాణాలలో ఉండవలసింది. వాయు మత్స్యపురాణాల వ్యత్యాసాన్ని డాక్టర్ విన్సెంట్ స్మిత్ సంతృప్తికరంగా సమన్వయం చేసినాడు. మత్స్యపురాణంలోని 456 సంవత్సరాలకు వాయు పురాణం 300 సం॥లకు మధ్య వ్యత్యాసం (156) శుంగ (112) కణ్వ (45) వంశాల పాలనాకాలంతో పూర్తవుతున్నది వాయుపురాణం లెక్క కణ్వ వంశాంతంనుండి ప్రారంభమయింది. సుశర్మను చంపింది శ్రీముఖుడుగాక అతని సంతతివాడని స్మిత్ చెప్పినాడు. ఆంధ్రులను పులోములని వ్యవహరించడం ద్వారా పులోమావి సుశర్మను చంపినాడని మత్స్యపురాణం సూచిస్తున్నది. వాయుపురాణంలో పులోమావి 5వ వాడు; కాని మత్స్యపురాణంలో 15వ వాడు.

పురాణాల సమాచారం యథాతథంగా స్వీకరించడం ఎంత ప్రమాదమో పూర్తిగా నిరాకరించడం అంత ప్రమాదం. కొన్ని సందర్భాలలో పురాణాల సాక్ష్యం పురాతత్త్వ పరిశోధనలతో సరిపోతున్నది. శాతవాహన వంశం 456 సంవత్సరాలు పాలించినట్లు పురాణాలు చెబుతున్నాయి. ఈ వంశం క్రీ.శ. 225 ప్రాంతంలో అంతరించి ఉంటుంది; ఐనచో (456 - 225) క్రీ. పూ. 230 ప్రాంతంలో విజృంభించి ఉంటుంది. ముఖ్యంగా నెవాసాలో జరిగిన తవ్వకాలలో శాతవాహన, కన్హ, శ్రీశాతకర్ణి అనే మొదటి రాజుల నాణేలు దొరికినాయి. అవి క్రీ.పూ. 3 వ శతాబ్దానికి చెందిన అంతర్వులలో లభించినాయని సంకాలియా వంటి నిపుణుల పరిశీలన.

హాతిగుంఫ శాసనం ప్రకారం ఖారవేల శాతకర్ణులు సమకాలికులు. ఈతడు మొదటి శాతకర్ణి. హాతిగుంఫ శాసనం నానాఘాట్ శాసన లిపులకు సాన్నిహిత్యం ఉంది. ఖారవేలుడు క్రీ.పూ. 183 ప్రాంతంలో కళింగాధిపతి అయినాడు. ఈ అంశాలు కూడ శాతవాహన విజృంభణ జరిగింది క్రీ పూ. 230 ప్రాంతంగా సూచిస్తున్నాయి.

అన్నిటికంటే ముఖ్యమయింది క్రీ. పూ. 3 వ శతాబ్ది ఉత్తరార్ధంలో దక్షిణాపథ రాజకీయ పరిస్థితులు ఆంధ్రుల స్వతంత్ర రాజ్యస్థాపనకు అనుకూలంగా వున్నాయి. అశోకుని మరణానంతరం అనతికాలానికే మౌర్య సామ్రాజ్యం విచ్ఛిన్నం కాసాగింది కదా! ఆనంతరం దక్షిణాపథంలో శుంగ కాణ్వాయనుల అధికారం చెల్లుబడియైనదనడానికి స్పష్టమైన ఆధారం లేదు. గ్రీకు రచయితలు పేర్కొన్నట్లు నాటికే ఆంధ్రులు చాల బలవంతులుగా ఉన్నారు; వారికి పెద్ద సైన్యం ఉంది; ముప్పది దుర్గాలున్నాయి. వారి రాజ్య ఆర్థిక సౌష్ఠవానికి ఆ నగరాలే నిదర్శనం. అట్టి పరిస్థితుల్లో దక్షిణాపథంలో అశోకుని మరణానంతరం సుమారు రెండువందల సంవత్సరాల రాజకీయ శూన్యతను ఊహించడం కష్టం. కాబట్టి పైఠాన్‌లో మౌర్యసామంతులుగా వున్న శాతవాహనులు అశోకుని అనంతరం ప్రబలిన కల్లోలం అవకాశంగా తీసుకొని స్వతంత్రులయినారని చెప్పడం సమంజసం.

## వంశస్థాపకుడు

పురాణ పట్టికల ప్రకారం ఆంధ్ర శాతవాహన రాజుల్లో శ్రీముఖుడు ఆద్యుడు. ఈతని పేరు శిశుక, సింధుక, స్విప్రక, సుద్రక, ఛిముక అనే భిన్న రూపాలలో కన్పిస్తుంది. శాసనాలవల్ల కోటిలింగాల నాణేలవల్ల శ్రీముఖుడనేది శుద్ధరూపమని తెలుస్తున్నది. ఆద్యుడుగా పేర్కొనడంవల్ల పురాణాలు శ్రీముఖుడే వంశకర్తయని సూచిస్తున్నాయి. కాని నానాఘాట్ శాసనంలో 'సిరిముఖ

శాతవాహనో సిరిమతో' అని కన్హేరిశాసనం అతని తమ్ముడైన కృష్ణుని 'శాత వాహనకుల' అని పిల్చినందున శ్రీముఖుడు వంశకర్త కాదని స్పష్టమవుతున్నది. గౌతమీపుత్రశాతకర్ణిని నాసికశాసనం "శాతవాహనకుల యశః ప్రతిష్ఠాకర' అని కీర్తిస్తున్నది.

సారస్వతంలో శాతవాహనరాజు ప్రసక్తి ఉంది. శాసనాలు, నాణేల నుండి 'శాతవాహన' అనేది వ్యక్తి నామమని స్పష్టంగా తెలుస్తున్నది. వరంగల్ హైదరాబాద్‌ల దగ్గిర దొరికిన నాణేల మీద సాద్వహనలేఖనం ఉంది. ఈ సాద్వ హనుడు శ్రీముఖునికంటే పూర్వుడని, అతడే శాతవాహనవంశ మూలపురుషుడనీ ఆచార్య మిరాషీ, రామారావుగార్ల అభిప్రాయం.

ఈ సాద్వహనుడు (శాతవాహనుడు) స్వతంత్ర రాజ్యస్థాపకుడే అయినచో అతణ్ణి ఆద్యుడుగా పురాణాలు పేర్కొని ఉండేవి. శ్రీముఖుని గురించి ఒక సందర్భంలో "సిన్ధుకోన్ధ్రిస్స జాతీయ ప్రాప్స్యతీమాం వసుంధరా" అని 'రాజా శ్రీముఖో' అనీ చెప్పడంవల్ల శాతవాహనుడు వంశకర్తయనీ శ్రీముఖుడు స్వతంత్రాంధ్ర రాజ్య స్థాపకుడనీ నిర్ణయించడం సమంజసం. నానాఘట్ కనుమ శిల్పాల కింది లేఖనాల్లో ఉన్న సిరిముక శాతవాహనో అన్నదాన్నిబట్టి శాత వాహనునకు శ్రీముఖుడు కొడుకని నిర్ణయించవచ్చు. శాతవాహనుడు అశోక మౌర్యుని సామంతుడై, నాటి పరిస్థితులను పరిశీలించి తన రాజాన్ని కట్టుదిట్టం చేసి ఉంటాడు. ఆ రోజుల్లో సామంతులకు సైతం నాణేలు ముద్రించే అధికారం ఉండేది. అశోకుని మరణానంతరం శ్రీముఖుడు స్వజాతీయులను కూడగట్టి స్వాతంత్ర్యాన్ని ప్రకటించి, క్రీ.పూ. 231/230 లో శాతవాహన రాజ్యం స్థాపించి నాడు. తన తండ్రియందు ఉన్న గౌరవంతో తన వంశాన్ని శాతవాహన వంశం అని పిల్చుకున్నాడు. తరువాతి కాలంలో విజయనగరాన్ని ఏలిన హరిహరుడు తన వంశాన్ని సంగమవంశమని పిల్చుకున్నాడు గదా!

శ్రీముఖుడు 23 సంవత్సరాలు పాలించినాడు. జైనసారస్వతం ప్రకారం మొదటి శాతవాహన రాజు జైనమతస్థుడై తన రాజధానిలో పెక్కు స్తూపాలు నిర్మించినాడు. దేశంలో జరుగుతున్న బ్రాహ్మణ మతోద్ధరణోద్యమాన్ని గుర్తించి కొత్తగా నిర్మించిన తన రాజ్య భద్రతకోసమై శ్రీముఖుడు క్రమంగా బ్రాహ్మణ మతాభిమానియైనట్లు చెప్పవచ్చు.

## తొలి శాతవాహనులు

### కన్హ (క్రీ.పూ. 208 - 198)

శ్రీముఖుని కుమారుడు శాతకర్ణి యుక్తవయస్కుడు కానందున తమ్ముడు కన్హ (కృష్ణ) సింహాసనం ఎక్కి పది సంవత్సరాలు పాలించినాడు.

కన్హుని మహామాత్రుడు నాసిక్‌లో శ్రమణులకై గుహలు తవ్వించినాడు. అశోకుని శాసనాలలో మహామాత్రులనే ఉద్యోగులున్నారు. కన్హేరీ శాసనంలో 'మహామాత్ర' పదంవల్ల శాతవాహనులు మౌర్యుల పాలనా విధానం అనుసరించినట్లు తెలియ దమేగాక రెండు రాజవంశాలు సమీపకాలంలో పాలించినట్లు తెలుస్తున్నది.

## మొదటి శాతకర్ణి (క్రీ పూ. 197 - 179)

పురాణాల ప్రకారం శాంతకర్ణి కన్హ కుమారుడు. కాని నానాఘట్ కనుమ లోని శిల్పాలనుబట్టి శాతకర్ణి శ్రీముఖుని కుమారుడని పురాణాల సమాచారం పొరబాటనీ స్పష్టమవుతున్నది. అతని భార్య అతని మరణానంతరం వేయించిన శాసనంలో శాతకర్ణిని వీర, శూర, అప్రతిహతచక్ర, దక్షిణాపథపతి అని వర్ణిస్తున్నది. వాస్తవానికి తొలి శాతవాహనుల్లో అగ్రగణ్యుడు శాతకర్ణి. మహారథి అంగీయ రాకుమారి నాగనికను వివాహమాడి వారి సాయంతో తన రాజ్యాన్ని పదిలపరచుకొని విస్తరణకు పూనుకున్నాడు.

శాతకర్ణి పాలించిన 18 సంవత్సరాల కాలంలో అనేక రాజకీయ సంఘట నలు జరిగినాయి. పుష్యమిత్రుడు మౌర్యవంశాన్ని నిర్మూలించి మగధలో శుంగ వంశాన్ని (క్రీ పూ. 187) స్థాపించడంతో మౌర్యసామ్రాజ్యంలో అలజడులు చెలరేగినాయి. ఇది అవకాశంగా గ్రహించి శాతకర్ణి తూర్పు మాళవ ప్రాంతాలను ఆక్రమించినట్లు తెలుస్తుంది. శాతకర్ణికి చెందిన నాణేలపైన ఉజ్జయినీ చిహ్నం అతని మాళవ ఆక్రమణను సూచిస్తుందని కొందరి అభిప్రాయం. కాని శ్రీముఖుని నాణేలమీద కూడ ఈ చిహ్నం ఉంది.

తూర్పు మాళవ ఆక్రమణకంటె ముఖ్యమయింది శాతకర్ణి ఖారవేలుల మధ్య సంఘర్షణ. తొలి శాతవానుల అధికారం ఆంధ్రదేశంలోనికి విస్తరించ లేదనే సిద్ధాంతం నాటి రాజకీయ పరిస్థితుల దృష్ట్యా అసంబద్ధంగా కన్పిస్తుంది. దక్షిణాపథ వాయవ్యప్రాంత పాలకులు తూర్పుతీర మైదానాన్ని, సింహళ, సువర్ణద్వీపాలవంటి విదేశాలతో వాణిజ్యం చేస్తున్న తూర్పుతీర రేవు పట్టణాలను కృష్ణాగోదావరీ నదీలోయలను ఆక్రమించడానికి ప్రయత్నాలు చేసినారు. అందు చేత వారికి తూర్పుతీర ప్రభువులకు జరిగిన సంఘర్షణలు అనాదిగా దక్షిణాపథ చరిత్రలో చాల ఆసక్తిదాయకమైన అంశాల్లో ముఖ్యమైనవి. చాళుక్యచోళ, బహ మనీ విజయనగర రాజ్యాలమధ్య సంఘర్షణలు చరిత్ర ప్రసిద్ధమైనవి. వీనికి నాంది శాతవాహన యుగంలోనే - శాతకర్ణి, ఖారవేలుల కాలంలోనే - పలకడ మయింది. శాతకర్ణి కాలంలో తూర్పుతీరంలో రాజకీయ ఐక్యం లేదు. శాత కర్ణిలాంటి విజేతల నెదిరించగల శక్తి సామర్థ్యాలున్న రాజులు లేరు. అందుచేత తూర్పుతీరంవరకు తన రాజ్యాన్ని శాతకర్ణి విస్తరింపచేసినాడని చెప్పవచ్చు.

అయితే ఈ సందర్భంలోనే శాతకర్ణికి కళింగాధిపుడైన ఖారవేలునితో సంఘర్షణ తప్పలేదు. తీరాంధ్రాన్ని ఖారవేలుడు సయితం ఆశించడం సహజమే. అదీగాక శాతవాహన విస్తరణను నిరసించిన భోజక, పిటినిక, మహిషకాది దక్షిణాపథ జాతులు ఖారవేలుని సహాయమర్థించి యుండవచ్చు; హాతిగుంఫ శాసనాన్నిబట్టి క్రీ.పూ. 181లో శాతకర్ణిని లక్ష్యం చేయక ఖారవేలుని సైన్యాలు కణ్ణబెణ్ణా వరకు పురోగమించి ముషిక నగరాన్ని హడలగొట్టినాయట! ఇతర సందర్భాలలో ఖారవేలుని విజయాన్ని స్పష్టంగా వర్ణించిన ఈ శాసనం ఈ దండయాత్రలో అతనికి విజయం లభించినట్లు చెప్పడం లేదు. కాబట్టి అతని సైన్యాల నోడించి శాతకర్ణి వెనుకకు మరలించినాడని చెప్పవచ్చు. చుళ్ళకళింగ జాతకంలో కళింగాధిపునిపై అశ్మకాధీశుని విజయం ఖారవేలునిపై శాతకర్ణి విజయమే అయి వుండవచ్చు; ఈ విజయంతో శాతవాహన రాజ్యం తూర్పుదిశకు విస్తరించింది.

ఖారవేలునిపై విజయానికి, స్వీయసామ్రాజ్య విస్తరణకు సూచనగా శాతకర్ణి రెండు అశ్వమేధాలు, రాజసూయం చేసినాడు. అశ్వమేధ సందర్భంలో అతడు ముద్రించిన నాణెం ఒకటి ఇటీవల పూనా సమీపంలో దొరికింది. శాతకర్ణి వైదిక మతాభిమాని. పై యజ్ఞాలే గాక అప్తోర్యామ, అనారంభనీయ, త్రిరాత్ర, దశరాత్ర, త్రయోదశరాత్రాది క్రతువు లొనర్చి గోహిరణ్య భూదానాలతో బ్రాహ్మణులను తృప్తిపరచినాడు. ఈ క్రతువులు దానధర్మాలు శాతకర్ణి రాజ్య విస్తృతితోబాటు, అతని రాజ్య ఆర్థిక వనరులను సూచిస్తున్నాయి.

శాతకర్ణి చాల చిన్నవయసులోనే మరణించినాడు. నానాఘట్ కనుమలోని శిల్పాలను బట్టి అతనికి కుమారహకుసిరి, శక్తిశ్రీమత్, కుమారశాతవాహన, వేదసిరి అనే కుమారులున్నట్లు తెలుస్తుంది. వీరు పిన్న వయస్కు లయినందు వల్ల తల్లి నాగనికాదేవి రాజ్యభారం వహించి, తన తండ్రి త్రణకాయిరో సాయంతో సమర్థతతో నిర్వహించింది. నాగనిక చాల ఆధ్యాత్మికచింతన ఉన్న రాణి. శాతకర్ణి క్రతుకాండలో ఆసక్తితో పాల్గొన్నది. యజ్ఞహుతధూపన సుగంధయా అనీ దిఘ్రవతసుందయా అనీ వర్ణించుకొన్నది.

**పూర్ణోత్సంగ (క్రీ.పూ. 179-161) :**

మొదటి శతకర్ణి తరువాతి రాజులను గురించి శాసన వాఙ్మయాధారాలు పరస్పర విరుద్ధంగా ఉన్నాయి. శాతకర్ణి తరువాత పూర్ణోత్సంగ సింహాసనం ఎక్కినట్లు పురాణాలు చెబుతున్నాయి. కానీ నెవాసా మొదలైన ప్రాంతాలలో సతసిరి, శాతవాహన లేఖనాలున్న నాణేలు దొరికినాయి. వీరిని శతిసిరి శత, కుమార శాతవాహనులుగా గుర్తించవచ్చు. అయితే నానాఘట్ శాసనాన్ని బట్టి శాతకర్ణి అనంతరం వేదిసిరి సింహాసనం ఎక్కినాడు. వేదసిరికే పూర్ణోత్సంగ అనేది వేదసిరి బిరుదమయి వుంటుంది. ఆ బిరుదానికి తుంగులను పూర్తిగా

నిర్మించినవాడని అర్థం చెప్పవచ్చు. పురాణాల ప్రకారం శుంగవంశ కాలంలో ఆంధ్రులు మగధ నాక్రమించిన సూచన కనిపిస్తుంది.

పై సాక్ష్యాలను సమన్వయం చేసినప్పుడు నాగనిక మరణానంతరం అన్న దమ్ముల మధ్య కలహం చెలరేగి రాజ్యాన్ని పంచుకొని వారు పాలించినారని చెప్పవలసి వస్తుంది. వేదిసిరి పైఠాన్‌లో రాజ్యం చేస్తుండగా శతిసిరి తూర్పు మాళవంలోను సిరిశాతవాహనుడు ఉత్తరక ప్రాంతంలోను పాలించినారు. జైనవాఙ్మయంలోని శక్తిశ్రీ, శతసిరి ఒక్కరే అయివుంటారు.

శాతవాహనరాజ్య విచ్ఛిత్తి ఖారవేలునకు మంచి అవకాశం అయింది శాతకర్ణి చేతిలో పొందిన పరాభవానికి ప్రతీకారం తీర్చుకొనే ఉద్దేశ్యంతో ఆంధ్ర రాజ్యంపై దండెత్తినాడు. హతిగుంఫశాసనం ప్రకారం తన నాలుగోరాజ్య సంవత్సరంలో (క్రీ.పూ. 179) దండెత్తి భోజక, పితినికాములను వశవరుచు కొన్నాడు పదకొండో సంవత్సరంలో మైసోలియాలోని వాణిజ్య కేంద్రమైన ప్రిథుడ నగరాన్ని నిర్మూలించినాడు. ప్రిథుడ నగరం బహుశా ప్రతిపాలపురం అయి వుంటుంది. గుంటుపల్లి శాసనంలో కళింగరాజుకు 'మహిషకాధిపతి' బిరుదు వుంది. మహిషకులను ఖారవేలుడే జయించి వుంటాడు. తరచుగా ఖారవేలుడు జరిపిన ఈ దాడులవల్ల ఆంధ్ర రాజ్యానికి చాల నష్టం వాటిల్లింది. తూర్పుతీర ప్రాంతాలు ఖారవేలుని వశమయినాయి.

తొలి శాతవాహనుల్లో మరో ప్రముఖుడు రెండో శాతకర్ణి. తెలంగాణా, ఉత్తర మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, మాళవ ప్రాంతాల్లో దొరికిన ఈతని నాణేల వల్ల ఈతడు తిరిగి శాతవాహన రాజ్యాన్ని సమైక్యంచేసి పాలించినట్లు తెలుస్తుంది. యుగ పురాణంలోని శతరాజు ఈ శాతకర్ణేనని కొందరి అభిప్రాయం; యుగ పురాణం ప్రకారం రెండోశాతకర్ణి శకులను నిర్జించి మగధ కళింగల నాక్రమించి పది ఏండ్లు పాలించినాడు (క్రీ.పూ. 100 ప్రాంతం). శాతకర్ణి శిల్పకారుల్లో ఒకడైన వాసిష్ఠీపుత్ర ఆనందుని శాసనం సాంచీస్తూప దక్షిణద్వారం మీద ఉంది. రెండో శాతకర్ణి 56 సంవత్సరాలు ఏలినాడు.

రెండో శాతకర్ణి మరణానంతరం అపీలక, మేఘస్వాతి, కుంతల శాతకర్ణి పులోమావి, హాలశాతవాహనులు పాలించినారు. వాత్స్యాయన కామసూత్రాలు, కథాసరిత్సాగరం, కావ్యమీమాంసలలో కుంతలుని పేరు కన్పిస్తుంది. ఈతని ఆస్థానంలోని శర్వవర్మ కాతంత్రవ్యాకరణాన్ని, గుణాఢ్యుడు బృహత్కథను వ్రాసినారని ప్రతీతి. పులోమావి పదిహేనో రాజు. ఈతడే సుశర్మను చంపినాడని మత్స్య పురాణం సూచిస్తున్నది. లీలావతీ కావ్యం, అభిధానచింతామణి దేశీనామమాల మొదలైన గ్రంథాలు హాలుని కీర్తిని అజరామరం చేసినాయి. గాథాసప్తశతిని హాలుడే సంకలనం చేసినాడని ప్రసిద్ధి.

## శక శాతవాహన సంఘర్షణలు

హాలుని అనంతరం గౌతమీపుత్ర శాతకర్ణి సింహాసనం ఎక్కేవరకు ఉన్న శాతవాహన రాజులు నామమాత్రులు. వారి కాలంలో శక విజృంభణ ఫలితంగా శాతవాహన రాజ్యానికి దుర్గతి వాటిల్లింది. శకులు దిగువ సింధులోయలో (శక ద్వీపం) స్థావరం ఏర్పరచుకొని, క్రీస్తుపూర్వం మొదటి శతాబ్దం నుండి విజృంభించ సాగినారు. రెండోశాతకర్ణి కాలంలోనే శక శాతవాహన సంఘర్షణలో ప్రథమ ఘట్టం జరిగింది. రెండోఘట్టం బహుశా కుంతలుని కాలంలో జరిగింది. శకులు ఉజ్జయిని నాక్రమించగా ప్రతిష్ఠానం ఏలుతున్న విక్రమాదిత్యుడు వారలను పార ద్రోలినాడని ఆ విజయసూచకంగా క్రీ పూ. 58 లో విక్రమార్కశకం ప్రారంభ మయిందని కాలకాచార్య కథానక అనే జైన గ్రంథం చెబుతున్నది. నాడు ప్రతి ష్ఠానం పాలిస్తున్నది శాతవాహనులు. ఆ విక్రమాదిత్యుడు కుంతలుడయి వుండ వచ్చు. తిరిగి భూమకుని నాయకత్వంలో క్షహరాట వంశస్థులైన శకులు విజృం భించినారు. గుజరాత్, సౌరాష్ట్ర, మాళవ, అజ్మీర్ ప్రాంతాల్లో భూమకుని నాణేలు దొరికినాయి. అతని అనంతరం రాజ్యం చేసిన నహపాణుడు గొప్ప విజేత. మాళవ, సౌరాష్ట్ర, గుజరాత్, మహారాష్ట్ర, ఉత్తర కొంకణ, రాజస్థాన్ ప్రాంతాలు చేరిన సువిశాలమైన రాజ్యం పాలించినాడు. మిన్నగరంగానీ, బరు కచ్ఛంగానీ అతని రాజధాని అయి వుండవచ్చు. దీన్నిబట్టి మాళవ, కొంకణ అపరాంత ప్రాంతాలను శాతవాహనులు శకులకు కోల్పోయినారని, వారి రాజ్యం ఆంధ్రదేశ ప్రాంతాలకు మాత్రమే పరిమితమయిందని తెలుస్తున్నది.

శక శాతవాహన సంఘర్షణను గ్రీకు గ్రంథమైన 'పెరిప్లస్' ధృవపరు స్తున్నది. దక్షిణాపథంలోని రేవుపట్టణాలను వర్ణిస్తూ పెరిప్లస్: "పెద్దసారంగేనస్ కాలంలో కల్యాణి రేవు సురక్షితంగా ఉండేది; కాని సాన్‌డెర్స్ కాలంలో ఈ రేవును శకులు అటకాయించి అచటికి చేరే ఓడలను బరిగజ చేరుస్తున్నారు" అని వ్రాసినాడు. దీనివల్ల రెండో శాతకర్ణి కాలంలో కల్యాణి ప్రసిద్ధ రేవు పట్టణంగా ఉండేదని, కాని సాన్‌డెర్స్ కాలంలో శకులవల్ల అంతరాయం కలిగిందని తెలుస్తున్నది. గౌతమీపుత్ర శాతకర్ణి పూర్వీకుల్లో సుందర శాతకర్ణి ఉన్నాడు. అతడే సాన్‌డెర్స్ అయివుంటాడు.

## సామ్రాజ్య ఉన్నతి


**గౌతమీపుత్ర శాతకర్ణి :**

శాతవాహనకుల యశస్సును తిరిగి ప్రతిష్ఠించినది గౌతమీపుత్ర శాతకర్ణి; శాతవాహనులందరిలో సుప్రసిద్ధుడు, ప్రముఖ భారతీయ చక్రవర్తులలోని వాడు. నాసికలోని అతని రెండు శాసనాలు, అతని తల్లి బాలశ్రీ వేయించిన నాసిక

ప్రశస్తి గౌతమీపుత్రుని గురించి తెలుసుకోడానికి ముఖ్య ఆధారాలు. ఈ ప్రశస్తి అతని కొడుకు పులోమావి 19 వ రాజ్య సంవత్సరంలో వేయించింది.

గౌతమీపుత్రుని కాలాన్ని గురించి అభిప్రాయభేదం ఉంది. జైనగాథల్లోని విక్రమాదిత్యుడితడేనని కొందరంటారు. కాని గౌతమీపుత్రునకు విక్రమాదిత్య బిరుదం ఉన్నదనడానికి సాక్ష్యమేమీ లేదు. ఈతడు క్రీ.శ. 106 లో సింహాసనం ఎక్కి 130 వరకు పాలించినాడని డి సి. సర్కార్ అభిప్రాయం. నహపాణుని శాసనాలలోని తేదీలు శక శకానికి చెందినవనే అభిప్రాయంతో సర్కార్ పైతేదీలను గుణించినాడు. మనకు తెలిసినంతవరకు నహపాణుని చివరి తేదీ 46. అది క్రీ శ. 124 కు సమమవుతున్నది. గౌతమీ పుత్రుని నాసిక శాసనం అతని 18 వ రాజ్యసంవత్సరంలో, అంటే క్షహరాటులపై దాడి సంఘర్షంలో ఇచ్చింది. ఆ దాడి ఫలితంగా క్షహరాట వంశం నిర్మూలనమయింది. అందుచే నహపాణుని 46 వ రాజ్యకాలం గౌతమీపుత్రుని 18 వ రాజ్యకాలానికి సమమవుతున్నది. కాబట్టి గౌతమీపుత్రుడు (24.18) క్రీ.శ. 106 లో సింహాసనం ఎక్కినాడని సర్కార్ సిద్ధాంతం. కాని, క్షహరాటుల అనంతరం రాజ్యం చేసిన కర్దమక వంశస్థుల శాసనాలు, గ్రీకు రచన "పెరిప్లస్" సాక్ష్యమూ సర్కార్ సిద్ధాంతానికి విరుద్ధంగా ఉన్నాయి. పెరిప్లస్ క్రీ.శ. 60 - 80 మధ్యకాలం నాటిది. ఈ గ్రంథం 'మాంబేనస్' అంటే నహపాణుని రాజ్యాన్ని వర్ణిస్తుంది. కాబట్టి నహపాణుడు ఆ కాలంనాటివాడని తెలుస్తున్నది. ఇక కర్దమక వంశస్థుడు చస్తనుని అందౌ శాసనం క్రీ.శ. 130 వ సంవత్సరానిది. ఈ శాసనం ప్రకారం నాటికే అతడు శాతవాహనుల నుండి కథియవార్ ప్రాంతం జయించి, పౌత్రుడు రుద్రదామునితో కలిసి పాలిస్తున్నట్లు తెలుస్తుంది. అంతకు పూర్వం కొడుకు జయదామునితో కలిసి చస్తను డా ప్రాంతం పాలించినాడు. అంటే కథియవార్ ప్రాంతాలను క్రీ.శ. 120 ప్రాంతంలోనే చస్తనుడు జయించి ఉండవలె, అయితే బాలశ్రీ నాసిక శాసనాన్ని బట్టి పులోమావి 19వ రాజ్య సంవత్సరం వరకు శాతవాహన రాజ్యానికి నష్టం వాటిల్లిందని చెప్పడం సమంజసం కాదు. అందుచేత గౌతమీపుత్రుని పాలనా కాలం క్రీ.శ. 106-130 కాదు; క్రీ.శ. 75-110 మధ్య కాలంలో అతడు పాలించినాడని చెప్పడం సమంజసం.

గౌతమీపుత్రుడు యోధాగ్రేసరుడు; విజేత. అతడు సింహాసనం ఎక్కే నాటికి శాతవాహన రాజ్యం సంకుచితమై ప్రతిష్ఠానానికి తూర్పున ఆంధ్ర ప్రాంతాలకు మాత్రమే పరిమితమై ఉండేది; దిగ్జయయాత్రలొనర్చి ఆ రాజ్యాన్ని సువిశాల సామ్రాజ్యంగా రూపొందించినాడు. మొదటి దిగ్జయ యాత్రలో ఆసిక, అశ్మక, ములక, విదర్భ లాతని వశమయినాయి. క్షహరాటులపై జరిగిన రెండో దండయాత్ర చాల ప్రసిద్ధమయినది. దానితో క్షహరాట వంశం నిర్మూలన




మయింది. గౌతమీ పుత్రుడు "క్షహరాటవంశ నిరవశేషకర" అనే బిరుదం ధరించినాడు. జొగెల్ తంబి నాణకనిధిలో గౌతమీపుత్రుడు పునర్ముద్రించిన నహపాణుని నాణేలు లభించినాయి. ఇది క్షహరాటులపై అతని అఖండ విజయాన్ని సూచిస్తుంది. గౌతమీపుత్రుడు ఓడించి వధించినది నహపాణుడేనని కొందరు, కాదు అతని తరువాతి రాజు, బహుశా అతని అల్లుడైన ఋషభ దత్తుడని కొందరు భావిస్తున్నారు.

నాసిక్ ప్రశస్తిలోని గౌతమీపుత్రసామ్రాజ్యవర్ణనవల్ల దాని విస్తీర్ణం తెలుస్తుంది. సామ్రాజ్యంలో అస్సక (నిజామాబాద్ ఔరంగాబాద్ జిల్లాలు) అసిక (రిషిక: అస్సకకు దక్షిణంగా కృష్ణా గోదావరి నదులమధ్య ప్రాంతం) ములక (పైఠాన్ పరిసర ప్రాంతం) సౌరాష్ట్ర (దక్షిణకథియవాడ్) కుకుర (తూర్పు రాజస్థాన్) అపరాంత (ఉత్తర కొంకణ, ఉత్తర మహారాష్ట్ర) అనూప (నర్మదా నది మీద మాహిష్మతీ రాజధాని) విదర్భ (బీరార్) ఆకర (తూర్పుమాళవ, విదిశ రాజధాని) అవంతి (పశ్చిమ మాళవ, ఉజ్జయని రాజధాని) అనే రాజ్యాలున్నాయి. వింధ్య అచీవత్, పరీయాత్ర (వింధ్య ఆరావళీ శ్రేణులు), సహ్య (పశ్చిమ కనుమలు) కన్హగిరి మలయ (నీలగిరులకు పశ్చిమాన) మహేంద్ర, చకోర (ఉత్తర తూర్పు కనుమలు) సెటగిరి (నాగార్జున కొండలు) సిరితణ (అమరావతి పరిసరాల్లోని) పర్వత శ్రేణులచే పరివేష్టితమయింది గౌతమీపుత్రుని రథాశ్వాలు మూడు సముద్రాలలో నీరు త్రాగినవట!

గౌతమీపుత్రుని వ్యక్తిత్వం చాల విశిష్టమయింది. అతనిమూర్తి ఉన్న నాణేలనుబట్టి అతడు దృఢకాయుడని, సురూపియని తెలుస్తున్నది; పరవారణ విక్రముడు; శత్రుభయంకరుడు; సమరశిరసివిజితరిపుసంఘాతుడు; ఉదార పరిపాలకుడు; పౌరజన సుఖదుఃఖాలలో భాగస్వామి; వైదిక విద్యాధర్మతత్పరుడు; ఆగమ నిలయుడు; వర్ణసాంకర్యాన్ని ఆపినవాడు; ద్విజద్విజేతర కుటుంబాలను పోషించినాడు; పరమ ధార్మికుడు; ధర్మార్థకామ పురుషార్థాల పట్ల శ్రద్ధ వహించినవాడు. ఏకబ్రాహ్మణుడని కీర్తి పొందినాడు. గౌతమీపుత్రుడు అశ్వమేధియని ఇటీవల కొందరి సూచన. కాని దానికేమాత్రమూ ఆధారం లేదు. నాసిక్ శాసనం శాతకర్ణి మరణానంతరం ఇరవై సంవత్సరాలకు విచారగ్రస్తయైన వృద్ధమాతృమూర్తి వేయించింది. ఇందులోని అంశాలు అతిశయోక్తులుగా కన్పించడం సహజమే గౌతమీ బాలశ్రీ బ్రాహ్మణి; బ్రాహ్మణ మతం ప్రకారం ఆదర్శ చక్రవర్తిగా తన కొడుకును ఆమె వర్ణించి వుంటుంది. రాజకీయ కారణాల వల్ల పరమత సహిష్ణుత ప్రదర్శించి బౌద్ధులకు సయితం దానధర్మాలు చేసినాడు. అతని కుమారుడు శకరరాకుమార్తెను పెండ్లాడినాడు; శాతవాహనులలో శకులు లీనం కాసాగినారు. ఏమైనా బాలశ్రీ దృష్టిలో శాతకర్ణి పురాణపురుషులతో సమానుడు. బ్రాహ్మణులను పోషించెననడానికిగానీ వర్ణసాంకర్యం మాన్పిన నిదర్శనాలు గానీ లేవు.

## రెండో పులోమావి

గౌతమీపుత్రుని అనంతరం అతనికొడుకు వాసిష్ఠీపుత్ర పులోమావి సింహాసనం ఎక్కినాడు. పులోమావి రాజ్యానికి వచ్చేనాటికే శాతవాహన రాజ్యంలో

కథియవార్ ప్రాంతాలను చస్తనుడు జయించినాడనే వాదం ఉంది. నాసిక్ ప్రశస్తి దృష్ట్యా ఈ వాదం సమంజసమైనది కాదు. శాతకర్ణి పరాజయం పొంది జయించిన అనతికాలానికే సామ్రాజ్య భాగాలను కోల్పోయినచో అతణ్ణి అంతగా బాలశ్రీ శ్లాఘించి ఉండేదికాదు; సంకుచిత సామ్రాజ్యాన్ని పాలించసాగిన పులోమావిని 'దక్షిణాపథేశ్వర' అని సంబోధించేది కాదు. అట్టి సంబోధన కేవలం పరిహాసమే అవుతుంది! అందుచేత పులోమావి 19 వ రాజ్య సంవత్సరం వరకు శాతకర్ణి రాజ్యానికి నష్టం వాటిల్లలేదని భావించడం సమంజసం. క్రీ.శ. 130 నాటికి చస్తనుని అందౌ శాసనం అతడు కథియవార్‌లో పాలిస్తున్నట్లు చెబుతున్నది. అందుచేత నాసిక ప్రశస్తి అనంతరం ఆ ప్రాంతాలను పులోమావి కోల్పోయినాడు. నాసికలోని అతని శాసనంవల్ల మహారాష్ట్రపై పులోమావి పాలన కొనసాగిందని గ్రహిస్తున్నాము.

టాలెమీ అనే గ్రీకు బాటసారి చస్తన పులోమావిలకు సమకాలీకుడై హిప్పొకురలో బెలికారస్ పాలిస్తున్నట్లు వ్రాసినాడు. హిప్పొకురను గుర్తించడం సాధ్యం కాదు. కొల్హాపూర్ ప్రాంతంలో మూడుతరాలకు చెందిన కుర వంశస్థుల నాణేలు దొరకినాయి. వారు వాసిష్టిపుత్ర విలివాయకుర, మాఢరీపుత్ర శివలకుర, గౌతమీపుత్ర విలివాయకుర అనే రాజులు. వీరు స్వతంత్ర సూచకమైన 'రాజన్' బిరుదు ధరించినారు; వీరి నాణేల మీద శాతవాహన చిహ్నాలకు భిన్నమైన ధనుర్బాణములున్నాయి. అందుచేత పులోమావి చస్తన సంఘర్షణను అవకాశంగా తీసుకొని శాతవాహనసామంతులైన కురవంశస్థులు స్వతంత్రంగా పాలించసాగినారని నిర్ణయించవచ్చు.

క్షాత్రపులతోటి సంఘర్షణలో పరాజయము, కురవంశస్థుల తిరుగుబాటు వల్ల పశ్చిమ ప్రాంతాలపై ఆశ వదలుకొని సామ్రాజ్యప్రాగ్భాగాలపై పులోమావి ఎక్కువ శ్రద్ధ వహించినాడని ఆచార్య గొర్తి వెంకట్రావుగారి అభిప్రాయము. అందుకు నిదర్శనంగా ధాన్యకటకంలో పులోమావిని పేర్కొనే శాసనం ఉంది. అతని నాణేలు ఆంధ్ర ప్రాంతంలో అసంఖ్యాకంగా దొరికినాయి.

**శివశ్రీశాతకర్ణి**

పులోమావి అనంతరము శివశ్రీ రాజైనట్లు పురాణ కథనము. వాసిష్టిపుత్ర శివశ్రీ పేరున్న చాల నాణెములు ఆంధ్ర ప్రాంతాల్లో దొరికినాయి. కన్హేరిలోని ఒక శాసనంలోని వాసిష్టిపుత్ర శాతకర్ణిని మహాక్షాత్రప రుద్రదాముని అల్లుడుగా గుర్తిస్తున్నారు. జూనాగడ్ శాసనంలో "దక్షిణాపథపతియైన శాతకర్ణిని ఓడించి తనకు సన్నిహిత బంధువైనందున విడిచిపెట్టి"నట్లు రుద్రదాముడు చెప్పుకున్నాడు, అందుచే శివశ్రీ (పురాణాలు) వాసిష్టిపుత్ర శివశ్రీ (నాణేలు)

వాసిష్టీపుత్ర శాతకర్ణి (కన్హేరి) శాతకర్ణి (జునాగడ్) ఒక్కరేనని నిర్ణయించడం సమంజసం.

వాసిష్టీపుత్ర శివశ్రీ శాతకర్ణి బహుశా పులోమావి తమ్ముడు. రుద్ర దాముని కుమార్తె రుద్రదమనికను పెండ్లి చేసుకున్నాడు. క్షాత్రపులు ఆక్రమించిన శాతవాహన సామ్రాజ్య భాగాలను జయించడానికి ప్రయత్నించి విఫలుడైనాడు. కన్హేరి శాసనంలో ఛత్రపణ శాతకర్ణి, శివశ్రీ ఒక్కరేనని కొందరి మతము.

### శ్రీ యజ్ఞ శాతకర్ణి

పురాణాలలోని యజ్ఞశ్రీ ప్రముఖ ఆంధ్ర శాతవాహనులలో చివరివాడు. శాసనాలు, నాణేలు ఇతణ్ణి గౌతమీపుత్ర శ్రీయజ్ఞ శాతకర్ణి అని వ్యవహరిస్తున్నాయి. నాసిక్, కన్హేరి, చినగంజాములలో ఈతని కాలపు శాసనాలున్నాయి. ఆంధ్రప్రదేశ్, మధ్యప్రదేశ్, బిరార్, కొంకణ, సౌరాష్ట్ర, మహారాష్ట్రలలో ఈతని నాణేలు లభించినాయి. అందుచేత యజ్ఞశ్రీ శాతవాహన సామ్రాజ్య బల గౌరవాలను పునరుద్ధరించినాడని భావించవచ్చు. క్షహరాట వంశంలో జీవదామ, రుద్రసింహుల మధ్య వచ్చిన అంతఃకలహాన్ని అవకాశంగా తీసుకొని యజ్ఞశ్రీ కొంకణ సౌరాష్ట్ర ప్రాంతాలను జయించినాడు.

యజ్ఞశ్రీ బౌద్ధమతం పట్ల ఆసక్తి వహించి నాగార్జునాచార్యుని పోషించినాడని బలమైన సంప్రదాయం ఉంది. నాగార్జుని పోషించిన రాజును త్రిసముద్రాధీశ్వరుడని బాణకవి హర్షచరిత్రలో వ్రాసినాడు. చివరి శాతవాహనులలో ఆ బిరుదానికి అర్హుడు యజ్ఞశ్రీయే! టిబెట్, చైనా చరిత్రకారుల రచనలను బట్టి నాగార్జునునికై యజ్ఞశ్రీ శ్రీపర్వతంలో మహాచైత్యవిహారాలను నిర్మించినాడు; ధాన్యకటక మహాస్తూపానికి నాగార్జునుడు శిలాప్రాకారం నిర్మించినాడు.

కథాసరిత్సాగరంలోని కథనుబట్టి నాగార్జునుడు శాతవాహన యువరాజు చేతిలో మరణించినాడు. అతని మరణానంతరం రాజ్యంలో అల్లకల్లోలం చెలరేగింది.

## వంశక్షీణత - పతనము

యజ్ఞశ్రీ పునరుద్ధరించిన శాతవాహన వైభవం తాత్కాలికమే అయింది. శాతవాహన వంశం క్రమంగా బలహీనమై, యజ్ఞశ్రీ మరణానంతరం అనతి కాలానికే నశించింది. చిరకాలంగా శాతవాహనులు శకులపై సాగించిన తీవ్ర పోరాటం వారి క్షీణతకు ముఖ్యకారణం. వారు పోరాటంలో నిమగ్నులైయున్న సమయంలో వారి సామంతులైన కుర, చుటు, ఇక్ష్వాకు వంశస్థులు బలవంతులై స్వతంత్రరాజ్య స్థాపనకు పూనుకున్నట్లు కన్పిస్తుంది. అదీగాక పశ్చిమ తీర

రేవులపై అధిపత్యం కోల్పోవడం అక్షికంగా శాతవాహన సామ్రాజ్యానికి గొడ్డలి పెట్టయింది.

యజ్ఞశ్రీ అనంతరం పురాణాల ప్రకారం విజయశాతకర్ణి రాజయినాడు. విజయశాతకర్ణి అసంపూర్తి శాసనం నాగార్జునకొండలో దొరికింది. బహుశా బలాధికులవుతున్న ఇక్ష్వాకులను అదుపులో ఉంచుకొనడానికికాతడు విజయపురి వెళ్ళియుండవచ్చు. విజయ శాతకర్ణి తరువాత చంద్రశ్రీ, అతని అనంతరం పులోమావి రాజులయినారు.

శాతవాహన అస్తమయాన్ని గురించిన సమాచారం అస్తవ్యస్తంగా ఉంది పురాణపట్టికలలో లేని రాజుల పేర్లు ఉన్న నాణేలు తర్హాలానిధినుండి, ఆంధ్రదేశ ప్రాంతాలనుండి లభ్యమయినాయి. ఈ నాణేలన్నీ ఇంచుమించు ఒకేకాలానికి చెందినవి. తీరాంధ్రంలో శకసద (శకశాతకర్ణి) నాణేలు దొరికినాయి. కన్హేరి శాసనంలోని మాఢరీపుత్ర శకసేనుడు శకసద ఒకరే అయివుండవచ్చు. తర్హాలా నిధిలో కుంభకర్ణ, శాతకర్ణుల నాణేలు తెలంగాణంలో కౌశికీపుత్రశాతకర్ణి నాణేలు, తీరాంధ్రంలో రుద్రశాతకర్ణి నాణేలు దొరికినాయి.

ఈ నాణేల సాక్ష్యము పౌరాణిక సమాచార సాక్ష్యము సమన్వయించి శాతవాహనాస్తమయాన్ని ఊహించవచ్చు. చంద్రశ్రీ అనంతరం సింహాసనం ఎక్కిన పులోమావికి పురాణాలలో ఉన్న "అన్యస్తేషాం" అనే విశేషణం వల్ల చంద్రశ్రీతో ప్రధాన శాతవాహన వంశ శాఖ అంతరించిందని అన్యశాఖీయుడైన పులోమావి రాజ్యాక్రమణ చేసినాడని కొందరి అభిప్రాయం. చివరి శాతవాహనుల కాలంలో అంతఃపురకలహాలను యుగపురాణంకూడ సూచిస్తున్నది. ఈ కలహాలు అవకాశంగా తీసుకొని శాతవాహన సామ్రాజ్యం భిన్న భాగాలలో భిన్నశాఖలకు చెందిన రాకుమారులు స్వతంత్రరాజ్యాలు స్థాపించుకొన్నట్లు నాణేల ద్వారా తెలుస్తున్నది పురాణాల్లో చివరిరాజు పులోమావి శాసనం బళ్లారిజిల్లా మ్యాకదొనిలో దొరికింది.

శాతవాహనుల నంతమొందించి శ్రీపార్వతీయులు రాజ్యం ఆక్రమించి నారని యుగపురాణ కథనం దీన్నిబట్టి నాటికే విజయపురిలో బలవంతులుగా ఉన్న ఇక్ష్వాకుల నాయకుడు శ్రీశాంతమూలుడు పులోమావిని పారదోలి ధాన్య కటక ప్రాంతాన్ని ఆక్రమించినాడు. పులోమావి బళ్లారి ప్రాంతానికి వెళ్ళి కొంత కాలం రాజ్యం చేసినాడు. అతనితో శాతవాహన వంశం అంతరించింది. శాత వాహన యుగం ముగిసింది.

# యుగవిశేషాలు

శాతవాహనులు నాల్గున్నర శతాబ్దాలకాలం దక్షిణాపథానికి వ్యక్తిత్వం ప్రసాదించి పాలించినారు. ఉచ్చస్థితిలో వారి సామ్రాజ్యం ఆరావళీపర్వతాలనుండి నీలగిరులవరకు తూర్పు పశ్చిమ సముద్రాలమధ్య విస్తరించింది. ఈ విశాల సామ్రాజ్యంలో అనేక జాతులవారు అనేక భాషలవారు ఉన్నారు. వీరందరికి సమ్మతమైన రాజ్యాంగాన్ని అనుసరించి శాతవాహనులు ప్రజాభిమానం చూరగొన్నారు. వారి పాలనలో ఆర్థికపుష్టితో దేశంలో సారస్వత శిల్ప కళాభివృద్ధికి అనుకూల వాతావరణం ఏర్పడింది.

## పాలనవిధానం

సార్వభౌమంతోబాటు పాలన విధానంలో పెక్కు అంశాలను మౌర్యుల నుండి శాతవాహనులు గ్రహించారు. మానవధర్మశాస్త్రం, కౌటిలీయార్థశాస్త్రం వారికి మార్గదర్శకములు. దేశకాలానుగుణంగా పాలనవిధానంలో కొన్ని కొత్త సంప్రదాయాలను నెలకొల్పి శాతవాహనులు భావితరాలకు అందించినారు.

ధర్మశాస్త్ర సమ్మతమైన రాచరికం శాతవాహన రాజ్యాంగానికి మూలం. శాతవాహన రాచరికం మాతృస్వామ్యంపై ఆధారపడిందని కొందరి అభిప్రాయం. శాతవాహన రాజులు ధరించిన మాతృసంజ్ఞలు, కొందరు శాతవాహనరాణులు రాజ్యవ్యవహారాలలో వహించిన ప్రముఖపాత్ర వీరి సిద్ధాంతానికి ఆధారము. కాని మాతృసంజ్ఞలు 26 వ రాజైన గౌతమీపుత్ర శాతకర్ణి కాలానికి పూర్వం శాతవాహనుల్లో ఉన్నవనడానికి నిదర్శనంలేదు ఇక ఇద్దరు శాతవాహనరాణుల పేర్లు మాత్రమే తెలియవచ్చినాయి. నాటి పరిస్థితుల్లో వారు ప్రత్యేకమైన ప్రముఖపాత్ర నిర్వహించినారని చెప్పలేము. అదీగాక వంశనామము శాతవాహనుడనే రాజు ద్వారా వచ్చిందని పరిశీలించినాము. గౌతమీపుత్రుడు "కులపురుష పరంపరాగత విపులరాజ్యం" పొందినాడంటూ బాలశ్రీ వర్ణించింది. అందుచేత మాతృస్వామ్యం గాక తండ్రిద్వారా సింహాసనాన్ని పొందటమే శాతవాహనుల రాచరికసంప్రదాయమని స్పష్టమవుతున్నది.

శాతవాహనులు రాజ, మహారాజ బిరుదం ధరించినారు. గౌతమీపుత్రుణ్ణి రామకేశవులతో పోల్చినందువల్ల రాజు దైవాంశసంభూతుడనే భావం నాటికే అంకురించి వుండవచ్చు. రాజు నిరంకుశుడు; మంత్రులకు ఆజ్ఞలు జారీ చేసేవాడు: సర్వ సైన్యాధ్యక్షుడు. కాని ప్రజాకంటకుడు కాదు. రాజులుగా వారి ఆదర్శాలు అత్యున్నతములు శబ్దార్థ, గాంధర్వ, గణిత న్యాయాది, శాస్త్రాలలోను, రాజోచిత సైనిక విద్యల్లోను ప్రవీణులై, మతసాంఘిక రాజకీయ శాంతిభద్రతలు రక్షించడంలో శ్రద్ధవహించినాడు. ధర్మశాస్త్ర సమ్మతములైన పన్నులు వసూలు

చేస్తూ ప్రజలకాదరపాత్రములైన సంస్థలు పోషిస్తూ ప్రజల సుఖ దుఃఖాలలో భాగస్వాములయినారు.

శాతవాహన సామ్రాజ్యం కేంద్రీకృతమై బలమైన రాచరికం కాదు. అందు చాల సామంతరాజ్యాలుండేవి. కొల్హాపుర ప్రాంతంలోని కురవంశం, మైసూర్‌లో చుటువంశం, విజయపురిలోని ఇక్ష్వాకుల వంశం సామంతవంశాలే. వీరు శాతవాహనులకు వలె మాతృసంజ్ఞలు ధరించి నాణేలు ముద్రించే అధికారం ఉన్నవారు. మహారాష్ట్ర ప్రాంతాలో మహారథి, మహాభోజ బిరుదాలు ధరించిన పాలకులు సయితం శాతవాహన సామంతులేనని చెప్పవచ్చు. ఈ సామంత వంశాలతో శాతవాహనులు వివాహ సంబంధాలు పెట్టుకొనేవారు.

మిగిలిన సామ్రాజ్యభాగాలు రాజుపాలనలో ఉండేవి. ఉన్నతోద్యోగి బృందం సాయంతో రాజులు పరిపాలన నిర్వహించేవారు. విశ్వాసామాత్య, రాజామాత్య, మహామాత్ర, మహాతరక (Chamberlain), భాండాగారిక, హెరణిక, ప్రతీహార, లేఖక నిబంధకార, పట్టికాపాలక అనే ఉద్యోగుల పేర్లు శాసనాలలో కన్పిస్తున్నాయి. ప్రతి నగరంలోను కార్యాలయం (Records Office) ఉండేది. ఉద్యోగులకు జీతాలు ధనరూపంలోనే చెల్లించేవారు.

భూమిశిస్తు రాజ్యానికి ప్రధాన ఆదాయమార్గం. రాజ్యంలో వ్యవసాయ భూమి అంతటికి రాజు సొంతదారుకాదు. రాజక్షేత్రం (రాజ కంఖేట) మాత్రమే ఆ రాజు సొంతం. రాజక్షేత్రానికి వెలుపల భూదానం చేయాల్సివచ్చినప్పుడా పొలాన్ని రాజు విక్రయించుకొనేవాడు. బ్రాహ్మణ, శ్రమణకులకు 'పరిహారా' లిచ్చే సంప్రదాయం శాతవాహనయుగంలోనే ప్రారంభమయింది. భూమిపై రెండు మూడు రకాల పన్ను లుండేవి; పంటలో రాజభాగానికి 'దేయమేయ' మనీ 'రాజభాగం' అని పేర్లు. భూమి పన్నుగాక రహదారులమీద సుంకాలు, వృత్తి పన్నులు (కరుకర) వసూలు చేసేవారు. పన్నులు ధనరూపంలోగాని, వస్తు రూపంలోగాని చెల్లించవచ్చు. కాని హెరణిక, భండాగారిక అనే ఉద్యోగులవల్ల, అసంఖ్యాకంగా దొరికిన శాతవాహన నాణేలనుబట్టి పన్నులు ధనరూపంలో చెల్లించడమే ఎక్కువ అములులో ఉన్నట్లు గ్రహించవచ్చు.

శాతవాహనులు తరచుగా జరిగిన దిగ్జయ యాత్రలవల్ల వారికి పెద్ద సైనిక బలం ఉన్నట్లు గ్రహిస్తున్నాము. హాతిగుంప శాసనం చతురంగ బలాలను గురించి ప్రసంగించింది. అమరావతీ శిల్ప ఫలకాన్నిబట్టి నాటి వ్యూహరచనను ఊహించవచ్చు. సేనాముఖంలో పదాతిదళం నడిచేది. వీరు పొట్టిఖడ్గాలు, గుండ్రని డాలు ధరించేవారు. పదాతిదళానికి పార్శ్వభాగాలలో అశ్వ గజ దళా లుండేవి. ఇందలి సైనికులు తలపాగాలు ధరించి, ఈటెలు, గొడ్డళ్ళతో పోరాడే వారు. పృష్ఠభాగంలో ధానుష్కదళం ఉండెది మహాసేనాపతి లేదా సర్వసైన్యా

ధ్యక్షుడు వుండేవారు. కాని తరచుగా రాజులే స్వయంగా యుద్ధభూమికి సైన్యాలను నడిపేవారు శాసనాలలో కటక, స్కంధావార పదాలు కన్పిస్తాయి. స్కంధావారమంటే తాత్కాలిక సైనిక శిబిరమనీ కటకమంటే సైన్యాగారమని చెప్పవచ్చు. ప్రతి రాష్ట్ర రాజధానిలోను సైన్యాగారం ఉండేది నగరాలకు రక్షణ దుర్గాలుండేవి. యుద్ధసమయాల్లో సాధారణంగా పౌరజనాన్ని బాధించేవారు కాదు; కాని అప్పుడప్పుడు విజేతలు అమానుషంగా ప్రవర్తించిన సంఘటనలు లేకపోలేదు. ఖారవేలుడు ప్రిథుద నగరాన్ని గార్దభ లాంగలాలతో దున్నించినాడు; గౌతమీపుత్రుని 'క్షహరాటవంశ నిరవశేషకర' అని గర్వంగా వర్ణించినారు.

### స్థానిక పరిపాలన

సామంత రాజ్యాలు మినహా ఇతర శాతవాహన ప్రాంతాలు "ఆహారాలు" అనే రాష్ట్రాలుగా విభక్తమయినాయి, సోపారాహార, గోవర్ధనాహార, మామలాహార, సాతవాహనిహారములు శాసనాలలో కన్పిస్తున్నాయి. రాజధాని నగరాల పేర్లే రాష్ట్రాలకు వర్తించేవి. 'అమాత్యులు' రాష్ట్రపాలకులు. అమాత్యులకు వంశపారంపర్య హక్కులు లేవు. వారిని తరచు బదిలీ చేస్తుండేవారు.

శకులతోటి సంఘర్షణవల్ల సరిహద్దు ప్రాంతాల రక్షణకు శాతవాహనులు ప్రత్యేక శ్రద్ధ వహించవలసి ఆ ప్రాంతాలను సేనాపతుల ఆధీనంలో ఉంచి వారికి సామంతాధికారాలు ఇచ్చినట్లు కన్పిస్తుంది. వీరు క్రమంగా భూస్వాముల వలె తయారై యుండవచ్చు. మ్యాకదోని శాసనంలోని 'గుల్మిక' పదం ఈ భావానికి బలం చేకూరుస్తున్నది.

నగరాలలో 'నిగమ' అనే పౌరసభలు పరిపాలనా బాధ్యతలు వహించేవి. శాతవాహన రాజ్యంలో బరుకచ్ఛ, ప్రతిష్ఠాన, తగర, గోవర్ధన, సోపార, కళ్యాణ, నాసిక, ధాన్యకటక, ప్రతీపాలపుర, కొండాపూర్, బ్రహ్మగిరి,విజయపురి మొదలైన పెక్కు నగరాలుండేవి. ఇవి వాణిజ్యకేంద్రాలు. అందుచే నిగమసభలు వాణిజ్య సంఘాలని చెప్పవచ్చు. కాని సభలలో గృహపతులుసయితం సభ్యులుగా ఉండేవారు.

పరిపాలనకు గ్రామం ప్రాతిపదిక. గ్రామిక లేక గ్రామణి గ్రామాధికారి. సప్తశతి నుండి గ్రామణి అధికార దర్పాలు ప్రదర్శించేవాడని తెలుస్తున్నది. తరచు జరిగే సైనిక దాడులవల్ల, తలారుల వల్ల గ్రామస్థులకు బెదద వాటిల్లుతూ ఉండేది.

### ఆర్థిక పరిస్థితులు

శాతవాహన యుగంలో ఆంధ్రదేశంతో సహా దక్షిణాపథం అపూర్వమైన ఆర్థిక వికాసం సాధించింది. దేశంలో వ్యవసాయము, పరిశ్రమలు, వాణిజ్యము ఇంచుమించు సమతూకంలో ఉండేవి. గ్రామాల్లో అధికసంఖ్యాకులకు వ్యవసా

యమే వృత్తిగా ఉండేది. అచ్చటచ్చట పొలాల్లో ఉమ్మడి హక్కులున్నట్లు కన్పిస్తుంది. బ్రాహ్మణ శ్రమణులకు దానం చేసిన భూములను బహుశా శూద్రులు సాగుచేసేవారు. అయితే, వీరు ఎంత 'మక్తా' చెల్లించేవారో తెలుసుకోడానికి ఆధారంలేదు. వరి, చెరుకు, జనుము, నువ్వుల పొలాలు గ్రామాలచుట్టూ ఉన్నట్లు సప్తశతి పేర్కొంటున్నది ప్రతి గ్రామంలోను బెల్లం బట్టీలుండేవి. కొబ్బరి తోటలు, ఆకుతోటలు సమృద్ధిగా ఉండేవి. నీటిపారుదల సౌకర్యాలు ప్రజలే కల్పించుకొనేవారు. ఉదకయంత్రాలు నడిపే వారొక శ్రేణిగా ఏర్పడినారు. ఉదక యంత్రం అంటే బహుశా ఏతాము వంటిదై యుంటుంది. పశువుల సాయంతో వ్యవసాయం జరిగేది. నాగళ్ళను లాగడానికి గాడిదలను కూడా ఉపయోగించి యుండవచ్చు. జనుమును పశుగ్రాసంగా పెంచేవారు. పశుపోషణపట్ల శ్రద్ధ వహించేవారు. మొదటి శాతకర్ణి 43,102 గోవులు, 27 000 గుర్రాలు దానం చేసినాడు. ఇది నాటి పశుసంపదకు తార్కాణము. గోదానము నాటికే పుణ్యకార్యమైనట్లు కన్పిస్తుంది.

శాతవాహనుల శాసనాల్లో పలురకాల చేతిపనివాండ్ర ప్రస్తావనలు కన్పిస్తాయి. వారిలో కోలిక (సాలి), కులార (కుమ్మరి), తిలపిసక (తైలకులు), కసకార (కంచరి), కమర (కమ్మరి), సువనక (స్వర్ణకార), మణిక (మణికారులు), వధిక (వడ్రంగి) ముఖ్యులు. దీన్నిబట్టి దేశంలో ఆయా పరిశ్రమలు విరివిగా సాగుతున్నట్లు గ్రహిస్తున్నాము. ముఖ్యంగా కుమ్మరి, కమ్మరి, వడ్రంగ పరిశ్రమలపట్ల ప్రత్యేక శ్రద్ధ కన్పిస్తుంది. కొండాపూర్, మస్కి, పైఠాన్ ప్రాంతాల్లో దొరికిన మృణ్మయ శకలాలనుగూర్చి యజ్దానీ పండితుడు నాటి కులారులు పనితనంలోగానీ కళాదృష్టిలోగాని శిల్పుల కేమాత్రం తీసిపోరని పేర్కొన్నాడు. కలపతో రథాలు, కుర్చీలు, బల్లలు, శయ్యలు, వాహనాలు తయారుచేసేవారు. వీటి నమూనాలు నాటి శిల్పాలలో కన్పిస్తాయి. మిశ్రమ లోహాలు తయారు చేయడంలో నాటి కమ్మరులు సిద్ధహస్తులు. కంచు, ఇత్తడి ప్రతిమలు, దీపస్తంభాలు, పాత్రలు మొదలైనవి బ్రహ్మపురి, పైఠాన్, అమరావతి మొదలైనచోట్ల దొరికినాయి. బంగారంతో ముఖ్యంగా ఆభరణాలు చేసేవారు శిల్పాలలో కన్పించే నాటి ఆభరణాల్లో మంచి పనితనం ప్రతిఫలిస్తుంటుంది.

ప్రతి పరిశ్రమలోని చేతి పనివాండ్రందరూ శ్రేణిగా ఏర్పడటం నాటి ప్రత్యేకత. శ్రేణి నాయకుడు శ్రేష్ఠి; కార్యస్థానం నిగమసభ. సభ్యుల వ్యవహారాలను పరిశీలిస్తూ శ్రేణి వారి శ్రేయస్సును పరిరక్షిస్తూ ఉండేవి. శ్రేణి శాసనాలను సభ్యులు మన్నించేవారు. ఈ శ్రేణులు బ్యాంకులు (Banks) గా కూడ వ్యవహరించేవి. ధనాన్ని నిల్వయుంచి దానిపై 12 శాతము వరకు వడ్డీ చెల్లించేవి. సాంఘిక సంక్షేమ కార్యక్రమాలు సయితం నిర్వహించేవి. గోవర్ధనంలోని కోలిక

శ్రేణి ఋషభదత్తుడు చెల్లించిన 2000 కర్షాపణాలపై వడ్డీతో శ్రమణులకు వస్త్రదానం చేసేది.

శాతవాహన యుగంలో దేశీయ విదేశీయ వాణిజ్యం విరివిగా సాగేది. పశ్చిమ ప్రాంతాల్లో పైఠాన్, తగర, జున్నార్, నాసిక, గోవర్ధన, వైజయంతి, కరహాట ప్రధాన వాణిజ్య కేంద్రాలు. తూర్పున కేవరూర, విజయపురి, కూడూర, ధాన్యకటక, నరసాల నగరాలు వాణిజ్య కేంద్రాలయినట్లు అమరావతి శాసనాల నుండి తెలుస్తున్నది. దేశీయ వాణిజ్య కేంద్రాలను, వీటిని రేవు పట్టణాలతోను కలుపుతూ రహదారులుండేవి. తూర్పుతీరంలో మచిలీపట్టణంనుండి ఒకటి, వినుకొండనుండి మరొకటి రహదార్లు ఉండేవని, ఇవి రెండూ హైదరాబాద్ సమీపంలో కలసి పశ్చిమ తీర రేవు పట్టణాలను కలిపేవని ఫ్లీట్ పండితుని పరిశోధన. ఉత్తరదేశం అంటే మగధనుండి మరొకమార్గం కళింగలోని తోసలి మీదుగా కృష్ణా ముఖద్వారానికి, అటనుండి రాయదూరు అంతర్వేది మీదుగా వైజయంతికి నడిచేది. ఎడ్లబండి ప్రధాన ప్రయాణ సాధనం. వర్తకులు బిడారులుగా ఏర్పడి ప్రయాణం సాగించేవారు. అల్లూరు శాసనం ప్రకారం అచటి బౌద్ధ సంఘం ఎడ్లబండ్లను దానంగా స్వీకరించింది. వర్తకులు వీనిని అద్దెకు తీసుకొనేవారు. నదులపై సరుకు రవాణా నాటికే చవకగా ఉండేది రహదారులమీద సత్రాలు, చలివేందిరలు ప్రభువులు ఏర్పాటు చేసేవారు. నదులు దాటడానికి బల్లకట్లు ఉండేవి.

విదేశ వాణిజ్యం సాగిస్తున్న రేవు పట్టణాలను పెరిప్లస్ వర్ణిస్తున్నది. పులోమావి కాలంనుండి శాతవాహన రాజులిచ్చిన నౌకాచిహ్న నాణేలు వారికి నౌకాబలం ఉన్నదని, వారు నౌకా వాణిజ్యం ప్రోత్సహించినారని సూచిస్తాయి. ఘంటసాల, గుంటుపల్లి శాసనాలు మహానావికులను పేర్కొంటున్నాయి. పశ్చిమ తీరంలో బరిగజ (బరుకచ్ఛ), సోపార, కళ్యాణ రేవులు ప్రసిద్ధములు. సారాయము, మణులు, వజ్రాలు, వెండి బంగారాలు, నాట్యకత్తెలు బరుకచ్ఛలోని దిగుమతులు. దంతపు సామాన్లు, పట్టు వస్త్రాలు, సుగంధ ద్రవ్యాలు అచటి ముఖ్య ఎగుమతులు తూర్పుతీరంలో కళింగ పట్టణం, పులికాట్ల మధ్య పెక్కు రేవు పట్టణాలుండేవి. వానిలో కూడూరు, ఘంటసాల, కోరంగి ముఖ్యమైనవి. వేంధ్రదేశంలో నెల్లూరు, వినుకొండ, చేబ్రోలు, ధాన్యకటకం, కొండాపూర్, నాగార్జునకొండ మొదలైనచోట్ల దొరికిన రోమన్ బంగారు నాణేలవల్ల ఆంధ్రదేశం రోమ్‌వరకు వాణిజ్యం సాగించి లాభాలు గడించినదనడానికి నిదర్శనం. అల్లూరు శాసనం (క్రీ.శ. 2 వ శతాబ్ది) యోనకదివ్వేను పేర్కొంటున్నది. ధాన్యకటకం, నాగార్జునకొండ మొదలైనచోట్ల రోమన్ స్థావరాలున్నట్లు, అచటి బౌద్ధ నిర్మాణాలలో రోమన్ జోక్యం ఉన్నట్లు తార్కాణాలున్నాయి.

సాంఘిక పరిస్థితులు

శాతవాహన యుగంలోని ప్రజల్లో అధిక సంఖ్యాకులు గ్రామాల్లో నివసించేవారు. అయితే, పరిశ్రమలు వాణిజ్యం పెంపొందినందువల్ల పెక్కు నగరాలు వెలసినాయి. పల్లెలు, పట్టణాలు శాశ్వతమైన నీటివనరుల సమీపంలో నిర్మించుకొనేవారు. పంటపొలాలు, తోటలు గ్రామాలను పరివేష్టించి ఉండేవి. నగరాల చుట్టూ ప్రాకారాలుండేవి. ఇండ్లలో పలురకాలున్నట్లు నాటి శిల్పాల ద్వారా తెలుస్తున్నది. రెండు మూడు అంతస్తుల భవనాలుకూడ ఉండేవి. సామాన్య ప్రజలు పూరి ఇండ్లలోనే నివసించేవారు. గోడల లోతట్టు భాగాలలో ఇతిహాస పురాణగాథలను చిత్రించుకొనేవారు.

శాతవాహనుల కాలం నాటికి సమాజంలో వర్ణవిభజన స్థిరపడిన సూచనలు లేవు. గౌతమీపుత్ర శాతకర్ణి వర్ణసాంకర్యాన్ని నిలిపినానని చెప్పుకొన్నాడు. ఐనను శక యవన పహ్లవాది విదేశీయుల రాకవల్ల, జైన బౌద్ధుల ప్రభావంవల్ల వర్ణధర్మాలు కట్టుదిట్టంగా లేవనే చెప్పవలె. శక యవన నాయకుల్లో బౌద్ధులు, 'హిందువులు'కూడ ఉన్నారు; భారతీయనామాలు ధరించి ఆచార వ్యవహారాలను అనుసరించి భారతీయులయినారు. నాసిక్ శాసనాల్లో ఇంద్రదత్త, ధమ్మదేవ, ధమ్మరక్షిత పేర్లతో యవనులు కన్పిస్తారు. నహపానుని కూతురు దక్షమిత్రా; అల్లుడు ఋషభదత్తుడు. కర్దమకవంశంలో సుప్రసిద్ధుడు రుద్రదాముడు. దక్షమిత్రా ఋషభదత్తులు బ్రాహ్మణులకు అనేక దానధర్మాలు చేసినారు. వీరితో స్థానిక రాజ వంశాలు వివాహ సంబంధాలు చేసుకున్నారు. ఈ విధంగా శస్త్రోపజీవులయిన విదేశీయులను నాటి బ్రాహ్మణ మతంలోని సంస్కరణోద్యమం అగ్రవర్ణాలుగా - బ్రాహ్మణ క్షత్రియులుగా అంగీకరించి వారి సహాయసహకారాలు బడసినట్లు కన్పిస్తుంది. శక శాతకర్ణి, చత్రపణ శాతకర్ణి అనే పేర్లు శక శాతవాహన విలీనాన్ని సూచిస్తాయి.

నాటి బ్రాహ్మణులు వైదిక విద్యల నభ్యసించి వైదికకర్మలు చేయడంలో సామర్థ్యం వహించినారని నానాఘట్ శాసనంవల్ల తెలుస్తున్నది. ఏమైనా నాటి శాసనాలలో బ్రాహ్మణుల ప్రసక్తి ఎక్కువగా కన్పించదు. గౌతమీపుత్రుడు ద్విజవర కుటుంబ వివర్ధనుడనని చెప్పియున్నాడు. కాని, అతడు బ్రాహ్మణులకు చేసిన దానాలేమీ కన్పించవు. అతని మంత్రికూడ శివగుప్తుడు, బ్రాహ్మణులు సమాజంలో ఆధిక్యాన్ని పొందిన నిదర్శనలు లేవు. వణిజులు సంఘాలుగానేర్పడి దేశీయ విదేశీయ వాణిజ్యం సాగించేవారు. వాణిజ్యసంఘానికి నాయకుడు శ్రేష్ఠి. ఈ పదమే తర్వాత 'సెట్టి'గా మారింది. వణిజులు బౌద్ధమతాభిమానులై అనేక గుహావిహారాలు, చైత్యాలు నిర్మించినారు. నగరపాలనలో నిగమసభలద్వారా వైశ్యులు ప్రముఖపాత్ర వహించేవారు. వైశ్యవర్ణంవారు ధనికవర్గీయులైనందున

ప్రభుత్వంలో మంత్రి, సేనాపతి, రాష్ట్రపాలాది ఉన్నతపదవులాక్రమించేవారు. వైశ్యవృత్తి (వాణిజ్యం) నవలంబించిన క్షత్రియులు లేకపోలేదు. శూద్రవర్ణంలో (హాలిక), గోలిక, (గోపాల), వధిక (వడ్రంగి), కమ్మర, కులార, కోలిక మొదలైన వృత్తులే తరువాతి కాలంలో కులాలుగా రూపొందినాయి.

కుటుంబాలు సమష్టిగా ఉండేవి. కుటుంబసభ్యులందరూ కలిసి తీర్థాటనం చేసేవారు; దానాలు చేసేవారు. శాసనాలలోని కుటుంబసభ్యులక్రమాన్నిబట్టి ఆలోచిస్తే స్త్రీలకంటే పురుషులకు ప్రాధాన్యం కనిపిస్తుంది. అంటే, కుటుంబం పితృస్వామ్యంపై ఆధారపడి ఉంది. అయితే, స్త్రీలకు సమాజంలో గౌరవప్రదమైన స్థానం ఉండేది. నాగనిక, బాల్యశ్రీలు రాజ్యవ్యవహారాల్లో సయితం పాల్గొన్నారు కదా! అక్కడక్కడా భర్తల ఉద్యోగనామాలు - భోజికి, సేనాపతిని వంటిని - ధరించేవారు. నాటి స్త్రీలు స్వయంగా చేసిన దానధర్మాలనుబట్టి వారికి కొంత ఆర్థిక స్వాతంత్ర్యం - అంటే సొంత ఆస్తి-ఉన్నట్లు తెలుస్తున్నది. స్త్రీలు విద్యావంతులై చర్చలలో, సభలలో పాల్గొనేవారు. గాథా సప్తశతిలోని పెక్కుగాథలు కవయిత్రులు రచించినారు. సామాన్యులు భర్తలతోపాటు పొలాల్లో, తోటలలో, గానుగలంచెంత పనిపాటలలో పాల్గొనేవారు. ప్రభువుల్లో బహుభార్యాత్వం ఉండేది. మాతృసంజ్ఞలధారణకు అదొక కారణం అయివుండవచ్చు. వివాహబంధాన్ని పవిత్రంగా భావించేవారు. వితంతువులు బ్రహ్మచర్యం అవలంబించి నిష్ఠతో కాలం గడిపేవారు.

అమరావతీ శిల్పాలలోను, గాథాసప్తశతిలోను నాటి సాంఘిక జీవితం ప్రతిఫలిస్తుంది. స్త్రీ పురుషులుభయులు చాల తక్కువగా దుస్తులు ధరించేవారు. స్త్రీలకు ఎర్రని వస్త్రాలమీద పుష్పాలమీద మక్కువ ఎక్కువ. రవికె ధరించేవారుకాదు. స్త్రీపురుషులుభయులు పలురకాల ఆభరణాలు, తలపాగాలు ఉపయోగించేవారు. అలంకరణపట్ల ఆసక్తి ఎక్కువ. స్త్రీలు జడలు అల్లుకొనేవారు. కబరీబంధాలు ఉండేవి. స్నాన సందర్భంలో పసుపువాడకం ఎక్కువ. కాళ్ళకు పారాణి ఉపయోగించేవారు. నాట్యకత్తెలు అరదళమనే మైపూతను వాడేవారు. నృత్యసంగీతాలు ముఖ్యమైన కాలక్షేపాలు. వీణ, వేణువు, మృదంగం, శంఖం మొదలైన వాద్యాలు, అనేక నృత్య భంగిమలు శిల్పాలలో కన్పిస్తాయి. ధనికుల ఇండ్లలో చిలుకలవంటి పక్షులను పంజరాల్లో పెంచేవారు. వాత్స్యాయన కామసూత్రాల్లో హాలక, ఉద్యానగమన, ఘటానిబంధన, మదనోత్సవాలవంటి పండుగల ప్రసక్తి ఉంది. గ్రామ జీవితం నిరాడంబరంగాను నగర జీవితం సుసంపన్నంగానూ ఉండేది. మొత్తంమీద ప్రజలు ఉల్లాసకరమైన జీవితం గడిపిసట్లు సప్తశతినుండి గ్రహిస్తున్నాము.

**మత పరిస్థితులు**

శాతవాహన యుగంలో ఆసక్తిదాయకమైన మతపరిణామాలు జరిగినాయి. ఔత్తరాహికములైన బ్రాహ్మణ, జైన, బౌద్ధాలు స్థానిక విశ్వాస ఆచారాలతో సమన్వయం పొంది తద్వారా విజయం సాధించినాయి. ఈ మతాలు చాలవరకు పరస్పర సహనంతో పురోగమించినాయి. కాని చెదురుగా వీనిమధ్య సంఘర్షణలు జరగకపోలేదు.

**బ్రాహ్మణ మతం**

దేశంలో వైదికమతోద్ధరణ జరుగుతున్న సమయంలో శాతవాహనులు అధికారంలోకి వచ్చినారు. జైనగాథల ననుసరించి ప్రథమ శాతవాహనుడు జైన మతాభిమాని. జైనమతం ద్వారా శాతవాహనుడు సామాజిక ఉన్నతి సాధించి వుంటాడు. అందుచేతనే అతణ్ణి పురాణాలు పేర్కొనలేదు. అతని కుమారులైన శ్రీముఖ, కన్హ (కృష్ణు)లు భాగవత మతం స్వీకరించినట్లు వారి పేర్లు సూచిస్తు న్నాయి. శ్రీముఖుని కొడుకు శాతకర్ణి బ్రాహ్మణవర్గ సానుభూతి సహకారాల నాశించి వైదికధర్మ రక్షణకు దీక్ష వహించి రెండశ్వమేధాలు, రాజసూయమే గాక అగ్న్యాధేయ, అప్తోర్యామ, అనారంభనీయ, దశరాత్ర, త్రయోదశరాత్ర, త్రిరాత్రాదిక్రతువు లొనర్చి బ్రాహ్మణులకు గోదానభూదాన సువర్ణదానాదులిచ్చి తృప్తి పరచినాడు. అతని మహారాణి దీక్షావ్రతయజ్ఞ సుందయా అనీ యజ్ఞహుత ధూపన సుగంధయా అని సగర్వంగా వర్ణించుకొన్నది. తమ కుమారునకు ఈ దంపతులు వేదసిరి అని పేరు పెట్టినారు; వైదికమత పునరుద్ధరణకు, పరి పూర్ణత చేకూర్చడానికి ప్రయత్నించి తమ వంశప్రతిష్ఠను పెంచుకున్నారు.

అయితే శాతవాహన యుగారంభంనుండీ వైదికమతం అపూర్వమైన మార్పుకు లోనయినట్లు నానాఘట్ శాసనంవల్లనే తెలుస్తున్నది. వైదికమత సంస్కారానికి అనేక కారణాలున్నాయి. నైతికప్రవర్తన, పవిత్రజీవితంపై నొక్కిపెట్టిన జైన బౌద్ధాల సవాలు నెదుర్కొనడం ఒక కారణం; మరొక కారణం దేశంలో ప్రవేశించిన క్షత్రియోపజీవులయిన శక యవనాది విదేశీయుల నాకర్షించి వారిని 'హిందూ' సామాజిక వ్యవస్థలో జీర్ణం చేసుకోవలసిన అవసరం; స్థానిక విశ్వాస ఆచారాలతో సమన్వయం పొందడం మూడో కారణం. ఈ కార ణాలవల్ల క్రతుప్రధానమైన వైదికమతం భక్తి వ్రతప్రధానమైన పౌరాణిక మతంగా పరిణమించ సాగింది. నానాఘట్ శాసనం వైదిక దేవతలతోబాటు భక్తి లేక భాగవత మతదేవతలైన సంకర్షణ వాసుదేవ ప్రార్థనతో ప్రారం భిస్తున్నది. మొదటి శాతకర్ణి తరువాతి శాతవాహనులు క్రతుకాండలో శ్రద్ధ వహించలేదు. ఈ పరిస్థితుల్లో రూపుదిద్దుకుంటున్న పౌరాణిక మతానికి రాజా దరణ సాధించే ఆశయంతో ఉన్నత గోత్రజాలైన బ్రాహ్మణులు శాతవాహనులతో

వివాహ సంబంధాలు చేసినట్లు కనిపిస్తున్నది. ఈ విధంగా జరిగిన మొదటి వివాహ ఫలితమే గౌతమీపుత్ర శాతకర్ణి. ఈతడు దిగ్విజయి; కాని యజ్ఞాలు చేయబూనలేదు. నాగనికవలెగాక బాలశ్రీ తాను 'సత్యవచన దాన అహింసా నిరతయా' అంటూ నైతిక ప్రవర్తన ప్రధానమైన విలువల నుగ్గడించింది. కొత్త మతానికి చతుర్విధ పురుషార్థాలు కర్మసిద్ధాంతంలో విశ్వాసం, వర్ణవ్యవస్థ, వ్రతతీర్థాటనలు, భక్తి అంటే శివునిగాని, విష్ణువును గాని భక్తితో పూజించడం ముఖ్య లక్షణాలు. ఈ మతానికి ఆగమపురాణాలు ప్రామాణికా లయినాయి. శాతవాహనుల కాలంలోనే పౌరాణిక వాఙ్మయం ప్రచారంలోనికి వచ్చినట్లు బాలశ్రీ నాసికశాసనమే నిదర్శనం. ఆ శాసనం గౌతమీపుత్రుని 'ఆగమునిలయ' 'ద్విజావరకుటుంబ వివర్ధన', 'వినివర్తిత చాతుర్వర్ణ సంకర ఏకబ్రాహ్మణ' అంటూ వర్ణించడమేగాక పౌరాణిక వీరులతో పోలుస్తున్నది. ఈవిధంగా గౌతమీ పుత్రుడు నూతన బ్రాహ్మణ మతానికి మూలస్తంభాలైన ఆగమవిద్యను, వర్ణ వ్యవస్థను, బ్రాహ్మణాధిక్యతను నిలబెట్టినట్లు నాసిక్ శాసనం సూచిస్తుంది. నాటికి పౌరాణిక వాఙ్మయం పెరిగిందనడానికి సప్తశతిలోని రాధాకృష్ణ, పార్వతీకల్యాణ, విష్ణు అవతార కథలు, శిబవ్రతం మొదలైన అంశాలు నిదర్శనం.

శాతవాహనుల్లో వైష్ణవులు శైవులూ ఇద్దరూ ఉన్నారు. నానాఘట్ శాసనంలో శివుని ప్రసక్తిలేదు: శ్రీముఖుని తమ్ముడు కృష్ణుడు! గౌతమీపుత్రుని శాసనాలపై వైష్ణవ చిహ్నాలున్నాయి. సంకర్షణ, వాసుదేవుల ప్రశంసవల్ల వైష్ణవంలో ప్రధానమైన వ్యూహసిద్ధాంతం కూడ ప్రచారమైనట్లు భావించవచ్చు. అయితే, గుడిమల్లం శివలింగం క్రీస్తు పూర్వానిదని, శాతవాహనుల పూజలందు కొన్నదని తెలుస్తుంది. సప్తశతి శివప్రార్థనతో ప్రారంభిస్తున్నది. కొన్ని శాతవాహన నాణేలమీద స్కందుడు ప్రత్యక్షమవుతున్నాడు: చివరి శాతవాహనుల్లో శివస్కంధ, శివశ్రీ అనేవారున్నారు. కాని, నాటి శైవం స్వభావం గ్రహించ టానికి ఆధారం లేదు. ఈ దేవతలకు నిరాడంబరమైన కోవెలలు నిర్మించినట్లు గుడిమల్లంలోని ఇటీవల తవ్వకాలు సూచిస్తున్నాయి. సప్తశతిలో గణపతి, శక్తి (మహిషాసుర మర్దని?) ఆలయాల ప్రసక్తి ఉంది.

## జైనమతం

శాతవాహనులు విజృంభించే నాటికే ఆంధ్ర దేశాన్ని పరివేష్టించి ఉన్న ప్రాంతాల్లో - మాళవ, కళింగ, మైసూరు రాజ్యాలలో - జైనమతం పాదు కొన్నది. క్రీ.పూ. 4వ శతాబ్దికే ఆంధ్రదేశంలో కూడ కళింగ మాళవ ప్రాంతాల నుండి జైనం ప్రవేశించిందని జైనగాథలవల్ల గ్రహిస్తున్నాము. అశోకుని పౌత్రుడు సంప్రతి ఆంధ్ర ద్రావిడ దేశాల్లో జైనవ్యాప్తికి కృషి చేసినాడు.

అమరావతి సమీపంలోని వడ్డమానుకొండపై సంప్రతి విహారం ఏర్పడింది. అచటనే ఖారవేలుడు మహామేఘవాహన విహారం నిర్మించినాడని ఇటీవల దొరికిన శాసనాలవల్ల తెలుస్తున్నది. మొదటి శాతవాహనుడు జైనమతాభిమానంతో తన రాజధాని నగరంలో జైనులకు చైత్యాలు నిర్మించినాడట. కాని ఈ యుగంలో బౌద్ధం బహుళ ప్రజాదరణ పొందడంవలన, బహుశా జైనుల్లో దిగంబరత్వంవంటి కఠిన ఆచారాలవల్ల జైనం విశేషంగా వ్యాపించలేదు. అయితే క్రీస్తుశకారంభంలో సుప్రసిద్ధ జైనాచార్యుడైన కొండకుందాచార్యుడు (క్రీ.పూ. 50 - క్రీ.శ. 50) కొనకొండ్ల (అనంతపురం జిల్లా)లో ఆశ్రమం నిర్మించుకొని మత ప్రచారం చేస్తూ అనేక సిద్ధాంత గ్రంథాలు రచించినాడు. వానిలో "సమయ సార" శ్వేతాంబర దిగంబర శాఖల వారందరికీ ఆదరణీయమయింది.

### బౌద్ధమతం

బ్రాహ్మణ మతానికి ఎంతటి రాజాదరణ ఉన్నా శాతవాహన - ఇక్ష్వాకు యుగం దాక్షిణాత్య బౌద్ధమత చరిత్రలో స్వర్ణయుగమని చెప్పవచ్చు. శాతవాహన చక్రవర్తులు బౌద్ధాన్ని ఆదరించలేదు; బాలశ్రీ మినహాయించి శాతవాహన రాజులు కూడ బౌద్ధాన్ని పోషించినవారు లేరు. వాస్తవానికి ఆంధ్రదేశంలో బౌద్ధం ప్రజా ఉద్యమంగా విస్తరిల్లింది. నాటి శాసనాలవల్ల వర్తకులు, పాటకజనం, స్త్రీ జనం బౌద్ధాన్నే పోషించినట్లు, స్తూపచైత్య విహారాదులు నిర్మించినట్లు తెలుస్తున్నది. వాణిజ్య పారిశ్రామిక కేంద్రాలైన పట్టణ, నగరాల సమీపంలోనూ, రహదారుల మీద బౌద్ధ క్షేత్రాలుండడం గమనించదగింది. చర్మకారులతోసహా సామాన్య ప్రజానీకం బౌద్ధం పట్ల శ్రద్ధ వహించినారు. ఇంతటి ప్రజాదరణ ఉన్నందునే బౌద్ధంపట్ల శాతవాహనులు సహనం వహించి, అప్పుడప్పుడు బౌద్ధ సంస్థలను పోషించినారు. గౌతమీపుత్ర శాతకర్ణి, అతని కుమారుడు పులోమావి బౌద్ధులకు దానధర్మాలు జేసినారు. అయితే, అందుకు రాజకీయాలు కారణమై వుండవచ్చు. శ్రీ యజ్ఞశాతకర్ణి నాగార్జునుని పోషించినాడని ఇతిహ్యం. శ్రీ విజయశాతకర్ణి శాసనం నాగార్జునకొండలో ఇటీవల దొరికింది. కాని, అది అసంపూర్ణమయింది.

బౌద్ధం భౌగోళికంగా విస్తరిస్తూ స్థానిక ఆచారాలతో సమాధానపడినందున బౌద్ధులలో విభేదాలేర్పడి సంఘం విడిపోవడానికి కారణమయింది. రెండో సంగీతి లోనే విభేదాలు బలపడి సంఘం థేరవాద, మహాసాంఘిక శాఖలుగా విడి పోయింది. థేరవాదులు సనాతనులని చెప్పవచ్చు. ధాన్యకటకం ప్రథమంనుండి మహాసాంఘిక కేంద్రమయింది. అమరావతీ శాసనాల్లో చైత్యకుల ప్రస్తావన ఎక్కువ. అందుచే మహాసాంఘికులకే చైత్యకులని స్థానికనామమై యుంటుంది. బుద్ధునకు మొదటగా 'లోకోత్తర' గుణాలను ఆపాదించినవారు చైత్యకులే. ఈ నూతన భావం ఫలితంగానే బోధివృక్షం, ధర్మచక్రం, సింహాసనం, త్రిరత్నం,

చైత్యం మొదలైన బుద్ధ చిహ్నాలను ఆరాధించడం ప్రారంభమయింది. చైత్యా లంకరణ, చైత్యపూజ చైత్యకవాదుల ముఖ్య లక్షణాలు. ఈ విధంగా నైతిక ప్రవర్తనపై, స్వయంకృషిపై నొక్కి పెట్టిన బౌద్ధ దర్శనం స్థానిక పితృ దేవతా రాధన, విగ్రహారాధనలతో సమన్వయం పొంది పూజాపురస్కారాలతో ఆకర్ష ణీయమైన మతంగా పరిణమించింది. చైత్యకులలో పూర్వశైల (ధాన్యకటక) అపరశైల (శ్రీపర్వత) ఉత్తరశైల (జగ్గయ్యపేట?) రాజగిరిక (గుంటుపల్లి) సిద్ధార్థక (గుడివాడ) శాఖలేర్పడినాయి.

మహాసాంఘిక చైత్యక సిద్ధాంతాలే క్రమంగా మహాయానానికి దారితీసి నాయి. మహాయానానికి ప్రామాణికమైన ప్రజ్ఞాపారమితాశాస్త్రం ఆంధ్రబౌద్ధుల కృతమే. మహాయానాన్ని నిర్దుష్టమైన దర్శనంగా రూపొందించినది నాగార్జునా చార్యుడు.

బుద్ధుని అనంతరం బుద్ధునంతటి మహాదార్శనికుడైన నాగార్జునాచార్యుని జీవితాన్ని గురించి స్పష్టమైన పరిజ్ఞానం లేదు. అతడు విదర్భవాసి అనీ, కాంచీ పురి అతని జన్మస్థలమనీ వివాదాలు ఉన్నాయి. 'లంకావతార సూత్ర' ననుస రించి దక్షిణాపథంలోని వేదలి అతని జన్మస్థలం. తెలుగు బ్రాహ్మణులలో వేదుల వారున్నారు. చైనాలో ప్రచారంలో ఉన్న సంప్రదాయం ప్రకారం అతడు శ్రీపర్వత - ధాన్య కటకాలకు మధ్యనున్న గ్రామంలో జన్మించినాడు. బాల్యం లోనే వేదవేదాంగ విద్యలభ్యసించి బౌద్ధం స్వీకరించినాడు. అనంతరం దేశాటనం చేసి నాలందా మొదలైన విద్యా కేంద్రాల్లో బౌద్ధంమీద అపారవిజ్ఞానం సాధించి శ్రీపర్వతంలో స్థిరపడినాడు. ప్రజ్ఞాపారమితా శాస్త్రం ఆధారంగా అసాధారణ తార్కిక శక్తితో మాధ్యమికవాదం శూన్యవాదం ప్రతిపాదించి, మహాయానాన్ని స్వయంసంపూర్ణమైన సిద్ధాంతంగా రూపొందించినాడు. ప్రజ్ఞాపారమితశాస్త్రటీకా, మాధ్యమికకారికా, రత్నావళి, సుహృల్లేఖాది పలు గ్రంథాల నాతడు వ్రాసినట్లు ప్రతీతి. సుహృల్లేఖ నాతడు తన పోషకున కిచ్చిన సందేశం. నాటి శాతవాహన చక్రవర్తి శ్రీయజ్ఞ శాతకర్ణియై యుండవచ్చు. నాగార్జునునకై యజ్ఞశ్రీ శ్రీపర్వతంలో మహాచైత్య మహావిహారాలను నిర్మించినట్లు, ధాన్యకటక మహా చైత్యానికి శిలాప్రాకారాన్ని నాగార్జునుడు నిర్మించినట్లు టిబెటన్ ఐతిహ్యాలవల్ల తెలుస్తున్నది. భారతీయ తర్కశాస్త్రానికి నాగార్జునుడే పితామహుడనవచ్చు. అతని శూన్యవాదం శంకరుని మాయావాదానికి మార్గదర్శి. అందుచే భారతీయ సంస్కృతీ పరిణామంలో నాగార్జునునిది అద్వితీయమైన స్థానం.

కథా సరిత్సాగర గాథ విశ్వసనీయమే అయితే నాగార్జునుడొక కుట్రకు బలియైనాడు. అతని ప్రచారంతో బౌద్ధం క్రొత్తశక్తిని సంతరించుకొని విజృం భించడాన్ని సహింపలేని బ్రాహ్మణులు అతని హత్యకు కారణమై యుండవచ్చు.

అతని అనంతరం ఆచార్య పీఠాన్ని అలంకరించిన ఆర్యదేవుడు సయితం ఆంధ్రుడేకాని ఇతడు కూడ బ్రాహ్మణుల చేతుల్లో మరణించినాడు. వీరి ఆత్మార్పణ ఫలితమో అన్నట్లు ఇక్ష్వాకులు కాలంలో మహాయానం ఆంధ్రదేశంలో మూడుపూవులు ఆరుకాయలుగా విజృంభించింది.

**విద్యలు**

మతంలోవలెనే శాతవాహన యుగంలో విద్యల్లో, భాషల్లో విశేష పరిశ్రమ జరిగింది. సమకాలిక శక, చేది రాజులవలె శాతవాహనులు సయితం శబ్ద, అర్థ, గణక, న్యాయవ్యవహార, విధి, లేఖ, రూప, గాంధర్వ విద్యల్లో ప్రవీణులై యుండేవారు బహుశా బ్రాహ్మణగృహాలే గురుకులాలై యుండేవి. కంఠస్థం చేయడమే విద్యార్జనా విధానమై యుంటుంది. ఇక ప్రతి బౌద్ధ విహారము ఒక పెద్ద విద్యాలయం. ధాన్య కటక, శ్రీపర్వతాలలో విశ్వవిద్యాలయాలుండేవని, ధాన్యకటక విశ్వవిద్యాలయం నమూనాగానే లాసాలోని విద్యాలయం నిర్మాణమయిందని టిబెట్‌లో ప్రచారంలో ఉన్న సంప్రదాయం. బౌద్ధులు మత విద్యలతోబాటు తర్క, శబ్ద, జ్యోతిష, సాముద్రిక శాస్త్రాలలో పరిశ్రమ జరిపేవారు. 'రత్నావళీ-రాజపరికథ' అనే గ్రంథంలో నాగార్జునాచార్యుడు శ్రేయోరాజ్య సిద్ధాంతం ప్రతిపాదించినాడు. శ్రీపర్వతంలో నాగార్జునుడొక పెద్ద గ్రంథాలయాన్ని సేకరించినాడని ఫాహియాన్ వ్రాసినాడు.

శాతవాహనులు ప్రాకృతాన్ని రాజభాషగా కొనసాగించినారు. నాటి శాసనాలన్నీ ప్రాకృతభాషలోను, బ్రాహ్మీలిపిలోనూ ఉన్నాయి. బౌద్ధమత గ్రంథాలు చాలవరకు ప్రాకృతభాషలోనే వ్రాసుకున్నారు. ఆంధ్ర బౌద్ధులకు ప్రత్యేకించి వినయ, అభిధమ్మ పిటకాలు, దిఘ మజ్ఝిమనికాయలు ఉండేవి. ప్రతి విహారంలోను ధమ్మకథిక అనే ఉద్యోగి ఉండేవాడు; కథలద్వారా ధమ్మాన్ని ప్రచారంచేయడం ఈతని ధర్మమైయుంటుంది. ఆంధ్రదేశంలో జాతక, అవదాన కథలు బహుళప్రచారం పొందినట్లు అమరావతీ శిల్పాలు చాటుతున్నాయి.

ప్రాకృతభాషాచరిత్రలో వాస్తవానికి శాతవాహనయుగం స్వర్ణయుగం అనదగింది 'కవివత్సలు'డైన హాలుని ఆస్థానంలో పెక్కుమంది కవులు, కవయిత్రులు ఉన్నట్లాతడు సంకలనంచేసిన 'గాథాసప్తశతి' నుండి తెలుస్తుంది. గుణాఢ్యుడు కుంతల శాతకర్ణి ఆస్థానంలో బృహత్కథను పైశాచీభాషలో వ్రాసినాడని ఐతిహ్యం. బృహత్కథ రామాయణంతో సమానమైన కావ్యమని విమర్శకుల అభిప్రాయం. గాథాసప్తశతి, బృహత్కథ అనేక నూతన సారస్వత సంప్రదాయాలను సృష్టించి తరువాతి కవులకు మార్గదర్శకము లయినాయి. బృహత్కథ నష్టమైనది. కాని, అందలి ఒక్క లంబకమే కథాసరిత్సాగరానికి మాతృకయైనది. గాథాసప్తశతివల్ల నాటి ఆంధ్రులెంతటి శృంగారప్రియులో

తెలుస్తుంది. అమాయక గ్రామీణజీవితం, ప్రకృతితోడి ప్రజల సాన్నిహిత్యం సప్తశతిలో ప్రతిఫలిస్తున్నాయి.

కుంతలశాతకర్ణి ఆస్థానంలో గుణాఢ్య శర్వవర్మలనే విద్వత్కవులమధ్య జరిగిన వివాదాన్ని గురించి ప్రచారంలో ఉన్న కథనుబట్టి శాతవాహనయుగం లోనే ప్రాకృతం ప్రాధాన్యాన్ని కోల్పోయి ఆ భాషాస్థానాన్ని సంస్కృతం ఆక్ర మిస్తున్నట్లు గ్రహిస్తాము. నాటికే శకులు తమ శాసనాలను సంస్కృతంలో చేయించ సాగినారు. యజ్ఞశ్రీ కాలంలో ఉజ్జయిని నుండి వచ్చిన యాత్రికుడు అమరావతిలో వేయించిన శాసనభాషలో సంస్కృతభాషా ప్రభావం కన్పిస్తుంది. బాలశ్రీ నాసిక శాసనం ఆగమ పౌరాణిక సాహిత్యం విస్తారంగా పెరిగినట్లు సూచిస్తున్నది. శక సేనాని ఋషభదత్తుడు చేసిన దానాలు పౌరాణిక మహాదానాల లోనివే! ఈ విధంగా సంస్కృతం రాజాదరణ పొందినందువల్లనే కాబోలు- బౌద్ధులు సయితం తమ సిద్ధాంత గ్రంథాలను సంస్కృతంలో వ్రాయసాగినారు. నాగార్జున, ఆర్యదేవుల రచనలు సంస్కృతంలోనే ఉన్నాయి. నాగార్జునుని సుహృల్లేఖ జనాదరణ పొందింది. ప్రతి విద్యార్థి సుహృల్లేఖను కంఠస్థం చేస్తుం టాడని క్రీ.శ. 7వ శతాబ్దిలో చైనా యాత్రికుడు ఇత్సింగ్ వ్రాసినాడు. శర్వ వర్మ కాతంత్రవ్యాకరణం సంస్కృతాన్ని అభ్యసించడానికి మంచి సహాయకారి అయివుంటుంది.

ప్రాకృత సంస్కృతాలేగాక 'దేశి' అనే మరోభాష ఉన్నట్లు బృహత్కథ వల్ల తెలుస్తున్నది. సామాన్యప్రజలు వాడినదే దేశిభాష. ఇది నేటి తెలుగుభాషకు మాతృక అయివుంటుంది. గౌతమీపుత్రుని కాలంనుండి శాతవాహనుల వెండి నాణేలపై రెండు భాషల్లో పేర్లు కన్పిస్తున్నాయి. ఒకటి ప్రాకృతం. రెండోది 'దేశి'. ఈ అంశం వారి మాతృభాష తెనుగని సూచిస్తుంది. సప్తశతిలో పొట్ట, అత్త, తుప్ప (నేయి), వేంట (వత్తి), అద్దం మొదలైన అనేక దేశి పదా లున్నాయి; శాతవాహన రాజుల్లోని పులోమావి పేరు దేశీ పదమేనని చెప్పవచ్చు.

## వాస్తుశిల్పాలు

శాతవాహన యుగంలో ఆంధ్రదేశం గొప్ప శిల్పకళానిలయమయింది. నాటి వాస్తు శిల్పాలకు మతమే ప్రధానమైన ప్రేరకము. నాటి లౌకిక నిర్మాణాల అవశేషాలు లభ్యం కాలేదు. గాథా సప్తశతిలో గౌరి, గణేశ, ఇంద్రాది దేవతల ఆలయాల ప్రస్తావన ఉంది. ఇటీవల గుడిమల్లం (చిత్తూరుజిల్లా) లో జరిగిన త్రవ్వకాల్లో బయల్పడిన దేవాలయ శిథిలాలు శాతవాహన యుగానికి చెందినవనే అభిప్రాయం ఉంది. కాని నాటి ఆలయాల పూర్తి స్వరూపం గ్రహించడం కష్టం. ఇక నాటి వాస్తుశిల్ప రంగాల్లో ఆంధ్రుల ప్రతిభను గ్రహించడానికి

మిగిలింది బౌద్ధ నిర్మాణ శిథిలాలే. బౌద్ధుల నిర్మాణాలలో ముఖ్యమైనవి స్తూప చైత్యవిహారాలు. బౌద్ధయుగ ఆంధ్ర వాస్తు శిల్పాలలో మహారాష్ట్రలోని గుహావాస్తు శిల్పాల ప్రభావము, ఉత్తరాపథ, వాయవ్య భారతశిల్ప ప్రభావము కన్పిస్తాయి.

### స్తూపము

బుద్ధునివిగానీ ప్రసిద్ధ ఆచార్యులవిగానీ శారీరక అవశేషాలపైన నిర్మితమైన స్మారక చిహ్నాలే స్తూపాలు లేక చైత్యాలు. వీనిలో మూడు రకాలుండేవి. 1) ధాతు గర్భాలు; శారీరక అవశేషాలపై నిర్మించినవి. 2) పారిభోజకాలు : ఆచార్యులుపయోగించిన వస్తు గర్భితాలు 3) ఉద్దేశిక స్తూపాలు : ధాతువులు లేకుండా నిర్మించినవి....ఆంధ్రదేశంలో భట్టిప్రోలు, అమరావతి, జగ్గయ్యపేట, ఘంటసాల,శాలిహుండం స్తూపాలు చాల ప్రాచీనాలైన ధాతుగర్భాలు శ్రీపర్వత మహాచైత్యం యజ్ఞశ్రీ కాలంలో నిర్మించబడింది. ఇవిగాక ఆంధ్రదేశంలో అనేక చోట్ల స్తూపాలు వెలసినాయి. ఇవి ఇటుకల నిర్మాణాలు. వీని ఉపరితలంలో శిల్పాలతో నిండిన పాలరాతి పలకలు తాపడం చేసేవారు. ఆంధ్రదేశ స్తూపాలన్నింటిలో అమరావతి స్తూపం చాల అద్భుత నిర్మాణం. పునాదుల చెంత ఈ స్తూపం వ్యాసం 162 అడుగులు; దాని పైని ఆండం వ్యాసం 142 అడుగులు. అమరావతీ ప్రాకారం మనోహర శిల్ప సమన్వితం ఈ శిల్పాలకు బుద్ధుని జీవితంలోని పంచకల్యాణములు, బుద్ధ జాతక కథలు, సామాన్య జీవితదృశ్యాలు కథా వస్తువులు.కృష్ణా లోయలోని స్తూపాలలో చాలవాటికి నాల్గు దిక్కులందు వేదికలు, వానిపై ఐదేసి "ఆయక స్తంభములు" ఉండేవి ఇవి పంచకల్యాణాలను బుద్ధుని జననం, మహాభినిష్క్రమణం, సంబోధి, ధర్మచక్ర ప్రవర్తనం, మహాపరినిర్వాణం - సూచిస్తాయి. ఆంధ్రదేశంలో ఉద్దేశిక స్తూపాలు అనకాపల్లి చెంత సంఘరం లోని లింగాలమెట్టలో గుంటుపల్లిలో కన్పిస్తాయి.

### చైత్యగృహం

పూజావస్తువుగా చైత్యంగానీ బుద్ధవిగ్రహంకానీ ఉంది నిత్యార్చనకుపయోగించు ఆలయమే చైత్యగృహం లేక చైత్యాలయం. పశ్చిమదక్కన్‌లో కార్లా, నాసిక, కన్హేరి, బేడ్స మొదలైన చోట్ల గుహాలయాలను కొండలలో తొలిచినారు. వీనిలో కార్లా చాల అందమైన గుహాలయం. వీనిలో ఉద్దేశిక స్తూపం పూజావస్తువు. ఆంధ్రదేశంలో గుంటుపల్లిలో నిట్టచైత్యాలయంవుంది. ఇది చాల ప్రాచీనమయింది. సంకరంలో గుహాలయాలున్నాయి. ఇవిగాక ఇటుకలతో నిర్మాణములైన చైత్యాలయాలు గుంటుపల్లి, నాగార్జునకొండ, రామతీర్థం శాలిహుండం మొదలైనచోట్ల బయల్పడినాయి.

**విహారసంఘారామాలు**

వర్షాకాలంలో బౌద్ధభిక్షువుల నివాసానికి ఉద్దేశించినవి విహారాలు. ఒకే ఆవరణలో మూడునాల్గు విహారాలుండి అధ్యయన అధ్యాపనుల కనుకూలమైనది సంఘారామం. పశ్చిమ దక్కన్‌లో పెక్కు గుహావిహారాలున్నాయి. ఆంధ్ర దేశంలో గుంటుపల్లిలో గుహావిహారాలున్నాయి. ఇటుకలతో నిర్మాణములైన విహారాలు పలుచోట్ల బయల్పడినాయి వీనిలో శాలిహుండం, రామతీర్థం, నాగార్జున కొండ మొదలైన ప్రాంతములలోనివి సంఘారామాలని చెప్పవచ్చు. అనకాపల్లి చెంత నేటి సంకరం అనే గ్రామం 'సంఘారామం' మాటకు, బుద్ధాం 'బుద్ధారామా'నికి భ్రష్టరూపాలే సాధారణంగా ప్రతి సంఘారామంలోను ఐదు విభాగాలుండేవి. (1) మహాచైత్యము (2, 3) దాని ముందు ఇరువైపులా చైత్య గృహాలు. అందొకటి స్తూపచైత్యం, రెండోది బుద్ధచైత్యము (4) ప్రార్థన, విద్యాబోధనలకు వీలైన మంటపము. (5) ఈ నిర్మాణాలను పరివేష్టించి విహారములు. ఇట్టి సంఘారామాలు 40 వరకు ఆంధ్రదేశంలో ఉన్నట్లు హ్యూయాన్‌సాంగ్ పేర్కొన్నాడు. శ్రీపర్వతంపై యజ్ఞశ్రీ తొలిపించిన ఏడు అంతస్తుల మహావిహారంలో 1500 గదులుండేవని, గదులలోనికి వెలుతురు, గాలి బాహాటంగా రావటానికి ఏర్పాట్లుండేవని నీటిసదుపాయం కూడ చేసినారని పాహియాన్ వ్రాసినాడు. 8, 12, 13 సంఖ్యల అజంతా విహారాలు శాతవాహన యుగానికి చెందినవే.

**శిల్పము**

ఆంధ్రదేశంలో అనేక స్థూపాల నుండి శిల్పాలు లభించినాయి. అశోకుని కాలం నుండి ఆంధ్రదేశంలో స్థానికమైన శిల్పపద్ధతి పెంపొందినట్లు కన్పిస్తుంది. ఆంధ్ర శిల్పుల కౌశల్యం సాంచీస్తూప ద్వారతోరణాలలోను అమరావతీ నాగార్జునకొండ శిల్పాలలోను పరాకాష్ఠనందిందని పండితుల అభిప్రాయం. ఆంధ్ర బౌద్ధక్షేత్రాలన్నింటిలో అమరావతి సుప్రసిద్ధమైనందున, అమరావతీ స్తూపము నుండి లభ్యమైన శిల్పమునందలి పద్ధతులే ఇతరాంధ్ర స్థూపశిల్పములందు కూడ ప్రతిఫలించినందున బౌద్ధయుగ ఆంధ్రశిల్పమునకు 'అమరావతీ రీతి' అనే పేరు వచ్చింది. సాంచీ బార్హూత్ శిల్పములవలె కేవల దేశీయ సంప్రదాయములకనుగుణంగా తయారై అమరావతీ శిల్పమొక ప్రత్యేక నైపుణ్యాన్ని, ప్రశస్తమైన వ్యక్తిత్వాన్ని ప్రదర్శిస్తుంది. అందుచే 'అమరావతీ రీతి' అనే పేరు సార్థకమయింది. సాంచీ, బార్హూత్ శిల్పం గ్రామీణమైన ప్రకృతి సాన్నిహిత్యాన్ని ప్రదర్శింపగా, అమరావతీ శిల్పం నాగరికజీవిత వైలక్షణ్యాన్ని ప్రదర్శిస్తుందని విమర్శకుల అభిప్రాయం. బహుశా అందుకు కారణం ధనికులైన శ్రేష్ఠి గృహపతుల పోషణలో అమరావతీ శిల్పం తయారవడం కావచ్చు!

అమరావతీ శిల్పంలో రెండు దశలు స్పష్టంగా కన్పిస్తాయి. ప్రథమదశ శిల్పం కేవలం దేశీయమై సాంచీ, భిల్సా శిల్పానికి సన్నిహితంగా ఉంటుంది. రెండో దశ శిల్పంలో గాంధార శిల్పచ్ఛాయలు కన్పిస్తాయి. అయితే మార్షల్ పండితుడు చెప్పినట్లు తన వ్యక్తిత్వానికి దేశీయతకు భంగం రాకుండా ఆంధ్ర శిల్పి గాంధార శిల్ప సంప్రదాయాలను జీర్ణించుకున్నాడు. నాగార్జున కొండ, రామిరెడ్డిపల్లి, గోలి శిల్పాలలో చాలా భాగం రెండోదశకు చెందినవి.

అమరావతీ శిల్పంలో అవ్యక్తమైన సౌందర్యతృష్ణ, మానవత్వంలో ఆసక్తి గోచరిస్తుంది. అవయవ సౌష్ఠవాన్ని తీర్చిదిద్ది సహజ సౌందర్యాన్ని శిల్పంలో రూపొందించడమే ఆంధ్రశిల్పి ఆదర్శం. మనోగత భావాలను — ప్రేమ, కోపం, వాత్సల్యం, గర్వం, దయా, విషాదం—చిత్రించడంలో అమరావతీ శిల్పిది అగ్రతాంబూలం. స్త్రీ, పురుషుల శిల్పాలలోగానీ, పశుపక్ష్యాది శిల్పాల్లోగానీ స్తబ్ధత గోచరించదు. అమరావతీ శిల్పాన్ని దర్శించేటప్పుడు చైతన్యపూరితము, ఆదర్శప్రాయమున్నైన సౌందర్యలోకం ప్రత్యక్షమయినట్లు ఉంటుంది.

శిల్పంతోబాటు చిత్రలేఖనంకూడ ఉచ్ఛదశలో ఉండేది. అజంతా 10వ గుహలోని 'శ్వేతగజ జాతక' చిత్రం శాతవాహన యుగానిదే. ఆనాటి ప్రజలు రామాయణ భాగవతాది పురాణ గాథలను ఇండ్ల గోడలపై చిత్రించుకొనేవారని సప్తశతి వలన తెలుస్తున్నది.

## విదేశ సంబంధాలు - ఆంధ్ర సంస్కృతీవ్యాప్తి

ప్రాచీనకాలం నుండి ఆంధ్రులు నౌకాయానంలో ఆరితేరి విదేశాలతో సముద్రం మీదుగా వాణిజ్యం జరిపేవారు. ఆంధ్రదేశంలోని రేవుపట్టణాలు, అవి జరుపుతున్న వాణిజ్యం పైన వివరించినాము. వాణిజ్యంతోబాటు బర్మా, ఇండోనేషియా; సింహళాలతో ఆంధ్రదేశ సాంస్కృతిక సంబంధాలను నెలకొల్పుకున్నది; ఆయా ప్రాంతాలలో వలసలు స్థాపించినారు.

శాతవాహనుల కాలానికే బర్మాలో తలైంగులు 'రామన్నదేశం' అనే రాజ్యం స్థాపించినారు. వీరి రాజధానికి 'హంసవతి' (పెగూ) అని పేరు. దీనికి ఉత్తరంగా శ్రీక్షేత్రం లేక బనవాసిరాజ్యం ఏర్పడింది. క్రీ.శ. 5వ శతాబ్దిలో ఈ రాజ్యాన్ని శాన్‌లాన్‌క్రోం పాలించినాడు. ఈ పేరు వేంగిని పాలిస్తున్న శాలంకాయన పేరును తలపిస్తున్నది. ఈ వంశస్థులే బర్మాలో బౌద్ధమతం ప్రవేశపెట్టినారు అమరావతీ—నాగార్జునకొండ ప్రాంతంనుండే బౌద్ధం బర్మాలో ప్రచారమయిందని నీహారరంజనరాయ్ అభిప్రాయం, ప్రోంలోని కింబాగోన్ స్తూపశిల్పాలు అమరావతీ శైలిలో ఉన్నాయి; శాసనాలు వేంగీలిపిలో ఉన్నాయి.

బర్మాలో ప్రచారంలో ఉన్న "లోకతిష్య" అర్థకథకు తెలుగునాటి "కొల్లేటి దహన" కథకు భేదం లేదు.

మలయాలో విదేశీయులను 'క్లింగ్' అనడాన్ని బట్టి అచటికి కళింగదేశం నుండి ముఖ్యంగా 'పాలూరు' రేవుపట్టణంనుండి వలసవెళ్ళివుంటారు. పాలూరు గంజాం జిల్లాలో ఉంది. ఇది ఆంధ్రప్రాంతం. ఇదే బహుశా ప్రాచీన దంతపురి. శాన్‌కోలక్‌లో దొరికిన బుద్ధవిగ్రహాలు బుద్ధాం (బాపట్ల తాలూకా) విగ్రహాలను పోలినాయి. లిగర్ ఆలయాలకు ఉండవల్లి గుహాలయాలకు పోలికవుంది; ఇచట వేంగిలిపిలోని శాసనాలు దొరికినాయి.

అశోకుని కాలంనుండి ఆంధ్ర సింహళాలమధ్య రాకపోకలుండేవి. సింహళాన్ని సమైక్యంచేసి పాలించిన విజయుడు ఆంధ్రదేశంనుండి వడ్రంగులను రప్పించి నౌకలు నిర్మించుకున్నాడనే గాథ ప్రచారంలో ఉంది. దుత్తగామిని అనూరాధపురంలో నిర్మించిన స్థూప ఆవిష్కరణ సందర్భంలో కృష్ణాముఖ ద్వారంలోని 'పల్లవబొగ్గ' నుండి వేలకొలది బౌద్ధభిక్షువులు హాజరైనారని మహావంశ చెబుతున్నది. నాగార్జునకొండలో సింహళబౌద్ధులకు ప్రత్యేకించి సింహళ విహారం ఏర్పాటుచేయబడింది. ఆచార్య నాగార్జునుడు దర్శించిన నాగలోకం సింహళమని కొందరి అభిప్రాయం. ఆర్యదేవుని సింహళ రాజైన ఓహరతిస్స తన దేశానికి ఆహ్వానించి గౌరవించినాడట. ఆంధ్రదేశంనుండి దిగుమతియైన ప్రాకృతభాషలోనే సింహళంలో త్రిపిటకాలు వ్రాసుకొన్నారని ఓల్డెన్‌బర్గ్ అభిప్రాయం. నాగార్జునకొండలో సింహళవిహారము, మహావిహారవాసీ విహారము వున్నాయి. సింహళ ప్రభువు లీ విహారాలకు దానధర్మాలుచేశారు. వీరి ప్రోత్సాహంతోనే బుద్ధఘోషుడు (5వ శతాబ్దం) సింహళానికి వెళ్ళి పాళీగ్రంథాలను భారతదేశానికి తెచ్చివుంటాడు.

క్రీ.శ. ప్రథమ శతాబ్దిలో కౌండిన్యుడనే ఆంధ్ర బ్రాహ్మణుడు ఇండో చైనాలో ప్రవేశించి అచట సోమా అనే నాగరాణిని పెండ్లాడి కౌండిన్యసోమ వంశం స్థాపించినాడని ఐతిహ్యము. ఈ వంశస్థులు చంపా, కాంభోజ రాజ్యములను సయితం జయించి పాలించారు. కాంభోజదేశానికి తెలుగులో ప్రచారంలో ఉన్న కాంభోజరాజా కథకు సంబంధం పరిశీలింపవలసి ఉంది. ఈ రాజ్యాలనేలిన రాజుల పేర్లు వేంగి నేలిన శాలంకాయన విష్ణుకుండిన వంశాలలోని రాజుల పేర్లను బోలి ఉండేవి; వీరు 'ధర్మమహారాజాధిరాజ' బిరుదం ధరించినారు. వేదవేదాంగాది విద్యల నభ్యసించినారు. చంపారాజ్యం రాజధాని సింహపురం; విశాఖపట్టణం జిల్లాలో సింగుపురి ఉంది. ఇది మాఠర వంశానికి (క్రీ శ. 5వ శ॥) రాజధానిగా ఉండేది. చంపాలోని రాష్ట్రాలపేర్లు: అమరావతి, కౌఠార, విజయపురి,

పంగ్రదంగం. ఇవి అన్నీ ఆంధ్రదేశంలోని నగరాలపేర్లే: ఆయా ప్రాంతాలనుండి వలసవెళ్ళిన ఆంధ్రులు మాతృదేశంమీది అభిమానంతో తమ కొత్త స్థావరాలకి పేర్లు పెట్టుకొని వుంటారు. అమరావతీ రాష్ట్రంలో డాంగ్‌డుయాంగ్ చెంత దొరికిన బౌద్ధ విగ్రహాలు అమరావతీ శిల్ప రీతిలో ఉన్నాయి. శాసనాలు వేంగీ లిపిలో ఉన్నాయి. ఇచట శాలివాహన శకం అమలు జరిగింది. క్రీ.శ. పదో శతాబ్దిలో కాంభోజ రాజ్యాన్ని పాలించిన జయవర్మ తనను శ్రీశైలంతో పోల్చు కున్నాడు.

చంపా, కాంభోజరాజ్యాల ప్రజలు ఇండోనేషియా (జావా, బోర్నియో మొదలైన) దీవులకు వలస వెళ్ళినారు. జావాకు కళింగమని నామాంతరం. జావా రాజులు కూడ 'వర్మ' నామాంకితులే. వారిలో పురాణవర్మ గోసహస్రదానం చేసినాడు. జావాలోని బోరోబుదురు సుప్రసిద్ధ బౌద్ధ క్షేత్రానికి సంఘరంలోని లింగాలమెట్ట నమూనా అని కొందరి అభిప్రాయం. ఇచట శివకేశవులు ఆరాధింప బడినారు: హరిహరతత్వం ప్రచారమయింది. తెలుగుదేశంలోవలెనే 'తోలు బొమ్మలాట' ప్రజల ప్రధాన వినోదంగా ఉండేది.

ఈ విధంగా శాతవాహనయుగంలో సింహళంతోను, తూర్పుదేశాలతోను ఏర్పడిన వాణిజ్య సాంస్కృతిక సంబంధాలు రెడ్డి - విజయనగర రాజులయుగం వరకు కొనసాగినాయి.

## కొన్ని ఉపయుక్త గ్రంథాలు


1. Burgess : Buddhist Stupas of Amaravatı and Jaggayya-peta.
2. Hanumantha Rao B.S.L. : 1) Age of Satavahanas
   2) Religion in Andhra
3. Gopalachari K. : Early history of the Andhra Country.
4. Rama Rao M. : 1) శాతవాహన సంచిక
   2) Studies in the Early History of Andhra Desa
5. Sastry A.M. (ed) : Coinage of the Satavahanas.
6. Sastri K.A.N : History of South India.
7. Sıvarama Murty : Amaravati Sculpture.
8. Yazdani : Early History of Deccan.

# శాతవాహన అనంతరీకులు

శాతవాహన వంశం అస్తమించడంతో ఆంధ్రజాతికి వారు ప్రసాదించిన రాజకీయ సమైక్యం విచ్ఛిన్నమయింది. ఆంధ్రదేశం భిన్న ప్రాంతాల్లో భిన్న రాజవంశాలు చిన్న చిన్న రాజ్యాలు స్థాపించి సుమారు పదో శతాబ్దం వరకు పాలించినారు. తమ వంశం సుస్థిరంగా ఉన్న కాలంలోనే శాతవాహనులు వేర్వేరు ప్రాంతాలలో సామంత రాజవంశాలను నెలకొల్పినట్లు పురాణాలు చెబుతున్నాయి వారిలో ఆంధ్రులు, ఆభీరులు, ఆంధ్రభృత్యులు ముఖ్యులు. ఆంధ్రేతరులేగాక విదేశీయులైన ఆభీరులు పశ్చిమోత్తర దక్షిణాపథంలో ప్రబలులయినారు. శాతకర్ణి బిరుదం ధరించినందున చుటుకులులను ఆంధ్రశాతవాహన వంశశాఖగా పరిగణించవచ్చు. వీరు కర్ణాట దేశాన్ని పాలించినారు. ఇక శ్రీపార్వతీయ ఆంధ్రభృత్యపదాలు రెండూ మత్స్యపురాణంలో కన్పిస్తున్నందున ఆంధ్రభృత్యులే శ్రీపార్వతీయులుగా అంగీకరించవచ్చు. వీరు ఆంధ్ర సామ్రాజ్యానికి ఆయువుపట్టుగా నుండిన కృష్ణా ముఖద్వారానికి ఇరువైపులనున్న రాజ్యాన్ని ఆక్రమించి నాలుగైదు తరముల కాలం పాలించినారు.

## ఇక్ష్వాకులు

పురాణాలు పేర్కొన్న శ్రీపార్వతీయులను గుర్తించడం చాలకాలం వరకు కష్టసాధ్యమయింది. కాని నాగార్జునకొండ శాసనాల్లో శ్రీచాంతమూలుడు ఇక్ష్వాకు కులజుడని అతని రాజధాని అయిన విజయపురి శ్రీపర్వత పశ్చిమ పాదంలో ఉన్నదని పేర్కొనడం వల్ల శ్రీపార్వతీయులను గుర్తించడం సులభమయింది. శాతవాహనులను ఆంధ్రులని వర్ణించినట్లే శ్రీపర్వత ప్రాంతీయులైన ఇక్ష్వాకులను శ్రీపార్వతీయులుగా పురాణాలు వర్ణించినాయి.

### జన్మస్థలం

ఇక్ష్వాకుల జన్మస్థలాన్ని గురించి అభిప్రాయ భేదాలున్నాయి. నామసామ్యాన్ని బట్టి ఇతిహాస కాలంలో కోసల రాజ్యాన్ని పాలించిన ఇక్ష్వాకు వంశంతో శ్రీపార్వతీయులకు సంబంధం కలపడానికి ప్రయత్నించడం సహజం. అదిగాక విష్ణు పురాణము జైన ధర్మామృతము ఇక్ష్వాకు రాకుమారులు దక్షిణాపథానికి వలస వచ్చి రాజ్యాలు స్థాపించినట్లు చెబుతున్నాయి గదా!

అందుచేత శ్రీపార్వతీయులు ఉత్తరాపథం నుండి మౌర్యుల కాలంలోనో అంతకు పూర్వమో ఆంధ్రదేశానికి వచ్చినారని కొందరి మతము కాని శ్రీపార్వతీయులు తమ శాసనాల్లో ఉత్తరాపథం నుండి వచ్చినట్లుగా గాని తమకు కోసలాధీశులతో సంబంధం ఉన్నట్లుగా గాని చెప్పుకోలేదు. వీరి పేర్లలో కన్పిస్తున్న అడవిసిరి, ఖంద, చలికి, బాపి, అంక మొదలైనవి దాక్షిణాత్య భాషా పదాలు. అనార్య జాతుల్లో మేనత్త కుమార్తెను పెండ్లాడే అసంగ తాచారం ఉన్నట్లు బౌద్ధాయనుడు పేర్కొన్నాడు. శ్రీపార్వతీయ ఇక్ష్వాకు వంశంలో రెండవరాజు వీరపురిషదత్తుని ఐదుగురు రాణులలో నల్గురు అతని మేనత్తకుమార్తెలే. కాబట్టి వీరు దాక్షిణాత్యులేనని గ్రహించడం యుక్తం. అయితే వీరు కన్నడ దేశం నుండి వలన వచ్చినారని వోగెల్ పండితుడు, తమిళదేశం నుండి వచ్చినారని గోపాలాచారి భావించినారు. కాని కాల్డ్వెల్‌వంటివారు స్థానికులేనని నిర్ధయించినారు. ఇక్ష్వాకుల పేర్లలోని పై పదాలు తమిళ, తెలుగు కన్నడ భాషలకు మౌలికమైన ఆది ద్రావిడానికి చెందిన పదాలయినందున అవి కేవలం కన్నడానికి గాని తమిళానికిగాని చెందినవని భావింపనక్కరలేదు. అందుచేత కాల్డ్వెల్ వాదాన్ని అనుసరించి కృష్ణానది తీరానికి స్థానికులైన ఇక్షు చిహ్నాన్ని ఆరాధించే ప్రాచీన గణం వారై సంస్కృతీకరణ క్రమంలో ఇక్ష్వాకులై యుంటారనడం సమంజసంగా ఉంటుంది. కృష్ణాలోయ చెరకు పంటకు ప్రసిద్ధమే గదా! అదీగాక నాగార్జునకొండ శాసనం శాక్యమునియైన గౌతమ బుద్ధుడు ఇక్ష్వాకు వంశస్థుడని చెబుతున్నది! దీన్నిబట్టి శ్రీపార్వతీయులు స్థానిక గణజాతులలోని వారై బౌద్ధమతం ద్వారా సాంఘిక ప్రతిపత్తి సాధించి బుద్ధుని యందున్న ఆదరాభిమానాల వల్ల తాము ఇక్ష్వాకు వంశస్థులమని వర్ణించుకొని వుంటారు. శాతవాహన వంశం కడపటి రోజుల్లో చెలరేగిన మత విప్లవంలో బ్రాహ్మణ మతాభిమానులయి రాజకీయాధికారాన్ని హస్తగతం చేసుకున్నారు.

**విజృంభణ**

ఇక్ష్వాకులు శాతవాహనుల అనంతరం క్రీ. శ. 225 ప్రాంతంలో విజృంభించినారు. వీరిని పల్లవులు నిర్జించి వీరి రాజ్యం ఆక్రమించినారనడానికి గుంటూరు మండలంలో దొరికిన పల్లవుల మంచికల్లు, మైదవోలు శాసనాలు నిదర్శనం. ఇవి పల్లవుల ప్రథమ శాసనాలు. లిపి, భాషను బట్టి ఈ పల్లవ శాసనాలు క్రీ శ. 300 ప్రాంతానివి. అందుచే ఇక్ష్వాకులు క్రీ. శ. 225 - 300 మధ్య కాలంలో రాజ్యం చేసినారని నిర్ధయిస్తున్నారు.

పురాణాల ప్రకారం ఇక్ష్వాకు వంశంలో ఏడుగురు రాజులున్నారు కాని శాసనాలనుండి నల్గురు రాజుల పేర్లే లభ్యమవుచున్నాయి. వీరిలో వాసిష్ఠీపుత్ర శ్రీ ఛాంతమూలుడు ప్రథముడు. ఈతని పూర్వులు శాతవాహన రాజులకు

సామంతులుగా. మహాతలవర, మహాసేనాపతి మొదలైన పదవులు నిర్వహించి నారు. బౌద్ధమతస్థులయి వుంటారు బహుశా యజ్ఞశ్రీ అనంతరం స్వతంత్రులు కావడానికి ప్రయత్నించి విజయ శాతకర్ణికి లొంగి ఉంటారు చంద్రశ్రీ అనం తరం శాతవాహన వంశంలో వచ్చిన అంతఃపుర కలహాల్లో జోక్యం కలిగించు కొని తమ వంశ బలగౌరవాలను ఛాంతమూలుడు పెంచినాడు; శ్రీఛాంత మూలుని ఐదవ, ఎన్మిదవ రాజ్య వర్షాలలో ఇచ్చిన శాసనాలు రెంటాల, కేసాన పల్లి గ్రామాల్లో ఇటీవల దొరికినాయి. కాని ఈ శాసనాల్లో అతడు అశ్వమేధ వాజపేయాలు చేసినాడని లేదు. కాని అతని పుత్ర పౌత్రాదుల శాసనాల్లో ఈ యజ్ఞాల ప్రసక్తి స్పష్టంగా ఉంది. నాగార్జున కొండలో అశ్వమేధ వేదిక బయల్పడింది. అందుచేత శ్రీఛాంతమూలుడు కొంతకాలం శాతవాహన సామంతుడుగా వుండి నాలుగో పులోమావి బలహీనతను గుర్తించి స్వతంత్రుడై వుంటాడు. అనంతరం శాతవాహన సామంతులైన ధనక, పూగీయ వంశాలను కూడగట్టుకొని పులోమావిని పారదోలి ధాన్యకటక ప్రాంతం ఆక్రమించి అశ్వ మేధ వాజపేయాలు చేసి సార్వభౌమత్వాన్ని ప్రకటించి ఉంటాడు.

శ్రీఛాంతమూలుడు (క్రీ.శ. 225-245) మహావీరుడు. అప్రతిహత శాసనుడు. నేటి గుంటూరు, ప్రకాశం, కడప, కర్నూలు, నల్లగొండ, తూర్పు గోదావరి జిల్లాలు చేరిన పెద్దరాజ్యం స్థాపించి మహారాజ బిరుదం ధరించినాడు. పల్లవులు, బృహత్పలాయనులు, శాలంకాయనులు, ధనకులు, పూగీయులు అతని సామంతులు. మహావిజేతయేగాక శ్రీఛాంతమూలుడు రాజనీతివరుడు. సామంతరాజ వంశాలతోనూ పొరుగు రాజ్యాలతోను వివాహ సంబంధాల ద్వారా ఇక్ష్వాకు రాజ్యాన్ని బలపరచినాడు. తన సోదరి ఛాంతిసిరిని పూగీయుడైన మహా తలవర మహాసేనాపతి స్కందశ్రీకిని, కూతురు అడవిఛాంతిసిరిని ధనకుడైన మహాతలవర మహాసేనాపతి మహాదండనాయక స్కందవిశాఖునకు ఇచ్చి పెండ్లి చేసినాడు. అంతేగాక ఉజ్జయిని శకరాకుమార్తె రుద్రధరభట్టారికాను తన కుమారుడు వీరపురుషదత్తునకు పెండ్లి చేసినాడు బహుశా దక్షిణంగా తన రాజ్యంమీదకి అభీరవిస్తరణ నరికట్టడమే ఈ సంబంధం ఉద్దేశ్యమయివుంటుంది.

శ్రీఛాంతమూలుడు పరమవైదికుడు. శాతవాహన యుగాంతంలో చెల రేగిన బ్రాహ్మణ మతోద్ధరణ కాతడు నాయకత్వం వహించివుంటాడు. అగ్ని హోత్ర, అగ్నిష్టోమ, అశ్వమేధ వాజపేయాలు చేసి అనేక హిరణ్యకోటి శత సహస్రహలశతసహస్ర దానాలొనర్చినాడు. ఈ దానాలకు సాంఘిక, ఆర్థిక ప్రాధాన్యం చాలవున్నట్లు కన్పిస్తుంది. యజ్ఞి అయినప్పటికీ శ్రీఛాంతమూలుడు మహాసేన విరూపాక్షపతిభక్తుడు. నాగార్జున కొండలోయలో బయల్పడిన

మహాసేనాలయాలలో కొన్నింటిని శ్రీఛాంతమూలుడే నిర్మించివుంటాడు. ఈయన స్వతంత్రంగా ఇరవై సంవత్సరాలు పాలించినాడని చెప్పవచ్చు.

**వీరపురుషదత్త, (క్రీ.శ. 245-265)**

ఛాంతమూలుని కొడుకు వీరపురుషదత్తుడు ఇరవై సంవత్సరాలు రాజ్యం చేసినట్లు శాసనసాక్ష్యం ఉంది. ఈతడు యుద్ధాలు చేసినట్లుగాని, రాజ్యవిస్తరణ సాధించినట్లుగానీ నిదర్శనలు లేవు. అయితే వీరపురుషదత్తుడు తన కూతురు కొడబలిసిరిని వనవాస మహారాజైన శివస్కంధ నాగశాతకర్ణికిచ్చి పెండ్లి చేసినాడు. ఈతని 18 వ రాజ్యవర్షంలో రాజ్యంలో అల్లర్లు రేగినట్లు కన్పిస్తుంది వీరపురుషుని అత్తగారు అదే సంవత్సరంతో ఆతని ఆయుర్వృద్ధికి రాజ్యవృద్ధికి దానాలు చేసింది బహుశా అల్లర్లనణచి అతడు శాంతి నెలకొల్పి ఉంటాడు.

ఒక శిల్పశకలం ఆధారంగా వీరపురుషుడు బౌద్ధాన్ని అభిమానించి వైదిక మతాన్ని హింసించినాడని కొందరు వ్రాసినదాంట్లో సత్యం లేదు. ఆ శిల్పం మాంధాత జాతకంలోని భాగంగాని వీరపురుషుని జీవితానికి సంబంధించినదికాదు. వీరపురుషుని ఇష్టదైవం కాని మతంగాని ఏదో తెలియదు. కాని అతని పరిపాలనా కాలం ఆంధ్ర బౌద్ధ మతచంత్రలో సువర్ణ ఘట్టం. అతని రాణులు ఇతర అంతఃపుర స్త్రీలు పోటీపడి బౌద్ధమత సంస్థలకు దానధర్మాలు చేసినారు. వీర పురుషుని ఆరో రాజ్యవర్షంలో మహాచైత్యం పునరుద్ధరించి ఆయక స్తంభాలు నిలిపినారు. హీనయానులకు బుద్ధగయవలె మహాయానులకు శ్రీపర్వతం పుణ్య క్షేత్రమై దూరదేశాలనుండి యాత్రికుల నాకర్షించింది, వారికోసం సింహళ విహారం వంటి ప్రత్యేక వసతు లేర్పాటు చేసినారు. ఈ సందర్భంలో రాజభాండా రికుడైన బోధిశర్మ మేనగోడలు ఉపాసిక బోధిసిరిచేసిన దానధర్మాలు గమ నార్హాలు. తామ్రపర్ణ, కాశ్మీర, గాంధార, చీన, చిలాట, తోసలి, అపరాంత, వంగ, వనవాస యవన, ద్రమిళ, పాలూరాది రాజ్యాల్లో బౌద్ధధర్మ ప్రచారంచేసే భిక్షుకులకు శ్రీపర్వతంలో చుళధమ్మ గిరిపై చైత్యగృహంతోబాటు చతుశ్శాలను నిర్మించింది; కులహ విహారం దగ్గిర ఒక చైత్యాన్ని సింహళ విహారంలో బోధి వృక్షానికి వేదికను, మహాధమ్మగిరిపై గృహాన్ని, దేవగిరిపై ప్రార్థనశాలను పూర్వశైలంపై తటాక మంటపశాలలను, కంటకశైల మహాచైత్య ప్రాగ్ద్వా రంలో శిలా మంటపాన్ని, హితువముత్తుకద మూడుగదులను, పపిలికద ఏడు గదులను పుష్పగిరిపై శిలామంటపాన్ని భిక్షుసంఘాన్ని సమస్త ప్రపంచ సౌఖ్యాన్ని ఉద్దేశించి నిర్మించింది.

**ఎహువల ఛాంతమూల, (క్రీ శ. 265 - 290)**

ఎహువల ఛాంతమూల వీరపురుషునకు బహుశా భట్టిదేవులయందు జన్మించి వుంటాడు. ఈతడు 25 సం॥ రాజ్యం చేసినాడని చెప్పవచ్చు. ఎహువలుని

కాలం శాసనంలోను వీరపురుషుని కాలంనాటి శాసనంలోను 'విజయ' పదం కన్పిస్తుంది. ఇది విజయనామ సంవత్సరమనీ ఆ సంవత్సరాలు క్రీ॥ శ॥ 274 - 334 అని, తండ్రీ కొడుకుల మధ్య అరవై సంవత్సరాల వ్యత్యాసం ఉందనీ డి.సి. సర్కార్‌వాదం. అంతేగాదు, నాగార్జునకొండలో ఆభీరవసుసేనుని సేనాని శివసేనుని శాసనం ఉంది. ఇది వసుసేనుని 30 వ రాజ్యవర్షం నాటిది. ఈ తేదీ త్రైకూటక శకానికి సంబంధించినదనీ అందుచే క్రీ॥ 279 నాటిదనీ నాగార్జునకొండలో ఇక్ష్వాకు అధికారానికి పది సంవత్సరాలు (క్రీ. శ. 275-285) గ్రహణంపట్టి ఆభీరులు రాజ్యం చేసినారనీ అందుచేత ఇక్ష్వాకు అధికారం క్రీ. శ. 335 ప్రాంతంలో అంతరించిందనీ సర్కార్ సిద్ధాంతం. ఇది చాలా అసంగతమైన సిద్ధాంతం. పై శాసనంలో ఆభీరులు ఇక్ష్వాకులను జయించినట్లు లేదు. అందులో సంజయపురి యవన శక కుమారుడు, అవంతి శకరుద్రదాముడు వనవాసీ విష్ణురుద్ర శివలానంద శాతకర్ణి కూడ కన్పిస్తున్నారు. శక, వనవాసి ప్రభువులు ఇక్ష్వాకుల మిత్రులు ఎహువలుని రాణుల్లో వమ్మభట్టాదేవి క్షాత్రప రాకుమారి; బహుఫలస గోత్ర కుటుంబం నుండి వచ్చింది. ఈ అంశం కూడా శకులు ఎహువలునికి మిత్రులేగాని శత్రువులు కాదని రుజువు చేస్తున్నది. వీరందరూ కలిసి విజయ పురిపై దండెత్తడంగాని ఇక్ష్వాకుల అధికారం క్రీ॥ శ॥ 335 వరకు కొనసాగడంగాని నాటి దాక్షిణాత్య చరిత్రకు విరుద్ధములైన అంశాలు.

కందారరాజు చేజర్ల శాసనంలో ధాన్యకటక యుద్ధంలో తన తాత ఆంధ్ర సుందరీమణులకు వైధవ్యం కలిగించి గజఘంటలను దోచుకున్నట్లు చెప్పినాడు. ఈ యుద్ధం ఇక్ష్వాకులకు ఆనంద గోత్రజులకు జరిగిందని ఒక సూచన. కానీ క్రీ॥ శ॥ 350 తర్వాతనే ఆనందగోత్రజులు అధికారంలోకి వచ్చినట్లు కన్పిస్తుంది.

ఎహువలుని కాలంలో పల్లవులు తిరుగుబాటు చేసినారని, వారిని అణచడంలో అతనికి సహాయార్థమై పై శాసనంలోని ప్రభువులందరు విజయపురిలో ప్రత్యక్షమైనారని కొందరి అభిప్రాయం అయితే ఆ శాసనంలో ఎహువలుని ప్రస్తావన లేకపోవడానికి కారణం కన్పించదు. ఆభీరులు అతణ్ణి జయించిన సూచనకూడ లేదు.

ఎహువలుని కాలంలో నాగార్జునకొండ లోయలో ఒకవైపు బౌద్ధ సంస్థలు మరొకవైపు బ్రాహ్మణ ఆలయాల నిర్మాణము విరివిగా జరిగింది. దేవికొడ బలిసిరి మహాశాసకులకై ఒక విహారం నిర్మించింది. సేనాని ఎలిసిరి కుమార స్వామికి సర్వదేవాధివాసం నిర్మించినాడు. రాకుమారుడైన వీరపురుషదత్తుడు పుష్పభద్రుడనే పేర శివాలయం నిర్మించినాడు ఒక అంతఃపురాంగన నొడగిరి

సామికి దాన ధర్మాలు చేసింది. ఈతని కాలంనుండి శాసనాల్లో సంస్కృతం వాడడం ప్రారంభమయింది; మాతృసంజ్ఞ ధరించినప్పటికీ శాసనాల్లో పితృ పితామహ ప్రపితామహులను పేర్కొనే ఆచారం కూడ కన్పిస్తున్నది.

## రుద్రపురుషదత్త (క్రీ. శ. 290 - 300)

ఎహువలుని అనంతరం అతని కుమారుడు రుద్రపురుషదత్తుడు పది సంవత్సరాలకు పైగా రాజ్యం చేసినాడు. ఈతని శాసనాలు నాగార్జునకొండ, గురజాలల్లో దొరికినాయి తెలిసినంతవరకు ఈతడే చివరి ఇక్ష్వాకురాజు.

ప్రాచీన పల్లవులలో ఆద్యుడని పరిగణిస్తున్న సింహవర్మ శాసనం విజయపురి సమీపంలో మంచికల్లు దగ్గిర దొరకింది; శాసనలిపి నాగార్జునకొండ శాసనలిపిని పోలివుంది. విజయార్థమై జీవశివస్వామికి శాంతి స్వస్త్యయనములు చేయించి అచటి త్రైర్థికులకు కంబళ్ళు దానం చేసినట్లు సింహవర్మ చెప్పు కొన్నాడు. దీన్నిబట్టి సింహవర్మ విజయపురిపై దండెత్తి ఇక్ష్వాకు వంశాన్ని తుదముట్టించి విజయపురిని ధ్వంస మొనర్చినాడని భావించవచ్చును.

సింహవర్మ కుమారుడైన శివస్కంధవర్మ మైదవోలు శాసనంవల్ల ధాన్య కటకంలో వల్లవవ్యాపృతుడు (రాష్ట్రపాలుడు) ఉన్నట్లు తెలుస్తున్నది. అందుచేత ఇక్ష్వాకులనుండి గుంటూరు మండల ప్రాంతాన్ని పల్లవులు క్రీ. శ. 300 ప్రాంతంలో ఆక్రమించినారని స్పష్టమగుచున్నది.

## బృహత్పలాయనులు
## (క్రీ. శ. 300 - 325)

ఇక్ష్వాకు వంశం అంతరించడంతో కృష్ణానదికి దక్షిణ ప్రాంతం పల్లవుల స్వాధీనమయినది. కృష్ణా ఉత్తర ముఖద్వారంలో బృహత్పలాయనులు విజృంభించినారు ఎహువలుని రాణి బహపలస గోత్రజురాలని పేర్కొన్నాము. 'బహపలస' అనే ప్రాకృతపదం బృహత్పలాయనస అనే సంస్కృత పదానికి భ్రష్టరూపం దీనివల్ల బృహత్పలాయనులు శకులైనట్లు తెలుస్తుంది. వీరు ఇక్ష్వాకులకు సామంతులై వుంటూ వారు బలహీనులు కావడంతో స్వతంత్ర రాజ్యం స్థాపించుకున్నారు.

ఈ వంశచరిత్రకు ఒకే ఒక కొండముది తామ్రశాసనం ఆధారం. ఆ శాసనం ఒకే రాజును, జయవర్మ మహారాజును పేర్కొంటున్నది. ఈ శాసనం భాషాలిపులను బట్టి క్రీ.శ. మూడో శతాబ్ది మధ్యభాగానికి చెందినదిగా కన్పిస్తుంది; బహుశా శివస్కంధవర్మ దాక్షిణాత్య రాజకీయాల్లో నిమగ్నుడై

యుండగా జయవర్మ కర్మరాష్ట్రాన్ని సయితం ఆక్రమించి ఉండవచ్చును. ఇతనికి కోడూరు రాజధాని అయివుంటుంది.

జయవర్మ బ్రాహ్మణ మతాభిమాని. మహేశ్వరు డితని ఇష్టదైవము. కూడూర హారములోని పంతూర గ్రామమును బ్రహ్మదేయముగా ఎనమండుగురు బ్రాహ్మణుల కిచ్చినాడు పల్లవుల ప్రోత్సాహంతో బ్రాహ్మణం విజృంభిస్తున్నదనీ బౌద్ధమత పరాజయం చేరువలో ఉన్నదనీ కొండముది శాసనం స్పష్టం చేస్తున్నది. జయవర్మ మరణానంతరం దక్షిణాంధ్రాన్ని పల్లవులు, కృష్ణామండల ప్రాంతాలను శాలంకాయనులు ఆక్రమించినారు.

## శాలంకాయనులు

ఇక్ష్వాకుల పతనానంతరం ఉత్తరతీరాంధ్రంలో అధికారం వహించిన వారిలో శాలంకాయనులు ప్రసిద్ధులు. వీరు చాల ప్రాచీనులవలె కన్పిస్తున్నారు. మైసోలియా (కృష్ణాప్రాంతం) దేశంలో బెన్‌గౌరా (వేంగిపుర) చెంత సాలెంకినాయ్ (శాలంకాయనులు) ఉన్నట్లు టాలెమీ క్రీ.శ. 130 వ్రాసినాడు. పెరిప్లస్ పేర్కొన్న మజరిక వీరి రాజ్యంలోనిదే అని కొందరి అభిప్రాయం. శాలంకాయన అంటే నంది అని అర్థం శ్రీపార్వతీయులవలెనే శాలంకాయనులు కూడ ప్రాచీనాంధ్రగణాలలోని వారై వుంటారు. శాతవాహనులకు సామంతులై క్రమంగా బలవంతులయినారు.

శాలంకాయన అనేది గోత్రనామం, శైవమతాభిమానులని వారి వృషభ లాంచనంవల్ల తెలుస్తుంది. కాని చిత్రరథస్వామి పాద భక్తులు. చిత్రరథస్వామి సూర్యుడా లేక శివుడా అనే అనుమానం వుంది. బ్రాహ్మణమతాన్ని, వైదిక కర్మలను ప్రోత్సహించినారు. శాతవాహన, ఇక్ష్వాకులవలె మాతృసంజ్ఞలు ధరించక బప్పభట్టారక పాదపద్మములను ధ్యానిస్తూ పితృ పితామహ ప్రపితామహులను తమ శాసనాల్లో వర్ణించినారు. సమకాలికులైన పల్లవులకు వీరికి పోలికలున్నందున వీరు పల్లవవంశ శాఖ అనే అభిప్రాయం ఉంది. కాని, అందులో సత్యం లేదు.

శాలంకాయనుల చరిత్రకు వారి పది శాసనాలు ఆధారాలు. వీనిలో మూడు ప్రాకృతంలో ఉన్నాయి. ఒకటి సంస్కృత ప్రాకృత మిశ్రమం. మిగిలినవి సంస్కృతంలో ఉన్నాయి. కొన్ని శాసనాలు ఒకే రాజును పేర్కొంటున్నాయి. ఈ శాసనాలన్నీ చాల సంక్షిప్తంగా ఉండినందువలన మూడు శాసనాలు నాల్గు తరాలను పేర్కొంటున్నప్పటికి రాజకీయ సంఘటనలను ప్రస్తావించనందున వీరి వంశవృక్షాన్ని కాలాన్ని నిర్ణయించడంలో భిన్న అభిప్రాయాలకు అవకాశం ఏర్పడింది.

## శాసనాలు

(1) కానుకొల్లు ప్రాకృత శాసనం

మహారాజ నందివర్మ
|
బాలక మహారాజ నందిపొత్త

(2) ఏలూరు పాకృత శాసనం

విజయదేవవర్మ

(3) కానుకొల్లు సం. శాసనం

హస్తివర్మ
|
నందివర్మ
|
హస్తివర్మ
|
స్కంధవర్మ

(4) పెదవేగి శాసనం

హస్తివర్మ
|
నందివర్మ I
|
చండవర్మ

నందివర్మ II

(5) కొల్లేరు శాసనం

చండవర్మ
|
విజయనందివర్మ

(6) కంతేరు శాసనం

నందివర్మ

(7) కంతేరు శాసనం

విజయస్కంధ వర్మ

(8) దారికాటూరు శాసనం

యువమహారాజ అచండవర్మ

(9) పెనుగొండ శాసనం

హస్తివర్మ

(10) గుంటుపల్లి శిలాశాసనం

రెండో నందవర్మ

శాలంకాయనుల స్వతంత్రాధికారాన్ని స్థాపించినది హస్తివర్మ. క్రీ.శ.320 ప్రాంతంలో ఈతడు విజృంభించి వుంటాడు. శాసనాలీతణ్ణి నానాప్రకారవిజయస్య (గుంటుపల్లి) అనేక సమరావాప్త విజయ (పెదవేగి) సమరముఖ నిర్మాత కర్మ (కానుకొల్లు సం॥) ధర్మమహారాజ (గుంటుపల్లి) అని వర్ణిస్తున్నాయి. ఈ వర్ణన ననుబట్టి ఈతడు వేంగిప్రాంతంలోని ఇక్ష్వాకు సామంతులనందరను నిర్జించి శాలంకాయన రాజ్యాన్ని విస్తరింపజేసినట్లు తెలుస్తుంది.

అలహాబాద్ ప్రశస్తిలోని వైగేయక హస్తివర్మ ఈతడే. సముద్రగుప్తుని దండయాత్ర కాలంలో (క్రీ. శ. 345 ప్రాంతం) తీరాంధ్రంలో వేంగితోబాటు అనేక చిన్న రాజ్యాలున్నట్లు తెలుస్తుంది. మహాకాంతార కోసల రాజ్యాలను జయించి సముద్రగుప్తుడు కళింగలో ప్రవేశించినాడు. కళింగలో కొత్తూర, ఏరండపల్ల, పిష్టపుర, దేవరాష్ట్ర రాజ్యాలుండేవి. అవముక్త కృష్ణాతీర రాజ్యమని

కొందరి అభిప్రాయం.దానికి దక్షిణంగా కుశస్థలపురం ఉండిఉంటుంది.పాలక్కడ అనేది పులికాటేనని చాలమంది గుర్తిస్తున్నారు. ఈ రాజ్యాల రాజులతో బాటు హస్తివర్మను, కంచినేలుతున్న విష్ణుగోపుని జయించి సముద్రగుప్తుడు వెనుకకు మరలినాడని అలహాబాద్ శాసనం చాటుచున్నది. కాని దాక్షిణాత్య రాజులందరూ కూటమిగా నేర్పడి సముద్రగుప్తు నెదిరించిరని, వారి బలాన్ని గుర్తించి సముద్ర గుప్తుడు వెనుదిరిగి పోయెనని ఒక అభిప్రాయం. ఏమైనను సముద్రగుప్తుని దండ యాత్రవల్ల దక్షిణదేశంలో రాజకీయ వైపరీత్యాలు పెద్దగా జరిగినట్లు కన్పించదు.

హస్తివర్మ కుమారుడు నందివర్మ (350 - 385) కానుకొల్లు ప్రాకృత శాసనం ఇచ్చిన మహారాజు. ఈతడు స్వప్రతాపానీతాహితవర్మ (కానుకొల్లు సం.) సముద్రగుప్తుని దండయాత్ర నవకాశంగా తీసుకొని తిరుగుబాటుచేయ సంకల్పిం చినవారి నణచి కృష్ణానదికి దక్షిణంగాకూడా రాజ్యవిస్తరణ జరిపి పాలించినాడు. కాని నందివర్మ ధార్మికచింతన పరుడు. వివిధ ధర్మ ప్రధానస్య (వేదవేగి), అర్జితధర్మస్య, గోసహస్ర ప్రదాయి (గుంటుపల్లి) అని శాసనాలు వర్ణిస్తున్నాయి. కానుకొల్లు ప్రాకృత శాసనంలోని ఖండపొత్త నందివర్మ పౌత్రుడు (పొత్త) రెండో హస్తివర్మ కుమారుడు (కానుకొల్లు సం; కంతేరు శాసనాలు) అయివుండ వచ్చు. బాల్యంలో అతడు అస్వస్థుడయినందున అతని అయురారోగ్యాలనర్థించి శాపానుగ్రహశక్తి యుక్తులైన విప్రులకు దానంచేసినట్లు పైశాసనం చెబుతున్నది.

నందివర్మ వయసు, ధర్మచింతన, దేశంలోని అలజడి అవకాశంగా తీసు కొని బహుశా అతని సోదరుడు దేవవర్మ సింహాసనం ఆక్రమించినాడు. పోరా టంలో నందివర్మ మరణించివుండవచ్చు. తన విజయసూచకంగా దేవవర్మ అశ్వమేధం చేసి విజయదేవవర్మగా సింహాసనం ఆక్రమించినాడు. కాని నంది వర్మ కుమారుడు అచండవర్మ,దేవవర్మను ప్రతిఘటించి,పోరాటం సాగించినాడు. అచండవర్మ యువమహారాజుగా 35వ రాజ్యసంవత్సరంలో ధారికాటూరి శాసనం ఇచ్చినాడు; ఇది నందివర్మ రాజ్య సంవత్సరమై ఉంటుంది. కాని ఆ విషయం అందులో స్పష్టంగా లేదు. అందుచే నందివర్మ నాటికే మరణించియుండవచ్చు. ఈ అంతర్యుద్ధంవల్ల శాలంకాయనుల ప్రతిష్టకు భంగం కలిగింది. దేవవర్మ 15 సంవత్సరాల పాలన అనంతరం అచండవర్మ తిరిగి రాజ్యం హస్తగతం చేసు కున్నాడు. కాని అతని సోదరుడు రెండో హస్తివర్మ జాజ్‌పురంలో స్వతంత్రు డయినట్లు కన్పిస్తుంది. జాజ్‌పురం తూర్పు గోదావరి జిల్లాలోనిదై యుంటుంది. తన పెనుగొండ శాసనంలో హస్తివర్మ తాను నారాయణ పాదారవిందభోపగుణి తుడనని చెప్పుకున్నాడు.

అచణ్డవర్మ (400-420) అనంతరం అతనికుమారుడు విజయనన్దివర్మకు రెండో హస్తివర్మ కుమారుడు విజయస్కంధవర్మకు మధ్య తిరిగి అంత్యర్యుద్ధం

ప్రాప్తించినట్లు కన్పిస్తుంది. ఈ ఉభయుల శాసనాలు కృష్ణానదికి దక్షిణంగా కర్మ రాష్ట్రంలో కన్పించినాయి. అంతర్యుద్ధంలో విజయనందివర్మ విజయం సాధించి శాలంకాయన రాజ్యం సమైక్యం చేసినాడు. శాలంకాయను లందరిలో ఈతని శాసనాలే ఎక్కువ లభించినాయి.

నందివర్మ విజయం తాత్కాలికమే అయింది. ఉత్తరాన పిష్టపురంలో మాఠరులు, కర్మరాష్ట్రంలో విష్ణుకుండులు బలవంతులై శాలంకాయనులతో పోరాడ సాగినారు. శత్రువర్గం పరివేష్టించిన శాలంకాయన రాజ్యం క్రీ.శ. 5 వ శతాబ్ది మధ్య ప్రాంతంలో అదృశ్యమయింది.

శాలంకాయనులలో విజయనందివర్మ చివరివాడు. ఈతడు పరమ భాగవతుడు. గుంటుపల్లిలోని బౌద్ధక్షేత్రానికి దానధర్మాలు చేసినాడు మొదటి నందివర్మను వివిధ ధర్మ ప్రధానస్య అని వర్ణించినారు. దీన్నిబట్టి ఆంధ్రదేశంలో బుద్ధ, విష్ణుదేవుల సమన్వయం పురోగమిస్తున్నట్లు తెలుస్తుంది.

## ఆనందగోత్రజులు

శాలంకాయనులకు ఇంచుమించు సమకాలికులుగా కృష్ణానదికి దక్షిణంగా కర్మ రాష్ట్రంలో ఆనందగోత్రజులు పాలించినారు. వీరి రాజధాని కందారపురం. ఇది ప్రస్తుతం గుంటూరు సమీపంలోని కంతేరని, చేబ్రోలని, చేజర్ల అని వేరు వేరుగా గుర్తించినారు. చేబ్రోలు, చేజర్లవలె కంతేరుకూడ ప్రాచీన గ్రామమే ననడానికి ఆధారాలు ఉన్నాయి కందారపురం కంతేరు అని రూపాంతరం చెందడానికి ఎక్కువ అవకాశం ఉంది. అందుచేత కంతేరే ఆనందగోత్రజుల కందారపురంగా నిర్ణయించడం సమంజసం. కందారరాజు మూలపురుషుడయి నందున కందారపురం రాజధాని అయినందున వీరిని కందారరాజులనడం కూడ ఉంది.

కందారరాజుల చరిత్రకు మూడు శాసనాలు ఆధారం. అవి : (1) అత్తివర్మ గోరంట్ల తామ్రశాసనం. (2) దామోదరవర్మ మట్టెపాడు తామ్రశాసనం. (3) కందారరాజు దౌహిత్రుని చేజర్ల శిలాశాసనం. ఈ శాసనాల కాలాన్ని గురించి ఇందలి రాజుల పరస్పర సంబంధాలను గురించి తీవ్రమైన అభిప్రాయ భేదాలున్నాయి. గోరంట్ల శాసనంలో అత్తివర్మ 'హిరణ్యగర్భోద్భవ' అని చెప్పుకున్నాడు. మట్టెపాడు శాసనంలో హిరణ్యగర్భోద్భవోద్భవ అని దామోదర వర్మ చెప్పుకున్నాడు. అందుచే అత్తివర్మ దామోదరవర్మ తండ్రియనికాని, పూర్వీకుడనీగాని గ్రహించవచ్చు. కాని మట్టెపాడు శాసనంలోని దానగ్రహీతల పేర్లు ప్రాకృతంలో ఉన్నందున ఆ శాసనమే మొదటిది అని కొందరి అభిప్రాయం. అయితే అత్తివర్మ అనే రూపం హస్తివర్మకు ప్రాకృతం కదా!

అత్తివర్మ పూర్వుడు, దామోదరవర్మ తరువాతివాడు అవుతారు గదా! చేజర్ల శాసనం ఆరో శతాబ్దం చివరిది. ఇది ఆనందగోత్రజులది కాదు అనే బలమైన అభిప్రాయం ఉంది. ఆ శాసనాన్ని ఇచ్చిన వ్యక్తి కందారరాజుకు చాల దూరపు బంధువై పల్లవ సామంతుడుగా నున్న స్థానిక ప్రభువై యుండవచ్చు!

ఈ శాసనాల్లో కందారులు తాము కపిష్ఠలజులమని చెప్పుకున్నందున వీరు కూడ ప్రాచీనాంధ్ర గణాల్లోని వారై వుంటారు. ఆనందగోత్రసంభూతులమని, త్రికూటపర్వతాధిపులమని, కందారపురం రాజధానిగా రెండు జనపదాలు ఏలినామని చెప్పుకున్నారు. త్రికూటపర్వతం నేటి కోటప్పకొండగా చరిత్రకారులు గుర్తిస్తున్నారు. ఈ కొండ వీరి రాజ్యానికి ఆయువుపట్టు వంటిదై వుంటుంది.

సముద్రగుప్తుని దండయాత్ర (క్రీ.శ. 345) అనంతరం శాలంకాయన పల్లవ అధికారాలకు కొంత అలజడి కలిగిన సమయంలో కర్మరాష్ట్ర ప్రాంతంలో ఆనంద గోత్రజులు విజృంభించినారని చెప్పవచ్చు. చేజర్ల శాసనంలోని కందారరాజు వీరి వంశకర్త. ఈతడే బహుశా కందారపురాన్ని నిర్మించి రాజధానిగా చేసుకున్నాడు. ధాన్యకటక యుద్ధంలో ఆంధ్రరాజు నోడించి గజఘటలను సంగ్రహించినట్లు చెప్పుకున్నాడు ఈ ఆంధ్రరాజు బహుశా శాలంకాయనుడయి వుంటాడు (నందివర్మ ?).

కందారరాజు అనంతరం దక్షిణాన పల్లవులు ఉత్తరంగా తిరిగి శాలంకాయనులు (దేవవర్మ ?) విజృంభించినందున కందారుల అధికారానికి నష్టం సంభవించింది. తరువాత శాలంకాయన వంశంలో వచ్చిన అంతర్యుద్ధాన్ని అవకాశంగా తీసుకొని కందారుల అధికారాన్ని అత్తివర్మ పునరుద్ధరించినాడు. అత్తివర్మ హిరణ్యగర్భ ప్రసవుడనని వంకేశ్వర నామాంకిత శంభు భక్తుడనని చెప్పుకొన్నాడు.

దామోదరవర్మ అత్తివర్మ కుమారుడో అతని సంతతివాడో స్పష్టంగా చెప్పలేము. కందారులలో చివరివాడు సమ్యక్సంబుద్ధ పాదపద్మారాధకుడు; అయినా బ్రాహ్మణులకు అగ్రహారాలిచ్చి మన్నించినాడు.

ఆనందగోత్రజులు పల్లవ శాలంకాయన విష్ణుకుండి వంశాలతో తరచు పోరాడవలసి వచ్చింది. విష్ణుకుండులు (మూడో మాధవవర్మ) త్రికూటమలయాధిపులమని వర్ణించుకొన్నాడు. మూడో మాధవవర్మ అమరపురి నుండి పాలించినాడు. అమరపురి నేటి వేల్పూరు అయివుంటుంది. వేల్పూరు సయితం త్రికూట పర్వత ప్రాంతంలోనే ఉంది. ఈ ప్రాంతాన్ని బిరుదంతో కూడ విష్ణుకుండులు కందారుల నుండి సంగ్రహించినారని చెప్పవచ్చు. ఇది బహుశా ఆరో శతాబ్ది పూర్వార్థంలో జరిగింది.

## కళింగరాజ్యాలు

మహానదీ గోదావరి ముఖద్వారాల మధ్య తీరప్రాంతాన్ని స్థూలంగా కళింగ దేశంగా పర్ణించవచ్చు. తొలి శాతవాహనులకు సమకాలీకులుగా కళింగను చేది (సద) రాజవంశస్థులైన మహామేఘ వాహనులు పాలించినారు. ఈ వంశాన్ని గురించి పైన అధోజ్ఞాపికలో వ్రాసినాము. వీరిలో సుప్రసిద్ధుడు ఖారవేలుడు (క్రీ.పూ. 178-150). ఇతని తండ్రి ఐహూణా వక్రదేవుడు.


ఉదయగిరి కొండల్లోని హాతిగుంఫా ప్రాకృత శాసనాన్ని బట్టి ఖారవేలుని చరిత్ర తెలుస్తుంది. అతడనేకమార్లు దిగ్విజయ యాత్రలు చేసినాడు. తూర్పు తీరాంధ్రాధిపత్యానికై శాతవాహనులకు ఆతనికి మధ్య తీవ్ర సంఘర్షణ జరిగినట్లు కన్పిస్తుంది. ఖారవేలుని రెండోరాజ్య సంవత్సరంలో శాతకర్ణిని లక్ష్యపెట్టక అతని సైన్యాలు కణ్ణబెణ్ణ (కృష్ణవేణి) వరకు పురోగమించి మసిక (మస్కి) నగరాన్ని అలజడి పరచాయి. కాని ఈ దాడిలో తనకు విజయం లభించినట్లు ఖారవేలుడు చెప్పుకొనలేదు. అందుచే శాతకర్ణి అతణ్ణి ఓడించి మరలించి వుంటాడని చెప్పవచ్చు. తిరిగి శాతకర్ణి మరణానంతరం ఖారవేలుడు దాడులు సాగించినాడు. తన నాలుగో పాలనా సంవత్సరంలో భోజకులను వశపరచుకున్నాడు; పదకొండో సంవత్సరంలో ప్రిథుడ నగరాన్ని ధ్వంసంచేసి గార్దభ లాంగలాలతో దున్నించినాడు. ప్రిథుడ నగరాన్ని టాలెమీ మైసోలియాలోనిదిగా పేర్కొన్న పిటుంద్ర నగరంగా నిర్ణయిస్తున్నారు. పిటుంద్ర వస్త్రపరిశ్రమకు వాణిజ్యానికి కేంద్రమని టాలెమీ వర్ణన. ఈ వర్ణన భట్టిప్రోలుకు సరిపోతుంది. ఈ దాడులవలన తీరాంధ్రం ఖారవేలుని రాజ్యంతో చేరింది.

ఖారవేలుని తరువాత అతని సంతతివారిని గురించి తెలియదు. కళింగలో అధికారం క్షీణించడంతో సదవంశస్థులు తీరాంధ్రానికి మరలి చిన్న రాజ్యాలు స్థాపించుకున్నారు చివరి శాతవాహనులు వీరిని తుదముట్టించినారు. కళింగలో అధికభాగం గౌతమీపుత్ర శాతకర్ణి రాజ్యాంతర్భాగమైనట్లు నాసిక్ ప్రశస్తి స్పష్టం చేస్తున్నది. శాతవాహనుల అస్తమయంతో కళింగదేశంలో చిన్న చిన్న రాజ్యా లేర్పడినాయి. సముద్రగుప్తుని దండయాత్ర సమయంలో కొత్తూరులో స్వామి-దత్త, ఏరండపల్లి (ఆముదాలవలస) లో దమన, దేవరాష్ట్రాన్ని కుబేర, పిష్ఠపురాన్ని మహేంద్ర (గిరి) పాలిస్తున్నట్లు అలహాబాద్ ప్రశస్తి చెబుతున్నది. దేవ రాష్ట్రం ఎలమంచిలి (విశాఖజిల్లా) ప్రాంతం; పిష్ఠపుర తూర్పుగోదావరి జిల్లాలోని పిఠాపురం. క్రమంగా దేవరాష్ట్రము, పిఠాపురము రెండు ప్రధాన రాజ్యాలకు కీలకమయినాయి. మరొక రాజ్యానికి సింహపురం రాజధాని అయింది. శ్రీకాకుళం నరసన్నపేటల మధ్యనున్న నేటి సింగుపురమే సింహపురం. ఈ రాజ్యాల రాజులు కళింగాధిపులనే బిరుదు ధరించి కళింగదేశాన్ని సమైక్యం

చేయడానికి ప్రయత్నించినారు. కొందరు సకల కళింగాధీశ బిరుదం ధరించినారు. ఈ ప్రయత్నాల వలన వీరు పరస్పర యుద్ధాల్లో మునిగి తేలినట్లు కన్పిస్తుంది.

## సింహపురీశులు

సింహపురి రాజధానిగా మూడు తరాల రాజులు పాలించినారు. వీరి శాసనాల ముద్రలలోని 'పితృభక్త' అన్న వాక్యాన్నిబట్టి కొందరు వీరిని పితృభక్త వంశీయులని వ్యవహరిస్తున్నారు. వీరివి ఆరు శాసనాల వరకు లభించినాయి. అవి : ఉమవర్మ ఇచ్చిన ధవళపేట, తెక్కలి, బృహత్ప్రోష్ఠ శాసనాలు; చండవర్మ తిరెదాన, కోమర్తి శాసనాలు; నంద ప్రభంజనవర్మ చికకోలు శాసనం. కాని ఈ శాసనాలవల్ల వీరి చరిత్రలోని విశేషాలు తెలియడంలేదు. ఈ వంశంలో ఉమవర్మ ఆద్యుడు. ముప్పది సంవత్సరాలు రాజ్యం చేసినాడు (350-380 ప్రాంతము). అతని కుమారుడు చండవర్మ 'సకల కళింగాధిపతి' బిరుదం ధరించినాడు (380-400). ఈ వంశంలో చివరివాడు నందప్రభంజనవర్మ (400-420). ఇతడు సైతం 'సకల కళింగాధిపతి' బిరుదం దాల్చినాడు. ఈతని అనంతరం సింహపుర రాజ్యాన్ని మాఠరులు జయించి ఆక్రమించినారు.



## మాఠరులు

పిష్ఠపురంలో మాఠరులు అధికారంలోనికి వచ్చినారు. వీరికి, అలహాబాద్ ప్రశస్తిలోని మహేంద్ర (గిరి)కు ఉన్న సంబంధం తెలియదు. వీరి చరిత్రకు నాల్గు శాసనాలు ఆధారం: (1) శక్తివర్మ రాగోలు శాసనం (2) ప్రభంజనవర్మ నింగొండి శాసనం (3, 4) అనంతశక్తివర్మ శకునక, అంథవరం శాసనాలు.

నింగొండి శాసనాన్ని అనుసరించి శంకరవర్మ మాఠరరాజ్య స్థాపకుడు. అతని కుమారుడు వాసిష్ఠీపుత్ర శక్తివర్మ; ఈతడు ధరించిన మాతృసంజ్ఞనుబట్టి మాఠరులకు, దేవరాష్ట్రాన్ని పాలిస్తున్న వాసిష్ఠులకు వైవాహిక సంబంధాలున్నట్లు తెలుస్తుంది. శక్తివర్మ కళింగాధిపతి బిరుదం ధరించినాడు; మహానదీ కృష్ణవేణీ మధ్యస్థ రాజ్యాధినేతగా నింగొండి శాసనం ఇతణ్ణి వర్ణిస్తున్నది కాని,అది కేవలం అతిశయోక్తి మాత్రమే. ఇతని కుమారుడు ప్రభంజనవర్మ; పౌత్రుడు అనంత శక్తి వర్మ. ఈతడు సింహపురీశులైన పితృభక్తులను జయించి వారి రాజ్యం ఆక్రమించినట్లు తెలుస్తుంది. అనంతశక్తివర్మ తన శకునక శాసనాన్ని సింహపురం నుండి ఇచ్చినాడు. కళింగాధిపతి బిరుదం ధరించి ముప్పది సంవత్సరాలకు పైగా (క్రీ. శ. 400-435) రాజ్యం చేసినాడు. బహుశా ఈతని అనంతరం దేవపురాధీశులైన వాసిష్ఠులు మాఠరులను జయించి పిష్ఠపురాన్ని ఆక్రమించినారు. వాసిష్ఠ అనంతవర్మ పిష్టపురం తన అధిష్ఠానంగా చెప్పుకున్నాడు.

## వాసిష్ఠులు

వాసిష్ఠుల రాజధాని దేవపురి. విశాఖపట్టణం జిల్లాలో శృంగవరపు కోట తాలూకా దేవాడయే దేవపురియని నిర్ణయిస్తున్నారు. వీరిని గురించిన సమాచారం అనంతవర్మ శృంగవరపుకోట, శింపురం శాసనాలనుండి లభ్యమవుతున్నది. గుణవర్మ (క్రీ శ. 300-375) వీరి మూలపురుషుడు. అతనికి దేవరాష్ట్రాధీశుడనే బిరుదం ఉంది. ఇతని కుమారుడు మహారాజ ప్రభంజనవర్మ (క్రీ.శ. 375-400) ఈ వంశంలో తెలిసినంతవరకు సుప్రసిద్ధుడు చివరివాడు అనంతవర్మ (క్రీ శ. 400-450). ఈతడు మాఠరుల నోడించి వారి రాజ్యం ఆక్రమించి పిష్ఠపురాన్ని రాజధానిగా చేసుకున్నాడు. ఇతని అనంతరం వాసిష్ఠులు ఎంతకాలం పిష్ఠపురంలో రాజ్యపాలన చేసినారో స్పష్టంగా చెప్పలేము.

## పృథ్వీమూలరాజు

పృథ్వీమూలశ్రీ మహారాజు శాసనాలు ఐదు లభించినాయి. ఇవి తామ్రశాసనాలే మొదటిది గోదావరీ శాసనం; రెండోది అతని కొడుకు హరివర్మ ఇచ్చిన కట్టుబడిపు శాసనం మిగిలిన మూడు శాసనాలు ఇటీవల గుంటూరు జిల్లా కొండపీడులో బయల్పడినట్లు తెలుస్తుంది. విష్ణుకుండి రెండో విక్రమేంద్రుని

తుమ్మలగూడెం శాసనం పృథ్వీమూలవంశంలో జన్మించిన పరమభట్టారికా మహాదేవిని ప్రస్తావిస్తున్నది. పృథ్వీమూలుడు నాటి విష్ణుకుండి చరిత్రలో ప్రముఖ పాత్రను నిర్వహించినాడనడానికి ఈతని కొండపీడు శాసనాలు నిదర్శనం.

కట్టచెరువుశాసనంలో ఈ వంశం రాజధాని గుణపాశపురం అనే సూచన ఉంది. ఇది తూర్పుగోదావరి జిల్లాలోని రాజోలుతాలూకా అదుర్రు అని నిర్ణయిస్తున్నారు. ఈ వంశం పేరుమాత్రం తెలియదు. మూడు తరాల రాజులను మాత్రం శాసనాలు పేర్కొంటున్నాయి పృథ్వీమూలుని తండ్రి ప్రభాకరమహారాజు, తాత మూలరాజు.

మూలరాజు విష్ణుకుండి గోవిందవర్మ సమకాలికుడయి వుంటాడు. బహుశా తన కూతురు పరమభట్టారికను గోవిందవర్మ కిచ్చి పెండ్లిచేసినాడు. ఈ బాంధవ్యంవల్ల ఉభయవంశాలకు లాభం చేకూరినట్లుంది. అతని కుమారుడు ప్రభాకర మహారాజు విష్ణుకుండి మాధవవర్మకు సామంతుడై రాజ్యపాలన నిర్వహించినాడు. ప్రభాకరుని కుమారుడు పృథ్వీమూలరాజు.

పృథ్వీమూలుడు చిరకాలం రాజ్యంచేసినట్లు శాసనాలు చూచిస్తున్నాయి. విష్ణుకుండి ఇంద్రవర్మకు వ్యతిరేకంగా ఏర్పడిన కూటమితో జరిగిన చతుర్దంత యుద్ధంలో విజయం సాధించి సహసేనాని అయిన అధిరాజ ఇంద్రుని అభ్యర్థనపై విజయకాండలి స్కంధావారం నుండి తానుపాక విషయంలోని చూయిపాక గ్రామాన్ని అథర్వవేద బ్రాహ్మణులకు దానంచేసినట్లు ఈతని గోదావరీశాసనంలో నమోదయింది. అనంతరం ఇంద్రభట్టారకుని కుమారుడు రెండో విక్రమేంద్రవర్మతో చేరి పల్లవులతో పోరాడినట్లు తుమ్మలగూడెం (2) శాసనం సూచిస్తున్నది. రెండో విక్రమేంద్రవర్మ రణదుర్జయులతో చేసిన యుద్ధంలో అతనితోపాటు పృథ్వీమూలుడు సయితం మరణించి వుంటాడు.

పృథ్వీమూలుడు, అతని తండ్రి ప్రభాకర మహారాజు బ్రాహ్మణ మతాభిమానులు. శ్రుతి స్మృతి విహితంగా వర్ణాశ్రమ ధర్మాలను రక్షిస్తూ పాలించినారు. దేవబ్రాహ్మణ గురుభక్తులు. పృథ్వీమూలుడు తాను పరమబ్రహ్మణ్యుడనని పరమమాహేశ్వరుడనని ధర్మ విజయినని చెప్పుకున్నాడు. కాని జైన బౌద్ధ మతాల పట్ల అభిమానం వహించి దాన ధర్మాలు చేశాడు. పృథ్వీమూలుని కుమారుడు హరివర్మ బౌద్ధ మతస్తునివలె కన్పిస్తాడు. హరివర్మ అదుర్రులో విహారం నిర్మించి దానికి తండ్రి నుండి పొందిన కట్టుచెరువు గ్రామాన్ని సమర్పించాడు. తాడికొండలో (గుంటూరు జిల్లా) శాక్యభిక్షు విహారం నిర్మించాడు. పృథ్వీమూలుడు గుణపాశపురంలో లోకవిఖ్యాత మహావిహారం నిర్మించి అట్టలువుడ గ్రామం దానం చేశాడు; శాక్యభిక్షు విహారానికి తంగోడునారువు అనే భూమిని, వర్ధమానపురంలోని మహామేఘ వాహన విహారానికి కల్వచెరువుం

గ్రామాన్ని దానం చేశారు. ఈ విధంగా పృథ్వీమూలునిలో సర్వమత సమతా దృష్టి కన్పిస్తుంది. ఇక్కడ గొప్ప బౌద్ధక్షేత్రమయినట్లు అచట లభించిన స్తూప విహార శిథిలాలవల్ల స్పష్టమవుతున్నది. పృథ్వీమూలునకంటె ముందుగానే హరి వర్మ గతించినట్లు కొండపేడు శాసనాలు సూచిస్తున్నాయి. పృథ్వీమూలుని అనంతరం ఈ ప్రాంతాన్ని బహుశా పిష్టపురపాలకులైన రణదుర్జయు లాక్ర మించి వుంటారు.

## కళింగ గంగ వంశం

క్రీ. శ. ఐదో శతాబ్దానికి కళింగాంధ్రలో గంగవంశ రాజుల పాలన ప్రారంభమయింది. వీరి జన్మస్థలాన్ని గురించి, కళింగలో వీరి రాజ్యస్థాపనను గురించి స్పష్టమైన సమాచారం లేదు. క్రీ. పూ 4 వ శతాబ్దంలో గంగా ముఖ ద్వారంలో 'గంగాండే' జాతి నివసిస్తున్నట్లు మెగస్తనీస్ పేర్కొన్నాడు. మోడో కళింగలో గంగజాతి ఉన్నట్లు ప్లినీ రచనలవల్ల తెలుస్తుంది. బౌద్ధవాఙ్మయంలో దంతపురం గంగులకు ముఖ్యపట్టణం అని వుంది. అందుచేత గంగులు కళింగ ప్రాంతాలకు స్థానికులై యుండవచ్చుననే అభిప్రాయం కలుగుతుంది.

అయితే ఇంచుమించు కళింగ గంగులు విజృంభించునాటికే ఉత్తరమైసూరు లోని గంగవాడిలో నొక గంగవంశం అధికారంలోకి వచ్చింది. కళింగ గంగులను తూర్పుగంగులని, మైసూరువారిని పశ్చిమగంగులని వ్యవహరిస్తారు ఉభయుల మధ్య చాల వ్యత్యాసం కన్పిస్తుంది. పశ్చిమగంగులు సూర్యవంశరాజులు; కాణ్వాయన గోత్రులు, జైన మతాభిమానులు. తూర్పుగంగులు చంద్రవంశస్థులు. ఆత్రేయ గోత్రులు. పరమమాహేశ్వరులు ఐతే వీరిమధ్య కొన్ని సామ్యాలు కూడ లేకపోలేదు పశ్చిమగంగుల మిత్రులైన కదంబులు కళింగలో మహేంద్ర భోగవిషయం పాలిస్తూ తూర్పు గంగులకు సామంతులుగా ఉన్నారు. తూర్పు గంగుల కులదైవం గోకర్ణమహేశ్వరుడు. గోకర్ణం గాంగవాడిలోనే ఉంది. కళింగ గంగవంశం కథలలో కొల్హాపుర ప్రశస్తి కన్పిస్తుంది. ఇది మైసూరులో కోలారని నిర్ణయం. కాబట్టి తూర్పు గంగులు పశ్చిమగంగ వంశ శాఖయేననీ వారిమధ్య కన్పించే విభేదాలన్నీ కాలక్రమంగా వారు పాలించే రాజ్య వాతావరణాల ననుసరించి ఏర్పడినాయని నిర్ణయించవచ్చును. అయితే ఈ గంగ వంశాల వారు మెగస్తనీస్, ప్లినీలు పేర్కొన్న గంగజాతులు ఒక్కరో కారో, ఒక్కరే అయినచో వారెప్పుడు ఏ విధంగా దక్షిణాదికి వలస వచ్చినారో నిర్ణయించటం సాధ్యంకాదు.

తూర్పు గంగులను ప్రాచీన గంగులని, అర్వాచీన గంగులని రెండు శాఖ లుగా విభజించటం కద్దు ప్రాచీన గంగుల చరిత్ర పూర్తిగ ఆంధ్రదేశ చరిత్రలో అంతర్గతం. అర్వాచీన గంగులు చాలవరకు ఉత్కళాధీశులే!

ప్రాచీన గంగుల శాసనాలు ముప్పదికి పైగా లభించినాయి. కాని వీనిలో రాజుల పేర్లు, వారి దానధర్మాలు మాత్రమే సోదయినాయి; నాటి రాజకీయ చరిత్రను గ్రహించడానికివి ఉపకరించవు. అయితే ఈ శాసనాలలో ఒక వైశిష్ట్యం ఉంది. ఇవి అన్నీ గాంగ శకానికి చెందినవి. ఇంతవరకు మనం పేర్కొన్న శాసనాలు రాజుల రాజ్యకాలం ఉదాహరించినవేగాని ఏ శకం తేదీలను ఉదాహరించలేదు. గంగవంశ స్థాపకుడైన ఇంద్రవర్మ తన పాలనా కాలాన్ని ఉదహరిస్తూ శాసనాలు వేయించినాడు. అతని సంతతివారు సయితం అతని పాలనా కాలాన్నే పేర్కొనడంతో గాంగశకం ఉదయించింది. గాంగశకం క్రీ. శ. 496/7 తో ప్రారంభమయిందని నిర్ణయిస్తున్నారు. (ఆచార్య వి. వి. మిరాషీ). అయినచో కళింగలో గంగరాజ్య స్థాపన అదే సంవత్సరంలో జరిగిందని వేరే చెప్పనక్కరలేదు.

కళింగ గంగవంశానికి మూలపురుషుడు ఇంద్రవర్మ. పృథ్వీమూలుని గోదావరి శాసనంలోని ఇంద్రాధి రాజీతదేననే అభిప్రాయం సరియైనది కాదని నిర్ణయమయింది. ఈతడు ఏ విధంగా కళింగను ఆక్రమించిందీ స్పష్టంగా నిర్ణయించలేము. దంతపురం రాజధానిగా రాజ్యం స్థాపించినాడు. దంతపురాన్ని శ్రీకాకుళం జిల్లాలో వంశధార నదిపైనున్న దంతవక్త్రుని కోటగా గుర్తిస్తున్నారు. ఈతడు మాఠరులు మొదలైన కళింగ రాజుల నందరని నిర్మూలించి త్రికళింగాధిప బిరుదం దాల్చినాడు. విష్ణుకుండి విక్రమేంద్రవర్మ బలహీనుడు కావడం ఇంద్రవర్మకు మంచి అవకాశమై వుంటుంది. ఇతని తరువాత 'జయశ్రీనివాసుడైన' మహా సామంతవర్మ (క్రీ శ. 560) గంగుల ప్రతిష్ఠ నినుమడింపజేసినాడు. అనంతరం పేర్కొనదగినవాడు రాజసింహ రణభీత బిరుదాంకితుడైన హస్తివర్మ. ఈతని ఉర్లాం శాసనం (క్రీ.శ. 576) ప్రకారమీతడాగ్రామాన్ని గ్రామస్థుల నుండి విక్రయించుకొని అగ్రహారంగా చేసి జయశర్మకు ఇచ్చినాడు. బహుశా హస్తివర్మ కుమారుడైన రెండో ఇంద్రవర్మ (క్రీ శ. 553-570) రాజధానిని దంతపురి నుండి కళింగనగరానికి మార్చినాడు. కళింగనగరాన్ని వంశధారానదీ ముఖద్వారంలోని కళింగపట్టణంగా (ఫ్లీట్), ముఖలింగంగా (శ్రీరాళ్ళబండి సుబ్బారావు) గుర్తిస్తున్నారు. రెండో ఇంద్రవర్మ శాసనాలు మూడు లభించినాయి. (అచ్యుతాపురం, శాంతబొమ్మలి, పర్లాకిమిడి). ఈతడు సకలకళింగాధిపతి బిరుదం ధరించినాడు.

రెండో ఇంద్రవర్మ అనంతరం గంగవంశంలో కుటుంబకలహాలు జరిగినట్లు కన్పిస్తుంది. రెండో ఇంద్రవర్మకు ఇద్దరు కుమారులు. రెండో కొడుకు దానార్ణవుడు. దానార్ణవుని కొడుకు ఇంద్రవర్మ. పెద్దకొడుకు పేరు తెలియదు కాని, అతని కొడుకు పేరు సయితం ఇంద్రవర్మ అని తెలుస్తుంది. ఇద్దరు ఇంద్ర

వర్మల మధ్య సింహాసనానికై పోరాటం జరిగి దానార్ణవుని కొడుకు నాలుగో ఇంద్రవర్మ సింహాసనం ఎక్కినాడు. బహుశా ఈ అంతర్యుద్ధ కాలంలోనే కళింగపై చాళుక్యపులకేశి దండెత్తి, దక్షిణకళింగ ప్రాంతాల నాక్రమించినాడు. క్రమంగా తూర్పు గంగులు తూర్పు చాళుక్యుల విస్తరణ నరికట్టలేక ఎలమంచిలి, విశాఖపట్టణం మొదలైన ప్రాంతాలను వారికి కోల్పోవడమేగాక చాళుక్య సామంతులై పదో శతాబ్దివరకు తలనెత్తలేక పోయినారు. తూర్పు చాళుక్యులు వేంగీదేశం 'త్రికళింగసహితం' పాలించినట్లు చెప్పుకున్నారు.

## విష్ణుకుండివంశం

శాతవాహనాస్తమయానికి (క్రీ.శ. 225) చాళుక్యోదయానికి (క్రీ శ. 615) మధ్యకాలంలో ఆంధ్రదేశాన్ని పాలించిన రాజవంశాలలో విష్ణుకుండులు సుప్రసిద్ధులు. సుమారొక శతాబ్దకాలం కృష్ణా నర్మదానదుల మధ్య ప్రభువులై ప్రజలపై సార్వభౌమాధికారం నెరపి రాజకీయంగా సాంస్కృతికంగా పెక్కు నూతన సంప్రదాయాలు నెలకొల్పినారు.

విష్ణుకుండుల శాసనాలు ప్రస్తుతానికి పది లభించినాయి. అవి (1) గోవింద వర్మ తుమ్మలగూడెం శాసనం; (2, 3, 4, 5) మాధవవర్మ ఈపూరు, ఖానాపూర్ పొలమూరు తామ్రశాసనాలు, వేల్పూరు శిలాశాసనం. వీనిలో పొలమూరు (పొలుంబూర్) శాసనం కృతకం (spurious) అనీ, విశ్వాసయోగ్యం కాదనీ బలమైన అభిప్రాయం ఉంది. ఈ శాసనానికి తూర్పు చాళుక్య జయసింహవల్లభుని (క్రీ.శ. 642-673) పొలమూరు శాసనానికీ భాషలో పదజాలంలో లిపిలో చాల సాన్నిహిత్యం ఉంది. దానం చేసిన గ్రామంకూడ ఒకటే. మాధవవర్మ వాస్తవానికి యిటువంటి శాసనమే ఇచ్చివుంటే దాన్ని చూడకనే జయసింహుని కాలంలో దానికి నకలు తయారు చేసి యుండవచ్చునని కొందరి అభిప్రాయం. (6) రెండో మాధవవర్మ ఈపూరు శాసనం; (7) ఇంద్రవర్మ రామతీర్థశాసనం; (8, 9, 10) విక్రమేంద్రభట్టారకవర్మ తుండి, చిక్కుళ్ళ, తుమ్మలగూడెం శాసనాలు. తుమ్మలగూడెం శాసనాలు ఇటీవలనే బయల్పడినాయి. వీనిని ఇంద్రపాలనగర శాసనాలనికూడ అంటారు. విక్రమేంద్ర భట్టారకుని తుమ్మలగూడెం శాసనం మిగిలిన వానికంటె సమగ్రంగా ఉండడమేగాక క్రీ.శ. 566 (శా శ. 488)లో ఇచ్చినట్లు స్పష్టంగా ఉన్నందున విష్ణుకుండి చరిత్రకు కాలనిర్ణయానికి చాల ఉపకరిస్తున్నది.

ఈ పది శాసనాల్లో కూడ విష్ణుకుండి చరిత్రను సమగ్రంగా పునర్నిర్మించడానికి అనుకూలమైన సమాచారం లేదు. అందుచే విష్ణుకుండి చరిత్రలో అనేక వాదోపవాదాలున్నాయి. వారిపేరు, జన్మభూమి, వారి శ్రీపర్వతస్వామి, కులము, వంశవృక్షము మొదలైన అంశాలపై చరిత్రకారులలో ఏకాభిప్రాయం లేదు.

'విష్ణుకుండి' పదం వినుకొండ (గుంటూరు జిల్లా) కు సంస్కృతీకరణమని అది వారి ప్రథమనివాసమని కీల్‌హారన్ పండితుని సూచన. కాని వేల్పూరు శాసనాన్ని బట్టి విష్ణుకుండి అనేది గోత్రనామమని తెలుస్తున్నది. ఏమైనా విష్ణుకుండులకు వినుకొండతో సంబంధం లేకపోలేదని చాలామంది చరిత్రకారుల విశ్వాసం.

విష్ణుకుండులు త్రికూటమలయాధిపులమని, అమరపురీశులమని చెప్పుకొన్నారు. త్రికూటం సహ్యాద్రులలోనిదని అమరపురి అమ్రోత్ అని అందుచే వీరు మహారాష్ట్ర ప్రాంతం నుండి వలసవచ్చినారనే కొందరి అభిప్రాయంతో ఇప్పుడు ఏకీభవించేవారు లేరనే చెప్పవచ్చు. 'త్రికూట మలయాధిప' బిరుదాన్ని విష్ణుకుండులు కందారరాజులనుండి గ్రహించినారని తెలుస్తున్నది. త్రికూట మలయం కోటప్పకొండేగాని వేరేమీకాదు.

ఇక అమరపురని అమరావతిగా కె వి లక్ష్మణరావుగారు చేసిన నిర్ణయాన్ని నేటికీ అంగీకరిస్తూ అదే ఇంద్రపాల నగరమని భావించేవారున్నారు. కాని మొదటి విష్ణుకుండులకు అమరావతితో సంబంధం ఉన్న నిదర్శనములు లేవు; అయినా నాటికి అమరావతి అని పేరు వాడుకలో లేదు. ధాన్యకటక నామమే ప్రసిద్ధము. అమరావతీ పదం పందొమ్మిదో శతాబ్దినుండి మాత్రమే వాడుకలోనికి వచ్చినట్లు తెలుస్తుంది. కాబట్టి ధాన్యకటకమని శతాబ్దాల తరబడి ప్రసిద్ధమైన పేరుండగా కొత్తగా అమరపుర అనిగాని ఇంద్రపాల నగరమనికాని వాడినారని భావించటం సమంజసం కాదు. అయితే సత్తెనపల్లి తాలూకాలో నేటి వేల్పూరును అమరపురిగా గుర్తించడానికి అవకాశం ఉంది. వేల్పూరు చాల ప్రాచీన గ్రామమనీ,బౌద్ధక్షేత్రమనడానికి అక్కడ ఇక్ష్వాకులిపిలో దొరికిన శాసనాలే నిదర్శనం. వేల్పు (అమర) ఊరు (పురి) అనే మాటకు సంస్కృతమే అమరపురి! అదే ఇంద్రపాల నగరమై వుంటుంది. విష్ణుకుండులలో సుప్రసిద్ధుడైన మాధవవర్మ శిలాశాసనం వేల్పూరులో ఉన్నట్లు చెప్పినాము. ఆ శాసనంలో అతనికి "వేల్పూరు దేశ శాసన' అనే బిరుదుకూడ ఉంది. ఇన్ని కారణాలవల్ల వేల్పూరే అమరపురి అనడం సమంజసం.

విష్ణుకుండుల కులదైవం శ్రీపర్వతస్వామి, శ్రీమల్లికార్జునుడే నన్న కీల్‌హారన్ నిర్ణయాన్ని అంగీకరించేవారు నేటికీ ఉన్నారు. కీల్‌హారన్ నిర్ణయానికి రెండు కారణాలున్నాయి: (1) అతడు ప్రచురించిన చిక్కుళ్ళ శాసనం ఇచ్చిన విక్రమేంద్ర భట్టారకుడు, అతని తండ్రి ఇంద్రవర్మ పరమమాహేశ్వరులని ఉండడం, (2) కీల్‌హారన్ నాటికి (1911) శ్రీపర్వత-నాగార్జునకొండ వెలుగులోనికి రాకపోవడము. కాని విష్ణుకుండుల శ్రీపర్వతం శ్రీశైలం అనడానికి ఆధారం లేదు. శ్రీపర్వతస్వామి పాదానుధ్యానంవల్ల ప్రజాపాలనాధికారం పొందినామని, తమ రాజ్యం శ్రీపర్వత ఉభయ పార్శ్వాలలో విస్తరించిందని

విష్ణుకుండులు చెప్పుకున్నారు. అందువల్ల శ్రీపర్వతస్వామి బహుజనాదరణ పొందిన దేవుడని విష్ణుకుండులకు శ్రీపర్వతంతో చాల సాన్నిహిత్యం ఉందని అర్థమవుతుంది. అయితే శ్రీశైలం క్రీ. శ. 5, 6 శతాబ్దాలకు జనాదరణ పొందిన క్షేత్రమయిందనడానికిగాని విష్ణుకుండుల అధికారం శ్రీశైలంవరకు విస్తరించిన దనడానికిగాని స్పష్టమైన ఆధారం ఇంతవరకు లభించలేదు. వినుకొండ, వేల్పూరు ప్రాంతంలో ప్రబలులైనవారికి శ్రీపర్వత నాగార్జునకొండతో సాన్ని హిత్యం ఏర్పడడం సహజం. కాబట్టి విష్ణుకుండుల శ్రీపర్వతం శ్రీశైలం కాదు. అయితే శ్రీపర్వతస్వామి ఎవరు? శ్రీపర్వతపాదంలోని విజయపురి రాజధానిగా ఏలిన ఇక్ష్వాకుల కులదైవం మహాసేనుడని, విజయపురిలో కార్తికేయాలయాలు బయల్పడినవని అందుచేత శ్రీపర్వతస్వామి కార్తికేయుడని ఇటీవల కార్తికేయ శర్మ గారి వాదము. అయితే మొదటి ఛాంతమూలుడు వినా ఇక్ష్వాకులలో ఇతరు లెవ్వరూ కార్తికేయుని ఆరాధించినట్లు తెలియదు. ఇక్ష్వాకుల పేర్లు కార్తికేయ భక్తిస్ఫోరకములు కావు. ఏహువలుడు శైవుడని అతడు నిర్మించిన పుష్ప భద్రాలయం చాటుతుంది. కార్తికేయాలయాలతోబాటు శివాలయాలు అష్టభుజ స్వామి ఆలయం, హారీతి ఆలయముకూడ విజయపురి ప్రాంతంలో బయల్పడి నాయి. కావున కార్తికేయునకు విజయపురిలో ప్రాముఖ్యం ఉన్నదని అంగీక రించినా అతడు విజయపురి స్వామియేగాని శ్రీపర్వతస్వామి కాజాలడు. శ్రీపర్వతం బౌద్ధ క్షేత్రంగానే దేశదేశాంతరాల్లో చిరకాలంగా ప్రసిద్ధి చెందింది. అందుచేతనే నేలటూరు వెంకట రమణయ్యగారు తమ అభిప్రాయం మార్చుకొని శ్రీపర్వతస్వామి బుద్ధదేవుడనినారు.

విష్ణుకుండులలో చివరి ఇద్దరిని మినహాయించి మిగిలినవారు వైష్ణవులే గాని శైవులు కాదు. వారి వంశనామం వైష్ణవం; రాజులపేర్లు, బిరుదులు వైష్ణవం; తమ రాజ్యాన్ని వారు కౌస్తుభంతో పోల్చుకున్నారు. వారి శాసన ముద్రలపై లక్ష్మి, శ్రీవత్సాలు, నాణేలమీద సింహము, శంఖము కన్పిస్తాయి. నంది గుర్తులున్న నాణేలు కూడ దొరికినాయిగాని వానిని పరమమాహేశ్వరులైన చివరి రాజులు ఇచ్చివుండవచ్చు. అందుచేత విష్ణుకుండులను వైష్ణవులనడం సమంజసం. అయితే వారిలో గోవిందవర్మ, మొదటి విక్రమేంద్రవర్మ బౌద్ధ మతాభిమానులైన వైష్ణవులు. నాటికే ఉత్తరదేశంలో గుప్తరాజుల ప్రభావంవల్ల వైష్ణవం పుంజుకొని బౌద్ధ వైష్ణవ మతాలమధ్య సామరస్యం ఏర్పడింది. బుద్ధుడు నారాయణుని నవమ అవతారంగా పూజలందుకొనసాగినాడు. శైవులయిన వాకాటకుల రాజ్యంలోకూడ ప్రభావతీగుప్త వైష్ణవాన్ని ప్రవేశపెట్టింది. శాలం కాయనుల కాలానికే బౌద్ధ వైష్ణవ సామరస్యం పుంజుకొంటున్నట్లు రెండో నందివర్మ గుంటుపల్లి శిలాశాసనం సూచిస్తున్నది. అందుచేత విష్ణుకుండులు శ్రీపర్వతస్వామి

అయిన బుద్ధదేవుని విష్ణుమూర్తి నవమ అవతారంగా భావించి ఆరాధించి నారనడం చారిత్రకంగా సమంజసము.

విష్ణుకుండులు బ్రాహ్మణులనీ, కాదు క్షత్రియులనీ భిన్న అభిప్రాయా లున్నాయి. తాము 'బ్రహ్మ క్షత్ర తేజో'యుతులమని వారు శాసనాల్లో చెప్పు కున్నారు. కాబట్టి జన్మరీత్యా బ్రాహ్మణ క్షత్రియ వర్ణాలలో దేనికి చెందరు. ఇక్ష్వాకు శాలంకాయనాదుల వలెనే విష్ణుకుండులుకూడ ఆదిమ ఆంధ్రజాతులలోని వారై బౌద్ధాన్ని స్వీకరించి క్రమంగా వైష్ణవ మతాభిమానులై హిందువులై వుంటారు. వైష్ణవమతం స్వీకరించడం ద్వారా ఆంధ్రులు పునీతులయినారని భాగవతం చాటుతున్నది. రాజకీయ ప్రాబల్యం వహించడంతో తదనుగుణమైన సాంఘిక ఉన్నతి సాధించే ఆశయంతో వైదికక్రతు కాండలు నిర్వహించినట్లు కన్పిస్తుంది. మాధవవర్మ ధరించిన 'పరమ బ్రహ్మణ్య' 'పరమేష్ఠి' బిరుదుల్లో ఆ తాపత్రయం ప్రతిఫలిస్తున్నది.

విష్ణుకుండుల వంశవృక్ష నిర్మాణం జటిల సమస్య. ఆ సమస్యను గురించి ఏ ఇద్దరు చరిత్రకారుల మధ్య అంగీకారం లేదు. వంశవృక్షానికి ఎన్మిది శాసనాలు ఉపకరిస్తున్నాయి. వీనిలో కొన్ని రెండు తరాలను, కొన్ని మూడు నాల్గు తరాలను, విక్రమేంద్రుని తుమ్మలగూడెం శాసనము ఐదు తరాలను ఈ క్రింది విధంగా పేర్కొంటున్నాయి:

**1. తుమ్మలగూడెం (1)**

ఇంద్రవర్మ
|
మాధవవర్మ
|
గోవిందవర్మ

**2. ఈపూరు (1)**

గోవిందవర్మ
|
మాధవవర్మ
|
మంచణ్ణభట్టారక

**3. ఈపూరు (2)**

మాధవవర్మ
|
దేవవర్మ
|
మాధవవర్మ

**4. పొలమూరు**

విక్రమహేంద్రవర్మ
|
గోవిందవర్మ
|
మాధవవర్మ

**5. రామతీర్థం**

మాధవవర్మ
|
విక్రమేంద్రవర్మ
|
ఇంద్రవర్మ

**6. చిక్కుళ్ళ**

మాధవవర్మ
|
విక్రమేంద్రవర్మ
|
ఇంద్రభట్టారకవర్మ
|
విక్రమేంద్రవర్మ

**7. తుండి**

మాధవవర్మ
|
విక్రమేంద్రవర్మ
|
ఇంద్రభట్టారకవర్మ
|
విక్రమేంద్రవర్మ

**8. తుమ్మలగూడెం (2)**

గోవిందవర్మ
|
మాధవవర్మ
|
విక్రమేంద్రవర్మ
|
ఇంద్రవర్మ
|
విక్రమేంద్రవర్మ II

ఈపూరు (1) గోవిందవర్మ తుమ్మలగూడెం, (2) గోవిందవర్మ ఒక్కరే నని, ఈపూరు (1) మాధవవర్మ, ఈపూరు (2) మొదటి మాధవవర్మ, రామ తీర్థం, చిక్కుళ్ళ, తుండి, తుమ్మలగూడెం (2) మాధవవర్మలు ఒక్కరేనని చరిత్రకారుల్లో అంగీకారం అయినప్పుడు, వారి వంశవృక్షం :

గోవిందవర్మ
|
మాధవవర్మ
|
- మంచణ్ణభట్టారక
- దేవవర్మ
  |
  మాధవవర్మ II
- విక్రమేంద్రవర్మ
  |
  ఇంద్రవర్మ
  |
  విక్రమేంద్రవర్మ II

ఇక పొలమూరు, తుమ్మలగూడెం (1) శాసనాలలోని రాజులను గురించి తీవ్ర అభిప్రాయభేదాలున్నాయి కొందరు పొలమూరు శాసనంలోని విక్రమహేంద్రుని చిక్కుళ్ళ తుండి శాసనంలోని రెండో విక్రమేంద్రునిగా గుర్తించి విష్ణుకుండి వంశవృక్షాన్ని మరి రెండు తరాల పొడిగించి క్రీ.శ. 615 వరకు విష్ణుకుండి పాలన సాగిందని వాదిస్తారు (ఓరుగంటి రామచంద్రయ్యగారు). విక్రమహేంద్రుని మొదటి విక్రమేంద్రుడుగా గుర్తించి పొలమూరు శాసనరాజులు విష్ణుకుండి శాఖాంతరమని త్రివర నగరం నుండి పాలించినారని మరికొందరి అభిప్రాయం (నేలటూరి వెంకట రమణయ్యగారు) అయితే పొలమూరు శాసనంలోని మాధవవర్మ వర్ణన ఈపూరు (1) మొదలైన శాసనాలలోని మాధవవర్మ

వర్ణనకు సరిపోతున్నది. ఇద్దరి తండ్రులూ గోవిందవర్మలే; ఇద్దరూ ఏకాదశాశ్వమేధులే, క్రతుసహస్రయాజులే. ఒకే వంశంలో ఒకే సంఖ్యలో యజ్ఞయాగాది క్రతువులు చేసిన గోవిందవర్మల కుమారులు మాధవవర్మలు ఇద్దరుండడం చారిత్రక విరుద్ధంగా కన్పించకపోదు. అయితే ఈ అభిప్రాయానికి ఒక కారణం ఉంది. ఈపూరు (1) పొలమూరు శాసనాల్లోని మాధవవర్మకు 'త్రివరనగర భవన యువతీప్రియు'డనే బిరుదుంది; ఇతర శాసనాల్లో ఈ బిరుదు లేదు. అందుచే ఈ శాసనాల్లోని గోవిందవర్మ మాధవవర్మలు శాఖావంశీయులని విష్ణుకుండి సార్వభౌముని నుండి త్రివర నగర ప్రాంతాన్ని పొంది సామంతులుగా పాలించి రెండో విక్రమేంద్రవర్మ అనంతరం ఆంధ్రప్రాంతానికి మరలి అమరావతి రాజధానిగా పాలించినారని వీరి వాదం. ఇందుకు చాల అభ్యంతరాలున్నాయి: (1) త్రివరనగర అర్థాన్ని గురించి చరిత్రకారులలో ఏకాభిప్రాయం లేదు. కొందరు తేవార్ అని, మరి కొందరు త్రి-వర-నగర: మూడు గొప్ప నగరాలనీ అంటున్నారు (2) మాధవవర్మ అనంతరం రెండు తరాల వరకు నర్మదానదీ ప్రాంతంలో విష్ణుకుండి అధికారం చెలామణీ అయిన నిదర్శనలు లేవు. ఆ ప్రాంతంలోని రాజకీయ పరిణామాలదృష్ట్యా అది అసంభవం. (3) సామంతుడైన రాజు లేదా త్రివర నగరంలో స్వతంత్రుడైన మాధవవర్మ ఏకాదశాశ్వమేధాది క్రతువులొనర్చినాడని విశ్వసించడం కష్టం. అందుచేత పొలమూరు శాసనస్థరాజులు ఈపూరు (1) శాసనరాజులు ఒక్కరేగాని భిన్నులు కారని నిర్ణయించడం సమంజసం. అదీగాక రెండో విక్రమేంద్రవర్మ అనంతరం విష్ణుకుండి వంశాన్ని రెండుతరాలు అంటే క్రీ.శ 615 వరకు పెంచడం అసంభవము. క్రీ.శ. 615-16 నాటికి చాళుక్య చక్రవర్తి రెండో పులకేశి తీరాంధ్రాన్ని జయించినాడు. అతడా ప్రాంతాన్ని విష్ణుకుండులనుండి ఆక్రమించినాడనడానికి ఏమాత్రమూ ఆధారం లేదు. అందుచేత పొలమూరు, ఈపూరు (1) శాసనాల్లోని గోవిందవర్మ, మాధవవర్మలు ఒక్కరేగాని భిన్నమైనవారు కాదు. పొలమూరు శాసన స్వభావాన్ని గురించి ముందే ముచ్చటించినాము. ఈ శాసనంలోని విక్రమహేంద్ర అనేది గోవిందవర్మ తండ్రి మాధవవర్మ (తుమ్మలగూడెం) (1) బిరుదంగా చిత్రకారులు స్వీకరిస్తున్నారు. (అజయమిత్రశాస్త్రి, డి సి. సర్కార్). ఇక తుమ్మలగూడెం (1) శాసనంలోని రాజులు ప్రధానవంశంతో సంబంధం స్పష్టంగాలేని శాఖాంతరమని రామారావుగారి అభిప్రాయం. కాని ఇందలి గోవిందవర్మ వర్ణన తుమ్మలగూడెం (2) శాసనంలోని గోవిందవర్మ వర్ణనకు వ్యత్యాసం లేదనే చెప్పవచ్చు. ఇద్దరు భిన్నవ్యక్తులనడానికి అవకాశం లేదు. అందువల్ల విష్ణుకుండుల వంశవృక్షం ఈ క్రింది విధంగా తయారవుతున్నది:

ఇంద్రవర్మ 375-400

విక్రమహేంద్ర 400-425

మూలరాజు

గోవిందవర్మ + పరమభట్టారిక

425—465

వాకాటక రాకుమారి + మాధవవర్మ I 465-515

మంచన్నభట్టారక

విక్రమేంద్రవర్మ I 515-525

దేవవర్మ

ఇంద్రవర్మ 525-555

మాధవవర్మ II

విక్రమేంద్రభట్టారకవర్మ II 525-555

విష్ణుకుండుల కాలనిర్ణయానికి తుమ్మలగూడెం (2) శాసనం కీలకం. అది రెండో విక్రమేంద్రుని 11వ రాజ్య సంవత్సరంలో, శా॥శ॥ 488 లో అంటే (క్రీ. శ. ఇచ్చినట్లు శాసనంలోనే స్పష్టంగా ఉంది.) రెండో విక్రమేంద్రుడు క్రీ.శ. 555 లో సింహాసనం ఎక్కి 15 సంవత్సరాలు రాజ్యం చేసి వుంటాడు. ఈ వంశంలో ఇతడే చివరిరాజు. అంటే విష్ణుకుండి వంశం క్రీ.శ. 570 లో అస్తమించింది. విక్రమేంద్రుని తండ్రి ఇంద్రభట్టారకుడు రామతీర్థ శాసనాన్ని తన 27వ రాజ్య వర్షంలో ఇచ్చినాడు. అతడు 30 సంవత్సరాలు రాజ్యం చేసినాడని భావించినచో అతడు సింహాసనం ఎక్కింది క్రీ. శ. 525 లో. మొదటి విక్రమేంద్రవర్మ సమర్థుడుకాడు. అంతేగాక, అతని తండ్రి సుమారు 50 సంవత్సరాలు రాజ్యం చేసినట్లు తెలుస్తున్నది. అందుచే మొదటి విక్రమేంద్రుడు 15 సంవత్సరాలు మాత్రం రాజ్యం చేసినట్లు చెప్పవచ్చు. దేవవర్మ, రెండో మాధవవర్మలు శాఖావంశీయులైనందున ప్రధానవంశం కాలం నిర్ణయించడంలో వారి ప్రసక్తి అవసరం లేదు 49 వ రాజ్యవర్షంలో ఇచ్చినట్లున్న పొలమూరు శాసనం విశ్వాసయోగ్యమే అయితే మాధవవర్మ 50 సం॥ రాజ్యం చేసినాడని చెప్పవలె. (క్రీ.శ. 460 - 510.) గోవిందవర్మ తుమ్మలగూడెం (1) శాసనం అతని

37వ రాజ్యవర్షంలో ఇచ్చినందున అతడు కనీసం 40 సం॥ పాలించినాడని భావించవచ్చు అంటే అతని పాలన క్రీ. శ. 420లో ప్రారంభమయింది. అతని తాత తండ్రులు 50 సం॥లు రాజ్యం చేసినారని భావించి ఆలోచిస్తే విష్ణుకుండి వంశం క్రీ.శ. 370 లో అధికారంలోనికి వచ్చి, క్రీ.శ. 570 ప్రాంతంలో అంత రించిందని స్థూలంగా అంచనా వేయవచ్చును.

ఇంద్రవర్మ, మాధవవర్మలు విష్ణుకుండి వంశంలో ఆద్యులైనట్లు తుమ్మల గూడెం (1) శాసనంవల్ల తెలుస్తున్నది. మాధవవర్మనే విక్రమ మహేంద్ర బిరు దంతో పొలమూరు శాసనం వ్యవహరించింది. వీరుభయులు శ్రీపర్వత - విను కొండ ప్రాంతంలో పల్లవాధికారాన్ని తుదముట్టించి స్వతంత్ర రాజ్యం స్థాపించి వుంటారు. సముద్రగుప్తుని దండయాత్రతో పల్లవరాజ్యం కల్లోలితమయినట్లు కన్పిస్తుంది. అదీగాక కదంబవంశ స్థాపకుడైన మయూరశర్మ పల్లవులపై విప్లవ ధ్వజం ఎత్తినాడు. ఈతడు బహుశా శ్రీపర్వతాన్ని ఆక్రమించి, స్థావరంగా చేసుకొని బృహద్బాణులను జయించి పల్లవులపై యుద్ధం చేసినాడు. మయూర శర్మ పల్లవులతో సంధి చేసుకొని శ్రీపర్వతం నుండి నిర్గమించినంతనే ఆ ప్రాంతాన్ని ఆక్రమించి విష్ణుకుండులు స్వతంత్రరాజ్యం స్థాపించినారు. ఇదే కాలానికి కర్మరాష్ట్రంలో కందారరాజ్యం ఏర్పడినందున విష్ణుకుండులు తీర ప్రాంతానికి విస్తరించడానికి ఆటంకమై కృష్ణానదిదాటి ఉత్తరంగా తెలంగాణా ప్రాంతాలను ఆక్రమించి విస్తరించడానికి పూనుకున్నారు. తెలంగాణాలో అధిక భాగం వాకాటక సామ్రాజ్యంలో చేరివుండేది. ప్రవరసేనుని (క్రీ.శ. 275-335) అనంతరం వాకాటకరాజ్యం రెండుగా చీలిపోయి ఆ వంశ శాఖలు పరస్పరం కలహాల్లో మునిగి ఉండటం వల్ల సామ్రాజ్యం బలహీనమై పొరుగు రాజ్యాల ఆక్రమణకు అనుకూలమయింది ఈ కారణంవల్లనే విష్ణుకుండులు తెలంగాణా ప్రాంతాలను ఆక్రమించగలిగినారు.

సుప్రసిద్ధులైన విష్ణుకుండులలో గోవిందవర్మ ప్రథముడు. గోవిందవర్మ రాజనీతిపరుడు; పరాక్రమశాలి. "స్వనయ భుజబలోత్సాహ ప్రభావానురాగావాప్త స్వరాజ్యేన" అని చెప్పుకున్నాడు. తీరాంధ్రంలో గుణపాశపురంలో బలవంతుడైన మూలరాజు కుమార్తెను పెండ్లాడి అతని సాయంతో శాలంకాయనులను తుదముట్టించి వారి రాజ్యాన్ని ఆక్రమించినాడు. దక్షిణంగా పల్లవుల నోడించి గుండ్లకమ్మవరకు విష్ణుకుండి రాజ్యాన్ని విస్తరింపజేసినాడు. శ్రీపర్వతానికి పూర్వాపర దిశలలోని క్షితిపతులనే హారంలో గోవిందవర్మ కౌస్తుభమని వర్ణించినారు (తు. గూ.)

గోవిందవర్మ ఉదాత్తగుణాలున్న రాజు. బౌద్ధ ధర్మాలలోను, ఇతర శాస్త్రాల్లోను పండితుడు. "గుణరూపసంపద్భిరనుగత" గోవిందుడు. బౌద్ధమతాభి

మానియైన వైష్ణవుడు. భిక్షువులను బ్రాహ్మణులను సమానంగా ఆదరించినాడు. అనేక దేవాయతన విహార ప్రపాతటాకాదులను నిర్మించినాడు. గ్రామ, క్షేత్ర ద్విరద తురగ గోబలీవర్ధశయనాది దానాలు చేసినాడు కులీనజనసమాశ్రయుడు. గోవిందవర్మ పట్టమహిషి పరమ (భట్టారికా) మహాదేవి బౌద్ధమతస్థురాలు. బహుశా ఈమెకీ అభిమానం పుట్టినింట గుణపాశపురంలోనే కలిగిఉంటుంది. గుణపాశపురం నాడొక పెద్ద బౌద్ధక్షేత్రం. రాజధానియైన శక్రపురంలో (వేల్పూరులో) ఈమె తన పేరనొక బౌద్ధవిహారం నిర్మించగా దానికి గోవింద వర్మ పెణ్కపర గ్రామం దానం చేసినాడు.

మాధవవర్మ విష్ణుకుండి రాజులందరిలో సుప్రసిద్ధుడు. తుమ్మలగూడెం(1) శాసనం మినహా మిగిలిన శాసనాలన్నీ బలసత్వ ధైర్యవీర్య వినయ సంపన్నుడుగా ఈతణ్ణి వర్ణిస్తున్నాయి. మాధవవర్మ దిగ్జయ యాత్రలు సాగించి విష్ణుకుండి అధికారాన్ని విస్తరింపజేసినాడు. మొదట్లో వాకాటక రాజ్యంపై దండు వెడలినట్లు కన్పిస్తుంది. వాకాటక వంశ ప్రధాన శాఖలో చివరి రాజైన పృథ్వీసేనుడు (460 - 480) మాధవవర్మ సమకాలికుడు. పృథ్వీసేనుడు దుర్బలుడు; త్రైకూటకులాతనిపై దాడులు చేస్తుండేవారు. అది అదనుగా గ్రహించి మాధవవర్మ అతణ్ణి ఓడించి ఆతని కుమార్తెను వివాహమాడినాడు. ప్రాచీన రాజ వంశమైన వాకాటకులతోడి వివాహ సంబంధంతో విష్ణుకుండుల గౌరవప్రతిష్ఠలినుమడించినాయి. అందుచేతనే గాబోలు ఈ సంబంధాన్ని గురించి విష్ణుకుండి శాసనాలు ప్రశంసాపూర్వకంగా పేర్కొంటున్నాయి. విష్ణుకుండుల అధికారం నర్మదా నది వరకు విస్తరించింది. మాధవవర్మ ఖానాపూర్ శాసనం, మహారాష్ట్రలో పలుచోట్ల దొరికిన విష్ణుకుండుల నాణేలు అందుకు నిదర్శనం. అనంతరం గుణపాశపురం ఏలే ప్రభాకరుడు సాయంగా బహుశా మాధవ వర్మ కళింగను ఆక్రమించినాడు. వాసిష్ఠులు బలహీనులు కావడం అతనికి సదవకాశమయింది. బహుశా మాధవ వర్మ ఉత్తర దిగ్జయయాత్రలలో ఉన్న సమయంలో పల్లవ రెండో సింహవర్మ కృష్ణానది వరకు దాడులు చేసినట్లు కన్పిస్తుంది. అందుచేత తన 33 వ రాజ్యవర్షంలో మాధవ వర్మ పల్లవులపై దాడివెడలి పల్లవుల నోడించి తిరిగి గుండ్లకమ్మ వరకు విష్ణుకుండి అధికారాన్ని ప్రతిష్ఠించినాడు. పల్లవ విష్ణుకుండి సంఘర్షణ చిరకాలంగా సాగుతున్నది. అందుచేత ముందు ముందు తన రాజ్యంపై పల్లవ దండయాత్రల నరికట్టే ఉద్దేశ్యంతో వేల్పూరు (అమరపురి) రాజధానిగా తన పెద్దకొడుకు దేవవర్మను రాజప్రతినిధిగా నియమించినాడని చెప్పవచ్చు. పల్లవులపై విజయంతో మాధవ వర్మ ప్రాగ్దక్షిణాపరాంబోనిధి రేవాసరిత్సలిలవలయ భూమి భర్తయై అనేక సామన్త మకుటమణిఖచిత చరణ యుగళుడయినాడు.

ఈపూరు (1) పొలమూరు శాసనాల్లో మాధవవర్మకు "త్రివరనగరభవన గత సుందరీ హృదయనందన" అనే బిరుదం ఉంది. త్రివరనగరం నర్మదా నదిపై జబ్బల్‌పూర్ సమీపంలోని త్రిపురి లేక తేవార్ అని కొందరి అభిప్రాయం. నర్మదా (రేవా) నదివరకు తన ప్రాబల్యాన్ని విస్తరింపజేసిన మాధవవర్మ ఈ బిరుదం ధరించడంలో ఆశ్చర్యం లేదు. అయితే త్రివరనగరం తేవార్ కాదని, తీవరదేవుని నగరమని ఇటీవల ఆచార్య వి. వి. మిరాషీ గారొక వాదం ప్రారంభించినాడు. శరభపురీకుల అనంతరం దక్షిణకోసలాన్ని పాలించిన పాండు వంశీయుల్లో సుప్రసిద్ధుడు తీవరదేవుడు. ఆతణ్ణి ఓడించి విష్ణుకుండుల అధికారాన్ని మాధవవర్మ దక్షిణకోసల వరకు విస్తరింపజేసినాడని మిరాషీగారి అభిప్రాయం. కాని తీవరదేవుని కాలాన్ని గురించి తీవ్ర వివాదాలున్నాయి. మాధవవర్మ అనంతరం చాలాకాలానికి గాని తీవరదేవుడు సింహాసనం ఎక్కలేదనీ ఆ బిరుదానికి త్రివర నగర మూడు గొప్ప పట్టణాలై వుండవచ్చునని అజయమిత్ర శాస్త్రిగారి అభిప్రాయం.

కళింగ దండయాత్ర తరువాత మాధవవర్మ వేంగి సమీపంలోని దెందులూరు పురానికి రాజధానిని మార్చినాడు. వేల్పూరు విష్ణుకుండి శాఖావంశానికి కేంద్రమయింది. మాధవవర్మ బ్రాహ్మణ మతాభిమాని, గొప్ప కర్మిష్ఠి; సువర్ణగర్భ ప్రసూతుడు ఏకదశాశ్వమేధ బహుసువర్ణ, పౌండరీక, పురుషమేధ, వాజపేయ, యుధ్య, షోడసి, రాజసూయ, ప్రాధిరాజ్య ప్రజాపత్యాద్యనేక వివిధ వృదుతర సహస్రయాజియై పరమేష్ఠిత్వాన్ని సాధించినాడు. వినయ సంపన్నుడు; పరిపాలనాదక్షుడు. శాలివాహన విక్రమాదిత్యులవలె ఇతణ్ణి గురించి, ముఖ్యంగా ఈతని న్యాయశీలతను గురించి కథలు ప్రచారంలో ఉన్నాయి. ఈతడు గొప్ప పండితుడు; ఇతనికి 'జనాశ్రయ' బిరుదం ఉంది. 'జనాశ్రయ ఛందోవిచ్ఛిత్తి' అనే ఛందో గ్రంథానికి కర్తయని తెలుస్తుంది. ఇంతటి సుప్రసిద్ధుడైనందునే తరువాతి కాలంలో ఆంధ్రదేశాన్ని పాలించిన కాకతీయాదులు మాధవవర్మను తమ వంశకర్తగా చెప్పుకొన్నారు.

మాధవవర్మ అనంతరం విక్రమేంద్ర భట్టారకుడు సింహాసనం ఎక్కినాడు. ఈతని శాసనాలు లభించలేదు. ఈతని పుత్ర పౌత్రుల శాసనాలనుండి 'విష్ణుకుండి వాకాటక వంశద్వయాలంకార జన్మ' అనీ 'పరమ సౌగత' అనీ 'మహాకవి' అనీ ఇతణ్ణి గురించి తెలుస్తుంది. అయితే ఇతడు రచించిన కావ్యాలేమీ లభించలేదు. ఈతని మంచితనం అవకాశంగా తీసుకొని వేల్పూరులో దేవవర్మ కుమారుడు మాధవవర్మ స్వతంత్రించినాడు. ఈతడు కందారవంశాన్ని పూర్తిగా నిర్మూలించి 'త్రికూట మలయాధిప' బిరుదాన్ని సంగ్రహించినాడు. ఈతని

ఈపూరు (2) శాసనం 47వ రాజ్య సంవత్సరంలో ఇవ్వబడింది. బహుశా వేల్పూరు రాజ్యం ఏర్పడినప్పటినుండి మాధవవర్మ తన రాజ్యవర్షాలను లెక్కించి వుంటాడు.

విక్రమేంద్రభట్టారకుని కుమారుడు ఇంద్రవర్మ కాలంలో విష్ణుకుండి రాజ్యానికి శత్రువుల అలజడి అధికమయింది. 'భ్రూభంగకర వినిర్ధూత సమగ్ర దాయాదస్య' అనే వర్ణనవల్ల ఇంద్రవర్మను దాయాదు లెదిరించినారని స్పష్టము. వీరు వేల్పూరు మాధవవర్మ, అతని అనుయాయులు. మాధవవర్మ స్వతంత్రించడమేకాక విష్ణుకుండి సింహాసనాన్ని ఆశించినట్లు కన్పిస్తుంది. ఇంద్రవర్మకు వ్యతిరేకంగా కన్నడ, ఆంధ్ర సరిహద్దుల్లో విజృంభిస్తున్న చాళుక్యుల సహాయం పొందడానికి కూడ అతడు వెనుకాడలేదు. ఏలేశ్వరంలో రణవిక్రమ బిరుదం ఉన్న శాసనాలున్నాయి. శాసనలిపి ఆరో శతాబ్దానిది. చాళుక్య వంశస్థాపకుడైన మొదటి పులకేశి బిరుదాల్లో రణవిక్రమ ప్రసిద్ధమయింది. బహుశా పులకేశి మాధవవర్మకు సహాయంగా వచ్చివుంటాడు. కాని ఇంద్రభట్టారకునిపై పులకేశికి స్పష్టమైన విజయం లభించిందని చెప్పలేము. అయితే నాడు మొదలు చాళుక్యులు విష్ణుకుండుల ననుసరించి 'ఆశ్రయ' పదం ఉన్న బిరుదులు ధరింపసాగినారు. మొదటి పులకేశి 'సత్యాశ్రయ' బిరుదం ధరించినాడు. ఇంద్రవర్మ మాధవవర్మనునిర్జించి వేల్పూరురాజ్యాన్ని 'చక్రవర్తిక్షేత్రం'లో కలుపుకొని వుంటాడు.

ఇంద్రవర్మ దాయాదులతో, పులకేశితో యుద్ధంలో నిమగ్నుడై వుండగా అతణ్ణి తుదముట్టించే ఆశయంతో కళింగసామంతులు కూటమిగా ఏర్పడి కాలు దువ్వినారు ఈ విషయాన్ని పృథ్వీ మూలుని గోదావరీ శాసనం చెబుతున్నది. ఈ శాసనంలో పృథ్వీమూలునితోబాటు అధిరాజఇంద్ర, ప్రతాపశీలుల ప్రస్తావన ఉంది. అధిరాజ ఇంద్రుడు సుప్రతీకమనే యుద్ధగజాన్ని సంహరించినాడట! సుప్రతీకం ఈశాన్య దిగ్గజం, కుముదం నైఋతి దిగ్గజం. అందుచేత అధిరాజ ఇంద్రుడు కళింగ గంగ వంశస్థుడైన ఇంద్రవర్మ అనీ కుముదం ఇంద్రభట్టారకునకు సూచనఅనీ, ఈ యుద్ధంలో ఇంద్రభట్టారకుడు ఓడి మరణించినాడనీ నిన్నమొన్నటివరకు చరిత్రకారులు అభిప్రాయపడినారు. కాని, అధిరాజ ఇంద్రుడు తమిళ మండలంలోని మామల్కుడివాసి, ఆయుధోపజీవి అయిన బ్రాహ్మణ వీరుడనీ; అతడు, పృథ్వీమూలుడు ఇంద్రభట్టారకుని మిత్రులేగాని శత్రువులుగారని ఇటీవల నేలటూరు వెంకటరమణయ్యగారు రుజువు చేసినారు. అదీగాక అనేక చాతుర్దంతసమర విజయాధిగతాశేష చక్రవర్తి క్షేత్రాధిపత్యస్య' అన్న శాసన వాక్యాన్నిబట్టి ఇంద్రవర్మ ఆ యుద్ధంలో విజయం పొంది, తన తండ్రి నిర్మించిన సామ్రాజ్యానికి భంగం వాటిల్లకుండా పరిపాలించివాడని చెప్పవచ్చు.

ఇంద్రభట్టారకుడు చేసిన చివరి యుద్ధం మౌఖరిరాజైన ఈశానవర్మతో జరిగింది. ఈశానవర్మ శులిక, ఆంధ్రరాజులను జయించినట్లు చెప్పుకున్నాడు. బహుశా ఈతడు దక్షిణ దిగ్విజయయాత్రకు రాగా ఇంద్రవర్మ ఎదిరించి పరాజయం పొంది వుండవచ్చు. ఈశానవర్మ కుమారుడు శర్వవర్మ రాణి ఇంద్ర భట్టారికాదేవి. దీన్నిబట్టి ఇంద్రభట్టారకుడు తన కుమార్తెను ఈశానవర్మ కుమారునకిచ్చి పెండ్లిచేసి మౌఖరులతో మైత్రి నెరపినాడని చెప్పవచ్చు.

ఇంద్రవర్మ మరణానంతరం అతని కుమారుడు రెండో విక్రమేంద్ర భట్టారకుడు సింహాసనం ఎక్కినాడు. విక్రమేంద్రుడు పిన్నవయస్కుడైనా మంత్రిమండలి అతణ్ణి సింహాసనం ఎక్కించినట్లు తెలుస్తుంది. రెండో విక్రమేంద్రుడే విష్ణుకుండులలో చివరివాడు. ఈతని ''సకలభువన రక్షాభరణైక్కాశ్రయ'' బిరుదం చాళుక్యుల ''సమస్త భువనాశ్రయ'' బిరుదాన్ని స్ఫురణకు తెస్తుంది.

ఇంద్రవర్మ కాలంనుండి విష్ణుకుండి రాజ్యం శత్రుపరవేష్టితమయింది తుమ్మలగూడెం (2) శాసనం ప్రకారం రెండో విక్రమేంద్రుని పదకొండో రాజ్య వర్షంలో పల్లవ సింహవర్మ విష్ణుకుండి రాజ్యంపై దండెత్తినాడు. విక్రమేంద్రుడీ దాడిని తిప్పికొట్టినట్లు కన్పిస్తుంది. ధాన్యకటకంలో పల్లవ సింహవర్మ శాసనం దొరికింది. ఈ యుద్ధం ధాన్యకటక పరిసరాల్లో జరిగి వుంటుంది. విజయం సాధించి విక్రమేంద్రుడు వేల్పూరులో పరమభట్టారికామహాదేవీ విహారానికి దానధర్మాలు చేసినాడు పల్లవుల తోటి యుద్ధంలో పృథ్వీమూలుడు విక్రమేంద్రునకు అండగా నున్నాడనే సూచన తుమ్మలగూడెం (2) శాసనంలో ఉంది.

విక్రమేంద్ర పృథ్వీమూలులు పల్లవులతో పోరాడుచుండగా పిష్టపురంలో రణదుర్జయ పృథ్వీమహారాజు స్వతంత్రించినాడు. పృథ్వీమహారాజు గొల్లపల్లి శాసనం అతని 48 వ రాజ్య సంవత్సరానిది. లిపినిబట్టి ఈ శాసనం ఆరవశతాబ్ది చివరికి, ఏడోశతాబ్ది ప్రారంభానికి చెందుతుంది. దుర్జయులనుండి వేంగీప్రాంతాన్ని చాళుక్యులు జయించినట్లు వారి శాసనాలు చెబుతున్నాయి. రెండో పులకేశి మారుటూరు శాసనాన్నిబట్టి క్రీ.శ. 616 - 17 నాటికి అతడు వేంగి నాక్రమించినాడు. పృథ్వీమహారాజు 50 సంవత్సరాలు పాలించి పులకేశిచే పరాజితుడై మరణించినాడని భావించితే అతని 50 వ పాలనా సంవత్సరం క్రీ.శ. 616 అవుతుంది. అతడు స్వతంత్రుడయినది 566 లో (616-50). అదే సంవత్సరంలో విష్ణుకుండి రాజ్యంపై పల్లవ సింహవర్మ దాడి జరిగింది.

రాజధానికి మరలిన విక్రమేంద్రుడు సైన్యాన్ని సమకూర్చుకొని పృథ్వీ మహారాజుపై వెడలినాడు. ఈ దండయాత్ర సందర్భంలోనే బహుశా తుండి శాసనం ఇచ్చి వుంటాడు. పృథ్వీమహారాజుతో జరిగిన యుద్ధంలో విక్రమేంద్రుడు మరణించడంతో విష్ణుకుండి వంశం అంతరించింది.

## రణదుర్జయులు

పృథ్వీమహారాజు తాండివాడ, గొల్లవళ్ళి శాసనాలనుండి మూడుతరాల రణదుర్జయులు తెలుస్తున్నారు. రణదుర్జయుడు మూలపురుషుడైనందున వీరి నీపేర వ్యవహరించటం పరిపాటి అయింది. వీరు శ్రీరామకాశ్యపగోత్రజులు. రణదుర్జయుడు విష్ణుకుండి మాధవవర్మ సమకాలికుడు, కళింగరాజ్యాన్ని వాసిష్టుల నుండి జయించి మాధవవర్మ రణదుర్జయుని తనకు సామంతుడుగా పిష్టపురంలో నియమించినాడని చెప్పవచ్చు అందుకు కృతజ్ఞతతో రణదుర్జయుడు తన కుమారునకు విక్రమేంద్రుడని పేరు పెట్టుకొని వుంటాడు.

విక్రమేంద్రుని కుమారుడే పృథ్వీమహారాజు. ఈతడు గొప్ప పరాక్రమవంతుడు. విజేత. స్వాతంత్ర్యం ప్రకటించి, రెండో విక్రమేంద్రవర్మను ఓడించి వధించడమేగాక ఉత్తరాన కటక్ వరకు దండయాత్రలు జరిపినాడు. ఈతని గొల్లవళ్ళి శాసనం విరజానగరం (జాజ్‌పురి-కటక్ జిల్లా) నుండి ఇచ్చింది.

చివరికీతడు చాళుక్యలతో జరిగిన పిష్టపుర, కునాళ యుద్ధాలలో ఓడి మరణించినాడని చెప్పవచ్చును.

## పల్లవులు

శాతవాహన సామ్రాజ్యం ప్రాగ్దక్షిణభూమిలో విజృంభించిన పల్లవులు శాతవాహన అనంతరీకులందరిలో సుప్రసిద్ధులు. శాతవాహనులకు అనంతరం బనవాసిచుటునాగులకు సామంతులుగా ప్రత్యక్షమైన పల్లవులు వివాహసంబంధం ద్వారా నాగరాజ్యాన్ని బడసి ఇక్ష్వాకులను తుదముట్టించి కృష్ణానది వరకు తీరాంధ్రాన్ని ఆక్రమించి మూడున్నర శతాబ్దాలు పాలించినారు. కర్మరాష్ట్రానికై ఆనందగోత్ర, శాలంకాయన, విష్ణుకుండి వంశాలతో పల్లవులు తీవ్రపోరాటాలు జరిపినారు. చివరకు క్రీ శ. 616 లో రెండవ పులకేశి కర్మరాష్ట్రాన్ని ఆక్రమించి, 630 లో వల్లూరు యుద్ధంలో గెలిచిన తరువాతనే పల్లవులు తమ దృష్టిని కేవలం తమిళ మండలంపై కేంద్రీకరించి తమిళ రాజులయినారు అయిననూ తుంగభద్రాతీర ప్రాంతాల్లోని తెలుగుచోడులు, బాణులు, వైదుంబులు, నెల్లూరులోని బోయలు చాలాకాలం వరకు పల్లవులకు సామంతులై వుండేవారు.

పల్లవోత్పత్తి దక్షిణ భారత చరిత్రలోని జటిల సమస్యలలో ఒకటి. ఎందరు చరిత్రకారులున్నారో ఈ సమస్యకు అన్ని పరిష్కారాలున్నాయి. పల్లవులు వాకాటకవంశ శాఖయని జయస్వాల్ గారి వాదము. ఇరు వంశాలవారు భారద్వాజ గోత్రులు. వైదిక హిందూమతాభిమానులు కావడం; నాగవంశంతో సంబంధం చేయడం వారి వాదానికి ఆధారము. కాని, వాకాటకులు, పల్లవులు ఇంచుమించు ఒకే సమయంలో ఉత్తర, దక్షిణాపథాలలో అధికారానికి వచ్చినారు. అందుచేత ఒకరు మరొకవంశ శాఖ అనడానికి అవకాశం లేదు. పల్లవుల శాసనాలలో వాకాటకులతో వారికి సంబంధం ఉన్న సూచన కన్పించదు. వాకాటకులు

ఉత్తరాది నాగవంశంతో సంబంధం వేసినారు పల్లవులకున్న సంబంధం దక్షిణాది చుటునాగులతో. అందుచే జయస్వాల్‌గారి వాదము అంగీకారయోగ్యం కాదు.

శ్రీకృష్ణస్వామి అయ్యంగారు తొండైమండలం జన్మభూమిగా ఉన్న కళ్లారులే పల్లవులనినారు. కళ్లారులు దొంగతనానికి ప్రసిద్ధి. తమిళ భాషలో 'పల్లవ' పదానికి 'దొంగ' అని అర్థం ఉంది. అందుచేత పల్లవులు కళ్లారులు ఒకరేనని అయ్యంగారి సిద్ధాంతము. కాని, అయ్యంగారే మరొక సందర్భంలో పల్లవులు శాతవాహన సామ్రాజ్యం దక్షిణ భూములనుండి తమిళ భూములలో ప్రవేశించినారనినారు. దీన్నిబట్టి పరదేశం నుండి తమ దేశంలో ప్రవేశించినందు వల్లనే పల్లవులను తమిళులు 'దొంగలు' అని పిల్చినారనడం సమంజసం.

ఇంతకంటే విచిత్రమైన సిద్ధాంతం సింహళదేశీయులైన రసనాయగంగారు ప్రతిపాదించినారు. "శింపప్పదికారం' అనే తమిళ గ్రంథానికి 14 వ శతాబ్దిలో వచ్చిన వ్యాఖ్యానంలోని కథ ఈ సిద్ధాంతానికి ఆధారం. తమిళదేశాన్ని పాలించే 'నెడుమూడికిల్లి'కిని 'మణిపల్లవం' (జాఫ్నా) పాలిస్తున్న నాగరాజకుమారైకు గాంధర్వ వివాహఫలితంగా జన్మించిన తొండైమాన్, తొండై మండలానికి ప్రభువై, తన మాతామహ స్థానమైన (మణి) పల్లవమును తన వంశనామంగా గ్రహించినాడని, అతని సంతతివారే పల్లవులయినారని ఈ సిద్ధాంతసారము. పల్లవులు తమిళులే ఆయితే వారి పేర్లలో తమిళ సంపర్కము గోచరింపకుండ డానికి కారణం తెలియదు; వారు వాడిన భాష ప్రాకృత సంస్కృతములు; పోషించినది ఔత్తరాహసంస్కృతి, వారి మొదటి శాసనాలు తమిళ దేశంలోగాక ఆంధ్రదేశంలో లభించినాయి. అందుచే రసనాయగంగారి సిద్ధాంతం చరిత్ర విరుద్ధమైన కట్టుకథ మాత్రమే.

పల్లవోత్పత్తి సమస్యను మొట్టమొదట చర్చించినది లూయి రైస్ పండితుడు. 'పల్లవ' పదం 'పహ్లవ' నుండి వచ్చిందని, భారతదేశానికి వచ్చి స్థిరపడిన పహ్లవులే పల్లవులైనారని అతని సిద్ధాంతం. రావు బహద్దూర్ వెంకయ్య, డూబ్రె, విన్సెంట్ స్మిత్‌గార్లు రైస్ సిద్ధాంతాన్ని స్వల్పమైన మార్పులతో అంగీకరించినారు. అయితే పల్లవులు ఆంధ్రదేశానికి ఎప్పుడు వచ్చి స్థిరపడినారో కాలనిర్ణయం చేయలేము. పురాణాల్లో ఆంధ్రులు, పహ్లవులు, ములకలు మొదలైన జాతులన్నీ మధ్య ఆసియాలోని వక్షునదీతీరంలో ఉన్నారని సూచిస్తున్నాయి. కృష్ణాముఖద్వారంలోని 'పల్లవబొగ్గ' నుండి పదివేలమంది బౌద్ధులు మహాదేవభిక్షుని నాయకత్వంలో సింహళానికి వెళ్ళినారని సింహళ ఐతిహ్యమైన 'మహావంశ' (క్రీ.శ. 4 - 5 శతాబ్దాల నాటిది) చెబుతున్నది. పల్లవబొగ్గ లేక పల్లవభోగ్యము వర్ణన నేటి పలనాడుకు సరిపోతున్నది. ములకలవల్ల ములకలనాడు, అశ్వకులవల్ల అశ్మకరాష్ట్రము, ఆంధ్రులవల్ల ఆంధ్రాపథము ఏర్పడినట్లే పల్లవులు (పహ్లవులు) స్థిరనివాసం ఏర్పరచుకున్న ప్రాంతమే

పల్లవభోగ్యమయినట్లు చెప్పవచ్చు పహ్లవులు శాతవాహన సామంతులుగా కర్నూలుజిల్లా ప్రాంతాలను పాలించినట్లు నాణక సాక్ష్యం లభిస్తున్నది. అందు చేత ఆభీర, నాగ, ఇక్ష్వాకు, శాలంకాయనుల వలె పల్లవులు శాతవాహనులకు సామంతులై; గుంటూరు, కర్నూలు మండల ప్రాంతాలను పాలిస్తూ, బలవంతులై స్వాతంత్ర్యం సంపాదించిన మీదట జాతినామాన్ని వంశనామంగా గ్రహించి వుంటారు.

ఆంధ్రదేశంతో సన్నిహిత సంబంధం ఉన్న పల్లవుల శాసనాలు పదునారు లభించినాయి. వానిలో నాల్గు ప్రాకృతంలోను, మిగిలినవి సంస్కృతంలోను ఉన్నాయి. ప్రాకృత శాసనాలు : (1) సింహవర్మ మంచికల్లు శిలాశాసనం, (2) యువమహారాజు శివస్కందవర్మ మైదవోలు శాసనం, (3) మహారాజాధి రాజ శివస్కందవర్మ హిరహడగళ్ళి శాసనం, (4) శ్రీ విజయస్కందవర్మ కోడలు, యువమహారాజు బుద్ధవర్మ భార్య, బుద్ధ్యంకరుని తల్లి చారుదేవి బ్రిటిష్ మ్యూజియం శాసనం.

సంస్కృత శాసనాలు : (1) విజయస్కందవర్మ ఒంగోడు (1) శాసనం, (2, 3) సింహవర్మ వేసంత, శక్రపట్టణం శాసనాలు, (4, 5) యువమహారాజ విష్ణుగోపుని నెడుంగరాయ, ఉరువపల్లి, శాసనాలు, (6, 7, 8, 9) (రెండో) సింహవర్మ ఒంగోడు (2), పికిర, మంగడూరు, విళవట్టి శాసనాలు, (10) విజయ విష్ణుగోపుని చురశాసనం (11) నన్దివర్మ ఉదయేందిరం శాసనం, (12) కుమారవిష్ణువు చందలూరు శాసనం. ఇవిగాక దర్శి శాసన ఖండం, వాయలూరు స్తంభశాసనం, వేలూరుపాళెయం శాసనము ఆంధ్ర పల్లవుల చరిత్రకు సహాయకారులు.

ఇన్ని శాసనాలు ఉన్నప్పటికీ పల్లవుల కాలాన్ని, వంశవృక్షాన్ని నిర్ణ యించడంలో అనేక సమస్యల నెదుర్కొనవలసి వస్తున్నది. ఈ శాసనాలు ఏ శకాన్నీ ఉదాహరించడం లేదు ఏ శాసనం నుండి కూడ సంపూర్ణ వంశ వృక్షం లభించడంలేదు. అయినా సమకాలిక చారిత్ర పరిణామాలు, సంఘటనల నుండి ఈ క్రింది సూచనలు లభిస్తున్నాయి:

(1) పై శాసనాలలో మొదటిదాని భాష దక్షిణదేశంలోని శాసనభాష ప్రాకృతం నుండి సంస్కృతానికి పరివర్తన చెందుతున్న సంధి యుగానికి చెందింది. ఇది క్రీ శ. 300 ప్రాంతమని చరిత్రకారుల నిర్ణయం.

(2) సముద్రగుప్తుని దండయాత్ర సందర్భంలో కంచిన విష్ణుగోపుడు పాలిస్తున్నట్లు అలహాబాద్ ప్రశస్తి పేర్కొన్నది. 'విష్ణుగోప' అనే పేరు పల్లవ శాసనాలలో తరచు కన్పిస్తున్నందున 'కాంచేయక విష్ణుగోపుడు' పల్లవరాజే గాని మరొక వంశస్థుడు కాదు. సముద్రగుప్తుని దక్షిణ దండయాత్ర క్రీ.శ. 350 ప్రాంతంలో జరిగిందని అందరూ అంగీకరించినదే.

(3) జైన భూగోళశాస్త్ర గ్రంథమైన 'లోకవిభాగ' రచన క్రీ.శ. 458 లో పూర్తయింది (శా.శ. 380). ఇది పల్లవ సింహవర్మ 22 వ రాజ్య సంవత్సరము. అంటే సింహవర్మ సింహాసన మెక్కింది క్రీ.శ. 436 అని స్పష్టమవుతున్నది.

(4) తూర్పు గంగారాజైన మాధవవర్మ తన పెనుగొండ శాసనంలో తనను పల్లవ స్కందవర్మ, తన తండ్రి అయ్యవర్మను స్కందవర్మ తండ్రి సింహవర్మ సింహాసనం ఎక్కించినారని చెప్పుకొన్నాడు. లిపినిబట్టి పెనుగొండ శాసనం క్రీ.శ. 475 ప్రాంతానిదిగా అంగీకరిస్తున్నారు.

(5) తుమ్మలగూడెం (2) శాసనాన్ని బట్టి విష్ణుకుండి రెండో విక్రమేంద్రునకు పల్లవ సింహవర్మకు క్రీ.శ. 566 లో యుద్ధం జరిగినట్లు తెలుస్తున్నది.

(6) మహాపల్లవులలో మూడోవాడైన మహేంద్రవర్మకాలం క్రీ.శ. 600-630 అని తెలుస్తున్నది.

ఈ సూచనలు ఆధారంగా ప్రాచీన పల్లవుల కాలాన్ని వంశవృక్షాన్ని స్థూలంగా నిర్ణయించవచ్చు.

ప్రాకృత శాసనాలలోని పల్లవులు, సంస్కృత శాసనాల పల్లవులు భిన్న శాఖీయులని, మహాపల్లవులావంశయుల కంటే ప్రత్యేకమైనవారనీ వాదాలున్నాయి. సంస్కృత శాసనాలు ఆంధ్రప్రాంతంలోనే లభ్యమయినాయి కాబట్టి వానిలోని రాజులకు కాంచీపురంతో సంబంధం లేదని మరొకవాదం. ఈ వాదములు యదార్థములు కావు విజయ స్కందవర్మ ఒంగోడు (1) శాసనం లిపిలో, భాషలో ప్రాకృత శాసనాలకు చాల దగ్గిరగా ఉంది. అందలి కుమారవిష్ణువు ప్రాకృత శాసనాల శివస్కందవర్మకు చాల సన్నిహితుడు, బహుశా కుమారుడై యుండవలె. ఈ విజయ స్కందవర్మ కుమారుడు సింహవర్మ వేసంత శాసనం, సింహవర్మ ప్రపౌత్రుడు నందివర్మ ఉదయేందిరం శాసనం, సింహవిష్ణు చందలూరు శాసనం కాంచీపురినుండియే ఇచ్చినారు. చందలూరు శాసనం అందలి మొదటి కుమారవిష్ణువు శత్రుహస్తగతమైన కాంచీపురిని ఆక్రమించి పాలించినాడని స్పష్టంగా చెబుతున్నది. కాబట్టి సంస్కృత శాసనాల పల్లవులకు కాంచీపురంతో సంబంధం లేదనడం అసంగతం. అయితే, సింహవర్మకాలంలో తమ్ముడైన యువమహారాజ విష్ణుగోపుని ఆంధ్రప్రాంతంలో తన రాజప్రతినిధిగా నియమించినట్లు కన్పిస్తుంది. యు.మ. విష్ణుగోపుని సంతతివారు సార్వభౌములకు విధేయులుగా ఆంధ్రప్రాంతాన్ని స్వతంత్ర ప్రతిపత్తితో బహుశా పాలక్కడ రాజధానిగా పాలించినారు. చందలూరి శాసనంలోని రెండో కుమార విష్ణువుతో ప్రధానశాఖ అంతరించగా పాలక్కడ శాఖీయుడైన సింహవిష్ణువు కంచి సింహాసనాన్ని అధిష్ఠించి మహాపల్లవులకు మూలపురుషుడైనాడు.

# ప్రాచీన పల్లవ వంశవృక్షం

సింహవర్మ 280-310

శివస్కందవర్మ-I 310-335

విష్ణుగోప 335-350

బుద్ధవర్మ + చారుదేవి

బుద్ధ్యంకుర

కుమారవిష్ణు 350-370

స్కందవర్మ-II 370-385

వీరవర్మ 385-400

విజయస్కందవర్మ-III 400-436

కాంచీపురి

పాలక్కడ

సింహవర్మ-II 435-480

స్కందవర్మ-IV 480-490

యు.మ. విష్ణుగోప

నందివర్మ 490-500

కుమారవిష్ణు-II 500-520

సింహవర్మ

బుద్ధవర్మ 520-530

విష్ణుగోప

కుమారవిష్ణు-III 530 550

సింహవర్మ 550-570

సింహవిష్ణు 570-600

మహేంద్రవర్మ 600-630

సింహవర్మ (మంచికల్లు) పల్లవుల మూలపురుషుడు. ఇతనికి పీరకూర్చ (దర్శి, వాయల్పాడు) అనే బిరుదుంది. పుత్రపౌత్రాభివృద్ధి బప్పభట్టారక అని సగౌరవంగా వ్యవహరించినారు. సింహవర్మ ఇక్ష్వాకులకు సామంతుడుగా బహుశా కర్మరాష్ట్ర ప్రాంతాలను పాలిస్తూ, వారిపై తిరుగుబాటు చేసినాడు. విజయపురిపై దాడి సందర్భంలోనే మంచికల్లు జీవశివస్వామి ఆలయంలో శాంతి స్వస్త్యయనాలనాశించి త్రైర్థికులకు దానధర్మాలొనర్చినాడు. అనంతరం తొండై మండలం ఏలే నాగుల రాకుమార్తెను పెండ్లాడి కాంచీపురాధీశుడయినాడు. తొండై మండలాన్ని (అవురనాక్) బసరనాగ పాలిస్తున్నట్లు టాలెమీ వ్రాసినాడు (క్రీ. శ. 130). ఈ నాగులు బనవాసి చుటునాగ వంశశాఖ అయివుండవచ్చు. కాంచి సింహాసనమాక్రమించి సింహవర్మ తనకుమారుడు యువరాజు శివస్కంద వర్మను ఆంధ్రపథంపై రాజప్రతినిధిగా నియమించినాడు. ఈ విధంగా క్రీ.శ. 300 ప్రాంతంలో పల్లవవంశం స్వతంత్రమై పల్లవరాజ్య నిర్మాణం జరిగింది.

మంచికల్లు మినహా మిగిలిన ప్రాకృతశాసనాలలోని శివస్కందవర్మ లందరూ ఒక్కరే; ఇతడు సింహవర్మ కుమారుడు. ఈతని కాలానికి (క్రీ శ. 310-355) చుటునాగులు అంతరించడంచేత శివస్కందవర్మ కర్ణాటక ప్రాంతాల నాక్రమించి, కృష్ణా తుంగభద్రా కావేరీనదుల మధ్య ప్రాంతంలో విస్తరించిన తన సార్వభౌమత్వానికి సూచనగా అగ్నిష్టోమ, అశ్వమేధ, వాజపేయాలు చేసినాడు. ధర్మమహారాజు బిరుదం ధరించినాడు. ఈతని కాలంలో ఆంధ్రపథాన్ని యువ మహారాజు బుద్ధవర్మ ఏలినాడు. బుద్ధవర్మ భార్య చారుదేవి; కుమారుడు బుద్ధ్యంకురుడు.

శివస్కందవర్మ చివరిరోజుల్లోనే పల్లవ రాజ్యానికి ప్రమాదం వాటిల్లింది కర్ణాటకంలో కదంబవంశ స్థాపకుడైన మయూరశర్మ పల్లవులపై విజృంభించి నట్లు తాలగుండ శాసనం నుండి తెలుస్తున్నది. ఈ తిరుగుబాటు జరిగే సందర్భం లోనే బహుశా శివస్కందవర్మ మరణించినాడు. అనంతరం అనతికాలానికే సముద్రగుప్తుని దక్షిణ దండయాత్ర జరిగింది (క్రీ.శ. 345-50). నాడు విష్ణు గోపుడు కాంచీ పాలకుడుగా అలహాబాద్ ప్రశస్తి పేర్కొంటున్నది. ఈ విష్ణు గోపుడు పికిర, మంగడూర్ మొదలైన శాసనాల యువమహారాజ విష్ణుగోపుడు ఒక్కరేననే కొందరి అభిప్రాయము (డా॥ రమేశన్) సరికాదు. యు.మ. విష్ణు గోపుని కాలంలో అతని అన్న సింహవర్మ కాంచీపాలకుడు. అదీగాక యు.మ. విష్ణుగోపుని పేర్కొంటున్న శాసనాలకంటే ఓంగోడు (1) శాసనం ప్రాచీన మైనది. ఈ శాసనంలోని రాజులు శివస్కందవర్మకు యు. మ. విష్ణుగోపునకు మధ్యకాలంలోనివారై యుండవలె. కాబట్టి అలహాబాద్ ప్రశస్తిలోని కాంచేయక విష్ణుగోపునకు యు. మ. విష్ణుగోపునకు చాల కాలవ్యవధి వున్నట్లు

స్పష్టమవుతున్నది. కాంచేయక విష్ణుగోపుడు శివస్కందవర్మ తమ్ముడో కుమారుడో అయి వుంటాడు.

సముద్రగుప్తుని దండయాత్రవల్ల ఏర్పడిన సంక్షోభంలో ఉత్తరాంధ్రంలోని కర్మరాష్ట్రంలో కందారులు స్వతంత్రించినారు. దక్షిణంగా కావేరీమండలంలో తంజావూరు ప్రాంతంలో చోళులు విజృంభించినారు. ప్రాచీన తమిళవాఙ్మయంలో ప్రస్తుతి కెక్కిన కరికాలచోళుని విజయాలు బహుశా ఈ కాలానికి చెందినవని భావించవచ్చు. ఇట్టి పరిస్థితిలో విష్ణుగోపుడు రాజ్యత్యాగంచేసి సమర్థుడైన కుమార విష్ణువుకు సింహాసనం అప్పగించినాడు. విష్ణుగోపుడు నిస్సంతుగా మరణించియుండ వచ్చు. అందుచేత పల్లవ శాసనాలలో అతని ప్రసక్తి కన్పించదు. అసమర్థులైన వారిని తమ వంశవృక్షాలలో పేర్కొనకపోవడంకూడ మన రాజవంశాల సంప్రదాయమే గదా!

కుమారవిష్ణువు కదంబులతో సమాధానానికివచ్చి ఇతర తిరుగుబాట్లనణచి పల్లవ ప్రతిష్ఠను పునరుద్ధరించి అశ్వమేధం చేసినాడు (ఒంగోడు 1). ఇతని పౌత్రుడైన విజయ స్కందవర్మ మహా వీరుడు. కృష్ణానది పర్యంతం దండయాత్రలు చేసి కందారుల నోడించి తిరిగి కర్మరాష్ట్రంలో పల్లవాధికారాన్ని స్థాపించినాడు. ఈతడు చేబ్రోలు (విజయాంధ్రాప) నుండి దానశాసనం ఇచ్చినాడు. బహుశా ఆ సమీపంలోనే కందారులతో యుద్ధం జరిగివుంటుంది. స్కందవర్మ ప్రజాపాలనదక్ష, పంచమలోకపాలక, సర్వశాస్త్రార్థనిర్ణయతత్వజ్ఞ అనే బిరుదులు దాల్చినాడు.

స్కందవర్మకొడుకు రెండో సింహవర్మ ప్రాచీనపల్లవులలో సుప్రసిద్ధుడు. లోకవిభాగ, పెనుగొండశాసనము పేర్కొంటున్నది ఈ సింహవర్మనే. శక్రపట్టణం శాసనాన్ని ఇతడు తన 41 వ రాజ్య సంవత్సరంలో ఇచ్చినాడు కాబట్టి ఈతడు క్రీ.శ. 436 లో సింహాసనం ఎక్కి, 480 వరకు పాలించినాడని నిర్ణయించవచ్చు.

సింహవర్మ అనేక సమరావలబ్ధ విజయ యశుడు, స్వవిక్రమాక్రాన్త నృపశ్రీ నిలయుడు. కనీసం ఈతడు ఉత్తర, పశ్చిమ దిగ్విజయయాత్రలు జరిపి నట్లితని వేసంత, శక్రపట్టణం శాసనాలు నిదర్శనం. సింహాసనం ఎక్కినవెంటనే కర్మ రాష్ట్రం వరకు దాడి జరిపి, విష్ణుకుండి గోవిందవర్మ ఆక్రమించిన పల్లవ రాజ్యభాగాలను స్వాధీనం చేసుకున్నాడు. విష్ణుకుండుల దక్షిణవిస్తరణ నరికట్టే ఉద్దేశ్యంతో సామ్రాజ్యం ఉత్తర సీమల్లో తమ్ముడు, యువరాజైన విష్ణుగోపుని ప్రతినిధిగా నిలిపినాడు.

అనంతరం సింహవర్మ సామ్రాజ్యం పశ్చిమ సరిహద్దులపై దృష్టిమరల్చి నాడు. నాటికి పశ్చిమాంధ్ర ప్రాంతాలలో బాణులు విజృంభిస్తున్నారు. మొదట్లో

వీరు కర్నూలు జిల్లాలోని పర్వతారణ్య ప్రాంతాల్లో ఉన్నట్లు తెలుస్తుంది. మయూరశర్మ బృహద్బాణుని నుండి కప్పం పుచ్చుకున్నానని చెప్పుతున్నాడు. క్రమంగా వీరు అనంతపురం, కోలారు, ఉత్తర ఆర్కాటుజిల్లా ప్రాంతాన్ని ఆక్రమించినారు కోలారు జిల్లాలోని నందగిరి, అనంతపురం జిల్లాలోని పరివిపుర (పరిగి) వీరి ప్రధాన కేంద్రాలు. బాణుల విజృంభణ నరికట్టే ఆశయంతో సింహవర్మ గంగ కదంబవంశాల మధ్య సంఘర్షణలో జోక్యం కలిగించుకొని కర్ణాటకంలో వీరవిహారం చేసినాడు. గంగ అయ్యవర్మకు (హరివర్మ) సింహాసనం ఎక్కించినాడు.

సింహవర్మ ధర్మచింతనగల రాజు. రాజర్షి. గుణసర్వస్వసన్దోహుడు. ధర్మ మహారాజు బిరుదం ధరించిన పరమభాగవతుడు.

సింహవర్మ అనంతరం స్కందవర్మ కూడ కర్ణాటక రాజకీయాల్లో జోక్యం కలిగించుకొని మాధవవర్మను గంగసింహాసనం ఎక్కించి సహాయకారిగా ఉన్నాడు.

నందివర్మ సింహాసనం ఎక్కడంతో పల్లవవంశానికి దుర్దినాలు ప్రారంభ మయినాయి. ఆంధ్రదేశ స్థానిక చరిత్రల్లో శాసనాల్లో ప్రశస్తికెక్కిన త్రిలోచన పల్లవుడు నందివర్మయేనని కొందరి అభిప్రాయం. త్రిలోచనపల్లవ కరికాలచోళ గాథల్లో చారిత్రక సత్యంలేదని ఆచార్య నీలకంఠ శాస్త్రిగారి నిర్ణయం. నందివర్మ రేనాటిచోడులను సామంతులుగా చేసుకొన్నాడుగాని కదంబుల చేతుల్లో ఓడి పోయినట్లు కన్పిస్తుంది. మృగేశ్వరవర్మ (475-490), రవివర్మ (497-537) పల్లవుల నోడించినట్లు చెప్పుకొన్నారు. ఈ పరాజయాలతో కాంచీపురి సైతం శత్రు హస్తగతమైంది ఇట్టి పరిస్థితుల్లో కుమారవిష్ణువు కాంచీపురిని ఆక్రమించి అచట పల్లవ వంశాన్ని పునరుద్ధరించినాడు. కుమారవిష్ణువునకు అతని కుమారుడు బుద్ధవర్మ సహాయం చేసినాడు. బుద్ధవర్మను 'చోళసైన్యాబ్ధిబడబాగ్ని'గా వర్ణించి నందున కాంచీపురిని ఆక్రమించిన శత్రువులు రేనాటిచోడులని భావించవచ్చు. కదంబ శాసనాల్లో కన్పించే 'చండదండ' బుద్ధవర్మ అయిఉండవచ్చు. కదంబు లపై విజయం సాధించి రేనాటిచోడులను తిరిగి సామంతులుగా చేసుకున్నాడు. కుమారవిష్ణువు తన విజయాన్ని అశ్వమేధం ద్వారా ప్రకటించినాడు. బుద్ధవర్మ అనంతరం మూడో కుమారవిష్ణువుతో కాంచీపురి పల్లవ శాఖ క్రీ శ. 550 ప్రాంతంలో అంతరించింది.

**పాలక్కడ శాఖ**

తన సామ్రాజ్యంలో ఆంధ్రప్రాంతాలను ప్రత్యేకరాష్ట్రంగా చేసి, తమ్ముడు యువమహారాజ విష్ణుగోపుని సింహవర్మ నియమించినట్లు చెప్పినాము. విష్ణు గోపుడు అన్నకు విధేయుడుగా పాలించినాడు. ఇతని వంశస్థుల శాసనాలు

(ఉరువపల్లి, నెడుంగరాయు, విళవట్టి) ఏకన్నాపభాగం పాలక్కడనుండి ఇవ్వబడి నందున అదియే వారి రాజధాని అయివుండవచ్చు. నెల్లూరుజిల్లాలోని పులికాట్ (ప్రళయకావేరి) ను పాలక్కడగా గుర్తిస్తున్నారు. చిత్తూరు నెల్లూరు, ప్రకాశం మండలాలు, గుంటూరు మండలంలో అధికభాగం ఈ రాజ్యంలో చేరినాయి. యు.మ. విష్ణుగోపుని అనంతరం అతని కొడుకు సింహవర్మ పాలక్కడరాజ్యాన్ని స్వతంత్రంగా పాలించినట్లు కన్పిస్తుంది. ఈతని మంగడూరు శాసనాన్ని బట్టి ఈతడు వెంగో రాష్ట్రంలో దానధర్మాలు చేసినాడు వెంగో రాష్ట్రం వేంగియని కొందరి నిర్ణయం. కాని, నాడు వేంగిలో విష్ణుకుండులు బలవంతులై యున్నారు. సింహవర్మ బలవంతుడేగాని వేంగి రాష్ట్రంలో నాడు దానధర్మాలు చేయగల సామర్థ్యం ఉన్నవాడా అనేది అనుమానం. చిత్తూరు, నెల్లూరు మండలాలలో కొన్ని ప్రాంతాలు వేంగోరాష్ట్రంగా వ్యవహారంలో ఉన్నట్లు అచటి శాసనాలవల్ల తెలుస్తుంది. అదే మంగడూరు శాసనంలోని వేంగోరాష్ట్రంగా భావించడం యుక్తము. సింహవర్మ అనంతరం అతని కొడుకు విజయవిష్ణుగోపుడు పాలక్కడ రాజ్యం ఏలినాడు.

**మహాపల్లవ శాఖ**

రాజసింహుని వాయలూరు స్తంభశాసనం సూచిస్తున్నదాన్ని బట్టి విజయ విష్ణుగోపుని కుమారుడు సింహవర్మ 550 లో కాంచీపుర సింహాసనం అధిష్టించి మహాపల్లవ వంశానికి మూలపురుషుడయినాడు. సింహవర్మ మహాపరాక్రమ వంతుడు క్రీ.శ. 566 లో కర్మ రాష్ట్రంపై దండెత్తి రెండో విక్రమేంద్రునితో పోరాడినాడు. ఈ యుద్ధం వివాహసంబంధంతో ముగిసిందని, విక్రమేంద్రుడు తన కుమార్తెను సింహవర్మ కొడుకు సింహవిష్ణువునకిచ్చి పెండ్లి చేసెనని, ఆ వివాహ ఫలితమే మహేంద్రవర్మ యని కొందరి (సి. శివమూర్తిగారు) అభిప్రాయము. ఏమైనా ఇది జరిగిన అనతి కాలానికే విష్ణుకుండివంశం అంతరించి కృష్ణానదివరకు పల్లవాధికారం చెలామణి అయింది. మహేంద్రవర్మ కాలంలో (600 630) బాదామిలో రెండోపులకేశి విజృంభించి దక్షిణాపథ ఆధిపత్యాన్ని సంకల్పించినాడు. క్రీ శ. 617 నాటికి కర్మరాష్ట్రాన్ని పులకేశి జయించినాడు. అనంతరం 630 లో పులకేశి పల్లవరాజ్యంపై దండెత్తి, కాంచీపురి వరకు నడచి నాడు. కాంచీనగరకి 15 మైళ్ళదూరంలో ఉత్తరంగా ఉన్న పల్లలూరుదగ్గిర జరిగిన యుద్ధంలో మహేంద్రవర్మ పరాజయం పొందినాడు. దక్షిణ తీరాంధ్రాన్ని చాళుక్యులాక్రమించినారు. పల్లవుల ఆంధ్రదేశాధిపత్యం అంతరించింది. వారు పూర్తిగా దాక్షిణాత్యులయినారు.

# రేనాటిచోడులు

పల్లవ చాళుక్య సంఘర్షణల్లో సైనిక సంచలనం వల్ల రాయలసీమ ప్రాంతం రాజకీయంగా చైతన్యవంతమయింది. స్థానిక ఆటవికజాతులను జయించి వారి పాలనలో సామంత రాజ్యాలు నెలకొల్పే ప్రయత్నాలు పల్లవులు చాళుక్యులు చేశారు. ఫలితంగా రేనాటిచోడ, బాణ, వైదుంబ రాజ్యాలీప్రాంతంలో ఏర్పడినాయి. వీరిలో తెలుగుచోడ లేక రేనాటిచోడులు ప్రథములు.

రేనాటి చోడులు సప్తసహస్రగ్రామ సమన్వితమైన రేనాడును (రేనాడు 7000 కడప, కర్నూలు, చిత్తూరు జిల్లాలు) 6,7 శతాబ్దాలలో పాలించినారు. ఈ ప్రాంతమునే చోళవాడి అనేవారని, చోళుల జన్మస్థలం ఇదేనని కొందరి (బి. వి. కృష్ణారావుగారు) వాదము. రేనాటిచోడులు కాశ్యపగోత్రులు; సాంఘిక పరంగా గౌరవం సాధించి ఉన్నత వర్ణాలలో చేరేవారికి కాశ్యపగోత్రాన్ని ధర్మ శాస్త్రాలు నిర్దేశించినాయి. కరికాలవంశస్థులమని చెప్పుకున్నారు. కావేరీనదికి వరదకట్టలు కట్టించే సందర్భంలో కరికాలుడు త్రిలోచన పల్లవుని నియమించె నన్న గాథ వీరి శాసనాల్లో మొదటిసారిగా కన్పిస్తున్నది. వీరి చరిత్రకు పుణ్య కుమారుని మాలెపాడు, దొమ్మెర నంద్యాల శాసనాలు; శ్రీకంఠచోళుని మద్రాస్ మ్యూజియం శాసనం ముఖ్యఆధారాలు. ఇటీవల దొరికిన పెదచప్పల్లి శాసనం గూడ శ్రీకంఠునిదే అయివుండవచ్చు ఇవిగాక వీరివి అనేక శిలాశాసనా లున్నాయి. వీనికి చారిత్రకప్రాముఖ్యం లేదుగాని తెలుగుభాషాపరిణామంలోని ప్రథమదశలు గ్రహించడానికి చాల అమూల్యములు. ఈ శాసనాలన్నింటిలో కలుమెళ్ళ శాసనం మొట్టమొదటి తెలుగుశాసనంగా గుర్తింపుపొందింది.

ప్రచారంలో నున్న గాథలను బట్టి కరికాలుడు కడప ప్రాంతారణ్యాలను ఛేదించి పంటపొలాలుగా మార్చి పొత్తపినగరం నిర్మించాడు; ఆ ప్రాంతమే పొత్తపినాడై క్రమంగా రేనాడులో అంతర్భాగమయింది. కరికాలుని కొడుకు దాసవర్మ పాకనాడు (నెల్లూరు జిల్లా) రేనాడు, పొత్తపినాడులను కలిపి పొత్తపి నుండి పాలించినాడు. అతని సంతతివారే రేనాటిచోడులని వారి శాసనాల నుండి తెలుస్తున్నది.

రేనాటిచోడుల మూలపురుషుడు నందివర్మ ఈతడు క్రీ. శ. 500 ప్రాంతంవాడు. ఈతని తండ్రి బహుశా పల్లవ నందివర్మకు సామంతుడై అతని పట్ల అభిమానంతో తన కొడుకునకు ఆ పేరు పెట్టివుంటాడు. కాని, నందివర్మ పల్లవులపై తిరుగుబాటు చేసినట్లు కన్పిస్తుంది. తిరిగి రెండో కుమారవిష్ణువు కాలంలో రేనాటిచోడులు పల్లవులకు సామంతులయినారు. నందివర్మకు సింహ విష్ణు, సుందరానంద, ధనంజయవర్మ అనే కుమారులున్నారు. వీరిలో సుందరా నంద, ధనంజయవర్మ రాజ్యాన్ని విభజించుకొని నిడుగల్లు, చిర్రులి రాజధానులుగా

పాలించినారు. వీరి శాసనాలలో ఎరిగల్ ముత్తురాజు, ఎరిగళ్దుగరాజు అనే పేర్లు తరచుగా కన్పిస్తాయి. నిడుగల్లుకు రూపాంతరమే ఎరిగల్. తిప్పలూర్ శాసనాన్ని బట్టి పుణ్యకుమారుడు చీర్పులినుండి పాలించినట్లు స్పష్టము. చీర్పులి శాఖయే ప్రధానమైన శాఖ.

నందివర్మ పౌత్రుడు మహేంద్రవిక్రమవర్మ. ఇతనికి 'ముదితశిలాక్షర' 'నవరామ' అనే బిరుదులున్నాయి. ఇతడు శబ్దశాస్త్రపారంగతుడు. పల్లవులు నడిపిన పాండ్య, చేర దండయాత్రలలో నీతడు ప్రముఖపాత్ర నిర్వహించినట్లు తెలుస్తుంది. ఈతని చోళమహారాజ బిరుదం స్వతంత్ర ప్రతిపత్తిని సూచిస్తున్నది.

మహేంద్రవిక్రమవర్మ కుమారుడు పుణ్యకుమారుడు (625 - 50). రేనాటి చోడులలో సుప్రసిద్ధుడు ఈతని పాలనలో రేనాటిచోడులు ఉచ్ఛస్థితిలో ఉన్నారు. సర్వస్వతంత్రుడుగా వ్యవహరించినా పుణ్యకుమారుడు కొంతకాలం పల్లవులకు అనంతరం చాళుక్యులకు సామంతుడుగా నుండినట్లు అతని బిరుదాలవల్ల తెలుస్తుంది. పోర్ముఖరామ, పురుషశర్దూల, ఉత్తమోత్తమ అనే బిరుదులు పల్లవ మహేంద్రవర్మ బిరుదుల్ని, 'పృథ్వీవల్లభ' బిరుదం చాళుక్యుల బిరుదును సూచిస్తున్నవి. ఈతని రాణి వసంతపోరి. ఈమె పేరు సయితం చాళుక్యసంబంధియే. పుణ్యకుమారుని అనంతరం విక్రమాదిత్య, శశికుమార, విక్రమాదిత్య సత్యాదిత్య మొదలైన వారు పాలించినారు. సత్యాదిత్యుడు (క్రీ.శ 750 ప్రాంతము) రేనాడును, సిద్ధి రాష్ట్రము 1000 ను కలిపి పాలించి చోళమహారాజాధిరాజ బిరుదం ధరించినాడు.

సత్యాదిత్యుని అనంతరం రేనాటిచోడవంశం క్షీణించింది. వీరి సార్వభౌములైన బాదామి చాళుక్యులు గూడ బలహీనులయినారు. ఇదే సమయంలో రేనాడు సమీప ప్రాంతాలలో నొలంబులు, వైదుంబులు విజృంభించి, తమ కలహాలలోనికి చోడుల నీడ్చినారు. చివరి చోడులలో నొకడైన ఎలచోళమహారాజు తిరుగల్లుచెంత వైదుంబుల చేతిలో నోడిపోయినాడు. ఇదే సమయంలో రాష్ట్రకూటాధిపుడైన ముమ్మడి గోవిందుడు తుంగభద్రాతీరం వరకు ఆక్రమించినాడు. చాళుక్యులకు సామంతులైన రేనాటిచోడులను నిర్మూలించడమే ఆశయంగా రాష్ట్రకూటులు వైదుంబులను వారిపై పురికొల్పినారు. రేనాటిలో నిలువనీడలేక, చోడులు తూర్పు చాళుక్య రాజ్యానికి వలసబోయి, కొణిదెన, కందుకూరు, నెల్లూరు మొదలైన స్థావరా లేర్పరచుకొన్నారు. రేనాడును వైదుంబ గండ త్రినేత్రుడు ఆక్రమించినాడు.

# యుగవిశేషాలు

శాతవాహన చాళుక్యయుగాల మధ్యకాలంలో (క్రీ శ. 200-600) ఆంధ్ర దేశ రాజకీయాలకు తీరప్రాంతమే కేంద్రమయింది. రాయలసీమ ప్రాంతం కొంతగాను తెలంగాణం పూర్తిగాను రాజకీయ ప్రాముఖ్యం కోల్పోయినాయి. ఇందుకు కారణం, శాతవాహన యుగాంతానికి వాణిజ్యం, పరిశ్రమలు క్షీణించి వ్యవసాయమే ఆర్థిక వ్యవస్థకు కీలకం కావడం. తీరాంధ్రంలో పలురాజ్యాలేర్పడి రాజవంశాలు పరస్పర యుద్ధాలలో మునిగితేలినాయి రాజులు 'అనేక సమరావాప్తవిజయ' వంటి బిరుదులు ధరించినారు. పాలనాయంత్రాంగం క్లిష్టమయింది. వ్యవసాయం ప్రధాన పరిశ్రమ కావడంతో రాజుకు రైతుకు మధ్య భూస్వాములు ఏర్పడి, ఆర్థిక సామాజిక వ్యవస్థలో నూతన పరిణామాలకు కారణమయింది. బ్రాహ్మణమతశాఖలైన శైవవైష్ణవాలు రాజాదరణతో జనవ్యాప్తి సాధించి. బౌద్ధం నానాటికీ క్షీణించింది. బౌద్ధంలో తాంత్రిక పూజా విధానం విస్తరించింది. తెలుగు భాష ప్రాథమిక పరిణామదశలు గడిచి శాసన భాషగా ప్రచారంలోనికి రావడం ఈ యుగ ఆంధ్ర సాంస్కృతిక జీవితంలో ఒక గొప్ప విశేషం.

**పాలనావిధానం**

శాతవాహన పరిపాలనావిధానాన్నే కొద్దిమార్పులతో ఈ యుగంలో అనుసరించినారు. రాజులు నిరంకుశులేగాని శ్రుతిస్మృతివిహితంగా ప్రభుత్వం నిర్వహించినారు. రాజులు వివిధ శాస్త్రాల్లో పండితులై న్యాయనిర్వహణాది విషయాల్లో సుశిక్షితులైనట్లు శాసనాలనుండి తెలుస్తున్నది. ధర్మమహారాజ, పంచమలోకపాలకాది బిరుదులు నాటి ప్రభువుల ధర్మనిరతిని సూచిస్తున్నాయి. రాజుకు సలహా ఇచ్చి సహాయంచేయడానికి మంత్రిమండలి ఉండేది. అత్యవసర పరిస్థితుల్లో మంత్రిమండలి ప్రత్యేకాధికారాలు నిర్వహించేది. తన శాసనాల్లో రెండో విక్రమేంద్రుడు 'ప్రకృతిమండలేన శైశవఏవ ఆరోపితరాజ్యభార' అని చెప్పుకున్నందున బాల్యంలోనే ఇతణ్ణి మంత్రిమండలి సింహాసనం ఎక్కించినట్లు భావిస్తున్నారు. యువరాజులు రాకుమారులు పరిపాలనలో రాజుకు తోడ్పడేవారు ముఖ్యంగా పల్లవులలో కుమారునిగాని, సోదరునిగాని యువరాజ్యపట్టాభిషిక్తునిజేసి 'యువమహారాజ' బిరుదంతో పాలనాభారం వహింపజేయడం ఆచారంగా ఉండేది. ఇక్ష్వాకుల కాలంలో మహాతలవర, మహాదండనాయక బిరుదులు ధరించిన సామంతులు రాజుకు సాయం చేసేవారు తరువాతకూడ అమాత్య, సేనాపతి, మహాదండనాయక, కోష్ఠాగారాది ఉద్యోగులు రాజుకు అండగా ఉండేవారు. పరరాజులను జయించి అశ్వమేధ రాజసూయాల ద్వారా సార్వభౌమత్వం ప్రకటించుకోవడం వారి ఆశయం. అందుచేత తరచు పోరాటాలు జరుగుతుండేవి. విష్ణుకుండి మాధవవర్మ, పల్లవ సింహవర్మ దిగ్విజయయాత్ర లొనర్చినారు. కొందరు

రాజులు 'ధర్మవిజయ' అనే బిరుదం దాల్చినారు. ఈ బిరుదాన్ని సరిగా నిర్వ చించడం సాధ్యం కాదు. సైన్యంలో గజబలానికి ప్రాముఖ్యం ఇచ్చేవారు. చాతుర్దంత యుద్ధాలలో విష్ణుకుండులు ఆరితేరినవారు. కందారరాజు అంధ్రాధిపతి గజఘటలను సంగ్రహించినాడట.

స్థానికపాలనలో ప్రాంతీయ భేదాలు కన్పిస్తున్నాయి. శాతవాహనులవలె బృహత్ఫలాయనులు రాష్ట్రములను ఆహారములని పిల్చినారు. ఆహారాధిపతి వ్యాపృతుడు. ఇక్ష్వాకులు తమ రాజ్యాన్ని రాష్ట్రములుగా విభజించి సామంత ప్రభువుల పాలనలో నుంచినారు. వీరి సామంతులలో పూగీయులు, చాళుక్యులు, బహుశా పల్లవులు ముఖ్యులు సామంతులు రాజధానిలోనేవుంటూ మహాదండ నాయక, మహాసేనాపతి ఉద్యోగాలలో రాజుకు తోడ్పడేవారు. ఒకేవ్యక్తి రెండు మూడు ఉద్యోగాలు సయితం నిర్వహించేవాడు. శాలంకాయనులు తమ రాజ్యాన్ని విషయాలుగా విభజించి విషయాధిపతులను లేక దేశాధిపతులను నియమించి నారు. వీరి గ్రామాధికారికి ముతుడ అని పేరు. విష్ణుకుండులు విషయము, రాష్ట్రము పర్యాయపదాలుగా వాడినారు. అధికార పురుషులు, మహాత్తరులు అనేవారు విషయాధిపతులు. ప్రతి విషయంలోను దేశాక్ష పటాలాధికృత అధీనంలో ఒక కార్యాలయం ఉండేది. మాఠరుల శాసనాల్లో కుమార అమాత్యు లనే ఉద్యోగుల ప్రసక్తి ఉంది.

పల్లవులరాజ్యం విస్తీర్ణంలో పెద్దదైనందున పాలనాయంత్రాంగం క్లిష్ట తరమై ఉద్యోగిబృందం పెద్దదిగా ఉండేది. వారు రాష్ట్రాలను పథము, రాష్ట్రము - ఆంధ్ర పథము, కర్మరాష్ట్రము, వెంగో రాష్ట్రము, ముండక రాష్ట్రము - అని వ్యవహరించినారు. రాష్ట్రాలపై సాధారణంగా రాకుమారులే పాలకులుగా ఉండేవారు. రాష్ట్రాన్ని భోగాలుగా, మాతబములుగా విభజించి నారు. కర్మరాష్ట్రంలో కవచకారభోగం ఉండేది. మాదబికుడు మాదబంపై అధికారి. పల్లవ శాసనాల్లో ధాన్యకటకం, తాంబ్రాప (చేబ్రోలు), దశనపుర (దర్శి), మేన్మాతుర, పాలక్కడ తరచుగా కన్పిస్తున్నాయి. ధాన్యకటకం ఆంధ్రపథానికి; మిగిలినవి రాష్ట్రాలకో, మాదబాలకో కేంద్రాలని చెప్పవచ్చు. వీరి శాసనాల్లో కన్పించే ఉద్యోగుల అధికార విధులను స్పష్టంగా నిర్వచింపలేము. రఠికులు రాష్ట్రోద్యోగులు, అమాచపదం రాష్ట్రామాత్యులనుద్దేశించింది. దేశాధి కృత, ఆయుక్తక నియుక్తులు మండలాధిపతులు; అధ్యక్షులు, రాజవల్లభులు ప్రభుత్వ పర్యవేక్షకులు; రహస్యాధికృత బహుశా విశ్వాసామాత్యుడు. గుమిక, అరణ్యాధికృత అనేవారు స్థానిక సైనికోద్యోగులు. శాతవాహనులకాలంలో కూడ గుమిక ప్రస్తావన ఉంది. బహుశా సరిహద్దు రాష్ట్రాలపై నియమించిన సైనిక రాజ్యప్రతినిధియే గుల్మికుడు. రాజశాసనాలను బహిరంగపరచే ఉద్యోగి శాసన

సమరాంతకుడు; మహాబలాధిక్రృత, దండనేత శాసనాలు అమలుపరిచేవారు. పల్లవ, గోపల్లవులు గ్రామోద్యోగులు; బహుశా పశు సంరక్షణ వీరి ప్రత్యేక ధర్మము.

ప్రభుత్వ ఆదాయానికి భూమిశిస్తుతోబాటు పెక్కు పన్నులుండేవి. ఉప్పు, పంచదారలపై పన్నులు విధించేవారు. శివస్కందవర్మ శాసనంలో వృత్తిపన్నుల ప్రసక్తి ఉంది. లోహ, చర్మకారులు, సాలీలు జూదగాండ్రు, మంగలివాండ్రు, దొమ్మర్లు కూడ వృత్తిపన్ను చెల్లించేవారు. వినోదగృహాలు పన్ను చెల్లించేవి. వివాహంలో ఇరుపక్షాలు పన్ను చెల్లించవలె. ప్రభుత్వోద్యోగులు పాలు, వెన్న, మజ్జిగ, పూలు, పండ్లు, కసవులను వసూలుచేసేవారు. నేరనిర్ణయానికి అగ్ని, జల, విష పరీక్షలుండేవి. వీనిని దివ్యములు అనేవారు న్యాయదక్షుడైన మాధవవర్మకు "అనసిత వివిధ దివ్య" అనే బిరుదుండేది. దేశంలో సైనికులు, గూఢచారులు విచ్చలవిడిగా తిరిగేవారు. దండయాత్రల సందర్భంలో రాజశిబిరానికి అవసరమైన సదుపాయాలను ఆయా గ్రామ ప్రజలు చేయవలె. అందుచేతనే 'రాజ సామీప్యం' ఈతిబాధలలో ఒకటిగా పేర్కొన్నారు. ఇట్టి పరిస్థితులవల్ల నాటి ప్రజాజీవనం సుఖంగా ఉండేది కాదని తెలుస్తున్నది. రాజు లెంతవరకు ప్రజాహితైకతత్పరులో అనుమానాస్పదము.

## సాంఘిక ఆర్థిక పరిస్థితులు

శాతవాహన యుగాంతానికి రోమన్ సామ్రాజ్యంతో వాణిజ్యం క్షీణించి పరిశ్రమలకు నష్టంవాటిల్లి వ్యవసాయంపై ప్రజానీకం దృష్టి మరలడంతో విపరీతమైన ఆర్థిక సాంఘిక పరిణామాలు జరిగాయి. ప్రభుత్వాదాయానికి ప్రధాన సాధనమైనందున ప్రభువులు వ్యవసాయాభివృద్ధిపట్ల శ్రద్ధ వహించినారు. శ్రీచాంతమూలుడు అనేక హిరణ్యకోటి గోశతసహస్ర హలశతసహస్రప్రదాయి. కరికాలుడు పినాకినీ సువర్ణముఖీ నదులపొడ్డున అడవులు ఛేదించి కొత్త గ్రామాలు, నగరాలు నిర్మించినాడు. త్రిలోచనపల్లవునకు 'అడవులు ఛేదించినవాడు' అనే అర్థం ఇచ్చే 'కాడువెట్టి' బిరుదం ఉంది. రాజులు బ్రాహ్మణులకు మతసంస్థలకు భూదానాలు విరివిగాచేసేవారు. అక్కడక్కడ బౌద్ధ సంస్థలకుగూడ భూదానాలు లభించినాయి. 'భూమిదానాత్ పరం నాస్తి' అనేవాదం ప్రచారమయింది. ఈ దేవ బ్రాహ్మణమాన్యాలను శూద్రులు సాగుచేసేవారు. అయితే దానశాసనాల చివర్లో కనిపించే వ్యాసగీతలు కొంత సాంఘిక సంఘర్షణను సూచిస్తున్నాయి. భూదానం నష్టపరచినవారికి ఇహంలో రాజదండన, మరణానంతరం రౌరవాదినరకప్రాప్తి అనే హెచ్చరికలవల్ల నాటి బ్రాహ్మణుల, ఇతర మతసంస్థల దానభూములకు ప్రజానీకం ఆటంకాలు కల్పించి ఉంటారనే అభిప్రాయం కలుగుతుంది.

"బ్రహ్మస్వం విషం ఘోరం, నవిషం విషముచ్యతే విషం ఏకాకినం హంతి బ్రహ్మస్వం పుత్ర పౌత్రికం" అంటూ బ్రాహ్మణులసొత్తు హరించినవారి వంశ నాశనం జరుగుతుందనే హెచ్చరిక కూడ జరిగింది క్రమంగా శూద్రులు స్వీయ ఆర్థికదుస్థితివల్ల నాటి పరిణామాలతో సమాధానపడి దేవబ్రాహ్మణ మాన్యాలను సాగుచేయసాగినారు. ఈ భూగ్రామదానాలు అష్టాదశపరిహారయుక్తంగా జరిగేవి. ఈ పరిహారాలవల్ల దానగ్రహీతలకు హక్కులు అధికారాలు సంక్రమించి ఆర్థికంగా రాజకీయంగా బలపడి వారు సామంతకౌన్నత్యాన్ని సాధించగలిగేవారు. ఈ విధంగా గ్రామీణ ప్రాంతాల్లో రాజుకు రైతులకుమధ్య భూస్వామికవర్గం బలపడసాగింది.

ఐతే రాజ్యంలోని పంటపొలం యావత్తూ రాజుదే అనే మౌలిక భూస్వామ్య సూత్రం అమలులోలేదు. రాజక్షేత్రం పరిమితమై మిగిలిన పంటపొలం వ్యక్తులకుగాని గ్రామాలకుగాని సమిష్టిగా చెందేది రాజక్షేత్రాలకు వెలుపల భూమిని దానం చెయ్యాల్సి వచ్చినపుడు రాజు ఆ భూమిని కొని దానంచేసేవాడని ఉర్లాం శాసనంద్వారా తెలుస్తున్నది.

గ్రామాలలో చేతిపరిశ్రమలు జరుగుచున్నట్లు విశపట్టి శాసనం సూచిస్తున్నది. కాని, ఇందలి ఉత్పత్తి ఉద్దేశ్యం గ్రామ అవసరాలను తీర్చడమేగాని దేశీయ విదేశీయ వాణిజ్యంగా కన్పించదు. శాతవాహన ఇక్ష్వాకు శాసనాల్లో తరచు కన్పించే నిగమ సభల, సెట్టిగహపతుల శ్రేణుల ప్రస్తావన ఈ యుగశాసనాల్లో లేకపోవడం విశేషం. గత యుగంలోని ద్రవ్యసంబంధమైన ఆర్థిక విధానం కూడ క్షీణించింది. ఇక్ష్వాకుల అనంతరం నాణేలు ముద్రించినవారు విష్ణుకుండులే. కాని, శాతవాహనుల నాటి పనితనం విష్ణుకుండుల నాణేలలో కన్పించదు. విష్ణుకుండుల నాణేలకుపయోగించిన లోహం కూడ చవక బారుది; రాగి మలామా చేసిన ఇనుము అని తెలుస్తున్నది. దీనివల్ల నాటి దేశ ఆర్థిక దుస్థితి స్పష్టమవుతున్నది పరిశ్రమలు, వాణిజ్యం క్షీణించడంతో ప్రాచీన నగరాలు, వానిని కలిపే రహదారులు నష్టపడినాయి. ఈ పరిణామాలవల్ల చైతన్యయుతమైన శాతవాహనయుగ నాగరిక జీవనవిధానం క్షీణించి, స్వయం పోషకమై, బాహ్యసంబంధాలు పరిమితమైన గ్రామీణ జీవితవిధానం పెరిగింది.

నాటికి వర్ణవ్యవస్థ ఇంకా ఘనీభవించలేదు. వైదికయుగంలో ప్రారంభమైన అటవిక వైదేశిక జాతుల సంస్కృతీకరణ కొనసాగింది. బృహత్పలాయనులు శకులని పైన పేర్కొన్నాము. అదే విధంగా పల్లవులకు భారద్వాజ గోత్రం ద్వారా అగ్రవర్ణంలోకి ప్రవేశం లభించింది. పల్లవులు వైదిక ధర్మం పట్ల ప్రత్యేకాభిమానం ప్రదర్శించడానికి, 'కలియుగ దోషావసన్న ధర్మోద్ధరణ సత్యసన్నద్ధ' అని చెప్పుకొనడానికి అదే కారణంగా భావించవచ్చు; అయితే

చిరకాలం క్షత్రియధర్మం అనుసరించినందున క్షత్రియులైనారు. బ్రాహ్మణ ధర్మాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారనే నెపంతో పల్లవులమీద పిడుగుపాటులా విజృంభించిన కదంబ మయూర శర్మ సంతతివారు సయితం వర్మలైనారు. కదంబులు కూడ ప్రాయికంగా ఆటవిక జాతియేననే అభిప్రాయం వుంది. బ్రాహ్మణులు వేదవేదాంగ ధర్మశాస్త్రవిదులై యజన, యాజన, అధ్యయన, అధ్యాపన, దాన, ప్రతిగ్రహణ అనే షట్కర్మ నిరతులై వుండేవారు కాని, అధిరాజ ఇంద్రుడనివలె శస్త్రోపజీవులై ఉద్యోగ నిర్వాహకులైన బ్రాహ్మణులు సయితం లేకపోలేదు. ఆర్థికంగా బలపడి రాజకీయంగా ఉన్నతి సాధించినవారిలో బ్రహ్మత్వం మీద 'మోజు' ఆనాటికే ఏర్పడింది. విష్ణుకుండులు 'బ్రహ్మక్షత్రతేజోత్పాదం'అని చెప్పుకొనడంలోను మాధవవర్మ పరమేష్ఠిత్వాన్ని సాధించినాడని చాటడంలోను ఈ తాపత్రయం ప్రతిఫలిస్తున్నది.శాలంకాయను కానుకొల్లు శాసనాలలో చతుర్వేదులైన రథకారుల ప్రస్తావన ఉంది. ధర్మశాస్త్రాలను అనుసరించి రథకారులు బ్రాహ్మణేతరులైన మిశ్రసంతతివారని తెలుస్తుంది. అయితేనేమి శాసనాంశాన్ని రెండు విధాలుగా సమర్థించవచ్చు. పూర్వకాలంలో బ్రాహ్మణులు సంగీత నాట్యాది శాస్త్రాలు శిల్పాగమాలు అభ్యసించి, విద్యార్థులకాయా శాస్త్రాలు బోధిస్తూ ఆయా కృషులను పర్యవేక్షణచేస్తూ ఉండేవారు. ఈ చతుర్వేద రథకారులు అట్టి బ్రాహ్మణులయి వుండవచ్చు. లేదా తమ వృత్తికి నాడున్న రాజకీయ ప్రాముఖ్యం వల్ల ఆర్థికోన్నతి సాధించి తద్వారా బ్రహ్మత్వం పొందిన రథకారవృత్తులవారై యుండవచ్చును. ఇక వైశ్య శూద్ర వర్ణాలను గురించి నాటి శాసనాల్లో వర్తమానం మృగ్యమే!

**మత పరిణామాలు**

శాతవాహనాంతసమయం వైదికమతోద్ధరణోద్యమంలో జరిగినట్లు చూచినాము. ఇక్ష్వాకు వంశస్థాపకుడైన శ్రీచాంతమూలుడు అశ్వమేధాది వైదికకర్మలొనర్చి బ్రాహ్మణమతోద్ధారకుడైనాడు. అతని కాలంలో శ్రీపర్వత బౌద్ధక్షేత్రానికి కొంత దైన్యత వాటిల్లి వుంటుంది. ఇక్ష్వాకు అంతఃపురాంగనలు బౌద్ధమతాభిమానులు కావడంవల్ల చాంతమూలుని తరువాతి రాజులు బౌద్ధం పట్ల సహనం వహించినారు. అందుచే బౌద్ధం పునరుజ్జృంభించింది. ఇక్ష్వాకుల బౌద్ధమతాదరణయే వారి పతనహేతువైనట్లు చెప్పవచ్చు. 'వీర బ్రాహ్మణ మతాభిమానులైన పల్లవ బృహత్ఫలాయన విజృంభణకు ఇక్ష్వాకులు బలి అయినారు. ఇక్ష్వాకుల అనంతరం శ్రీపర్వతప్రాంతాన్ని ఏలినవారు పల్లవులే. పల్లవ బృహత్ఫలాయన శాలంకాయన విష్ణుకుండి వంశస్థులు వైదిక మతోద్ధరణమే రాజధర్మమని భావించినట్లు కన్పిస్తుంది. పల్లవులు ధర్మమహారాజ బిరుదం ధరించినారు. ఈ వంశాలలో పరమబ్రహ్మణ్యులం తరచు కన్పిస్తారు విష్ణుకుండుల

కాలంలో వైదికధర్మనిష్ఠ పరాకాష్ఠనందుకొన్నది. మాధవవర్మ ఏకాదశాశ్వమేధావభృథస్నానములచే జగత్కల్మషాన్ని ప్రక్షాళనం చేసినాడట! సువర్ణ, పౌండరీక పురుషమేధ, సర్వమేధ ప్రాధిరాజ్య ప్రాజాపత్య రాజసూయాది అనేక దుష్కరక్రతువు లొనర్చినాడు. ఈతడు మూర్తీభవించిన వైదికకర్మనిష్ఠ వలె నున్నాడు సువర్ణగర్భ మహాదానాలు ఈ యుగంలో తరచూ కన్పిస్తాయి. బహుశా ఇవి మతాంతీకరణ లేక పవిత్రీకరణ క్రతువులయి వుంటాయి.

అయితే, శాతవాహన యుగానికే వైదికమతం పౌరాణిక మతంగా పరివర్తన చెందసాగింది. పౌరాణిక మతానికి శివ లేక విష్ణు ఆరాధన, దానధర్మాలు, తీర్థాటన ముఖ్యమైనవి. ఈ యుగానికి పౌరాణిక మతశాఖలయిన శైవ వైష్ణవాలు జనాదరణ పొందినాయి. ఇవి శాతవాహన యుగంలోనే ప్రారంభమయినాయి. విజయపురిలో శివునకు, విష్ణునకు, శక్తికి, మహాసేనునకు ఆలయాలున్నాయి. 'హిందూ' మతంలోని షణ్మతాలకు వీరు కేంద్రాలు. నాటి రాజులలో పరమ మాహేశ్వరులు, పరమభాగవతులు ఉన్నారు. వైష్ణవం కంటే ఆంధ్రదేశంలో శైవమే ప్రాచుర్యం వహించినట్లు కన్పిస్తుంది ఇక్ష్వాకులు శైవులు; మహేశ్వరుడు బృహత్పలాయనులు ఇష్టదైవం; శాలంకాయనులు వృషభలాంఛనులు. విష్ణుకుండులలో ఇంద్రభట్టారక, విక్రమేంద్రవర్మలు (చిక్కుళ్ళ శా.) పరమ మాహేశ్వరులు. తూర్పుగంగులు గోకర్ణమహేశ్వరుని ఆరాధించినారు. శివునితో బాటు స్కంధ గణపతి ఆరాధన ఎక్కువయిందనడానికి నాటి స్కంధవర్మ, హస్తివర్మ అనే పేరులే నిదర్శనం రుద్రదత్త, నందిదత్త, శివస్కంధ, రుద్రపురుషదత్త పేర్లు తరచుగా కన్పిస్తాయి. విజయపురిలో, చేబ్రోలులో మహాసేనాలయాలు వెలసినాయి. పృథ్వీమూలుడు పరమమాహేశ్వరుడనని చెప్పుకున్నాడు అమరావతీ శిల్పాలలోనే గజముఖయక్షుడు కన్పిస్తాడు. మాధవ వర్మ (క్రీ. శ. 500) గణపతి ప్రతిష్ఠ చేసినట్లు వేల్పూరు శిలాశాసనం నుండి తెలుస్తున్నది. మృతులైనవారి పేర బాణలింగాలు వేయసాగినారు; అంటే లయకారుడుగా మహేశ్వరునకు పూర్తి గుర్తింపు వచ్చింది. వైష్ణవుడైన సూర్యునకు శివునితో పొత్తు కుదిరింది. మహేశ్వరులైన శాలంకాయనులు చిత్రరథస్వామి భక్తులు. సౌరపురాణం శివసూర్యులకు అభేదం సూచిస్తున్నది.

శైవంతో ఇంచుమించు సమంగా వైష్ణవం ప్రచారమయింది. ఇక్ష్వాకుల కాలంలోనే విజయపురిలో అష్టభుజస్వామిని అభీరులు నెలకొల్పినారుగదా! భాగవత పురాణం ప్రకారం దక్షుడు పునర్జీవితుడైన వెంటనే నారాయణుని విరాట స్వరూపాన్ని అష్టభుజస్వామిగా కీర్తించినాడు. పల్లవులలోని సింహవర్మ సింహవిష్ణు, విష్ణుగోపమహారాజు వైష్ణవమతస్థులే పల్లవులు కుందుకూరులో విష్ణుహార దేవాలయాన్ని దాలూరులో కులిమహాతారకనారాయణ ఆలయాన్ని నిర్మించి

పోషించినారు. శాలంకాయనులలో రెండో హస్తివర్మ రెండో నందివర్మ పరమ భాగవతులు. నందివర్మ త్రైలోక్యనాథుడైన విష్ణుగృహస్వామి భక్తుడు. హస్తివర్మ "భగవన్నారాయణ చరణారాధన రజోవపుశ్రీక శిరస్కుడు." విష్ణుకుండులలో పరమమాహేశ్వరులిద్దరు మినహాయించి మిగిలిన వారందరూ వైష్ణవులే! విష్ణుని అవతారాలలో ముఖ్యంగా నరసింహ త్రివిక్రమ, రామ, కృష్ణ అవతారాలు జనాదరణ పొందినట్లు ఉండవల్లి, మొగల్‌రాజపురం గుహాశిల్పాలు సాక్ష్యము. శ్రీ పర్వతస్వామి విష్ణుమూర్తి తొమ్మిదో అవతారమని చెప్పినాముగదా! కొండమోటు నరసింహశిల్పం (క్రీ శ 400 ప్రాంతము) లోని వృష్ణివీరుల శిల్పాలవల్ల వ్యూహారాధన ప్రాచుర్యం వహించిందని చెప్పవచ్చు.

శైవవైష్ణవాలతోబాటు శక్తి ఆరాధన జరిగిందనడానికి నాగార్జునకొండలో బయల్పడిన హారీతిదేవాలయము, కొణిదెన, పెదముడియం శిల్పఫలకాలు నిదర్శనం. దేవాలయాలలో సప్తమాతృకలను నెలకొల్పి ఆరాధించేవారు. వేజర్లలో చాల ప్రాచీనములైన సప్తమాతృకాశిల్పాలున్నాయి. శైవవైష్ణవశక్తి మతాలు ప్రచారమైనప్పటికీ శాఖాభేదాలు విజృంభించలేదు. రాజులు స్వీయాభిమానాలకు అనుగుణంగా శైవ వైష్ణవాలను అనుసరించినారు గాని అన్యమతాలను పీడింపలేదు. ఈ సమరస దృష్టి శాలంకాయనహస్తివర్మ ధరించిన ''వివిధ ధర్మప్రధానస్య'' అనే బిరుదంలో స్పష్టమవుతుంది. అంతేగాక, పెదముడియంలో లభించిన శిల్పఫలకం నుండి నాడు భిన్నమత శాఖలమధ్య సామరస్యం ఉందని, పౌరాణిక ఆగమగాథలు స్పష్టరూపాన్ని ధరించి ప్రచారమైనాయని తెలుస్తున్నది. ఇటీవల కొణిదెనలో లభ్యమైన శిల్పంలోకూడ బ్రహ్మవిష్ణు శివలింగాలు దేవి ఉన్నాయి. ఈ శిల్పంకూడ త్రిమూర్తి ఆరాధనకు శాఖాసామరస్యానికి నిదర్శనంగా చెప్పవచ్చు.

దేవాలయం మతానికి కేంద్రం కాసాగింది. ఇక్ష్వాకుల కాలంనుండి విజయపురిలో ఆలయాలు నిర్మించినారు. వారి కాలానివే కొన్ని దేవాలయాలు కర్నూలు జిల్లా వీరాపురంలో ఇటీవల బయల్పడినాయి. పల్లవులు శాలంకాయనులు, విష్ణుకుండులు ఆలయాలు నిర్మించినట్లు చెప్పుకున్నారు ప్రాచీన ఆచారమైన తీర్థాటనం బహుళప్రచారం పొందింది. క్షేత్రాలలో దానధర్మాలు చేసేవారు. విజయపురి గొప్ప 'హిందూ' క్షేత్రం. అచట హారీతి ఆలయంలో సంతానం కాంక్షించిన స్త్రీలు గాజులు దానం చేసినట్లు తెలుస్తుంది. నేటికీ ఈ ఆచారం ఉందిగదా! మంచికల్లు శాసనం త్రైర్థికులకు ప్రస్తావిస్తున్నది. విజయపురి వలె వేల్పూరుకూడ బౌద్ధులకు హిందువులకు గూడ గొప్ప క్షేత్రం. అచట భూతగ్రాహకస్వామి (యముడు) కి గూడ ఆలయం ఉండేది. మాధవర్మ అచటనే గణపతి ప్రతిష్ఠ

చేసినాడు. పూర్వగంగుల గోకర్ణేశ్వరం నేటి ముఖలింగానికి నామాంతరమని కొందరి అభిప్రాయం.

బ్రాహ్మణ మతోద్ధరణ ఫలితంగా బౌద్ధం క్షీణించిందిగాని మాసిపోలేదు. ఇక్ష్వాకుల కాలంలోని బౌద్ధవిజృంభణ తాత్కాలికమే అయింది. అనంతర రాజ వంశాలలో బౌద్ధాన్ని పోషించినవారు అరుదు. విష్ణుకుండి గోవిందశర్మ మహారాణి పరమభట్టారికా మహాదేవి ఒక విహారం నిర్మించగా దానికి గోవిందవర్మ భూదానం చేసినాడు. గుణపాశ పురాధీశుడైన పృథ్వీమూలుడు అతని కుమారుడైన హరివర్మ బౌద్ధ జైన సంస్థలకు భూదానాలు చేసినారు. ఇంతకు మినహా బౌద్ధ సంస్థలు ఈ యుగంలో పొందిన పోషణను గురించిన సాక్ష్యంలేదు. ఈ పరిణామానికి బ్రాహ్మణ మతోద్ధరణతోపాటు నాటి ఆర్థిక పరిణామాలు చాలావరకు కారణం. నాటి వరకు బౌద్ధాన్ని పోషించినవారిలో అధికులు. వర్తకులు, చేతి పనులవారు. పైన వివరించిన ఆర్థిక పరిణామాలవల్ల శ్రేష్ఠులు నిర్ధనులు కావడంతో బౌద్ధానికి పోషణ క్షీణించింది. బౌద్ధులలో బహుశ్రుతీయ, పూర్వశైల, అపరశైల, రాజగిరిక, సిద్ధార్థక శాఖ లేర్పడి ఐకమత్యం నశించింది. మహాయానమతం వర్ధిల్లడంతో బౌద్ధం వ్యక్తిత్వాన్ని కోల్పోయింది. విహారాలలో ధూపదీపాలతో పూజాదికాలు పెరిగి దేవాలయాలకు వానికి భేదం సన్నగిల్లింది. క్రమంగా బౌద్ధులు ప్రాకృతభాషను వీడి సంస్కృతంలో గ్రంథరచన సాగించి ప్రజలకు దూరమైనారు. ఈ యుగంలో భావవివేకునివంటి దార్శనికాచార్యులు లేకపోలేదు. భావవివేకుడు ధాన్యకటకవాసి. దిఙ్నాగుడు సయితం కొంతకాలం వేంగి సమీపంలో ఉన్నాడని ప్రసిద్ధి. కాని వీరు మతప్రచారంకంటె తాత్త్విక చింతనలోనే కాలంగడిపినట్లు కన్పిస్తుంది. జనాదరణ తగ్గుతున్న ఈ సమయంలో అమానుషశక్తులను సాధించి ప్రజాదరణ పొందాలనే ఆసక్తితో బౌద్ధులు తాంత్రిక విద్యల నాశ్రయించడం ఫలితంగా మహాయానం వజ్రయానానికి దారితీసింది. వజ్రయానానికి సయితం జన్మభూమి ఆంధ్రదేశమే. బుద్ధుడే కాలచక్రతంత్రాన్ని ధాన్యకటకంలో బోధించినాడని, దశబలుడు (బుద్ధుడు) ధారణులను నిక్షిప్తం చేసినందునే "ధారణికోట" అనే పేరు వచ్చిందని గాథలు ప్రచారంలో ఉన్నాయి. ధాన్యకటకానికి వజ్రపర్వతం అనే పేరున్నట్లు సింహళ గ్రంథాలనుండి తెలుస్తున్నది. ధాన్యకటక సమీపంలోని కొండగుహలో వజ్రపాణి అర్చన జరుగుతోందని ధారణులు (మంత్రాలు) తయారు చేస్తారని హుయన్‌సాంగ్ వ్రాసినాడు. వజ్రయాన సిద్ధాంత కర్తయైన సిద్ధనాగార్జునుడు ఆంధ్రదేశవాసి అని రామిరెడ్డిపల్లి శాసనంవల్ల తెలుస్తున్నది. ధాన్యకటకం, సంఖరం, రామతీర్థం, శాలి

హుండాలు వజ్రయాన కేంద్రాలయినవనడానికి ఆ క్షేత్రాలలో దొరికిన వజ్రయాన ప్రతిమలే నిదర్శనం. వజ్రయానోత్సాహం ప్రబలడంతో నైతికంగా సిరసించి బౌద్ధం జనాదరణ పూర్తిగా కోల్పోవడంతో బౌద్ధక్షేత్రాలు నిర్జనం కాసాగినాయి.

**విద్యలు, వాఙ్మయము**

బ్రాహ్మణమత విజృంభణతో సంస్కృత భాషకు, వైదిక విద్యలకు పోషణ లభించింది. ఇక్ష్వాకుల కాలంలోనే శాసనాల్లో సంస్కృతాన్ని వాడడం ప్రారంభమయింది. పంచచామర, వంశస్థ మొదలైన వృత్తాలున్నాయి. వారి తర్వాత రెండు మూడు దశాబ్దాలకే శాసనాల్లో ప్రాకృతం స్థానాన్ని సంస్కృతం ఆక్రమించింది. నాటిరాజులు విద్యాభిమానులు, స్వయంగా విద్వాంసులు. వారిలో సర్వ శాస్త్రార్థ తత్వజ్ఞులు, మహాకవులు, వ్యాకరణ ఛందోశాస్త్ర కోవిదులు ఉన్నారు. ఘటికలనే పేర కళాశాలలు స్థాపించి పోషించినారు. వేంగి, కాంచి విద్యాకేంద్రాలయినాయి. శాసనాల్లో ఇందుపూరు ఘటిక (తుమ్మెయనూరు శాసనం), అనంతపురం జిల్లా హెంజేరులోని నొనం(లం)బేశ్వరాయ ఘటిక, అశనపురాస్థాన ఘటికల ప్రసక్తి వుంది. ధాన్యకటకం బౌద్ధవిద్యాలయమైనట్లు పల్లవసింహవర్మ అమరావతీ శిలాశాసనంద్వారా తెలుస్తున్నది. ఘటికలలో చతుర్దశవిద్యలు బోధించేవారు (అంగానివేదశ్చత్వారో మీమాంసాన్యాయ విస్తరః ధర్మశాస్త్రం పురాణంచ విద్యా హేతు చతుర్దశ.) నాటి బ్రహ్మణుల్లో ద్వివేదులు, చతుర్వేదులు, చతుష్షష్టి కళాకోవిదులు ఉన్నారు. పొలుమూరు శాసనం పేర్కొన్న శివశర్మ చతుర్వేదపారంగతుడు. పృథ్వీమహారాజు తాండివాద శాసనంలోని భవశర్మ వేదవేదాంగ న్యాయయోగ ఉపనిషత్తులతోబాటు 3000 విద్యలు, 20 వ్యాఖ్యానాలు అధ్యయనం చేసినాడు. అతని తండ్రి పృథ్వీశర్మ త్రిసహస్రవిద్యల అధ్యయన అధ్యాపనలో నిమగ్నుడైనవాడట. ఈ త్రిసహస్ర విద్యలేవో నిరూపించడానికి ఆధారం లేదు. లిఖితపూర్వకంగా లేనందున ఆ విద్య లన్నీ నశించినాయి.

ఈ యుగం భాషాచరిత్రలో మిక్కిలి ఆసక్తిదాయకమైన అంశం తెలుగు పరిణామం. ఇక్ష్వాకుల పేర్లలో విహువల, అనిక్కి, బాపి, అదవి, రెమ్మణక అనేవి తెలుగు పేర్లని చెప్పడానికి సందేహించనక్కరలేదు. విష్ణు కుండుల శాసనాల్లోనే ఆంధ్రపదాలు కన్పిస్తున్నాయి. చిక్కుళ్ళ శాసనంలో 'విజయరాజ్య సంవత్సరంబుళ్' అనే ప్రయోగం కన్పిస్తుంది. అంతకు ముందు కాలానికి చెందిన అమరావతీ శాసనంలో 'నాగబు' అనే పదం కన్పిస్తుంది కాబట్టి శాతవాహనుల కాలంనాటి 'దేశి' తత్సమ తద్భవాలను చేర్చుకొని

విస్తరించినట్లు స్పష్టమవుతున్నది. విష్ణుకుండి మాధవవర్మ "జనాశ్రయచ్ఛందో విచ్ఛిత్తి" వ్రాసినాడని అందులో సీసము (శీర్షకం), ద్విపద, త్రిపద అనే దేశీ ఛందముల వివరణ ఉన్నట్లు ప్రసిద్ధి. గీత పద్యం చివర్లో ఉన్న సీస పద్యాలలో ఏడు రకాలు వర్ణింపబడినాయట! తెలుగు పరిణామంలో రేనాటిచోడ యుగం మరొక ముఖ్య ఘట్టం. వారి శాసనాలలో చాల భాగం తెలుగులో ఉన్నాయి. వానిలో పుణ్యకుమారుని పొట్లదుర్తి శాసనం నాటి తెలుగు స్వరూపాన్ని, సంస్కృతీకరణకు ప్రమాణాన్ని గ్రహించడానికి ఉపకరిస్తున్నది.

భాషతోబాటు లిపికూడ పరిణామం చెందింది. ఇక్ష్వాకులు బ్రాహ్మీలిపినే వాడినారు. నాగార్జునకొండ శిల్పాలెంతటి సర్వాంగ సుందరాలో నాటి లిపి కూడ అంతటి మనోహరస్వరూపం సంతరించుకొన్నది. గుండ్రని అక్షరాల తెలుగు లిపికి నాగార్జునకొండ శిల్పులే ఆకృతి నేర్పరచినాదనడంలో సందేహం లేదు. క్రమంగా చాళుక్య యుగానికి తెలుగు లిపి నేటి స్వరూపానికి సన్నిహితమయింది.

**నిర్మాణాలు**

ఈ యుగ నిర్మాణాలలో చాల వైవిధ్యం గోచరిస్తున్నది. నాగార్జునకొండ తవ్వకాలలో విజయపురికి ఉండిన ప్రాకారాలు, అగడ్త, కోటలోపలి పెక్కు భవనాలు బయల్పడినాయి. పర్వతశ్రేణులను కలుపుతూ మూడువైపుల నున్న రక్షణశ్రేణులు మరోవైపున కృష్ణానదితో విజయపురి బలిష్టమైన దుర్గంగా ఉండేది. కూర్మకుండము అవభృథస్నానవాటికతోటి అశ్వమేధవేదిక శ్రీచాంతమూలుని కాలం నాటిదని వేరే చెప్పనక్కరలేదు. దీని సమీపంలోని కట్టడాలు రాజప్రాసాదమై యుండవచ్చు. మిగిలిన నిర్మాణాలలో ప్రేక్షాగారము బహిరంగ ప్రదర్శన శాల ప్రసిద్ధమైనది మిక్కిలి క్లిష్టమైన ఈ ప్రదర్శనశాల నిర్మాణంలో రోమన్ నిపుణులు సహాయపడి ఉంటారు. ఇతర నగరాలలో వేంగి, లెందలూరు, అమరపురి (వేల్పూరు), తాంబ్రాప, కందారపురం, పాలక్కడ ముఖ్యమైనవి. వీనిలో ప్రాకార రక్షణ శ్రేణులుగాని ప్రాసాదాలుగాని బయల్పడలేదు. అవి నామ మాత్రములైన నగరాలై యుండవచ్చును.

ఇక్ష్వాకుల కాలంలో శ్రీపర్వతం, జగ్గయ్యపేట, రామిరెడ్డిపల్లి, చినగంజాం వంటి బౌద్ధక్షేత్రాలలో స్థూపవిహార మంటపాదుల నిర్మాణం జరిగింది. క్రమంగా బౌద్ధనిర్మాణాలు అరుదై క్షీణించిపోయినాయి.

ఎహువల చాంతమూలుని కాలంనుండి (క్రీ.శ. 275 ప్రాంతం) దేవాలయ నిర్మాణం ముమ్మరంగా సాగింది. నాగార్జునకొండలోనే కార్తికేయ, పుష్పభద్ర, హారీతి అష్టభుజస్వామి, కుబేర నవగ్రహ ఆలయశిథిలాలు బయల్పడినాయి.

మంచికల్లు, ఏలేశ్వరం, వేల్పూరు, హాలంపురి, వేంగి మొదలైన తీర్థాలలో ఆలయాలు వెలసినాయి. కొన్నిచోట్ల బౌద్ధుల చైత్యాలయాలను హిందూ ఆలయాలుగా మార్చినారు. చేజర్ల (గుంటూరుజిల్లా)లోని నేటి కపోతేశ్వరాలయం చైత్యాలయమేనని ప్రతీతి. నాగార్జునకొండ శిథిలాలనుబట్టి గర్భగుడి, అంతరాళం, మంటపం, ధ్వజస్తంభం, ప్రాకారం అనే విభాగాలతో దేవాలయ వాస్తువు పరిపుష్ట మైనదని, ఆ ఆలయాలను ఆగమోక్తపద్ధతి ప్రకారం నిర్మించినారని తెలుస్తుంది. ఏలేశ్వరం, చేజర్ల, ఉండవల్లిలో నున్న ఉద్దేశిక ఆలయాలను (ఆలయ నమూనాలను) బట్టి నాటి ఆలయాలకు వృత్త, శాలా, (గజపృష్ఠ) శిఖరాలుండేవని, వృత్త శిఖరాలు ద్రావిడశైలిలో ఏకతలములై శిఖరముఖంలో చైత్యవాతాయనాలంకరణ ఉండేదని గ్రహిస్తున్నాము.

బొజ్జన్నకొండ, మొగల్‌రాజపురం, విజయవాడ, ఉండపల్లి, భైరవకొండ గుహాలయాలు ఈ కాలానివే. బొజ్జన్నకొండ బౌద్ధక్షేత్రం. ఇక్కడ దొరికిన గుప్తరాజుల నాణెంవల్ల ఈ క్షేత్రం నాలుగైదు శతాబ్దాలలో ప్రసిద్ధివహించిం దని చెప్పవచ్చు. భూమి స్పర్శముద్రలతో బుద్ధప్రతిమలు పూజావస్తువులుగా ఉన్న ఈ మహాయాన బౌద్ధాలయాలలో వజ్రాయాన చిహ్నాలు సయితం కన్పి స్తాయి. ఈ కొండ సమీపంలోనే లింగాలమెట్ట ఉంది. ఇచ్చటి కొండను భక్తులు అనేక ఉద్దేశికస్థూపాలుగా మలచివేసినారు ఈ క్షేత్రమే నమూనాగా జావాలోని బొరోబుదురు నిర్మాణమైనదని ఒక అభిప్రాయం (శ్రీ కె.ఆర్ సుబ్రమణ్యం.)

మొగల్‌రాజపురంలోని ఐదు గుహలలో మూడు గుహలు అతిసామాన్య మైనవి. నాలుగోది దుర్గగుహ. దీనిలో వెనుకగోడపై అర్థనారీశ్వరమూర్తిని చెక్కినారు. ఐదోది శివతాండవ గుహ మిగిలిన గుహలకంటె పెద్దది, అంద మైనది. స్తంభ మంటపానికి వెనుకనున్న మూడు గర్భగుహలు బహుశా త్రిమూర్తులకు అంకితము. ఐదో గుహాముఖంపై నటరాజ విగ్రహంవల్ల ఈ గుహ కాపేరు వచ్చింది. ఈ శిల్పం చాలావరకు శిథిలమయింది. కపోతం మీది కూడు లలో దేవీసహితులైన త్రిమూర్తులున్నారు. బెజవాడ దుర్గం కొండకు దిగువున "అక్కన్న మాదన్న'' గుహలు చాలా శిథిలావస్థలో నున్నాయి. వీనికి ఎగువ నున్న పెద్ద గుహ సైతం త్రిమూర్తులకు అంకితమే. కాని, ఇందులో క్రీ.త. రెండు మూడు శతాబ్దాల లిపిలోనున్న శాసనం ఈ గుహ చాలా ప్రాచీనమైనదన డానికి నిదర్శనం. బహుశా ఇది బౌద్ధుల, జైనుల విహారమై, తరువాత 5, 6 శతాబ్దాలలో హిందువులాక్రమించి వుంటారు. ఈ త్రిమూర్తి గుహలు నాటి హిందూమతంలోని సామరస్యానికి నిదర్శనము.

ఉండవల్లిలోని మూడు గుహలలో అనంతశాయిగుడి అనే పేర మధ్యస్థమై యున్న గుహ పెద్దది. ముఖ్యమయింది. ఇది నాలుగు అంతస్తుల గంభీర నిర్మాణం. రెండో అంతస్తులో కుడివైపు చివరిభాగంలో ఉన్న పెద్ద అనంతశాయి విగ్రహంవల్ల దీనికి పేరు వచ్చింది. దీని నిర్మాణం పల్లవుల మహామల్లపుర రాతిరథాలననుకరించిందనే అభిప్రాయంతో అంగీకరించేవారు నేడు అరుదు క్రీ.పూ. 2 వ శతాబ్దిలో గుంటుపల్లిలో ప్రారంభమైన గుహావాస్తువు ఉండవల్లిలో పరిపక్వతనందదమేగాక పల్లవుల శైలికి వరవడి పెట్టిందని చాలామంది (శ్రీ గంగూలీ, శ్రీ శివరామమూర్తి) అభిప్రాయం. విష్ణుకుండుల నాణేలపై కన్పించే సింహం ప్రతిరూపం ఈ గుహాలయ స్తంభాలపై ప్రత్యక్షమవుతున్నది గుహాముఖంపై క్రీ.శ. 6వ శతాబ్ది లిపిలో 'ఉత్పత్తిపిడుగు' అనే లేఖనం ఉంది స్తంభాలస్థూలత పల్లవనిర్మాణంకంటే ప్రాచీనమని స్పష్టం చేస్తున్నది. అందుచే సది విష్ణుకుండుల నిర్మాణమని నిర్ణయించవచ్చు. ఉత్పత్తిపిడుగు అనేది గుహలు తవ్విన శిల్పులశ్రేణి పేరై యుండవచ్చు. ముఖ్యంగా రెండో అంతస్తులోని స్తంభాలపై విష్ణుమూర్తి అవతారగాథలు, రామాయణ, భాగవతగాథలు, లింగోద్భవగాథ శిల్పీకరించినారు కింది అంతస్తు అసంపూర్తిగా వదిలివేసినారు. విష్ణుకుండివంశం అంతరించి తీరాంధ్రం చాళుక్యుల వశం కావడమే అందుకు కారణమై యుండవచ్చు.

భైరవకోండ (నెల్లూరుజిల్లా) లో ఎన్మిది గుహాలయాలున్నాయి. ఇవి అన్నీ శివునకు అంకితాలే. ఇందులో కుంభశీర్షాలతోనున్న సింహపాద స్తంభాలు పల్లవ శిల్ప సంప్రదాయ ప్రభావాన్ని ప్రదర్శిస్తున్నాయి. ఇది రేనాటిచోడుల పోషణలో క్రీ శ. 7, 8 శతాబ్దాలలో తయారయినాయి

అమరావతీ శిల్పరీతి నాగార్జునకొండ బౌద్ధ శిల్పాలలో పరిపుష్టి నందింది. నాగార్జునకొండలో పెక్కు స్తూపశిథిలాలనుండి శిల్పాలు లభించినాయి. ఇక 'హిందూ' శిల్పసంప్రదాయం శాతవాహన యుగంలోనే ప్రారంభమయింది. గుడిమల్లంలోని శివ (ముఖ) లింగం క్రీ.పూ. రెండువందల నాటిదని విమర్శకుల నిర్ణయం. నాగార్జునకొండలో మహాసేన, శక్తి, విగ్రహాలు దొరికినాయి. క్రమంగా ఇతిహాస పురాణ గాథల శిల్పాలు దేవాలయాలలో వెలయసాగినాయి. కొండమోటు నరసింహశిల్పంలోను (క్రీ.శ. 400 ప్రాంతం), ఉండవల్లి గుహాలయ శిల్పాలలోను నాగార్జునకొండ రీతి ప్రతిఫలిస్తున్నది. క్రమంగా శిల్పంలో నాగార్జునకొండశిల్పంలో కన్పించే సౌకుమార్యం,సహజత్వం కొరవడసాగినాయి.

# కొన్ని ఉపయుక్త గ్రంథాలు


1. Andhrapradesh Govt. Archalogical Series Nos. 6, 8, 10 and 21
2. Hanumantha Rao B S.L : Religion in Andhra
3. Minakshi : Administration and Social Life under the Pallavas.
4. Rajendra Prasad : Arts of South India - Andhra Pradesh.
5. Rama Rao M. : 1) Studies in the Early History of Andhra Desa.
6 Sankaranarayanan. Vishnukundins and their times.
7. వెంకటరమణయ్య విష్ణుకుండినులు.

# చాళుక్య యుగము

వేంగి చాళుక్య రాజ్యస్థాపనతో ఆంధ్రుల చరిత్రలో నూతనాధ్యాయం ప్రారంభమయింది. చాళుక్యులు కర్ణాటకంలోని బాదామినుండి బయలుదేరి విజేతలై ఆంధ్రదేశాన్ని ఆక్రమించి సుమారు ఐదు శతాబ్దాలకాలం పాలించినారు. బాదామి చాళుక్య శాఖ అయినందున వేంగి చాళుక్యులను ఆంధ్రేతరులుగా పరిగణించడం సహజం. అంతేగాక, వేంగి చాళుక్యులు తీరాంధ్రాన్ని మాత్రమే స్వాధీనం చేసుకొని పాలింపగలిగినారు; శాతవాహనులతో అంతరించిన ఆంధ్రదేశ రాజకీయ ఐక్యాన్ని సాధింపలేకపోయినారు. ప్రాగ్దక్షిణాంధ్ర భూములు (రాయలసీమ ప్రాంతం) పల్లవ రాజ్యంలో వారి సామంతులైన బాణ వైదుంబ వంశాల పాలనలో చిరకాలం ఉండి, అనంతరం చోళ సామ్రాజ్యాంతర్భాగాలయినాయి. తెలంగాణా ప్రాంతాలు పశ్చిమ చాళుక్య, రాష్ట్రకూట, కల్యాణి చాళుక్య వంశాలు వశపరచుకొన్నాయి. ఈ రాజవంశాలన్నీ వేంగి నాక్రమించి తద్వారా దక్షిణాపథపతిత్వాన్ని సాధించడానికై తరచు యుద్ధాలు చేస్తూ ఉండేవి. అందుచేత ఈ యుగంలో ఆంధ్రుల నిజ చరిత్ర ఏమి? అనే ప్రశ్న రావడానికి అవకాశం ఉంది. వేంగిలో చాళుక్యులు స్థిరపడి స్థానికభావంతో "జన్మభూమిశ్చాళుక్యానాం దేశో వేంగితిప్రశ్రుతః" అని చాటి, వేంగి ప్రజాక్షేమాన్ని కాంక్షించి పాలించినారు. చోళ చాళుక్యాది రాజవంశాలు సార్వభౌమత్వానికై పోటీపడి ఆంధ్రదేశాన్ని యుద్ధరంగంగా మార్చిన ఈ యుగంలో తూర్పు చాళుక్యులు ఆంధ్రదేశ స్వాతంత్ర్య గౌరవ ప్రతిష్ఠలను నిల్పడానికి శక్తికొలది ప్రయత్నించడమేగాక ఒక్కొక్కమారు ఆంధ్ర విజయపతాకాన్ని శత్రు భూములలో విహరింపజేసినారు. సాంస్కృతికంగా ఒక మహోద్యమాన్ని ప్రోత్సహించి చాళుక్యులు ఆంధ్రులకొక వ్యక్తిత్వాన్ని సమకూర్చినారు. నాటివరకు రాజస్థానాల్లో ఆదరణలేని తెలుగుభాషను ఆదరించి విశేష ప్రచారంలోనికి తెచ్చినారు. జాతీయాభివృద్ధికి, జాతి సమైక్యానికి భాషను మించిన సాధనం లేదు. అట్టి తెలుగు భాషను ఆంధ్రదేశంలో నిల్పి జాతీయ చైతన్యాన్ని కలిగించి; ఆంధ్రులు ఆంధ్రదేశము, ఆంధ్రదేశాధీశ్వరుడు అనే భావాలు ఏర్పడడానికి సుగమమార్గం కల్పించినవారు చాళుక్యులు. అందుచేత తూర్పు చాళుక్యుల చరిత్రయే ఈ యుగంలో ఆంధ్రుల చరిత్ర అనడంలో సందేహానికి తావుండరాదు.

# చాళుక్య వంశోత్పత్తి

చాళుక్య వంశోత్పత్తి సయితం నేటికీ జటిల సమస్యగానే ఉంది. వివిధ చాళుక్య వంశ శాఖల శాసనాల్లోని కల్పిత గాథలు చిత్రవిచిత్రములైన ఊహలకు కారణమై సత్యాన్ని మరుగువరుస్తున్నాయి. ఈ గాథలాధారంగా చాళుక్యులు అయోధ్యనేలిన చంద్రవంశీయులని, కారణాంతరాలవల్ల దక్షిణపథానికి వలసవచ్చి వాకాటక, కదంబ వంశాలకు సామంతులై ఉంటూ వారు బలహీనులయినంతనే విజృంభించినారని కొందరి వాదము. గుజరాతునేలిన సోలంకీలు చాళుక్యవంశ శాఖయే. వారు అగ్నికుల క్షత్రియ శాఖయని చందుబర్దాయ్ వ్రాసిన పృథ్వీరాజ్‌రాసో గ్రంథం పేర్కొంటున్నది. ఏమైనా చాళుక్య పదానికి సరియైన సంస్కృతమూలం కన్పించదు. ఆ పదాన్ని సాధించడానికి ఒక గాథ కల్పించినారు: భూభారం మాన్పవలసిందిగా భూదేవి బ్రహ్మకడకేగి మొర పెట్టుకుంది. ఆ సమయంలో బ్రహ్మ సూర్యునకు అర్ఘ్యాంజలి సమర్పిస్తున్నాడు భూదేవి ప్రార్థన విని ఆగ్రహావేశుడై బ్రహ్మ అర్ఘ్యజలం ఉన్న చుళకంలోకి చూచినాడు. వెంటనే అందుండి కవచకుండలధారియైన మహావీరుడుద్భవించినాడు. చుళకంనుండి పుట్టినందునే అతడు చాళుక్యుడై, చాళుక్య వంశకర్త అయినాడు. ఇది కేవలం విశ్వాసయోగ్యంకాని కట్టుకథ అని వేరే చెప్పనక్కరలేదు. చుళకం నుండి పుట్టినవాడు 'చుళుక్యుడు' కావలెగాని చాళుక్యుడు కావడానికి వీల్లేదు. ఈ గాథ పదోశతాబ్దిలో పుట్టినట్లు తెలుస్తున్నది ఈ గాథలో మరొక అసందర్భం ఉంది. ప్రాచీనకాలంనుండి అయోధ్య సూర్యవంశజుల రాజ్యం అట్టి అయోధ్య చంద్రవంశజులైన చాళుక్యుల స్వాధీనమెప్పుడయింది? అనే ప్రశ్నకు సమాధానం లేదు చాళుక్యులు ధరించిన "హారీతిపుత్ర" అనే మాతృసంజ్ఞ, మాతృసంజ్ఞలు ధరించిన శాతవాహన, ఇక్ష్వాకు, కదంబాది దాక్షిణాత్య రాజవంశాలతో వారికి సంబంధం సూచిస్తున్నది కదంబులవలె చాళుక్యులు సయితం "మాతృగణ పరిపాలితానాం" అని చెప్పుకొన్నారు. అందుచేత చాళుక్యుల జన్మభూమి సయితం దక్షిణాపథమేననే అనుమానం సహజం.

ఇటీవల దుర్గాప్రసాద్ దీక్షిత్ పండితుడు చాళుక్య జన్మభూమిని గురించి క్రొత్త సిద్ధాంతం ప్రతిపాదించినాడు: మహారాష్ట్రలో చలికి అనే కులంవారున్నారు, చాళుక్య వంశస్థులమని చెప్పుకొనేవారున్నారు. బిదర్ సమీపంలో చల్కిపురి ఉంది. దాని సమీపంలోనే చుల్కి అనే నది ప్రవహిస్తున్నది. చైనా బాటసారి హ్యుయాన్‌సాంగ్ రెండో పులకేశిని మహారాష్ట్రాధిపుడనినాడు. ఈ కారణాలవల్ల కర్ణాటక రాష్ట్ర సరిహద్దు ప్రాంతంలో ఉండే బిదర్, ఉస్మానాబాద్ జిల్లాల ప్రాంతం చాళుక్య జన్మభూమి అని దీక్షిత్ పండితుని సిద్ధాంతసారము. చాళుక్యులు సువిశాలమైన — గుజరాత్ మొదలు తమిళనాడువరకు ఉభయ

సముద్రాలమధ్య విస్తరించిన—సామ్రాజ్యాన్ని చిరకాలం పాలించినారు. చాళుక్య వంశ శాఖలు దక్షిణాపథంలో అనేక ప్రాంతాల్లో స్థిరపడినవనే చారిత్రకాంశం అందరికీ తెలిసిందే. శాతవాహనుల పేరుతో శాతవాహ నిహార, శాతవాహన కోట (సాతానికోట),శాతవాహన కొండ అనేవి ఆంధ్ర కర్ణాటక మహారాష్ట్ర ప్రాంతాల్లో ఉన్నట్లే చాళుక్యుల పేరున పట్టణాలు, నదులు భిన్న ప్రాంతాలలో ఏర్పడడా నికి అవకాశం ఉంది. మహారాష్ట్ర ప్రాంతంలో పర్యటిస్తున్న సందర్భంలో బహుశా హుయాన్‌సాంగ్ పులకేశిని మహారాష్ట్రాధిపుడని చెప్పి యుండవచ్చు ఆంధ్రదేశంలోని గోదావరీ జిల్లాలలో చాళుక్య వంశస్థులమని చెప్పుకొనే క్షత్రియు లున్నారుగదా! అందుచే దీక్షిత్ పండితుని నిర్ణయం యదార్థమని అంగీకరించ లేము.

వాస్తవానికి 'చలికి' అనేమాటకు శాసనస్థమైన మొదటిసాక్ష్యం క్రీ.శ. మూడోశతాబ్దికి చెందిన నాగార్జున కొండనుండి లభిస్తున్నది ఆ శాసనం మహా తలవర మహాదండనాయక చళికి రెమ్మణక అనే ఇక్ష్వాకుసామంతుని పేర్కొంటు న్నది. తరువాతి శాసనాల్లో సల్కి, సలుకి, చలుకి, చల్క్య, చలిక్య, చళిక్య, చళుక్య అనే రూపాంతరాలతో చలికి ప్రత్యక్షం అవుతున్నది ఇవి అన్నీ సంస్కృతీకరణంలోని వివిధ దశలని చెప్పవచ్చు. ములక, అస్సక, ఆంధ్ర మహిషకాది జాతులవలె దక్షిణ దేశంలో చలికి అనే జాతి వుండివుండవచ్చును. చాళుక్య విక్రమాదిత్య, చాళుక్య భీమాది పదాలవలె చళికి రెమ్మణక అంటె చలికి జాతీయుడైన రెమ్మణక అని అర్థము. చళికి రెమ్మణక హిరణ్య రాష్ట్రాధిపతియని ఆ శాసనంలో ఉంది. నేటి కడప, కర్నూలు జిల్లాలలో కొన్ని ప్రాంతాలు కలిపి ప్రాచీన హిరణ్యరాష్ట్రమయింది. ఈ సందర్భంలో రణస్థిపూడి శాసనం (క్రీ శ. 11 వ శతాబ్ది) స్మరింపదగిఉంది. ఆ శాసనం ప్రకారం విజయాదిత్యుడనే రాకు మారుడు భార్యాసహితుడై అయోధ్యనుండి రాజ్యస్థాపనోద్దేశ్యంతో దక్షిణాపథానికి వచ్చినాడు. అతడు త్రిలోచన పల్లవునితోటి యుద్ధంలో మరణించినాడు. గర్భిణి యైన అతని భార్యను ముడివేము అగ్రహారవాసియైన విష్ణుభట్ట సోమయాజి రక్షించి నాడు. ఆమెకు జన్మించిన కుమారుడు నందాదేవి వరప్రసాదంతో రాజ్యం స్థాపించి చాళుక్యులకు మూలపురుషుడయినాడు. ముడివేము అగ్రహారం నేటికి కడపజిల్లాలో, అంటే హిరణ్యరాష్ట్రంలో వుంది. చాళుక్యులు హారీతి పుత్రానాం అని చెప్పుకున్నారు. విజయపురిలో హారీతి దేవాలయం ఉంది. విజయపురిలోని హారీతియే చాళుక్యుల ఆరాధ్య దేవతయని చెప్పవచ్చు.

ఇటీవల రెండోపులకేశి తుమ్మెయనూరు శాసనం కర్నూలు - మహబూబ్ నగర్ జిల్లాల సరిహద్దుల్లో దొరికింది, దీనిలో కృష్ణా, తుంగభద్రా నదుల సంగమ స్థలంలోని సంగమేశ్వరము చాళుక్య విషయముల ప్రసక్తి ఉంది. చాళుక్య

విషయమే చాళుక్యుల జన్మభూమి అనడదం సముచితమైన తీర్మానం. ఆంధ్ర పథం అన్నట్లు జాతిపేరునునుసరించి వారి నివాసప్రాంతానికి పేరురావడం సంప్రదాయం. శాసనం దొరికిన ప్రదేశాన్నిబట్టి కర్నూల్, మహబూబ్‌నగర్ జిల్లాలలోనే చలికిజాతి వుండేదని, ఆ ప్రాంతాలు కలిసి చాళుక్య విషయమైనదని నిర్ణయించవచ్చు. "రణవిక్రమ" అనే మొదటి పులకేశి బిరుదం ఉన్న శాసనం ఏలేశ్వరంలో లభించింది. అందుచేత మొదటి చాళుక్యులకు చాళుక్య విషయ పాలకులుగా ఇక్ష్వాకులతోను, అనంతర విష్ణుకుండులతోను సన్నిహిత సంబంధాలున్నట్లు తెలుస్తున్నది. హిరణ్యరాష్ట్రి చాళుక్య విషయములను పాలిస్తూ కదంబులు బలహీనులైన అవకాశం పురస్కరించుకొని పశ్చిమంగా విస్తరించి చాళుక్యులు స్వతంత్రరాజ్యం స్థాపించినారు అనేది సముచితమైన నిర్ణయం

**చాళుక్య రాజ్యస్థాపన**

చాళుక్య రాజ్యస్థాపకుడు మొదటి పులకేశి పులకేశి అనే మాటకు 'భూరి కేశి' అనే అర్థం చెప్పవచ్చు. పులకేశి తండ్రి రణరాగ; తాత జయసింహ. విష్ణు కుండులు, కదంబులు బలహీనులు కావడంతో పులకేశి క్రీ.శ. 534 - 44 లో బాదామిని ఆక్రమించి అశ్వమేధమొనర్చి స్వతంత్ర చాళుక్య రాజ్యాన్ని స్థాపించినాడు సత్యాశ్రయ, రణవిక్రమ, శ్రీవల్లభ, శ్రీపృథ్వీవల్లభ అనేవి ఈతని బిరుదులు. ఏలేశ్వరంలోని రణవిక్రమ అనే లేఖనాలితనివేనని పైన చెప్పినాము గదా!

పులకేశి కుమారుడైన కీర్తివర్మ క్రీ.శ. 557 నుండి 597 వరకు పాలించినాడు కీర్తివర్మ కదంబులను, కొంకణంలోని మౌర్యులను జయించి రాజ్యాన్ని విస్తరింపజేసినాడు. కీర్తివర్మ కుమారుడు పులకేశి యుక్తవయస్కుడు కానందున తమ్ముడు మంగళేశుడుకూడ కాలచుర్యులతో యుద్ధంచేసి రాజ్యాన్ని విస్తరింపజేసినాడు; కాని రాజ్యలోభంతో సింహాసనాన్ని శాశ్వతంగా ఆక్రమించాలని ప్రయత్నించినాడు. ఇది గ్రహించి రెండో పులకేశి తమ్ముల సహాయంతో మంగళేశుని ఓడించి వధించి చాళుక్య సింహాసనాన్ని అధిష్టించినాడు. పులకేశి హైదరాబాదు శాసనాన్నిబట్టి క్రీ.శ. 612 నాటికి పులకేశి పట్టాభిషేకం జరిగి మూడు సంవత్సరాలు గడిచినట్లు తెలుస్తున్నది. అంటే, పులకేశి క్రీ.శ. 609 లో పట్టాభిషిక్తుడయినాడు.

భారతచరిత్రలో ప్రథమగణ్యులైన మౌర్యచంద్రగుప్త, సముద్రగుప్త, గౌతమీపుత్రుల శ్రేణిలోచేరిన చక్రవర్తి రెండో పులకేశి, దక్షిణాపథ ఆధిపత్యం సాధించే ఆశయంతో దిగ్విజయ యాత్రలు సాగించి కదంబ, గంగ, అలూప, మౌర్యలాటమాళవ ఘూర్జరాధిపతులను జయించి వారి భూములనాక్రమించినాడు. కర్ణాటక మహారాష్ట్రాలు అతని స్వాధీనమయినాయి. అనంతరం అతడు తీరాంధ్రంపై దృష్టి మరల్చి వేంగి చాళుక్యరాజ్యస్థాపనకు కారణమయినాడు.

# తూర్పుచాళుక్య రాజ్యస్థాపన

నిన్న మొన్నటి వరకు తీరాంధ్రాన్ని రెండో పులకేశియే జయించి ఆక్ర మించి తమ్ముడైన విష్ణువర్ధనుని పాలకుడుగా నియమించినాడని, విష్ణువర్ధనుడు స్వతంత్ర వేంగి రాజ్యాన్ని స్థాపించినాడని చరిత్రకారులు విశ్వసించినారు. అయితే తూర్పు చాళుక్యరాజ్య స్థాపనకాలాన్ని గురించి అనేక వాదోపవాదాలు జరిగినాయి ప్లీట్, కె. వి. లక్ష్మణరావు మొదలైన పండితులు క్రీ. శ. 611 లోనే పులకేశి వేంగిదేశాన్ని జయించినాడని నిర్ణయించినారు. ఇందుకు కొప్పరం శాసనం ఆధారము. కొప్పరం శాసన అజ్ఞప్తి పృథ్వీదువరాజు. సత్యాశ్రయునకు (పులకేశి) సామంతుడుగా గోవా శాసనం పేర్కొంటున్న ధృవరాజు ఇంద్రవర్మయే పృథ్వీదువరాజని ప్లీట్ మొదలైనవారి అభిప్రాయం. గోవా శాసనం ధృవరాజు 20వ సంవత్సరానిది. క్రీ శ. 610 కి చెందింది. కొప్పరం శాసనం 21 వ సంవత్స రానిదైనందున క్రీ శ. 610-611 కి చెందుతుంది. కాబట్టి ఆ సంవత్సరంలోనే పులకేశి తీరాంధ్రాన్ని జయించి వుండవలెనని వారి సిద్ధాంతం. క్రీ. శ 611 లో జయించినప్పటికీ క్రీ. శ. 615 లో విష్ణువర్ధనుని రాజప్రతినిధిగా పులకేశి నియ మించినాడని ప్లీట్ అభిప్రాయము. క్రీ శ. 611 లోనే వేంగిని పులకేశి జయించి నాడని అంగీకరిస్తూ తూర్పుచాళుక్య శాసనాల్లోని తిథివారనక్షత్రాది వివరాలు లెక్కించి, క్రీ శ. 624 లో కుబ్జవిష్ణువర్ధనునికు వేంగిరాజ్యాన్ని ఇచ్చినాడని బి. ఎ. కృష్ణారావుగారి సిద్ధాంతము. క్రీ శ 609-610 లో బాదామి సింహాసనం ఆక్రమించిన పులకేశి క్రీ శ. 611 లోనే వేంగిపై దండెత్తి జయించడం సాధ్యం అని ఊహించలేము. అదీగాక గోవా శాసనంలోని ధృవరాజు కొప్పరం శాసనం లోని పృథ్వీదువరాజు ఒకరుకాదు గోవా ధృవరాజు ఆంధ్రప్రాంతంపై దండె త్తిన సూచనలు లేవు. కొప్పరం శాసనంలోని వ్యక్తి పృథ్వీయువరాజు విష్ణువర్ధ నుడేగాని మరొకరుకాదు. మరొక విశేషమేమంటే, యువరాజు విష్ణువర్ధనుని సతారా శాసనాన్నిబట్టి అతడు క్రీ. శ. 617 వరకు మహారాష్ట్రంలో భీమరథీ ప్రాంతంలో రాజప్రతినిధిగా ఉన్నాడు. కాబట్టి ప్లీట్ నిర్ణయించిన రెండు తేదీలు సరియైనవికావు. కొప్పరం శాసనం పేర్కొనే 21 సంవత్సరాలు పులకేశిరాజ్య కాలం. అది క్రీ. శ 630 కి సరిపోతున్నది. అందుచేత పులకేశి వేంగిరాజ్యాన్ని క్రీ. శ. 630 లోనే జయించి విష్ణువర్ధనునికిచ్చినాడని మల్లంపల్లి సోమశేఖరశర్మ గారి వాదము.

పులకేశి 611 లో తీరాంధ్రాన్ని జయించినాడనే అభిప్రాయాన్ని వ్యతిరే కిస్తూ నేలటూరు వెంకటరమణయ్యగారు కూడ క్రీ. శ. 624 లోనే వేంగిరాజ్య స్థాపన జరిగిందని నిర్ణయించినారు సర్వలోకాశ్రయ విష్ణువర్ధనుని తేరాల శాసనం అతని ఐదో రాజ్యవర్షం బహుధాన్యనామ సంవత్సరంగా పేర్కొంటున్నది.

ఈతడు కుబ్జవిష్ణువర్ధనుని పౌత్రుడైన రెండో విష్ణువర్ధనుడనీ, బహుధాన్య క్రీ.శ. 678 లో వచ్చిందని లెక్కలవల్ల స్పష్టమయింది. దీన్నిబట్టి రెండో విష్ణువర్ధనుడు క్రీ. శ. 673 లో సింహాసనం అధిష్టించినాడు. చీపురుపల్లి శాసనాన్నిబట్టి కుబ్జ విష్ణువర్ధనుడు 17 లేక 18 సంవత్సరాలు పాలించినాడు. అతని కొడుకైన జయసింహ వల్లభుడు 33 సం॥లు రాజ్యం చేసినట్లు తెలుస్తున్నది. సాధారణంగా ఒక రాజు మరణించినసంవత్సరంనుండే ఆతని వారసుని పాలనకాలం లెక్కిస్తారు కాబట్టి ప్రతిరాజు పాలనాకాలంనుండి ఒక సంవత్సరం తగ్గించి లెక్కగట్టవలె. అందుచేత రెండో విష్ణువర్ధనునకు కుబ్జ విష్ణువర్ధనునకు 49 సంవత్సరాల (17 + 32) కాలవ్యవధి ఉన్నందున, కుబ్జవిష్ణువర్ధనుని పాలన క్రీ.శ. 624 లో (673–49) ప్రారంభమయింది ఈ నిర్ణయాన్ని జయసింహవల్లభుని ఆదివాసక శాసనం బలపరుస్తున్నది. ఈ శాసనం క్రీ. శ. 658 లో జయసింహవల్లభుని 17 వ రాజ్యవర్షంలో ఇవ్వబడింది. కుబ్జవిష్ణువు 17 సం॥లు రాజ్యం చేసినాడు కాబట్టి అతని పరిపాలన (658–(17 + 17) క్రీ. శ. 624 లో ప్రారంభమైనట్లు స్పష్టమౌవుతున్నది. కొణికి శాసనం ప్రకారం జయసింహుని 30 వ రాజ్య సంవత్సరం క్రీ.శ. 670 అవుతుంది, కాబట్టి అతని పాలన (670–29) క్రీ.శ. 641 లోను కుబ్జవిష్ణువు పాలన (641–17) క్రీ శ. 624 లోను ప్రారంభమయినవి.

ఇటీవల ప్రకాశంజిల్లా మారుటూరులో సత్యాశ్రయశ్రీ పృథ్వీవల్లభుని తామ్రశాసనం దొరికింది. ఈ శాసనం తేదీ క్రీ.శ. 616 అనీ, అందుచే సత్యాశ్రయశ్రీ పృథ్వీవల్లభుడు రెండో పులికేశియని ఎన్. రామేశన్‌గారు చేసిన నిర్ణయాన్ని నేలటూరు వెంకటరమణయ్యగారు మొదలైనవారు అంగీకరించారు. ఈ నిర్ణయం ప్రకారం క్రీ శ. 616 లోనే పులకేశి తీరాంధ్రాన్ని జయించి సోదరుడైన కుబ్జవిష్ణువర్ధనుని పాలకుడుగా నియమించినాడనీ 617 - 24 ల మధ్య కాలంలో విష్ణువర్ధను చాళుక్యాధికారాన్ని పటిష్టంచేసి అన్న అంగీకారంతో క్రీ.శ. 624 నుండి స్వతంత్రంగా వ్యవహరించినాడని చెప్పవలె కాని దీక్షిత్, రమేష్ గార్లు మారుటూరు శాసనం తేదీని క్రీ.శ. 598 - 99 అని సరిదిద్దినారు. ఐనచో తీరాంధ్రంపై దండెత్తి పిష్టపుర, కుణాశ (కొల్లేరు) యుద్ధాల్లో విజయం పొందింది మంగళేశుడు. ఈ విజయాల అనంతరం కృష్ణాతీరంలోని కొల్లూరులో విడిసి అలుకురాజును మంగళనిలయంపై అధిపతినిచేసి మారుటూరు అగ్రహారాన్ని కర్ణాట బ్రాహ్మణులకు దత్తం చేశాడు. అలుకురాజు, అగ్రహారము చాళుక్యాధికారానికి కాపుదలగా ఉండగలవని మంగళేశుడు ఆశించి ఉంటాడు. కొల్లూరు, మంగళనిలయం, మారుటూరు కృష్ణకు దక్షిణాన ఇంచుమించు కర్మరాష్ట్రంలోనే వున్నాయి. కృష్ణకు ఉత్తరాన వేంగి (కుణాల), కళింగ (పిష్టపుర) ప్రాంతాల్లో

చాళుక్యాధికారాన్ని పదిలపరచే చర్యలనాతడు చేసినట్లు కన్పించదు. అందుచే ఈ ప్రాంతాలపై మంగళేశుని దాడి కేవలం సుడిగాలి వంటిది; దానివల్ల శాశ్వత పరిణామాలు జరగలేదని చెప్పవచ్చు.

బాదామికి మరలినంతనే మంగళేశునకు పులకేశితో సంఘర్షణ ప్రారంభమై వుంటుంది. చివరకు అనంతపురం జిల్లాలోని ఎలపట్టు సింబిగె దగ్గర మంగళేశుని ఓడించి వధించి పులకేశి బాదామి సింహాసనం అధిష్టించాడు. కర్ణాటక మహారాష్ట్ర ప్రాంతాల్లోని సామంతులను వశవర్తులనుగా చేసుకొనడానికి పులకేశికి చాలాకాలం పట్టియుండవలె. క్రీ. శ 617 నాటికి పులకేశి తీరాంధ్రంపై దృష్టి మరల్చినాడు. క్రీ శ. 617 తర్వాత విష్ణువర్ధనుడు మహారాష్ట్రంలోవున్న నిదర్శనలు లేవు. అందుచే తీరాంధ్రాన్ని జయించడానికి పులకేశి అతణ్ణి నియమించి ఉంటాడు. సుమారు క్రీ శ. 600 - 624 మధ్యకాలం తీరాంధ్ర చరిత్రలో అజ్ఞాతయుగం అని చెప్పవచ్చు విష్ణుకుండుల పతనానంతరం చాళుక్య దండయాత్ర సృష్టించిన అలజడిలో స్థానికపాలకులు గిరి, వన, జల, స్థల దుర్గాలను స్థావరాలుగా చేసుకొని పాలించసాగినారు. వీరిలో బహుశా దుర్జయులు బలవంతులు. పట్టవర్ధన, బ్రహ్మ, కాలకంప, అటవిదుర్జయ, బుద్ధవర్మల సహాయంతో విష్ణువర్ధనుడు కళింగాంధ్రము, వేంగి కర్మ రాష్ట్రాలను పూర్తిగా స్వాధీనం చేసుకున్నాడు. వీరిలో బుద్ధవర్మ దుర్జయుడు; బహుశా భేదోపాయం ప్రయోగించి విష్ణువర్ధనుడు స్థానికులైన దుర్జయులలో కొందరిని తనవైపు త్రిప్పుకొని ఇతరులను నిర్జించి వుంటాడు. దేశ ఆక్రమణ క్రీ శ. 624 నాటికి పూర్తి అయింది నాడు మొదలు పులకేశి అంగీకారంతో విష్ణువర్ధనుడు వేంగిని స్వతంత్రంగా పాలించినాడు. అయితే కొప్పరం శాసనంలో (క్రీ.శ. 631) పులకేశి విష్ణువర్ధనుని "యువరాజు" అని వ్యవహరింపగా చీపురుపల్లి శాసనంలో (క్రీ శ. 641) విష్ణువర్ధనుడు మహారాజు బిరుదం దాల్చినాడు. అందుచేత క్రీ శ. 641 లో పల్లవనింహవర్మ చేతిలో పులకేశి పరాజయం అవకాశంగా తీసుకొని విష్ణువర్ధనుడు స్వతంత్రించి మహారాజు బిరుదం ధరించినాడు; కాని నరసింహవర్మ తోటి బాదామి యుద్ధంలో పులకేశితోబాటు మరణించివుంటాడు అనే భావాలు (శ్రీ యన్. రమేశన్) పరస్పర విరుద్ధాలు. వేంగిలో మహారాజుగా పాలిస్తున్నప్పటికి విష్ణువర్ధనుడు పులకేశికి ప్రియానుజుడే అతణ్ణి పులకేశి వాత్సల్యంతో యువరాజదృష్టితోనే చూచినాడనడం సమంజసం. క్రీ శ 624 నుండి విష్ణువర్ధనుడు స్వతంత్రంగా మహారాజుగా వేంగిని పాలించినందువల్లనే అతని సంతతివారు వేంగి చాళుక్యపాలనను క్రీ శ 624 నుండి గుణించినారు.

### కుబ్జవిష్ణువర్ధనుడు (క్రీ.శ. 624 - 641-2)

కుబ్జవిష్ణువర్ధనుడు మహాపరాక్రమవంతుడు. పదిహేడు సంవత్సరాలు పైగా వేంగిని పాలించినాడు. వేంగిలో చాళుక్యాధికారస్థాపన అతడు సాధించిన ఘనవిజయమేనని చెప్పవచ్చు. స్థల, జల, వన, గిరి - విషమదుర్గాలను సాధించడంలో సమర్థుడు; అందుచేతనే అతనికి 'విషమసిద్ధి' బిరుదం లభించింది. తనకు సాయంచేసిన సేనానులను భిన్న ప్రాంతాలలో సామంతమాండలికులుగా అతడు నియమించాడు. బుద్ధవర్మకు గిరిపశ్చిమసీమ (గుంటూరు జిల్లాల్) నిచ్చినాడు. కుబ్జవిష్ణువర్ధనునకు మకరధ్వజుడనే బిరుదం కూడ ఉంది. అతడు పరమ భాగవతుడు; అతనిభార్య అయ్యణ మహాదేవి జైనమతాభిమాని. బెజవాడలో కవరూరిగణ జైనయతులకు నెడుంబివసతి నిర్మించింది. ఈ కవరూరిగణానికి గుజరాతు ప్రధాన కేంద్రంగా తెలుస్తుంది.

## తూర్పుచాళుక్యులు - పల్లవులు - బోయలు

కుబ్జవిష్ణువు కుమారుడు జయసింహవల్లభుడు. సర్వలోకాశ్రయ, విజయసిద్ధి బిరుదాలతో 33 సం॥ (641.73) పాలించినాడు. రెండో పులకేశి మరణంతో కష్టనష్టాలకు గురియైన సోదర బాదామిచాళుక్యుల కాతడు సహాయం చేసినట్లు కన్పించదు. ఈతని కాలంలోనే వేంగీ చాళుక్యులకు పల్లవులకు మధ్య సంఘర్షణ ప్రారంభమయింది. ఉభయ రాజ్యాల మధ్య ప్రకాశం జిల్లా కందుకూరు నుండి నెల్లూరు జిల్లాలోనికి బోయవిహారదేశం వ్యాపించి వుంది. బోయలు ఆటవికులు; మంచి ధానుష్కులు. పొరుగున వున్న నాగరిక ప్రజల ననుసరించి తమ జీవిత విధానం సంస్కరించుకొన్నట్లు కన్పిస్తుంది వారిలో వున్న అలబోయ, దొంది బోయ, ముందుబోయ, కోయిలబోయ పదాలనుబట్టి వారిలో వృత్తిపరమైన సామాజిక విభజన ఏర్పడినట్లు, నాడు విస్తృత ప్రచారంలో వున్న శైవ వైష్ణవ మతాల ప్రభావం వల్ల దేవాలయాలు (కోయిల్) నిర్మించుకొని పూజారులను నియమించుకొన్నట్లు తెలుస్తుంది. పల్లవుల కొలువులో వున్న దండి మహాకవి తన దశకుమార చరిత్రలో బ్రాహ్మణులు కిరాతుల భోజనం చేస్తూ వారితో కలిసి నివసిస్తున్నారని నిరసన వ్యక్తం చేస్తాడు. వీరు బహుశా బోయలకు విద్యాబోధన చేస్తూ సంస్కృత నాగరికత పట్ల అభిమానం కలిగించినారని చెప్పవచ్చు బోయలు కొట్టము (దుర్గము)లు నిర్మించుకొని తెగల రాజ్యాలుగా నేర్పడినారు వీరిని తమ తమ సామంతులుగా చేసుకోడానికి పల్లవులు చాళుక్యులు ప్రయత్నించినారు జయసింహుడు తన పెదమద్దాల శాసనాన్ని ఉదయపురం నుండి ఇచ్చినాడు. ఉదయపురం నెల్లూరు జిల్లాలోని ఉదయగిరి అని అభిప్రాయం అయినచో పల్లవ రాజ్యంపై విజయాదిత్యుని (రెండో పులకేశి కుమారుడు) దండయాత్రలు పురస్కరించుకొని జయసింహుడా ప్రాంతాలను ఆక్రమించి, అచటి బోయరాజులను సామంతులుగా చేసికొని యుండవచ్చును.

కళింగాంధ్రప్రాంతంలోని శత్రుశేషాన్ని సయితం జయసింహుడు తుద ముట్టించినాడని అతని పోలమూరు శాసనం సూచిస్తున్నది. జయసింహునకు సంతానం లేదు. తమ్ముని పౌత్రుడైన మంగిని తనకు యువరాజుగా నియమించు కున్నాడు.

జయసింహుని తరువాత ఇంద్రభట్టారకుడు (ఏడురోజులు), రెండో విష్ణు వర్ధనుడు (673-81), మంగి యువరాజు (681-705), రెండో జయసింహుడు (705-717), వరుసగా రాజ్యం చేసినారు. జయసింహవల్లభు డాక్రమించిన బోయకొట్టాలలో చాళుక్యాధికారాన్ని బలపరిచే బాధ్యత వీరు వహించవలసి వచ్చింది. ఆ కార్యక్రమంలోనే బోయ బ్రాహ్మణుల రుషిగోత్రాలను, సనాతన సామాజిక వ్యవస్థలో వారి స్థానాన్ని గుర్తించి, కర్మ రాష్ట్రంలో వారికి అగ్ర హారాలిచ్చినట్లు రేయూరు, చందలూరు, కొండనాగూరు శాసనాలనుండి తెలు స్తున్నది. ఈ బ్రాహ్మణులద్వారా చాళుక్యాధికారానికి బోయల విశ్వాస సహ కారాలు సాధించి తద్వారా పల్లవదాడుల నరికట్టవచ్చును వీరి ఆశయం.

రెండో జయసింహుని మరణానంతరం వేంగిరాజ్యంలో అంతఃకలహాలు ప్రారంభమయినాయి. జయసింహునకు సంతానం లేనందున అతని సోదరుల్లో పెద్దవాడైన మూడో విష్ణువర్ధనుడు సింహాసనం ఎక్కవలె. కాని చిన్నవాడైన కొక్కిలి సింహాసనం ఆక్రమించి ఆరుమాసాలు రాజ్యంచేసి పదభ్రష్టుడై పారిపోయి మధ్య కళింగలో ఎలమంచిలి రాజధానిగా స్వతంత్రరాజ్యం స్థాపించుకున్నాడు. కొక్కిలి అనంతరం మూడు తరాలవారు - మంగివర్మ, వినయాదిత్యవర్మ, శ్రీ కొక్కిలివర్మ ఎలమంచిలి రాజ్యం పాలించినారు. ఈ కాలంలో వేంగి పాలకులు ఎలమంచిలి రాజ్యంలో జోక్యం కలిగించుకోలేదు. అనంతరం ఎల మంచిలి వేంగిలో లీనమయింది.

కొక్కిలిని పారదోలి మూడో విష్ణువర్ధనుడు సమస్త భువనాశ్రయ, త్రిభువనాంకుశ, విషమసిద్ధి బిరుదులు ధరించి 24 సంగలు (718-52) పాలించి నాడు. పల్లవమల్ల బిరుదాంచితుడైన రెండో నందివర్మ ఈతని సమకాలికుడు. నందివర్మ బలపరాక్రమాలు గల రాజు. వేంగి చాళుక్యవంశంలోని అంతః కలహాలు అతనికి మంచి అవకాశమయినాయి. అతని ఉదయేందిరం శాసనాన్ని బట్టి అతని సేనాపతి ఉదయచంద్రుడు దండెత్తి, పాకనాడు (నెల్లూరు) ప్రాంతంలోని బోయకొట్టాలను పాలించే పృథ్వీవ్యాఘ్రరాజును పారదోలి వానిని ఆక్రమించినాడు. వ్యాఘ్రరాజు బహుశా తూర్పు చాళుక్యుల సామంతుడే. ఈతని పేరు బోయలలో సంస్కృతంపట్ల అభిమానానికి నిదర్శనం. బోయకొట్టాలు తిరిగి పల్లవుల స్వాధీనమయినాయి.

# తూర్పుచాళుక్యులు - రాష్ట్రకూటులు

మూడో విష్ణువర్ధనుని కుమారుడైన విజయాదిత్యుని కాలంలో (753-770) కర్ణాటకంలో రాజకీయ విప్లవం జరిగింది. క్రీ. శ. 753 లో బాదామి చాళుక్యుల్లో చివరివాడైన రెండో కీర్తివర్మను పారదోలి, నాటివరకు చాళుక్య సామంతుడైన రాష్ట్రకూట నాయకుడు దంతిదుర్గుడు స్వతంత్ర రాష్ట్రకూటరాజ్యం స్థాపించినాడు. దక్షిణాపథ రాజకీయాల్లో ఈ విప్లవం అనేకపరిణామాలకు దారితీసింది. తమ బంధువులైన బాదామిచాళుక్యులు పదభ్రష్టులయినందున తూర్పుచాళుక్యులు నిస్సహాయులు కావడమేగాక తరచుగా రాష్ట్రకూట సామ్రాజ్యకాంక్షకు బలి అయినారు. దంతిదుర్గుడు శ్రీశైలప్రాంతాలనుగూడ జయించి ఆక్రమించినట్లు చెప్పుకున్నాడు. తెలంగాణా, రాయలసీమ ప్రాంతాల్లో చాలభాగం రాష్ట్రకూట సామ్రాజ్యంలో చేరింది.

రాష్ట్రకూట తూర్పుచాళుక్య వంశాలమధ్య సంఘర్షణ విజయాదిత్యుని కాలంలోనే ప్రారంభమయింది. దంతిదుర్గుడు క్రీ.శ. 756 లో మరణించి, అతని పిన తండ్రి కృష్ణుడు రాష్ట్రకూట సింహాసనం ఎక్కినాడు. కాని, సుమారు పది సంవత్సరాల కాలం అతడు శత్రువులతో దాయాదులతో పోరాడవలసి వచ్చింది. కృష్ణుని విరోధులలో రాహప్ప చాల బలవంతుడైనట్లు కన్పిస్తుంది. అతడు బహుశా బాదామి చాళుక్య వంశస్థుడై యుండవచ్చు విజయాదిత్యుడు కృష్ణుని శత్రువులతో చేరి అతణ్ణి పదభ్రష్టుని చేయడానికి ప్రయత్నించినాడు. తన శత్రువులందరినీ నిర్జించి సింహాసనంపై స్థిరపడిన వెంటనే కృష్ణుడు ప్రతీకార చర్యగా తన కుమారుడైన యువరాజ గోవిందుని వేంగిపై దాడి పంపినాడు. విజయాదిత్యుడు ఓడిపోయి అపార ధనరాశులు, తన రాజ్యంలో కొంతభాగము రాష్ట్రకూటులకిచ్చి సంధి చేసుకున్నాడు. ఇది మొదలు సుమారు రెండు శతాబ్దాలవరకు రాష్ట్రకూటులు తూర్పు చాళుక్యులు బద్ధ విరోధులై అవకాశం చిక్కినప్పుడెల్ల పోరాడినారు.

విజయాదిత్యుని కుమారుడైన నాలుగో విష్ణువర్ధనుని (771-806) గురించి తూర్పుచాళుక్య శాసనాల్లో ఎక్కువ వర్తమానం కన్పించదు. కాని, రాష్ట్రకూటుల శాసనాలనుండి పంపకవి రచించిన కన్నడ విక్రమార్జున విజయం నుండి కొంత సమాచారం లభిస్తున్నది. విష్ణువర్ధనుడు రాష్ట్రకూట రాజకీయాల్లో ప్రముఖపాత్ర నిర్వహించినాడు. రాష్ట్రకూట కృష్ణుడు మరణించగా(772) గోవిందుడు సింహాసనం ఎక్కినాడు. కాని, అతణ్ణి తమ్ముడు నిరుపమధారావర్షబిరుదాంచితుడైన ధ్రువుడు ప్రతిఘటించినాడు. ఇది విష్ణువర్ధనునకు మంచి అవకాశమయింది. విష్ణువర్ధనుడు గోవిందుని పక్షం నిలిచినాడు. మాళవ, కాంచి, గంగవాడి ప్రభువులు సయితం గోవిందునికి సాయపడినారు. కాని, ఈ మిత్రకూటమిని ఓడించి ధ్రువుడు

సింహాసనం ఆక్రమించినాడు వెంటనే ధృవుడు వేంగీశుని శిక్షించడానికై వేంగిపై దండు పంపినాడు. వేములవాడ చాళుక్యాధీశుడైన మొదటి అరికేసరి ఈ దండ యాత్రను నిర్వహించినాడు వేంగీ త్రికళింగములను ధృవుని పంపున అరికేసరి జయించినట్లు విక్రమార్జున విజయం పేర్కొంటున్నది. విష్ణువర్ధనుడు ఓడి రాష్ట్రకూటసార్వభౌమత్వం అంగీకరించి కప్పంచెల్లించడమేగాక తన కుమార్తె శీలమహాదేవిని ఇచ్చి ధృవునకు పెండ్లి చేసినాడు. శీలమహాదేవి ధృవునకు పట్టమహిషి అయింది.

రాష్ట్రకూట ధృవుడు క్రీ.శ. 794 లో మరణించగా అతని కుమారుడు మూడో గోవిందుడు సింహాసనమెక్కినాడు కాని, గోవిందుని అన్న కంభ తిరుగుబాటొనర్చినాడు. ఈ అంతఃకలహం అవకాశంగా తీసుకొని నాలుగో విష్ణువర్ధనుడు స్వతంత్రించి రాష్ట్రకూటులకు కప్పం చెల్లించడం మానినాడు.

నాలుగో విష్ణువర్ధనుని మరణానంతరం అతని కుమారుడైన రెండో విజయాదిత్యునకు భీమసలుకికి మధ్య సింహాసనానికై పోరాటం ప్రారంభ మయింది. వేంగిలో రాష్ట్రకూట సార్వభౌమత్వం పునరుద్ధరించడానికి ఈ అంతః కలహం అవకాశమని గోవిందుడు గ్రహించినాడు. అతని సైనికసహాయం భీమసలుకికి లభించింది. విజయాదిత్యుని సింహాసనం నుండి పారదోలి భీమసలుకి వేంగికి రాజైనాడు. కాని, రాష్ట్రకూట శాసనాలనుబట్టి సలుకి సామంతుడై రాష్ట్ర కూటాధిపునకు ఊడిగం చేసినట్లు తెలుస్తుంది. వేంగి రాజ్యప్రతిష్ఠకు తీరని నష్టం కలిగింది.

సింహాసనం కోల్పోయిన విజయాదిత్యుడు నిస్సహాయంగా ఊరుకోలేదు సవతి సోదరుడు హైహయుడునైన నృపరుద్రుని సాయంతో బహుశా బెజవాడను స్థావరంగా చేసుకొని భీమసలుకితో, అతనికి సాయంగా ఉన్న రాష్ట్రకూట, పశ్చిమగంగ సైన్యాలతో పన్నెండు సంవత్సరాలు ఘోరంగా పోరాడినాడు. ఉభయపక్షాల మధ్య 108 యుద్ధాలు జరిగినట్లు శాసనాలు చెబుతున్నాయి ఈలోగా మూడో గోవిందుడు మరణించి (814) బాలుడైన అమోఘవర్షుడు సింహా సనమెక్కినాడు. ఇది అదనుగా గ్రహించి, రాష్ట్రకూట సామంతులనేకులు తిరుగు బాటు చేయడంతో రాష్ట్రకూట సార్వభౌమాధికారం తాత్కాలికంగా అస్తమించి నట్లు కన్పిస్తుంది. ఇట్టి పరిస్థితుల్లో భీమసలుకికి రాష్ట్రకూట సహాయం లభించే అవకాశంలేదు. అందుచేత విజయాదిత్యుడు విజృంభించి క్రీ.శ. 813 లో సలుకిని ఓడించి పారదోలి వేంగి సింహాసనం ఆక్రమించినాడు అంతటితో ఆగక విజయాదిత్యుడు రాష్ట్రకూట సామ్రాజ్యంపై దండెత్తి వీరవిహారం చేసినట్లు, స్తంభపురిని (కాంబె?) ధ్వంసం చేసినట్లు తెలుస్తుంది. చాళుక్యార్ణవం ముంచెత్తి రాష్ట్రకూట వైభవాన్ని కుడిచిపెట్టినట్లు రాష్ట్రకూట శాసనాలే చెబుతున్నాయి.

ఇట్టిపరిస్థితుల్లో రాష్ట్రకూట ప్రహారాలు నిర్వహిస్తున్న గుజరాత్ రాష్ట్ర పాలకుడు సువర్ణవర్షకర్క రాజు విజయాదిత్యునితో సమాధానపడి తన కూతురు శీలమహాదేవిని విజయాదిత్యుని కుమారుడు (కలి) విష్ణువర్ధనుకిచ్చి పెండ్లిచేసి సంధి కుదుర్చుకున్నాడు. ఈ దండయాత్ర సందర్భంలోనే విజయాదిత్యుడు నాగరాజు నోడించినట్లు తెలుస్తుంది. ఈ నాగరాజు గూర్జర ప్రతీహారరాజైన రెండో నాగభటుడని ఒక అభిప్రాయం. కాదు, నాడు బస్తర్ ప్రాంతాన్ని పాలిస్తున్న నాగ వంశజుల్లోనివాడని కొందరి అభిప్రాయం.

సుప్రసిద్ధులైన తూర్పుచాళుక్యుల్లో రెండో విజయాదిత్యుడొకడు. అతడు మహావీరుడు, నరేంద్రమృగరాజ బిరుదు ధరించి వేంగి ప్రతిష్ఠను పునరుద్ధరించినాడు. కేవలం యుద్ధాలు చేయడమేగాక కళాభిమాని. తాను పోరాడిన 108 యుద్ధ భూములలో నరేంద్రమృగేశ్వరాలయాల పేరున శివాలయాలు నిర్మించినాడట. తన రాజ్యంలో పలు అగ్రహారాలు నెలకొల్పినాడు సత్రములు, చలివేందిరలు, విహారవనాలు నిర్మించినాడు అతని ఆస్థానంలో అనేకమంది కవులు, గాయకులు, శిల్పులు, చిత్రలేఖకులు, నటకులు పోషణనందుకొన్నారు. బెజవాడకాపేరు విజయాదిత్యుని వల్లనే వచ్చిందని కొందరి అభిప్రాయం.

విజయాదిత్యుని అనంతరం అతని కుమారుడు ఐదో విష్ణువర్ధనుడు ఒక్క సంవత్సరం మాత్రం పాలించినాడు (క్రీ.శ. 846-47.) ఈతడు కలివిష్ణువర్ధనుడని ప్రసిద్ధికెక్కినాడు. కలి అంటే వీరుడని అర్థం ఉంది. బహుశా తండ్రిచేసిన యుద్ధాల్లో పాల్గొని ఈ బిరుదం పొందివుంటాడు. ఈతనికి శీలమహాదేవివల్ల విజయాదిత్య, నృపకామ, యుద్ధమల్ల అనే కుమారులు కలిగినారు.

### గుణగవిజయాదిత్యుడు

కలివిష్ణువు కుమారుడు మూడోవిజయాదిత్యునే గుణగవిజయాదిత్యుడని వ్యవహరిస్తారు. 'గుణకనెల్ల' అనే మాటకు గుణాలచే అందమయినవాడు అని అర్థం. గుణగుడు తూర్పుచాళుక్యరాజులందరిలో అగ్రగణ్యుడు. మహాపరాక్రమశాలి. చాళుక్య విజయధ్వజాన్ని గంగానది మొదలు కావేరి పర్యంతం వీరవిహారం చేయించినవాడు. అతని కాలంలో వేంగి బలగౌరవాలు ఇనుమడించినాయి.

గుణగవిజయాదిత్యుని శాసనాలు తొమ్మిది లభించినాయి. వానిలో మచిలీపట్టణం, గుంటూరు, సాతులూరు, సీసలి తామ్రశాసనాలు, అద్దంకి శిలాశాసనం ముఖ్యమైనవి. తరువాత వచ్చిన చాళుక్య భీముని అత్తిలి శాసనం, అమ్మరాజు ఈడేరు, కలుచుంబర్రు శాసనాలు, రాష్ట్రకూట శాసనాలనుండి గుణగుని చరిత్ర తెలుస్తున్నది.

గుణగుని పాలనకాలం (క్రీ శ 848-891) యుద్ధాలతో దండయాత్రలతో గడిచింది ఈ యుద్ధాలు నిర్వహించడంలో అతనికి ప్రముఖ క్షిపరాయణులు

యుద్ధ తంత్రజ్ఞులు చతుర్విధోపాయ ప్రయోగచతురులైన నల్గురు బ్రాహ్మణ సేనానులు తోడ్పడినారు. వారిలో కడియరాజు, అతనికొడుకు పండురంగడు ప్రథమగణ్యులు. మిగిలిన ఇద్దరు వినయదిశర్మ, రాజాదిత్యుడు. రాజాదిత్యుడు తొండైమండలం నుండి వచ్చినవాడు సింహాసనం ఎక్కిన వెంటనే గుణగుడు బోయకొట్టములపై యుద్ధం చేయవలసి వచ్చింది. తూర్పు చాళుక్యులకు రాష్ట్రకూటులకు మధ్య జరిగిన యుద్ధాలు పురస్కరించుకొని పల్లవుల ప్రోత్సాహంతో బోయలు వేంగిరాజ్యంపై దాడులు సాగించి వుంటారు. అందుచే వారి నణచడానికై గుణగుడు పండరంగ సేనానిని పంపినాడు. పండరంగడు బోయల ప్రధాన స్థావరాలైన నెల్లూరును దగ్ధంచేసి కట్టెమును నేలమట్టంచేసి పన్నెండు కొట్టాలను స్వాధీనం చేసుకున్నాడు. అనంతరం కందుకూరును బెజవాడవలె బలిష్ఠమైన దుర్గంగా చేసుకొని, ఆ ప్రాంతంలో శాంతిభద్రతలు నెలకొల్పి పరిరక్షించినాడు. ఈ దండయాత్ర సందర్భంలోనే పల్లవ, పాండ్యరాజుల నుండి 'హేమాన్ని' గ్రహించి వుంటాడు. అనంతరం పండరంగడు రాహన అనే శత్రువును అణచినాడు. ఈ రాహన ఎవరో ప్రస్తుతానికి గుర్తించడం కష్టం. కొట్టములు నశించడంతో బోయలు తీరాంధ్రంలో విస్తరించి వ్యవసాయ వాణిజ్యాది వృత్తులవలంబించి ధనికులై రాజస్థానాల్లో ప్రవేశించి సెట్టి, రెడ్డి, నాయుడు, కమ్మ కులాలలో లీనమయినారు.

గుణగ రాష్ట్రకూట సంబంధాలలో రెండు ప్రధాన ఘట్టాలున్నాయి. మొదటిఘట్టంలో గుణగుడు పరాజయం పొందడమేగాక అమోఘవర్షుని ఆజ్ఞను శిరసావహించవలసి వచ్చింది. రెండోఘట్టంలో రట్టేశుని అతని మిత్రబృందాన్ని ఓడించి వారలరాజ్యాలలో వీరవిహారంచేసి నాటివరకు తూర్పుచాళుక్యులు పొందిన పరాభవాలకు ప్రతీకారం చేయడమేగాక దక్షిణాపథ ఆధిపత్యం సాధించినాడు.

బహుశా బోయకొట్టాలతో చాళుక్యులకు యుద్ధం జరిగే రోజుల్లోనే అమోఘవర్షుడు చాళుక్యరాజ్యంపై దండెత్తినాడు. వింగవల్లిచెంత ఇరుపక్షాలకు భీకర యుద్ధం జరిగింది చాళుక్యులనే ఖాద్యాలతో అమోఘవర్షుడు యముని తృప్తి చేసినాడని రాష్ట్రకూట శాసనాలు చెబుతున్నాయి. గుణగుడు ఓడినాడు అమోఘవర్షుని జీవితాంతము గుణగుడాతని సామంతుడైనాడు.

ఇదే సమయంలో రాష్ట్రకూట సామంతుడైన పశ్చిమ గంగరాజు నీతిమార్గ రణవిక్రముడు నొలంబుల సహాయంతో అమోఘవర్షుని ధిక్కరించినాడు. వారి నణచడానికై రట్టేశుడు గుణగుని దండుపంపినాడు. ఈ దండయాత్ర క్రీ.శ. 370 ప్రాంతంలో జరిగివుంటుంది. గంగవాడిపై దాడిని తూర్పుచాళుక్యుల శాసనాలు విపులంగా వర్ణిస్తున్నాయి. ఇందు మొదటిఘట్టం నొలంబవాడిపై దాడి. నొలంబవాడిని నాడు పాలిస్తున్నది పొలల్చోర నొలంబాధిరాజు (క్రీ.శ. 830-870)

ఇతనికే మంగళ లేక మంగి అనే పేరున్నట్లు సోమశేఖరశర్మ గారి తీర్మానము. నొలంబులతో సంగ్రామం జరిగింది. సేనాని వినయదిశర్మ సాయంతో గుణగుడు మంగిని సంహరించి గంగవాడిపై పురోగమించినాడు. రణవిక్రముడు గంగకూటము (శివగంగకోట?) లో తల దాచుకొన్నాడు. కాని గుణగుడాతనిని నోడించినాడు. రణవిక్రమ అమోఘవర్షులమధ్య సంధి కుదిరి బంధుత్వం ఏర్పడింది.

గుణగదొక చోళరాజ శరణార్థికాగా కాచినట్లు శాసనాల్లో ఉంది. ఈతడు బహుశా నొలంబులకు అధికారం కోల్పోయిన రేనాటి చోడులలోనివాడయి వుండవచ్చు. అతణ్ణి కాచింది గంగవాడిపై దండయాత్ర సందర్భంలో అయి వుంటుంది.

అమోఘవర్షుడు క్రీ శ. 880 లో మరణించి అతని కుమారుడు రెండో కృష్ణుడు సింహాసనం ఎక్కడంతో రాష్ట్రకూటులకు దుర్దినాలు ప్రారంభమయినాయి. గూర్జర ప్రతిహారుల్లో ప్రముఖుడయిన మిహిరభోజుడు రాష్ట్రకూట రాజ్యంపై దండెత్తినాడు. మాళవము ప్రతిహారుల వశమయింది. రాష్ట్రకూటరాజ్యం కల్లోలితమయింది. ఇది గుణగునకు సదవకాశమయింది. అతడు స్వతంత్రించటమేగాక పూర్వపరాభవానికి ప్రతీకారంగా రాష్ట్రకూట రాజ్యంపై జైత్రయాత్ర జరిపినాడు. ఈ దాడుల వివరాలు తూర్పుచాళుక్యుల శాసనాల నుండి లభిస్తున్నాయి. వీనిని పండరంగ సేనాపతి నిర్వహించినాడు. రాష్ట్రకూట కృష్ణుడు, అతని బావమరది దాహళ దేశాధికుడైన సంకిలుడు (శంకరగణరణవిగ్రహ) పలు యుద్ధాలలో నోడి వెన్నుజూపినారు. అనంతరం గంగా నర్మదానదుల మధ్యస్థమైన దాహళముపై దండయాత్ర జరిగింది. మార్గమధ్యంలో రట్టేశుని సామంతుడు వేములవాడ చాళుక్యాధిపతి అయిన బద్దెగ ఓడిపోయినాడు. బద్దెగ మహాపరాక్రమశాలియైన యుద్ధవీరుడుగా పంపకవి విక్రమార్జున విజయం వర్ణిస్తున్నది. బద్దెగుని చక్రకూటపురం (బస్తర్) పరశురామప్రీతి అయింది. కళింగ నేలుచున్న గంగవంశస్థుడు దేవేంద్రవర్మను ఓడించి అతని నుండి యుద్ధగజాలు స్వీకరించడం జరిగింది. అనంతరం దక్షిణకోసల మీదుగా పండరంగడు దాహళంలో ప్రవేశించి రాజధానియైన కిరణపురాన్ని ఆక్రమించినాడు. అటనుండి పశ్చిమంగా పురోగమించి అచలపురాన్ని పట్టుకున్నాడు. కిరణ అచలపురాలను దగ్ధం చేసినాడు. గుణగుడు (నెల్లూరు, కిరణ, అచల) త్రిపుర మర్త్య మహేశ్వర బిరుదం ధరించినాడు. గుణగుని అఖండ విజయాన్ని తన పరాజయాన్ని రెండో కృష్ణుడు అంగీకరించినాడు. రాష్ట్రకూటుల నుండి సార్వభౌమ సూచకమైన పాళిధ్వజాన్ని- గంగాయమునా తోరణాన్ని గ్రహించి

దక్షిణాపథపతిత్వాన్ని సూచించే 'సమధిగత పంచమహాశబ్ద' బిరుదాన్ని గుణగుడు స్వీకరించినట్లు సాతులూరు, ధర్మవరం శాసనాల వల్ల తెలుస్తున్నది.

త్రిపుర మర్త్యమాహేశ్వర బిరుదంతోపాటు గుణగునకు పరచక్రరామ, భువన కందర్ప, పరమకరధ్వజ, రణరంగశూద్రక, మనుజప్రకార బిరుదులున్నాయి. అతడు సాధించిన విజయపరంపరలతో తూర్పు చాళుక్యుల అధికారం ఉత్తరాన మహానది నుండి దక్షిణాన పులికాట్ సరస్సు వరకు విస్తరించింది. దక్షిణాపథంలో వారి శక్తికి ఎదురులేకపోయింది. 'చండచాళుక్యులు'గా వారు ప్రసిద్ధులయినారు.

గుణగునకు సంతానం లేదు. అందుచేత తమ్ముడు విక్రమాదిత్యుడు యువరాజుగా వ్యవహరించినాడు. అతని కుమారుడైన చాళుక్యభీముడే గుణగునకు వారసుడు.

**కుటుంబ కలహాలు**

గుణగుని మరణంతో తూర్పుచాళుక్య రాజవంశంలో అంతఃకలహాలు చెలరేగి రాష్ట్రకూటులపై వారు సాధించిన విజయాలు కేవలం తాత్కాలికమైనాయి. రాజవంశం శాఖోపశాఖలై బిన్న శాఖల రాకుమారులు సింహాసనం కాంక్షించి రాజ్యాన్ని రక్తపాతంలో ముంచెత్తినారు. వీరి అంతఃకలహాలవల్లనే తిరిగి వేంగిలో రాష్ట్రకూటుల ఆధిపత్యం పెరిగింది. రాష్ట్రకూటుల అనంతరం కల్యాణిచాళుక్య చోళ సామ్రాజ్యకాంక్షకు వేంగి బలి అయింది

చాళుక్యభీముడు రాజుకాకుండా దాయాదులు, అంటే అతని పినతండ్రి యుద్ధమల్లుడు ఆతని అనుయాయులు అడ్డుపడినట్లు కనిపిస్తుంది. పట్టబంధానికి పూర్వమే భీముడు దాయాదులను, రట్టసైన్యాలను పారదోలినాడని పండిపాక శాసనం చెబుతున్నది. రాష్ట్రకూట సైన్యం దండెత్తివచ్చి రణమర్దవంశస్థులు పాలిస్తున్న మంచికొండనాడును ఆక్రమించింది. ఈ దాడిని వేములవాడ బద్దెగ నిర్వహించినాడని చెప్పవచ్చు. "మొసలిని జలాశయంలోనే" పట్టుకొన్న విధంగా భీముని బద్దెగ బంధించినాడని విక్రమార్జున విజయం వర్ణిస్తున్నది. కొరవి శాసనాన్ని బట్టి రణమర్దవంశనాయకుడైన కుసుమాయుధుడు రట్టసైన్యాల నోడించి పారదోలినాడు. చాళుక్యభీముడు బంధవిముక్తుడై అరోవిష్ణువర్ధన నామాంతరంతో క్రీ శ. 892లో పట్టాభిషేకం జరుపుకొన్నాడు.

దాయాదుల కుట్రలవల్ల చాళుక్య భీముని రాజ్యకాలం ప్రశాంతంగా సాగలేదు. చాళుక్యభీముడు 360 యుద్ధాలు చేసినట్లు మల్లపదేవుని పిఠాపురం శాసనం చెబుతున్నది. వేంగి రాజ్యంలోని ఈ అస్థిర పరిస్థితులు రెండోకృష్ణునకు మంచి అవకాశ మిచ్చినాయి చతురంగ బలాలతో ఆతడు వేంగిపై దండెత్తినాడు. రాకుమారుడు షోడశవర్ష ప్రాయుడునైన ఇరిమర్తి గండడు చాళుక్య

సైన్యాధిపత్యం వహించి రాష్ట్రకూటులతో తలపడినాడు. నిరవద్యపురం, పెరువంగూరుల వెంత భీకర యుద్ధాలు జరిగినాయి. నిరవద్యపుర యుద్ధంలో వల్లభుని గజహయ ధానుష్క బలాలు ఓడి పటాపంచలయినాయి. పెరువంగూరు యుద్ధంలో ఇరిమర్తి గండడు రట్టసేనాపతి గుండయను వధించి లాటసైన్యాలను దాయాది సైన్యాలను పారదోలినాడు కాని, యుద్ధంలో తగిలిన గాయాలవల్ల ఇరిమర్తి గండడు మరణించినాడు.

రాజ్యకాలం చివర్లో చాళుక్యభీముడు దేవాలయ నిర్మాణంలోను లలితకళా పోషణలోను గడిపినాడు. సామర్లకోట సమీపంలో చాళుక్య భీమవరంలోని భీమేశ్వరాలయము, దాక్షారామ భీమేశ్వరాలయము తన పేరున చాళుక్య భీముడు కట్టించినవే. అతని సామంతుడైన చట్టప బెజవాడ ఇంద్రకీలాద్రిపై పార్థేశ్వ రాలయం నిర్మించినాడు. సమస్త గాంధర్వ విద్యాకోవిదయైన చెల్లవ్వ భీముని ఆస్థానగాయకురాలైనట్లు అత్తిలి శాసనంవల్ల తెలుస్తున్నది. ఆమెతండ్రి మల్లప్ప సంగీతంలో తుంబురునివంటివాడట! భీముని శాసనకర్త కవివృషభ బిరుదాంచి తుడైన వామన; ఈతడూ కావ్యాలంకార సూత్రరచయితగా భాసిస్తున్న భట్ట వామనుడూ ఒకరేనని చరిత్రకారుల అభిప్రాయము

చాళుక్యభీముని కుమారుడు కొల్లభిగండ బిరుదాంచితుడైన నాలుగో విజయాదిత్యుడు ఆరుమాసాలు రాజ్యంచేసినాడు (క్రీ.శ 922) ఈతని శాసనాలు లభించలేదు కాని, తరువాతి చాళుక్యుల శాసనాలనుండి కొల్లభిగండడు తూర్పు గంగులతో విరజాయుద్ధంచేసినాడని తెలుస్తున్నది. త్రికళింగదేశం తూర్పుచాళుక్య రాజ్యభాగంగా ఉండేది. గుణగడు "దక్షిణాపథ సత్రికళింగదేశం" పాలించి నాడు. కాని, అనంతరం గంగవంశస్థుడైన వజ్రహస్తదేవుడు త్రికళింగ ప్రాంతా లను జయించి తన రాజ్యంలో కలుపుకొన్నాడు. అందుచే నాలుగో విజయా దిత్యుడు కళింగపై దండెత్తినాడు విరజా యుద్ధంలో చాళుక్య సైన్యాలు పరాజయం చెంది విజయాదిత్యుడు మరణించినాడు.

విరజాయుద్ధంలో చాళుక్యుల పరాజయానికి చాళుక్యరాజ్యంలో చెలరేగిన తిరుగుబాటు ప్రధాన కారణం. నాలుగో విజయాదిత్యుని తమ్ముడైన (రెండో) విక్రమాదిత్యుడు చాళుక్యమూలబలంలో కొంత తనవైపు త్రిప్పుకొని అన్నను ధిక్కరించినాడు. విక్రమాదిత్యుని నూతిమడుగుశాసనం అతడు ఎన్మిది సంవత్స రాల పాటు శత్రువులతో యుద్ధాలు చేసినట్లు చెబుతున్నది విక్రమాదిత్యుడు క్రీ.శ. 920 లో సింహాసనం ఆక్రమించినాడు. కాబట్టి అతని తిరుగుబాటు క్రీ.శ. 922 లో విరజా యుద్ధ సమీపకాలంలో ప్రారంభమైనదని స్పష్టమవు తున్నది.

విక్రమాదిత్యుని తిరుగుబాటుతో చాళుక్యరాజ్యంలో ప్రారంభమయిన అంతర్యుద్ధం 14 సంవత్సరాలు భీషణంగా చెలరేగింది. వంశ గౌరవాన్ని దేశ స్వాతంత్ర్యాన్ని ప్రజాక్షేమాన్ని పాటింపక స్వార్థపరులై అధికారవ్యామోహంతో రాకుమారులు అనేక దురాగతాలు చేసినారు. ఈ అంతఃకలహాలు తిరిగి రాష్ట్రకూటులకు సదవకాశం కలిగించినాయి. ఈ స్వల్పకాలంలో ఆర్గురు రాజకుమారులు సింహాసనం ఎక్కి మరణించినారు. చాళుక్యులు స్వహస్తాంతోనే వేంగి నగరాన్ని పరశురామప్రీతి చేసినారు.

ఇట్టి పరిస్థితుల్లో కొల్లభిగండని కొడుకైన అమ్మరాజు పితృపితామహుల మూలబలాన్ని తనపై పుతిప్పుకొని సింహాసనం అధిష్టించి (క్రీ.శ. 922.920) నట్లు ఈతని ఈదేరుశాసనంనుండి గ్రహిస్తున్నాము. ఇతనికి రాజమహేంద్ర బిరుదం ఉంది. నాటి పరిస్థితుల్లో వేంగి సురక్షితమైన నగరం కాదని, గోదావరీ తీరంలో తన పేర రాజమహేంద్రనగరాన్ని నిర్మించి రాజధానిగా చేసుకున్నాడు. అమ్మరాజు కాలమంతా పినతండ్రి విక్రమాదిత్యునితో యుద్ధంతోనే గడచినట్లు కన్పిస్తుంది. అమ్మరాజుకు మహాకాల, భండనాదిత్య అనే సేనాపతులసాయం లభించింది. మహాకాల గౌమకాంబ కుమారుడు. గౌమకాంబ చాళుక్యభీమునికి పాలిచ్చి పెంచిన దాది కూతురు. చాళుక్య భీముని కాలంలో కూడ మహాకాల సైన్యాధ్యక్ష పదవిని నిర్వహించినాడు.

అమ్మరాజుకొడుకైన కంటికవిజయాదిత్యుడు సింహాసనం ఎక్కిన పదిహేను రోజుల్లో అతణ్ణి తొలగించి రెండో విక్రమాదిత్యుడొక సంవత్సర కాలం పాలించినాడు. ఈతనికాలంలో త్రికళింగరాజ్యం తిరిగి వేంగిలో చేరింది రెండో చాళుక్య భీముని శాసనం ప్రకారం అమ్మరాజు కొడుకైన భీముడు రెండో విక్రమాదిత్యుని సంహరించి ఎన్మిది మాసాలకాలం వేంగిని ఏలినాడు. ఈ ఎన్మిది మాసాలు రాజ్యం అల్లకల్లోలితం అయినట్లు రెండో అమ్మరాజు మలియంపూడి శాసనం వర్ణిస్తున్నది: "సూర్యాస్తమయానంతరం రాక్షసులవలె రెండో విక్రమాదిత్యుని మరణానంతరం దాయాదులైన యుద్ధమల్ల, రాజమార్తాండ, కంటిక విజయాదిత్యాది రాకుమారులు రాజ్యానికై పోరాడి ప్రజలను నానాహింసలకు గురి చేసినారు."

ఈ రాజకీయకల్లోలాలను అవకాశంగా తీసుకొని వేంగిలో రాష్ట్రకూటాధిపత్యాన్ని పునరుద్ధరించడానికి నాలుగో గోవిందుడు సంకల్పించి తాలరాజుకుమారుడైన యుద్ధమల్లునకు సైనిక సాయం చేసినాడు. రెండో యుద్ధమల్లుడు వారి సాయంతో భీముని వధించి వేంగిరాజ్యం ఆక్రమించినాడు.

రాష్ట్రకూట సహాయంవల్ల యుద్ధమల్లునకు (క్రీ.శ. 930-34) ఉపకారం కంటె అపకారమే ఎక్కువ జరిగింది. దాయాదులు సింహాసనం ఆక్రమించే

ప్రయత్నాలు మానలేదు. రాష్ట్రకూట సేనాపతులైన బోయసామంతులు వివిధ ప్రాంతాల్లో స్థావరా లేర్పరచుకొని అధికారం నిర్వహించినారు. బహుశా వారి దౌర్జన్యాలు సహించలేక యుద్ధమల్లుడు వేంగి రాజమహేంద్రవర నగరాలను వీడ వలసి వచ్చింది. కృష్ణానదికి దక్షిణ ప్రాంతాన్నే అతని అధికారం చెల్లుబడి అయి నట్లు కన్పిస్తోంది. చేబ్రోలు రాజధానిగా చేసుకొని అతడు పాలించినట్లు అతని బెజవాడ మధ్యాక్కరల శాసనం సూచిస్తున్నది. బెజవాడ అతని రాజధానియని వెంకటరమణయ్యగారి అభిప్రాయము.

యుద్ధమల్లుని తొలగించి రెండో చాళుక్యభీముడు క్రి.శ. 935లో రాజయి నాడు. ఈతడు నాలుగో విజయాదిత్యుని కుమారుడు. తల్లి మేలాంబ. రెండో భీముని కోలవెన్ను శాసనంతోబాటు అతని కొడుకు రెండో అమ్మరాజు మలియం పూడి, కలుచుంబర్రు శాసనాలనుండి యుద్ధమల్లునితోబాటు తాతబిక్కి, రాజ మార్తాండ, అయ్యప, లోవబిక్కి మొదలైనవారి నాతడు వధించినట్లు తెలు స్తుంది. కాని, రెండో అమ్మరాజు యుద్ధమల్లునితో పోరాడినట్లు ఉన్నందున భీముడు యుద్ధమల్లుని చంపినాడనడం నిజంకాదు. ఇక మిగిలినవారందరు నాలుగో గోవిందుని సేనాపతులు, సామంతులు అయివుంటారు.

రాష్ట్రకూట రాజ్యంలో నాలుగో గోవిందునిపై వచ్చిన తిరుగుబాటు రెండో భీమునకు మంచి అవకాశం అయింది. నాలుగో గోవిందుడు రెండో అమోఘవర్షుని తొలగించి సింహాసనం ఆక్రమించినాడు. అందుకే అతనికి ప్రజాదరణ లభించ లేదు. ఇది ఇట్లుండగా గోవిందుని పినతండ్రి బద్దెగ తిరుగుబాటు చేసినాడు. దాహళదేశాధీశులు, వేములవాడ రెండో అరికేసరి బద్దెగకు సహాయంగా నిలిచి నారు. మంచికొండనాడునేలే ముదిగొండ చాళుక్యనాయకుడైన విజయాదిత్యుడు కూడ తిరుగుబాటుచేసి తనపై దండెత్తివచ్చిన రాష్ట్రకూట సేనాపతిని రెండో అరికేసరి సాయంతో ఓడించి పారదోలినాడు. సర్వత్ర వ్యతిరేకత ప్రబలి పరా జయాలు ప్రాప్తించడంతో నాలుగో గోవిందుడు రాజ్యత్యాగం చేసి చోళమండలా నికి పారిపోయినాడు.

ఇట్టి పరిస్థితుల్లో రెండో చాళుక్యభీముడు విజృంభించి రాష్ట్రకూట సేనా పతులను పారదోలడంతో వేంగిరాజ్యం నిష్కంటకమయింది. భీమునకు రాజ మహేంద్ర, గండమార్తాండ, బృహద్భీమ బిరుదులువున్నాయి. భీమునకు ఊర్జపా (అంకిదేవి), లోకాంబ అనే ఇద్దరు రాణులు వున్నారు. అంకిదేవి కళింగరాకుమారి. ఆమెకు దానార్ణవుడు, లోకాంబకు అమ్మరాజు కుమారులు.

చాళుక్యభీముడు మరణించడంతో (క్రి.శ. 945). రెండో యుద్ధమల్లుడు వేంగిపై దండెత్తి ఉంటాడు. అతణ్ణి ఓడించి బహుశా వధించడంతో (రెండో)

అమ్మరాజు ప్రముఖపాత్ర నిర్వహించినందున అతడే సింహాసనం ఆక్రమించి వాడని చెప్పవచ్చు.

యుద్ధమల్లుని నిర్జించి రెండో అమ్మరాజు క్రీ శ. 945 లో వేంగి సింహాసనం ఎక్కి ఇరవై అయిదు సంవత్సరాలు పాలించినాడు. కాని, అమ్మరాజు అన్నయైన దానార్ణవుడు, యుద్ధమల్లుని కుమారులైన బాడప, తాళరాజులు అమ్మరాజును ప్రశాంతంగా ఉండనీయలేదు. అమ్మరాజు రెండుసార్లు సింహాసనం కోల్పోయి తిరిగి పొందడం జరిగింది. అమ్మరాజు శాసనాలు చాల ఉన్నాయి. వానిలో తాడికొండ, మలియంపూడి, కలుచుంబర్రు శాసనాలు చాల ముఖ్యం. వానితోబాటు బాడపుని ఆరుంబాక, ఇంటూరు శాసనాలు, తాళవుని శిరిపూడి శాసనం, దానార్ణవుని మాగల్లు శాసనాలు అమ్మరాజుకాలం రాజకీయ సాంస్కృతిక చరిత్రను గ్రహించడానికి ఉపకరిస్తున్నాయి.

అమ్మరాజు సింహాసనం ఎక్కిన వెంటనే బాడప తాలరాజుల తిరుగుబాటు జరిగింది. ఈ సోదరులు మూలబల నాయకుడైన పండరంగని తమవైపు తిప్పుకున్నారు. సారోనాథుడైన గండనారాయణ నాయకత్వంలో చాళుక్యసామంతులు సయితం వారి పక్షం వహించారు. వీరికి సాయంగా రట్టేశుడైన మూడోకృష్ణుడు పంపిన సైన్యం రాజ్యంలో ప్రవేశించింది. శత్రుబలాధిక్యతను తన నిస్సహాయతను గుర్తించిన అమ్మరాజు రాజ్యత్యాగం చేయక తప్పదు.

బాడపుడు ఎంతకాలం రాజ్యంచేసినాడో చెప్పలేము. అతని తమ్ముడైన తాలరాజు పాలన జనాదరణ పొందలేదు. అందుచేత సామంతులు పండరంగాది ఉద్యోగులు అమ్మరాజు పక్షం వహించినారు. సారోనాథుడైన నృపకాముడు తన కుమార్తెను అమ్మరాజుకిచ్చి పెండ్లిచేసినట్లు తెలుస్తుంది. వీరందరి సాయంతో అమ్మరాజు తిరిగి వేంగి నాక్రమించినాడు.

దానార్ణవుని మాగల్లుశాసనం ప్రకారం క్రీ.శ 956 లో వేంగిపై రాష్ట్రకూట మూడో కృష్ణుని దండయాత్ర జరిగింది. ఈ దాడి ఉద్దేశం దానార్ణవుని వేంగిశునిగా చేయడమే. రట్టేశుని దాడిని ప్రతిఘటించడానికి ప్రయత్నించక అమ్మరాజు కళింగ రాజ్యానికి పారిపోయినాడు. రాజ్యం దానార్ణవుని హస్తగతమయింది. రాష్ట్రకూట సేనాని సామంత వడ్డి వంశస్థుడయిన కాకర్త్యగుండ్యన సహాయంతో దానార్ణవుడు వేంగిని పాలించినాడు.

రాష్ట్రకూట సైన్యాలు మరలినంతనే అమ్మరాజు వేంగికి మరలివచ్చి దానార్ణవుని తొలగించి రాజ్యం ఆక్రమించినాడు. అమ్మరాజు పాలన ఎంతకాలం సాగిందో చెప్పలేము. దానార్ణవుడు తన బలాన్ని కూడగట్టుకొన్నాడు. ముదిగొండ చాళుక్యులైన మల్లన గొండియ లాతనితో చేరినారు. దానార్ణవుని తల్లి కళింగ రాకుమారి. కళింగ గంగుల సహాయం కూడ అతనికి లభించి వుండవచ్చు.

అమ్మరాజు బలం క్షీణించింది. క్రీ.శ. 970 లో అతణ్ణి వధించి దానార్ణవుడు వేంగి రాజ్యాన్ని ఆక్రమించినాడు.

అమ్మరాజు మహావీరుడు; యుద్ధనిర్వహణలో సమర్థుడు; బల్లాల దేవుడాతని యువరాజు. ఉభయుల మధ్య సంబంధమేమో స్పష్టంగా తెలియదు. మతంలో అమ్మరాజు ఉదారభావాలున్నవాడు; పరమబ్రహ్మణ్య, పరమ మాహేశ్వర, పరమభట్టారక బిరుదాలు మూడూ ధరించినాడు. అతని కాలంలో తీవ్రవాద శైవులైన కాలాముఖులతోబాటు జైనులకు గూడ పోషణ లభించింది. అమ్మరాజుకు 'కవిగాయక కల్పతరువు' అనే బిరుదు వుంది అతని ఆస్థానంలో కవిచక్రవర్తి పోతనభట్టు మొదలైన కవులున్నారు.

దానార్ణవుని మూడు సంవత్సరాల పాలన (970–73) కాలంలో దక్షిణ దేశ రాజకీయాలల్లో అనేక పరిణామాలు జరిగి, చివరకు అతని జీవితమే విషాదాంతమైంది. క్రీ.శ. 972 నాటికి రాష్ట్రకూటులు బలహీనులైనారు రెండో తైలపుడు క్రీ.శ. 973 లో రాష్ట్రకూట రాజ్యం ఆక్రమించి చాళుక్య వంశాన్ని పునరుద్ధరించినాడు. తైలపుడు 108 యుద్ధాలు చేసి రట్టవల రాక్షసులను రూపుమాపినాడని, 88 దుర్గాల నాక్రమించినాడని శాసనాలు చాటుతున్నాయి. చోళమండలంలో పరాంతకుని మరణంతో (క్రీ.శ. 956) ప్రబలిన అరాజకాన్ని అణచి రాజరాజు చోళప్రతిష్ఠను పునరుద్ధరిస్తున్నాడు.

ఇట్టి పరిస్థితుల్లో దానార్ణవుడు దక్షిణదేశ దండయాత్రలు సాగించినట్లు అతని కుమారుడైన శక్తివర్మ పొన్నేరు, కంద్యం శాసనాలవల్ల తెలుస్తున్నది రాష్ట్రకూటాధికారం క్షీణించడం గుర్తించిన దానార్ణవుడు దండెత్తి రేనాడులో పాలిస్తున్న భువన త్రినేత్ర వైదుంబమహారాజు నోడించి సామంతుడుగా చేసుకోవడమేగాక పొత్తపినాడును ముదిగొండ చాళుక్య రాకుమారులు, తనకు విశ్వాసపాత్రులైన మల్లన, గొండియలకు ఇచ్చినాడు. అనంతరం తొండై మండల ప్రాంతంపై దండెత్తినట్లు తెలుస్తుంది. శక్తివర్మ శైశవంలోనే 'ద్రమిళాహవం'లో పాల్గొన్నాడని శాసనాలు చాటుతున్నాయి.

## జటాచోడభీముడు, (క్రీ.శ. 973–1000)

ఇంతలో జటాచోడభీముని తిరుగుబాటు జరిగింది. మధ్యయుగాంధ్ర మహావీరులలో ప్రసిద్ధుడీ భీముడు. ఇతణ్ణి గురించి తెలుసుకోడానికి ఈతని కైలాసనాథ దేవాలయ శాసన ఖండమే ఆధారము. ఇతడు తెలుగుచోడ వంశస్థుడు. ఈ వంశస్థులు రాష్ట్రకూట సామంతులుగా పెద్దకల్లును (కర్నూలు జిల్లా) పాలించేవారు. వీరికి వైదుంబులకు బద్ధవైరం ఉండేది భీముని తండ్రి జటాచోడుడు, తల్లి వేంగీశుడైన కొల్లభిగండ విజయాదిత్యుని కూతురు. ఆంధ్ర

దేశాన్ని 'స్వరగిని విషయం' అని చెప్పినందున భీముని సోదరి బహుశా రెండో అమ్మరాజు పట్టమహిషి అయివుండవచ్చు.

రాష్ట్రకూట మూడో కృష్ణుని మరణానంతరం చోడభీముడు స్వతంత్రించి రాజ్యవిస్తరణకు పూనినాడు. వేంగి రాజకీయాలు అతణ్ణి ఆకర్షించినాయి. రెండో అమ్మరాజును వధించి దానార్ణవుడు సింహాసనం ఆక్రమించడాన్ని చోడభీముడు సహించలేకపోయినాడు. అంతేగాక దానార్ణవుడు పొత్తపి ప్రాంతాన్ని ఆక్రమించడం అతనికి మరింత ఆగ్రహం కలిగించింది. ఇవి కారణాలుగా చోడభీముడు వేంగిపై దండెత్తినాడు. దానార్ణవు డోడి మరణించినాడు చాళుక్య సింహాసనం చోడభీముని వశమయింది. (క్రీ.శ 973)

సింహాసనం ఆక్రమించినంత మాత్రంతో వేంగిరాజ్యం పూర్తిగా చోడ భీముని స్వాధీనం కాలేదు. వైదుంబాది చాళుక్య సామంతు లాతని అధికారాన్ని ప్రతిఘటించినారు. దానార్ణవుని కుమారులైన శక్తివర్మ విమలాదిత్యులు కళింగకు పారిపోయి తూర్పు గంగవంశజుల సహాయం అర్థించినారు. గంగరాజైన కామార్ణవుడు చోడభీమునిపై దండెత్తినాడు. అందుచేత వేంగిలో తన అధికారం సుప్రతిష్ఠితం చేసుకోవడానికి చోడభీముడు సుమారు ఎన్మిది సంవత్సరాలు ఎడ తెగని యుద్ధాలు చేయవలసి వచ్చింది. బహుశా భీముడు కళింగపై దండెత్తినాడు. సుదీర్ఘ పోరాటం తరువాత కామార్ణవుడు (క్రీ. శ. 978), అతని తమ్ముడు వినయాదిత్యుడు మరణించినాడు. కళింగరాజ్యం భీముని పాదాక్రాంతమయింది. అనంతరం భీముడు వైదుంబులపై దండెత్తి భువనత్రినేత్రుని ఓడించి సామంతుడుగా చేసుకుని 'చోడత్రినేత్ర' బిరుదం ధరించినాడు. వేంగి, కళింగ రాజ్యాలలో చోడభీముని అధికారానికి అడ్డులేకపోయింది.

కళింగ నుండి శక్తివర్మ విమలాదిత్యులు చోళమండలానికి పారిపోయినారు. నాడు చోళరాజ్యం రాజరాజు పాలనలో బలపడుతూ ఉంది. రాజరాజు పరాక్రమవంతుడు; రాజనీతి ధురంధరుడు. నాటికే చోళులకు అనంతర చాళుక్యులకు దక్షిణదేశ అధిపత్యానికై స్పర్ధ ప్రారంభమయింది. వేంగి రాజ్యంలో తన ప్రాబల్యం నెలకొల్పితే అనంతర చాళుక్య విజృంభణ నరికట్టడం సులభమని గ్రహించినాడు. అందుచే చాళుక్య సోదరులకు ఆశ్రయం ఇచ్చి వారికి సహాయం వాగ్దానం చేసినాడు. తన కుమార్తెయైన కుందవ్వను సోదరులలో చిన్నవాడైన విమలాదిత్యునకిచ్చి పెండ్లిచేసి చోళ తూర్పు చాళుక్య వంశాలమధ్య సంబంధాన్ని దృఢతరంచేసి ఆ సోదరులను వేంగిలో ప్రతిష్ఠించడానికి సన్నాహాలు ప్రారంభించినాడు.

చోళ సైన్యాల సాయంతో శక్తివర్మ చోడభీమునితో తలపడి యుద్ధాలు చేసినాడు. శక్తివర్మ ప్రభుపత్రు, పెన్నేరు, ఆంధ్ర సాహిత్య పరిషత్ శాసనాలి

దాడుల వివరాలు తెల్పుతున్నాయి. వేంగిపైకి వస్తున్న శక్తివర్మ నరికట్టడానికి చోడభీముడు మొదట్లో ఏకవీర సేనానిని, అనంతరం బద్దెన, మహారాజ సేనానులను పంపినాడు. వీరందరూ యుద్ధంలో నిహతులయినారు. చోడభీముడు కళింగ ప్రాంతానికి తిరోగమించడంతో వేంగి శక్తివర్మ స్వాధీనమయింది. ఇది క్రీ.శ. 999 లో జరిగినట్లు శాసనాలు సూచిస్తున్నాయి. కాని, చోడభీముడు సైన్యాలు కూర్చుకొని కళింగనుండి వేంగిపై దాడిచేయడంతో శక్తివర్మ రాజ్యత్యాగంచేసి మరల చోళ మండలానికి పలాయనమైనాడు. బహుశా శక్తివర్మను వెన్నంటి చోళులను శిక్షించే ఆశయంతో భీముడు కాంచీపురి వరకు దాడులు జరిపినాడు. కాంచీపురం అతని వశమైనదనడానికి అచటి కైలాసనాథ దేవాలయంలోని శాసన ఖండమే నిదర్శనం. కాని బహుశా, కాంచీపురం సమీపంలోనే రాజరాజ శక్తివర్మల సైన్యాలు దిగ్బంధనంచేయడంతో చోడభీముడు ఓడి మరణించినాడు. వేంగి కళింగ రాజ్యాలు శక్తివర్మ స్వాధీనమయినాయి.

## వేంగిలో చోళ పశ్చిమచాళుక్య స్పర్థ

శక్తివర్మ (990 - 1011) వేంగి నాక్రమించినాడుగాని వేంగి రాజ్య ప్రతిష్ఠ, చాళుక్య వంశగౌరవం క్షీణించినాయి. శక్తివర్మను సింహాసనమెక్కించిన చోళుల సామ్రాజ్య విస్తరణ కాంక్షకు ప్రతిద్వందిగా పశ్చిమ చాళుక్యులు నిలిచినారు. వీరిద్దరిమధ్య సంఘర్షణ రాజరాజు తైలపదేవుల కాలంలోనే ప్రారంభమయింది. నాటికే చోళుల ప్రాబల్యం చోళవాడి, గంగవాడీలలో నెలకొన్నది. ఈ రెండు ప్రాంతాలనుండి చోళులను తరిమివేయాలన్న తైలపుని ప్రయత్నం ఫలించలేదు. తైలపుని విధానమే కొడుకు సత్యాశ్రయుడు అనుసరించినాడు. వేంగిలో చోళాధికారం నెలకొంటే దక్షిణాపథంలో వారి నెదిరింపగలవారుండరని గ్రహించి ఆంధ్రదేశంనుండి చోళులను తరిమివేయాలని సంకల్పించినాడు. బయలనంబి అనే బ్రాహ్మణ సేనాని నాయకత్వంలో ఒక చాళుక్య సైన్యం తీరాంధ్రంమీదికి నడిచింది. ఎనమదల, ధరణికోట దుర్గాలను ధ్వంసంచేసి బయలనంబి, చేబ్రోలులో విడిసినాడు. సత్యాశ్రయునకు తీసిపోవువాడు కాదు రాజరాజు. వేంగినుండి చాళుక్య సైన్యాలను మరలించే ఉద్దేశ్యంతో తన కుమారుడు రాజేంద్రుని నాయకత్వంలో ఒక సైన్యాన్ని కర్ణాటకపై పంపినాడు. రాజేంద్రుడు నవలక్ష సైన్యంతో దోనూరు (బిజాపూర్ జిల్లా) వరకు నడిచి స్త్రీ, బాల, బ్రాహ్మణ విచక్షణ లేకుండా వధించి దేశాన్ని దోచుకొనడమేగాక స్త్రీల మానభంగం చేసినట్లు హొట్టూరు శాసనం చెబుతున్నది. చోళ దండయాత్ర నరికట్టి కర్ణాటకని రక్షించడానికి వేంగినుండి సత్యాశ్రయుడు తన సైన్యాన్ని మరలింపక తప్పలేదు. తాత్కాలికంగా వేంగికి శక్తివర్మకు శాంతి లభించింది, కాని

తూర్పు చాళుక్యుల బలహీనత దాక్షిణాత్య రాజ్యాలకు స్పష్టమయింది. దాక్షిణాత్య సార్వభౌమత్వం ఆశించిన పశ్చిమ చాళుక్యులకు చోళులకు వేంగి యుద్ధరంగమయింది. క్రీ. శ. 1070 లో కులోత్తుంగ చాళుక్యచోళుడు తంజావూరు సింహాసనం ఎక్కేవరకు వేంగి ప్రజలకు శాంతిభద్రతలు కరువయినాయి.

శక్తివర్మ మరణానంతరం తమ్ముడు విమలాదిత్యుడు క్రీ.శ. 1011నుండి 1018 వరకు రాజ్యం చేసినాడు. ఇతనికి కుందవ్వ, మేళమ అనే ఇద్దరు భార్యలు. కుందవ్వ చోళ రాజకుమారి. ఆమె కుమారుడు రాజరాజనరేంద్రుడు. మేళమ తెలుగుచోడ రాకుమారి. జటాచోడ భీముని కుమార్తెయని ఒక సూచన (డా॥ వెంకట రమణయ్యగారు). భీముని మరణానంతరం విమలాదిత్యుడామెను పెండ్లాడి ఉభయవంశాల మధ్య సఖ్యం కుదిర్చి వుండవచ్చు.

విమలాదిత్యుని మరణానంతరం (1019) రాజరాజనరేంద్రుడు రాజైన నాటినుండి తూర్పు చాళుక్య యుగాంతం (1079) వరకు వేంగి చరిత్ర సుస్పష్టంగా లేదు. రాజరాజనరేంద్రునివి, అతని సవతి తమ్ముడు విజయాదిత్యునివి, రెండో శక్తివర్మవి, చోళులవి, చాళుక్యులవి ఈ యుగానికి సంబంధించిన శాసనాలు చాల ఉన్నాయి. చోళులు, చాళుక్యులు సామ్రాజ్యకాంక్షతో భీషణ సంఘర్షణలతో నిమగ్నులైనందున వారివారి శాసనస్థాంశాలను సత్యాలుగా విశ్వసించలేము. మిగిలిన శాసనాల అంశాలు కూడ అస్తవ్యస్తంగా ఉన్నందున రాజరాజనరేంద్ర విజయాదిత్యుల మధ్య సంబంధాలను గురించి, ఇతర సంఘటనలను గురించి అభిప్రాయభేదాలున్నాయి. శాసనస్థ సాక్ష్యం యావత్తూ పునఃపరిశీలనకు లోనవుతూ ఉంది.

రాజరాజనరేంద్రుడు సింహాసనం ఎక్కడానికి (క్రీ. శ. 1019), అతని పట్టాభిషేకానికి (క్రీ.శ. 1021) మూడు సంవత్సరాల వ్యవధి ఉంది. కొత్త శివారం (అనంతపురం జిల్లా) శాసనాల్లో రాజేంద్రచోళుని సేనాపతి చోళవరాయన్ తాను కుంతల (పశ్చిమచాళుక్య) తెలుంగు, కళింగ, వడ్డసేనలను ఓడించినట్లు, వేంగీశ్వరుని పారదోలినట్లు చెప్పుకున్నాడు. ఈ విజయాల అనంతరమే చోళవరాయన్ గంగానది వరకు నడిచి అచట వంగరాజ్యాధీశుడైన మహీపాలునోడించినాడు. ఇదేసమయములో తిరువాలంగాడుశాసనంలో రాజేంద్రచోళుడు కులూట ఉత్కలాధిపులను గోదావరీతీరంలో జయించినట్లు ఉంది. ఈ అంశాలు ఆధారంగా రాజరాజనరేంద్రుని పట్టాభిషేకాన్ని విజయాదిత్యుడు ప్రతిఘటించి కుంతల కళింగాధీశుల సాయంతో సింహాసనం ఆక్రమించినాడని, చోళవరాయడాతని పారదోలగా రాజేంద్రచోళుడు వేంగి వరకు నడిచి తనకుమార్తె అమ్మంగదేవిని రాజరాజనరేంద్రునకిచ్చి పెండ్లిచేసి, 16-8-1022 తేదీన అతని పట్టాభిషేకం జరిపించినాడని ఒక సిద్ధాంతం. (డా॥ వెంకటరమణయ్య.) కాని తన

పాములవాక శాసనంలో విజయాదిత్యుడు తన మొదటి సింహాసన ఆక్రమణను ప్రస్తావించలేదు. రాజరాజు పాలనకాలాన్ని క్రీ.శ. 1019 నుండియే లెక్కించి నాడు. అందుచేత రాజరాజనరేంద్రుని పట్టాభిషేకం వాయిదా పడడానికి విజయాదిత్యుడు 1019 లో సింహాసనం ఆక్రమించడం కారణం కాదని స్పష్టమవుతున్నది. బహుశా వేంగి ఆధిపత్యంనుండి విముక్తి పొందడానికి కళింగాధీశుడైన మధుకామార్ణవుడు, చోళప్రాబల్యాన్ని తుదముట్టించడానికి చాళుక్యజయసింహుడు పన్నిన కుట్రలు, వానివల్ల నేర్పడిన అలజడి కారణంగా రాజరాజనరేంద్రుని పట్టాభిషేకం ఆలస్యమై వుంటుంది.

పట్టాభిషేకానంతరం రాజరాజనరేంద్రుని పాలన తొమ్మిది సంవత్సరాలు ప్రశాంతంగా జరిగింది. కాని చాళుక్యజయసింహుడు తన ప్రయత్నాలు మానలేదు. విజయాదిత్యునిలో ఆశలు రెచ్చగొట్టి తనపక్షానికి తిప్పుకొని వేంగిరాజ్య సింహాసనాక్రమణకు అతణ్ణి పురికొల్పినాడు. అతనికి సాయంగా కన్నడ సంధి విగ్రహియైన దండనాయక చావణ్ణరసనాయకత్వంలో పెద్దసైన్యం పంపించాడు. వేంగిరాజ్యంలో అధికభాగం, బహుశా కృష్ణాగోదావరీ నదుల నడిమిప్రాంతం విజయాదిత్యుని వశమయింది వేంగినగరం రాజధానిగా విజయాదిత్యుడు క్రీ. శ. 1034 లో పట్టాభిషేకం జరుపుకున్నాడు. మిగిలిన రాజ్యభాగాన్ని రాజమహేంద్రవరం నుండి పాలిస్తూ వేంగిరాజ్య ఐక్యాన్ని పునరుద్ధరించడానికై రాజరాజనరేంద్రుడు చోళులసాయం అర్థించినాడు. రాజరాజబ్రహ్మమహారాజు నాయకత్వంలో చోళసైన్యం వేంగిపై నడిచింది. వేంగి సమీపంలో కలిదిండి దగ్గర చోళచాళుక్య సైన్యాలకు ఘోరయుద్ధం జరిగింది. చాళుక్యసైన్యాలు పరాజయం చెంది వేంగినుండి నిష్క్రమించినాయి. వేంగిరాజ్యం సమైక్యమయింది. విజయాదిత్యుడు పశ్చాత్తాపం చెందినాడు. రాజరాజనరేంద్రుడతణ్ణి క్షమించి మన్నించినాడు. యుద్ధంలో మృతులైన చోళసేనాపతుల స్మారకార్థం కలిదిండిలో మూడు శివాలయాలు నిర్మించినాడు.

తిరిగి క్రీ.శ. 1042 నుండి రాజరాజనరేంద్రుని అధికారానికి ప్రమాదం వాటిల్లింది. జయసింహుడు మరణించి ఆహవమల్ల సోమేశ్వరుడు పశ్చిమ చాళుక్యరాజయినాడు. రాజేంద్రచోళుడు మరణించి (క్రీ.శ. 1044) చోళసింహాసనం రాజాధిరాజు అధిష్ఠించినాడు. వీరిరువురి కాలంలో చాళుక్యచోళ సంఘర్షణ తారస్థాయికి చేరడంతో వేంగి రాజ్యం అలజడి పాలయింది. సోమేశ్వరుని సామంతుడైన శోభనరసు 'వేంగి పురవరేశ్వర' బిరుదం ధరించినాడు. క్రీ. శ. 1044, 1047 నాటి శాసనాలు ఆహవమల్లుడు వేంగి కళింగ రాజ్యాలను జయించినట్లు చెబుతున్నాయి. వీటినిబట్టి సింహాసనం ఎక్కిన వెంటనే

సోమేశ్వరుడు వేంగిరాజ్యంలో అధిక భాగాన్ని జయించి ధరణికోట, వేంగి మొదలైన కీలకస్థానాల్లో చాళుక్య సైన్యాలను నిలిపినట్లు కన్పిస్తుంది.

తీరాంధ్రంలో చాళుక్య ప్రాబల్యాన్ని తుదముట్టించడమే చోళుల ఆశయం. అందుచే రాజాధిరాజు (1044-54) చాళుక్యులకు వ్యతిరేకంగా ప్రయత్నాలు సాగించినాడు. క్రీ.శ. 1045 లో పెద్దసైన్యాన్ని సమకూర్చుకొని ధరణికోటవరకు పురోగమించినాడు. ధరణికోట చెంత పెద్దయుద్ధం జరిగింది. చాళుక్య సైన్యాలు ఓడినాయి. చాళుక్య సేనాపతులలో గంగాధర, గండమయ్యలు మరణించినారు; విక్రమాదిత్య విజయాదిత్య, సంగమయ్యలు పారిపోయినారు. చాళుక్య సైన్యాలను వెన్నంటి రాజాధిరాజు కొల్లిపాకవరకు పురోగమించి కొల్లిపాకను ధ్వంసం చేసినట్లు చెప్పుకొన్నాడు. మరల క్రీ.శ. 1051 లో వేంగిపై దండెత్తే ఉద్దేశంతో ధరణికోటవరకు పురోగమించి, అటనుండి కర్ణాటకంపై నడిచి ఏతగిరిలో రాజాధిరాజు విజయస్తంభం ప్రతిష్ఠించినాడు. చివరకు 1053 లో పశ్చిమ చాళుక్య రాజ్యంపై దండెత్తి కొప్పంయుద్ధంలో ప్రాణాలు కోల్పోయినాడు. ఈ విజయ యాత్రలవల్ల వేంగి రాజకీయపరిస్థితిలో మార్పురాలేదు. వేంగిలో పశ్చిమచాళుక్య ప్రాబల్యానికి ప్రమాదం వాటిల్లలేదు. ఈ విధంగా చోళుల ప్రయత్నాలు విఫలం కావడంతో రాజరాజనరేంద్రుడు గత్యంతరంలేక ఆహమవల్ల సోమేశ్వరునితో సమాధానపడి అతని సార్వభౌమత్వాన్ని అంగీకరించి వేంగిని పాలించినాడు. చోళవంశాభిమానియైన రాజరాజనరేంద్రుని విశ్వసించజాలక సోమేశ్వరుడు వేంగి ఆస్థానంలో ప్రధాని నారాయణభట్టును తన ప్రతినిధిగా నిల్పినట్లు తెలుస్తుంది. నారాయణభట్టు కూతురు కుప్పమ దాక్షారామశాసనంలో తన తండ్రి సోమేశ్వరుని ప్రధాని అని స్పష్టంగా చెప్పింది. పశ్చిమచాళుక్యుల బిరుదాలైన 'సమస్త భువనాశ్రయ' 'సత్యాశ్రయ కులశేఖర' అనేవి నన్నయ ఆంధ్రమహాభారతంలో రాజరాజనరేంద్రునకు వాడినాడు. ఈ అంశంకూడ రాజరాజనరేంద్రుడు పశ్చిమ చాళుక్య సామంతుడని సూచిస్తున్నది.

అనంతరం క్రీ.శ. 1061 వరకు రాజరాజనరేంద్రుని పరిపాలన ప్రశాంతంగా సాగింది. రాజరాజనరేంద్రుడు మహావీరుడేగాక పండితుడు. పండితగోష్ఠిలో అతనికి ఆసక్తి హెచ్చు. పరమశైవుడైనను వైదికధర్మనిష్ఠాపరుడు; ఈశ్వరాగమాలలోను మహాభారతంలోను అభిమానం వహించినాడు. వర్ణాశ్రమ ధర్మరక్షణ తత్పరత్వంతో అతని పరిపాలన సాగింది. అతని పాలనకాలం ఆంధ్రభాషా చరిత్రలో ప్రముఖ ఘట్టం. మహావిద్వాంసుడు, మహాకవి అయిన నన్నయ సంస్కృత భారతాన్ని ఆంధ్రీకరించడానికి ఉపక్రమించినాడు. నన్నయకు నారాయణభట్టు సహాయమైనాడు. నారాయణభట్టు అష్టభాషా సుకవిశేఖరుడు.

నారాయణభట్టుకు నందంపూడి అగ్రహారాన్ని ఇచ్చి రాజరాజనరేంద్రుడు గౌరవించినాడు.

## తూర్పు చాళుక్యాస్తమయం

రాజరాజనరేంద్రుని మరణానంతరం వేంగిలో జరిగిన రాజకీయ సంఘటనలను గురించి ఏకాభిప్రాయంలేదు. రాజనరేంద్రుని కుమారుడైన రాజేంద్రుడు (కులోత్తుంగచోళుడు) చోళాస్థానంలోనే గడిపినట్లు కన్పిస్తుంది. ఫ్లీట్ మొదలైన శాసనాలలోని 'ప్రత్యగ్రహీత్' పదం ఆధారంగా విజయాదిత్యుడు వేంగిరాజ్యాన్ని బలవంతంగా ఆక్రమించి, తన కుమారుడైన రెండో శక్తివర్మకు పట్టాభిషేకం చేసి తాను పశ్చిమ చాళుక్య సామంతుడుగా నొలంబవాడిని పాలించి, శక్తివర్మ మరణానంతరం క్రీ.శ. 1063 లో వేంగికి రాజయినాడని ఒక అభిప్రాయము (డా॥ వెంకటరమణయ్య). నొలంబవాడి ప్రాంతంలో విష్ణువర్ధన, విజయాదిత్య, వేంగిపురవరేశ్వర బిరుదులతో నున్న శాసనాలు విజయాదిత్యునివేనని వారి తీర్మానము. కాని రాజ్యకాంక్షతో దురాక్రమణజరిపిన విజయాదిత్యుడు స్వయంగా పట్టాభిషేకం జరుపుకొనక, యువకుడు అనుభవశూన్యుడునైన కుమారుని, అందునా, శత్రుపరివేష్టితమైన రాజ్యంలో నిలపడం అసహజంగా కన్పిస్తుంది. నొలంబవాడి నేలిన వేంగిపురవరేశ్వర విష్ణువర్ధన విజయాదిత్యుడు చాళుక్య చక్రవర్తి మొదటి సోమేశ్వరుని కుమారుడని నిర్ధారణ జరిగింది (శ్రీ జి. యస్. గాయ్). 'ప్రత్యగ్రహీత్' అనేమాటకు (దాన) స్వీకారం అనే అర్థం ఉంది. రాజరాజనరేంద్రుని కుమారుడైన రాజేంద్రుడు (కులోత్తుంగ చోళుడు) చోళసింహాసనంపై ఆసక్తివహించి వేంగి రాజ్యాన్ని పినతండ్రియైన విజయాదిత్యునకు ఇచ్చినట్లు అతని శాసనాలవల్ల స్పష్టమవుతున్నది. అతని శాసనాల్లోగాని, అతని కుమారుల శాసనాల్లోగాని విజయాదిత్యుడు దురాక్రమణదారుడనే సూచనలేదు. కాబట్టి రాజేంద్రుడు స్వయంగా వేంగిని పినతండ్రి కిచ్చినాడు నాటికి విజయాదిత్యునకు రాజ్యకాంక్ష క్షీణించడంవల్ల పుత్రవాత్సల్యంతో శక్తివర్మకు పట్టం కట్టినాడు.

రాజరాజనరేంద్రుని మరణంతో వేంగి రాజ్యానికి వ్యక్తిత్వం పూర్తిగా నశించి, చోళ చాళుక్య సార్వభౌములలో విజేతలైనవారి పక్షమో, లేదా వేంగిపై దండెత్తివచ్చినవారి పక్షమో వహించవలసిన దయనీయస్థితికి దిగజారిపోయింది. ఈ యుగంలో చోళ చాళుక్య యుద్ధాలు, దండయాత్రలు చాల గజిబిజిగా ఉండడమే గాక ఎవరు విజేతలో ఎవరు పరాజితులో నిర్ణయించడం సాధ్యంకాదు.

రాజరాజనరేంద్రుని కాలంలోనే వేంగీశులు పశ్చిమ చాళుక్య సార్వభౌమత్వం అంగీకరించడమేగాక రాజ్యంలో అధికభాగం పశ్చిమ చాళుక్య సేనాపతుల పాలనలో ఉన్నట్లు తెలుస్తుంది. బహుశా ఇందువల్లనే రాజేంద్రుడు

(కులోత్తుంగుడు) వేంగి రాజ్యాన్ని పినతండ్రికి దత్తం చేసివుంటాడు. విజయాదిత్యుడు రాజేంద్రునితో సమాధానానికి రావడం చోళాధిపత్యాన్ని అంగీకరించడమే. ఇది పశ్చిమ చాళుక్యులకు సహింపరాని పరిణామం. అందుచేతనే చాళుక్యరాకుమారుడు విక్రమాదిత్యుడు క్రీ శ. 1062-63 లో దండెత్తి వేంగి చక్రకూటాలను జయించినట్లు విక్రమాంకదేవ చరిత్ర చెబుతున్నది. బహుశా విక్రమాదిత్యునితోటి పోరాటంలోనే రెండో శక్తివర్మ మరణించినాడని చెప్పవచ్చు. శక్తివర్మ మరణంతో విజయాదిత్యుడు కుంగిపోయినాడు. కాని బంధుమిత్రుల ఉద్యోగుల బలవంతం మీద ధర్మరక్షణయే ఆశయంగా బహుశా పశ్చిమ చాళుక్యుల సామంతుడుగా విజయాదిత్యుడు వేంగి పాలనాబాధ్యత స్వీకరించినాడు; వేంగిని పాలించిన విజయాదిత్యులతో ఇతను ఏడవవాడు. ఇతణ్ణి విష్ణువర్ధన-విజయాదిత్య అనికూడ వ్యవహరిస్తారు సప్తమ విజయాదిత్యుడు చాళుక్య సామంతుడు కావడం చోళులకు కోపకారణ మయింది.

రెండో రాజేంద్ర చోళుని మరణానంతరం (1062) సింహాసనం ఎక్కిన వీర రాజేంద్రుడు మహాశూరుడు. చాళుక్యులను నిర్జించి వేంగి కళింగ రాజ్యాల్లో చోళాధిపత్యం పునరుద్ధరించవలెనని అతని సంకల్పం. వీర రాజేంద్రుడు తనకు యువరాజుగా రాజేంద్రుని (కులోత్తుంగుని) చేసుకోవడమేగాక అతనికి తన కూతురు మధురాంతకినిచ్చి పెండ్లి చేసినాడు. (మధురాంతకి, ఆమె సోదరి రాజసుందరి రెండో రాజేంద్రచోడుని కుమార్తెలని ఒక అభిప్రాయము) దీనితో చోళ సింహాసనంపై రాజేంద్రుని ఆశలు, హక్కులు బలపడినాయి. వీర రాజేంద్రుడు కూడల్ సంగం చెంత చాళుక్య సైన్యాల నోడించి (క్రీ.శ. 1066) వేంగిపైకి నడచినాడు. వేంగిపై వీర రాజేంద్రుడు రెండు దాడులు చేసినాడుగాని వాని వివరాలు తెలియవు. ఈ దండయాత్రల సందర్భంలోనే విజయాదిత్యుడు వేంగిని వీడి కళింగలో తలదాచుకొని వుంటాడు. తన తండ్రియైన రాజరాజ దేవేంద్రవర్మ వృద్ధ విజయాదిత్యుని చోళుల బారినుండి రక్షించి చిరకాలం వేంగి నేలేటట్లు చేసినాడని, 'ద్రమిళాహవం'లో గెలిచినాడని అనంతవర్మ చోడ గంగ దేవుని కొన్ని శాసనాలు చెబుతున్నాయి. వీర రాజేంద్రుడు రాజరాజ దేవేంద్రవర్మతో సమాధానానికి వచ్చి వేంగిని సప్తమ విజయాదిత్యుని కిచ్చి తన కూతురు రాజసుందరిని దేవేంద్రవర్మ కిచ్చి వివాహంచేసి స్నేహసంబంధాలను బలపరచినాడు. ఈ విధంగా వేంగి కళింగలలో తన పలుకుబడి నెలకొల్పి వీర రాజేంద్రుడు చక్రకొట్టంపై దండెత్తినాడు కాని చక్రకొట్టంలో యుద్ధనిర్వహణను యువరాజు రాజేంద్రుని కప్పగించి చోళరాజ్యంపై చాళుక్య దండయాత్రల నరికట్టడానికై వీర రాజేంద్రుడు దక్షిణాదికి మరలవలసివచ్చింది. రాజేంద్రుడు వైరాగరం చెంత గజఘటలను సంగ్రహించి చక్రకొట్టేశుడైన ధారావర్షునోడించి కప్పం

వసూలు చేసినాడు. ఇదేసమయంలో విక్రమాదిత్యుడు చక్రకొట్టం ప్రవేశింపగా రాజేంద్ర విక్రమాదిత్యులకు పోరు జరిగింది. విజయమెవ్వరిదో స్పష్టంగా లేదు. విక్రమాదిత్యుడు చక్రకొట్టం నుంచి మరలి మార్గమధ్యంలో ఉండగా అతని తండ్రి ఆహవమల్ల సోమేశ్వరుడు గతించి, అన్న రెండో సోమేశ్వరుడు క్రీ శ. 1068 లో సింహాసనం ఎక్కినాడు.

విక్రమాదిత్యుడు అన్నను ప్రతిఘటించడంతో కర్ణాటకంలో అంతర్యుద్ధం ప్రబలింది. చాళుక్యాధిపత్యాన్ని నిరసింపజేయడానికి వీర రాజేంద్రుని కిది మంచి అవకాశం. విక్రమాదిత్యునితో వీర రాజేంద్రుడు సమాధానపడి తన కుమార్తెనతని కిచ్చి పెండ్లిచేసి చాళుక్య సింహాసనంపై అతని హక్కులు బలపరచినాడు. విక్రమాదిత్యుడు కర్ణాటక సింహాసనం ఎక్కకముందే వీర రాజేంద్రుడు మరణించినాడు. (క్రీ శ. 1070.) అతని కుమారుడు అధిరాజేంద్రుడు బావమరిది విక్రమాదిత్యుని సాయంతో చోళ సింహాసనం ఎక్కినాడు కాని గంగైకొండ చోళపురం (గంగాపురం)లో జరిగిన తిరుగుబాటులో మరణించినాడు. తూర్పు చాళుక్య రాజేంద్రుడు కులోత్తుంగ బిరుదంతో చోళ సింహాసనం అధిష్ఠించినాడు.

కర్ణాటకంలో అంతర్యుద్ధం చెలరేగడంవల్ల, రాజేంద్రుడు చోళ సార్వభౌముడు కావడంవల్ల వేంగికి చాళుక్య చోళ ప్రమాదాలు తాత్కాలికంగా తప్పినాయి. ఆ తరువాత సప్తమ విజయాదిత్యుడు ఐదు సంవత్సరాలు మాత్రమే పాలించినాడు. అతని పాలన ప్రశాంతంగా సాగలేదు. వేంగి బలహీనత దాక్షిణాత్య రాజ్యాలకు విశదమై అవకాశం చిక్కినప్పుడెల్ల వేంగి ఐశ్వర్యాన్ని కొల్లగొట్టడానికి ప్రయత్నాలు జరిగినాయి. క్రీ శ. 1073 లో దాహళ ప్రభువు చేది యశఃకర్ణదేవుడు దండెత్తి వచ్చి వేంగిపుని దోచుకొని సప్తగోదావరి భీమేశ్వరుని అర్చించినట్లు చెప్పుకున్నాడు. ఇది జరిగిన అచిరకాలానికే గంగరాజు రాజదేవేంద్ర వర్మ తన సేనానాయకుడైన బణపతిని వేంగిపై దండు పంపినాడు బణపతి వేంగినిదోచుకున్నట్లు తెలుస్తుంది. బహుశా చాళుక్యాధిపత్యంనుంచి విముక్తి సాధించడమే దేవేంద్రవర్మ ఆశయం అయివుంటుంది. కులోత్తుంగు డతనితో సమాధానానికి వచ్చి అతని స్వాతంత్ర్యాన్ని అంగీకరించినాడని చెప్పవచ్చు. అనంతరం అనతికాలానికే విజయాదిత్యుడు (క్రీ.శ. 1075) మరణించడంతో తూర్పుచాళుక్య రాజవంశం అంతరించింది. కులోత్తుంగుడు వేంగిని తన సామ్రాజ్యంలో కలుపుకున్నాడు. వేంగికి స్వతంత్ర ప్రతిపత్తి నశించి, చోళ సామ్రాజ్యంలో ఒక రాష్ట్రమయింది.

## సామంత రాజవంశాలు

వేంగి రాజ్యం తీరాంధ్రానికి మాత్రం పరిమితమై తెలంగాణా రాయలసీమ ప్రాంతాలను ఆంధ్రేతర సామ్రాజ్య కేంద్రాలనుండి పల్లవ, చోళ, బాదామిచాళుక్య,

రాష్ట్రకూట, కల్యాణిచాళుక్య రాజవంశాలు పాలించినట్లు చెప్పడం జరిగింది. సామంతులలో బాణ, నొలంబ, వైదుంబ, తెలుగుచోడ వంశాలు ముఖ్యమైనవి. వేంగి రాజ్యంతో వీనికి సంబంధం లేదని చెప్పవచ్చు. పల్లవ, గంగ, రాష్ట్రకూట, చోళ-చాళుక్యరాజకీయాలల్లోను అంతరరాజ్యసంఘర్షణల్లోను వీరు ప్రముఖపాత్రను నిర్వహించినారు. తెలంగాణా ప్రాంతంలో వేములవాడ (కరీమ్‌నగర్ జిల్లా) కేంద్రంగా చాళుక్యవంశశాఖ రాష్ట్రకూట సామంతులుగా సువిశాలమైన రాజ్యం ఏలినారు. వీరి రాజ్యం బస్తర్ ప్రాంతాలకు గూడ విస్తరించింది. రాష్ట్రకూట తూర్పు చాళుక్య యుద్ధాలలో తమ సార్వభౌములకు అండగా నిలిచినారు; రాష్ట్రకూటులతోబాటు వీరు అంతర్హితులై వారి రాజ్యం కల్యాణి చాళుక్య రాజ్యంలో కలిసింది. వేములవాడ రాజ్యానికి ప్రాగ్దక్షిణంగా ముదిగొండ చాళుక్యరాజ్యం వెలసింది. ముదిగొండ చాళుక్యులు తూర్పుచాళుక్యులకు సామంతులు. కాకతీయ విజృంభణతో ఈరాజ్యం అస్తమించింది.

**బాణులు**

బాణులు చాలా ప్రాచీన జాతి. వీరు బలిసంతతియని, బాణాసురుని సంతతి యని భిన్నములైన ఐతిహ్యాలున్నాయి. బాణులను గురించిన మొదటి ప్రసక్తి కదంబ కకుత్స్వవర్మ తాలగుండ శాసనంలో కన్పిస్తున్నది. కదంబవంశకర్త యైన మయూర శర్మ శ్రీపర్వత ప్రాంతంలో బృహద్బాణుని నుండి కప్పం వసూలు చేసినాడని ఆ శాసనంవల్ల తెలుస్తున్నది. క్రమంగా బాణులు దక్షిణాదికి వలస వెళ్ళి ఐదో శతాబ్ది నుండి గుత్తి, జమ్మలమడుగు తాలూకాలలో కన్పిస్తున్నారు. బాణులరాజ్యం పేరు బాణపాడిగా ప్రసిద్ధి. అది ఆంధ్రదేశం నైరుతి భాగంలో శ్రీశైలం కాళహస్తి పాలార్ నదుల నడిమిప్రదేశం. పరివిపురి వీరి రాజధాని. అనంతపురం జిల్లా హిందూపూర్ తాలూకాలోని నేటి పరిగయే పరివిపురి. బాణరాజుల పేర్లు చాళుక్యుల పేర్లను పోలివుంటాయిగాని వారు ప్రాయికంగా పల్లవ సామంతులు. వీరి శాసనాలు గుడిమల్లం, చిక్కబల్లిపూర్, ముడియనూర్, కప్పలె మొదలైనచోట్ల లభించినాయి. యుద్ధంలో మరణించిన యోధునకు 'వీరకల్' వేయడం వీరి ఆచారం.

చారిత్రకంగా బాణ వంశానికి వినయ నందివర్మ (క్రీ శ. 975-80) ఆద్యుడు. పల్లవ సామంతుడుగా ఈతడు 'వడుగావళి 12,000' పాలించడమే గాక పల్లవమల్ల నందివర్మకు పశ్చిమగంగ శ్రీపురుషునకు జరిగిన యుద్ధాలలో పాల్గొన్నాడు. మూడో గోవింద, అమోఘవర్షుల కాలంలో బాణులు రాష్ట్రకూట సార్వభౌమత్వం అంగీకరించినారు. నాటినుండి గంగవంశంతోను, వారితో వివాహాది సంబంధాలున్న నొలంబులతోను బాణులకు తీవ్రవైరం ఏర్పడింది. నందివర్మ బాణుని పౌత్రుడైన మల్లదేవ బాణుడు (క్రీ.శ. 820-850) తెలుగు

చోడుల నోడించి రేనాడులో చాలభాగం ఆక్రమించినాడు. అతడే వైదుంబులను రేనాడులో నిలిపివుండవచ్చు. ఆంధ్రమండలంలో 12,000 గ్రామాలకు అధిపతిగా మల్లదేవుణ్ణి శాసనాలు వర్ణిస్తున్నాయి. ఇతని కొడుకు విక్రమాదిత్యబాణుని కాలంలో (క్రీ.శ. 850-890) పశ్చిమగంగ సింహాసనానికై పృథ్వీపతికి రెండో రాజమల్లుకు పోరాటం ఆరంభమయింది. పృథ్వీపతి కూతురు కుందవ్వను విక్రమాదిత్యుడు పెండ్లాడి. వారసత్వ యుద్ధంలో పృథ్వీపతి పక్షం వహించినాడు. రాజమల్లు, నొలంబులు, తెలుగుచోడులు కలిసి కూటమి ఏర్పడింది. పృథ్వీపతి, బాణులు, వైదుంబులు మరొక కూటమిగా ఏర్పడినారు. ఉభయకూటముల మధ్య తీవ్ర సంఘర్షణ ప్రారంభమై, పెక్కు గోగ్రహణాలు (పందపోటులు) ఓకరయుద్ధాల అనంతరం క్రీ.శ. 878 లో సోరమడి యుద్ధంలో తారస్థాయికి చేరింది. సోరమడి యుద్ధంలో బాణకూటమియే విజయం సాధించింది కాని, వాంఛనీయమైన ఫలితాలు ప్రాప్తించలేదు.

సోరమడి యుద్ధానంతరం బాణ నొలంబ సంఘర్షణ తీవ్రతరమయ్యింది. నొలంబ మహేంద్రుడు బాణులననేక యుద్ధాల్లో ఓడించి విక్రమాదిత్య బాణుని వధించి "మహాబలికుల విధ్వంసక" బిరుదం ధరించినాడు. కాని బాణుల బలం క్షీణించినట్లు కన్పించదు. ఈలోగా శ్రీపురంబియం యుద్ధంలో (క్రీ. శ. 885) పల్లవ నృపతుంగ వర్మ ఓడిపోవడంతో బాణులు స్వతంత్రులయినారు. రెండో విజయాదిత్యబాణుడు (క్రీ.శ. 890-910), రెండో విక్రమాదిత్యబాణుడు (క్రీ. శ. 910-916) సర్వస్వతంత్రులయినట్లు వారి శాసనాలు సూచిస్తున్నాయి.

తొమ్మిదో శతాబ్ది ఆరంభానికి దక్షిణదేశంలో పల్లవుల స్థానం చోళులాక్రమించి సామ్రాజ్యనిర్మాణానికి పూనుకున్నారు. మరొకవైపున రాష్ట్రకూటులు దక్షిణ దండయాత్రలు సాగిస్తున్నారు. చోళ-రాష్ట్రకూట సంఘర్షణలో బాణులు రాష్ట్రకూట పక్షం వహించినారు. రాష్ట్రకూట రెండోకృష్ణునకు చోళపరాంతకునకు క్రీ.శ. 911లో వల్లాలయుద్ధం జరిగింది. గంగ రెండోపృథ్వీపతి సాయంతో పరాంతకుడు రాష్ట్రకూట కూటమిని ఓడించినాడు. బాణరాజ్యం పరాంతకుడాక్రమించి పృథ్వీపతి పరంచేసి అతనికి 'బాణాధిరాజ' బిరుదం ఇచ్చి సత్కరించినాడు. బాణులకిది గొడ్డలి పెట్టయింది. ఐనప్పటికీ బాణవంశం పూర్తిగా నశించలేదు; రాష్ట్రకూట మూడో కృష్ణునితో చేరి తక్కోల యుద్ధంలో (క్రీ.శ. 949) పరాంతకుని ఓడించి ప్రతీకారం తీర్చుకున్నారు. కాని బాణులు తమ పూర్వ అధికార వైభవాలను పునరుద్ధరించుకోలేకపోయినారు. చిరకాలం వరకు రాష్ట్రకూటులకు, చోళులకు సామంతులుగా ఉన్నతోద్యోగులుగా దాక్షిణాత్య శాసనాల్లో కన్పిస్తున్నారు.

**నొలంబులు**

క్రీ.శ. 8-10 శతాబ్దాలలో దక్షిణదేశంలోని సామంతరాజవంశాలలో నొలంబులు సుప్రసిద్ధులు. నొలంబులు తాము పల్లవవంశశాఖగా చెప్పుకొనడమే గాక 'కాంచీపురవరేశ్వర' మొదలైన పల్లవ బిరుదాలు ధరించినారు. అందుచేత వీరిని నొలంబ పల్లవులని కూడ వ్యవహరించడం కద్దు. అనంతపురం, చిత్తల్‌దుర్గ్, తుంకూరు ప్రాంతాలలో నొలంబవాడి 32,000 ఏర్పడింది. అనంతపురం జిల్లాలోని హెంజేరు (హేమవతి) నొలంబవాడికి రాజధాని. పల్లవుల పశ్చిమోత్తర విజృంభణ నరికట్టడానికై పశ్చిమగంగులో, పశ్చిమ (బాదామి) చాళుక్యులో వీరి నీ ప్రాంతాలలో నెలకొల్పినారనే అభిప్రాయం వుంది. పశ్చిమగంగులతో వీరు చిరకాలం మైత్రి వహించినారు. ఉభయుల మధ్య వివాహ సంబంధా లున్నాయి. గంగ-పల్లవ-రాష్ట్రకూట రాజకీయాల్లో వీరి పాత్ర చాల ఆసక్తిదాయకమయింది. హేమవతి, కంబదూరు, కర్షనపల్లి, నేలపల్లి, మొరిగెరి మొదలైన చోట్ల వీరి శాసనాలు లభ్యమయినాయి.

నొలంబులలో మొదటి సుప్రసిద్ధుడు సింగపోత (క్రీ.శ. 770-815); గంగరాజు రెండో శివకుమారుని సామంతుడు; శివకుమార - పల్లవమల్ల నంది వర్మ - రాష్ట్రకూట ధృవుల మధ్య జరిగిన యుద్ధాల్లో పాల్గొన్నాడు. ఈతని పౌత్రుడే పొలల్చోర నొలంబాధిరాజు (క్రీ.శ. 830-870). పొలల్చోరని మేనత్త గంగ మొదటి రాజమల్లుని రాణి. ఆ దంపతుల కూతురైన జాయబ్బెను పొలల్చోర పెండ్లాడినాడు. రాజమల్లునితో చేరి పొలల్చోర అమోఘవర్షుని ప్రతిఘటించినాడు. అమోఘవర్షుని ఆజ్ఞపై గుణగ విజయాదిత్యుడు వీరిపై దండెత్తినాడు పొలల్చోర ఘోరంగా పోరి మరణించినాడు. ఈతని కుమారుడు మహేంద్రాధిరాజు (క్రీ.శ. 870-895) కాలంలోనే సోరమడి యుద్ధం జరిగింది. గంగ, తెలుగుచోడరాజులతో కలిసి మహేంద్రుడు పరాజయం చెందినాడు. కాని యుద్ధానంతరం విక్రమాదిత్యబాణు నోడించి "మహాబలికుల విధ్వంసక" బిరుదం ధరించినాడు. బాణులప్రాబల్యం క్షీణించడంతో నొలంబులు బలాధికులై తమ రాజ్యాన్ని విస్తరింపజేసినారు. అనంతపూర్, తుంకూర్, చిత్తల్‌దుర్గ్, బెంగుళూరు, కోలార్, బళ్ళారి, సేలం, ఉత్తరార్కాటు జిల్లాలకు నొలంబ రాజ్యం విస్తరించింది. ఈ పరిణామం పశ్చిమ గంగులకు కన్నెర్ర జేసింది. గంగ నొలంబ సంఘర్షణ ప్రారంభమయింది. గంగ నీతిమార్గుడు మహేంద్ర నొలంబుని వధించి 'మహేంద్రాంతక' బిరుదం ధరించినాడు. మహేంద్రుని అనంతరం నొలంబులు గంగులతో ఎడతెరిపిలేని పోరాటాలు సాగించినారు. గంగ మూడోమారసింహుడు మహేంద్రుని ప్రపౌత్రుడైన నన్ని నొలంబుని (క్రీ.శ. 970-975) వధించడమేగాక నొలంబ వంశాన్ని దారుణ హత్యాకాండకు

గురిచేసినాడనడానికి అతని 'నొళంబాంతక' బిరుదమే నిదర్శనం. ఈ దారుణ హత్యాకాండకు తప్పించుకున్న నొళంబులు చోళ సామంతులై, చోళ-గంగ యుద్ధాల్లో తమ సార్వభౌములకు తోడ్పడి ప్రతీకారం తీర్చుకున్నారు. అనంతరం నొళంబవాడి పశ్చిమచాళుక్య రాజ్యంలో చేరింది. క్రీ.శ. 1060 ప్రాంతంలో మొదటి సోమేశ్వరుని కొడుకైన విష్ణువర్ధన విజయాదిత్యుడు రాజప్రతినిధిగా నొళంబవాడి నేలినాడు.

**వైదుంబులు :**

వైదుంబులు తాము పశ్చిమగంగ వంశ శాఖయని చెప్పుకున్నారు. కాని వారు పూర్తిగా తెలుగుజాతియనీ చిత్తూరు జిల్లా మదనపల్లి వారిజన్మభూమియనీ చరిత్రకారుల అభిప్రాయము. వైదుంబ నగరాధీశులైనందున వారికా పేరు వచ్చిందనే వాదం ఉంది కాని, ఆ నగరం ఎక్కడున్నదో నిర్ధారణ చేయడానికి అవకాశం కన్పించదు. తొమ్మిదో శతాబ్దంలో 'రేనాడు 7000' పాలకులుగా వైదుంబులు చరిత్రలో ప్రత్యక్షమయినారు. వీరు యుద్ధప్రియులు; వీరశిలలు వేయించడం వీరి ఆచారం; వీరి శాసనాలు చాలవరకు వీరశిలలే. చాలకాలం బాణులకు సామంతులుగా ఉండి నొళంబులతో పశ్చిమ గంగులతో ఘోర యుద్ధాలు చేసినారు.

వైదుంబులు పశ్చిమ చాళుక్య సామంతులుగా వల్లూరు పట్టణం (కడప జిల్లా), కలుకడ పురాలను (చిత్తూరు జిల్లా) ఏలినట్లు శాసనాధారం ఉంది తొమ్మిదో శతాబ్ది ఉత్తరార్ధానికి చెందిన గండత్రినేత్రుడు వైదుంబ రాజులలో ప్రథమగణ్యుడు. బహుశా బాణుల సహాయంతో తెలుగు చోడులను జయించి రేనాడు నాక్రమించి వైదుంబ రాజ్యం స్థాపించినాడు. బాణులతో చేరి సోరమడి యుద్ధంలో విజయం సాధించడంతో తెలుగు చోడులకు రేనాడులో నిలువనీడ లేకుండాపోయి వైదుంబరాజ్యం బలపడింది.

మనుజత్రినేత్రుని కాలంలో (క్రీ.శ. 910-916) బాణ వైదుంబ రాజ్యాలపై చోళ దండయాత్రలు ప్రారంభమయినాయి. చోళులతో వైదుంబులు సమాధాన పడినట్లు కన్పిస్తుంది. చోళ పరాంతకుని కొడుకు అరింజయుని భార్య వైదుంబ రాకుమారి, వారి కుమారుడే సుందరచోళుడు. తక్కోలయుద్ధంలో పరాంతకుడు ఓడిపోవడంతో వైదుంబరాజ్యం రాష్ట్రకూట సామ్రాజ్యాంతర్భాగమయింది. వైదుంబులు రాష్ట్రకూట సామంతులై ఉన్నతోద్యోగాలు నిర్వహించినారు.

రాష్ట్రకూట సామ్రాజ్యం విచ్ఛిన్నమైన తర్వాత వైదుంబులు తిరిగి రేనాడులో రాజ్యం స్థాపించుకొన్నారుగాని ఎక్కువరోజులు పాలించలేదు. ఈ శాఖ రాజులలో భువన త్రినేత్రుడు (క్రీ.శ. 970 ప్రాంతము) సుప్రసిద్ధుడు. ఇతడు

జటాచోడభీముని తోటి యుద్ధంలో మరణించినాడని ఒక అభిప్రాయం. అనంతరం తూర్పుచాళుక్య దానార్ణవుడు పొత్తపి ప్రాంతాలను జయించి అచట తనకు విశ్వాసపాత్రులైన ముదిగొండ చాళుక్యులను పాలకులుగా నిలిపినాడు.

**వేములవాడ చాళుక్యులు**

బోధన్, వే(లే)ములవాడలు కేంద్రాలుగా పశ్చిమోత్తర తెలంగాణా ప్రాంతాలను రాష్ట్రకూటసామంతులుగా వేములవాడ చాళుక్యులు పాలించినారు. పూర్తిగా కన్నడవంశంవలె కన్పించే వీరు ఇంచుమించు రాష్ట్రకూటోదయంతో పాలన ప్రారంభించి వారితోనే అస్తమించినారు. వీరి చరిత్రకు మొదటి అరికేసరి కొల్లిపర, మూడో అరికేసరి పర్భని తామ్రశాసనాలు, రెండో అరికేసరి వేములవాడ శిలాశాసనం, పంపకవి కన్నడంలో రచించిన విక్రమార్జున విజయం ఆధారాలు.

విక్రమాదిత్య యుద్ధమల్లుడు వేములవాడ చాళుక్య వంశ స్థాపకుడు. ఈతడు లాట చాళుక్య శాఖీయుడని బహుశా ధారాశ్రయ జయసింహవర్మ కుమారుడని చారిత్రకుల అభిప్రాయం. దక్షిణాపథంపై దండెత్తివచ్చిన అరబ్బుల నోడించి తిప్పికొట్టి రెండో చాళుక్య విక్రమాదిత్యునిచే 'అవనిజనాశ్రయ' బిరుదం పొందిన పులకేశి ఈతని సోదరుడే. యుద్ధమల్లుడు రాష్ట్రకూట వంశస్థాపకుడైన దంతిదుర్గుని సేనాపతిగా ఆతని యుద్ధాల్లో పాల్గొని దుర్భేద్యమైన చిత్రకూట (చిత్తోడ్) దుర్గాన్ని వట్టుకోవడమేగాక "సపాదలక్ష" దేశాన్ని పాలించినాడు. ఇతని సేవలు గుర్తించి దంతిదుర్గుడు పోతన (బోదన్, నిజామాబాద్ జిల్లా) ప్రాంతాన్ని సామంతరాజ్యంగా యుద్ధమల్లునకిచ్చినట్లు తెలుస్తుంది

యుద్ధమల్లుని కుమారుడు అరికేసరి; రాష్ట్రకూట ధృవుని (క్రీ శ. 780-93) సమకాలికుడు. తూర్పుచాళుక్య నాలుగో విష్ణువర్ధనునిపై ధృవుడు జరిపిన యుద్ధాలను అరికేసరి నిర్వహించినట్లు కొల్లిపర శాసనం, విక్రమార్జునవిజయాల వల్ల తెలుస్తున్నది. అరికేసరి వేంగి, త్రికళింగలను జయించినట్లే ఆధారాలు చెబుతున్నాయి. ఈతని విజయాల ఫలితంగా వీరి రాజ్యం తూర్పుగా విస్తరించి నందున అరికేసరి వేములవాడను రాజధానిగా చేసుకున్నాడు.

అరికేసరి ప్రపౌత్రుడైన బద్దెన సలభై రెండు యుద్ధాలు చేసిన "సోలద గండడు!" అంటే పరాజయం ఎరుగని వీరుడు అని ప్రసిద్ధుడయినాడు. గుణగ విజయాదిత్యుని శాసనాలవల్ల ఆతడు బద్దెన నోడించినట్లు తెలుస్తుంది. గుణగుని మరణానంతరం రాష్ట్రకూట రెండో కృష్ణుడు తూర్పు చాళుక్యులపై జరిపిన ప్రతీకారయుద్ధాలను బద్దెన నిర్వహించినాడు. చాళుక్యభీముని బద్దెన ఓడించి బందీగా పట్టుకున్నట్లు పర్భని శాసనం చెబుతున్నది. ముదిగొండ చాళుక్యుడైన

కుసుమాయుధుడు మంచికొండనాడును, చాళుక్యభీముని విముక్తి గావించినట్లు తెలుస్తుంది.

బద్దెన పౌత్రుడైన రెండో నరసింహుడు రాష్ట్రకూట మూడో ఇంద్రుని ఉత్తర జైత్రయాత్రలో పాల్గొన్నాడు. అతనిభార్య జాకవ్వ మూడో ఇంద్రుని సోదరి అయి వుంటుంది. జాకవ్వ కుమారుడైన అరికేసరి వేములవాడ చాళుక్యులలో అగ్రగణ్యుడని చెప్పవచ్చు. రెండో అరికేసరి కాలంలో రాష్ట్రకూట రాజ్యంలో వారసత్వయుద్ధం వచ్చింది; రెండో అమోఘవర్షుని తొలగించి నాలుగో గోవిందుడు సింహాసనం ఆక్రమించినాడు (క్రీ.శ. 930). ఆస్థాన ఉద్యోగులు, సామంతులు గోవిందుని వ్యతిరేకించి, అతని పినతండ్రి బద్దెగను సమర్థించినారు. రాష్ట్రకూట సామ్రాజ్యంలో తిరుగుబాటులు చెలరేగినాయి. చేది, పశ్చిమగంగ రాజులు బద్దెగతో చేరినారు. వేంగిదేశంలో రెండో చాళుక్యభీముడు గోవిందుని సామంతుడైన యుద్ధమల్లుని తొలగించి రాష్ట్రకూట సైన్యాలను పారదోలినాడు. ముదిగొండ చాళుక్య విజయాదిత్యుడు సయితం రెండో అరికేసరితో చేరి రాష్ట్రకూటులతో పోరాడినాడు. ఇట్టి పరిస్థితుల్లో రెండో అరికేసరి బద్దెగను వేములవాడకు ఆహ్వానించి అతణ్ణి రాష్ట్రకూట సార్వభౌముడుగా ప్రకటించి గోవిందుని సైన్యాలను పెక్కు యుద్ధాల్లో ఓడించి బద్దెగను రాష్ట్రకూట సింహాసనంపై నిలిపినాడు. కన్నడభాషలో ఆదికవియైన పంప అరికేసరి ఆస్థాన కవి. అరికేసరిని అర్జునునితో పోలుస్తూ పంప తన విక్రమార్జున విజయం రచించినాడు.

రెండో అరికేసరి పౌత్రుడు మూడో అరికేసరి రాష్ట్రకూట మూడో కృష్ణుని సామంతుడు. తన తండ్రి బద్దెగ వేములవాడలో నిర్మించిన సుభధామ జినాలయంలో ఆచార్యుడైన సోమదేవసూరికి దానం చేస్తూ పర్భని శాసనం ఇచ్చినాడు. సోమదేవుడు జినధర్మంలో కూలంకష పాండిత్యం ఉన్నవాడు; మహాకవి. ఈ చాళుక్య శాఖలో మూడో అరికేసరి చివరివాడు.

**ముదిగొండ చాళుక్యులు**

కొరవిసీమలోని ముదిగొండ (ఖమ్మం జిల్లా) రాజధానిగా మంచికొండ నాడును పాలించినవారు ముదిగొండ చాళుక్యులు. కొరవిసీమ మంచికొండనాడు అంతర్భాగము. కొరవిసీమకే విసరునాడని నామాంతరం ఉంది. వేంగికి తూర్పు సరిహద్దుల్లో గోదావరి నుండి కృష్ణానది వరకు విస్తరించిన ఈ రాజ్యాన్ని రాష్ట్రకూట దాడులు నేరుగా తమ రాజ్యంపై జరగకుండా ఆటంకం (**Buffer State**) గా ఉపకరిస్తుందనే ఆశయంతో వేంగి చాళుక్యులే నిర్మించి వుంటారు. ఆ ఆశయానికి అనుగుణంగా తూర్పు చాళుక్యులపట్ల విశ్వాసంతో ముదిగొండ చాళుక్యులు సుమారు క్రీ.శ. 850 నుండి మూడున్నర శతాబ్దాల

కాలం - కాకతీయ గణపతిదేవుని వరకు - స్థానిక రాజకీయాల్లో ముఖ్యమైన పాత్రను నిర్వహించినాడు. వీరి చరిత్రలో తూర్పు చాళుక్య యుగంవరకు కొరవి, మొగల్‌చెరువు శాసనాలు; అనంతర చరిత్రకు విరియాలవారి గూడురు శాసనం, కుసుమాయుధుని క్రివ్వక (కుక్కనూరు) శాసనము ఆధారము.

ఈ శాసనాలలో తేదీలు లేనందున వీనిలోని సమాచారం సమగ్రంకాక సందేహాస్పదంగా ఉన్నందున ముదిగొండ చాళుక్య చరిత్రలో అనేక వివాదాంశాలున్నాయి. వారి చరిత్రను స్పష్టంగా వ్రాయడానికి అవకాశం కన్పించదు.

ముదిగొండ చాళుక్య వంశానికి రణమర్ద మూలపురుషుడు. ఈతని అన్న కొక్కిలిని గురించిన వివరాలు తెలియవు. రణమర్ద పశ్చిమ చాళుక్య రాకుమారుడై వుంటాడు. తూర్పు చాళుక్యుల ప్రాపుతో కొరవి మండలం సంపాదించి ముదిగొండనుండి పాలించినాడు. అతని కొడుకు కుసుమాయుధుడు. గుణగ విజయాదిత్య,చాళుక్యభీముల సమకాలీకుడై వేంగి-మాన్యఖేట సంఘర్షణల్లో ప్రముఖపాత్ర వహించినాడు. గుణగ విజయాదిత్యుని మరణానంతరం రెండో కృష్ణుడు ప్రతీకారకాంక్షతో కొరవి నాక్రమించి వేంగిపై దండెత్తినాడు. కుసుమాయుధుడు రాష్ట్రకూటులను పారదోలి కొరవిని తిరిగి ఆక్రమించి చాళుక్యభీముని వేంగి సింహాసనంపై నిలిపినాడు. అందుకు కృతజ్ఞతతో భీముడు కుసుమాయుధుని పలువిధాల గౌరవించినాడు.

కుసుమాయుధునకు గొణగయ్య, నిరవద్య అనే కుమారులున్నారు. గొణగయ్య గుణగ విజయాదిత్య పదానికి హ్రస్వరూపమే. గొణగయ్యనే కరి (నల్లని) గొణగ అనికూడా అనేవారు. చాళుక్యభీముని అనంతరం వేంగిలో జరిగిన అంతఃకలహాలవల్ల గొణగయ్య వేంగి అభిమానం కోల్పోయినాడు. అతణ్ణి తొలగించి తమ్ముడు నిరవద్యుడు ముదిగొండ సింహాసనం ఆక్రమించినట్లు కొరవి శాసనం సూచిస్తున్నది. గొణగయ్య (విజయాదిత్యుడు) వేములవాడ రెండో అరికేసరి నాశ్రయించి అతడు రాష్ట్రకూటులతో నిర్వహించిన యుద్ధాల్లో పాల్గొన్నట్లు పంపకవి విక్రమార్జున విజయం నుండి తెలుస్తున్నది. గొణగయ్య అరికేసరికి సామంత ప్రభువైనాడు. ముదిగొండలో నిరవద్యుడు జనాదరణ పొందినట్లు కన్పించదు. అతని అనంతరం గొణగయ్య సంతతివారే ముదిగొండ నాక్రమించినట్లు తెలుస్తుంది.

ఈ పరిస్థితుల్లోనే కాకతీయరాజ్యం ఉద్భవించింది. బహుశా ముదిగొండ చాళుక్యుల నరికట్టే ఉద్దేశంతో రాష్ట్రకూట రెండో కృష్ణుడు ఎరియ రాష్ట్రకూటుని కుర్రవాడిపై అధిపతిగా నియమించినాడు. కుర్రవాడి కొరవి రాజ్యాంతర్భాగమే. బహుశా ఎరియ ఓరుగల్లు (కాకతిపురము)ను రాజధానిగా చేసుకొని వుంటాడు. కాకతీయ, ముదిగొండ చాళుక్య సంఘర్షణ ప్రారంభమయింది.

ముదిగొండ-కాకతి సంఘర్షణ తొలిఘట్టంలోని వివరాలు స్పష్టంగా లేవు. కాకతీయుల విజృంభణవల్ల చాళుక్యులు కొరవిని తాత్కాలికంగా విడిచి వెళ్ళవలసి వచ్చినట్లు కన్పిస్తుంది. విరియాలవారి గూడూరు శాసనంలో ఎఱ్ఱభూపతి బొట్టుబేతనివైరిని చంపి అతణ్ణి కొరవిలో నిలిపినట్లు చెప్పుకున్నాడు. క్రివ్వక శాసనాన్నిబట్టి బొట్టుబేతడు ముదిగొండ చాళుక్యుడు. బొట్టుబేతనివైరి కాకర్త్య గుండ్యన అయి వుండవచ్చు. అయితే అదే గూడూరు శాసనంలో ఎఱ్ఱభూపతి భార్య కామసాని కాకతీయుడైన గరుడబేతని కాకతిలో ప్రతిష్ఠించినట్లు చెప్పు కొన్నది. కాని గూడూరు శాసనంలోని బొట్టుబేతనికి క్రివ్వక శాసనంలోని బొట్టుబేతనికి మధ్య రెండు మూడు తరాల వ్యవధి కన్పిస్తుంది. ఏమయినా కాకతిలో కాకతీయులు, కొరవిలో చాళుక్యులు అధిపతులయినారు తిరిగి వారి మధ్య సంఘర్షణ ప్రారంభమయింది.

క్రివ్వక శాసనాన్నిబట్టి తిరిగి కొరవిరాజ్యంలో 'ప్రఘట్టనం' జరిగి చాళుక్య రాకుమారులు అజ్ఞాతవాసం చెయ్యవలసి వచ్చింది. ఇది బహుశా కాకతి రుద్ర దేవుని రాజ్యవిస్తరణ ఫలితమైనట్లు పాలంపేట శాసనం సూచిస్తున్నది. క్రివ్వక శాసనాన్నిబట్టి ముదిగొండ చాళుక్యుల్లో చివరివారు కుసుమాదిత్యుడు, అతని తమ్ముడు నాగతిరాజు. రుద్రదేవుని మరణానంతరం తిరిగి వీరు విసరునాడును ఆక్రమించినారు. కాని అనతికాలంలోనే గణపతిదేవుని రాజ్యవిస్తరణ ఫలితంగా కుసుమాదిత్య నాగతిరాజులు కొరవిని వీడి వేంగిలో తల దాచుకోవలసివచ్చింది. ముదిగొండ చాళుక్యరాజ్యం కాకతిసామ్రాజ్య అంతర్భాగమయింది.

## చాళుక్యయుగ విశేషాలు

**రాజకీయాలు - పరిపాలన**

తూర్పు చాళుక్య రాజ్యస్థాపనతో మధ్యయుగం ప్రారంభమవుతుంది. రాజకీయ అనైక్యం, అంతర్యుద్ధాలు, వ్యవసాయ ఆర్థిక విధానం, పురోహితుల ప్రాబల్యం, మూఢవిశ్వాసాలతో కూడిన మతం విద్యలకు ఆధారంకావడంవంటి మధ్యయుగ లక్షణాలీకాలంలో స్పష్టంగా కన్పిస్తాయి. చాళుక్యయుగంలో తీరాంధ్రం మాత్రం వేంగిరాజ్యంకింద సమైక్యమై పశ్చిమాంధ్రలో సామంతరాజ వంశాలు పాలిస్తూ ఉండేవి. ఈ సామంతులు తమ సార్వభౌములకు యుద్ధాల్లో తోడ్పడుతూ తమ రాజ్యాలను సర్వస్వతంత్రులుగానే పాలించేవారు, వీరి ఆస్థానాలు సార్వభౌమాస్థానాలకు నమూనాలు. వీరికి మంత్రిమండలులుండేవి. వీరు పరస్పర యుద్ధాల్లో నిమగ్నులై వుండేవారు. ముఖ్యంగా రాయలసీమ ప్రాంతంలో మందపోటులు ఎక్కువగా జరిగేవి. వేంగిలో సయితం కేంద్రాధికారం బలహీనమయి రాజవంశం అంతఃకలహాల్లో మునిగితేలింది. రాజవంశం శాఖోప

శాఖలై రాజబంధువులు సామంతులుగను, ఉన్నతోద్యోగులుగను ఉండడం ఈ కలహాలకు ముఖ్యకారణం. దేశ, జాతి, కుటుంబ మర్యాదలను తృణీకరించి స్వార్థపరులై సింహాసనాసక్తై రాకుమారులు పోరాడినారు. వీరిలో భీమసలుకి, యుద్ధమల్లుడు దేశస్వాతంత్ర్యాన్ని తాకట్టుపెట్టడానికి సయితం సందేహించలేదు. రాకుమారుల దృష్టిఅంతా సింహాసనం ఆక్రమించడం, చేజిక్కిన అధికారాన్ని భద్రపరచుకొనడం మీదే లగ్నమయి ఉండేది. ఈ అరాజక పరిస్థితులను అవకాశంగా తీసుకొని పొరుగురాజ్యాలు తమ అధికార ప్రాబల్యాలు వేంగిలో నెలకొల్పడానికి ప్రయత్నించినారు. వారివారి సైన్యాలు దేశంలో యథేచ్ఛగా వీరవిహారం చేస్తూఉండేవి. వేంగి, ధరణికోట, యనమదల, నెల్లూరు, కంభము వంటి నగరాలు పెక్కుమార్లు ధ్వంసమయినాయి. పెక్కుగ్రామాలు భస్మీపటలమయినాయి. దేశం యావత్తూ ఒక పెద్ద యుద్ధశిబిరంగా తయారయినదనడం అతిశయోక్తికాదు. ఈ విధంగా దుర్బల కేంద్రాధికారము, అంతఃకలహాలు, రాజకీయ లక్షణాలైన భూస్వామ్యవిధానం బలపడసాగిన ఈ యుగంలో శాంతిభద్రతలు కరువై ప్రజలనేక బాధలకు లోనైనారని చెప్పవచ్చు.

ఇట్టి పరిస్థితుల్లో పాలనాయంత్రాంగం ఏవిధంగా ఉండేదో చెప్పడానికి తగిన ఆధారాలు లేవుగాని సాంప్రదాయక విధానమే అమలుజరిగిన సూచనలున్నాయి. రాజే సర్వాధికారి. రాజాధికారము సప్తాంగ సమన్వితము. రాజు, మంత్రి, రాజ్యము, దుర్గము, కోశము, సైన్యము, మిత్రము అనేవి సప్తాంగాలు. రాజవ్యవహార నిర్వహణలో రాజుకు యువరాజు తోడ్పడేవాడు. కొడుకులు లేని రాజులు తమ్మునో తమ్ముని కొడుకునో యువరాజుగా నియమించుకొనేవారు. యువరాజును 'ఉపరాజు' అని చెప్పవచ్చు. రాజుకు మంత్రి, సేనాపతి, కోశాధికారులు సలహాలిచ్చి సహకరిస్తుండేవారు. ఈ ఉద్యోగాలను సాధారణంగా విశ్వాసపాత్రులు, శీలవంతులు, ధర్మనీతి శాస్త్రజ్ఞులైన బ్రాహ్మణులు వంశపారంపర్యంగా నిర్వహించినట్లు కన్పిస్తుంది. క్రమంగా శూద్రులీపదవులాక్రమించసాగినారు. నొలంబుల ఆస్థానాల్లో 'గవుండు'లు ప్రెగ్గడ, సేనాపతి పదవులు నిర్వహించినారు. పరిపాలన శాఖలుగా విభజితమై తీర్థుల అధీనంలో ఉండేది. మంత్రి, పురోహిత, సేనాపతి, యువరాజ, దౌవారిక, ప్రధాన, అధ్యక్ష మొదలైనవారు తీర్థులు. ప్రాచీన నీతిశాస్త్రాల్లో పదునెన్మిదిమంది తీర్థుల పేర్లు కన్పిస్తాయి రెండో అరికేసరి వేములవాడ శాసనంలో మహాసంధి విగ్రహి, తంత్రపాల, సత్రాధిపాల అనే ఉద్యోగులు కన్పిస్తారు. శాసనాల్లోని నియోగాధికృత, నియోగవల్లభ అనే ఉద్యోగులు బహుశా వివిధశాఖల పర్యవేక్షకులయి వుంటారు. కాకతీయ శాసనాల్లోని బాహత్తర (72) నియోగాధిపతులు వీరి వారసులని చెప్పవచ్చు.

స్థానిక పాలన చాలభాగం సామంతరాజుల ఆధీనంలో ఉండేది. ఎల మంచిలి, పిఠాపురం, ముదిగొండలలో చాళుక్యవంశ శాఖలవారే అధికారం నిర్వహించేవారు. వీరుగాక పట్టవర్ధని, దుర్జయ, హైహయాది సామంతరాజ వంశాలు విజృంభించినాయి. వీరు రాజలాంఛనాలు ఐడసి సర్వస్వతంత్రులై తమ ప్రాంతాలను పాలించేవారు. కప్పం చెల్లించడం, అవసరమైనప్పుడు యుద్ధాల్లో పాల్గొనడం వీరికి రాజుకు మధ్యనున్న సంబంధం. వారసత్వ తగాదాల్లో భిన్నపక్షాలను సమర్థించి ఆ యుద్ధాలను మరింత భయంకరంగా మార్చేవారు. వీరి స్వాతంత్ర్యమే కేంద్రాధికార బలహీనతకు బలమైన కారణమని వేరే చెప్ప నక్కరలేదు.

మిగిలిన రాజ్య విభాగం విషయాలు విభజితమయింది. వేంగి రాజ్యంలో సుమారు 30 విషయాలున్నట్లు శాసనాలనుండి తెలుస్తున్నది. కమ్మ రాష్ట్ర విషయము, అత్తిలినాడు విషయము అని వున్నందున రాష్ట్రము, విషయము అనే పదాలు, పర్యాయ పదాలుగా వాడినారని చెప్పవచ్చు, రాయలసీమ ప్రాంతంలో సీమ, నాడు అనే విభాగాలు కన్పిస్తున్నాయి. పెరుంబాణపాడిలోని పులినాడు అని శాసనాలు పేర్కొంటున్నాయి. పాలనా వ్యవస్థకు గ్రామమే పునాది. గ్రామేయకులు, రాష్ట్రకూట ప్రముఖులు గ్రామాధికారులు. గ్రామ వ్యవహారాలలో ముఖ్యమైన నిర్ణయాలు వీరి సమక్షంలో జరిగేవి. రాజులు సయితం గ్రామాల్లో భూదానాలు చేసినప్పుడు వీరి సమ్మతి పొందేవారు. గ్రామాల్లో గ్రామణి అనే రాజోద్యోగిని నియమిస్తున్నట్లు తెలుస్తుంది. రేనాడులో గ్రామ సభలున్నట్లు శాసన సాక్ష్యం లభిస్తున్నది. కుంగనూరు (పుంగనూరు)లో అదవల్లం అనే వ్యక్తిని గ్రామకరణం (Accountant) గా గ్రామసభ నియమించి నట్లొక శాసనంనుండి తెలుస్తున్నది. రెండవ చాళుక్యభీముని మచిలీపట్నం శాసనం కూడ అగ్రహారాల్లో బ్రాహ్మణ పరిషత్తులున్నట్లు సూచిస్తున్నది.

ప్రభుత్వాదాయానికి భూమిశిస్తుతోపాటు పలురకాల పన్నులుండేవి. అగ్రహారాలు ఇచ్చే సమయంలో 'సర్వకరపరిహారంగా' అనే మాట పన్నుల బాహుళ్యాన్ని సూచిస్తుంది. వైదుంబ రాజైన భువన త్రినేత్రుడు సింహాసనం ఎక్కిన సందర్భంలో రేనాడు రైతులపైనున్న 'దేగరచపన్ను, పడెవాలుపన్ను, పడియేరిపన్ను, సంధివిగ్రహంపన్ను' మినహాయించినాడు. కల్లనక్కము, విదనలి, విషయసుంకము బీసదాయము, చిట్టవాటము మొదలైన పన్నులు రాయలసీమ శాసనాల్లో కన్పిస్తున్నాయి. పన్నులు ధనరూపంలో, వస్తురూపంలో చెల్లించేవారు.

నాడు న్యాయ నిర్వహణ జరిగినతీరు తెలియదుగాని కొరవి శాసనంలో కొన్ని శిక్షల ప్రసక్తి ఉంది. "ముక్కుదరగినను చ(చె)రచినను, మరియ వెరకినను ముచ్చిలినను (ముచ్చిలినను) రంకాడినను ఇరవాద్యది ఏనుం ద్రమ్మలు; మాణిని చేసినా దోషంబునకు వాని జీవితంబ దండువు." ఇందు 'రంకాడిన' విధించే అవరాధం స్త్రీలకే వర్తించియుండవచ్చు. కారణం-పురుషులకు 'లంజపెళ్ళాములు' ఉన్నట్లు శాసన సాక్ష్యం ఉంది హత్య చేసిన వారికి మరణమే శిక్ష.

**ఆర్థిక పరిస్థితులు**

నాటి ఆంధ్రదేశ ఆర్థిక పరిస్థితులను గురించి స్పష్టమైన సమాచారం లభ్యం కావడంలేదు. కాని నానాటికి సమాజం భూమిపై - వ్యవసాయంపై - ఆధారపడడం ఎక్కువయింది. ఈ పరిణామం శాతవాహన అనంతరీకుల కాలంలోనే ప్రారంభమయింది. బ్రాహ్మణులు ఆలయాలు, భూములు, అగ్రహారాలు పొంది, భూస్వాములుగా రూపొందినారు. వారి భూములను శూద్ర వర్ణాలు సాగుచేస్తూ వారిపట్ల విధేయులై విశ్వాసపాత్రులై వుండేవారు. చాళుక్య యుగంమధ్యకాలంనుండి బ్రహ్మదేయాల ప్రసక్తి తగ్గి సైనిక అవసరాలు ఎక్కువయినందున రాజ్యానికి విశిష్టమైన సేవచేసిన సైనికులకు ఉద్యోగులకు గ్రామాలు దానం చేయడం పెరిగింది. తీరాంధ్రంలో ప్రభువులు సీటిపారుదల సౌకర్యాలపట్ల పెద్దగా శ్రద్ధ వహించిన సూచనలు లేవు. రేనాడులో తటాక నిర్మాణంపట్ల తటాకాల మరమ్మత్తుపట్ల ప్రభువులు జాగ్రత్త వహించేవారు. ఆ ప్రాంతాల్లోనే పశుసంపదపట్ల ఆసక్తి హెచ్చు అనడానికి అచట తరచుగా జరిగిన గోగ్రహణాలే నిదర్శనం. పరిశ్రమలలో అధికభాగం స్థానిక వినియోగానికి మాత్రమే పరిమితమైవుండేవి. మాడలు, ద్రమ్మములు, గద్యాణములు అనే నాణేల ప్రసక్తి ఉందిగాని చాళుక్యరాజుల నాణేలు ఎక్కువగా లభించలేదు. అందుచే ఆర్థిక విధానం ద్రవ్యసంబంధమైనదిగాక వస్తుసంబంధమైనదనవచ్చు. పరిమితంగా ఉన్న వాణిజ్యం కోమట్ల చేతుల్లో ఉండేది. వీరు 'నకరములు' అనే శ్రేణులుగా ఏర్పడసాగినారు. ప్రతి నకరానికి ఒక శ్రేష్ఠి ఉండేవాడు. నకరాల ప్రసక్తి తర్వాతయుగంలో ఎక్కువగా కన్పిస్తుంది. శక్తివర్మ బంగారు నాణేలు సయాం దేశంలో బయల్పడినాయి. ఇది నాడు ఆంధ్రదేశం జరిపిన విదేశ వాణిజ్యానికి నిదర్శనమని చరిత్రకారుల అభిప్రాయము.

**మతము - సమాజము**

చాళుక్యయుగ ఆంధ్ర చరిత్రలో ఆసక్తిదాయకమైన మత సాంఘిక పరిణామములు అనేకం జరిగినాయి. అందులో ముఖ్యమయినది జైనమతవ్యాప్తి, పిమ్మట పతనము. శాతవాహన యుగారంభంలోనే జైనం ఆంధ్రదేశంలో

ప్రత్యక్షమయింది కాని, బౌద్ధం వ్యాప్తిలో ఉన్నంతకాలం జనాదరణ పొందలేక పోయింది. క్రీ. శ. 5, 6 శతాబ్దాలనుండి బౌద్ధం క్షీణించింది. చాళుక్యయుగంలో ఆంధ్రదేశంలో ఇంచుమించు బౌద్ధప్రసక్తిలేదు అందుచే నాటివరకు బౌద్ధాన్ని ఆదరించిన వివిధ వర్ణాల ప్రజలు జైనాన్ని అభిమానించినట్లు కన్పిస్తుంది. క్రమంగా, జైనులుసయితం వ్యక్తిగత కైవల్యసాధనాశయంతోబాటు సామాజిక స్పృహ పెంచుకొని తమ మతాన్ని వ్యాపింపజేయడానికి పూనుకున్నారు. ఆర్థికంగా బలపడి రాజాస్థానాల్లో వుద్యోగాలు సంపాదించిన శూద్రులు సాంఘిక ఉన్నతికి సాధనంగా జైనమతాన్ని స్వీకరించసాగినారు. అంతకంటె ముఖ్యమయిన విషయం జైనానికి రాజాదరణ లభించడం ఈ అంశంలో బౌద్ధంకంటే జైనం అదృష్టవంతమయింది.

చాళుక్య, రాష్ట్రకూట, నొలంబ వంశాలలోని రాజులు, రాణులుసయితం జైనాన్ని పోషించినట్లు శాసనాధారాలు లభిస్తున్నాయి. కుబ్జవిష్ణువర్ధనుని పట్టపు రాణి అయ్యమహాదేవి, బెజవాడలో నెడుంబివసటి నెలకొల్పి దానికి ముషినికుండ గ్రామం దానం చేసింది. రెండో అమ్మరాజు బంధువులు, ఉద్యోగులు జైనమతాభిమానులు. అతని ప్రియపత్ని చామెకాంబకోరికపై అమ్మరాజు జైనులకు కలుచుంబర్రు దానం చేసినాడు. కర్మరాష్ట్ర విషయాధ్యక్షుడైన దుర్గరాజుకోరికపై కటకాభరణజినాలయానికి దానధర్మాలు చేసినాడు; సేనాపతులైన భీమనరవాహనుల కోరికపై బెజవాడలో జినాలయాల నిర్మాణానికి పెదగాదెలవఱ్ఱు నిచ్చినాడు. విమలాదిత్యుడుజైనమతం స్వీకరించినాడు. రామతీర్థం (విశాఖజిల్లా), బిక్కవోలు (తూర్పుగోదావరి), దానవులపాడు (కడప), కొనకండ్ల (అనంతపురం), అన్మకొండ జైనక్షేత్రాల్లో రాష్ట్రకూట ప్రభావం కన్పిస్తుంది. రాష్ట్రకూట సామంతులైన వేములవాడ చాళుక్యుల రాజధాని వేములవాడ గొప్ప జైనక్షేత్రమయింది. కల్యాణి చాళుక్యుల కాలంలో ఆంధ్రదేశంలో జైనం ఉచ్ఛస్థితిలో ఉంది. పొట్లచెరువు, కొలనుపాక, ఉజ్జిలి, వర్ధమానపురం మొదలైన చోట్ల ఆరో విక్రమాదిత్యుడు జైనులకు దానధర్మాలు చేసినాడు. పొట్లచెరువు (పాటన్‌చెరువు) లోనే 500 జైన వసదులు ఉండేవట

జైనసంఘంలో యతులు, ఉపాసకులు (శ్రావకులు) ఇద్దరూ ఉండటం విశేషం. అందువల్లనే బౌద్ధంవలెగాక జైనం శాశ్వతంగా మనగలిగింది. జైనుల్లో సంఘ, గణ, గచ్ఛ, బలి, అన్వయ అనే విభాగాలుండేవి. ఆంధ్రదేశంలో మూల, యాపనీయ, గౌళి, ద్రావిడసంఘాలుండేవి. కవురూరి, దేశి, వలహరి, బలత్కారగణాలు, నంది గచ్ఛ, పుస్తక గచ్ఛ, మేషపాషాణ గచ్ఛలు శాసనాల్లో కన్పిస్తాయి బలి, అన్వయ అనేవి చిన్న విభాగాలు

జైనయతులు జ్ఞానదర్శనతపోవీర్యగుణసంపన్నులై ఉండేవారు. కొందరు ఏకాంతస్థలాల్లో కైవల్యసాధనలో నిమగ్నులై వుండేవారు కొందరు ప్రభువులనుండి దానధర్మాలు గ్రహించి సత్రాలు, భిక్షాగృహాలు నిర్వహిస్తూ బీదసాదలకు, నిరాశ్రయులకు మహోపకారులయినారు. వైద్య జ్యోతిష సర్వ విద్యలభ్యసించి ప్రజలకు సేవ చేస్తుండేవారు. మరికొందరు అధ్యయన అధ్యాపనలతోబాటు సృజనాత్మక సారస్వత కృషి జరిపినారు. రామతీర్థవాసియైన ఉగ్రాదిత్యుడు 'కల్యాణకారక' అనే వైద్య గ్రంథం రచించినాడు. పాతశివారా (అనంతపురం) నికి చెందిన పద్మప్రభమలధరిదేవుడు 'సుకవిజన పయోజమిత్రుడు'; కుంద కుందాచార్యుని 'నియమసార'పై 'తాత్పర్యవృత్తి' అనే భాష్యం వ్రాసినాడు. వేములవాడసుభరామజినాలయాచార్యుడైన సోమదేవసూరికి స్యాద్వాదాచలసింహ, తార్కికచక్రవర్తి, కవిరాజ మొదలైన బిరుదులుండేవి. సంస్కృతంలో అతడు 'యశస్తిలక' 'నీతివాక్యామృత', 'యుక్తిచింతామణీసూత్ర' మొదలైన గ్రంథాలు రచించినాడు జైనులు ప్రజలభాషల్లో మతప్రచారంచేస్తూ ఆ భాషలో గ్రంథ రచన సాగించినారు. కన్నడ ఆదికవి పంపను గురించి చదివినారు. తెలుగులో 'జినేంద్ర పురాణం' రచించిన పద్మకవి పంపకవి ఒక్కరేనని చారిత్రకుల అభి ప్రాయం. అధర్వణుడనే జైనుడు మహాభారతం ఆంధ్రీకరించినాడట. కవిజనా శ్రయకర్త రేచన శ్రావకాభరణుడు. క్రీ శ. 11వ శతాబ్దికి చెందిన ఒక తమిళ కవి వాంచియార్ అనే జైనుని ఛందోగ్రంథాన్ని చూచి తాను తమిళంలో 'యాప్పిరంగళం' వ్రాసినట్లు చెప్పుకున్నాడు. వాంచియారే రేచన అని కొంద రంటారు. జైనుల విద్యాభ్యాసం 'ఓంనమః సిద్ధంనమః' అనే సూత్రంతో ప్రారంభ మయ్యేది. దానికి 'శివాయనమః' చేర్చి దాన్ని శైవ సూత్రంగా మార్చినారని కొందరి అభిప్రాయము.

శ్రావకులు సమాజంలో ప్రత్యేకవర్గంగా వ్యవహరింపక హిందువులతో సహ జీవనం గడుపుతూ జైనం బోధించిన "పంచ అతిచారాల"ను వర్జించి ద్వాదశవ్రతాలను అనుసరిస్తూ ఉండేవారు. జైనులు, హిందువులు సన్నిహితంగా జీవించడంవల్ల పరస్పర ప్రభావానికిలోనైనారు. అందువల్ల జైనుల్లో వర్ణవ్యవస్థ ఏర్పడింది. జైనుల్లో కూడ మూడు అగ్రవర్ణాలకే ఉపనయనార్హత ఉండేది. స్తూపచైత్యాలతోబాటు జైనులు ఆలయాలు నిర్మించి తీర్థంకర విగ్రహాలు ప్రతిష్ఠించి అంగరంగభోగాలతో అష్టాంగపూజ చేసేవారు.

ఆచారాల్లోని సామ్యంవల్ల హిందూజైన ప్రజలమధ్య సమరసభావం ఏర్పం డింది. బెక్కల్లుశాసనాన్నిబట్టి మల్లారెడ్డి అనే శ్రావకుడు "దైవంఏకము" అనే భావంతో జిన, బుద్ధ, శివ, విష్ణు ఆలయాలు నిర్మించినాడు. ఇట్టి సామరస్యం పురోగమిస్తున్నప్పటికీ మధ్య యుగాంధ్రంలో భయంకర మతసంఘర్షణలో జైనం

పరాజయం పొందింది. ఈ సంఘర్షణ మతాచార్యుల మధ్య వాగ్వాదాల రూపంలో ప్రారంభమయింది. క్రీ శ. 8, 9 శతాబ్దాలలో కుమారిలభట్టు, శంకరాచార్యుడు 'హిందూ'మత దిగ్విజయయాత్రలు జరిపి 'హస్తినాతాడ్యమానోపి నగచ్ఛేత్ జైన మందిరం' అని బోధించినారు ఇదే సమయంలో కాలాముఖుల వంటి తీవ్ర వాదులు విజృంభించినారు. శైవమత ప్రాశస్త్యం నెలకొల్పడానికి బలప్రయోగా నికి సయితం వీరు వెనుకాడలేదు. తెలుగుభాషలోని శైవవాఙ్మయం పరిశీలిస్తే జైనమత నిర్మూలనలో శైవులపాత్ర బోధపడుతుంది జైనులను శైవులబారి నుండి రక్షించడానికి నాటిప్రభువులు ప్రయత్నించలేదు. దీనికితోడు నాటి చోళ చాళుక్య సంఘర్షణలో ముఖ్యంగా చోళులు ఆంధ్రదేశంలోని జైనక్షేత్రాలను ధ్వంసం చేసినట్లు కన్పిస్తుంది. ఈ సంఘర్షణతో చాళుక్యులతో బాటు జైనం క్షీణించింది. జైనాంధ్ర వాఙ్మయం భస్మీపటలమయింది. జైనాలయాలు నేల మట్టమయినాయి; విగ్రహాలు ముక్కలయినాయి జైనులు సంఘబహిష్కరణ భీతితో హిందువుల్లో కలిసిపోయినారు. ఆంధ్రదేశంలో నేడు ప్రతి గ్రామంలో కనిపించే పాటిదిబ్బలు, శిథిలాలు ఒకప్పుడు జైనం పొందిన జనాదరణకు నిదర్శనాలు.

జైనబౌద్ధ మతాల పోటీ క్షీణించడంతో హిందూమతం పురోగమించింది. తూర్పు చాళుక్యులు ప్రాయికంగా వైదిక ధర్మాభిమానులు. కిందటి యుగాల్లో ప్రారంభమైన వైదిక ధర్మోద్ధరణ తూర్పు చాళుక్య యుగంలో కొత్త మార్గాలలో వికసించసాగింది. వైదిక క్రతుకాండ విష్ణుకుండియుగంలో పరాకాష్ఠ నందు కొన్నది. తూర్పు చాళుక్యులు 'అనేకాశ్వమేధావభృధస్నాన పవిత్రీకృతవపుషాం' అని వర్ణించుకున్నారు. కాని వారిలో యజ్ఞాలు చేసిన రాజులు కన్పించరు. బ్రాహ్మణులు మాత్రం యజ్ఞాలు చేసినట్లు అరుదుగా శాసనాలు చెబుతున్నాయి. పూర్వమీమాంసా పద్ధతిని ప్రచారం చేసిన కుమారిలభట్టు ఈ యుగం (క్రీ.శ. 8 వ శతాబ్ది) లోనే జీవించినాడు. ఆతడు ఆంధ్రుడు. కేవలం వైదిక క్రతుకాండ విధానాన్ని పునరుజ్జీవితం చేయడం సాధ్యం కాదని గుర్తించి మీమాంసా విధానంతో నిత్య కర్మపద్ధతిని పంచాయతన పూజను మోక్షసిద్ధాంతాన్ని ప్రవేశ పెట్టి, కర్మభక్తి మార్గాల సమన్వయమైన కొత్త దృక్పథం కలిగించడానికి కృషి చేసినాడు. కుమారిలుని అనంతరం మతప్రచారం చేసిన శంకరాచార్యుడు (క్రీ.శ. 9 వ శతాబ్ది) జ్ఞానమార్గానికి ప్రాధాన్యం ఇచ్చినప్పటికీ భక్తిమార్గాన్ని అందుకు అనుబంధం చేసినాడు. కుమారిల, శంకరుల ప్రచార ఫలితంగాను కొంతవరకు జైన ప్రభావంవల్లను వైదిక కర్మలపట్ల వైముఖ్యము, పురాణ, ఆగమోక్త విధానంపట్ల అభిమానము ఏర్పడినాయి వ్రత, దాన, తీర్థాటనలలోను భక్తి, విగ్రహారాధన ప్రధానమైన శైవవైష్ణవాలలోను ఆదరం హెచ్చింది. చాళుక్యులలో పరమ భాగవత, పరమమాహేశ్వర, పరమబ్రహ్మణ్య బిరుదులు మూడూ ధరించిన వారున్నారు. ఇది సమన్వయంపై నాధారపడిన స్మార్తవిధానానికి నిదర్శనమని

చెప్పవచ్చు. తూర్పు చాళుక్యులు బ్రాహ్మణులకు అగ్రహారాలిచ్చి వేద విద్యలను పోషించినారు; దేవాలయాలు నిర్మించినారు ప్రజానీకంలో హిందూ ధర్మ సందేశం ప్రచారం కావడానికి పంచమవేదమైన భారతాన్ని ఆంధ్రీకరింపజేసినారు. రాజరాజనరేంద్రునకు పరమ ప్రీతికరములైన ఐదింటిలో భూదేవతార్చన, పార్వతీపదార్చన ప్రధానమైనవి. ఒకవైపున వైదిక మతాభిమానము, మరొక వైపున శైవమతపోషణ; శైవాగమాలయందు, మహాభారతంలోను సమంగా హృదయం నిల్పినాడు. వర్ణాశ్రమ ధర్మరక్షణలో ఆసక్తి ఉన్నవాడు. ఇట్టి బలీయమైన తూర్పు చాళుక్యయుగ వారసత్వమే కాబోలు-వీరశైవం విజృంభించి వర్ణాధర్మాలను కూలదోయ సమకట్టిన సమయంలో 'భక్తిమీద వలపు బ్రాహ్మణుతోపొత్తు బాయలేను నేను బసవలింగ' అని పండితారాధ్యునిచేత అనిపించింది. కాబట్టి వర్ణధర్మయుక్తమైన శైవవైష్ణవ సంప్రదాయాలు వ్యాపించడానికి తూర్పు చాళుక్య యుగం సుగమమార్గం కల్పించింది.

తూర్పుచాళుక్యుల్లో పరమభాగవతులూ, పరమమాహేశ్వరులు ఉభయులూ ఉన్నారు. కాని పరమ మాహేశ్వరులే ఎక్కువ. మహాసేనుడు చాళుక్యుల ఇష్ట దైవాలలోనివాడు. హారీతి, మహాసేనులు, చాళుక్యులకు - బహుశా ఇక్ష్వాకుల నుండి సంక్రమించిన వారసత్వం అయివుంటుంది. చాళుక్యార్జునుడైన రెండో విజయాదిత్యుడు 108 నరేంద్ర మృగేశ్వరాలయాలు నిర్మించినాడు. పంచారామాలు చాళుక్యభీముని కాలంలో శైవక్షేత్రాలయినాయి. రాజరాజనరేంద్రుడు శైవాగమాధ్యయన శివపూజా తత్పరుడు. పంచారామాలతో బాటు శ్రీశైలం, కాళహస్తి, బెజవాడ, చేబ్రోలు మొదలైనవి శైవక్షేత్రాలయాలు.

అయితే శైవంలో ప్రాచీనకాలం నుండి శాఖ లేర్పడినాయి ఒక మతం భౌగోళికంగా విస్తరిస్తూ స్థానిక విశ్వాసాలు ఆచారాలతో రాజీపడడంవల్ల లక్ష్యాలలో లక్ష్యసాధనలలో వైవిధ్యం ఏర్పడుతుంది. ఆ విభేదాలు భిన్నశాఖలుగా పరిణమిస్తాయి. శైవంలో పాశుపతం అతి ప్రాచీనశాఖ. క్రీస్తు శకారంభంలో మధ్యభారతంలో లకులీశ్వరుడు పాశుపతాన్ని స్థాపించినాడు. క్రీస్తుశకం ఏడో శతాబ్ది నుండి ఆంధ్రదేశంలో పాశుపతులున్నారు. పాశుపతులు అహింసా వ్రతులే గాని కఠిన నియమాలు పాటించేవారు. లకులీశుని శిష్యుల్లోనివాడైన కాలాననుని అనుయాయులు కాలాముఖులు. వీరు తీవ్రవాద శైవులు. శైవమత ప్రాబల్యం స్థాపించడానికి బలప్రయోగానికి సయితం వీరు వెనుకాడేవారుకాదు. ఆంధ్రదేశంలో జైనబౌద్ధాల విధ్వంసనంలో వీరు ప్రధానభూమిక ధరించినారు. అమరావతి, బెజవాడ మొదలైనచోట్ల 'సింహపరిషత్తు'లు స్థాపించి, కాలాముఖులు మత ప్రచారం చేసినారు. శ్రీశైలం, అలంపురం, దాక్షారామాలుసైతం కాలాముఖ కేంద్రాలే కాలాముఖులలోని వామాచారులే కాపాలికులు శివుని భయంకరమూర్తి

యైన భైరవుని మద్య, మాంస, మత్స్య, మైధున, ముద్ర అనే పంచముద్రలతో ఆరాధించేవారు. కపాలభోజనం, నరబలి వీరి ఆచారాల్లో ముఖ్యమైనవి. శ్రీశైలంలో కాపాలికులను శంకరాచార్యుడు నిర్జించినట్లు జనశ్రుతి. శ్రీశైలాన్ని కాపాలిక క్షేత్రంగానే భవభూతి తన మాలతీమాధవంలో వర్ణించినాడు. అయితే కాపాలికుల ప్రభావం సమాజంపైన ఎక్కువగా కన్పించదు.

చాళుక్యయుగ మధ్యకాలంనుండి దేవాలయం మతానికి కేంద్రమయింది. సాంఘిక ఆర్థిక కార్యకలాపాలు సమస్తమూ దేవాలయం చుట్టూ కేంద్రీకృతం కాసాగినాయి. పెద్దదేవాలయాలకు అనుబంధంగా మఠాలేర్పడినాయి. ప్రధానంగా కాలముఖ మఠాలీయుగంలో ప్రజాదరణ పొందినట్లు కన్పిస్తుంది. దేవాలయాలు దర్శించడం, దేవాలయాలకు బ్రాహ్మణులకు దానధర్మాలు చేయడం, పురాణేతిహాసశ్రవణం పుణ్యకార్యాలయినాయి. దేవాలయాలలో జాతరలు చేసేవారు. జాతర్లలో విగ్రహాలను ఊరేగించేవారు. చేబ్రోలుమహాసేనుని జాతరలో చేబ్రోలు నుండి బెజవాడవరకు ఊరేగింపు జరిగినట్లు యుద్ధమల్లుని బెజవాడశాసనంలో సూచన ఉంది. జాతరల్లో ప్రభువులుసైతం పాల్గొనేవారు. మతానికి సంబంధించిన అనేక మూఢవిశ్వాసాలు, అర్థరహితములైన ఆచారాలు ప్రజల్లో వ్యాపించినాయి. జైనమహాకవి సోమదేవసూరి 'హిందు'వుల్లోని ఈ క్రింది మూఢాచారాలను అధిక్షేపించినాడు :

సూర్యార్ఘ్యో గ్రహణస్నానం సంక్రాంతౌ ద్రవిణవ్యయః
సంధ్యాదేవాగ్ని సత్కారో గేహ దేహార్చనోవిధిః
నదీనద సముద్రేషు మజ్జనం ధర్మచేతసామ్
గోపృష్ఠాన్తనమస్కారౌ తన్మూత్రస్య నిషేవనమ్
రత్నవాహన భూయక్ష శస్త్రకాలాదిసేవనమ్.

అయితే జైనులలో మూఢాచారాలు లేకపోలేదు. వారు సయితం పంచయజ్ఞాలు చేసేవారు; పితృదేవతలకు పిండాలు వేసేవారు; క్షురకర్మకుబదులు జుట్టుపీక్కునేవారు. అన్నిటికంటే వారిలో ప్రధానమయింది సల్లేఖన వ్రతం. ప్రాయోపవేశం చేసి మరణించడం. అట్టి క్రూరకర్మకు కేంద్రమయినందునే దానవులపాడునకాపేరు వచ్చింది. రేనాటిశాసనాల్లో అగ్నిలో ప్రవేశించి ప్రాణాలు కోల్పోయే ఆచారప్రసక్తి ఉంది. ఇదీ ఒకరకమైన సల్లేఖనమే! దైవశక్తిలో ఇంతటి విశ్వాసానికి, జీవితంపై విరక్తికి నాటిరాజకీయాలలోని అరాజకత్వం, ఆర్థికంగా దారిద్ర్యమూ చాలవరకు కారణాలని చెప్పవచ్చు.

శాతవాహనులవలె చాళుక్యులుకూడ వర్ణధర్మాలను ఉద్ధరించినారు. "వర్ణాశ్రమ ధర్మరక్షణ మహామహిమన్ మహినొప్పు సర్వలోకాశ్రయుడ"ని రాజరాజ నరేంద్రుని నన్నయ్యభట్టు వర్ణించినాడు. బ్రాహ్మణులు సమాజంలో గౌరవ

స్థానం ఆక్రమించినారు. నాటి శాసనాలవల్ల సమాజంలో బ్రాహ్మణుల సంఖ్య నేదికంటే ఎక్కువ. బ్రాహ్మణులలో గౌతమ, ఆపస్తంబ సూత్రాల ననుసరించే వారు అధికం హిరణ్యకేశి సూత్రులు అరుదు. "ఇదం బ్రాహ్మం ఇదం క్షాత్రం" అన్నట్లు బ్రాహ్మణులు ఒకవైపున వైదిక విద్యావిజ్ఞానవిదులై వుండేవారు; మరొకవైపున శస్త్రోపజీవులై సేనాపతులై ప్రభువులను సేవించేవారు. కడియ రాజు, అతనికుమారుడు పండరంగడు, వినయడి, శర్మ, దుగ్గరాజు, వజ్జియ ప్రెగ్గడ మొదలైనవారు మహావీరులు, రాజనీతిమర్మజ్ఞులు, పాలనాదక్షులు, విశ్వాసపాత్రులై చాళుక్యరాజ్యానికి మూలస్తంభాలయినారు. వేదవేదాంగ పారంగతులైన బ్రాహ్మణులు అగ్రహారాల్లోను ఘటికలలోను పంచయజ్ఞ షట్కర్మ నిరతులై వైదికసంస్కృతిని రక్షించేవారు. ఆంధ్ర బ్రాహ్మణుల్లో బహుశా ఈ యుగంలోనే వైదిక నియోగిశాఖాభేదం ప్రారంభమయి వుంటుంది. చాళుక్య యుగంలో రెండో భాగంలో సైనిక అవసరాలు పెరగడంతో బ్రాహ్మణపోషణ క్షీణించినందున తీరాంధ్రంనుండి విద్యావంతులైన బ్రాహ్మణకుటుంబాలు పశ్చిమ చాళుక్యరాజ్యానికి తమిళదేశానికి వలస వెళ్లసాగినాయి

రాజధర్మాన్ని నిర్వహించేవారు క్షత్రియులు. చాళుక్యులు చంద్రవంశ క్షత్రియులమని చెప్పుకున్నారు రేనాటిచోడులు సూర్యవంశరాజులని, కాశ్యప గోత్రులని శాసనాల నుండి తెలుస్తున్నది వీరుకూడ ప్రాచీన స్థానికజాతులలోని వారై చిరకాలం ప్రభుత్వం నిర్వహించడంచేత క్రమంగా క్షత్రియులయినారని చెప్పడం చారిత్రకంగా సమంజసం; సముచితం బాణరాజులు తాము బాణాసురుని సంతతియని చెప్పుకోవడం ఆశ్చర్యకరమే!

వైశ్యులు వర్తక వ్యాపారాలు చేస్తుండేవారు వీరిని కోమట్లు అంటారు. కోమటి అనేమాట గోమతేశ్వర అనే పదంనుండి వచ్చివుంటుంది గోమతేశ్వరుడు ప్రాచీన జైన ఆధ్యాత్మికవీరుడు. జైనులాతణ్ణి ఆరాధిస్తారు. బోధన్ ఒకప్పుడు గోమతేశ్వర ఆరాధనకు కేంద్రమని, అచటి గోమతేశ్వర విగ్రహం నమూనాగానే శ్రావణబెళగొళ విగ్రహం చేసినారని ఒక ఐతిహ్యం. ఆర్థికంగా పురోగమిస్తున్న తీరాంధ్రంలోని కోమట్లు వైశ్యులమని వ్యవహరించుకున్నారు తెలంగాణాలో కోమటిపదమే ఎక్కువ. ఏమైనా ఈ యుగంలో వైశ్యులు జైనాన్ని విశేషంగా ఆదరించినారు. వైశ్యుల కులదేవత వాసవీకన్యక ఈమె ఆరాధనకు పెనుగొండ (తూ గోదావరి) కేంద్రం. వాసవీకన్యకను విష్ణువర్ధనుడనే చాళుక్యరాజు బలాత్కరించగా ఆమె అగ్నిలో దూకి ఆహుతియైనదనే కథలో చారిత్రక సత్యం లేదు. అయితే అగ్నిలో దూకి మరణించడం జైన ఆచారాల్లో ఒకటి. వాసవి కూడ ఆ వ్రతం ఆచరించి వైశ్యులకు ఆరాధ్యదేవత అయింది. దేశంలో శైవం ప్రబలడంతో వాసవీకన్యక దుర్గాదేవి అవతారమయి, కన్యకాపరమేశ్వరిగా

పరిణామం చెందివుంటుంది. వైశ్యులలో 714 గోత్రాలవారున్నారు ముఖ్యంగా వాణిజ్యం చేసేవారు 'నకరము' అనే కూటమిగా ఏర్పడి, శ్రేష్ఠ లేక శ్రేష్ఠి నాయకత్వంలో వ్యవహరించేవారు. శ్రేష్ఠ పదమే సెట్టిగా మారిందని ఇంతకు ముందే చదివినాముగదా!

శూద్రులు వ్యవసాయాది వృత్తుల నవలంబించేవారు. అగ్రహారాలు పెరగ డంతో వ్యవసాయం విస్తరించింది. అగ్రహార భూములు సాగుచేసే రైతులు పంటలో సగభాగం (అర్ధసీరి) అనుభవించడంచే వారి ఆర్థిక పరిస్థితి క్రమంగా మెరుగై, అందుకు అనుగుణమైన సాంఘిక హోదాకు ప్రయత్నించసాగినారు. మిగిలినవారిలో కుమ్మరులు, సాలీలు మొదలైన చేతిపనులవాండ్రు భిన్న కులాలుగా స్థిరపడినట్లు కన్పిస్తుంది. తెలికవాండ్లకు, సాలీలకు వృత్తి సంఘా లుండేవి. ఉత్పత్తిలో అధికభాగం స్థానిక వినియోగానికి ఉద్దేశించింది. వాణిజ్య ప్రాముఖ్యం వున్న వస్తుఉత్పత్తిదార్లు సంఘాలుగా ఏర్పడివుంటారు.

శాసన ప్రతికాకారులుగా శాసనలేఖకులుగా విశ్వకర్మ కులస్థులు కన్పిస్తు న్నారు తమ పేర్ల చివర 'ఆచార్య' పదం ధరించేవారు. సంఘబహిష్కరణ భీతితో శైవం ద్వారా హిందూసమాజంలో చేరిన జైనులే విశ్వకర్మలని కొందరి అభిప్రాయం. వీరినే కంసాలి, అగసాలి పదాలతో వ్యవహరించడం కద్దు 'కర్మ శాలి' అనే మాటనుండి 'కంసాలి,' 'అగ్నిశాల' పదంనుండి 'అగసాలి' వచ్చి వుండవచ్చు. సాలి అనే పదానికి పనివాడు అని అర్థంవుంది. అందుచే 'కర్మ రాష్ట్రంలోని పనివాండ్రు' అనియైన కంసాలి పదానికి అర్థం చెప్పవచ్చు. శాసన లేఖకులుగానేగాక దారులోహకర్మకారులుగా శిల్పకళాకోవిదులుగా విశ్వకర్మలు ప్రసిద్ధిచెందినారు. క్రమంగా వీరు 'పంచాణంవారు'గా అంటే కంసాలి, కమ్మరి, కంచరి, కాసె వడ్రంగి అనే ఐదు శాఖలుగా నేర్పడినారు.

చాళుక్యయుగంలో సామాజికంగా ఆసక్తికరమైన పరిణామాలు జరిగి నాయి. అందొకటి- తరచుగా జరిగిన యుద్ధాలవల్ల, అగ్రహారాల ద్వారా, వ్యవ సాయ విస్తరణవల్ల బోయలవంటి ఆటవిక జాతులు నాగరక సాంప్రదాయక సమాజంలో భిన్నకులాలలో చేరినారు. బోయలను గురించి చెప్పినాము. తీరాం ధ్రాన్ని జయించి రాష్ట్రకూటులు బోయసేనాపతులకు పంచి ఇచ్చినట్లు వారి శాసనాల వల్ల తెలుస్తున్నది తెలంగాణా ప్రాంతంలో పుళిందులు కూడ ఈ క్రమంలో సాంఘికోన్నతి సాధించినారు. మరొకటి - నాటివరకు సమాజంలో కింది వర్ణాలుగా ఉన్నవారు వ్యవసాయాది వృత్తులద్వారా ధనికులై తద్వారా ప్రభుత్వంలో ఉన్నతపదవుల నాక్రమించి సంప్రదాయక పాలకవర్గంలో చెరడం చాలా విశిష్టమైనది. సాధారణంగా నాటి సైనికుల్లో అధికభాగం శూద్రవర్ణజులే; విశిష్ట సేవలతో రాజాభిమానం బడసి సేనాపతులై సామంతులవుతూ ఉండేవారు.

చాళుక్య సామంతులైన వెలనాటి రాజులు, దుర్జయ (కొండ పడమటి) చాగి, పరిచ్ఛేది వంశాలవారు చతుర్థకులానికి చెందినవారే రాష్ట్రకూట సేనాపతులుగా ఆంధ్రదేశంలో ప్రవేశించి సామంతప్రభువులైన కాకతీయులు విష్ణి వంశస్థులు. తమ శౌర్యధైర్యాలచే రాజనీతిచే ప్రసిద్ధులై వీరందరూ క్షత్రియత్వం కాంక్షించ సాగినారు.

ప్రజలు తరచుగా ఒక ప్రాంతంనుండి మరొక ప్రాంతానికి వలసబోవడం మరొక విశేషం. దక్షిణభారతంలో జరిగిన మతపరిణామాలు, మతకలహాలు, రాజవంశాల మధ్య యుద్ధాలు ఇందుకు కారణాలు. తమిళదేశంలో ఆళ్వారుల ధాటికి నిలువలేక జైనులు ఆంధ్ర కర్ణాటక ప్రాంతాల్లో చాళుక్యుల ప్రాపున స్థావరా లేర్పరచుకున్నారు. బహుశా అందుచేతనే చోళులు తమ దాడులలో జైన కేంద్రాలను ధ్వంసం చేసినారు. రాష్ట్రకూట కృష్ణుని కాలంలో కర్ణాటక జైనులు తీరాంధ్రానికి వలస వచ్చినారని ప్రతీతి. రాష్ట్రకూటులు తాము జయించిన ఆంధ్ర ప్రాంత గ్రామాల్లో తమకు విశ్వాసపాత్రులైన వారిని ఉద్యోగులుగా నియమించి వుంటారు. వారే రాష్ట్రకూటులని వ్యవహరింపబడి కాలక్రమాన ఒక కులంగా రూపొందివుంటారు. వారే రెడ్లు అని ఒక అభిప్రాయం. తూర్పు చాళుక్యుల పోషణలో బ్రాహ్మణమతం విజృంభించినందున కర్మరాష్ట్రం వేంగి మొదలైన ప్రాంతాలనుండి జైనులు పశ్చిమాంధ్రసీమలకు కర్ణాటకానికి వలస వెళ్ళినారు. ఉద్యోగరీత్యా నారాయణభట్టు వేంగికి వచ్చినాడు. అతనికి సహాధ్యాయుడైన నన్నయభట్టారకుడు సయితం కర్ణాటకం నుండి వచ్చియుండవచ్చు. 'నన్ని' 'నన్న' పదాలు సత్యము అనే అర్థంలో కన్నడంలో వాడుకలో ఉన్నాయి. నన్నయపై పంపరచనల ప్రభావం స్పష్టం. అంతేగాక, అతనిది సంస్కృత ప్రాబల్యం ఎక్కువగానున్న శైలి. వీనినిబట్టి నన్నయ కన్నడ జాతీయుడనే అనుమానం బలపడుతుంది.

పల్లవరాజు నందివర్మ తొండంతొట్టం శాసనం నుండి తొమ్మిదో శతాబ్దంలో కర్మరాష్ట్రం నుండి బ్రాహ్మణులు అసంఖ్యాకంగా తమిళదేశానికి వలస బోయినట్లు తెలుస్తున్నది వీరందరూ వేదపండితులు, కర్మవిదులు - ఒకవైపు జైనమత ప్రాబల్యం, మరొకవైపు భక్తి మతాలు విజృంభించి దేవాలయ సంస్కృతి పెరగడంవల్ల వైదిక కర్మలకు ఆదరణ తగ్గడంతో వీరు దక్షిణ దేశానికి వలసవెళ్ళి భూములు, గ్రామాలు సంపాదించి స్థిరపడివుంటారు. అదే విధంగా తొమ్మిది పది శతాబ్దాల్లో వేంగీ కల్లోలిత మయినందున విద్యావంతులు సమర్థులునైనవారికి అవకాశాలు సన్నగిల్లడంతో వారందరు కళ్యాణి చాళుక్య రాజ్యానికి వలసబోయినారు. కర్మరాష్ట్రం నుండి ఆ విధంగా వెళ్ళినవారిలో వీరశైవ మతస్థాపకుడైన బసవేశ్వరుని కుటుంబం ఒకటి. ఇక ఆరామ ద్రావిడులనే

ఆంధ్ర బ్రాహ్మణులు తమిళదేశం నుండి కులోత్తుంగచోళుని కాలంలో గోదావరీ ముఖద్వార ప్రాంతాల్లో స్థిరపడినారు ఇట్టి వలసల వల్ల సాంఘికాచార వ్యవహారాలు భాషాసంప్రదాయాలు మొదలైన విషయాల్లో పరస్పర సంబంధాలు ఏర్పడినాయి. ముఖ్యంగా కన్నడ ఆంధ్ర భాషల లిపులకు సాన్నిహిత్యం ఏర్పడింది. ఆంధ్రులు కన్నడానికి కన్నడిగులు ఆంధ్రానికి సేవ చేయ గలిగినారు.

**చాళుక్యులు - విద్యలు**

చాళుక్యయుగంలో వైదిక విద్యలకు ఇతోధికమైన పోషణ లభించింది. ఈ యుగ శాసనాల్లో తరచుగా ద్వివేదులు, చతుర్వేదుల ప్రసక్తి కనిపిస్తుంది. చీపురుపల్లి శాసనంలోని మాధవవర్మ వేదవేదాంగ పురాణ ఇతిహాస ధర్మశాస్త్ర ఆగమాలలో కూలంకష ప్రజ్ఞ ఉన్నవాడు. పెదముద్దాలి శాసనంలోని గుప్తశర్మ తర్కంపై 70 వ్యాఖ్యానాలు వల్లె వేసినాడట. నిడుప్రరు శాసనగ్రహీతయైన కటిశర్మ వేద ఇతిహాస పురాణ ధర్మశాస్త్ర ఆగమ ఉపనిషత్పారంగతుడు. అతని తాత మండశర్మ పద, క్రమ, అనుక్రమాలతో రెండు వేదాలభ్యసించడమేగాక కల్ప పురాణ ఇతిహాస ధర్మశాస్త్రాలలో పండితుడై అశనపురాస్థానంలో ఘటికా సామాన్య పదవి నిర్వహించినాడు. అగ్రహారాల్లో ఘటికాస్థానాల్లో అధ్యయన అధ్యాపనలే బ్రాహ్మణుల ప్రధాన ధర్మము. అశనపురాస్థానం కర్మరాష్ట్రం లోనిదిగా కన్పిస్తుంది. హెంజేరు (హేమవతి) లోని శౌనంబేశ్వరాలయం ఘటికా స్థానమని, అచట 90 మంది విద్యార్థులకు భోజన సౌకర్యం కల్పించబడిందని హిరె సముద్ర శాసనం (అనంతపురం జిల్లా) పేర్కొంటున్నది. ఘటికాస్థానాల్లో చతుర్దశ విద్యలతోబాటు ఆయుర్వేద ధనుర్వేద గాంధర్వ అర్థశాస్త్రాలలో బోధన జరిగేది. రాజరాజ నరేంద్రుడు తాను పురాణములు, అర్థ, ధర్మశాస్త్రములు, రసాన్వితములైన కావ్యనాటకాలు పఠించి, ఈశ్వరాగమముల పట్ల ఆసక్తి వహించి నట్లు చెప్పుకున్నాడు ఇవి బహుశా రాకుమారుల వంటి ఉన్నత వర్గీయుల విద్యలో భాగాలయి వుండవచ్చు. ఇక సామాన్య ప్రజానీకం విద్యను గురించి తెలుసుకోవడానికి ఆధారం లేదు. వారిలో అధికభాగం నిరక్షరాస్యులేనని చెప్ప వచ్చు గురుముఖతః విని వల్లె వేయడమే నాటి విద్యార్జన విధానం; గ్రంథాలు అరుదు; అందుచేతనే నాటి విజ్ఞానంలో (తర్కంపై 70 వ్యాఖ్యానాల వంటి) అధిక భాగం నశించిపోయింది.

చాళుక్య యుగంలో వివిధ భాషల్లో పెక్కుమంది కవులు పండితులు విలసిల్లినారు. మూడో విష్ణువర్ధనుడు కవిపండిత కామధేనువు. 'కవిగాయక

కల్పతరు' వనే బిరుదం ధరించిన అమ్మరాజు ఆస్థానంలో మాధవభట్టు, పోతన భట్టు, భట్టదేవుడు అనే కవులున్నారు. వీరిలో భట్టదేవుడు 'కవి చక్రవర్తి' బిరుదాంచితుడు. రాజరాజనరేంద్రుడు 'కావ్యగీతిప్రియుడు' అతని ఆస్థానంలో విద్యాదయితుడైన నన్నయ, అష్టభాషాసుకవి శేఖరుడైన నారాయణభట్టు, సత్కారశీలుడు, సుకవి మల్లుడునైన పావులూరి మల్లన ఉన్నారు. నాటి శాసనాల్లో చాలాభాగం గద్యపద్యాత్మకాలు. వానిలో చక్కని కవిత్వం కన్పిస్తుంది. వానిని రచించినవారు కవులేనని వేరే చెప్పనక్కరలేదు. రాజాస్థానాల్లో పండిత పరిషత్తులుండి, కవుల కావ్యగుణాలను పరిశీలించి సత్కరిస్తుండేవి ఆంధ్ర మహాభారతం అవతారికలో నన్నయభట్టు "సత్సభాంతర సరసీవనంబుల ముదం బొనరన్" గొనియాడినాడు.

**తెనుగుభాష**

మునుమార్గ కవితలోకంబున వెలయగ దేశికవిత బుట్టించి తెనుం
గును నిలిపి రంధ్రవిషయంబున జనసత్యాశ్రయునిదొట్టి చాళుక్యనృపుల్

అని నన్నెచోడు డన్నట్లు ఆంధ్రభాషా చరిత్రలో చాళుక్యులు సాటిలేని స్థానం ఆక్రమిస్తున్నారు. విష్ణుకుండి శాలంకాయన కాలం నుండి శాసనాల్లో తెలుగుపదాలు కన్పిస్తాయి. కాని చాళుక్యారంభం నుండి తెలుగు ఉన్నతస్థానం ఆక్రమించసాగింది. ఇందుకు బహుశా జైనమతాచార్యుల ప్రచారం చాలావరకు కారణమై వుంటుంది. చాళుక్య వంశ స్థాపకుడైన కుబ్జవిష్ణువర్ధనుని చేజర్ల శాసనంలో సగంపైగా తెలుగు. అతని కుమారుడు జయసింహ వల్లభుని విప్పర్ల, మాచెర్ల శాసనాలు తెలుగు శాసనాలు. ఇదే కాలం నాటి రేనాటిచోడులు సయితం తమ శాసనాలను తెలుగులో వేయించినారు. వానిలో ధనంజయుని కలమళ్ళ శాసనం (క్రీ.శ. 575) తెలుగు శాసనాలలో ప్రాచీనమయింది. ప్రాచీనాంధ్ర భాషాస్వరూపం ఈ శాసన పరిశీలన వల్ల స్పష్టమవుతున్నది. క్రీ.శ. 6,7 శతాబ్దాల వరకు తెలుగుబాష సంస్కృత భూయిష్ఠం కాలేదు. నాటి శాసనాలలో అన్నీ తెలుగు మాటలే. పద్యరచన కూడ ప్రారంభం కాలేదని చెప్పవచ్చు. నాటి తెలుగులో కర్త కర్మల మధ్య క్రియాపదాన్ని ఉంచె అపూర్వ ప్రయోగాలు కన్పిస్తాయి వర్ణనలు గాని దీర్ఘ సమాసాలుగాని వక్రోక్తులుగాని లేవు. బహువచన ప్రత్యయానికి 'ళ' వాడినారు. అచ్చటచ్చట 'ద' బదులు ఢ్జ అని ఉచ్చారణ ఉన్న 'ఱ' వంటి అక్షరం కన్పిస్తుంది. ఈ రెండు లక్షణాలు తమిళభాషా ప్రభావ ఫలితాలు. తెలుగు కన్నడ లిపులు చాలా సన్నిహితంగా ఉండేవి.

తెలుగు భాష క్రమంగా సంస్కృ (సంస్కృతీక) రింపబడినది. గుణగ విజయాదిత్యుని కాలంనాటికి తెలుగులో సంస్కృత పదాల సంఖ్య ఎక్కువయింది. గుణగుని కాలం ఆంధ్ర కవిత్వ చరిత్రలో ప్రథమ ఘట్టం. మాత్రాగణబద్ధము లైన దేశియ ఛందస్సులతో కవిత్వ రచన ప్రారంభమయినట్లు శాసన సాక్ష్యం లభిస్తుంది. పండరంగని అద్దంకి శాసనంలో తరువోజ ఉంది. గుణగుని సాతులూరు శాసనంలో ప్రాసవున్న చంపకమాలా వృత్తం సంస్కృతంలో ఉంది. తెలుగు కవిత్వానికి ప్రాస ప్రత్యేకలక్షణం. అందుచేత తెలుగు కవియే ఈ చంపక మాలను సంస్కృతంలో రచించి వుంటాడు. అద్దంకి శాసనం తరువాత కొంది కాలానికే వేయబడిన కందుకూరు ధర్మవరం శాసనాల్లో సీసపద్యాలున్నాయి. యుద్ధమల్లుని బెజవాడ శాసనం మధ్యాక్కరల శాసనం. బాదపుని ఆరుంబాక శాసనంలో కందపద్యం సంస్కృతంలో ఉంది. "ధవళగుణో, ధవళయశో, ధవళితదిఙ్మండలోవ దమితారతిః భవభక్తోభవకరుణోద్భవ భవభోగాన్వితో విబాతిసుకీర్తిః." ఈ శ్లోకంలో యతిప్రాసలు పాటించినారు. బహుశా ఈ పద్యాల నడక ప్రాసాదినియమాలు సంస్కృత యతికి భిన్నమైన క్లిష్టమైన యతి నన్నయ కవిత్వాన్ని గుర్తుకు తెస్తాయి. ధర్మవర శాసన గద్యం కూడ నన్నయ మహా భారత గద్యకు దీటువస్తుంది. కాబట్టి క్రీ. శ. 9వ శతాబ్ది నాటికే తెనుగు సంస్కృతీకరింపబడి గ్రాంథికమయింది. తరువోజ, సీసము, మధ్యాక్కరల వంటి దేశియఛందములతోబాటు చంపకమాలాది వృత్తాలనలవరచుకొని ఆంధ్రులు పద్య రచనలో ఆరితేరినారు. ఈ కాలంలో కన్నడభాషలోవలె ఆంధ్రంలో కూడ గ్రంథాలు వెలువడి వుంటాయి. ఐనా నాడు ప్రజల భాషలో వ్రాయడానికి సాహసించినవారు జైనులొక్కరే. నాటి హిందూమతానికి ఇంకనూ దేవ భాషయే అధికార భాష. జైనులైన పద్మకవి, రేచన తెలుగులో గ్రంథాలు రచించినారు. తెలుగులో జినేంద్ర పురాణం రచించిన పద్మకవి కన్నడంలో విక్రమార్జునవిజయ కర్తయైన పంప(పద్మప్ప=పంప) ఒక్కరేనని కొందరి అభిప్రాయం. పంపకవి తమ్ముడు జినవల్లభుడు సైతం గొప్ప కవియే. అతని గంగాధర శాసనంలో తెలుగు కంద పద్యాలున్నాయి. ఆరుంబాక, గంగాధర శాసనాలవల్ల నాడు కంద పద్యం బహుళ ప్రచారంలో ఉన్నట్లు తెలుస్తుంది. శైవమత విజృంభణలో జైన వసదులతోబాటు తెలుగు జైన వాఙ్మయం కూడ రూపుమాసిపోయి వుంటుంది.

రాజరాజనరేంద్రునికాలం నాటికి తెనుగు భాషా స్వరూప పరిణామం పూర్తయింది. అతని ఆస్థానంలోనే పావులూరి మల్లన గణితశాస్త్ర సమస్యలను

కూడ సుబోధకంగా తెలుగు పద్యాల్లో వ్రాసినాడంటే ఆనాటి భాష ఎంత మార్దవాన్ని శబ్దనైపుణ్యాన్ని సంతరించుకొన్నదో గ్రహించవచ్చు. అదీగాక ఆనాటికి వైదిక మతస్థులు సయితం ప్రజల భాషలో ధర్మప్రచారం చేయడానికి పూనుకున్నారు. నాటికి మహాభారతం నవహైందవ మతానికి విజ్ఞాన సర్వస్వంగా పంచమవేదంగా తయారయింది; బహు భాషల్లో బహు విధాల భారతాన్ని అనువదించుకుంటున్నారు. వేదమత సందేశాన్ని ప్రజల్లో వ్యాప్తి చేయడానికి అంతకంటె మార్గాంతరం లేదని స్పష్టమయింది. భారత శ్రవణంవల్ల బహు యజ్ఞాల ఫలితం లభించడమేగాక ప్రజల్లో వర్ణధర్మతత్పరత వర్ధిల్లకలదని ప్రభువులు పండితులు ఆశించినారు. కాకతాళీయంగా భారతం చంద్రవంశస్థులైన పాండవేయుల చరిత్ర కావడంతో చాళుక్యుల అభిమానానికి పాత్రమయింది. అందువల్ల రాజరాజనరేంద్రుడు నన్నయభట్టారకుని భారతాంధ్రీకరణకు ప్రోత్సహించినాడు. అందుకు సరియైన వ్యక్తి నన్నయభట్టు, సంహితాభ్యాసుడు, నానా పురాణ విజ్ఞాన నిలయుడు; అవిరళ జప హోమ తత్పరుడైన లోకజ్ఞుడు; ఉభయ భాషాకావ్య రచనా ప్రాగల్భ్యుడు; వాగనుశాసనుడైన వయ్యాకరణి నన్నయ; 'ఆంధ్రభాషానుశాసనం' అనే వ్యాకరణం రచించినాడని ప్రసిద్ధి. నన్నయకు నారాయణభట్టు సహాయంగా నిలిచినాడు.నారాయణభట్టు వాఙ్మయధురంధరుడు, అష్టభాషాసుకవిశేఖరుడు సహాధ్యాయులైన నారాయణ నన్నయభట్టులు భారత యుద్ధానికి సంసిద్ధులైన కృష్ణార్జునులవలె భారతాంధ్రీకరణకు పూనుకొని ఒక విజ్ఞాన సర్వస్వంగా దాన్ని రూపొందించే ప్రయత్నం ప్రారంభించినారు; తెనుగు కావ్యభాషాస్వరూపానికి పూర్ణత్వం సాధించి పండితులు, పామరులు మెచ్చుకొనదగిన శైలిని రూపొందించి తరువాతి కవులకు మార్గదర్శకులయినారు; ఆంధ్ర భాషా చరిత్రలో నన్నయ నారాయణులు యుగపురుషులు.

రాజరాజనరేంద్రుని పాలనకాలంలో సాహిత్యపోషణకు అనుకూలమైన ప్రశాంతవాతావరణం క్రీ. శ. 1045-1060 మధ్యలో ఉంది. ఆ కాలంలోనే భారతాంధ్రీకరణ జరిగి వుంటుంది. 1060 లో రాజరాజనరేంద్రుని మరణంతో భారత రచన ఆగినదని చెప్పవచ్చు. నారాయణభట్టుకు నందంపూడి అగ్రహారాన్ని ఇచ్చి రాజరాజనరేంద్రుడు గౌరవించినాడు. ఈ దానశాసన కావ్యరచయిత నన్నియ. ఈతడు నన్నయ ఒక్కరేనని భావించవచ్చు. నన్నయకు లభించిన గౌరవమేమో తెలియదు. నన్నయ చాళుక్య కులబ్రాహ్మణుడు!

పావులూరి మల్లన రాజరాజుచే నవఖండవాడను అగ్రహారంగా బడసినాడు. మహావీరాచారి అనే జైనకవి రచించిన గణితసారసంగ్రహాన్ని తెలుగు పద్యాల్లో

రచించినాడు. పావులూరి గణితంలోని ఈ క్రింది పద్యంవల్ల నాడు తర్క-వ్యాకరణ గణిత ఖగోళ, భూగోళ శాస్త్రాల్లో ప్రజలు శ్రద్ధవహించినట్లు తెలుస్తుంది:

అర్కాదిగ్రహసంచరగ్రహణ కాలన్వేషణోపాయమున్
దర్క వ్యాకరణాగమాది బహుశాస్త్రప్రోక్తనానార్థ సం
పర్కాది వ్యవహారమున్ భువనరూపద్వీప విస్తారమున్
దర్కింపన్ గణితప్రవృత్తి వెలిగా దక్కొండెఱింగించునే?

## వాస్తుశిల్పాలు - నృత్యసంగీతాలు

భక్తిప్రధానమైన శైవవైష్ణవాలు ప్రజ్వరిల్లినందున దేశంలో ఆలయనిర్మాణం విరివిగా సాగింది. రాజకీయ పరిస్థితుల ప్రభావంవల్ల నాటి ఆలయనిర్మాణరీతుల్లో వైవిధ్యం గోచరిస్తున్నది. పశ్చిమ చాళుక్యుల పాలనలో ఉన్న పశ్చిమాంధ్ర ప్రాంతంలో చాళుక్యశైలి ప్రభావం ఎక్కువ. అలంపురం (మహబూబ్‌నగర్ జిల్లా) లోని నవబ్రహ్మ ఆలయాలు, సంగమేశ్వర్, కదమలకాల్వ, మహానంది (కర్నూలు) ఆలయాలు ఇందుకు నిదర్శనాలు. నొలంబులు తమ రాజ్యంలో ద్రావిడ కర్ణాటక సంప్రదాయాల మిశ్రమశైలిలో ఆలయాలు నిర్మించినారు. తూర్పుచాళుక్యులు తీరాంధ్రంలో పల్లవచాళుక్య సంప్రదాయాల ప్రభావం జీర్ణించుకొన్న స్వతంత్రరీతిని రూపొందించినారు. పంచారామాల్లో, ముఖ్యంగా దాక్షారామాలయంలోను బిక్కవోలు ఆలయాల్లోను తూర్పుచాళుక్యరీతి ప్రస్ఫుటమవుతుంది. బిక్కవోలు (బిరుదాంకనిప్రోలు) ఆలయాలు గుణగుని నిర్మాణాలని చెప్పవచ్చు. వీనిలో గోలంగేశ్వరాలయం మినహా మిగిలినవి శిథిలావస్థలో ఉన్నాయి. అయినా తూర్పు చాళుక్య ఆలయశైలిని గ్రహించడానికి ఉపకరిస్తున్నాయి. ఆలయకుడ్యాలపైన కుడ్యకోష్ఠాలలోను ఉన్న దేవతాప్రతిమలు ఆగమసూత్రాలకనుగుణంగా చైతన్యం ఉట్టిపడుతూ ఉంటాయి.

ఆలయాలు ఆస్థానాలు సంగీతకళలను ప్రోత్సహించినాయి. చాళుక్యభీముడు గాంధర్వవిద్యావిశారద అయిన చెల్లవ్వకు అత్తిలిగ్రామంలో మాన్యం ఇచ్చి ఆదరించినాడు. ఆమె తండ్రి మల్లప్ప సంగీతవిద్యలో తుంబురునివంటివాడు. అమ్మరాజు భార్య చామెకాంబ నటముఖారవిందములకు సూర్యరశ్మియట! బాదవుడు నటులను గాయకులను పోషించినాడు. నాటి శిల్పాలలో వీణ, పిల్లనగ్రోవి, మృదంగం, తాళాలవంటి వాద్యాలు కన్పిస్తాయి. విజయవాడ జమ్మిదొడ్డి శిల్పాలలోను చేబ్రోలులో దొరికిన ఒక శిల్పంలోను నృత్యవాద్య గోష్ఠులున్నాయి. నృత్యగీత మిశ్రమమైన కోలాటం నాటి వినోదాల్లో ముఖ్యమయింది.

# వేంగిచాళుక్య వంశవృక్షం

- 1. కుబ్జవిష్ణువర్ధన 624-642
  - 2. జయసింహ
  - 3 ఇంద్రభట్టారక
    - 4. రెండో విష్ణువర్ధన
      - 5. మంగియువరాజు
        - 6. రెండో జయసింహ
        - 8. మూడో విష్ణువర్ధన
          - 9. విజయాదిత్య
            - 10. నాలుగో విష్ణువర్ధన
              - 11. రెండో విజయాదిత్య
                - 12. కలివిష్ణువర్ధన
                  - 13. గుణగవిజయాదిత్య
                  - విక్రమాదిత్య
                    - 14. చాళుక్యభీమ
                      - 15. నాలుగో విక్రమాదిత్య
                        - పల్లవమహాదేవి
                          - 16. అమ్మరాజ
                      - 19. రెండో విక్రమాదిత్య
                        - మేలాంబ
                          - 21. రెండో చాళుక్యభీమ
                  - యుద్ధమల్ల
                    - 18. తాల
                      - 20. యుద్ధమల్ల
                        - బాడప
                        - రెండో తాల
              - శీలమ + రాష్ట్రకూటధ్రువ
        - 7. కొక్కిలి (ఎలమంచిలిశాఖ)

18. అమ్మరాజ    21. రెండో చాళుక్యభీమ    బాడప    రెండో తాల

ఊర్జపా    లోకాంబ

17. బేతవిజయాదిత్య    భీమ

23. దానార్ణవ    22. రెండో అమ్మరాజ    రాజరాజచోళ

24 శక్తివర్మ    మేలమ + 25. విమలాదిత్య + కుందవ్వ    రాజేంద్ర

28. విజయాదిత్య    26. రాజరాజనరేంద్ర + అమ్మంగదేవి

27. రెండో శక్తివర్మ    రాజేంద్ర (కులోత్తుంగ)

---

## కొన్ని ఉపయుక్త గ్రంథాలు


| | | |
|---|---|---|
| 1. | Arudra | సమగ్ర ఆంధ్రసాహిత్యం - I |
| 2. | Blambal | Feudatories of South India |
| 3. | Hanumantha Rao, B.S.L. | Religion in Andhra |
| 4. | Krishna Rao, B.V. | The Eastern Chalukyas |
| 5. | Ramesan | Studies in Medieval Daccan |
| 6. | Ramesh | Chalukyas of Vatapi |
| 7. | Sastri, K.A N. | The Cholas |
| 8. | Venkataramanaiah, N. | (1) The Eastern Chalukyas of Vengi<br>(2) The Chalukyas of Vemulavada |
| 9. | Viresalingam, K. | ఆంధ్రకవుల చరిత్ర. |

# చాళుక్య - చోళయుగం

సప్తమ విజయాదిత్యుని మరణానంతరం కులోత్తుంగ రాజేంద్రచోడుడే వేంగి రాజ్య పాలనభారాన్ని స్వయంగా వహించినాడు. ఉభయచాళుక్య చోళ కులోద్ధారకుడైన ఈతని సంతతివారు చాళుక్య - చోళులని ప్రసిద్ధులైనారు. క్రీ శ. 1076 మొదలు కాకతీయులు ఆంధ్రదేశాధిపత్యం వహించేవరకు (క్రీ.శ. 1200 ప్రాంతము) ఈ వంశీయుల సార్వభౌమత్వం చెల్లినందున ఆంధ్రుల చరిత్రలో ఈ కాలాన్ని చాళుక్య - చోళయుగం అంటారు. చాళుక్యులకాలంలో రాష్ట్ర పరిపాలన నిర్వహిస్తున్న సామంత కుటుంబాలీయుగంలో బలపడి విజృంభించి నాయి. నెల్లూరు, పొత్తపి, కొణిదెనలలో తెలుగుచోడులు; చందోలు, నాదెండ్ల (గిరి పశ్చిమ సీమ)లలో దుర్జయులు; నతవాడిలో చాగి (త్యాగి) వంశీయులు; కోన సీమలో హైహయులు తీరాంధ్రమాండలికులలో పేర్కొనదగినవారు. అనుమకొండ ప్రాంతాన్ని కాకతీయులు పశ్చిమచాళుక్య సామంతులుగా పాలించేవారు. వీరం దరూ పేరుకుమాత్రం సార్వభౌములకు సామంతులై, తమ ప్రాంతాల పాలనలో సర్వస్వతంత్రులై వ్యవహరించేవారు. అందుచేత ఈ యుగాన్ని మాండలిక యుగం అనడంకూడ కద్దు.

## కుమారరాజ ప్రతినిధులు

కులోత్తుంగచోళునకు మధురాంతకియందు కల్గిన కుమారులలో రాజరాజ చోడగంగు, రాజరాజముమ్మడిచోడుడు, వీరచోడుడు. విక్రమచోడుడు అనే నల్గురు మాత్రమే శాసనాలనుండి తెలుస్తున్నారు. వీరందరు వేంగిరాజప్రతినిధి పదవి నిర్వహించినవారే. అందరూ విష్ణువర్ధన, సర్వలోకాశ్రయాది తూర్పు చాళుక్య బిరుదులు ధరించినవారే. అందుచే వీరి శాసనాలు సమన్వయం చేయడం కష్టసాధ్యమవుతూ ఉంటుంది.

క్రీ.శ. 1076 లో కులోత్తుంగుడు తన రెండో కొడుకైన రాజరాజ ముమ్మడి చోడుని వేంగిరాజ ప్రతినిధిగా నియమించినాడు. ముమ్మడి చోడుడు జననాథపుర. (దాక్షారామం)లో పట్టాభిషేకం జరుపుకొని సర్వలోకాశ్రయ, విష్ణువర్ధన బిరుదాలతో పరిపాలన సాగించినాడు. ఈతడు ఒక సంవత్సరం మాత్రమే రాజప్రతినిధిగా ఉన్నట్లు ఇతర శాసనాలు చెబుతున్నాయిగాని ఏలూరు

శాసనం ప్రకారం ముమ్మడి కనీసం రెండేండ్లు వేంగిని పాలించినాడు. దుర్జయ వంశస్థుడైన వెలనాటి గొంకయ ఈతని సమస్త సేనాపతి. ముమ్మడిభీమనృపాలు డీతని మరొక ఉద్యోగి. రాజప్రతినిధిగా ముమ్మడిచోడునకు కళింగ, కుంతల (పశ్చిమచాళుక్య) రాజులతో పోరాడవలసివచ్చింది. కళింగలో రాజరాజ దేవేంద్ర వర్మ (క్రీ.శ. 1077) మరణించి అతనికొడుకు అనంతవర్మ చోడగంగదేవుడు బాలుడైనందున దాయాదులు పశ్చిమచాళుక్యుల సాయంతో సింహాసనం ఆక్ర మించడానికి ప్రయత్నించినారు. అట్టిపరిస్థితుల్లో ముమ్మడిచోడుడు కళింగపై దండెత్తి శత్రువులను నిర్జించి అనంతవర్మ చోడగంగును సింహాసనంపై నిలిపి నాడు (క్రీ.శ. 1078). ఈ యుద్ధంలో తనకు సాయం చేసిన ముమ్మడిభీముని వేంగిరాజ్యంలో పండ్రెండు గ్రామాలపై అధిపతిగా చేసినాడు. ముమ్మడి భీము నకు బహుశా కొలనివీడు రాజధాని అయివుంటుంది. సోదరకుమార రాజప్రతి నిధులవలె తనశాసనాల్లో తండ్రిపాలనాకాలాన్ని ఉదాహరించక ముమ్మడిచోడుడు తన పాలనా కాలమే ఉదాహరించినాడు. అందుచే ఈతడు వేంగిలో స్వతంత్రించ డానికి ప్రయత్నించినాడనీ తండ్రి అతణ్ణి తిరిగి చోళమండలానికి రప్పించి నాడనీ చెప్పవచ్చు.

ముమ్మడి చోడుని అనంతరం వీర చోడుడు క్రీ.శ. 1078లో జననాథ పురంలో పట్టాభిషేకం జరుపుకొని క్రీ.శ. 1084 వరకు వేంగిని పాలించినాడు. క్రీ.శ.1081, 1082 నాటి పశ్చిమచాళుక్యుల దాక్షారామ శాసనాలనుబట్టి వీర చోడునికాలంలో పశ్చిమచాళుక్యులు వేంగిపై దండెత్తి దాక్షారామంవరకు నడిచినట్లు తెలుస్తున్నది. కళింగసేనాపతి బణపతి, వెలినాటి గొంకయ అన్నకొడుకు వేదు రుడు సాయపడగా వీర చోడుడు పశ్చిమచాళుక్యదాడిని తిప్పికొట్టినాడు. వేదురుడు పాండ్యరాజును జయించడంలో వీర చోడునకు సాయపడినట్లు శాసన సాక్ష్య మున్నది. నాడు పశ్చిమ చాళుక్య సామంతులుగా పాండ్యులు నొలంబపాడి నేలే వారు. వారి రాజధాని ఉచ్చంగి. నాడుత్రిభువనమల్ల పాండ్యుడు ఉచ్చంగిరాజు. బహుశా అతడే పశ్చిమ చాళుక్యసేనలతో వేంగిపై దండెత్తగా అతణ్ణి వేదురుడు ఓడించి వుండవచ్చును. అందుకు ప్రతిఫలంగా వేదురుని అర్ధసింహాసనస్థుని చేయడమేగాక రెండేరుల (గౌతమీ వసిష్ఠల) నడిమి రాజ్యంపై పాలకుని గావించినాడు.

వీర చోడుడు క్రీ.శ. 1084లో దక్షిణాదికి మరలిన పిమ్మట రాజరాజచోడ గంగు వేంగికి రాజప్రతినిధి అయినాడు. ఈతని చేకి శాసనంవల్ల మన్నేరు మొదలు మహేంద్రగిరి (కళింగ) వరకు చాళుక్య - చోళాధికారం చెల్లినట్లు తెలుస్తున్నది. ఈ శాసనంలో "తెలిక వేవుర"కు రాజరాజు అనేకమర్యాదలు ఇచ్చినాడు. క్రీ.శ. 1089 ప్రాంతంలో వేంగి రాజ్యంలో చాళుక్య-చోళాధికారానికి

ప్రమాదం ఏర్పడింది. చక్రకూటాధిపుడైన రాజభూషణ సోమేశ్వరదేవుడు స్వతంత్రించి, తన తండ్రికి కులోత్తుంగ రాజేంద్రచోడుని వల్ల జరిగిన పరాభవానికి ప్రతీకారం చేయడానికి ప్రయత్నించసాగినాడు. అతనికి పశ్చిమ చాళుక్య విక్రమాదిత్యుని ప్రోత్సాహము, అతని సామంతుడైన పరమార జగదేవుని సహాయము లభించినాయి. సోమేశ్వరుని అణచడానికి చేసిన ప్రయత్నంలో రాజరాజ చోడగంగు మరణించినాడని కొందరి అభిప్రాయము (శ్రీ బి. వి. కృష్ణారావు).

అందుచే తిరిగి ఉత్తరదేశాన్ని జయించడానికై వీర చోడుని వేంగిరాజ ప్రతినిధిగా క్రీ.శ. 1089 లో కులోత్తుంగుడు పంపినాడు. కాని, కులోత్తుంగుని కోర్కె ఫలించలేదు. చక్రకూట సోమేశ్వరుడు 1094 లో వేంగిపై దండెత్తి వీర చోడుని వధించి జననాథపురాన్ని దగ్ధంచేసి 'వీరచోడసంహారకామ' అనే బిరుదం ధరించినట్లు తెలుస్తుంది; 'సవేంగిదేశబాంధవం వ్యదీయపత్ కిరీటివత్' అని చెప్పుకున్నాడు

వీర చోడుడు రెండోమారు రాజప్రతినిధిగానున్నకాలం ఐదేండ్లలో తమిళ వైష్ణవ బ్రాహ్మణులనేకమంది తీరాంధ్రంలో స్థిరపడినారు. ఇతని పిఠాపురం శాసనం ప్రకారం మాలవెల్లి, పొన్నతొఱ్ఱ, అల్మి అనేమూడు గ్రామాలను కలిపి వీరచోడ చతుర్వేదిమంగళమనే అగ్రహారంచేసి 563 బ్రాహ్మణులకు ఇచ్చినాడు. ఈ బ్రాహ్మణులలో చతుర్వేదపండితులు, షడంగమీమాంసా, వేదాంతవ్యాకరణ విదులునైన వైష్ణవులున్నారు. వీరందరూ ద్రావిడ బ్రాహ్మణులేనని చెప్పవచ్చు. చెల్లూరులోని వైష్ణవాలయానికి కాలేరుగ్రామాన్ని దేవభోగంగా దానంచేసినాడు. ఆంధ్రదేశంలో రామానుజవైష్ణవం వ్యాప్తికీచర్యలు సుగమమార్గం కల్పించినాయి.

చక్రకూట సోమేశ్వరుని దండయాత్రతో వేంగి అల్లకల్లోలమయింది. ఇది అవకాశంగా తీసుకొని కొలనిభీముడు స్వతంత్రించినట్లు కన్పిస్తుంది. కళింగలో కూడ చాళుక్య చోళాధికారానికి ప్రమాదం ఏర్పడింది. అందుచే కులోత్తుంగ రాజేంద్ర చోడుడు కళింగ దండయాత్రకు నిర్ణయించినాడు. ఈ దండయాత్రను గురించి అభిప్రాయ భేదాలున్నాయి. కళింగపై కులోత్తుంగుడు రెండుమారులు దండెత్తినాడని, మొదటి దండయాత్ర 1098 లో సాగించి కొలని భీముని నిర్జించి దక్షిణ కళింగను ఆక్రమించినాడని, క్రీ.శ. 1110 లో రెండో దండయాత్రలో అనంతవర్మచోడగంగదేవు నోడించినాడని ఆచార్య నీలకంఠ శాస్త్రిగారి అభిప్రాయం. కులోత్తుంగుని ఆస్థానకవియైన జయంగొండార్ 'కళింగట్టుపరణి' కావ్యానికి కథావస్తువీ కళింగదండయాత్రయే. అందు కులోత్తుంగుని కళింగశత్రువు అనంతవర్మ అనియే వుంది. కాని, కళింగపై కులోత్తుంగుడు రెండు దండయాత్రలు జరిపినాడనడానికి ఆధారంలేదు. శాసనాలు ఒకే దండయాత్రను

సూచిస్తున్నాయి. అదీగాక ఈ దండయాత్ర దక్షిణ కళింగను (త్రికళింగమును) పాలిస్తూ పశ్చిమ చాళుక్యుల ప్రోత్సాహంతో వేంగిపై తరచు కాలుదువ్వుచున్న దేవేంద్రవర్మ మీద జరిగిందని శ్రీ మల్లంపల్లి సోమశేఖరశర్మ గారి నిర్ణయం. ఈ దండయాత్రను నిర్వహించింది కరుణాకరతొండమాన్ అనే పల్లవరాజు. ఈతడు తన దాక్షారామ శాసనంలో దేవేంద్రవర్మాది రాజులను పారదోలి కళింగను భస్మీ పటలంచేసి ఓఢ్రదేశం సరిహద్దుల్లో జయస్తంభం నాటినట్లు చెప్పుకున్నాడు రాజ కుమారుడైన విక్రమ చోళుడు, చోళ సామంతుడైన పరాంతక పాండ్యుడు, ఆంధ్ర దేశంలోని హైహయ, దుర్జయ, కోటవంశీయులు సయితం ఈ కళింగ దండ యాత్రలో పాల్గొని కులోత్తుంగచోడునకు విజయం చేకూర్చినారు. ఈ దండ యాత్ర క్రి. శ. 1096 లో జరిగి ఉంటుంది. క్రి. శ. 1099 నాటి కులోత్తుంగుని సింహాచల శాసనం ప్రకారం దక్షిణ కళింగలో అతని సార్వభౌమత్వం చలామణి అవుతున్నది.

కళింగ దండయాత్ర సందర్భంలో విక్రమ చోళుడే వేంగిరాజ ప్రతినిధి యని కొందరి అభిప్రాయం. కాని అందుకు తగిన సాక్ష్యాధారం లేదు. విక్రమ చోళుని శాసనాలు వేంగిలో లభింపలేదు. క్రి.శ. 1093 - 1107 మధ్యకాలంలో వీర పెర్మాడిదేవుడు సర్వలోకాశ్రయ విష్ణువర్ధన బిరుదాలతో వేంగి నేలినట్లు శాసనాలు చెబుతున్నాయి. అనంతరం పరాంతక దేవుడు రాజప్రతినిధి అయినాడు.

పరాంతక చోళుడే వేంగినేలిన చివరి చాళుక్య చోళకుమార రాజప్రతినిధి. ఈతని కాలంలో (క్రి శ. 1107-19) వేంగి కల్లోలానికి గురి అయింది. పశ్చిమ చాళుక్య దండయాత్రలు తీవ్రతరమయినాయి. అదీగాక, చోళసింహాసనానికి విక్రమ చోడ పరాంతుకులమధ్య స్పర్థ ఏర్పడినట్లు కన్పిస్తుంది. విక్రమచోడుడు హోయ సాల రాకుమార్తె తనయుడు. హోయసాలులాతణ్ణి బలపరచడంలో ఆశ్చర్యం లేదు. క్రి.శ. 1117 ప్రాంతంలో హోయసాలులు వేంగిపై దండెత్తినట్లు వారి శాసనాలు సూచిస్తున్నాయి. హోయసాల మొదటి నరసింహునకు 'నిజసేనానాథ నిర్ధళిత జననాథపుర' అనే బిరుదం వుంది. అంతేగాక, పరాంతకుని సామంతుడైన మదపల్లి నూంకయ 'పరాంతక క్షితిపతి జైత్రయాత్రల సఖుడ'నని వర్ణించు కున్నాడు. దీనివల్ల పరాంతకుడనేక యుద్ధాలు చేయవలసివచ్చినట్లు తెలుస్తున్నది. ఇట్టి పరిస్థితుల్లో ఆంధ్రదేశంపై తన అధికారం క్షీణిస్తున్నదని గమనించి కులోత్తుంగ చోడదేవుడు ఆంధ్రదేశంలోని విశ్వాసపాత్రులైన మాండలికులను బలపరచినాడు. అట్టివారిలో వెలనాటి దుర్జయులు ప్రథమగణ్యులు.

## వెలనాటి రాజులు

క్రీ.శ. 11, 12 శతాబ్దాలలో వెలనాడునేలినరాజుల శాసనాలు పిఠాపురం, ధాన్యకటకం, చేబ్రోలు, చందోలు, దాక్షారామం, త్రిపురాంతకం మొదలైనచోట్ల లభ్యమయినాయి. పృథ్వీశ్వరుని పిఠాపురం శాసనంలో ఈ వంశాన్ని గురించిన వివరాలు చాల లభిస్తున్నాయి. చాళుక్య చోళ కుమార ప్రతినిధుల శాసనాలు వీరి శాసనస్థ అంశాలను బలపరుస్తున్నాయి.

వెలనాటిరాజులు చతుర్థాన్వయులు. తమ పూర్వులు మధ్యదేశంలోని కీర్తిపురాన్ని పాలించేవారని చెప్పుకున్నారు. వీరి పూర్వుడైన మల్లవర్మ దక్షిణాదికి వచ్చి త్రిలోచన పల్లవునివల్ల అరువేలనాడును బడసినాడట. కాని, వీరిలోని మల్ల, ఎరియ, కొరియ, పిడువర, గండ, పంద అనే పేర్లనుబట్టి వీరు దాక్షిణాత్యులేనని చెప్పవచ్చు. అరువేలనాడులోని అంతర్భాగం వెలనాడనీ, అరువేలనాడు వెలనాడు ఒకటేనని అభిప్రాయాలు ఉన్నాయి. నేటి గుంటూరు జిల్లాలోని బాపట్ల, తెనాలి, రేపల్లె, గుంటూరు తాలూకాల ప్రాంతమే అరువేలనాడు. దీనికి చందోలు - ధనదుపురము, ధనదుప్రోలు, చందవోలు-రాజధాని. ఈ వంశంలోని మొదటి రాజులు తమ పేర్ల చివర వర్మ అనీ, రాజ అనీ ధరించినారు. కులోత్తుంగ రాజేంద్రచోడుడే ఈ వంశంలోని చోడనామధేయాల్లో ప్రథముడు. అయితే, వీరికీ తెలుగుచోడులకూ ఏమాత్రం సంబంధం కన్పించదు. పిఠాపురం శాసనంలో వెలనాటిరాజుల పూర్వీకులలో దుర్జయుడొకడున్నాడు. వెలనాటి రెండో రాజేంద్ర చోడునకు "దుర్జయకులప్రాకార" అనే బిరుదు ఉంది. వెలనాటివారిని గిరి పశ్చిమ ప్రాంతం ఏలిన దుర్జయులకూ వివాహ సంబంధాలున్నాయి. అందుచేత వెలనాటి ప్రభువులు సయితం దుర్జయ వంశానికి చెందినవారై తమ సార్వభౌములైన చాళుక్య - చోళులవట్ల ఉన్న గౌరవం కొలది, ముఖ్యంగా కులోత్తుంగుడు రాజేంద్రుని పుత్రభావంతో ఆదరించిన నాటినుండి చోడ శబ్దాన్ని ధరించి వెలనాటిచోడులని వ్యవహరింపబడినారు.

వెలనాటి చోడులు తూర్పు చాళుక్యుల కొలువులో మంత్రి, సేనాపతి పదవులు నిర్వహించి ప్రసిద్ధులయినారు. అట్టివారిలో ప్రముఖుడు ఎరియ; 'చాళుక్యభీమానుచర ప్రధాన' అని వర్ణించియున్నాడు. చాళుక్య భీముల్లో ఇతడు మొదటివాడు. ఎరియ కుమారుడైన మల్లియ రెండో చాళుక్య భీముని సేవించినట్లు తెలుస్తుంది. రెండో చాళుక్య భీముని అనంతరం చాళుక్యవంశంలో అంతః కలహాలు జరిగి యుద్ధమల్ల, బాడప రెండో తాల రాజుల అధికార్యం బహుశా వెలనాడుకు మాత్రమే పరిమితమైన రోజుల్లో వెలనాటి రాజుల పరిస్థితి ఏమో స్పష్టంగా తెలియదు. మల్లియ కొడుకైన ఎరియ రాజు గుద్రవార విషయాన్ని విష్ణువర్ధనుని నుండి పొందినాడని తెలుస్తున్నది. రెండో తాళరాజుకు విష్ణువర్ధన

బిరుదు ఉందికాని తాలరాజు ఆధిపత్యం గుద్రవార విషయంపై చెల్లిందా అనేది అనుమానం. తాలరాజు తరువాత శక్తివర్మ విష్ణువర్ధన బిరుదం ధరించినాడు. అందుచే శక్తివర్మ ఆపదల్లో ఆతనికి అండగా నుండి గుద్రవార విషయాన్ని ఎరియరాజు పొందివుంటాడు. ఇది నేటి కృష్ణా జిల్లాలోని గుడివాడ ప్రాంతమై వుంటుంది. ఎరియ కుమారుడు కుడియవర్మ విమలాదిత్యుని యుద్ధాలో పాల్గొని గుద్రవార ద్వయాన్ని పొందినాడు. అంటే రెండు గుద్రవారములని అర్థం లేదా గుద్రవారానికి మరొక రాష్ట్రం చేర్చినాడని చెప్పవచ్చు. కుడియవర్మ పౌత్రుడైన నన్నిరాజు రాజరాజనరేంద్రుని సేనాపతి. ఈ విధంగా పదకొండో శతాబ్ది మధ్య కాలానికి వెలనాటి చోడులు చందోలు రాజధానిగా షట్సహస్ర, గుద్రవార విషయపాలకులయినారు.

రాజరాజనరేంద్రుని మరణానంతరం వేంగిలోని అల్లకల్లోలాలలో వెలనాటి చోడులు కులోత్తుంగ రాజేంద్రచోడునికి వెన్నుదండగా నిలిచి ఆతని అభిమానం సంపాదించినారు. వేంగిలో నియుక్తులైన కుమార రాజప్రతినిధులకు బాసటగా ఉంటూ పరిపాలనాభారం వహించినారు. నన్నిరాజు పౌత్రుడైన వేదురుడు వేంగిపై జరిగిన పశ్చిమచాళుక్య - పాండ్య దండయాత్రలో వీరచోడునకు సాయం చేసి రెండేరుల నడిమి విషయము (గౌతమీ - వసిష్ఠల అంతర్వేది)నకు అధిపతి అయినాడు. వెలనాటిచోడుల ఆధిపత్యం గోదావరీముఖద్వారంలో నెలకొన్నది.

**గొంకరాజు :**

వేదురుని తండ్రి అయిన గొంకరాజు వెలనాటివంశానికి మూలపురుషుడు. కుమారరాజ ప్రతినిధి వీరచోడునికాలం నుండి గొంకరాజు సమస్త సేనాపతిత్వం నిర్వహించినాడు. దాక్షారామం శాసనం ఒకదానిలో గొంకరాజు వేంగి రాజ్యం లోని సామంతులందరినీచేర్చి వారిచేత విధేయతాప్రతిజ్ఞ చేయించినట్లు తెలుస్తుంది. బహుశా ఇది రాజరాజ చోడగంగు పాలనాకాలంలో చక్రకూట సోమేశ్వరుని శత్రు చర్యలను ప్రతిఘటించే ఉద్దేశంతో జరిగియుండవచ్చు. గొంకరాజు మహా మండలేశ్వర, చాళుక్యరాజ్య మూలస్తంభ, త్రిశతోత్తర షట్సహస్రావనీనాథ బిరుదులు ధరించినాడు ఇతని శాసనాలనుబట్టి దక్షిణాన గుండ్లకమ్మ వరకు పశ్చిమాన త్రిపురాంతకం వరకు గొంకరాజు సామంతాధికారం చెల్లుబడి అయినట్లు స్పష్టమవుతున్నది. క్రీ.శ. 1108 వరకు గొంకరాజు శాసనాలు కన్పిస్తున్నాయి.

**చోడరాజు :**

గొంకరాజుకు సబ్బాంబిక యందు కలిగిన కుమారునకు కులోత్తుంగ చోడునిపట్ల తనకున్న భక్తి గౌరవాల సూచకంగా చోడరాజని పేరు పెట్టినాడు. గొంకయ మరణానంతరం వేంగిలోని కల్లోలిత రాజకీయ పరిస్థితు లను గుర్తించి కులోత్తుంగచోడుడు చోడరాజును పుత్రభావంతో ఆదరించి ఆతనికి

వెలనాడును రాజలాంఛనాలతో దత్తం చేసినందున కులోత్తుంగ రాజేంద్ర చోడుడని ప్రసిద్ధుడయినాడు. ఈతని కాలంలో తీరాంధ్రంలో అనేక రాజకీయ పరిణామాలు జరిగిసాయి. అందు మొదటివి కళింగ దండయాత్ర. ఇందులో వెలనాటి రాజేంద్రచోడుడు మాండలికులను - కొండపడమటి మన్మండరాజు, కోన పోతరాజు, కోన గొంకరాజులను - కూడగట్టుకొని కళింగయుద్ధంలో విక్రమ చోళ కరుణాకరతొండమాన్‌తో కలసి పోరాడినాడు. కళింగయాత్ర చోళ-చాళుక్య సార్వభౌమాధికారానికి ఘనవిజయం. కాని, అనతికాలంలోనే వేంగిలో చాళుక్య - చోళ సార్వభౌమాధికారానికి గ్రహణం పట్టింది. కులోత్తుంగచోడ సార్వభౌముడు వృద్ధుడయినాడు; పుత్రశోకం కూడ అతణ్ణి కుంగదీసి వుంటుంది; దానికితోడు సింహాసనానికై విక్రమచోడ పరాంతకదేవ రాకుమారుల మధ్యవైరం ప్రబలింది. ఈ పరిస్థితులన్నీ కులోత్తుంగుని ప్రత్యర్థియైన పశ్చిమ చాళుక్య చక్రవర్తి ఆరో విక్రమాదిత్యునకు అనుకూలించినాయి. వేంగినుండి చాళుక్య-చోళులను పారదోలే ఆశయంతో దండనాయక అనంతపాలయ నాయకత్వంలో పెద్ద సైన్యాన్ని వేంగిపైకి పంపినాడు. అనంతపాలయ కొల్లూరు శాసనం ప్రకారం ఈ దాడి క్రీ.శ. 1115 లో జరిగింది. వెలనాటి రాజేంద్రచోడుడు పరాజయం చెందినాడు; అతని కొడుకు గొంకయ బందీగా చిక్కినాడు. వెలనాటిరాజులు పశ్చిమ చాళుక్య సార్వభౌమత్వం అంగీకరించక తప్ప లేదు పశ్చిమ చాళుక్య సైన్యాలు బెజవాడ, కొండపల్లి మొదలైన దుర్గాల నాక్రమించి జననాథపురంపై నడిచినాయి. రాజ ప్రతినిధి పరాంతక చోళుడు యుద్ధంలో మరణించి వుంటాడు. వేంగి రాజ్యం సమస్తం చాళుక్యుల వశమయింది. అనంతపాలయ కొమ్మూరు శాసనం ప్రకారం క్రీ.శ. 1118 లో అతడు వేంగి పదునాల్గువేల దేశాన్ని పాలిస్తున్నాడు. అతనికి సామంతుడుగా గోవిందరాజు కొండపల్లి మున్నూరు రాజ్యపాలన నిర్వహించినాడు. అనంత పాలయకు చింతలూరు భీమరసు ప్రెగ్గడగాను, శాంతినాథుడు సంధి విగ్రహిగాను సహాయపడినారు. వేంగిని ఆక్రమించే సందర్భంలోనే అనంత పాలయ కాంచీపురివరకు దాడిచేసి ఆ పురాన్ని కొల్లగొట్టినట్లు అతని 'కాంచీ కవాటచూరకార' బిరుదం సూచిస్తున్నది. అనంతపాలయ ఉద్యోగియైన ఏచప నాయకునకు 'చోళరాజ్య నిర్మూలన' బిరుదు వుంది. ఆరో విక్రమాదిత్యుని ఆశయం నెరవేరింది. క్రీ.శ. 1115 నుండి 1126 వరకు సమస్తాంధ్ర దేశము అతని సార్వభౌమత్వం శిరసావహించింది.

కులోత్తుంగచోళుడు క్రీ.శ. 1120 లో మరణించి విక్రమచోళుడు (క్రీ.శ. 1120-35) చాళుక్య - చోళసార్వభౌముడయినాడు. వేంగినుండి చాళుక్యులను పారదోలడాని కితడు చేసిన తొలి ప్రయత్నాలు ఫలించలేదు. వేంగిలోని సామంతులు మాత్రం విక్రమచోళుని పట్లనే అభిమానం వహించినారు. ఇంతలో

క్రీ.శ. 1126 లో విక్రమాదిత్యుడు మరణించి భూలోకమల్ల సోమేశ్వరుడు (క్రీ శ. 1126-38) కల్యాణి సింహాసనం అధిష్ఠించినాడు. భూలోకమల్లుడు సింహాసనంపై పదిలపడక పూర్వమే చాళుక్యాధికారాన్ని తుదముట్టించడానికి వేంగిలోని మాండలికులు ప్రయత్నించినారు. వారిలో ప్రథముడు తూర్పు చాళుక్య యుద్ధమల్లుని సంతతివాడైన మల్లభూపతి. పశ్చిమచాళుక్యులను తరిమివేసి కృష్ణానది మొదలు జననాథపురంవరకు ఆక్రమించి సర్వలోకాశ్రయ, విష్ణువర్ధన బిరుదులతో కొంత కాలం పాలించినాడు. ఇదేకాలంలో కళింగాధిపతి అనంతవర్మ చోడగంగదేవుని శాసనాలు దాక్షారామంలో కనిపిస్తున్నాయి. తన శాసనాలలో అనంతవర్మ వేంగిరాజు నుద్ధరించినట్లు చెప్పుకున్నాడు. బహుశా మల్లభూపతి అనంతవర్మ సహాయంతోనే వేంగిని జయించి వుంటాడు. కాని, కృష్ణానదికి దక్షిణంగా ఉన్న వెలనాటి దుర్జయులు, పలనాటి హైహయులు, కొండపడమటి దుర్జయులు అతనితో సహకరించక భూలోకమల్లుని సార్వభౌమత్వం అంగీకరించినారు.

ఈ పరిస్థితి ఎంతో కాలం సాగలేదు. క్రీ. శ. 1132 ప్రాంతంలో విక్రమచోడుడు వేంగిలోని మాండలికుల అభ్యర్థనపై యువరాజు (రెండో) కులోత్తుంగుని నాయకత్వంలో ఒక సైన్యాన్ని వేంగిపైకి పంపినాడు. వెలనాడు, గిరిపశ్చిమ, కోనకంద్రవాటి రాజులందరు ఆ సైన్యంతో చేరినారు. మన్నేరుపై జరిగిన యుద్ధంలో పశ్చిమచాళుక్య సైన్యాలు పరాజయం పొందాయి. కృష్ణానదికి దక్షిణాన పశ్చిమ చాళుక్యాధిపత్యం అస్తమించింది. క్రీ.శ. 1132 నాటి తూబాడు శాసనాలలో వెలనాటి రాజేంద్రుని సేనాని కాపయ 'సిద్ధిబేత విద్రావణ' బిరుదం ధరించినాడు. సిద్ధిబేత అనే పేరు పొత్తపి తెలుగు చోడులలో సర్వసాధారణము. పొత్తపి చోడులలోనివాడైన ఈ సిద్ధిబేతరు పశ్చిమ చాళుక్య సేనానిగా మన్నేరు యుద్ధంలో పాల్గొని యుండవచ్చును. వెలనాటి రెండో గొంకరాజుకు "సిద్ధిబేత చీడ్పులిహరిణ మృగేంద్ర" బిరుదం ఉంది. చీడ్పులినాడు నెల్లూరు మండలంలోనిది. ఆ ప్రాంత ప్రభువుని చీడ్పులి అని వ్యవహరించి వుండవచ్చు. ఈ బిరుదులను బట్టి మన్నేరు యుద్ధం క్రీ. శ. 1132 ప్రాంతంలో జరిగిందని నిర్ణయించవచ్చు.

ఈ యుద్ధానికి ఇంచుక అనంతరం వెలనాటి రాజేంద్రచోడుడు మరణించి, గొంకరాజు వెలనాటి మహామండలేశ్వరుడయినాడు.

**రెండో గొంకరాజు :**

రెండో గొంకరాజు (క్రీ. శ. 1132-1161) వెలనాటి రాజులలో అగ్ర గణ్యుడు. తండ్రి కాలంలోనే అనేక యుద్ధాల్లో పాల్గొని విజయాలు సాధించిన వాడు. అతనికి మంత్రాంగంలోను యుద్ధ నిర్వహణలోను ఆరితేరిన నంబూరు గోవిందమంత్రి ప్రధాని.

రెండో గోంకయ ప్రథమ ఆశయం పశ్చిమ చాళుక్యులను వేంగినుండి పూర్తిగా పారదోలడం. అందుచే మన్నేరు యుద్ధానంతరం రెండో కులోత్తుంగుని నాయకత్వంలో అతడు వేంగిపై నడిచినాడు నాడు గోవింద దండనాయకుని సాయంతో దండనాయక లకణరాజు వేంగిని పాలిస్తున్నాడు. ఉభయపక్షాలకు గోదావరీ తీరంలో ఘోర సంగ్రామం జరిగింది. పశ్చిమ చాళుక్య సైన్యాలు ఓడి పారిపోయినాయి. వారి ఘోటక ఘోట కోష్ఠ నివహాలను చాళుక్యచోళులు కొల్లగొట్టినారు. ఈ యుద్ధం క్రి. శ. 1135 లో జరిగిందని శాసనాధారాలతో నిర్ణయిస్తున్నారు. గోదావరీ యుద్ధంతో వేంగి రాజ్యంలో పశ్చిమ చాళుక్యాధికారం అస్తమించింది.

గోదావరి యుద్ధానంతరం అనతికాలానికే విక్రమచోళుడు గతించి రెండో కులోత్తుంగుడు (క్రి. శ. 1135-45) సార్వభౌముడయినాడు. అతని దృష్టి అంతా దాక్షిణాత్య రాజకీయాల్లోనే లగ్నమయింది. అందుచేత గొంకయ సామర్థ్యం గుర్తించి అతణ్ణి సామంతలక్షణాలతో మహేంద్రగిరి శ్రీశైల మధ్యస్థ దేశానికి అధిపతిగా చేసినాడు. నాటినుండి చాళుక్య - చోళ సార్వభౌములు ఆంధ్ర రాజకీయాల్లో జోక్యం కలిగించుకోలేదనే చెప్పవచ్చు. రెండో కులోత్తుంగుని ఆనంతరం రెండో రాజరాజచోళుడు (క్రి.శ. 1145-75) సార్వభౌముడయినాడు. గొంకరాజు చాళుక్య - చోళ సార్వభౌములయందు విశ్వాసంతోనే ఆంధ్రదేశాన్ని పాలించినాడు.

అయితే చాళుక్య-చోళ సార్వభౌములు గొంకయకు సర్వాధికారం దత్తం చేయడం తీరాంధ్రంలోని ఇతర మాండలికులు సహించలేకపోయినారు. వారిలో కొందరు ఇటీవలివరకు పశ్చిమ చాళుక్య సార్వభౌమత్వం అంగీకరించినవారు. అట్టివారందరూ వెలనాటి ఆధిపత్యాన్ని ధిక్కరించి స్వతంత్రించడానికి ప్రయత్నించినారు. అందుచేత గొంకయ కాలమంతా ఎడతెగని యుద్ధాలతో నిండిపోయింది.

**కొణిదెన చోడులు :**

మొదట్లో గొంకయ పొరుగున ఉన్న కొణిదెన (కొట్యదొన) తెలుగు చోడులపై దృష్టి మరల్చినాడు. కొణిదెన చోడులు రేనాటి చోడులశాఖగా చెప్పవచ్చు. కొణిదెన ప్రాంతంలో వీరు క్రి.శ. 10 వ శతాబ్దినుండి కన్పిస్తున్నారు. వీరిలో కన్నరచోడ, కామచోడులు ఆద్యులు. కామచోడునికొడుకు త్రిభువనమల్ల చోడమహారాజు గొంకయ సమకాలికుడు; ఈతడు కమ్మనాడు, గుండికర్తి (గుండ్లకమ్మకు ఉభయ పార్శ్వముల ప్రాంతము) మోటాటి (కర్నూలు జిల్లా తూర్పు ప్రాంతము) భూములను ఏలుచుండేవాడు. మల్లచోడ, గొంకయలు ఉభయులు కలిసి కొణిదెనలోని శ్రీబల్లీశ్వర మహాదేవరకు దానం చేసినారు.

(క్రీ.శ.1147). దీన్నిబట్టి త్రిభువన మల్లుచోడుడు గొంకయకు వశవర్తి అయినట్లు స్పష్టము. కానీ త్రిభువనమల్లుని కొడుకులు నన్నిచోడ, కన్నరదేవులు గొంకని ధిక్కరించి స్వతంత్రులయినారు. కాని, కంచెర్వులకోట (వినుకొండ తాలూకా పెదకంచెర్ల) యుద్ధంలో ఓడి, వెలనాటి సామంతులయినారు. ఈ యుద్ధంలో ప్రముఖ పాత్ర వహించిన అయ్యవంశస్థుడైన జిల్లబోయని దండనాథునిగాను, అతని అన్న నారపను (తలగడ) దీనికి అధిపతిగాను గొంకయ నియమించినాడు.

**నెల్లూరు చోడులు :**

కమ్మనాడు జయించిన అనంతరం బహుశా క్రీ.శ. 1150 ప్రాంతంలోనే వెలనాటి సైన్యాలు నెల్లూరు తెలుగుచోడుల పాలనలో ఉన్న పాకనాడుపై దండెత్తినాయి. ఈ సైన్యాలను ఈవనికంద్రవాటి కంట భూపతి. కోట భీమరాజు, రాచూరి దారపరాజు, నడిపినారు. కంట భూపతి "నెల్లూరి సిద్ధిక్ష్మాపకీక్షణకుంభ ప్రోన్ముక్తమౌక్తిక విరాజిత వీరభూమి" నెల్లూరును నాడు నల్లసిద్ధిరాజు పాలిస్తున్నాడు. తెలుగుచోడులు పూర్తిగా ఓడిపోయినట్లు తెలుస్తున్నది. రాచూరి దారపు రాజు 'సిద్ధిచోడమస్తకశూల' మొదలైన బిరుదులు ధరించినాడు. పాకనాడులో వెలనాటి దుర్జయుల అధికారం నెలకొన్నది.

**సారోనాథులు :**

సారసీపురం రాజధానిగా ఈ మాండలిక రాజ్యం రెండో అమ్మరాజు కాలంలో ఏర్పడింది. అతని కాలంలో నృపకాముడు ఈ ప్రాంతాన్ని పాలించేవాడు. సారసీపురాన్ని నేటి ఏలూరుగా గుర్తిస్తారు. కొల్లేరులోని కొలనివీడు వీరికి బలిష్టమైన స్థావరం. కొలని మాండలికులరాజ్యం నేటి ఏలూరు తణుకు, అత్తిలి, భీమవరం తాలూకాలకు విస్తరించింది. క్రీ. శ. 1125 - 32 సం॥ల మధ్యకాలంలో ఒక్కెత్తుగంధ రాజేంద్రచోడు దీరాజ్యం ఏలినాడు. పేరునుబట్టి ఈతడు చాళుక్య - చోళ సామంతుడని తెలుస్తుంది. గాని పశ్చిమచాళుక్య సార్వభౌమత్వం అంగీకరింపక ఇతనికి తప్పలేదు. గోదావరీ యుద్ధంలో ఈతడు మరణించియుండవచ్చు. క్రీ.శ. 1140-51 మధ్య కాలంలో కాటమ నాయకుని శాసనా లీప్రాంతంలో కన్పిస్తున్నాయి. ఇతనికి ఒక్కెత్తు గండనికిగల సంబంధం తెలియదు. కాటమ నాయకుడు స్థానిక చాళుక్య రాజులను జయించి తనరాజ్యం విస్తరింపజేసుకున్నాడు: కాని చాళుక్య - చోళసార్వభౌమత్వాన్ని, గొంకని అధిపత్యాన్ని అంగీకరించినాడు.

**కోన హైహయులు :**

ఆంధ్రదేశంలో కోన, పలనాడు పంచధార్ల ప్రాంతాల్లో హైహయులు మాండలికులుగా వుండేవారు. వీరందరిలో కోన, పలనాటి హైహయులు ముఖ్యత

యుగ ఆంధ్రుల చరిత్రలో చెప్పుకోదగిన పాత్రను నిర్వహించినారు. కోన హైహయులకు కీర్తిరాజు మూలపురుషుడు. క్రీ.శ. 1073 నాటి ఈతని శాసనం దాక్షారామంలో వుంది. క్రీ శ. 1072 లో వేంగిరాజ్యంపై దండెత్తిన చేదిరాజు యశఃకర్ణదేవునితో కీర్తిరాజు వచ్చినాడని కొందరి అభిప్రాయం. వేంగిలో స్థిరపడిన కీర్తిరాజు కులోత్తుంగునిద్వారా కోనమండల ఆధిపత్యం సంపాదించి వుంటాడు. రాకదురు బహుశా అతని రాజధాని. కీర్తిరాజు అనంతరం కోనమండలికుడైన ముమ్మడి భీమరాజు కులోత్తుంగుని నుండి సామంత మండలాధిపత్యం పొందినప్పటికి దాక్షారామశాసనాన్ని (క్రీ.శ. 1082) బట్టి అతడు చాళుక్య సార్వభౌమత్వం అంగీకరించినాడు. భీముని అనంతరం రాజపరేడు, రాజేంద్రచోడుడు కోనమండలం ఏలినారు. రాజేంద్రచోడుని తరువాత (క్రీ. శ. 1135) అతని సోదరులు రెండో ముమ్మడిభీముడు, సత్యరాజు అధిపతులయినారు. నాటినుండి కోన హైహయులలో ద్వైరాజవిధానం (dual kingship) అమలు జరిగింది. వీరి తరువాత భీమరాజుకొడుకు లోకభూపల్లభుడు, సత్యరాజు తనయుడు భీమరాజు ఉమ్మడిగా ఏలినారు. లోకరాజులో రాజ్య విస్తరణ కాంక్ష ఎక్కువ. పొరుగున ఉన్న చాళుక్యరాజులను జయించడంతో తృప్తిచెందక లోకరాజు వెలనాటిపై దండెత్తి బాపట్లవరకు నడిచినాడు (క్రీ.శ.1150) కాని వెలనాటి రెండో గొంకసేనాని ప్రోలయనాయకుడు లోకరాజును వధించడమేగాక కోనమండలిపై దండెత్తి హైహయులను సామంతులుగా చేసినాడు.

**పలనాటి హైహయులు :**

పలనాటి హైహయులకు గురజాల రాజధాని. వీరి మూలపురుషుడు బేతరాజు (క్రీ శ. 1103). ఈతనికి హైహయరాష్ట్ర ప్రతిష్ఠాచార్య, శనివారసిద్ధి అనే బిరుదులున్నాయి. బహుశా చాళుక్య చక్రవర్తి ఆరో విక్రమాదిత్యునితో వచ్చి పలనాడులో స్థిరపడి వుంటాడు. పశ్చిమ చాళుక్యులకు వేంగిపై దాడులకు పలనాడు అనువుగా వుండేది. బేతరాజు కుమారుడు పీరకాముడు (క్రీ.శ. 1118). అతని తరువాతి రాజులు వేంగి దండయాత్రల్లో చాళుక్యులతో సహకరించినట్లు కనిపిస్తుంది. అనుగురాజు కాలానికి (క్రీ.శ. 1134-40 ప్రాంతము) పరిస్థితులు మారినాయి. పశ్చిమ చాళుక్యులు పరాజయంపొంది వేంగినుండి నిర్గమించినారు. అందుచే రెండో గొంకరాజుతో అనుగురాజు పొత్తు కుదుర్చుకున్నాడు, గొంకని కూతురు మైలమను అనుగురాజు వివాహమాడి వెలనాటి సామంతుడయినాడు. అయితే, అనుగురాజును విశ్వసించక గొంకయ తన ప్రతినిధిగా దొడ్డనాయని గురజాలలో నిలిపినాడు. అనుగురాజు - మైలమల కుమారుడు నలగాముడు క్రీ శ. 1147 ప్రాంతంలో గురజాల మాండలికుడయినాడు.

**కాకతీయులు, చాళుక్యులు :**

నకరం (ముఖలింగం) మొదలు నెల్లూరు వరకు తీరాంధ్రంలో అప్రతిహతంగా సాగిన రెండో గొంకయ సామంతాధిపత్యాన్ని విచ్ఛిన్నం చేయడానికి కాకతీయులు తూర్పుచాళుక్యవంశ శాఖలవారు ప్రయత్నించినారు. చాళుక్యులకు సాయంగా క్రీ.శ. 1157 ప్రాంతంలో అనుమకొండ నేలుచున్న రెండో ప్రోలరాజు వెలనాటిపై దండెత్తినాడు. వెలనాటి యువరాజు వీర రాజేంద్రుడు కోట చోడరాజు సాయంతో ప్రోలుని వధించి కాకతీయ సైన్యాలను తరిమివేసినాడు. ఈ ఉభయులకు 'కాకతిప్రోల నిర్దహన' అనే బిరుదం ఉంది.

పూర్వ చాళుక్య వంశశాఖీయులు పిఠాపురం కేంద్రంగా చేసుకొని చిన్న రాజ్యం స్థాపించి స్వతంత్రించడానికి ప్రయత్నించినారు. వీరికి పొరుగున ఉన్న హైహయాదుల ప్రోత్సాహం లభించింది. పిఠాపురం చాళుక్యుల్లో మూడో విజయాదిత్యుడు ప్రముఖుడు ఈతడు మార్జవాడినేలుతున్న పులకేశి కూతురును పెండ్లాడి, అతని సహాయంతో క్రీ. శ. 1158 లో స్వతంత్రించినాడు. క్రీ. శ. 1157 నుండి రెండో గొంకని శాసనాలు దాక్షారామంలో కన్పించవు. అంతేగాక, క్రీ.శ. 1158 నాటిదే కాకతిరుద్రుని ప్రెగ్గడ బ్రహ్మరెడ్డి శాసనం దాక్షారామంలో ఉంది. కాబట్టి పిఠాపుర చాళుక్యులకు కాకతీయుల సహాయంకూడ లభించినదని చెప్పవచ్చును. ఇట్టి పరిస్థితులలో గొంకయ క్రీ శ. 1161 లో మరణించి, రెండో రాజేంద్రచోడుడు వెలనాటి అధిపతి అయినాడు.

**రెండో రాజేంద్రచోడుడు :**

రెండో రాజేంద్రచోడుని కాలంలో (క్రీ శ. 1161-81) వెలనాటిరాజ్యం అత్యున్నత స్థితి ననుభవించింది. నాటి చాళుక్య-చోళ సార్వభౌముడు రెండో రాజాధిరాజు (క్రీ.శ. 1163-79) దుర్బలుడు. దానికితోడు చాళుక్య - చోళ వంశంలో కలతలు చెలరేగినాయి అందుచే అతని దృష్టి అంతా దక్షిణాత్యపరిణామాలకే పరిమితమైంది. ఇది అవకాశంగా గ్రహించి రాజేంద్రచోడుడు సార్వభౌములకు కప్పం చెల్లించడం విరమించి వెలనాటిరాజ్యానికి స్వతంత్ర ప్రతిపత్తిని చేకూర్చినాడు. రాజేంద్రుని మంత్రి నందూరి కొమ్మన్న శ్రీకూర్మం, ఎలమంచిలి, కొట్యదొన, త్రిపురాంతకం మొదలుగా ముప్పైరెండు పట్టణాలలో విష్ణుప్రతిష్ఠ లొనర్చినట్లు శాసనాలు చెబుతున్నాయి. అందుచే రాజేంద్రుని రాజ్యంలో ఆంధ్రదేశంలో అధికభాగం చేరిందని స్పష్టమవుతున్నది.

సింహాసనం ఎక్కిన వెంటనే రాజేంద్రుడు వెలనాటిపై తిరుగుబాటు చేసిన మాండలికులపై దృష్టిమరల్చినాడు. పిఠాపురం చాళుక్యులు ఆదర్శంగా కొలని మాండలికులు, కోన హైహయులు స్వతంత్రించినారు. దుర్భేద్యమైన కొలనివీడు స్థావరంగా చేసుకొని భీముడు విజృంభించినాడు. ఇతనికి కొలని కాటమ

నాయకునికి ఉన్న సంబంధం తెలియదు, భీముని దుష్టుడని, నీచుడని శాసనాలు వర్ణిస్తున్నాయి. అమృతలూరిదేవన ప్రెగ్గడసాయంతో రాజేంద్రుడు ఈ రాజ్యాలపై దండెత్తినాడు. పిఠాపుర చాళుక్యులు ఓడి సామంతులయినారు. సమూలంగా భీముని నిర్మూలనం జరిగింది. ఈ సమయంలోనే కోన హైహయులు వెలనాటిపై దండెత్తినారు దేవన ప్రెగ్గడ వారిని త్రిపురాంతకం దగ్గిర యుద్ధంలో ఓడించినాడు. హైహయనాయకులు చాలమంది నిహతులైనారు; యుద్ధానంతరం కోన మండలంపై నడచి ఆ రాజ్యాన్ని దగ్ధం చేసినాడు. కోన మల్లిదేవుడు రాజేంద్రుని సామంతుడయినాడు. కోన దండయాత్ర సందర్భంలోనే ప్రోలుని సేనాని పిఠాపురాది చాళుక్య రాజ్యాలను లోబరచుకొన్నాడు. దక్షిణ కళింగలో వెలనాటి అధికారం గౌరవింపబడింది.

ఈ సమయంలోనే కర్ణాటకంలో ముఖ్యమైన రాజకీయ విప్లవం జరిగింది. చాళుక్య చక్రవర్తి భూలోకమల్లుని కొడుకైన తైలపుని తొలగించి కలచురి బిజ్జలుడు అధికారం హస్తగతం చేసుకుని (క్రి.శ. 1150) స్వతంత్రంగా పాలించసాగినాడు. పశ్చిమ చాళుక్యులవలెనే కాలచుర్యులు నెల్లూరు తెలుగుచోడులకు మిత్రులు; వెలనాటి వారికి శత్రువులు. పాకనాడులో వెలనాటి అధికారం తుదముట్టించి తెలుగుచోడుల నుద్ధరించడానికి సంకల్పించినారు. బిజ్జలుని కుమారుడైన సోమేశ్వరుడు క్రి.శ. 1179లో చౌండరాయ, పొమ్మన ముప్పచోడాది సేనాపతుల నాయకత్వంలో ఒక సైన్యాన్ని పాకనాటిపైకి పంపినాడు. వెలనాటి రాజేంద్రుని ప్రతినిధిగా పాకనాటిని నందూరి కొమ్మన ఏలుతున్నాడు. ఉభయ పక్షాలకు కొచ్చెర్లకోట (ప్రకాశం జిల్లా దర్శి తాలూకా) దగ్గిర ఘోర సంగ్రామం జరిగింది. కొమ్మనమంత్రి కటక సామంతులను ఓడించి పారదోలినాడు. తిరోగమిస్తున్న కర్ణాటసేనలను వెన్నంటి వెలనాటి సేనలు మార్జవాడిలో ప్రవేశించి దగ్ధం చేసినాయి. కోట చోడరాజుకు మార్జవాడిదవదావానల బిరుదం ఉంది. రాచూరు దారపరాజు 'చౌణ్డరాయచాణూరమురాంతక', 'పొమ్మన దండనాయక కులచ్ఛేదక' అనే బిరుదులు ధరించినాడు. శ్రీశైల ప్రాంతం వెలనాటి రాజ్యంలో చేరింది. "పూర్వాంబోనిధికాళహస్తి శిఖర శ్రీమన్మహేంద్రాచల శ్రీశైలర్వలయీకృతాంధ్ర" మండలాన్ని రాజేంద్రచోడుడు పరిపాలించినాడు.

**వలనాటియుద్ధం- క్రి.శ. 1176-1182 :**

రాజేంద్రుని కాలంలో వెలనాటిరాజులు ఉచ్ఛస్థితికి వచ్చినారు. కాని, వారి అధికారభానుడు పశ్చిమాభిముఖుడైనాడు. అందుకు మొదటి కారణం పలనాటి యుద్ధమని చెప్పవచ్చు. ఇది వెలనాటి దుర్జయుల సామంతులు బంధువులునైన పలనాటి హైహయులలో జరిగిన కుటుంబ కలహం. దీనికి శాసనాధారంలేదు మహాకవి శ్రీనాథ విరచితంగా అంగీకరిస్తున్న పల్నాటి వీరచరిత్ర అనే ద్విపద

కావ్యమే ఆధారం. జనశ్రుతి ఆధారంగా ఇటీవల ములుగు వీరభద్రకవి (బహుశా 19వ శతాబ్ది) 'పలనాటి వీరభాగవతం' అనే పద్య కావ్యం రచించినాడు. వీనిలో చారిత్రకాంశాలు కట్టుకథలు కలగాపులగంగా ఉన్నందున ఎంతో శ్రద్ధగా పరిశీలిస్తేగాని రుజుచారిత్రకాంశాలు బయల్పడవు. వీని ననుసరించి అనుగురాజుకు మైలమదేవియందు నలగాముడు, ఇతర భార్యలయందు మలిదేవాదులు జన్మించినారు. వెలనాటి ప్రభుత్వ ప్రతినిధులుగా గురజాల వెళ్ళిన దొడ్డనాయుడు, అతని కొడుకు బ్రహ్మనాయుడు స్థానిక ప్రజలపై అత్యాచారాలు జరపడమేగాక అనుగురాజు పట్ల సయితం అవిధేయులయినారు. వారిని ప్రతిఘటించడానికై రెడ్డి నాగమ్మ స్థానిక ప్రజల నాయకురాలై, అనుగురాజుకు అనంతరం రాజైన నలగామరాజుకు మంత్రిణి అయింది. ఇది సహింపని బ్రహ్మనాయుడు మలిదేవాదులను రెచ్చగొట్టి పలనాటి రాజ్య విభజనకు కారకుడయినాడు. బ్రహ్మనాయుడు మంత్రిగా మలిదేవుడు మాచర్ల యేలసాగినాడు. మాచర్లలో గురజాల, చందోలు ప్రభుత్వాలకు విరుద్ధచర్యలు మితిమీరినాయి. చందోలు శత్రువులైన కాలచుర్యల రాకుమారితో మలిదేవుని పెండ్లి జరిపి బ్రహ్మన్న వారి సహాయం సంపాదించినాడు. వీరవైష్ణవం ఇచ్చి పంచములలో చైతన్యం కలిగించి వారిని చేరదీసినాడు. హైహయ వంశాన్ని రూపుమాపి తన వంశాన్ని నెలకొల్పడమే బ్రహ్మనాయని ఆశయం అనే సూచన స్థానిక చరిత్రల్లో కన్పిస్తుంది. ఇది గ్రహించి నాగమ గురజాల, మాచర్లల సమైక్యానికి ప్రయత్నించింది. ఉభయుల మధ్య క్రమంగా శత్రుత్వం బలబడి కారెంపూడి దగ్గర ఘోర యుద్ధం జరిగింది. కాకతీయులు, హోయసాలులు, వెలనాటి సామంతులైన కోటరాజులు నలగామునిపక్షం వహించినారు. మలిదేవునకు కాలచుర్యల సహాయం మాత్రం లభించింది. యుద్ధంలో నలగాముని పక్షానికే విజయం లభించింది. కానీ, ఈ యుద్ధంవల్ల వెలనాటి రాజ్య దౌర్బల్యం విదితమయింది. వెలనాటి సామంతులకు అపారమైన ధననష్టం, సైనిక నష్టం కలిగింది. పొరుగు విరోధుల దాటిని తట్టుకోలేనిస్థితి ఏర్పడింది.

బహుశా కారెంపూడి యుద్ధాంతంలోనే సంకర్షణ దేవుని సేనాని కాణవ దండ నాయకుని నాయకత్వంలో కాలచుర్యల సైన్యాలు వెలనాడుపై దండెత్తినాయి. క్రీ.శ. 1180 నాటి కలచురి శాసనాలలో కాణవయ్యను వెలనాటిచోళియ రాజ్య నిర్మూలన, వెలనాటిచోళియ నిర్మూలన అని పేర్కొన్నారు. అదే సమయంలో వేంగి ప్రాంతంలోని చాళుక్యుల సహాయార్థం కాకతిరుద్రుడు సైన్యాలను నడిపినట్లు దాక్షారామ శాసనం సూచిస్తున్నది. ఈ విధంగా పలనాటి యుద్ధంతో శత్రుదాడులతో వెలనాటి రాజ్యం సంక్షుభితమవుతున్న సమయంలోనే రెండో రాజేంద్రచోడుడు మరణించి, అతని కొడుకు మూడో గొంకరాజు సింహాసనం ఎక్కినాడు.

పాల్కురికి సోమనాథుని పండితారాధ్య చరిత్రలోని అంశాలనుబట్టి రెండో రాజేంద్రచోడుడు అతని బావమరిది కొండపడమటి బుద్ధరాజు మల్లికార్జున పండితుని హింసించినందున పండితుడు కోపించి చందోలు నాశనమగునట్లు శపించినట్లు తెలుస్తున్నది. కాలచర్య కాకతీయ దాడుల రూపంలో శాపం ఫలించి చందోలు ధ్వంసమై వెలనాటి రాజ్య ప్రతిష్ఠ అంతరించిందింది.

**మూడో గొంకరాజు :**

మూడో గొంకరాజు శాసనాలు లభించనందున అతడు సింహాసనం ఎక్కి వరిపాలించాడా అనే సందేహం వుంది. చందోలు ధ్వంసమైనందున పిఠాపురానికేగి అచటి నుండి పాలించినాడని మరియొక అభిప్రాయం. కాని, పిఠాపురం ప్రాంతంలోని చాళుక్య శాసనాల వల్ల ఆ ప్రాంతంలో చాళుక్యులు స్వతంత్రులైయున్నట్లు తెలుస్తున్నది. ఏమైనా అతని స్వల్పపాలనాకాలంలో (క్రీ.శ 1181 - 1186) వెలనాడు రాజ్యం మరింత క్షీణించింది.

పల్నాటి యుద్ధానంతరం అనతికాలానికే కాకతిరుద్రుడు కోట రాజవంశం పాలిస్తున్న ధరణికోటరాజ్యంపై దండెత్తినాడు కోటవంశస్థులు చతుర్ధాన్వయులు; ధనంజయ గోత్రులు; హారిసీమకృష్ణుని సంతతివారమని చెప్పుకున్నారు. ఈ కృష్ణుడు ఎక్కడివాడో ఎప్పటివాడో చెప్పడం సాధ్యంకాదు. వీరు కన్నడ దేశంనుంచి వచ్చినారని ఒక సూచన. దరణికోట కేంద్రంగా కోటవారు పదకొండో శతాబ్ది మధ్య నుండి పాలిస్తున్నట్లు కన్పిస్తుంది. వెలనాటి దుర్జయుల సామంతులై వారి రాజ్యానికి అండగా వుండేవారు. వీరిలో ముమ్మడి భీముడు కులోత్తుంగుని కళింగ దండయాత్రలో పాల్గొన్నాడు అతని పౌత్రుడు కేతరాజు (క్రీ.శ. 1153). కేతరాజు కొడుకు దొడ్డభీముడు చాల సుప్రసిద్ధుడు. వెలనాటి రెండో గొంకరాజు సోదరి సుబ్బాంబికను వివాహమాడినాడు. ఈతని కొడుకు రెండో కేతరాజు వలనాటియుద్ధంలో నలగాముని పక్షాన పోరినాడు. కాకతీయులతోడి యుద్ధంలో దొడ్డభీముడు నిహతుడైనాడు. కాకతీయుల సామంతులైన కొమరవెల్లివారికి 'దొడ్డభీమదేవ శిరచ్ఛేదక' బిరుదం ఉంది. కేతరాజు కాకతీయులకు విశ్వాసపాత్రుడైన సామంతుడై ధరణికోటకు రాజైనాడు.

అనంతరం కాకతీయ సైన్యాలు కొండపడమటి రాజ్యాన్ని ఆక్రమించినాయి. కొండపడమటి రాజులు చతుర్ధాన్వయులు; దుర్జయులు. వీరి రాజధాని నాదెండ్ల (గుంటూరుజిల్లా). వీరి మూలపురుషుడైన బుద్ధవర్మ కుబ్జవిష్ణువర్ధనుని నుండి ఒంగేరు మార్గత్రయాన్ని పొందినట్లు శాసనాలు తెలుపుతున్నాయి. ఈ ప్రాంతం కొండపడమటి రాజ్యాంతర్భాగమై వుండవచ్చు. వీరు కూడ వెలనాటిరాజుల సామంతులై మంత్రి సేనాపతి ఉద్యోగాలు నిర్వహిస్తూండేవారు. వీరిలో మందరాజు కూతురు అక్కమ వెలనాటి రెండో రాజేంద్రచోడుని భార్య.

వీరి కుమారుడే గొంకరాజు అక్కమ సోదరుడు బుద్ధరాజు వెలనాటి ఆస్థాన వ్యవహారాలు నిర్వహిస్తున్నట్లు తెలుస్తుంది. కొండపడమటివంశం బుద్ధరాజుతో అంతరించినట్లు చెప్పవచ్చు. కోటదొడ్డ భీమరాజు బంధువైన ధాచూరి దారవరాజు 'బుద్ధకులకుద్దాల' బిరుదం ధరించినాడు. కోటవంశస్థులకు విప్పర్లవారికి కూడ ఇటువంటి బిరుదే ఉంది విప్పర్లవారు కాకతీయసామంతులు. బహుశా కోటరాజ్యం కాకతీయుల వశమైన తరువాత వీరందరూ నాదెండ్లపై దండెత్తి కొండపడమటి వంశాన్ని రూపుమాపి ఉంటారు.

ఈ విజయాలతో కాకతీయ రాజ్యం త్రిపురాంతక శ్రీశైలాల వరకు విస్తరించింది పాకనాటి చోడులు విజృంభించి కమ్మనాడులోనికి చొచ్చుకురాసాగినారు. ఇట్టి పరిస్థితుల్లో మూడో గొంకని కొడుకు పృథ్వీశ్వరుడు వెలనాటి సింహాసనం అధిష్టించినాడు.

**పృథ్వీశ్వరుడు :**

పృథ్వీశ్వరుడు (క్రీ శ 1186 - 1207) వెలనాటి రాజులలో చివరివాడని చెప్పవచ్చు. ఈతడు ఎక్కడ, ఎప్పుడు సింహాసనం ఎక్కినాడో చెప్పలేము. ఈతని మొదటి శాసనం క్రీ. శ 1186 నాటిది పిఠాపురంలో ఉంది. కొఅవి వెన్నయామాత్యుడీతని ప్రధాని. కేయూరబాహుచరిత్రననుసరించి నండూరి కేతన మరొక మంత్రియని తెలుస్తున్నది. వీరి సహాయంతో పృథ్వీశ్వరుడు వెలనాటి రాజ్య ప్రతిష్ఠను పునరుద్ధరించడానికి విఫలప్రయత్నం చేసినాడు.

పృథ్వీశ్వరుడు మొదట వేంగి ప్రాంతాన్ని బహుశ మల్లపదేవుల నుండి ఆక్రమించి పిఠాపురం రాజధానిగా పాలింపసాగినాడనడానికి అతని పిఠాపుర శాసనమే నిదర్శనం. అనంతరం అతడు దక్షిణ కళింగను గంగచక్రవర్తి రెండో రాజరాజు (అనంతవర్మ చోడగంగు మూడో కొడుకు) నుండి ఆక్రమించినట్లు తెలుస్తుంది. వెన్నయామాత్యునకు కళింగనిర్ధూమధామ, వీరఘొట్టవిభాళ అనే బిరుదులున్నాయి. వీరఘొట్టం కళింగ దేశాంతర్భాగము. శ్రీకూర్మంలో పృథ్వీశ్వరుని శాసనం ఉంది. దక్షిణ కళింగ తిరిగి వెలనాటి రాజ్యంలో చేరింది.

వెన్నయామాత్యునకు 'సనదవోలిపురవరాధీశ్వర పృథ్వీశ్వరరాజ్యసముద్ధరణ' అనే బిరుదు సింహాసనద్వాత్రింశత్సాలభంజికలో కన్పిస్తుంది. అదేకావ్యంలో "నెగడె సనదవోలు నెలవుగా' అనేవాక్యం ఉంది. దీన్నిబట్టి పృథ్వీశ్వరుడు వెలనాడును తిరిగి ఆక్రమించినాడనేది స్పష్టం. కోన మాండలికులు,నతవాడి,కోట, అయ్య వంశాలవారాతనికి తిరిగి సామంతులయినారు. ఇది బహుశా క్రీ.శ. 1196-1200 సంవత్సరాల మధ్య కాలంలో జరిగివుంటుంది. క్రీ.శ. 1196 నాటికి కాకతి

రుద్రుడు గతించి కాకతీయరాజ్యం ఇంచుమించు అరాజకమయింది. అది పృథ్వీశ్వరునకు అనుకూలించినది.

పృథ్వీశ్వరుడు ఎంతోకాలం చందోలులో రాజ్యంచేయలేదు. క్రీ.శ. 1201 లోనే గణపతిదేవుని వెలనాటి దండయాత్ర ప్రారంభమయింది. కాకతీయ సేనాని ముత్యాల చౌండరాయుడు దివిసీమ నాక్రమించి చందోలుపై దండెత్తినాడు. పృథ్వీశ్వరుడు కళింగకు పారిపోయినాడు. తిరిగి క్రీ.శ. 1206-7 ప్రాంతంలో పృథ్వీశ్వరుడు వెలనాడు నాక్రమించడమేగాక నెల్లూరు తెలుగు చోడరాజ్యంపై దండెత్తినట్లు కన్పిస్తుంది. ఈ దండయాత్ర బహుశా రాజ్యభ్రష్టుడైన చాళుక్య-చోళ చక్రవర్తి రెండో రాజాధిరాజు సహాయార్థమై వుంటుంది. కాని, తెలుగుచోడులు, కాకతీయులు కలిసి పృథ్వీశ్వరుణ్ణి ఓడించి వధించినారు. చోడతిక్కన, గణపతి దేవుడు పృథ్వీశ్వరశిరఃకందుక క్రీడావినోదులమని చెప్పుకున్నారు.

**వెలనాటి వంశ అస్తమయం :**

పృథ్వీశ్వరునితో వెలనాటి వంశం అస్తమించలేదు. క్రీ.శ. 1230-50 మధ్యకాలంలో మూడో కులోత్తుంగ రాజేంద్రచోడుడు వెలనాటి ప్రతిష్ఠను పునరుద్ధరించడానికి అనేక విధాల కృషి చేసినాడు.

గురుములూరు యుద్ధంలో తప్పించుకొని రెండో రాజరాజు వేంగికి పారిపోయి క్రీ.శ. 1212 వరకు పాలించినాడు. అతని అనంతరం త్రిభువన చక్రవర్తి మూడో రాజాధిరాజు ఎనభయి సంవత్సరాలు పాలించినట్లు శాసనాలు సూచిస్తున్నాయి ఈ రాజాధిరాజును కూడగట్టుకుని మూడో కులోత్తుంగ రాజేంద్ర చోడుడు కాంచీపురిపై దండెత్తినాడుగాని, చోడతిక్కన వీరిని ఓడించి మరలించినాడు. మూడోకులోత్తుంగ రాజేంద్రచోడునకు ఏరువమన్నీలుకూడ సాయపడినారు. కర్నూలుజిల్లాలోని త్రిపురాంతకప్రాంతమే ఏరువ రాజ్యం. దీన్ని తెలుగుచోడులు పాలించేవారు.

ప్రథమప్రయత్నాలు విఫలంకావడంతో మూడో కులోత్తుంగ రాజేంద్ర చోడుడు కళింగనేలుతున్న అనియంకభీముని (శ్రీమదనంతవర్మ రాహుత్తదేవుడు) సహాయం అర్థించినట్లు కన్పిస్తుంది. ఈలోగా చోళమండలంలోకూడ పరిస్థితులు అస్తవ్యస్తమయినాయి. చాళుక్య చోళాధికారం నిరసించి పాండ్యులు విజృంభించినారు. క్రీ.శ 1218 ప్రాంతంలో మూడో కులోత్తుంగుడు మరణించి అతని కుమారుడు మూడో రాజరాజు సార్వభౌముడయినాడు. ఈతనిపై సామంతులు తిరుగుబాట్లు ప్రారంభించినారు. వేంగి నేలుతున్న రాజాధిరాజును తంజావూరు సింహాసనాధిష్ఠుని చేయడానికి అదే మంచితరుణమని అనియంకభీముడు క్రీ.శ. 1220 ప్రాంతంలో దండెత్తి శ్రీరంగం వరకు పురోగమించినాడు కాని, హోయసాలుల సాయంతో మూడో రాజరాజు అతనిని తిప్పికొట్టినాడు.

మరల క్రీ శ. 1230లో మూడో రాజరాజు హొయసలచే ఓడిపోయి కొప్పెరుంజింగని చేతిలో బందీ అయినాడు. ఈ సమయంలో అనియంకభీముడు, వెలనాటి మూడోకులోత్తుంగుడు, మూడోరాజాధిరాజు కూటమిగా నేర్పడి చోళమండలంపై దండెత్తినారు. కాని, నెల్లూరుచోడతిక్కరాజు కాంచీపురిదగ్గర "జేమంద' వర్గాల సాయంతో ఓడించి మరలించినట్లు తెలుస్తుంది. హోయసాల వీరనరసింహుడు, చోడతిక్కన చాళుక్య-చోళసార్వభౌముని బంధవిముక్తుని చేసినారు.

వెలనాటి మూడో కులోత్తుంగరాజేంద్రుడు క్రీ.శ. 1257 వరకు జీవించి వున్నట్లు కాకతీయుల శాసనాలనుండి తెలుస్తున్నది. క్రీ శ. 1257 ప్రాంతంలో నెల్లూరు మనుమసిద్ధిపై తిరుగుబాటుచేసిన తిక్కన బయ్యనలతో సితదుచేరినాడని చెప్పవచ్చు. మనుమసిద్ధికి సాయంగా గణపతి దండెత్తి వచ్చి కులోత్తుంగరాజేంద్ర చోడుని వధించి వెలనాడు న్నాక్రమించి పాకనాడిపై పురోగమించినట్లు అతని నాయనపల్లిశాసనంనుండి తెలుస్తుంది. వెలనాడుచోడవంశం అంతరించింది.

## నెల్లూరు చోడులు

వెలనాటి రాజులకు ప్రత్యర్థులుగా దక్షిణతీరాంధ్రాన్ని నెల్లూరుతెలుగు చోడులు పాలించినారు. వీరిరాజ్యంలో నేటి నెల్లూరు, కడప, చిత్తూరు, చెంగల్పట్టు జిల్లాలు ఉండేవి. నెల్లూరుకే విక్రమసింహపురమని నామాంతరం. నెల్లూరు చోడులు తాము కరికాలుని సంతతివారమని, తమ మూలపురుషుడు మధురాంతక పొత్తపి చోడుడని చెప్పుకొన్నారు. పశ్చిమచాళుక్యులకు, చోళచాళుక్యులకు చివరకు కాకతీయులకు సామంతులుగా దక్షిణాంధ్రంలోనేగాక సమస్త దాక్షిణాత్య రాజకీయాల్లో సుమారొక శతాబ్దికాలం నెల్లూరు చోడులు గణనీయమైన పాత్ర వహించినారు.

నెల్లూరులో క్రీ శ. 12 వ శతాబ్దికిపూర్వం చోడులపాలనకు నిదర్శనలు లేవు. నన్నెచోడమహాకవి తన తండ్రి చోడబల్లి 'పాకనాడిరువది యొక్కవేయిటి కధీశుడు' అని చెప్పినమాటకు రుజావు కన్పించదు. ఈ చోడబల్లి పొత్తపినుండిగాని కొణిదెన నుండి గాని పాకనాటిని పాలించెనేమో చెప్పలేము. నెల్లూరు చోడవంశంలో చోడబల్లిగానీ నన్నెచోడుడుగానీ కన్పించరు.

చారిత్రకంగా నెల్లూరు చోడవంశ కర్త తెనుంగు బిజ్జన. ఈతడు పశ్చిమ చాళుక్య చక్రవర్తి మొదటి సోమేశ్వరుని (క్రీ శ. 1042-1068) సామంతుడుగా యేతగిరి నుండి కన్నెమున్నూరు, పెదకల్లెనూరు, నెరవాడియేనూరు పాలించినాడు. తన సార్వభౌముని పక్షాన ఈతడు రాజాధిరాజ చోళుని పూదూరు వద్ద (గద్వాల్ సమీపంలో) ఓడించి (క్రీ శ. 1043). సోమేశ్వరుని మన్ననకు పాత్రుడయినాడు ఈతని వంశస్థుల శక్తి సామర్థ్యాలను స్వామిభక్తిని గుర్తించి ఆరో

విక్రమాదిత్యుడు (క్రీ.శ 1076-1126) వీరిని పాకనాటి పాలకులుగా నియమించినాడు. వీరికి నెల్లూరు రాజధాని. కాంచీపురి ఉపరాజధాని అయినాయి.

నెల్లూరు నేలిన చోడులలో సిద్ధిబేటకు ప్రథముడని తెలుస్తున్నది. ఈతణ్ణి వెలనాటి మొదటి రాజేంద్రచోడుడు క్రీ. శ. 1132 ప్రాంతంలో ఓడించి వధించినాడు. కాని, అచిర కాలంలోనే నెల్లూరు చోడులు స్వతంత్రించసాగినారు. నల్లసిద్ధి అనే మరో తెలుగు చోడుడు విజృంభించి సిద్ధవటం వరకు పౌత్తపినాడు న్నాక్రమించినాడు. నాడు మొదలు రెండో రాజేంద్ర చోడుని మరణానంతరం (క్రీ.శ. 1180) వరకు నెల్లూరు చోడులు తలెత్తలేకపోయినారు. వారి సార్వభౌములైన పశ్చిమ చాళుక్యులు సయితం బలహీనులు కావడంవల్ల వారి సాయం తెలుగు చోడులకు లభించలేదు.

కళ్యాణిలో పశ్చిమ చాళుక్యులను తుదముట్టించి (క్రీ శ. 1156) కాలచుర్యుడైన బిజ్జలుడు తన వంశాన్ని నెలకొల్పినాడు. కాలచుర్యులు పశ్చిమ చాళుక్యుల రాజనీతినే అనుసరించి, తంజావూరు చాళుక్య - చోళులను వెలనాటి చోడులను శత్రువులుగా పరిగణించినారు. వారుభయులు మిత్రులై యుండడం తమకు ప్రమాదమని కాలచుర్యుల విశ్వాసం. అందుచే, వారి నణచడానికి పాకనాటి చోడులతో మైత్రి వహించి పాకనాటినుండి వెలనాటి చోడులను పారదోలడానికి శక్తికొలది ప్రయత్నించినారు. క్రీ శ 1070 లో కొచ్చెర్లకోట యుద్ధం ఆశయం అదే. ఆ యుద్ధంలో కలచురి సేనాని చౌండరాయుడు ప్రాణాలు కోల్పోయి వుంటాడు. వెలనాటి సామంతుడైన రాచూరు దారపరాజుకు చౌండరాయ చాణూరమురాంతక బిరుదం ఉంది. కాని, క్రీ.శ. 1180 లో కాణవయ్య దండనాయకుడు వెలనాటిపై దండెత్తి, ఆ రాజ్యాన్ని ధ్వంసం చేసినాడు. అంతటితో నెల్లూరు తెలుగు చోడులు విజృంభించినారు. క్రీ.శ. 1187 లో నల్లసిద్ధి నెల్లూరును పాలిస్తున్నాడు. నల్లసిద్ధికే మనుమసిద్ధి అని కూడ పేరు. ఈతని కుమారుడే చోడతిక్కన. నల్లసిద్ధి తమ్ముడు తమ్మసిద్ధి. నల్లసిద్ధి భార్య నూంగమ తిరుప్పావైవనం, కాళహస్తి, నందలూరులలో దానధర్మాలు చేసింది.

క్రీ.శ. 1180 ప్రాంతంలో తంజావూరు సింహాసనం ఆక్రమించిన మూడో కులోత్తుంగ చాళుక్య - చోళుడు - చోళ వైభవాన్ని పునరుద్ధరించే సంకల్పంతో దిగ్విజయ యాత్రలు సాగించినాడు. నెల్లూరు నేలుతున్న సిద్ధిరాజాతని సార్వభౌమత్వం అంగీకరించినాడు. కాని, అచిరకాలంలోనే స్వతంత్రించి కాంచీపురిపై దండెత్తి ఆక్రమించినాడు. శ్రీరంగం శాసనం ప్రకారం మూడో కులోత్తుంగుడు తిరిగి కాంచీపురిని స్వాధీనం చేసుకుని, నెల్లూరు చోడులనుండి కప్పం వసూలు చేసినట్లు తెలుస్తున్నది. నల్లసిద్ధి క్రీ శ. 1205 లో మరణించి, అతని తమ్ముడు

తమ్ముసిద్ధి సింహాసనం ఎక్కినాడు. కాని, నల్లసిద్ధి కుమారుడైన తిరుకాళత్తి దేవుడే (తిక్కన్న) యువరాజు

తమ్ముసిద్ధి పాలన కాలంలోనే రెండో రాజాధిరాజు చక్రవర్తి సహాయంగా వృథ్వీశ్వరుడు పాకనాటిపై దండెత్తినాడు కాని, నెల్లూరు యువరాజైన చోడ తిక్కన మూడో కులోత్తుంగ చక్రవర్తి సాయంతో అతణ్ణి ఓడించి వధించినాడు. ఈ విషయాన్నే కవితిక్కన తన నిర్వచనోత్తర రామాయణంలో చోడతిక్కనను గురించి "శైశవలీలనాడె పటుశౌర్య దురంధరుడైన చోడ పృథ్వీశ నరేంద్రు మస్తకము నేడ్తెర కందుక కేళి సల్పెదే" అని వర్ణించినాడు.

**చోడ తిక్కన, (క్రీ.శ. 1223-48)**

నెల్లూరు తెలుగు చోడులందరిలో చోడతిక్కన సుప్రసిద్ధుడు. ఈతని కాలంలో ఈ వంశ అధికారం కావేరి వరకు విస్తరించి, దాక్షిణాత్య రాజకీయాల్లో వారి కత్తికి ఎదురులేకపోయింది చాళుక్య - చోళ చక్రవర్తులు బలహీనులై సామంతులచేతి కీలుబొమ్మలయినారు. సామంతులైన పాండ్యులు, హొయసాలులు దక్షిణదేశ సార్వభౌమత్వానికి అర్రులు చాస్తున్నారు. చేదిమండలము (ఉత్తర ఆర్కాటు జిల్లా) నేలుచున్న కొప్పెరుంజింగడనే పల్లవ (కాడవ) సామంతుడు సాధ్యమైనంత అధికారం హస్తగతం చేసుకొని విజృంభిస్తున్నాడు. కొప్పెరుం జింగనికి తిరుక్కోయిలూరు, సెందమంగళం కేంద్రాలుగా వుండేవి. ఈ రాజ కీయ పరిస్థితులు తెలుగు చోడులకు మంచి అవకాశము కలిగించినాయి.

చాళుక్య-చోళ చక్రవర్తి మూడో రాజరాజు క్రీ.శ. 1230 లో పాండ్యులపై దండెత్తడంతో అల్లకల్లోలం ప్రారంభమయింది మార వర్మ సుందర పాండ్యుడు చక్రవర్తి నోడించడమేగాక తంజావూరులో ప్రవేశించి వీరాభిషేకం జరుపుకున్నాడు చక్రవర్తి రాజరాజు హొయసాలుల సహాయార్థమై వెళుతుండగా మార్గమధ్యంలో అతణ్ణి కొప్పెరుంజింగడు బందీగా పట్టుకున్నాడు. కొప్పెరుం జింగనికి సహాయంగా ఏరువమన్నిలు, అనియంక భీముడు చోళ మండలంపై దండెత్తడానికి ఉద్యమిస్తున్నారు.

ఈ పరిస్థితిలో హొయసాల వీరనరసింహుడు, చోడతిక్కన కార్య రంగంలో ప్రవేశించినారు. తిక్కన కాంచీపురం సమీపంలో బేరుండవర్గ సహాయంతో అనియంక భీమునోడించి మరల్పడమేగాక చేదిమండలంలో ప్రవేశించి కాడవపతి కొప్పెరుంజింగని నోడించినాడు వీరనరసింహుడు పాండ్యులను మహేంద్ర మంగళంచెంత నోడించినాడు తిక్కన, వీరనరసింహుడు మూడో రాజచక్రవర్తిని సింహాసనస్థుని గావించినారు.

సోమేశ్వరుడు క్రీ.శ. 1233 లో హొయసాల సింహాసనం అధిష్టించి నాడు చోళ చక్రవర్తిని కీలుబొమ్మగా చేసికొనవలెనని ఈతని ఆశయం.

అందుచే సోమేశ్వరుడు పాండ్యులపక్షం వహించినాడు. కొన్ని శాసనాల్లో అతనికి "పాండ్యకుల సంరక్షణదక్ష దక్షిణభుజ" అనే బిరుదం కన్పిస్తుంది. అయితే, చోళ మండలంలో హోయసాల ప్రాబల్యం పెరగడం చోడ తిక్కన సహించలేదు. ఇది ఇట్లుండగా క్రి శ. 1246 లో సింహాసనం ఎక్కిన మూడో రాజేంద్ర చక్రవర్తి తన వంశ ప్రతిష్ఠను పునరుద్ధరింప సంకల్పించినాడు. చాళుక్య - చోళ చక్రవర్తులలో మూడో రాజేంద్రుడే చివరివాడని చెప్పవచ్చు. ఈతడు పాండ్యులపై దండెత్తి వారినోడించినాడు. చాళుక్య - చోళ పునర్విజృంభణ హోయసాల సోమేశ్వరునకు ఇష్టంలేదు. అందుచే నాతడు పాండ్యులతో చేరి చక్రవర్తిపై కత్తిగట్టినాడు. ఈ సమయంలో చోడ తిక్కన నిస్సహాయుడైన చక్రవర్తితో చేరి హోయసాలులను పాండ్యులను కూడ ఓడించి చక్రవర్తికి శత్రుభయం తొలగించి 'చోళ స్థాపనాచార్య' బిరుదం ధరించినాడు. అతనికి తొండై మండలం సంక్రమించింది.

ఈ విజయ పరంపరలతో దక్షిణ దేశంలో తెలుగు చోడుల ప్రాబల్యం ఇనుమడించింది. చోడ తిక్కనకు కవి తిక్కన సోమయాజి కుటుంబం ఎంతో అండగా ఉండేది. కవి తిక్కన తాత భాస్కరుడు, తండ్రి కొమ్మన, పెదతండ్రి సిద్ధన మంత్రి దండ నాయక రాష్ట్రపతులుగా చోడ తిక్కనను సేవించినారు. సిద్ధనకు 'స్థాపితసూర్యవంశ వసుధాపతి' అనే బిరుదు ఉంది. చోడ తిక్కన భాషాభిమాని. 'అభినవభోజ' 'కవి సార్వభౌమ' అనే బిరుదాలు అతని భాషాభిమానాన్నేగాక పాండిత్యాన్ని, కవితా సామర్థ్యాన్ని వెల్లడిస్తున్నాయి.

**మనుమసిద్ధి (క్రీ శ. 1248 - 63)**

చోడ తిక్కన కుమారుడు వీరగండగోపాల బిరుదందాల్చిన రెండో మనుమసిద్ధి కాలంలో నెల్లూరు చోడుల ప్రభ క్షీణించింది. మనుమసిద్ధికి నలువైపులా శత్రు ప్రమాదం పెరిగింది విజయగండగోపాలుడనే తెలుగు చోడుడు నెల్లూరు రాజ్యంలోని దక్షిణ ప్రాంతాలను (చెంగల్‌పట్టు) ఆక్రమించి పాలిస్తూ మనుమసిద్ధిని ఎదిరించినాడు. అతనికి హోయసాల సోమేశ్వరుడు, చాళుక్య చోళ చక్రవర్తి మూడో రాజేంద్రుడు అండగా నిలిచినట్లు కన్పిస్తుంది. విజయగండ గోపాలుని పూర్వ వృత్తాంతం తెలియదు. ఇదే సమయంలో పడిహారి తిక్కన బయ్యనలు మనుమసిద్ధిపై విజృంభించినారు. శాసనాల్లో తిక్కన బయ్యనలని వుండగా సిద్ధేశ్వర చరిత్రలో అక్కన బయ్యనలని వుంది. వీరు మనుమసిద్ధి దాయాదులై వుంటారు. మనుమసిద్ధిని పారదోలి వీరు నెల్లూరు సింహాసనం ఆక్రమించినారు. ఇదే సమయంలో వైదుంబాధీశుడైన రక్కెసగంగడు మనుమసిద్ధి రాజప్రతినిధియైన గంగయసాహిణిని పారదోలి కడప ప్రాంతం ఆక్రమించినాడు.

ఈ విధంగా శత్రు పరివేష్టితుడై రాజ్యం కోల్పోయిన మనుమసిద్ధి గత్యం తరం లేక కాకతీయ చక్రవర్తి గణపతి దేవుని సహాయం అర్థించినాడు. నాటికే కాకతీయుల అధికారం వెలనాడు కమ్మనాడులలోనికి విస్తరించింది. చోడ తిక్కన కాలంలోనే నెల్లూరు రాజకీయాల్లో గణపతి జోక్యం కలిగించుకొన్నాడని, వెలనాటి పృథ్వీశ్వరుని సంహరించడంలో చోడ తిక్కనకు గణపతి సాయపడినా డని ఒక అభిప్రాయం వుంది (శ్రీ మల్లంపల్లి సోమశేఖరశర్మ). మనుమసిద్ధి తన శ్రేయోభిలాషి, మహామాత్యుడు, మహాకవియైన తిక్కనను గణపతి దేవుని చెంతకు రాయబారం పంపినాడు. తీరాంధ్రంలో కాకతీయుల అధికారం నెల కొల్పడానికి గణపతి దేవునకు ఇది సదవకాశం. అందుచేత క్రీ. శ. 1254 ప్రాంతంలో గణపతి దేవుడు దక్షిణదేశ దిగ్జయ యాత్ర సాగించినాడు. వెల నాటి మూడోకులోత్తుంగుని వధించినాడు. మూడో రాజేంద్ర, హోయసాల సోమే శ్వర విజయగండగోపాల కూటమి పలయ్యూరు దగ్గర జరిగిన యుద్ధంలో పరాజయం పొందింది. ఈ దండయాత్రలో సామంత భోజుడనే కాకతీయ సేనాని ప్రముఖ పాత్ర వహించినాడు. అనంతరం రక్కెన గంగను పారదోలి తిరిగి కడప ప్రాంతంలో గంగయసాహిణిని సామంత ప్రభువుగా నెలకొల్పడం జరిగింది. కాని, ఇందువల్ల మనుమసిద్ధి సింహాసనస్థుడయినప్పటికి తన రాజ్యంలో చాల భాగంతోపాటు స్వాతంత్ర్యం కోల్పోయి, గంగయసాహిణితో సహా మనుమసిద్ధి కాకతీయ సామంతుడయినాడు.

ఇది జరిగిన అనతికాలానికే మనుమసిద్ధికి, అద్దంకిసీమనేలే యాదవరాజు సారంగదేవునకు యుద్ధం జరిగింది. క్రీ శ. 12వ శతాబ్ది మధ్యనుండి అద్దంకి రాజధానిగా 4, 5 తరాల యాదవరాజులు రాజ్యమేలినారు. వీరు మహారాష్ట్ర నుండి వచ్చినట్లు తెలుస్తున్నది. కాని, వీరికి దేవగిరియాదవులతో సంబంధమేమో తెలియదు. కాకతిరుద్రుని కాలంలో వలసవచ్చి కాకతీయసామంతులుగా అద్దంకిలో స్థిరపడి వుంటారు మనుమసిద్ధికి సారంగదేవునకు మధ్య కలహానికి కారణం తెలియదు. బహుశా సారంగదేవుడు తెలుగుచోడరాజ్యంపై దండెత్తి వుంటాడు. అతణ్ణి ఓడించి మనుమసిద్ధి సైన్యాలు ఆతని అశ్వదళాన్ని సంగ్రహించినట్లు తిక్కన నిర్వచనోత్తర రామాయణంనుండి తెలుస్తుంది.

క్రీ.శ 1260 ప్రాంతంలో కనిగిరిసీమలోని ఎఱ్ఱగడ్డపాడు అధిపతియైన కాటమరాజుకు మనుమసిద్ధికి పుల్లరిని గురించి యుద్ధం జరిగింది. తిక్కన సోమయాజి పెదతండ్రి కుమారుడైన ఖడ్గతిక్కన తన ప్రాణాలు ధారవోసి మనుమసిద్ధికి విజయం చేకూర్చినాడు ఈ వృత్తాంతం కాటమరాజుకథగా బహుళ జనాదరణపొందింది.

ఇంతటితో మనుమసిద్ధి కష్టాలు తీరి గట్టెక్కలేదు. దాక్షిణాత్య రాజకీయాల్లో పాండ్యులు విజృంభించినారు. మూడో రాజేంద్రచోడచక్రవర్తి, కొప్పెరుంజింగడు, విజయగండగోపాలుడు వారిసార్వభౌమత్వం అంగీకరించినారు. ఇంతటితో ఆగక జటావర్మ సుందరపాండ్యుడు నెల్లూరు రాజ్యం జయించాలని సంకల్పించినాడు క్రీ.శ. 1263 లో కొప్పెరుంజింగాదులను కాకతీయ రాజ్యం పైకి పంపి తాను స్వయంగా నెల్లూరుపై దండెత్తినాడు. మనుమసిద్ధి, కాకతీయ, హోయసాల, బాణరాజుల సహాయం అర్థించినాడు. కాని, ముదుగూరు యుద్ధంలో వీరందరినీ జటావర్మ ఓడించినాడు. మనుమసిద్ధి ప్రాణాలు కోల్పోయినాడు. కాంచీ నాక్రమించి నెల్లూరు ప్రవేశించి, జటావర్మ వీరాభిషేకం జరుపుకున్నాడు.

మనుమసిద్ధి మరణంతో నెల్లూరు రాజ్యం వ్యక్తిత్వం కోల్పోయి కాకతీయ పాండ్య సేనలకు కదనరంగమై తరచుగా చేతులు మారింది. ముదుగూరు యుద్ధానంతరం పాండ్యులకు సామంతుడుగ వీరరాజేంద్రచోళుడు కొంతకాలం (క్రీ.శ. 1262-68) నెల్లూరు నేలినాడు అతణ్ణి తొలగించి కాకతీయులు నాగదేవ మహారాజును సింహాసనం ఎక్కించినారు. ఇతణ్ణి ఇరుమడి తిరుకాళత్తిదేవుడు (రెండో తిక్కన) పారదోలి నెల్లూరు నాక్రమించినాడు. ఇతడు రెండో మనుమసిద్ధి కొడుకు. బహుశా ఇతనికి పాండ్యుల సహాయం లభించి వుంటుంది. పాండ్యుల సామంతుడైన విజయ గండగోపాలుడుకూడ తోడ్పడి వుండవచ్చు. రెండో తిక్కన తరువాత (క్రీ శ. 1282) నెల్లూరులో మనుమ గండగోపాలుని పరిపాలన కన్పిస్తుంది. కాకతీయులపై తిరుగుబాటు చేసిన కాయస్థ మాండలికుడైన అంబయదేవుని సాయంతో నీతడు నెల్లూరు నాక్రమించి పాలించినాడు. అందుచేత రుద్రమదేవికాలంలో అంబయపై దాడిలో భాగంగా కాకతీయ సకల సేనాధిపతి అడిదం మల్లు నెల్లూరుపై దండెత్తి మనుగండగోపాలుని సంహరించినాడు (క్రీ.శ. 1292). అనంతరం రెండో మనుమసిద్ధిపౌత్రుడైన రాజగండగోపాలుడు నెల్లూరురాజై పాండ్యులపక్షం వహించినట్లు తెలుస్తుంది. అందుచే ప్రతాపరుద్రుడాతనిపై బోలినాయనింగారిని, కొణిదెనచోడుడైన మనుమ గండగోపాలుని పంపినాడు. రాజగండగోపాలుడు ఓడి, కాకతీయ సార్వభౌమత్వం అంగీకరించినాడు (క్రీ.శ. 1297). కాని, క్రీ శ. 1310 ప్రాంతంలో మాలిక్‌కపూర్‌తోటి యుద్ధంలో ప్రతాపరుద్రుడు ఓడిన సందర్భంలో రాజగండగోపాలుడు స్వతంత్రించినందున కాకతీయ సేనాపతి ముప్పిడి నాయకుడు, ఆతనికొడుకు పెదరుద్రసేనాని దండెత్తి రాజగండగోపాలుని ఓడించి పారదోలినారు. నెల్లూరు కాకతీయ రాజ్యాంతర్భాగమై రాజకీయ ప్రాధాన్యం కోల్పోయింది.

# చోళ చాళుక్య యుగ విశేషాలు

**పరిపాలన :**

చాళుక్య - చోళయుగారంభంలో ఆంధ్రదేశం అంతా సామంతరాజుల పాలనలో వుంది. క్రమంగా తెలంగాణా ప్రాంతంలో కాకతీయులు పశ్చిమ చాళుక్య సామంతులయినారు. సామంత రాజుల్లో వెలనాటి చోడులు, తెలుగు చోడులు సుప్రసిద్ధులు. తీరాంధ్రంలోని రాజులందరూ కొంతకాలం వెలనాటి ఆధిక్యాన్ని అంగీకరించినారు. ఆంధ్రదేశం చిన్న చిన్న నాడులుగా విభజిత మయింది. కొన్ని నాడులతో సంఖ్య జతపరచి చెప్పడం సంప్రదాయం. పాకనాడు 21000; వెలనాడును ఆరువేలనాడు అనేవాడు; వేంగి 14000, కొండపల్లి 300, పొత్తపినాడు, కోటదేశం, నతవాడి, కోనమండలం, కొలను విషయం సబ్బినాడు 2000 మొదలైనవి. ఈ సంఖ్యలు ఆనాడులోని గ్రామాల సంఖ్యను సూచిస్తుందని ఒక అభిప్రాయం. కాని ఇదమిత్థంగా చెప్పలేము. ఇంచుమించు ప్రతి మండలానికి ఒక సామంతరాజ్యం ఏర్పడింది. వీరిలో చాల మంది వెలనాడు రాజులకు సామంతులుగా వుంటూ సమయం చిక్కినపుడు స్వతంత్రులవుతూ వుండేవారు. ఈ రాజులు తమ తమ రాజ్యాల్లో సర్వాధికారులే వీరి ఆస్థానాలు సార్వభౌమాస్థానానికి నమూనాలు రాచరికం సప్తాంగసమన్వితం శాసనాల్లో మహామాత్య, అమాత్య, మంత్రి, ప్రధాని. ప్రెగడ, సంధివిగ్రహి, సమస్తసేనాపతి, రాజాధ్యక్ష భాండారు, కోష్ఠాగార, మహానియోగాధిపతి అనే ఉద్యోగుల పేర్లు కన్పిస్తున్నాయి. సాధారణంగా మహామాత్య పదవుల్లో కార్య ఖడ్గ దురంధరులైన బ్రాహ్మణులుండేవారు. ఛత్ర, చామర, ఆందోళికాదులు అధికార లాంఛనాలయినాయి. రాజ్యానికి విశిష్ట సేవ చేసినవారికి లాంఛనాలిచ్చి ప్రభువులు గౌరవించేవారు. ఆస్థాన ఉద్యోగం, ఆర్థిక భద్రతకేగాక సాంఘిక ఔన్నత్యానికి గూడ సైనిక వృత్తి సాధనమయింది.

రాజ్యంలోని ముఖ్య భాగం స్థలం. రాకుదురుస్థల, యనమదలస్థల మొదలైన పేర్లు శాసనాల్లో కన్పిస్తున్నాయి గ్రామణి, తలారి గ్రామోద్యోగులు, రెడ్డి కులస్థులు గ్రామణి పదవులు నిర్వహించినారు. రెడ్డి నిర్వహించిన పదవినే 'రెడ్డికం' అన్నారు. కొన్ని గ్రామాలకు రెడ్డికం ఏర్పాటు చేసే పద్ధతి కూడ ఉన్నట్లు కన్పిస్తుంది. కొన్ని సందర్భాలలో గ్రామస్థుల సమావేశాలు జరిగేవి. శాసనాలు మహాజనాలను పేర్కొంటున్నాయి. దానధర్మాది కార్యక్రమాలు రాజులు సయితం మహాజనాల సమక్షంలో చేసేవారు.

తరచుగా యుద్ధాలు జరిగినందున ప్రతి చిన్న రాజ్యము పెద్ద సైన్యాన్ని పోషించింది. సైనిక సహాయం చేయడం. ప్రభువుల యుద్ధాల్లో పాల్గొనడం సామంతుల విధి. కోట, హైహయ, కొండపడమటి రాజ్యాల సైన్యాలు వెలనాటి

రాజుల యుద్ధాల్లో పాల్గొన్నాయి. వీరందరూ చాళుక్య - చోళ సార్వభౌముల పక్షాన యుద్ధాలు నిర్వహించినారు. సైనికులకు, సేనాపతులకు గ్రామాలు అరణంగా ఇవ్వడం ఎక్కువయింది. నాటి దుర్గాలు చాలవరకు స్థలదుర్గాలే. యుద్ధాల్లో అశ్వదారి దళాలకే ఎక్కువ ప్రాధాన్యం ఉంది. ఎద్దులను, ఒంటెలను కూడ బహుశా భారవాహసాధనాలుగా ఉపయోగించేవారు. కుంత, ఖడ్గ, ధనుర్బాణాలు ప్రధాన ఆయుధాలు. బ్రహ్మనాయని ఇంటి పేరు 'కుంతాల'. కారెంపూడి యుద్ధంలో నలగాముని (నాయకురాలి) పక్షం ధనుర్బాణాలపైన, మలిదేవుని (బ్రహ్మనాయని) పక్షం కుంతాలపైన ఆధారపడినట్లు కన్పిస్తున్నది. నలగాముని విజయం కుంతాలపై విల్లంబులు సాధించిన విజయమే యుద్ధ ప్రారంభంలో భైరవుని ఆరాధించేవారు. యుద్ధ సమయంలో సైనికులకు వీరావేశం ఎక్కడానికి రణభేరి, ఢక్క, ఢంగుర, పటహాది వాద్యాలు మోగించేవారు. విజేతలు శత్రు శిబిరాలను దోచడం, శత్రు రాజ్యంలో ప్రవేశించి పల్లెలు పట్టణాలు దోచి పరశు రామ ప్రీతిచేయడం సర్వ సాధారణం. 'మూర్జవాడిదవదావానల' 'బుద్ధకుల కుద్దాల' 'సిద్దిబేటచీడ్పులిహరిణ మృగేంద్ర' 'చౌండరాయ చాణూరమురాంతక' 'కాకతి ప్రోలనిర్దహన' అంటూ నాటి రాజులు సగర్వంగా ధరించిన బిరుదులు వారి క్రౌర్యాన్ని, శత్రునిర్మూలనలో వారు పొందిన ఆనందాన్ని సూచిస్తున్నాయి.

**ఆర్థిక పరిస్థితులు :**

ఉపలభ్యములైన పరిమిత ఆధారాలనుబట్టి తీరాంధ్రంలో ప్రజానీకానికి వ్యవసాయమే ముఖ్య వృత్తి. దానికి అనుబంధంగా పశుపాలన సాగింది. గొర్రెల పెంపకం ఎక్కువగా కన్పిస్తుంది గ్రామాలను అరణంగా పొందినవారు - జిల్ల బోయని సోదరుడు నారప-దివిలో వలె తోటలువేసి చెరువులు తవ్వించి వాని అభివృద్ధికి పాటుపడినారు. పలుప్రాంతాల్లో మంచినీటికి, సేద్యపునీటికి చెరువులే ముఖ్య ఆధారమైనట్లు కన్పిస్తుంది. వరి, చెరకు, జొన్న, పత్తిపంటలు ఎక్కువ. మామిడి, కొబ్బరి ఆకు, పోకతోటలు పెంచేవారు. నేల సారవంతమైనందున పంటలు పుష్కలంగా పండి దేశం సుభిక్షంగా వుండేది. చందోలు నగరం 'మంటికరవ నులక మంచంబు పూరిల్లు' లేనంత మహదైశ్వర్యంతో తులతూగినట్లు మంచన కవి వర్ణించినాడు. పెదగంజాం, కడవకుదురు, వాయందుర్రు, కురవాడ మొదలైనచోట్ల ఉప్పుకొటార్లు ఉండేవి. ఉప్పు మీద కూడ పన్ను వుండేది. కోమట్లు, పెక్కండ్రు అనే పేర సంఘంగా ఏర్పడి వాణిజ్యం జరిపినారు, దేశ రాజకీయ అనైక్యము, తరచుగా జరిగిన యుద్ధాలు పరిశ్రమల వాణిజ్య అభివృద్ధికి అంతరాయాలయినాయని చెప్పవచ్చు. రాచనగరు సరుకులు సరఫరా చేసే సెట్లు ప్రత్యేకించివుండేవారు. ప్రతి సామంత రాజ్యము నాణేలు ముద్రించింది. వెలనాడు శాసనాల్లో జయమాడ, బిరుదుమాడ, దామరమాడ, కులోత్తుంగ

గద్యాణములు, త్యాగి పద్యము, చిన్నము, రూకల పేర్లు కన్పిస్తున్నాయి మాడకు పది రూకలయినట్లు బాపట్ల దేవాలయ శాసనం సూచిస్తున్నది. మాడ బంగారు నాణెము, రూక వెండి నాణెము అయివుంటాయి

**సాంఘిక పరిస్థితులు :**

సామాజిక పరిస్థితుల ననుసరించి ఈ యుగం ఇంచుమించు చాళుక్య యుగానికి అనుబంధమే. సమాజంలో అష్టాదశవర్ణాలు కుదురుకున్నాయి. రాజకీయాల్లో బ్రాహ్మణుల ప్రాబల్యం క్షీణించింది. అయితే, నందూరు కొట్టరువు కుటుంబాలవంటివారు ప్రముఖ పాత్ర వహించారు. చతుర్థాన్వయులు రాజస్థానాల్లో ప్రాబల్యం వహించినారు. పాలకులలో చాలభాగం చతుర్థాన్వయులే; రాజకీయ అనైక్యం, పరస్పర యుద్ధాలు సమాజంపై బలమైన ప్రభావం ప్రదర్శించినాయి. ఇవి కారణంగానే ప్రధాన వర్ణాలలో ప్రాంతీయ విభేదాలు (నాడీ భేదాలు) ఏర్పడినాయి. అమరావతీ శాసనం ఒకటి "రాజిత కీర్తులట్టి యకరంబున కమ్మ కులోద్భవుల్ భరద్వాజమునీంద్ర గోత్రజులు........వారిలో ..... .సత్పురుషమాన్యుడు భూసుర వంశ శేఖరుండన నుదయించె చెన్నయ" అంటూ కమ్మనాటి బ్రాహ్మణులను ప్రస్తావిస్తున్నది. అదేవిధంగా ఆరువేలనాటి, వేగినాటి, ములికినాటి మొదలైన శాఖ లేర్పడి వుంటాయి. ఆరువేల బ్రాహ్మణులు ముఖ్యంగా రాజోద్యోగాలు నిర్వహిస్తూ నియోగులయినారు. ఇతరులు ప్రధానంగా వైదికవృత్తు లవలంబించి వుంటారు. అదేవిధంగా బాపట్ల శాసనం కమ్మవైశ్యులను పేర్కొంటున్నది. శూద్రవర్ణంలో కూడ, ముఖ్యంగా వ్యవసాయం వృత్తిగా ఉన్న కాపుల్లో కమ్మ, వెలమ, రెడ్డి తెగలేర్పడినాయి. కమ్మ, వెలమ కులాలు కమ్మనాడు, వెలమనాడు పంటకాపులే. 'రెడ్డి' మొదట్లో ఉద్యోగనామమై (రాష్ట్రకూట) క్రమంగా కాపుల్లో ఒక శాఖ పేరుగా స్థిరపడిందని చారిత్రకుల అభిప్రాయం. కాని ప్రాచీన రట్ట తెగనుండి రెడ్డి పదం వచ్చినట్లు కన్పిస్తుంది

పాలకవర్గంలో వర్ణ సాంకర్యం ఎక్కువగా కన్పిస్తుంది ప్రతి చిన్న రాజవంశము వివాహ సంబంధాల ద్వారా తన రాజ్యాన్ని పదిలపరచుకోవాలని కాంక్షించడం, సైనికోద్యోగం ఆర్థిక సాంఘిక ఉన్నతికి సాధనం కావడం ఇందుకు కారణాలు. క్షత్రియులైన హైహయులు చతుర్థాన్వయులైన వెలనాటిచోడులతో బంధుత్వం చేసినారు. వెలనాటి ఆస్థానంలో బోయలు ఉన్నతోద్యోగాలు నిర్వహించారు. తాము చతుర్థాన్వయులమని, దుర్జయులతో సమాన హోదా వున్నవారమని చెప్పుకున్నారు జిల్లబోయడు, అతని అన్న సైనికోద్యోగులై, అయ్య వంశానికి మూలపురుషులై తరువాతి రాజవంశాలతో వివాహసంబంధాలు చేసినట్లు కన్పిస్తుంది రెడ్డి, వెలమ, కమ్మ కులాలు భూస్వాములుగా బలవంతులై పాలక

వర్గీయులైనారు క్రమంగా వెలమ, రెడ్డి కులాలమధ్య అధికార ప్రాబల్యానికై పోటీ ప్రారంభమయింది. ఆ పోటీలో ప్రథమ ఘట్టమే పలనాటి యుద్ధం.

**మత పరిణామాలు :**

జైన మతం రాయలసీమ, తెలంగాణా ప్రాంతాల్లో అక్కడక్కడ కన్పించినా ఆంధ్రదేశంలో బౌద్ధం అడుగంటింది. పండితారాధ్యుని జీవిత చరిత్ర వల్ల చందోలు ప్రాంతంలో బహుశా నేటి బుద్ధాంలో బౌద్ధులున్నట్లు తెలుస్తుంది. అమరావతి శాసనంలోని "చైత్యమత్యున్నతంయత్ర నానాచిత్రసుచిత్రితం" అనే వాక్యాన్నిబట్టి నాటికి ధాన్యకటక మహాచైత్యం నష్టం కాలేదు కాని, బుద్ధుడు విష్ణుమూర్తి అవతారంగా మాత్రమే పూజలందుకొన్నట్లు అమరావతి, కరీంనగర్, బెక్కల్లు శాసనాలు చెబుతున్నాయి. త్రిపురాసురులను వంచించి విష్ణుమూర్తిచే వారి నిర్మూలనకు కారణమైన మాయావి బుద్ధుడనే కథ ప్రచార మయింది. ఈ విధంగా నామమాత్రావశిష్టమైన బుద్ధారాధన పండితారాధ్యుని తీవ్రవాదశైవ ప్రచారఫలితంగా అంతర్హితమయింది.

ఆంధ్రదేశంలో శైవానికి ప్రజాదరణ ఎక్కువ. కాని, రామానుజుని ప్రచారంతో కలిగిన నూతనోత్తేజంతో వైష్ణవం శైవంతో పోటీ పడింది. చాళుక్య - చోళ యుగంలో పెక్కు ద్రావిడ వైష్ణవ కుటుంబాలు ఆంధ్రదేశం వివిధ ప్రాంతాలలో స్థిరపడినాయి. కొమ్మన మంత్రి ముప్పైరెండు క్షేత్రాల్లో విష్ణుప్రతిష్ఠలు చేసినట్లు కేయూరబాహు చరిత్ర చాటుతున్నది. శైవ వైష్ణవాలు రెంటిలోను 'దీక్షాధారణ' ఉంది. శివదీక్షలో రుద్రాక్ష, విభూతి, గురుపాదోదకం ప్రధానాంశాలు. భిన్నశైవ శాఖల మధ్య దీక్షావిధిలో వ్యత్యాసం ఉన్నట్లు తెలుస్తుంది. క్రీ శ. 7వ శతాబ్దినాటి శాసనంలో 'శివమండల దీక్ష' ప్రసక్తి ఉంది. నన్నెచోడుడు 'పాశుపతదీక్ష' పేర్కొన్నాడు. వీరశైవదీక్ష వీనికి భిన్నమై యుండవచ్చు. వైష్ణవదీక్షలో చక్రాంకితాలు, పుండ్రధారణ, ఉచ్ఛిష్టభోజనం, దాస నామధారణ, ఏకాదశీవ్రతం ప్రధానాంశాలు. "నాయుడెంగిలిపెట్టినగుబాటుచేసె ననుచు మీ వారునన్నాడంగజూతు" రంటు బ్రహ్మనాయు డొకభక్తునితో అంటాడు. శైవవైష్ణవాలు రెంటిలోను ఈయుగంలో తీవ్రవాద ఉద్యమాలు బయలుదేరినాయి.

శంకరాచార్యులచే పరాజితులైన కాపాలికులు పూర్తిగా అంతరించ లేదు. శివుని మహావ్రతిగా నన్నెచోడుడు వర్ణించినాడు. కాపాలికవ్రతమే మహావ్రతం. శ్రీశైలం, ఆలంపురం, బెజవాడ, పిఠాపురం మొదలైనవి శక్తి పూజా కేంద్రాలుగా కూడ ఉండేవి.

ఈ యుగంలోనే కర్ణాటకంలో బసవేశ్వరుడు (క్రీ శ. 1100-70) వీరశైవోద్యమం ప్రారంభించినాడు. వాస్తవానికి వీరశైవం బసవేశ్వరునికంటే ప్రాచీనమని, ఆతనికి పూర్వులైన ఏకాంతరామయ్య, శ్రీపతిపండితులే వీరశైవ సిద్ధాంతాలను

ప్రచారం చేసినారని సంప్రదాయం. శివాధిక్యాన్ని నిరూపించడానికి ఏకాంత రామయ్య తల కత్తిరించుకొని తిరిగిపొందినాడట; శ్రీపతి ఆంధ్రదేశంలోని పండితత్రయంలో ప్రథముడు; విజయవాడవాసి; అనంతపాలయ దండనాథుని కొలువులో నిప్పును ఉత్తరీయంలో ముడిచి శివుని ఆధిక్యాన్ని చాటినాడట. బసవేశ్వరుడు వీరశైవానికి నిర్దుష్టరూపంకల్పించి ప్రజాదరణ సాధించినాడు. శివుడే పరదైవమనే భావము లింగధారణ, భక్తిసాధనంగా లింగ అంగ సమైక్య సాధన వీరశైవంలోని ప్రధానాంశాలు అలయ పూజావిధానంతో సహా కర్మకాండలను వర్ణధర్మాలను వీరశైవులు తీవ్రంగా ఖండించినారు. జైన బౌద్ధాలలోని నైతికవర్తన, సాంఘిక సమత్వము, పౌరాణిక మతంలోని భక్తిని బసవేశ్వరుడు వీరశైవంలో సమన్వయం చేసినాడు. వీరశైవాన్ని ఆగమాంతము అన్నారు. వైదిక క్రతుకాండపై వేదాంతం(ఉపనిషత్తులు) వలె పౌరాణిక సత్కర్మకాండపై ఆగమాంతం తిరుగుబాటనిచెప్పవచ్చు.

విషాదకర పరిస్థితుల్లో బసవేశ్వరుడు మరణించడాన్ని బట్టి అతని ఉద్యమం సాధించిన విజయం అనుమానాస్పదం. ఆంధ్రదేశంలో స్వల్పంగా క్రిందివర్ణాలలో మినహాయించి వీరశైవం జనాదరణ పొందలేదు. బసవేశ్వరుని సమకాలికుడైన మల్లికార్జున పండితారాధ్యుడు ప్రత్యేకమైన శైవం ప్రచారం చేసినాడు. “భక్తి మీద వలపు బ్రాహ్మ్యంబుతో పొత్తు బాయలేనునేను బసలింగ"అని పండితుడన్నాడని ప్రతీతి భక్తి, వైదిక పద్ధతులు, పాశుపత సూత్రాలు, నాయనారుల బోధనలు పండితుని విధానంలో సమన్వయమయినాయి. మల్లికార్జునుడు దేశాటన చేస్తూ జైనబౌద్ధాలను నిర్మూలించి శైవ ప్రచారం సాగించినాడు. అతని సిద్ధాంతాలే ఆరాధ్య విధానంగా రూపొంది ఆంధ్ర కర్ణాటక దేశాల్లో అగ్రవర్ణాలలో వ్యాప్తి చెందినాయి.

రామానుజాచార్యులు క్రింది వర్ణాలకు వైష్ణవ దీక్ష నిచ్చినాడుగాని వర్ణ వ్యవస్థను ఖండించలేదు. పల్నాటి బ్రహ్మనాయుడు మాత్రం బసవేశ్వరుని అనుకరిస్తూ వర్ణవ్యత్యాసాలను నిరసించిన వీరవైష్ణవాన్ని ప్రచారం చేసినాడు. అతని ప్రచారం వల్లనే ఆంధ్రదేశంలోని పంచముల్లో దాసర్ల సంఖ్య హెచ్చింది. బ్రహ్మన్న వర్ణాంతర వివాహాలను, చాపకూడును ప్రోత్సహించినాడని, మాచర్ల చెన్నకేశవ దేవాలయంలో పంచములకు ప్రవేశం కలిగించినాడని జనశ్రుతి. ఇంతటి విప్లవాత్మక సంస్కరణలు నాటికి అపూర్వములే! కాని, బ్రహ్మన్న కుటుంబసభ్యులే వాటిని హర్షించ లేకపోయినారు. ఒక చాటు పద్యం పల్నాటి యుద్ధకారణాల్లో చాపకూడును పేర్కొంటున్నది. వాస్తవానికి పల్నాటి యుద్ధం సంప్రదాయ ప్రియత్వానికి సంస్కరణ ప్రయత్నానికి మధ్య సంఘర్షణ. అందు సంప్రదాయమే విజయం పొందింది. సంస్కరణోద్యమానికి అడ్డుకట్టపడింది.

వీరశైవ, వీరవైష్ణవ పరాజయంతో శాఖావిభేదాలకు అతీతమై సంప్రదాయ సిద్ధమైన స్మార్తమతానికి ప్రోత్సాహం లభించింది. స్మార్త ఉద్యమానికి ఒక విధంగా తిక్కన మహాకవి నాయకుడని చెప్పవచ్చు. మహేశ్వరాంఘ్రి కమలధ్యానైక శీలుడైన మహాభక్తుడయిన తిక్కన యజ్ఞం చేసిన సోమయాజి! "శివాయ విష్ణురూపాయ శివరూపాయ విష్ణవే" అని చాటినవాడు. స్మార్త మతానికి జీవమైన అద్వైత ధర్మ ప్రచారమే ఆశయంగా మహా భారత ఆంధ్రీకరణకు పూనుకున్నాడు తిక్కన. క్రమంగా తీవ్రవాద మతశాఖలు క్షీణించి, ప్రజల్లో స్మార్త సమన్వయ భావాలు పాదుకొనసాగినాయి.

**కళలు, సారస్వతం :**

భక్తి ప్రధానమైన మతశాఖలు ప్రచారమైనందున దేవాలయ నిర్మాణం విరివిగా సాగింది. నాటి రాజ్యాలవలె ఈ యుగ ఆలయాలు సయితం అల్ప ప్రమాణం ఉన్నవే; స్థాపత్య శిల్పాలకు ప్రత్యేక ప్రాముఖ్యం ఉన్నవి కావు. ఆలయాలకు అనుబంధంగా తటాకాలు, తోటలు ఉండేవి. ఇవి అన్నీ పుణ్య సాధనములైన సప్త సంతానాలలోనివే. పెద్ద ఆలయాల్లో మఠాలు ఉండేవి. దేవాలయాల్లో అంగరంగ భోగాలతో పూజలు, సంవత్సరం పొడవునా ఉత్సవాలు జరిగేవి ఉత్సవాలన్నింటిలో 'తిరునాళ' ప్రధానమయి దూర గ్రామాల నుండి సయితం జనాన్ని ఆకర్షించేది.

ఆలయాలు, రాజస్థానాలు సంగీత నృత్యకళలకు కేంద్రాలయినాయి. పల్నాటి వీరచరిత్ర సన్నాయిజోళ్ళు, ఢంకిణి, మురళి, ముఖవీణ, రుంజ, చేగంట, చిరుగంట మొదలైన వాద్యాలను పేర్కొంటున్నది. అదే గ్రంథంనుండి భరతశాస్త్ర సమ్మతమైన భిన్ననాట్య పద్ధతులను గురించి తెలుస్తున్నది.

చాళుక్య యుగంలో ప్రారంభమైన ఆంధ్ర సారస్వత మహోద్యమం పురోగమించసాగింది. చాళుక్య - చోళ యుగం నాటి తెలుగు శాసనాలు చాలా భాగం పద్యాలలో ఉన్నాయి. ప్రతి పద్య శాసనం ఒక చిన్న ఖండకావ్యం. "తలపు సదర్థిభావమున తద్గతసూక్తుల గూడ వర్తనల్ గొలుసుగొనంగ ద్రావడులు గోరిన భంగిక వచ్చిముట్ట గోమలగతి దేశి మార్గములు ముట్టువడన్ గవనంబులొప్ప నాద్యుల క్రియజెప్పనేర్చె నృపదూర్జటి భీమయ వందిదిమ్మహిన్" అనే చేబ్రోలు శాసన పద్యాన్నిబట్టి నాటి సాహిత్య పరిశ్రమ స్వభావాన్ని గురించి, నాడు తెలుగులో మార్గ, దేశి కవితారీతులున్నవని తెలుస్తున్నది. నన్నెచోడుడు సయితం ఉత్తమమార్గ సత్కవీశ్వరులను దేశి సత్కవులను సంస్తుతించినాడు.

నన్నెచోడుడే ఈ యుగకవులలో అద్యుడు. తెలుగుభాషలో తెలిసినంత వరకు ఈతడే మొదటిరాజకవి; కవిరాజశేఖర బిరుదాంచితుడు. నన్నెచోడుని కుమారసంభవంలో కన్నడ భాషా సాహిత్య సంప్రదాయాల ప్రభావం ఎక్కువ. ఈతని కాలాన్ని గురించి పెక్కువాదాలున్నాయి. నన్నయకు పూర్వుడని కొందరు,

సమకాలికుడని కొందరు, తిక్కనకు అనంతరీకుడని మరి కొందరు వాదించినారు. తిక్కన అనంతరం తెలుగుచోడుల్లో నన్నెచోడుడు కన్పించడు. నన్నయకు పూర్వం క్రీ.శ. 950 ప్రాంతం వాడనే వాదంలోకూడ బలంలేదు. నన్నెచోడుని దైవము, గురువు, ప్రభువు ముగ్గురూ మల్లనామాంకితులేనని కుమారసంభవం నుండి తెలుస్తున్నది. దైవము శ్రీశైల మల్లికార్జునుడే; క్రీ శ. 930 ప్రాంతంలో వేములవాడనేలే రెండో అరికేసరి శాసనాల్లో మల్లికార్జున శివయోగి కన్పిస్తున్నాడు. అదేకాలంలో తూర్పు చాళుక్యరాజు యుద్ధమల్లుడున్నాడు. వీరు నన్నెచోడుని గురువు, ప్రభువునని, క్రీ శ. 950 ప్రాంతంలో పొత్తపి నేలిన బల్లియచోడుడే నన్నెచోడుని తండ్రి చోడబల్లియని పైవాదం సారాంశం వేములవాడ చాళుక్యుల గురువే నన్నెచోడుని గురువనడంగాని రాష్ట్రకూట సామంతుడైన యుద్ధమల్లుడే అతని ప్రభువు అనడంగాని సమంజసంకాదు. బల్లియచోడుని చోడబల్లిగా గుర్తించడంకూడ చాలమందికి అంగీకారం కాదు. క్రీ.శ. 1140 ప్రాంతానికి చెందిన పెదచెరుకూరు శాసనంలోని చోడబల్లి, నన్నెచోడులే కుమారసంభవంలోని వారని చరిత్రకారులు చాలమంది అంగీకరిస్తున్నారు. ఈ శాసనంలోని తరాలను లెక్కించినప్పుడు నన్నెచోడుడు క్రీ.శ. 1120 లో జీవించివున్నట్లు తెలుస్తున్నది. క్రీ.శ. 1115 నాటి కొప్పరం శాసనంలో కన్నరచోడుకు అతని సోదరుడైన చోడబల్లి వారికులగురువైన మల్లికార్జునుల ప్రసక్తి ఉంది. ఈ మల్లికార్జునుడే నన్నెచోడుని గురువై వుంటాడు ఇదేకాలంలో ఆంధ్రదేశంలో అధిక భాగం కల్యాణి చాళుక్య చక్రవర్తి త్రిభువనమల్ల ఆరో విక్రమాదిత్యుని సార్వభౌమత్వంలో ఉంది. అతడే నన్నెచోడుని ప్రభువని చెప్పవచ్చు. అయినచో కుమార సంభవ రచన క్రీ శ 1120-1125 మధ్యకాలంలో జరిగివుంటుంది. నన్నెచోడుడు షష్ఠ్యంతములు మొదలైన సంప్రదాయాలు ప్రారంభించడమేగాక తెలుగులో అష్టాదశ వర్ణనలతో కూడిన కావ్యప్రబంధ శైలికి ఆద్యుడయినాడు.

తరువాత చెప్పదగిన కవి మల్లికార్జున పండితారాధ్యుడు. నన్నెచోడుడు శివ కవులలో చేరినప్పటికి సాహిత్యాన్ని శైవమత ప్రచార సాధనంగా చేసిన మొదటి కవి మల్లికార్జునుడే. భవా, శివా అనే భిన్నమకుటాలతో నాల్గువందలకు పైగా కంద పద్యాలున్న అతని 'శివతత్వసారాన్ని' శతకంగానే పండితులు గుర్తిస్తున్నారు. అందుచే తెలుగులో శతక ప్రక్రియకు శ్రీకారం చుట్టిన ఘనత పండితునిదే.

చాళుక్య - చోళ యుగ కవులలోనేగాక తెలుగు కవులందరిలో తిక్కన సోమయాజి అగ్రగణ్యుడని పండితుల అభిప్రాయం. తిక్కనది కవి పండిత కుటుంబం. పితామహుడైన భాస్కర మంత్రి సారకవితాభిరాముడు. భాస్కర మంత్రియే భాస్కర రామాయణ కర్తయనే కొందరి వాదానికి తగిన సాక్ష్యాధారం లేదు. కాదంబరిని తెలుగు పద్యకావ్యంగా రచించిన కేతన తిక్కన పెద

తండ్రి అయివుండవచ్చు తిక్కన మహామంత్రి, మహాకవిమాత్రమే కాదు. అతడొక సాంస్కృతిక మహోద్యమం. నాటి మత పరిణామాల్లో అతని పాత్రను పరిశీలించినాము; సాహిత్యరంగంలో సైతం విశిష్టమైన పాత్రను నిర్వహించి నాడు. తిక్కన సహజ సారస్వత వ్యక్తిత్వం అతని మొదటి రచనయైన నిర్వచ నోత్తరరామాయణంలో ప్రతిబింబిస్తుంది. ఇది మనుమసిద్ధికి అంకితం; ఇందులో తాను ఉభయ కావ్య ప్రౌఢిబాటించు శిల్పములో పారగుడనని, 'కళావిదుడ'నని సగర్వంగా చెప్పుకున్నాడు దృశ్య శ్రవ్యకావ్యాలే ఉభయకావ్యాలని చెప్పవచ్చు. 'కవివాగ్బంధ'మనే లక్షణకావ్యాన్ని కృష్ణశతకాన్ని తిక్కన వ్రాసినాడనే ప్రతీతి ఉంది కాని, తిక్కన రచించిన దృశ్య(నాటకం) కావ్యాల ప్రసక్తి ఎక్కడా కన్పించదు. అయినా, తిక్కన రచనలో నాటకీయత అధికం అని అందరూ అంగీకరించిన విషయమే. నిర్వచనోత్తరరామాయణాన్ని నన్నయవలె తిక్కన సంస్కృతశ్లోకంతో ఆరంభించినాడు. ఆ కావ్యం పేరులోనే కవిత్వంలో తిక్కనకు ఉన్న అభిప్రాయం వ్యక్తమవుతుంది. క్రమంగా నాటిపరిస్థితులు అతని దృక్పథాన్ని మార్చినాయి. ఆంధ్ర జాతీయాభిమానంతో పాటు సమకాలిక విలువలకు అనుగుణమైన సామాజిక స్పృహ అతనిలో కన్పిస్తుంది. సంస్కృతోక్తి చమత్కారప్రియత్వాన్ని వీడి మార్గదేశి కవితారీతులకు వారధిగా సమన్వయమార్గంలో కొత్తశైలిని రూపొందించిన కవిబ్రహ్మయై, ఉభయకవి మిత్రుడయినాడు. ఈ కొత్త సంప్రదాయంలో ఒక కవి కుటుంబాన్నాతడు ప్రోత్సహించినట్లు కన్పిస్తుంది ఆతని శిష్యుల్లో కేతన రచించిన దశకుమార చరిత్రకు కృతిపతియై ఆతనికి 'అభినవ దండి' బిరుదం ఇచ్చినాడు; భోజరాజీయకర్త అనంతామాత్యుని తాతయైన బయ్యనను 'భవ్యభారతి' అనే బిరుదంతో గౌరవించినాడు. చివరకు హరిహరమూర్తికి అంకితంగా 'ఆంధ్రావళి మోదముంబొరయునట్లు' మహాభారత ఆంధ్రీకరణం పూర్తి చేసినాడు. ఉత్తరదిశనుండి కాకతీయులు చేస్తున్న రాజకీయ సమైక్య సాధన కృషికి బలంగా దక్షిణాదినుండి తిక్కన సాగించిన సాంస్కృతిక సామరస్య ఉద్యమం ఆంధ్రుల్లో జాతీయ చైతన్యోదయానికి దోహదం చేసింది.

## కొన్ని ఉపయుక్త గ్రంథాలు


1. Arudra — సమగ్ర ఆంధ్రసాహిత్యం I, II
2. Krishna Rao, B. V. — The Eastern Chalukyas
3. Lalitamba, K. — Virasaivism in Andhra
4. Sastri K.A.N. — The Cholas
5. Somasekharasarama, M. — ఆంధ్ర విజ్ఞాన సర్వస్వము
6. Srinatha — పల్నాటి వీరచరిత్ర

# కాకతీయ యుగము

ఆంధ్రుల చరిత్రలో కాకతీయులకాలం చాల ముఖ్యమైన ఘట్టం. కొందరు దీన్ని స్వర్ణయుగం అనడం కూడ కద్దు శాతవాహనుల అనంతరం ఆంధ్ర దేశాన్నీ జాతినీ సమైక్యం చేసి, ఏకచ్ఛత్రాధిపత్యం కిందికి తెచ్చిన హైందవ రాజవంశీయులు కాకతీయులొక్కరే. నాటివరకు బలంగా ఉన్న వేంగి, వెలనాడు, పాకనాడు, రేనాడు అనే ప్రాంతీయ రాజకీయాభిమానాలు తొలగించి, ఆంధ్రత్వానికి సమగ్రమైన రూపం దిద్ది, జాతీయ భావాన్ని సాధించింది కాకతీయులే. వారి కాలంలోనే ఆంధ్ర, త్రిలింగ పదాలు సమానార్థకాలై, దేశపరంగా జాతిపరంగా ప్రచారమయినాయి. కాకతీయులు ఆంధ్ర దేశాధీశ్వర బిరుదం ధరించినారు. వారి రాజధానియైన ఓరుగల్లు ఆంధ్రనగరి. ఆంధ్ర భాషకు ఆదరాభిమానాలు అధికం కాజొచ్చినాయి. అనేక మతసాంఘిక పరిణామాలు జరిగి, ఆంధ్ర సమాజం నేటి రూపం ధరించింది. ప్రాంతీయాభిమానాలు విస్మరించి, ఆంధ్రజాతీయోజ్జీవనానికై ఆంధ్రులు కాకతీయ యుగంలో కృషి సల్పినారు. ఆంధ్రుల చరిత్రలోనేగాక యావద్భారత చరిత్రలో కాకతీయులు గణనీయమైన పాత్రను నిర్వహించినారు. ఉత్తర భారతంలో రాజపుత్రులవలె దక్షిణాన తురుష్క సేనావాహినుల నరికట్టి, హైందవ స్వాతంత్ర్య సంస్కృతులను రక్షించడానికై కాకతీయులు తమసర్వస్వాన్ని ధారపోసినారు. వారి దేశభక్తి, స్వాతంత్ర్య దీక్ష వారి అనంతరం ఆంధ్రదేశాన్ని పాలించిన రెడ్డి, విజయ నగరాధీశులకు ఆదర్శమై, దక్షిణాపథంలో హైందవసంస్కృతి రక్షణకై వారిచే కంకణం ధరింప జేసినాయి.

**వంశం పుట్టుపూర్వోత్తరాలు :**

కాకతీయులు కూడా చాళుక్యులవలె కర్ణాటకం నుండి ఆంధ్ర దేశానికి వచ్చి స్థిరపడినవారే. వారిని గురించిన మొదటి ప్రస్తావన తూర్పు చాళుక్య రాజు దానార్ణవుని మాగల్లు శాసనం (క్రీ.శ. 950) లో ఉంది. ఈ శాసనం గుండియ రాష్ట్రకూటుని ప్రపౌత్రుడు కాకత్య గుండ్యనగా పేర్కొంటున్నది. గుండియ కొడుకు ఎరియరాష్ట్రకూటుడు. అతని కొడుకు బేతియ. ఈ బేతియ కొడుకైన కాకత్య గుండ్యనకు కాకతీయులకు సంబంధం లేదేమోనని చరిత్రకారులు

చిరకాలం అనుమానించినారు. ఐయల్పొడిన ఐయ్యారం చెరువు శాసనం ఆ అనుమానాన్ని నివృత్తి చేసింది. ఈ శాసనాన్ని గణపతి దేవుని చెల్లెలు మైలాంబ (క్రీ.శ. 1250) ఇచ్చినది. ఐయ్యారం శాసనం అందలి వంశ వృక్షంలో ఆద్యుడైన వెన్నభూపతి వంశస్థులే కాకతీయులయినారని పేర్కొంటున్నది. వెన్నభూపతి సంతతిలోని ప్రథముల పేర్లు మాగల్లు శాసనంలోని మొదటి నాలుగు పేర్లు ఇంచుమించు ఒకటే. మాగల్లు శాసనంలోని మొదటి ఇద్దరికి 'రాష్ట్రకూట' బిరుదం ఉంది. వీరిలో గుండయ రాష్ట్రకూటుడు వల్లభేశుని సేనాని అని కూడ మాగల్లు శాసనం చెబుతుంది. కాబట్టి, కాకతీయులు రాష్ట్రకూట సేనానులుగా ఆంధ్రదేశంలో ప్రత్యక్షమయినారు. క్రమంగా సామంతులుగా ఆంధ్రదేశంలో స్థిరపడి, తమ సార్వభౌములు దుర్బలురయినంతనే విజృంభించి స్వతంత్రరాజ్యం స్థాపించుకొన్నారు.

మాగల్లు శాసనం కాకతీయులు 'సామంత విట్టి' వంశానికి చెందినవారని చెబుతుంది. 'సామంత వడ్డె' అనే రూపం కూడ ఉంది. 'విట్టి' పదం 'విష్టి'కి వికృతి. 'విష్టి' అంటే ఊడిగం అని అర్థం. కానీ, విష్టి అనే పదం 'వృష్టి' పదానికి భ్రష్టరూపమనీ, రాష్ట్రకూటులు 'వృష్టి' వంశస్థులని కాబట్టి, కాకతీయులు రాష్ట్రకూట వంశశాఖయే అనే వాదం (డా॥ పరబ్రహ్మశాస్త్రి) ఉంది. గుండియ ఎరియలకున్న (మాగల్లు శాసనం) రాష్ట్రకూట బిరుదము, కాకతీయుల గరుడకేతనమూ ఈ వాదానికి బలంగా సూచిస్తారు. రాష్ట్రకూటులది గరుడకేతనం. కాకతీయులు వృష్టి వంశ క్షత్రియులని ఈ వాదం సారం. కాని, ఐయ్యారం చెరువు శాసనం కాకతీయులు దుర్జయులని చెబుతున్నది. ఆంధ్రదేశాన్ని పాలించిన వెలనాటి రాజులు దుర్జయులు; కొండపడమటి రాజులూ దుర్జయులే. వీరందరూ తాము చతుర్థాన్వయులమని చెప్పుకున్నారు. కాకతీయుల శాసనాల్లో చాలభాగం వారిని చతుర్థాన్వయులుగానే చెబుతున్నాయి. గణపతిదేవుని కాలం నాటి శాసనాలు కొన్ని వారిని ఇక్ష్వాకు వంశస్థులంటున్నాయి. ప్రతాపరుద్రుని ఆస్థాన కవి విద్యానాథుడు "అత్యర్కేందుకులప్రశస్తిమభిజద్యం కాకతీయాన్వయమ్" అంటూ సూర్యచంద్ర వంశాల ప్రతిష్ఠను తలదన్నే ప్రతిష్ఠ కాకతీయుల కులానిదనినాడు. అంటే, పరోక్షంగా కాకతీయులు క్షత్రియులు కాదని చెప్పడమే.

దీన్నిబట్టి తమ వంశోత్పత్తిని గురించిన స్పష్టమైన అభిప్రాయం కాకతీయులకే లేనట్లు తెలుస్తుంది. ఈ వంశంలోని వెన్న, గుండ, ఎరియ వంటి పేర్లు సార్వభౌమాధికారం నెరపే రాజవంశ శాఖీయుల పేర్లుగా ధ్వనించవు. బోయలలో, పుళిందులలో ఈ పేర్లు ఎక్కువగా కన్పిస్తాయి. రాష్ట్రకూట బిరుదం వంశంలో మధ్యస్థులైన గుండయ, ఎరియలకు ఉంది, ఇతరులకు లేక

పోవడానికి కారణం కన్పించదు. వాస్తవానికి రాష్ట్రకూట అనేది ఉద్యోగనామం. రాష్ట్రకూటులు ఉద్యోగనామాన్నే వంశనామంగా స్వీకరించినారు. వారు కూడ ఐతిహాసిక వృష్టి వంశస్థులని చెప్పడం అనుమానాస్పదం. సార్వభౌమాధికారం సాధించిన తరువాత ఇట్టిగాథలు కల్పించుకోవడం మన రాజవంశాలకు మామూలే; గరుడకేతనం కూడ కాకతీయుల రాష్ట్రకూట వంశశాఖ అని సూచించదు. తమ సార్వభౌములపట్ల ఉండే గౌరవం కొద్దీ గరుడకేతనం స్వీకరించి వుంటారు. రాష్ట్రకూటుల అనంతరం సార్వభౌములయిన చాళుక్యుల వరాహ లాంఛనాన్ని కాకతీయులు స్వీకరించినారు కదా? అందుచేత, కాకతీయులు రాష్ట్రకూట ప్రభువుల కింద సామాన్య సైనికోద్యోగాల్లో చేరిన బోయ, పుళింద జాతులలోని వారై, జైన మతం ద్వారా సాంఘికోన్నతి సాధించి శూద్రులుగా గుర్తింపు పొంది క్రమంగా ఉన్నత పదవులు నిర్వహించి సామంతులైనారు. ఇట్టి సామాజిక పరివర్తన ఆ రోజుల్లో అరుదు కాదు.

కాకతి పదాన్ని గురించి సయితం వివాదాలున్నాయి. 'కాకతిదేవతో పాకోసభూతిః కాకతివిభుః'అని విద్యానాథుడనగా,అతని 'యశోభూషణ' వ్యాఖ్యాత 'కాకతిర్నామ దుర్గాశక్తి రేకశిలానగరేశ్వరానామ్ కులదేవతా సాశక్తిర్పూజనీయా స్యేతికాకతీయాః' అందే. కాకతి అనే దుర్గను పూజించినందున కాకతీయులయినారని తాత్పర్యము. ఓరుగల్లులో కాకితమ్మ దేవాలయం ఉన్నట్లు వినుకొండ వల్లభామాత్యుని క్రీడాభిరామంలోని "కాకితమ్మకు సైదోడు ఏకవీర" అనే పద్యపాదం సాక్ష్యం. కాబట్టి ,కాకితమ్మ కాకతీయుల కులదేవత అనడంలో సందేహం లేదు. కాకితమ్మకు చిత్రమైన చరిత్ర ఉన్నట్లు కన్పిస్తుంది. కాకతి పదానికి గుమ్మడి లేక 'కూష్మాండ' అనే అర్థం వుంది. జైనతీర్థంకరుల్లో ఇరవై రెండోవాడైన నేమినాథుని శాసనాధికారిణి కూష్మాండిని. కాకతీయులు మొదట్లో జైనులుగా వుండి తరువాత శైవులైనట్లు ప్రసిద్ధం. వారి రాజధానులైన అన్మకొండ, ఓరుగల్లు పరిసరాల్లో జైనవిగ్రహాలు శిథిలాలు అధికంగా గోచరిస్తాయి. అందుచేత కాకతీయులు జైనం విడిచి శైవం స్వీకరించిన తరువాత కూడ పూర్వసంప్రదాయాలను పూర్తిగా త్యజించలేక కూష్మాండినీ దేవతను కాకితమ్మ అనే దుర్గాదేవిగా పూజించినారని ఒక అభిప్రాయం.

మరొక విశేషం - కాకతి వంశ ప్రతిష్ఠకు పునాదులు వేసిన బేతరాజుకు 'కాకతి పురాధినాథ' అనీ, అతని కొడుకు ప్రోలరాజుకు 'కాకతి వల్లభ' అనీ బిరుదులున్నాయి. వంశకర్తయైన వెన్నభూపతి కాకతి నుండి రాజ్యం చేసినందున అతని వంశస్థులు కాకతీశులయినారని బయ్యారం చెరువు శాసనం చెబుతుంది. దీన్నిబట్టి కాకతీపురాధీశులయినందున కాకతీయులనే పేరువచ్చినట్లు స్పష్టమవుతుంది. కాకందివాడ, కాకందిపురము అనే పేర్లు ఆంధ్రదేశంలో

చాలా వున్నాయి. అయితే, కాకతీయుల పూర్వులు కర్ణాటకం నుండి వచ్చినారు గాన కాకతిపురం కర్ణాటకంలోనే వుండి వుండవలెనని ఒక అభిప్రాయం. సిద్ధేశ్వర చరిత్రలోని కాకతీయోత్పత్తిని గురించిన కథ వారి మూలపురుషునిది కందారపురంగా ప్రస్తుతిస్తున్నది. కర్ణాటకంలో నాందేడ్ సమీపంలో కందార పురం ఉంది. కాబట్టి, నాందేడ్ సమీపంలోని కందారపురమే కాకతీయుల జన్మ స్థలము; అదే బహుశా కాకతిపురము అని కొందరి ఊహ. సిద్ధేశ్వర చరిత్రలోని పైగాథలో కాకతీయుల మూలపురుషుడు మాధవవర్మ అనివుంది. ఈ మాధవ వర్మ విష్ణుకుండులలో సుప్రసిద్ధుడు. విష్ణుకుండుల కాలంలో కందారపురం - ఆనందగోత్రుల రాజధాని ఉండేది. మాధవవర్మకు సంబంధించిన కందారపురం ఆనందగోత్రుల కందారపురమై వుండడం సమంజసం, సిద్ధేశ్వరచరిత్ర కథలోని వ్యక్తులు, ప్రదేశాలు, కేవలం కల్పితాలు. అందులో చారిత్రకసత్యం ఉన్నదను కొనడం ప్రమాదం. ఇక వెన్నభూపతి కాలానికి- బయ్యారం చెరువు శాసన కాలానికి దాదాపు నాల్గుశతాబ్దాల వ్యవధి వుంది. కాబట్టి, వెన్నభూపతిని గురించి ఆ శాసనస్థ అంశాలను యథాతథంగా అంగీకరించడం యుక్తంకాదు. అదీగాక ఆ శాసనం వెన్నభూపతి పుత్రపౌత్రులను కాకతీయులుగా వ్యవహరించలేదు. మాగల్లుశాసనంకూడ తాను పేర్కొన్న నలుగురిలోను చివరివానినే కాకత్య బిరుదంతో వ్యవహరించింది ఈ కాకత్య గుండ్యన వెన్నభూపతికి ఆరోతరానికి చెందినవాడు. గుండ్యనయే మొదటి కాకతీయుడు. ఈతని కాకత్య బిరుదం బహుశా తరువాత 'కాకతివల్లభ' బిరుదానికి బీజమైవుంటుంది. అయితే, బయ్యారం చెరువు శాసన కాలానికి 'కాకతిపురవల్లభ' బిరుదం ప్రచారంలో ఉన్నందున ఆవంశ నామాన్ని నిర్వచించవలసిన అవసరం ఉన్నందున ఆ శాసనకర్త వెన్న భూపతికి ఆ బిరుదం తగిలించి అందువల్లనే వంశనామం వచ్చిందనినాడనడం యుక్తం. కాకతీయులు 'కాకతిపురవల్లభు'లే కాని, అది వారి జన్మస్థలం కానక్కర లేదు. గ్రామాలను అందలి ప్రసిద్ధ దేవస్థానాల పేర్లతో వ్యవహరించడం మన కున్న సంప్రదాయమే. చేబ్రోలును 'మహాసేనం' అనీ, అనుమకొండను 'రుద్రేశ్వరం' అనీ అనేవారు అదేవిధంగా కాకితమ్మకు దేవస్థానం ఉన్న ఓరుగల్లే 'కాకతిపురం'గా ప్రసిద్ధమై వుంటుంది. కాకత్యగుండ్యన పితామహునికాలంనుండి ఈ వంశంవారికి కొరివి మండలంతో సంబంధం ఉంది. ఓరుగల్లు కొరవి మండలం సరిహద్దులోనే వుంది. అదీగాక, ఆరోజుల్లో మండలాల సరిహద్దులు తరచు మారుతూ ఉండేవి. కొరవి మండలాన్ని బడసిన ఎరియ రాష్ట్రకూటుడు తన రాజ్యాన్ని ఓరుగల్లు - కాకతిపురంనుండి పాలించివుంటాడు. నాటినుండి ఆ వంశస్థులకు కాకతీయులనే వ్యవహారం వచ్చివుంటుంది.

# మొదటి కాకతీయులు

మాగల్లు శాసనంలోని గుండయ రాష్ట్రకూటుడు కాకతీయుల్లో మొదటి చారిత్రక వ్యక్తి. ఈతడు బయ్యారం శాసనంలో మొదటివాడైన వెన్నభూపతి ప్రపౌత్రుడు. కాకత్యగుండ్యన కోరికపై దానార్ణవుడు క్రీ.శ. 950 ప్రాంతంలో మాగల్లు శాసనం ఇచ్చినాడు. కాకత్య గుండ్యనకు గుండయ రాష్ట్రకూటుడు ముత్తాత. కాబట్టి, గుండయ రాష్ట్రకూటుడు క్రీ.శ. 900 ప్రాంతంలోని వాడని భావించవచ్చు అది రాష్ట్రకూట రెండోకృష్ణునకు వేంగి మొదటి చాళుక్య భీమునకు యుద్ధాలు జరుగుతున్న రోజులు. తన పాలనాకాలం ప్రారంభంలోనే చాళుక్యభీముడు సామంతులైన ముదిగొండచాళుక్యల సాయంతో రాష్ట్రకూట దండయాత్రను తిప్పికొట్టినాడు. కాని, రెండోకృష్ణుడు వేంగిపై దాడులు మానలేదు ఈ దాడుల్లో గుండయ రాష్ట్రకూటుడు ప్రముఖపాత్ర వహించినాడు. బహుశా బెజవాడను పట్టుకోవడంలో గుండయ ప్రదర్శించిన సాహసాన్ని మాగల్లు శాసనం వర్ణిస్తున్నది. అనంతరం పెరువంగూరు యుద్ధంలో గుండయ మరణించినాడు. చాళుక్యభీముని మచిలీపట్టణం శాసనం పేర్కొంటున్న 'దండేవ గుండన' గుండయ రాష్ట్రకూటుడే.

గుండయ తన సేవలో ప్రాణాలర్పించినందున కృతజ్ఞతతో రాష్ట్రకూట కృష్ణుడు గుండయకొడుకు ఎరియరాష్ట్రకూటుని కుర్రవాడిపై అధిపతిగా నిలిపి నాడు కుర్రవాడి ముదిగొండచాళుక్య రాజ్యాంతర్భాగమైన కొరవిలోని భాగంగా ఓరుగల్లుకు సమీపంలో ఉంది ఈ రాజ్యానికై తూర్పుచాళుక్య, రాష్ట్రకూట వంశాలమధ్య తరచు సంఘర్షణలు జరిగాయి. రాష్ట్రకూట సామ్రాజ్యం తూర్పు సరిహద్దురక్షణగా, ముదిగొండ చాళుక్యులపై అదుపుగా కుర్రవాడిరాజ్యం ఉపకరి స్తుందని కృష్ణుని ఉద్దేశం. ఎరియ ఓరుగల్లును (కాకతిపురం) రాజధానిగా చేసుకొని పరిపాలన ప్రారంభించినాడు. కాబట్టి, రాష్ట్రకూట సేనాపతులుగా, సరిహద్దు రక్షణోద్యోగులుగా గుండయ, ఎరియలు ఆంధ్రదేశంలో ప్రవేశించి కాకతీయులైనారు.

ఎరియ కొడుకు బేతియను బయ్యారం శాసనం పేర్కొనదు. బహుశా బేతియ సమర్థుడు కానందున అతణ్ణి తరిమివేసి కుర్రవాడిని ముదిగొండచాళుక్యు లాక్రమించి వుంటారు బేతియకొడుకే కాకత్య గుండ్యన. బయ్యారం శాసనం ఇతణ్ణి పిండిగుండ అనిపిలుస్తున్నది. వేంగిలో తిరిగి సంఘర్షణ ప్రారంభం కావటంతో రాష్ట్రకూటుల జోక్యానికి అవకాశం కలిగింది. రాష్ట్రకూట మూడో కృష్ణుని సాయంతో దానార్ణవుడు తమ్ముడైన రెండో అమ్మరాజును తొలగించి రాజ్యం కైవసం చేసుకున్నాడు. ఈ యుద్ధాల్లోనే కాకత్య గుండ్యన దానార్ణవునకు తోడ్పడి నతవాడి పాలకుడయినాడు. ఇంతలో రాష్ట్రకూట, వేంగి రాజకీయాల్లో

విప్లవాలు జరిగాయి. మూడోకృష్ణుని మరణానంతరం (క్రీ.శ. 973) రాష్ట్రకూట వంశాన్ని తొలగించి రెండో తైలపదేవుడు చాళుక్యవంశాన్ని పునః ప్రతిష్ఠించి నాడు. వేంగిలో దానార్ణవుని వధించి జటాచోడ భీముడు సింహాసనం ఆక్రమించి నాడు. ఈ అల్లర్లు అవకాశంగా తీసుకొని కాకత్య గుండ్యన దండెత్తి ముదిగొండ చాళుక్యుల నోడించి తన తండ్రిదైన కుర్రవాడిరాజ్యం స్వాధీనం చేసుకున్నాడు. ఓరుగల్లు నాక్రమించడంతో అతని కాకత్య బిరుదం సార్థకమయింది.

నాటి కల్లోలిత రాజకీయాల్లో విరియాల కుటుంబం అసక్తిదాయకమైన పాత్ర నిర్వహించినట్లు వారి గూడూరు శాసనం నుండి తెలుస్తున్నది. విరియాల ఎఱ్ఱభూపతి "బొట్టుబేతవసుధాధిపుజేకొని వాని వైరినుద్ధ్రతమునజంపి యాకొరవి దేశమునందు ప్రతిష్ఠజేసి"నట్లా శాసనం చెబుతున్నది. క్రివ్యంక శాసనం ప్రకారం బొట్టు బేతడు ముదిగొండ చాళుక్యుడు అతని వైరియైన కాకత్య గుండ్యనను వధించి కొరవి మండలంలో తిరిగి ముదిగొండ చాళుక్యులను నెలకొల్పినాడు ఎఱ్ఱభూపతి.

గుండ్యన కొడుకు పిన్న వయస్కుడైన గరుడ బేతన రాజ్యం కోల్పోయి నిస్సహాయుడయినాడు. ఎఱ్ఱభూపతిభార్య కామసాని అతనిపట్ల జాలివహించింది. ఆమె "గరుడనిభేత భూపతిని గాకతివల్లభు చిన్నవాని దాబరగగ జేతబట్టి....చక్రవర్తిగని కాకతి"లో నిలిపినట్లు గూడూరు శాసనం. కామసాని తైలపుని ఆశ్ర యించి గరుడ బేతని కాకతి (ఓరుగల్లు)లో నిల్పింది. కొరవిలో ముదిగొండ చాళుక్యులు, కాకతి పురంలో కాకతీయులు అధిపతులయినారు. కాకతీయులు విరి యాలవారి సాయంతో చాళుక్యుల సామంతులుగా ఆంధ్రదేశంలో కుదురుకున్నారు.

గరుడ బేతనికి "చోళచమూవార్థి ప్రమథన" బిరుదం ఉంది. నాటి చాళుక్య చోళ సంఘర్షణలో అతడు పాల్గొని యుండవచ్చు. కరీంనగర్ జిల్లాలోని శనిగరంలో బేతని శాసనం ఉంది ఆ ప్రాంతం వేములవాడ చాళుక్య రాజ్యం లోనిది. ఆ శాసనాన్నిబట్టి ఆ ప్రాంతం బేతని వశమయినట్లు స్పష్టమవుతున్నది. బేతన క్రీ.శ. 1052 వరకు రాజ్య మేలినాడు. బేతరాజుమంత్రి నారణయ్య శనిగరంలోని యుద్ధమల్లజినాలయాన్ని జీర్ణోద్ధరణగావించి కానుక లిచ్చినాడు.

బేతనికొడుకు ప్రోలరాజు(క్రీ.శ.1052-76). ఈతని శనిగరం శాసనమూ, పౌత్రుడు దుర్గరాజు కాజీపేట దర్గా శాసనమూ ప్రోలరాజు చరిత్రకు ఆధారాలు. ప్రోలుని పాలనారంభం చాళుక్యయువరాజు (ఆరో) విక్రమాదిత్యుడు దిగ్వి జయ యాత్రలు జరిపిన కాలం. అతని కొంకణ, చక్రకూట దండయాత్రల్లో ప్రోలరాజు పాల్గొని 'సమధిగత పంచమహాశబ్ద' బిరుదాన్ని, త్రైలోక్యమల్లసోమే శ్వరునినుండి అనుమకొండ విషయాన్ని పొందించినాడు. స్థానిక ప్రభువులైన అన్నయ్య గొన్నయ్యలను నిర్జించి, అనుమకొండ ప్రాంతాన్ని నిష్కంటకం

జేసినాడు. అనంతరం భద్రంగుని పారద్రోలినాడు. ఈతడు బహుశా వేములవాడ చాళుక్య వంశస్థుడయిన బద్దెగ అయి వుండవచ్చు. క్రీ.శ. 1068 - 76 మధ్య విక్రమాదిత్యునకు, అతని అన్న రెండో సోమేశ్వరునకు సింహాసనానికై జరిగిన సంఘర్షణలో ప్రోలరాజు, అతనికొడుకు బేతరాజు విక్రమాదిత్యునకు వెన్నుండగా నిలిచినారు. ప్రోలరాజుకు 'అరికేసరి' బిరుదం ఉంది. ఓరుగల్లు సమీపంలో ఈతడు కేసరి సముద్రమనే తటాకం తవ్వించినాడు.

ప్రోలరాజు కొడుకు రెండో బేతరాజుకు (క్రీ.శ. 1076-1108) 'విక్రమ చక్రి' బిరుదం ఉంది. ఈతని మంత్రి వైజదండాధిపుడు రాజనీతి మర్మజ్ఞుడు. బేతరాజు కాలంలో కొల్లిపాక రాష్ట్రాధీశుడైన పరమార జగద్దేవుడు, పొలవాస రాష్ట్రపాలకుడయిన మేడరాజు కాకతీయులపై కత్తిగట్టినారు. వైజదండాధిపుని సాయంతో, విక్రమాదిత్యుని ప్రోత్సాహంతో బేతరాజు వారిద్దరిని అణచి సబ్బి మండలాన్ని సాధించినాడు. దీనితో కొరవి మండలం, అనుమకొండ విషయం, సబ్బిసాయిర మండలం కలుపుకొని కాకతీయరాజ్యం విస్తరించసాగింది. ప్రోల రాజు కాలంలోనో, బేతరాజు కాలంలోనో అనుమకొండ కాకతీయుల రాజధాని అయివుంటుంది.

బేతరాజు మరణానంతరం పెద్దకొడుకు దుర్గరాజు సింహాసనం ఎక్కి నాడు. తండ్రికాలం నుండి దుర్గరాజు రాజ్య వ్యవహారాల్లో పాల్గొన్నట్లు తెలు స్తుంది. అనుమకొండలో శివపురాన్ని, అందు బేతేశ్వరమనే శివాలయాన్ని బేత రాజు నిర్మింపగా, దుర్గరాజు ఆ ఆలయానికి కాలాముఖాచార్యుడైన రామేశ్వర పండితుని పరంగా దానాలు చేసినట్లాతని కాజీపేట దరగా శాసనం చెబుతున్నది. రామేశ్వర పండితుడు శ్రీపర్వత శిలా మఠాధిపతి.

దుర్గరాజు ఎన్మిది సంవత్సరాలు (1108 - 1116) మాత్రమే పాలించి నాడు. పొలవాస పాలకుడయిన మేడరాజుతోను, కొలనుపాక కోల్పోయిన పరమార జగద్దేవునితోను కలిసి దుర్గరాజు చాళుక్య చక్రవర్తిపై తిరుగుబాటుకు ప్రయత్నించగా అతని తమ్ముడు ప్రోలరాజు అతణ్ణి తొలగించి సింహాసనం ఆక్రమించినాడని రా॥ పరబ్రహ్మశాస్త్రిగారి అభిప్రాయం. దుర్గరాజు స్వల్ప పరి పాలనకు అదే కారణం అయి వుంటుంది.

## రెండో ప్రోలరాజు (క్రీ. శ. 1116 - 57)

మొదటి కాకతీయుల్లో ప్రసిద్ధుడు రెండో ప్రోలరాజు. ఈతని విజయాలను పెక్కు శాసనాలు వర్ణిస్తున్నాయి. వానిలో రుద్రదేవుని అనుమకొండ (సహస్ర స్తంభ దేవాలయ) శాసనం ప్రధానమయింది. ఆ శాసనాన్నిబట్టి ప్రోలరాజు యుద్ధంలో తైలపదేవుని పట్టుకొని విడిచినాడు; గోవిందరాజు నోడించి రాజ్యాన్ని ఉదయరాజుకు ఇచ్చినాడు; మంత్రకూటాధిపుడైన గుండనను వధించి ఏదనియుద్ధ

భూమినుండి పారదోలినాడు. అనుమకొండను ముట్టడించిన జగద్దేవుని ఓడించి తరిమివేసినాడు. ఈ రాజులను గుర్తించడంలో అభిప్రాయ భేదాలున్నాయి. జగద్దేవుడు కొలనుపాక నేలే పరమార జగద్దేవుడు. దుర్గరాజును తొలగించి ప్రోలరాజు సింహాసనం ఎక్కినందున ప్రోలరాజుపై జగద్దేవుడు దండెత్తగా ప్రోలరాజాతణ్ణి తరిమివేసినాడు. ఇదే ప్రోలుని మొదటి విజయం అని చెప్ప వచ్చు. తైలపుడు. చాళుక్య చక్రవర్తి మూడో తైలపుడని, ప్రోలుడు కాలచుర్యు లతో చేరి చక్రవర్తిని ధిక్కరించి స్వతంత్రించినాడని చరిత్రకారులు విశ్వసించే వారు.

ఇటీవలి పరిశోధనలవల్ల (డా॥ పరబ్రహ్మశాస్త్రి) క్రీ. శ. 1163 వరకు కాకతీయులు చాళుక్య సార్వభౌమత్వం అంగీకరించినట్లు తెలుస్తున్నది తైలపుడు కందూరు, కొలనుపాక ప్రాంతాలపై చాళుక్య రాజ ప్రతినిధి; ఆరో విక్రమా దిత్యుని రెండో కొడుకు. అన్న భూలోకమల్ల మూడో సోమేశ్వరుడు సింహాసనం ఎక్కినప్పటి నుండి (క్రీ శ 1126) తన రాష్ట్రం (కుమార వృత్తి)లో స్థానిక పాలకుల సాయంతో స్వతంత్రించడానికి ప్రయత్నించినాడు. కందూరు చోడ భీమన, మంత్రకూటాధిపుడైన మేడరాజు, అతని కొడుకు గుండన కుమార తైలపునకు సహాయంగా నిలిచినారు. ఏడరాజు మరొక స్థానిక పాలకుడు. కొండపల్లిపై అధికారం నెరపుతున్న శౌచ గాంగేయ గోవింద దండనాయకుడు తిరుగుబాటుదారుల్లో చేరి బహుశా కందూరు రాజ్యంలోని పానగల్లు ప్రాంతాన్ని తైలపు దేవుని నుండి సంపాదించినాడు ఇంతలో - క్రీ. శ. 1157లో రెండో జగదేకమల్లుడు సింహాసనం ఎక్కడంతో తైలపుడు స్వతంత్రించినాడు. వీరి నణచడానికై జగదేకమల్లుడు దండెత్తగా ప్రోలుడాతనికి బాసటగా ఉండి వారందరిని జయించినాడు. గోవిందరాజును పారదోలి పానగల్లులో చోడ ఉదయనను నిలిపినాడు. గుండని వక్షస్థలంపై వరాహ లాంఛనం ముద్రించి, వధించి నాడు. ఈ విజయాలతో కాకతీయులకు తాత్కాలికంగా శత్రు ప్రమాదం తప్పింది. ప్రోలరాజు శ్రీశైలంవరకు పురోగమించి, అచట విజయ స్తంభం నాటినాడు.

తీరాంధ్రానికి విస్తరించడానికై ప్రోలరాజు చేసిన ప్రయత్నంలో అతని జీవితం విషాదాంతమయింది వెలనాటి యువరాజు రాజేంద్రచోడునికి వెలనాటి సామంతులైన కోటహైహాది మాండలికులకు 'కాకతి ప్రోలనిర్దహన' అనే బిరుదు ఉంది. క్రీ.శ. 1158 లో అనుమకొండ పురవరాధీశ్వర రుద్రదేవుని సేనాని బొమ్మిరెడ్డి శాసనం దాక్షారామంలో ఉంది. ఆ రోజుల్లో పిఠాపురం ప్రాంతాల్లోని చాళుక్యులు వెలనాటి రాజులమీద తిరుగుబాటు చేస్తుండేవారు. వారికి సహాయం చేసి తద్వారా తన అధికారాన్ని విస్తరింపజేయాలని ప్రోలరాజు విధానం. ఆ

ఉద్దేశ్యంతోనే వేగినాడుపై దండెత్తి వెలనాటి రాజుల చేతిలో మరణించి వుంటాడు అతని మరణానంతరం బమ్మిరెడ్డి దాక్షారామంలో శాసనం వేయించి వుంటాడు.

ప్రోలరాజు భార్య ముప్పమాంబ నతవాడి దుర్గరాజు సోదరి అతని మంత్రి బేతనామాత్యుడు వైద్యదండనాథుని కొడుకు. బేతన మంత్రి భార్య మైలమ అనుమకొండపై కడలాలయ జైనవసదిని నిర్మించింది. ప్రోలరాజు శైవుడు. ఓరుగల్లు కోటలో స్వయంభూ దేవాలయాన్ని నిర్మించినాడని ప్రతీతి.

## ప్రసిద్ధ కాకతీయులు

### రుద్రదేవుడు (క్రీ శ. 1158 - 1195)

ప్రసిద్ధ కాకతీయుల్లో రుద్రదేవుడు ఆద్యుడు ఇతణ్ణి కాకతి రుద్రుడని కూడ వ్యవహరిస్తారు. రుద్రుడు గొప్ప పరాక్రమవంతుడు, రాజనీతిపరుడు. ఇతడు సింహాసనం ఎక్కే నాటికి చాళుక్య సామ్రాజ్యంలో విపరీత పరిణామాలు జరిగినాయి. రెండో జగదేవుని తొలగించి (క్రీ. శ. 1151) అతని తమ్ముడు మూడో తైలపుడు సింహాసనం ఎక్కినాడు కాని, అతడు సమర్థుడు కాడు. నాటికి బలాధికుడయిన కలచురి బిజ్జలుడు క్రీ. శ. 1156 - 57 నుండి స్వతంత్రించి చాళుక్య నిర్మూలనకు ప్రయత్నించసాగినాడు కాకతీయులు ఈ విప్లవంలో కాలచుర్యుల పక్షం వహించినారనడానికి ఆధారం లేదు అంతేకాక, క్రీ.శ. 1163 నాటి బిజ్జలుని లక్ష్మేశ్వర శాసనంలో అతడు ఆంధ్రాధిపతితో పోరాడినట్లు ఉన్నది. కుమారతైలపుడు గతించినాడు కాని,కాకతీయ విజృంభణపట్ల అసూయాపరులై కక్ష వహించిన చాళుక్య సామంత వంశాలున్నాయి. చాళుక్య సార్వభౌమాధికారానికి వారసుడుగా బిజ్జలుడు కాకతీయులను లొంగదీసుకొన డానికి ప్రయత్నించినట్లు కన్పిస్తుంది. ఇట్టి క్లిష్ట పరిస్థితుల్లో రుద్రదేవుడు అసమానమైన రాజనీతిని ప్రదర్శించి శత్రు నిర్మూలన చేసి కాకతీయుల స్వాతంత్ర్యాన్ని ప్రకటించటమే గాక రాజ్య విస్తరణ విధానాలను రూపొందించి నాడు.

రుద్రదేవుని చరిత్రకు అతని అనుమకొండ శాసనం ముఖ్యమైన ఆధారం ఆ శాసనాన్నిబట్టి దొమ్మరాజు మేడరాజు, మైలగిదేవ, భీమచోడోదయులను అతడు నిర్జించినాడు. దీన్నిబట్టి సింహాసనం ఎక్కినప్పటినుండి రుద్రదేవుడు అనేక దిగ్విజయ యాత్రలు చేసినట్లు తెలుస్తున్నది. దొమ్మరాజు నగునూరు (కరీంనగర్ జిల్లా) అధిపతి; మేడరాజు పొలవాసాధిపతి - రెండో ప్రోలుడు వధించిన గుండరాజు అన్న; మైలగిదేవుడు కలచురి బిజ్జలుని కుమారుడు. బిజ్జలుని ప్రోత్సాహంతో మైలగినాయకత్వంలో దొమ్మరాజు మేడరాజాదులు కూటమిగా నేర్పడి రుద్రు నెదిరించినారు. రుద్రుడు వారి నోడించి కూటమిని

విచ్ఛిన్నం చేయటమేగాక కలచురి రాజ్యంపై కూడ దండెత్తినట్లు కన్పిస్తుంది. (డా॥ వర(బ్రహ్మ)శాస్త్రి ) మేడరాజు కుమార్తెను రుద్రుడు పెండ్లాడ కోరినాడు. కాని "అనిచ్ఛంకన్యకాందాతుం యస్మై మేడనృపోదదౌ విభూతిందాభిమానంచ కీర్తించ కులసంచితాం"— కూతురు రుద్రునకీయ నిష్టపడక పొలవాస రాజ్యాన్ని రుద్రునకర్పించినాడట. ప్రాచీన రాజవంశంతో వివాహసంబంధంద్వారా తన వంశ ప్రతిష్ఠను పెంచడానికి రుద్రుడు కాంక్షించినాడని, మేడరాజు అందుకు అంగీకరించకపోవడంవల్ల కాకతీయులు నాటికింకా సుక్షత్రియులుగా గుర్తింపుకు రాలేదని భావించవచ్చు.

కందూరు చోడులపై రుద్రుని రెండో దండయాత్ర జరిగింది. కుమార తైలపుని మరణానంతరం చోడభీముడు స్వతంత్రించి రుద్రదేవునితో స్పర్థ పెంచుకున్నాడు. ఇతణ్ణి భ్రాతృహంతయనీ, మాతఃసపత్నీపతి అనీ చాల దుష్టుడుగా శాసనాలు వర్ణిస్తున్నాయి భీమునితో ఉదయచోడుడు చేరినాడు. బహుశా క్రీ.శ. 1160 - 62 ప్రాంతంలో వర్ధమానపురంపై దండెత్తి భీముని నిర్జించి అనంతరం చోడోదయుని రాజధాని పానగల్లును దగ్ధం చేసినాడు. చోడోదయుడు తన కూతురు పద్మావతినిచ్చి పెండ్లిచేసి రుద్రునితో సంధి చేసుకున్నాడు. ఈ విజయాలతో తెలంగాణా ప్రాంతంలో అధికభాగం కాకతీయరాజ్యంలో చేరింది. ఇది జరిగిన వెంటనే కాకతిరుద్రుడు స్వాతంత్ర్యం ప్రకటించుకొన్నట్లు అనుమకొండ శాసనం (క్రీ.శ. 1162) సూచిస్తున్నది.

అనంతరం రుద్రదేవుడు వెలనాటి రాజులపై ప్రతీకారం తీర్చుకొని తన అధికారం తీరాంధ్రంలో విస్తరింపజేయ ప్రయత్నించినాడు వెలనాటి రెండో రాజేంద్రుని పాలనాంతానికి వెలనాటి రాజ్యానికి దుర్దినాలు ప్రారంభమయినాయి. వేంగిమండలంలోని చాళుక్యులు యథాప్రకారం కుట్రలు సాగిస్తున్నారు. దీనికి తోడు క్రీ. శ. 1176-82 ల మధ్య పలనాటి యుద్ధం జరిగింది. పలనాటి వీర చరిత్రనుబట్టి కాకతిరుద్రుడు నలగాముని పక్షానికి సైనికసహాయం చేసినాడు. ఇది మంచి రాజనీతితో కూడిన చర్య. రుద్రుడు ఆశించినట్లు ఆ యుద్ధంతో వెలనాటి మాండలికుల సైనికబలాలు ధ్వంసమై వెలనాటి రాజ్యం నీరసించింది. ఇది అవకాశంగా కాకతిరుద్రుడు తీరాంధ్రంపై దండెత్తి ధాన్యకటకం కోటరాజులను జయించి సామంతులుగా చేసుకున్నాడు; గిరిపశ్చిమదుర్గయులను నిర్జించినాడు. త్రిపురాంతకంవరకు నడిచి, అచట శాసనం వేయించినాడు. (క్రీ. శ. 1185.) బహుశా ఈ దండయాత్రలో భాగంగానే ముదిగొండ చాళుక్యులను కొరవినుండి తరిమివేసి ఆ రాజ్యం ఆక్రమించినట్లు క్రివ్వక శాసనం సూచిస్తున్నది. పిఠాపుర చాళుక్యులు రుద్రునితో మైత్రి వహించినట్లు క్రీ.శ. 1186 నాటి అతని దాక్షారామ శాసనం నిదర్శనం. ఈ విజయయాత్రలతో తెలంగాణం సమస్తమూ కాకతీయ

రాజ్యంలో చేరడమేగాక వారి అధికారం తీరాంధ్రానికి విస్తరించింది. రుద్రుని రాజ్యాన్ని విస్తీర్ణాన్ని అనుమకొండ శాసనం ఈ విధంగా వర్ణిస్తున్నది:

"రాజ్యం ప్రాచ్యం లవణజలధేస్తీరపర్యంతమస్య
శ్రీశైలాంతం ప్రచరతిసదాదక్షిణానాంసమగ్ర
ప్రాతీచ్యాన్తా కటకనికటస్థాయినీరాజ్యలక్ష్మీ
కౌబేరాస్యాంతటవిలసతే మాల్యవంతం ప్రపేదే."

కాకతీయుల విజృంభణ పొరుగున ఉన్న యాదవులకు సయితం కన్నెర్ర జేసింది. యాదవరాజుల ఆస్థానకవియైన హేమాద్రి తన 'చతుర్వర్గసార గ్రంథం 'వ్రతఖండ'లో జైత్రపాలుడు (జైతుగి) తిల్లింగాధిపతియైన రుద్రుని బలిపశువుగా చేసి నరమేధం చేసినట్లుగా చెప్పినాడు. దీన్నిబట్టి జైతుగి రుద్రదేవునోడించి పట్టుకొన్నట్లు స్పష్టమవుతున్నది కొందరు హేమాద్రి సాక్ష్యాన్ని శంకిస్తున్నారు. రుద్రదేవుని అనంతరం అతని సోదరుడు సింహాసనం ఎక్కినవెంటనే యాదవ రాజ్యంపై దండెత్తినాడు. ఈ దండయాత్రకు ప్రతీకారకాంక్ష మినహాయించి మరొక కారణం కన్పించదు. అందుచే జైతుగితోటి యుద్ధంలో రుద్రదేవుడు మరణించినాడనే నిర్ణయం సమంజసంగా కన్పిస్తున్నది.

రాజకీయంగానేగాక సాంస్కృతికంగాకూడ ఆంధ్రదేశ ఉజ్వల భవిష్యత్తుకు రుద్రదేవుడు పునాదులు వేసినాడు. ఓరుగల్లును దుర్భేద్యమైన దుర్గంగా రూపొందించడాని కాతడు ప్రారంభించినాడు. క్రీ. శ 1195 నాటి బెక్కల్లు శాసనం ఓరుగల్లును రుద్రదేవుని నెలవీడుగా - అంటే రాజధానిగా పేర్కొంటున్నది. ఇతని కాలంలోనే కాకతి రాజ్యంలో జైన - శైవ సంఘర్షణలు ప్రారంభమయి, జైనానికి నష్టం వాటిల్లినట్లు కన్పిస్తుంది. జైనాచార్యుడైన ఉపమన్యుముని రుద్రునిపై అతని సోదరుడు మహాదేవునిచే తిరుగుబాటు చేయించినట్లును రుద్రు డాతని నలిపి శిక్షించినట్లును స్థానిక చరిత్రలు చెబుతున్నాయి వైదిక మతంతో వర్ణధర్మాలతో శైవానికిపొత్తు కుదిర్చి ప్రచారంచేసిన మల్లికార్జున పండితారాధ్యుడు రుద్రుని సమకాలికుడు. చండోలును శపించినట్లు పండితుడు పానగల్లును సయితం శపించినాడు. పానగల్లును రుద్రుడు దగ్ధంచేసినాడుగదా! అయితే, కాకతి రుద్రుడు అనుమకొండలో నిర్మించిన రుద్రేశ్వరాలయంలో శివునితోబాటు విష్ణు, సూర్య ప్రతిమలను కూడ ప్రతిష్ఠించినాడు రుద్రదేవుని మంత్రి గంగాధరుడు వైష్ణవాభిమానియైన స్మార్తబ్రాహ్మణుడు, ఈతడు సయితం పెక్కుదేవాలయాలు నిర్మించినాడు. వీనిలో బుద్ధదేవుని ఆలయంకూడ ఉంది రుద్రదేవుడు బాషాభిమాని: కవి. సంస్కృతంలో 'నీతిసారం' అనే గ్రంథం రచించినాడు. అతనికి విద్యాభూషణ బిరుదం ఉంది.

## మహాదేవుడు (1195-99)

రుద్రదేవునకు సంతానంలేనందువల్ల తమ్ముడు మహాదేవరాజు కుమారుడు గణపతిదేవుని దత్తస్వీకారం చేసుకున్నట్లు స్థానిక చరిత్రవల్ల తెలుస్తున్నది. బహుశా రుద్రుడు పట్టుబడిన యుద్ధంలోనే గణపతిసయితం యాదవులకు బందీగా చిక్కినాడు. అందుచేత మహాదేవరాజు సింహాసనం ఎక్కినాడు. అయితే, ప్రతాప రుద్రుని ఖండవల్లి శాసనం ప్రకారం రుద్రదేవుడే మహాదేవునకు రాజ్యం అప్పగించి నట్లుంది. సింహాసనం ఎక్కినవెంటనే అన్నమరణానికి ప్రతీకారం తీర్చుకొని గణపతిని బంధవిముక్తుని చేసే ఆశయంతో యాదవరాజ్యంపై మహాదేవుడు దండెత్తినాడు. ఏనుగు నధిరోహించి యుద్ధం నడుపుతూ మహాదేవుడు మరణించి నట్లు శాసనాలు చెబుతున్నాయి.

కుంభయోస్సకరీంద్రస్య జయశ్రీకుచయోరివ
సంవివేశ రణేగాత్రే రక్తచందన చర్చితః॥

మహాదేవునకు బయ్యాంబికయందు గణపతితోబాటు మైలాంబ, కుంద మాంబ అనే కుమార్తెలున్నారు. మైలాంబను నతవాడి బుద్ధరాజుకొడుకు రుద్రున కిచ్చి పెండ్లి చేసినాడు. కుందమాంబ కూడ అతణ్ణే పెండ్లాడినట్లు కన్పిస్తుంది. కుందమాంబ భర్త రుద్రుడు, బుద్ధరాజు రెండోకొడుకని కొందరి అభిప్రాయం. మహాదేవుడు శైవమతాభిమాని, ధ్రువేశ్వర పండితు డాతని దీక్షాగురువు.

## గణపతిదేవుడు (క్రీ.శ 1199-1262)

గణపతిదేవుని శాసనాలు క్రీ.శ. 1199 నుండి లభిస్తున్నందున నాటికి అతడు సింహాసనం అధిష్ఠించినాడు జైత్రపాలుడే గణపతిని బంధవిముక్తునిజేసి ఆంధ్రదేశానికి పంపివుంటాడు. జైతుగికొడుకు సింఘనకు 'తెలుగురాయస్థాపనా చార్య' బిరుదం ఉంది. ఈ పరిణామానికి నాటి రాజకీయ పరిస్థితులు తోడ్పడి నాయి. హోయసాలులు విజృంభించి యాదవులకు పక్కలోబల్లెంగా తయారయి నారు. హోయసాల రెండో బల్లాలుడు కృష్ణా తుంగభద్రల అంతర్వేది నాక్ర మించినాడు. ఆంధ్రదేశంలో అరాజకం చెలరేగితే హోయసాలరాజ్య విస్తరణకు అనుకూలించి యాదవులకు ప్రమాదమేర్పడవచ్చు అందుచే ఆంధ్రదేశంలో స్థిర ప్రభుత్వం నెలకొనడం యాదవరాజ్య శ్రేయస్సుకు అవసరమని గుర్తించి జైతుగి గణపతిని విడిచిపంపివుంటాడు. ఇంతమాత్రాన గణపతి సేవుణ సామంతుడుగా రాజ్యం చేసినాడననడానికి ఆధారంలేదు. అయితే, సేవుణులతో గణపతి మైత్రివహించి వున్నాడు. దక్షిణాదిన పాండ్యాదులతో జరిగిన యుద్ధంలో కాకతీయ సేవుణ సైన్యాలు కలిసి పోరాడినాయి.

మహాదేవరాజు కాలంలో గణపతి యాదవుల బందీగానున్న రోజుల్లో కాకతీయ రాజ్యంలో అలజడులు చెలరేగినాయి. ముదిగొండ చాళుక్యులైన

నాగభూపాలుడు విజృంభించి తిరిగి కొరవిమండలం ఆక్రమించినాడు. తీరాంధ్రం లోని మాండలికులు పృథ్వీశ్వరుని అధికారం అంగీకరించవలసి వచ్చింది. ఇది అదనుగా మూడో కులోత్తుంగుడు చాళుక్యచోళుడు ఓరుగల్లువరకు దాడిచేసినాడు. ఇట్టిక్లిష్టసమయంలో విశ్వాసపాత్రుడైన రేచర్ల రుద్రసేనాపతి అప్రమత్తతతో అంతరంగిక శత్రువులనణచి విదేశ దాడులను తిప్పికొట్టినాడు. నాగతిదేవుడు పరాజితుడై కొలనిమండలంలో తలదాచుకున్నాడు. ఇంతటితో ముదిగొండ చాళుక్యుల చరిత్ర పరిసమాప్తమైనదని చెప్పవచ్చు. కాకతి సింహాసనం భద్రంగా గణపతికి అప్పగించి రేచర్లరుద్రుడు 'కాకతిరాజ్యభారధౌరేయ' బిరుదం వహించి నాడు. క్రీ.శ. 1199 నాటి మంథెన శాసనంలో 'సకలదేశ ప్రతిష్ఠాపనాచార్య' అనే గణపతి బిరుదంవల్ల నాటికి రుద్రదేవుని రాజ్యసమస్తమూ గణపతి వశమై నట్లు స్పష్టమవుతున్నది.

గణపతి మహావీరుడు; దూరదృష్టి ఉన్న రాజనీతిపరుడు. పాండ్య, హొయసాల, శేవుణరాజుల దురాక్రమణల బారిపడకుండడానికి ఆంధ్రదేశం సమైక్యంగా ఉండడం అవసరమని గుర్తించినాడు. నాటికి ఉత్తరాపథం సమస్తమూ తురుష్కపాదాక్రాంతమయింది. తురుష్కదండయాత్రల ప్రమాదం కూడ అతని దృష్టిలో ఉండివుండవచ్చు. అందుచే ఆంధ్రదేశంలో ఏకఛత్రాధిపత్యం సాధించ డానికై గణపతి దిగ్విజయ యాత్రలు సాగించినాడు. అయితే, జయించిన రాజ వంశాల నాతడు తొలగించలేదు. వారి రాజ్యాల నాక్రమించలేదు. వారితో వివాహ సంబంధాలు చేసి వారి సామంత ప్రతిపత్తిని గుర్తించినాడు. వారు కాకతీయ రాజ్యానికి అండదండలుగా ఉండేవారు. ఈ వివాహ సంబంధాలు గణపతి రాజనీతికి నిదర్శనం.

వెలనాటిపై దాడితో (క్రీ. శ. 1201) గణపతి దిగ్విజయయాత్రలు ప్రారంభమైనాయి. ఈ దండయాత్రను ముత్యాలచౌండరాయడు నిర్వహించినాడు. కాకతీయుల సామంతులు బంధువులునైన నతవాడి రాజులాతనికి సహాయపడి నారు. అయ్యవంశం పాలిస్తున్న దివిసీమపై బెజవాడ నుండి దండెత్తి పిన్నచోడిని జయించి చౌండరాయడు దివిని ఆక్రమించినాడు. గణపతి అతనికి 'ద్వీపీలుంటాక' బిరుదం ఇచ్చి గౌరవించినట్లాతని పెందెకల్లు శాసనంవల్ల తెలుస్తుంది గణపతి పిన్నచోడి కుమార్తెలైన నారమ, పేరమలను పెండ్లాడి వారి సోదరుడు జాయపను తన సైన్యంలో గజసాహిణిగా నియమించినాడు. దివిసీమ నుండి చౌండయ చందోలుపై దండెత్తి పృథ్వీశ్వరు నోడించి అతని కోశం దోచుకున్నాడు. పృథ్వీశ్వరుడు కళింగకు పారిపోయి సైన్యం కూర్చుకొని క్రీ. శ. 1206 - 7 ప్రాంతంలో వెలనాడుపై దండెత్తినాడు. కాకతీయులు, తెలుగుచోడులు కలిసి పృథ్వీశ్వరునోడించి వధించినారు. తిక్కన నిర్వచనోత్తర రామాయణాన్ని బట్టి

చోడతిక్కన పృథ్వీశ్వరుని మస్తకముతో కందుకకేళి సల్పినాడు. గణపతి దేవునికి సయితం 'పృథ్వీశ్వర శిరఃకందుకక్రీడావినోద' బిరుదం ఉంది. ధరణికోటనేలే కోటరాజులు కాకతీయుల సార్వభౌమత్వం అంగీకరించినారు. కోటరుద్రుని కొడుకు బేతరాజుకు తన పెద్ద కూతురు గణపాంబనిచ్చి గణపతి పెండ్లి చేసినాడు. ఈ విజయపరంపరలతో, వివాహసంబధాలతో వెలనాటి ప్రాంతంలో కాకతీయాధికారం బలపడింది.

గణపతిదేవుడు క్రీ.శ. 1212 - 1230 సం॥ మధ్యకాలంలో దక్షిణ దేశంపైకి రెండు దండయాత్రలు పంపినట్లు తెలుస్తుంది. క్రీ.శ. 1212 నాటి చేబ్రోలు శాసనంలో జాయప దక్షిణ దండయాత్రనుండి మరలుతున్నట్లు ఉంది. ఈ దండయాత్ర ఉద్దేశం స్పష్టంగా తెలియదు. క్రీ.శ 1228 నాటి (వరంగల్, గిర్మాజీపేట) శాసనాల్లో గణపతికి 'చోడకటకచూరకార' బిరుదం ఉంది. క్రీ.శ. 1231 నాటి జాయప గణపేశ్వరం శాసనంలో అతడు చోళ, కళింగ, సేవుణ, బృహత్కర్ణాట, లాటాధీశ్వరులను జయించినట్లు ఉంది. నిర్వచనోత్తర రామాయణాన్ని బట్టి కురువులూరు యుద్ధంలో చోడ తిక్కన సేవుణ సైన్యాన్ని నిగ్గించినాడు. తిక్కనకు సాయంగా కాకతీయ సైన్యాలీయుద్ధంలో పాల్గొని వుంటాయి. ఈ యుద్ధానంతరం నెల్లూరు సింహాసనంపై బలపడిన చోడ తిక్కన జీవితాంతం కాకతీయులతో మైత్రి వహించి వున్నాడు. నెల్లూరుపై దాడుల సందర్భంలోనే బహుశా కాకతీయ సామంతుడైన పొత్తపిచోడ ఒప్పిలిసిద్ధి కొణిదెన తెలుగుచోడులను జయించి కాకతీయాధికారంకిందికి తెచ్చినాడు వెలనాడు, కమ్మనాడు, ఏరువనాడు, పాకనాడులలో కాకతీయాధికారం నెలకొన్నది.

పృథ్వీశ్వరుని మరణానంతరం (క్రీ.శ. 1206-7) గణపతి వేంగి, కళింగ రాజ్యాల నాక్రమించడానికి ప్రయత్నించినాడు. అదటి మాండలికులు తూర్పు గంగరాజైన మూడో రాజరాజు పాలనలో వున్నారు. కళింగపై కాకతీయ సైన్యాలు మూడు దాడులు జరిపినాయి మొదటిదానిని రేచర్లరాజునాయక, ఏరువ భీమాదులు నడిపినారు. వేంగిలోని చాళుక్యరాజ వంశాలు కాకతీయాధికారం అంగీకరించినాయి. వారిలో నిడదవోలు చాళుక్యుడైన వీరభద్రునకు రుద్రమదేవి నిచ్చి గణపతి పెండ్లి చేసినాడు అనంతరం కాకతీయ సైన్యాలు మాడెములు, మన్నెములు ఆక్రమించినాయి. బొక్కెర యుద్ధంలో (గంజాం జిల్లా) గోదూమ ఘరట్ట మరణించినాడు. ఉదయగిరి (పెదకిమిడి) యుద్ధంలో పడిరాయలు ఓడిపోయినాడు. బస్తర్ చక్రకూటాలు కాకతీయుల వశమయినాయి. కాని, ఈ దాడి వల్ల పెద్ద ప్రయోజనం లేకపోయింది.

మూడో రాజరాజు మరణానంతరం (క్రీ.శ. 1211) గంగ సింహాసనం ఎక్కిన అనియంకభీముడు సమర్థుడు. సామ్రాజ్యకాంక్ష ఉన్నవాడు. అధిరకాలం

తోనే అనియంక భీముడు కళింగలో కాకతీయాధికారాన్ని తుదముట్టించి పృథ్వీశ్వరుని సంతతివారికి బాసటగా వేంగిని ఆక్రమించినాడు. దాక్షారామం వరకు అతని అధికారం చెల్లింది. అంతేగాక, దక్షిణాదిన చాళుక్య చోళరాజకీయాల్లో జోక్యం కలిగించుకున్నాడు. కాని, వెంటనే గణపతిదేవుడాతనిపైకి సైన్యాలు పంపినాడు. దీనికి ఇందులూరి సోమన, ఏరు భీమన, మల్యాల హేమాద్రిరెడ్డి నాయకులు. వేంగి, కొలను రాజ్యాలు కాకతీయుల వశమయినాయి. ఇందులూరి సోమన కొలనురాజ్యం ఆక్రమించినందున అతని వంశం కొలను వంశంగా ప్రసిద్ధమయింది. అనియంక భీముని అనంతరం అతనికొడుకు నరసింహదేవుడు తిరిగి వేంగిపై దండెత్తినాడు. అతణ్ణి కాకతీయ సకల సేనాపతి పట్టసాహిణియైన వడిదము బొప్పదేవుడు గోదావరి యుద్ధంలో ఓడించి పారదోలినాడు. వేంగిలో కాకతీయాధికారం నిలబడింది. ఇంతలో నెల్లూరులో చోడతిక్కన కుమారుడు మనుమసిద్ధి (వీరగండ గోపాలుడు) దాయాదులకు రాజ్యం కోల్పోయి గణపతి




సాయం అర్థించినాడు. సామంత భోజుని నాయకత్వంలో కాకతీయ సైన్యం నెల్లూరుపై నడచి మనుమసిద్ధి దాయాదులైన అక్కన, బయ్యనలను వధించి మనుమసిద్ధి విరోధులైన ద్రావిడ, కర్ణాటాధీశులను, విజయగండగోపాలుని

ఓడించినారు. కులోత్తుంగ రాజేంద్రచోడుడు ఓడి పారిపోయినాడు. ఇతడు మూడో రాజేంద్ర చోడుడు (చోళచక్రవర్తి) అనీ కాదు. వెలనాటి రాజనీ భిన్న అభిప్రాయాలున్నాయి ఈ విజయాలను నాయనిపల్లి శాసనం వర్ణిస్తున్నది. కాకతీయ సైన్యాలు రక్కెసగంగని ఓడించి కడప ప్రాంతంలో గంగయ సాహిణిని పునరుద్ధరించినాయి. అయితే, గంగయ సాహిణి కాకతీయసామంతుడయినాడు గణపతిదేవు డాతణ్ణి 'బాహత్తరనియోగాధిపతి'గా నియమించినాడు. కాకతీయసామంతుడుగా గంగయ సాహిణి త్రిపురాంతకం నుండి కోలారువరకు ఉన్న రాజ్యాన్ని వల్లూరు రాజధానిగ ఏలినాడు. రేనాడు కాకతీయ సామ్రాజ్య అంతర్భాగమయింది.

నెల్లూరు రాజ్యంలో జోక్యం పాండ్య- కాకతీయ సంఘర్షణకు దారితీసింది. జటావర్మ సుందరపాండ్యుడు చాళుక్య చోళ చక్రవర్తిని కూడ నిర్జించి పాండ్య సార్వభౌమత్వం నెలకొల్పి పూర్వచోళ సామంతులందరినీ విధేయులుగా చేసుకోవాలని సంకల్పించినాడు. నెల్లూరు కూడ చోళసామంత రాజ్యమేగదా? నెల్లూరు రాజ్యం దక్షిణప్రాంతాల్లో ఏలుతున్న విజయగండగోపాలుడు, కొప్పెరుంజింగడు పాండ్య సార్వభౌమత్వం అంగీకరించినారు. ఇక పాండ్యులదృష్టి నెల్లూరుపై మరలింది జటావర్మ తన సైన్యాన్ని రెండుగా విభజించి, ఒక సైన్యాన్ని మూడో రాజేంద్ర చాళుక్య చోళ, విజయగండ గోపాల, కొప్పెరుంజింగల నాయకత్వంలో పశ్చిమంగా కాకతీయరాజ్యం పైకి పంపినాడు. ఈ సైన్యం త్రిపురాంతకం వరకు నడిచింది. కొప్పెరుంజింగడు దాక్షారామం వరకు దాడి చేసినాడు కాని, ఓడిపోయి గణపతి దేవునకు సామంతుడయినాడు. జటావర్మ మిగిలిన సైన్యంతో నెల్లూరుపైబడినాడు. నెల్లూరు సమీపంలో ముటుకూరు చెంత (క్రీ.శ. 1263) తెలుగుచోడ, కాకతీయ, శేవుణ సైన్యాలు పరాజయం చెందినాయి. మనుమసిద్ధి మరణించినాడు. నెల్లూరులో ప్రవేశించి జటావర్మ వీరాభిషేకం జరుపుకున్నాడు. నెల్లూరు రాజ్యం పాండ్య సామ్రాజ్యంలో చేరింది. కాకతీయులకిది ఘోర పరాజయం.

గణపతిదేవుడు క్రీ.శ. 1269 వరకు జీవించివున్నాడు. కాని, చాల వృద్ధుడయినాడు. అతనికి పురుష సంతానం లేనందున రెండోకూతురు రుద్రమకు పురుషోచిత విద్యలునేర్పి తనకు వారసురాలుగా నిర్ణయించినాడు. ఈ ఏర్పాటుకు సమ్మతించని రాజవంశీకుల వల్ల రాజ్యం అలజడులపాలయింది. బహుశా ఇది కారణంగానే గణపతి పాండ్యులపై ప్రతిచర్య తీసుకోలేకపోయినాడు. ముటుకూరు యుద్ధంలో మినహాయిస్తే గణపతి పరాజయం తెలియని విజేత. అతని విజయపరంపరలతో 'తెలుగుదేశం' సమైక్యమై ఆంధ్రులలో వినూత్న జాతీయోత్సాహం కలిగింది. ఓరుగల్లు ఆంధ్రనగరి అయింది. గణపతి ఆంధ్రాధీశుడయినాడు.

నాడు గణపతి కాలంలో పెక్కు తటాకాలు, గ్రామాల నిర్మాణం జరిగింది. అనేక గణపవరాలు వెలసినాయి. మోటుపల్లిరేవులో వేయించిన శాసనం ద్వారా విదేశవర్తకులకు హామీయిచ్చి గణపతి వాణిజ్యం ప్రోత్సహించినాడు. అతడు పరమ మాహేశ్వరుడు. గోళకీమతాధిపతియైన విశ్వేశ్వర శివదేవులు గణపతి దీక్షా గురువు. కాకతీయ శిల్పవాస్తువిద్యలకు గీటురాయైన రామప్ప దేవాలయం గణపతి కాలానిది. ఆంధ్రదేశం నాడు సాధించిన రాజకీయ ఉన్నతికి ఆర్థికపుష్టికి రామప్పదేవాలయం చక్కని ప్రతీక!

## రుద్రమదేవి, (క్రీ.శ. 1269-89)

రుద్రమదేవి బహుశా పురుషవేషంతో 'రుద్రదేవ మహారాజా' అనే పేర క్రీ.శ. 1258 నుండి రాజ్యభారం వహించినట్లు శాసనాలు చాటుతున్నాయి. క్రీ.శ. 1266 నాటి త్రిపురాంతకం శాసనంలో మల్లయ ప్రెగడ తాను గణపతిదేవ మహారాజా సామంతుడనని చెప్పుకొన్నాడు కాయస్థ జన్నిగదేవుని దుర్గి శాసనం (క్రీ.శ. 1269) రుద్రమదేవిని 'పట్టోధృతి'గా వర్ణిస్తున్నది. అంటే. నాటికి రుద్రమదేవికి పట్టాభిషేకం జరగలేదు బహుశా అనంతరం అచిరకాలానికే గణపతిదేవుడు మరణించడంతో రుద్రమదేవి పట్టాభిషేకం జరుపుకొనివుంటుంది.

రుద్రమ సింహాసనమధిష్ఠించడాన్ని ఆమె దాయాదులు వతిఘటించినారు. ఇది అవకాశంగా తీసుకొని పొరుగున ఉన్న శత్రువులు కాకతీయ రాజ్యభాగాల నాక్రమించడానికై ప్రయత్నించినారు. అందుచేత రుద్రమదేవి పాలనాకాలమంతా యుద్ధాలతోనే సరిపోయింది. 'ప్రతాప చరిత్ర' ననుసరించి రుద్రమ సవతి కుమారులైన హరహర మురారిదేవులు రుద్రమపై తిరుగుబాటు చేసినారు కాని విశ్వాసపాత్రులైన రేచర్ల ప్రసాదాదిత్యుడు కాయస్థ జన్నిగదేవుడు, అతని సోదరులు, గోన గన్నారెడ్డి మున్నగు సేనానుల సాయంతో రుద్రమ వారి తిరుగు బాటు నణచింది. వెలుగోటివారి వంశావళిలో ప్రసాదాదిత్యునకు 'కాకతీయ రాజ్య స్థాపనాచార్య' 'రాయ పితామహాంక' బిరుదులున్నాయి. కన్నరదేవ, అంబయ దేవాదులకుగూడ వారి శాసనాల్లో రాయస్థాపనాచార్య బిరుదం కన్పిస్తుంది.

దాయాదుల తిరుగుబాటు నణచడంలో రుద్రమ నిమగ్నమై ఉన్న సమయంలో తూర్పు గంగనరసింహదేవుడు వేంగి ప్రాంతం ఆక్రమించినట్లు అతని దాక్షారామ శాసనం (క్రీ.శ. 1262) సూచిస్తున్నది. క్రీ.శ. 1278 వరకు వేంగిలో కాకతీయాధికారం చెలామణి అయిన నిదర్శనలు లేవు. కాని, పోతి నాయక, ప్రోలినాయకుల ఆధిపత్యంలో కాకతీయ సైన్యం నరసింహదేవుని కొడుకు వీరభానుదేవుని, అతని మిత్రులైన వడ్డాది మత్స్యనాయకులను ఓడించి

తరిమివేసి తిరిగి వేంగిలో కాకతీయాధికారం నెలకొల్పినారు. ఈ నాయకులు 'గజపతిమత్తమాతంగసింహ' 'ఒడ్డియరాయమానమర్దన' బిరుదులు ధరించినారు.

ఇంతలో యాదవ మహాదేవుడు దండెత్తినాడు. ఈ దండయాత్ర ఫలితాలను గురించి ఉభయపక్షాల ఆధారాలలోని సమాచారం పరస్పర విరుద్ధంగా ఉంది. మహాదేవుడు కాకతీయుల యుద్ధగజాలను పంచమహాశబ్దాలను సంగ్రహించి, స్త్రీయనే నెపంతో రుద్రమదేవిని వధింపక విడిచి పెట్టెనని యాదవ సమాచారం. ఇక రుద్రమదేవి యాదవరాజు నోడించి దేవగిరివరకు తరిమి యుద్ధనష్టపరిహారంగా పెద్ద మొత్తాన్ని మహాదేవుని నుండి గ్రహించిందని ప్రతాప చరిత్ర చెబుతున్నది ఇటీవల తెలంగాణా వలుప్రాంతాల్లో యాదవుల బంగారు వెండి నాణేలు దొరికినాయి. వానిపై కాకతీయుల వరాహ లాంఛనం ముద్రితమైనందున ఈ నాణేలు ప్రతాపచరిత్ర సమాచారాన్ని బలపరుస్తున్నాయి. రాచపట్టణం (కృష్ణాజిల్లా) దగ్గిర దొరికిన యాదవ నాణేలు కూడ రుద్రమ వసూలు చేసిన మొత్తంలో భాగమై వుండవచ్చును. రుద్రమ 'రాయగజకేసరి' బిరుదం ధరించింది. కాకతీయ సామంత పదవుల్లో పలువురు యాదవరాకుమారులు చేరినారు.

సామ్రాజ్యం దక్షిణ ప్రాంతంలో విపత్కరమైన దారుణ పరిణామాలు జరిగినాయి ముటుకూరు యుద్ధానంతరం నెల్లూరు రాజ్యం పాండ్యుల వశమై వారి సామంతుల పాలనలోకి పోయింది. నందలూరు, తిరువతి క్షేత్రాలలోని పాండ్య శాసనాలనుబట్టి వల్లూరుకాయస్థరాజ్యంకూడ పాండ్యుల వశమయింది. నెల్లూరును కాకతీయ సేనాని మహామండలేశ్వర నాగతిదేవమహారాజు వశపరచుకొన్నాడు. కాని, అచట కాకతీయాధికారం ఎంతోకాలం నిలవలేదు తిరిగి నెల్లూరు పాండ్య సామంతులైన తెలుగుచోడు లాక్రమించినారు.

వల్లూరు రాజ్యప్రాంతాలను కలుకడ వైదుంబరాజు భుజబలం వీరనారాయణుని నుండి కాయస్థసేనాని జన్నిగ జయించి ఆక్రమించినాడు. వల్లూరు పాండ్యాధికారంనుండి విముక్తమయింది. జన్నిగదేవుడు, అతని అనంతరం త్రిపురారిదేవుడు (క్రీ.శ. 1270.72) కాకతీయ సామంతులుగానే పాలించినారు. కాని, త్రిపురారి తరువాత సింహాసనం ఎక్కిన అంబయదేవుడు రుద్రమను ధిక్కరించి స్వతంత్రకాయస్థరాజ్యస్థాపనకు పూనుకున్నాడు. అంబయకూడ మొదట్లో కాకతీయ విధేయుడే. రుద్రమ ఇక్కట్లు బహుశా అతనిలో స్వాతంత్ర్యకాంక్షను రెచ్చగొట్టివుంటాయి. త్రిపురాంతకం శాసనం అంబయ విజయ పరంపరలను వర్ణిస్తున్నది. పాండ్య కేరళాధీశులతో మైత్రివహించి వారి సైనిక సహాయంతో అంబయ స్వతంత్రించినట్లు కన్పిస్తున్నది. పై శాసనం ప్రకారం అంబయ డెబ్బయి అయిదుమంది నాయకులతో పోరాడినాడు. వీరు కాకతీయ

నాయంకరులయి వుండవచ్చును. గురిందాల (గురిజాల) ప్రభువైన రాయమల్లహస్ర శ్రీపతి గణపతి నోడించినాడు. కలుకడ వైదుంబాధీశులైన సోమిదేవులను వారి మిత్రులైన గుత్తి పురాధీశుడు అల్లు గంగను ఓడించినాడు; ఏరువ మనుమల్లి దేవుని వధించి ఏరువనాడు నాక్రమించినాడు; పెండెకల్లు అతని వశమయింది; కొప్పెరుంజింగని వధించి 'కాడవరాయి విధ్వంసక' బిరుదం ధరించినాడు ఈ విజయాలతో కాయస్థరాజ్యంలో గండికోట, ములికినాడు, రేనాడు, సకిలినాడు, ఏరువ, పొత్తపినాడు చేరినాయి. నెల్లూరులో మనుమగండ గోపాలుని సింహాసనం ఎక్కించి, అంబయ దేవు దాతణ్ణి సామంతుడుగా చేసుకున్నాడు. తమ అధికారం పునరుద్ధరించడానికి దండెత్తి వచ్చిన పాండ్యుల నోడించి పారదోలినాడు. దీనితో ఆంధ్రదేశ దక్షిణ ప్రాంతంలో సువిశాలమైన స్వతంత్రకాయస్థ రాజ్యం బలపడి, కాకతీయ సార్వభౌమత్వానికి భంగం కలిగింది.

అంబయ తిరుగుబాటును రుద్రమ సహించలేదు మల్లికార్జున నాయక సేనాపతి నాయకత్వంలో ఒక సైన్యాన్ని అంబయపై నడిపింది. క్రీ.శ. 1295 వరకు రుద్రమ జీవించి వుందని, అంబయ తిరుగుబాటు నణచటం ఆమె పాలనలోనే జరిగిందనే అభిప్రాయం వుండేది. కాని, ఇటీవల బయల్పడిన చందుపట్ల (నల్గొండ జిల్లా) శాసనం నుండి క్రీ.శ. 1289 నాటికే రుద్రమ మరణించినట్లు తెలుస్తున్నది. అంబయ కూడ సకలాంధ్రపతినియైన అతని ఏలికతోసహా మల్లికార్జున నాయకుని వధించినట్లు చెప్పుకున్నాడు. చందుపట్ల శాసనం రుద్రమ మల్లికార్జున నాయకుల పుణ్యార్థం చేసిన ధర్మాన్ని నమోదు చేస్తున్నది. అందుచేత అంబయతోటి యుద్ధంలోనే రుద్రమ మరణించెనని నిర్ణయించవలసివుంది.

నిరంతరం యుద్ధాల్లో నిమగ్నురాలయినప్పటికీ రుద్రమ మంచి సామర్థ్యంతో పరిపాలన నిర్వహించింది ఓరుగల్లుకోటకు మరమ్మత్తులు చేయించి రాతికోటకు లోపైపున మెట్లు కట్టించింది మట్టికోటకు అగడ్తను, బురుజులను నిర్మించి ఓరుగల్లును దుర్భేద్యంగా చేసింది. రుద్రాంబకాలంలో దేశం సుభిక్షంగా ఉంది. ఆమె పాలన చివర్లో సుప్రసిద్ధ వెనిస్ యాత్రికుడయిన మార్కోపోలో మోటుపల్లి రేవులో దిగి, దేశంలో పరిపాలన కట్టుదిట్టంగా వుందని, పరిశ్రమలు, వాణిజ్యం అభివృద్ధిలో ఉన్నాయని వర్ణించినాడు.

## ప్రతాపరుద్రుడు (క్రీ.శ. 1289–1323)

రుద్రమదేవికి గూడ పురుష సంతానం లేదు. ఆమెకు ముగ్గురు కుమార్తెలు రుయ్యమ రుద్రమ, ముమ్మిడమ్మ. రుయ్యమను బ్రాహ్మణ సేనాని ఇందులూరి (కొలని) అన్నయ్య మంత్రికిచ్చి పెండ్లి చేసింది. రుద్రమను యాదవ రాకుమారుడైన యల్లాణదేవుడు పెండ్లాడినాడు. ముమ్మిడమ్మకు మహాదేవరాజుతో పెండ్లి జరిగింది. మహాదేవరాజు కాకతీయ వంశ్యుడని తెలుస్తుందిగాని - ఇతర

వివరాలు తెలియవు, ముమ్మిడమ్మ కుమారుడు ప్రతాపరుద్రుడు. పెద్దల అజ్ఞాను సారం రుద్రమదేవి దౌహిత్రుడైన ప్రతాపరుద్రుని పుత్రభావంతో, అంటే బహుశా దత్త స్వీకారం చేసింది. గణపతి దేవుని జీవిత కాలంలోనే ఇది జరిగి ఉండ వచ్చు. కాకతి రుద్రకుమార, కుమార రుద్రదేవ అనే పేర్లతో రుద్రమ కాలంలోనే ప్రతాపరుద్రుడు రాజ్య వ్యవహారాలను నిర్వహించినట్లు తెలుస్తుంది. క్రీ. శ. 1289 లో రుద్రమ మరణానంతరం అతడు పట్టాభిషేకం చేసుకొన్నాడు. ఆ తరువాత సయితం శాసనాల్లో కుమార రుద్రదేవ అనే పేరు కనిపిస్తుంది.

ప్రతాపరుద్రుని పాలనలో కాకతీయ సామ్రాజ్యం ఉచ్ఛస్థితి నందింది; కాని, విచ్ఛిన్నం కూడ అదే కాలంలో జరిగింది. ప్రతాపరుద్రుని పాలన కాల మంతా అంతరంగిక విప్లవాల సణచడంలోను విదేశ దండయాత్రల నెదుర్కొ నడంలోను గడిచిపోయింది. అంతరంగికమైన తిరుగుబాట్లకు కాయస్థ, వెలమ, రెడ్డి, వర్ణవైషమ్యాలు ప్రోత్సాహ కారణాలై వుండవచ్చును. అంతర్బహి శ్శత్రువులతోటి సంఘర్షణ ఫలితంగా కాకతీయ సామ్రాజ్యం కూలిపోయింది.

ప్రతాపరుద్రుడు సింహాసనం ఎక్కినపుడు అంబయతోటి యుద్ధం సాగు తున్నది. యుద్ధాన్ని విజయవంతంగా నిర్వహించి, కాకతీయ వంశ ప్రతిష్ఠను రాజ్య ఔన్నత్యాన్ని పునరుద్ధరించడం ప్రతాపరుద్రుని ప్రథమ కర్తవ్యమయింది. అందుకు అనుగుణంగా నాయంకర విధాన పునర్నిర్మాణం జరిగింది. రాజ్యాన్ని 77 లేక 75 నాయంకరాలుగా విభజించి, ప్రతాపరుద్రుడు విశ్వాసపాత్రులైన సేనాపతుల పరం చేసినాడు. అయితే, దీనివల్ల కాకతీయులకు అండగా ఉంటూ ఉండిన పూర్వ సామంత వంశాలు నష్టపడినట్లు కన్పిస్తుంది. అదీగాక నాయం కరులలో అధికభాగం వెలమలు కావడంతో వర్ణవైషమ్యాలకు దోహదప్రాయమై, ప్రతాపరుద్రుని పట్ల రెడ్లకు ఆగ్రహం కలిగించిందని స్థానిక చరిత్రలు సూచి స్తున్నాయి.

అనంతరం అంబయపై, అతని మిత్రులపై త్రిముఖంగా దండయాత్రలు జరిగినాయి కొలని సోమయ మంత్రి కొడుకైన గన్నయసేనాని అంబయనోడించి త్రిపురాంతకం ప్రాంతాన్ని ఆక్రమించినాడు (క్రీ.శ. 1291). రెండో దాడి నెల్లూరుపై జరిగింది. సకల సేనాపతి సోమయాదుల రుద్రదేవుని దక్షిణభుజాదండ మైన ఆడిదంమల్లు మనుమడు గండగోపాలుని వధించి, రాజగండగోపాలుడనే రంగనాథుని సింహాసనం ఎక్కించినాడు. కాని, రంగనాథుడు పాండ్యులతో చేరి కాకతీయులను ధిక్కరించడంతో నెల్లూరు రెండో దండయాత్ర అవసరమయింది. ఈ దండయాత్ర మనుమ గండపాలుడనే తెలుగు చోడుని నాయకత్వంలో జరిగింది. రంగనాథుడు, అతని పాండ్యమిత్రులు పూర్తిగా పరాజితులయినారు. ఇక మూడోదాడి పశ్చిమ ప్రాంతాలపై, బహుశా సేవుణరాజ్య దక్షిణసరిహద్దులపై

జరిగింది. వర్ధమానపురం పాలిస్తున్న కాకతీయ సామంతుడు గోన విఠలుడీ దండ యాత్రను నిర్వహించినాడు. కృష్ణా తుంగభద్రా అంతర్వేది కాకతీయ సామ్రాజ్యంలో చేరింది. రాయచూరు దుర్గ నిర్మాణం జరిగింది.

ఇంతలో తురుష్క-దండయాత్రలు జరిగి (క్రీ.శ 1303.1310), కాక తీయరాజ్యం అలజడిపాలయింది. ఇది అవకాశంగా దక్షిణదేశంలోని సామంతులు తిరుగుబాటు చేసినారు. గండికోటలో వైదుంబ మల్లిదేవుడు, నెల్లూరులో రంగ నాథుడు స్వతంత్రించినారు. జుట్టయలెంక గొంకారెడ్డినాయకత్వంలో కాకతీయ సైన్యం మల్లిదేవునోడించి గండికోట నాక్రమించింది. గొంకారెడ్డి ఆ ప్రాంతానికి కాకతీయరాజప్రతినిధి అయినాడు. ఇది ఇట్లుండ పాండ్యరాజ్యంలో అంతర్యుద్ధం ప్రారంభమయింది. కులశేఖరపాండ్యుని మరణానంతరం వీరపాండ్య, సుందర పాండ్యులు సింహాసనానికై కలహించినారు. సుందరపాండ్యుని అభ్యర్థనపై మాలిక్ కవూర్ పాండ్యరాజ్యంపై దండెత్తి నగరాలు, ఆలయాలు దోచుకొని ఢిల్లీకి మరలినాడు. అతడు రాజకీయంగా సాధించిందేమీలేదు. పాండ్యరాజ్యంలో అరాచకం కేరళ, కర్ణాటక రాజుల జోక్యానికి అవకాశమిచ్చింది. మలయాళ కులశేఖరుడు వీరపాండ్యునకు సహాయంగా వచ్చినాడు. చంద్రగిరి యాదవ రాజు పడైవీడు సాంబువ రాయలతో కలసి హొయసాల మూడో బల్లాలుడు దండెత్తి కాంచీపురి నాక్రమించినాడు. ప్రతాపరుద్రుడుకూడ పాండ్యరాజ్యంపై దండెత్తినాడు. ఈ దండయాత్రను (క్రీ.శ. 1311) ఢిల్లీ సుల్తాన్ అల్లావుద్దీన్ ఖిల్జీ ఆజ్ఞానుసారం నిర్వహించినాడని కొందరి (నెలటూరి వెంకటరమణయ్యగారి) అభిప్రాయం కాని, అందుకు స్పష్టమైన ఆధారం లేదు. పూర్వ పరాజయాలకు ప్రతీకారం చేయడానికి ఇదే మంచి సమయమని ప్రతాపరుద్రుడు పాండ్యరాజ్యంపై దండెత్తి వుండవచ్చు. ఈ దండయాత్రలో పెదరుద్ర, ముప్పిడినాయక, రేచర్ల ఎరదాచానాయక, దేవరినాయకాది కాకతీయ సేనాపతులు ప్రముఖపాత్ర వహించి నారు. పెదరుద్ర ముప్పిడి నాయకులు రంగనాథు నోడించి నెల్లూరునుండి పార దోలినారు. నెల్లూరు కాకతీయుల రాజ్యాంతర్భాగమైంది. దేవరినాయకుడు హొయసాలులనుండి కాంచీపురినాక్రమించి మలయాళకులశేఖరునితోసహా వీర పాండ్యునోడించి వీరధవళందగ్గిర సుందరపాండ్యునకు పట్టం కట్టినాడు. కావేరి తీరంలోని శ్రీరంగనాథునకు దేవరినాయకుడు సలకలవీడును (గిద్దలూరు తా॥) దానం చేసినాడు. కాంచీపురంవరకు కాకతీయాధికారం చెల్లుబడి అయింది.

తుంగభద్రాతీరంలోని ఆనెగొందిలో యాదవసామంతుడైన సింగమనాయ కుడు కంపిలి అనే స్వతంత్రరాజ్యం స్థాపించినాడు అతని కుమారుడైన కంపిల దేవుడు మహాపరాక్రమవంతుడు కంపిలిరాజ్యం విస్తరింపజేయడం అతని లక్ష్యం. అందుచేతనాతడు హొయసాల మూడో బల్లాలునితోయుద్ధానికి దిగినాడు. యుద్ధ

నిర్వహణలో ప్రతాపరుద్రుని సహాయం అర్థించి విఫలుడయినాడు. అది కారణంగా ప్రతాపరుద్రునిపై పగబట్టి 'మూరురాయరగండ' 'వీరరుద్రదనగండ' అనే బిరుదులు ధరించి కంపిలదేవుడు ప్రతాపరుద్రున కాగ్రహం కలిగించినాడు. అతణ్ణి అణచడానికై బెండపూడి అన్నయామాత్యుడు, రేచర్ల సింగమనాయుడు కంపిలి రాజ్యంపై నడచి, కంపిలరాయల అటోపం అడచినారు. శ్రీనాథుని భీమేశ్వర పురాణం అన్నయామాత్యుని "దాడి విఘటిత కుమ్మటోద్యాను"డని వర్ణిస్తున్నది. కుమ్మటం కంపిలి రాజ్యంలో బలమైన దుర్గం.

ఈ యుద్ధాలన్నీ క్రీ.శ. 1315 నాటికి పూర్తయినాయి. యుద్ధాలవల్ల, తురుష్క-దండయాత్రలవల్ల, ఢిల్లీ సుల్తానుకు పలుమార్లు చెల్లించిన కప్పంవల్ల వట్టిపోయిన ధనాగారం నింపడానికి ప్రతాపరుద్రుడు అనేక విధాల ప్రయత్నించినాడు. కడప, కర్నూలు, పల్నాడు ప్రాంతాల్లో అడవులు ఛేదించి పంట పొలాలుగా మార్చడం జరిగింది. నీటిపారుదల సౌకర్యానికై చెరువులు, బావులు తవ్వించినారు. నిర్జన ప్రదేశాల్లో గ్రామాలు, నగరాలు ఏర్పడినాయి. కాకతీయుల రాజ్య ఆర్థికపరిస్థితి మెరుగుపడింది.

ప్రతాపరుద్రుడు భాషాభిమాని. సంస్కృతాంధ్ర కర్ణాట కవులాతని పోషణ నందుకున్నారు. ఆతని ఆస్థానకవియైన విద్యానాథుడు సంస్కృతంలో 'ప్రతాపరుద్ర యశోభూషణ' మనే అలంకార గ్రంథం రచించినాడు. అగస్త్య, విశ్వనాథ కవులు సంస్కృత భాషకు నూతనాలంకారాలు చేకూర్చినారు. ప్రతాపరుద్రుని మంత్రులు, సేనాపతులు కూడ భాషాపోషకులు. గన్నారెడ్డి మారన మార్కండేయ పురాణాన్ని అంకితం పుచ్చుకున్నాడు. భాస్కర రామాయణ రచనా పూర్తికి సాహిణిమారుడు కారణమైనాడు.

### ప్రతాపరుద్రుడు - తురుష్కులు

ఈ విధంగా సర్వతోముఖాభివృద్ధి చెందుతున్న కాకతీయ సామ్రాజ్య వైభవం తురుష్కుల నాకర్షించింది. నాటికి ఉత్తరాపథం ఢిల్లీ సుల్తానుల పాదాక్రాంతమై, వారి దృష్టి దక్షిణాపథంపైకి మరలింది. మొహమ్మదీయ బాటసారులు, రచయితలు - అమీర్ ఖుస్రూ అబ్దుల్లా వాసఫ్ - దాక్షిణాత్యరాజ్యాల మహదైశ్వర్యాన్ని ఢిల్లీ సుల్తానుల నోరు ఊరేటట్లు వర్ణించినారు. ఆ సంపదను దోచుకుని దక్షిణాపథంలో తమ సామ్రాజ్యాన్ని విస్తరింపజేయడానికి ఉవ్విళ్ళూర సాగినారు. క్రీ.శ. 1294 లోనే దక్షిణాపథంపైకి ముస్లిం దాడులు ప్రారంభమయినాయి. హిందూ మత సంస్కృతులకు బద్ధ విరోధులుగా భావిస్తున్న తురుష్కుల దాడుల సందర్భంలో సయితం దాక్షిణాత్యరాజులు తమ వైరాలను మరచి సమైక్యంగా తమ శత్రువును ప్రతిఘటించకపోవడం శోచనీయం. యథాప్రకారం హిందూ రాజులు పరస్పర యుద్ధాలు సాగించడమేగాక తమ యుద్ధాల్లో తరచు ముస్లింల

సహాయాన్ని అర్థించడాన్నిబట్టి వారికి వ్యక్తిగత రాజకీయ విజయాల్లో ఉన్న శ్రద్ధాసక్తులు హిందూమత సంస్కృతుల రక్షణపట్ల ఉన్నవా? అనే అనుమానం కలగడం సహజం

దక్షిణ దేశంపై మొదటి ముస్లిం దండయాత్రను క్రీ శ 1294 లో అల్లా ఉద్దీన్ ఖిల్జీ నడిపినాడు. యాదవ రాజ్యంపై దండెత్తి, రామదేవుని ఓడించి ఎల్లిచ్ పూర్ జిల్లాతో సహా అపార ధనరాసులు కప్పంగా గ్రహించినాడు. యాదవ రాజ్యం ఢిల్లీ సామంత రాజ్యమయింది అనంతరం అల్లాఉద్దీన్ దృష్టి కాకతీయ రాజ్యంపై మరలింది దాక్షిణాత్య రాజ్యాలను సామంత రాజ్యాలుగా చేసుకొని వానినుండి కప్పం గ్రహించడమే అతని ఆశయంగా కన్పిస్తుంది. క్రీ శ. 1309 లో కపూర్ దక్షిణ దేశ దండయాత్రకు బయలుదేరే సమయంలో "రుద్రదేవుడు సామంతుడై కప్పంచెల్లించడానికి అంగీకరిస్తే యుద్ధం విరమించి అతని పట్ల మర్యాదగా ప్రవర్తించవలసింది" అని ఖిల్జీ అతనికి సలహా యిచ్చినాడు. కాని, ఖిల్జీల అనంతరం ఢిల్లీ సుల్తానులైన తుగ్లక్‌లు ఈ విధానానికి స్వస్తి చెప్పి, దాక్షిణాత్యరాజ్యాలను నిర్మూలించి ఢిల్లీ సామ్రాజ్యం విస్తరింపజేయడానికి పూనుకున్నారు.

ఓరుగల్లుపై తురుష్కులు ఎనిమిదిమార్లు దండెత్తినారని ప్రతాప చరిత్ర, విలస, కలువచెరు శాసనాలు పేర్కొన్నా ముస్లిం చరిత్రల నుండి ఐదు దాడుల వివరాలు మాత్రమే లభిస్తున్నాయి. ఈ విషయంలో ముస్లిం సమాచారమే విశ్వాసయోగ్యమైనదని చరిత్రకారుల అభిప్రాయం. మొదటిమారు క్రీ. శ. 1303 లో అల్లాఉద్దీన్ ఖిల్జీ పెద్ద సైన్యంతో మాలిక్ ఫక్రుద్దీన్ జూనాను బెంగాలు మీదుగా ఓరుగల్లుపైకి పంపినాడు. ఈ సైన్యాన్ని ఉప్పరపల్లి (కరీంనగర్ జిల్లా) దగ్గిర రేచర్ల వెన్న సేనాని, పోలుగంటి మైలి ఓడించి తరిమివేసినారు పరాజయం వల్ల అల్లాఉద్దీన్‌కు ఓరుగల్లుపై పగ ఇనుమడించింది. ఓరుగల్లును జయించడానికై క్రీ.శ. 1309 లో మాలిక్ కపూర్ సేనానిని పంపినాడు. మాలిక్ దేవగిరి చేరి. అటనుండి బసీర్‌ఘర్, సర్బార్, కూనర్బాల్‌ల గుండా అనుమకొండ చేరినాడు. సర్బార్‌కోటలోని సేనానులు భార్యలతోసహా జౌహార్ చేసినట్లు అమీర్ ఖుస్రూ వ్రాసినాడు. అనుమకొండ నుండి ఓరుగల్లు కోటపై ముట్టడి జరిగింది. మట్టికోట నాక్రమించి, రాతికోటపై ముస్లింలు దాడి ప్రారంభించినారు. నెల రోజులుగా ముట్టడి సాగినందున పౌరజనం అనేక కష్ట నష్టాలకు గురి అయినారు. గత్యంతరం లేక ప్రతాపరుద్రుడు మాలిక్ కపూర్‌తో సంధి చేసికొని 100 ఏనుగులు, 6000 ఖర్వారుల ధనం ఇవ్వడమేగాక ప్రతి సంవత్సరం ఢిల్లీకి కప్పం చెల్లించడానికి అంగీకరించినాడు అల్లాఉద్దీన్ జీవితాంతము ప్రతాపరుద్రుడీ షరతులను గౌరవించినాడు.

అల్లాఉద్దీన్ మరణంతో ఢిల్లీలో చెలరేగిన అలజడులు అవకాశంగా తీసుకొని ప్రతాపరుద్రుడు కప్పం చెల్లించడం మానినందున, ముబారక్‌ఖిల్జీ ఓరుగల్లుపై దాడి పంపినాడు. ఈ దండయాత్రను ఖుస్రూఖాన్ నడిపినాడుగాని ఈ దండయాత్ర వివరాలు లభించలేదు. ప్రతాపరుద్రుడు ఓడిపోయి, 100 ఏనుగులు, 12000 గుర్రాలు, పెద్ద మొత్తంలో ధనమూ ఇచ్చి సంధి చేసుకున్నట్లు అమీర్‌ఖుస్రూ, ఇసామీల రచనల నుండి తెలుస్తున్నది.

ఘియాజుద్దీన్ తుగ్లక్ కాలంలో నాలగో దండయాత్ర జరిగింది (క్రీ.శ. 1321 - 22). దండయాత్రను నడిపింది 'ఉల్లూఖాన్' బిరుదాంచితుడైన యువరాజు జూనాఖాన్ (మొహమ్మద్‌బిన్ తుగ్లక్) దేవగిరి మీదుగా పురోగమించి కోటగిరి మొదలైన దుర్గాలతో సహా ఓరుగల్లును తురుష్కులు ముట్టడించినారు. ముట్టడి ఆరు మాసాలు జరిగినట్లు తెలుస్తుంది. విజయం కనుచూపు మేరలో ఉండగా ముస్లిం సైన్యంలో కవి ఉబెయిద్ కారణంగా ఢిల్లీ సుల్తాన్ మరణించినాడనే నీలి వార్త వ్యాపించి తైమూర్, టిగిన్ అనే సేనాపతులు తిరుగుబాటు చేసి, ప్రతాపరుద్రునితో సంప్రదింపులు ప్రారంభించినారు. గత్యంతరం లేక ముట్టడి విరమించి ఉల్లూఖాన్ తిరోగమనానికి ఉద్యుక్తుడయినాడు. తిరోగమిస్తున్న ఢిల్లీ సేనపై కాకతీయ సైన్యం పడి, అపార నష్టం కలిగించినట్లు ఇసామీ, ఫెరిష్టాల రచనలనుండి తెలుస్తున్నది. ఏచానాయకుడు కొలచలమ యుద్ధంలో తురుష్కుల నోడించి వారి గుర్రాలు సంగ్రహించినట్లు వెలుగోటివారి వంశావళి చెబుతున్నది. స్థానిక చరిత్రల్లో కోసగి నాయకులకు 'ఉల్లుఖాన సప్తాంగహరణ' అనే బిరుదు కన్పిస్తుంది.

ఉల్లూఖాన్ దేవగిరిచేరి, ఢిల్లీనుండి అదనపు సైన్యాలు వచ్చిచేరడంతో తిరిగి ఓరుగల్లుపై దండయాత్ర సంకల్పించినాడు. తురుష్కసైన్యాలు బిదర్, బోధన్ నగరాలు ఆక్రమించి ఓరుగల్లును ముట్టడించినాయి. అప్పటికే కాకతీయ సైన్యంలో ప్రతిఘటనాపాటవం సన్నగిల్లింది. అనేకమార్లు జరిగిన ముస్లిం దండయాత్రలవల్ల సైనిక బలానికి చాల నష్టం వాటిల్లింది. ఆర్థికంగా రాజ్యం నీరసించింది. తురుష్కులచేతిలో తరచుగా పొందిన పరాజయం ఫలితంగా ప్రజల్లోను సైన్యంలోనుకూడ నైతికబలం క్షీణించింది. ఇన్నిమార్లు తురుష్కదండయాత్రలు జరిగినప్పటికీ కాకతీయులు తమ యుద్ధనిర్వహణ విధానాన్ని సంస్కరించుకొనలేదు. ఆగ్నేయాస్త్ర దళాన్నిగానీ అశ్వ దళాన్నిగానీ మెరుగుపరచుకొనలేదు. 'ఓరుగల్లు కోటలోనున్న శిలాకంటకాలు విసిరే గండశిలలు బ్రాహ్మణ యజ్ఞోపవీతాల నుండి వస్తున్నవా అన్నంత నిష్ప్రయోజనంగా ఉన్న'వని ఒక ముస్లిం చరిత్రకారుడు పరిహసించినాడు. అన్నిటికంటే ముఖ్యం వర్ణ వ్యత్యాసాలవల్ల సైన్యంలో సయితం ఐకమత్యం లోపించింది. రెడ్డినాయకులు ప్రతాపరుద్రునిపట్ల,

వెలమనాయకులపట్ల ద్వేషంవహించినారు. ఉలుఘఖాన్‌తోటి యుద్ధం క్లిష్టపరిస్థితికి చేరుకున్న సమయంలో బొబ్బారెడ్డి అనే సేనాపతి తన సైనికదళంతో కాకతీయ సైన్యం నుండి వైదొలగి, యుద్ధభూమినుండి నిర్గమించినట్లు ప్రతాపచరిత్రవల్ల తెలుస్తున్నది. మన చరిత్రలో ఇటువంటి ద్రోహాలు అరుదుగానీ అపూర్వంగానీ కాదు! అట్టి ప్రతికూల పరిస్థితుల్లో ప్రతాపరుద్రుడు శక్తికొలది ఉలుఘఖాన్ నెదిరించి పోరాడినాడు ఆంధ్రసైన్యం పరాజితమయింది. ఆంధ్రసేనాపతుల్లో సుప్రసిద్ధులు మరణించినారు. ప్రతాపరుద్రుడు తురుష్కులచేతిలో బందీ అయినాడు. ఖాదర్ ఖాన్‌చే ఢిల్లికి గొనిపోబడుతూ మార్గమధ్యంలో నర్మదానదీతీరాన ప్రతాపరుద్రుడు మరణించినాడు. 'సోమోద్భవాయాః సరితః ప్రతీరే దేవాదయా సీత్ త్రిదశాధి వాసమ్' అని విలస శాసనం ఆంధ్రదేశం ఢిల్లీ సామ్రాజ్యంలో లీనమయింది. ఆంధ్రనగరి సుల్తాన్‌పూర్ అయింది.

## కాకతీయ యుగ విశేషాలు

### జాతీయైక్యము

ఆంధ్రభాషను మాట్లాడువారి నందరిని ఏకచ్ఛత్రాధిపత్యం కిందికి గొని తెచ్చి, ఆరాజకీయ సమైక్యం ఫలితంగా వారిలో జాతీయచైతన్యం కలిగించినవారు కాకతీయులు. వారి విజయపరంపరం ఫలితంగా సన్నిహితులైన ఆంధ్రులు ప్రాంతీయభావాలు విస్మరించి తాము ఆంధ్రులమని గుర్తింపసాగినారు రేనాడు, వెలనాడు, వేగినాడు, పాకనాడు అనే ప్రాంతీయనామాలు మరుగునపడి త్రిలింగ, ఆంధ్రపదాలు పర్యాయ పదాలుగా ప్రచారంలోకి వచ్చినాయి. కాకతీయులు ఆంధ్రాధీశులయినారు. ఓరుగల్లు ఆంధ్రనగరి ఆయింది. వేంగి దేశానికి నాయక మణివంటి రాజమహేంద్రప్రభువైన రాజరాజనరేంద్రునకై నన్నయ భారతాంధ్రీ కరణం ప్రారంభించగా "ఆంధ్రావళి మోదముంబొరయు నట్లుగ" తిక్కన పరిసమాప్తి చేసినాడు. తమ దేశంలో, భాషలో, జాతిలో ప్రజలకు ఆదరాభి మానాలు జనించినాయనడానికి "శేషాంశిరోభూషణమేవదేశ త్రిలింగనామా జగదేకసీమా" అనే శాసన వాక్యమే నిదర్శనం. ఈ సమైక్యతాభావం, జాతీయాభి మానం కాకతీయ యుగంలో వివిధరంగాల్లో జరిగిన కృషిలో ప్రతిఫలిస్తాయి ఈ చైతన్యమే ఆంధ్రప్రజానీకంలో స్వాతంత్ర్య ప్రియత్వానికి కారణమై, ఓరుగల్లు పతనానంతరం తురుష్కులతో పోరాటం సాగించడానికి అవసరమైన నైతిక బలాన్ని చేకూర్చింది.

### పాలన విధానం

కాకతీయ యుగంలో రాజనీతిని గురించి జరిగిన ఆలోచనలకు నాడు తయారైన గ్రంథాలే నిదర్శనం. కాకతిరుద్రుడు 'నీతిసార'మనే గ్రంథం

రచించినాడు, రుద్రమకాలంలో సామంతరాజైన బద్దెన 'నీతిసారముక్తావళిని'. గణపతి సమకాలికుడైన శివదేవయ్య 'పురుషార్థసారము'ను రచించినారు. ఈ గ్రంథాలనుండి, ఇతర రాజనీతి గ్రంథాలనుండి ఉదాహరిస్తూ క్రీ.శ. 1350 ప్రాంతంలో జీవించినాడని భావిస్తున్న మడికి సింగన 'సకలనీతి సమ్మతము'ను రచించినాడు. ఈ గ్రంథాలనుండి, శాసనాల నుండి కాకతీయుల పాలనావిధానం గురించిన వివరాలు లభిస్తున్నాయి.

కాకతీయులు సంప్రదాయ సిద్ధమైన రాచరికాన్ని అమలుచేసినారు. కాని, హిందూ రాజవంశాల్లో స్త్రీని సింహాసనం ఎక్కించిన అపూర్వగౌరవం కాకతీయులదే!రాచరికం సప్తాంగ సమన్వితం.ధర్మశాస్త్రబద్ధులై 'సంప్రదాయా'న్ని రక్షించడం రాజులు తమ విధిగా భావించినారు. 'చాతుర్వర్ణసముద్ధరణ' బిరుదం తరచుగా కన్పిస్తుంది. రాజుకు సహాయంగా ఒక ఉద్యోగి బృందం ఉండేది. మహాప్రధాన, ప్రధాన, ప్రెగ్గడ, అమాత్య, మంత్రి అనే ఉద్యోగుల పేర్లు శాసనాల్లో కన్పిస్తున్నాయి. మల్యాల హేమాద్రిరెడ్డి గణపతికి మహాప్రధాని. ప్రతాపరుద్రుని మహాప్రధాని ముప్పిడి నాయకుడు.వీరుగాక అష్టాదశతీర్థులను సకలనీతిసమ్మతం పేర్కొంటున్నది. రాజు మంత్రులతో,తీర్థులతో తరచు సంప్రదిస్తూ వుండవలెనని పురుషార్థసారం ఆదేశిస్తున్నది. రాజులకు అంగరక్షకులుండేవారు. అంతఃపురరక్షకుడు నగరిశ్రీకావలి. రాజోద్యోగులను నియోగాలుగా విభజించేవారు. అట్టి నియోగాలు డెబ్బై రెండు ఉండేవి. వీటిని బాహత్తర నియోగాధిపతి పర్యవేక్షించేవాడు. కాయస్థగంగయ సాహిణి గణపతి కాలంలో బాహత్తర నియోగాధిపతి. రుద్రమ కాలంలో త్రిపురారి, అతని అనంతరం పోంకలమల్లయ ప్రెగడ ఆ పదవి నిర్వహించినారు. చాళుక్యయుగంలో సాధారణంగా బ్రాహ్మణులు మంత్రి సామంత దండనాయకాది ఉన్నతపదవులాక్రమించి ఉండేవారు.కాకతీయ యుగానికి కాసంప్రదాయం వెనుకబడి, అన్ని వర్ణాల నుండి సమర్థులైన వారిని ఉన్నతోద్యోగాల్లో నియమించడం జరిగింది.

కాకతీయులు 'మహామండలేశ్వర' బిరుదంతోనే తృప్తిపడినారు, కాని, సార్వభౌమాధికార సూచకములైన బిరుదాలు ధరించలేదు. అందుకు కారణం బహుశా రాజ్యం వివిధ ప్రాంతాల్లో కోట, నతవాడి, చాళుక్య, అయ్య, తెలుగు చోడాది సామంత వంశాలు స్వతంత్రంగా పాలిస్తుండడము అయివుండవచ్చు. రుద్రమ కాలంనాటికి ఈ వంశాలు క్షీణించి,నాయంకర విధానం అమలు జరిగింది. ఈ రెండు పద్ధతుల వల్ల కేంద్రాధికారం బలహీనంగా ఉండేదని చెప్పవచ్చు. సమయం చిక్కినప్పుడల్లా ఈ వంశాలు తిరుగుబాటుచేసి, స్వతంత్రం ప్రకటించుకొనేవారు.

కాకతీయరాజ్యాన్ని పాలనా సౌకర్యందృష్ట్యా నాడులుగా విభజించినారు, నాడుకు సీమ (గండికోటసీమ, సాకిసీమ), భూమి (ఆరెభూమి), పాడి మొట్టుపాడి, మహారాజపాడి) పర్యాయపదా లయినట్లు కన్పిస్తుంది. రేనాడు, పాకనాడు, కమ్మనాడు, సబ్బినాడు, ములికినాడు మొదలైనవి శాసనాల్లో కన్పిస్తున్నాయి. సామంత వంశాలు క్షీణించిన తరువాత నాడు పరిపాలన విధానం తెలుసుకొన డానికి ఆధారం లేదు. 'నాడు' తరువాతి విభాగం 'స్థలం'. స్థలంలో సుమారు ఇరవై గ్రామాలుండేవి నాడులను, స్థలాలను అందలి గ్రామాల సంఖ్యతో చెప్పే ఆచారం కొనసాగింది. గురిందాలస్థల, పింగళిస్థల, మగతలస్థల, గంగాపురస్థల మొదలైన వానిని శాసనాలు పేర్కొంటున్నాయి. స్థలాలను సేనాపతులైన నాయంకరులకు నాయంకర వృత్తిగా ఇవ్వడం ఉంద. శాసనాల్లో స్థలం కరణాల ప్రసక్తి ఉంది గ్రామంలో పన్నిద్దరు ఆయగాండ్రు ఉండేవారు. వీరు- కరణం, రెడ్డి లేక పెద్దకాపు, తలారి, పురోహిత, కమ్మరి, కంసాలి, వడ్రంగి, కుమ్మరి, చాకలి, మంగలి, సెట్టి, చర్మకార. వీరికి వృత్తులు (ఆయము) ఇచ్చేవారు. వీరు రైతులనుండి పంటధాన్యంలో కొంతభాగం (మేర) వసూలు చేసుకొనేవారు. వీరిలో మొదటి ముగ్గురు మాత్రమే ప్రభుత్వంతో సంబంధించినవారు. మిగిలిన వారు తమ వృత్తులద్వారా గ్రామ విధులు నిర్వహిస్తూ గ్రామంలో సుఖజీవనానికి తోడ్పడేవారు.

న్యాయనిర్ణయంలో సంప్రదాయ పద్ధతులే అనుసరించినారు న్యాయ విష యాల్లో రాజుకు సలహా ఇవ్వడానికి ప్రాడ్వివాకులుండేవారు. గ్రామాల్లో తగాదా పరిష్కరించడానికి రాజాజ్ఞపై ప్రత్యేక ఉద్యోగులను నియమించే ఆచారం ఉన్నట్లు దుగ్గిరాల శాసనంవల్ల తెలుస్తుంది ఈ ఉద్యోగులు స్థానిక మహాజనుల సహాయంతో తగాదాలు తీర్చేవారు ప్రత్యేక నేరాలను విచారించడానికి నిపుణులతో ధర్మాసనాలు ఏర్పాటు చేస్తున్నట్లు క్రీడాభిరామం సూచిస్తున్నది. అష్టాదశ వర్ణాలకు ఉన్న సమయ సభలు కూడ తమ తమ సభ్యుల నేరాలు విచారించి శిక్షిస్తూ ఉండేవి. శిక్షలు కఠినంగా ఉండేవి. బీజచ్ఛేద, కుక్షిచ్ఛేద, శిరచ్ఛేద శిక్షలున్నట్లు - వీనిని అమలు జరపడానికి గ్రామాల్లో వీరభటులున్నట్లు తెలుస్తుంది.

ప్రభుత్వానికి భూమిశిస్తు ప్రధాన ఆదాయమార్గం. పంటపొలంలో కొంత రాచపొలము. దీన్ని రైతులకు కోరు లేక అర్ధాదాయానికి కవులుకిచ్చేవారు. అట్టి రైతులను అర్ధశీరి అనేవారు. మిగిలిన పొలంలో నీరుపొలం, వెలిపొలం, తోట పొలం అనే వర్గీకరణం ఉండేది. పెనుంబాకమానదండం, కేసరిపాటిగడలుపయో గించి పంటపొలాన్ని సర్వే చేయించినారు. పల్నాటిలోని నన్నిగండ్ల శాసనంలో

రాజ్యవ్యవహారి, కొలగాంగ్రుడు,కరజాల్ప్రసక్తి ఉంది పన్ను, పంగము, సీరువిధి, పుట్టివహించి, తోటసుంకము అనేవి పంటపొలాలపై పన్నులలోని రకాలు.

ఇవిగాక అనేక రకాల పన్నులుండేవి- దరిశనము, అప్పనము, ఉపకృతి అనేవి రాజుకు సంప్రదాయంగా చెల్లించే పన్నులు. కోటగణపాంబ మొగలుట్ల శాసనాన్నిబట్టి వృత్తి పన్ను లుండేవి. తక్షక (Carpenter), అయస్కార, కుంభకార, సువర్ణకార, రజక, నాపిత, చండాల, అర్ధశీరి మొదలైనవారేగాక తమ్మరులు, గొల్లలు, మాలాకారులు వృత్తి పన్నులు చెల్లించేవారు. గొర్రెల మందలపై అర్ధపట్టి సుంకం వసూలు చేసేవారు. ఇల్లరి, పుల్లరి, మడిగ (Shop) సుంకాలుండేవి. నూనె గానుగులపై, ఉప్పుకొటార్లపై, మగ్గాలమీద, రాట్నము (నీటి యంత్రమ్ము)ల మీద పారిశ్రామిక సుంకాలుండేవి. ముద్ర సుంకము, పేట సుంకం, అమ్మబడి సుంకము మొదలైనవి వాణిజ్య సుంకాలు. ఇవిగాక ఒంటెల ఆయము, తలారిపన్ను, గడ్డుగ కానికె వసూలు చేసేవారు. మొత్తంమీద కాకతీయుల కాలంలో ప్రజలపై పన్నుల భారం చాల ఎక్కువ అని చెప్పవలె. వాణిజ్య సుంకాలను నిర్ణయించి ప్రజలకు, వర్తకులకు తెలిసేటట్లు సంతల్లోను, మోటుపల్లి మొదలైన రేవు పట్టణాలలోను కాకతీయులు శాసనాలు వేయించినారు. సుంకాలు వసూలు చేయడానికి సుంకరులు, సుంకాధిపతులు ఉండేవారు. రేవు పట్టణాలను కరవట్టణాలు అనీ, సుంకాలు వసూలు చేసే ఇతర స్థలాలను ఘట్టాలు అనీ అనేవారు. వర్తకులు సుంకాలు తప్పించుకోడానికి ప్రయత్నిస్తుండే వారు.

కాకతీయులు పెద్ద సైన్యాన్ని పోషించినారని వేరుగ చెప్పక్కరలేదు. రాజ్య రక్షణలో దుర్గాల ప్రాముఖ్యం గుర్తించినారు. "పులులుండుబొదల నేను గుల లమగిరీంద్రములనుండు ననిశము సింహంబులు గుహలనుండు గావున బలవంతమైన దుర్గబలమదివలయున్" అని పురుషార్థసారము. దుర్గాలలో వన, గిరి, స్థల జల దుర్గా లుండేవి నీతిసారంలో దుర్గ రక్షణ గురించిన వివరా లున్నాయి. ఇక సైన్యంలో మూలబలము, నాయంకరబలము అనే రెండు స్థూల విభాగాలుండే వనవచ్చు. రాజనీతి గ్రంథాలలో రథగజతురగ పదాతిబలాల ప్రస్తావనలున్నప్పటికి రథాలు వాడుకలో లేవనే చెప్పవలె. అయితే, శిలాయంత్రా లొక విభాగంగా ఉండేదని చెప్పవచ్చు. ఒక్కొక్క విభాగం ఒక అధ్యక్షుని అధీనంలో ఉండేది. ఈ అధ్యక్షులు సాధారణంగా రాష్ట్ర పాలక పదవులు సయితం నిర్వహించేవారు. ఇందులూరి అన్నయ ఐదులక్షల కాల్బలానికి అధ్యక్షుడు. గణపతి కాలంలో జాయప గజసాహిణి. ప్రతాపరుద్రుని కాలంలో బెండపూడి అన్నయ గజబలాధ్యక్షుడు; సాహిణి కుమారుడు అశ్వదళాధిపతి. మూలబలం సర్వమూ బహుశా 'మహారాజపట్టసాహిణి' పర్యవేక్షలో ఉండేది.

ఇక నాయంకరులు రాజానుండి 'నాయంకర స్థలవృత్తులు' స్వీకరించి సైన్యాలు పోషించి అవసరమైనప్పుడు రాజుకు తోడ్పడేవారు. కొన్ని విషయాల్లో భూస్వామ్య విధానంలోని భూస్వాములతో వీరిని పోల్చవచ్చు. నాటి యుద్ధ విధానంగానీ వ్యూహరచనావద్ధతిగాని గ్రహించడానికి ఆధారాలు లేవు. అయితే, నీతిశాస్త్రకారులు "కూటయుద్ధాన్ని" అనుమతించినారు. "ఒక్కొట గూటయుద్ధమున నుక్కర శత్రువధించినన్ జయంబెక్కుడు గల్గి పాపమొక యించుకగల్గదు నిశ్చయంబు'' అని సకలనీతి సమ్మతము. కాకతీయుల సైన్యంలో అన్ని ప్రముఖ వర్ణాలకు ప్రాతినిధ్యం ఉన్నట్లు శాసనాలద్వారా తెలుస్తున్నది. కాని, వెలమల ప్రాబల్యం ఎక్కువని ప్రతాపచరిత్ర చెబుతున్నది.

**ఆర్థిక పరిస్థితులు**

కాకతీయుల కాలంలో ఆంధ్రదేశం సిరిసంపదలతో తులతూగుతున్నట్లు అమీర్ ఖుస్రూ, అబ్దుల్లా వాసఫ్, మార్కోపోలోవంటి విదేశ యాత్రికుల రచనలను బట్టి తెలుస్తున్నది. ఈ మహదైశ్వర్యమే ఢిల్లీసుల్తాన్ నోరూరించి ఓరుగల్లుపై దాడులకు పురికొల్పింది.

వ్యవసాయమే నాడు ఆంధ్రులకు ప్రధాన వృత్తి. వ్యవసాయం చాల వరకు వర్షాధారమనే చెప్పవలె. అయితే, కాకతీయ ప్రభువులు, వారి సామంతులు-ముఖ్యంగా తెలంగాణా ప్రాంతంలో పెద్ద చెరువులు, కాలువలు తవ్వించి, నీటి పారుదల సౌకర్యాలు కల్పించినారు. తటాక నిర్మాణం సప్తసంతానాల్లో ఒకటి. మొదటి ప్రోలరాజు కేసరి సముద్రమనే తటాకం నిర్మించినాడు. ప్రతాప చరిత్ర ననుసరించి గణపతి తనరాజ్యం పలు ప్రాంతాల్లో చెరువులు తవ్వించినాడు. గణపతిసేనాని రుద్రుడు మానేరుజలం ఆధారంగా 12 చ॥మై॥ విస్తీర్ణం ఉండి 17258 ఎకరాలు సాగుచేసే పాఖాల చెరువును, రేచర్ల రుద్రరెడ్డి 8 చ॥మై॥ విస్తీర్ణం ఉన్న రామప్ప చెరువు తవ్వించారు. ఇవిగాక కాటసముద్రం, చౌడ సముద్రం, సబ్బిసముద్రం, జగత్కేసరి సముద్రం మొదలైన తటాకాల సమీపంలో కొత్త వ్యావసాయికగ్రామాలు ఏర్పడినాయి ప్రతాపరుద్రుని కాలంలో నెల్లూరు, కడవ, పల్నాడు ప్రాంతాల్లోని అడవులు చేదించి, వంటపొలాలుగా మార్చడం, క్రొత్త గ్రామాలు నిర్మించడం జరిగింది.

దేశం పలుప్రాంతాల్లో గోదుమలు, వరి, కొర్రలు, పెసలు, జొన్నలు, చెరకు, నూనెదినుసులు, ఉల్లి, అల్లం, వసుపు విశేషంగా పండించేవారు. వరిలో పలు రకాలుండేవి. ఓరుగల్లు ప్రాంతంలో సువాసనగల బియ్యం తయారైనట్లు తెలుస్తున్నది. కందివప్పు వాడకంలోనికి వచ్చినట్లు కన్పించదు. దేశమంతట టెంకాయ, జామ, మామిడి, అరటి, ఆకుకూరగాయల తోటలుండేవి బెల్లము, వంచదార,. నూనెపరిశ్రమలు ప్రతి గ్రామంలోను సర్వసాధారణాలు.

దేవాలయాలకు దానంచేసిన పశువుల సంఖ్యనుబట్టి పశుసంపదకూడ విశేషమని బోధపడుతుంది పాలు, పెరుగు, నెయ్యి పుష్కలంగా లభించేవి. ఓరుగల్లులోని పూటకూటి ఇండ్లో "కప్పురభోగి వంటకము, కమ్మని ఆలనేయి, పెసరప్పు, గుప్పెడు పంచదార, కొమ్మనటిపండ్లు, అప్పలతోటి క్రొంబెరుగుతో" ఒక రూకకు విందుభోజనం కంటే ఎక్కువగా లభించేది.

వ్యవసాయంతోపాటు పెక్కు పరిశ్రమలు వృద్ధి చెందినాయి. ప్రాచీన కాలం నుండి ఆంధ్రదేశం సాలెపురుగు జాలెవలె ఉండే దువ్వలువలకు, కలంకారీ చీరలకు ప్రసిద్ధి చెందింది. పాల్కురికి సోమన పండితారాధ్య చరిత్రలో ఇరవైకి మించి వస్త్రాల్లో రకాలను పేర్కొనాడు. వానిలో చీని, మహాచీని అనే వస్త్రాలు చైనా నుండి దిగుమతియైనప్పటికీ మిగిలినవి స్థానికంగా తయారయ్యేవి. మైసోలియా ప్రాంతంలో మహారాజులు సయితం గర్వింపదగిన వస్త్రాలు తయారవుతున్నాయని మార్కోపోలో పేర్కొన్నాడు. ఓరుగల్లులో రత్నకంబళాలు, ముఖమల్ వస్త్రాలు నేసేవారు. పంచలోహాలతో - ఇనుము, పిత్తళి, కంచు, హేమ తామ్రాల మిశ్రమంతో పలురకాల వస్తువులు తయారయ్యేవి. దేవాలయ శాసనాల్లో లోహ దివియలు, కంచు కరదీపికలు, పళ్లెరములు, గంటలు, పిడి గంటల ప్రసక్తి తరచు కన్పిస్తుంది. త్రిపురాంతకంలో పంచలోహ స్తంభాన్ని బ్రహ్మనాయు డెత్తించినట్లు పల్నాటి వీరచరిత్ర పేర్కొంటున్నది. పందాణం వారిలో వజ్రంగులు కర్రతో రంగుల రాట్నాలు, జంత్రపు బొమ్మలు మొదలైనవి చేయడంలోను, దంతపు పెట్టెలు చేయడంలోను సిద్ధహస్తులు. లక్కబొమ్మలు, ఆట వస్తువులు దేశంలో వివిధ ప్రాంతాల్లో చేసేవారు. తోలు బొమ్మలాటకు బొమ్మలు తయారుచేసి రంగులు వేయడం పెద్దపరిశ్రమ అయింది గుత్తికొండ, పల్నాటిసీమలు ఇనుప పరిశ్రమకు పేరొందినాయి. యుద్ధాలలో ఉపయోగించిన వివిధ ఆయుధ సామగ్రి స్థానికంగానే తయారయ్యేది. నిర్మల్‌లో తయారైన కత్తులు దమాస్కస్ వరకు ప్రసిద్ధి చెందినాయట. గోల్కొండ ప్రాంతంలో వజ్రపు గనులు ఉన్నట్లు మార్కోపోలో వ్రాసినాడు. రాయలసీమలో సయితం వజ్రాలు తవ్వి తీసేవారు. ఈ పరిశ్రమలో వేలకొలది పనివాండ్రకు జీవనోపాధి లభిస్తున్నదని చెప్పవచ్చును.

శాతవాహనానంతరయుగంలో క్షీణించిన దేశీయ, విదేశీయ వాణిజ్య సంప్రదాయాలను కాకతీయులు పునరుద్ధరించినారు. రాజకీయ సమైక్యము ఆర్థిక వైభవము అందుకు తోడ్పడినాయి. దేశీయ వాణిజ్యానికి ఓరుగల్లు ప్రధాన కేంద్రము. అచట ప్రతి వారమూ మడిసంత, మైలసంత జరిగేవి. మంథెన, పానగల్లు, అలంపురం, మాచెర్ల, వేల్పూరు, యనమదల, తంగెడ, త్రిపురాంతకం, ఛేబ్రోలు, కొచ్చర్లకోట, నందలూరు, నెల్లూరు, పెద గంజాం, ఘంటసాల ఇతర

వాణిజ్య కేంద్రాలు. వీనిని రేవు పట్టణాలైన మోటుపల్లి, మచిలీపట్టణాలతో కలుపుతూ రహదారులుండేవి. మోటుపల్లి నుండి త్రిపురాంతకం మీదుగా బళ్ళారి మార్గం ఆంధ్ర కర్ణాటకాలను కలిపేది. పలనాడు నుండి నల్గొండ, నెకరికల్లుల మీదుగా ఓరుగల్లుకు మార్గాన్ని క్రీడాభిరామం పేర్కొంటున్నది. శాసనాల్లో కన్పిస్తున్న రేవు సుంకాన్ని బట్టి కృష్ణా గోదావరి నదులు కూడ ప్రయాణ సౌకర్యాలుగా ఉపయోగించినవని చెప్పవచ్చు. ఎడ్లబళ్ళమీద, దున్నలు గాడిదల మీద సరకు రవాణా జరిగేది. ఓరుగల్లు శాసనాన్నిబట్టి అనేక వస్తువుల్లో వాణిజ్యం జరిగింది. వాణిజ్య సామగ్రిలో బూసిభాండాలు (ధాన్యాలు), కొల భాండాలు (నువ్వులు, ఆవాలు, మిరియాలు, నూనెలు), గంధద్రవ్యాలు (శ్రీగంధము, జవ్వాది కర్పూరము, కస్తూరి), మణిభాండాలు (ముత్యాలు, పగడాలు, గాజు, రుద్రాక్ష) అనే వర్గీకరణ ఉండేది. ఇవిగాక పోకలు, నూనె, పట్టు, ఉన్ని, మంజిష్ఠ, దంతము, తగరము, రాగి. సీసము మొదలైన లోహాలలో; టెంకాయలు, మాదీఫలాలు, మామిడి పండ్లు, చింతపండు, ఊరుగాయలలో వాణిజ్యం జరిగింది. విదేశ వాణిజ్యానికి మోటుపల్లి (ప్రకాశం జిల్లా) ప్రధాన కేంద్రం. కృష్ణాపట్టణం (నెల్లూరు), హంసలదీవి (గుంటూరు), మచిలీపట్టణం (కృష్ణా) రేవులు కూడ విదేశ వాణిజ్యం జరుపుతుండేవి. విదేశ వర్తకులకు అభయం ఇస్తూ గణపతిదేవుడు మోటుపల్లిలో ఒక శాసనం వేయించినాడు. ఆ శాసనాన్ని బట్టి నాటి ఎగుమతి-దిగుమతులు గ్రహించవచ్చు. కరి తురగ, కనకరత్నాదులు; చందనం, జవ్వాది, కర్పూరం, కర్పూరతైలం, పన్నీరు, దంతం, రాగి, తగరం, సీసం, పాదరసం, పట్టు, పగడాలు, సుగంధ ద్రవ్యాలలో విదేశ వాణిజ్యం జరిగేది. ఈ వస్తువుల్లో రత్నాలు, సుగంధ ద్రవ్యాలు, చందనం, దంతం, పగడాలు బహుశా ఆంధ్రదేశం ఎగుమతులయివుంటాయి. చైనా, పర్షియా, అరేబియా దేశాలతోనూ సింహళం, తూర్పు ఇండియా దీవులతోనూ వాణిజ్యం సాగింది. వస్తుస్వభావాన్నిబట్టి సుంకం వుండేది.

కాకతీయులు ఉదారము, పటిష్ఠమునైన వాణిజ్య విధానం అనుసరించినారు. వర్తకసుంకాలు నిరంకుశంగా పెంచరాదని, విదేశ వర్తకుల పట్ల ఉదారంగా ఉండి, వారిని ప్రోత్సహించవలెనని 'నీతిసారం' సలహా ఇస్తున్నది. అయితే, మోసం చేస్తున్న వర్తకులను కఠినంగా శిక్షించేవారు వర్తకులు సుంకా లెగగొట్టడానికి ప్రయత్నించే వారని "ఎంత ప్రొద్దువేళ లేచినా చింతగుట్ట దగ్గరే తెల్లవారింది" అనే సామెత సూచిస్తున్నది. చింతగుట్ట దగ్గిర సుంకాలు వసూలుచేసే ఘట్టం ఉన్నదన్నమాట. తప్పుడు కొలతలు నుపయోగించడం, ఒక వస్తువును గుత్తకొని ధర పెంచడంగూడా వర్తకుల్లో కన్పిస్తుంది. అట్టి పరిస్థితుల్లో ప్రభుత్వం జోక్యం చేసుకునేది. "తులలు తూములు పాటినిలవక సాగంగనిచ్చుట"

కూడదని "ఒకరుగొన్న సరుకు లోకబాయనెక్కువ నెక్కుచెల్ల రాజులెరిగి కొనుచు కొంచెమైన వెలకుకొన్న వస్తువులను కొన్న వెలయే ఇచ్చి కొనగదగును" అని నీతిసారం ఇచ్చిన సలహా!

దేశీయ విదేశీయ వాణిజ్యం వైశ్యులు, బలిజశెట్టులు నిర్వహించేవారు. ముస్లిం రచనలనుబట్టి కఫూర్ దండయాత్రలకు పూర్వమే తురక వర్తకులు ఆంధ్రదేశంలో ప్రవేశించి, మోటుపల్లి మొదలైన రేవు పట్టణాల్లో వ్యాపారం సాగించినట్లు తెలుస్తుంది. కాని వీరి సంఖ్య చాల స్వల్పం. వర్తకులు నకరం, స్వదేశీ, పరదేశీ, ఉభయదేశీ, నానాదేశి పెక్కుండ్రు అనే శ్రేణులుగా ఏర్పడే వారు. కన్నడ దేశానికి చెందిన "అయ్యావళి అయినూరరు" (500) అనే సంఘం త్రిపురాంతకం వంటి వర్తక కేంద్రాలలో కనిపిస్తున్నది. ఈ శ్రేణులు ఆయా ప్రాంతాల్లో వాణిజ్యం జరుపుకోడానికి అనుమతి పత్రాలు (Licence) పొందేవి. యనమదల స్థలానికి చెందిన "వీరబలంజ ఉభయనానాదేశి పెక్కండ్రు" పాక నాడు, వేగినాడు, అనుమకొండ స్థలాల్లో వర్తకానికి అనుమతి పొందినట్లు యనమదల శాసనం నుండి తెలుస్తున్నది. ఏదో ఒక వస్తువులో వర్తకానికి అను మతి పత్రాలు పొందిన శ్రేణులుండేవి అయితే, ప్రతి శ్రేణికి రాజధాని నగరంతో సంబంధం ఉండేది.

కాకతీయుల నాణేలు ఎక్కువగా దొరకలేదు. కాని, శాసనాల్లో, వాఙ్మ యంలో నాణేల పేర్లు, ప్రస్తావనలు ఎక్కువగా ఉన్నాయి. నాటి నాణేలన్నిం టిలో పెద్దది గద్యాణము; దీన్ని నిష్కము, మాడ అనికూడ వ్యవహరించేవారు. (డా॥ పరబ్రహ్మశాస్త్రి) ఇది బంగారు నాణెము; బహుశా ప్రతాపరుద్రునిదయి వుండవచ్చు 'రూక' తరువాతి నాణెం. మాడకు పది రూకలయినట్లు బాపట్ల శాసనంనుండి తెలుస్తున్నది. రూక వెండినాణెం అయివుంటుంది. అడ్డుగ (అర్ధ) పాదిక (పాతిక) వీస అనే నాణేలను కూడ శాసనాలు పేర్కొంటున్నాయి. ఇవి 'రూక'లోని విభాగాలయి వుంటాయి. ఇవిగాక కొన్ని శాసనాల్లో 'చిన్నము' ప్రసక్తి ఉంది; దీని విలువ స్పష్టంగా తెలియదు.

**మత, సాంఘిక పరిస్థితులు :**

చాళుక్య - చోళయుగంలో ప్రారంభమైన మత,సాంఘిక సంక్షోభం కొంత వరకు కొనసాగి కాకతీయ యుగంలో సమాజం నిర్దిష్టరూపం ధరించింది. పశ్చిమ చాళుక్యుల పోషణలో జైనం తెలంగాణా ప్రాంతంలో విశేష జనాదరణ పొందింది. బోధన్, వేములవాడ, పొట్లచెరువు (పటాన్‌చెరువు), అన్మకొండ, కొల్లిపాక మొద లైన ప్రసిద్ధ జైన క్షేత్రాలు వెలసినాయి. కాకతీయులు మొదట్లో జైనమతాన్ని అనుసరించారు. వైదిక మతాభిమానులైన తూర్పు చాళుక్యుల చేతుల్లో హింసకు గురి యైన జైనులకు ఆనాడు అన్మకొండ ఆశ్రయమయింది. రాజరాజనరేంద్రుడు

హింసింపగా ఋషభనాథుడనే జైనాచార్యుడు అన్మకొండకు వచ్చినాడని ఓరుగల్లు కైఫియత్ చెబుతున్నది. ప్రోలరాజు మంత్రి బేతన భార్య మైలమ అన్మకొండపై కడలాలయబసది నిర్మించింది. ప్రోలరాజు అన్మకొండ శాసనం జినేంద్ర ప్రార్థనతో ప్రారంభమవుతున్నది.

క్రమంగా బౌద్ధంవలెనే జైనంకూడ ప్రజాబాహుళ్యానికి ఆధ్యాత్మిక సంతృప్తి నీయలేకపోయింది. అందుచే అద్వైతవాదులు, బ్రహ్మవాదులు, ఏకాత్మవాదులు, పాంచరాత్రులు, అభేదవాదులు, శూన్యవాదులు, కర్మవాదులు, ప్రకృతివాదులు, చార్వాకులు, పురుషత్రయైవాదులు మొదలైనవారు తమ తమ సిద్ధాంతాలను బోధిస్తున్నట్లు శైవవాఙ్మయంనుండి తెలుస్తున్నది. కాలక్రమంలో ఈ వాదాలన్నీ వెనుకాడి, భక్తిమతాలైన శైవ వైష్ణవాల్లో ప్రజలకు విశ్వాసం కుదిరింది. క్రీ.శ. 7,8 శతాబ్దాలనాటికే ఆంధ్రదేశంలో కాలాముఖ, పాశుపత అనే తీవ్రవాద శైవ మత శాఖలు విజృంభించినట్లు పైన చెప్పినాము. తెలంగాణా ప్రాంతంలో సయితం కాలాముఖులకు ప్రచారం లభించింది. బేతరాజు, అతని కొడుకు దుర్గరాజు శ్రీశైల శిలామఠాధిపతియైన రామేశ్వర పండితుడనే కాలాముఖాచార్యుని శిష్యులు. అలంపురం గొప్ప కాలాముఖ క్షేత్రం. వీరశైవోద్యమ ప్రచారం కూడ తెలంగాణాపై ప్రసరించింది. మల్లికార్జున పండితారాధ్యుడు పానగల్లు దర్శించి అచటి రాజును శపించినాడని అతని చరిత్ర చెబుతున్నది. ఏమైనా, కాకతి రుద్రుడు వీరశైవాన్ని ఆదరించినాడనే (డా॥ మారేమండ రామారావుగారి) అభిప్రాయానికిగాని, ఆంధ్రదేశంలో వీరశైవం ప్రాబల్యం వహించి ముస్లిం దండయాత్రల నెదిరించడానికి అవసరమైన మతావేశం ప్రజలకు కలిగించిందనే (ఆచార్య నీలకంఠశాస్త్రిగారి) అభిప్రాయానికిగాని ఆధారాలు లేవు. కాని, కాలాముఖులు, వీరశైవులు జైన మతనిర్మూలనలో ప్రముఖపాత్ర నిర్వహించినట్లు పాల్కురికి సోమనాథుని గ్రంథాలు వర్ణిస్తున్నాయి. బ్రహ్మయ అనే శైవుడు గోపూరులోని జైన వసదులను నేలమట్టం చేసినాడు. ఒక్క పొట్లచెరువులోనే 100 వసదులను ధ్వంసంచేసి, 2000 మంది జినమునులకు శైవ దీక్ష నిచ్చినారు. తిరువూరులో 18 వేల జైనులను ''కాలియున్న ఇనుపశూలములందు'' దిగిచినారు. ఇక సిద్ధేశ్వర చరిత్రనుబట్టి గణపతి అన్మకొండలోని జైనులను క్రూరంగా హింసించినాడు. అతని దీక్షాగురువైన విశ్వేశ్వరశివుడు 36 జైన గ్రామాలను నాశనం చేసినాడు. శైవ వాఙ్మయం అత్యుక్తి దోషానికి పాల్పడినదని అంగీకరించినా, అందు లేశ మాత్రం కూడ సత్యం లేదనడం చారిత్రక విరుద్ధం. పై స్థలాలలోని జైన శిథిలాలు నాటి విధ్వంస కాండకు నిదర్శనాలు. నాటి రాజులు స్వయంగా జైనులను హింసించినారనడం యదార్థమైనా కాకపోయినా

శైవులు జైనులపట్ల జరుపుతున్న అత్యాచారాలను ఆపకపోవడంలో ప్రజారక్షణ పట్ల తనకున్న బాధ్యతను అలక్ష్యం చేసినారని చెప్పడం తప్పుకాదు.

గణపతిదేవ, రుద్రమాంబలకాలంలోకూడా కాలానన, పాశుపత, శివ శాసన, కాపాలిక (మహావ్రత), యామిళ, సిద్ధ మొదలైన శాఖలున్నట్లు త్రిపు రాంతకం, మల్కాపురం శాసనాలనుండి తెలుస్తుంది అయితే, గణపతి దేవుని కాలానికి గోళకిమఠం ఆంధ్రదేశంలో విశేష జనాదరణ పొందింది. శుద్ధ శైవ సంప్రదాయంపై గోళకి మఠాన్ని దాహళ దేశంలో సద్భావశంభు అనే యోగి స్థాపించినాడు. దాక్షారామం, మందడం, త్రిపురాంతకం, శ్రీశైలం, పుష్పగిరి మొదలైనచోట్ల గోళకి మఠ శాఖలు వెలసినాయి. వీనిలో మందడం ప్రసిద్ధ కేంద్రమయినట్లు కన్పిస్తుంది. ఆంధ్రలో గోళకీమఠ ప్రధానాచార్యుడైన విశ్వేశ్వర శివ దేవులు గణపతిదేవుని దీక్షాగురువు. ఈతడు శైవసిద్ధాంతపారగుడేగాక వేదాధ్యయన పరుడయినట్లు తెలుస్తుంది.

కాకతీయులు శైవాన్ని ఎంత అభిమానించినప్పటికీ ఆంధ్రలో శైవం ఏకైక మతం కాలేదు. కాకతీయులు సయితం వైష్ణవాన్ని నిరాదరించలేదు. సుపర్ణకేతనాన్నిగాని వరాహలాంఛనాన్నిగాని వారు త్యజించలేదు. దక్షిణదేశం నుండి రామానుజవైష్ణవం ఆంధ్రదేశంలో ప్రవేశించి వ్యాప్తి చెందింది. నెల్లూరు, నందలూరు, తిరుపతి, మాచర్ల, బాపట్ల, మంగళగిరి, శ్రీకాకుళం. సింహాచలం, శ్రీకూర్మం మొదలైన క్షేత్రాలు కేంద్రాలుగా వైష్ణవం ప్రాబల్యం వహించింది. మఠాలు, సమయాలు వెలసినాయి. ఇట్టి పరిస్థితుల్లో శైవ వైష్ణవాలకు సంఘర్షణ తప్పలేదు. తాము బలవంతులుగా ఉన్న చోట శైవ క్షేత్రాలను రామానుజా చార్యుడు వైష్ణవ క్షేత్రాలుగా మార్చినాడని శ్రీపతి భాష్యం చాటుతున్నది. వెంకటాచల ఇతిహాసమాల అనే తిరుపతి స్థలపురాణంలో కూడా అదే సూచన ఉంది. సింహాచలాన్ని గురించికూడ అటువంటిగాథే ప్రచారంలో వుంది.

శైవ వైష్ణవాల్లో తీవ్రవాద ఉద్యమాలు వర్ణవ్యత్యాసాలను ఇతర బ్రాహ్మణ సంప్రదాయాలను నిరసించి, సాంఘిక సమత్వస్థాపనను ఆశించినాయి. వీరశైవులు లింగధారి సమాజం సృష్టించడానికి ప్రయత్నించగా వైష్ణవులు చక్రాంకితదాస సమాజాన్ని ఉద్దేశించారు. "సన్నుతవేదార్థ చరితంబులుండ మున్నుబుట్టిన కులమ్ములమాట లేల'' అని, ''మిక్కిలి పదునెన్మిది వర్ణములకు నిక్కమారయ భక్తనిచయంబు కులము" అనీ చాటినారు పల్నాటి బ్రహ్మనాయని సంస్కారణలు పై అధ్యాయంలో చదివినారు. వైష్ణవ దీక్షలోని ఉచ్ఛిష్టభోజన, దాసనామ ధారణ బహుశా సర్వసమభావాన్ని, ఆత్మార్పణ భావాన్ని కలిగించడానికి ఉద్దే శించి వుంటాయి. వీర శైవ, వీర వైష్ణవ ఆశలు ఫలించి, వర్ణ రహిత సమాజం ఏర్పడి, ఆంధ్రులు సమైక్యజాతిగా రూపొంది వుండినచో ముస్లిందాడులను శక్తి

వంతంగా అరికట్టి వుండేవారని చెప్పవచ్చు. "భక్తిహీన పలపు బ్రాహ్మణులతో పొత్తు" అనే పండితారాధ్యుని ప్రచారంతో వీరశైవం వెనుకాడింది. పల్నాటి యుద్ధంలో వీరవైష్ణవం పరాజయం పొందింది.

పరిస్థితులు వైదిక మతానికి అనుకూలమయినాయి శివకేశవులకు అభేదం కూర్చి వర్ణవ్యవస్థపై ఆధారపడిన సమాజ నిర్మాణం వైదిక మతోద్ధారకుల ఆదర్శం అయింది. కాకతి ప్రోలరాజు మంత్రి రామేశ్వరదీక్షితులు ఉమామహేశ్వర గ్రామణి అయినా పరివృఢ శ్రౌతక్రియాకర్మఠుడు. భక్తికి కర్మకాండకు పొత్తు కూర్చే ప్రయత్నాలు పురోగమించినాయి. కాకతి రుద్రుడు రుద్రేశ్వరంలో శంభునితోబాటు కేశవుని సూర్యుని ప్రతిష్ఠించి ఆరాధించినాడు. ఆతని మంత్రి గంగాధరుడు విష్ణుభక్తుడైన స్మార్త బ్రాహ్మణుడు. ప్రజల్లో భిన్నమతాలపై సమదృష్టి ఏర్పడింది. బెక్కల్లు శాసనంలోని మల్లరెడ్డి జైనుడు; శివ, విష్ణు, బుద్ధ, జినాలయాలను నిర్మించినాడు. మంచి భట్టోపాధ్యాయుడు కేశవ, మహాదేవులకు ఆలయాలు నిల్పినట్లు మంథెన శాసనం చెబుతున్నది. శైవుల ప్రయత్నాలు నిరసించి "వేదభర్మాక్రాంతులైన బ్రాహ్మణగార్దభంబు" లని తిట్టిపోసినారు. శైవులు పతితులని, వారి రచనలు అప్రమాణములు, అనాద్యములని బ్రాహ్మణులు నిందించినారు చివరకు వైదికులదే పైచేయి అయింది. తిక్కన ప్రభావంవల్ల గణపతి వైదికమతాభిమాని అయినాడు గోళకి మతంకూడా వైదిక మతానికి సుముఖమే. విశ్వేశ్వరశివుడు మందడంలో వేద పాఠశాల నెలకొల్పి దక్షిణదేశం నుండి నానాగోత్రాల బ్రాహ్మణులను రప్పించి వారివసతికై సత్రం నిర్మించినాడు. రుద్రుడు, గణపతి 'చాతుర్వర్ణసముద్ధరణ' బిరుదం ధరించినారు. కులనిర్మూలన ప్రయత్నాలు విఫలమయినాయి. కులవైషమ్యాలు వెర్రితలలువేసి కాకతిరాజ్యం విధ్వంసనానికి దారి తీసినాయి. ప్రతాపరుద్రుని కాలానికి కాకతీయ రాజాస్థానంలో బ్రాహ్మణాధిక్యం సుప్రతిష్ఠమయినట్లు పిడుపర్తి సోముని బసవ పురాణం (క్రీ శ. 7 వ శ.) నుండి తెలుస్తుంది. చాలాకాలం క్రితమే శంకరుడు స్మార్తమతాన్ని ప్రవర్తింప చేసినాడు. 'అద్వైతం' అంటూ తిక్కన పేర్కొన్నది ఆ మతమేనని చెప్పవచ్చు. కర్మసిద్ధాంత మాయావాదాలపై రూపొంది శివకేశవులకు అభేదం పాటించిన స్మార్త సమన్వయ మతం ప్రజల్లో వ్యాప్తిచెంద సాగింది.

సమన్వయ మతపురోగతి ఫలితంగా బహుదేవతారాధన ప్రబలమయింది. బహుశా ఒకే దేవత నారాధించడం వల్ల కోర్కెలన్నీ తీరవనే భయమేమో! జైన దేవతలు, ఆచారాలు హిందూమతంలో ప్రవేశించినాయి. కాకితమ్మ, జోగులాంబ మొదట్లో జైనదేవతలేనని ప్రసిద్ధి. ప్రజల్లో అనేక మూఢవిశ్వాసాలు ఆచారాలు కన్పిస్తాయి. జంతుబలులు, ఆత్మబలిదానాలు విపరీతమయినాయి. శివభక్తులు

వీరావేశంలో గండకత్తెరతో తలలు కత్తిరించుకొనేవారు. మైలారదేవుని ఆరాధనలో ఇట్టి వీరకృత్యాలెక్కువ. ఇతడు శివసంబంధియైన క్షుద్రదేవుడని కొందరి అభిప్రాయం. కొన్ని క్షేత్రాల్లో వీరారాధన మెండయింది. పల్నాటి వీరులకు ఉత్సవాలు జరిపేవారు. ఓరుగల్లులో వీరగాథలకు ప్రచారం బాగా ఉన్నట్లు క్రీడాభిరామంవల్ల తెలుస్తున్నది. ప్రతి దేవాలయంలోను ఉత్సవాలు జరిగేవి. వానిలో తిరునాల చాల ముఖ్యమయింది. ఐదు రోజులు జరిగే తిరునాలకు గ్రామాంతరాలనుండి కూడ జనంమూగేవారు. గ్రామదేవతలకు కొలువులు జరిగేవి. ఓరుగల్లులోని కాకితమ్మ కొలువులో మాలెతలు పాల్గొనేవారు. కొలువు సందర్భంలో సిడమెక్కి ఆడడం సాధారణం. "గాలంపు గొంకి కంకాళ చర్మము గ్రుచ్చి ఉడువీధినుయ్యేలలూగువారు" అని క్రీడాభిరామం సిడమును వర్ణిస్తున్నది.

భక్తిమత విజృంభణతో దేవాలయం మతానికి తద్వారా సాంఘిక కార్యకలాపాలకూ కేంద్రమయింది. దేవాలయం సప్తసంతానాల్లో ఒకటి అయినందున రాజులు, వారి సామంతోద్యోగుల పోషణలో ఆలయ నిర్మాణం విరివిగా సాగింది. గ్రామాలు, భూములు, ధనవస్తువాహనాదులు దానంగా స్వీకరించి, ఆలయం ఐశ్వర్యవంతమైన సంస్థగా రూపొందింది. శ్రీశైలమల్లికార్జుననకు సభ్బినాడు, దోవసముద్రం మధ్య దేశంలో 70 గ్రామాల్లో భూములుండేవి. ముఖ్య ఆలయాలన్నింటికీ పెద్ద భూవసతు లేర్పడి, అవి భూస్వాములుగా తయారయినాయి.

ఆలయాన్ని దేవస్థానం అని వ్యవహరించేవారు. రాజ్యపాలన విధానం అనుసరిస్తూ దేవస్థానపాలనను రూపొందించినారు. ఆలయ ఉద్యోగి బృందంతో స్థానాపతులు, మానులు (మాన్యులు), సానులు, నిబంధకారులు అనే వర్గీకరణ ఉండేది. స్థానావతులు ప్రధానాధికారులు. వీరిలోనివారే పూజారులు. కొట్టరు, భండారి, శ్రీకరణం మొదలైన ఉద్యోగులు, మానులు, నట్టువగాండ్రు, పాటగాండ్రు, వాద్యగాండ్రు, కాసె మొదలైన ఇతర పరిచారకులు నిబంధకారులు. ఈ వర్గాలవారు సంఘాలుగా ఏర్పడి తమ విధులు నిర్వర్తించేవారు. శాసనాల్లో 'సానిమున్నూరు' అనేమాట తరచుగా కన్పిస్తుంది. ఇది సానుల వృత్తిసంఘమయివుంటుంది. రాజ్యపాలన శాఖలను పర్యవేక్షించడానికి ఉన్నట్లే ఆలయ ఉద్యోగిబృంద పర్యవేక్షణకు బాహత్తర నియోగాధిపతి ఉండేవాడు.

దేవస్థానంపై ఆ గ్రామ ప్రజలు, పరిసర గ్రామ ప్రజలు ఆధారపడివుండేవారు. ఆలయ భూములు రైతులు సాగు చేసేవారు. ఆలయ అవసరాలకు భిన్న వృత్తిసంఘాలు కృషి చేస్తుండేవి. ప్రతి పెద్ద ఆలయానికి అనుబంధంగా మఠాలు, సత్రాలు, విద్యాలయాలు, ఆరోగ్యశాలలు ఏర్పడేవి. బీదసాదలకు, బాటసారులకు, విద్యార్థులకు సత్రాలలో ఉచిత భోజన సౌకర్యం వుండేది. మందడం సత్రంలో విప్రులు మొదలు పంచముల వరకు అన్నప్రదానం చేసేవారు. తెలుగు

లోని "స్త్రీలోలజనం మదనిద్ర" అనే సామెతవల్ల కొందరి సౌకర్యా లుపయోగించుకొని సోమరులయ్యేవారని భావించవచ్చు. అంతేగాక, ఆలయాలు 'బ్యాంకు'లుగా, 'నాటకశాలలు'గా 'ప్రదర్శనశాలలు'గా, వర్తకశ్రేణులకు కార్యస్థానాలు (నకరం)గా ఉపకరించేవి. ఇన్నివిధాల ఐశ్వర్యవంతమైన ఆలయంచుట్టూ సామాజిక కార్యక్రమాలు అల్లుకొనివున్నందునే ముస్లిములు ఆలయాలమీద దృష్టి కేంద్రీకరించినారు. ఆలయ విధ్వంసనంతో సామాజిక జీవితం విచ్ఛిన్నమై దేశాక్రమణ సులభం కాగలదని వారి ఉద్దేశమయివుంటుంది.

కాకతీయులు ఏ కులానికి చెందింది స్పష్టంగా చెప్పలేము. జైన, శైవ మతాలద్వారా సాంఘిక ఉన్నతి సాధించి రాజకీయాధికారం బలపరచుకొన్న తర్వాత రుద్రుని కాలంనుండి వైదిక మతాభిమానులైనారు. వైదికమత ప్రాబల్యంతో వర్ణవ్యవస్థ పాదుకొన్నది. వీరశైవ వీరవైష్ణవాలు కుల నిర్మూలనను సాధింపకపోగా వానివల్ల బలిజ, సాతాని మొదలైన కొత్తకులాలు ఏర్పడినాయి. బ్రహ్మన్న వీరవైష్ణవ ఫలితమే పద్మనాయకులని ఒక అభిప్రాయం వుంది. అయితే, రాజకీయ ప్రాబల్యం, ఆర్థిక పుష్టి సాధనాలుగా సాంఘిక పరివర్తనం కొనసాగింది. మాచేడు (వరంగల్ జిల్లా) శాసనంలో కాకతి ప్రోలరాజు సేనాని పుళింద కులస్థుడు. తన వర్ణాన్ని బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర వర్ణాలను రక్షించడానికే బ్రహ్మ సృష్టించినట్లు చెప్పుకున్నాడు. ఈ కులస్థులు - బోయలవలె - ఏ కులంలో లీనమైపోయినది చెప్పలేము. నాటి శాసనాల్లో అష్టాదశ వర్ణాల ప్రసక్తి ఉంది. వర్ణాంతర వివాహాలు అక్కడక్కడ కనిపించినా అవి కేవలం రాజకీయ వివాహాలై వర్ణ సామరస్యానికి తోడ్పడలేదు. గ్రామాల్లో వర్ణాలమధ్య సమాధానం వుండి సామాజిక జీవితం ప్రశాంతంగా సాగినట్లు శాసనాలు సూచిస్తున్నాయి. కాని, రాజకీయంగా ప్రాబల్యం వహించిన రెడ్డి, వెలమ కులాలమధ్య అధికారానికై పోటీ ప్రారంభమయింది. ఈ వర్ణాలు కాకతీయుల పతనానంతరం కూడ పరస్పర యుద్ధాల్లో మునిగి, బహమనీరాజ్య విస్తరణకు అవకాశం కల్పించడం శోచనీయం.

కుల సంఘాలు కాకతీయయుగ సాంఘిక జీవితానికొక ప్రత్యేక లక్షణం. కుల సంఘాలను 'సమయము'లని వ్యవహరించేవారు. బ్రాహ్మణ సమయానికి 'మహా జనులు' అని, వైశ్యసంఘానికి 'నకరము' అని ప్రత్యేకములైన పేర్లు. శైవ, వైష్ణవ సమయాలు ఆయా దేవస్థానములకు చెందిన అర్చక సంఘాలని చెప్పవచ్చు. సానిమున్నూరు, తెలికిదేవురు, పంచాణంవారు కులసంఘాలే. శాసనాల్లో ఊరుసమయ, స్థలసమయ అనే పేర్లు వున్నందున సమయాలు రెండు స్థాయిలలో వున్నట్లు తెలుస్తుంది. ప్రతి సమయానికి సమయాచారం. కులం కట్టుబాటు వుంటుంది. సమయం స్థానికంగా కొన్ని పన్నులు వసూలు చేసుకొనవచ్చు.

సమయాచారానికి విరుద్ధంగా ప్రవర్తించినవారిని, తదితర నేరస్థులను న్యాయ విచారణ జరిపి 'సమయదండన' విధిస్తుంది. బాపట్ల శాసనంలోని సమయ సేనాపతి బహుశా సమయాచారాన్ని అమలు జరిపే ఉద్యోగి అయివుంటాడు. కుల సంఘాల సమక్షంలోనే రాజోద్యోగులు గ్రామంలోని ముఖ్య వ్యవహారాలు నిర్వహించేవారు. నిరంకుశంగా వ్యవహరించే మండలాధీశులపై ప్రభుత్వానికి ఫిర్యాదు చేయడమేకాక ఉద్యోగుల నదుపులో వుంచేవారు. సమయాలు అనుభవించిన ఈ స్వీయ పాలనాధికారాలవల్ల నాటి నిరంకుశ రాచరికం కొంతవరకు బాధ్యతాయుతమైందని భావించవచ్చును

అష్టాదశ వర్ణాలలో అగ్రవర్ణమైన బ్రాహ్మణులు రాజకీయ ప్రాబల్యం మరింత కోల్పోయినారు. రాజకీయాధికారం చతుర్థవర్ణం పరమైంది. నామ మాత్రంగా వున్న క్షత్రియ వంశాలు అధికారంలోవున్న చతుర్థవర్ణాలతో వివాహ సంబంధాలు చేయడానికి వెనుకాడలేదు. అన్ని వర్ణాలలోను అనేక దురాచారాలు ప్రబలినాయి. బాల్య వివాహం, వరశుల్కం, ఓలి ఇచ్చి స్త్రీని పెండ్లాడటం, నిర్బంధ వైధవ్యం, సతీ సహగమనం తరచు కన్పిస్తున్నాయి. సామాన్య ప్రజల్లో విద్యాగంధం మృగ్యం. జూదం, మద్యపానం, కోడి, పొట్టేళ్ళ పందేలు మొదలైన దుర్వ్యసనాలు బీదలపాలిటి పెనుభూతాలయినాయి దేవదాసీలకు, వేశ్యలకు సంఘంలో గౌరవప్రదమైన స్థానం ఉండేది. వారు గజ్జ కట్టనిదే వివాహాది సాంఘిక కార్యాలుగాని, దేవతాకార్యాలుగాని జరిగేవి కావు వేశ్యాలోలత్వం సర్వసాధారణం. వేశ్యలు నృత్య, సంగీత, సాహిత్య చిత్రలేఖనాల్లో ప్రవీణలై, కవిపండితులను పోషించేవారు. ప్రతాపరుద్రుని ఉంపుడుకత్తె మాచల్దేవికి ఉన్న ప్రశస్తి ఢిల్లీ సురథాణికి కూడ లేదట.

**విద్యా - భాషాపోషణ :**

చాళుక్య యుగంలో ప్రారంభమైన భాషా సారస్వతోద్యమానికి కాకతీయ యుగంలో నూతనోత్తేజం లభించింది. కాకతీయ శాసనాల్లో విద్యా మంటపాల ప్రసక్తి కన్పిస్తుంది. ఇవి మందడం, పుష్పగిరి మొదలైన ప్రసిద్ధ ఆలయాల్లో వున్నందున వీనిలో మత చర్చలు, సాహిత్య గోష్ఠులు జరిగేవని భావించవచ్చు. ప్రతాపరుద్రుని ఖండవల్లి శాసనం ఘటశాసనులైన విప్రులను పేర్కొంటున్నది. వీరు ఘటికాస్థానాల్లోని ఆచార్యులై వుంటారు. మందడంలో విశ్వేశ్వర శివదాక వేద పాఠశాలను నెలకొల్పినాడు. వేద-వేదాంగ ఇతిహాస ధర్మశాస్త్ర పురాణ విదులైనవారిని శాసనాలు పేర్కొంటున్నాయి. వీనితోబాటు గణిత, (వ్యాకరణ ప్రాణినీయ) జ్యోతిష, ఆయుర్వేద విద్యల్లో పరిశ్రమ జరిగింది. అయితే, ఈ విద్యల్లో చాలాభాగం అగ్రవర్ణాలకే పరిమితం

**సంస్కృతం :**

కాకతీయుల రాజభాష సంస్కృతమే వారి శాసనాల్లో చాలాభాగం సంస్కృతంలోనే ఉన్నాయి. వారి సామంతులు కూడ శాసనాల్లో సంస్కృతాన్నే తరచు వాడినారు. అన్మకొండ, పాకాల, పాలంపేట, వర్ధమానపుర, బూద పురాది శాసనాలు చిన్న చిన్న ఖండ కావ్యాలని చెప్పవచ్చు. వీని రచయితలు చిత్రకవిత్వంలో సిద్ధహస్తులు. మల్యాలగుండని బూదపుర శాసనకర్త అభినవ మయూరి సూరి కొడుకు ఈశ్వర భట్టోపాధ్యాయుడు. ఇతడు 'పదవాక్య ప్రమేయ విచిత్ర కవిత్వ తత్వజ్ఞుడు.' పాకాల శాసన రచయిత అయిన కవిచక్రవర్తి గణపతి ఆస్థానకవి అయివుంటాడు.

కాకతి రుద్రుడు స్వయంగా కవి. 'నీతిసార' అనే రాజనీతి గ్రంథాన్ని సంస్కృతంలోను, తెలుగులోనుకూడ రచించినాడని ప్రసిద్ధి. ఇక ప్రతాపరుద్రుని ఆస్థానం కవి-పండిత కల్పతరువైంది. అతని ఆస్థానంలో అగస్త్యుడు 74 కావ్యాలు వ్రాసినాడట వానిలో నలకీర్తికౌముది అనే ఖండకావ్యం, బాలభారత మహాకావ్యం, కృష్ణచరిత ముఖ్యమైనవి. విజయనగరాధీశుడైన మొదటి బుక్కరాయలి కోడలు గంగాదేవి తన మధురావిజయంలో అగస్త్యుని తన గురువుగా కీర్తించింది. ఉత్తర రాఘవకావ్య, నిరోష్ఠ్యరామాయణాది కావ్యాలు రచించిన శాకల్యమల్లుభట్టు ప్రతాపరుద్రుని పోషణ నందుకొన్నాడు. ఈ కాలంలోనే విద్యనాచార్యులు 'ప్రమేయచర్చామృతా'న్ని గంధయభట్టు శ్రీహర్షుని 'ఖండన ఖండఖాద్య' అనే వేదాంత గ్రంథానికి వ్యాఖ్యానమూ రచించినారు నాటి కవులందరిలో ప్రతాపరుద్రుని ఆస్థానకవియైన విద్యానాథుడు అగ్రగణ్యుడు. ఈతడు 'ప్రతాపరుద్ర యశోభూషణ' మనే అలంకార గ్రంథాన్ని రచించి, ప్రతాపరుద్రుని ఘనతను కీర్తించినాడు. విద్యానాథుడు, అగస్త్యుడు ఒక్కరేనని కొందరు, కాళిదాసుని కావ్యాలకు వ్యాఖ్యాతయైన మల్లినాథుడే విద్యానాథుడని మరికొందరు అభిప్రాయ పడుతున్నారు

**తెలుగు :**

ఆంధ్రత్వానికి వ్యక్తిత్వం ఆంధ్రులలో జాతీయ చైతన్య వికాసం కలిగించినా కాకతీయులు తెలుగును ఆస్థానభాషగా చేయలేదు. అయినప్పటికీ చాళుక్య యుగంలో ప్రారంభమైన ఆంధ్ర సాహితీ స్రవంతి అవిచ్ఛిన్నమై కాకతీయ యుగాన్ని రసవత్తరం చేసింది తిక్కన సోమనాథాది మహాకవులెందరో తెలుగుభాషకు అమూల్యాలంకారాలు సమకూర్చినారు. కాకతీయ సేనానులు తెలుగులో కృతికర్తలు కృతిభర్తలు అయినారు తెలుగు సారస్వత చరిత్రలో విజయనగరం సృష్టించిందని భావిస్తున్న స్వర్ణయుగానికి కాకతీయ యుగంలోనే నాంది ప్రస్తావన జరిగింది.

కాకతీయ యుగంలో తెలుగు భాష సర్వతోముఖ వికాసం సాధించడమే గాక ఒక ప్రత్యేక వైలక్షణ్యం ప్రదర్శించింది. చాళుక్యులు సంస్కృత సంప్రదాయ సిద్ధమైన మార్గకవిత్వం ప్రవేశపెట్టినారు. సంస్కృత శ్లోకంతో ఆంధ్ర మహాభారతం ప్రారంభించి నన్నయ తనకు గీర్వాణ సంస్కృతిలోను, మార్గ కవిత్వంలోను ఉన్న అభిమానం చాటినాడు. సంస్కృతభాషా సంప్రదాయాలు తెలుగులోనికి దిగుమతి అయినాయి. 'అరూఢి గద్య పదాత్మక సంస్కృత భూయిష్ఠ రచన'తో అక్షర రమ్యత సాధించవచ్చును. గాని, ప్రజాదరణ పొందడం కష్టమనే సత్యాన్ని శైవ మత ప్రచారకులు గ్రహించినారు. వైదిక సంస్కృతికి ప్రధానమైన వర్ణ వ్యవస్థతోబాటు సంస్కృత భూయిష్ఠ రచనను నిరసించినారు. జైన బౌద్ధాలను రూపుమాపి ప్రజల్లో దైవభక్తి కలిగించడానికి ప్రజలకు సుబోధకమైన భాషలో ధర్మబోధనకై దేశి కవిత్వాన్ని సాధనంగా గ్రహించినారు. దేశి కవిత్వం అంటే దేశి ఛందములతో - మాత్రాగణబద్ధములై సులభంగా కంఠస్థం చేయడానికి అనువైన ద్విపద, రగడ, మంజరి, కందము మొదలైన ఛందములతో శైవ సిద్ధాంతాన్ని ప్రజల నిత్యజీవితంలో భాగంగా చేయడం వారి ఆశయం. దేశి ఛందములకు దేశి భాషయే సముచితం. ప్రజలకు చిరపరిచయమైన సామెతలు, నానుడులతో కూడిన జానుతెనుగే దేశిభాష. "జాను తెనుగు విశేషము ప్రసన్నతకు" అన్నారు. "ఉరుతర గద్య పద్యోక్తుల కంటె సరసమై పరిగిన జానుతెలుగు చర్చింపగా సర్వసామాన్యమగుట" చేత జాను తెలుగులో దేశికవితోద్యమాన్ని శైవకవులు ప్రారంభించినారు ఈ ఉద్యమానికి ఆద్యుడనదగిన పాల్కురికిసోమన కాలంనాటికే వెన్నెల పదాలు, తుమ్మెద పదాలు మొదలయిన గేయ వాఙ్మయం విశేష ప్రచారంలో ఉన్నట్లు అతని గ్రంథాల వల్లనే తెలుస్తున్నది. వర్ణవ్యత్యాసాలను ధిక్కరించి సాంఘిక విప్లవాన్ని బోధించినట్లే మార్గకవితా నియమాల నుల్లంఘించి భాషలో కూడ శైవులు విప్లవానికి ప్రయత్నించినారు.కాశీనాథుని నాగేశ్వరరావుగారి మాటలలో మార్గ-దేశి కవిత్వాల్లో "ఒకటి పురాతనము, రెండవది నవీనము; ఒకటి వేదోక్తమైన కర్మపథము, రెండవది భాగవతాయత్తమైన భక్తిపరము; ఒకటి గ్రంథస్థము, రెండవది ముఖస్థము; ఒకటి బ్రాహ్మణ సాహిత్య సంవర్ధితము, రెండవది ప్రజాసాహిత్య సంవర్ధితము.'

దేశికవితా ఉద్యమం శైవులకు మాత్రమే పరిమితం కాలేదు వైష్ణవుల పైనా, మార్గకవులపై గూడ ఆ ప్రభావం ప్రసరించింది. ఆ ఉద్యమంలోని గుణాన్ని గ్రహించి మార్గకవులు వైదిక ధర్మ సందేశాన్ని ప్రజానీకానికి సుబోధకమయ్యే విధంగా రచనలు సాగించినారు. తిక్కనయే మార్గకవితారీతిని సంస్కరించడానికి పూనుకొన్నాడు. అలతి అలతిపదాలతో గంభీరార్థబోధనయే

ఉత్తమ కావ్యశిల్పమనీ, తేటతెనుగులో తన ఆంధ్రమహాభారతం 'సర్వసామాన్యమై' 'ఆంధ్రావళిమోదము' చెందునట్లు రచించి ఉభయకవి మిత్రుడయినాడు. ఇతర మార్గకవులు సయితం తిక్కనననుసరించి తమకున్న సామాజిక బాధ్యతను గుర్తించినారో ఏమోగాని ప్రజలను దృష్టిలో వుంచుకొని రచనలు చేసినారు. ప్రజలపైకి కవులు దృష్టి మరల్చడం చేతనే ఈ యుగ కవిత్వంలో జాను తెనుగు ఎక్కువగా గోచరిస్తుంది. ఈ విధంగా మత సాంఘిక పరిణామాలకు కారకులై కవులొక పెద్ద ఉద్యమానికి నాయకులయినారు. ఆంధ్రుల చరిత్రలో యే యుగంలో కూడ కవులు ప్రజలకింత సన్నిహితులై జాతీయ జీవన స్రవంతిలో ప్రముఖ పాత్ర వహించినట్లు కన్పించదు.

కాకతీయ యుగసారస్వతాన్ని స్థూలంగా మత లౌకిక శాఖలుగా విభజించ వచ్చు. మత సారస్వతంలో శైవ, వైష్ణవ, వైదిక శాఖలున్నాయి. జైనులు సయితం సారస్వత సేవ చేసినారుగాని, వారి వసదులవలెనే వారి రచనలు కూడ రూపుమాసినాయి. జైన కవులందరిలో అధర్వణుడు అగ్రగణ్యుడు. విరాట పర్వాన్నితడు అనువదించినట్లు తెలుస్తుంది. కాని అందులో కొన్ని పద్యాలు మాత్రమే లభ్యమవుతున్నాయి. అప్పయార్యుడనే మరొక జైనకవి 'జైనేంద్ర కళ్యాణాభ్యుదయం' అనే కావ్యాన్ని క్రీ.శ: 1310 లో పూర్తి చేసినట్లు చెప్పు కున్నాడు.

శివకవుల ప్రాబల్యం ఎక్కువగా ఉన్నందున ఆంధ్ర సారస్వత చరిత్రలో కాకతీయ యుగాన్ని కొందరు శైవయుగం అంటారు. ప్రస్తుతం లభిస్తున్న రచనలనుబట్టి తెలుగులో శైవ సాహిత్యానికి మల్లికార్జున పండితుని శివతత్వసారమే శ్రీకారం. పండితారాధ్యుడు ఇంచుమించు కాకతి రుద్రుని కాలంవాడు (క్రీ.శ. 1156-1180) తరువాత చెప్పదగినవాడు యథావాక్కుల అన్నమయ్య; సర్వేశ్వర శతక కర్త. ఈతడు క్రీ.శ. 1240 ప్రాంతంలో జీవించినాడు. శివదేవయ్య కాకతీయుల్లో చివరి ముగ్గురి ఆస్థానాల్లో మంత్రిగా ఉండేవాడు. పరమ శైవుడు. 'శివదేవధీమణి' అనే మకుటంతో శతకం రచించినాడు. శివదేవయ్య, గణపతి దీక్షా గురువైన విశ్వేశ్వర శివాచార్యులు ఒక్కరేనని కొందరి అభిప్రాయం. శివ కవులందరిలో అగ్రగణ్యుడు పాల్కురికి సోమనాథుడు. మతావేశంలో భక్తి పారవశ్యంలో నిరంకుశ కవితా విహారంలో అతనికతడే సాటి. బసవేశ్వర పండితారాధ్యుల సిద్ధాంతాలకు హత్తుగూర్చి ఆంధ్రదేశంలో ప్రచారం చేసినాడు. ఓరుగల్లు సమీపంలో ఉన్న పాలకుర్తి సోమనాథుని జన్మస్థలం. ఈతని కాలాన్ని గురించి తీవ్ర అభిప్రాయ భేదాలున్నాయి. కాని ప్రతాపరుద్రుని కాలంవాడని క్రీ.శ. 1323 కు ఇంచుక పూర్వం - ఓరుగల్లును విడిచి వెళ్ళినాడని పిడుపర్తి సోమనాథుని రచన విశ్వాస యోగ్యంగా కన్పిస్తుంది. తెలుగులో దేశికవితారీతికి

గౌరవం కల్పించినది సోమనాథుడే. మార్గకవుల దూషణలను లెక్కచేయక తన ఆశయంలో అచంచలమైన దీక్షతో కావ్యరచన సాగించిన భగీరథుడు సోమనాథుడు పండితారాధ్య చరిత్ర, బసవపురాణం అనే ద్విపద కావ్యాలను అనుభవసారం అనే పద్యకావ్యాన్ని, వృషాధిప శతకాన్ని రచించి, ఆంధ్రదేశంలో శైవ విజ్ఞాన పీఠాన్ని అలంకరించినాడు. కన్నడంలో బసవన రగడ, గంగోత్పత్తి రగడ, సద్గురు రగడ మొదలైనవి, సంస్కృతంలో రుద్రభాష్యాన్ని రచించినాడు. సోమనాథుని తెలుగు కృతులన్నింటిలో ఇతివృత్తం స్వతంత్రం, కవిత్వం స్వతంత్రం, భాషలోగూడ స్వాతంత్ర్యం గోచరిస్తుంది. అందుచేత సోమన ద్విపద కావ్యాలే తెలుగులో మొదటి స్వతంత్ర కావ్యాలని చెప్పవచ్చు. పాల్కురికి సోమనకు సమకాలికుడై, శివభక్తి పారవశ్యంలో అతడి శిష్యుడైన చక్రపాణి రంగనాథుడు వేలసంఖ్యలో పద్యాలూ, రగడలూ రచించినాడు.

ఆంధ్రదేశంలో వైష్ణవం శైవమంతటి ప్రాబల్యం వహించలేదు. వైష్ణవ సారస్వతం కూడ పెద్దగా లేదు. వానిలో భాస్కర రామాయణం మొదటి గ్రంథమని చెప్పవచ్చు. దీని కర్తృత్వాన్ని గురించి పెద్ద 'రగడ' ఉంది. ఆశ్వాసాంత గద్యలనుబట్టి రామాయణాన్ని నలుగురు పూర్తిచేసినట్లుంది. బాలకాండ, కిష్కింధ, సుందరకాండలు మల్లికార్జునభట్టు; అయోధ్యకాండను కుమార రుద్రదేవుడు, అరణ్యకాండను, యుద్ధకాండలో కొంతభాగాన్ని హుళక్కి భాస్కరుడు; యుద్ధకాండ శేషాన్ని అయ్యలార్యుడు రచించినారు. తరువాతి కవులు రామాయణకర్తగా హుళక్కి భాస్కరుని కీర్తించినారు. అందుచే హుళక్కి భాస్కరుడే తన కుమారుడైన మల్లికార్జునభట్టు శిష్యులైన రుద్రదేవ, అప్పలార్యుల సహాయంతో రామాయణ రచన గావించినాడని చెప్పవచ్చు. రామాయణంలో కొన్ని భాగాలు సాహిణిమారుని కంకితమయినాయి. సాహిణిమారుడు ప్రతాపరుద్రుని సైన్యంలో ఉద్యోగి. రామాయణరచన అతని ప్రోత్సాహంలో జరిగి వుంటుంది. మార్గ కవితారీతిలో తయారైన భాస్కర రామాయణం బహుశా ప్రజాదరణ పొందనందున రామాయణగాథను ప్రజల్లో వ్యాపింపజేయడానికై శివకవుల మార్గం అనుసరించి వైష్ణవులు ద్విపద రామాయణం రచించి వుంటారు. దాన్ని గురించి ముందు అధ్యాయంలో ఆలోచిద్దాం.

వైదిక మతాభిమానులైన కవుల్లో తిక్కన అగ్రగణ్యుడు, నాటి మతసారస్యోద్యమాల్లో తిక్కన నిర్వహించిన పాత్రను పై అధ్యాయంలో చదివినారు. అతని తరువాత పేర్కొనదగినవారు అతని శిష్యులైన మారన, కేతన. మారన మార్కండేయ పురాణాన్ని తెనిగించి నాగయగన్న మంత్రికి అంకితం ఇచ్చినాడు. స్మార్తమతం విజయం పొందుతున్న రోజుల్లో మార్కండేయ పురాణం ఆంధ్రీకరణ సముచితంగా ఉంది. మూలఘటిక కేతన దశకుమార

చరిత్రను అనువదించినాడు. కేతన శబ్దశాస్త్ర, ధర్మశాస్త్రవిదుడు; వివిధ కళా నిపుణుడు. సంస్కృతాద్యనేక భాషా కావ్య రచనా విశారదుడు. అభినవ దండి బిరుదాంచితుడు. దశకుమార చరిత్ర తెలుగులో మొదటి కథా కావ్యమని ప్రసిద్ధి. కేతనకు ఇంచుమించు సమకాలికుడు మంచన. నందూరి గుండన మంత్రి కోరికపై అతనికి అంకితంగా కేయూర బాహు చరిత్రను రచించినాడు. వెలనాటి పృథ్వీశ్వరుని (1182-1207) మంత్రియైన నందూరి కేతన మనుమడు గుండనమంత్రి (క్రీ.శ. 1260). కేయూర బాహు చరిత్ర ఇంచుమించు స్వతంత్రమే. ఇదీ కథా కావ్యమే.

పండిత పామర హృదయంగమమై దైవ సంకీర్తనకు అత్యంతము అనుకూలమైన శతకము ఈ యుగంలోనే ప్రారంభమయినాయి. ఈ ప్రక్రియకు గూడ శివకవులే ఆద్యులు. పండితారాధ్యుడు, పాల్కురికి సోమన, శివదేవయ్య, అన్నమయ్య శతకాలు రచించినట్లు పరిశీలించినాము. తిక్కన సోమయాజి సయితం 'కృష్ణ శతకం' రచించినట్లు ప్రతీతి. నీతులను సూత్రీకరించి ప్రజలకు బోధించడానికి శతకాలు ఉపయోగపడినాయి బద్దెన 'నీతి శతకం' ఇందుకు చక్కని ఉదాహరణ. శైవ శతకాలలో మతావేశంతోబాటు మార్గ కవితా నియమోల్లంఘనం, మోక్షసాధనంతోబాటు భాషను సయితం ప్రజల పరం చేయాలనే తాపత్రయం కన్పిస్తుందనడానికి ఈ క్రింది పద్యం నిదర్శనం:

ఏనిన్నే శరణంబు బాంధవులుగానీ ఎల్లవారుం బగే
కానీ మృత్యువు తల్లక్రిందుపడనీ కాలుండు గీవెట్టనీ
నానాకర్మచయంబు గింజుకొననీ నాకేమి నేరాజ నిం
తే నీచాటున దాగియున్నపుడు భీతేయింక సర్వేశ్వరా!

మతేతరమైన లౌకిక సారస్వతంలో శాస్త్ర గ్రంథాలు, శృంగార రస ప్రధానాలైన ప్రబంధాలను చేర్చవచ్చు. శాస్త్ర గ్రంథాల్లో కేతన అనువదించిన విజ్ఞానేశ్వరీయమనే యాజ్ఞవల్క్య ధర్మశాస్త్రం ప్రథమగణ్యం. వైదిక ధర్మంతోబాటు, సాంఘిక నియమావళిని కూడా ప్రజల్లో వ్యాపింపజేయడం అతని లక్ష్యం అయినట్లు చెప్పుకున్నాడు. "తజ్ఞులకు దెలియునట్లుగ, ప్రాజ్ఞులు మదిమెచ్చ తెనుగు పద్యంబులను తత్వజ్ఞుడు మ్రానయకేతన విజ్ఞానేశ్వరము జగతివెలయగ జెప్పెన్." ఈ దృక్పథంలో దేశి కవితోద్యమ ప్రభావం కన్పిస్తుంది. తెలుగు భాషాశాస్త్రానికి కూడ కేతనయే పునాది వేసినాడు. తన ఆంధ్ర భాషాభూషణం ద్వారా తెలుగులో వ్యాకరణం లేని లోటు తీర్చినాడు. తరువాత అథర్వణుని కారికలు, కవిరాక్షసీయం వెలువడినాయి. తిక్కన కూడ 'కవి వాగ్బంధనము'నే ఛందో గ్రంథం వ్రాసినాడని ప్రతీతి. కాకతీయ యుగంలో పెక్కు రాజనీతి గ్రంథాలు తెలుగులో రావడం ఒక విశేషం. వానిలో బద్దెన నీతిశాస్త్ర ముక్తావళి

తరువాత పేర్కొనదగింది ప్రతాపరుద్రుని నీతిసారం. బద్దెనగూడ "వినం బడువన్ గడుమంచిదంచు జెప్పెర కవి నీతి పద్ధతులు జేసె వినోదము బాల బోధకున్". బాల బోధనకు ప్రత్యేకంగా సుమతీ శతకం కూడ బద్దెన రచించినాడు. దాని తరువాత వచ్చినవి క్షేమేంద్రుని 'ముద్రామాత్యం', శివదేవయ్య 'పురుషార్థసారం'. క్షేమేంద్రు డనేది బిరుదమై వుంటుంది. ఈతడు క్రీ. శ. 1200 ప్రాంతంవాడని ఒక అభిప్రాయం. ఆంధ్ర భోజుడనే కవి 'నీతి భూషణం' రచించినట్లు లక్షణ గ్రంథాల నుండి తెలుస్తున్నది. భోజకవి 'చారుచర్య'ను అనువదించినందున అప్పనమంత్రికి 'ఆంధ్రభోజ' బిరుదం వచ్చిందని, నీతి భూషణకర్త అతడేనని విమర్శకుల అభిప్రాయం. ఆదర్శప్రాయమైన దినచర్యను వివరించే వైద్య గ్రంథం చారుచర్య.

ఇక ప్రబంధాలు వర్ణనాత్మక శృంగార కావ్యాలు. కాకతీయ యుగంలో రాజకీయంగా దేశం సమైక్యమై, శాంతి లభించింది. ఆర్థికంగా పుష్టి సంతరించుకొన్నది. జైన శైవ వైష్ణవ సంఘర్షణ వెనుకాడి, సమన్వయమతమైన స్మార్తం పురోగమిస్తున్నది. పరిష్కరించవలసిన జరూరు సమస్యలు లేవు. ఇట్టి ప్రశాంత వాతావరణంలో కవుల దృష్టి శృంగార కావ్యాల వైపు మరలింది. ప్రబంధ యుగానికి తిక్కనయే నాంది పలికినాడని, అతని భారతంలోని ప్రతి పర్వమూ ఒక ప్రబంధము అనే అభిప్రాయం ఉంది. అయితే, నాటి శృంగార దృష్టికి తిక్కన పెద తండ్రిగా భావిస్తున్న కేతన కృతమైన 'కాదంబరి', ఈ యుగం చివర్లో జీవించిన రావిపాటి త్రిపురాంతకుని 'మదన విజయం' చక్కని ఉదాహరణలు. త్రిపురాంతకుడు (తిప్పన్న) 'ప్రేమాభిరామం' అనే వీధి నాటకాన్ని సంస్కృతంలో రచించినాడని, దానికి అనువాదమే వినుకొండ వల్లభామాత్యుని 'క్రీడాభిరామ' మని తెలుస్తుంది. ఓరుగల్లులోని మత సాంఘిక జీవితానికి దర్పణం వంటిది క్రీడాభిరామం. తిప్పన్న 'అంబికా శతకం' కూడ వ్రాసినాడు. అందులోని ఈ క్రింది పద్యంలోనిది భక్తి పారవశ్యమో శృంగార రసావేశమో ఆలోచించవలె:

కూడెడి వెంద్రుకల్ నిదుర కూకటి త్రోవగఁ బొడ్డుపైవళుల్
జాడలుదోప గ్రొమ్మొలకచన్నులమించుదొలంక సిగ్గునం
జూడగనేరముల్ మెరుగు జూపునమేన హిమాద్రియింట నీ
వాడుట శూలికిన్ మనము వాడుటగాదె! తలంప నంబికా!

కాకతీయ యుగ ఆస్థానాలలో దేవస్థానాలలో నాట్య సంగీతాలకు మంచి పోషణ లభించింది. ముఖ్యంగా వేశ్యలు (కళావతులు) ఈ విద్యలకు పట్టుగొమ్మలుగా ఉండేవారు. వారికి సమాజంలో గౌరవం వుండేదని, వివాహాది శుభకార్యాలు గాని ఆలయ ఉత్సవాలుగాని నాట్యసంగీతాలు లేనిది అసంపూర్ణములని

చదివినారు. శిల్పాల్లో పలు రకాల నాట్య భంగిమలు వాద్యాలు కన్పిస్తాయి. రామప్ప, పానగల్లు, పిల్లలమఱ్ఱి, ధర్మసాగర, చేబ్రోలు, మల్కాపురం, గుంటూరు శాసనాల్లో నాట్యకత్తెల, వాద్యగాండ్ర ప్రస్తావనలున్నాయి. అలయ శాసనాల్లో నట్టువరాండ్రతోబాటు నట్టువగాండ్ర ప్రసక్తి కన్పిస్తుంది. మందరం లోని విశ్వేశ్వర దేవస్థానంలో 10 మంది ఆటగత్తెలు, 16 గురు పాటగత్తెలు, ఇద్దరు ముఖరి వాయించేవారు ఎన్మిదిమంది మార్దంగికులు, కరడా, శంఖం మొదలైనవి వాయించేవారు, అర్గురు వున్నట్లు మల్కాపుర శాసనం చెబుతున్నది. వీరిలో కాశ్మీర దేశీయుడొకడున్నాడు. ఈతడు బహుశా ఆంధ్రవాద్యగాండ్రకు శిక్షణ ఇవ్వడానికి వచ్చివుండవచ్చు. ధర్మసాగర శాసనంలో జలకరండమనే వాద్యవిశేషం కన్పిస్తుంది. జాయప సేనాని నాట్యసంగీతశాస్త్ర గ్రంథాలైన నృత్త రత్నావళి, గీతరత్నావళి రచించినాడు. గీతరత్నావళి లభ్యం కాలేదు. ఇందులో నృత్యానికి గీతం ఉపాంగంగా వర్ణించినాడని విమర్శకుల అభిప్రాయం. నృత్త రత్నావళిలో మార్గ-దేశిరీతులు వర్ణిస్తూ దేశివిభాగంలో పేరణ, రాసకము చిందు, కందుకము, కోలాటము మొదలైన జానపదనృత్యాలను జాయప చేర్చినాడు. నాట్యంతోబాటు నాటక కళకూడ ప్రజాదరణ పొందింది. శివుని లీలలు, పల్నాటి వీరగాథలు నాటకాలుగా ఆడేవారని బసవ పురాణ, క్రీడాభిరామాలనుండి తెలుస్తుంది. "నటులంది దోరసముద్రము" అన్న క్రీడాభిరామవాక్యంవల్ల నాటకా లాడేవారు బహుశా జట్లుగా నేర్పడి దూరప్రాంతాలకు కూడ వెళ్ళి ప్రదర్శన లిస్తుండేవారని భావించవచ్చు. నాట్యశాస్త్రం అభ్యసించి కళావతులకు శ్రీమంతు లకు నాట్యశాస్త్రం బోధించడం పెక్కు బ్రాహ్మణ కుటుంబాలకు జీవనోపాధిగా ఉండేది.

**వాస్తుశిల్పాలు :**

కాకతీయులు, వారి సామంతులు ప్రసిద్ధ నిర్మాతలైనందున వాస్తు శిల్పా లకు పోషణ లభించింది. దేశ రక్షణలో దుర్గాల ప్రాముఖ్యం హెచ్చడంతో దుర్గ నిర్మాణం విరివిగా జరిగింది. ఓరుగల్లు, రాయచూరు, గోల్కొండ, రాచకొండ, దేవరకొండ మొదలైన దుర్గాలు నాటి నిర్మాణ కౌశల్యానికి నిదర్శనాలు. మూడు రక్షణ శ్రేణులతో ఓరుగల్లు దుర్భేద్యమైన కోటగా ఉండేది. మొదటిది పుట్టకోట. ప్రస్తుతం దాని శిథిలాలు కూడ కన్పించవు. రెండోది మట్టికోట, దాన్ని పరివేష్టించి కందకము; నాలుగుదిక్కులా నాలుగు దర్వాజాలు. ఈ కోట ఎత్తు 20 అడుగులుండేది. మట్టికోటకు సుమారు ఫర్లాంగు దూరంలో తిరిగి ఆగడ్తరాతికోట (కలుకోట). దీనిలోకూడ నాల్గువైపులా బలిష్టమైన ద్వారా లుండేవి. ప్రతాపచరిత్రనుబట్టి ఈ రాతికోటలో 77 బురుజులుండేవి. రుద్రమ దేవి కాలంలో రాతికోట లోపలిభాగంలో సోపాన పంక్తి నిర్మించినారు. రాతి

కోటలో ఐహూళా నగరానికి మధ్యగా స్వయంభూ ఆలయ శిధిలాలు, వానికి నలు వైపులా గంభీరములైన శిలాతోరణాలు కన్పిస్తాయి.

కాకతీయ యుగారంభంలో జైన వసదుల ఆలయనిర్మాణం విరివిగా జరిగి తీర్థంకర, శాసనాధికారిణుల ప్రతిమలు వెలసినాయి. జైనం క్షీణించడంతో వానిలో చాలభాగం ధ్వంసమయినాయి. క్రమంగా శైవ వైష్ణవాలయాల సంఖ్య పెరిగింది. శైవం ప్రబలంగా ఉన్నరోజుల్లోనే 'శివుని గుడిలేని ఊళ్ళో' ఉండ రాదు అనే సంప్రదాయం ఏర్పడి వుంటుంది. ప్రోలుని కాలంలో అన్మకొండలో సిద్ధేశ్వరాలయం, పద్మాక్షి ఆలయం; ఓరుగల్లులో స్వయంభూ, కేశవ ఆలయాలు నిర్మించినారు. ఎత్తైన అధిష్ఠానాలు, వివిధ శిల్పాలంకృతాలైన స్తంభాలు, జాలా లంకృతాలైన పిట్టగోడలున్న మండపాలు, తోరణస్తంభాలు కాకతీయ ఆలయాల లోని విశిష్ట లక్షణాలు. క్రి.శ. 1162 లో కాకతి రుద్రుడు అన్మకొండలో నిర్మించిన వేయి స్తంభాల గుడి (రుద్రేశ్వరాలయం) నాటి శిల్పుల వాస్తుప్రావీణ్యా నికి గీటురాయి. ఇది రుద్రేశ్వర, వాసుదేవ, సూర్యదేవులకుద్దేశించిన 'త్రికూటా లయం.' ఈ త్రికూటాలయంపై విమానాలు శిధిలమైనవి. గర్భాలయ ద్వార బంధాలు, ముఖమండప స్తంభాలు నీడలు దేరునంతగా నిగనిగలాడుతూ లోహ స్తంభాలా అనే భ్రాంతిని కలిగిస్తాయి. వీనినిండా మనోహర శిల్పసంపదే. గణపతిదేవుని కాలంలో ఓరుగల్లు, పాలంపేట, పిల్లలమర్రి, కొండపర్తి, నాగులపాడు మొదలైనచోట్ల ఆలయాలు వెలసినాయి. రామప్ప చెరువు గట్టున రేచర్ల రుద్రుడు నిర్మించిన పాలంపేట దేవాలయం కాకతీయ నిర్మాణాలకు మకుటప్రాయం. ఎత్తైన అధిష్ఠానంమీద నాలుగంతస్తుల విమానంతో చాల గంభీరమైన నిర్మాణం. రంగమంటప స్తంభాలు వివిధ శిల్పాలతో, ఇతిహాస గాథలతో మనోహరంగా ఉంటాయి. ఆలయ నాసికలో వివిధ భంగిమల్లోని స్త్రీమూర్తులు ఈ ఆలయంలోని ప్రత్యేకాకర్షణ. ఇది బేలూరులోని హొయసాల చెన్నకేశవాలయ ప్రభావమా అనిపిస్తుంది కాని, చాళుక్య హొయసాల శిల్పాల కంటే వీనిలో సున్నితమైన అంగసౌష్ఠవం, స్త్రీ సహజమైన సౌకుమార్యం ఉట్టి పడుతుంటాయి. తోరణాలలో, విమానాలలో చాళుక్యరీతి ప్రభావం కన్పించి నప్పటికీ కాకతీయశిల్పం చాళుక్య విజయనగర శిల్పరీతుల మధ్యవర్తియై, సహజ పరిణామంలోని వైలక్షణ్యం ప్రదర్శిస్తుంది.

కాకతీయులనాటి చిత్రలేఖనాలు లభించలేదు. కాని, నాటి సారస్వతంలో చిత్రాలను గురించిన ప్రస్తావన విశేషంగా కన్పిస్తుంది. అనాదిగా తెలుగు స్త్రీలు చిత్రలేఖనంలో ప్రవీణులని పేరుమోసినారు. ప్రాతఃకాలంలో ముంగిటిని శుభ్రం చేసి కలాపిబల్లి రంగవల్లులు తీర్చడం ఆంధ్ర జాతీయతలోని విశిష్ట లక్షణం. తెలుగు ప్రబంధాలలోని నాయికల చిత్రలేఖన నైపుణ్యం గురించి ప్రశంసలు

కన్పిస్తాయి. పల్నాటి వీర చరిత్రను బట్టి రామ, కృష్ణావతారగాథల చిత్రపటాలను నాడు ఇండ్లలో అలంకరించుకొన్నట్లు తెలుస్తుంది ఓరుగల్లులో 1500 చిత్రకారుల ఇండ్లు ఉన్నట్లు ప్రతాప చరిత్ర చెబుతున్నది. ప్రతాపరుద్రుని ఉంపుడుకత్తెయైన మాచలదేవి ప్రత్యేకంగా చిత్రశాలను నిర్మింపినట్లునూ అందు దారుకావన శివలీలలు, గోపికాకృష్ణులు, తారాచంద్రులు మొదలైన చిత్రాలు ప్రదర్శించినట్లును క్రీడాభిరామంలో వుంది. "గచ్చు చేసిన చిత్రంపుగద్దెవలక వ్రాసినారదె చూడరా. వైశ్యరాజ! శిల్పబ్రహ్మాది వీరనాసీర చరిత" అనడం ద్వారా చిత్రాలు గీసే పద్ధతిని కూడా క్రీడాభిరామం సూచిస్తున్నది ప్రజలకు సర్వసాధారణమైన వినోదము తోలుబొమ్మల ఆటలు. వీనిని తయారుచేయడానికి సయితం చిత్రలేఖన కౌశలం అవసరం. చిత్రలేఖనంలోని ఈ సంప్రదాయాలే విజయనగర యుగంలో లేపాక్షి మొదలైనచోట్ల వికాసాన్ని సాధించినాయి.

## కొన్ని ఉపయుక్త గ్రంథాలు


1. Arudra — సమగ్ర ఆంధ్ర సాహిత్య చరిత్ర- I, II.
2. Hanumantha Rao B.S.L. — Religion in Andhra.
3. Parabrahma Sastry — The Kakatiyas.
4. Ramarao — కాకతీయ సంచిక.
5. Somasekhara Sarma — ఆంధ్ర విజ్ఞాన సర్వస్వము.
6. Vaidehi — Social & Economic Condition of Eastern Deccan, 1000 - 1250 A. D.
7. Venkataramanaiah — The early Muslim expansion in South India.
8. Yazdani (ed) — Early History of Deccan

# రెడ్డి – నాయక యుగము

ఓరుగల్లు నాక్రమించి ఆ నగరానికి సుల్తాన్‌పూర్ అనే పేరు పెట్టి ఉల్లుఖాన్ అచ్చట ముస్లిం పాలకులను నియమించినాడు. తరువాత నిరవద్యపుర, రాజమహేంద్రవరములను ఆక్రమించి రాజ్‌నగర్ మీదుగా ఢిల్లీకి పయనించి, తండ్రి ఘియాస్ ఉద్దీనును బహుశా హత్యచేసి. మొహమ్మద్ బిన్ తుగ్లక్ అనే పేరుతో క్రీ.శ. 1326 లో సింహాసనం ఎక్కినాడు. రాజమహేంద్రవరం పెద్ద మసీదులో క్రీ.శ. 1324 నాటి ఘియాస్ ఉద్దీన్ శాసనం ఉంది. ఈ మసీదును, చాళుక్యయుగ వేణుగోపాలస్వామి ఆలయం పడగొట్టి నిర్మించినారు. ఏలూరు సమీపంలో ఘియాస్ నాణేలు దొరికాయి. దీన్నిబట్టి క్రీ.శ. 1324 నాటికి తీరాంధ్రం ఢిల్లీ సామ్రాజ్యంలో చేరినట్లు స్పష్టమవుతుంది. అబ్దుల్లా వాసఫ్ రచనను బట్టి క్రీ.శ. 1328 నాటికే నెల్లూరు నుండి మాబార్ (మధుర) వరకు ఢిల్లీ సామ్రాజ్యంలో చేరింది. మధుర, తెలంగాణాలు ఢిల్లీ సామ్రాజ్యంలో రెండు రాష్ట్రాలయినాయి జలాలుద్దీన్ హసన్‌షా మధుర నవాబయినాడు తెలంగాణా పాలన దేవరగిరి వజీరయిన మాలిక్ బుర్హన్ ఉద్దీన్ వరమయింది. అతనికి సాయంగా ఓరుగల్లులో మాలిక్ మక్‌బూల్ నాయబ్ వజీరు అయినాడు. ప్రతాపరుద్రుని కొలువులోని కన్ను అనే సేనాని ఉల్లుఖాన్ మన్ననకు పాత్రుడై, ఇస్లాం స్వీకరించి తెలంగాణా పాలకుడైనాడని షామ్‌సి సిరాజ్ అసిఫ్ రచననుబట్టి తెలుస్తుంది ప్రతాపరుద్రుని కాలంలో కటక పాలకుడయిన నాగయ గన్నయయే కన్ను అనీ అతడే ఓరుగల్లు నాయబ్ వజీరైన మాలిక్ మక్బూల్ అని చరిత్రకారుల అభిప్రాయము.

తురుష్క పాలనలో ఆంధ్రులనేక కష్టనష్టాలకు గురి అయినారు. పన్నుల భారం అధికమయింది. విద్వజ్జనుల అగ్రహారాలకు నష్టం వాటిల్లింది; ఆలయాలు దేవతా ప్రతిమలు భగ్నమయినాయి అని ప్రోలయనాయకుని విలసశాసనం నుండి తెలుస్తున్నది. శత్రుదండయాత్రల్లో, పర పరిపాలనలో- అందునా మతేతరులైన తురుష్కుల పాలనలో ఇట్టి వైపరీత్యాలకు ఆశ్చర్యపడవలసిన పనిలేదు. యదార్థానికి మొహమ్మద్ బిన్ తుగ్లక్ పరమతద్వేషికాదు. మత సహనం ప్రదర్శించిన సుల్తాను. హిందువులాతణ్ణి 'యోగి'గా శ్లాఘించేవారని సమకాలిక రచనలు చెప్పుతున్నాయి. కాని, పరిపాలనలో అతడు చేసిన ప్రయోగాలవల్ల ఆందోళన ప్రబలి

సామ్రాజ్యం నలుమూలలా తిరుగుబాట్లు జరిగినాయి. అతని మత సహన విధానం నిరసించి ఉలేమాలు ఎదురు తిరిగినారు, పలు రాష్ట్ర పాలకులు తుగ్లక్‌ను ధిక్కరించినారు. క్రీ. శ. 1328 లో తుగ్లక్ బంధువు సాగర్ రాష్ట్ర పాలకుడునైన బహాఉద్దీన్ గుర్షస్ప్ తిరుగుబాటు చేసినాడు. కాని, తుగ్లక్ చేతిలో ఓడి పారిపోయి ఆనెగొంది పాలకులను శరణు జొచ్చినాడు. ఆనెగొంది పాలకులైన కంపిలి రాయలు, అతని కొడుకు రామనాథరాయలు ధైర్యసాహసాలున్న మహావీరులే కానీ రాజనీతిపరులైనట్లు కన్పించదు. బహాఉద్దీన్‌కు ఆశ్రయం ఇచ్చి ఢిల్లీ సుల్తాన్‌తో ఢీకొన్నారు. సుల్తాన్ తండ్రి కొడుకులను వధించి ఆనెగొంది (కంపిలి) రాజ్యాన్ని ఢిల్లీ సామ్రాజ్యంలో కలిపి, కంపిలి రాయల బంధువులు కొందరిని బందీలుగా ఢిల్లీకి పంపినాడు. ఈ బందీలలో హరిహరబుక్క-రాయ సోదరులున్నారు. బహాఉద్దీన్ ద్వారసముద్రం పారిపోయి, మూడో బల్లాలుని శరణువేడినాడుగాని బల్లాలు దాతణ్ణి సుల్తాన్‌కు అప్పగించి అతని సామంతుడయినాడు దక్షిణదేశం సమస్తమూ ఢిల్లీ సుల్తాన్‌కు శిరసొగ్గింది.

మొహమ్మద్ బిన్ తుగ్లక్‌పై దేశవ్యాప్తమైన ఆందోళనలోని భాగంగా ఆంధ్రదేశంలో భిన్నప్రాంతాల్లో స్వతంత్రరాజ్యస్థాపనకై తిరుగుబాట్లు ప్రారంభమయినాయి. మన చరిత్రలో కేంద్రాధికారంపై రాజకీయ స్వార్థంతో కూడిన తిరుగుబాట్లు - ముఖ్యంగా చాళుక్య, కాకతీయ యుగాలలో కొల్లలుగా జరిగినట్లు చదివినాము. తుగ్లక్‌పై జరిగిన తిరుగుబాట్లను సుసంఘటితమైన ప్రజా ఉద్యమం అనీ, హింసాయుత మతదౌష్ట్యవిధానంపై తిరుగుబాటనీ దేశీయ చరిత్రకారులు వర్ణించినారుగాని ఆ అభిప్రాయానికి బలమైన సాక్ష్యాధారం కన్పించదు. ఈ తిరుగుబాటుల నాయకులు ఆంధ్రదేశంలో వేరు వేరు స్వతంత్ర రాజ్యాలు స్థాపించడమేగాక, హిందూమతసంస్కృతుల రక్షణ దృష్టితో సమైక్యంగా ముస్లింలను ప్రతిఘటించడానికి బదులు పరస్పర యుద్ధాల్లో నిమగ్నులై, బహమనీరాజ్య విస్తరణకు తోడ్పడి తాము బలైపోవటం శోచనీయం.

ఆంధ్రదేశంలో తురుష్కాధికారం అంతమొందించిన నాయకుల్లో రేచర్ల సింగమ నాయకుడు మాత్రం ప్రతాపరుద్రుని కొలువులోని సేనాని. ఇతడు దక్షిణ తెలంగాణాలో స్వతంత్రించి పద్మనాయక రాజ్యం స్థాపించినాడు. ఉత్తర తెలంగాణా, ఉత్తర తీరాంధ్ర ప్రాంతాల్లో ముసునూరి ప్రోలయనాయకుడు వన, గిరి దుర్గాలను స్థావరాలుగా చేసుకొని, యవనులతో పోరాడి తరిమివేసి, రేకపల్లి రాజధానిగా స్వతంత్ర రాజ్యం స్థాపించినాడు. వేంగి ప్రభువు చంద్ర వంశస్థుడు అయిన వేంగి భూపాలుడు ప్రోలనాయకునితో సహకరించినట్లు చోదభక్తిరాజా పెంటపాడు శాసనం సూచిస్తున్నది. ప్రోలనాయకుని విలస తామ్ర

శాసనం ప్రతాపరుద్రుని ప్రస్తావిస్తున్నదిగాని అతడు కాకతీయులకొల్వులో ఉన్నాడనడానికి ఆధారం లేదు. విలస శాసనంలో కాలం లేనందున ప్రోల నాయకుడు ఎప్పుడు స్వతంత్రించిందీ స్పష్టంగా చెప్పలేము.

దక్షిణతీరాంధ్రంలో తిరుగుబాటు నాయకుడు ప్రోలయ వేమారెడ్డి. క్రీ.శ. 1325 నాటి ఈతని మల్లవరం శాసనంలో ఈతనికి వున్న మ్లేచ్ఛాబ్ధికుంభోద్భవ బిరుదాన్ని బట్టి నాటికే వేమారెడ్డి స్వతంత్రించినాడని చెప్ప వచ్చు. ప్రతాపరుద్రుని ఉద్యోగులైన కొలని రుద్రదేవుడు బెండపూడి అన్నయామాత్యుడు ప్రోలయ వేమారెడ్డితో సహకరించినట్లు కన్పిస్తుంది. క్రీ .శ. 1326 నాటి కొలని రుద్రుని శాసనం వేమారెడ్డి రాజ్యంలోని సంతమాగులూరులో ఉంది. రెడ్డిరాజుల ఆస్థాన కవియైన శ్రీనాథుడు బెండపూడి అన్నయ్య మంత్రిని "ఆంధ్రభూమండలాధ్యక్ష సింహాసన సంప్రతిష్ఠాపనాచార్యుడ"ని కీర్తించినాడు శ్రీనాథుడే పెదకోమటి వేమారెడ్డిని "ఆంధ్రక్షమా మండలాఖండలుడ'ని వర్ణించినాడు. బహుశ శ్రీనాథుని అభిప్రాయంలో రెడ్డిరాజులే నాటికి ఆంధ్రాధీశ్వరులు. ప్రోలయ వేమా రెడ్డి ప్రతాపరుద్రుని కొల్వులోనివాడుకాదు రుద్రమదేవి, ప్రతాపరుద్రులపై తిరుగుబాటు చేసిన కాయస్థ నాయకుడు అంబదేవునితో వేమారెడ్డిగాని, అతని తండ్రి ప్రోలయరెడ్డిగాని సహకరించి వుండవచ్చుననే అభిప్రాయం వుంది. కొండవీటి దండకవిపలెవంటి స్థానిక చరిత్రలు ప్రోలయ వేముడు ఓరుగల్లు పతనానికి పూర్వమే (క్రీ.శ. 1320) స్వతంత్రించినాడనే అభిప్రాయానికి తావిస్తున్నాయి. ఓరుగల్లు పతనానంతరం అచిరకాలానికే ప్రోలయ వేముడు స్వతంత్రరాజ్యం నిర్మించటం - అంతకు పూర్వంనుండి అతడా ప్రయత్నంలో ఉన్నాడనే అనుమానానికి అవకాశం ఇస్తున్నది.

అదే అభిప్రాయం రాయలసీమలో విజృంభించిన అరవీటి వంశంపైకూడ కలుగుతుంది ఇచటి తిరుగుబాటుకు సోమదేవరాజు నాయకుడు. దోనేరు కోనేరునాథుని ద్విపద బాల భాగవతం, అందుగుల వెంకన్న రామరాజీయం అరవీటి వంశస్థులను గురించిన వివరాలు ఇస్తున్నాయి. సోమదేవరాజు తండ్రి తాతపిన్నమరాజు, సోదరుడు కొటికంటి రాఘవుడు. వీరు కర్నూలు, శ్రీశైలం మధ్య భూముల నాక్రమించి పాలించినారు. వీరికి మల్యాల కేంద్రం. ప్రతాప రుద్రుని కాలంలో ఈ ప్రాంతం చెరకు వంశస్థుల పాలనలో వుంది. చెరకు సామంతులనుండి అరవీటి వారెప్పుడు మల్యాల నాక్రమించినారో చెప్పటం కష్టం. బహుశా ప్రతాపరుద్రుని చివరి రోజుల్లో - ముస్లిం దాడులవల్ల ఏర్పడిన అలజడిని అవకాశంగా తీసుకొని అరవీటివారు మల్యాల రాజ్యం ఆక్రమించి వుంటారు. తమ రాజ్య విస్తరణ ప్రయత్నంలో తాతపిన్నమరాజు, కొటికంటి రాఘవుడు కంపిలి రాయలతో పోరాడినట్లు తెలుస్తుంది. క్రీ.శ 1338 లో కంపిలి రాజ్యంఆక్రమించి

సుల్తాను ఢిల్లీకి మరలడంతో సోమదేవరాజు ఢిల్లీని ధిక్కరించి, తీవ్ర పోరాటం సాగించినాడు. సుల్తానుకు విధేయులైన సదబాలనాయక, గంగినాయక, గుజ్జల వీరినీడు, గౌరారెడ్డి మొదలైన హిందూ సామంతులు కూటమిగా ఏర్పడి సోమదేవరాజును ప్రతిఘటించినారు. గంగినేనికొండదగ్గర ఈ కూటమి నోడించి విచ్ఛిన్నంచేసి సోమదేవరాజు మొసలిమడుగు, సాతానికోట, కందనవోలు, కల్వకొండ, రాచూరు, ఏతగిరి మొదలైన దుర్గాల నాక్రమించినాడు. మణిజిల్లకోట నేలే మన్నె నాయకుడు గోసంగిని వధించి ఆ దుర్గం పట్టుకున్నాడు. అనెగొందిలోని సుల్తాన్ ప్రతినిధి మాలిక్ నెబి సోమదేవరాజు బెదరించి 6000 గుర్రాలతో పట్టుబడి శరణు వేడి ప్రాణాలు దక్కించుకున్నాడు. ఇట్టి పరిస్థితుల ప్రోత్సాహంతో మూడో బల్లాలుడు స్వాతంత్ర్యం ప్రకటించి కంపిలిరాజ్యంపై దాడులు చేయసాగినాడు. కంపిలి రాజ్యంలో ముస్లిం అధికారం ఇంచుమించు అస్తమించింది.

సుల్తానుకు కంపిలి తిరుగుబాటు వర్తమానం అందింది. మంత్రిమండలి సలహా ప్రకారం కంపిలికి స్థానికులైన వారినే ఆరాజ్యపాలకులుగా పంపడం ఉత్తమమని హరిహర-బుక్కరాయ సోదరులను బంధవిముక్తులుగా చేసి వారికి సైన్యాన్నిచ్చి సుల్తాను పంపినాడు. వీరు బల్లాలునితోను అరవీటి నాయకులతోను పోరాటం సాగించినారు. క్రీ శ. 1335 ప్రాంతంలో ఆ సోదరులకు అనెగొంది (కుంజరకోన) స్వాధీనమయింది. నెల్లూరు మొదలు చంద్రగిరివరకు వారి పాలన కిందికి వచ్చింది. ఈ విజయపరంపరలతో హరిహర, బుక్కరాయల సోదరులకు స్వతంత్ర రాజ్యస్థాపనాకాంక్ష కలగడం సహజం. అందుకై ఆ సోదరులు కృషి ప్రారంభించినారు.

ఈలోగా రేకపల్లిలో ముసునూరు ప్రోలయ మరణించి,కాపయ నాయకుడు రాజైనాడు. ముస్లిం చరిత్రకారులితణ్ణి కృష్ణానాయక్, కాన్యానాయక్, కాన్యా పాయక్, కానా నాయంగ్, కాబా నాయంగ్ అనే పేర్లతో వ్యవహరించడమే కాకుండ ప్రతాపరుద్రుని కుమారుడని వర్ణించినారు. కాపయ సాహసోత్సాహ లున్న వీరుడు. ఓరుగల్లు పునరాక్రమణయే అతని లక్ష్యం. దక్షిణాది హిందూ ప్రభువులందరితో-ముఖ్యంగా బల్లాలునితో చేరి ఓరుగల్లు, దోరసముద్రం, కంపిలి రాజ్యాలను ముస్లిం అధికారం నుండి విముక్తి చేయటానికి సుసంఘటిత ప్రణాళిక తయారుచేసినాడని ఫెరిష్టా కథనం. కాని, ఫెరిష్టా వృత్తాంతాన్ని బలపరిచే విశ్వాసయోగ్యమైన సాక్ష్యం కన్పించదు. దాక్షిణాత్య హిందూరాజులందరు ఒకే సారి ఢిల్లీ నుండి స్వతంత్రులయినందున అదొక ప్రణాళిక ప్రకారం జరిగిందని ముస్లిం చరిత్రకారులు భావించి వుండవచ్చు.

దాక్షిణాత్య హిందూరాజులను మరింతగా ప్రోత్సహించినది మదుర వజీరైన సయ్యద్ జలాల్ ఉద్దీన్ తిరుగుబాటు. దేశంలోని అలజడులు, సుల్తాన్ నిస్సహాయత గమనించి జలాల్ ఉద్దీన్ క్రీ.శ. 1335 లో స్వాతంత్ర్యం ప్రకటించుకున్నాడు. అతణ్ణి శిక్షించడానికై సుల్తాన్ సైన్యంతో ఓరుగల్లువరకు నడచినాడు. దురదృష్టవశాత్తు ఓరుగల్లులో 'ప్లేగ్' వ్యాధివల్ల ఢిల్లీసైన్యంలో చాలమంది మరణించినారు. సుల్తాన్‌కు గూడ వ్యాధి సోకినట్లు ఇసామి వ్రాసినాడు. గత్యంతరంలేక మాబార్ దండయాత్రను విరమించి సుల్తాన్ దౌలతాబాద్ చేరి అచట చికిత్స పొంది ఢిల్లీకి మరలినాడు. దీనితో సుల్తాన్ బలహీనత తేటతెల్లమయింది. ఇదే అదనని కాపయ నాయకుడు దండెత్తి, మాలిక్ మక్‌బూలును పారదోలి, ఓరుగల్లును ఆక్రమించినాడు. ఓరుగల్లు కోట బురుజులపై స్వతంత్రాంధ్రపతాకం తిరిగి ప్రతిష్ఠితమయింది. అదే సమయంలో ఆనెగొందిలో హరిహరుడు స్వతంత్రించినాడు శ్రీరాంధ్రంలో ప్రోలయ వేమారెడ్డి స్వతంత్రంగా తన రాజ్యవిస్తరణ చేసుకుంటున్నాడు. యావదాంధ్రదేశంలో ముస్లిం అధికారం అస్తమించింది భారతదేశంలో మరి ఏ ఇతర ప్రాంతంలోను తురుష్కుల అధికారం ఇంత త్వరలో (క్రీ శ. 1323-1336) అంతరించలేదనడం అతిశయోక్తి కాదు.

ఆంధ్రులు స్వతంత్రులయినారు. కాని, కాకతీయులు వారికి ప్రసాదించిన రాజకీయ ఐక్యం నశించింది. కాకతీయ సామ్రాజ్య శిథిలాలనుండి నాల్గు స్వతంత్ర రాజ్యాలు ఉద్భవించినాయి. కంపిలి (విజయనగర), రెడ్డి, వెలమ, నాయక రాజ్యాలుగా విడిపోవడంతో ఆంధ్ర జాతీయత తిరిగి విచ్ఛిన్నమయింది. ఈ రాజవంశాల్లో వర్ణాభిమానము మితిమీరి ఆంధ్రదేశాన్ని పరస్పరయుద్ధాల్లో ముంచెత్తినాయి. నాయకులు - వెలమలు, వెలమలు - రెడ్లు పోరాడుకొనుచు ఒకరితరువాత ఒకరు బహమనీల సామ్రాజ్య కాంక్షకు బలియై, తెలంగాణమును వారికి కట్టబెట్టినారు. వీరందరూ ఐకమత్యంతో వ్యవహరించినచో బహమనీరాజ్యం అచిరకాలంలోనే అంతరించి ఆంధ్రుల చరిత్ర, భారత చరిత్ర మరోవిధంగా రూపొందివుండేది.

## ముసునూరి నాయకులు

ముసునూరి వంశ చరిత్రకు ప్రోలయ నాయకుని విలస తామ్రశాసనం, కాపయ పోలవరం శాసనాలు ముఖ్య ఆధారాలు. చోడభక్తిరాజు పెంటపాడు శాసనం, అనితల్లి కలువచేరు శాసనాలుకూడ ప్రోలయ, కాపయలను ప్రస్తావిస్తున్నాయి. అనితల్లి రాజమహేంద్రవర రెడ్డిరాజ్యాన్ని పాలించిన వీరభద్రారెడ్డి రాణి. ఈ శాసనం క్రీ.శ. 1425 నాటిది. అయితే, మరి ఏ రెడ్డిరాజుల శాసనాల్లోనూ ముసునూరి ప్రస్తావన కన్పించదు. ఈ శాసనాలనుండి ముసునూరి

వంశోత్పత్తిని గురించిగాని, ప్రోలయ కాపయలను గురించిన వివరాలుగానీ సమగ్రంగా లభించడంలేదు.

ముసునూరు అనే గ్రామం కృష్ణాజిల్లాలో ఒకటి, నెల్లూరుజిల్లాలో మరొకటి ఉన్నాయి. కృష్ణాజిల్లా వుయ్యూరు సమీపంలోని ముసునూరులో కోటగోడల శిథిలాలు నేటికీ కన్పిస్తాయి. కమ్మవారిలో ముసునూరివారున్నారు. ముసునూరు నాయకుల స్వాతంత్ర్యపోరాట రంగస్థలం కృష్ణాజిల్లా సమీపంలో ఉన్నందున అందలి ముసునూరే వారి జన్మస్థలం అయివుండవచ్చును.

**ప్రోలయ :**

ముసునూరివారు చతుర్థాన్వయులు. ప్రోలయ తండ్రి పోతినాయకుడు. ఆతనికి దేవ, కామ, రాజనాయకులనే పినతండ్రులున్నారు ప్రోలయ జీవితం లోని తొలి దశలను గురించిన వర్తమానం లభించడంలేదు. ఓరుగల్లు పతనానంతరం యవనాక్రాంతమైన ఆంధ్రదేశంలో చెలరేగిన అసంతృప్తి అవకాశంగా తీసుకొని భద్రాచల ప్రాంత మన్యభూముల్లోని గిరి వన దుర్గాలను స్థావరంగా ఏర్పరచుకొని తురుష్కులతో పోరాడినాడు. ఈ పోరాటంలో ప్రోలయకు వేంగి పాలకుడైన వేంగభూపాలుడు, తన పినతండ్రి కొడుకు కాపయ నాయకుడు తోడైనారు. బహుశ ప్రోలయ వేమారెడ్డికూడ సహకరించివుంటాడు. తురుష్కులతో యుద్ధాలు చేసి వారిని ప్రారదోలి గోదావరిప్రాంతంలో మాల్యవంత (పర్వత) సమీపంలోని రేకపల్లి రాజధానిగా స్వతంత్రరాజ్యం స్థాపించినాడు.

ప్రోలయ నాయకుడు తురుష్కదాడుల్లో నష్టమైన అగ్రహారాలతోబాటు వైదికధర్మాన్ని పునరుద్ధరించినాడు అమలాపురం తాలూకాలోని విలస గ్రామాన్ని భారద్వాజ గోత్రుడైన అన్నయకుమారుడు వెన్నయకు చంద్రగ్రహణకాలంలో దానం చేసినాడు. ఈ శాసనంలో తేదీ లేదు. కాని, క్రీ.శ. 1330 ప్రాంతంలోని దయివుండవచ్చు. ప్రోలయ ఎప్పుడు గతించిందీ స్పష్టంగా చెప్పలేము.

**కాపయనాయకుడు :**

ప్రోలయ మరణానంతరం కాపయ రేకపల్లి సింహాసనం అధిష్ఠించి స్వాతంత్ర్య సంగ్రామంలో అతనిలక్ష్యసిద్ధికై కృషి చేసినాడు. ఈతని పోలవరం, పిల్లలమర్రి, గణపేశ్వర శాసనాలనుండి, వెలుగోటివారి వంశావళినుండి, ఫెరిస్తా మొదలైన ముస్లించరిత్రకారుల రచనలనుండి కాపయచరిత్ర తెలుస్తున్నది. పైన వివరించినట్లు క్రీ.శ. 1336 లో కాపయ ఓరుగల్లును ఆక్రమించినాడు. ఆంధ్ర దేశాధీశ్వర, ఆంధ్ర సురత్రాణ అనే బిరుదులతో శాసనాలతణ్ణి వ్యవహరిస్తున్నాయి. అతని తల్లి కలువచేరు శాసనం "ఆధసంచో త్తరసవ్తతినాయక సంసేవ్యమాన పదపద్మః కాపాయ నాయకః" అంటే. కాకతీయులనాటి నాయకులందరు కాపయను సేవించినట్లు వర్ణిస్తున్నది. ఇది అతిశయోక్తి. కలువచేరు శాసనం

మినహాయించి ప్రోలయవేమారెడ్డి కాపయతో సహకరించినాడనడానికిగాని, అతని ఆధిపత్యం అంగీకరించినాడనడానికిగాని వేరే సాక్ష్యం లేదు. ఇక రేచర్ల సింగమ నాయుడు యుద్ధంలో కాపయ నోడించినాడని వెలుగోటివారి వంశావళినుండి తెలుస్తున్నది. కాని, గణపేశ్వర శాసనం (క్రీ శ. 1346) లోని "ఆనుమనగంటిపుర వరాధీశ్వర" అనే బిరుదం కాపయ తిరిగి పద్మనాయకులపై ఆధిపత్యం సాధించినట్లు సూచిస్తుందని చరిత్రకారుల అభిప్రాయం. ఏమైనా- ఉత్తర తెలంగాణము, కృష్ణానది పర్యంతం ఉత్తర తీరాంధ్రము కాపయ అధికారాన్ని స్పష్టంగా గుర్తించినట్లు చెప్పవచ్చును.

రాజ్యానికి నాడున్న ప్రమాదాలను మనసులోనుంచుకొని ఓరుగల్లుకోటను బలపరచి కాపయ కట్టుదిట్టమైన పరిపాలన నేర్పరచడానికి ప్రయత్నించినాడు. విశ్వాసపాత్రులు, బంధువులునైనవారిని రాజ్యం వివిధ ప్రాంతాల్లో రాజప్రతినిధులగా నియమించినాడు. ఉత్తరాంధ్రంలో అతని పినతండ్రి రాజానాయని కొడుకు అనపోతానాయడు పాలకుడయినాడు. అనపోతుకు కొంతకాలం తొయ్యేరు, అనంతరం రాజమహేంద్రవరమూ రాజధానులు. అందుచే నీతడు తొయ్యేటి అనపోతానీడు అని ప్రసిద్ధికెక్కినాడు. గురిజాల చెలుంగున్నృపుని కొడుకు ముప్పభూపాలుడు సబ్బినాటి రాజప్రతినిధి. ఇతనికి రామగిరి (కరీంనగర్) రాజధాని. ముప్పభూపాలుడు మడికి సింగనకవిని పోషించినాడు. సింగన తొయ్యేటి అనపోతు మంత్రియైన అయ్యలామాత్యుని కుమారుడు. కాపయ కోరుకొండదుర్గాన్ని నిర్మించి, అందు కూనయనాయకుని రాజప్రతినిధిగా నియమించినాడు. కూనయకొడుకు ముప్పిడినాయకునకు కాపయ తన మేనకోడలి నిచ్చి పెండ్లిచేసి బంధుత్వం చేసినాడు. క్రమంగా ఉత్తర తీరాంధ్రంలో రాజకీయాలకు కోరుకొండ బలమైన కేంద్రమయింది.

కాపయ తన రాజ్యాన్ని పదిలపరచుకొంటున్న సమయంలో దక్షిణ దేశంలో మరొక రాజకీయ విప్లవం జరిగింది. మొహమ్మద్‌బిన్ తుగ్లక్ చర్యలను అనుమానించి దక్కన్‌లోని సైన్యాధిపతులు జాఫర్‌ఖాన్ అనే హసన్‌గంగూ నాయకత్వంలో తిరుగుబాటు చేసినారు. ఈ తిరుగుబాటువట్ల కాపయ ఆసక్తి వహించి పదిహేను వందల అశ్వదళాన్ని హసన్‌కు సాయంగా పంపినట్లు ఫెరిష్టా వ్రాసినాడు. ఇదే నిజమయితే ఇది దూరదృష్టిలేని చర్య అని చెప్పక తప్పదు. కొత్త ముస్లిం రాజ్యం ఢిల్లీ సామ్రాజ్యం నుండి కాపుదలగా ఉండగలదని కాపయ ఆశించివుండవచ్చు. కాని, తన రాజ్య సమీపంలో స్వతంత్ర తురుష్క రాజ్యావతరణను ప్రోత్సహించడంలోని అనౌచిత్యాన్ని కాపయ గుర్తించకపోవడం శోచనీయం. అచిరకాలంలోనే ఈ అనౌచిత్యం రుజువయింది. అల్లాఉద్దీన్ బహమన్‌షా అనే బిరుదంతో క్రి. శ. 1341 లో హసన్ గంగూ గుల్బర్గ

రాజధానిగా బహమనీ రాజ్యం స్థాపించినాడు. బహమనీ సుల్తానులకు దక్షిణా పథంలో ఇస్లాం అధికార విస్తరణయే లక్ష్యం అయింది. అందుచే కాపయపట్ల కృతఘ్నతతో హసన్ గంగూ, బహుశా క్రీ. శ. 1350 ప్రాంతంలో ఓరుగల్లును జయించడానికై సికందర్‌ఖాన్ సేనానిని పంపినాడు. కాపయ ఓడిపోయి కౌలస్ దుర్గాన్ని (నిజామాబాద్ జిల్లా) అపారమైన ధనరాసులను కొన్ని యేనుగులను సమర్పించి సంధి చేసుకొన్నాడు. ఆంధ్రదేశంలో పశ్చిమోత్తర ప్రాంత భాగాలు బహమనీ రాజ్యంలో చేరినాయి. తిరిగి క్రీ. శ. 1356 లో అల్లాఉద్దీన్ ఆంధ్రదేశంపై దండెత్తినాడు. ఈ దండయాత్ర ఆశయం ఓరుగల్లును సామంతరాజ్యంగా చేసి ప్రతి సంవత్సరం కప్పం వసూలు చేయడమని ఫెరిష్టా రచన సూచిస్తున్నది. కాని ఈ దండయాత్ర తెలంగాణాకు మాత్రమే పరిమితం కాలేదు. అల్లాఉద్దీన్ కృష్ణా తీరంలోని ధాన్యకటకంవరకూ నడచి, అమరేశ్వరాలయాన్ని దోచుకున్నట్లు రెడ్డిరాజుల శాసనాలనుండి తెలుస్తున్నది, కాపయ ఓడిపోయి భువనగిరి దుర్గాన్ని బహమనీ సుల్తానుకిచ్చి సంధి చేసుకున్నాడు.

అల్లాఉద్దీన్ దాడులతో ఓరుగల్లు, విజయనగరాలు బహమనీ రాజ్యం వల్ల తమ కేర్పడిన ప్రమాదం గుర్తించి, ఆ రాజ్య విధ్వంసనానికి కలిసి ప్రయత్నించడానికి నిర్ణయించినాయి. బహమనీల బంగారు నాణేలను సాధ్యమైనంత వరకు సంగ్రహించి కరిగించవలసిందిగా హిందూరాజులు తమ ప్రజలకు సూచించినట్లును. బహమని సుల్తానులకుద్దేశించిన గుర్రాలను అరబ్బు వర్తకుల నుండి హిందూరాజులు సంగ్రహిస్తున్నట్లు ఫెరిష్టా వ్రాసినాడు. ఈ చర్యలవల్ల బహమని ఆర్థిక విధానానికి, సైనిక బలానికి పెద్ద నష్టం వాటిల్లేది. దీనికితోడు బుక్కరాయ కాపయ నాయకులు కలసి తమ రాజ్యాలనుండి అల్లాఉద్దీన్ ఆక్రమించిన ప్రాంతాలను తిరిగి ఇవ్వవలసిందని, లేనిపక్షంలో ఢిల్లీ సుల్తానుతో తాముచేరగలమని మహమ్మద్‌షాను బెదరిస్తూ రాయబారం పంపినారు సుల్తాన్ వారే తనకు కప్పం చెల్లించవలసిందిగా ఎదురు రాయబారం పంపినాడు సుల్తాన్ కోరికకు ఆగ్రహించి కాపయ తన కుమారుడైన వినాయకదేవుని బహమనీ రాజ్యంపై దండెత్త పంపినాడు. అతనికి సాయంగా బుక్కరాయలనుండి ఇరవైవేల అశ్వదళం వచ్చి చేరింది. కాని, బహమనీ సేనాని బహదూర్‌ఖాన్ చేతిలో ఓడి వినాయకదేవుడు తన రాజధాని వెలుంపట్టన్ కోటలో తల దాచుకున్నాడు. మహమ్మద్‌షా విజయనగర రాజ్యంపై దండెత్తి విజేతయై గుల్బర్గాకు మరలినాడు. బహదూర్‌ఖాన్ ఓరుగల్లును ముట్టడింపగా కాపయ అతనికి ధనమూ గుర్రాలూ, ఏనుగులు సమర్పించి సంధి చేసుకున్నాడు.

వెలుంపట్టన్‌లో వినాయకదేవుడు అరబ్బు గుర్రాలను అటకాయించడం మానలేదు క్రీ. శ. 1362 లో అరబ్బు వర్తకుల పిర్యాదుపై మహమ్మద్‌షా

దండెత్తి వినాయక దేవుని ఓడించి పట్టుకొని బాలా దారుణమైన మరణానికి గురి చేసినాడు. వినాయకదేవుని కోశాగారము, రాజ్యము దోపిడికి గురి అయినాయి. కాని, మార్గమధ్యంలో ఆగ్రహావేశులైన ప్రజలు సుల్తానుకు అపార నష్టాన్ని కలిగించినట్లు ఫెరిష్టా వ్రాసినాడు.

కొడుకు మరణం కాపయను కుంగదీసింది. బహమనీ సుల్తానును స్వయంగా జయించడం అసాధ్యమనే అధైర్యంతో కాపయ ఢిల్లీసుల్తాన్ ఫిరోజ్‌షా తుగ్లక్ సహాయం అర్థించినాడు. ముస్లింలతో యుద్ధంచేస్తున్న కాపర్లకు సహాయం చేయడం ఫిరోజ్ అభిప్రాయంలో ధర్మ విరుద్ధం. అందుచే కాపయ కాతడు సహాయం నిరాకరించినాడు. కాపయ ప్రయత్నాలను చారులద్వారా మహమ్మద్ షాకు అంది, ఓరుగల్లును నిర్మూలించదాని కాతడు నిర్ణయించి విస్తృత ప్రయత్నాలు చేసినాడు. అజాం హుమాయూన్ సేనానిని గోల్కొండపైనా, సఫ్దర్ ఖాన్ సేనానిని ఓరుగల్లు పైకి పంపి, సుల్తాన్ వారిని అనుసరించినాడు. విజయనగరం నుండి కాపయకు సహాయం అందలేదు. కాపయ ఓడిపోయినాడు. బహదూర్‌ఖాన్ మధ్యవర్తిత్వంతో 1364-65 లో సంధి జరిగింది. గోల్కొండ దుర్గంతోసహా ఆ పరిసరప్రాంతాన్ని, 100 ఏనుగులు, 250 గుర్రాలు, 33 లక్షల రూపాయలు యుద్ధనష్టపరిహారంగా కాపయ చెల్లించినాడు. ఉభయ రాజ్యాల మధ్య గోల్కొండ సరిహద్దుగా నిర్ణయం జరిగింది. ఈ సంధి షరతులను ఉభయ వంశాల్లో ముందుతరాలవారు సయితం గౌరవించే ఒప్పందం జరిగింది. అనంతరం వజ్రవైడూర్యాలు పొదిగిన సింహాసనాన్ని మహమ్మద్‌షాకు కాపయ బహూకరించినాడు. ఈ సింహాసనం మొహమ్మద్ బిన్ తుగ్లక్‌కు ఉద్దేశించినదని ఫెష్టారి వ్రాసినాడు.

బహమనీలతోటి యుద్ధాలలో పరాజయాలు కాపయ అధికార ప్రతిష్ఠలకు భంగం కలిగించినాయి. తీరాంధ్రంలో అతని అధికారం అస్తమించినది. పిఠాపురంలో కొప్పుల నాయకులు స్వతంత్రించినారు. బెజవాడ (క్రీ.శ. 1267), దోనేపూడి (క్రీ.శ. 1337), సింహాచలం శాసనాలనుండి కొప్పుల వంశచరిత్ర తెలుస్తుంది. బెజవాడ శాసనంలోని నారెబోయ, నాగబోయ అనే పేర్లనుబట్టి వీరు మొదట్లో బోయనాయకులయివుంటారు. బహుశా కాకతీయపాలనాంతంలో కృష్ణాతీరం నుండి పిఠాపురానికి వచ్చి సామంతులయినారు. కాటయ, ప్రోలయ, అతని కొడుకులు నామయ, కొప్పులయ్య, కొప్పులయ్య కొడుకు ప్రోలయలను శాసనాలు పేర్కొంటున్నాయి. వీరిలో నామయ సుప్రసిద్ధుడు (క్రీ.శ. 1337). అతని అనంతరం కొప్పుల వంశంలో అంతఃకలహాలు చెలరేగినాయి క్రీ.శ. 1353లో జరిగిన కళింగగంగ దండయాత్ర వీరి అధికారానికి నష్టం కలిగించి వుంటుంది. అయితే, పంచధారల యుద్ధంలో చోడభక్తిరాజు గణపతిని ఓడించి, కొప్పులపతిని

సింహాసనస్థుని చేసినట్లు భక్తిరాజు కొడుకు అన్నదేవచోడుని రాజమహేంద్రవర శాసనం చెబుతున్నది. అనంతరం కొప్పుల వంశచరిత్ర స్పష్టంగా లేదు

రాజమహేంద్రవరంలో తొయ్యేటి అనవోతనాయకుడు మరణించడంతో (క్రీ శ. 1356) ఆ రాజ్యం కోరుకొండ రాజ్యంలో చేరింది. కోరుకొండనేలే మంచికొండ వంశస్థులు చాల ప్రాచీనులవలె కన్పిస్తారు. మంచికొండ కూనయ నాయకుడు ముసునూరు ప్రోలయకు సమకాలికుడు. అతని కొడుకులు ముమ్మడి, సింగన్న, గన్నయనాయకులు, ముమ్మడి కోరుకొండ శిలాశాసనం. శ్రీరంగం శాసనం ( కీ శ. 1350), సింగన అక్కలవూండి తామ్రశాసనాలు (క్రీ.శ. 1368) వీరిచరిత్రకు ముఖ్య ఆధారాలు. ముమ్మడి నాయకుడు ముసునూరి కాపయకు బందువే అయినా పానార, కోన, కురవాట, వెంగర మొదలుగా "గోదావరీ ముభయతీర ముపాంత" దేశాన్ని జయించి స్వతంత్రించినట్లు కనిపిస్తుంది. క్రీ.శ. 1353 లో కృష్ణాతీరం వరకు పురోగమించిన గంగదండయాత్ర మంచికొండవారి అధికారానికి భంగం వాటించింది. అనంతరం క్రీ.శ. 1356 లో కొండవీటి అనవోతారెడ్డి కళింగ దండయాత్ర జరిపినట్లాతని దాక్షారామ శాసనం నుండి తెలుస్తుంది. మంచికొండవారు రెడ్ల సామంతులైనారు. ఉత్తర తీరాంధ్రంలో రెడ్ల అధికారం నెలకొన్నది.

తీరాంధ్రం కాపయ చేయిజారిపోయే సమయంలోనే తెలంగాణంలో రేచర్ల సింగమ విజృంభించినాడు. అతణ్ణి అదుపులో వుంచటానికి కాపయ చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. బహమనీలతోటి యుద్ధాల్లో కాపయతో సహకరించటానికి బదులు వెలమల అనంతర చరిత్రనుబట్టి వారు బహమనీలపట్లనే అభిమానం వహించినట్లు కన్పిస్తుంది. కాపయ యుద్ధాల్లో మునిగియుండగా సింగమ కృష్ణానది పర్యంతం రాజ్యాన్ని విస్తరింపజేయడమేగాక కృష్ణా తుంగభద్రా అంతర్వేదిలోని ప్రాంతాలను సయితం ఆక్రమించినాడు. చివరకు సింగమ నాయకుడు జల్లిపల్లి రాజులతోటి యుద్ధంలో హతుడయి, అతని కొడుకు అనవోతానీడు రాజయినాడు. సింగమ మరణంలో కాపయకు జోక్యం ఉన్నదని అనవోతు అనుమానించినట్లు కన్పిస్తుంది. అనవోతు ఆమనగల్లు నుండి రాజధానిని బలిష్టదుర్గమైన రాజుకొండకు మార్చి, కాపయపై దండెత్తినాడు. ఓరుగల్లు సమీపంలోని భీమవరంచెంత భయంకరమైన యుద్ధం జరిగింది (క్రీ శ. 1366). కాపయనాయకుడు ఓడి మరణించినాడు, ఓరుగల్లు, భువనగిరి మొదలైన దుర్గాలు పద్మనాయకుల వశమయినాయి. ముసునూరువంశం అంతరించింది. ఆంధ్రనగరియైన ఓరుగల్లు రాజకీయ ప్రాముఖ్యం కోల్పోయింది.

# పద్మనాయకులు

వెలమలకే పద్మనాయకులనికూడ వ్యవహారము. విష్ణుపాదం పద్మనుండి జన్మించినందున వీరికీ పేరు వచ్చిందని ఒక అభిప్రాయం. కాని, శూద్రులందరు విష్ణుపాద పద్మోద్భవులే గదా! పలనాటి బ్రహ్మన్న సాంఘిక సంస్కరణల ఫలితంగా వీరు ఏర్పడినారనే సూచనలో సయితం సత్యం కన్పించదు. పద్మనాయకులలో పదిహేడు గోత్రాల వారున్నారు. రాజుకొండ, దేవరకొండనేలిన వారిది రేచర్ల గోత్రం. పల్నాటి వీర చరిత్రలో వెలమల ప్రసక్తి ఎక్కువగా కన్పిస్తుంది. బ్రహ్మన్నది సయితం రేచర్ల గోత్రమే. పద్మనాయకులు కాకతీయాస్థానంలో ప్రాబల్యం వహించిన కాలంలో ఓరుగల్లులో పల్నాటి వీరగాథలకు జనాదరణ ఉన్నట్లు, బ్రహ్మన్న జీవితగాథలను చిత్రాలుగా గోడలపై వ్రాసుకొనే వారని క్రీడాభిరామం పేర్కొంటున్నది. పలనాటి యుద్ధానంతరం వెలమలు ఆమనగల్లు, పిల్లలమర్రి, ఓరుగల్లు ప్రాంతాలకు వలసపోయి, కాకతీయుల ప్రాపకం సంపాదించి బలపడినారని చెప్పవచ్చు. అయితే, వెలమల చరిత్రకు ఆధారమైన 'వెలుగోటివారి వంశావళి'లో చెవిరెడ్డి నామాంతరం ఉన్న బేతాళ నాయకుడు వెలమల మూలపురుషుడని వుంది. వెలమల్లో 'రెడ్డి' పదం ధరించిన వారు లేరు. కాని, పిల్లలమర్రి పాలించిన రెడ్డి సామంతులలో చెవిరెడ్డి ప్రసిద్ధుడు. వీరిదికూడ రేచర్ల గోత్రమే. అందుచే 'వెలుగోటి'వారి వంశావళి రచయిత పొరబాటున బేతాళనాయకుడే చెవిరెడ్డి అని రచించి వుండవచ్చు. బేతాళనాయకుడే పలనాటి బ్రహ్మనాయుడనే అభిప్రాయం కూడ ఉంది.

శాసనాల్లో పద్మనాయక చరిత్ర దాచానాయనితో ప్రారంభిస్తున్నది. గణపతి దేవుని కాలంలో దామ, రుద్ర, ప్రసాదాదిత్యనాయకులు ప్రసిద్ధులయినారు. రుద్రమదేవి కాలంలో జరిగిన తిరుగుబాటుల నణచి ప్రసాదాదిత్యుడు "కాకతిరాయ రాజ్య స్థాపనాచార్య" "రాయపితామహాంక" బిరుదములు పొందినట్లు వెలుగోటివారి వంశావళి చెబుతున్నది. ప్రసాదాదిత్యుని సోదర కుమారుడు వెన్నయ తెలంగాణంపై దండెత్తిన తురుష్క సైన్యంపై విజయం సాధించినాడట. ప్రతాపరుద్రుని ఆస్థానంలో ఎరదాచానాయుడు, అతని కొడుకు సింగమనాయుడు ప్రసిద్ధ సేనాపతులు. దాచానాయునికి 'పంచ పాండ్య దళ విభాళ' బిరుదం వుంది. ప్రతాపరుద్రుడు పాండ్యుళ్లపై జరిపిన దండయాత్రలో నీతడు ప్రముఖ పాత్ర వహించినాడు. ఈ బిరుదాన్ని పద్మనాయకులు వంశ పరంపరా ధరించినారు. సింగమనాయుడు కూడ ప్రతాపరుద్రుడు నిర్వహించిన అనేక యుద్ధాల్లో ముఖ్యంగా కాంచీ కంపిల రాజ్యాలపై దాడుల్లో పాల్గొని మెప్పించి అతనిచే అశీతి (ఎనభయి నాల్గు) వరాలను పొంది అశీతివరాల సింగమనాయుడని ప్రసిద్ధికెక్కినాడు.

**సింగమనాయుడు**

ఓరుగల్లు పతనానంతరం (క్రీ.శ. 1323) సింగమ నాయని చరిత్ర స్పష్టంగా లేదు. తురుష్కులపై జరిపిన దేశ విముక్తి పోరాటంలో ముసునూరి ప్రోలయతో నితడు సహకరించినాడని చరిత్రకారులు ముక్త కంఠంతో వ్రాస్తున్నారు. అందుకు స్పష్టమైన సాక్ష్యం లేదు. ఆమనగల్లు, పిల్లలమఱ్ఱి ప్రాంతాల్లో బలపడి, స్వతంత్ర రాజ్యస్థాపనకు మొదటినుండి సింగమనీడు ప్రయత్నించినాడని చెప్పవచ్చు. ప్రోలయ మరణానంతరం కాపయ సింహాసనం ఎక్కడంతో సింగమనీడు బహిరంగంగా విజృంభించినాడు. కాపయనాయకునిపై యుద్ధంలో సింగమనీడు గెలిచినట్లు వెలుగోటివారి వంశావళి చెబుతున్నది. ఈ యుద్ధం ఎప్పుడు. ఎక్కడ జరిగిందో చెప్పలేము. కాపయ ఇష్ట భృత్యుడైన ఎరపోతులెంక క్రీ శ. 1357లో పిల్లలమఱ్ఱిలో పాలిస్తున్నట్లు ఉన్న శాసనం ప్రకారం సింగమనీడు నాటికి కాపయ అధిపత్యం అంగీకరించినట్లు స్పష్టమవు తున్నది. కాపయ బహమనీలతో పోరాటం సాగిస్తున్న సమయంలో సింగమనీడు విజృంభించి, కృష్ణా తుంగభద్రానదుల అంతర్వేదిని, ఏలేశ్వరాన్ని ఆక్రమించి తన రాజ్యం విస్తరింపజేసినాడు. ఇదే కాలంలో సింగమనీడు స్వతంత్రించినాడని కూడా చెప్పవచ్చు. ఈ రాజ్య విస్తరణ సందర్భంలోనే జల్లిపల్లి పాలకులైన సోమవంశ క్షత్రియులతో సింగమనీనికి యుద్ధం సంభవించింది. పద్మనాయకు లకు బద్ధవిరోధులైన రెడ్లు జల్లిపల్లివారికి సహాయంగా నిలిచినారు. సింగమనీని విజృంభణ నరికట్టడానికి ప్రయత్నిస్తున్న కాపయ నుండి కూడ జల్లిపల్లికి ప్రోత్సాహం లభించి వుంటుంది. సింగమనీని బావమరిదియైన చింతపల్లి సింగమను సోమవంశీయులు బంధించడంతో సింగమనీడు జల్లిపల్లిపై దండెత్తినాడు. సోమ వంశీయులు మోసం చేసి తంబళజియ్యచేత సింగమనీని చంపించినారు. కాకతీయ సేనాపతుల తరం అంతరించింది.

**అనపోతానాయుడు**

సింగమనాయని పెద్ద కొడుకు అనపోతానాయుడు. ఆమనగల్లు సింహా సనం అధిష్టించి తండ్రి మరణానికి ప్రతీకారం తీర్చుకొనే ఉద్దేశంతో జల్లిపల్లిపై దండెత్తినాడు. తమ్ముడు మాదా (మాధవ) నాయుడాతనికి అండగా నిలిచినాడు. సోమవంశస్థులను, వారికి సహాయంగా వచ్చిన రెడ్డి నాయకులను హతమార్చి, వారి రక్తంతో తమ తండ్రికి తర్పణసమర్పించి 'సోమకుల పరశురామ' బిరుదు ధరించి నాడు. ఈ సందర్భంలోనే వెలమలకు కొండవీటి రెడ్లకు పోరాటం ప్రారంభ మయింది. వెలమ సోదరులు ధరణికోటవరకు నడచి, అనపోతారెడ్డిని ఓడించి శ్రీశైల ప్రాంత భూములను ఆక్రమించినారు రెడ్డి - వెలమల సంఘర్షణ రెడ్డి రాజ్యపతనంవరకు కొనసాగింది.

జల్లిపల్లి దండయాత్రనుండి మరలి అనపోతానాయుడు రాజకొండ (రాచ కొండ రాజాచలం)ను దుర్భేద్యమైన దుర్గంగా రూపొందించి, రాజధాని నచటికి మార్చినాడు. అనంతరం మునునూరి కాపయపై దండెత్తినాడు. భీమవరం యుద్ధంలో (క్రీ.శ. 1367-68) కాపయ మరణించి ఓరుగల్లు అనపోతానాయని వశమయింది. భువనగిరి, శృంగవరం మొదలైన దుర్గాలను ఆక్రమించి అనపోతానాయుడు 'ఆంధ్రదేశాధీశ్వర' బిరుదం ధరించినాడు.

ఓరుగల్లు ఆక్రమించిన తరువాత అనపోతానాయుడు కళింగ దండయాత్ర సాగించినాడు. రెడ్డి రాజ్య ఉత్తర విస్తరణ నరికట్టడమే ఈ దండయాత్ర ఉద్దేశ మయి వుంటుంది. కాని, దీని వివరాలు లభించవు.

అనపోతానాయుని రాజ్యం గోదావరీ నదికి శ్రీశైలానికి మధ్య తెలం గాణంలో విస్తరించింది నాడు మొదలు ఒక శతాబ్ది కాలం పద్మనాయకుల చరిత్రయే తెలంగాణా చరిత్ర. పరిపాలన సౌకర్యానికై అనపోతానీడు తన రాజ్యాన్ని రెండుగా విభజించి, తమ్ముడైన మాదానాయని దేవరకొండ ప్రభువుగా నియమించినాడు. అది మొదలు రాచకొండలో అనపోతానీని సంతతి, దేవర కొండలో మాదానీని సంతతి పరస్పర సహకారంతో పాలించినారు.

సింగమనీని కాలంనుండి పద్మ నాయకులకు బహమనీలతో సమాధానం ఉన్నట్లు తోస్తుంది. అనపోతానీడు సయితం బహమనీలవట్ల సుహృద్భావం ప్రద ర్శించి వుంటాడు. కాపయకాలంలో తరచుగా తెలంగాణంపై దండెత్తిన బహమ నీలు భీమవరయుద్ధం తరువాత దండెత్తలేదు.

అనపోతానీనికి చిలుమరాజు తిప్పరాజు, మాదానీనికి పోతరాజు మంత్రులు. ద్విపద హరిశ్చంద్రోపాఖ్యానకర్త గౌరనకు పోతరాజు పెదతండ్రి.

**కుమారసింగమనాయుడు, (క్రీ.శ. 1389-99)**

అనపోతానాయుని పెద్దకొడుకు రెండో సింగమనాయుడు. ఇతనికి కుమార సింగమనాయడనే వ్యవహారం కూడ ఉంది. ఇతని కాలంలో పద్మనాయకులకు బహమనీలతో మైత్రి; విజయనగర, రెడ్డి రాజ్యాలతో వైరము బలపడి పెక్కు యుద్ధాలకు దారి తీసింది. యువరాజుగా ఉన్నప్పుడే బహుశా బహమనీల ప్రోత్సా హంతో ఈతడు కల్యాణదుర్గం జయించి, అచట విజయస్తంభం ప్రతిష్ఠించినట్లు ఈతని ఆస్థానకవి విశ్వేశ్వరుని 'చమత్కార చంద్రిక' నుండి తెలుస్తున్నది. కుమారసింగమనీడు సింహాసనం ఎక్కడంతో విజయనగరంతో యుద్ధం ప్రారంభ మయింది. కాపయను వధించడమేగాక బహమనీలతో పద్మనాయకులు మైత్రి వహించడంతో వారిపై ఆగ్రహించి రెండో హరిహరరాయలు వెలమరాజ్యంపై యువరాజు వీర బుక్కరాయలను దండు పంపినాడు పద్మనాయకులకు సాయంగా బహమనీలు రాయల ఆధీనంలోని కొత్త కొండను (మహబూబ్

నగర్ జిల్లా) ముట్టడించి, విజయనగర సేనానియైన సాళువరాయ దేవుని వధించినారు. ఈ యుద్ధంలో పద్మనాయకులే విజయం సాధించినారు. అనంతరం కుమార సింగమనీడు దేవరకొండ పాలకుడైన పెదవేదగిరితో కలిసి కళింగపై దండెత్తి రెడ్డిరాజులనుండి గోదావరి ప్రాంతాన్ని ఆక్రమించినట్లు అతని సింహాచలం శాసనం సూచిస్తున్నది. బెండపూడి మొదలైన దుర్గాలను పెదవేదగిరి ఆక్రమించినట్లు 'వెలుగోటివారి వంశావళి' వర్ణిస్తున్నది.

మరల క్రీ.శ. 1397 ప్రాంతంలో పద్మనాయకులు విజయనగరంతో పోరాడవలసి వచ్చింది. కొత్తకొండ పరాజయానికి ప్రతీకారం తీర్చుకొని కృష్ణాతుంగభద్రా అంతర్వేదిని సాధించే ఉద్దేశముతో రెండోహరిహరుడు బహమనీరాజ్యముపై గుండదండనాథుని నాయకత్వంలో దండు పంపినాడు. విజయనగర సైన్యాలు పురోగమిస్తుండగా సుల్తాన్ ఫిరోజ్‌షాకు సహాయంగా వెలమసైన్యాలు విజయనగర రాజ్యంపై దండెత్తినాయి. ఈ సైన్యాలను వేదగిరి నాయకుని కొడుకైన రామచంద్రుడు నడుపుతూ కర్నూలు రాజ్యంలో ప్రవేశించి దేశాన్ని కొల్లగొట్టినాడు రామచంద్రుని మరలించడానికై హరిహరుడు తన కుమారుడు బుక్కరాయలను సైన్యసమేతంగా పంపినాడు. రామచంద్రునోడించి తరిమివేయడమేగాక బుక్కరాయలు ఓరుగల్లుపైకి, అటనుండి మెదకువరకు దండయాత్ర జరిపినట్లు తెలుస్తుంది. ఈ ఓరుగల్లు దండయాత్రను బుక్కరాయని ఆస్థానకవి లక్ష్మణాచార్యుని "వైద్యరాజ వల్లభం" వర్ణిస్తున్నది. చివరకు విజయనగర సైన్యాలు పానగల్లు దుర్గాన్ని ముట్టడించినాయి ఫిరోజ్‌షా సహాయంతో వెలమలు దుర్గ రక్షణకు శక్తికొలది ప్రయత్నించినారు. కాని, దుర్గం బుక్కరాయల వశమైనట్లు అచటి అతని శాసనం (1397) వల్ల తెలుస్తున్నది. విజయనగర - బహమనీ, వెలమ - రెడ్డిరాజ్యాలమధ్య సంబంధాలలో పానగల్లుదుర్గం కీలకపాత్ర వహించింది. పానగల్లు పతనానంతరం అచిర కాలానికే కుమారసింగమనీడు మరణించినాడు. ఈతడు గొప్ప విద్వాంసుడు; కవి; కవి-పండిత పోషకుడు; సర్వజ్ఞ, సర్వజ్ఞ చక్రవర్తి బిరుదాలు ధరించినాడు.

**రెండో అనపోతానాయుడు (క్రీ. శ. 1399-1421) :**

కుమార సింగమనీని పెద్దకొడుకు రెండో అనపోతానాయుడు గొప్ప పరాక్రమవంతుడు; అనేక యుద్ధాల్లో విజయం సాధించిన వీరుడు. వెలగోటివారి వంశావళి ఈతని విజయ పరంపరలను వర్ణిస్తున్నది. అయితే, రెండో అనపోతానీని కాలంలో దాక్షిణాత్య రాజ్యాల మధ్య సంబంధాల్లో పెద్ద మార్పు జరిగింది. రెడ్డిరాజ్యం కుమారగిరి కాలంలో కొండవీడు, రాజమహేంద్రవర రాజ్యాలుగా విడిపోయింది. పెదకోమటి వేమారెడ్డి సుల్తాన్ ఫిరోజ్‌షా సాయంతో రెడ్డి రాజ్యాలను సమైక్యం చేయడానికి ప్రయత్నించినాడు. రాజమహేంద్ర వరానికి విజయ

నగర సహాయం లభించింది. తమకు గర్భశత్రువులైన రెడ్లతో సుల్తాన్ మైత్రి వహించడంతో పద్మనాయకులకు ఆగ్రహం కలిగి, వారు విజయనగరాధీశులతో మైత్రివహించసాగినారు. ఈ మైత్రీపరివర్తనం పద్మనాయక రాజ్యంపై విపత్కర ప్రభావం ప్రదర్శించింది.

రెండో అనపోతానీడు సింహాసనం ఎక్కిన సమయంలో వెలమరాజ్యంపై విజయనగర దండయాత్ర జరుగుతున్నది. అనపోతానీడు కర్ణాట (విజయనగర) సైన్యాల నోడించి తరిమి మెదకు దుర్గాన్ని రక్షించినాడు; ఆ సైన్యాలను వెన్నంటి పానగల్లును కొల్లగొట్టినాడు; విజయనగర సామంతులుగా కర్నూలు నేలుతున్న సంబెటవారిని నిర్జించినాడు. చెన్నపట్టణంవరకు ఉన్న బోయ, తిగుళ రాజ్యాలలో వీర విహారం చేసినాడు. రాజమహేంద్రవరం వరకూ రెడ్డి రాజ్యాన్ని అల్లకల్లోలపరచడమే గాక గజపతి సామంతుడైన సర్వేపల్లి తమ్మా రెడ్డిపై విజయం సాధించినాడు.

రెండో అనపోతానీనికి సమకాలికులుగా దేవరకొండ నేలినవారు కుమార మాదానాయక, రామచంద్రనాయకులు. ఏరువచోడుడైన అన్నదేవునకు ఆశ్రయం ఇచ్చినందున వెలమలకు రెడ్లతో తిరిగి సంఘర్షణ ప్రారంభమయింది. వెలమ సైన్యంతో అన్నదేవుడు రాజమహేంద్రవరంపై దండెత్తినాడు గాని, రెడ్ల సామంతుడైన చాళుక్య విశ్వేశ్వరు డతణ్ణి ఓడించి తరిమినాడు. రెండోమారు మాదానేడు స్వయంగా అన్నదేవునికి సహాయంగా వెళ్ళినాడుగాని, విజయం సాధించలేకపోయినాడు.

ఇంతలో కొండవీడు, బహమనీ రాజ్యాలమధ్య మైత్రి కుదిరి, పెదకోమటి వేముని కోరికపై ఫిరోజ్‌షా రాజమహేంద్రవరంపై దండెత్తినాడు. వాడపల్లి దగ్గిరవున్న ఫిరోజ్‌షా శాసనాలనుబట్టి క్రీ.శ. 1417 ఆరంభంలో ఈ దాడి జరిగింది. కాని, అల్లాడరెడ్డి చేతిలో ఘోర పరాజయం పొంది సుల్తాన్ మరల వలసి వచ్చింది. అల్లాడరెడ్డి విజయానికి విజయనగర సహాయం కారణమని విజయనగర సహాయం రాజమహేంద్రవరానికి పానగల్లుద్వారా లభిస్తున్నదని, గ్రహించి ఫిరోజ్‌షా 1417 చివర్లో పానగల్లును ముట్టడించినాడు. ఈ సందర్భం లోనే విజయనగర, పద్మనాయకరాజ్యాలు సన్నిహితములయినాయి ఉభయ సైన్యాలు ఓడి పారిపోయినాయి.

పానగల్లు యుద్ధంతో వెలమలకు, రెడ్లకుమధ్య స్పర్ధ తీవ్రతర మయింది. బహుశా పానగల్లు ముట్టడి సాగుతుండగానే దేవరకొండ ప్రభువైన పినవేదగిరి నాయుడు ధరణికోటపై దండెత్తి కోమటివేముని తమ్ముడైన మాచారెడ్డిని చంపినాడు. ఇందుకు ప్రతీకారంగా కోమటి వేముడు దేవరకొండను ముట్టడించి పిన వేదగిరిని పట్టుకొని వధించినాడు. బహుశా పానగల్లుయుద్ధం ముగిసిన తరువాత

(క్రీ.శ. 1420) రెండో అనపోతానీడు, పినవేదగిరి సోదరుడైన లింగమనీడు కలసి కొండవీటిపై దండెత్తినారు. వీరితోటి యుద్ధంలో పెదకోమటి వేముడు మరణించినాడు. అతని శిరస్సును పద్మనాయకులు తమ్మపగడలో సమర్చి నారట. అనంతరం అనతికాలానికే అనపోతానీడు మరణించినాడు.

## మాదానాయుడు (క్రీ.శ. 1421-30)

రెండో అనపోతానాయుని కుమారులైన సింగమ నాయకాదులు యుక్త వయస్కులు కానందున అతని తమ్ముడు మాదానాయుడు రాచకొండ సింహా సనం ఎక్కి సుమారు పది సంవత్సరాలు పాలించినాడు. ఈతని కాలంలో వెలమలకు విజయనగరంతో మైత్రి వృద్ధికాగా బహమనీలతో వైరం తీవ్రరూపం దాల్చి వెలమరాజ్యం అపారనష్టానికి గురిఅయింది. రెండో దేవరాయలకు సుల్తాన్ అహమ్మద్‌షాకు జరిగిన యుద్ధంలో (క్రీ.శ. 1424) మాదానాయుడు విజయ నగరపక్షం వహించినాడు. దేవరాయలతో సంధి చేసుకొన్న తరువాత పద్మ నాయకులను శిక్షించే ఉద్దేశంతో సుల్తాన్ ఓరుగల్లుపై అజీమ్‌ఖాన్ సేనానిని దండు వంపినాడు. ఓరుగల్లు మొదలైన దుర్గాలను అజీమ్‌ఖాన్ ఆక్రమించ డంతో గత్యంతరంలేక మాదానాయుడు సుల్తాన్‌తో సంధి చేసుకున్నాడు. (క్రీ శ. 1425) పద్మనాయక రాజ్య విచ్ఛిన్నం ప్రారంభమై, తెలంగాణాలో అధికభాగం బహమనీరాజ్యంలో చేరింది.

మాదానాయుడుకూడ మహా పండితుడు వైష్ణవమతాభిమాని. శ్రీశైల వంశీయుడైన రామానుజాచార్యుని కొడుకు వెంకటాచార్యుని శిష్యుడు. తాడూరు గ్రామాన్ని శ్రీరంగనాథస్వామికి దానం చేసినాడు. మాదానీని భార్య నాగాంబిక రాజగిరిపాదంలో నాగసముద్రమనే తటాకం తవ్వించి వేయించిన శాసనం ప్రకారం మాదానాడు రామాయణానికి 'రాఘవీయం' అనే వ్యాఖ్యానం రచించి శ్రీరామునకే అంకితం చేసినాడు.

## సర్వజ్ఞ రావు సింగమనాయుడు (క్రీ.శ. 1430-75)

రెండో అనపోతానాయని కుమారుడు మూడో సింగమనాయుడుకూడ గొప్ప పండితుడు; 'దీవిశాలుడు'; సర్వజ్ఞ బిరుదం వున్నవాడు. అందుచే అతణ్ణి సర్వజ్ఞ రావు సింగమనాయడని వ్యవహరిస్తారు. ఈతనికి సమకాలికంగా దేవర కొండలో పినవేదగిరి తమ్ముడు లింగమనీడు రాజ్యం చేసినాడు. లింగమనీడు గొప్ప ధైర్యశౌర్యాలున్న వీరుడు. అతని విజయాలను గురించి వెలుగోటివారి వంశావళిలో పెద్ద సీసమాలిక వుంది. అయితే, స్వతంత్రంగా పాలించిన వెలమ రాజుల్లో సర్వజ్ఞసింగమ, లింగమనాయకులే చివరివారు. వీరుకూడ చివర్లో గజ పతులకు విజయనగరాధీశులకు సామంతులయినారు. లింగమ విజయాలన్నీ గజపతి సామంతుడుగా సాధించినవై యుండవచ్చు.

సర్వజ్ఞ సింగమ సింహాసనం ఎక్కేనాటికి తెలంగాణంలో బహమనీ లాక్రమించిన ప్రాంతాలన్నీ ఓరుగల్లుతో సహా పద్మనాయకుల వశమయినాయి. గుజరాతు మాళవ ప్రాంతాల్లో సుల్తాన్ అహమ్మద్‌షా సాగించవలసి వచ్చిన యుద్ధాలు వెలమలకు మంచి అవకాశమయినాయి. కాని, ఆ యుద్ధాలు ముగిసిన వెంటనే సుల్తాన్ తెలంగాణంపై దండెత్తినాడు (క్రీ.శ. 1433) ఓరుగల్లు, రామగిరి మొదలైన దుర్గాలన్నీ బహమనీలు ఆక్రమించినారు. భువనగిరికోట కేంద్రంగా జాగీరు నేర్పరచి సంజర్‌ఖాన్‌ను పాలకుడుగా నియమించి. తెలంగాణాన్ని పూర్తిగా ఆక్రమించవలసిందని సుల్తాన్ అతణ్ణి ఆజ్ఞాపించినాడు. సుల్తాన్ ఆజ్ఞ మేరకు క్రీ.శ. 1435 నాటికి రాచకొండతో సహా తెలంగాణంలో అధికభాగం సంజర్‌ఖాన్ ఆక్రమించినాడు. బహమనీ రాకుమారుల్లో ఒకడైన దానూర్‌ఖాన్ రాచకొండలో రాజప్రతినిధి అయినాడు.

దేవరకొండ మినహా తెలంగాణం అంతా బహమనీల వశమైనట్లు కన్పిస్తున్నది ఇంచుమించు ఇదేసమయంలో కళింగలో గంగవంశాన్ని తొలగించి కపిలేశ్వరుడు సూర్య (గజపతి) వంశం స్థాపించినాడు. కపిలేశ్వరుని సహాయంతో రాచకొండ నాక్రమించడానికి సర్వజ్ఞసింగమ ప్రయత్నించినాడు క్రీ శ. 1444 లో కపిలేశ్వరుడు తెలంగాణంపై దండెత్తినాడు. కాని, సుల్తాన్ అల్లాఉద్దీన్‌షా సేనాని సంజర్‌ఖాన్ అతణ్ణి ఓడించి తరిమివేసినాడు. సుల్తాన్ తమ్ముడైన మహమూద్‌ఖాన్ రాచకొండలో సామంతరాజయినాడు.

తెలంగాణంలో సర్వజ్ఞసింగమకు నిలువనీడ లేకపోయింది. క్రీ శ. 1453 నాటి అతని శాసనం గుంటూరు జిల్లా బెల్లంకొండలో కన్పిస్తుంది. ఆ రోజుల్లో ఈ ప్రాంతం విజయనగర, గజపతులమధ్య చేతులు మారుతున్నది. బహుశా కపిలేశ్వరుని ప్రాపకంతో సర్వజ్ఞ సింగమ బెల్లంకొండ ప్రాంతం సంపాదించి పాలించినాడని చెప్పవచ్చు. ఇంతలో అల్లాఉద్దీన్ మరణించి (క్రీ శ. 1457) హుమాయూన్ సుల్తానయినాడు. హుమాయూన్ క్రూర స్వభావు డయినందున అతని కాలంలో పెక్కు తిరుగుబాట్లు జరిగినాయి ఈ తిరుగుబాటుదార్లకు సాయం చేసి తెలంగాణాన్ని తిరిగి జయించాలని పద్మనాయకులు ప్రయత్నించినారు. హుమాయూన్ తిరుగుబాట్ల నణచి పద్మనాయకులను శిక్షించడానికై ఖాజా జహాన్, నిజాం ఉల్‌ముల్క్ అనే సేనానులను దండు పంపినాడు. వీరు దేవరకొండను ముట్టడించగా పద్మనాయకులు కపిలేశ్వరునిసాయం అర్థించినారు. కపిలేశ్వరుడు తన కుమారుడైన హంవీరుని పెద్ద సైన్యంతో పంపినాడు బహమని సైన్యాలు పరాజయమంది తిరోగమించినాయి. రాచకొండ, భువనగిరి, ఓరుగల్లు మొదలైన దుర్గాలు పద్మనాయకుల పరమయినాయి. ఓరుగల్లులో క్రీ.శ. 1464 నాటి హంవీర దేవుని శాసనం ఉంది. సర్వజ్ఞ సింగమ తమ్ముడు

రామధర్మానాయుడు 1464 లో వైశాఖపూర్ణిమ చంద్రగ్రహణ సందర్భంలో ఓరుగల్లు సీమలోని ముచ్చెర్ల, ముందుపల్లెలను తిరువేంకటేశ్వరునకు అయ్యం గార్లకు దానం చేసి శాయింపేటలో శాసనం వేయించినాడు.

హుమాయూన్‌షా అనంతరం నిజాంషా కాలంలో తెలంగాణాన్ని ఆక్ర మించడానికి బహమనీలు చేసిన ప్రయత్నాలను కపిలేశ్వరుని సాయంతో వెల మలు ప్రతిఘటించినారు. క్రీ.శ. 1470 లో కపిలేశ్వరుని మరణంతో వెలమలకు తిరిగి దుర్దినాలు ప్రారంభమయినాయి. కపిలేశ్వరుని కుమారులైన పురుషోత్తమ, హంవీరులమధ్య సింహాసనానికై కలహం ప్రారంభమయింది. హంవీరుడు బహ మనీల సహాయం అర్థించినాడు. ఇది అదునుగా గ్రహించి సుల్తాన్ రెండో మహమ్మద్‌షా తెలంగాణం జయించడానికి నిజాం ఉల్ ముల్క్ ఇబ్రహీం సేనానిని నియమించినాడు. క్రీ.శ. 1475 నాటికి తెలంగాణం పూర్తిగా బహమనీల వశ మయింది. పద్మనాయకరాజ్యం అస్తమించింది. ఓరుగల్లులో అజీంఖాన్ నియా మకం జరిగినట్లు ఫెరిష్టా రచనవల్ల తెలుస్తుంది.

గజపతులచే ఆశాభంగానికి పాలై, బహమనీలకు రాజ్యంకోల్పోయి చివరి దశలో సర్వజ్ఞసింగమనీడు విజయనగరాధీశులను శరణుజొచ్చినాడు. అందుకు క్రీ.శ. 1475 నాటి అతని తిరుపతి శాసనం నిదర్శనం. "విష్ణుభక్తి సుధాకరం" అనే గ్రంథాన్ని బట్టి కంఠమరాజ వంశీయుడైన తమ్మభూపాలుడు రేచర్లరావు సింగమనీని ఓడించినాడనీ, "ఉషాభ్యుదయ" కావ్యాన్నిబట్టి పెదవీటి యుద్ధంలో వధించినాడని తెలుస్తున్నది. తమ్మభూపాలుడు గజపతుల సేనాని, ఈ తెలుగు కావ్యాల కథనం యథార్థమే అయితే పురుషోత్తమ గజపతి విజయనగరంపై జరిపిన దండయాత్రలో అతణ్ణి ఎదిరించి సర్వజ్ఞసింగమనీడు ప్రాణాలుకోల్పోయి నాడని గ్రహించవచ్చు సింగమనీని చివరివృత్తాంతం తెలియదు. సర్వజ్ఞుని మరణంతో పద్మనాయక చరిత్ర పరిసమాప్తమయిందనవచ్చు.

## రెడ్డిరాజులు

కాకతీయుల పతనానంతరం సింహాచల విక్రమ సింహపుర మధ్యస్థ తీరాంధ్రాన్ని శతాబ్దికి పైగా పాలించి తెలుగుభాషా సంస్కృతులకు రెడ్డిరాజులు మెరుగులు దిద్దినారు. 'రెడ్డి' పద ఉత్పత్తిని గురించి చాలా పెద్ద చర్చ ఉంది. క్రీస్తుశకం ఆరోశతాబ్దం నుండి ఆంధ్రదేశంలో కాపుల పేర్ల చివర రట్టకుడి లేక రట్టగుడి పదం కన్పిస్తుంది. 'కుడియన్' అనే మాటకు కాపు అని అర్థం. నేటికి ఆంధ్రదేశంలో రెడ్డికాపు అనే ప్రయోగం సర్వసాధారణం. రట్టకుడి పదమే రట్టోడి, రట్టడి, రడ్డి అనే మార్పులు పొంది రెడ్డిగా స్థిరపడిందనడంలో సందేహంలేదు. ఈ రూపాలన్నీ శాసనాల్లోనూ తెలుగు గ్రంథాల్లోను కన్పిస్తున్నాయి.

రడ్డి, రట్టడి రూపాలు పదహారో శతాబ్దం వరకు వాడుకలో ఉన్నాయి. మొదటి కులోత్తుంగుని దాక్షారామ శాసనంలో (క్రీ. శ. 1104 ప్రాంతం) రట్టడం రాష్ట్రకూటం పదాలు సమానార్థకాలుగా వాడినారు. ఎనిమిదో శతాబ్దం నుండి 'రాష్ట్రకూట ప్రముఖాన్' అనే ప్రయోగం కన్పిస్తుంది. ప్రభువులు దానధర్మా లను గ్రామాల్లోని రాష్ట్రకూట ప్రముఖుల సమక్షంలో చేసేవారు. అంటే ప్రతి గ్రామంలోను పలువురు రాష్ట్రకూటులు (రట్టులు) వుండేవారని తెలుస్తున్నది. రాష్ట్రకూట వంశస్థులు తొమ్మిదో శతాబ్దం నుండి రెండుశతాబ్దాలు దక్షిణాపథ సార్వభౌములై ఆంధ్రదేశ చరిత్రలో కూడ ప్రముఖ పాత్ర నిర్వహించినట్లు మనకుతెలుసు. 'రాష్ట్రకూట' అనేది ఉద్యోగ నామమనీ, దాన్నే వంశనామంగా ధరించినారని ఒక అభిప్రాయం. అయితే రాష్ట్రకూట పదం కంటె రట్టకుడి పదం ప్రాచీనమైనదిగా కన్పిస్తుంది. కాబట్టి 'రట్టకుడి' సంస్కృతీకరణమే రాష్ట్రకూట అని చెప్పవచ్చు. రాష్ట్రకూట రాజులు 'రట్టకందర్ప,' 'రట్టవిద్యా ధర' బిరుదాలు ధరించినారు. వీటన్నిటినిబట్టి రట్టపదం జాతివాచకమైనట్లు తోస్తుంది. అశోకుని శాసనాలలో దక్షిణాపథంలో 'రట్ట' జాతివారున్నట్లు సాక్ష్యం ఉంది. అశోకుని శాసనాల్లో రాష్టిక, రాట్రక, రిష్టిక రూపాలున్నాయి. శాతవాహన శాసనాల్లో మహారథులున్నారు. ఖారవేలుని హాతిగుంఫ శాసనం రఠికులను ప్రస్తావిస్తున్నది. అరట్ట, సురట్ట, మరట్ట, రట్టపాడి అనే ప్రాంతీయ విభాగాల పేర్లు - ఆర్యావర్త, ఆంధ్రపథలవలె - రట్టజాతి వల్లనే వచ్చినాయి, కాబట్టి ఆంధ్రజాతిలో లీనమైన పలుతెగల్లో రట్టులొకరని చెప్పవలె. శాతవాహన పతనానంతరం దేశం రాజకీయంగా విచ్ఛిన్నమై ఆర్థికంగా సంక్షోభానికి గురి యైన కాలంలో (క్రీ.శ. 300-600) వీరి ప్రస్తావన కన్పించదు. బహుశా ఆ కాలంలోనే వీరు ఆంధ్రదేశం భిన్న ప్రాంతంల్లో స్థిరపడి వ్యవసాయవృత్తిని అవలంబించి క్రమంగా ధనవంతులై గ్రామ ప్రముఖులై ఏడో శతాబ్దానికి శస్త్రోప జీవులై రాజకీయాల్లో ప్రవేశించి వుంటారు,

రెడ్డిరాజులు పంటశాఖీయులు. ఆంధ్రదేశంలోని ప్రధాన వర్ణాలలో వారు వారు నివసించే ప్రాంతాలను బట్టి శాఖలేర్పడినట్లు తెలుస్తుంది. శూద్రులలో కమ్మవారు, వెలమలు, బ్రాహ్మణులలో వెలనాటి, వేగినాటి మొదలైనవారు అందుకు నిదర్శనం. అదే విధంగా పంటరాష్ట్ర వాసులయి నందున పంట రెడ్ల యినారు. పంట రాష్ట్రం పాకనాడు అంతర్భాగమైనట్లు శాసన సాక్ష్యం ఉంది. పంటరాష్ట్రంలో ప్రధాన గ్రామమైన ముట్టి యెంబాక్కంను తెలుగుచోడ ప్రభువు తమ్ము సిద్ధి దానం చేసినట్లాతని శాసనంలో నమోదయింది. గూడూరు తాలూకాలో నేటి ముట్టెంబాకయే ఆ గ్రామంగా గుర్తించినారు. పాకనాటిలో విక్రమసింహపురం,దువ్వూరు, గండవరాది పట్టణాలు పంటదేసటి మహాన్వయానికి

అధికార కేంద్రాలని శ్రీనాథుడు భీమేశ్వర పురాణంలో పేర్కొన్నాడు పంటరెడ్లు క్రమంగా పంటరాష్ట్రం నుండి విస్తరించి తమతమ నివాస ప్రాంతాలను బట్టి మోటాటి, వెలనాటి, మొరస, చాంగలునాటి మొదలైన పదునాల్గు శాఖలుగా విడిపోయినారు వడ్లలో ఎన్నిరకాలో రెడ్లలో అన్నిశాఖలని తెలుగులో నానుడి.

కొండవీటి కైఫీయత్ వంటి స్థానిక చరిత్రలు రెడ్డిరాజులు 'దొంతి' వంశస్థులని చెబుతున్నాయి. కాని రెడ్డిరాజుల ఆస్థానంలోని కవులైన ఎర్రాప్రగడ శ్రీనాథులు వారు దేసటి వంశస్థులని వ్రాసినారు. ఎర్రాప్రగడ ప్రోలయవేముని "దేసటి వేమా సమస్తధీర లలామా" అని శ్రీనాథుడు వీరభద్రారెడ్డిని 'శ్రీమద్దేసంటి వంశగ్రామణి' అని సంబోధించినారు. అయితే దేసటి అనేది ఉద్యోగ నామమనీ దాన్నే వంశనామంగా స్వీకరించినారని ఒక సూచన. కొణిదెన శాసనంలో (క్రి.శ. 1147) దేసట్లు అనే ప్రయోగం కన్పిస్తున్నది. స్థానిక చరిత్రల్లో ప్రతాపరుద్రుని అస్థాన నాయకునకు దేసట్ల పురవరాధీశ్వర బిరుదం ఉంది. కాబట్టి దేసట్ల అనే పురం ఉన్నట్లు తెలుస్తున్నది. పశ్చిమ చాళుక్య సత్యాశ్రయుని సామంతుడైన శోభనరసుకు 'దేసటిగిరి దుర్గమల్ల' అనే బిరుదం ఉన్నట్లు శాసన సాక్ష్యం లభిస్తున్నది. దీన్నిబట్టి పంటరాష్ట్రంలో దేసటిగిరి దుర్గం ఉన్నదని ఆ దుర్గాధీశ్వరులే దేసటి వంశస్థులయినారని నిర్ణయించడం సమంజసం.

**దేసటి వంశ విజృంభణ :**

పంటదేసటి రెడ్డిరాజ వంశానికి కోమటి ప్రోలారెడ్డి మూలపురుషుడు. వీరి వంశంలో కోమటి, వేమ అనే పేర్లు తరచు కన్పిస్తాయి. పరుసవేదివల్ల ధనికుడైన వేమురనే కోమటిని హత్యచేసి అతని ధనాన్ని సంగ్రహించి, ఆ పాపపరిహార్థమై కోమటి, వేమ పేర్లు ధరించినారని స్థానికచరిత్రల గాథ. ప్రోలారెడ్డికుమారుడే రెడ్డిరాజ్యస్థాపకుడైన ప్రోలయ వేమారెడ్డి. ఇతణ్ణి అనవేమారెడ్డి అనికూడ వ్యవహరించేవారు.

పంటరెడ్లు నెల్లూరు తెలుగుచోడుల సామంతులుగా రాజకీయప్రాముఖ్యం సంపాదించినారని చెప్పవచ్చు. క్రి. శ. 13 వ శతాబ్దంలో చోడ తిక్కన, మనుమసిద్ధి దక్షిణాత్య రాజకీయాల్లో గణనీయమైన పాత్రను నిర్వహించినారు కదా! హొయసాల, పాండ్యరాజులతోను స్థానిక పల్లవసామంతులతోను ఎడతెగని యుద్ధాలు చేసినారు. బహుశా ప్రోలారెడ్డి ఈ యుద్ధాల్లో పాల్గొన్నట్లు రెడ్డిరాజుల వంశానుగత బిరుదావళి సూచిస్తున్నది. అప్పయ, గోపయ అనేవారు హొయసాల రెండో సోమేశ్వరుని సేనానులు. వారికి 'జగనొబ్బగండ' బిరుదం ఉండేది. ఆ సేనానుల నోడించి 'జగనొబ్బగండ' బిరుదంతోపాటు అప్పయగొప్ప యదిశాపట్ట బిసదాన్ని పంటరెడ్లు ధరించివుంటారు. పాండ్యుల నోడించి జంతి

దుర్గం ఆక్రమించినందువల్ల 'పాండ్యరాజగజకేసరి', 'చెంచుమలమారకార' బిరుదాలు వారికి సంక్రమించినాయి. ప్రోలయ వేమారెడ్డికి వున్న 'పల్లవత్రినేత్ర' బిరుదాన్నిబట్టి పల్లవులు రెడ్డిరాజులకు మూలపురుషులనే అభిప్రాయం కొందరు వ్యక్తం చేసినారు కాని, అందుకు ఆధారంలేదు. అంతేగాక, రెడ్డిరాజుల బిరుదాల్లో 'ఆళగియవరద శిరఃఖండన' బిరుదం ఉంది. కొప్పెరుంజింగని వంశంలో "ఆళగియపల్లవ" బిరుదం కనిపిస్తున్నది. ఆళగియవరదుడు కొప్పెరుంజింగని బంధువై వుంటాడు. కాబట్టి, పల్లవప్రభువులపై విజయాలు సాధించడంవల్లనే "పల్లవత్రినేత్ర" బిరుదాన్ని రెడ్డిరాజులు ధరించినారని అనడం సమంజసం.

తెలుగుచోడులు బలహీనులుకావడంతో ప్రోలయ వేమారెడ్డి వల్లూరు-గండికోటలనేలే కాయస్థుల మైత్రివహించినాడు. కాయస్థ అంబయదేవుడు రుద్రమదేవిపై తిరుగుబాటు చేసి, గుంటూరు మండలంలోని మాచర్లవరకు స్వతంత్రాధికారం విస్తరింప జేసినాడు. బహుశా అతని అండదండలతోనే ప్రోలయవేమారెడ్డి ధరణికోట ప్రాంతంలో బలపడివుంటాడు. అంబయదేవుని మంత్రియైన ఘోడె రాయ గంగదేవుడు ప్రోలయవేమారెడ్డి గురువని, గంగదేవుని కృపవల్లనే వేమారెడ్డి రాజకీయాధికారం సంపాదించినాడని శాసన వాఙ్మయాధారాలు చాటుతున్నాయి. తన హరివంశంలో ఎఱ్ఱాప్రగడ "శ్రీపార్వతీశ శక్తివ్యాపితగుణ ఘోడెరాయ గురుకృపా స్థాపితసామ్రాజ్యసముద్దీపిత వేమక్షితీంద్ర" అంటాడు. "ధన్యోవేమ మహీపతిః శ్రీ ఘోడెరాయగంగాఖ్య గురుపదాబ్జ షట్పదః" అని అతుకూరుశాసనం. కాబట్టి, అంబయదేవ ఘోడెరాయగంగదేవుల సహాయంతోనే ప్రోలయ వేమారెడ్డి రాజ్యం సంపాదించివుంటాడు.

## రెడ్డి రాజ్యస్థాపన

ప్రోలయ వేమారెడ్డి ప్రతాపరుద్రుని కొలువులోని నాయంకరులలోనివాడనే అభిప్రాయం బలంగావుంది. నాయంకరుల్లో రెడ్లుఉన్నారుగాని వేమారెడ్డిఉన్నాడని అనడానికి సాక్ష్యం లేదు. వేమారెడ్డిశాసనాలు చాలా లభించినాయిగాని వానినుండి అతని జీవితవిశేషాలు స్పష్టంగా తెలియడంలేదు. వేమారెడ్డి అనంతరం సుమారొక శతాబ్దికి చెందిన అనితల్లి కలువచేరు శాసనం ప్రోలయవేముడు కావయనాయకుని కొలచిన 75 నాయకుల్లోని వాడని చెబుతున్నది. ఈ శాసన సమాచారం విశ్వాసయోగ్యం కాదని పండితుల అభిప్రాయం. వేమారెడ్డి శాసనాల్లో అతడు కాకతీయుల సామంతుడనే సూచనలేదు. అంబయదేవ ఘోడెరాయల సహాయంతో ప్రబలుడైన వేమారెడ్డి, ప్రతాపరుద్రుని చేతిలో అంబయ పరాజయం పొందిన తరువాత నామమాత్రంగా కాకతీయులకులొంగి తన రాజ్యాన్ని ఏలుకొన్నాడని చెప్పవచ్చు. అనవేముడనేపేర ప్రోలయవేముడు ప్రమథ కవి శ్రీ గిరిదేవయ్యనింగారికి పశ్చిమ గోదావరి జిల్లా మొగల్లులో భూదానం చేసినట్లు అచటి శాసనాల్లో

నమోదయింది. ఆ శాసనాల్లో ప్రోలయ వేముని హోదాగాని కాకతీయుల ప్రసక్తి గాని లేదు. ఈ శాసనాల్లో ఒకదానిలో తేదీ లేదు. రెండోది క్రీ.శ. 1315 నాటిది. అది ప్రతాపరుద్రుని పాలనకాలం. అందుచే ఆశాసనంలో వేముడు ప్రతాపరుద్రుని సార్వభౌమత్వం అంగీకరించలేదని స్వతంత్రంగా వ్యవహరిస్తున్నాడనే సూచన ఉంది. ప్రతాపరుద్రుని యుద్ధాలు, తురుష్కులతోటి సంఘర్షణ ప్రోలయ వేమారెడ్డి బలవంతుడు కావడానికి అనుకూలించినాయి. మాచారెడ్డి, మల్లారెడ్డి మొదలైన సోదరులసాయంతో స్వతంత్ర రెడ్డిరాజ్యస్థాపనకు ప్రయత్నాలు సాగించినాడు. ప్రతాపరుద్రుడు తురుష్కులతో చేసిన చివరి యుద్ధంలో వేమారెడ్డి సోదరులు పాల్గొన్నజాడలేదు. ఈ కారణం వల్లనే బహుశా స్థానిక చరిత్రలు వేమారెడ్డి ధరణికోటలో క్రీ.శ. 1320 లోనే స్వతంత్ర రెడ్డిరాజ్యం స్థాపించినాడని చాటుతున్నాయి. పైన చెప్పినట్లు ఓరుగల్లు పతనానంతరం అనతికాలానికే అద్దంకి రాజ్యస్థాపన జరగడం పైఅభిప్రాయాలను బలపరుస్తున్నది.

తురుష్కులు ఓరుగల్లునాక్రమించిన తరువాత వేమారెడ్డి విజృంభించి తన బలాన్ని ప్రదర్శించే ఉద్దేశంతో దిగ్విజయ యాత్రలు జరిపినట్లు కన్పిస్తుంది. స్వయంగానో లేక అరవీటివారితో కలిసియో మ్లేచ్ఛులతో పోరాడి వారిని కృష్ణానదికి దక్షిణ దేశం నుండి తరిమివేసినాడు. ఈ యుద్ధాల్లోనే వేమారెడ్డికి గుజ్జరి ఘట్టవిభాళ(ఘూర్జర అశ్వదళాన్ని ఓడించినవాడు),ఆనెయ (ఆనెగొంది)మండలిక గండరబిరుదాలు సంక్రమించి వుంటాయి. ఈ ప్రయత్నాలలో వేమారెడ్డికి బహుశా కొలని రుద్రదేవుని ప్రోత్సాహం లభించిందని రుద్రదేవుని సంతమాగులూరు శాసనం నుండి తెలుస్తున్నది. ఈ విధంగా మ్లేచ్ఛాబ్ధికుంభోద్భవుడై మల్లవరం శాసనం ప్రకారం ప్రోలయ వేమారెడ్డి క్రీ.శ. 1324 - 25 నాటికి అద్దంకి రాజధానిగా రెడ్డిరాజ్యం స్థాపించినాడు.

## ప్రోలయ వేమారెడ్డి (క్రీ. శ. 1325 - 53)

ప్రోలయ వేముడు క్రీ.శ. 1353 వరకు పాలించినట్లాతని మణికేశ్వరం శాసనం సూచిస్తున్నది. అతని పాలన కాలంలోని రాజకీయ సంఘటనలను గురించి వివరాలు లభింపవు. ముసునూరి నాయకులతో నాతని సంబంధాలు సయితం స్పష్టంగా తెలియవు. క్రీ.శ. 1325 నుండి ప్రోలయ వేముడు స్వతంత్రంగా రాజ్యపాలన చేసినాడని చెప్పవచ్చు. పద్మనాయకులు నాటికి పూర్తి స్వతంత్రులు కాలేదు.సింగమనాయకుని మరణంతోనే రెడ్డి పద్మనాయక సంఘర్షణ ప్రారంభమయింది. ఇక కొండవీడు, విజయనగర రాజ్యాలు ఉద్భవించిన నాటినుండి ఉభయుల మధ్య దక్షిణతీరాంధ్రానికై - ముఖ్యంగా వంటరెడ్ల జన్మభూమియైన పాకనాటికై పోరాటం ప్రారంభమయినట్లు కన్పిస్తున్నది. క్రీ.శ. 1339 నాటికి హరిహరరాయలు పూర్వపశ్చిమ సముద్రాధీశ్వర బిరుదం ధరించినాడు. క్రీ.శ. 1343 నాటినుండి నెల్లూరు జిల్లాలో విజయనగర శాసనాలు

కన్పిస్తున్నాయి. దీన్నిబట్టి ప్రోలయ వేముడు పాకనాడును విజయనగరాధీశులకు కోల్పోయినాడని నిర్ణయించవచ్చును. మోటుపల్లి రేవునుకూడ 'ప్రతీపధరణీపాల వశం' దోలి మల్లారెడ్డి ఆక్రమించినాడట. ఈ శత్రురాజు లెవరో నిర్ణయంగా చెప్పలేము. ముస్లిం విస్తరణకు వ్యతిరేకంగా ఉద్భవించిన హిందూరాజ్యాలు హిందూమత సంస్కృతుల రక్షణకై సహకారంతో వ్యవహరింపక రాజ్యవిస్తరణ కాంక్షతో పరస్పరం పోరాడుకోవడం శోచనీయం!

రెడ్డిరాజ్యానికి బహమనీ రాజ్యంనుండి ప్రమాదం ప్రోలయ వేమునికాలం లోనే ప్రారంభమయింది. మొదటి బహమనీ సుల్తాన్ అల్లాఉద్దీన్ తెలంగాణం మీదుగా కృష్ణాతీరం వరకు దాడి జరిపినట్లునూ, ఆ దాడిని మల్లారెడ్డి త్రిప్పికొట్టి రెడ్డిరాజ్యాన్ని రక్షించినట్లును తెలుస్తున్నది. ఈ దాడి క్రీ.శ. 1357 లో జరిగిం దని చరిత్రకారుల అభిప్రాయం.

ప్రోలయ వేముడు ఏరువ చోడులతో సంబంధ బాంధవ్యాలు నెలకొల్పు కొన్నాడు. ఏరువ చోడులు రెడ్డిరాజ్య రాజకీయాల్లో ఆసక్తికరమైనపాత్రను నిర్వ హించినారు. ఏరువ చోడులని పేరేగాని ఏరువనాడును వీరు పాలించినజాడలేదు. భక్తిరాజు పెంటపాడు శాసనము, మద్రాస్ శాసనము, అతని కొడుకు అన్నదేవ చోడుని రాజమండ్రి శాసనమూ వీరి చరిత్రకు ముఖ్య ఆధారాలు. ఈ వంశంలో ప్రథమగణ్యుడైన ఏరువభీముడు బహుశా గణపతిదేవుని సేనాపతియై వుంటాడు. భక్తిరాజు తండ్రి గంగాధరుడు, తల్లి, వేంగీశుడు చంద్రవంశజుడునైన వెంగ భూపాలుని సోదరి - ఇరుగాంబిక. వెంగభూపాలుడు స్వాతంత్ర్యోద్యమంలో ముసునూరుప్రోలయతో సహకరించి తురుష్కులతోటి యుద్ధాల్లో మరణించడంతో ప్రోలయ నాయకుడు భక్తిరాజును వేంగిలో సింహాసనస్థుని చేసినట్లు పెంటపాడు శాసనంనుండి తెలుస్తున్నది. కాని, కాపయ నాయకుడు రాజ్యాన్ని పునర్వ్యవస్థీ కరించి తొయ్యేటి అనపోతును రాజమండ్రిలో నియమించడంతో భక్తిరాజు తన రాజ్యం కోల్పోయి, ప్రోలయ వేమారెడ్డి సహాయం అర్థించివుంటాడు. భక్తిరాజుకు ఇద్దరు కొడుకులు. వారిలో భీమచోడుడు (భీమలింగచోడుడు) అనవేముని (ప్రోలయవేముని) కుమార్తెను పెండ్లాడినాడు. దీనితో రెడ్డి,ఏరువచోడ కుటుంబాల మధ్య మైత్రి బలపడింది భక్తిరాజు రెండోకొడుకు అన్నదేవచోడుడు సూరవరం (కృష్ణాజిల్లా) పాలిస్తున్న సూర్యవంశస్థుడైన పినతుండిరాజుకూతురు ఇరుగాంబికను పెండ్లాడినాడు. తొయ్యేటి అనవోతు మరణానంతరం రెడ్డిరాజుల సహాయంతో భక్తిరాజు తిరిగి వేంగిప్రాంతాన్ని సంపాదించినాడు; రెడ్డిరాజులకు మిత్రుడుగానే క్రీ.శ. 1355 లో శ్రీశైలం దర్శించి త్రిపురాంతకం ప్రాంతంలో దానధర్మాలు చేసినాడు.

ప్రోలయ వేముని రాజ్యం స్థూలంగా కృష్ణానది, శ్రీశైలం, అహోబల క్షేత్రాలు, కందుకూరిసీమ, తూర్పుతీరాలమధ్య విస్తరించింది. తన రాజ్యరక్షణ కాతడనేక ప్రయత్నాలు చేసినాడు. రాజ్యంలో ధరణికోట, చందోలు, వినుకొండ, బెల్లంకొండ, కొండవీడు, కందుకూరు, కొండపల్లిదుర్గాలు నిర్మించి, బలమైన సైన్యాలను నిలిపినాడు. అద్దంకి రాజధానిగా చేసుకొన్నప్పటికీ కొండవీడును భావిరాజధాని అనే దృష్టితో దుర్భేద్యమైన దుర్గంగా రూపొందించినట్లు కన్పిస్తుంది. ప్రోలయ వేమారెడ్డికి అతని సోదరులు, మేనమామలు అండగా నిలిచారు. అన్న మాచారెడ్డి చందోలుదుర్గానికి, తమ్ముడు మల్లారెడ్డి కందుకూరుకు అధిపతులైనారు. మల్లారెడ్డి సర్వసైన్యాధ్యక్ష పదవినికూడ నిర్వహించినట్లు తెలుస్తుంది.

ప్రోలయవేముడు వైదికధర్మాభిమాని; సాహిత్య పోషకుడు. 'అనవరత పురోహితకృత సోమపాన' అనీ, 'ధర్మప్రతిష్ఠాగురు' అనీ అతణ్ణి కీర్తించినారు. తురుష్క దండయాత్రల్లో నష్టమైన అగ్రహారాలను పునరుద్ధరించడమే గాక స్వయంగా 44 గ్రామాలను దానం చేసినట్లు సంప్రదాయం ఉంది. 'నిస్సీమ భూదానపరశురామ' అని అతని బిరుదు. హేమాద్రివ్రతఖండంలో చెప్పిన దానాలు, వ్రతాలూ చేసినాడట. వేముడు శైవమతాభిమాని. శ్రీశైలం, అహోబలక్షేత్రాలకు సోపానపంక్తులు నిర్మించి, భక్తుల కృతజ్ఞతకు పాత్రుడయినాడు. కవిత్రయంలో చివరివాడైన ఎర్రాప్రగడను వేమారెడ్డి, మల్లారెడ్డి ఇద్దరూ ఆదరించినారు. శంభుదాసుగా ప్రసిద్ధుడైన ఎర్రాప్రగడ అనువదించిన హరివంశాన్ని వేమారెడ్డి అంకితం పుచ్చుకున్నాడు.


**అనవోతారెడ్డి (క్రీ.శ. 1353-64)**

ప్రోలయ వేముని పెద్ద కొడుకు అనవోతారెడ్డి తండ్రి మరణానంతరం సింహాసనం ఎక్కినాడు. తండ్రికాలంలో అనేకయుద్ధాల్లో పరాక్రమం ప్రదర్శించి 'పీరాన్నవోతు'గా ప్రసిద్ధిచెందినాడు. తమ్ముడైన అనవేమారెడ్డి ఇతణ్ణి "ప్రత్యర్థిం ప్రతిపక్షదేశజయినః" అని కీర్తించినాడు. అయితే, అనవోతారెడ్డికాలం యుద్ధాలతో నిండినమాట వాస్తవమేగాని రాజ్యాలను జయించి ఆక్రమించడానికి బదులు తండ్రి ద్వారా సంక్రమించిన రాజ్యంలో కొంతభాగమీతడు కోల్పోయినాడనడం నిజం. ఈతడు మేఖలభూధర పర్యంతం జయించినాడన్న అనవేమునివాక్యం కూడ అతిశయోక్తియే.

రాజ్యానికి వచ్చినంతనే అనవోతుదృష్టిని కళింగదేశపరిస్థితు లాకర్షించిబాయి. తొయ్యేటి అనవోతానాయకుడు మరణించడంతో వేంగిరాజ్యం అలజడి పాలయింది. కాపయ అధికారం అస్తమించడం ప్రారంభమయింది. ఈ పరిస్థితుల్లో కళింగ గంగాధీశుడైన నాలుగో నరసింహుడుదండెత్తి, కృష్ణాతీరంలోని శ్రీకాకుళం వరకు సైన్యాలు నడిపినాడు (క్రీ.శ. 1353). బహుశా కళింగ

దండయాత్రను మరలించే ఉద్దేశంతో అనవోతారెడ్డి దండెత్తి తలగడదీపిని ఆక్రమించి దాక్షారామంవరకు నడచినట్లాతని దాక్షారామశాసనం (క్రీ.శ. 1356) వల్ల తెలుస్తున్నది. ఈ దండయాత్రలో కోన హైహయులు, కోరుకొండ - రాజమహేంద్రవర ముమ్మడి నాయకుడు, కొప్పుల (పిఠాపురం) ప్రభువులు ఆతని వశవర్తులయినారు. ఈ దండయాత్ర క్రీ.శ. 1353-1356 సంవత్సరాల మధ్య జరిగింది.

అయితే అనవోతారెడ్డి కళింగదండయాత్ర పూర్తి విజయవంతమని చెప్పలేము. రెడ్ల అధికార విస్తరణ తమ రాజ్యాలకు ప్రమాదంగా పరిణమించగలదనే భయంతో; కృష్ణా, గోదావరి మండలాలలోని క్షత్రియులు, వీరువచోడభక్తిరాజు కూటమిగానేర్పడి బహుశా అనవోతారెడ్డిని కళింగనుండి తిరుగు ప్రయాణంలో సూరవరం దగ్గిర ఎదుర్కొని ఓడించినారు. ఈ పరిణామాన్ని భక్తిరాజుకొడుకు అన్నదేవచోడుని రాజమండ్రి శాసనం సూచిస్తున్నది. భక్తిరాజుకు సూరవరాధీశులతోను రెడ్లతోనూ బంధుత్వం ఉంది. అయినప్పటికి స్వీయరాజ్యరక్షణకై సూరవరాధీశులతో చేరి, రెడ్డిరాజ్య విస్తరణ నరికట్టడమే అతని లక్ష్యమయి వుంటుంది.




కళింగదండయాత్ర అనంతరం అనతికాలానికే అనవోతారెడ్డికి వెలమలతో యుద్ధం సంభవించింది. రేచర్ల సింగమనాయని వధించడంలో జల్లిపల్లి

క్షత్రియులతో రెడ్లు చేరినందున రెడ్లపై ప్రతీకారం తీర్చుకోడానికి అనవోత, మాదానాయకులు రెడ్డి రాజ్యంపై దండెత్తినారు. వెలమసైన్యాలు కృష్ణానది దాటడంతో ధాన్యకటకం దగ్గర రెడ్లకు వెలమలకు భీకరయుద్ధం జరిగింది. ఆ యుద్ధంలో వెన్నెలకంటి సూరన రచననుబట్టి మొదట్లో అనవోతారెడ్డి విజయం సాధించినాడు. కాని, చివరకు మాదానాయకుని చేతిలో పూర్తి పరాజయం పొంది పారిపోయినాడు. "మాధవాధిపునిధాకన్ విభ్రష్టసాధనుడై దన్నలికోట యొద్దననవేమారెడ్డిమానంబు, నిగ్గునుబోనాడి రయంబునన్ బరచె"నని వెలుగోటివారి వంశావళి వర్ణిస్తున్నది. రెడ్డిరాజుల 'జగనొబ్బగండాది' బిరుదులను స్వీకరించడమేగాక ప్రోలయ వేముని రాజ్యాంతర్భాగమైన శ్రీశైల ప్రాంతాన్ని పద్మనాయకులు ఆక్రమించినారు. అనవోత, మాదానాయకులు శ్రీశైలానికి సోపానాలు నిర్మించినట్లు రసార్ణవ సుధాకర, వెలుగోటివారి వంశచరిత్రల వల్ల తెలుస్తున్నది.

ఇంచుమించు ఇదే సమయానికి (క్రీ.శ. 1361) బహమనీ సుల్తాన్ దండెత్తి కృష్ణానదిని దాటి ధాన్యవాటిలోని అమరేశ్వర దేవాలయానికి నష్టం కలిగించినాడు. అనవోతారెడ్డి మంత్రియైన మల్లయవేమన ఆ దాడిని తిప్పికొట్టి, అమరేశ్వరస్వామిని పునఃప్రతిష్ఠగావించి నట్లాతని శాసనం చెబుతున్నది.

పద్మనాయకులతో బహమనీలతో రెడ్డిరాజుల యుద్ధాలు సదవకాశంగా తీసుకొని, విజయనగరాధీశుడైన మొదటి బుక్కరాయలు రెడ్డిరాజ్యంపై దండెత్తినాడు. విజయనగర ధాటికి వెలమలు శ్రీశైల ప్రాంతంనుండి నిర్గమించినారు. శ్రీశైలం, దూపాడు (మార్కాపురం) సీమలు బుక్కరాయల స్వాధీనమయినాయి. ఈ దాడి పురోగమిస్తున్న కాలంలోనే అనవోతారెడ్డి మరణించి వుంటాడు.

నిరంతరం యుద్ధాలు జరుగుతున్న ఆ రోజుల్లో స్థలదుర్గమైన అద్దంకి సురక్షితం కాదని అనవోతారెడ్డి కొండవీటికి ప్రాకారాదులు నిర్మించి, రాజధానిని అచటికి మార్చినట్లు మన్యమాపుర శాసనం (క్రీ. శ. 1364) నుండి తెలుస్తున్నది. అనవోతారెడ్డి మహావీరుడనడంలో సందేహంలేదు. కాని, అతని కాలంలో రెడ్డి రాజ్యం అపార నష్టానికి గురియై ప్రతిష్ఠను కోల్పోయింది. రాజ్య ఆర్థికావసరాలను గుర్తించి వాణిజ్యాభివృద్ధికై అనవోతారెడ్డి తగిన చర్యలు తీసుకున్నాడు. అతని మంత్రియైన సోమయ మోటుపల్లి రేవులో అభయ శాసనం నెలకొల్పి, ఎగుమతి దిగుమతుల విషయంలో వర్తకులకు ప్రోత్సాహకరమైన మర్యాదలు చేసినాడు. అనవోతారెడ్డి తండ్రివలె వైదిక ధర్మాభిమాని; శివభక్తి తత్పరుడు. హేమాద్రి సూచించిన దానవ్రతాలన్నింటిని పాటించేవాడు. వెన్నెలకంటి వంశీయులైన కవులను ఆదరించి కృతులు పొందెనాదని సూరన వ్రాసినాడుగాని, ఆ కృతులేవీ లభించలేదు. అతని శాసనాలన్నింటిని బాలసరస్వతి అనే కవిపండితుడు రచించి

నాడు. ఇతణ్ణి గురించిన వివరాలు తెలియవు. తననుగురించి కేవలం "అన్న పోతనరేంద్రస్య విద్వాన్ బాలసరస్వతిః" అని మాత్రమే ఈ కవి చెప్పుకున్నాడు.

**అనవేమారెడ్డి (క్రీ. శ. 1364 - 1386)**

అనవోతారెడ్డి మరణించేనాటికి అతని కొడుకు కుమారగిరి యుక్త వయస్కుడు కాడు. నాటి రాజకీయ పరిస్థితుల్లో సమర్థుడైన పాలకుడు అవసరం. అందుచే అనవోతారెడ్డి తమ్ముడు, యుద్ధాల్లో రాజనీతిలో ఆరితేరిన అనవేముడు కొలువులోని ఉద్యోగుల, ప్రభువుల ప్రోత్సాహంతో సింహాసనం ఎక్కినాడు ఆ కారణంగానే శాసనాలు అతణ్ణి "రాజ్యశ్రీరమణీయంవరవతి" అని వర్ణిస్తున్నాయి. తన పాలనకాలం సుమారు ఇరవై సంవత్సరాల్లో అనవేముడు రెడ్డిరాజ్య బల గౌరవాలను ఇనుమడింప జేసినాడు.

అనవేమారెడ్డి కాలంకూడ యుద్ధాలతో, దండయాత్రలతో నిండిపోయింది. అతని శాసనాలు పదికిపైగా ఉన్నాయిగాని, వానిలో సాంప్రదాయక ప్రశస్తి మినహా అతని విజయాలను గురించిగాని నాటి రాజకీయ సంఘటనలనుగురించి గాని సమాచారం కన్పించదు. ఇక, శ్రీశైల శాసనంలోని దివిదుర్గవిభాళ, రాజ మహేంద్ర నిరవద్యనగరాది బహుశిధ స్థల దుర్గవిదళన బలరామ,సాగర గౌతమీ సలిల సంగమ సకల జలదుర్గసాధన రఘురామ, అనే బిరుదులవల్ల అతని దండ యాత్రలను, అందలి విజయాలను ఊహించవచ్చు

మొదట్లో వేంగిరాజ్య పరిస్థితులు అనవేముని దృష్టి నాకర్షించినాయి. వేంగి రాజ్యంలో శక్తిరాజు మరణించినంతనే అతని కొడుకులమధ్య సింహాసనానికై కలహం జరిగి,అందు అన్నదేవచోడుడు తన అన్న చోడభీము నోడించి పారదోలి రాజ్యం ఆక్రమించినాడు. చోడభీముడు తనభార్య సోదరుడైన అనవేముని ఆశ్ర యించినాడని చెప్పవచ్చు. ఈ పరిస్థితిని అవకాశంగా తీసుకొని అనవేముడు కళింగ దండయాత్ర సాగించినాడు. ప్రథమంలో దివిదుర్గం అతని వశమయింది. దివిని అనవోతారెడ్డియే జయించినాడుగాని, అతని చివరి రోజుల్లో శత్రుహస్తగత మయినందున అనవేముడు తిరిగి దాన్ని జయించవలసివచ్చింది. అనంతరం నిరవద్యపురంపై నడచినాడు. కళింగదండయాత్రలో దూపూరురెడ్ల సహాయం అనవేమునకు లభించింది. వీరిలో ప్రముఖుడైన అల్లాడరెడ్డి చోడభీముని కుమార్తె వేమాంబికను పెండ్లాడినాడు. వేమాంబిక అనవేముని మేనకోడలే. అల్లాడరెడ్డి సాయంతో అన్నదేవుని నిరవద్యపురం దగ్గిర ఓడించి, ఆ రాజ్యం చోడభీముని వరం చేసినాడు. అనంతరం గోదావరీ ముఖద్వారంలోని వసిష్ఠ గౌతమీనదుల మధ్య జలదుర్గాలను ఆక్రమించి పానార, కోనరాజ్యాలను కైవసం చేసుకున్నాడు. రాజమహేంద్రవరదుర్గం అతని వశమయింది. ఈ విజయాలను అతని పరివేల, దాక్షారామ శాసనాలు సూచిస్తున్నాయి. రాజమహేంద్రవరంలో బహుశా

అల్లాడరెడ్డి పాలకుడయినాడు. ఈ విజయాలతో కళింగపై దండయాత్ర సులభ మయింది. మంచికొండ ముమ్మడినాయకుడు, పిఠాపురం కొప్పుల నాయకులు, ఎలమంచిలి చాళుక్యులు, వడ్డాది మత్స్యరాజులు ఓడిపోయినారు. ఈ దండ యాత్రలు బ్రాహ్మణసేనాని చెన్నమనాయకుడు నిర్వహించినట్లును, అవి క్రీ.శ. 1375 నాటికి పరిసమాప్తమయినట్లును సింహాచలం శాసనం సూచిస్తున్నది. అనవేముని గురించి మన్యమాపుర శాసనంలోని "సింహాచల వింధ్యపాదప్రతిష్ఠాపిత కీర్తి స్తంభ'' అనే వాక్యంలో కొంత సత్యం లేకపోలేదు. కాని, దాక్షారామ సింహాచల మధ్యదేశం రెడ్డిరాజుల ప్రత్యక్ష పాలనలోనికి వచ్చిందని చెప్పలేము. చెన్నమనాయకుడు వడ్డాద మత్స్యప్రభువై వీరార్జునదేవునినుండి గొట్టివాడ గ్రామంపొంది సింహాచలేశునకు దానం చేసినట్లు అచటి శాసనం చెబుతున్నది. దీన్నిబట్టి ఆ ప్రాంతం రెడ్లపాలనలో లేదని స్పష్టమవుతున్నది. అదీగాక కుమార గిరి కాలంలో కాటయ వేముడీ ప్రాంతాలను తిరిగి జయించవలసి వచ్చింది. అందుచే అనవేముని దాడివల్ల తాత్కాలికమూ పరిమితమున్నైన ప్రయోజనం మాత్రమే కలిగిందని చెప్పవలె. రాజ్యం విస్తరించలేదు; గౌరవప్రతిష్ఠ లినుమ డించినాయి.

కళింగ దండయాత్ర అనంతరం అనవేముడు రాచకొండ, విజయనగర రాజ్యాలపై దృష్టి మరల్చినాడు. నల్గొండజిల్లా (వజీరాబాద్) వాడపల్లి దగ్గర అనవేముని ఉద్యోగి కడియం పోతినాయకుని శాసనం ఉంది. బూరుగుగడ్డలో కూడ దేసటి రెడ్లశాసనం ఉన్నట్లు శ్రీ మల్లంపల్లి సోమశేఖరశర్మగారి పరిశీలన. ఈ శాసనాలు రెడ్డిరాజ్యం కృష్ణానదికి ఉత్తరంగా విస్తరించినదనడానికి నిదర్శ నాలు. కాని, వెలుగోటివారి వంశావళి అనవేముని మాదానీడు ఓడించినట్లు వర్ణిస్తున్నది. వాఙ్మయ సాక్ష్యంకంటే శాసనసాక్ష్యం విశ్వసనీయం కదా! అదీగాక వెలుగోటివారి వంశావళి వెలమలపరాజయాన్ని నమోదుచేయకపోవడం అసహజం కాదు. వెలమరాజ్యంపై దండయాత్రలో భాగంగానే అనవేముడు విజయనగరా ధీశుల నోడించి శ్రీశైల ప్రాంతాన్ని ఆక్రమించినాడనడానికి అచట అతని శాసనమే సాక్ష్యము.

అనవేముడీవిధంగా శత్రువులాక్రమించిన రాజ్యభాగాలను తిరిగి జయించి, రెడ్డి రాజ్యప్రతిష్ఠను పునరుద్ధరించినాడు. 'ఛురికాసహాయ', 'ప్రజాపరిచిత చతుర్విధోపాయ' అనే బిరుదులు అతడు యుద్ధాల్లో ఎంతటి అసహాయశూరుడో రాజనీతిలో అంతటి ప్రజ్ఞావంతుడని చాటుతున్నాయి. రాజ్యభారభరణ వ్యాపార దక్షుడైన మామిడి పెద్దనామాత్యుడు అనవేముని మంత్రి దండనాయకుడు. సమస్తశాస్త్రవేది, నీతిమంత్రీశ్వరుడైన ఇమ్మడేంద్రుడు మరొకమంత్రి. తండ్రివలె అనవేముడు ఆధ్యాత్మిక చింతనపరుడు. బహు సువర్ణ గోసహస్రాది దానాలు

చేసినవాడు. అనేకాగ్రహారా లిచ్చినవాడు. శైవాచార తత్పరుడు. అయినా శ్రీశైల త్రిపురాంతక పంచారామాలలోగాక, శ్రీకూర్మ సింహాచల క్షేత్రాలలో కూడ అనేక దానధర్మాలు చేసినాడు. సింహాచలంలో 'అనవేమపురి' అనే ప్రసిద్ధ మండపాన్ని, శ్రీశైలంలో వీరశిరోమండపాన్ని నిర్మించినాడు. ప్రతి సంవత్సరం వసంతోత్సవాలొనర్చి- కవి, నటగాయకాది కళోపాసకుల నాహ్వానించి, గౌరవించి వసంతరాయలని కీర్తిగడించినాడు. అతని పాలనలో కవులకు "మృద్వన్నం మృదులాంబరం మృగమదం చామీకరం చామరం'' లభించినవని ఒక కవి వర్ణించినాడు. వెన్నెలకంటి సూరన మాటల్లో—

"తన బ్రతుకు భూమిసురులకు తన బిరుదులు పంటవంశధరణీశులకున్
తన నయము భూమిప్రజలకు ననవేమనఇచ్చె కీర్తినధికుండగుచున్."

## కుమారగిరి (క్రీ.శ. 1386-1402)

అనవేముని తర్వాత కుమారగిరి సింహాసనానికి రావడం ప్రశాంతంగా జరిగిందని కొందరి అభిప్రాయం. కాని, కుమారగిరిని ప్రతిఘటించి చందోలు పాలించిన మాచారెడ్డి పౌత్రుడు పెదకోమటివేముడు యుద్ధానికి సన్నద్ధుడయి నాడనీ, కుమారగిరి పక్షాన అతని బావమరది కాటయ వేముడు అంతర్యుద్ధం నడిపి, చివరకు కోమటివేమునితో సమాధానానికి వచ్చిన తరువాతనే కుమారగిరి రాజ్యపాలన సాగించినాడని శ్రీమల్లంపల్లివారి నిర్ణయము. క్రీ.శ. 1387-1388 సంవత్సరాల మధ్యకాలంలో కుమారగిరి శాసనాలు లేకపోవడం, శ్రీకృష్ణుడు ధర్మరాజునువలె కాటయవేముడు కుమారగిరిని సింహాసనంపై నిల్పినాడని కాటయవేముని తొత్తరమూడి శాసనం వర్ణించడం, వంశపరంపరా రెడ్డిరాజుల మంత్రులుగానుండిన మామిడి వంశస్థులు కుమారగిరి కొలువులోనుండక పెద కోమటివేముని ఆశ్రయించడం శ్రీశర్మగారి నిర్ణయాన్ని బలపరుస్తున్నాయి.

అంతర్యుద్ధకాలంలో రెడ్డిరాజ్యానికి శాత్రవ ఉపద్రవం అధికమయింది. వినుకొండవరకూ శ్రీశైలప్రాంతం విజయనగరాధీశులు ఆక్రమించినారు. రెండో హరిహరుని రత్నభాండారి తిప్పన శృతపర్వతాన్ని (వినుకొండ) వశపరచు కొన్నట్లు వల్లభామాత్యుని క్రీడాభిరామంనుండి తెలుస్తున్నది. కళింగప్రాంతంపై రేచర్లనాయకులు దండయాత్రలు సాగించినారు. బెండపూడి మొదలైన దుర్గాలు వారి వశమయినాయి. కళింగేశుడైన నాలుగో నరసింహుడు ఓడి, తన కూతురు కనకమహాలక్ష్మిని సింగమనాయకుని కొడుకు అనపోతానాయనకిచ్చి పెండ్లిచేసి సంధి చేసుకున్నాడు. ఈ సంఘటన క్రీ.శ. 1387 ప్రాంతంలో జరిగినట్లు దాక్షారామ శాసనం సూచిస్తున్నది. ఇక అనవేమునిచే రాజ్యభ్రష్టుడైన అన్నదేవ చోడుడు మిత్రులకై అన్వేషణ ప్రారంభించినాడు. ఈ అన్వేషణలోనే అతడు

క్రీ.శ. 1388 లో త్రిపురాంతకం వచ్చినాడు. బహుశా పెదకోమటివేముని ప్రోత్సాహం లభించి వుంటుంది.

పెదకోమటివేమునితో సమాధానపడిన తరువాత కుమారగిరి తన బావ మరది కాటయ వేముని విజయనగర దుర్క్రాక్రమణ నరికట్టడానికి పంపినాడు. కొండవీడు విజయనగరాల మధ్య జరిగిన యుద్ధ వివరాలు తెలియవు. విజయ నగరం పరాజయం పొందినట్లు స్పష్టమవుతున్నది. అప్పటికే రెండవ హరిహర రాయలు బహమనీ, పద్మనాయక కూటమిచే పరాజయం పొంది వున్నాడు (కొత్తకొండయుద్ధం) అందుచే వారికి శత్రువులైన రెడ్లతో స్నేహం చేయడం రాజనీతి అని భావించి వుంటాడు. బహమనీలతో పోరాడుతున్న రాయలతో మైత్రి కొండవీటికిగూడ అనుకూలమనే ఆశయంతో కాటయ వేముడు హరి హరునితో సంధి చేసుకున్నాడు. శ్రీశైలం ప్రాంతం రాయల ఆక్రమణలోనే వుండేటట్లు; వినుకొండ, త్రిపురాంతక ప్రాంతాలు తిరిగి కొండవీటి అధీనంలోనికి వచ్చేటట్లు ఒప్పందం అయినట్లు తెలుస్తుంది. ఈ మైత్రినిబలపరుస్తూ హరిహరుడు తన కూతురిని కాటయవేమునికొడుకు కాటయకిచ్చి పెండ్లి చేసినాడు.

వెలుగోటివారి వంశావళి కుమారగిరిని వెలమనాయకులోడించి బొమ్మ పెట్టినట్లు వర్ణిస్తున్నది. కాని, కుమారగిరికాలంలో కొండవీటివక్షాన యుద్ధాలు నిర్వహించింది కాటయవేమారెడ్డి. కాటయ వేముని గురించిన ప్రసక్తి ఆ గ్రంథంలో కన్పించదు. అందుచే కుమారగిరిని గూర్చిన ఆ గ్రంథకథనం విశ్వసనీయంగాలేదు.

విజయనగరంతో ఒప్పందమైన తర్వాత కుమారగిరి కాటయవేముని కళింగదండయాత్రకు పంపినాడు. యువరాజు అనవోతారెడ్డి కాటయవేముని అనుసరించినాడు. ఈ దండయాత్రలో రాజమహేంద్రవరవాస్తవ్యులైన అల్లారెడ్డి, అతనికొడుకులు వేమ, వీరభద్ర, దొడ్డారెడ్లు ప్రముఖపాత్రను నిర్వహించినట్లు శ్రీనాథుని కాశీఖండం, శివలెంక కొమ్మన శివలీలావిలాసంనుండి తెలుస్తున్నది. కాటయవేముని కాళిదాస వ్యాఖ్యానాలనుండి, కుమారగిరి గోపవరం శాసనంనుండి కూడ కొన్ని వివరాలు లభిస్తున్నాయి. కాటయ వేమాదులు రంప, మొల్లేటి (మొల్లేరు), కిమ్మూరు, బెండపూడి దుర్గాలు (తూర్పుగోదావరిజిల్లా); రామగిరి, వీరఘోట్టము, ఝూదేశ వనం, జంతురునాడు,వడ్డాది(విశాఖజిల్లా):సప్తమాడెములు బారహదొంతి (గంజాం) జయించి, కటకంవరకు నడచినారు. గోపవరం శాసనం కాటయవేముని 'కటకచూరకార' అని వర్ణిస్తున్నది. దొడ్డారెడ్డి కిరాం బోధిని (చిలకసరస్సు) తీరంలో జయస్తంభంనాటినట్లు కాశీఖండం చాటుతున్నది. ఈ రాజ్యాలు చెల్లించిన కానుకలతో కాటయవేముడు కొండవీడుకు తిరిగి వచ్చి కుమారగిరికి సమర్పించినాడు.రెడ్డిరాజులు జరిపిన దిగ్విజయయాత్రలన్నింటిలో ఇది విస్తృతము, విజయవంతమునైనది.

కాటయవేముడు తూర్పున జయించిన సీమలన్నింటిని ఒక రాష్ట్రంగా చేసి కుమారగిరి తన కుమారుడైన అనవోతారెడ్డిని రాజప్రతినిధిగా నియమించినాడు. దీనికి రాజమహేంద్రవరం రాజధాని. మిగిలిన ప్రాంతాలను, బెండపూడివంటి దుర్గాలు కేంద్రాలుగా, సీమలుగా విభజించి, విశ్వాసపాత్రులైన సామంతప్రభువులను నియమించినాడు. అల్లాడరెడ్డి కుటుంబసహాయంతో అనవోతారెడ్డి రాజమహేంద్ర రాజ్యాన్ని పాలించినాడు. కాటయవేముడు తన పౌత్రి హరిహరాంబను అల్లాడరెడ్డి పెద్దకొడుకు వేమారెడ్డికి, తన కూతురు అనితల్లిని అల్లాడరెడ్డి రెండోకొడుకు వీరభద్రారెడ్డికి ఇచ్చి పెండ్లిచేసి మైత్రిని బలవత్తరమైన బంధుత్వంగా మార్చినాడు.

ఈ విజయపరంపరలతో కొండవీటి గౌరవప్రతిష్ఠలినుమడించి, అనవర్తి శాసనం చెప్పినట్లు నాల్గుదిక్కుల రాజులతోను స్నేహసంబంధాలేర్పడినాయి. కాటయ వేమ, అల్లాడరెడ్డి అండదండలతో రాజ్యంలో శాంతిభద్రతలు నెలకొన్నాయి. అందుచే కుమారగిరి సాహిత్య కళాపోషణలో ప్రొద్దుపుచ్చినాడు. వాస్తవానికి రెడ్డిరాజులందరిలో కుమారగిరి రసికుడు, సంస్కృతంలో గొప్ప పండితుడు, నాట్యకళాభిమాని. అతని ఆస్థానంలో లకుమాదేవి అనే ప్రసిద్ధ నర్తకికి విశేష ఆదరం లభించింది. ప్రతి సంవత్సరం వసంతోత్సవాలు జరిపి, వసంతరాయలు, కర్పూర వసంతరాయలు అనే బిరుదాలు పొందినాడు. ఈతని వసంతోత్సవాలను అవచి తిరుమలశెట్టి నిర్వహించినాడని శ్రీనాథుని హరవిలాసం వర్ణిస్తున్నది.

ఇంతలో కుమార అనవోతారెడ్డి అకాలమరణానికి గురి అయినాడు. అనవర్తి శాసనం (క్రీ. శ. 1390)లో లేని అతని మరణ ప్రసక్తి గణపవరం శాసనం (క్రీ. శ. 1395)లో కన్పిస్తున్నది. ఈ సంఘటన కుమారగిరిని మానసికంగా కుంగదీయటమేగాక రెడ్డి రాజ్య చరిత్రలో అవాంఛనీయ పరిణామాలకు కారణమయింది. రాజమహేంద్రవరంతో సమర్థుడు విశ్వాసపాత్రుడునైన రాజప్రతినిధి అవసరమనడంలో సందేహం లేదు. ఆ రాజ్యాన్ని జయించింది కాటయవేముడు అంతేగాక, కుమారగిరి అనంతరం కొండవీడు పెదకోమటివేముని పరం అవుతుంది అందుచేత రాజమహేంద్ర ప్రాంతాలను సామంత ప్రతిపత్తి ఉన్న రాజ్యంగా చేసి కుమారగిరి కాటయవేమునకు యిచ్చినాడు. ఇది రెడ్డి రాజ్య విభజనకై దురుద్దేశంతో చేసిన చర్యగా పెదకోమటివేముడు, అతని వర్గీయులు భావించిన ఫలితంగా అంతర్యుద్ధం ప్రారంభమయింది.

అంతర్యుద్ధం రాజ్యంలో అల్లకల్లోలం సృష్టించి శాత్రవ దురాక్రమణకు, సామంతుల తిరుగుబాట్లకు దారితీసింది. దీనికితోడు క్రీ. శ. 1395 ప్రాంతంలో దక్షిణదేశంలో తీవ్రమైన క్షామం విజృంభించి, ప్రజలనేక బాధలకు గురి అయినారు; పన్నులు చెల్లించలేకపోయినారు. ప్రభుత్వంపట్ల ఆదరాభిమానాలు

నశించినాయి. క్రీ. శ. 1396 లో బహమనీ సుల్తాన్ ఫిరోజ్‌షా విజయనగరంపై దండయాత్రలో బాగంగా రెడ్డి రాజ్యంపై నడిచినాడు. గజరావుతిప్ప అనే సామంతుడు బహమనీ సైన్యాలను కంభంమెట్టుదగ్గిర ఓడించి మరలించినట్లు తెలుస్తున్నది. క్రీ. శ. 1399 లో గజపతి ప్రభువు దండెత్తిరాగా అతణ్ణి గొగ్గయ కొడుకు దేవయసేనాని సింహాచలం (విహారణగిరి) చెంత ఓడించి తరిమివేసినట్లు సర్వవరం శాసనం చెబుతున్నది. దేవయ, కుమారగిరిసేనాని. ఇక రాజ్యం దక్షిణ బాగంలో విజయనగరం చొచ్చుకువచ్చింది. రెండో హరిహరుని శాసనం యనమదలలోను, అతని కొడుకు దేవరాయల శాసనాలు మూర్కొండపాడు, పరుచూరులలోను కన్పిస్తున్నాయి. ఇవి క్రీ. శ. 1400 సం॥ నాటివి. కందుకూరును పాలిస్తున్న మల్లారెడ్డి సంతతివాడైన కోమటివేముడు విజృంభించి తీరాంధ్రంలో తెనాలి వరకు ఆక్రమించినట్లు అతని పెదపూడి శాసనం (క్రీ. శ. 1404) వల్ల స్పష్టమవుతుంది. ఈ దాడులను అరికట్టడానికి కుమారగిరి చేసిన ప్రయత్నాలు తెలియరావు. రాజ్యం ఈ దాడులతో సంక్షుభితమయి, సామంతులు కుమారగిరిని ధిక్కరించినారు. గుంటూరు, బాపట్ల, పలనాడు తాలూకాలలో వెలుగోటి రాయప నాయని శాసనాలు కన్పిస్తున్నాయి. ఈతని సామంతుడైన గజరావుతిప్పని విజయపరంపరలను గుర్రించి పెక్కు చాటువులున్నాయి. వెలుగోటివారు వెలమలు. కాని, రాయపనాయనికి రాచకొండ వెలమలతోటి సంబంధం తెలియదు. అతని శాసనాలు కుమారగిరిని ప్రస్తావించవు. అందుచేత అతడు కుమారగిరిని ధిక్కరించి స్వతంత్రంగా వ్యవహరిస్తూ చివరకు పెదకోమటివేమునిపక్షం వహించినాడు. ఇట్టి సామంతులందరినీ కూడగట్టుకొని పెదకోమటి వేమారెడ్డి క్రీ. శ. 1402 ప్రాంతంలో కుమారగిరిని తొలగించి కొండవీటిసింహాసనం ఆక్రమించినాడు.

కుమారగిరి రాజమహేంద్రవరం చేరి కాటయవేముని ఆశ్రయించినాడు. కొండవీడును ఆక్రమించడానికి ఉభయులు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. చివరకు నిరాశతో వ్యాధిగ్రస్తుడై కుమారగిరి మరణించినాడు.

కుమారగిరి విద్యావంతుడు, రసజ్ఞుడు, కళాపోషకుడు. కాని, రాజకీయాల్లో దూరదృష్టి, సామర్థ్యం లేనివాడు. రాజనీతిలేని అతని చర్యలవల్లనే కొండవీటి రెడ్డి రాజ్యం అల్లకల్లోలాల పాలై విచ్ఛిన్నం కాసాగింది.

## పెదకోమటి వేమారెడ్డి (క్రీ. శ. 1402 - 20)

కుమారగిరిని పారదోలి పెదకోమటివేమారెడ్డి సింహాసనం అధిష్ఠించినాడు. పూర్వపు ఒడంబడిక ప్రకారం కుమారగిరి అనంతరం పెదకోమటి వేముడే సింహాసనానికి వారసుడు. కాని, రాజ్య విభజనవల్ల కోమటి వేముడు తిరుగుబాటు చేయవలసి వచ్చింది. కాటయవేముడే గాక కొండవీటిలోని కుమారగిరి అభిమానులు

సయితం కోమటివేముని ధిక్కరించినట్లు తెలుస్తుంది. బహుశా అందుచేతనే "క్రమ పరిప్రాప్త సామ్రాజ్య సింహాసనాధ్యాసి'' అని చెప్పుకోవలసివచ్చింది. క్రమంగా స్థానిక వ్యతిరేకతను నిర్మూలించి పెదకోమటివేముడు కొండవీడులో బలవంతుడయినాడు.

పెదకోమటి వేముడు సింహాసనం ఎక్కిన వెంటనే అంతర్యుద్ధంలో భాగంగా కాటయవేముని ఎదిరించవలసివచ్చింది. కుమారగిరిని పునరుద్ధరించే ఆశయంతో కాటయవేముడు కొండవీడురాజ్యంపై దండెత్తినాడు. అతనికి సాయంగా రెండో హరిహరరాయలు చౌండపసేనానిని కొండవీడు పైకి పంపినాడు. పెదకోమటి వేముని సేనాని గజరావు తిప్పన గుండుగొలను, కోనూరుయుద్ధాల్లో కాటయ వేముని ఓడించి మరణించినాడు. ఇంతలో చౌండపసేనాని కొండవీడువరకు పురోగమించినాడు. అతణ్ణి సయితం కొండవీటి కోటముందు గజరావుతిప్పనయే ఓడించి తరిమివేసినాడు. కుమారగిరి, కాటయవేముల ప్రయత్నాలు విఫలమై, పెదకోమటి వేమునికి తాత్కాలికంగా ప్రమాదం తప్పింది. అనంతరం పెద కోమటి వేముడు తన తమ్ముడైన మాచారెడ్డిని కొండపల్లి పాలకుడుగా నియమించి నాడు.

క్రీ.శ. 1404 లో రెండోహరిహరుడు మరణించి, అతని కొడుకులు సింహాసనానికై కలహించడం పెదకోమటి వేమునకు సదవకాశం అయింది; తన రాజ్యం దక్షిణ ప్రాంతంలో-విజయనగరాధీశుల వశమైన భాగాలను, కందుకూరు కోమటివేము డాక్రమించిన తీరాంధ్రప్రాంతాలను-తిరిగి స్వాధీనంచేసుకున్నాడు. రాజ్యంలో శాంతి భద్రతలను పునరుద్ధరించడానికి ప్రయత్నించినాడు.

కొండవీడు, రాజమహేంద్రవర రాజ్యాలను విలీనంచేసి పాలించడమే పెదకోమటి వేమారెడ్డి జీవితాశయమయింది. కాటయ వేముని సాధించడానికై మొదట్లో కోమటివేముడు అన్నదేవ చోడుని పక్షం వహించినట్లు కన్పిస్తుంది. కొండవీడు, రాజమహేంద్రవరాల మధ్య కలహం, అన్నదేవునకు అనుకూలిం చింది. దేవరకొండ పద్మనాయకుడైన పెద వేదగిరి సాయంతో అన్నదేవుడు వేంగిలో తాను కోల్పోయిన రాజ్యం తిరిగి సంపాదించినాడు. క్రీ.శ.1404 నాటి దాక్షారామ శాసనం అతణ్ణి రాజాధిరాజవరమేశ్వర, పూర్వసింహాసనాధ్యక్ష అని వర్ణిస్తున్నది. పోలవరంలో క్రీ.శ. 1408 నాటి అతని శాసనం ఉంది. పద్మ నాయకుల శాసనాలు క్రీ.శ. 1405, 1407 నాటివి శ్రీకూర్మంలో ఉన్నాయి. కాటయ వేముడు పద్మనాయకులనుగానీ అన్నదేవచోడునిగానీ ప్రతిఘటించిన ప్రయత్నాలను గురించి తెలియదు. ఈ విధంగా శత్రుపరివేష్టితుడైన కాటయ వేముడు వారి ప్రమాదం నుండి తప్పించుకొనడానికై విజయనగర సహాయం అర్థించినాడు. నాటికి దేవరాయలు అంతర్యుద్ధంలో విజయం సాధించి పట్టాభిషేకం

జరుపుకున్నాడు (క్రీ. శ. 1406). కాటయ వేముడు స్వయంగా విజయనగరం దర్శించి వుండవచ్చునని అహోబలంలోని అతని శాసనం (క్రీ.శ.1410) సూచిస్తున్నది. మొదటి దేవరాయలు కాటయ వేమునకు సైనిక సహాయం చేయడానికి అంగీకరించినాడు.

పెదకోమటివేమ, అన్నదేవచోడులు బహుశా క్రీ.శ. 1412 ప్రాంతంలో రాజమహేంద్రవరంపై దండెత్తినారు. అత్తిలి, కాకరపర్రుల చెంత (తణుకు తాలుకా పశ్చిమ గోదావరిజిల్లా) భీషణయుద్ధాలు జరిగాయి. "తన మిత్రుని రక్షించడానికై గోదావరీ తీరంలోని కాకరపర్రు యజ్ఞభూమిగా పినఉండిరాజు అధ్వర్యుడుగా కన్నడాది సైన్యాలు యజ్ఞపశువులుగా అన్నదేవుడు వీరమహాయజ్ఞంచేసి"నాడని అతని రాజమహేంద్రవర శాసనం వర్ణిస్తుంది. ఇందలి మిత్రుడు పెదకోమటివేముడని, ఈ యుద్ధంలో కాటయ వేముడు మరణించినాడని చెప్పవచ్చును. క్రీ.శ. 1414 తరువాత కాటయవేముని శాసనాలు కన్పించవు. కొప్పునూళ్ళ వారి బిరుదావళినిబట్టి గజరావుతిప్పనకు "కాటయ వేముని తల గొండుగండ" అనే బిరుదు కన్పిస్తున్నది.

కాటయ వేముడు మరణించినప్పటికీ రాజమహేంద్రవరం పెదకోమటి వేముని స్వాధీనం కాలేదు. కాటయవేమునికొడుకు బాలుడునైన రెండో కుమారగిరిని సింహాసనం ఎక్కించి అల్లాడరెడ్డి పెదకోమటివేముని ప్రతిఘటించి అతని ప్రయత్నాలు విఫలం చేసినాడు. అంతేగాక, క్రీ శ. 1415 ప్రాంతంలో అన్నదేవచోడునికూడ వధించినట్లు కన్పిస్తుంది. అతనిమరణంతో పెదకోమటివేముడు నిస్సహాయుడయినాడు. అతణ్ణి అల్లాడరెడ్డి ధిక్కరిస్తున్నాడు. అల్లాడరెడ్డికి వెన్నండగా విజయనగరాధీశులున్నారు. అందుచే గత్యంతరంలేక పెదకోమటి వేముడు బహమనీసుల్తాన్ ఫిరోజ్‌షా మైత్రి వహించినాడు. గుల్బర్గా, కొండవీడుల మధ్య మైత్రికుదర్చడంలో కోమటి వేముని మంత్రి మామిడిసింగన ప్రముఖపాత్ర వహించినాడని 'యవనాధీశసభా నిరంకుశ వచోవ్యాపారపారంగతా' అనే వర్ణన సూచిస్తుంది. కొండవీడుకు సాయంగా ఫిరోజ్‌షా పెద్ద సైన్యాన్ని తెలంగాణం మీదుగా పంపినాడు. వేదాద్రిలోని సుల్తాన్ శాసనాలు ఫెరిస్టా రచన ఆధారంగా ఈ దాడి క్రీ.శ. 1417 లో జరిగినట్లు తెలుస్తున్నది. రెడ్డి, బహమనీసైన్యాలు రాజమహేంద్రవరాన్ని ముట్టడించినాయి. అచట జరిగిన భీషణ యుద్ధంలో ఫిరోజ్‌షా, కోమటివేములను నోడించి అల్లాడరెడ్డి తరిమినాడు. బహుశా కోమటి వేముని వెన్నంటి తరుముతూ రామేశ్వరం (రాజోలు తాలూకా, తూర్పుగోదావరి జిల్లా) యుద్ధంలో కూడ ఓడించి, అతని సైనిక సంపత్తిని హరించినట్లు శివలీలా విలాసం వర్ణిస్తున్నది.

ఈ పరాజయాలతో కొండవీడుబలం క్షీణించింది. ఫిరోజ్‌షా పెదకోమటి వేములు అల్లాడరెడ్డితో పోరాడుతున్న సమయంలో మొదటి దేవరాయలు-బహమనీ వారిదృష్టి మరలించే ఉద్దేశంతో - కొండవీటిపైకి దాడులు పంపినాడు. రాజమహేంద్రవరం నుండి తిరోగమిస్తున్న ఫిరోజ్‌షా సైన్యాలు పానగల్లును ముట్టడించినాయి. ఈ సందర్భంలోనే విజయనగర, రాచకొండ రాజ్యాలమధ్య మైత్రి కుదిరింది. ఉభయులు కలిసి ఫిరోజ్‌షా నోడించి తరిమివేసినారు. కొండవీడుపై నడచిన విజయనగర సైన్యాలు మోటుపల్లితో సహా రెడ్డిరాజ్యం దక్షిణ ప్రాంతాలను ఆక్రమించినాయి. క్రీ.శ. 1416 లో దేవరాయలు మోటుపల్లిలో అభయశాసనం వేయించినాడు.

ఈ పరిస్థితుల్లో రెడ్డి పద్మనాయక రాజ్యాల మధ్య స్పర్థ తీవ్రరూపం ధరించింది. బహమనీ ఫిరోజ్‌షా పానగల్లు ముట్టడి సాగిస్తుండగా దేవరకొండ నేలుతున్న కుమార వేదగిరి దండెత్తి కోమటివేముని తమ్ముడు మాచారెడ్డిని వధించినాడు. ఇందుకు ప్రతిక్రియగా కోమటి వేముడు దేవరకొండపై దండెత్తి కుమారవేదగిరిని చంపినాడు. దీనితో రెచ్చిపోయి వేదగిరిసోదరుడైన లింగమనీడు కొండవీటిపై దండెత్తి పెదకోమటి వేముని ఓడించి, అతని సింహలాంఛనాన్ని, వంశానుగతమైన నందికంట పోతరాజు కటారిని సంగ్రహించి, అతని బొమ్మను తమ్మెపడగలో పెట్టినాడట, వెలుగోటివారి వంశావళినిబట్టి లింగమనీడు పెదకోమటి వేముని బందీగొని విడిచిపెట్టినట్లున్నది. సింగయఅన్న అతణ్ణి వధించినట్లున్నది. బహమనీ వెలమలతోటి యుద్ధాల్లోనే క్రీ శ. 1420 ప్రాంతంలో పెదకోమటి వేమారెడ్డి మరణించినాడు. క్రీ.శ. 1419 తర్వాత అతని శాసనాలు కన్పించవు.

పెదకోమటి వేమారెడ్డి మహావీరుడు, రాజనీతిధురుడు. కాని, నాటి ఆంధ్రదేశ రాజకీయ పరిస్థితులవల్ల రెడ్డిరాజ్య సమైక్యానికై అతని కృషి ఫలించలేదు. అతని యుద్ధాలవల్ల రాజ్యం బలహీనమై విచ్ఛిన్నం కాసాగింది. పెదకోమటి వేముడు సంగీత సాహిత్యాల్లో మహా పండితుడు, విద్యాపోషకుడు, వదాన్యుడు. సంస్కృత మహాకవియైన వామనభట్టబాణు డాతని ఆస్థానకవి. ఆంధ్రకవిసార్వభౌముడైన శ్రీనాథుడు విద్యాధికారి స్వయంగా కోమటివేముడు దృశ్య శ్రవ్య ప్రబంధనిర్మాణదక్షుడు. అతని సర్వజ్ఞచక్రవర్తి బిరుదం సార్థకం.

**రాచవేముడు (క్రీ.శ. 1420-24)**

కొండవీటి రెడ్డిరాజులలో చివరివాడు రాచవేముడు పెదకోమటి వేముని కుమారుడు. తండ్రి మరణానంతరం సింహాసనమెక్కి సుమారు ఐదు సంవత్సరాలు రాజ్యం చేసినాడు. రాచవేముడు సమర్థుడు కాడు. తన తల్లి సూరాంబిక నిర్మించిన సంతాన సాగరం అనే చెరువుకు జగనొబ్బగండ కాలువ నీతడు

తప్పించినట్లు అమీనాబాదు శాసనం వర్ణిస్తున్నది. రాచవేముడు రాజ్యానికివచ్చే నాటికి పరిస్థితులు విషమంగా ఉన్నాయి. రాజ్యానికి శత్రువు లెక్కువయినారు. సైనికబలం నీరసించింది, ధనాగారం వట్టిపోయింది. బహుశా ధనాగారాన్ని నింపే ఆశయంతో రాచవేముడు 'పురిటి సుంకం' వంటి పన్నులు విధించవలసి వచ్చింది. దానితో ప్రజాదరణ కోల్పోయినాడు. రాచవేముడు ప్రజాకంటకు డయినాడనీ చివరకు సవరం ఎల్లయ్య అనే బలిజ నాయకుడతణ్ణి వధించినాడనీ కొండవీటి కైఫీయత్‌వల్ల తెలుస్తున్నది. ఇంతటితో కొండవీటి రెడ్డిరాజవంశం అంతరించింది.

రాచవేముని కాలానికి విజయనగరాధీశులు రెడ్డిరాజ్య దక్షిణప్రాంతాలను ఆక్రమించినారు. మొదటి దేవరాయల శాసనం క్రీ.శ. 1420 నాటిది గుంటూరు తాలూకా పొత్తూరులో ఉంది. దీనికితోడు ఉత్తర దిక్కునుండి గజపతుల దురాక్రమణ ప్రారంభమయింది క్రీ.శ. 1424 ప్రాంతంలో లాంగూల గజపతి కొండవీడును ఆక్రమించి కోటకు మరమ్మత్తులు చేయించినట్లు కొండవీటి కైఫీయాత్ చెబుతున్నది. కాని, గజపతుల ఆక్రమణను బలపరిచే శాసనసాక్ష్యం లేదు. ఏమైనా, రాచవేముని మరణంతో కొండవీడు రాజ్యం విజయనగర, గజపతి రాజ్యాల వరమయిందనడంలో సందేహం లేదు.

## రాజమహేంద్రవర రెడ్డిరాజ్యం

రాజమహేంద్రవర రెడ్డి రాజ్య నిర్మాణానికి దారి తీసిన పరిస్థితులు పైన పేర్కొన్నాము. అంతకు మూడునాల్గుతరాలకు పూర్వమే-ముఖ్యంగా అనపోత, అనవేమారెడ్ల తూర్పుదిగ్విజయయాత్రల సందర్భంలో పాకనాటి రెడ్డి కుటుంబా లనేకం రాజమహేంద్రవర ప్రాంతంలో స్థిరపడినాయి. వీనిలోకాటారెడ్డి, పెదమాండిరెడ్డి కుటుంబాలు చాలా ముఖ్యమయినవి. పెదమాండిరెడ్డి దువ్వూరు వంశానికి చెందినవాడు తమ రాజ్యభద్రతకు, విస్తరణకు ఈ కుటుంబాల సహాయ సహకారాలు అవసమని కొండవీటిరెడ్డిరాజులు వీరితో బంధుత్వం చేసినారు. కాటారెడ్డి పౌత్రుడైన రెండోకాటారెడ్డికి ప్రోలయవేమారెడ్డి కూతురు దొడ్డాంబికతో పెండ్లి జరిగింది ఈ దంపతుల కుమారుడే కాటయ వేమారెడ్డి. ఈతడు మేనమామ అనవోతారెడ్డి కూతురు దొడ్డాంబికను పెండ్లాడినాడు. ఈమెకే అన్నెమాంబ అని కూడ పేరని కొందరి అభిప్రాయం. కాటయ వేమునకు దొడ్డమాంబగాక మరి కొందరు భార్యలున్నట్లు తెలుస్తుంది. కాటమ వేమునకు కాటయ, కుమారగిరి అనే కొడుకులు అనితల్లి అనే కూతురు ఉన్నారు. వీరిలో కుమారగిరి, అనితల్లి దొడ్డాంబిక సంతానం.

కాటయ వేము ఏర్పర్చిన వివాహ సంబంధాలను గురించి చరిత్రకారుల్లో వివాదాలున్నాయి. విజయనగరాధీశుడైన రెండో హరిహరరాయలతో కాటయ

వేముడు వియ్యమందినాడు. హరిహరుని కూతురి పేరు విజయలక్ష్మి అని తెలుస్తుంది. ఈమెను పెండ్లాడింది కాటయవేముని పెద్దకొడుకు కాటయ అని కొందరి వాదం. కాని, కొందరు చరిత్రకారులు కాటయ వేముని కుమారుడు కాటయను గుర్తింపరు.

పౌత్రీం కాటయవేమయక్షితిపతేః పుత్రీంచ కాటప్రభోః
దౌహిత్రీం చతురర్ణవీం హరిహరక్షోణిపతేః శాసితుః
తన్నామ్నా విదితాహ్వయాం హరిహరాంబాం దారమగ్రాహయ
త్పాణౌ వేమమహీశమల్ల నృపతి స్సామ్రాజ్యలక్ష్మ్యాసమమ్

అనే వేమవర (కోరుమల్లి) శాసనంలోని శ్లోకం మొదటి పాదాన్ని "పుత్రీం కాటయ వేమయక్షితిపతేః పౌత్రీంచ కాటప్రభోః అని సవరించి కాటయను కాటయ వేముని తండ్రి రెండో కాటారెడ్డిగా గుర్తిస్తున్నారు. సోమశేఖరశర్మగారు ఈ వాదాన్నే అంగీకరించినారు. కాని, ఈ సవరణ సమంజసమయినదిగా కన్పించదు.

ఇక పెరుమాండిరెడ్డి మనుమడైన అల్లాడరెడ్డి మహావీరుడు. చోడభీమ లింగని పుత్రిక వేమాంబికను పెండ్లాడినాడు. అతనికి వేమ, వీరభద్ర, దొడ్డ, అన్నారెడ్డి అనే కుమారులున్నారు. వేమారెడ్డి కాటయవేముని పౌత్రి, హరిహరుని దౌహిత్రి అయిన హరిహరాంబను పెండ్లాడినాడు. వీరభద్రారెడ్డి కాటయవేముని కూతురు అనితల్లిని పెండ్లిచేసుకున్నాడు మేనగోడలు, మేనత్తలను, అన్న దమ్ములు పెండ్లాడడం వింతగా కన్పించవచ్చును. కాని, నాటివి చాలవరకు రాజకీయ వివాహాలు; ఈ విధంగా కాటారెడ్డి దువ్వూరురెడ్ల కుటుంబాల మధ్యను, ఉభయులకు కొండవీటి రెడ్లతోను సన్నిహితసంబంధ బాంధవ్యాలేర్పడినాయి.

**కాటయవేముడు (1395 - 1414)**

రెండో అనవోతారెడ్డి మరణానంతరం కాటయవేముడు రాజమహేంద్ర వరానికి అధిపతికావడంతో రెడ్డిరాజ్యంలో కూమారగిరి, పెదకోమటివేములమధ్య అంతర్యుద్ధం ప్రాప్తించింది. రాజ్యభ్రష్టుడైన కుమారగిరిని రెండో హరిహరుని సహాయంతో కొండవీటి సింహాసనంపై పునరుద్ధరించడానికై కాటయ వేముడు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. రాజమహేంద్రవరం శత్రుపరివేష్టితమయింది. వెలమల సాయంతో అన్నదేవచోడుడు వేంగిలో కొన్ని ప్రాంతాలాక్రమించి కాటయ వేమునితో తలపడినాడు. వెలమలదాడుల నడకట్టడానికి కాటయవేముడు చేసిన ప్రయత్నాలు తెలియవు. చివరకు అన్నదేవ, కోమటివేముల కూటమితో కాకవర్తి యుద్ధంలో క్రీ. శ. 1414 ప్రాంతంలో గజరావుతిప్పన చేతిలో కాటయ వేముడు మరణించివుంటాడు.

కాటయవేముడు వీరాధివీరుడు. ఆతనివల్లనే రెడ్డిరాజ్యం విస్తరించడమేగాక గౌరవ ప్రతిష్ఠలు పెంచుకుంది. కాని, ఆతనివల్లనే అంతర్యుద్ధం సంభవించి, రాజ్య విధ్వంసనానికి దారితీసింది, కాటయవేముడు మహావిద్వాంసుడు; రచయిత.

## రెండో కుమారగిరి (క్రీ. శ. 1414 - 1416)

కాటయ వేముని మరణానంతరం అల్లాడరెడ్డి రంగంలో ప్రవేశించినాడు. అంతకు పూర్వమే కాటయ వేముని పెద్దకొడుకు కాటయ గతించినందున రెండో కొడుకు కుమారగిరిని అల్లాడరెడ్డి సింహాసనం ఎక్కించినాడు. రెండోకుమారగిరి పదేండ్ల బాలుడు. అందుచే అల్లాడరెడ్డియే సంరక్షకుడుగా రాజ్యవ్యవహారాలు నిర్వహిస్తూ రాజమహేంద్రవర రాజ్య స్వతంత్ర ప్రతిపత్తిని రక్షించడానికి శక్తి కొలది కృషి చేసినాడు. రాజమహేంద్రవర రాజ్యానికి గర్భశత్రువు అన్నదేవ చోడుడు. ఇతడు గోదావరీతీరం వెంబడి పట్టిసం, మోటిదీవులమధ్య ప్రాంతం ఆక్రమించి, వేంగి రాజ్యం సమస్తం స్వాధీనం చేసుకొనే యత్నంలో ఉన్నాడు. ఆతనికి పెదకోమటివేమ, ఫిరోజ్‌షాల సాయం ఉంది. కాటయ వేముని కుటుంబాన్ని బందీగా పట్టుకొని, శరణనగా అన్నదేవుడు విడిచిపెట్టినాడని ఆతని రాజమహేంద్రవరశాసనం చెబుతున్నది. కోనసీమలో చాలభాగం ఆతని వశమయింది. కాని ,ఆతడెంతోకాలం రాజ్యం చేయలేదు. క్రీ శ. 1414నాటి పలివెల శాసనంలో ద్రోహికులాన్ని తుదముట్టించి, కాటయవేమ వంశాన్ని పునరుద్ధరించినట్లు అల్లాడరెడ్డి చెప్పుకున్నాడు. అల్లాడరెడ్డి సేనానియైన నరహరినీడు తన పాలకొల్లు శాసనంలో (క్రీ. శ. 1416) అల్లాడరెడ్డి అధికారాన్ని ప్రతిష్ఠించినట్లు వర్ణించుకున్నాడు. క్రీ. శ. 1414 తర్వాత అన్నదేవుని శాసనాలు కన్పింపవు. క్రీ. శ. 1415 లో అల్లాడరెడ్డి, నరహరినీడులతోటి యుద్ధంలో అన్నదేవుడు మరణించినాడని చెప్పవచ్చు.

ఇంచుమించు ఇదే సమయానికి (క్రీ.శ. 1416) రెండో కుమారగిరి అకాలమృత్యువు పాలయినాడు. దానితో అల్లాడరెడ్డికి తీవ్రమయిన సమస్య లెదురయినాయి. రాజ్యానికి తన కోడలయిన అనితల్లి వారసురాలు. అందుచే వీరభద్రారెడ్డిని సింహాసనం ఎక్కించి, రాజ్యవ్యవహారాలు నిర్వహించసాగినాడు. కాని, రాజమహేంద్రవర రాజ్యానికి శత్రుప్రమాదం మితిమీరింది. గజపతులు, విజయనగరాధీశులు రాజమహేంద్రవరంపై దండెత్తినారని వారితో అల్లాడరెడ్డి మైత్రి చేసుకున్నాడని వేమవరం శాసనం చెబుతున్నది. ఇది జరిగిన వెంటనే ఫిరోజ్‌షా, పెదకోమటి వేములు రాజమహేంద్రవరాన్ని ముట్టడించినారు. అల్లాడరెడ్డి వారిని ఓడించి తరిమివేసినాడు. కాశీఖండం, శివలీలావిలాసం, వేమవరం శాసనం అల్లాడరెడ్డి ధారానగరధీశుడైన అలఫ్‌ఖాన్ నోడించి, ఆతని గుర్రాలను సంగ్రహించినట్లు వర్ణిస్తున్నాయి. బహుశా ఆతడు ఫిరోజ్‌షాకు సాయంగా వచ్చి

వుండవచ్చు. ఈ దాడిలో భాగంగానే రామేశ్వరయుద్ధంలో అల్లారెడ్డి పెదకోమటి వేము నోడించి, అతని సర్వస్వం హరించినాడు. ఈ విజయపరంపరలతో రాజమహేంద్రవర రాజ్యానికి తాత్కాలికంగా ప్రమాదం తప్పింది.

ఆ తరువాత అల్లాడరెడ్డి ఎంతోకాలం జీవించలేదు. పాలకొల్లు శాసనం ప్రకారం క్రీ.శ. 1420లో నారపనీడు (నరహరి) అల్లాడరెడ్డిపేర శివలింగం ప్రతిష్ఠించినాడు. మృతులైనవారిపేర లింగప్రతిష్ఠ జరపడం ప్రాచీన ఆచారం. కాబట్టి క్రి. శ. 1419-20లో అల్లాడరెడ్డి మరణించినట్లు స్పష్టం అవుతున్నది.

**మూడో కుమారగిరి, మూడో అనవోతారెడ్డి**

అల్లాడరెడ్డి మరణంతో రాజమహేంద్రవరంలో రాజకీయ విప్లవం జరిగింది. క్రి.శ. 1423 వరకు అనితల్లి-వీరభద్రుల శాసనాలు కన్పించవు. కాని, క్రీ.శ. 1422 నాటి కొమ్ముచిక్కాల శాసనాన్నిబట్టి అనవోతారెడ్డి రాజమహేంద్రవరాన్ని రాజధానిగా చేసుకున్నట్లు తెలుస్తుంది. ఈతడు అల్లాడరెడ్డి అన్నయైన అన్నవోలారెడ్డి కొడుకు. సోదరుడైన కుమారగిరితో కలిసి అనవోతారెడ్డి వేమ, వీరభద్రారెడ్లనుండి రాజమహేంద్రవరరాజ్యం ఆక్రమించినాడు.

క్రి శ. 1420లో లాంగూలగజపతి రాజమహేంద్రవరాన్ని ఆక్రమించినట్లు స్థానిక చరిత్రలు ఏకకంఠంగా చెబుతున్నాయి. ఇది రాజమహేంద్రవరంలో విప్లవం జరిగిన సమయమే. లాంగూల గజపతి గంగవంశం చివరి రాజులలోనివాడేగాని ఎవరో స్పష్టంగా చెప్పలేము. బహుశా ఈతని సాయంతోనే మూడో కుమారగిరి, మూడో అనవోతారెడ్డి రాజమహేంద్రవరాన్ని ఆక్రమించి వుంటారు.

దురాక్రమణదారు లెంతోకాలం రాజ్యం అనుభవించలేదు. ఈ సోదరుల్లో కుమారగిరి మరణించినాడు, ఈలోగా వేమ, వీరభద్రారెడ్లు కళింగాధీశులతో సమాధానం కుదుర్చుకున్నారు. అందుకు ప్రతిఫలంగా తమ రాజ్యంలో కొంత గజపతులకు దత్తం చేయవలసివచ్చింది. అనంతరం అనవోతారెడ్డిని పారదోలి వేమ, వీరభద్రారెడ్లు ఆక్రమించినారు.

**వీరభద్రారెడ్డి (క్రి. శ. 1423-48)**

వీరభద్రారెడ్డి సింహాసనం ఎక్కినాడు. కాని, రాజ్యనిర్వహణభారం వహించింది అన్నయైన వేమారెడ్డియే. శాసనాలు ఉభయులను రాజులుగానే వర్ణిస్తున్నాయి. కాని, ఈ సోదరులు ఎంతోకాలం స్వతంత్రంగా రాజ్యపాలన సాగించలేకపోయినారు. గజపతులు, విజయనగరాధీశులు, పద్మనాయకులు రాజమహేంద్రవరంపై దాడులు సాగించినారు. తీరాంధ్రంనుండి గజపతులను పారదోలి, అచట స్వీయాధికారం నెలకొల్పవలెనని రెండో దేవరాయల ఆశయం. క్రి.శ. 1424 నాటికే కొండవీటి రాజ్యంలో అధికభాగం విజయనగర రాజ్యంలో

లీనమయిందిగదా! రెండో దేవరాయలి సామంతుడైన తెలుంగురాయల శాసనం (క్రీ.శ. 1428) సింహాచలంలో వుంది. 'మతంగరాజసింధురవరకోటిమర్దన' అనీ, 'ఆంధ్ర నరేంద్ర సైన్య సాగర కలశోద్భవ' అనీ ముడబిదురె శాసనం (క్రీ. శ. 1410) రెండో దేవరాయలను వర్ణిస్తున్నది. మతంగరాజు గజపతి అని, ఆంధ్ర నరేంద్రుడు వీరభద్రారెడ్డి అని అనడంలో పొరబాటుండదు. దీన్నిబట్టి తీరాంధ్రం నుండి గజపతులను పారదోలి రాజమహేంద్రవర రెడ్డి రాజులను దేవరాయలు సామంతులుగా చేసుకున్నాడని తెలుస్తున్నది. అనంతరం సింహాచలం పర్యంతం రెడ్ల అధికారం చెల్లినట్లు సింహాచలంలోని వేమ వీరభద్రారెడ్డి శాసనాలు సూచిస్తున్నాయి.

రాజమహేంద్రవర అనంతరచరిత్ర స్పష్టంగా లేదు. క్రీ శ. 1434-35లో కళింగలో జరిగిన రాజకీయ విప్లవం రెడ్డి రాజ్యానికి మరింత ప్రమాదకరంగా పరిణమించింది. గంగవంశాన్ని తొలగించి సూర్యవంశజుడైన కపిలేశ్వరుడు కళింగ సింహాసనం ఆక్రమించినాడు. కపిలేశ్వరుడు గొప్ప వీరుడు, విజేత. రెడ్డి రాజ్యాన్ని ఆక్రమించదాని కాతడు సంకల్పించడంతో రాజమహేంద్రవరం రాయలకు గజపతికి కదనరంగమయింది. క్రీ.శ. 1414 ప్రాంతంలో గజపతి దండయాత్రను తిప్పికొట్టడానికి రెడ్డిరాజులకు సాయంగా దేవరాయలు తన సేనాని మల్లప ఒడయరును పంపివుంటాడు. దాక్షారామంలో వేమారెడ్డి అను మతితో మల్లప దానం చేసినాడు. గజపతి విజృంభణ తాత్కాలికంగా అణిగింది. కాని, క్రీ.శ. 1446 లో రెండోదేవరాయల అస్తమయంతో విజయనగర రాజ్య పరిస్థితులే అస్తవ్యస్తమయినాయి. ఇది అవకాశంగా కపిలేశ్వరుడు రెడ్డిరాజ్యంపై దండెత్తినాడు వెలుగోటివారి వంశావళిని బట్టి దేవరకొండలింగమనీడు వేమ వీరభద్రారెడ్ల నోడించి, రాజమహేంద్రవరాన్ని చూరగొన్నట్లు తెలుస్తుంది. బహుశా కపిలేశ్వర, లింగమనీడులు కలిసి రెడ్డిరాజ్యంపై దండెత్తి వుంటారు. క్రీ.శ. 1448 నాటి పెనుగొండ (తూర్పుగోదావరి) శాసనం గజపతిక్షోణిశుని పేర్కొంటున్నది. దీన్నిబట్టి క్రీ.శ. 1448 నాటికి రెడ్డిరాజ్యం అస్తమించి. రాజమహేంద్రవరం కపిలేశ్వరుని రాజ్యంలో లీనమయింది.

## కందుకూరి రెడ్డిరాజ్యం

బోయవిహార దేశాన్ని గురించిపై అధ్యాయంలో పేర్కొన్నాము ఇచటి బోయకొట్టాలపై కాపుదలగా కందుకూరును దుర్భేద్యమైన దుర్గంగా పంఢరంగడు రూపొందించినాడు గదా! ఈ ప్రాంతాలను మల్లారెడ్డి సాయంతో ప్రోలయవేముడు జయించి ఆక్రమించినాడు. మల్లారెడ్డి శాసనాలు క్రీ శ. 1324 నుండి ఇచట కన్పిస్తున్నాయి. మల్లారెడ్డి మహావీరుడు. అద్దంకి రాజ్యానికి సర్వ సైన్యాధ్యక్షుడు. మోటుపల్లిని జయించినాడు. అల్లావుద్దీన్ హసన్‌గంగూను

ధరణికోట దగ్గిర ఓడించి మరలించినాడు. ఇతణ్ణి బోయవిహార దేశంపై తన ప్రతినిధిగా ప్రోలయ వేముడు నియమించినాడు. కందుకూరు రాజధానిగా మల్లారెడ్డి, అతని సంతతి స్వతంత్రులై, ఒక శతాబ్దికాలం పాలించినారు.

మల్లారెడ్డి పౌత్రుడైన శ్రీగిరికాలంలో కందుకూరు రాజ్యం బలపడి విస్తరించింది. బహమనీసుల్తాన్ ఫిరోజ్‌షా విజయనగరంపై జరిపిన దాడిలో (క్రీ.శ. 1398) భాగంగా కందుకూరుపై దండెత్తినట్లును, శ్రీగిరి సోదరుడు మాచారెడ్డి తురుష్కుల నోడించి తరిమినట్లును తెలుస్తుంది. రెండో హరిహర రాయల మరణానంతరం విజయనగరంలో జరిగిన అంతఃకలహాన్ని పురస్కరించుకొని కందూరు రెడ్లు పొత్తపి, పులుగులనాడుల నాక్రమించుకున్నారు, శ్రీగిరి సంగీతసాహిత్య విశారదుడు; కళాభిమాని. వ్యవసాయాభివృద్ధికై అనేక తటాకాలు తవ్వించినాడు. ప్రౌఢదేవరాయ శ్రీగిరి శిష్యుడు. శ్రీగిరిరెడ్డి తరువాత అతని తమ్ముడు మాచారెడ్డి కొడుకు రెండో కోమటిరెడ్డి రాజయినాడు. కొండవీడులోని అంతఃకలహం అవకాశంగా తీసుకొని రెండో కోమటిరెడ్డి తీరాంధ్రం ఆక్రమించిన ట్లాతని పెదపూడి శాసనాన్నిబట్టి తెలుస్తున్నది. ఉదయగిరిసీమ సయితం ఈతని రాజ్యంలో చేరినట్లు లేపాకలోని రెడ్డిశాసనాలు సూచిస్తున్నాయి. కాని, కందుకూరురెడ్ల ప్రాబల్యం ఎంతో కాలం నిలువలేదు. తీరాంధ్రాన్ని పెదకోమటివేముడాక్రమించినాడు. అంతఃకలహంలో విజయం పొంది విజయనగర సింహాసనం ఎక్కిన దేవరాయలు నష్టపడిన రాజ్యభాగాలను జయించ నిశ్చయించినాడు. ఉదయగిరి ప్రాంతాలు అతని స్వాధీనమయినాయి. శ్రీగిరి కొడుకు మూడో కోమటిరెడ్డి కాలంలో కందుకూరు రెడ్లు విజయనగర సామంతులయినారు.

## యుగవిశేషాలు

**రాజకీయాలు**

రెడ్డి, నాయకయుగం చాలవరకు కాకతీయయుగానికి అనుబంధంగా కన్పిస్తుంది. అయితే, కాకతీయులు సాధించిన రాజకీయ ఐక్యం మాత్రం నశించింది. పశ్చిమోత్తర ఆంధ్రప్రాంతం క్రమంగా బహమనీరాజ్యంలో చేరగా, నేటి రాయలసీమలో అధికభాగం విజయనగరరాజ్యాంతర్భాగం అయింది. ఓరుగల్లులో ముసునూరు నాయకరాజ్యం, రాచకొండ దేవరకొండల్లో వెలమరాజ్యం, తీరాంధ్రంలో రెడ్డిరాజ్యాలు ఏర్పడినాయి. ప్రతి రాజ్యంలోను సంప్రదాయక పాలనా విధానమే అమలు జరిగింది. కాపయనాయకుడు, వెలమలు 'ఆంధ్రదేశాధీశ్వర', 'ఆంధ్రసురత్రాణ' బిరుదులు ధరించినారు. పెదకోమటి వేముని 'ఆంధ్రక్ష్మామండలాఖండలుడ'ని శ్రీనాథుని వర్ణించినాడు. ప్రధాని, సేనాపతి, పురోహితుడు రాజుకు సలహాయిచ్చి తోడ్పడేవారు. నాటి రాజనీతి గ్రంథాల్లోనివి ఆదర్శ పరిస్థితుల వర్ణనలుగా కన్పిస్తాయి. ప్రభుత్వ యంత్రాంగంలో యువరాజుకు

ప్రత్యేక స్థానం ఉండేది. కొడుకులు లేనప్పుడు తమ్ముని యువరాజుగా నియమిస్తుండేవారు. వైదిక ధర్మాన్ని రక్షించడం, వర్ణవ్యవస్థను కాపాడటం, హేమాద్రి సూచించిన దానాలు, వ్రతాలు చేయడం రాజులకు ఆదర్శాలు.

రాజ్యంలో 'సీమ' ముఖ్యమైన విభాగము. రెడ్డిరాజుల శాసనాల్లో గురజాల తంగెడ, నాగార్జునకొండ, బెల్లంకొండ మొదలైన సీమల పేర్లు కన్పిస్తాయి. సాధారణంగా సీమకు దుర్గం కేంద్రంగా ఉండేది. ప్రతి సీమలోను కొన్ని నాయంకారాలు వుండేవి. గ్రామం పాలనకు పునాది. గ్రామ వ్యవహారాలను పన్నిద్దరాయగాండ్రు చూచేవారు. వీరిలో రెడ్డి, కరణం, తలారి ముఖ్యులు, తలారినే 'అరెకుడు' అనేవారు. రాత్రులందు అవసరమైతే దివిటీలు పట్టుకుని అరెకులు కాపలా కాచేవారు.

న్యాయ నిర్వహణకు ధర్మాసనాలుండేవి ప్రత్యేక నేరాలను విచారించడానికి తాత్కాలిక ధర్మాసనాలు ఏర్పరచేవారు. మడ్డుపట్టుటవంటి దివ్యపరీక్షల ద్వారా నేర నిరూపణ జరిగేది. శిక్షలు చాల కఠినంగా ఉండేవి. శిత్తి వలిపించడం, అంగచ్ఛేదం, గానుగలో పెట్టి తిప్పడం, ఒంటిపై వెంటిచుట్టి నిప్పంటించడం, ఎండలో నిలబెట్టి పొగడదండలు వేయడం, వీపుపై గుండ్లు ఎత్తించడం, ముక్కుకు నీరెత్తడం, కొరత వేయడం మొదలైన శిక్షలు నాటి గ్రంథాలనుండి తెలుస్తున్నాయి. ఉరిశిక్షకు అర్హుడైన బ్రాహ్మణుని ముఖంపై కుక్కపాదం అచ్చొత్తి గాడిదమీద ఊరేగించి గ్రామంనుండి బహిష్కరించేవారు. దీనికంటే మరణ శిక్ష మేలు గదా!

ప్రజలపై పన్నుల భారం అధికమే. భూమిశిస్తు ప్రధానమైన రాజ్య ఆదాయ మార్గం. పంటలో ఆరోవంతు పన్నుగా వసూలు చేసినట్లు విలస శాసనంనుండి తెలుస్తుంది. రాచపూళ్ళను వ్యక్తులకు కవుళ్ళకు ఇచ్చేవారు. కవులును సాధారణంగా ధనరూపంలో చెల్లించేవారు. కవులు పైకం చెల్లించని రైతులను కఠినంగా శిక్షించేవారని శ్రీనాథుని చాటువువల్ల తెలుస్తున్నది. దేవబ్రాహ్మణ మాన్యాలపై పన్నుల మినహాయింపు ఉండేది. శాసనాలలో 'దశబంధమాన్యం' అనేమాట కనిపిస్తుంది. ఈ మాన్యాల ననుభవించేవారు నీటివనరుల మరమ్మతులు మొదలైన కార్యక్రమాలకు పంటలో పదోవంతు చెల్లించేవారు, 'వాణిజ్య సుంకాలు', వృత్తి ఈనాములు మొదలైన పన్నులు కాకతీయ యుగంలోవలెనే వుండేవి.

రాజ్యాల మధ్య పరస్పర యుద్ధాలు నాటి రాజకీయాల ప్రధాన లక్షణం. అందుచే ప్రతి రాజ్యం తన ఆదాయంలో ఎక్కువ భాగం సైన్య పోషణకు వెచ్చించేది. సైన్యంలో కాల్బలం, అశ్వబలం ప్రధానాంగాలు. యుద్ధాల్లో గిరి దుర్గాలు కీలకపాత్ర వహించినాయి. యుద్ధ నిర్వహణలో పైశాచిక క్రూరత్వం ప్రదర్శించేవారు. శత్రు సైన్యాలు నడిచే మార్గంలోని నీటినవరులలో విషం

కలవరడంవంటి దుర్మార్గాలను మడికి సింగన తన సకల నీతి సమ్మతంలో సూచించాడు. ఓడినవారి బొమ్మను డాకాలి అందెలోగాని తమ్మపడగలోగాని అమర్చి అవమానించేవారు. 'రణము కుడుపు' అనే ఆచారం సర్వసాధారణ మయింది. మృతులైనవారి రక్తమాంసాలతో బియ్యం కలిపి వండిన వంటకాన్ని రణదేవతలకు, భూత ప్రేతపిశాచాలకు నివేదన చేయడమే 'రణము కుడుపు.' ఈ యుద్ధాలవల్ల ప్రజలు పడిన బాధలు చెప్పడం సాధ్యంకాదు. నాటి రాజులు బ్రాహ్మణమతాలను, కాకతీయయుగంలో నెలకొన్న సాంస్కృతిక సంప్రదాయా లను పోషించినారనడంలో అనుమానం లేదు; కాని, తమ అంతఃకలహాలవల్ల బహమనీ రాజ్యం విస్తరించి, హిందూమత సంస్కృతులకు ప్రమాదం వాటిల్ల గలదనే దూరదృష్టి వారిలో లోపించింది. అంతేగాదు, బహమనీలసాయంతో- ముఖ్యంగా రెడ్డి, వెలమలు పరస్పరం ప్రతీకారం తీసుకోడానికి ప్రయత్నించి నారు. దీన్నిబట్టి స్వీయ రాజకీయ శ్రేయస్సులకు మత సంస్కృతుల శ్రేయస్సు లను బలిచేసినారని చెప్పవచ్చును. ఈ పరిస్థితులవల్లనే బహుశా నాటి రాజులపట్ల ప్రజలకు అభిమానం తగ్గింది. పురిటిసుంకం విధించినందుకు రాచవేమారెడ్డిని వధించారు. పోతన "ఇమ్మనుజేశ్వరాధములు" అనగా "రాజుల్‌మత్తులు వారి సేవ నరకప్రాయంబు" అని ధూర్జటి నిరసించినాడు.

**ఆర్థిక పరిస్థితులు**

రెడ్డి నాయక యుగ రాజకీయ వాతావరణాన్నిబట్టి కాకతీయుల నాటి ఆర్థికాభ్యున్నతికి నష్టంవాటిల్లెననడంలో సందేహం లేదు. వృత్తి సంఘాల, సమయాల, సంతల ప్రసక్తులీ యుగంలో ఎక్కువ కన్పించవు. వ్యవసాయం ప్రధానము, గౌరవప్రదమునైన పరిశ్రమ అయింది. శూద్రుల్లో అధిక సంఖ్యాకులే గాక రాజాస్థాన జీవితంతో విసుగెత్తిన బ్రాహ్మణులు సయితం వ్యవసాయాన్ని ఆశ్రయించసాగినారు. చెరువులు. కోళ్ళు, బావులు, నూతులు, నీటిపారుదల సౌకర్యాలు. కొండవీటి రెడ్డి రాజులు సంతాన సాగర తటాకాన్ని, జగనొబ్బ గండ కాలువను తవ్వించినారు. వెలమలు అనపోతుసముద్రం, రాయసముద్రం, నాగసముద్రం మొదలైన తటాకాలు నిర్మించినారు ఏతాము, రాట్నములద్వారా పొలాలకు నీటిపారుదల గావించేవారు. మెట్ట ప్రాంతాల్లో ప్రజలు మంచినీటికి సయితం ఇబ్బందిపడేవారు అనడానికి "పరమేశా! గంగ విడువు పార్వతిచాలున్" అన్న శ్రీనాథుని దీనాలాపమే నిదర్శనం.

పంటల్లో వరి, జొన్న, సజ్జ, చెరకు, నువ్వులు, పత్తి ముఖ్యమైనవి. కలమశాలి, సీరాముఖి, పతంగ, హాయన మొదలుగా వరిలో పలు రకాలను నాటి గ్రంథాలు పేర్కొంటున్నాయి. అయినా, జొన్నలే ప్రధాన ఆహార ధాన్యం. పల్నాడు, రేనాడులలో వరి అన్నం అరుదు. పల్నాడులో 'కుసుమాస్త్రి'దైన

జొన్నకూడే' తింటాడట. 'మిరమిర రేనాటి జొన్న మెతుకులు తినుమీ' అని శ్రీనాథుడు శివుని మీద సవాలు చేస్తాడు. జొన్న తర్వాత చెప్పదగిన ఆహార ధాన్యం సజ్జ. వరి డెల్టా ప్రాంతంలో ముఖ్యంగా ధనికుల ఆహారధాన్యంగానే పరిమితమయింది. పలుప్రాంతాల్లో అరటి, ద్రాక్ష, కొబ్బరి, ఆకుతోటలు పెంచేవారు.

నాటి పరిశ్రమల్లో అగ్రస్థానం వస్త్రపరిశ్రమది. ముఖ్యంగా పలనాడు, వినుకొండ సీమలు ఈ పరిశ్రమకు పెట్టిందిపేరు. ప్రతి ఇంటిలో స్త్రీలు రాట్నం వడికేవారు. పల్నాడులో "రంభయైన ఏకులు వడకున్" అని శ్రీనాథుని చాటువు. 'కదురు కవ్వం ఆడిన ఇంట్లో కరువుండద'నే సామెత ప్రసిద్ధం. వస్త్రపరిశ్రమకు అనుబంధంగా రంగులపరిశ్రమ సాగింది. బహుశా ప్రతి గ్రామంలోనూ నీలిమందు తయారుచేసేవారు. సింహాసన ద్వాత్రింశిక పలురకాల పట్టుబట్టలను పేర్కొంటున్నది. వీనిని బహుశా దిగుమతి చేసుకొనేవారు

వాఙ్మయంలో పలు పరిశ్రమల ప్రసక్తి కన్పిస్తుంది. పంచాణంవారు 'పంచలోహం'తో కొలువుచవికెలు, గజఘంటలు, జయస్తంభాలు, దీపస్తంభాలు, ఆయుధాలు తయారుచేసేవారు. "వయ్యందిగాచి కమ్మరి చయ్యన బదనిచ్చు నుక్కుచక్రముమాడ్కిన్" అనే పద్యాన్నిబట్టి ఉక్కుతయారీలో సైతం కమ్మర్లు సిద్ధహస్తులయినట్లు తెలుస్తుంది. నిర్మల్ ఉక్కుకత్తులు దేశాంతరాల్లో కూడ ప్రసిద్ధిచెందినాయి. గాజురెక్కల తలుపులు, అద్దాలుకూడ గ్రంథాల్లో కన్పిస్తాయి. గాజు బహుశా దిగుమతి అయ్యేది. శ్రీనాథుడు కాగితాన్ని పేర్కొన్నాడు. కాగితాన్ని ముస్లిములు దేశంలో ప్రవేశపెట్టివుంటారు. కాగితం తయారుచేయడం స్థానికులు నేర్చుకున్నట్లు కన్పించదు.

దేశీయ, విదేశీయవాణిజ్యం వైశ్య, తెలిక, బలిజ కులాలు నిర్వహించేవి. దేశీయ వాణిజ్యానికి ముఖ్యంగా రాజధాని నగరాలు, పుణ్యక్షేత్రాలు, కేంద్రాలు. సంతలు, జాతరలు, వసంతోత్సవాల సమయాల్లో క్రయ విక్రయా లెక్కువగా జరిగేవి. విదేశ వాణిజ్యానికి మోటుపల్లి కేంద్రంగా కొనసాగింది. 'సప్తద్వీప సద్వస్తుసంభారం' మోటుపల్లి రేవుద్వారా దిగుమతి అయ్యేది. అందుచేతనే మోటుపల్లికై రెడ్డి - విజయనగర రాజులమధ్య తీవ్రసంఘర్షణ జరిగింది. మోటుపల్లిలో అనవోతారెడ్డి వర్తకులకు అభయమిస్తూ శాసనం వేయించినాడు. విదేశ వాణిజ్యంద్వారా అవచి తిప్పయ కుటుంబం విశేషధనమార్జించి, తద్వారా రాజకీయ ప్రాబల్యం వహించింది. శ్రీనాథుని హరవిలాసాన్నిబట్టి జాఫ్నా, సింహళం సుమత్రా, మలయా, ఇండోచైనా, భోటాన్ ఆర్మజ్ మొదలైన దూరదేశాలనుంచి చీనాంబరాలు, చందనాగరుకర్పూరహిమాంబు మొదలైన పూరములవంటి విలాస వస్తువులు దిగుమతి అవుతుండేవి అని తెలుస్తుంది. నౌకల్లో కప్పలి, జోంగు,

వల్లి, వలికా, మొదలైన రకాలున్నట్లు హరవిలాసము నుండి తెలుస్తుంది. వీనిని దేశంలోని రేవు పట్టణాల్లోనే నిర్మించేవారు. జోంగు బహుశా చైనావారి నౌక.

**మతం :**

ముస్లిం అధికార దౌర్జన్యాలపై తిరుగుబాటుఫలితంగాయేర్పడ్డ రెడ్డినాయక రాజ్యాలు హిందూమతసంస్కృతుల రక్షణకు పూనుకొనడం సహజం. ముస్లిం దాడులలో నష్టపడిన బ్రాహ్మణ అగ్రహార పునరుద్ధరణలతో నీయుగం ప్రారంభ మయింది. అందుచే కాకతీయుల కాలంలో పురోగమిస్తున్న సమన్వయస్మార్త మతవిధానానికి ప్రోత్సాహం లభించింది. ప్రోలయ వేమారెడ్డి శైవుడయినను వైష్ణవాన్ని ఆదరించినాడు. 'అనవరత పురోహిత కృతసోమపాన' అని ఆతని బిరుదు. "అగ్రహారముల విద్యాతపోవృద్ధ విప్రులకిచ్చి, యజ్ఞకర్తలుగ" నిలిపి నాడని అతణ్ణి ఎర్రాప్రగడ వర్ణించినాడు. అయితే, కేవలం వైదిక క్రతువు లెక్కువగా జరిగినాయనడానికి నిదర్శనలు లేవు. స్మార్తవిధానం కూడ అగ్ర వర్ణాలకు మాత్రమే పరిమితం. వాస్తవానికి అది యావద్భారత దేశంలో ఇస్లాం మతప్రభావఫలితంగా భక్తిఉద్యమాలు బయలుదేరినయుగం. అంధవిశ్వాసాలను, మూఢాచారాలను తొలగించి మతాన్ని ప్రక్షాళనం చేస్తూ నిరాడంబరంగా, నిర్మలహృదయంతో, ఏకాగ్రచిత్తంతో చేసే ధ్యానంద్వారా' భగవత్సాన్నిధ్యాన్ని చేరవచ్చునని భక్తిమతాలు బోధించినాయి సాంఘికంగా వర్ణవ్యత్యాసాలను నిరసించినాయి. బసవేశ్వరుని వీరశైవంలోనయితం ఇస్లాంబోధనల ప్రభావం కన్పిస్తుంది. ఆంధ్రదేశంలో ఈ లక్షణాలున్న భక్తి ఉద్యమం రాలేదు. కాని, భక్తి కేంద్రమయిన శైవ, శాక్తేయ, వైష్ణవాలు ఆదరణ పొందినాయి. ముసునూరు, రెడ్డి, నాయకరాజుల్లో మొదటివారు శైవమతాభిమానులు. రెడ్డి, పద్మనాయక రాజులు చివర్లో వైష్ణవాన్ని అభిమానించినారు.

శైవంలో తీవ్రవాదశైవానికి ఆదరణ హెచ్చింది. శివుని ఉగ్రమూర్తులైన భైరవ, మైలారులను అర్చించేవారు. పద్మనాయకులు అనేక భైరవప్రతిష్ఠలు చేసినారు. 'రణము కుడుపు' ఆచారం భైరవారాధానఫలితమని చెప్పవచ్చు. వామాచారసంబంధమైన తాంత్రికపూజావిధానంద్వారా మానవాతీతములయిన అష్టసిద్ధులు సాధించవచ్చుననే విశ్వాసం బలంగా ఉండేది. సిద్ధులు సాధించిన మత్స్యేంద్రనాథాది నవనాథుల చరిత్రలను ప్రజలు పురాణాలుగా చెప్పుకొనేవారు. కాలుచేతులు, చివరకు తలలు నరుక్కోవడం, నాల్కలు కత్తిరించుకోవడం, కండలుకోసి అర్పించడం, ఒళ్ళంతా నారసాలు గుచ్చి దీపాలు వెలిగించడం వంటి క్రూరకృత్యాలు ఎక్కువగా సాగినాయి. నాటి కావ్యాల్లో చంపుడు గుడుల ప్రసక్తి ఎక్కువగా కన్పిస్తుంది. అనవేమారెడ్డి శ్రీశైలంలో వీరశిరోమండపం నిర్మించినాడు. దైవం పేర ఆత్మార్పణ చేసినవారి గౌరవార్థం వారి ప్రతిమలున్న

శిలలు (వీరకల్) నిల్పేవారు. భృగుపాతం అంటే కొండ శిఖరం నుండి దూకి మరణించటం ద్వారా మోక్ష సిద్ధి లభిస్తుందని కొందరి విశ్వాసం. దీనిని కర్మ హారి (కనుమారి) అనేవారు. శ్రీశైలంలో భృగుపాతం జరిపేవారని పండితా రాధ్య చరిత్ర పేర్కొంటున్నది. ఈ ఆచారాలనుబట్టి నాడు ప్రజల్లో జీవితం పట్ల విరక్తి పెరిగినట్లు కన్పిస్తుంది. అందుకు నాటి రాజకీయఅవ్యవస్థ, ఆర్థిక బాధలు కారణాలని చెప్పవచ్చు.

నాడు శైవం ప్రచారం చేసిన గురు వంశాల్లో ఘోడెరాయవంశం ప్రసిద్ధ మయింది. త్రిపురాంతకం వీరి ప్రధాన కేంద్రంవలె కన్పిస్తుంది. కొండవీడు, రాజమహేంద్రవరం, కందుకూరు రెడ్డిరాజులు ఘోడెరాయాచార్యుల శిష్యులు. శ్రీనాథ కవిసయితం "ఘోడెరాయాంక సద్గురు వీర మహేశ్వరస్వామి పద సమారాధనం" చేసినానని చెప్పుకున్నాడు.

దుర్గ, కాళి, భద్రకాళి, చండి మొదలైన పేర్లతో శక్తిని ఆరాధించేవారు. ప్రతి గ్రామానికి గ్రామదేవత యేర్పడింది. రెడ్డిరాజులకు 'మూలగూరమ్మ' కులదేవత, వేమభూపాలచరిత్రలో వామనభట్టబాణుడు వింధ్యవాసినీ పూజను కండ్లకు గట్టినట్లు వర్ణిస్తాడు. శక్తిపూజలో మద్య మాంసాలు విశృంఖలంగా వాడేవారు. గ్రామదేవతల కొలుపుల్లో జంతుబలులు సర్వసాధారణం.

శైవం ప్రాబల్యం వహించినప్పటికీ కొన్ని వర్గాలలో కాకతీయయుగం నుండి వైష్ణవం ప్రచారమయింది. నెల్లూరు, బాపట్ల, మాచర్ల, తిరుపతి, శ్రీకాకుళం, అహోబలం, సర్పవరం, సింహాచలం, శ్రీకూర్మం వైష్ణవక్షేత్రాలై భక్తుల నాకర్షించాయి. రెడ్డిరాజులు శ్రీశైలంతోబాటు అహోబలం, సింహాచలాలకు దానధర్మాలు చేసినారు. కుమారగిరి, కాటయ వేములు వైష్ణవ మతాభిమానులు. దక్షిణదేశంనుండి తిరుమల, కందాడ, భట్టార వైష్ణవ కుటుంబాలు దేశంలో సంచరిస్తూ వైష్ణవం ప్రచారం చేసినారు. భట్టరుకుటుంబం శ్రీరంగక్షేత్రవాసులు. రామానుజుని అనంతరం శ్రీరంగంలో గురుపీఠం అలంకరించిన పరాశరభట్టుసంతతివాడును శ్రీరంగవర్ధన నామాంతరుడునైన పెద్ద పరాశరభట్టు కోరుకొండ ముమ్మడి నాయకుని గురువు. శ్రీరంగవర్ధనుడు కోరుకొండలోనే మరణించినట్లును, అతని ఆదేశం మీదనే ముమ్మడినాయకుడు కోరుకొండపై నరసింహాలయం నిర్మించినట్లు తెలుస్తున్నది.

పద్మనాయకుల్లో చివరివారు సయితం వైష్ణవం స్వీకరించినారు."గురుపరం పరా ప్రభావ" అనే వైష్ణవ సాంప్రదాయగ్రంథాన్ని బట్టి వేదాంతదేశికుని కొడుకు వరదాచార్య నామాంతరుడైన నైనాచార్యులు సర్వజ్ఞ సింగమనీని ఆస్థానంలో వైష్ణవమతం స్థాపించినాడు. సింగమనీని కోరికపై వేదాంతదేశికుడు 'సుభాషితనీవి', తత్త్వసందేశ, 'రహస్య సందేశ' గ్రంథాలు రచించి పంపినాడు.

అయితే, సర్వజ్ఞ సింగమలిద్దరిలో జైనాచార్యుని శిష్యుడెవరో నిర్ణయించడం సాధ్యం కాదు.

వైష్ణవంలోకూడ క్రమంగా శాఖ లేర్పడినాయి. వైఖానసులు తమది వైదిక సంప్రదాయం అంటారు రామానుజాచార్యులను పెద్దగా గౌరవించరు. అయితే. వైఖానసం అగ్రవర్ణాలకు మాత్రమే పరిమితం. ప్రాచీన వైష్ణవాచార్యులైన ఆళ్వారుల బోధనలు తమిళంలో వున్నాయి. వాని సంకలనం నాల్గాయిర ప్రబంధం'గా ప్రఖ్యాతి చెందింది నాథముని,యామునాచార్యులు తమిళ వైష్ణవాన్ని సంస్కృతీకరించే ప్రయత్నం చేశారు.ప్రస్థానత్రయానికి సంస్కృతంలో భాష్యం వ్రాసి ప్రబంధవైష్ణవానికి వైదిక విధానానికి సమన్వయంగా రామానుజాచార్యులు శ్రీవైష్ణవాన్ని రూపొందించినాడు. క్రింది వర్ణాలలో వైష్ణవాన్ని ప్రచారం చేసి వారిలో చైతన్యం కలిగించడానికి రామానుజుడు ప్రయత్నించాడు. కొన్ని దేవాలయాల్లో పంచమప్రవేశానికి అనుమతించాడు. రామానుజుని అనంతరం అనతి కాలానికే శ్రీవైష్ణవం తెంగల, వడగళ శాఖలుగా చీలిపోయింది. తెంగలశాఖ వారు తమిళప్రబంధ సంప్రదాయాన్ని అనుసరించే ఉదారవాదులు. వడగళశాఖకు వేదాంతదేశికుడు నాయకుడు. వీరిది సంస్కృత సంప్రదాయం; వైష్ణవంలో కేవలం వైదిక పద్ధతిని పునరుద్ధరించడం వీరి ఆశయం. వైష్ణవాన్ని సంస్కృతీకరించడానికి రామానుజుడు ప్రారంభించిన ఉద్యమానికి వడగళశాఖ పరాకాష్ట అనవచ్చునేమో! ఆంధ్రదేశంలో వడగళ సంప్రదాయం ప్రచారం కావడం గమనించదగివుంది. అందుకు కారణం మాధవాచార్య విద్యారణ్యుల నాయకత్వంలో విజయనగర పోషణలో జరుగుతున్న వైదిక సంప్రదాయ పునరుద్ధరణోద్యమ ప్రభావం అయి ఉంటుంది వడగళశాఖవారు అహోబలంలో తమ మఠం నెలకొల్పి, తమ సిద్ధాంతాల ప్రచారానికి పూనుకున్నారు.

శైవ వైష్ణవాలమధ్య, భిన్నసాంప్రదాయాల మధ్య వివాదాలు జరుగుతుండేవి. పద్మనాయకుల ఆస్థానంలో శాకల్య మల్లుభట్టుకు పరాశరభట్టుకు వివాదం జరిగింది. విద్యారణ్యునకు ద్వైతపీఠాధిపతియైన అక్షోభ్యతీర్థులకు వివాదం జరిగిందని వైష్ణవ సంప్రదాయ గ్రంథాలు చాటుతున్నాయి. నాచన సోముడు "పరిహాసాస్పదవాదమోదమదిరాపానంబునన్ మత్తులై హరిమేలంచు హరుండు మేలనుచు" ఉంటారని విచారిస్తాడు. ఈ దేవతలకు తోడు అనేక చిల్లరదేవుళ్ళను ఆరాధించేవారు. ఇంటింటికీ ఊరూరా దేవతలు వెలసినారు. "చిన్న చిన్న రాళ్ళు చిల్లర దేవుళ్ళు" అంటాడు శ్రీనాథుడు. సామాజిక మత కార్యక్రమాలకు ఆలయం కేంద్రం. ఆలయ నిర్మాణం విరివిగా జరిగింది. కాని, ఈ యుగ ఆలయాలు పరిమాణంలో చిన్నవి, శిల్పంలో నిరాడంబరమయినవి. ఆలయాల్లో అనేక ఉత్సవాలు జరిగేవి. కొలుపులు, జాతర్లు, తిరునాళ్ళు. నిర్వ

హించేవారు. వీనితో సమాజంలోని అన్ని వర్ణాలవారు పాల్గొనేవారు. పెద్ద పెద్ద ఆలయాల్లో మఠాలుండేవి శ్రీశైలంలో గంటామఠం, విభూతిమఠం, కలుమఠం, భిక్షావృత్తి మఠం మొదలైనవి ఉండేవి. ఆయా మత విద్యలకు మఠాలు కేంద్రాలుగా ఉండేవి. భిక్షావృత్తిమఠం గౌరన, శ్రీనాథకవులను ఆదరించింది.

**సమాజము**

భక్తి ప్రధానమైన హిందూమతం రూపొంది సమాజానికి ఐక్యం చేకూర్చ డానికి ప్రయత్నించింది. కాని, వర్ణవిభేదాలు ఆ ఐక్యానికి అటంకమయినాయి. నానాటికి వర్ణాల సంఖ్యకూడ పెరిగింది. బ్రాహ్మణుల గౌరవ ప్రతిపత్తులు కొన సాగినాయి. అయితే,వైదికకర్మలే ప్రధానవృత్తిగావున్న బ్రాహ్మణవర్గం ఎప్పుడో అంతర్ధానమయింది. బ్రాహ్మణుల్లో కొందరు రాజోద్యోగాల్లో నియుక్తులైనారు. వైదిక నియోగి విభేదాలు ఈ కాలంలో బలపడివుంటాయి. వైదికుల్లో కొందరు పదక్రమజటఘన పద్ధతులపై వేదాల నభ్యసించి అధ్యాపన జరిపేవారు. మరి కొందరు తర్క, వ్యాకరణ, జ్యోతిష, గణిత, వైద్యాదిశాస్త్రాలలో కృషి చేసే వారు. ఈ విద్యలన్నింటికి అగ్రహారాలు కేంద్రాలు. బ్రాహ్మణుల్లో కొందరు వ్యవసాయవృత్తి నవలంబించినారు. ఉదరపోషణకై ధనార్జనకై నీచవృత్తుల నవలంబించిన బ్రాహ్మణులుకూడ లేకపోలేదు. క్షత్రియులు గత యుగంలోనే నామమాత్రులయినారు. శూద్రులలో రెడ్డి, వెలమ, కమ్మకులాలేర్పడి, రాజకీయాధి కారం వారి హస్తగతమయింది. వీరిలో చెలరేగిన వైషమ్యాలు, కలహాలు ఆంధ్ర జాతి పరాధీనతకు దారి తీసినాయి. సామాన్య శూద్ర కుటుంబాలు వ్యవసాయం మొదలైన వృత్తుల నవలంబించినారు. వైశ్యులకు వ్యాపార వాణిజ్యాలు ముఖ్య వృత్తులు. విదేశ వాణిజ్యంద్వారా కోటికి పడగెత్తిన వైశ్యులు పెనుగొండ, కొండ వీడు, వినుకొండలలో ఉండేవారు. వారిలో కొండవీటికి చెందిన అవచి కుటుంబం ఎన్నదగింది. ధనిక వైశ్య కుటుంబాలు సాహిత్యాన్ని, నాట్య సంగీతాలను పోషించేవారు.

రాజస్థానాలు, అగ్రహారాలు విద్యాకేంద్రాలుగావున్నా పల్లెల్లో అజ్ఞానం తాండవించింది. విద్య బ్రాహ్మణ, ప్రభువర్గాలకు మాత్రం పరిమితమని చెప్పవచ్చు. కాని, వైష్ణవ ప్రచారంవల్ల కింది వర్ణాలలో విద్యలపట్ల ఆసక్తి కలుగసాగింది. శకునాల్లో నమ్మకం ఎక్కువ. 'పంచాంగా'న్ని సంప్రదించనిదే ఏ పనీ చేసేవారుకాదు. జూదం సర్వసాధారణ వినోదం అయింది. ప్రజల్లో ధనార్జనాసక్తి ఎక్కువగా కన్పిస్తుంది. స్పర్శవేది సాధించడానికి ఎంతో తాపత్రయపడేవారు. బహుశా ఇది ప్రజలు నాడనుభవించిన దారిద్ర్యానికి తార్కాణంగా చెప్పవచ్చు. పత్రాలపై వడ్డీకిచ్చే ఆచారం ప్రబలింది. బ్రాహ్మ ణులుకూడ వడ్డీ వ్యాపారం చేసేవారు. మాసవడ్డీ, చక్రవడ్డీ వసూలుచేసేవారు.

వడ్డీ వ్యాపారాలు చేసే మోసాలు నాటి కావ్యాలనుండి తెలుస్తుంది. 'సమయ నిరాకరణం' ఎక్కువయింది. వర్తకంలో మాయోపాయాలద్వారా వైశ్యులు ప్రజాభిమానం కోల్పోయినారనడానికి "కోమటికొక్కటిచ్చి పదిగొన్నను దోసము లేదు" అనే చాటువు నిదర్శనం. ఒక వైశ్యునితో విసిగిన ప్రభువు "ఓరీ కోమటి ముక్కున సీరెత్తుడు" అని ఆరోపించినాడు. ప్రభువులు మొదలు పేదలవరకు శృంగార ప్రీతి ఎక్కువయింది. శిష్టాచార సంపన్నులయిన బ్రాహ్మణుల్లోకూడ వేశ్యాలంపటత్వం మితిమీరినట్లు 'శివరాత్రి మాహాత్మ్యం'వంటి గ్రంథాలు సాక్ష్యం. జాతరల్లో, తిరునాళ్ళల్లో యువతీయువకులు విశృంఖలంగా విహరించేవారు. సమాజంమీద మత ప్రభావం ఎంత ప్రబలంగా ఉన్నా ప్రజల్లో నైతిక విలువల పట్ల శ్రద్ధాసక్తులు మృగ్యమయినాయి.

**విద్యలు - సారస్వతం**

విద్యలను సారస్వతాన్ని ఆదరించడంలో రెడ్డినాయకరాజులు కాకతీయుల వారసుల మనిపించుకొన్నారు. నాటి ప్రభువుల్లో చాలామంది మహా పండితులు, కవులు. ముఖ్యంగా రెడ్డిరాజులు, పద్మనాయకులు పాండిత్యంలో, సాహిత్య పోషణలో పోటీ పడినారా అనిపిస్తుంది. వేదాంగాలు, పురాణేతిహాసాలు, కావ్య నాటకాలంకార శాస్త్రాలు, రాజనీతిధర్మశాస్త్రాలు, అశ్వశాస్త్రం, సామజశిక్ష, శస్త్రధారణాది విద్యలు, భరత, సంగీత కామశాస్త్రాలు ప్రభువులు అభ్యసిస్తూ ఉన్నట్లు తెలుస్తుంది. సింగభూపాలుడు, పెదకోమటి వేముడు సర్వజ్ఞబిరుదం ధరించినారు. ఈ విద్యలకు కేంద్రాలయిన అగ్రహారాలను, దేవాలయ మఠాలను రాజులు పోషించినారు. విలస శాసనాన్నిబట్టి విప్రులు జ్యోతిషం, షడ్దర్శనాలు, శబ్దమీమాంస శాస్త్రాలు, సంగీత సాహిత్యాలు, ధర్మశాస్త్రం, ఆయుర్వేదం మొదలైన విద్యల్లో పరిశ్రమచేస్తున్నట్లు తెలుస్తుంది.

సంస్కృతాంధ్రాల్లోనేగాక అనేక భాషల్లో పాండిత్యం సంపాదించడానికి ప్రయత్నించేవారు. రెడ్డిరాజుల ఆస్థానంలో విద్యాధికారియైన శ్రీనాథుడు బహు దేశబుధులతో భాషించినాడట. బహుశా సంస్కృతమే రాజభాష అయి వుంటుంది. కానీ, నాటి కవులలో అష్టభాషల్లో కవిత్వం చెప్పడం గొప్పగా భావించేవారు. రాజాస్థాన ఉద్యోగాలు లక్ష్యంగా ఉన్నా వారు అరబీ పారశీక భాషాదులు సయితం అభ్యసించేవారు. పెక్కు లిపులు నేర్చుకొని, అందంగా వ్రాయడంలో శిక్షణ పొందేవారు. దేశంలో అరబీ, పారశీక, భాషాపాఠశాల లేర్పడి వుంటాయి. ఈ భాషలు నేర్చుకోవడంపై సాంఘిక నిబంధనలు లేవు; ఎవరైనా అభ్యసించవచ్చు.

వివిధ విద్యలతోబాటు లలితకళల్లో సయితం విశేష పరిశ్రమ జరిగింది. సంగీత నాట్యశాస్త్రాలపై పెక్కు గ్రంథాలు వెలువడినాయి. సింగభూపాలుడు,

అనవేముడు, కుమారగిరి, పెదకోమటి వేముడు వసంతోత్సవాలు జరిపి, దూర ప్రాంతాలనుండి సయితం నటులను, గాయకులను ఆహ్వానించేవారు. విద్యా పరీక్షలు జరిపి, అర్హతనుబట్టి ఆదరించేవారు. కుమారగిరిని కాటయ వేముడు "నిత్యంనందతిన రత్నైరభినయైః కాంతైర్వసంతోత్సవైః సంతానాభ్యుదయైః కుమారగిరిభూపాలో నృపాలోత్తమః" అన్న వర్ణనలో అసత్యం లేదు. భరత శాస్త్రంలో ప్రావీణ్యం వహించిన లకుమాదేవి కుమారగిరి మన్ననకు పాత్రురాలయింది. నాట్యంలో కొత్తపద్ధతు లనేకం బయలుదేరినాయి. మార్గరీతియైన భరతనాట్యమేగాక గొండ్లి, జక్కిణి, పేరణి, బిందు అనే దేశీరీతులు పారశీక మత్తల్లి అనే విదేశరీతులు ప్రచారంలో వుండేవి. వాయిద్యాల్లో భేరీ, జయఘంట, వల్లకి, చక్కి, కాహళము, వంశము, ఢక్క, హుడుక్క, ఝర్ఝరి, ఝల్లరి మొదలైనవానిని నాటి వాఙ్మయం పేర్కొంటున్నది. వీణల్లో పలురకాలున్నట్లు తెలుస్తుంది. నాటక కళకూడ చాల అభివృద్ధి చెందింది. వసంతోత్సవాలలో రథోత్సవాలలో ముఖ్యంగా నాటకాలాడేవారు. నాటకాలాడడానికి ప్రత్యేకశాలలుండేవి. 'ప్రమథ పురాతన పటుచరిత్రలు', 'అతనుగీతలు' నాటక వస్తువులు. నటులు సంఘాలుగా నేర్పడి దేశసంచారం చేస్తుండేవారు.

**సంస్కృతం :**

రెడ్డి పద్మనాయక ఆస్థానాల్లో సంస్కృత భాషకు విశేష ఆదరణ లభించింది. సంస్కృతకవులు ఆస్థానకవులుగా విద్యాధికార పదవుల్లో ఉండేవారు. పెక్కు సంస్కృత కావ్యాలను వీరు రచించినారు. ప్రోలయ వేమారెడ్డి ఆస్థానంలో మహాదేవుడనే సంస్కృత విద్వాంసుడు బహుశా విద్యాధికారి. అనపోత, అనవేమారెడ్ల కాలంలో బాలసరస్వతి, త్రిలోచనాచార్యులనే సంస్కృత పండితులుండి వారి దాన శాసనాలు రచించినారు. కుమారగిరి భరతశాస్త్ర ప్రవీణుడై, వసంతరాజీయం అనే పేర నాట్యశాస్త్రం రచించినాడు. అతని బావమరది సేనాని అయిన కాటయ వేమారెడ్డి కాళిదాసు నాటకత్రయానికి "కుమారగిరి రాజీయ"మనే వ్యాఖ్యానం వ్రాశాడు. పెదకోమటివేముని కొలువు సంస్కృత సరస్వతికి రంగస్థలమయింది. కోమటివేముడు మహాకవుల్లో ఎన్నదగినవాడు. సంగీత చింతామణి, సాహిత్య చింతామణి, సప్తశతీసారటీక అమరుక కావ్యంపై శృంగారదీపిక అనే వ్యాఖ్య అతని కృతులు. అతని ఆస్థానకవి వామనభట్ట బాణుడు. బాణునకు సాహిత్య చూడామణి, సాహిత్య సామ్రాజ్య ధురంధర, కవిసార్వభౌమ బిరుదులుండేవి. ఈతడు పద్య, గద్య, నాటకరచనలో ప్రవీణుడు. కనకలేఖా కళ్యాణం, ఉషా పరిణయం, పార్వతీ పరిణయం అనే నాటకాలు; నలాభ్యుదయం, రఘునాథాభ్యుదయం, హంస సందేశం అనే పద్యకావ్యాలు; వేమభూపాల చరిత్ర (వీర నారాయణ చరితం) అనే గద్యకావ్యం; శబ్దరత్నాకరం,

శబ్దచంద్రిక అనే నిఘంటువులు ఇతని రచనలు. కందుకూరునేలిన శివలింగరెడ్డి హరదత్తుని 'గిరీశశ్రుతి సూక్తిమాల'పై తత్త్వప్రకాశిక అనే వ్యాఖ్యానం రచించినాడు. రాజమహేంద్రవరం ఏలిన వీరభద్రారెడ్డి సాహిత్య సంగీత లక్ష్యలక్షణభంగి సర్వజ్ఞుడు అని పేరొందినాడు.

వెలమల ఆస్థానాల్లో సయితం సంస్కృత సారస్వత సృష్టి విశేషంగా జరిగింది. అనపోతానేని ఆస్థానంలో పశుపతి పండితుని పుత్రుడైన నాగనాథ కవి వుండేవాడు. ఈతడు సంస్కృతంలో 'మదనవిలాసభాణం' రచించినట్లు తెలుస్తుంది. పాండిత్యంలో భాషాపోషణలో సాహిత్యసృష్టిలో పెదకోమటి వేమునకుద్దియైన రెండో సింగభూపాలుడు "రసార్ణవ సుధాకరం" అనే లక్షణ గ్రంథం, 'రత్నపాంచాలిక' అనే నాటకం రచించడమేగాక సారంగధరుని "సంగీత రత్నాకరం"పై "సంగీత సుధాకరం" అనే వ్యాఖ్యానం సమకూర్చి నాడు. "రత్నపాంచాలిక" (కువలయావళి)ను రాచకొండలోని ప్రసన్న గోపాల దేవుని వసంత యాత్రా మహోత్సవ సందర్భంలో ఆడేవారట: సింగభూపాలునకు లక్ష్య లక్షణవేది అనీ సర్వజ్ఞ అనీ బిరుదులున్నాయి. ఈతని ఆస్థానంలో విశ్వేశ్వరుడు, బొమ్మకంటి అప్పయార్యుడు పోషణనందినారు. విశ్వేశ్వరుడు "చమత్కారచంద్రిక" అనే అలంకారశాస్త్ర గ్రంథ రచయిత. సింగభూపాలు నీతడు "సాహిత్యశిల్పావధి" అని వర్ణించినాడు. అప్పయార్యుడు "అమర కోశా"నికి వ్యాఖ్యానం రచించినాడు. సింగభూపాలుని కుమారుడైన రావుమాదానేడు కూడ గొప్ప విద్వాంసుడు. 'శ్రీమద్రామాయణము'పై నితడు 'రాఘవీయ' మను వ్యాఖ్యను కూర్చినట్లు ఆతని భార్య నాగారం శాసనంవల్ల తెలుస్తున్నది. రేచర్ల సింగమనీని ఆస్థానంలో శాకల్య మల్లుభట్టు అనే విద్వాంసుడున్నట్లు అతణ్ణి నైనాచార్యు లోడించినట్లు వైష్ణవ సంప్రదాయం. శాకల్యమల్లుభట్టు మహాకవి. ఈతడు 'నిరోష్ఠ్యరామాయణం', 'ఉదార రాఘవం' అనే కావ్యాలు, 'అవ్యయ సంగ్రహ నిఘంటువు' రచించినాడు. ఈ నిఘంటువు చివర తాను "చతుర్భాషా కవితాపితామహాంకు"డనని చెప్పుకొన్నాడు.

**తెలుగు :**

ఆంధ్రభాషాచరిత్రలో రెడ్డినాయకయుగం చాలముఖ్యమైనఘట్టం. ఆంధ్రా ధీశులైన కాకతీయులనాడుకూడ రాజాదరణపొందలేని తెలుగు ఆస్థానభాషా గౌరవానికై సంస్కృతంతో పోటీ పడసాగింది. కాకతీయ యుగంలో కలిగిన జాతీయాభిమానం స్వభాషాభిమానంగా పరిణమించడంలో విచిత్రం లేదు. ఆ అభి మానమే వల్లభామాత్యునిచే "దేశభాషలందు తెలుగు లెస్స" అని పలికించింది. శ్రీనాథుడు కోమటి వేముని ఆస్థాన విద్యాధికారికావడంతో తెలుగుభాష చరిత్రలో నూతన అధ్యాయం ప్రారంభమయింది. తెలుగుకవికి బహుదేశ భాషాకోవిదులను

పరిశీలించే గౌరవం లభించింది. విజయనగర ఆస్థానంలో గౌడ డిండిమభట్టు కంచుఢక్కను శ్రీనాథుడు పగుల గొట్టడం రాజాస్థానాల్లో సంస్కృత భాషకున్న అధికార గౌరవాలను విచ్ఛిన్నం చేయడమే. శ్రీనాథుని విజయం ఆంధ్రవాణి విజయం గుణాఢ్యుని ఓటమితో ప్రాకృతం తిరోగమించి సంస్కృతం రాజభాష అయినట్లే డిండిముని ఓటమితో సంస్కృతం వెనుకంజవేసి దేశభాషల ప్రభావం బలపడింది. కర్ణాటక, ద్రావిడరాజ్యాల్లో ఆంధ్రభాషా సంస్కృతుల విస్తరణ కీసంఘటన తోడ్పడిందని చెప్పవచ్చు.

ఆంధ్రభాషలో దీన్ని సంధియుగంగా పేర్కొంటారు. ఇది నన్నయ సాంస్కృతిక శైలికి, సోమనాథ తిక్కనల దేశిశైలికి సంగమం: మరొకవైపున పురాణ (ఆఖ్యాన) ప్రబంధ (వర్ణనాత్మక) విధానాలకు కూడలి. ఈ సామరస్యాల ఫలితంగా అలంకారికమైన శైలి తయారయింది. ఈ కొత్త శైలికి బీజాలు నాటినవాడు 'ప్రబంధపరమేశ్వరు'డయిన ఎర్రాప్రగడ; దోహదంచేసి మహా వృక్షంగా రూపొందించినవాడు శ్రీనాథుడు. తన శైలిని శ్రీనాథుడు "ప్రౌఢి బంకింప సంస్కృతభాష.... పలుకు నుడికారమున నాంధ్రభాష" అని చెబుతూ వాస్తవానికి తనది 'కర్ణాటభాష' అంటాడు. ఈ మాట వాడిన సందర్భాన్ని బట్టి ఆలోచిస్తే 'కర్ణాటభాష'కు "సంస్కృతాంధ్రాల మిశ్రమమై చెవులకింపైనశైలి" అని అర్థం చెప్పడం సమంజసం. పోతనగూడ సంస్కృతాంధ్రాలసమన్వయానికే కృషిచేసి సాధసెడానికి ఈ కింది పద్యమే సాక్ష్యం: "కొందరకు తెలుగు గుణమగు కొందరకున్ సంస్కృతంబుగుణమగు రెండున్ గొందరకు గుణములగు నేనందర మెప్పింతు గృతుల నయ్యైయెడలన్" నిశ్శంక కొమ్మన గూడ తనది తెలుగు సంస్కృతాల మిశ్రమశైలియేనని చెప్పుకుంటాడు.

నాటి కవులు కొంతవరకు సామాజిక అవసరాల గుర్తింపు వుండి రచనలు సాగించినారు. మరొకవైపు రాజాస్థానాల్లో వినోదం కలిగించడానికి పాండిత్య ప్రకర్షకు అనువుగా చిత్రకవిత్వం రూపొందించినారు. ఓరుగల్లు పతనంతో ఆంధ్రదేశం తాత్కాలికంగా యవనాక్రాంతమై, హిందూమత సంస్కృతులకు ప్రమాదం వాటిల్లింది. ముస్లిం దండయాత్రలతో, కుల కక్షలతో, ఆర్థిక దుస్థితితో ప్రజలలో నైతిక పతనం స్పష్టంగా కన్పిస్తుంది. అట్టి పరిస్థితులలో హిందూ మతాసక్తితోబాటు నైతికవర్తనపట్ల ప్రజలకు శ్రద్ధ కలిగించవలసిన అవసరం ఏర్పడింది. హిందూమతవైశిష్ట్యాన్ని ఉద్బోధించడానికి ఉద్దేశించిన భారతాంధ్రీ కరణను పూర్తిచేయడంలోని ఆశయం అదే ననవచ్చు. హిందూ క్షేత్రాల మాహాత్మ్యాన్ని వర్ణించే కాశీఖండం (శ్రీనాథుడు), కాంచీ మాహాత్మ్యం (దగ్గుపల్లి దుగ్గన) వంటి గ్రంథాలు; దేహం అశాశ్వతం, కీర్తి అజరామరం కాబట్టి సత్య నిష్ఠతో ధర్మపరాయణత్వంతో జీవించాలని బోధించే భోజరాజీయం,

విక్రమార్క చరిత్రవంటి కావ్యాలు ఎక్కువగా వెలువడినాయి. కాని కాకతీయ రాజ్యపతనానికి కన్నీరు కార్చినవారుగాని ముస్లిం దురాగతాలను వర్ణించినవారుగాని నాటికవుల్లో లేకపోవడం ఆశ్చర్యం కలిగించే అంశం.

చిత్ర కవిత్వ ప్రాబల్యం రెడ్డి నాయకయుగ సారస్వతాలలో ఒక విశేషం, "అష్ట భాషల మధురాసువిస్తర చిత్ర కవితలు చెప్పువారు" "ఘటికాశత గ్రంథ" కర్తలు బయలుదేరినారు. శాకల్య మల్లుభట్టు సంస్కృతంలో నిరోష్ఠ్య రామాయణం రచించినాడుకదా! అవధానాలు, సమస్యాపూరణము, గర్భకవిత్వం, గోప్యకవిత్వం, అక్షరచ్యుతకం, మాత్రాచ్యుతకం, ఏకసంథా, ద్విసంథాధారణలు ఎక్కువయినాయి. ఈ సారస్వత 'గారడీలు' రాజ్యసభల్లో వినోదానికి ఉద్దేశించినవై వుంటాయి.

శంభుదాస, ప్రబంధపరమేశ్వర బిరుదాంచితుడైన చదలవాడ ఎర్రాప్రగడతో సీయుగ సార్వతచరిత్ర ప్రారంభిస్తున్నది. కవిత్రయంలో నీతడు చివరివాడు. రెడ్డిరాజ్య స్థాపకులైన మల్లారెడ్డి, ప్రోలయ వేమారెడ్డి ఈతణ్ణి పోషించినారు. ఎర్రన ప్రథమ కావ్యమైన రామాయణం లభించలేదు. అనంతరం నన్నయ తిక్కనల శైలిని పుణికిపుచ్చుకొన్నట్లు అరణ్య పర్వశేషాన్ని పూర్తి చేసినాడు. ఉత్తర హరివంశ కావ్యాన్ని ఎర్రన ప్రోలయ వేమునికి అంకితమిచ్చినాడు. ఇందులోనే ఎర్రన శైలి పరిపుష్టి నందిందని విమర్శకుల అభిప్రాయం. ఈతని చివరి కావ్యం నృసింహపురాణం. ఇందీతడు సాంస్కృతిక దేశీ శైలీ విధానాలను సమన్వయం చేసి పురాణ రచనలో వర్ణనా ప్రాబల్యం నెలకొల్పి ప్రబంధ శైలికి బీజం నాటినాడు.

ఎర్రనకు సమకాలికుడే అయిన శ్రీగిరికవి నవనాథ చరిత్రను పద్య కావ్యంగా రచించినాడు. ఇంచుక తరువాతనున్న విన్నకోట పెద్దనామాత్యుడు తన 'కావ్యాలంకార చూడామణి'ని పంచధారల నేలుతున్న చాళుక్య విశ్వేశ్వరునకు అంకితం చేసినాడు. ఇదే కాలంలో రాజమహేంద్రవరంలో అల్లాడరెడ్డి కొడుకైన దొడ్డారెడ్డి ఆదరంతో ఆతనికి అంకితంగా 'శివలీలా విలాసం' రచించినాడు. ఈ కావ్యాన్నితడు "ప్రబంధ విధానశ్రీ వరలగ" చెప్పినాడు. తిక్కన సోమయాజి కుమారుడైన కొమ్మనకు దౌహిత్రుడైన మడికిసింగన కూడ రాజమహేంద్రవరానికి చెందినవాడే. సింగన తండ్రియైన అయ్యలామాత్యుడు రాజమహేంద్రవరం పాలించిన తొయ్యేటి అనవోతానాయని మంత్రి అనవోతానాయని మరణానంతరం (క్రీ శ 1353) ఈ కుటుంబం వారు రామగిరికి వలస వెళ్ళినారు. రామగిరి సబ్బినాటికి రాజధాని (కరీంనగర్) సింగన తన పద్మపురాణ, దశమస్కంధాలను రామగిరి రాజైన ముప్పిడి నాయకుని మంత్రి కందయామాత్యునకు అంకితం ఇచ్చినాడు. 'వాశిష్ఠ రామాయణా'న్ని తెనిగించి అహోబల నారసింహా

నకు అంకితం చేసినాడు. 'సకలనీతి సమ్మతా'న్ని కేశవేశ్వరునకు సమర్పించినాడు.

కుమారగిరికి సమకాలికుడైన వినుకొండ వల్లభామాత్యుడు కడప జిల్లా లోని మోపూరి గ్రామాధికారి. ఇతని తండ్రి విజయనగరాధీశుల పక్షాన వినుకొండను పాలించినాడు. వల్లభమంత్రి 'క్రీడాభిరామం' తెలుగు సాహిత్యంలో మొదటి వీధి నాటకమని చెప్పవచ్చు. 'క్రీడాభిరామం' రావిపాటి త్రిపురాంతకుని సంస్కృత 'ప్రేమాభిరామా'నికి అనువాదం. 'క్రీడాభిరామ' కర్త శ్రీనాథుడనే అభిప్రాయం కూడా ఉంది. శ్రీనాథుని కాలంవాడైన అనంతామాత్యుడు (క్రీ.శ. 1435 ప్రాంతం) నేటి కృష్ణాజిల్లా ప్రాంతానికి చెందినవాడు. భోజరాజీయం, ''ధర్మరీతుల్ నీతులు చిత్రకథ''లుగా చెప్పినాడు.

శ్రీనాథభట్టకవి సార్వభౌముడీ యుగ కవులందరిలోనూ ప్రసిద్ధుడు. అయితే అతడు కన్నడ జాతీయుడనే అభిప్రాయం బలంగా ఉంది. శ్రీనాథుని తాత కమల నాభామాత్యుడు, ఇటువంటి పేర్లు నాటి ఆంధ్రకవుల్లో అరుదు. 'భట్టు'తో అంతమయ్యే తెలుగు పేర్లు గూడ నాడు అరుదే. తన ఇంటిపేరు కూడ శ్రీనాథుడు ఎచ్చటా చెప్పుకోలేదు. కమలనాభుడు పద్మపురాణం రచించినాడట కానీ ఏ భాషలోనో తెలియదు. అతడు వినమత్కాకతి సార్వభౌముడు. కాకతీయుల ఆదరణతోనే 'వారిధి తటీకాల్పట్టణాధీశు' డయినాడు. కాకతీయ యుగంలో తీరంవెంట (సుంకాలు వసూలు చేసే) కరపట్టణాలు ఉండేవి. బహుశా ఒంగోలు ప్రాంతంలో ఒక కరపట్టణానికి ప్రభువులయినప్పటి నుండి వీరు పాకనాటి వారయి వుంటారు. శ్రీనాథుడు 'నా కవిత్వంబు నిజము కర్ణాటక భాష' అనడం 'తల్లి కన్నడ రాజ్యలక్ష్మి' అని సంబోధించడం, 'కర్ణాటకటక పద్మవనహేళి'నని చెప్పుకోవడం, దేవరాయల్ని 'కర్ణాట క్షితిపాల' అని వర్ణించడం అతనిలో అంతర్గతంగా ఉన్న కన్నడాభిమానాన్ని సూచించవచ్చు. తత్సమ భూయిష్టమైన అతని రచన కూడ 'ఈతడు నిజంగా తెలుగువాడా?' అనే అనుమానాన్ని బలపరుస్తుంది. అయితే అతడు ప్రదర్శించిన ఆంధ్ర దేశాభిమానం ఆంధ్ర ప్రజలపట్ల సానుభూతి ఆంధ్ర భాషకు అతనిసేవ గణనీయాలు. వాస్తవానికి ఆంధ్ర సారస్వత చరిత్రలో కవిబ్రహ్మ తరువాత చెప్పుకోదగినవాడు కవిసార్వభౌముడే. తిక్కనవలెనే శ్రీనాథుడు సాహితీ గురుపీఠమే గాక అధికార పీఠం అధిష్ఠించి, నాటి రాయకీయ సాంఘిక పరిణామాల్లో శ్రద్ధ వహించినాడు. తెనుగుభాషకు వ్యక్తిత్వం నిలిపి గౌరవస్థానం సంపాదించిన శ్రీనాథుడే యథార్థ ఆంధ్రభాషా యుగకర్త భాషలో, రీతిలో క్రొత్త సంప్రదాయాలు నెలకొల్పి పురాణాలనుండి కవుల దృష్టిని కావ్యాలవైపు మరలించి అందుకు అనుకూలము,

కవిత్రయ మార్గానికి భిన్నము, అక్షర రమ్యత, అర్థగౌరవాలకు సమన్వయము నైన అనుకరణ మార్గం చూపిన కవితా శిల్పాచార్యుడు శ్రీనాథుడు.

పదిహేనోశతాబ్ది ప్రతినిధిగా శ్రీనాథుడు చరిత్ర ప్రసిద్ధి చెందినాడు. ఓరుగల్లు పతనానంతరం తీరాంధ్రానికి కొండవీడు రాజధాని కావడంతో శ్రీనాథుని కుటుంబం కొండవీడు చేరింది. అక్కడే అవచి తిప్పయ శ్రీనాథుని బాల్య సఖుడయినాడు. 'ఆరాధ్య చరిత్ర'ను కృతియిచ్చి మామిడి ప్రెగడయ్య అభిమానమూ తద్వారా అతని తమ్ముడు మామిడి సింగన ఆదరణ పొంది, పెదకోమటి వేముని విద్యాధికారి అయినాడు. సింగన శృంగారనైషధ కృతిపతి అయినాడు.

శ్రీనాథుని కవితా పరిశ్రమ కొండవీడుకే పరిమితంగాక యావదాంధ్రానికి విస్తరించింది. శ్రీనాథుడు విజయనగరానికేగి గౌడ డిండిమభట్టు నోడించి దేవరాయలచేత కనకాభిషేకం, కవిసార్వభౌమ బిరుదం పొందినాడు. అనంతరం రెడ్డి, వెలమ రాజ్యాలమధ్య బహుశా దౌత్యం జరిపే ఆశయంతో రాజుకొండకేగి సర్వజ్ఞ సింగభూపాలుని మర్యాద లందుకున్నాడు. ఇంతలో కొండవీటి రాజ్యం పతనమయింది. నిరాశ్రయుడై శ్రీనాథుడు దేశాటనం చేస్తూ పలనాడు, రేనాడు ప్రజల దుర్భర పరిస్థితులకు కంటతడి పెట్టినాడు. ఈ సందర్భంలోనే బహుశా కాంచీపురిని దర్శించి అవచి తిప్పయకు 'హరవిలాసం' అంకితం చేసి వుంటాడు. అనంతరం బంధువైన బెండపూడి అన్నామాత్యుని ఆశ్రయించి రాజమహేంద్ర వర్మ ఆస్థానంలో ప్రవేశించినాడు. భీమఖండ, కాశీఖండాల రచన జరిగింది. శ్రీనాథుని కష్టాలు గట్టెక్కలేదు కపిలేశ్వర గజపతి దురాక్రమణతో క్రీ శ. 1448 నాటికి రెడ్డిరాజ్యం అస్తమించింది. తీరాంధ్రం గజపతి వశమయింది. తిరిగి నిరాశ్రయుడై పుణ్యక్షేత్రాలు దర్శిస్తూ శ్రీశైలంలో భిక్షావృత్తి మఠాధిపతి శాంతలింగయ్య కోరికపై 'శివరాత్రి మాహాత్మ్యం' రచించినాడు. చివరకు "వీరభద్రారెడ్డి విద్వాంసుడు"గా గజపతి రాజులు పెట్టిన అష్టకష్టాలకు గురియై మరణించినాడు.

రెడ్డిరాజుల ఆస్థానంలో మహాభారతాంధ్రీకరణ కాగా పద్మ నాయకులు అంటే దేవరకొండ నేలిన పెద వేదగిరి ఆస్థానంలో రామాయణ ఆంధ్రీకరణని శాకల్య అయ్యలార్యుడు పూర్తి చేసినాడు సంస్కృత నిరోష్ఠ్య రామాయణ కర్తయైన శాకల్యమల్లుభట్టు పౌత్రుడు అయ్యలార్యుడు. వెలమల ఆస్థానంతో సంబంధం ఉన్న తెలుగు కవులలో ప్రసిద్ధులు గౌరన, పోతనలు. దేవరకొండ నేలిన మాదానేనికి మంత్రియైన పోతరాజు తమ్ముని కుమారుడు గౌరన. ఇతనికి 'సరస సాహిత్య లక్షణ చక్రవర్తి' బిరుదం ఉంది. హరిశ్చంద్రోపాఖ్యానం,

నవనాథ చరిత్ర, లక్షణ దీపిక ఇతని రచనలు. మొదటి రెండూ ద్విపదలో ఉన్నాయి. నవనాథ చరిత్ర శ్రీశైలంలోని శాంత భిక్షావృత్తి యతీశ్వరుల ప్రోత్సాహంపై రచించింది.

ఈ యుగ ద్విపద కావ్యాలలో రంగనాథ రామాయణం ప్రసిద్ధమయింది. గోన బుద్ధరాజు 'తన తండ్రి విఠల ధరణీశుపేర' ఈ గ్రంథాన్ని రచించినట్లు చెప్పినాడు. విఠలభూపతి గోన గన్నయకు సామంతుడుగా రాయచూరు దుర్గం నిర్మించినట్లు అచటి శాసనం సాక్ష్యంగా వుంది. అయితే, ఈ కావ్యానికి రంగనాథ రామాయణం అనే పేరు రావడానికి ఉన్న కారణం గురించి చాల తర్జన భర్జన జరిగింది. రంగనాథుడనే ప్రసిద్ధ కవి సహాయంతో బుద్ధరాజు ఈ రామాయణం రచించినందున ఈ పేరు వచ్చిందని బలమైన అభిప్రాయం. 'పాండురంగ విఠలనాథు'డనేది పూర్తి పేరనీ, దానికి హ్రస్వరూపమే రంగనాథుడనీ ఆచార్య పింగళి లక్ష్మీకాంతంగారి అభిప్రాయం. 'పాండురంగ విఠలనాథు'డనే వ్యవహారం సుప్రసిద్ధమే. రచయిత చెప్పింది యథార్థమే అయితే లక్ష్మీకాంతంగారి అభిప్రాయం సమంజసంగా కనిపిస్తుంది. రంగనాథ రామాయణ రచన క్రి. శ. 1340 ప్రాంతంలో రాయచూరులోనే జరిగిందని ఆరుద్రగారి అభిప్రాయం. వైష్ణవులు ఆశించినట్లు రంగనాథ రామాయణం బహుళ జనాదరణ పొందింది.

ఆంధ్ర కవుల్లో ప్రత్యేకమైన గౌరవస్థానం పొందినవాడు బమ్మెర పోతన. ఈతడు ఏకశిలా నగరవాసి. కొంతకాలం సర్వజ్ఞ సింగని ఆస్థానంలో ఉండి, అతని కోరికపై 'భోగినీ దండకం' రచించినాడట. క్రమంగా రాజాస్థాన జీవితం పట్ల విసుగెత్తి హాలికవృత్తితో జీవితం గడిపినాడని ప్రతీతి. నాటి సామరస్య భక్తి ఉద్యమాల ప్రభావం పోతన రచనల్లో కన్పిస్తుంది. అతని తల్లిదండ్రులు పరమ శైవులు. బహుశా అతడుగూడ శైవుడై 'వీరభద్ర విజయం' రచించినాడు. అనంతరం వైష్ణవ ప్రభావానికి పూర్తిగాలోనై, భక్తిప్రధానమైన 'మహా భాగవతం' రచించినాడు. భాగవతంలో చైతన్యునికంటె ముందుగనే 'మధుర భక్తి'కి సన్నిహితమైన భక్తి భావాన్ని పోతన బోధించినాడు. ఆంధ్రులకు అత్యంత ప్రీతిపాత్రములైన మహాభారతం, రామాయణ భాగవతాలను ప్రసాదిస్తూ రెడ్డినాయకయుగం రాయల యుగానికి దారి తీసింది.

## కొన్ని ఉపయుక్త గ్రంథాలు

1. Apparao — రెడ్డి సంచిక
2. Arudra — సమగ్ర ఆంధ్రసాహిత్యము III, IV
3, Habib (ed) — Comprehensive History of India, V
4. Sherwani and Joshi — Medieval History of Deccan.
5. Somasekhara Sarma — (1) Forgotten Chapter of Andhra History
(2) Reddi Kingdoms of Konda. vidu & Rajahmundry
6. Venkataramanaiah — (1) Early Muslim Expansion in South India
(2) Further Sources of Vijayanagara History.

# విజయనగరయుగం

విజయనగరస్థాపన రెడ్డినాయక రాజ్యాలతోబాటే జరిగింది. దాక్షిణాత్య చరిత్రలోనేగాక యావద్భారత చరిత్రలోనే విజయనగరయుగం ఒక ముఖ్య ఘట్టంగా రూపొందింది. ఓరుగల్లు పతనానంతరం కృష్ణానదికి దక్షిణదేశాన్ని సమైక్యంచేసి తురుష్క విస్తరణను అరికట్టి సుమారు రెండున్నర శతాబ్దాలకాలం హిందూ మత సంస్కృతులకు రక్షణ కల్పించింది. దక్షిణదేశంలో హిందూ సంస్థలు స్వచ్ఛంగా ఉండడానికి కారణంకావడమేగాక దేశవ్యాప్తమైన హిందూ పునర్జీవనానికి ప్రోత్సాహం సమకూర్చింది. బహమనీలతో ఎడతెగని పోరాటాలు సాగించినందున సుల్తానుల దృష్టి దక్షిణాపథరాజకీయాల్లోనే లగ్నమై ఢిల్లీ సామ్రాజ్య పతన కాలంలో వారు ఉత్తరంగా విస్తరించే అవకాశం లేకుండా చేసింది. బహమనీలు ఢిల్లీని ఆక్రమించివుంటే భారత చరిత్రలో మొగల్ యుగం అనుమానాస్పదమయి ఉండేది. ఈ విధంగా విజయనగరం మధ్యయుగ రాజకీయాల్లో కీలకపాత్ర నిర్వహించింది. విజయనగరాధీశులు సంస్కృతీప్రియులై సంస్కృతాన్ని దక్షిణాత్యభాషా సారస్వతాలను పోషించినారు. ముఖ్యంగా విజయనగరం ఆంధ్రులు గర్వించదగిన కాలం. ఈ కాలంలో ఆంధ్ర సంస్కృతి దాక్షిణాత్య ప్రజలందరి ఆదరణ పొందింది. ఆంధ్రభాషా కవులు విజయనగరాస్థానకవులయినారు. ఆంధ్రశిల్పరీతి, సంగీతం దాక్షిణాత్యులందరికీ ఆదర్శములయినాయి. దక్షిణదేశమంతటా తెలుగువారి రాజకీయ సాంస్కృతిక స్థావరాలేర్పడినాయి

అయితే విజయనగరాధీశులు ఆంధ్రదేశ సమైక్యాన్ని సాధించలేకపోయినారు. వారి అధికారం చాలవరకు కృష్ణానది దక్షిణప్రాంతానికి మాత్రం పరిమితమయింది. ముసునూరు, పద్మనాయక రాజ్యాలు అస్తమించిన తరువాత తెలంగాణం బహమనీలు ఆక్రమించినారు. రెడ్డిరాజ్యాలపతనంతో ఉత్తరాంధ్రం గజపతులకు బహమనీలకు జరిగిన యుద్ధాలకు రంగస్థలమై తీరని బాధ లనుభవించింది.

## విజయనగర స్థాపన

విజయనగర స్థాపననుగురించి విభిన్న సిద్ధాంతాలున్నాయి విజయనగర వైభవాన్ని వెలుగులోనికి తెచ్చిన రాబర్ట్ సూయల్ తన "విస్మృత విజయనగర

సామ్రాజ్యం" అనే గ్రంథంలో స్థానిక, విదేశీ రచనలను పరిశీలించి విజయనగర స్థాపనను గురించి ఏడు సంప్రదాయాలను పేర్కొన్నాడు. అయితే ఇవి కట్టు కథలతో నిండి వున్నాయని, వీనిని సవిమర్శకంగా పరిశీలించి నిగ్గుతేల్చినప్పుడే యథార్థవృత్తాంతాన్ని సాధింపగలమని అతడు సూచించాడు. సూయల్ దృష్టిలో సమంజసమైన వృత్తాంతము: "కురుబ తెగకు చెందిన హరిహరబుక్క సోదరులు ఓరుగల్లు ప్రతాపరుద్రుని కోశాగార ఉద్యోగులు; క్రీ.శ. 1323 లో ఓరుగల్లును ఢిల్లీ సుల్తాన్ ఆక్రమించడంతో వారు ఆనెగొందిరాజు నాశ్రయించి ఉద్యోగాల్లో చేరినారు; 1334 లో ఆనెగొందిని సుల్తాన్ ఆక్రమించి మాలిక్‌ని అచట తన ప్రతినిధిగా నియమించినాడు; కాని ప్రజలాతనిపై తిరుగుబాటుచేయగా సుల్తాన్ స్థానిక హిందువులనే రాజు, మంత్రులుగా నియమించినాడు; వారే హరిహర బుక్క సోదరులు" ఈ నిర్ణయాన్ని శ్రీకృష్ణస్వామి అయ్యంగారు, హెచ్. కృష్ణ శాస్త్రి, పి. బి. దేశాయ్ మొదలైన పండితులు తిరస్కరించి హరిహర సోదరులు మూడో బల్లాలుని ఆస్థాన ఉద్యోగులని అందుచేత వారు కన్నడిగులని సిద్ధాంతీక రించినారు. వారి సిద్ధాంతసారం: సంగమునికి ఐదుగురు కొడుకులు - హరిహర, బుక్క, కంపన, మారప్ప, ముద్దప్ప - మూడో బల్లాలుని కొలువులోనివారు; క్రీ.శ. 1327-28 లో ఢిల్లీ సుల్తాన్ దోరసముద్రాన్ని ధ్వంసంచేయగా మూడో బల్లాలుడు తన రాజ్యం ఉత్తర సరిహద్దు రక్షణకు కేంద్రంగా హొసపట్టణం (విరూపాక్షి పట్టణం) నిర్మించి ఆ సరిహద్దుభూముల్లో సేనాపతులుగా హరిహర బుక్క సోదరులను నియమించి తాను దక్షిణాన ఉన్న తిరువణ్ణామలై రాజధానిగా చేసుకున్నాడు. హొసపట్టణమే విజయనగరం అయింది. బల్లాలుడు దూరంగా ఉన్నందున హరిహరుడు బలపడి అతడు మరణించిన అనంతరం స్వతంత్రించినాడు. విజయనగం కర్ణాటకంలో ఉన్నది. శ్రీనాథునివంటి తెలుగు కవులు సయితం విజయనగరాన్ని 'కన్నడ రాజ్యలక్ష్మి' అనీ, దేవరాయల్ని 'కర్ణాటక్షితిపాల' అనీ సంబోధించినారు సంగములు కన్నడ బిరుదులు ధరించి నారు. కన్నడ భాషను పోషించినారు. అందుచేత విజయనగర స్థాపకులైన సంగములు కన్నడిగులే!

సంస్కృత, కర్ణాటక, ఆంధ్రభాషల్లోని స్థానిక చరిత్రలు, బార్నీ ఇస్లామీ వంటి ముస్లిం చారిత్రక రచనలు, పాశ్చాత్య వర్తకులైన న్యూనిజ్ వ్రాతలు, శాసనస్థములైన సమాచారములు సమన్వయంచేసి డాక్టర్ నేలటూరు వెంకట రమణయ్యగారు పై సిద్ధాంతాన్ని పూర్వపక్షంచేస్తూ హరిహరసోదరులు ఆంధ్రు లని నిరూపించే ప్రయత్నం చేసినారు: (1) హొసపట్టణంలోగానీ విజయనగరంతో గానీ హరిహరాదులకు క్రీ.శ. 1336 కు పూర్వం సంబంధం ఉన్నదనడానికి సాక్ష్యంలేదు. విరూపాక్ష దేవాలయం వల్ల ఈ పట్టణాన్ని విరూపాక్షపట్టణం అని

కూడా అన్నారు. ఈ విరూపాక్ష దేవాలయాన్ని కంపిలరాయలు నిర్మించినట్లు శాసనాధారం ఉంది. (2) దోరసముద్రాన్ని క్రీ.శ. 1328 లో సుల్తాన్ నిర్మూలించినాడనడం నిజం కాదు. తిరుగుబాటుదారైన బహాఉద్దీన్‌ను మూడో బల్లాలుడు సుల్తానుకు అప్పగించి సంధి చేసుకున్నట్లు ముస్లిం చరిత్రలవల్ల తెలుస్తుంది. కాబట్టి దోరసముద్రాన్ని ధ్వంసం చేయవలసిన అవసరం సుల్తాన్‌కు లేదు (3) ఆదీగాక బల్లాలుడు దోరసముద్రం నుండియే పాలించినట్లు 1329-40 మధ్యకాలంలోని అతని శాసనాలు సూచిస్తున్నాయి. (4) 1327-28లో కంపిలి రాజ్యాన్ని సుల్తాన్ ఢిల్లీ సామ్రాజ్యంలో కలిపినాడు. అందుచే ఆ ప్రాంతంలో బల్లాలుడు నగరాన్ని నిర్మించే అవకాశంలేదు. బల్లాలుని శాసనాలు చాల దొరికినాయి. వానిలో అతడు హొసపట్టణాన్ని నిర్మించిన వృత్తాంతం కన్పించదు. (5) మల్లెనాడు ప్రాంతంలో హరిహరుని సోదరులైన మారప్ప ముద్దప్పలు పాలించినట్లు శాసనాలున్నమాట వాస్తవమే. కాని ఈ శాసనాలు క్రీ.శ. 1352 ప్రాంతానివి. ఆదీగాక మల్లెనాడు ప్రాంతం మూడో బల్లాలుని రాజ్యాంతర్భాగమని చెప్పే సాక్ష్యం లేదు. (6) హరిహర సోదరులు బల్లాలుని ఆస్థాన ఉద్యోగులనడానికి ఆధారం కనిపించదు. అంతేగాక వారు హొయసాలులతో పోరాడినట్లు సూచించే శాసనాలున్నాయి. మల్లినాథ వడయర్ అనే సేనాని హొయసాల సైన్యాలను జయించినాడని తిప్పరాజనే మరొక సేనాని ఉచ్ఛంగి దుర్గాన్ని ఆక్రమించినాడని, శత్రువు నుండి జయించి బుక్కరాయలు హరిహర నుండి పాలించినాడని శాసనాలు చెబుతున్నాయి. ఉచ్ఛంగి, హరిహర హొయసాల రాజ్యంలోనివి; వీనిని శత్రువు బల్లాలుని నుండి ఆక్రమించి వుంటారు. (7) దేశం కర్ణాటకమయినంత మాత్రంచే అచట రాజ్యస్థాపకులు కన్నడిగులై వుండనవసరం లేదు. భాషాదురభిమానాలు నేడున్నంతగా నాడు లేవు. ఒక భాషాప్రాంత రాకుమారులు అన్యభాషా ప్రాంతాల్లో రాజ్యాలు నిర్మించిన సన్నివేశాలు చరిత్రలో చాల ఉన్నాయి. ఆంధ్రదేశంలో 'తెనుగు నిలిపి'న వారు బాదామినుండి వచ్చిన చాళుక్యులేగదా! స్థానిక సాంప్రదాయాలను నిలపడం భాషలను పోషించడం రాజనీతికి లక్షణం. వాస్తవానికి సంగములు కన్నడ బిరుదులతో పాటు మహామండలేశ్వర, మూరురాయరగండ వంటి కాకతీయ బిరుదులుకూడ ధరించినారు. సంగములు పోషించిన మొదటి ప్రాంతీయ భాషాకవి నాచన సోమనాథుడు తెలుగుకవి. మొదటి బుక్కరాయలి కోడలు గంగాంబ తన 'మధురావిజయ' కావ్యంలో ప్రతాపరుద్రుని ఆస్థాన కవులైన అగస్త్యవిశ్వనాథులనేగాక తెనుగుకవి కవిబ్రహ్మయైన తిక్కననుకూడ స్తుతించింది. ఈ అంశాలు సంగములు తెలుగువారని, వారికి ఓరుగల్లుతో సంబంధం ఉందని సూచిస్తున్నాయి. (8) "కెలదినృప విజయం" హరిహరాదులు 'ఉత్తరాది

క్షత్రియులు' అంటున్నది. 'రాజకాలనిర్ణయ', 'శివతత్త్వరత్నాకర' గ్రంథాలు వారు ప్రతాపరుద్రుని ఉద్యోగులని వర్ణిస్తున్నాయి. బార్నీ రచనకూడ వారికి ఓరుగల్లుతో సంబంధం సూచిస్తున్నది."బల్లాలరాయని యుద్ధ" అనే గ్రంథం హరిహర బుక్కసోదరులు కంపిలరాయని భాండాగారులని చెబుతున్నది. న్యూనిజ్ రచన ఈ అంశాన్ని బలపరుస్తున్నది. "నాగుండి (ఆనెగొంది)లో తన ప్రతినిధిగా పాలించడానికి సుల్తాన్ పంపిన దేవరావు పూర్వం నాగుండి పాలిస్తున్న రాజు మంత్రియే" అని న్యూనిజ్ రచన. 'విద్యారణ్యవృత్తాంత', 'విద్యారణ్య కాలజ్ఞాన' ములు పై విషయాలను బలపరుస్తున్నాయి. అంతేగాక, 'విద్యారణ్యవృత్తాంతం' సంగముడు మంగళనిలయాధిపతి అని చెబుతున్నది. మంగళ నిలయం గుంటూరు జిల్లాలో ప్రాచీన నగరమైన మంగళగిరి అయివుండవచ్చు.దీనివల్ల హరిహరాదులు ఆంధ్రులే అనడానికి ఎక్కువ అవకాశాలున్నాయి.

ఓరుగల్లు పతనంతో హరిహర బుక్కరాయాదులు కంపిలరాయని ఆస్థానంచేరి,అతనితో బంధుత్వంచేసి భాండాగార ఉద్యోగులు అయినారు. కంపిల రాజ్యస్థాపకుడైన ముమ్మడి సింగమనాయకుడు దేవగిరి యాదవ రామచంద్రుని ఉద్యోగి. రామచంద్రుని మరణానంతరం సింగమ స్వతంత్రుడయినాడు. అనంతరం అతని కొడుకు కంపిలరాయలు రాజయినాడు. కంపిలరాయని కొడుకు రామనాథుడు మహావీరుడు. బళ్ళారి, చితల్‌దుర్గ్, రాయచూరు, ధార్వాడ ప్రాంతాలు కంపిలరాజ్యంలో చేరివుండేవి. తన రాజ్య విస్తరణ సందర్భంలో కంపిలరాయలికి మూడోబల్లాలునితో ప్రతాపరుద్రునితో వైరం సంభవించింది. కాని, కంపిలరాయ ప్రతాపరుద్రులు సమాధానానికి వచ్చినట్లు కన్పిస్తుంది.

బహాఉద్దీన్‌గుస్తస్ప్ తిరుగుబాటు సందర్భంలో మొహమ్మద్‌బిన్ తుగ్లక్ కంపిలరాయల్ని రామనాథున్ని వధించి, ఆనెగొందిని ఢిల్లీ సామ్రాజ్యంలో కలిపినాడు (1327 - 28). మాలిక్‌నెబి ఆనెగొంది పాలకుడయినాడు. కంపిల రాయల బంధువులను బందీలుగా తీసుకొని సుల్తాన్ ఢిల్లీకి మరలినాడు. అనంతరం అచిరకాలంలోనే ఆనెగొంది ప్రాంతాల్లో తిరుగుబాట్లు చెలరేగినాయి. మాలిక్‌నెబి నిస్సహాయుడయినాడు. మూడో బల్లాలుడు స్వతంత్రించడమేగాక, ఆనెగొంది రాజ్యభాగాల నాక్రమించినాడు. తిరుగుబాటు సమాచారం అందిన వెంటనే సుల్తాన్ తన మంత్రులను సంప్రదించి కంపిలరాయలి బంధువులైన హరిహర బుక్కసోదరులను సైనిక సహాయం ఇచ్చి తన ప్రతినిధులుగా ఆనెగొందిలో పాలించమని పంపినాడు. మాలిక్‌నెబినుండి అధికారం హరిహరుని హస్తగతమయింది. కాని, వీరికి ఆనెగొందిరాజ్యం స్వాధీనం కాలేదు. అందుచేత గుత్తి దుర్గాన్ని కేంద్రంగా చేసుకొని బల్లాలునితో, అరవీటివారితో పోరాటం సాగించినారు. విద్యారణ్యవృత్తాంతాన్నిబట్టి మొదట హరిహరుడు బల్లాలున్ని

చేతిలో పరాజయం పొందినాడు. కాని, కాపలూరుశాసనం ప్రకారం క్రి.శ. 1335 నాటికి ఆనెగొంది (కుంజరకోన) హరిహరుని రాజధాని అయింది.

ఇంతలో ఢిల్లీ సుల్తాన్ విధానాలపట్ల ప్రబలమైన అసంతృప్తి తిరుగుబాటుగా విజృంభించింది. క్రి. శ. 1335 లో మదుర నవాబ్ తిరుగుబాటును సుల్తాన్ అణచివేయలేకపోవడంతో దక్షిణదేశంలో హిందూపాలకుల ధైర్యం ద్విగుణీకృతమయింది. క్రి శ. 1336 లో కాపయ ఓరుగల్లు నాక్రమించినాడు. హరిహరరాయలు ఆనెగొందిలో స్వాతంత్ర్యం ప్రకటించినాడు బర్నీ మాటల్లో "మాలిక్‌మక్‌బూల్‌నాయబ్ వజీర్ ఢిల్లీపారిపోగానే వరంగల్‌ను హిందువులాక్రమించినారు. కంబలభూమి కూడ నష్టమై హిందువుల హస్తగతమయింది." విజయనగర సామ్రాజ్యానికి అంకురార్పణ జరిగింది.

**మతాంతరీకరణ వృత్తాంతం :** హరిహరబుక్క సోదరులకు తుగ్లక్ ఇస్లాంమతం ఇచ్చినాడని, ఆనెగొంది నాక్రమించిన అనంతరం వారు మతం మార్చుకొని స్వాతంత్ర్యం ప్రకటించినారని గతానుగతికంగావున్న అభిప్రాయం. దీనికి కేవలం ఇసామీ రచనయే ఆధారం. హిందూరచనలేవీ ఈ కథను ప్రస్తావించవు. ఉత్తర భారతంలో ఇట్టి మతాంతరీకణలు జరుగుతునే ఉన్నాయని మతం మార్చుకున్నవారిపై హిందువులకు సానుభూతేగాని ద్వేషం ఉండేదికాదని తెలుస్తుంది అయినచో స్థానిక హిందూరచనలనుబట్టి హరిహరసోదరుల మతం మార్పిడిని సందేహించవలసి వస్తున్నది. మొహమ్మద్‌బిన్ తుగ్లక్ ఇస్లాం దురభిమాని కాకపోవడమేగాక హిందువులపట్ల ఉదారంగా ఉన్నాడని, అందుచే అతణ్ణి 'చంపినా పాపంరాద'ని సమకాలిక ముస్లిం రచయితలు వ్రాసినారు. అట్టి తుగ్లక్ హరిహర సోదరులకు నిర్బంధంగా ఇస్లాం ఇచ్చినాడనడం నమ్మశక్యంకాని విషయం. అదీగాక స్థానికులను పంపడం ద్వారా ఆనెగొందిలో తన అధికారాన్ని శాంతిభద్రతలను కాపాడాలనే ఆశయంతో హరిహర సోదరులను పంపినాడు గదా! అయినచో వారికి ఇస్లాం ఇవ్వడంవల్ల సుల్తాన్ ఆశయానికే భంగం వాటిల్లుతుంది గదా! నాటి ముస్లిం రచయితలు ఇస్లాం ఘనతను వెర్రిగా నమ్మినవారు. దేశంలోని ప్రజలంతా ఇస్లాం స్వీకరించాలని, సుల్తాన్ అందుకు సహాయపడాలని, ముస్లింలను మాత్రమే ఆదరించాలని వారి ఆకాంక్ష. కేవలం అట్టివారి రచనలే ఆధారంగా హరిహరాదుల మతాంతరీకరణ కథను నమ్మడం సమంజసం గాదు.

**విద్యారణ్య సమస్య :** విజయనగర స్థాపనలో హరిహర సోదరులకు విద్యారణ్యుల సహాయం లభించిందనీ, అతని సలహాపైనే విద్యానగరం నిర్మింపగా అదే విజయనగరం అయిందనీ స్థానిక చరిత్రల సంప్రదాయాన్ని చరిత్రకారులు విశ్వసిస్తున్నారు. న్యూనిజ్ రచనలో సయితం "విద్యాజాన" ప్రసక్తి ఉంది,

విద్యారణ్యుల జీవితాంశాలను గురించి చాల తర్జనభర్జనలున్నాయి. స్థానిక చరిత్రలలోని వృత్తాంతాల్లోను శాసనవిషయాలలోనూ ఉన్న పరస్పర వైరుధ్యాలే అందుకు కారణం. విజయనగర రాజ్యస్థాపనకాలంలో విద్యారణ్యులు శృంగేరి పీఠాధిపతి అని స్థానిక చరిత్రలు చెబుతున్నాయి. కాని, శాసనాల ప్రకారం కనీసం క్రీ.శ. 1376 వరకు భారతీ తీర్థులు శృంగేరి పీఠాధిపతి అని స్పష్టమవుతున్నది. క్రీ.శ. 1346 లో హరిహర సోదరులు, క్రీ.శ. 1356 లో బుక్కరాయలు శృంగేరిలో భారతీ తీర్థ శ్రీపాదులను సేవించినారు. వారణాసిలో ఉంటున్న విద్యారణ్యులను దక్షిణాదికి రప్పింపవలసిందిగా క్రీ.శ. 1356 లో బుక్కరాయలు భారతీ తీర్థులను కోరినట్లు సయితం శాసన సాక్ష్యం ఉంది. క్రీ.శ. 1380, 1384, 1386 లలో విద్యారణ్యుల మహత్తర గుణాలను, విజయాలను కీర్తిస్తూ రెండో హరిహరరాయలు శాసనాలు వేయించినాడు. వానిలో విజయనగర స్థాపన ప్రసక్తి లేదు. మొదటి బుక్కరాయలి కోడలు గంగాంబ తన 'మధురావిజయం'లో సంగమవంశ కులగురువులుగా కాలాముఖాచారులైన క్రియాశక్తిని స్తుతించింది గాని, విద్యారణ్యులను ముచ్చటించదు. దేవరాయల కాలం వరకూ క్రియాశక్తి ఆచార్యులే సంగముల కులగురువులు. కాని, వారు శృంగేరి పీఠాధిపతులను సయితం ఆదరించినారు. అధికార భద్రత దృష్ట్యా రాజ్యంలోని మత సంస్థ లన్నింటినీ ఆదరించడం మన దేశ సంప్రదాయమేగాక రాజనీతికి లక్షణం. గంగాంబ విజయనగరాన్ని మూడుమార్లు ప్రస్తావించింది కానీ 'విద్యానగర' ప్రసక్తి ఆ గ్రంథంలో లేదు. విజయనగరస్థాపనకు కారకుడే అయినచో విద్యారణ్యులను మధురా విజయంలో ప్రస్తావించక పోవడం చాల ఆశ్చర్యకరమైన విషయం. ఈ అంశాలవల్ల విజయనగర స్థాపనలో విద్యారణ్యులకు జోక్యంలేదని స్పష్టమవుతున్నది. అయితే, కొన్ని శాసనాల్లో విద్యారణ్య, విద్యానగర ప్రస్తావన లేకపోలేదు. కాని, ఈ శాసనాల స్వచ్ఛతను ప్లీట్, రైస్, హీరాస్, నరసింహాచారి, గోపీనాథరావు వంటి పండితులు సందేహిస్తున్నారు. చివరి సంగమవంశరాజుల బలహీనతను అవకాశంగా తీసుకొని శృంగేరి పీఠాధిపతు లీగాథలను సృష్టించి ప్రచారం చేసినారనే హీరాస్ అభిప్రాయం సమంజసమని చెప్పవచ్చు. ఇస్లాంమతానికి వ్యతిరేకంగా విజయనగర స్థాపనకు హిందూమత ప్రాశస్త్యాన్నిస్తున్నందున ఈ గాథ జాతీయ చరిత్రకారులకు అంగీకార యోగ్యమయింది.

**నగర నిర్మాణము :** స్వాతంత్ర్య ప్రకటన తర్వాత కొంతకాలం హరిహరునకు ఆనెగొందియే రాజధానిగా వుంది. నాటి రాజకీయ పరిస్థితుల్లో అది సురక్షిత ప్రదేశం కాదని, తుంగభద్రానది దక్షిణతీరంలో కొత్తనగరం నిర్మించి బహమనీ సుల్తానుపైనా బల్లాలునిపైనా తమ విజయాలకు సూచనగా విజయ

నగరం అని పేరు పెట్టినారు. బుక్కరాయలు పర్యవేక్షణలో నగర నిర్మాణం క్రీ.శ. 1343 నాటికి పూర్తికాగా, రాజధానిని ఆనెగొందినుండి అచటికి మార్చడ మయింది. కాని క్రీ శ. 1347 నాటి మారప్ప శాసనం హస్తినీ మహానగరాన్నే హరిహరుని రాజధానిగా పేర్కొంటున్నది.

విజయనగరాన్ని నిసర్గ రక్షణలలో అభేద్యమైన దుర్గంగా నిర్మించినారు. నగరానికి పూర్వపశ్చిమదిశల్లో పర్వత పంక్తులున్నాయి. దక్షిణ దిక్కున రామ దుర్గమనే గుట్టలు, ఉత్తరాన తుంగభద్రానది ఉన్నందున విజయనగరం గిరి దుర్గంగా రూపొందింది. పట్టణం చుట్టూ ఏడు శిలాప్రాకారాలను నిర్మించినారు. కొండలమధ్య వుండే స్థలాన్ని బలమైన రాతిగోడలతో పూడ్చగా ఈ ప్రాకారా లేర్పడినాయి. దక్షిణ, నైరుతి దిక్కులనుండి మాత్రమే శత్రువులు నగరంలో ప్రవేశించడానికి వీలుండేది. అందుచే నైరుతి దిశలో నాల్గు చదరపుమైళ్ళ వైశాల్యం ఉన్న పెద్ద చెరువు తవ్వించి చెరువుకట్టలను కోటగోడలుగా నిర్మించి నారు. దక్షిణదిశలో ఒక కోటను కట్టి, దాన్ని నగరంలోని పర్వత పంక్తులతో కలిపినారు. సప్త ప్రాకారాల లోపల ఒక గుట్టమీద రాజమందిరం, టంకశాల, సేనాధిపతి నివాసం ఉండేవి. మొత్తంమీద విజయనగరం 14 మైళ్ళ పొడవు 10 మైళ్ళ వెడల్పు ఉండి,సకలైశ్వర్యాలకు,సమస్త విద్యలకు ఆకరమైన ప్రపంచంలో సాటిలేనిదనే కీర్తిని ఆర్జించింది.

## సంగమవంశం
## (1336 - 1485)

### హరిహరుడు (1336 - 1365)

సంగముని సంతతి వారైనందున హరిహరుని వంశానికి సంగమ వంశ మని పేరు వీరిలో 15 మంది రాజులు సుమారు 156 సంవత్సరాలు రాజ్యం చేసినారు. వీరి కాలంలో విజయనగరం కర్ణాట ఆంధ్ర తమిళ ప్రాంతాలకు విస్తరించి, బహమనీల దక్షిణ విస్తరణ నరికట్ట గలిగింది.

స్వాతంత్ర్య ప్రకటనానంతరం హరిహరుడు ఇరవై సంవత్సరాలు పాలించినాడు. బుక్కరాయలు యువరాజై, అతని కుడిభుజంగా సహాయపడి నాడు. ఇతర తమ్ములు కూడ రాజ్య విస్తరణలో ప్రభుత్వ నిర్వహణలో అండ దండలయినారు. 1336 - 40 మధ్య శాసనాలను బట్టి హరిహర బల్లాలులమధ్య పోరాటం కొనసాగింది. క్రమంగా కొంకణం, దక్షిణ కానరా (1336), కోలారు (1339) ప్రాంతాలు హరిహరుని స్వాధీనమయినాయి. క్రీ. శ. 1340 నాటి బాదామి శాసనం హరిహరుని 'పూర్వ పశ్చిమ సముద్రాధీశ్వర' అని వర్ణిస్తున్నది. నెల్లూరు ప్రాంతం కూడ అతని వశమయిన దనడానికి బుగ్గబావి (ఉదయగిరి) శాసనం నిదర్శనం. క్రీ.శ. 1341 42 లో బల్లాలునకు మదుర సుల్తానుకు

మధ్య సంఘర్షణ తీవ్రతరమై, బల్లాలుడు మరణించినాడు. నాలుగో బల్లాలుడు సమర్థుడు కాడు; అతడెంతో కాలం రాజ్యం చేయలేదు. అతనితో హొయసాల వంశం అంతరించింది. హొయసాల రాజ్యం హరిహరుని హస్తగతమయింది. హొయసాల సామంతులు, ఉద్యోగులు హరిహరునకు లొంగిపోయినారు. క్రీ.శ. 1346 లో శృంగేరిని దర్శించి హరిహర సోదరులు విజయోత్సవం జరుపుకున్నారు.

## విజయనగర - బహమనీ సంబంధాలు

గుల్బర్గాలో క్రీ.శ. 1347 లో అల్లావుద్దీన్ హసన్ గంగూ బహమనీ స్వతంత్ర బహమనీ రాజ్యం స్థాపించినట్లు చదివినారు. రాజ్య విస్తరణకాంక్ష ప్రతి రాజవంశానికీ సహజ లక్షణమే. ఫలితంగా బహమనీ రాజ్యానికీ పొరుగు రాజ్యాలకూ సంఘర్షణలు జరిగినాయి. ముఖ్యంగా విజయనగర - బహమనీ సంఘర్షణ మధ్యయుగ దాక్షిణాత్య రాజకీయాల్లో చాల ఆసక్తి దాయకమైన అంశం. వాస్తవానికి దక్షిణా పథంలో పశ్చిమ ప్రాంత రాజ్యాలకు తూర్పు దక్షిణ ప్రాంత రాజ్యాలకు మధ్య సంఘర్షణ కొత్తదికాదు. శాతకర్ణి ఖారవేలుల కాలంలోనే ప్రారంభమై పల్లవ - చాళుక్య, చాళుక్య - చోళ యుగాల్లో కొనసాగి విజయనగర - బహమనీ యుగంలో తీవ్రతరమయింది. దీని ఛాయలు అనంతరం మహారాష్ట్ర యుగంలో సయితం కన్పిస్తాయి. బహమనీ రాజ్యం ఏర్పడిన పశ్చిమ భూములు నిస్సారమైనందున ఐశ్వర్యవంతములైన నదీ లోయల్నీ తూర్పుడెల్టా భూముల్నీ ఆక్రమించాలని సుల్తాను లాశించడం సహజం. అదీగాక ఓరుగల్లు, విజయనగరాధీశులు బహమనీ రాజ్య వాణిజ్యానికి ఆటంకాలు కలిగించేవారు. అరబ్బులనుండి తనకుద్దేశించిన గుర్రాలను సంగ్రహించినందునే వినాయక దేవుని మహమ్మద్‌షా వధించినట్లు చదివినారు. విదేశ. వాణిజ్యానికి కేంద్రమైన గోవా (రేవతీద్వీపం) ఉభయుల దృష్టిని ఆకర్షిస్తుండేది. బహమనీల నాణేలను సంగ్రహించి కరగించివేసి హిందూ రాజులు నష్టం కలిగించేవారని తెలుస్తుంది. ఉభయ రాజ్యాల ప్రభువులు దక్షిణదేశ సార్వభౌమత్వం సాధించే ఉద్దేశంతో కీలకస్థానంలో ఉన్న కృష్ణా - తుంగభద్రా అంతర్వేదినీ, ఆ ప్రాంతానికి ఆయువు పట్టులయిన రాయచూర్, ముద్గల్లు, బంకపూర్, ఆదోని దుర్గాలనూ ఆక్రమించడానికి ప్రయత్నించినారు. ఈ ఆర్థిక రాజకీయ కారణాలకు మతం పదును పెట్టింది. సుల్తానులు తమ మత వ్యాప్తికి ప్రయత్నించగా,హిందూమత రక్షణకు విజయనగరాధీశులు కంకణం ధరించినారు. క్రీ.శ. 1356 నాటి శాసనం హరిహర రాయలు సుత్రాముని బోలిన సుల్తానును నిర్జించినట్లు వర్ణిస్తున్నది. దీన్నిబట్టి విజయనగర - బహమనీ సంఘర్షణ క్రీ.శ. 1356 లోనే ప్రారంభమయింది.

ఢిల్లీ సుల్తానును ధిక్కరించి స్వతంత్ర రాజ్యం నిర్మించడమేగాక, అది ఆర్థిక సౌష్టవం కలిగి శాంతిభద్రతలతో మనడానికి తగిన ప్రభుత్వ యంత్రాంగాన్ని సయితం హరిహరుడు నిర్మించినాడు. కడవ ప్రాంతంలో అడవులునరికి వ్యవసాయ గ్రామాల నిర్మాణాన్ని ప్రోత్సహించినాడు. రాజ్యంలో గ్రామ, స్థల, నాడు విభాగా లేర్పడి, ఆయగాండ్ర, స్థలకరణాల, నాడుగౌడల నియామకం జరిగింది.

**బుక్కరాయలు (1356 - 1377)**

హరిహరుని తర్వాత బుక్కరాయలు ఇరవై సంవత్సరాలు పాలించినాడు. సామ్రాజ్య స్థాపనలో, నగర నిర్మాణంలో, పరిపాలనలో హరిహరునకీతడు సర్వదా సహాయకారిగా ఉన్నాడు. బుక్కరాయలు కాలంలో జరిగిన సంఘటన లన్నింటితో 'మదురా విజయం' ముఖ్యమయింది. క్రీ. శ. 1325 ప్రాంతంలో ఢిల్లీ సామంతులుగా మదుర నేలిన ముస్లిములు మదుర రాజ్యం స్థాపించినారు. వీరిపాలనలో హిందువులనేక బాధలనుభవించినారు. రామేశ్వరం, మదుర, శ్రీరంగం మొదలైన క్షేత్రాలలో పూజా పురస్కారాలు ఆగిపోయినాయి. బుక్కరాయలకుమారుడైన వీర కంపరాయలు సాళువ మంగు, గోపనార్యుల సాయంతో మదురపై దండెత్తినాడు మార్గమధ్యంలో సాంబువరాయల్ని ఓడించి (చెంగల్‌పట్టు ఆర్కాటు జిల్లాలు) సామంతునిగా చేసుకొని మదురపై నడచి సుల్తాన్‌నోడించి వధించి మదురను విజయనగరరాజ్యంలో లీనం చేసినాడు. తిరుపతిలో ప్రవాసంలో ఉన్న శ్రీరంగనాథుని శ్రీరంగంలో పునఃప్రతిష్ఠ చేసినాడు. ఈ దండయాత్రా విశేషాలను (1371) గంగాంబ 'మదురావిజయం'లో కీర్తించింది కొంకణ ప్రాంతంలో రాజప్రతినిధియైన మారవ్ప ప్రోత్సాహంలో మాధవమంత్రి గోవా రేవుపట్టణాన్ని (క్రీ.శ. 13c6) ఆక్రమించినాడు.

బుక్కరాయలు కాపనాయకునితో కలిసి ఢిల్లీసుల్తాన్ సహాయం సంపాదించి బహమనీ రాజ్యాన్ని విచ్ఛిన్నం చేయడానికి ప్రయత్నించడంతో విజయనగర బహమనీ రాజ్యాల మధ్య భీకర యుద్ధాలు జరిగినాయి. బుక్కరాయలకు అల్లాఉద్దీన్‌కొడుకు మహమ్మద్‌షా (1358-75) సమకాలికుడు, ఇతడు మంచి సమర్థుడు. తన ఆస్థానంలో హిందువులను ఉన్నతోద్యోగాలలో నియమించినట్లు తెలుస్తుంది. హిందూ రాజుల కుట్రలు గ్రహించి మహమ్మద్‌షా ఓరుగల్లుపై దండెత్తి గోల్కొండ వరకు ఆక్రమించినాడు. కాపయకు సహాయంగా బుక్కరాయలు పంపిన సైన్యాలు పరాజయం చెందినాయి పశ్చిమోత్తర ఆంధ్రప్రాంతం బహమనీ రాజ్యంలో బహుళా బీదర్ రాష్ట్రభాగమయింది. అనంతరం సుల్తాన్ విజయనగరంపై దృష్టిమరల్చి, ఆ రాజ్య కోశాగారం మీద ఒక ఆజ్ఞాపత్రాన్ని జారీ చేసినాడు (క్రీ.శ. 1366). ఇది అవమానంగా తీసుకొని బుక్కరాయలు దండెత్తి ముద్గల్లు నాక్రమించినాడు కాని కౌతలం, ఆదోని యుద్ధాలలో విజయ

నగర సైన్యాలు పూర్తి పరాజయం చెందినాయి. యుద్ధకాలంలో ఉభయపక్షాలు పౌరజనాన్ని క్రూరంగా హింసించినారు. చివరకు బుక్కరాయలు సంధి చేసుకో వలసి వచ్చింది. ఈ సంధి ప్రకారం యుద్ధాల్లో పౌర జనాన్ని హింసించరాదని కట్టడి చేసుకున్నారు. చాలాకాలం ఇరుపక్షాలు ఈ నిబంధనను పాటించడం విశేషం. మహమ్మద్‌షా మరణానంతరం ముజాహిద్‌షా (1375-78) సింహాసనం ఎక్కిన వెంటనే బుక్కరాయలు కృష్ణా-తుంగభద్రా అంతర్వేదిని కోరడంతో తిరిగి యుద్ధం ప్రారంభమయింది. బహమనీ సైన్యాలు విజయనగరం వరకు నడచి తిరోగమించినాయి.

బుక్కరాయని కాలంలో విజయనగరం సుస్థిరమై దక్షిణంగా విస్తరించింది. ధర్మపాలనలో బుక్కరాయలు మనువు వంటివాడని గంగాంబ వ్రాసింది. వేదభాష్యకారుడైన సాయణాచార్యులు, ఉపనిషన్మార్గ ప్రవర్తకుడైన మాధవుడు బుక్కరాయని మంత్రులు. వారణాసినుండి విద్యారణ్యులను విజయనగరానికి బుక్కరాయలు రప్పించినాడు. వైదిక వాఙ్మయానికి భాష్యరచన ప్రారంభమయింది. 'వైదికమార్గ ప్రవర్తక' బిరుదం బుక్కరాయలకు సార్థకం. తెలుగు కవి నాచన సోమనాథునిరాయలు ఆదరించినాడు.

### రెండో హరిహరరాయలు (క్రీ శ. 1377-1404)

బుక్కరాయల తరువాత రెండో హరిహరుడు సింహాసనం ఎక్కినాడు. వీర కంపరాయల అభిషేకనామమే హరిహరుడనే అభిప్రాయంకూడా ఉంది. రెండో హరిహరుని కాలంలో రాజ్యపాలన విధానంలోను వైదేశిక నీతిలోను ముఖ్యమైన మార్పులు వచ్చినాయి నాటివరకు సామ్రాజ్య భాగాలను దాయాదులు పాలించేవారు. అది మొదటి హరిహరుని కాలంనాటి ఏర్పాటు. కేంద్రాధికారం పట్ల వారి విధేయత క్రమంగా క్షీణించే ప్రమాదం ఉన్నందున వారిని తొలగించి రెండో హరిహరుడు తన కుమారులను నియమించినాడు. ఉదయగిరిలో దేవరాయలు, మదుర ప్రాంతంలో విరూపాక్షుడు, యువరాజు (రెండో) బుక్కరాయలు ముల్‌బాగల్ ప్రాంతంలో నియుక్తులయినారు. అరగ రాజ్యంపై విశ్వాస పాత్రుడైన మాధవమంత్రి నియామకం జరిగింది. రాష్ట్రాలీవిధంగా విశ్వాస పాత్రులైన ఉద్యోగుల, రాకుమారులవరమై, అధికారం కేంద్రీకృతమయినందున రెండో హరిహరుడు 'మహామండలేశ్వర' బిరుదానికి బదులు సార్వభౌమాధిపత్యం సూచించే రాజాధిరాజ, రాజపరమేశ్వరాది బిరుదులు ధరించినాడు.

రెండో హరిహరుని కాలానికి బహమనీలతో మైత్రి వహించిన పద్మనాయకులు ఓరుగల్లును ఆక్రమించినారు వెలమ బహమనీ కూటమి విజయనగరానికి ప్రమాదకరమని, దాన్ని విచ్ఛిన్నం చేయడానికి హరిహరుడు ప్రయత్నించాడు. అంతేగాక, సాధ్యమైతే రెడ్డిరాజ్యాన్ని జయించి, కృష్ణానదిని విజయనగర

ఉత్తర సరిహద్దు చేయడం, కనీసం రెడ్డిరాజ్యంతో సఖ్యంచేయడం అతనిఆశయం. ముజహిద్‌షా హత్య (క్రీ శ 1378)లో గుల్బర్గాలో చెలరేగిన అలజడులు, అనంతరం సింహాసనం ఎక్కిన రెండో మహమ్మద్‌షా (క్రీ.శ. 1378-79) శాంతి కాముకుడు కావడం, కొండవీటిలో కుమారగిరి, పెదకోమటివేముల మధ్య స్పర్థ అతనికి ప్రోత్సాహకరములయినాయి.

అమరణాంతం రెండో హరిహరుడు కొండవీటి రాజకీయాల్లో జోక్యం కలిగించుకొన్నాడు. మొదట శ్రీశైల ప్రాంతాన్ని ఆక్రమించడానికి ప్రయత్నించి రెడ్డిసేనాని కాటయవేముని చేతిలో ఓడి అతని కొడుకు కాటయకు తన కూతురునిచ్చి సంధి చేసుకున్నాడు. తిరిగి క్రీ శ 1400 ప్రాంతంలో ఉదయగిరి రాజప్రతినిధి దేవరాయలు దండెత్తి మోటుపల్లి ప్రాంతాన్ని ఆక్రమించినాడు. క్రీ.శ. 1402 ప్రాంతంలో పెదకోమటి వేముసిపై చౌండప సేనానిని పంపినాడు. కాని, ఈ ప్రయత్నాలేమీ ఫలించలేదు. పెదకోమటి వేముడు సింహాసనం ఎక్కి, తిరిగి తన రాజ్య భాగాలన్నింటినీ స్వాధీనం చేసుకున్నాడు.

వెలమ - బహమనీ కూటమిపై రెండో హరిహరుడు రెండు దండయాత్రలు పంపినాడు. మొదటి దండయాత్ర తెలంగాణంపై జరిగింది. దీన్ని యువరాజు బుక్కరాయలు, సాళువరామ దేవుడు నిర్వహించినారు. రామదేవుడు ప్రాణాలు కోల్పోయినాడు. బహమనీ సైన్యంచేత కొత్తకొండ యుద్ధంలో పరాజయం పొంది బుక్కరాయలు తిరోగమించినాడు ఈ పరాజయానికి ప్రతీకారంగా క్రీ.శ. 1397 ప్రాంతంలో రెండో దండయాత్ర జరిగింది దీనికి బుక్కరాయలు, గుండ దండనాథుడు నాయకత్వం వహించినారు. ఈ దాడిలో భాగంగానే దేవరాయలు అలంపురంపై దాడి చేసినట్లు తెలుస్తుంది. సుల్తాన్ ఫిరోజ్‌షా (1397 - 1422) ఈ దాడిని తీవ్రంగా ప్రతిఘటించినాడు. భీకర పోరాటం తర్వాత పానగల్లు బుక్కరాయల వశమయింది. చౌల్, దాబోల్ కూడ విజయనగర రాజ్యంలో చేరినాయి. తమిళ ప్రాంతాన్ని పాలిస్తున్న రాజప్రతినిధి విరూపాక్షుడు సింహళంపై దండెత్తి ఆ రాజా నోడించి కప్పం వసూలు చేసినట్లు తెలుస్తుంది.

రెండో హరిహరుని కాలంలో వర్షాభావంవల్ల దక్షిణాపథంలో తీవ్రమైన క్షామం సంభవించి మహారాష్ట్ర, తెలంగాణా ప్రాంతాలు నష్టానికి గురి అయినాయి లక్షలాది ప్రజలు మరణించినారని సమకాలిక రచనలవల్ల తెలుస్తుంది. మహారాష్ట్ర ప్రాంతంలో దీన్ని 'దుర్గాదేవి' కరువు అన్నారనీ దీని ప్రభావం పన్నెండు సంవత్సరాలు (1391 - 1403) ఉందనీ వ్రాసినారు. బహమనీ సుల్తాన్ రెండో మహమ్మద్‌షా క్షామనివారణోపాయాలపట్ల చాల శ్రద్ధ వహించినాడు. స్వంత ఖర్చుతో పదివేల యెద్దబండ్లు సమకూర్చి మాళవ, గుజరాతుల

నుండి ధాన్యం సరఫరా చేసి స్వల్ప ధరకు అమ్మించినాడట. కృష్ణా గోదావరీ మధ్య భూముల్లో ముప్పది సంవత్సరాలపాటు ఆదాయం పడిపోయింది. విజయ నగర రాజ్యానికి ఈ కరువువల్ల కలిగిన నష్టం తెలియదు. రెండో హరిహరునకు క్రీ. శ. 1386 వరకూ విద్యారణ్యులు మంత్రియని చెప్పవచ్చు. వేదభాష్యరచన ఈతని కాలంలోనే పూర్తయి వుంటుంది.

రెండో హరిహరుని మరణానంతరం (1404) విజయనగర చరిత్రలో మొదటి వారసత్వ కలహం జరిగింది. యువరాజుగా ఉన్న బుక్కరాయల్ని కాదని విరూపాక్షుడు సింహాసనం ఆక్రమించినాడు. అచిరకాలంలోనే అతణ్ణి తొలగించి బుక్కరాయలు రాజై, రెండేండ్లు పాలించినాడు. రెండో బుక్క రాయల్ని తొలగించి క్రీ. శ. 1406 లో దేవరాయలు పట్టాభిషేకం జరుపు కున్నాడు.

## మొదటి దేవరాయలు (1406 - 22)

మొదటి దేవరాయలి కాలంలో చాలభాగం యుద్ధాలతో గడిచిపోయింది. బహమనీ రెడ్డి రాజ్యాలపట్ల నీతడు తన తండ్రి విధానమే అనుసరించినాడు. కాని వెలమలతో మైత్రి ఈతని కాలంలో కొత్త పరిణామం.

సింహాసనం ఎక్కడంతోనే దేవరాయలు ఫిరోజ్‌షా దండయాత్ర నెదు ర్కొనవలసి వచ్చింది. బహమనీ సుల్తానుల్లో ఫిరోజ్‌షా (1397 - 1422) సుప్ర సిద్ధుడు, బహు భాషాకోవిదుడు. గుల్బర్గానుండి పాలించిన బహమనీలలో చివరి వాడు. క్రీ. శ. 1406లో ఫిరోజ్‌షా విజయనగరంపై దండెత్తిన కారణం గురించి ముస్లిం చరిత్ర కారుల్లోనే ఏకాభిప్రాయం లేదు. ముద్గల్లు వాస్తవ్యురాలైన ఒక కంసాలి కుమార్తె నెహాల్‌ను దేవరాయలు బలాత్కరించగా ఆమెను రక్షిం చడానికై ఫిరోజ్‌షా దండెత్తి విజయనగరం వరకు నడచెనని,దేవరాయలు ఓడి తన కూతుర్ని సుల్తాన్‌కిచ్చి పెండ్లి జరిపి సంధి చేసుకున్నాడని. నెహాల్‌కు సుల్తాను తన కొడుకు హసన్‌ఖాన్‌తో పెండ్లి జరిపినాడని ఫెరిష్టా వృత్తాంతం. కాని సయ్యద్ అలీ ప్రకారం ఇది కేవలం మతయుద్ధం. ఫిరోజ్‌షా దేవరాయల నుండి 33 లక్షల ధనం గ్రహించి మరలినాడని అలీ కథనం.

విజయనగరంపై ఫిరోజ్‌షా దండెత్తిన సమయంలోనే కందుకూరు రెడ్లు దండెత్తి ఉదయగిరి రాజ్యంలోని పొత్తపినాడు, పులుగులనాడు నాక్రమించినారు. కొండవీడు, కందుకూరులకు వ్యతిరేకంగా దేవరాయలు రాజమహేంద్రవరం కాటయ వేమునితో సంధి చేసుకొని (క్రీ.శ. 1410) పెదకోమటి, అన్నదేవ, ఫిరోజ్‌షా కూటమిని ప్రతిఘటించినాడు. కాటయ వేమునకు సహాయంగా పంపిన విజయనగర సైన్యాలు పరాజయం పొందినాయి. కాని, కాటయ వేముని మరణా నంతరం రాజమహేంద్రవరం వ్యవహారాలు నిర్వహించిన అల్లాడరెడ్డి

పెదకోమటి, ఫిరోజ్‌షాల నోడించి పారదోలినాడు. రాజమహేంద్రవర, విజయ నగరాల మధ్య సంబంధాన్ని విచ్ఛిన్నంచేసే ఆశయంతో ఫిరోజ్‌షా పానగల్లు దుర్గం ముట్టడించినాడు. ముట్టడి రెండేండ్లు సాగింది. ఈ ముట్టడి సందర్భంలోనే పద్మనాయకులు విజయనగర పక్షం వహించినారు బహుశా కొండవీటి రెడ్ల దృష్టి మరల్చడానికి దేవరాయలు తీరాంధ్రంపైకి దండు పంపినాడు. ఈ సైన్యం పొత్తపి వులుగులనాడులనేగాక ఉత్తరంగా నడచి మోటుపల్లివరకు ఆక్రమించింది; వెలమల సాయంలో ఈ సైన్యం భీకరంగా పోరాడి ఫిరోజ్‌షా నోడించి పారదోలింది. పానగల్లు - నల్గొండ ప్రాంతం విజయనగరం స్వాధీనమయింది.

దేవరాయలు విజయనగర ప్రాకారాలను బలపరచి బురుజులు నిర్మించినాడు. తుంగభద్రానదికి ఆనకట్ట వేయించి, 15 మైళ్ళ కొండ ప్రాంతాన్ని తొలిపించి కాలువల ద్వారా నగరానికి నీటి సౌకర్యం సమకూర్చినాడు. జక్కన కవి రచించిన "విక్రమార్క చరిత్ర'ను కృతిపొందిన సిద్దనను ఆదరించిన చామన దండనాయకుడు దేవరాయల మంత్రి.

దేవరాయల మరణానంతరం అతని కుమారుడైన రామచంద్రరాయలు రాజయినాడు. కాని అతణ్ణి కొన్ని నెలల్లోనే పదభ్రష్టునిచేసి తమ్ముడు విజయ రాయలు సింహాసనం ఆక్రమించినాడు. ఈతడు కూడ సమర్థుడు కాదు. అందుచే ఈతని పాలనా కాలం నాలుగు సంవత్సరాలు. కొడుకైన (రెండో) దేవరాయలే ప్రభుత్వాన్ని నిర్వహించినాడు.

**రెండో దేవరాయలు (క్రీ. శ. 1426 - 46)**

రెండో దేవరాయలు సంగమవంశంలో ప్రసిద్ధుడు. ఇతణ్ణి ప్రౌఢదేవ రాయలని కూడ వ్యవహరించేవారు. 'గజబెంటకార' అనే బిరుదం ఏనుగుల వేటలో ఈతని ఆసక్తిని సామర్థ్యాన్ని సూచిస్తుంది. విజయనగర రాజ్యం ఈతని కాలంలో మున్నెన్నడూ లేనంతగా విస్తరించింది. విజయనగర గౌరవవైభవాలు విదేశీయులను ఆకర్షించినాయి.

తీరాంధ్రంపై విజయనగరాధికారం స్థాపించాలనే ఆశయం రెండో దేవ రాయలి కాలంలో ఫలించింది. కొండవీడులో రాచవేముని మరణానంతరం సామంతులు స్వతంత్రులై చిన్న చిన్న రాజ్యాలు స్థాపించుకున్నట్లు కన్పిస్తుంది. దేవరాయలు దండెత్తి పంట మైలారరెడ్డి (నరసరావుపేట, ఒంగోలు), సాళువ తెలుంగురాయలు (పొదిలి ప్రాంతం) మొదలైనవారిని జయించి క్రీ. శ. 1428 నాటికి కొండవీడును ఆక్రమించడమేగాక సింహాచలంవరకు రెడ్డి రాజ్యాన్ని సామంత రాజ్యంగా చేసుకున్నాడు. (చూడుడు-రెడ్డి యుగం) క్రీ. శ. 1435 లో కళింగ సింహాసనం ఎక్కిన కపిలేశ్వర గజపతి క్రీ.శ. 1444 లో రాజమహేంద్ర రాజ్యం జయించడానికి ప్రయత్నించినాడు. అతని దాడిని తిప్పికొట్టడానికి

దేవరాయలు మల్లప వడయ సేనానిని పంపినాడు. తాత్కాలికంగా గజపతి విజృంభణ సమసింది. విజయనగరాధికారానికి ప్రమాదం తప్పింది.

దేవరాయల కాలంలో కేరళలో అధిక భాగం (కళ్ళికోట మినహాయించి) విజయనగరాధికారాన్ని అంగీకరించింది. విజయనగరాధీశుడు వాస్తవానికి దక్షిణ దేశాధీశుడయినాడు. అంతేగాదు, దేవరాయల సేనాని లక్కన్న దండనాయకుడు-దండెత్తి జాఫ్నానుండి కప్పం వసూలుచేసినాడు. నాటినుండియే విజయనగరాధీశులు "దక్షిణ సముద్రాధీశ్వర" బిరుదం ధరించినారు.అబ్దుర్ రజాక్ చెప్పినట్లు రాయల సామ్రాజ్యం "సరన్‌దీవ్ (సింహళం) సరిహద్దుల నుండి గుల్‌బర్గా సరిహద్దువరకు బెంగాల్ (ఒరిస్సా) నుండి మాబార్‌వరకూ విస్తరించింది."

రెండో దేవరాయలకాలంలో విజయనగర బహమనీరాజ్యాల మధ్య రెండు యుద్ధాలు జరిగినాయి. ఈ కాలంలో అహమ్మద్‌షా (1422-36), అతని కొడుకు రెండో అల్లాఉద్దీన్ బహమన్‌షా (1436 - 58) సుల్తానులు సింహాసనం ఎక్కిన వెంటనే గుల్బర్గా రాజకీయ కుట్రలకు కేంద్రంగా వుందనీ శీతోష్ణ పరిస్థితులు అనుకూలంగా లేవనీ అహమ్మద్‌షా రాజధానిని బిదర్‌కు మార్చినాడు. అనంతరం సైన్యాన్ని సమకూర్చుకొని పానగల్లులో ఫిరోజ్‌షాకు జరిగిన పరాజయానికి ప్రతీకారం తీర్చుకొనే ఉద్దేశంతో అహమ్మద్‌షా విజయనగరంపై దండెత్తినాడు. దేవరాయలు పరాజయం పొంది నష్టపరిహారం చెల్లించి సంధి చేసుకున్నాడు. ఈ సంధి అనంతరమే అహమ్మద్‌షా వెలమలను శిక్షించడానికై తెలంగాణంపై దండయాత్రచేసి ఆక్రమించినాడు. రాయల సహాయం పద్మనాయకులకు లభించలేదు. దీనితో విజయనగరానికి వెలమలకు మధ్య మైత్రి విచ్ఛిన్నమయింది.

బహమనీలతో రెండోయుద్ధాన్ని దేవరాయలే ప్రారంభించినాడు. క్రీ. శ. 1443లో దేవరాయలు దండెత్తి ముద్గల్లునాక్రమించి రాయచూర్, బంకాపూర్‌లను ముట్టడించినాడు. అతని సైన్యాలు బిజాపూర్, సాగర్‌ల వరకు పురోగమించినాయి. అల్లాఉద్దీన్ తెలంగాణా దౌలతాబాద్, బిరార్‌ల నుండి సైన్యాలు రప్పించి రాయల నెదిరించినాడు. యుద్ధం రెండుమాసాలు జరిగింది. యుద్ధ పర్యవసానం గురించి ఫెరిస్టా, అబ్దుర్ రజాక్‌ల నుంచి భిన్నములైన సమాచారములు లభిస్తున్నాయి. రాయలు ఓడి కప్పం చెల్లించడానికి అంగీకరించగా కృష్ణానదిని ఇకముందు దాటిరానని సుల్తాన్ వాగ్దానం చేసినాడని ఫెరిస్టా కథనం. ఈ యుద్ధంలో గుల్బర్గావరకు నడచి విజయవంతంగా రాయలు రాజధానికి మరలినాడని రజాక్ వృత్తాంతం.

రెండో దేవరాయలు విజయనగర బలగౌరవాలినుమడించడానికి శ్రద్ధ వహించినాడు. బహమనీ రాజ్యంకంటె జనసమృద్ధి ఉండి ఐశ్వర్యవంతమైన

విజయనగరం సుల్తానుల చేతులో తరచు పరాజయం పొందటానికి విజయనగర అశ్వధానుష్క దళాల దౌర్బల్యమే కారణమని పరిశీలించి ముస్లిం ఉద్యోగులను నియమించి తన సైన్యానికి శిక్షణ నిప్పించినాడు. వాస్తవానికి మొదటి దేవరాయల కాలంనుండి విజయనగరాస్థానంలో ముస్లిములు చేరినారు. రెండో దేవరాయలి ఉద్యోగంలో 2000 మంది ముస్లింములున్నట్లు అతని సైన్యంలో 2,00,000 కాల్బలము, 60,000 ధానుష్కులు, 80,000 అశ్వికులు ఉన్నారని ఫెరిస్టా వృత్తాంతము. తన సైన్యం సామర్థ్యాన్ని పరీక్షించటానికే క్రీ. శ. 1443 లో దేవరాయలు బహమనీ రాజ్యంపై దండెత్తి వుంటాడు.

దేవరాయలు శైవమతాభిమానియేగాని మతసహనం ఉన్న ఉదార పాలకుడు. వీరశైవుడైన చామరసు రాయల పోషణలో కన్నడంలో "ప్రభులింగ లీల'' రచించినాడు. రాయల మంత్రియైన ప్రోలుగంటి తిప్పన విఠలస్వామి దేవాలయానికి భోగ మంటపం సమకూర్చినాడు. హజార రామాలయ నిర్మాణం కూడ ఇదేకాలంలో జరిగిందని కొందరి అభిప్రాయం. జైనులు రాయల అనుమతితో పాన్‌సుపారీబజారులో జినాలయం నిర్మించుకున్నారు. రాజధానిలో తురకవాడ అభివృద్ధిచెందడమేగాక తురకలకు ప్రార్థనాసౌకర్యాలు ఏర్పడినాయి.

రాయలు గొప్ప పండితుడు. పండితగోష్ఠి అతని కాలక్షేపం. సంస్కృతంలో మహాకవి కవిసార్వభౌముడైన అరుణగిరినాథడిండిము డాతని ఆస్థానకవి. అతని నోడించి శ్రీనాథుడు దేవరాయల ఆదరణకు పాత్రుడయినాడు.

దేవరాయల కీర్తిప్రతిష్ఠలు నలుదిశలకు వ్యాపించడంలో ఆశ్చర్యం లేదు. పర్షియా చక్రవర్తి రాయబారి అబ్దుర్ రజాక్ రాయల ఆస్థానానికి క్రీ. శ. 1443 లోను నికోలోకాంటే అనే ఇటలీ యాత్రికుడు క్రీ శ. 1442 ప్రాంతంలోను విజయనగరం దర్శించినారు. వీరిద్దరూ రాయల్ని, విజయనగర వైభవాన్ని సామ్రాజ్య స్థితిగతులను కన్నులకు గట్టినట్లు వర్ణించినారు.

కాంటే లెక్క ప్రకారం విజయనగరం చుట్టుకొలత 60 మైళ్ళు. కొండలను తుంగభద్రానదినీ కలుపుతూ నగరం చుట్టూ ఏడు ప్రాకారాలున్నాయి. ప్రాకారాల మధ్య పంట పొలాలు, అంగళ్లు, నివాసగృహాలు ఉన్నాయి. ఏడో ప్రాకారంలో రాజ ప్రాసాదము, ఉన్నతోద్యోగుల నివాసాలు ఉన్నాయి. నగరంలో 90,000 మంది ఆయుధోపజీవులున్నారు. ప్రజల్లో బహుభార్యాత్వము సతీ సహగమనం ఎక్కువ. దీపావళి, శివరాత్రి రథోత్సవాలు కాంటే నెక్కువగా ఆకర్షించినాయి. శివరాత్రి రథోత్సవాల సందర్భంలో ఇనుప గాలాలు గుచ్చుకొని ఉయ్యాలలూగే క్రూర ఆచారం కొందరు అనుసరించినట్లు కాంటే వ్రాసినాడు. భారతదేశంలోని రాజులందరిలో రాయలు బలశాలి; అతనికి 12,000 మంది భార్యలు; వారిలో 2000 మంది వరకు సహగమనం చేయడానికి సంసిద్ధులు.

అబ్దుర్‌రజాక్ మాటల్లో - రాయలు చాల బలవంతుడు. దూరదేశాలైన పెగూ, టెనాసరిమ్‌లు కూడ అతనికి కప్పం చెల్లిస్తాయి. అతని రాజ్యంలో 300 ఓడ రేవులున్నాయి. రాజ్యం మహైశ్వర్యాన్ని అనుభవిస్తున్నది. విజయనగరం వంటి వైభవోపేతమైన మరొక నగరాన్ని కన్నులు చూడలేదు. దానితో సమానమైన మరొక నగరం ప్రపంచంలో ఉన్నదని చెవులు వినలేదు. నగరం లోపలి రాజప్రాసాదం మనోహరంగా ఉంది. నగర వీధుల్లో బంగారమూ, రత్నాలు, వజ్రవైడూర్యాలు రాశులుపోసి బాహాటంగా విక్రయిస్తారు. ప్రజలు విలాసప్రియులు. ఉల్లాసంగా జీవితం గడుపుతారు. వారికి ఆహారం ఎంత అవసరమో గులాబీలు అంత ముఖ్యం.

**సంగమవంశ అస్తమయం**

రెండో దేవరాయల మరణానంతరం రాజులైనవారు అసమర్థులైనందున రాజ్యబలగౌరవాలు క్షీణించి సంగమ వంశానికేగాక విజయనగర రాజ్యానికే ప్రమాదం వాటిల్లింది. దేవరాయల కొడుకు మల్లికార్జునరాయలపాలన క్రీ. శ. 1446 నుండి 1465 వరకు సాగింది. ఈతని బలహీనతను గుర్తించిన విజయనగర శత్రువులైన బహమనీ సుల్తానులు,గజపతులు విజృంభించి రాజ్యభాగాలను ఆక్రమించసాగినారు. గజపతులకు వెలమలు తోడైనారు.

కపిలేశ్వర గజపతి క్రీ. శ. 1448 లో తీరాంధ్రంపై దాడి జరిపినట్లు పెనుగొండ శాసనం సూచిస్తున్నది. వెలమల సహాయంతో గజపతి రాజమహేంద్రవరం ఆక్రమించి కొండవీడుపై నడచినాడు. క్రీ.శ. 1449 వరకూ కొండవీడులో విజయనగరాధికారం చెల్లింది. బహుశా 1450 లో కొండవీడు గజపతి వశమయింది. విజయనగరంపై దాడిలో భాగంగా బెల్లంకొండ, వెలుగోడు, అద్దంకి, శ్రీశైల ప్రాంతాలను ఆక్రమించి కపిలేశ్వరుడు విజయనగరం ముట్టడించినాడు. విరూపాక్షరాయలు ఓడి కప్పం చెల్లించినట్లు ప్రతాపరుద్ర గజపతి అనంతవరం శాసనం చెబుతున్నది. ఇదే సమయంలో బహమనీసుల్తాన్ కూడ విజయనగరంపై దాడి చేసినాడు. కాని ఆదండయాత్ర ఫలితం తెలియదు. గజపతి, సుల్తాన్ కలిసి విజయనగరాన్ని ముట్టడించినారని కొందరి అభిప్రాయం. కాని, ఈ అభిప్రాయానికి స్పష్టమైన ఆధారం లేదు.

ఇంతలో దేవరకొండ వెలమలు కపిలేంద్రుని సహాయం అర్థించినారు. క్రీ.శ. 1453 నుండి తెలంగాణాప్రాంతంలో సుల్తానులపై తరచుగా తిరుగుబాట్లు జరిగినాయి. ఆ సంవత్సరమే భోన్‌గిరిపాలకుడైన జలాలఖాన్ అతని కొడుకు సికందర్‌ఖాన్ తిరుగుబాటు చేసినారు. సుల్తాన్ రెండో అల్లాఉద్దీన్ మామూద్ గావాన్‌సేనానిని వారిపైకి పంపినాడు. వెలమల సాయంతో గావాన్ తిరుగుబాటుదారుల నోడించి క్షమించినాడు. అల్లాఉద్దీన్ మరణానంతరం హుమాయూన్

కాలంలో (1458.61) తిరిగి జలాల్‌ఖాన్ తిరుగుబాటు చేసినాడు. వీరితో కలిసి వెలమలు తమ స్వాతంత్ర్యం పొందాలని ఆశించినారు. సుల్తాన్ పంపిన ఖ్వాజా జహాన్, నైజామ్ ఉల్‌ముల్క్‌లు తిరుగుబాటుదారుల నంతమొందించి దేవరకొండపై నడచినారు. దేవరకొండ నేలే లింగమనీడు గత్యంతరం లేక కపిలేశ్వరుని సహాయం అర్థించినాడు.

కపిలేశ్వరుడు తన కుమారుడైన హంవీరుని నాయకత్వంలో పంపిన సైన్యం బహమనీ సేనానులను ఓడించింది. సుల్తాన్ తెలంగాణా రక్షణబాధ్యత గావాన్‌కు అప్పగించినాడు. హంవీరుడు గావాన్ నోడించి ఓరుగల్లును వశపరచుకున్నాడు. గావాన్ బిదర్‌కు మరలడంతో తెలంగాణా గజపతుల స్వాధీనమయింది. క్రీ. శ. 1461 లో సుల్తాన్ హుమాయూన్ మరణించినాడు. వెలమ నాయకులు సాయంగా గజపతి సైన్యాలు బహమనీరాజ్యంలో ప్రవేశించి బిదర్‌ను ముట్టడించినాయి. కాని, గజపతిరాజ్యం ఉత్తర సరిహద్దులో ప్రమాదం ఏర్పడినందున బిదర్ ముట్టడి విరమించి మరలవలసి వచ్చింది. అయినా రాయలని, సుల్తానును ఓడించిన సూచనగా కపిలేశ్వరుడు 'నవకోటికర్ణాటకలుబరిగేశ్వర' బిరుదం ధరించినాడు.

అనంతరం కపిలేశ్వరుడు దక్షిణతీరాంధ్రాన్ని జయించడానికై క్రీ.శ. 1464 లో హంవీరుని పంపినాడు. ఈ దండయాత్ర కాంచీపురి వరకు సాగినట్లు తెలుస్తుంది. చంద్రగిరి, ఉదయగిరి రాజ్యాలు అతని వశమయినాయి. తమిళ మండలంలోని శాసనాలనుబట్టి హంవీరుని కొడుకు కుమార కపిలేశ్వర మహాపాత్రుడు కొండపల్లి- అద్దంకి, వినుకొండ, పడైవీడు, వలుదులంపట్టుసావడి, తిరుదానూరు, తిరుచిరాపల్లి, చంద్రగిరులను పాలించినాడు. ఈ దండయాత్రను ప్రతిఘటించడానికి మల్లికార్జున రాయలు ప్రయత్నించినట్లు కన్పించదు. తీరాంధ్రం గజపతి రాజ్యంలో చేరింది. గజపతి (ఒడ్డె) పాలనలో దక్షిణాదిన జంబి, శ్రీరంగం మొదలైన ప్రసిద్ధ క్షేత్రాలలో పూజాదికాలు లేక ఆలయాలు జీర్ణములైనాయని శాసనాలు చాటుతున్నాయి.

మల్లికార్జునరాయల మరణానంతరం రెండో విరూపాక్షరాయలు సింహాసనం ఆక్రమించినాడు. ఇతడు రెండో దేవరాయల తమ్మునికొడుకు. దాయాదులను నిద్రలో వధించి రెండో విరూపాక్షుడు సింహాసనం హస్తగతం చేసుకొన్నట్లు 'ప్రపన్నామృతం' చెబుతున్నది. ఇతడు సమర్థుడుకాడని వ్యసనలోలుడని న్యూనిజ్ వ్రాసినాడు. అయితే ఈతని కాలంలోనే సామ్రాజ్యం దక్షిణతూర్పు ప్రాంతాలనుండి గజపతులను తరిమివేయడం జరిగింది. దాన్ని సాధించింది పెనుగొండ రాజ్యపాలకుడైన సాళువ నరసింహరాయులు. క్రీ.శ. 1470 వరకూ ఉదయగిరి గజపతులు ప్రతినిధియైన కంటంరాజు తమ్మరాజు అధీనంలో ఉంది.

సాళువ నరసింహరాయలు ఉదయగిరిని సాధించినాడని రాజనాథడిండిముడు సాళువాభ్యుదయంలో పేర్కొన్నాడు. క్రీ శ. 1470 లో కపిలేశ్వరుడు మరణించినాడు. అతడు కృష్ణాతీరంలో మరణించినట్లు జనశ్రుతి. కపిలేశ్వరుడు, అతని కొడుకు పురుషోత్తముడు బహుశా ఉదయగిరి రాజ్యరక్షణకై దక్షిణాదికి వచ్చి పరాజయం పొందివుంటారు కృష్ణానదీపర్యంతం తీరాంధ్రం తిరిగి విజయ నగరంలో చేరింది. కపిలేశ్వరుని మరణానంతరం నరసింహరాయలు గోదావరి వరకు ఆక్రమించివుంటాడు క్రీ.శ. 1477 లో గోదావరీ ప్రాంతంలో నరసింహుని అధికారం చెల్లినట్లు ముస్లిం చరిత్రలు చెబుతున్నాయి.

కపిలేశ్వరుని మరణానంతరం గజపతి సింహాసనానికై జరిగిన కలహాలలో హంవీరునోడించి పురుషోత్తముడు రాజయినాడు. గత్యంతరంలేక హంవీరుడు బహమనీ సుల్తాన్ సహాయ మర్థించినాడు. నాటి సుల్తాన్ మూడో మహమ్మద్‌షా (క్రీ.శ. 1463 - 82). ఈతని తండ్రి హుమాయూన్‌షా (క్రీ.శ. 1458 - 1461) పరమక్రూరుడు (జలీమ్) అని ఫెరిస్టావంటి ముస్లిం చరిత్రకారులే వ్రాసినారు. హుమాయూన్ మరణించే నాటికి అతని కొడుకులు (మూడో) అహమ్మద్‌షా, (మూడో) మహమ్మద్‌షాలు బాలురై నందున వారితల్లి మఖ్దూమాజహాన్ నర్గిస్‌బేగం సంరక్షకురాలుగా, గావాన్ సహాయంతో పరిపాలన నిర్వహించింది. మూడో అహమ్మద్‌షా హటాన్మరణంతో మహమ్మద్‌షా సింహాసనం ఎక్కినాడు. ఇతడు మంచివిద్యావంతుడు. పరిపాలనాదక్షుడు. యుద్ధాల్లో ఆరితేరిన లష్కర్ (వీరుడు) అని ప్రసిద్ధికెక్కినాడు. మహమూద్‌గావాన్ ఇతని అమీర్ ఉల్‌ఉమ్రా; పారశీక దేశస్థుడు. సమర్థుడైన సేనాని, రాజనీతిపరుడు. వీరికాలంలో బహమనీ రాజ్యాధి కారం ఉచ్చస్థితినందింది. కాని, వీరి మరణంతో బహమనీ రాజ్యం విచ్ఛిన్న మయింది. సింహాసనానికి వచ్చిన అనతికాలానికే విజయనగరంలోని అరాజకాన్ని అవకాశంగా తీసుకొని చౌల్, దాబోల్ మొదలైన ప్రాంతాలను గోవా రేవు పట్టణాన్ని (1472) మహమ్మద్‌షా ఆక్రమించినాడు. హంవీరుడు రాజమహేంద్ర వర, తెలంగాణాలను దత్తం చేస్తాననడంతో మహమ్మదిషా అతనికి సహాయం చేయడానికి అంగీకరించి, మాలిక్‌హసన్‌బ్రహీని సైన్యంతో పంపినాడు. బహమనీ సైన్యాలు కొండవీడు, రాజమహేంద్రవరాలనాక్రమించి ఒరిస్సాపై పురోగమించి హంవీరుని సింహాసనం ఎక్కించినాయి. (క్రీ. శ. 1471). మాలిక్‌బ్రహీ నైజాం ఉల్‌ముల్క్ రాజమహేంద్రవరంలో పాలించసాగినాడు. హంవీరుడు ఎంతో కాలం సింహాసనం నిలుపుకోలేక పోయినాడు. పురుషోత్తముని చేతిలో ఓడి ఉభయులు సమాధానపడి కృష్ణా గోదావరి అంతర్వేదిని జయించబూనినారు. వారి నెదిరించలేక బ్రహీనైజాం ఉల్‌ముల్క్ వజీరాబాద్‌కు తిరోగమించడంతో తీరాంధ్రం గజపతుల వశమయింది.

సుల్తాన్ మహమ్మద్‌షా ఆగ్రహించి స్వయంగా ఆంధ్రదేశంపై దండెత్తినాడు. రాజమహేంద్రవరం ఆక్రమించి ఒరిస్సాపైకి పురోగమించినాడు. పురుషోత్తమ, హంవీరులోడి సంధి చేసుకున్నారు. తిరిగి రాజమహేంద్రవర రాజ్యం బహమనీల వశమయింది. సుల్తాన్ దృష్టి దక్షిణ తీరాంధ్రంపైకి మరలింది. ఆ ప్రాంతం సాళువ నరసింహుని ఆధీనంలో ఉంది. తెలంగాణంలోని ప్రభువులను రెచ్చగొట్టుతున్నందున సాళువ నరసింహునిపై సుల్తానుకు ఆగ్రహంగా ఉంది. అందుచే రాజమహేంద్రవర, తెలంగాణా తరఫ్‌లను బ్రహీన్నైజాం ఉల్‌ముల్క్, అజంఖాన్‌ల ఆధీనంలో ఉంచి దండయాత్ర సాగించినాడు. కొండవీడును వశపరచుకొని, క్రీ.శ. 1481 మార్చినెలలో కాంచీపురిని పట్టుకొని దోచి అపార ధనరాశులతో మరలినాడు. బహమనీ సుల్తానుల్లో మరెవ్వరూ కాంచీపురం వరకు దండయాత్ర సాగించినవారు లేరు.

సుల్తాన్ కాంచీపుర దండయాత్రలో నుండగా సాళువ నరసింహుడు మచిలీపట్టణ ప్రాంతాల నాక్రమించినట్లు కన్పిస్తుంది. అంతేగాదు, నరసింహుని సేనాని తుళువ ఈశ్వర నాయకుడు సుల్తాన్ సైన్యాలను కందుకూరు దగ్గర ఓడించి అతని శిబిరాన్ని దోచుకున్నాడు. ఇది తీరని అవమానంగా భావించి నరసింహుని శిక్షించడానికై యూసఫ్ ఆదిల్‌ఖాన్, ఫకల్ ఉల్‌ముల్క్ సేనానులను పెనుగొండపైకి పంపి తాను మచిలీపట్టణంపైకి నడిచినాడు. పెనుగొండపై నడచిన సైన్యాలు పరాజయంచెంది తిరోగమించినాయి. కాని, సుల్తాన్ మచిలీపట్టణాన్ని వశపరచుకున్నాడు. మచిలీపట్టణంనుండి మరలి కొండపల్లి దగ్గర సుల్తాన్ విశ్రాంతి తీసుకుంటుండగా గావాన్‌పై కుట్ర జరిగింది.

గావాన్ విదేశీ ముస్లిం. నాటికి చాలారోజులుగా విదేశీ, దక్కన్ ముస్లిం వర్గాలేర్పడి, ఉభయుల మధ్య తీవ్రఘర్షణలు జరుగుతున్నాయి. గావాన్ బహమనీ రాజ్యాన్ని ఎనిమిది తరఫ్‌లుగా విభజించి, తరఫ్‌దారుల ద్వారా అధికారాన్ని కేంద్రీకృతం చేసినాడు. దీనితో సర్దారుల ప్రాబల్యం తగ్గింది. అందుచే వారు గజపతి దండయాత్రను గావాన్ ఆహ్వానించినట్లు ఒక లేఖను కల్పించి సుల్తానుచే గావాన్‌కు మరణశిక్ష విధిస్తూ ఆజ్ఞ జారీ చేయించినారు. "గావాన్ మరణంతో (1481) బహమనీరాజ్యంలో ఐక్యమూ, పాటవమూ నశించినాయి" రాజ్యం చుక్కానిలేని నౌక అయింది. కుట్ర గ్రహించిన సుల్తాన్ పశ్చాత్తాపంతో క్రీ. శ. 1482 లో మరణించినాడు బహమనీ సామ్రాజ్యం విచ్ఛిన్నం కాసాగింది.

విజయనగరంలో సయితం పరిస్థితులు విషమించినాయి. వ్యసన లోలుడైన విరూపాక్షరాయల దుష్పరిపాలనను అతని కొడుకు సహించలేక అతణ్ణి హత్య చేసినాడు, (క్రీ శ. 1485). కాని, పశ్చాత్తాపంతో సింహాసనాన్ని తమ్ముడు ప్రౌఢరాయలకు దత్తంచేసినాడు. ప్రౌఢరాయలుకూడ దుర్మార్గుడే సింహాసనం ఎక్కిన

వెంటనే అందుకు కారకుడైన అన్నను వధించి విలాసాల్లో మునిగి తేలసాగినాడు. అతణ్ణి బాగుపరచడం అసంభవమనీ అతని పాలన కొనసాగితే విజయనగర రాజ్యం విచ్ఛిన్నం అయ్యే ప్రమాదం ఉందనీ సామంతులందరూ గుర్తించినారు. ఆ పరిస్థితుల్లో రాజ్యాన్ని రక్షించగల సమర్థుడు సాళువ నరసింహరాయలే. తన సేనాని తుళువ నరసనాయకుని విజయనగరంపైకి నరసింహుడు పంపినాడు. నరసనాయకుని దాడివార్త సయితం ప్రౌఢరాయల్ని కదిలించలేకపోయింది. నగరాన్ని ఆక్రమించి నరసనాయకుడు రాజప్రాసాదంలో ప్రవేశించినాడు. 'దొడ్డి దోవన' నగరవీధుల్లోని జనంలోచేరి ప్రౌఢరాయలు పొరుగుదేశానికి పారిపోయి నాడు. సంగమవంశం 185 సంవత్సరాల పరిపాలన అనంతరం అస్తమించింది.

## సాళువ వంశం

## (1485-1505)

కర్ణాటకంలోని కల్యాణ నగరం సాళువ వంశ జన్మస్థలంగా కనిపిస్తుంది. ఈ వంశస్థులు కల్యాణపురవరాధీశ్వర బిరుదం ధరించినారు. బహుశా ముస్లిం దండయాత్రల కాలంలో ఆంధ్రదేశానికి వీరు వలస వచ్చివుంటారు. కర్నూలు, చంద్రగిరి ప్రాంతాల్లో వీరి రాజకీయ ప్రాబల్యం ప్రారంభమయింది. వీరి అసలు వంశనామం తెలియదు. అయితే నరసింహుని పూర్వుల్లో 'కటారిసాళువ' బిరుదం ఉంది. నరసింహుని ప్రపితామహుడైన మంగిరాజుకు 'ప్రతిపక్షసాళువ' బిరుదం ఉంది. కాబట్టి క్రమంగా బిరుద నామమే వంశ నామమయిందని భావించడం ఉచితం.

'సాళువాభ్యుదయా'న్నిబట్టి కంపరాయల మధురాపురి దండయాత్రలో శ్రీరంగనాథుని పునఃప్రతిష్ఠలో మంగిరాజు ప్రముఖపాత్ర నిర్వహించినాడు. శ్రీరంగనాథునకాతడు 60,000 మాడలు, ఎనిమిది గ్రామాలు దానం చేసినాడట! 'ప్రతిపక్షసాళువ' బిరుదం ధరించింది ఈతడే! నాడు మొదలు సాళువ వంశస్థులు కర్నూలు, చంద్రగిరి ప్రాంతాలను విజయనగర ఉద్యోగులుగా పాలించినట్లు స్థానికచరిత్రలు, శాసనాలు సూచిస్తున్నాయి. కాని నరసింహరాయల తండ్రి గుండరాజు కల్యాణంనుండి పాలించినాడని సాళువాభ్యుదయం చెబుతున్నది. గుండరాజు మరణానంతరం కల్యాణ నగరానికి విపత్తు సంభవించగా నరసింహ రాయలు చంద్రగిరికి రాజధాని మార్చినాడట!

చంద్రగిరి ప్రభువుగా నరసింహుడు బలవంతుడై సాటి ప్రభువర్గంలో పలుకుబడి సంపాదించినాడు. చాలకాలం సంగములకు విధేయుడుగానే విజయ నగర రాజ్య రక్షణకు పూనుకొన్నాడు. విరూపాక్షరాయల అసమర్థ దుష్పరిపాల వల్ల రాజ్యంలో అలజడులు చెలరేగినాయి. గజపతులు, బహమనీలు దండెత్తి రాజ్యభాగాలను ఆక్రమిస్తున్నారు. అట్టి పరిస్థితులను చక్కబరచడానికి 1460

ప్రాంతంనుండి నరసింహుని ప్రయత్నాలను గురించి తెలుస్తుంది. దక్షిణదేశంలో పాండ్యులు మొదలైన తమిళపాలకుల ప్రోత్సాహంతో బాణప్రభువు భువనైక సమర కోలాహల మావలిబాణాధిరాయలు తిరుగుబాటొనర్చి కాంచీపురినాక్రమించినాడు. 'సాళువాభ్యుదయం', 'జైమినిభారతా'లను బట్టి క్రీ.శ 1462 ప్రాంతంలో నరసింహరాయలు దక్షిణ దండయాత్ర జరిపి తిగుళ (తమిళు)లను, చెవులపోతు (బాణు) లను నిర్జించి శాంతి నెలకొల్పినట్లు తెలుస్తున్నది. అనంతరం విజయనగర కళింగ–బహమనీ రాజ్యాల మధ్య తీరాంధ్రంలో జరిగిన సంఘర్షణలో పాల్గొని ఉదయగిరి మొదలు గోదావరి పర్యంత తీరాంధ్రాన్ని అత డాక్రమించి పాలించడం పైన వివరించడం జరిగింది గదా! సాళువాభ్యుదయాన్నిబట్టి నరసింహుడు తెలంగాణంపై దండెత్తి బాలకొండ దగ్గర ముస్లిం సైన్యాల నోడించి నర్మదా నదివరకు దండెత్తినట్లుంది. కళింగలో పురుషోత్తమ హంవీరుల మధ్య చెలరేగిన అంతర్యుద్ధంలో పురుషోత్తమునకు సాయంగా సుల్తాన్ దృష్టి మరల్చడానికి ఈ దాడి జరిపివుంటాడు. బహుశా ఈ దాడిలో భాగంగానే క్రీ శ. 1477 లో నరసింహుడు గోదావరీతీరంలో విడిసినట్లు కన్పిస్తుంది.

ఈ విజయపరంపరలతో సాళువ నరసింహుని బలగౌరవా లినుమడించినాయి. విజయనగర రాజ్యాన్ని రక్షించే శక్తిసామర్థ్యా లాతనికి ఒక్కనికే ఉన్నట్లు ప్రజలు, సామంతులు భావించినారు. నాటికే అతడు "రాయమహారసు"గా ప్రసిద్ధుడయినాడు. విరూపాక్ష రాయల్ని బాగుచేయడం సాధ్యం కాదనే భావం బలపడింది. అందుచే తుళువ నరసనాయకుని సాయంతో నరసింహుడు సంగమ వంశాన్ని పారదోలి సింహాసనం ఆక్రమించినాడు. ఇది దురాక్రమణే కావచ్చు కాని పరిస్థితులవల్ల తప్పనిసరి అయింది; విజయనగరం తర్వాతి చరిత్రవల్ల సమర్థనీయమయింది. ఒక చరిత్రకారుని అభిప్రాయంలో - సాళువ దురాక్రమణ వల్ల తళ్ళికోట యుద్ధం ఎనభయి సంవత్సరాల తర్వాత జరిగింది.

సాళువ నరసింహునకు సింహాసనం ఆక్రమించడం ఒక ఎత్తు, రాజ్యంలోని అరాజడుల నణచి శాంతిభద్రతలు నెలకొల్పి విజయనగర గౌరప్రతిష్ఠలను పునరుద్ధరించడం మరొక ఎత్తుగా పరిణమించింది. అతని పాలనాకాలం 15 సంవత్సరాలు ఆ ఆశయసాధనలోనే గడిచిపోయింది. ముందుగా అతని దృష్టి తిరుగుబాటు చేస్తున్న విజయనగర సామంతుల పైకి మరలింది. వారిలో పెరనిపాడు (కడప) పాలిస్తున్న సంబెటవారు, ఉమ్మత్తూరు (మైసూరు), సంగీతపురం (తులునాడు) పాలెగార్లు, బొమ్మవరం ప్రభువైన సాళువ మల్లిదేవుడు ముఖ్యులు. సంబెట శివరాజు, అతని బంధువు వీర నరసింహుడు విజయనగరాన్ని ధిక్కరించి, పరసర సీమల్లో ప్రజలను భయభ్రాంతులను చేస్తున్నారు. వర్తకులకు, ప్రయాణీకులకు భద్రత లేకపోయింది. అందుచే సాళువ నరసింహుడు దండెత్తి,

సంబెటవారి నణచి, ఆ ప్రాంతంలో శాంతిభద్రతలు నెలకొల్పినాడు. అనంతరం ఉమ్మత్తూరు, సంగీతపుర సామంతుల నణచడం జరిగింది. 'కేరళపలమ' అనే మళయాళంలోని స్థానిక చరిత్రను బట్టి, సాళువ నరసింహుడు పశ్చిమ తీర ప్రాంతాలను జయించినట్లు తెలుస్తున్నది క్రీ శ. 1490 - 1506 మధ్య కాలం నాటి శాసనా లా వృత్తాంతాన్ని బలపరుస్తున్నాయి. హనోవర్, భట్కల్, మంగళాపురం మొదలైన రేవులు విజయనగరానికి స్వాధీనమయినాయి. గోవా, చౌల్ నష్టం కొంత పరిహార మయింది.

బహమనీ రాజ్యంలో చెలరేగిన అరాజకాన్ని అవకాశంగా తీసుకొని పురుషోత్తమ గజపతి తీరాంధ్రాన్ని జయించడానికి నిశ్చయించినాడు. మూడో మహమ్మద్‌షా మరణానంతరం సుల్తానైన ఆతని కొడుకు మామూద్ బాలుడైనందున, నైజాం ఉల్‌ముల్క్ బాహ్రి ప్రాబల్యం వహించినాడు. బాహ్రి దక్కన్ ముస్లిం నాయకుడు. ఆతని ప్రాబల్యాన్ని విదేశీ ముస్లింనాయకులైన యూసఫ్ ఆదిల్, ఇమాద్ ఉల్ ముల్క్‌లు సహించక బిజాపూర్, బీరారుల్లో తమ బలాలను కూడతీసుకోసాగినారు. దక్కనీ, విదేశీ ముస్లిములు పరస్పరం దారుణ హత్యాకాండకు దిగినారు. తెలంగాణంలో జరిగిన తిరుగుబాటు నణచే సందర్భంలో బాహ్రిని హత్య చేసినారు. దీనితో పరస్పర హత్యలు మితిమీరినాయి. ఈ కల్లోల పరిస్థితుల్లో కాశిం బరీద్ విజృంభించి, ప్రధానియై సుల్తానును కీలుబొమ్మగా చేసుకున్నాడు. ఇదే సమయంలో గజపతి దండయాత్ర జరిగింది. నాడు రాజమహేంద్రవరం తరఫ్‌దార్ ఎవరో స్పష్టంగా తెలియదు. ముస్లిం రచనల్లో దిలావర్‌ఖాన్, కావామ్ ఉల్‌ముల్క్‌ల పేర్లు కన్పిస్తున్నాయి. రాజమహేంద్రవరాన్ని ఆక్రమించిన గజపతి సైన్యం 1484 నాటికి కొండపల్లి కొండవీడులను స్వాధీనం చేసుకున్నది. గజపతి సేనాని అజమ్‌ఖాన్ వినుకొండ తాలూకాలోని మితుకుమల్లిని క్రీ.శ. 1484 లో దానం చేసినాడు. దక్షిణ తీరాంధ్రంలో కూడ సాళువ నరసింహుని అధికారం బలంగాలేదు. వినుకొండ, ఉదయగిరి మధ్య భూమిలో సరియపల్లి తిమ్మారెడ్డి పాలిస్తున్నాడు. హిందూరాయ సురత్రాణ అనే ఈతని బిరుదాన్ని బట్టి తిమ్మారెడ్డి స్వతంత్రునివలె కన్పిస్తున్నాడు. కాని, ఈతడు గజపతులకు లొంగిపోయినాడు. అనంతరం గజపతి ఉదయగిరిని ముట్టడించినాడు. ఉదయగిరిని రక్షించడానికై సాళువ నరసింహుడు దండెత్తి, మార్గ మధ్యంలో సాళువ మల్లదేవుని తిరుగుబాటు నణచి, బొమ్మవర దుర్గాన్ని పూర్తిగా నిర్మూలించి ఉదయగిరిపై నడచినాడు. అయితే, ఉదయగిరిని పాలిస్తున్న పూసపాటి బసవ భూపాలుడు గజపతితో చేరి, నరసింం సింహునే ఎదిరించినట్లు కన్పిస్తుంది బసవ భూపతి మంత్రియైన గంగయ్యను "నృసింహనృపతి వశీకరణ నయవిద్యాకరణ" అని ప్రబోధ చంద్రోదయం

వర్ణిస్తున్నది. దీన్నిబట్టి సాళువ నరసింహుని మోసంతో గజపతి బందీ చేసినట్లు తెలుస్తుంది. ఉదయగిరిని గజపతికి సమర్పించి, నరసింహుడు సంధి చేసుకున్నాడు. ఇది జరిగిన అనతికాలానికే క్రీ శ. 1491 లో సాళువ నరసింహుడు మరణించినాడు.

తన స్వల్ప పాలన కాలంలో సాళువ నరసింహుడు విజయనగరాన్ని బలపరచి, సంగములు నెలకొల్పిన సాంస్కృతిక సంప్రదాయాలను పదిలపరచినాడు. ప్రజల్లో ధైర్య సాహసాలు కల్పించే సాముగరిడీలను ఈతడు ప్రోత్సహించినట్లు తెలుస్తుంది. అరబ్బు వర్తకులకు రక్షణ కల్పించి వారు దిగుమతి చేస్తున్న గుర్రాలతో సైన్యాన్ని వృద్ధి చేసినాడు. కవుల, పండితుల పట్ల నరసింహునకు అభిమానం ఎక్కువ. సంస్కృతాంధ్రాలను పోషించినాడు. రాజనాథ డిండిము డాతని ఆస్థాన కవి. 'రాఘవాభ్యుదయం' అనే సంస్కృత కావ్యం నరసింహుని కృత మంటారు గాని, దాన్ని రాజనాథ డిండిముడే రచించి వుంటాడు.

**ఇమ్మడి నరసింహరాయలు**

నరసింహరాయల అనంతరం సాళువ వంశ చరిత్ర స్పష్టంగా లేదు. స్వల్ప వయస్కులైన తన ఇద్దరు కొడుకులను సేనాపతి, ప్రధాని, కార్యకర్త అయిన తుళువ నరసనాయకునకు అప్పగించి, తాను సాధించలేకపోయిన రాయచూరు, ఉదయగిరి దుర్గాలను జయించవలసిందని నరసింహ దతణ్ణి కోరినాడట! నరసానాయకుడు సోదరుల్లో పెద్దవాడైన తమ్మరాజును సింహాసనం ఎక్కించి సర్వాధికారాలు నిర్వహించసాగినాడు. తమ్మరాజు అకాల మృత్యువు వాతపడినాడు. ఈతని మరణాన్ని గురించి విరుద్ధములైన వృత్తాంతాలున్నాయి. నరసానాయకుని అపనిందపాలుచేసే ఉద్దేశంతో తిమ్మరుసనే మంత్రి తమ్మరాజును హత్యచేసినాడని ఒక వృత్తాంతం, యుద్ధంలో క్షతగాత్రుడై మరణించినాడని మరొక వృత్తాంతం.

బహమనీ రాజ్యంలో దేశీయ విదేశీయ ముస్లిము వర్గాల మధ్య సంఘర్షణలు అవకాశంగా కాశింబరీద్ బలవంతుడై సుల్తాన్ మామూద్‌షాను కీలుబొమ్మగా చేసుకున్నాడు. కాని అతనికి వ్యతిరేకత మితిమీరింది. బిజాపూర్‌లో యూసఫ్ ఆదిల్‌ఖాన్ 1489 లో స్వతంత్రించి బరీద్‌ను ధిక్కరించినాడు. బ్రాహ్మీ కొడుకు మాలిక్ అహమ్మద్ నైజాంషా అహమ్మద్‌నగర్ నిర్మించి (1490) కేంద్రంగా చేసుకొని బలవంతుడయినాడు. బీరార్‌లో ఇమాద్ ఉల్ ముల్క్, తెలంగాణంలో, కులీకుతుబ్ ఉల్‌ముల్క్ విజృంభిస్తున్నారు. ఇట్టి పరిస్థితిల్లో శత్రువుల దృష్టి తనపై నుండి మరల్చే ఉద్దేశంతో కాశింబరీద్ రాయలను అంతర్వేదిపై దండెత్తిరమ్మని ఆహ్వానించగా రాయలు రాయచూరును

ఆక్రమించినాడు గాని యూసఫ్ ఆదిల్‌షా తిరిగి స్వాధీన పరచుకొన్నాడని ముస్లిం చరిత్రకారులు వ్రాసినారు. ఈ సందర్భంలోనే నరసానాయకుడు యూసఫ్‌ఆదిల్‌షాతో రెండుమార్లు (1491, 1493) యుద్ధం చేయవలసివచ్చింది. మొదటిసారి మానవదుర్గం యుద్ధంలో గెలిచి రాయచూరును ఆక్రమించి వుంటాడు. కాని రెండో యుద్ధంలోనే బహుశా తమ్మరాజు క్షతగాత్రుడై మరణించినాడు. అతని తమ్ముడు ఇమ్మడి నరసింహరాయలు సింహాసనం ఎక్కినాడు.

ఇమ్మడి నరసింహుడు తుళువ నరసానాయకుని ప్రాబల్యం సహించలేక అతణ్ణి తొలగించి నాదెండ్ల తిమ్మరుసును ప్రధానిగా నియమించినాడు. నరసానాయకుడు పెనుగొండకు మరలి సైన్యంకూర్చుకుని విజయనగరంపై దండెత్తినాడు. యుద్ధంలో తిమ్మరుసు మరణించినాడు. ఇమ్మడి నరసింహుని బందీగా పట్టుకొని పెనుగొండకుపంపి నరసానాయకుడు ప్రభుత్వం నిర్వహించసాగినాడు. సాళువవంశపరిపాలన అంతమయింది. అయితే నరసానాయకుడు సింహాసనం ఎక్కినాడా లేదా అనేవాదం ఉంది సమకాలిక ముస్లించరిత్రలు, నాటికవులు నరసనాయకుడు సింహాసనం ఎక్కి పాలించినట్లు వర్ణిస్తున్నాయి. 'విజయనగర భద్రసింహాసనస్థు' అని పారిజాతపహరణం, నరసానాయకుడు స్వతంత్రాధికారం సూచించే విజయనగరాధీశుల 'భాషగె తప్పువరాయరగండ. రాజాధిరాజ, రాజ పరమేశ్వర'' మొదలైన బిరుదులు ధరించినట్లు శాసనాలనుండి తెలుస్తుంది. నరసానాయకుని చర్యలనుబట్టి ఈ బిరుదులు కేవలం విజయనగరం పట్ల విశ్వాసంతో ధరించినవని చెప్పలేము. కాబట్టి నరసానాయకుడు సింహాసనం ఆక్రమించడమే యథార్థం. విజయనగరచరిత్రలోనిది రెండో దురాక్రమణ.

సింహాసనం ఆక్రమించిన అనంతరం నరసానాయకుడు దక్షిణదండయాత్ర జరిపి తిరుగుబాటు చేస్తున్న సామంతుల నణచినాడు. 'వరదాంబికా పరిణయం' నుండి అతడు చోళ, పాండ్య, చేర ప్రభువులను మధురరాజైన మానభూషణుని ఓడించి కప్పంవసూలుచేసినట్లు కోనేటి రాజును జయించినట్లు తెలుస్తుంది. ఈ రాజులను గుర్తించడం కష్టం. మానభూషణుడు చోళ సామంతుడుగా మధురను పాలించేవాడు. "కోయి లొలుగు"నుబట్టి కోనేటిరాజు తిరుచునాపల్లి సీమను పాలిస్తూవుండేవాడు. అతనికి మహామండలేశ్వర, రాయబసువశంకర, రాజరాజగండ మొదలైన బిరుదులున్నాయి. ఇతడు శ్రీరంగంలోని శ్రీవైష్ణవులను హింసిస్తుండగా వారు నరసనాయకునితో మొరపెట్టుకున్నారు. నరసానాయకుడు కోనేటిరాజునోడించి పదవీచ్యుతునిచేసినాడు. (క్రీ.శ. 1496) అనంతరం కావేరిని దాటి శ్రీరంగపట్టణం ముట్టడించినాడు. ఆ ప్రాంతాన్ని గంగవంశజుడనని చెప్పుకున్న నంజరాజు పాలిస్తున్నాడు. నంజరాజు ఓడి సామంతుడయినాడు. అచటనుండి పశ్చిమ తీరంలోని (తుంకూరు) దమకార, తరనంగి దుగ్గిరాల నాక్ర

మించి నరసానాయకుడు గోకర్ణ క్షేత్రం దర్శించి అచట తులాపురుషదానం చేసినట్లు 'వరదాంబికాపరిణయం' చెబుతున్నది. నరసానాయకుడు చేర రాజ్యంపై దండెత్తి కాయల్ నాక్రమించడానికి చేసిన ప్రయత్నం ఫలించలేదు.

కటకంలో పురుషోత్తమ గజపతి మరణించి అతనికొడుకు ప్రతాపరుద్రగజపతి పాలన (1496-1538) ప్రారంభమయింది. తన తండ్రికాలంలో బహమనీలవశమైన తెలంగాణ ప్రాంతాలను చేజారిపోయిన తమిళప్రాంతాలను తిరిగి జయించాలని ప్రతాపరుద్రుడు సంకల్పించినాడు. నాటికి కులీ కుతుబ్ ఉల్ ముల్క్ వరంగల్, కోయిల్ కొండలను ఆక్రమించి తెలంగాణంలో బలవంతుడై ఉన్నాడు (క్రీ.శ. 1497). గజపతి దండెత్తి పెన్నానదీతీరంవరకు నడచినట్లు రాజవోలుశాసనం సూచిస్తున్నది. అయితే,నరసానాయకుని 'గజపతిరాయేభగండభేరుండ' బిరుదాన్నిబట్టి నరసానాయకుడు గజపతినిఓడించి మరలించినాడని చెప్పవచ్చుగాని ఈ విజయంవల్ల విజయనగరానికి లాభం కలగలేదు. ఇదే సమయంలో తెలంగాణప్రాంతంలో చితాబ్ ఖాన్ విజృంభించినాడు. ఈతని పేరు సీతాపతి. ఇతని పుట్టుపూర్వోత్తరాలు తెలియవు. 'రాయవాచకం' ఇతణ్ణి పురుషోత్తమగజపతి సేనానిగా వర్ణిస్తున్నది. క్రీ.శ. 1504 నాటి ఈతని వరంగల్లు శాసనాన్నిబట్టి నాటికాతడాప్రాంతం జయించి పాలిస్తున్నాడు రాజుకొండ మొదలుగా దక్షిణ తెలంగాణా సయితం అతని వశమైనట్లు క్రీ.శ. 1510 నాటి గజపతి ఉండ్రకొండ శాసనం స్పష్టం చేస్తున్నది. తెలంగాణాలో అధికభాగం తిరిగి గజపతుల స్వాధీనమయింది.

ఆంతరంగిక కల్లోలాల నణచి విజయనగర రాజ్యానికి భద్రత, సౌష్ఠవం చేకూర్చడానికి సాళువ నరసింహుడు ప్రారంభించిన కృషిని కొనసాగించి నరసానాయకుడు చాలవరకు విజయం సాధించినాడు. కాని, శత్రువుల హస్తగతమైన ఉదయగిరి, రాయచూరు ప్రాంతాలను తిరిగి ఆక్రమించక పూర్వమే, రాజ్యాన్ని కొడుకు వీర నరసింహున కప్పగించి క్రీ.శ. 1503 లో నరసానాయకుడు మరణించినాడు.

నరసానాయకునకు ముగ్గురు భార్యలు. వారిలో తిప్పాంబయందు వీరనరసింహుడు, నాగలాంబికయందు శ్రీకృష్ణదేవరాయలు, ఓబాంబికయందు రంగరాజు, అచ్యుతరాయలు అనే నల్గురు కుమారులు కలిగినారు. వీరనరసింహుని ఇమ్మడి నరసానాయకుడు అనేవారు. తండ్రి మరణానంతరం అధికారం వీరనరసింహుని హస్తగతమయింది. పెనుగొండలో బందీగానున్న సాళువ ఇమ్మడి నరసింహుని ఈతడు హత్యచేయించినాడు. సాళువ వంశం అంతరించింది. వీర నరసింహుడు క్రీ.శ. 1505 లో తుళువ వంశాన్ని స్థాపించినాడు.

# తుళువ వంశం
# (1505-1575)

మైసూరులోని తుళు(వ) రాష్ట్రం జన్మస్థలమైనందున తుళువ వంశమనే పేరు వచ్చింది. హరిహరుడు క్రీ.శ. 1342 ప్రాంతంలో తుళునాడు జయించి నప్పటినుండి ఈ వంశస్థులు విజయనగరాస్థానంలో ఉద్యోగాలు నిర్వహించ సాగినారు. సాళువ వంశస్థుల వలెనే వీరును తమది చంద్రవంశమని వర్ణించు కొన్నారు. ఈ వంశానికి తిమ్మరాజు మూలపురుషుడు. ఇతనికొడుకైన ఈశ్వర నాయకుడు సాళువ నరసింహుని సేనాపతిగా 1481 లో మహమ్మద్‌షాను కందుకూరు దగ్గర ఓడించి, అతని శిబిరం దోచుకున్నాడు. ఇతణ్ణి 'దేవకీ పురాధిపుడ'ని వరాహ పురాణం వర్ణిస్తున్నది. ఉత్తర ఆర్కాటు జిల్లా ఆరణి తాలూకాలోని దేవికాపురమే దేవకీపురం అయివుంటుంది. ఇక్కడ తుళువ వంశీయుల శాసనాలున్నాయి. ఈశ్వరనాయకుని కొడుకు నరసానాయకుడు. ఇతణ్ణి గురించి పైపుటల్లో చెప్పినాము. తుళువ వంశస్థులు తెలుగుభాషను అభి మానించినారు. నంది మల్లయ్య, ఘంట సింగయలు రచించిన 'వరాహపురాణా'న్ని నరసానాయకుడు అంకితం పొందినాడు. అతనికొడుకు శ్రీకృష్ణరాయల తెలుగు భాషాభిమానం జగద్విదితం. తుళువ వంశీయుల మాతృభాష కన్నడం, అభిమాన భాష తెలుగు. అయితే, వీరిలో తాము కన్నడిగులము అనేభావం ఉండేది. 'తెలుంగురాయ'డైన శ్రీకాకుళాంధ్ర విష్ణువు తనను 'కన్నడరాయ' అని సంబో ధించినట్లు శ్రీకృష్ణదేవరాయలు సగర్వంగా చెప్పుకున్నాడు.

**వీరనరసింహరాయలు (క్రీ.శ. 1505-1509)**

వీరనరసింహరాయలు ప్రజల్లో ధైర్యసాహసాలు వీరోచిత గుణాలు కలిగించడానికి ప్రయత్నించినాడు. తగాదాలను ద్వంద్వయుద్ధం (duelling) ద్వారా పరిష్కరించుకోవడాన్నితడు ప్రోత్సహించినట్లు కన్పిస్తుంది. ఈతని పాలన కాలం ఐదు సంవత్సరాలు యుద్ధాలలో గడచిపోయింది. నరసింహుని దురాక్రమణను సహించలేని సామంతోద్యోగులు తిరుగుబాటొనర్చినారు. వారిలో ఆదోని ప్రభువైన కానప్ప వడయరు, ఉమ్మత్తూరు దేవరాజు, శ్రీరంగపట్టణం గుండరాజు ముఖ్యులు. దీనికితోడు బహమనీ సుల్తాన్ మహమూద్‌షా తన సర్దారులను బిదర్‌లో సమావేశపరచి (క్రి శ. 1501) ప్రతి సంవత్సరం హిందు వులపై 'జీహద్' జరపడానికి నిర్ణయించినాడు. మొదటి 'జీహద్' క్రీ.శ. 1502 లోనే జరిగినట్లుంది కాని, దాని వివరాలు తెలియవు. బహుశా ఆ నిర్ణ యానికి అనుగుణంగానే యూసఫ్ ఆదిల్‌ఖాన్ విజయనగరంపై దండెత్తినాడు. ఆదోని కానప్ప అతనితో చేరినాడు. కాని, కందనవోలు పాలిస్తున్న అరవీటి రామరాజు, అతనికొడుకు తిమ్మరాజు ఆదిల్‌ఖాన్ నోడించి తరిమివేసినారు.

వీరనరసింహుడు కృతజ్ఞతతో అరవీటివారికి కందనవోలు, ఆదోని ప్రభుత్వాన్ని అప్పగించి సత్కరించినాడు.

అనంతరం వీరనరసింహుడు రాజ్యపాలనను తమ్ముడు శ్రీకృష్ణదేవ రాయలకు అప్పగించి ఉమ్మత్తూరు, శ్రీరంగ పట్టణాలపై దాడి జరిపినాడు. క్రీ. శ. 1510 లో విజయనగరం దర్శించిన పోర్చుగీస్ రాయబారి ఫ్రెయర్ లూయిజ్ నరసింగరాజు ఐదు వేల అశ్వదళంతో, ఐదు వేల కాల్బలంతో సామంతు దొకనిపై దండెత్తినట్లు వ్రాసినాడు ఈ దండయాత్ర వివరాలు తెలియవు. గుంశరాజ, దేవరాజులను అణచక పూర్వమే వీరనరసింహుడు క్రీ. శ. 1509 లో మరణించినాడు.

# శ్రీకృష్ణదేవరాయలు
# (క్రీ. శ. 1509-1529)

విజయనగరాన్ని పాలించినరాజులలో శ్రీకృష్ణరాయలు అగ్రగణ్యుడు. కృష్ణరాయలు మహావీరుడు, విజేత; రాజనీతివరుడు, పాలనాదక్షుడు; సాహితీ సమరాంగణ సార్వభౌముడు, కావ్యస్రష్ట. ఆతని పాలనలో విజయనగర అధికార గౌరవాలు మహోన్నతస్థాయి నందుకొన్నాయి. రాయల ప్రధాని సాళువ తిమ్మరుసు. ఈ ఉభయులను గురించి దక్షిణదేశం అంతటా ప్రచారంలోఉన్న పెక్కు కథలనుబట్టి రాయలు సాధించిన జనాదరణను ఊహించవచ్చు.

తిమ్మరుసుమంత్రి సాయంతోనే కృష్ణరాయలు సింహాసనం ఆక్రమించి నాడు. వీరనరసింహరాయలు మరణసమయంలో తన తమ్ముని గుడ్లు పీకించి బందీచేసి పిన్నవయస్కుడైన తన కొడుకును సంహాసనం ఎక్కించవలసిందిగా మంత్రి తిమ్మరుసును కోరినాడని, అందుకు విరుద్ధంగా మంత్రి కృష్ణరాయల్ని రాజుచేసినాడనీ న్యూనిజ్ వ్రాసినాడు. కాని రాయవాచకం మొదలైన ఇతర ఆధారాల్లో ఈ వృత్తాంతం లేదు. వీరనరసింహరాయలు కృష్ణరాయలు మధ్య సత్సంబంధాలే ఉన్నట్లు కన్పిస్తుంది. ఉమ్మత్తూరుపై దండెత్తినపుడు ప్రభుత్వాన్ని వీరనరసింహుడు కృష్ణరాయలుకే అప్పగించినాడు. అయినా, న్యూనిజ్ రచన కేవలం కట్టుకథగా తోసిపుచ్చడానికి వీల్లేదని చరిత్రకారుల అభిప్రాయము. కృష్ణరాయల పట్టాభిషేకం క్రీ. శ. 1509 శ్రీజయంతి (ఆగష్టు, 8) నాడు జరిగింది.

శ్రీకృష్ణరాయలు సింహాసనం ఎక్కిన సమయంలో దక్షిణదేశపరిస్థితి, ముఖ్యంగా విజయనగరరాజ్యం అల్లకల్లోలంగా ఉంది. అతడు సింహాసనం ఆక్రమించడం సవతి తమ్ములు సహించినట్లు కన్పించదు. అది అటుంచి ఉమ్మత్తూరు, శ్రీరంగపట్టణ ప్రభువుల తిరుగుబాటు సాగుతూనేవుంది. తీరాంధ్రాన్ని ఆక్రమించివున్న ప్రతాపరుద్రగజపతి రాజ్యవిస్తరణకు ప్రయత్నిస్తున్నాడు.

రాయచూర్ అంతర్వేది ఆదిల్‌ఖాన్ స్వాధీనంలోనే ఉంది. సుల్తాన్ మామూద్‌షా 'జీహద్' ప్రకటించివున్నాడు. ఇక, పశ్చిమతీరంలో పోర్చుగీసుల బెడద మితిమీరుతున్నది. రాయల సామంతులైన భట్కల్, హొనోవర్ ప్రభువు లనేగాక కళ్ళికోట జామొరిన్ అధికారాన్నిగూడ పోర్చుగీసులు ధిక్కరిస్తున్నారు; కొచ్చిన్, కన్ననూరులలో కోటలు కట్టుకున్నారు. 1509 లో కళ్ళికోట, ఈజిప్టుల సంయుక్త నౌకాబలంపై సాధించిన విజయంతో నాటివరకు అరబ్బులు గుత్తకొన్న వాణిజ్యం అంతా పోర్చుగీసులవశమై హిందూ మహా సముద్రంమీద వారికత్తికి ఎదురులేకపోయింది. కొత్తగా పోర్చుగీసు గవర్నరైన అల్‌ఫోన్జో అల్బూకర్క్ గోవా నాక్రమించి తమకు కేంద్రంగా చేసుకోవాలని సంకల్పించి జామొరిన్‌మీద ఆదిల్‌ఖాన్‌మీద తాను జరిపే యుద్ధాల్లో రాయల సహాయం అర్థిస్తూ లూయజ్ ఫ్రెయర్‌ను రాయబారిగా విజయనగరం పంపినాడు.

### రాయలు–పోర్చుగీసులు

ఇట్టి పరిస్థితుల్లో కృష్ణరాయలు విజయనగర శ్రేయస్సును దృష్టిలోనుంచుకొని వ్యవహరించినాడు. విజయనగర విరోధియైన బిజాపూర్‌తో వైరంవహించిన పోర్చుగీసులతో మైత్రిచేసుకోవడం రాజనీతిగా భావించినాడు. గోవా నాక్రమించడంలో పోర్చుగీసులకు రాయలు సాయం చేసేటట్లు, పోర్చుగీసులు తాము దిగుమతి చేస్తున్న గుర్రాలను గుత్తగా రాయలకు విక్రయించేటట్లు ఒడంబడిక జరిగింది. పోర్చుగీసులు భట్కల్‌లోగూడ కోటలు కట్టుకోడానికి రాయలు అనుమతించినాడు. క్రీ. శ. 1509 లో పోర్చుగీసులు గోవా నాక్రమించినారు. క్రీ శ. 1510 లో యూసఫ్ ఆదిల్‌ఖాన్ గోవాపై దండెత్తినాడుగాని ఆక్రమించలేకపోయినాడు. అదే సమయంలో (క్రీ. శ. 1509–10) బహమనీరాజ్యాలపై కృష్ణరాయల దాడులు జరుగుతున్నాయి. బహుశా అందువల్లనే ఆదిల్‌ఖాన్ గోవాపై తన బలం కేంద్రీకరించి ఆక్రమించలేకపోయినాడు.

### రాయలు–బహమనీలు

పోర్చుగీసులు సరఫరా చేసిన గుర్రాలతో సైన్యాన్ని బలపరిచి, ఆర్థిక వనరులను కట్టుదిట్టంచేసి కృష్ణరాయలు బహమనీలపై దృష్టి మరల్చినాడు. (క్రీ. శ. 1510) హంపీ శాసనం నాటికే అతడు బహమనీలతో యుద్ధంచేసి గెల్చినట్లు తెలుస్తున్నది. ఈ యుద్ధానికి కారణం సుల్తాన్ మామూద్‌షా ప్రకటించిన 'జీహద్' మాలిక్ అహమ్మద్ బాహ్రీ, యూసఫ్ ఆదిల్‌ఖాన్, కుతుబ్ ఉల్‌ముల్క్, ఇమాద్ ఉల్‌ముల్క్ మొదలైన సర్దారులను కూడగట్టి సుల్తాన్ విజయనగరంపై నడచినాడు. బహమనీలను విజయనగర సైన్యాలు 'దీవాన్' యుద్ధంలో ఓడించి మరలించినాయి. తిరోగమిస్తున్న సైన్యాలను

తరుముతున్న విజయనగర సైన్యాలను ఆదిల్‌ఖాన్ ఆటకాయించి కోవిలకొండ దగ్గిర ప్రాణాలు కోల్పోయినాడు. కోవిలకొండ నాక్రమించి శ్రీకృష్ణరాయలు విజయనగరానికి మరలినాడు.

యూసఫ్ మరణంతో బహమనీ రాజ్య పరిస్థితి మరింత కల్లోలిత మయింది. యూసఫ్ కొడుకు బాలు డయినందున అధికారం కామాల్ ఖాన్ సర్దారు వశ మయింది. కామాల్ ఖాన్ దురాశాపరుడు; సింహాసనం ఆక్రమించాలని అతని ప్రయత్నం. కామాల్ దౌర్జన్యం సహించలేని గుల్బర్గా ప్రభువు మాలిక్ దస్తూర్ దీనార్ పారిపోయి, బీదర్‌లో బరీద్ సహాయం అర్థించినాడు. కాని, ఉభయులను ఓడించి, కామాల్ బీదర్‌ను ఆక్రమించి సుల్తాన్ మహమూద్‌షాను తన చేతిలో బందీగా చేసుకున్నాడు బరీద్, దస్తూర్, ఇబ్రాహీ, కుతుబ్ ఉల్ ముల్క్‌లు కూటమిగా నేర్పడి బిజాపూర్‌పై దండెత్తినారు. కామాల్ దురాగతాలు సహించ లేక ప్రజలు తిరుగుబాట్లు ప్రారంభించినారు. ముఖ్యంగా బెల్గాం నగర పౌరులు కృష్ణరాయలను దండెత్తి రమ్మని ఆహ్వానించినారు. కృష్ణరాయలు దండెత్తి రాయచూరు, అంతర్వేదిని స్వాధీనం చేసుకున్నాడు. ఈలోగా కామాల్, బరీద్‌లు సమాధానం కుదుర్చుకొని విజృంభించినారు. బిజాపూర్‌లో ఇస్మాయిల్‌ను బంది చేసి సింహాసనం ఆక్రమించే ప్రయత్నంలో కామాల్ ఉండగా, బీదర్‌లో సుల్తాన్ మహమూద్‌షాను బరీద్ బందీ చేసినాడు. ఇంతలో కామాల్ హత్య గావడంతో బిజాపూర్‌లో అల్లర్లు చెలరేగినాయి. ఈ పరిస్థితులు అవకాశంగా తీసుకొని కృష్ణరాయలు మరొకమారు దండెత్తి, బరీద్‌ను గుల్బర్గా దగ్గిర ఓడించి బీదర్ వరకు నడచి, మహమూద్‌షాను బంధవిముక్తుని చేసి సింహాసనంపై నిలిపి నాడు. నామమాత్రంగానైనా, సుల్తాన్ ఉనికి సర్దారుల్లో పరస్పర కలహాలకు కారణమై, అందువల్ల విజయనగరానికి ప్రమాదం తప్పదమేగాక వారి కలహాల్లో జోక్యానికి అవకాశం ఏర్పడి, విజయనగర గౌరవ ప్రతిష్ఠలు ఇనుమడించగల వని కృష్ణరాయల ఆశయం. ఈ విజయానికి సూచనగా రాయలు 'యవన రాజ్య స్థాపనాచార్య' బిరుదం ధరించినాడు. మనుచరిత్రలో 'కలుబరిగికటకక్షితిరక్షక' అనీ, 'యవనక్షోణీధవస్థాపనా' అనీ రాయలను పెద్దన కీర్తించినాడు.

**ఉమ్మత్తూరు దాడి**

ఉమ్మత్తూరు పాలకుడైన గంగరాజు శివసముద్ర దుర్గాన్ని కేంద్రంగా చేసుకొని రాయల అధికారాన్ని ధిక్కరిస్తున్నాడు. లూయిజ్ ఫ్రెయర్ రచన ప్రకారం 5000 కాల్బలంతో, 2000 అశ్వదళంతో కృష్ణరాయలు శివసముద్రంపై దండెత్తినాడు. ముట్టడి సంవత్సరంవరకు సాగినట్లు తెలుస్తుంది. చివరకు గంగ రాజు కావేరిలో మునిగి మరణించినాడు. ఉమ్మత్తూరు, శివసముద్ర దుర్గాలను నేలమట్టం చేసి, ఆ ప్రాంతాన్ని శ్రీరంగపట్టణం రాజధానిగా, ఒక రాష్ట్రంగా

పునర్నిర్మించి, కృష్ణరాయలు తన ప్రతినిధిగా సాళువ గోవిందరాజును నియమించినాడు

**కళింగ దండయాత్ర**

అనంతరం గజపతి ఆక్రమణలోనున్న తీరాంధ్ర తెలంగాణాలను జయించడానికి రాయలు సంకల్పించినాడు. ఈ ప్రాంతంలో దుర్గాలు అనేకం ఉన్నాయి. వానిలో ఉదయగిరి, కొండవీడు, కొండపల్లి దుర్భేద్యమైనవి వీనిలో సన్నిహితులు. విశ్వాసపాత్రులు నైన వారిని తన ప్రతినిధులుగా గజపతి నియమించి, వారికి సాయంగా ప్రసిద్ధ సేనానులను, పెద్ద సైన్యాలను నిలిపినాడు కొండవీడు ప్రధాన కేంద్రంగా ప్రతాపరుద్రుని కొడుకు వీర రుద్ర గజపతి పాలనలో ఉండేది.

రాయల కళింగ దండయాత్ర క్రీ. శ 1513 లో ప్రారంభమై 1519 వరకు సప్త సంవత్సర యుద్ధం సాగింది. అయితే, రాయలు సర్వదా సైన్యంతో లేడు. మధ్య మధ్య రాజధానికి మరలుతూ అమరావతి, శ్రీకాకుళం, అహోబిలం, శ్రీశైలం, తిరుపతి, చిదంబరం వంటి పుణ్యక్షేత్రాలను దర్శించి, తన విజయాలకు కృతజ్ఞతగా ఆచటి దేవతలకు కానుకలు సమర్పిస్తూ వుండేవాడు. స్వయంగా రెండుమార్లు కళింగపై నడచినట్లు సింహాచలంలోని అతని శాసనాలు సూచిస్తున్నాయి. ఈ దండయాత్ర ఉదయగిరి ముట్టడితో ప్రారంభమయింది. ఉదయగిరిని గజపతి పినతండ్రి తిరుమలరాహుత్త రాయలు పాలిస్తున్నాడు. సంవత్సరం స్నర పోరాటం తరువాత దుర్గం రాయల వశమైనట్లు న్యూనిజ్ వ్రాసినాడు. కొండ మరుసయ్యను ఉదయగిరి పాలనకు నియమించడం జరిగింది. ఉదయగిరి కోటలోని బాలకృష్ణ విగ్రహాన్ని సంగ్రహించి రాయలు విజయనగరంలో ప్రతిష్ఠించినాడు.

ఉదయగిరి నుండి రాయల సైన్యాలు కొండవీడుపై నడచినాయి. మార్గంలో కందుకూరు, వినుకొండ, అద్దంకి, కవుతారం, తంగెడ, నాగార్జున కొండ, బెల్లంకొండలను ఆక్రమించి బోయ సైన్యం ద్వారా దేశాన్ని కొల్లగొట్టి భీతావహం సృష్టించి, క్రీ శ. 1515 లో కొండవీడును ముట్టడించినాయి. సాళువ తిమ్మరుసు ముట్టడిని నిర్వహించినాడు. రెండు నెలలు ముట్టడి సాగడంతో దుర్గంలోని ప్రజలు అన్నపానాలు లేక అలమటించినారు. చివరకు 'లగ్గలు' నిర్మించి పోరాడి రాయల సైన్యాలు కోటను పట్టుకొన్నాయి. వీర రుద్ర గజపతి, గజపతి రాణివాసం, కసవాపాత్రుడు, మల్లుఖాన్, ఉద్దండ ఖాన్ మొదలైన సైనికులు బందీలుగా చిక్కినారు. వారిని రాజధానికి పంపి, రాణులతో రాయలు అమరావతిలో తులాపురుషమహాదానం నిర్వహించినాడు. రాణులు రత్నధేను, సప్తసాగర వ్రతాలు చేసినారు. కొండవీడు పాలకుడుగా తిమ్మరాజు పినకొండ్రాజు నియామకం జరిగింది.

కృష్ణానదిని దాటి రాయల సైన్యాలు కొండపల్లిని ముట్టడించినాయి. కొండపల్లి ప్రహరేశ్వర పాత్రుని రక్షణలో వుంది. అతనికి సాయంగా బిజిలిఖాన్ మొదలైన సేనానులున్నారు. కొండపల్లి ముట్టడికూడ రెండుమాసాలు సాగింది. కొండపల్లిని రక్షించుకోవడానికి గజపతి స్వయంగా వచ్చినట్లు, ఆతణ్ణి మార్గ మధ్యంలో కృష్ణరాయలు ఓడించి మరలించినట్లు న్యూనిజ్ వ్రాసినాడు. కొండ పల్లిని వశపరచుకొని రాయల సైన్యాలు చితాబ్ఖాన్ పాలనలో ఉన్న తెలం గాణంలో ప్రవేశించాయి. వాని నటకాయించడానికి చితాబ్ఖాన్ చేసిన ప్రయ త్నాలను గురించి తెలియదు. అనంతగిరి, ఉంద్రకొండ, ఉర్లికొండ, జల్లిపల్లి, కందికొండ, కప్పలువాయి, దేవరకొండ, నల్లగొండ, కమ్మమ్మెట్టులతో తూర్పు తెలంగాణం రాయలవశమయింది. అటునుండి జమ్మిలోయగుండా సాగి వేంగి (రాజమహేంద్రవరం), కోన, కోట్టాములను ఆక్రమించి, పొట్నూరు-సింహాచలం చేరినాడు. పొట్నూరు దగ్గిర రాయలకు చితాబ్ఖాన్కు భీకరయుద్ధం జరిగింది. రాయలు గెలుపొంది విజయస్తంభం ప్రతిష్ఠించినాడు. రాయల సైన్యాలు మాడెములు ప్రేల్చి, ఒడ్డాది మనీయొనర్చి, కటకమును గాల్చినాయి. ప్రతాప రుద్రగజపతి తన కూతురును కృష్ణరాయలకిచ్చి పెండ్లిచేసి సంధిచేసుకున్నాడు. గజపతి కూతురు పేరు భద్రాదేవి అని ప్రబోధ చంద్రోదయ వ్యాఖ్యానంలో నాదెండ్ల గోప మంత్రి పేర్కొన్నాడు. ఈమెకు తుక్కాదేవి అని నామాంతర మున్నట్లు తెలుస్తుంది. కృష్ణానదికి ఉత్తర భూములన్నీ రాయలు గజపతికి ఇచ్చివేసినాడు.

**రాయలు - ఆదిల్షా**

కళింగదండయాత్ర అనంతరం కృష్ణరాయలు బహమనీ వ్యవహారాలతో ముఖ్యంగా బిజాపూర్తోటి యుద్ధాల్లో గడపవలసి వచ్చింది. క్రీ.శ. 1510 లోనే మామూద్షాను ఉద్ధరించడంద్వారా బహమనీ వ్యవహారాల్లో రాయలు జోక్యం కలిగించుకున్నాడు. మామూద్షా మరణంతో (క్రీ.శ. 1518) సుల్తాన్ మరింత నామమాత్రుడై అధికారం ఆలీబరీద్ హస్తగతమయింది. మామూద్షాకు ముగ్గురు కొడుకులు. వారిలో అహమ్మద్షా (క్రీ.శ. 1518-20), వాలియుల్లా (క్రీ.శ. 1520-23) లు అకాల మరణానికి గురికాగా మూడోవాడైన కాలిముల్లా సుల్తానై రాజనిర్మాతగా వ్యవహరిస్తున్న ఆలీబరీద్ను తొలగించడానికి ప్రయత్నించి పద భ్రష్టుడై బిదర్ విడిచి పారిపోయినాడు. బహమనీ రాజవంశం అంతరించి రాజ్యం విచ్ఛిన్నమై ఐదు రాజ్యాలకు స్పష్టమైన రూపం ఏర్పడింది. ఈ రాజ్యాలలో బిజాపూర్ మొదటినుండి బలవత్తరంగా ఉంది. అందుచే ఇతర రాజ్యాలు బిజాపూర్ పట్ల ద్వేషం వహించినాయి; ఆ సుల్తానులు బిజాపూర్తోటి యుద్ధం మొదటిదశలో రాయలను బలపరిచినారు.

కృష్ణరాయలకు బిజాపూర్ సుల్తాన్ ఇస్మాయిల్ ఆదిల్‌షాకు పలుమారు యుద్ధం జరిగింది. ఈ యుద్ధాల తేదీలను గురించి, ఫలితాలను గురించి అభిప్రాయ భేదాలున్నాయి. అందుకు న్యూనిజ్, ఫెరిస్టాల రచనలలోని వ్యత్యాసాలే కారణం. వీరిరచనలు పరి శీలించిన రాబర్ట్ సూయల్ నిర్ణయం ప్రకారం కృష్ణ రాయలు కళింగదండయాత్రలో ఉండగా ఇస్మాయిల్ ఆదిల్‌షా రాయచూర్ అంతర్వేదిని ఆక్రమించినాడు. క్రీ.శ. 1520 లో కృష్ణరాయలు దండెత్తి వెళ్ళి రాయచూర్ సమీపంలో జరిగిన (గొబ్బూరు) యుద్ధంలో ఆదిల్‌షా నోడించి రాయచూర్‌పై నడచి పోర్చుగీసు వ్యాపారి క్రిస్టఫో దఫీగూరిడో క్రిందనున్న శతఘ్ని దళం సాయంతో రాయచూర్‌ను ఆక్రమించినాడు. ఈ నిర్ణయాన్ని చాలమంది చరిత్రకారులు అంగీకరించినారు. ఓరుగంటి రామచంద్రయ్యగారి నిర్ణయాన్ని తిరస్కరించినారు. వారి పరిశీలనలో క్రీ.శ. 1520 వరకు రాయ చూర్ రాయల స్వాధీనంలోనే ఉంది. ఆ సంవత్సరమే ఆదిల్‌షా దండెత్తి కృష్ణానదీతీర యుద్ధంలో పరాజితుడై పారిపోయినాడు కాని, క్రీ.శ. 1521 లో రాయచూర్ ఆదిల్‌షా వశమయింది; క్రీ శ. 1522 లో రాయచూర్ దగ్గర భీకర పోరాటం జరిపి రాయలు తిరిగి స్వాధీనం చేసుకున్నాడు.

రాయచూర్ విజయంతో రాయలప్రాబల్యం పెరిగింది. కాని, విజయ నగరం పట్ల సుల్తానులలో భయాందోళనలు చెలరేగినాయి. వారందరూ రాయ చూర్‌ను ఆదిల్‌షాకు పునరుద్ధరించవలసినదిగా రాయలను కోరినారు. అదే కోరికతో ఆదిల్‌షా రాయల ఆస్థానానికి అసద్‌ఖాన్ లారీని రాయబారం పంపినాడు. "ఆదిల్‌షా నా కాలికి మొక్కితే రాయచూరును తిరిగి ఇస్తాను" అని రాయలు సమాధానం పంపినాడు. ముద్గల్లులో సమావేశం ఏర్పాటు అయింది. కాని, ఆదిల్‌షా హాజరుకాకపోవడంతో రాయలు ఆగ్రహించి బిజాపూర్ రాజ్యంపై దండెత్తి గుల్బర్గా, షిరోజాబాద్, హసన్‌బాద్, సాగర్ నగరాలను ధ్వంసం చేసి మరలినాడు.

ఆదిల్‌షాకు రాయల అహంకారపూరిత సమాధానము, సాగర్ పర్యంతం అతను జరిపిన విధ్వంసాయుత వీర విహారం సుల్తానులలో విజయనగరం పట్ల భయవిద్వేషాలను విపరీతం చేసినవనడంలో సందేహం లేదు. ఆదిల్‌షా కూడా క్రమంగా తన బలాన్ని కూడదీసుకున్నాడు. బుర్హాన్ నిజాంషా (అహమ్మద్‌నగర్) తోను అల్లావుద్దీన్ ఇమాద్‌షా (బీరార్) తోను వివాహ సంబంధాలు జరిపి వారి మైత్రిని సాధించినాడు. అమీర్ బరీద్ (బిదర్) ఓడిపోయి ఆదిల్‌షా మైత్రి వహించినాడు. చివరకు క్రీ. శ. 1528-29 లో ఇమాద్, బరీద్‌ల సైనిక సహా యంతో ఆదిల్‌షా దండెత్తి, . మూడు మాసాల యుద్ధానంతరం రాయచూర్ ముద్గల్లు కోటల నాక్రమించినాడు. కృష్ణరాయల ప్రతిష్ఠకిది తీరనినష్టం.

అంతర్వేదిని తిరిగి ఆక్రమించడానికి రాయలు చేసిన ప్రయత్నం ఫలించలేదు. 1565 లో జరిగిన రాక్షసిగండి యుద్ధం రాయలు అనుసరించిన ఈ విధానానికి పరాకాష్ఠయేనని చెప్పవచ్చు.

శ్రీకృష్ణరాయల చివరరోజులు విషాదాంతమయినాయి రాయలకుమార్తె తిరుమలాంబ అరవీటి కామరాజును పెండ్లాడింది. ఇతడే అళియ (అల్లుడు) రామ రాయలు అనేవారు. రాయల ఏకైక పుత్రుడు తిరుమలుడు పసివాడు. రాయలు వృద్ధుడైన కొలది వారసత్వ సమస్య తలెత్తి వుంటుంది. అంతిపురం బహుశా రామరాజును బలపరచగా తుళువ వంశంపట్ల విశ్వాసపాత్రులైన తిమ్మరుసుమంత్రి మొదలైనవారు కృష్ణరాయల తమ్ముడు అచ్యుతరాయల్ని బలపరచివుంటారు. ఇంతలో తిరుమలుడు మరణించినాడు అతణ్ణి హత్య చేసినారని ఆ కుట్రలో తిమ్మరుసుకు హస్తం ఉందనీ తిమ్మరుసును గుడ్లు పీకించి రాయలు బందీచేసినాడు ఈ పరిస్థితుల్లోనే రాయచూరు అంతర్వేదిని ఆదిల్‌షా ఆక్రమించినాడు. ఈ సంఘటనలతో కుంగిపోయి కృష్ణరాయలు క్రీ శ. 1529 లో మరణించినాడు.

శ్రీకృష్ణరాయలు యోధాగ్రేసరుడు, విజేతమాత్రమేకాదు- పాలనాదక్షుడు. రాజనీతివరుడు. ఆముక్తమాల్యదలో తన రాజనీతిని రాయలు వివరిస్తాడు కాని, అందు చాలభాగం సంప్రదాయక హిందూ రాజనీతి సూత్రాలే కన్పిస్తాయి. రాచరికం దైవ దత్తమని, ప్రజలు దైవస్వరూపులుగాన వారి శ్రేయోభివృద్ధికి కృషి చేస్తూ వర్ణ ధర్మాలను రక్షించడం రాజు కర్తవ్యమనీ అతని విశ్వాసం. విశ్వాసపాత్రులు విద్యావంతులు నైన విప్రులను మంత్రులుగా నియమించి తరచు మంత్రి పరిషత్తును సమావేశపరచి సలహాలుగ్రహిస్తూ ఉండవలె. దుర్గాధిపతులు, సేనాపతులు బ్రాహ్మణులైనచో ఇతర వర్ణాల అపహాస్యానికి, పాలవుతామనే భయంతో ప్రాణాలకు తెగించి పోరాడి విజయం సాధిస్తారని అతని అభిప్రాయం. రాయల యుద్ధాలు చాలవరకు సాళువ తిమ్మరుసే నిర్వహించినాడు. సరిహద్దుల్లోని చెంచు, కోయ, బోయాది ఆటవికజాతులవల్ల శాంతిభద్రతలకు భంగంరాకుండ శ్రద్ధవహించవలె. కృష్ణరాయల సైన్యంలో బోయ విభాగం ఉన్నట్లు కళింగ దండయాత్రలో కొండవీటిరాజ్యంలో బీభత్సం సృష్టించింది వారేనని తెలుస్తుంది. ప్రజలపై పన్నులభారం ఎక్కువ కారాదని రాయల ఆశయం కాని, అతని కాలంలో పన్నుల భారం ఎక్కువగానే ఉండేది. కృష్ణరాయల కాలంలో కొండ వీటి పాలకుడైన బాచమరసును గురించి ఈ క్రింది పద్యము చూడండి;

గోలకొండతురక గోవులభక్షించు కొండవీటి విప్రకులమునెల్ల
బాచమరసుచేరి భక్షించుచున్నాడు తురకమేలొ? బాచమరసుమేలొ?

అదిగాక పన్నులు చెల్లించలేక ప్రజలు వలసపోగా చాలగ్రామాలు బేచిరాకయినట్లు రాయలసీమలోని కైఫీయతులు పేర్కొంటున్నాయి. బహుశా అట్టి

సంఘటనలు తన దృష్టికి వచ్చినందువల్లనే ఆముక్తమాల్యదలో రాయలు ఈ క్రిందిపద్యం వ్రాసి వుంటాడు:

ప్రజలవిసిచన్న బిలువక ప్పసుల, గొలుచునమ్మి, ఇండ్లింధనమున
కాయెననెడు

కలనినక్కైన అధికారగల నృపతికి ఏదుదీవులుగొన్న సమృద్ధిలేదు.

తిమ్మరుసు మంత్రి సాయంతో రాయలు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను పునర్వ్యవస్థీకరించి పటిష్ఠం చేసినాడు. పోర్చుగీసు 'ఇంజినీర్ల' సాయంతో కాలువలు, చెరువులు తవ్వించి, నీటివనరులు కల్పించినాడు. తన తల్లిపేర నాగలాపురాన్ని నిర్మించినాడు. రాయలు సంస్కృతిప్రియుడు; సాహితీసమరాంగణ సార్వభౌముడు 'భువనవిజయ' మని ప్రసిద్ధమైన అతని దర్బారులో వసంతోత్సవాలు జరిగి, సంగీతసాహిత్యాలకు ఆదరణ లభించింది. అతని ఆస్థానంలో అష్ట దిగ్గజాలనే కవులుండేవారని ప్రసిద్ధి వీరిలో సంస్కృతాంధ్ర కర్ణాటక తమిళ కవులున్నట్లు తెలుస్తుంది. బండారు లక్ష్మీనారాయణకవి సంస్కృతంలో 'సంగీత సూర్యోదయం' రచించి, రాయలకు అంకితం చేసినాడు. కన్నడంలో తిమ్మనకవి భారతం రచించినాడు. కృష్ణరాయలు 'కన్నడ రాయల్ని' అని చెప్పుకున్నా తెలుగుభాషపట్ల అతనికి విపరీతమైన అభిమానం


కృష్ణరాయలు వైష్ణవమతాభిమాని ద్వైతమతాచార్యులైన వ్యాసరాయలు అతని గురువు. విజయనగరంలోని కృష్ణాలయం అతడు నిర్మించిందే. అయితే శైవ, వైష్ణవ క్షేత్రాలు రెంటిలో దానధర్మాలు చేసినాడు, తిరుపతి; కాంచీపురి, కాళహస్తి, సింహాచలం, అహోబలం, శ్రీశైలదేవాలయాలకు గోపురమంటపాలు సమకూర్చినాడు. రాజధానినగరం అతనికాలంలో ఉద్యానవనాలతో, సరోవరాలతో అత్యంతరమణీయంగా రోమ్‌నగరంతో తులతూగునట్లు ఉందని పేస్ వర్ణించినాడు.

**అంతఃకలహాలు**

శ్రీకృష్ణరాయల మరణంతో విజయనగరానికి దుర్దినాలు ప్రారంభమై అంతఃకలహాలు చెలరేగినాయి. నాటివరకు పెనుగొండలో బందీగావున్న అచ్యుత రాయల్ని కృష్ణరాయలు వారసుడుగా ప్రకటించడాన్ని అళియ రామరాయలు ప్రతిఘటించి అధికారం కైవసం చేసుకోడానికి ప్రయత్నించినాడు. కాని, విశ్వాసపాత్రులైన సాళువ నరసింగదండనాయకాది ప్రభువులు ఆ ప్రయత్నాలు సాగనీయలేదు. అచ్యుతరాయలు తిరుపతిలో పట్టాభిషేకం జరుపుకొని విజయనగరం చేరి సింహాసనం ఆక్రమించినాడు.

రాజధానిలోని కల్లోల పరిస్థితి విజయనగర శత్రువులకు సదవకాశ మయింది. గజపతి దండెత్తి వచ్చినట్లు పెద్దనకవి చాటువువల్ల తెలుస్తుంది. అచ్యుతరాయలు గజపతిని ఓడించి మరలించినట్లు రాధామాధవకవి 'తారకాభ్యు

దయం' చెబుతున్నది. క్రీ. శ. 1530 లో గోల్కొండ సుల్తాన్ కులికుతుబ్ ఉల్‌ముల్క్ దండెత్తి కొండపీటిని ముట్టడించగా వెలుగోటి గనితిమ్మానాయుడాతణ్ణి ఓడించి అతని అశ్వదళానికి అపారనష్టం కలిగించి మరలించినాడు.




శత్రుదండయాత్రల ప్రమాదం గుర్తించి అచ్యుతరాయలు రామరాయలతో సమాధానపడినాడు కాని, సాళువ నరసింగరాయలు అందుకు సమ్మతింపక ఉమ్మత్తూరు మొదలైన దుర్గాధిపతులతో కలిసి తిరుగుబాటొనర్చినాడు. రాయల బావమరదులైన సలకం పెద, చిన తిరుమలరాజులా తిరుగుబాటునణచి శాంతి నెలకొల్పినారు.

అచ్యుతరాయలకు రాయచూరు అంతర్వేదిని ఆక్రమించే అవకాశం లభించింది. కోవిల్‌కొండ దగ్గర కులీకుతుబ్ ఉల్‌ముల్క్‌తో జరిగిన సుదీర్ఘ యుద్ధంలో ఇస్మాయిల్ ఆదిల్‌షా మరణించినాడు. అతని కొడుకు మల్లూ ఆదిల్‌షా సింహాసనం ఎక్కినాడు. మల్లూ ప్రజారంజకుడు కాదు. అసద్‌ఖాన్ లారీ అనే ఉద్యోగి నాయకత్వంలో ప్రజ లాతనిపై తిరుగుబాటొనర్చినారు. అందుచే క్రీ. శ. 1535 ప్రాంతంలో అచ్యుతరాయలు దండెత్తి అంతర్వేదిని ఆక్రమించినాడు.

రాజధానిలో రామరాయల బలం నానాటికి పెరిగింది. తమ్ములైన వెంకటాద్రి, తిరుమలు లాతని అండగా వుండేవారు. కందనవోలు, అనంతపూర్, ఆలూరు, అవుకు దుర్గాధిపతు లాతని ఇష్టులు. ఇంతలో బిజాపూర్‌లో మల్లూను తొలగించి ఇబ్రాహిం అదిల్‌షా సింహాసనం ఎక్కి, మల్లూఇష్టులైన ఉద్యోగు లందరిని తొలగించినాడు. అతనిచే బర్తరఫ్ అయిన మూడువేల సైనికులను రామరాయలు తన సైన్యంలో చేర్చుకొని, రాజధానిలోని తురకవాడలో నిలిపినాడు. ఈ విధంగా బలపడి రామరాయలు తిరిగి కుట్రలు ప్రారంభించినాడు. క్రీ. శ. 1536 ప్రాంతంలో గుత్తిలో జరిగిన తిరుగుబాటునణచి రాజధానికిమరలిన అచ్యుతరాయల్ని బందీగా పట్టుకొని రామరాయలు సింహాసనం ఆక్రమించి పట్టాభిషేక ప్రయత్నాలు జరిపినాడు గాని ఫలించలేదు.

ప్రజలుగాని సామంతులుగానీ రామరాయలు సింహాసనం ఆక్రమించడం సహించలేదు. ముఖ్యంగా మధుర; కొచ్చిన్‌ప్రాంత సామంతులు కప్పం చెల్లించడం నిలిపినందున రామరాయలు వారిపై దండెత్తవలసివచ్చింది. రామరాయల దక్షిణ దండయాత్రా సమయంలో రాజధానిలోని అతని ఉద్యోగులు సలకం పెద తిరుమల రాజుతో చేరి అచ్యుతరాయల్ని బంధవిముక్తునిచేసి సింహాసనంపై పునరుద్ధరించినారు.

రామరాయలు రాజధానికి మరలేనాటికి ఇబ్రాహిం ఆదిల్‌షా నాగలాపురాన్ని నేలమట్టంచేసి రాజధానిని సమీపించినాడు. అతనికి ప్రతిఘటన లేకపోయింది. ఆదిల్‌షా ప్రతిపక్షంలో చేరరాదనే భయంతో అచ్యుతరాయలుగానీ రామరాయలుగానీ అతనితో యుద్ధం చేయలేదు ఉభయులు ఆదిల్‌షా సహాయం అర్థించినట్లు కన్పిస్తుంది. వారు కలిస్తే తనకు ప్రమాదమని ఆదిల్‌షా గుర్తించి వుంటాడు. ఆదీగాక అసద్‌ఖాన్ లారీ మొదలైన ఉద్యోగులు ఆదిల్‌షాపై కుట్రలు ప్రారంభించినారు. పరిస్థితి గమనించి అచ్యుత, రామరాజులమధ్య సమాధానం కుదిర్చి ఆదిల్‌షా బిజాపూర్ మరలినాడు.

రామరాయలతో ఒప్పందం అయిన తర్వాత అచ్యుతరాయలు రాజ్య వ్యవహారాలను సలకం తిరుమలరాజు పరం చేసి సర్వదా అంతఃపురంలోనే గడిపినట్లు, ప్రభుత్వం నిరసించినట్లు తెలుస్తుంది. విజయనగరానికి అంతిమగడియలు సమీపించినాయని ప్రజలు భయపడినారు. ప్రజాభిమానం కోల్పోయి అచ్యుతరాయలు క్రీ శ. 1542 లో మరణించినాడు.

అచ్యుతరాయల మరణంతో రామరాయలు సలకం తిరుమలుల మధ్య స్పర్థతీవ్రమై రాజ్యాన్ని అంతర్యుద్ధంలో ముంచెత్తింది. అచ్యుతుని కొడుకైన వెంకటపతిని సింహాసనంఎక్కించి తిరుమలుడు సంరక్షకుడై అధికారం హస్తగతం

చేసుకోవడమేగాక సింహాసనం ఆక్రమించడానికే ప్రయత్నించినాడు. అందుకు వ్యతిరేకంగా గుత్తి దుర్గంలో రామరాయలు సదాశివరాయల్ని రాజుగా ప్రకటించినాడు. సదాశివరాయలు అచ్యుతరాయలు అన్న రంగరాయల కుమారుడు. అందుచే అచ్యుతరాయల కంటె విజయనగర సింహాసనంపై సదాశివునకు బలమైన హక్కు ఉందనడం రామరాయల ఆశయం. సదాశివుడు దుర్బలుడు, వ్యక్తిత్వంలేనివాడు. అతణ్ణి సింహాసనం ఎక్కించి అధికారం హస్తగతం చేసుకోవచ్చని రామరాయల పన్నాగం. క్రీ.శ. 1542 నుండి సదాశివరాయల శాసనాలు కన్పిస్తున్నాయి.

తిరుమల, రామరాయలుల మధ్య సంవత్సరంపాటు జరిగిన అంతర్యుద్ధం అవకాశంగా ఇబ్రాహిం ఆదిల్‌షా రెండుమూడుమార్లు విజయనగరంపై దండెత్తినాడు. ప్రజలనేక బాధలకు గురి అయినారు. మొదట్లో తిరుమలుని దురాశనుండి వెంకటపతిని రక్షించే ఉద్దేశంతో వరదాంబిక ఆదిల్‌షా నాహ్వానించింది. కాని, తిరుమలు దాతనితో ఒప్పందం చేసుకొని వెనుకకు మరలించినాడు. తిరిగి రామరాయల అభ్యర్థనపై ఆదిల్‌షా విజయనగరాన్ని ముట్టడించినాడు. ప్రజలు భయభ్రాంతులై తిరుమలుని సింహాసనం ఎక్కించినారు తిరుమలదేవ మహారాయలనే పేర పట్టాభిషేకం జరుగుపుకొని అతడు ఆదిల్‌షా నోడించి పారదోలడమేగాక రాజధానికి మరలి, వెంకటపతిని హత్యచేసి, తనకు ప్రతికూలురనే అనుమానం ఉన్న ఉద్యోగులను నిర్దాక్షిణ్యంగా హింసించినాడు. అతని నిరంకుశ దురాగతాలతో విసుగెత్తిన ప్రజ లాతణ్ణి ద్వేషించసాగినారు.

పరిస్థితిని గమనించిన రామరాయలు గుత్తినుండి బయలుదేరి పెనుగొండను వశపరచుకొని, కోవలి, బేతంచర్ల, జూటూరు, బెదగల్లు యుద్ధాల్లో తిరుమలుని అనుయాయులనోడించి,ఆదోని నాక్రమించి రాజధానిపై నడచినాడు. తిరుమలుడు ఆదిల్‌షా సాయం అర్థించినాడుగాని ప్రయోజనం లేకపోయింది. చివరకు తుంగభద్రాతీరంలో జరిగిన యుద్ధంలో తిరుమలు నోడించి వధించి, రామరాయలు రాజధానిలో ప్రవేశించినాడు. సదాశివరాయల పట్టాభిషేకమహోత్సవం జరిగింది.

### సదాశివరాయలు-రామరాయలు

సదాశివరాయలు పేరుకుమాత్రమే రాజు, అధికారం సమస్తమూ అళియ రామరాయలిదే. రామరాజు సమర్థుడు, ముక్కాకలుదీరిన యోధుడు, రాజనీతి చతురుడు. కులీకుతుబ్ ఉల్‌ముల్క్ ఆస్థానంలో సేనాపతిగా ఉండి బహమనీ రాజకీయాలు క్షుణ్ణంగా గ్రహించినవాడు. ఆదిల్‌షాతోటి ఒక యుద్ధంలో పరాజయం పొందడంతో కులీ అవమానించగా అతని కొలువు చాలించి కృష్ణరాయల నాశ్రయించినాడు. రామరాయల సామర్థ్యం గుర్తించి అతణ్ణి ఉన్నత పదవిలో

నియమించడమేగాక కృష్ణరాయలు తన కూతురు నాతనికిచ్చి పెండ్లి చేసినాడు. కృష్ణరాయల మరణానంతరం అంతిపుర ప్రోత్సాహంతో సింహాసనం ఆక్రమించ దాని కాతడు చేసిన ప్రయత్నాలు ప్రజలు, ప్రభువులు వ్యతిరేకించడంవల్ల ఫలించలేదు అందుచేతనే సదాశివరాయల్ని సింహాసనం ఎక్కించి, క్రీ.శ. 1543 నుండి 1565 వరకు విజయనగరానికి మకుటంలేని రాజుగా వ్యవహరించి నాడు. అయితే విజయనగర పతనానికి ఆతడే చాలవరకు బాధ్యుడు అనడంలో పొరబాటుఉండదు అచ్యుతుని కాలంనుండి రామరాయలు సాగించిన అంతర్యుద్ధం రాజ్యం పునాదులను కదలించి వేయగా అతని పాలన విదేశవిధానాలు తళ్లికోట యుద్ధానికి, అందులో పరాజయానికి కారణాలయినాయి

అధికారం హస్తగతం చేసుకొన్న వెంటనే రామరాయలు వంశపరంపరా విశ్వాసపాత్రులై విజయనగరాస్థానంలో ఉన్నతోద్యోగాలు నిర్వహిస్తున్న వారిని తొలగించి తన కిష్టులైనవారిని నియమించినాడు. ముస్లిములను అసంఖ్యాకంగా సైన్యంలో చేర్చుకొని, తురకవాడలో గోవధను సయితం సమ్మతించినట్లు తెలుస్తుంది. అనంతరం రామరాయలు దక్షిణ దేశంపైకి దండయాత్ర పంపి నాడు. అంతర్యుద్ధకాలంలో కొచ్చిన్, తిరువాన్కూర్ ప్రాంతాల సామంతులు కేంద్రాధికారాన్ని ధిక్కరించి కప్పంకట్టడం మానినారు. అదీగాక ఆ ప్రాంతాల్లో పోర్చుగీస్ దుండగాలు మితిమీరినాయి. పోర్చుగీస్ గవర్నర్ మార్టిన్ అఫాన్సో డసౌజా శ్రీరంగ క్షేత్రానికి నష్టం కలిగించడమేగాక కాంచీపుర ఆలయాలను దోచుకోడానికి ప్రయత్నించినట్లు తెలుస్తుంది. రామేశ్వరం మొదలైన క్షేత్రాలను దర్శించే తీర్థయాత్రికులకు బాధలు కలిగిస్తూ క్రైస్తవులు తమ మతం ప్రచారం చేస్తున్నారు. అందుచే రామరాయలు తన పితృవ్యపుత్రులైన చినతిమ్మ, రామ రాజు, విఠలుల నాయకత్వంలో దండయాత్ర పంపినాడు వీరు సామంతులనుండి కప్పం వసూలుచేసి, పోర్చుగీసు దుండగాల నణచి మరలినారు. రామరాయలు శాన్‌థోమ్, గోవాలపై గూడ దాడులు జరిపి పోర్చుగీస్‌వారినుండి కప్పం వసూలు చేసినాడు. డసౌజా అనంతరం పోర్చుగీస్ గవర్నరైన జావోదకాస్ట్రో రామ రాయలతో సమాధానం కుదుర్చుకున్నాడు.

**రామరాయలు - బహమనీ రాజ్యాలు**

అంతఃకలహాల్లో మునిగిన బహమనీ రాజ్యాల వ్యవహారాల్లో జోక్యం కలిగించుకొనే విధానం కృష్ణరాయలే ప్రారంభించినాడు కాని, ముందెన్నడూ లేనంతగా వారి రాజకీయాల్లో ప్రవేశించి రామరాయలు విజయనగరానికి ఎనలేని గౌరవ ప్రాబల్యాలు సాధించినాడు. ఏదో ఒక సందర్భంలో రామరాయల సాయం సుల్తానులందరూ ఆశించినవారే. వారిపట్ల నాతడు 'విభజించి పాలించు' విధానం అనుసరించి, ఒక్కొక్కమారు ఒకరితో చేరి అందరినీ ఓడించినాడు.

రామరాయల చర్యలు సుల్తానుల్లో భయద్వేషాలకు కారణమై వారిని కూడగట్ట డానికి తోడ్పడినాయి.

రామరాయల బహమనీ వ్యవహారాలు బిజాపూర్‌తోటి సంఘర్షణతో ప్రారంభమయినాయి. క్రీ. శ. 1542-43 లో ఇబ్రాహిం ఆదిల్‌షా, బుర్హాన్ నిజాంషాలు ఒక సంధిద్వారా అహమ్మద్‌నగర్ బిదర్‌ను, బిజాపూర్ విజయ నగరాన్ని జయించడానికి ఒప్పందం చేసుకున్నారు. దాని ప్రకారం ఆదిల్‌షా విజయనగరంపై దండెత్తి ఓడిపోయి మరలినాడు. అనంతరం రామరాయలకు అహమ్మద్‌నగర్‌తో సుదీర్ఘమైన సంఘర్షణ జరిగినట్లు 'బాల భాగవతం' 'కెలది నృపవిజయం' వర్ణిస్తున్నాయి. బుర్హాన్ నిజాంషా క్రీ. శ. 1548 లో బిదర్‌కు చెందిన కల్యాణ దుర్గంపై దండెత్తినాడు. బిదర్ సుల్తాన్ అలీబరీద్ ఇబ్రాహిం ఆదిల్‌షా సహాయం అర్థించినాడు. బుర్హాన్ నిజాంషా గోల్కొండ ఇబ్రాహీం కుతుబ్‌షాతో సంధి చేసుకొని బిజాపూర్‌తో యుద్ధానికి దిగినాడు ఆదిల్‌షా రామరాయల సాయం అర్థించినాడు. రామరాయలు సుల్తానుల మధ్య సమాధానం కుదర్చడంతో యుద్ధ ప్రమాదం తప్పింది. ఈ సంధిని ఉల్లంఘించి ఒక సుల్తాన్ మరొకరిపై దండెత్తితే దురాక్రమణకు గురియైన సుల్తానుతో ఇతర సుల్తానులు చేరవలెనని ఒప్పందం.

ఇబ్రాహిం ఆదిల్‌షా మరణానంతరం (క్రీ.శ 1558) అలీ ఆదిల్‌షా బిజాపూర్ సింహాసనం ఎక్కినాడు. అలీ పిన్నవయస్కుడు. ఇది అవకాశంగా హుస్సేన్ నిజాంషా బిజాపూర్‌పై దండెత్తినాడు గత్యంతరం లేక అలీఆదిల్‌షా రామరాయల సహాయం అర్థించినాడు. స్వయంగా ఇష్టంలేక పోయినప్పటికి పై సంధి షరతులనుబట్టి ఇబ్రాహిం కుతుబ్‌షా రామరాయలతోచేరి నిజాంషాపై యుద్ధం చేయవలసివచ్చింది. వీరి సైన్యంలో ఒక విభాగం కల్యాణ దుర్గాన్ని ముట్టడించగా మరొక విభాగం రామరాయలి తమ్ముడు వెంకటాద్రి నాయ కత్వంలో అహమ్మద్‌నగర్‌పై దండెత్తింది. రామరాయల సేనాని సదాశివ నాయకుడు జంబుఖండి (జంగోవాన్, అహమ్మద్‌నగర్ జిల్లా) చెంత నిజాంషాతో ఘోరంగా పోరి విజయం సాధించినాడు. కల్యాణదుర్గం అతని వశమయింది. వెంకటాద్రి సైన్యం నైజాంషా నోడించి దౌలతాబాద్‌ను ఆక్రమించింది. గోదావరీ ప్రాంత భూములను కొల్లగొట్టి విజయనగర సైన్యాలు అహమ్మద్ నగర్ రాజ్యంలో బీభత్సం సృష్టించినాయి చివరకు నిజాంషా కల్యాణదుర్గాన్ని అలీ ఆదిల్‌షా పరంచేసి సంధి కుదుర్చుకున్నాడు.

గోల్కొండ సుల్తాన్ ఇబ్రాహిం కుతుబ్‌షా రామరాయల సహాయం పొందినవాడే. చాల రోజు లాతడు విజయనగరంలో శరణార్థిగా ఉండి, రామ రాయలి సైనిక సహాయంతో గోల్కొండ సింహాసనం వశపరచుకున్నాడు.

క్రమంగా ఉభయులమధ్య అసూయా ద్వేషాలు ప్రబలినాయి. ముఖ్యంగా ఆదిల్‌షాతో చేరి రామరాయలు నైజాంషాపై సాధించిన విజయాలతో విజయనగర ప్రాబల్యం ఇనుమడించడం ఇబ్రాహిం కుతుబ్‌కు ఆందోళన కారణమయింది. ఫెరిస్టా వ్రాసినదాన్నిబట్టి ఇబ్రాహిం కుతుబ్‌షాపై తిరుగుబాటు చేసిన ఇమ్మడి జగదేవరావు అనే సర్దారుకు రామరాయలు ఆశ్రయం ఇవ్వడంతో రాయలపై కుతుబ్‌షా ఆగ్రహించినాడు అందుచే అతడు నైజాంషాతో మైత్రికి ప్రయత్నించినాడు కుతుబ్‌షామైత్రి నైజాంషాకు కూడ అవసరమే. నైజాంషా తన కూతురు బీబీజమాన్‌ను ఇబ్రాహింకిచ్చి పెండ్లిచేసి తన మైత్రిని సుస్థిరం చేసుకొనడానికి నిశ్చయించినాడు. వివాహం కల్యాణదుర్గంలో జరగడానికి నిశ్చయమయింది. నైజాంషా కుతుబ్‌షా సైన్యాలు కల్యాణదుర్గంపై దండెత్తినాయి.

ఆలీఆదిల్‌షా విజయనగరం సందర్శించి రామరాయల సాయం అర్థించినాడు. మిత్రకూటమిపై రాయలు యుద్ధానికి నిర్ణయించినాడు. వెంకటాద్రి, జగదేవరావులను సైన్యంతో గోల్కొండపైకి పంపి; ఆదిల్‌షా, ఆలీబరీద్‌షాలతో రామరాయలు అహమ్మద్‌నగరంపైకి నడచి ముట్టడించినాడు. ఫెరిస్టా రచన ప్రకారం సేనానదిలో వరదలు ఉధృతం కావడవల్ల విజయనగర సైన్యాలు ముట్టడిని విరమించవలసి వచ్చింది. వెనుదిరిగి సైన్యాలు గోల్కొండ రాజ్యంలో అల్లకల్లోలం సృష్టించినాయి. విజయనగరంపై దండెత్తి రాయలదృష్టి మరల్చడానికి కుతుబ్‌షా చేసిన ప్రయత్నం ఫలించలేదు. ఇంతలో కొండవీడునేలుతున్న తిమ్మరాజు కొండపల్లిమీద, చితాబ్‌ఖాన్ రాజమహేంద్రవరంమీద దాడులు చేసినారు. శత్రువు లీవిధంగా ముట్టడింపగా గత్యంతరంలేక ఇబ్రాహింకుతుబ్‌షా ఘనపుర, పానగల్లు దుర్గాలను రాయల పరంచేసి సంధి చేసుకున్నాడు, ఈ యుద్ధంతో కుతుబ్‌షా రామరాయల మధ్య విద్వేషం పెరిగిపోయింది.

**రాకాసిగండి యుద్ధం**

రామరాయల విజయపరంపరలతో అతని సైన్యాల వీరవిహారాలతో సుల్తానులు కండ్లుతెరిచినారు; యథాప్రకారం పరస్పరయుద్ధాల్లో తాము నిమగ్నులయితే తమ రాజ్యాలను విజయనగరం కబళించడం తథ్యమనే భయం వారిలో కలిగింది. అయితే ఒంటరిగా తామందరూ బలహీనులే. అందుచే సమైక్యమై విజయనగరాన్ని ఎదిరించి ధ్వంసం చేయడం రాజనీతి అని గుర్తించినారు. రామరాయలు ఇస్లాం మతాన్ని, విశ్వాసాలను తుదకు ఖురాన్‌ను అవమానపరచినాడంటూ ఫెరిస్టావంటి ముస్లిం చరిత్రకారుల వ్రాతలు కేవలం కట్టుకథలేగాని విశ్వాసయోగ్యాలుకావు. విజయనగరంలోని తురకవాడలో గోవధను సయితం సమ్మతింపజాలిన ఔదార్యం రామరాయలు ప్రదర్శించినాడని స్పష్టంగా తెలుస్తుంది. దండయాత్రల సందర్భంలో విజయనగర సైన్యాలు ముస్లిం రాజ్యాల్లో

దారుణకృత్యాలకు పాల్పడి వుండవచ్చు. అవి ఆనాటి యుద్ధతంత్రంలోని భాగాలే గాని ప్రత్యేకించవలసినపనిలేదు. సుల్తానుల కూటమిలో మాలిక్ ఇబ్రాహిం కుతుబ్‌షా, హుస్సేన్ నిజాంషాలు ప్రముఖపాత్ర వహించినారనడంలో వింత లేదు. రామరాయలవల్ల ఎక్కువ నష్టపోయింది వారేకదా! వారితో అలీబరీద్‌షా, బుర్హాన్‌ఇమాద్ ఉల్‌ముల్క్‌లు (బీరార్) చేరినారు. అలీ అదిల్‌షాను బెదిరించి కూటమిలో చేర్చినట్లు స్థానికచరిత్రలు చెబుతున్నాయి. వీరిని 'పంచ పాదుషాలు' అని వ్యవహరిస్తున్నాయి; గుత్తి కైఫీయత్ వంటి రచనల్లో ఢిల్లీపాదుషా (అక్బర్) సయితం పాదుషాల కూటమిలో చేరినట్లుంది గాని అది విశ్వాసయోగ్యంగా కన్పించలేదు.

'పంచ పాదుషాలు' తమ సైన్యాలతో విజయనగరంపై దండెత్తినారు. ఈ సమాచారం గ్రహించి రామరాయలు పెద్ద సైన్యం కూర్చుకొని సోదరులైన తిరుమల వెంకటాద్రులతో వారిపై నడచినాడు. యుద్ధం కృష్ణానదికి దక్షిణంగా జరిగినదన్న ముస్లిం రచనలకు ఆధారం కన్పించదు. స్థానిక చరిత్రలు ముక్తకంఠంగా కృష్ణానది ఉత్తర తీరంలోని రక్షసి తంగిడి గ్రామాలమధ్య యుద్ధం జరిగినట్లు చెబుతున్నాయి. ఈ గ్రామాలు తళ్ళికోటకు దక్షిణంగా సుమారు ఇరవై మైళ్ళ దూరంలో ఉన్నాయి. యుద్ధం మొత్తంమీద ఆరుమాసాలు జరిగిందని స్థానికచరిత్రల వృత్తాంతం. యుద్ధంలో మొదట ముస్లిం సైన్యాలు పరాజయం చెంది ఇరవై మైళ్ళు తిరోగమించినాయి. 'కేలదినృపవిజయం'లోని సమాచారాన్ని బట్టి సుల్తానులు మోసబుద్ధితో శాంతి సంప్రదింపులు ప్రారంభించినారు. రామరాయలు వారిని విశ్వసించినాడు. విజయగర్వంతో విజయనగర సైన్యాలు అప్రమత్తంగా ఉన్న అర్ధరాత్రివేళ ముస్లిం సైన్యాలు విజయనగర శిబిరాన్ని చుట్టుముట్టినాయి. ఇదే సమయంలో రాయలసైన్యంలోని ముస్లింవిభాగం యుద్ధం నుండి తప్పుకొన్నట్లు తెలుస్తుంది. విజయనగరసైన్యాలు సర్వనాశనమయినాయి. రామరాయలు శత్రువులచేజిక్కి హతుడయినాడనీ యుద్ధం నిర్వహిస్తూ కాకతాళీయంగా దెబ్బతగిలి మరణించినాడనీ భిన్న వృత్తాంతాలున్నాయి.

## విజయనగర విధ్వంసనం

రాక్షసిగండి యుద్ధదుర్వార్త విజయనగరాన్ని దిగ్భ్రాంతిలో ముంచెత్తింది. యుద్ధంలో చావు తప్పించుకొని పారిపోయిన తిరుమలరాయలు విజయనగరాన్ని రక్షించడం అసాధ్యమనే భయంతో అచటి ధనరాశులను 1550 ఏనుగులపై నెక్కించి సదాశివరాయలతో అంతఃపురజనంతో పెనుగొండకు తరలినాడు. విజయనగరంలో ప్రభుత్వం అదృశ్యమై రక్షణ లేకపోయింది. ఇది గ్రహించి సమీపారణ్యాలనుండి చెంచు, కురుబాది దోపిడిగాండ్రు దాడిచేసి ప్రజలను

దోచుకున్నారు. అనంతరం విజయోత్సాహంతో ముస్లిం సైన్యాలు నగరంలో ప్రవేశించి ఆరుమాసాలపాటు నగరాన్ని పరిసర గ్రామాలను దోచుకొని నగరంలోని రాజ ప్రాసాదాలను ప్రధాన నిర్మాణాలను నిర్మూలించి మరలినాయి. ముస్లిం దురాగతాలను క్రైఫియతుల వంటి స్థానిక చరిత్రలు విపులంగా వర్ణిస్తున్నాయి.

విజయనగరాన్ని తురుష్క సైన్యాలు శ్మశానంగా మార్చినాయన్న సూయల్ వర్ణన అతిశయోక్తి. ముస్లిముల చేతిలో చాలా నష్టపడింది గాని విజయ నగరం పూర్తిగా ధ్వంసం కాలేదు. నాటి యుద్ధాల్లో ఇట్టి సంఘటనలు తరచుగా జరుగుతూ ఉండేవే. అయితే, యుద్ధానంతరం అనతికాలానికే విజయనగరం రూపు మాసిపోయింది. అందుకు ముస్లిం సైన్యాలెంత కారణమో అనంత పరిణా మాలూ అంత కారణం. తురుష్క సైన్యాలు మరలిన తరువాత తిరుమలరాయలు విజయనగరం తిరిగివచ్చి నగరాన్ని పునర్నిర్మించి పూర్వ ప్రతిష్ఠను సాధించ డానికి ప్రయత్నించినాడు. పారిపోయిన ప్రజలు కూడ నగరానికి తిరిగి చేరు కున్నారు. పోర్చుగీస్ వర్తకులు విజయనగరంలో తిరుమలుని దర్శించి వాణిజ్యం యథాప్రకారం సాగించడానికి అంగీకరించినట్లు తెలుస్తుంది. కాని, కుటుంబ కలహాల వల్ల తిరుమలుని ప్రయత్నాలు ఫలించలేదు. సదాశివరాయలు తిరుమ లుని ధిక్కరించినాడు. అళియరామరాయల కొడుకైన పెదతిరుమలుడు పిన తండ్రిని నిరసించి అతణ్ణి అధికారం నుండి తొలగించడానికై సుల్తానుల సహా యము అర్థించడానికి సయితం వెనుకాడలేదు. ఈ కుటుంబ కలహాల ఫలితంగా రాజ్యంలో అరాజకం విజృంభించి ఆదోని, బంకాపుర, మధుర రాజ్యాల సామం తులు స్వతంత్రులయినారు. నిరాశతో నిస్సహాయుడైన తిరుమలరాయలు విజయనగరాన్ని విడిచి పెనుగొండ చేరి స్వతంత్రించి కర్ణాటక రాజ్యం స్థాపించి నాడు. తిరుమలరాయలు సదాశివరాయల్ని హత్యచేసినాడన్న సూయల్ కథ నంలో సత్యం లేదు. క్రీ.శ. 1576 వరకు సదాశివరాయల్ని శాసనాలు పేర్కొం టున్నాయి. నాటివరకు జీర్ణవిజయనగరంలోనే నామమాత్రమైన అధికారం నెర పుతూ సదాశివరాయలు జీవించివున్నాడు. అతనితో తుళువ వంశం అస్తమించింది. రాజకీయాధికారం అంతర్హితంగావడంతో అలనా పాలనా లేక విజయనగరం పూర్తిగా శిథిలమయింది.

## ఆరవీటి వంశం

కర్నూలు జిల్లాలోని అరెవీడు కేంద్రంగా ప్రసిద్ధులయినందున అరెవీటి వంశం అనే పేరు వచ్చింది. కాకతీయుల కాలంలో వీరు మహారాష్ట్రం నుండి వలసవచ్చి స్థిరపడినారు. ఆరవీటి సోమదేవరరాజు ఆనెగొందిలో ముస్లిములపై స్వాతంత్ర్య పోరాటం జరపడం చదివినారు గదా! అనంతరం ఆరవీటివారు విజయనగర సామంతులయినారు. ఆరవీటి తిమ్మరాజు సాళువ నరసింహుని

సేనాపతిగా ప్రసిద్ధుడయినాడు. అతని కొడుకులే రామరాయలు, వెంకటాద్రి, తిరుమలరాయలు. మొదటి ఇద్దరూ రాకాసిగండి యుద్ధంలో మరణించినారు. యుద్ధానికి పూర్వంగూడ తిరుమలుడు పెనుగొండ రాజ్యం పాలిస్తున్నట్లు ఫెరిస్తా రచనల వల్ల తెలుస్తుంది. యుద్ధానంతరం విజయనగరంలో తన కృషి ఫలించక పోవడంతో తిరుమలుడు పెనుగొండకు మరలినాడు. పెనుగొండలో సైతం అతనికి ఇక్కట్లు తప్పలేదు. రామరాయల కొడుకైన పెదతిరుమలుడు అలీ ఆదిల్‌షా సాయంతో పెనుగొండ సింహాసనం సాధించే ప్రయత్నం చేసినాడు. పెద తిరుమలుని కోరికపై ఆదిల్‌షా పెనుగొండ మీదికి ఖిజర్‌ఖాన్ నాయకత్వంలో దండు పంపినాడు. పెనుగొండ దుర్గ పాలకుడైన సవరం చెన్నప్ప ఆ దాడిని తిప్పికొట్టినాడు అయితే, రాకాసిగండి యుద్ధానంతరం 'పంచపాదుషా' లలో ఐకమత్యం నశించి యథాప్రకారం వారు కలహించుకొనసాగినారు. స్వీయ రాజ్య రక్షణకు వారి వ్యవహారాలలో జోక్యం కలిగించుకొనడం అవసరమని తిరుమలుడు భావించినట్లు కన్పిస్తుంది. కుతుబ్‌షా, నైజాంషాలు కలిసి ఆదిల్‌షాపై చేసిన యుద్ధంలో తిరుమలుడు మిత్రకూటమితో చేరనాడు. ఇందుకు ఆగ్రహించి అలీఆదిల్‌షా 1568 లో ఆదోని, పెనుగొండలపై దాడులు పంపినాడు. పెనుగొండపై దాడి విఫలమయింది గాని ఆదోని పాలకుడైన కోనేటి కొండమరాజా ఓడిపోయి బిజాపూర్ సామంతుడైనాడు. ఆదోని రాజ్యం శాశ్వతంగా బిజాపూర్ రాజ్యంలో చేరింది.

ముస్లిం దాడులు మరలిన తరువాత తిరుమలుడు క్రీ.శ. 1570 లో పెనుగొండలో పట్టాభిషేకం జరుపుకున్నాడు. అరవీటి వంశస్థాపన జరిగింది. అనంతరం తిరుమలుడొక సంవత్సరం మాత్రమే పాలించి పూర్వవిజయనగర అధికార వైభవాలు పునరుద్ధరించడానికి ప్రయత్నించినాడు; తన రాజ్యాన్ని మూడు రాష్ట్రాలు (రాజ్యాలు)గా విభజించి తన కొడుకులను రాజప్రతినిధులుగా నియమించినాడు. ఈ విభజన భాషను బట్టి జరిగినట్లు కన్పిస్తుంది. తెలుగు ప్రాంతాలను పెనుగొండ కేంద్రంగా శ్రీరంగరాయలు, కన్నడ ప్రాంతాన్ని శ్రీరంగపట్టణం నుండి రామరాయలు, తమిళ ప్రాంతాన్ని చంద్రగిరి నుండి వెంకటపతి పాలించినారు. తిరుమలుడు చేసిన ఈ విభజన రాజనీతితో కూడిన చర్యగా కన్పించదు. రాకుమారులమధ్య పరస్పర సహకారం లోపించడంతో రాజ్యం బలహీనమై సుల్తానుల విస్తరణకు అవకాశం కల్పించింది. రామరాజభూషణుడు తిరుమలరాయలకు తన వసుచరిత్రను అంకితం చేసినాడు.

## శ్రీరంగరాయలు (క్రీ.శ. 1572 - 85)

శ్రీరంగరాయలు సింహాసనం ఎక్కేనాటికి రాజ్యం అల్లకల్లోలంగా ఉంది. సామంతులు తమలో తాము పోరాడుకొంటూ రాయల్ని ధిక్కరించడమేగాక రాజ్య

ద్రోహంతైన ముస్లిం దండయాత్రికులతో చేరసాగినారు. క్రీ.శ. 1576 లో ఆలీ ఆదిల్‌షా దండెత్తిరాగా అనంతపుర పాలకుడైన హండె తిమ్మానాయకు డాతనితో చేరినాడు. మాలిక్ ఇబ్రాహిం కుతుబ్‌షా సాయంతో శ్రీరంగరాయలు ఆదిల్‌షా నోడించి పారదోలినాడు. అచిరకాలంలోనే సారె, మట్లి, హండె సామంతులు రాయల్ని వ్యతిరేకించి కుతుబ్‌షాను ఆహ్వానించినారు. రాయలతోటి సంధిని విస్మరించి మాలిక్ ఇబ్రాహింకుతుబ్‌షా కందనవోలు రాజ్యంమీదికి మురహరిరావు అనే మరాటా బ్రాహ్మణ సేనానిని దండు పంపినాడు. మురహరిరావు అహోబల దేవాలయాన్ని పరిసర ప్రాంతాలనూ దోచుకొని ప్రజలను హింసించినాడు. అహోబల శ్రీనివాసమఠ జీయ్యర్ కోరికపై శ్రీరంగరాయలు పంపిన కొండమరాజు వెంకటరాజు మురహరిరావు నోడించి పారదోలినాడు. దీనితో ఆగ్రహించి కుతుబ్‌షా కొండవీడు రాజ్యంపైకి హైదర్ ఉల్‌ముల్క్‌ను దాడి పంపినాడు. గోల్కొండ సైన్యాలు ఉదయగిరి పర్యంతం ఉన్న అనేక స్థల గిరి దుర్గాల నాక్రమించి కొండవీటిని ముట్టడించినాయి. గొబ్బూరి తిమ్మరాజు, వెలుగోటి తిమ్మానాయుడు కొండవీటిని పాలిస్తున్నారు. ముట్టడి చాలాకాలం సాగింది. చివరకు మురహరిరావు దగ్గిర లంచం పుచ్చుకొని వెలుగోటి తిమ్మానాయుడు దుర్గాన్ని కుతుబ్‌షా స్వాధీనం చేసినాడు (క్రీ.శ. 1580). కర్ణాటకం కొండవీడు రాజ్యాన్ని శాశ్వతంగా కోల్పోయింది.

గోల్కొండ దాడులు జరుగుతూవున్న కాలంలోనే పాలెయగార్లమధ్య భయంకరమైన అంతర్యుద్ధం జరిగింది. కొండ్రాజు వెంకటరాజు విజృంభించి హండె, సారె కుటుంబాల రాజ్యాలను ఆక్రమించినాడు. సారి ఓబన ఏరువ రాజ్యం ఏలుతున్న వెలుగోటి రంగప్ప సాయం అర్థించినాడు. రంగప్ప తన బావమరిది దామెర్ల వెంకటపతితో బయలుదేరి మట్లి సామంతుల రాజ్యంగుండా నడచి కోడూరు (కడప జిల్లా, బద్వేల్ తాలూకా) చేరినాడు. ఇది మట్లి తిమ్మానాయునికి ఆగ్రహం కలిగించింది. తిమ్మానాయుడు కొండ్రాజు పక్షం వహించినాడు. ఉభయ సైన్యాలకు కోడూరు దగ్గిర ఘోర యుద్ధం జరిగింది. (క్రీ. శ. 1579.) మట్లి తిమ్మానాయుడు మొదలైన పాళెగార్లనేకులు మరణించినారు. ఓబన, రంగప్పలకు విజయం లభించింది. కాని ఈ యుద్ధంతో రాయల బలహీనత స్పష్టమయి, పెనుగొండ రాజ్యం పునాదులు కదలినాయి.

## రెండో వెంకటపతి, (క్రీ.శ. 1586 - 1614)

శ్రీరంగరాయలు సంతానహీనుడైనందున పెదతమ్ముడు రామరాయల్ని కాదని చెన్నపట్టణం జగదేవరావు మొదలైన సామంతులు కనిష్ఠ సోదరుడు చంద్రగిరి పాలకుడైన వెంకటపతిని సింహాసనం ఎక్కించినారు. రెండో వెంకటపతిరాయలు సమర్థుడు. సామంతుల తిరుగుబాట్లు నణచడమేగాక కుతుబ్‌షా

ఆక్రమించిన రాజ్యభాగాలు చాలవరకు జయించి రాజ్యపూర్వవైభవం పునరుద్ధరించినాడు. రాకాసిగండి యుద్ధంతో దక్షిణ దేశంలో హైందవ రాజకీయ ప్రాబల్యం నశించలేదనడానికి వెంకటపతి పాలన నిదర్శనం.

సింహాసనం ఎక్కిన వెంటనే వెంకటపతి ముస్లిము లాక్రమించిన ప్రాంతాలను తిరిగి స్వాధీనం చేసుకొనే ప్రయత్నం చేసినాడు. క్రి శ. 1589 నాటికి ఉదయగిరి అతని వశమయింది. మొహమ్మద్ కులీకుతుబ్‌షాపై తిరుగుబాటు చేసిన అలీఖాన్ లూర్ సేనాని వెంకటపతి సాయంతో కొండవీడు రాజ్యంలో అల్లర్లు సృష్టించినందున అమీర్ ఉల్‌ముల్క్ నంద్యాల, కర్నూలు, గుత్తి పాలెగార్లను జయించి గండికోటను వశపరచుకొని పెనుగొండపై నడచినాడు. (క్రి.శ. 1597) వెంకటపతి సంధి సంప్రదింపులు సాగిస్తూ యుద్ధ ప్రయత్నం చేసినాడు. చివరకు మట్లి అనంత, తంజావూరు రఘునాథరాయలు, గుబ్బలంగసెట్టి మొదలైనవారి నాయకత్వంలో పెనుగొండ సైన్యం హటాత్తుగా గోల్కొండ సైన్యంపై బడినది. దీనికితోడు వర్షాలు ప్రారంభమై కృష్ణానదిలో వరదల ప్రమాదం కలిగింది. అమీర్‌ఉల్‌ముల్క్ పరాజయం పొంది తిరోగమించినాడు. గండికోట, గుర్రంకొండ, గుత్తి మొదలైన దుర్గాలు వెంకటపతి వశమయినాయి. కొండవీడు రాజ్యంమినహా కుతుబ్‌షా ఆక్రమణలోని తెలుగు ప్రాంతాలు పెనుగొండ రాజ్యంలో చేరినాయి.

గోల్కొండ దండయాత్రను అవకాశంగా తీసుకొని రాజ్యం నలుమూలలా సామంతులు వెంకటపతిపై తిరుగుబాట్లు చేసినారు. కోలారుప్రాంతంలో తమ్మయగౌడ కప్పం చెల్లించక రాయల్ని ధిక్కరించినాడు. గోల్కొండ యుద్ధం పరిసమాప్త మయినంతనే మట్లి అనంత, వెలుగోటి రంగప్పలతో రాయలు అతడ్ని ఓడించి కప్పం వసూలు చేసినాడు. ఇది జరిగిన వెంటనే పొత్తపినేలే కొండ్రాజు తిరుపతిరాజు, కందనవోలు గోపాలరాజులతో కలసి నంద్యాల కృష్ణమరాజు రాయల నెదిరించినాడు. (క్రి శ. 1598). ఈ తిరుగుబాటు నణచి రాయలు కృష్ణమరాజు, గోపాలరాజులను బందీలుగా పట్టుకొన్నాడు. వారి రాజ్యాలు గండికోట కేంద్రంగా పెమ్మసాని తిమ్మానాయని కిచ్చినాడు. నాడు మొదలు గండికోట పెమ్మసానివారికి రాజధాని అయింది. కొండ్రాజు తిరుపతి ఓడి పారిపోగా పులుగులనాడు, సిద్ధవటం సీమలపై మట్లి ఎల్లమరాజును పాలకుడుగా రాయలు నియమించినాడు.

తెలుగుప్రాంతాల తిరుగుబాటు అణగినంతనే తమిళ భూమిలో వెల్లూరు లింగమనీని తిరుగుబాటు జరిగింది. తిండివనం, తిరువాడి, వందవాసి, ఆర్కాటు మొదలైన ప్రాంతాల సామంతు లతనితో చేరినారు. వెలుగోటి యాచమ నాయకత్వంలో పెనుగొండ సైన్యం ఉత్తర మల్లూరు యుద్ధంలో తిరుగుబాటుదార్ల

నోడించి మరలినాడు. తిరిగి లింగమనీడు రాయల్ని ధిక్కరించినాడు. మళ్లీ అనంత, ధామెర్ల చెన్నసేనాయకు లతడ్ని మిన్నూరు, గూడలాటూరి యుద్ధాల్లో ఓడించినారు. లింగమ బందీగా పట్టుబడి పదభ్రష్టుడయినాడు.

వెంకటపతిరాయలు రాజధానిని పెనుగొండనుండి వెల్లూరుకు మార్చినాడు సుల్తానుకు దూరంగానూ, దాక్షిణాత్య సామంతులకు సన్నిహితంగాను రాజధాని ఉండడం అవసరమని అతని అభిప్రాయమయివుంటుంది. రెండో వెంకటపతి ఆస్థానానికి మొగల్ పాదుషా అక్బర్ తన సార్వభౌమత్వం అంగీకరించవల సిందిగా రాయబారం పంపినట్లు తెలుస్తుంది. అక్బర్‌కోరికను తిరస్కరిస్తూ తాను అతనితో యుద్ధానికి సిద్ధమేనని కబురుపంపి ఉదాత్త విజయనగర సంప్రదాయాన్ని వెంకటపతి నిలిపినాడు.

**అంతర్యుద్ధం**

రెండో వెంకటపతికి సంతానంలేదు. అతని పట్టమహిషి బాయమ్మ ఆళియ రామ రాయల దౌహిత్రి. గొబ్బూరి ఓబరాజు కూతురు బాయమ్మ రహస్యంగా ఒక బ్రాహ్మణ బాలుడ్ని చేరదీసి తనకొడుకుగా ప్రకటించి పెంచింది. అతడ్ని సింహాసనం ఎక్కించాలని ఆమె ఆశయం వెంకటపతికి ఈ రహస్యం తెలుసు అందుచే తన అన్నకొడుకు శ్రీరంగరాయల్ని తనకు వారసుడుగా ప్రకటించి వెంకటపతి మరణించినాడు.

రెండో శ్రీరంగరాయలు సింహాసనం ఎక్కినాడుగాని బాయమ్మ సోదరుడు గొబ్బూరు జగ్గరాజు సేనాపతులైన మాలెరాజు, తిమ్మనాయకులను కూడగట్టుకొని శ్రీ రంగరాయల్ని తొలగించి తన మేనల్లుణ్ణి సింహాసనం ఎక్కిం దానికి కుట్ర పన్నినాడు. వెలుగోటి కస్తూరి రంగప్ప కొడుకు యాచమనాయకుడు మాత్రం శ్రీరంగరాయల పక్షం వహించినాడు. జగ్గరాజు కుట్ర ఫలించి శ్రీరంగ రాయల కుటుంబం బందీ అయింది. శ్రీరంగని కొడుకు రామదేవరాయల్ని మాత్రం యాచమ బందీ నుండి తప్పించగలిగినాడు. దీనితో ఆగ్రహించి జగ్గ రాజు శ్రీరంగరాయలకుటుంబాన్ని ఖైదులో హత్యచేయించినాడు.

జగ్గరాజు అమానుషక్రూరకృత్యంతో రాజ్యం అట్టుడికినట్లయింది. వెల్లి తిరువెంగళనాథాదిమిత్రులు సయితం జగ్గరాజుపట్ల విముఖత్వం వహించినారు. రాజ్యం యాచమ జగ్గరాజుల పక్షాలుగా చీలిపోయింది. జగ్గరాజుపక్షం బలహీనం కావడం గమనించి యాచమ మిత్రబృందాన్ని కూర్చుకొని వెల్లూరుపై దండెత్తి నాడు. జగ్గరాజు ఓడిపోయినాడు. వెల్లూరు యాచమవశమయి, రామదేవరాయల పట్టాభిషేకం జరిగింది.

పరాజయం చెందిన జగ్గరాజు తన ప్రయత్నాలు మానలేదు. మధుర, చెంజి నాయకుల సాయం అతనికి లభించింది. రాకాసిగండి యుద్ధం నుండి ఈ

నాయకులు రాయల అధికారాన్ని ధిక్కరిస్తున్నవారే. ఇది గమనించి యాచమ తంజావూరు రఘునాథరాయల సహాయం పొందినాడు. ఉభయుల సైన్యాలు తోపూరుదగ్గిర తారసిల్లినాయి మొదట్లో ఫిరంగులతో భీకరయుద్ధం జరిగింది. దక్షిణదేశంలో పెద్ద యెత్తున ఫిరంగులు వాడింది తోపూరు యుద్ధంలో (క్రీ.శ. 1686) నని చెప్పవచ్చు. యుద్ధంలో జగ్గరాజు మరణించడంతో మిత్రకూటమి విచ్ఛిన్నమయింది. చెంజి కృష్ణప్ప, మధురవీరప్పలు పారిపోయి ప్రాణాలుదక్కించుకున్నారు. వారిసైన్యాలు చెల్లాచెదరయినాయి. గొబ్బూరువారు అపార నష్టానికి గురి అయినారు. వారి దుర్గాలనేకం యాచమ స్వాధీనం చేసుకున్నాడు. 'వెలుగోటి వారి వంశావళి' తోపూరు యుద్ధాన్ని విపులంగా వర్ణిస్తున్నది.

తోపూరుయుద్ధంతో అంతర్యుద్ధం సమాప్తం కాలేదు. జగ్గరాజు సోదరుడు యతిరాజు బలాన్ని కూడదీసుకొని యాచమని ధిక్కరించినాడు. క్రీ.శ.1691 లో బాయమ్మ కొడుకు మరణించడంతో యతిరాజుల బలం క్షీణించింది, అంతేగాక, రామదేవరాయలు అతనితో సమాధానపడి అతని కూతుర్ని పెండ్లాడినాడు. అంతర్యుద్ధం అంతటితో ముగిసింది. ఈ అంతర్యుద్ధాన్ని గురించిన వివరాలు పోర్చుగీసు బాటసారి మాన్యూల్ బర్రదాస్ లేఖలనుండి లభిస్తున్నాయి.

అంతర్యుద్ధం ముగిసినా రామదేవుని అధికారం స్థిరపడలేదు. మధుర, చెంజి నాయకులు యధాప్రకారం రాయల్ని ధిక్కరించినారు. కాళహస్తి సామంతుడైన దామెర్ల వెంకటపతి బలవంతుడై తిరుగుబాటు ప్రారంభించినాడు. రామదేవ, యతిరాజులమధ్య సమాధానం యాచమ పక్షంవారు సహించలేదు. యాచమ కొడుకు వెలుగోటి కస్తూరి రంగప్ప విప్లవధ్వజ మెత్తినాడు. ఇట్టి క్లిష్టపరిస్థితుల్లో యతిరాజు సహాయంతో రామదేవుడు తిరుగుబాటుదార్లపై పలు యుద్ధాలొనర్చి వారిని ఓడించినాడు. దామెర్ల వెంకటపతి లొంగిపోవడంతో క్రీ.శ. 1629 నాటికి శాంతి యేర్పడి రామదేవుని అధికారం సుస్థిరమయింది.

అంతర్యుద్ధము, సామంతుల తిరుగుబాట్లు అవకాశంగా తీసుకొని కందనవోలు రాజ్యం ఆక్రమించే ఆశయంతో ఆదిల్‌షా రెండు దండయాత్రలు పంపినాడు. మొదటి దండయాత్ర (క్రీ.శ. 1621)ను అబ్దుల్ ఖాన్ నడిపినాడు. కర్నూలు పాలకుడైన గోపాలరాజాతణ్ణి ఓడించి మరలించినాడు కాని, క్రీ.శ. 1624 లో వాహబ్‌ఖాన్ చేతుల్లో ఓడి బిజాపూర్ సామంతుడయినాడు. కందనవోలు రాజ్యం బిజాపూర్‌లో కలిసిపోయింది.

**మూడో వెంకటపతి, క్రీ.శ. 1630 - 42**

రామదేవరాయల మరణంతో మరొక అంతర్యుద్ధం ప్రారంభమయింది. తనకు సంతానం లేనందున రామదేవుడు అళియ రామరాయల మనుమడు పెద

వెంకటపతిని తనకు వారసుడుగా నిర్ణయించినాడు. ఈ నిర్ణయాన్ని రామదేవుని పినతండ్రి తిమ్మరాజు ధిక్కరించి యుద్ధానికి దిగినాడు. తిమ్మరాజు చర్యను మధుర, జెంజి, తంజావూరు నాయకులు గర్హించినారు. సామంతుల సాయంతో వెంకటపతి తిమ్మరాజు నోడించి సింహాసనం ఎక్కినాడు. క్రీ.శ. 1635 లో తిమ్మ రాజు మరణంతో అంతర్యుద్ధం ముగిసింది.

అనంతరంకూడ మూడో వెంకటపతి ప్రశాంతంగా రాజ్యం చేయలేదు. బిజాపూర్ సుల్తాన్‌తో అతనికి సుదీర్ఘమైన యుద్ధం జరిగింది. ఈ యుద్ధానికి విశ్వాస ఘాతకులైన విజయనగర సామంతులే చాలవరకు కారణం. ముఖ్యంగా శ్రీరంగరాయలు బిజాపూర్ సేనానితో చేరినాడు. శ్రీరంగరాయలు మూడో వెంకటపతి తమ్ముని కొడుకు. కందనవోలు గోపాలరాజు దత్తపుత్రుడు. అందుచే క్రీ శ. 1624 నుండి అతడు బిజాపూర్ సామంతుడు. అతడు వెల్లూరు సింహాసనం ఆశించినట్లు కన్పిస్తుంది. తిమ్మరాజుతోటి యుద్ధంలో మూడో వెంకట పతికి అండగా ఉన్నారు. అనంతరం ఉభయులమధ్య అభిప్రాయభేదాలు వచ్చినాయి. బహుశా శ్రీరంగరాయల ప్రోత్సాహంతో రణదౌలఖాన్ క్రీ.శ. 1637 - 42 ల మధ్య కర్ణాటకంపై పలుమార్లు దండెత్తినాడు. ఇక్కేరి, బసువా పట్టణం, బెంగుళూరులు బిజాపూరు సామంతరాజ్యా లయినాయి. రణదౌలఖాన్ బెంగుళూరులో షహజీని పాలకుడుగా నియమించి శ్రీరంగ పట్టణంపై దండెత్తి నాడుగాని, కంఠీరవ నరసరాజుతణ్ణి ఓడించి మరలించినట్లు కన్పిస్తుంది. క్రీ.శ. 1641 లో రణదౌలఖాన్, శ్రీరంగరాయలు కలసి వెల్లూరుపై దండెత్తినారు. వెంకటపతిరాయలు మధుర, తంజావూరు నాయకుల సహాయం అర్థించినాడు. సమయానికి వారి సైన్యాలు రావడంతో రణదౌలఖాన్ తిరోగమించినాడు. తాత్కాలికంగా వెంకటపతికి ప్రమాదం తప్పింది.

కర్ణాటకరాజ్యంలో అధిక భాగం బిజాపూర్ ఆక్రమించడాన్ని గోల్కొండ సుల్తాన్ సహించక, క్రీ శ. 1642లో ఆంధ్రప్రాంతాల మీదికి దండయాత్ర పంపి నాడు. వెలుగోటి తిమ్మానాయుడు దామెర్ల వెంకటపతి మొదలైన సామంతుల సాయంతో వెంకటపతి గోల్కొండ సైన్యాల నెదిరించినాడుగాని పూర్తిగా పరా జయం పొందినాడు. రాయలు చిత్తూరు జిల్లా అడవుల్లోకి పారిపోయి కొన్ని రోజులకే మరణించినాడు. పులికాట్, శ్రీహరికోట, అర్మగం మొదలైన దుర్గాలు గోల్కొండ సైన్యాలు ఆక్రమించినాయి. మూడో వెంకటపతి పాలన చివరికి ఆంధ్ర కర్ణాట ప్రాంతాల్లో అధికభాగం గోల్కొండ, బిజాపూర్ రాజ్యాల స్వాధీన మయినాయి.

### మూడో శ్రీరంగరాయలు

మూడో వెంకటపతి పారిపోవడంతో శ్రీరంగరాయలు రణదౌలఖానును వీడి వెల్లూరుచేరి సింహాసనం (క్రీ.శ. 1642) ఆక్రమించినాడు. ఇతడే విజయ నగరాధీశుల్లో చివరివాడు. శ్రీరంగరాయలు సింహాసనం ఆక్రమించే నాటికి రాజ్యం అంతిమ దశలో ఉంది. అతనిలోవలెనే ప్రభువర్గాలన్నింటిలో ద్రోహ బుద్ధి, స్వార్థచింతన బలసిపోయినాయి. రాజ్యంపై బిజాపూర్, గోల్కొండ సైన్యాలు దండెత్తివున్నాయి. సుల్తానుల్లో ఒకరికి వ్యతిరేకంగా మరొకరి సాయం పొందడానికీ, సామంతులనణచి సామ్రాజ్యాధికారాన్ని పునరుద్ధరించి తన పదవిని పదిలపరుచుకోడానికి శ్రీరంగరాయలు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. రాయలమాయోపాయాలు గ్రహించిన సుల్తానులు ఏకంగావడంతో సామంతులు రాయల్ని తుదముట్టించే ప్రయత్నంలో సుల్తానులసాయం కోరడంతో కర్ణాటక రాజ్యం సంక్షుభితమై క్రమంగా అస్తమించింది.

సింహాసనం ఆక్రమించినవెంటనే మూడో శ్రీరంగరాయలు ఉదయగిరిని ముట్టడిస్తున్న గోల్కొండ సైన్యాలను తరిమివేయడానికి చేసిన ప్రయత్నం కాళహస్తిపాలకుడు దామెర్ల వెంకటపతి తిరుగుబాటువల్ల విఫలమయింది. ఇక్కేరి (మలెనాడు) తిరుగుబాటు నణచే ప్రయత్నంలో బిజాపూర్ సైన్యాలు నిమగ్నమై యున్నందున శ్రీరంగరాయలకు సహాయం అందలేదు. అయితే కర్ణాటకాన్ని గోల్కొండ జయించి ఆక్రమించడం మహమ్మద్ఆదిల్‌షా సహించ లేకపోయినాడు. మలెనాడులో తిరుగుబాటు అణగినంతనే రాయలసహాయార్థం ఒక సైన్యంపంపినాడు. ఆ సైన్య తో రాయలు ఉదయగిరిని ఆక్రమించడమేగాక వెంగల్లుయుద్ధంలో గోల్కొండసైన్యాలనోడించి కందుకూరువరకు తరిమినాడు.

ఈ విజయాలతో తనశక్తిసామర్థ్యాలలో విశ్వాసంకుదిరి చెంజి,తంజావూర్, మధుర నాయకులను అదుపులో పెట్టడానికి శ్రీరంగరాయలు ప్రయత్నించినాడు సామంతులీ ప్రయత్నాలు సహించలేదు. అదీగాక బహుశా తిరిగి రాయలు బలవంతుడవుతున్నాడనే భయంతో బిజాపూర్, గోల్కొండ ఏకమై వెల్లూరుపై దండెత్తినాయి. మీర్‌జుమ్లా నాయకత్వంలో గోల్కొండ సైన్యాలు ఎర్రగొండ పాలెం, ధద్దవాలమొదలైన దుర్గాలు ఆక్రమించగా బిజాపూర్‌సైన్యాలు నంద్యాల, సిరివెళ్ళ, కనిగిరి మొదలైనవి ఆక్రమించినాయి. బహుశా శ్రీరంగరాయలు సుల్తానులతో సమాధానపడినందున ఈ దండయాత్రలు మరలినట్లు కన్పిస్తుంది. కాని ఇంతలో చెంజి, మధుర, తంజావూరు నాయకులేకమై తిరుగుబాటొనర్చి సుల్తానుల సహాయం అర్థించడంతో పరిస్థితి మరల విషమించింది. బిజాపూర్ సైన్యాలు ముస్తఫాఖాన్ నాయకత్వంలో గుర్రంకొండ, ఉక్కపట్టణాలను ముట్టడించగా మీర్‌జుమ్లా సైన్యాలు వినుకొండమీదికి నడచినాయి. ముస్తఫాఖాన్

కోలారు ప్రాంతాలపై దాడులు జరుపగా మీర్‌జుమ్లా ఉదయగిరి, చిట్వేలి, బద్వేల్ కోటలు వశపరచుకొన్నాడు. రాయలు నిస్సహాయుడయినాడు. ఖజానా వట్టిపోయింది. సామంతులు, సేనాపతులు ద్రోహులై ముస్లిందండయాత్రికులతో చేరుతున్నారు. గోల్కొండ, బిజాపూర్ సైన్యాలు క్రమంగా రాజ్యాన్ని పంచుకొంటున్నాయి. ఈ పరిస్థితి గమనించి మైసూర్, తంజావూరు, చెంజి నాయకులు రాయలకు సైనిక సాయం పంపినారు. కాని వెల్లూరుదగ్గిర జరిగిన యుద్ధంలో (క్రీ శ. 1642) రాయలు పూర్తిగా పరాజయం పొందినాడు. ముస్తఫాఖాన్ వెల్లూరు ముట్టడించినాడుగాని ఆ ప్రాంతంలో తీవ్రమైన దుర్భిక్ష పరిస్థితులేర్పడినందున ముట్టడి విరమించి మైసూర్‌లోని పెక్కు దుర్గాలు ఆక్రమించి బిజాపూర్ మరలినాడు.

తాత్కాలికంగా రాయలకు ముస్తఫాఖాన్ బెడదతీరినా మీర్‌జుమ్లా ప్రమాదం హెచ్చింది. అందుచే రాయలు వెల్లూరికి తగిన రక్షణ కల్పించి చెంజి' తంజావూరు రాజ్యాల్లో తలదాచుకున్నట్లు కన్పిస్తుంది. ఉదయగిరి వశపరచుకొన్న మీర్‌జుమ్లా తొండమాన్‌నాడు, తిరుపతి, చంద్రగిరి ఆక్రమించి పులికాట్ చేరినాడు (క్రీ. శ. 1646) పులికాట్‌లోని డచ్చివారితో అతనికి సమాధానం కుదరలేదు. అనంతరం పొన్నేరి, పూనమల్లి, కాంచీపురం, చెంగల్పట్టుల నాక్రమించినాడు. శ్రీరంగరాయల ప్రోత్సాహంతో మదుర, మైసూరు నాయకు లేకమై మీర్‌జుమ్లానెదిరించినారుగాని వందవాసియుద్ధంలో పరాజయంపొందినారు. మీర్‌జుమ్లా చెంజిదుర్గాన్ని పట్టుకోడానికి ప్రయత్నించడంతో ముస్తఫాఖాన్ రంగంలో ప్రవేశించి అతణ్ణి ప్రతిఘటించినాడు. ముస్తఫాఖాన్‌తో సమాధానపడి మీర్‌జుమ్లా సిద్ధవటం, మట్లి సామంతులను, గండికోట పెమ్మసాని నాయకులను జయించినాడు. చెంజీ, పెనుగొండ, వెల్లూరు దుర్గాలు (క్రీ. శ. 1650) ముస్తఫాఖాన్ వశమయినాయి. సుగుమంచిపల్లి కైఫియత్ ప్రకారం క్రీ. శ. 1652 నాటికి విజయనగరరాజ్యం పూర్తిగా సుల్తానుల స్వాధీనమయింది. శ్రీరంగరాయలు రాజ్యాన్నీ రాజధానినీ కోల్పోయి మైసూర్‌ప్రాంతాల్లో శరణార్థి అయినాడు.

కర్ణాటకరాజ్యాన్ని పంచుకొన్న బిజాపూర్ గోల్కొండలమైత్రి ఎంతో కాలం నిలువలేదు. చెంజి ఆక్రమణను గురించి ఏర్పడ్డ అభిప్రాయభేదాలు క్రమంగా తీవ్రమయినాయి. ఇది ఇట్లుండగా మీర్‌జుమ్లా తాను జయించిన కర్ణాటక ప్రాంతాలను కుతుబ్‌షా పరం చేయక సొంత జాగీరుగా స్వతంత్రంగా పాలించడానికి సంకల్పించినాడు. అతణ్ణి అణచే ప్రయత్నంలో సుల్తాన్ శ్రీరంగరాయల్ని ప్రోత్సహించినట్లు కన్పిస్తుంది. కాని క్రీ. శ. 1656 లో మొగలాయిదక్కన్ సుబేదారయిన ఔరంగజేబు గోల్కొండపై దండెత్తినాడు. అతనితో మీర్‌జుమ్లా చేరినాడు బిజాపూర్‌లో మొహమ్మద్ ఆదిల్‌షా మరణించి

(క్రీ.శ. 1656) ఆ రాజ్యంకూడ మొగల్ దండయాత్రకు గురి అయింది. కుతుబ్ షా ఆదిల్ షాలు ఔరంగజేబుతో సంధి చేసుకొని ప్రమాదం తప్పించుకున్నారు. మీర్ జుమ్లా మొగల్ కొలువుచేరి దక్షిణదేశం నుండి నిర్గమించినాడు. కాని మహారాష్ట్ర నాయకుడు శివాజీ విజృంభణతో బిజాపూర్ అల్లకల్లోలితమయింది. ఈ పరిస్థితుల్లో శ్రీరంగరాయలు బిజాపూర్ నుండి పెనుగొండను ఆక్రమించి (క్రీ. శ. 1665) సుమారు క్రీ శ 1680 వరకు పాలించినట్లు తెలుస్తుంది. అతనితో ఆరవీటి వంశము, కర్ణాటక రాజ్యము అస్తమించినాయి.

## నాయకరాజ్యాలు

విజయనగర రాజ్యం కన్యాకుమారి వరకు విస్తరించి ఉచ్ఛస్థితిలో ఉన్న ప్పుడు తమిళ మండలంలో - ముఖ్యంగా తంజావూరు, చెంజి, మధుర రాష్ట్రాల్లో తెలుగు నాయకులు సామంత పాలకులయినారు. రాకాసిగండి యుద్ధానంతరం విజయనగరం క్షీణించడంతో అమరనాయక - పాళెయగారి విధానంలోని దుష్ఫ లితాలు వెర్రితలలు వేసినాయి. రాష్ట్రపాలకులు పాళెగార్లు అంతర్యుద్ధాలు జర పడమేగాక కేంద్రంతో సయితం యుద్ధాలకు దిగినారు. ఈ రోజుల్లోనే పైరాజ్యాల నాయకరాజులు స్వతంత్రంగా పాలించసాగినారు. ఈ వంశాల చరిత్రకు ఆంధ్రదేశంతో ఏమాత్రం సంబంధం లేదు కాని, వారిచరిత్ర ఆరవీటి వంశ చరిత్రతో ముడిపడింది. ముఖ్యంగా చెంజి, మధుర నాయకులు ద్రోహబుద్ధితో ఆరవీటివంశ నిర్మూలనకు, కర్ణాటకరాజ్య వినాశనానికి శక్తికొలది ప్రయత్నించి నారు. అయితే ఆంధ్రసంస్కృతీ వికాస విస్తరణలకీ రాజ్యాలు ఇతోధికంగా కృషి చేసినాయి. తెలుగు సంగీత సాహిత్యాలకు రంగస్థలాలై దక్షిణదేశం అంతటా తెలుగు సంస్కృతికి గౌరవప్రతిష్ఠలు చేకూర్చినాయి.

### మధుర

ప్రాచీనపాండ్యదేశమే రాయలనాటి మధురరాజ్యం. అందులో నేటి మధుర, రామనాథపురం, తురునల్వేలి, తిరుచునాపల్లి, కోయంబత్తూరు, సేలం జిల్లాలు, తిరువాన్కూరులో కొంతభాగం కలిసివుండేవి. మధుర రాజ్యస్థాపనను గురించి ఒక ఐతిహ్యం ఉంది. "పాండ్యరాజులనుండి మధురను జయించిన సేనాని నాగమ నీడు కృష్ణరాయలను ధిక్కరించి స్వతంత్రించినాడు. నాగమకొడుకు విశ్వ నాధుడు నాగమను జయించి బందీగా పట్టుకురాగా రాయలు సంతసించి మధుర రాజ్యాన్ని విశ్వనాథుని కిచ్చినాడు" అని ఆ కథ. అంటే - కృష్ణరాయల కాలం లోనే విశ్వనాథుడు మధుర రాజ్యం స్థాపించినాడని ఆ కథ సారాంశం. దీనికి చారిత్రక ఆధారం లేదు. విశ్వనాథుడు అచ్యుతరాయల కాలంలో తాంబూలకరండ వాహిగా ఉన్నట్లు శాసనసాక్ష్యం ఉంది. బహుశా అచ్యుతుని అభిమానంతో విశ్వనాథుడు చోళమండలంలో అమరనాయకుడయి వుంటాడు. తరువాత సదాశివుని

కాలంలో దక్షిణదేశ దండయాత్రనడిపిన రామరాజు విఠలులకు సాయపడి రామరాయల అభిమానంపొంది తిరువాడపాలకులయినట్లు తెలుస్తుంది. క్రీ. శ. 1564 వరకు విశ్వనాథుని పాలనసాగింది. అనంతరం అతనికొడుకు కృష్ణప్ప పాలకుడయి రాకాసితంగడి యుద్ధంలో పాల్గొన్నాడు. యుద్ధానంతరం తిరుమల రాయల ఇక్కట్టులు, నిస్పృహాయత అవకాశంగా తీసుకొని నామమాత్రంగా అతనికి లోబడి కప్పం చెల్లిస్తూ స్వతంత్రంగా వ్యవహరింపసాగినాడు. అందుచే క్రీ. శ. 1565 ప్రాంతంలో కృష్ణప్పనాయకుడే మధురరాజ్యం స్థాపించినాడని చెప్పవలె.

కృష్ణప్పకాలంలో (క్రీ. శ. 1564-72) అరియనాథుడు ప్రధాని, దండనాథ పదవుల్లోవుండి రాజ్యవ్యవహారాలు నిర్వహించినాడు. కృష్ణప్పకొడుకు వీరప్పనాయకుడు (1572-96) రెండో వెంకటపతిరాయలపై తిరుగుబాటుచేసి వల్లంకోట యుద్ధంలో పరాజయం పొందినట్లు తెలుస్తుంది. ఈతని కాలంలో ఫెర్నాండియనే పోర్చుగీస్ క్రైస్తవ మతప్రచారకుడు మధురలో చర్చి నిర్మించి ప్రచారం ప్రారంభించినాడు. వీరప్ప అనంతరం సింహాసనం ఎక్కినవారిలో ముద్దుకృష్ణప్ప (క్రీ శ. 1601-9) ప్రముఖుడు. మారవ దేశంలో (మధుర తీర ప్రాంత భూములు) పోర్చుగీసులు జరుపుతున్న దుండగాల నణచి రామేశ్వరం వెళ్ళే తీర్థయాత్రికులకు రక్షణ కల్పించినాడు. ముద్దుకృష్ణప్ప కొడుకు ముద్దు వీరప్ప (క్రీ. శ. 1609-23) బాహాటంగా విజయనగరాన్ని ధిక్కరించి రెండో వెంకటపతిరాయలి అనంతరం చెలరేగిన అంతర్యుద్ధంలో జగ్గరాజుపక్షం వహించి తోపూరు యుద్ధంలో పరాజయం చెందినాడు.

వీరప్పకొడుకు తిరుమలనాయకుడు మధురనాయకరాజుల్లో అగ్రగణ్యుడు (క్రీ. శ. 1623-59). రాజనీతి కిటుకులు తెలిసినవాడు. ఈతని పాలనలో మధుర ప్రాబల్యం ఇనుమడించింది కాని, స్వార్థంతో ఈతడు అనుసరించిన విధానాలవల్ల విజయనగరరాజ్యం నశించడమేగాక మధుర ఉనికికే ప్రమాదం ఏర్పడింది. శ్రీరంగరాయలు విజయనగర రక్షణకై చేసిన ప్రయత్నాలను ప్రతిఘటించి తిరుమలనాయకుడు బిజాపూర్ గోల్కొండ సుల్తానులపక్షం వహించినాడు. దీనితో కర్ణాటకాన్ని బిజాపూర్, ఆంధ్రప్రాంతాలను గోల్కొండ ఆక్రమించినాయి దీనికితోడు తిరుమలరాయలకాలం అంతా మారవ సేనాపతులతోను ఇతర పాళెగార్లతోను యుద్ధాలతో సరిపోయింది. ఈతని చివరి రోజుల్లో మైసూర్ కంఠీరవ నరసరాజు మధురపై దండెత్తి, సత్యమంగళం ప్రాంతంలో చేజిక్కిన వారిని ఆడ మగ విచక్షణ లేకుండా క్రూరంగా ముక్కులు కోయించినాడట. దీన్నే 'ముక్కుల యుద్ధం' అంటారు. యుద్ధంలో పోర్చుగీసువారు సాయం చేసినందున తిరుమలుడు వారికి చర్చిలు కట్టించినాడు. ఈ రోజుల్లోనే రాబర్ట్ ద నోబిలీ అనే ప్రసిద్ధ మత ప్రచారకుడు మధుర కేంద్రంగా కొత్త పద్ధతుల్లో క్రైస్తవ

ప్రచారం ప్రారంభించినాడు. యుద్ధాల్లో నిమగ్నుడై వున్నా తిరుమలుడు కళలను, సారస్వతాన్ని పోషించడంలో ఏమరలేదు. నేటికీ మధురలో యాత్రికుల నాకర్షించే 'తిరుమల రాయల మహల్' అతని నిర్మాణమే. తిరుమలుని కాలంనుండి మధుర తెలుగు సారస్వతానికి ఆటపట్టయింది.

తిరుమలుని కొడుకు చొక్కనాథుని కాలంలో (1657-82) మధుర రాజ్య విచ్ఛిన్నం ప్రారంభమయింది. ఉద్యోగులు కుట్రలు సాగించినారు. దానికితోడు క్రీ.శ. 1663 లో బిజాపూర్ సైన్యం దండెత్తిరాగా, చొక్కనాథుడు సంధి చేసుకొని మరలించినాడు. మధుర పరిస్థితు లీ విధంగా వుండగా, చొక్కనాథుడు తంజావూరు నాక్రమించి పగ తీర్చుకున్నాడు. చొక్కనాథుని తమ్ముడు అళగిరి తంజావూరు పాలకు డయినాడు. కాని, అచిరకాలంలోనే తంజావూరు, బిజాపూర్ సామంతులైన మహారాష్ట్రుల వశమయింది. ఇంతలో చొక్కనాథుడు కోయంబత్తూరు, చిత్తూరు ప్రాంతాలను, మైసూరును కోల్పోయినాడు.

చొక్కనాథుని కొడుకు మూడో ముద్దుకృష్ణప్ప ఏడేండ్లు పాలించినాడు. అతని కొడుకు విజయరంగచొక్కనాథుడు బాలు డయినందున మాతామహి మంగమ్మ సామర్థ్యంతో రాజ్యవ్యవహారాలు నిర్వహించింది. మంగమ్మ కాలంలో దక్షిణదేశ రాజకీయాల్లో అనేక పరిణామాలు జరిగాయి. శివాజీ స్వరాజ్యం స్థాపించినాడు (క్రీ. శ. 1674). తంజావూరు మహారాష్ట్రుల స్వాధీనమయింది (క్రీ.శ. 1676). మొగల్ పాదుషా ఔరంగజేబు బిజాపూర్, గోల్కొండల నాక్రమించినాడు. దక్షిణదేశంలో అధిక భాగం హైదరాబాద్ సుబాలో చేరి నైజాం ఉల్ ముల్క్ సుబేదారయినాడు. హైదరాబాద్ సుబేదార్ కింద ఆర్కాటులో 'నవాబీ' ఏర్పడింది. ఇట్టిపరిస్థితుల్లో మంగమ్మ రాజనీతితో వ్యవహరించి ఔరంగజేబుకు కప్పం చెల్లించడానికి అంగీకరించింది. క్రీ శ. 1706 నుండి విజయరంగ చొక్కనాథుడు పరిపాలనాభారం వహించినాడుగాని అతనికి సాహిత్యంలోవున్న ఆసక్తి ప్రభుత్వ నిర్వహణలో లేనందున ఉద్యోగుల దుండగాలు మితిమీరి ప్రజ లనేక బాధలకు గురి అయినారు.

విజయరంగ చొక్కనాథుని మరణానంతరం (క్రీ. శ. 1732) అతని భార్య మీనాక్షి పాలనాభారం వహించింది. ఆస్థాన ఉద్యోగు లది సహించక కుట్రలు సాగించినారు. పరిస్థితులవకాశంగా తీసుకొని ఆర్కాటు నవాబు అనతితో చందాసాహెబ్ మధురపై దండెత్తినాడు (క్రీ.శ. 1739). మీనాక్షి ఆత్మహత్య చేసుకొన్నది. మధుర రాజ్యం ఆర్కాటు 'నవాబీ'లో లీనమయింది.

**తంజావూరు**

ప్రాచీన చోళ మండలంలో తంజావూరు నాయక రాజ్యం ఏర్పడింది. తంజావూరు, తిరుచునాపల్లి, పుదుకోట ప్రాంతం అందులో చేరివుండేది. కృష్ణరాయల కాలంలోనే ఈ మండలాన్ని విజయనగరం ఆక్రమించింది. దూర

ప్రాంతమయినందున విశ్వాసపాత్రులైన వారిని పాలకులుగా నియమించడం అవసరమనే దృష్టితో అచ్యుతరాయలు తనకు దగ్గరి బంధువైన చెవ్వప్పను తంజావూరు పాలకుడుగా క్రీ.శ. 1535 లో నియమించినాడు. అచ్యుతరాయలు పట్టమహిషియైన వరదాంబిక చెల్లెలు మూర్తమాంబ భర్త చెవ్వప్ప. ఇది తంజావూరు రాజ్యోదయము. చెంజి, మధురలవలె కాక, తంజావూరు చాలవరకు విశ్వాసంతో వ్యవహరిస్తూ రాయల అండగా వుండేది. అందుచేతనే బహుశా మధుర, తంజావూరు రాజ్యాల మధ్య తీవ్రమైన స్పర్థ ఏర్పడింది.

**తంజావూరు**

చెవ్వప్ప (క్రీ శ. 1535-61) మంచి సమర్థుడు. తంజావూరు ప్రాంతాల్లో అలజడులకు కారణమైన చోళ నాయకుల నణచి శాంతిభద్రతల నెలకొల్పినాడు. మహావిద్వాంసుడైన గోవింద దీక్షితులు అతని మంత్రి. చెవ్వప్ప అనుమతితో పోర్చుగీసువారు తంజావూరులో చర్చి నిర్మించుకున్నారు. చెవ్వప్ప కొడుకు అచ్యుతనాయకుడు (క్రీ. శ. 1561 - 1614) రాయలపట్ల విధేయతతో వళ్ళం కోట యుద్ధంలో రెండో వెంకటపతి పక్షాన మధురతో పోరాడినాడు. దీనితో మధుర, తంజావూరుల మధ్య స్పర్థ పెరిగింది. అచ్యుతునకు యువరాజైన రఘునాథుడు అన్నివిధాల తోడ్పడుతూవుండేవాడు. క్రీ శ. 1597 లో వెల్లూరుపై గోల్కొండ సైన్యాలు దండెత్తినప్పుడు రఘునాథుడే రాయల సహాయంగా సైన్యాలు నడిపినాడు. అచ్యుతనాయకుడు కుంభకోణం, చిదంబర క్షేత్రాల్లో గోపుర మండపాలు నిర్మించటమేగాక, కావేరి నది ఆనకట్ట మరమ్మత్తు చేయించి ప్రజలకు మేలు చేకూర్చినాడు.

తంజావూరు నాయక రాజుల్లో రఘునాథుడు (క్రీ. శ. 1613 - 1633) అగ్రగణ్యుడు. ఈతడు సింహాసనం ఎక్కేనాటికి విజయనగరంలో అంతర్యుద్ధం జరుగుతోంది. అదేసమయంలో పోర్చుగీసులచే పదభ్రష్టుడయిన నేపాళ (జాఫ్నా) రాజు రఘునాథుని శరణు జొచ్చినాడు. దేవికోట ప్రాంతంలో చోళగుడనే దొంగల నాయకుని దుశ్చర్యలు మితిమీరినాయి. ఇట్టి పరిస్థితుల్లో రఘునాథుడు డచ్చివారితో స్నేహంచేసి, వారిచే తన సైనికులకు శిక్షణనిప్పించి దేవికోటమీద దండెత్తినాడు. చోళగుని అణచి దేవికోటనాక్రమించి జాఫ్నాపైదండెత్తి పోర్చుగీసుల నోడించి నేపాళప్రభువును సింహాసనంపై పునరుద్ధరించినాడు. అనంతరం యాచమనాయకునితోచేరి తోపూరుయుద్ధంలో ప్రముఖ పాత్ర నిర్వహించినాడు. రఘునాథుడు సాహిత్యస్రష్ట, పోషకుడు; తంజావూరుకు శ్రీకృష్ణరాయల వంటివాడు.

రఘునాథుని కొడుకు విజయరాఘవుడు (క్రీ.శ. 1633-73) సాహిత్యాభిమానియేగాని రాజకీయాల్లో సమర్థుడుకాదు; భక్తితుడు. తాతతండ్రులవలెగాక

మదురతో చేరి రాయలకు ద్రోహం తలపెట్టినాడు. అయితే, తిరుమల నాయకునితో కూడ వైరం పెట్టుకొని ఏకాకి అయినాడు. రాజ్యంలో కూడ వైష్ణవ మతాభిమానంతో అన్యమతస్థులను పీడించడంవల్ల ప్రజాభిమానం కోల్పోయినాడు. విజయరాఘవుని బలహీనతను గ్రహించి బిజాపూర్, గోల్కొండ సుల్తానులు తరచు దండెత్తివచ్చి కప్పం వసూలు చేసినారు. దీనితో ప్రజలపై పన్నులభారం పెరిగింది. ఇందుకుతోడు క్రీ.శ 1662 లో గొప్ప క్షామం సంభవించి ప్రజలనేక బాధలకు గురి అయినారు. పరిస్థితులిట్లుండ మదుర చొక్కనాథునిపై తిరుగుబాటుచేసిన లింగమనీనికి విజయరాఘవుడు ఆశ్రయం ఇచ్చినందున చొక్కనాథుడు ఆగ్రహించి దండెత్తివచ్చి విజయరాఘవుని, అతని కొడుకు మన్నారుదాసును వధించి తంజావూరు రాజ్యాన్ని మదురలో కలిపినాడు.

తంజావూరు రాజ్యంపై చొక్కనాథుని సవతితమ్ముడు అళగిరి పాలకుడయినాడు అళగిరి రాజనీతిపరుడుకాదు. విజయరాఘవుని కొలువులోని ఉద్యోగియైన రాయసం వెంకన్న బిజాపూరు సేనాని ఏకోజీ సహాయంతో అళగిరిని తొలగించి మన్నారుదాసు కొడుకు చెంగమలదాసును సింహాసనం ఎక్కించినాడు. చెంగమలదాసు తన దుష్పరిపాలనతో వెంకన్న అభిమానం కూడ కోల్పోయినాడు. అందుచే ఏకోజీ సేనాని చెంగమల దాసును తొలగించి తంజావూరునాక్రమించినాడు. ఏకోజీ శివాజీ సవతితమ్ముడు. తంజావూరులో మహారాష్ట్రపాలన ప్రారంభమయింది.

## విజయనగర యుగ విశేషాలు

విజయనగరం కేవలం ఆంధ్రసామ్రాజ్యంకాదు. రాజధానీనగరం కర్ణాటక ప్రాంతంలో ఉన్నదనడం నిర్వివాదం; పాలించిన రాజవంశాల్లో సంగమ, ఆరవీటి వంశాలు తెలుగువారు. సాళువ, తుళువ వంశస్థులు కన్నడిగులు. సంగముల జాతీయత వివాదగ్రస్తం. ప్రౌఢదేవరాయల్ని శ్రీనాథుడు దక్షిణాధీశుడని, కర్ణాటక్షితిపాలుడని సంబోధించినాడు. తనను శ్రీకాకుళ ఆంధ్రవిష్ణువు 'కన్నడ రాయ' అని పిలిచినట్లు కృష్ణరాయలు చెప్పుకున్నాడు. అయితే, విజయనగర సామ్రాజ్యంలో కన్నడ, తమిళ, మళయాల ప్రాంతాలతోబాటు కృష్ణానదికి దక్షిణంగా సుమారు ఆంధ్ర భూభాగం చేరి వుండేది. రాజ్యం చివరదశలో సయితం ఉదయగిరి, పెనుగొండ, చంద్రగిరి ప్రాంతాల్లో రాయల అధికారం చెల్లింది. అందుచేత పురాతన స్థానిక సంప్రదాయాలను మన్నిస్తూ, సమకాలిక అవసరాల కనుగుణమైన పాలన విధానాన్ని విజయనగరాధీశులు రూపొందించినారు. తురుష్కదండయాత్రల ప్రమాదంనుండి హిందూ మత సంప్రదాయాలను రక్షించడానికి బద్ధకంకణులయి సంస్కృతంతోబాటు దాక్షిణాత్య భాషాసంస్కృతులను పోషించినారు. ముఖ్యంగా తెలుగు సాహిత్య సంగీతాలకు

విజయనగరంలో విశేష ఆదరణ లభించింది. నాడు దక్షిణదేశం అంతటా తెలుగు అధికారభాషగా చలామణీ అయినట్లు కన్పిస్తుంది. అందుచేతనే ఆంధ్ర సంస్కృతీ వికాసచరిత్రలో విజయనగర యుగాన్ని స్వర్ణయుగం అనడంకద్దు.

**పాలనవిధానం**

కేంద్ర ప్రభుత్వం : మాధవాచార్యుల పరాశరమాధవీయం, ఆముక్త మాల్యద, సకలనీతిసమ్మతంవంటి నాటి గ్రంథాల్లో కన్పించే రాజనీతి చర్చలు కేవలం ఆదర్శ పరిస్థితులను సూచిస్తాయేగాని ఆచరణలోవున్న యదార్థ పరిస్థితులను చెప్పవు. ఇక నాటి శాసనాలనుండి, న్యూనిజ్ వంటి విదేశీయుల రచనల నుండి కొన్ని వివరాలు లభిస్తాయి. వీటినిబట్టి విజయనగరంలో సంప్రదాయమైన రాచరికమే అమలు జరిగినట్లు తెలుస్తుంది. అయితే, నాటిపరిస్థితులనుబట్టి రాష్ట్ర సైనికపాలనా వ్యవస్థలను భూస్వామ్యపద్ధతులపై రూపొందించవలసిన అవసరం ఉన్నందున, సనాతనమైన సమయాచారాలను స్థానిక స్వపరిపాలనా సంస్థలను మన్నించవలసినందున నాటిది కేంద్రీకృత నిరంకుశ రాచరికం అని చెప్పలేము. రాచరికం వంశానుగతమైనప్పటికీ రాజ్యభద్రతకు ప్రజాక్షేమానికి విరుద్ధంగా ప్రవర్తించేవారిని, అసమర్థులు, వ్యసనపరులునైన రాజులను తొలగించేవారు. అందుచేతనే సాళువ తుళువ ఆక్రమణలు జరిగినాయి. రాజాధిరాజ, రాజపరమేశ్వర వంటి బిరుదులవల్ల రాయలు రాజులకు రాజు అనేగాక దైవాంశ సంభూతుడనే భావం ఉన్నట్లు స్పష్టమవుతుంది. రాయలు రాజ్యవ్యవహారాల్లో సర్వదా శ్రద్ధ వహించేవాడు. న్యూనిజ్ రచననుబట్టి రాయవాచకంనుండి రాయల దినచర్య క్రమబద్ధంగా ఉండేదని గ్రహిస్తాము. యువరాజు రాయలకు అన్నివిధాలా సహాయంగా వుండేవాడు. ప్రతిరోజు గూఢచారులను, దన్నాయకులను, సంప్రతులను కలిసీ చర్చించేవాడు; తరచుగా కొలువుకూటాల్లో సమావేశాలు జరిగేవి. దేవరాయలసభాభవనం ముత్యాలశాల అని శ్రీనాథుడు వర్ణించినాడు. కృష్ణ రాయల సభకు 'భువనవిజయం' అనీ అచ్యుతరాయల సభకు 'వెంకట విలాస మండప'మనీ పేర్లు. ప్రాజ్ఞులగోష్ఠులుకూడ వీనిలోనే జరిగేవి.

మంత్రిమండలి : రాజ్యం సప్తాంగ సమన్వితం. సప్తాంగాల్లో మంత్రి ప్రాముఖ్యం వివరించవనిలేదు. రాయలకు సలహా ఇవ్వడానికి మంత్రిపరిషత్తు ఉండేది. దానికి సర్వశిరఃప్రధాని అధ్యక్షుడు. ఇతణ్ణి సభానాయక, తంత్రనాయక కార్యకర్త అనికూడ అనేవారు. ఉపప్రధాని, రాయభాండారి, దళాధికారి (దన్నాయక), మహా సామంతాధిపతి మంత్రివర్గంలో ఇతర సభ్యులు. సాధారణంగా మంత్రిమండలి సమావేశాలు రహస్యంగా జరిగేవి. ముఖ్యమైన సమావేశాలకు రాయలే అధ్యక్షత వహించేవాడు మంత్రివర్గసమావేశాలను తరచు జరుపుతుండాలని కృష్ణరాయల సూచన.

**ప్రభుత్వశాఖలు:** ప్రభుత్వకార్యక్రమాలు శాఖలద్వారా జరిగేవి. అట్టవన, కందాచార, భాండార, ధర్మాసన, సుంకవ్యవహారాది శాఖలుండేవి వీనిని ప్రధాని, దన్నాయక, ధర్మాసనాధికారి, భాండాగారాదిమంత్రులు నిర్వహించేవారని చెప్పవచ్చు. ప్రతి శాఖలోను సంప్రతులు, కరణాలు ఉండేవారు. తొమ్మిదిమంది సంప్రతు లున్నట్లు తెలుస్తున్నందున తొమ్మిది శాఖలున్నట్లు భావించవచ్చు. భాండారంలో రత్నభాండార, స్వర్ణభాండార విభాగాలుండేవి. సంప్రతులు సీమల, స్థలాలపొలిమేరలనుగురించి భూభామందులనుగురించి,శిస్తులను గురించిన చిట్టాలు తయారుచేసి వుంచేవారు.

**ఆదాయవ్యయాలు:** ప్రభుత్వ ఆదాయమార్గాల్లో పన్నులు, సామంతులు చెల్లించే కప్పాలు, భాండారవాడల ఆదాయం, అమరనాయకుల మామూళ్ళు దర్శనకానుక. అధికారవర్తని మొదలుగా సాంప్రదాయక వసూళ్ళు ముఖ్యంగా పేర్కొనవచ్చు. పుత్రోదయ, వివాహాది శుభసమయాల్లో ప్రభువులు రాయలకు ధనరూపంలో, ఆభరణ రూపంలో కానుకలు చెల్లిస్తారని పేస్ వ్రాసినాడు.

విజయనగరంలో అనేక రకాల పన్నులు వసూలు చేసినారు. వానిలో భూమిశిస్తు ప్రధానమయింది. విజయనగరాధీశులు వంటపొలాల్ని 'సర్వే' చేయించి నారని, తెలుగు ప్రాంతాల్లో 'సర్వే' తిమ్మరుసుమంత్రి నిర్వహించినాడని తెలుస్తున్నది. భిన్నప్రాంతాల్లో వేరు వేరు కొలమానాలు వాడినారు. తీరాంధ్రంలో కేసరిపాటిగడ (42 '6'), రేనాడులో దొరగడ వాడుకలో ఉండేవి. పాకనాడులోనే రెండుగడలు ప్రచారంలో ఉన్నట్లు శాసనాలవల్ల తెలుస్తున్నది. శాస్త్రరీత్యా పంటలో ఆరోవంతు పన్నుగా వసూలు చేయవలెగాని పంటలోసగం (నంగోరు) లేక మూడోవంతు (ముంగోరు) వరకు వసూలు చేసేవారు. బ్రాహ్మణుల ఈనాములపై ఆరోవంతు, దేవాలయ భూములపై ముప్పదోవంతు వసూలుచేసినారు. కొత్తగా ఏర్పడిన వ్యవసాయ గ్రామాలపై కొంత మినహాయింపు వుండేది. మాగాణి (నీరాంబర), మెట్ట(కాడాంబర) పొలాలపై పన్నులో వ్యత్యాసాలుండేవి. పన్ను ధనరూపంలోగాని ధాన్యరూపంలోగాని చెల్లించవచ్చు కాని, హరిహర రాయలు పన్నులు ధన రూపంలోనే చెల్లించే కట్టడి చేసినాడని పరాశర మాధవీయం చెబుతున్నది. నీరాంబరభూముల్లో ధాన్యరూపంలో చెల్లించినా కాడాంబర భూముల్లో (అరటి, ఆకుతోటలు, కూరగాయతోటలు) ధనరూపంలోనే చెల్లించవలె. సువర్ణాదాయాన్ని సిద్ధాయం అనేవారు. గ్రామాల్లో పంటపొలాలు శిస్తు మొదలైన వివరాలను కరణాలు 'కవిలె'లలో నమోదుచేసి వుంచేవారు.

భూమిశిస్తుతోబాటు వృత్తి, సామాజిక, మత, పారిశ్రామిక, వాణిజ్య సుంకాలు పలురకాలుండేవి. పశువులను మేపుకున్నందుకు పచ్చికబీళ్ళపై పుల్లరి,

కొండలపై కొండగుట్ట చెల్లించవలె. గ్రామోద్యోగులు, పురోహితులు, కంసాలి వడ్రంగి, కమ్మరి, కుమ్మరి, చాకలి, మంగలి, మేళగాండ్రు పశువుల కాపర్లు, జంగము, మాదిగ వృత్తిపన్నులు చెల్లించేవారు. బిచ్చగాండ్రపై 'గణాచారిపన్ను' అనే వృత్తి పన్ను విధించేవారు. కొండోజు అనే మంగలి ప్రార్థనపై అళియ రామ రాయలు కొన్ని ప్రాంతాల్లో మంగలి పన్ను తీసివేసినాడు. వేశ్యలుకూడ వృత్తి పన్ను చెల్లించవలె. రాజధానినగరంలో వేశ్యలు చెల్లించేపన్ను అందలి 12,000 మంది రక్షకభటదళాన్ని పోషించడానికి సరిపోయేదని పేస్ వ్రాసినాడు. సాలె (మగ్గరి, పింజనిద్దాయం), కంసాలి, తెలిక (గానుగరి) కుమ్మరి (చక్రకానిక), గమళ్ళ (ఈడుగ సుంకం) మొదలైన వారిపై పారిశ్రామిక సుంకాలుండేవి. ఉప్పుకొటార్లపై ఉప్పరి సిద్ధాయం వసూలు చేసేవారు. ఇండ్లు (ఇల్లరి), నిధి నిక్షేపాలు, పశువులు, తోటలు, నీటి బుగ్గలపై సంపత్తి పన్ను వుండేది. స్థలా దాయ మార్గాదాయ, మామూలాదాయములు వాణిజ్య సుంకాలు. కొండవీడు వంటి వాణిజ్య కేంద్రాలలో వస్తువులపై సుంకక్రమాణాన్ని వివరిస్తూ శాసనా లుండేవి. ఎండుగడ్డి, కట్టెల వంటి వానిపైగూడ సుంకాలుండేవి. వసంతగరువు, చలివేందిర, సంతలు వాణిజ్య సుంకాల వసూలు కేంద్రాలు. వేలంపాటలో 'సుంకందార్లు' సంతల్లో సుంకం వసూలుచేసే హక్కులు కొనేవారు. నాగలా పురంలో ప్రవేశించే వస్తువులపై 42 వేల 'పరోడా'లు అదాయం వచ్చేదని న్యూనిజ్ వ్రాసినాడు. సభలు, సమావేశాలకు గూడ పన్ను చెల్లించవలె. దేవా లయ పోషణకు, అందలి ఉత్సవ నిర్వహణకు కానుపీసాలు, మహారాజ ప్రయోజ నాలు అనే పన్నులుండేవి. దన్నాయకస్వామ్యం, దుర్గస్వామ్యం, కావలికానిక అనేవి సైనిక పన్నులు. పెండ్లిండ్లలో ఉభయ పక్షాలమీద గుడి కల్యాణం, కల్యాణ కానికె అనే సుంకాలుండేవి. గుడి కల్యాణం ఊరేగింపు పన్ను అని తెలుస్తుంది. వివాహ సుంకాలను ప్రజలు తీవ్రంగా నిరసించినారు. కృష్ణరాయలీ పన్నులను కందనవోలు, చంద్రగిరి మొదలైన ప్రాంతాల్లో తొలగించినట్లు తెలు స్తుంది. కాని, తరువాత మామూలుగా వసూలు చేసినవారు. ఒక శాసనంలోని "కల్యాణ కానుక వసూలు చేసేవాడు తల్లికి మొగుడు" అనే మాటను బట్టి ప్రజలీ పన్నును ఎంతగా గర్హించినారో స్పష్టమవుతుంది.

**'అట్టవణం' ఆదాయవ్యయశాఖ:**బహుశా ఇది ప్రధాని పర్యవేక్షణలో పని చేసేది. మహానవమితో ఆర్థిక సంవత్సరం ప్రారంభమయ్యేదని పేస్ రచననుబట్టి తెలుస్తుంది. పన్నులు వసూలు చేయడంలో పలు పద్ధతులుండేవి. కొన్ని సంద ర్భాలలో సుంకాధికారులను ప్రభుత్వం నియమించేది. కొన్ని చోట్ల సుంకాధి కారాన్ని మధ్యవర్తులు విక్రయించుకొనేవారు. మరికొన్ని చోట్ల స్థానిక సంస్థలు అమర నాయకులు వసూలు చేసేవారు.

దక్షిణ భారతదేశంలో పన్నుల భారంతోను సుంకాధికారుల దౌర్జన్యాలతోను ప్రజలు కుంగిపోతున్నారన్న పేస్, న్యూనిజ్ రచనల్లో సత్యం లేకపోలేదని పైవివరణ రుజువు చేస్తున్నది. పన్నులు చెల్లించడానికై చేసిన అప్పులు చెల్లించలేక రైతులు భూములు అమ్ముకోవడం, భూములు వదలి వలస పోవడం వంటి సంఘటనలు నాటి కైఫియతుల్లో విస్తారంగా కన్పిస్తాయి. ఈ సమాచారాన్ని శాసనాలు బలపరుస్తున్నాయి. మాచువల్లి కైఫియతు ననుసరించి పన్ను చెల్లించని రైతుల స్త్రీల స్తనాలకు సంబెట గురవరాజనే ఉద్యోగి చిరతలు పట్టించి బాధించినట్లు తెలుస్తుంది. కృష్ణరాయల కాలంలో కొండవీడులో బాచమరసు దౌష్ట్యంతో వ్యవహరించినాడట. సుంకాదికార్లు పన్నులతోబాటు సొంతానికి కట్నాలు వసూలు చేసేవారు. పన్నులు చెల్లించలేక తంజావూరును విడిచి వెళ్ళడానికి పంచాణం వారు నిశ్చయించగా వారిపై కానిక, తలారి కానిక మొదలైన పన్నులను చిన్నప్ప నాయకుడు మినహాయించినాడట. తమిళ మండలంలో పన్నుల భారానికి వ్యతిరేకంగా వలంగై, ఇండగై తెగలు సహాయ నిరాకరణోద్యమం సాగించడమేగాక ప్రభుత్వానికి తాము ఎంత చెల్లించేది తామే నిర్ణయించుకొన్నట్లు శాసన సాక్ష్యం లభిస్తున్నది. పన్నులు వసూలు చేయడంలో ఉద్యోగులు క్రూరంగా ప్రవర్తించేవారనడానికి కృష్ణరాయల ఆముక్తమాల్యద నుండి పైన వుదహరించిన పద్యం చక్కని నిదర్శనం.

విజయనగర రాజ్యం మొత్తం ఆదాయం ఎంతో నిర్ధారణగా చెప్పలేము. స్థానిక చరిత్రల సమాచారం ఆధారంగా లూయిరైస్ 81 కోట్ల రూపాయలని అంచనా వేసినాడుగాని, ఇది అతిశయోక్తిగా కన్పిస్తుంది. "కర్ణాటక రాజకాల సవిస్తర చరిత్ర'' అనే ప్రాచీన గ్రంథం ప్రకారం తూర్పు కన్నడ ప్రాంతాల నుండి కృష్ణరాయల ఆదాయం మూడుకోట్ల రూపాయలు. వార్తమా అనే పాశ్చాత్య బాటసారి రాయలను భారతదేశంలోని రాజులందరిలో ఐశ్వర్యవంతుదని, అతని ఆదాయం రోజుకు 12,000 అని వ్రాసినాడు. బర్హన్ ఇమానిర్‌ను బట్టి సదాశివరాయలి ఆదాయం 12 కోట్ల హొన్నులు. ఈ విధంగా ఆదాయ ప్రమాణం నిర్దుష్టంగా తెలియనట్లుగానే రాయల ఖర్చుల పద్దులేమో స్పష్టంగా తెలియవు. విజయనగరంలో ఉద్యోగులకు ఈనాములిచ్చే ఆచారం ఉంది. ప్రభుత్వం నిర్వహించే క్రమబద్ధమైన న్యాయస్థానాలు లేవు. గ్రామాల్లో రక్షక భటులకు ఇతర ఉద్యోగులకు గ్రామస్థులే వరుమానాలు చెల్లించేవారు. విద్య, వైద్య సదుపాయాలకు ప్రయోగకర సంస్థలు స్థాపించి ప్రభుత్వం నిర్వహించ లేదు. అయితే, ఆదాయం అంతిపుర ఖర్చులకు, సైన్యపోషణకు, దేవాలయాది భవన నిర్మాణానికి, తటాకాది నీటిపారుదల సౌకర్యములకు, కళాసాహిత్య పోషణకు, దానధర్మాలకు వినియోగమయ్యేది. రాయలు తన ఆదాయం 65 లక్ష

లలో 25 లక్షలు మాత్రం సొంతానికి వినియోగించి మిగిలిన మొత్తంతో గుర్రాలు, ఏనుగులు కొనేవాడని న్యూనిజ్ వ్రాసినాడు కాబట్టి ఆదాయంలో అధిక భాగం సైన్య పోషణకు ఖర్చయ్యేది. నాటి పరిస్థితుల్లో అది తప్పనిసరి అని చెప్పనక్కర లేదు. ఇక రాయల అంతిపురం అత్యంత వైభవోపేతంగా ఉండేదని బాటసారులు వర్ణించినారు. ఆదాయంలో ఐదో వంతు దేవాలయ నిర్మాణ నిర్వహణలకు వినియోగించినారు. ఖర్చుపోను ప్రతి సంవత్సరం కోటిపణాలు భండారంలో రాయలు నిల్వ చేసేవాడని పేస్ వ్రాతలనుబట్టి తెలుస్తుంది.

విజయనగరంలో బంగారు, వెండి, రాగి నాణేలు అమలులో ఉండేవి. గద్యాణం బంగారునాణెం. దాన్నే 'వరాహ' అనేవారు. ఇది చాళుక్యుల కాలం నుండి వస్తున్న నాణెం. బహుశా వరాహ పదమే 'వరహా' అయివుంటుంది. కృష్ణరాయల గద్యాణం 119.7 వడ్ల గింజల ఎత్తు ఉండేది. ఘట్టి వరాహ, దొడ్డ వరాహ అనే ప్రత్యేక గద్యాణాలు కూడ ఇచ్చేవారు. గద్యాణంలో సగం 'ప్రతాప' తరువాతవి 'పణం', 'చిన్నం' ఇవి అన్నీ బంగారు నాణాలే. ఎక్కువ వాడుకలోవున్న నాణెం పణం. 'తార్' అనేది వెండి నాణెం. ఇది పణంలో ఆరో వంతు. జీటలు, కాసు అనేవి రాగి నాణాలు. వీని విలువ స్పష్టంగా తెలియదు. ఇవిగాక రాజ్యం పశ్చిమ ప్రాంతాల్లో పోర్చుగీస్, ఈజిప్షియన్ నాణెలు వాడుకలో ఉన్నట్లు తెలుస్తుంది. దీనారం ఈజిప్షియన్ నాణెం. ప్రౌఢరాయలు 'దీనార టంకాల'తో శ్రీనాధుని శిరమాడించినాడు. కేంద్రప్రభుత్వమేగాక రాష్ట్రపాలకులు నగరాధిపతులు (వర్తక శ్రేష్ఠులు) గూడ నాణేలు ముద్రించేవారు "ప్రతి సంస్థానానికి టంకశాల గుత్త చేసుకొని వారి వారి పేరటను ముద్రలు కల్పించుచూ వచ్చిరి" అని అట్టవనతంత్రం చెబుతున్నది. నాణేల నాణెతను కంసాలులు ఒరపురాతినుపయోగించి నిర్ణయించేవారు.

**న్యాయనిర్వహణ :** న్యాయనిర్వహణకు విజయనగరంలో క్రమబద్ధమైన న్యాయస్థానాలు లేవనే చెప్పవలె. సభ్యులనుబట్టి నాల్గురకాల న్యాయస్థానాలను పరాశర మాధవీయం పేర్కొన్నదికాని అవి ఎంతవరకు ఆచరణలో ఉన్నదీ చెప్పలేము. నిరంకుశ రాజరికాలన్నింటిలో వలెనే విజయనగరంలో కూడ రాయలే ఉన్నత న్యాయాధికారి. అతడే నేరాలను విచారించి నిందితులను శిక్షించేవాడు. "అయోగ్యులకు న్యాయ నిర్వహణాధికారం ఇవ్వరా"దని కృష్ణరాయల సూచన. కాని విజయనగరంలో రాయలకు బదులు ప్రధాని న్యాయనిర్వహణ జరిపేవాడని రజాక్ రచన సూచిస్తున్నది. తిమ్మరుసు మంత్రికి ఉన్న "ధర్మ ప్రతిపాలక" బిరుదం రజాక్ సాక్ష్యాన్ని బలపరుస్తున్నది. ప్రాడ్వివాకులు, సభ్యులు రాయలకు న్యాయనిర్వహణలో సహాయపడేవారు. రాయలు పర్యటనలో ఉన్నప్పుడు సయితం స్థానికులు ఆతడ్ని దర్శించి తమ వ్యవహారాలు నివేదించు

కొనే అవకాశం ఉండేది. రాష్ట్రాలలో రాష్ట్ర పాలకులు, అమర నాయకులు న్యాయ నిర్వహణ జరిపేవారు. వారి తీర్పు సంతృప్తికరంగా లేనిచో రాయలకు నివేదించుకొనే అవకాశం ఉంది ఆస్తి తగాదాలకు తాత్కాలిక న్యాయస్థానాలను ఏర్పాటు చేసేవారు వీటిని ధర్మాసనాలు అనేవారు. ఇవి సాధారణంగా ఆలయ మండపంలో సమావేశ మవుతుండేవి. నిందితులను హింసించి తద్వారా నేరం ఒప్పించే ఆచారం ఉంది "అడుమకట్టున వేడి ఎండలో మిగులజడియ వీపుల మీద కోపరాలెత్తి" పొగడ దండలువైచి హింసించేవారు. నేరనిరూపణకు దివ్య పరీక్షలుండినట్లు నికోలో కాంటే పేర్కొన్నాడు. శిక్షలు కఠినంగా ఉండేవి. దేశ ద్రోహ, రాజ ద్రోహనేరాలకు మరణమే శిక్ష. కృష్ణరాయల కాలంలో బహుశా నాగలాపుర తటాక నిర్మాణానికి నరబలి అవసరమైనందున మరణశిక్ష విధింప బడిన బందీలను బలి ఇచ్చినట్లు న్యూనిజ్ వ్రాసినాడు. బ్రాహ్మణులకు మరణ శిక్ష విధింపరాదు కాబట్టి కండ్లు పొడిచి యావజ్జీవ కారాగార శిక్ష విధించేవారు.

**రక్షకభటవిధానం:** నేర నిరోధమునకు శాంతిభద్రతల రక్షణకు ప్రభుత్వమూ ప్రజలూకూడ శ్రద్ధ వహించే వారేకాని ప్రభుత్వంలో ప్రత్యేక రక్షకభట శాఖ ఉన్నట్లు తెలియదు. గ్రామంలోని పన్నిద్దరు ఆయగాండ్రలో తలారి ఒకడు. దొంగలనుపట్టి వారు తస్కరించిన సొమ్ము రాబట్టడం, అల్లర్లు జరగ కుండా చూడడం ఈతని విధులు ఈతనికి నెల జీతం లేదు. పంటపొలంలో ఈనాము ఇచ్చేవారు. రైతులు, వర్తకులు, పంచాణం వారినుండి తలారి మామూలు వసూలు చేసుకొనేవాడు. పది పన్నెండు గ్రామాలకు - అందే స్థలానికి 'కావలిగారు' ఉండేవాడు గ్రామ తలారిని స్థల కావలిగారే నియమించినట్లు తెలుస్తుంది. వీరిపై అధికారి దేశ కావలిగారు. శాసనాల్లో అక్కడక్కడ 'నాడు కావలిగారు' అనే మాట కన్పిస్తుంది. వీరిని బహుశా రాయలే నియమించేవాడు. సాధారణంగా చెంచు, కోయ, బోయ మొదలుగా (నేరస్థుల) జాతుల్లోని వారినే కావలిగార్లుగా నియమించేవారు.ఇది 'దొంగకు తాళంచెవులివ్వడం' వంటి విధానం దొంగలముఠాల స్థావరాలతోను వారివిధానాలతోను వీరికి పరిచయం ఉన్నందున నేరాలను సామర్థ్యంతో ఆపగలరని వీరిని నియమించినట్లు తెలుస్తుంది.వీరికికూడా మాన్యాలు ఇచ్చేవారు కొన్నిచోట్ల భూస్వాములు, ధనికులు ప్రత్యేకంగా కావలి గార్లను నియమించి పోషించడం కూడ కద్దు. ఇక పర్వతారణ్య ప్రాంతాల్లోను సరిహద్దుల్లోను రక్షణకు పాళెగార్లుండేవారు. ప్రతి పాళెగానికి రెండు గ్రామాలు 'జాగీరు' ఇచ్చి కోటలు కట్టుకొనే హక్కు ఇవ్వడం జరిగింది. క్రమంగా పాళెగార్లు బలవంతులై విజయనగరం చివరి రోజుల్లో ఇతర భూస్వాముల వలెనే పరస్పర యుద్ధాల్లో మునిగి, రాజ్య శ్రేయస్సుకు ప్రమాదంగా పరిణమించినారు.

రాజధానీ నగరంలోను ఇతర ప్రధాన నగరాల్లోను ప్రత్యేకమైన ఏర్పాటు లుండేవి. విజయనగరంలో పన్నెండువేలమంది రక్షకభటులుండేవారనీ ఒక్కొక్కనికి ముప్పది పణాల జీతమనీ వారిపైఅధికారి కార్యాలయం టంకశాలకు ఎదురుగా వుండేదని అబ్దుల్ రజాక్ వ్రాసినాడు. తలారులు రాత్రులందు దివిటీలు ధరించి కావలా కాస్తుండేవారు. "ప్రొద్దుపోయినదని తలారులకు వెరచి, యొక విధంబున నారాత్రి యుండదలచె" అన్న నిరంకుశోపాఖ్యాన వాక్యాన్ని బట్టి కేవలం దొంగతనాలేగాక ఇతర సాంఘిక నేరాలనుకూడ తలారు లరికట్టేవారని తెలుస్తున్నది. రాష్ట్రాల్లో రాష్ట్ర ప్రభువులు, అమర నాయకులు శాంతిభద్రతల రక్షణకు కృషి చేసేవారు. ఇన్ని జాగ్రత్తలు తీసుకున్నప్పటికీ రాజ్యంలో దొంగతనాలు, దోపిడీలు, దార్లుకొట్టడం చాలా తరచుగా జరుగుతుండేవని కైఫియత్తుల వల్ల, నాటి సారస్వతంనుండి తెలుస్తుంది

సైన్యం : బహమనీలతో నిరంతర పోరాటాలు జరుగుతున్నందున విజయ నగరాధీశులు సైన్యపోషణలో అప్రమత్తత వహించినారు. రాజ్య ఆదాయంలో అధికభాగం సైన్యానికి ఖర్చయ్యేది. స్థానిక పాలనవిధానంకూడ సైనిక అవసరాల కనుగుణంగా రూపొందించినారు. రెండో దేవరాయలు, వీర నరసింహరాయలు, కృష్ణరాయలు అనేక సంస్కరణలొనర్చి క్రమశిక్షణలో, నేర్పరితనంలో, తంత్రంలో, విజయనగర సైన్యం బహమనీ సైన్యానికి కనీసం తీసిపోనివిధంగా తీర్చిదిద్దినారు.

నికోలో కాంటె లెక్కనుబట్టి రాయల సైన్యంలో 90 వేలమంది, రజాక్ లెక్క ప్రకారం లక్షమంది సైనికులుండేవారు. కృష్ణరాయలు 70,000 కాలి బంట్లు, 32,000 అశ్వదళం, 550 ఏనుగులు ఉన్న సైన్యంతో రాయచూరుపై దండెత్తినట్లు న్యూనిజ్ వ్రాసినాడు. కాని, రాయవాచకం ప్రకారం రాయల సైన్యంలో 1200 ఏనుగులు, 60,000 గుర్రాలు, 5,00,000 కాలిబంట్లు ఉన్నట్లు తెలుస్తుంది.

విజయనగర సైన్యంలో ప్రధానంగా రెండు విభాగాలు ఉండేవి. ఒకటి సిద్ధసైన్యం- రాయలు స్వయంగా జీతంయిచ్చి పోషించే కైజీతసైన్యం. ఇందులో కొంత మూలబలం. సిద్ధసైన్య ప్రమాణం స్పష్టంగా తెలియదు. న్యూనిజ్ వ్రాసిన దాన్నిబట్టి కృష్ణరాయల కైజీతసైనికులు 50 వేలమంది అని అందులో రెండు వేల అశ్వికులు అంతిపురరక్షణకు, రెండువందలమంది అశ్వికులు రాజు అంగ రక్షకులుగా ఉన్నట్లు తెలుస్తుంది. సిద్ధసైన్యంపై అజమాయిషీకి కందాచార శాఖ ఉండేది. ఈ శాఖ అధిపతి సేనాపతి లేక దళవాయి; మంత్రిమండలిలో సభ్యుడు. అంతిపుర రక్షకదళంమీద, బహుళా గజబలంమీద ప్రత్యేక సేనాపతులుండేవారు. ముస్లిం సైనికులకు రాయలు ఈనాము లిచ్చినాడని ఫెరిస్టా వ్రాసినాడు. కాని,

జాగీర్లుగాక నాల్గు నెలలకొకమారు సైనికులకు రాయలు జీతాలిచ్చినట్లు రజాక్ చెప్పినాడు కందాచారశాఖకింద సైనికుల అవసరాలు తీర్చడానికి నల్గురు పారుపత్యగార్లు, ఆర్గురు కరణాలు, ఆర్గురు ముదుపుగొల్లలు - సుమారు మూడువేల మంది వరకు పనిచేస్తూండేవారు. వీరిలో 300 మంది మాలీసు చేసేవారు. కమ్మరి, కాసె, వడ్రంగి పనులవారు రెండువేలమంది; మిగిలినవారు చాకళ్ళు, మంగళ్ళు మొదలైనవారు. మహానవమినాడు రాయలు క్రైజీతంసైన్యాన్ని సమీక్ష జరిపేవారు.

రెండోవిభాగం అమరనాయక సైన్యం. అమరనాయక పద్ధతికి కాకతీయుల నాటి నాయంకర విధానం పునాది. ఇది భూస్వామ్యవిధానం అని చెప్పవచ్చు. రాజ్యాన్ని అమరములుగా విభజించి, కోరినప్పుడు సైన్యం సరఫరాచేసే నిబంధన మీద విశ్వాసపాత్రులైన నాయకులకు పంచియివ్వడం జరిగింది. "సైనిక సహాయానికి ఇచ్చే భూమిని గాని ఆ భూమిపై ఆదాయంగానీ అమరము" అని ఒక అర్థం. అమరం పారశీకభాషాపదం అనీ ఆజ్ఞ అని దాని అర్థమనీ మరొక వాదం. అమరం ప్రమాణాన్ని బట్టి అమరనాయకుని హోదా, అతడు పోషించవలసిన సైన్య ప్రమాణము ఉండేది. సైనిక సహకారంమీదనే అమరనాయకులు తమ భూములను కింది నాయకులకు పంచియిచ్చేవారు. అచ్యుతరాయలకాలంలో ఆరు లక్షల అమర నాయక సైన్యం ఉండేదని న్యూనిజ్ అంచనా. రాయవాచకం ప్రకారం రెండు లక్షల కాల్బలం 24 వేల అశ్వదళం, 1200 ఏన్గులు అమర నాయకులు పోషించేవారు. అమర నాయకులేగాక సామంత రాజులు, రాష్ట్ర ప్రభువులు అవసరమైనప్పుడు రాయలకు సైనిక సహాయం చేసేవారు.

విజయనగర సైన్యంలో పదాతి అశ్వ, గజదళ విభాగాలు ముఖ్యమైనవి. విల్లంబులు, కత్తి, ఈటె ప్రధాన ఆయుధాలు. కాల్బంట్లకు కవచశిరస్త్రాణాలు లేవనీ శరీరంనిండా నూనె పులుముకొనేవారనీ ఫెరిస్తా వ్రాసినాడుగాని చర్మంతో చేసిన కవచ శిరస్త్రాణాలు దాలు ధరించేవారని పేస్, బర్రోస్‌లవంటి పోర్చుగీస్ బాటసారులు వర్ణించినారు. పదాతిదళంలో తుపాకివిభాగం కూడ ఉంది. "రటిత దిక్తటనటత్పెట పెటార్పటులతో ఘోరమైన తుపాకిగుండ్లు" అంటూ కుమార ధూర్జటి రచన. అయితే, విజయనగరాధీశులు తుపాకిదళంపై ఎక్కువ శ్రద్ధ వహించినట్లులేదు. గుర్రాలు, ఏనుగులను అలంకరించేవారు. పశ్చిమతీరంలో విజయనగరాధీశులకు నౌకాదళం ఉండేది. కృష్ణరాయల కాలంలో హొనావర్ రాష్ట్రాధిపతి తిమ్మోజీ నౌకాదళాధిపతి అయినట్లు తెలుస్తుంది. గోవా నాక్రమించడంలో పోర్చుగీసువారికి రాయల నౌకాబలం సహాయం చేసిందని ఫాదర్ హిరాస్ వ్రాసినాడు

మధ్యయుగ యుద్ధాల్లో దుర్గాలు ప్రముఖ పాత్ర నిర్వహించినాయి. అష్టవిధ దుర్గాలని సంప్రదాయంగాని రాయవాచకం మాత్రం గిరి, స్థల, జల, వన

అనే చతుర్విధ దుర్గాలనే పేర్కొంటున్నది గడిదేశంలో - సరిహద్దుల్లో - దుర్గా లెక్కువగా నిర్మించాలని కృష్ణరాయల సూచన. విజయనగరం సరిహద్దుల్లో పెక్కు దుర్గాలున్నాయని వానిచుట్టూ దుర్గమాటవులు పెంచుతారని పేస్ వ్రాసినాడు. దుర్గ రక్షణకు పాషాణయంత్రాలు, దంబోళి ఉండేవి. శత్రువులపై రాలురువ్వే ఫిరంగియే దంబోళి. దుర్గ ఆక్రమణకు లగ్గలు వేసే పద్ధతిఉంది. కృష్ణరాయలు కొండవీటిని లగ్గలంబట్టుకొన్నాడు.

సైనికుల నెన్నిక చేయడంలో రాయలు స్వయంగా శ్రద్ధ వహించేవాడు. ధైర్య సాహసాలకు పేరొందిన తుళు, కబ్బలి, మొరసజాతులవారు రాయల సైన్యంలో అధిక సంఖ్యాకులు ఆటవికులైన చెంచు, కోయ, బోయలకుగూడ ప్రత్యేక అవకాశాలుండేవి. ప్రజల్లో ధైర్యశౌర్యాలు, యుద్ధోత్సాహం, దేహ దార్ఢ్యం పెంపొందించడానికి అవకాశాలు కల్పించినారు ద్వంద్వయుద్ధానికి ప్రోత్సాహం ఉండేది. దేశం నలుమూలలా సాముగరిడీలుండి హోంతకారులు శిక్షణ ఇచ్చేవారని నాటిగ్రంథాలనుండి తెలుస్తున్నది. విజయనగరం భిన్నభాషా ప్రాంతాల రాజ్యం కాబట్టి వారి సైన్యంతో భిన్నత్వం కన్పిస్తుంది. రాజ్యస్థాపన కాలంనుండి ఇంచుమించు రాయలసైన్యంలో ముస్లిములు చేరినారు. దేవరాయల కాలంనుండి వారి సంఖ్య పెరిగి అళియరామరాయల కాలంలో విపరీతమయింది. రామరాయలు రాకాసిగండి యుద్ధంలో పరాజయంచెందటానికి ముస్లింసేనాపతుల ద్రోహం ఒక కారణం.

**స్థానిక పాలన :** విజయనగరంలో స్థానిక పాలన విధానం నాటి సైనిక అవసరాలకనుగుణంగా రూపొందించినారు. బలిష్ఠములైన దుర్గాలు కేంద్రంగా రాష్ట్రాలు ఏర్పడినాయి. ఆంధ్ర, తమిళ, కన్నడ ప్రాంతాలలో స్థానిక పాలన విధానంలో వ్యత్యాసాలున్నాయి. తమిళమండలంలో చోళయుగంనాటి నాడు, కొట్టం మొదలైన విభాగాల్లో మార్పు లేదు. ఆంధ్రప్రాంతంలో రాష్ట్రాలను రాజ్యాలు అని వ్యవహరించినారు. పెనుగొండ, గుత్తి, కందనవోలు, శ్రీశైలము ఉదయగిరి, చంద్రగిరి, కొండవీడు రాజ్యాలకు కేంద్రాలు. వీటిలో గండికోటను కూడా చేర్చవచ్చు. పర్వత నాయకుడు గండికోట రాజధానిగా సిరివాళ్ళ, సిద్ధవట, సకిలి, పొత్తపినాడు రాజ్యాలను పాలించినాడని స్థానిక చరిత్రలు చెబుతున్నాయి. అచ్యుతరాయల కాలంలో సామ్రాజ్యంలో మొత్తం 17 రాజ్యాలున్నట్లు శాసనాలవల్ల తెలుస్తుంది.

దుర్గదన్నాయకుడు రాజ్యంపై అధికారి. సాధారణంగా వీరు రాజకుమారులు, రాజబంధువులు లేదా మాధవమంత్రి, లక్కన, తిమ్మరుసుల వంటి విశ్వాసపాత్రులైన మంత్రులు. దన్నాయకులుగా బ్రాహ్మణులను నియమించడంలోని రాజనీతిని కృష్ణరాయలు వివరించినాడు. సరిహద్దురాజ్యాల దన్నాయకులు

మినహా ఇతరులు రాజధానిలోనే వుంటూ తమరాష్ట్ర వ్యవహారాలను కార్యకర్తల ద్వారా నిర్వహించినారు. రాష్ట్రాల్లోకూడ ప్రధాని, కార్యకర్త, దళవాయి, సామంతాధికారి మొదలైన వారితో సలహా సంఘం వుండేది. దన్నాయకులకు నాణేలు ముద్రించడం, పన్నులు మినహాయించడం, కొత్త పన్నులు విధించడం వంటి అధికారాలుండేవి. 'దుర్గదన్నాయక నివర్తన' అనే పన్నులు వీరు వసూలు చేసినట్లు తెలుస్తుంది. దన్నాయకుడు తన రాబడిలో కొంత రాయలకు చెల్లిస్తూ తనకు నిర్దేశితమైన సైన్యాన్ని పోషించవలె. ఉదయగిరి దన్నాయకుని ఆదాయం 8 లక్షలు. అందులో 3 లక్షలు రాయలకు చెల్లించేవాడు; 25 వేల కాల్బలాన్ని, 1500 అశ్వదళాన్ని, 40 ఏనుగులను పోషించేవాడని న్యూనిజ్ వ్రాసినాడు. దన్నాయకులను ఒక దుర్గంనుండి మరొక దుర్గానికి తరచు మారుస్తుండేవారు.

శాసనాల్లో చావడి, కరణాలు అనే మాటలు తరచు కన్పిస్తాయి. చావడి దన్నాయకుని కార్యస్థానమని. కరణాలు అందలి గుమాస్తాలని భావించవచ్చు. దీన్నిబట్టి రాష్ట్ర వ్యవహారాలు నిర్వహించడానికి ఒక ఉద్యోగిబృందం ఉండేదని తెలుస్తుంది.

అమరనాయక వ్యవస్థ స్థానిక పాలనవిధానంలో అంతర్భాగంగా ఉండేది. ఈ వ్యవస్థననుసరించి రాజ్యంలోని భూమిసమస్తానికి రాయలు యజమాని. ఆ భూమిని అమరాలుగా విభజించి సైన్యసహాయం చేసే షరతుమీద నాయకులకు రాయలు పంచేవారు. ఇవి పొందినవారే అమరనాయకులు. పోర్చుగీస్‌వారి రచనలను బట్టి రెండువందల మంది అమర నాయకులున్నట్లు తెలుస్తుంది. అమర నాయకులు తమ భూములను తమక్రింది నాయకులకు పంచేవారు. కొన్ని వ్యత్యాసాలున్నప్పటికి భూస్వామ్య, అమరనాయక విధానాలకు పోలికలున్నాయి. భూమిలో హక్కులు, సైనిక సహాయం అనేవి రెంటికీ సమాన లక్షణాలు.

అమరగ్రామాలమీద దన్నాయకులకు అధికారం లేదు. దన్నాయకుడు రాయల ప్రతినిధి; అమరనాయకుడు రాయల సైనిక సామంతుడు. అమరం ప్రమాణాన్నిబట్టి అమరనాయకుని హోదా ఉండేది. అమరనాయకుడు ప్రతి సంవత్సరం రాయలకు 'కప్పం' చెల్లించవలె. అంతేగాక, కొన్ని సందర్భాల్లో ముఖ్యంగా సంవత్సరాది రోజున రాయలకు మామూళ్ళు, కానుకలు సమర్పించవలె. మామూళ్ళలో భోజనపదార్థాలుకూడ ఉండేవి. తనకు నిర్ణీతమైన సైన్యాన్ని పోషించి రాయలకు సహాయం చేయవలె. తన అమరంలో శాంతి భద్రతల రక్షణకు అతడే బాధ్యుడు. అడవులు ఛేదించి వ్యవసాయాభివృద్ధికి పాటుపడవలె. అమర నాయకులుకూడ రాజధానిలోనే వుండేవారు. దన్నాయకులకంటె వీరి స్వాతంత్ర్యం ఎక్కువని చెప్పవచ్చు. వీరిని ఒక అమరం నుండి మరొక

దానికి మార్చరు. అయితే, విధినిర్వహణలో ప్రమత్తులైన వారిని రాయలు శిక్షించవచ్చు లేదా తొలగించవచ్చు. రాకాసిగండియుద్ధం వరకూ అమర నాయకుల్లో వారసత్వహక్కు ఏర్పడ లేదు.

రాజ్యంలో ముఖ్యవిభాగం సీమ; పారుపత్యగారు సీమపై అధికారి. రాయసం వారు, అవసరికులు, రాచకరణాలు అనే మాటలు కన్పిస్తున్నాయిగాని వీరు సీమల్లో ఉద్యోగులని స్పష్టంగా చెప్పలేము. పారుపత్యగారు సీమ ఆదాయ వ్యయాలపై శ్రద్ధ వహించేవాడు. రైతులకు పట్టాలివ్వడం, పన్నులు మినహాయించడం, కొత్తపన్నులు విధించడం, సంతలు ఏర్పాటు చేయడం ఈతని అధికారాలు. సీమను స్థలాలుగా విభజించినారు. ప్రతి స్థలంలో చావడి ఉండేది. రెడ్డి లేకగౌడ, స్థలకరణాలు ఇందలి ఉద్యోగులు. వీరికి గ్రామపాలనతో సన్నిహిత సంబంధం ఉండేది రెండుమూడు గ్రామాల ఉద్యోగులతో కలిసి వీరు ధర్మాసనంగా ఏర్పడి నేరస్థులను విచారించి శిక్షించేవారు.

గ్రామాల్లో భాండారవాడలు, అమరగ్రామాలు, మాన్యగ్రామాలు అని మూడు రకాలుండేవి అమర నాయకుల అధీనంలో ఉండేవి అమర గ్రామాలు. మాన్య గ్రామాల్లో దేవ, బ్రాహ్మణ అగ్రహారాలూ, ఉబ్బలిగ్రామాలూ ఉండేవి. ప్రభుత్వానికి చేసిన సేవకు ప్రతిఫలంగా బహూకరించిన గ్రామాలు ఉబ్బలి గ్రామాలు. మాన్య గ్రామాలు నామమాత్రమైన 'జోడి' అనే పన్ను చెల్లించేవి. బ్రాహ్మణాగ్రహారాల్లో విద్వాన్ మహాజనసభలు గ్రామపాలనని నిర్వహించేవి. భాండార వాడలు రాజక్షేత్రంలోనివి.

సాధారణ గ్రామ వ్యవహారాలను పన్నిద్దరు ఆయగాండ్రు నిర్వహించేవారు. వాస్తవానికి వీరు గ్రామసేవకులు వీరు కరణము, రెడ్డి, తలారి, పురోహితుడు, కంసాలి, కమ్మరి, వ్రడంగి, కాసె, కుమ్మరి, చాకలి, మంగలి, మాదిగ. కొన్ని గ్రామాల్లో నీర్గంటి వన్నిద్దరిలో వుండేవాడు. కరణము, రెడ్డి తలారికిమాత్రము ప్రభుత్వంతో-ముఖ్యంగా స్థలోద్యోగులతో సంబంధం ఉండేది. ఆయగాండ్రకు జీతాలు లేవు; భూములు అనుభవించేవారు. రైతులు పంటలో 'మేర' అను పేర మామూళ్ళు చెల్లించేవారు.

**ఆర్థికపరిస్థితులు :**

విజయనగర రాజ్య ఆర్థిక సౌష్ఠవాన్ని రజాక్, పేస్, న్యూనిజ్‌వంటి విదేశయాత్రికులు వర్ణించినారు. సుభిక్షమై సరిసంపదలతో తులతూగుతున్నందునే విజయనగరం తరచు బహమనీల దాడులకు దోపిడీలకు గురి అయింది. ప్రతి సంవత్సరం రాయలు లక్షమాడలు భండారంలో భద్రపరుస్తూన్నట్లు పోర్చుగీసు బాటసారుల వృత్తాంతం. దేశ ఆర్థిక వనరులను పెంపొందించడంలో రాయలు శ్రద్ధ వహించేవాడు. ఆముక్తమాల్యదలో కృష్ణరాయలు-

దేశసౌభాగ్య మర్థసిద్ధికినిమూల మిలయొకింతైన కుంటకాల్వలు రచించి
నయము పేదకు అరికోరునను నొసంగి ప్రజలజేసిన అర్థధర్మములు
పెరుగు

నంటాడు.

ప్రజల్లో అధిక సంఖ్యాకులకు వ్యవసాయమే ముఖ్య వృత్తియని చెప్ప పనిలేదు భూమి సారవంతమైనదని వ్యవసాయం సమృద్ధిగా సాగుతున్నదని పేస్ న్యూనిజ్‌లు మెచ్చుకున్నారు. రాజులు వారి యుద్యోగులు తటాకాలు, కాల్వలు తవ్వించి నీటి సౌకర్యాలు కల్పించినారు. బుక్కరాయలకాలంలో పెను గొండదగ్గిర శిరువేరు తటాకం నిర్మించినారు. సాళువ నరసింహుని కాలంలో అనంతపురం దగ్గిర నరసాంబుధి అనే తటాకం ఏర్పడింది, కృష్ణదేవరాయలు పోర్చుగీసు ఇంజనీర్లసాయంతో నాగలాపుర తటాకం నిర్మించడమేగాక వంట కాలువలు తవ్వించినాడు. కొండవీటిరాజ్యంలో కొండమరసు తిమ్మసముద్రం, కొండసముద్రాలను నిర్మించినాడు ఉదయగిరి రాజ్యంలో అనంత సాగరం, కందనవోలులో సిద్ధవట తటాకం వ్యవసాయాని కుపయోగించేవి. తటాకాల మరమ్మతులు మొదలైన పనులకు పన్నులు వసూలు చేసేవారు; ఆలయాలు, గ్రామసభలు శ్రద్ధ వహించేవి. రాజులు సయితం కొత్త వ్యవసాయక గ్రామాలు నిర్మించి మిరాశీలిచ్చి కొన్ని సంవత్సరాల పాటు పన్నులు వసూలు చేయక వ్యవసాయాభివృద్ధికి తగిన ప్రోత్సాహం ఇస్తుండేవారు. దేశం అంతటా జామ, మామిడి, నిమ్మ, అరటి, కొబ్బరి అకుశోటలు విస్తారమనీ పండ్లు చవకగా లభి స్తాయనీ పేస్ వర్ణించినాడు. వరి, జొన్నలు, రాగులు, మినుములు, పెసలు, శనగలు, చెరకు. నువ్వులు, ఆముదాలు పుష్కలంగా పండేవి. వరిధాన్యంలో తీగమల్లెలు, ఖర్జూరాలు, సంపెంగలు, రాజనాలు, కుసుమలు మొదలుగా పలు రకాలున్నట్లు తెలుస్తుంది. అయినా, వరి అన్నం విలాస వస్తువుగానే ఉండేది.

సాధారణంగా ప్రతి గ్రామంలోను వ్యవసాయసంబంధములైన పరిశ్రమలు-బెల్లం, నూనెల తయారీల వంటివి - సాగుతుండేవి. నీలిమందు చాలచోట్ల తయా రయ్యేది. అనాదిగా ఆంధ్రదేశం వస్త్రపరిశ్రమకు పేరుపొందింది. విరామ సమయాల్లో రైతు స్త్రీలు రాట్నాలపై నూలు వడకేవారు. బట్టల నేతకూడ ప్రతి గ్రామంలోను సాగిందని చెప్పవచ్చు. 'పింజసిద్ధాయం' అనే పన్నునుబట్టి ప్రత్తి శుభ్రం చేయడం కొందరి వృత్తి అయింది. సాలె, పద్మసాలె, జాండ్ర, కురుబ, మాలకులాలు నేతవృత్తి నవలంబించినారు కురుబలు, గొల్లలు, బహుశా కంబళ్లు నేస్తుండేవారు. తాడిపత్రి, ఆదోని, గుత్తి, వినుకొండ నూలుపరిశ్రమకు కేంద్రాలు. ఒక అలవకొండ గ్రామంలో 411 మగ్గాలుండినట్లు తెలుస్తుంది. వస్త్రపరిశ్రమకు సంబంధించినదే అద్దకం పరిశ్రమ మంజిష్ఠ, ఇంగిలీకం, కరక్కాయలతో చేసిన

రంగులతో వస్త్రాలకు రంగులు వేసేవారు. వీనిని కలంకారీ బట్టలంటారు. కలంకారీ వస్త్రాలకు విదేశాల్లో మంచి గిరాకీ ఉండేది.

ఆంధ్రదేశంలోని వజ్రపరిశ్రమను విదేశబాటసారులెంతగానో వర్ణించినారు. కర్నూలు, గుత్తి, అనంతపురం ప్రాంతాల్లో వజ్రాలు దొరుకుతున్నట్లు, అందులో వజ్రకరూరు గనులు ప్రసిద్ధములైనట్లు పేర్కొన్నారు. నకిలీ వజ్రాలు కూడ దేశంలో తయారవుతున్నట్లు బార్బోసా వ్రాసినాడు. బంగారు, వెండి నగలు చేయడంలో; కర్ర, ఇనుము, రాగి, కంచు మొదలైన లోహాలతో వ్యవసాయం పనిముట్లు, గృహోపకరణాలు, చవికెలు, సింహాసనాలు, కీలుగుర్రాల వంటి దేవతావాహనాలు చేయడంలో వండాణంవారు సిద్ధహస్తులు. విజయనగర రాజ్యం పోషిస్తున్న సైన్యానికి సరిపడు ఆయుధాలు, కవచశిరస్త్రాణాలు స్థానికంగానే తయారయ్యేవని చెప్పవచ్చు. పన్నీరు, బుక్కాపిండి మొదలైన సుగంధద్రవ్యాలను తయారుచేయు గంధకారులకు ఆంధ్రదేశం ప్రసిద్ధి కెక్కింది. పన్నీటిని తోలుతిత్తులలో పోసి అమ్మేవారు. నగరాలలో పూటకూటి ఇండ్లు, క్షౌరశాలలు ఏర్పడినాయి. పూటకూటిండ్లకు పాలు, పెరుగు, నెయ్యి సరఫరా చేయడం గ్రామాల్లో కొందరికి వృత్తి అయింది.

విజయనగరాధీశులు రాకపోకల సౌకర్యాలు కల్పించి దేశీయ విదేశీయ వాణిజ్యం పెంపొందించినారు. 'రేవుల్ మావుమతం గజంబులు మణిశ్రీ గంధ ముక్తాళియన్ రా వాణిజ్యము పెంచి యేలగనగున్' అని కృష్ణరాయలు. విజయనగరం నుండి రాజ్యం నలుమూలలకు రహదారులుండేవి, తిరుపతి బాట, కాశీ రామేశ్వరం బాట, విజయనగరం కంచీనగరాల మధ్య బాట, అహోబలం, పోరుమామిళ్ళ, బనవోలు, కంభములను కలిపే బాట, మచిలీపట్టణం, కోవిలకొండ, కంపిలిని కలిపే బాటలు చాల ముఖ్యమైనవి. ఇవి దండు బాటలుగా కూడ ఉపకరించినాయి. వీనిమీద కావళ్ళు, ఎద్దులు, గుర్రాలు, గాడిదలు, ఎడ్లబండ్లు, పల్లకీలు ప్రయాణ సాధనాలు. పల్లకీలను బోయలు మోసేవారు. ఎడ్లను, గుర్రాలను మజిలీ స్థలాలలో అద్దెకిచ్చేవారు, 'లావుగల యద్దెగుర్రపు జావడముల మీద మాత్రనంచులు గ్రాలన్' అని ఆముక్తమాల్యద. బాటలపై చలివేందిరలు, పూటకూటిండ్లు, సత్రాలు ఉండేవి, చలివేందిరలలో వనితులు సుగంధ మిశ్రితమైన మంచినీటిని, నీరుమజ్జిగను ఇచ్చి దాహం తీర్చేవారని నాటి గ్రంథాల నుండి తెలుస్తుంది. వారానికోమారు బహుశా ప్రతి గ్రామంలోను సంత జరిగేది. స్థానిక పాలకులీసంతల నేర్పాటు చేసేవారు. 'ఊరూరి సంత సంతకు' అని ఆముక్తమ్యాల్యద. హంసవింశతి అనే 18 వ శతాబ్ది కావ్యం దక్షిణాపథంలోని ప్రముఖ వ్యాపార కేంద్రాల్లో ఆంధ్రదేశంలోని ఆదోని, పెనుగొండ, ఉదయగిరి,

కొండవీడు, వినుకొండ, పొదిలి, దేవరకొండ, కంభం, మార్కాపురం, పోరుమామిళ్ళ, మాచర్ల, మంగళగిరి, కొండపల్లి మొదలైన వానిని పేర్కొంటున్నది.

రహదారులపై దోపిడీదొంగల బెడద హెచ్చుగానున్నట్లు స్థానిక చరిత్రల నుండి తెలుస్తుంది. బాటసారులను దోచుకొని, అడ్డగించిన వారిని నిర్దాక్షిణ్యంగా చంపేవారు. దొంగల గుంపుల్లో బోయవారెక్కువ. మాలవారు కూడ దారులు కాచి దోచుకొనేవారు. ఇండ్లకు కన్నాలు వేసి దోచుకోవడం కూడ ఎక్కువగా ఉండేది. దొంగల భయానికి వర్తకులు, యాత్రికులు గుంపులుగా పయనిస్తుండేవారు. కృష్ణరాయలు సయితం ఆముక్తమాల్యదలో దొంగల పద్ధతులు, క్రూర చర్యలు వర్ణించినాడు.

విదేశ వాణిజ్యానికి రేవుపట్టణాలు కేంద్రాలు. విజయనగరంలో 300 లకు పైగా ఓడరేవులున్నవని అబ్దుల్ రజాక్ వ్రాసినాడు. వీనిలో చాలవరకు పశ్చిమ తీరంలోనివి. ఆంధ్రప్రాంతంలో మైలపూర్, పులికాట్, మోటుపల్లి ముఖ్యమైన రేవులు. మైలపూర్ అప్పుడప్పుడే వృద్ధిలోకి వస్తున్నది. మోటుపల్లి కోసం కొండవీడు, విజయనగరాల మధ్య చాలకాలం సంఘర్షణ జరిగింది. మోటుపల్లిని మొదటి దేవరాయ లాక్రమించి అచట ధర్మశాసనం వేయించినాడు (క్రీ. శ. 1416). కాని, క్రమంగా మోటుపల్లి ప్రాముఖ్యం క్షీణించి పులికాట్ అభివృద్ధి చెందింది. పులికాట్ రేవులో ముస్లిం, హిందూ వర్తకు లసంఖ్యాకంగా వాణిజ్యం సాగిస్తున్నారని, రాజ్యం నలుమూలల నుండి బాటలమీదుగా రకరకాల వస్తువులచటికి చేరుతాయని; ముఖ్యంగా పెగూ, టెనాసరిం, మలాకా, సుమత్రా దీవులతోను, పశ్చిమాన మలబార్, గుజరాతులతోను పులికాట్ ఎక్కువగా వాణిజ్యం సాగిస్తున్నదని; తూర్పుదీవులకు ఎక్కువగా కలంకారీ చీర లెగుమతి చేసి ధనం గడిస్తూన్నదనీ, వస్త్రాలుగాక రాగి, వజ్రవైడూర్యాలు, పాదరసం, పన్నీరు, ధాన్యం ఇచటి వాణిజ్య వస్తువులనీ బార్బోసా వ్రాసినాడు. విదేశ వాణిజ్యం క్రమంగా అరబ్బులనుండి పోర్చుగీసుల వశమవుతోంది. విజయనగరాధీశులు పోర్చుగీసులతో స్నేహసంబంధా లేర్పరచుకొన్నారు. తూర్పుదేశాల్లో పోర్చుగీసుల ప్రాబల్యం విజయనగరంతో పెరిగి విజయనగరంతోబాటే కూలిందని ఒక చరిత్రకారుడు వ్రాసినదాంట్లో సత్యం లేకపోలేదు. పదిహేడో శతాబ్దారంభానికి డచ్చి, ఆంగ్ల కంపెనీల రాక ప్రారంభమయింది. డచ్చివారు పులికాట్‌లోను, ఆంగ్లేయులు మచిలీపట్టణం, నిజాం పట్టణాలలోను స్థావరా లేర్పరచుకొన్నారు. పాశ్చాత్య జాతుల మధ్య పోటీ ప్రారంభమయింది. దిగుమతులలో ముఖ్యమయినవి గుర్రాలు. బాహ్లిక, పారశీక, శక, ధట్టా, రట్ట, ఘోట్టాణములనే జాతుల గుర్రాలను సాహిత్యం పేర్కొంటున్నది. ఆ మాటలనుబట్టి అవి ఆయాదేశాలకు చెందిన గుర్రాలని భావించవచ్చు. పచ్చకప్పురం, పట్టుబట్టలు, కస్తూరి, ముత్యాలు

ముఖులు పారశీక వనితలు కూడ దిగుమతుల్లో ముఖ్యమయినవి. ఎగుమతుల్లో కలంకారీ వస్త్రాలు రత్నకంబళ్లు,సుగంధద్రవ్యాలు, వజ్రాలు ప్రధానమయినవి.

వర్తకులు, పంచాణం, సాలె, మేదర మొదలైన చేతిపనులవారు, ఉప్పు కొటార్లవారు సంఘాలుగా నేర్పడి తమ వృత్తులు సాగించినారు. వర్తక, హస్త కళా సంఘాలమధ్య పరస్పర సహకారం వుండేది. శాసనాల్లో 'అయ్యావళిబాలు మూల' వర్తకసంఘం ప్రసక్తి కన్పిస్తుంది. ప్రతి ముఖ్య వాణిజ్య కేంద్రంలోనూ ఈ సంఘ శాఖ ఉండేది. "శెట్టిపట్టణ శ్రేష్ఠి" ఈ సంఘానికి అధ్యక్షుడు. సంఘ సమావేశాలు సాధారణంగా ఆలయమండపంలో జరిగేవి. ప్రతి సంఘానికి ఒక లాంఛనం ఉండేది. వర్తకసంఘాలు స్థానికపాలనలో కొన్ని విధులు నిర్వర్తించేవి. సభ్యులు ప్రభుత్వానికి చెల్లించవలసిన సుంకాలు కావలిగాని రుసుము ఆలయాలకు, మఠాలకు చెల్లించవలసిన మినహాయింపులు, మామూళ్లు వసూలుచేసి చెల్లించేవి. స్థానిక పాలకులతో కలిసి ధర్మాసనా లేర్పడి న్యాయ నిర్వహణలో తోడ్పడుతుండేవి

ఆర్థిక కృషి ఇంతగా జరిగినా ప్రజానీకం జీవితం సుఖంగా, ప్రశాంతంగా జరిగిందని చెప్పలేము. అందుకు ప్రధాన కారణం విపరీతమైన పన్నులభారం. రాజుకు, అమరనాయకునకు, అయగార్లకు, ఆలయాలకు చెల్లించవలసిన రకరకాల పన్నులతో మామూళ్ళతో రైతు పంట హరించిపోయేది. తరచుగా జరిగిన బహమనీ దండయాత్రల్లో యుద్ధాల్లో పొలాల్లోని పంటకు నష్టం వాటిల్లేది; గ్రామాలు దోపిడులకు గురిఅయ్యేవి. వీనికితోడు అజ్ఞానంతో మూఢవిశ్వాసాలతో జరిపే కొలుపులు యాత్రలు, సంతర్పణలు, వివాహాది సాంఘిక కార్యక్రమాల్లోని ఆడంబరాలు సామాన్యులను ఆర్థికంగా కుంగదీస్తుండేవి. అందుచే రైతులకు అంబలే గతి అయ్యేది. "గురుగుంజెంచలి తుమ్మి లేదగిరిసాకుం దింత్రిణీపల్లవోత్కరముం గూడి పొరంటినూనియలతో కట్టారికుట్టారికోగిరముల్ మెక్కె" వారని పరిహాసంతో కృష్ణరాయలు రెడ్లను గురించి వ్రాసిన ఆ మాటలు నాటి సామాన్య ప్రజానీకం జీవితప్రమాణానికి దర్పణం అని చెప్పవచ్చును. ఇదే యుగంలో బహమనీ రాజ్యంలో పర్యటించిన రష్యా యాత్రికుడు నికిటిన్ "పట్టణాల్లో ప్రభువులు ఐశ్వర్యంలో, విలాసాలతో తులతూగుతుండగా సామాన్య ప్రజలు దుర్భర దారిద్ర్యంలో మునిగితేలుతున్నారు" అని వ్రాసినాడు. విజయ నగర పరిస్థితులు అందుకు ఏమంత భిన్నములు కావు.

**మతసాంఘిక పరిస్థితులు :**

తురుష్క సామ్రాజ్య విస్తరణ నరికట్టి ఏర్పడిన విజయ నగర రాజ్యానికి హిందూమత సంస్కృతుల రక్షణ, పోషణ ఆశయాలు కావడం సహజం. విజయ నగరాధీశులు "వేదమార్గ ప్రతిష్ఠాపనాచార్య" బిరుదం ధరించినారు. అయితే విజయనగర రాజ్యంలో హిందువుల్లోని భిన్నశాఖలేగాక జైనులు, తగినంత

సంఖ్యలో ముస్లిములు, క్రైస్తవులుకూడ నున్నారు. తమ అభిమాన మతం ఏదయినప్పటికీ విజయనగరాధీశులు మతాలన్నింటినీ సహనంతో చూచినారు. శ్రీరంగంలోని వైష్ణవులు జైనులను హింసిస్తుంటే బుక్కరాయలు కల్పించుకొని వారి మధ్య సమాధానం కుదిర్చినాడు. రాజధానిలో విరూపాక్షాలయం పక్కనే జైనుల ఆలయాలున్నాయి. దేవరాయలు జైనులకు ముస్లిములకు కూడ ప్రార్థనా సౌకర్యాలు కల్పించినాడు. ఆముక్తమాల్యదలో కృష్ణరాయలు వైష్ణవాధిక్యాన్ని స్థాపించడానికి ప్రయత్నించడమేకాక "వైరిశైవంబుముదిరి మద్వినుతి వినడు" అంటూ అన్యమతనిరసనం ప్రదర్శించినాడు కాని విరూపాక్షునకు స్వర్ణ కిరీటాది కానుక లర్పించినాడు. శైవ వైష్ణవ క్షేత్రాలు రెండూ దర్శించి, అచట గోపుర మండపాలు నిర్మించినాడు. వీరశైవుడైన శాంతలింగప్ప శ్రీశైల ప్రాంతంలోని జైనులను హింసించడం విని కృష్ణరాయలు పంపగా వెలుగోటి గని తిమ్మానాయ డాతణ్ణి దండించినాడట. అళియ రామరాయలు రాజధానిలోని తురకవాడలో గోవధను కూడ సమ్మతించే దూరదృష్టిని ప్రదర్శించినాడు. భారతీయ ప్రభువులకు మత సహనం సాంప్రదాయకమే అయినా ముస్లిములతో నిరంతరం పోరాడుతున్న విజయనగరాధీశులు తమ రాజ్యంలో మతపరమైన కలతలు లేకుండ జూచి సర్వ ప్రజల సమాదరాన్ని చూరగొనడం రాజనీతి అని కూడ భావించి వుంటారు.

కాకతీయయుగంలో వేళ్లూనడానికి ప్రారంభించిన స్మార్తమతానికి విజయ నగ రారంభంలో రాజాస్థానంలో పోషణ లభించింది. సంగమ వంశీయులు కాలాముఖ శైవులని చెప్పవచ్చు. వారి కులదైవం విరూపాక్షుడు; కులగురువు క్రియాశక్తి ఆచార్యులు. గంగాదేవి "అసాధారణ సార్వజ్ఞ్యం విలసత్సర్వ మంగళమ్ క్రియాశక్తి గురుంవన్దే త్రిలోచనవివావరమ్" అంటూ కీర్తించింది. కానీ నాటికి అతివాద శైవం వెనుకాడి స్మార్త గురుపీఠమైన శృంగేరి ప్రాబల్యం వహించసాగింది. అందుచేతనే హరిహరుడు సోదరులతో సహా శృంగేరి దర్శించి మఠాధిపతియైన విద్యాతీర్థులకు దానధర్మాలు చేసి ఆశీస్సులు పొందినాడు. రాజధానిలో విరూపాక్షాలయం కేంద్రంగా స్మార్తమతశాఖ ఏర్పడింది. వైదికవిద్యలో కూలంకష పాండిత్యం ఉన్న మాధవాచార్యులు బుక్కరాయల మంత్రి. మాధవాచార్యులు, అతని తమ్ముడు శాయణాచార్యులు వేదాలకు, స్మృతులకు భాష్యాలు వ్రాసినారు. బుక్కరాయలి చివరి రోజుల్లో స్మార్త పీఠాధిపతి అయిన విద్యారణ్యులు ప్రాబల్యం వహించినాడు. మాధవాచార్యులూ, విద్యారణ్యులూ ఒక్కరే ననే బలమైన వాదం ఉంది. కాని, ఆ వాదానికి బలవత్తరమైన అభ్యంతరాలు సయితం ఉన్నాయి. కేవలం శంకరాచార్యుల అద్వైత వేదాంత విధానమేగాక మాధవాచార్యులు కర్మమీమాంసా పద్ధతిని పునరుద్ధరించడానికి ప్రయత్నించినాడు.

అతడు "మహాక్రతూనాం ఆహర్త", 'ప్రతి వసంత సోమయాజీ.' ఈ విధానాన్ని వివరిస్తూ "జైమినీయ న్యాయమాలావిస్తర", "యజ్ఞతంత్ర సుధానిధి" అనే గ్రంథాలు రచించినాడు. ఈ యుగ ప్రముఖ అద్వైత ప్రవర్తకులలో అప్పయ్య దీక్షితులు చివరివాడు (క్రీ శ. 1520-93; బహు గ్రంథకర్త. రెండో వెంకటపతి రాయల ఆస్థానంలోనివాడు. అయితే, నాటి ప్రధాన సమస్య రాజకీయం గానేగాక మత సాంస్కృతిక పరంగా కూడ ఇస్లాం వ్యాప్తి నరికట్టడం. ఆదే ఆశయంతో ఉత్తర భారతంలో సంస్కరణాత్మకమైన భక్తి ఉద్యమం సాగింది. ఆ ఉద్యమానికి; మాధవాచార్య, విద్యారణ్యుల ద్వారా విజయనగరం ప్రోత్సహించిన వైదిక ధర్మ పునరుద్ధరణోద్యమానికి పొంతన లేదు. సంస్కృతంలో సంతరించిన వేదభాష్యాల ద్వారా ప్రజానీకంలో హిందూమత సందేశంలో విశ్వాసం బలపరిచి ఇస్లాం సవాలు నెదుర్కొనగల శక్తిస్థైర్యాలను వారికేమాత్రం ఈ ఉద్యమం ఇవ్వగలిగిందో అనుమానం అందుచేత విజయనగ రాస్థానంలో సాగిన మతోద్యమ సామాజిక ప్రయోజనం అత్యల్పమేనని చెప్పవచ్చు.

స్మార్తమతం రాజాస్థానానికీ బ్రాహ్మణుల్లో ఒక చిన్న వర్గానికీ మాత్రమే పరిమితం. ప్రజానీకంలో భక్తిప్రధానమైన శైవవైష్ణవాలకే ఆదరం ఉంది. శైవ మతశాఖల్లో కాలాముఖ వీరశైవాలకు పరిమితంగా ఆదరణ వుంది. సంగమ వంశస్థుల్లో దేవరాయలవరకు కాలాముఖాచార్యుడైన క్రియాశక్తి కులగురువు. వారి శాసనాలు "శ్రీవిరూపాక్ష" పదంతో సమాప్తమయ్యేవి. హరిహరుని సోదరుడు మారప్పకు మంత్రిగా బానవాసీ రాజ్యం పాలించిన మాధవమంత్రి గురువు కూడ క్రియాశక్తి పండితుడే. మాధవమంత్రి ఉపనిషన్మార్గ ప్రవర్తకుడు. స్థూలంగా ఆలోచిస్తే వైదిక మార్గం కర్మమార్గం; ఉపనిషన్మార్గం జ్ఞానమార్గం. రెండో దేవరాయలు "వీరశైవాగమ సంపన్నుడు." క్రమంగా తీవ్రవాద శైవశాఖలు శ్రీశైలం, త్రిపురాంతకంవంటి ప్రదేశాల్లో ఆలయాలకు, మఠాలకు మాత్రమే పరిమితమైనట్లు కన్పిస్తుంది. నాటి సారస్వతంలో సిద్ధ, కాపాలిక శాఖల ప్రసక్తి కూడ ఉందిగాని, వారి ప్రభావం సమాజం మీద చాల స్వల్పం.

విజయనగర యుగంలో వైష్ణవం రాజాదరణతో ఎక్కువగా ప్రచారమయింది. ద్వైత, విశిష్టాద్వైతపరంగా వైష్ణవంలో రెండు ప్రధాన శాఖలున్నాయి. ద్వైతమత స్థాపకుడు మధ్వాచార్యులు (క్రీ.శ. 1193-1275). ఆంధ్రదేశ పర్యటనలో మధ్వాచార్యులు గోదావరి తీరంలో శ్యామశాస్త్రి, శోభనభట్టులను శిష్యులుగా స్వీకరించినాడని వారే నరహరతీర్థ, పద్మనాభతీర్థులని ఒక గాథ వుంది. మధ్వాచార్యుల అనంతరం పద్మనాభతీర్థులు ద్వైతగురుపీఠం అలంకరించినాడు. నరహరితీర్థులు శ్రీకూర్మం కేంద్రంగా ఆంధ్ర కళింగ ప్రాంతాల్లో మాధ్వమతం ప్రచారం చేసినాడు. వైష్ణవ సంప్రదాయ గ్రంథాల నుండి అక్షోభ్యతీర్థులకు

విద్యారణ్యులకు వాగ్వాదం జరిగినట్టు తెలుస్తుంది. ఏమైనా విజయనగరంలో ప్రసిద్ధ ద్వైతాచార్యులు వ్యాసతీర్థులు. సాళువ నరసింహుని కాతడు గురువు. అతని కోరికపై వ్యాసతీర్థులు తిరుపతిలో అర్చకత్వం నిర్వహించి, అతడు విజయనగర సింహాసనం ఆక్రమించిన తరువాత చంద్రగిరి నుండి విజయనగరం చేరినారు. వ్యాసతీర్థులు గొప్ప విద్వాంసుడు. కృష్ణరాయల కాతనిపట్ల అపారమైన అభిమానం; రాయలపట్ల తీర్థులకెనలేని వాత్సల్యం. ఇంతటి రాజాదరణ లభించి నప్పటికీ సనాతన సంప్రదాయ ప్రియత్వం వల్ల మాధ్వమతం కూడ జనాదరణ పొందక బ్రాహ్మణుల్లో అత్యల్ప వర్గానికి మాత్రమే పరిమితమయింది.

విశిష్టాద్వైతపరమైన శ్రీ వైష్ణవంలో వడగలశాఖ ఆంధ్రదేశంలో ప్రచారమైనట్లు పైన చదివినారు, సాళువ నరసింహుని కాలం నుండి వైష్ణవానికి రాజాస్థానంలో బలం చేకూరింది. నాటి వైష్ణవ కుటుంబాలలో తాళ్ళపాక, తాతాచార్య కుటుంబాలు ప్రసిద్ధములు. తాళ్ళపాకవారు తిరుపతిలో ఉండేవారు; కవులు, వాగ్గేయకారులు. తాతాచార్యకుటుంబంవారు తుళువ, ఆరవీటి వంశాల కులగురువులయినారు. కృష్ణరాయలు గోవిందదేశికుని తొలగించి తాతాచార్యులను రాజగురు పీఠంలో నిలిపినాడు. వైష్ణవంలో పుష్టిపద్ధతికి ప్రవర్తకుడైన వల్లభాచార్యులు కృష్ణరాయలి ఆస్థానం దర్శించినాడనీ, అతనికీ వ్యాసతీర్థులకు వాగ్వాదం జరిగిందని ఒక సంప్రదాయం. కృష్ణరాయల ఆస్థానకవి పెద్దన గురువు శఠగోపయతి. అళియ రామరాయలకి గూడ తాతాచార్యులే గురువు. వీరిద్దరి సహాయంతో దొడ్డయాచార్య అనే వైష్ణవ గురువు అప్పయ్యదీక్షితుల నోడించి శైవక్షేత్రమైన చిదంబరంలో గోవింద రాజస్వామి పూజోత్సవాలను ప్రతిష్ఠించినాడట. ఆరవీటి వంశంలో ఇంచుమించు అందరూ వైష్ణవులే. శ్రీరంగరాయల గురువు తిరుమల తాతాచార్యులు. రెండో వెంకటపతి కాలం నుండి శాసనాల్లో శ్రీ విరూపాక్షునికి బదులు శ్రీ వెంకటేశ్వరుడు ప్రత్యక్షమయినాడు. అతని నాణెములమీద కూడ శ్రీ వెంకటేశ్వరాయ నమః అనే లేఖనం కన్పిస్తుంది. వెంకటపతి ఆస్థానంలో తాతాచార్యులకు తోడు తిరుమల శ్రీనివాసాచార్య, కందాళ అప్పలాచార్య, తాళ్ళపాక తిరుమలాచార్య అనే వైష్ణవ విద్వాంసులుండేవారు.

ఆలయము, మఠము మత విద్యలకు సంప్రదాయాలకు పట్టుగొమ్మలుగా నిలిచినాయి. ఆలయనిర్మాణం విరివిగా సాగింది. పాత ఆలయాలకు కొత్తగా గోపుర మండపాదులను కల్పించినారు. తిరుపతి, శ్రీశైలం, అహోబలం, కాళహస్తి ఆలయాలు ప్రసిద్ధములు. ముఖ్యంగా వైష్ణవ క్షేత్రాలైన తిరుపతి, అహోబలాలను తుళువ, ఆరవీటిరాజు లెక్కువ ఆదరించి పోషించినారు. అనేక ఉత్సవాలు, తిరునాళ్ల జరిపి ఆలయాలు ప్రజలను ఆకర్షించేవి. ప్రజల ఆర్థిక

సాంస్కృతిక జీవితంలో ఆలయం నిర్వహించిన పాత్రను పైఅధ్యాయాల్లో చదివినారు. సాధారణంగా మఠాలు ఆలయాలకు అనుబంధంగా వుండేవి. పుష్పగిరి (కడప జిల్లా)లో శృంగేరి స్మార్తమఠశాఖ వెలసింది. శ్రీశైలంలో, భిక్షావృత్తి మొదలైన వీరశైవ మఠాలుండేవి. తిరుపతి, అహోబలాలలో వైష్ణవ మఠాలు ప్రసిద్ధములు. ముఖ్యంగా వైష్ణవ గురువులు దేశసంచారం చేస్తూ మత ప్రచారం జరిపేవారు.

ప్రజలలో మతసంబంధమైన మూఢ విశ్వాసాలు ఆచారాలు ఎక్కువగా ఉండేవి. ఒకే దేవుడు తమ కోర్కెలన్నింటినీ తీర్చలేడేమో అనే భయమో లేక ఒక దేవుని ఆరాధిస్తే ఇతరులకు ఆగ్రహం వస్తుందనే భయమోగాని బహు దేవతారాధన ఎక్కువయింది. స్మార్తులు ఐదుగురు దేవతలతోటి "పంచాయతన" ఆరాధన చాలా కాలంగా చేస్తున్నారు. ఆ దేవతలకు కుమారస్వామిని చేర్చి 'షణ్మతాలను' రూపొందించడమే గాక అద్వైత బోధకుడైన శంకరాచార్యుని 'షణ్మత స్థాపకు' డని కీర్తించసాగినారు. మాధ్వమతం వల్ల హనుమంతుని పూజకు ఆదరణ హెచ్చింది. మధ్వాచార్యులు హనుమంతుని అవతారమని మాధ్వుల విశ్వాసం. మహారాష్ట్ర నుండి విఠోబా ఆరాధన ప్రవేశించింది. కృష్ణ రాయలు విఠోబా భక్తుడు. గ్రామదేవతల సంగతి వేరే చెప్పనక్కరలేదు. సాగుమానం (సహగమనం) చేసినవారు దేవతలై పూజ లందుకొనేవారు. శకునాలలో దయ్యాలు భూతాలలో నమ్మకం విపరీతంగా ఉండేది. గ్రామదేవతల కొలువుల్లోను నవరాత్రులలోను జంతుబలులు జరిగేవి. విజయనగరంలో నవరాత్రులలో ప్రతిరోజు 24 దున్నలు, 150 మేకలు, చివరిరోజున 250 దున్నలు, 400 మేకలు బలి ఇస్తారని పేస్ వ్రాసినాడు. జనులు రకరకాల మొక్కులు మొక్కి వానిని జాతర్లలో తీర్చేవారు. వానిలో సిడమెక్కి ఆడడం, వీపుకండ లివ్వటం, అరటి ఆకు చిరగకుండ నడవడం, నిప్పులపై నడవడం, నిప్పుగుండంలో ప్రవేశించడం, నోటి తాళాలివ్వడంవంటి వికృతములైన క్రూర ఆచారాలుండేవి రాజధానిలో శివరాత్రినాడు సిడమెక్కేవారనీ రథోత్సవంలో రథానికిఉన్న ఇనుప గాలాలకు వీపుచర్మం గుచ్చి వేలాడతారనీ నికోలో కాంటి వర్ణించినాడు. అపారమైన కష్టనష్టాలను, దోపిడి దొంగల ఉపద్రవాలను లక్ష్యంచేయక కాశీ, ప్రయాగ, చిదంబరం, శ్రీరంగ, రామేశ్వరాలు; శ్రీశైలం, తిరుపతి, కాళహస్తి, అహోబలాల తీర్థయాత్రకు వెళ్ళేవారు. తిరుపతి కొండకు వెళ్ళేవారు వింత మొక్కులు మొక్కుకొనేవారు. ''అనశనవ్రతముచే నతుల్యకార్శ్యంబున గనుపట్టునోరి టీగములవారు, దైహికాయాసంబు దలపక దొర్లుచునడతెంచు పొరలు దండములవారు'' తిరుపతి యాత్రికుల్లో ఉన్నట్లు చంద్రభాను చరిత్రలో తరిగొప్పుల మల్లన్న వర్ణించినాడు.

భిన్న మతశాఖలమధ్య శైవ వైష్ణవాలు, అద్వైత విశిష్టాద్వైతాలు - తీవ్ర చర్చలు వాగ్వాదాలు జరుగుతుండేవి. పరస్పరం దూషించుకొనేవారు. అవకాశం లభించినపుడెల్ల నిందారోపణ చేసుకొనేవారు. కృష్ణరాయలంతటివాడు ఆరాధ్య దేవుళ్ళను (శైవగురువులను) పతితులని శ్రీరంగనాథునిచే అనిపించాడు. ఆముక్త మాల్యదలో విష్ణుమూర్తి పాండ్యరాజును గురించి లక్ష్మీదేవికి ఫిర్యాదు చేస్తాడు, "వైరి శైవంబు ముదిరి మద్వినుతి వినడు.'' "మాయావాదు లాత్మీయ దుర్వ్యాభిచారం బదిమేరువంతయిన మాయన్ మిథ్యలేదంద్రు పెల్లభియోగంపుదు రన్యదుష్కృతము గోరంతైన కొండంతగా" అని విప్రనారాయణ చరిత్ర చెబుతున్నది.

సనాతనధర్మ పునరుద్ధరణ ఆశయమైన విజయనగరంలో వర్ణవ్యవస్థ బలపడే అవకాశం ఎక్కువ. ఆదిమ వర్ణ ధర్మాలు చాలవరకు నశించినప్పటికి వర్ణవ్యత్యాసాలు తత్ఫలితంగా వైషమ్యాలు పెరిగినాయి. బ్రాహ్మణుల్లో పూజారులు, మఠాధిపతులు, భూస్వాములు, ఉద్యోగులు, వర్తకులు, భోక్తలు అనే వర్గాలున్నట్లు బార్బోసా, పేస్ వంటి పాశ్చాత్య యాత్రికులు గమనించారు. కృష్ణరాయల కాలం వరకూ బ్రాహ్మణు లెక్కువ సంఖ్యలో మంత్రులుగా, దండనాయకులుగా విజయనగరానికి సేవ చేసినారు. కాని క్రమంగా బ్రాహ్మణులు వ్యవసాయవృత్తి నవలంబించసాగినారు. కొందరు నీచ వృత్తులకుదిగి అపహాస్యానికి పాలైనారు. చివరి వర్గాన్ని గురించి "వీరు భోజనం మినహా ఏ ఇతరపనీ చేయ'' రని బార్బోసా వ్రాసినాడు. బహుశా వీరిని గురించే 'గుత్తిన్ పుల్లెలు గుట్టి, చంద్రగిరిలో గూడెత్తి, పెనుగొండలో హత్తిన్ సత్రమునందు వేడి, బలు దుర్గాధీశ తాంబూలపున్‌దిత్తుల్ మోసి, పదస్థులై'' నారని భట్టుమూర్తి నిరసించినాడు. శివాలయాల్లోని అర్చకులు తంబళవారు, నంబివారు విష్ణ్వాలయంలోని పూజారులు. ఉభయులూ అనేకవిధాల దేవద్రవ్యం హరిస్తారని వారిపట్ల ప్రజలకు సదభిప్రాయం వుండేదికాదు. క్షత్రియులు నామమాత్రులు. దేశీయ వాణిజ్యం చాలావరకు వైశ్యులు నిర్వహించినారు. వీరిలో నీతినియమాలు మృగ్యమైనాయి. వీరి రితత్వశక్తిని గురించి వీరు చేసే మోసాలను గురించి నాటి కావ్యాల్లోను, చాటువుల్లోను చాల సమాచారం లభిస్తుంది. పంచాణంవారు దొంగసొమ్ము కొనేవారని రక్షకభటులు వారి ఇండ్లపై నిఘా వేసి వుంచేవారని తెలుస్తుంది. "కంచును వెండియు, రాగియు, కాంచనమును మౌక్తికాదికములగు మణులన్ పంచాణము వారింటికి, కొంచక కొనివత్తు రమ్మకొనుటకు చోరుల్" అని వైజయంతీ విలాసము. రెడ్లు, వెలమలు తమ రాజకీయ ప్రాముఖ్యం కోల్పోయినారు. కృష్ణరాయల అనంతరం కమ్మవారు-రావెళ్ళ, పెమ్మసాని మొదలైన కుటుంబాలవారు సేనానులుగా, సామంతులుగా ప్రాబల్యం వహించసాగినారు.

సమాజవ్యాప్తంగా అనేక దురాచారాలు ప్రబలినాయి. ప్రభు, ధనిక వర్గాలలో శృంగార ప్రియత్వం భోగలాలసత్వం ఎక్కువయింది. బహు భార్యాత్వం సర్వసాధారణమయింది. వివాహాలు ఆడంబరంగానే జరిగేవి. కన్యాశుల్కం, వరశుల్కం విపరీతంగా వుండేవి. రెండో దేవరాయలు బ్రాహ్మణులను సమావేశపరిచి కన్యాదాన విధానమే అనుసరిస్తామని వారిచేత ప్రతిజ్ఞ చేయించినాడు. ఆడపిల్ల పెండ్లిని భారంగా తల్లిదండ్రులు పరిగణించేవారు. కొన్ని సందర్భాలలో భూములమ్మి పెండ్లి చేయవలసి వచ్చేది. వేశ్యాలంపటత్వాన్ని గురించి వేరే చెప్పనక్కర్లేదు. ఉంపుడుకత్తె హోదాకు చిహ్నం కాసాగింది. ముఖ్యంగా రాజవేశ్యలకు ప్రత్యేక గౌరవం ఉన్నట్లు పాశ్చాత్య బాటసారులు కూడ గుర్తించినారు. నాటి సారస్వతం నిండా వేశ్యలమోసాలు, ధనార్జనోపాయాలు కన్పిస్తాయి. భూములు, వస్తువులు కుదవబెట్టి డబ్బు వడ్డీకి తీసుకునే పద్ధతి ఎక్కువయింది. సాధారణంగా తాకట్టు-వడ్డీ వ్యాపారం కోమట్లు చేసేవారు. సతీసహగమనం అక్కడక్కడ కనిపిస్తుంది. రాయల అంతఃపురంలోని స్త్రీలలో కొన్ని వందలమంది అతనితో సహగమనం చేయడానికి సిద్ధం అని కాంట్రే వ్రాసినాడు. భర్తశవంతోపాటు భార్యను పూడ్చిపెట్టే ఆచారం తెనుగువారిలోనున్నట్లు న్యూనిజ్ కథనం. వీరశైవుల్లో బహుశా ఇటువంటి సంప్రదాయం వుండివుంటుంది. మద్యపానం ఎక్కువయింది. దానికి ధూమపానం తోడయింది. అన్ని తరగతులలోను రకరకాల జూదం సర్వసామాన్యమై అనేక బాధలకు కారణమయింది. వేషధారణలో తురుష్క పాశ్చాత్య సంప్రదాయాలు ప్రవేశించినాయి.

సమాజంలో వర్ణవైషమ్యాలు కూడ బలపడసాగినాయి. కృష్ణరాయల వంటి ప్రభువే రెడ్లను పరిహసించినాడుగదా! తమ నీచవృత్తులచే విద్యాహీనతచే బ్రాహ్మణులు గౌరవం కోల్పోయినారు. ఇతర వర్ణాలవారు విద్యావంతులై బ్రాహ్మణాధిక్యతను ధిక్కరించసాగినారు. ఈ యుగానికి చెందినదని విమర్శకులు భావిస్తున్న చంద్రశేఖర శతకంనిండా ఈ నిరసన కన్పిస్తుంది. అందొక పద్యంలో శూద్రవర్ణజుడు -

నన్నుసదించె బాబు నిననాడుతమాసగ భాగతంబు రా
మాన్నము భారతంబునుతమాముగ, కిందివి ముందెవచ్చె నే
నిన్ని సదుండగానె బవుయెత్తుమునోరిక, బావనోండ్లు నా
కన్నను లొజ్జటండ్రు"

అని ఫిర్యాదు చేస్తాడు. మత సాంఘిక కార్యకలాపాలలో శూద్రులు బ్రాహ్మణులతో సమాన హక్కులు కోరసాగినారు. రెండో వెంకటపతి కాలంలో (క్రి. శ. 1596) ముద్దుకృష్ణప్ప నాయకుని సమక్షాన కందెయ దేవరను వృద్ధాచలానికి

ప్రభువుగానొక శూద్ర పురోహితుడు అభిషేకించినట్లు శాసన సాక్ష్యం వుంది. పదిహేడో శతాబ్ద ఆరంభంలో జీవించిన వేమన రచించిన-

శూద్రతనముపోయె శూద్రుడగానని ద్విజుడనుకొను చెల్ల తెలివిలేమి
ఇత్తడెసగు పసిడి ఈడనవచ్చునా? త్రాడు మెడనువేసి తనదుశూద్రత్వంబు
పోయెననెడిదెల్ల బుద్ధిలేమి మనసునిలక త్రాడు మరివన్నె తెచ్చునా?

అనే పద్యాలనుబట్టి వేమనకాలానికే శూద్రులు యజ్ఞోపవీతం ధరించడం మొదలు పెట్టినారని 'పౌరోహిత్యం' ప్రారంభించినారని భావించడానికి అవకాశం వుంది ఈ చైతన్యంవల్ల వర్ణవైమనస్యాలు పెచ్చు పెరిగినవేగాని సమసిపోయి, జాతి సమైక్యం కాలేకపోయింది.

**విద్యలు-భాషలు-కళలు**

ప్రజల్లో విద్యాభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యక్షంగా శ్రద్ధ వహించేది కాదు. అధిక సంఖ్యాకజనులు నిరక్షరాస్యులే. విద్యలో ఆసక్తి ఉన్నప్పటికీ సక్రమ మైన పాఠశాలలు లేవు. గ్రంథాలుకూడ సులభంగా లభ్యమయ్యేవికావు. అనాదిగా పేరొందిన బ్రాహ్మణుల్లో సయితం విద్యపట్ల నిర్లక్ష్యం ఏర్పడింది. ఒక విప్ర యువకునిపట్ల "నిగమశర్మాభిధానంబు నేతిబీరకాయ"వలె అయథార్థమ యిందని పాండురంగ మాహాత్మ్య వృత్తాంతం. అగ్రహారాల్లో, మఠాల్లో, ఆలయాల్లో విద్యాబోధన జరుగుతూనే వుండేది. ఈ సంస్థలకూ జ్యోతిష ఆయుర్వేదాది శాస్త్రపండితులకూ అగ్రహారాలు, మాన్యాలు ఇచ్చి ప్రభువులు పరోక్షంగా విద్యలను ప్రోత్సహించినారు. ఇతర గ్రామాల్లో మాధుకరవృత్తిలో జీవిస్తూ విద్యార్థులు విద్యనభ్యసించేవారు. తమ ఇండ్లలోనే ఉచితంగా భోజనంపెట్టి విద్యను బోధించే ఉదారులైన ఉపాధ్యాయులు లేకపోలేదు. వేదవేదాంగాలు, పురాణేతిహాసాలు, తర్క-వ్యాకరణ జ్యోతిష ఆయుర్వేదాలు, న్యాయమీమాంసా దర్శనాలు మొదలైన సాంప్రదాయక విద్యలను బ్రాహ్మణులు అభ్యసించేవారు. రాజోద్యోగాలు ఆశించినవారు గణిత, జ్యోతిష శాస్త్రాలు, రాజనీతి, భిన్నలిపులు మొదలైనవి అభ్యసించేవారు. "కరణంబుకొడుకు ముందర కరణిక ధర్మంబునందు కడుకుశలుండై ధరణిగల విద్యలన్నియు బరువడి నెరుగంగ వలయు బనిలేకున్నన్" అని సకల నీతిసమ్మతం. "సరులు గ్రుచ్చినయట్లు వెరసులు చక్కగా విశదముగ" వ్రాయడంపట్ల అభిమానం ఉండేది.

రాజసభల్లో వాగ్వాదాలు, విద్యాపరీక్షలు జరిగేవి. రాజులు యోగ్యతా పత్రాలు బహుశా, తామ్రపత్రాలమీద వ్రాయించి ఇచ్చేవారు. మఠాల్లోను, పండితుల ఇండ్లలోను పుస్తక భాండాగారాలుండేవి. శృంగేరీపీఠ పుస్తక భాండాగార ఉద్యోగి, పౌరాణిక కవి కృష్ణభట్టును రెండో బుక్కరాయలు ఈనాములిచ్చి గౌరవించినాడు. నాటివి చాలవరకు తాళపత్ర గ్రంథాలే. రాగిరేకులపై కూడ

వ్రాయడం వుంది. తాళ్ళపాక అన్నమాచార్యులు తన కీర్తనలు రాగిరేకులపై వ్రాయించి 'సరస్వతీభాండారం'లో భద్రం చేసినాడు.

**భాషలు :** దక్షిణదేశ చరిత్రలో మరి ఏ యుగంలోకూడ విజయనగరాధీశుల పోషణలో జరిగినంతటి సాహిత్య పరిశ్రమ జరగలేదనడం అతిశయోక్తి కాదు. ప్రభువుల్లోను వారి సామంతుల్లోను పలువురు సంస్కృతాంధ్రాదిభాషల్లో పండితులు, కవులు, పండితగోష్ఠి వారి ప్రధాన కాలక్షేపం. దాక్షిణాత్యభాషల్లోను సంస్కృతంలోను వివిధ సారస్వతశాఖల్లో పెక్కు గ్రంథాలు వెలసినాయి. నూతన కవితారీతుల సృష్టి జరిగింది.

**సంస్కృతం :** విజయనగర చరిత్ర పూర్వార్ధంలో సంస్కృతభాషా ప్రాబల్యం ఎక్కువగా కన్పిస్తుంది. సంస్కృతం వైదిక - దేవభాష గదా! వేద భాష్యాలు, అలంకారశాస్త్రాలు, కావ్యనాటకాలు అనేకం సంస్కృతంలో వెలువడినాయి. అద్వైత, ద్వైత, విశిష్టాద్వైతపరమైన గ్రంథాలనేకం రచించినారు. విద్యారణ్యులు ఐతరేయదీపిక, తైత్తిరీయదీపిక, పంచదశి, జీవన్ముక్తివివేకాది గ్రంథాలకు కర్త; మాధవాచార్యులు పరాశరస్మృతి- వ్యాఖ్య (పరాశరమాధవీయం)తోబాటు జైమినీయ న్యాయమాలావిస్తర, సర్వదర్శన సంగ్రహాది గ్రంథాలు రచింపగా ఆతని సోదరుడు శాయణాచార్యులు 'వేదార్థప్రకాశిక' అనే పేర చతుర్వేదాలకు కూలంకషమైన భాష్యం రచించినాడట. తంజావూరు రఘునాథరాయల, మంత్రి అద్వైత విద్యావిచార బిరుదాంచితుడునైన గోవిందదీక్షితుల కొడుకు వెంకటమఖి బోధాయనశ్రౌతసూత్రాలకు భాష్యమూ శుల్బమీమాంస అనే గ్రంథమూ రచింపగా, ఆతని తమ్ముడు లింగాధ్వరి 'వేదార్థతత్వ నిర్ణయం' రచించినాడు. శాయణమాధవాచార్యుల సమకాలికుడైన వేదాంతదేశికుడు తత్వటీక, తాత్పర్యచంద్రిక, న్యాయసిద్ధాంజనములద్వారా విశిష్టాద్వైత సిద్ధాంతానికి బలం చేకూర్చినాడు. ఇక ద్వైతపరంగా వ్యాసతీర్థులు తాత్పర్యచంద్రిక, తర్కతాండవ, న్యాయామృతములను; వాదిరాజతీర్థులు మధ్వతంత్రముఖభూషణమును రచించినారు. శ్రీకంఠ పండితుడు వీరశైవపరంగా బ్రహ్మసూత్రభాష్యం వ్రాయగా, దానిపై అప్పయ్యదీక్షితులు శైవార్కమణిదీపికపేర వ్యాఖ్యానం రచించినాడు. మొదటి బుక్కరాయలకాలంవాడైన మాధవమంత్రి సూతసంహితపై తాత్పర్యదీపికను, శైవామ్నాయసారమును రచించినాడు. ఈ విధంగా భిన్నమతశాఖల్లో వెలువడిన సారస్వతం లక్ష్యం అన్యసిద్ధాంత ఖండనము, స్వీయసిద్ధాంత ప్రతిష్ఠాపన!

ఈ యుగం కావ్యాలలో వేదాంత దేశికుడు రచించిన యాదవాభ్యుదయ, రామాభ్యుదయాలు మొట్టమొదటివి. వేదాంతదేశికుని 'కవితార్కికసింహ' అని సమకాలికులు పిలిచినారు. భోగనాథుడు త్రిపుర విజయ, రామోల్లాస కావ్యాలు

రచించినాడట! రెండో దేవరాయలు 'మహానాటకసుధానిధి'ని, ఆతనికాలంవాడే అయిన ఉద్దండకవి 'మల్లికామారుత' నాటకాన్ని రచించినట్లు తెలుస్తుంది. నాటి సారస్వత చరిత్రలో కవయిత్రుల రచనలు, చారిత్రక రచనలు విశిష్ట లక్షణాలు. వీనిలో గంగాంబ 'మధురావిజయ' కావ్యం సుప్రసిద్ధం. ప్రౌఢదేవరాయల కాలం లోనే డిండిమకవి కుటుంబం విజయనగరాస్థానంలో ప్రవేశించింది. వారిలో అరుణ గిరినాథడిండిముడు 'సోమవల్లీయోగానంద ప్రహసన' కర్త. శ్రీనాథుడు ఓడించిం దీతణ్ణే. ఇతని సంతతివారిలో రెండో రాజనాథుడు సాళువాభ్యుదయాన్ని, మూడో రాజనాథుడు అచ్యుతరాయాభ్యుదయాన్ని రచించినారు కృష్ణరాయలు జాంబవతీ కల్యాణం మొదలైనవి రచించినాడు. విరూపాక్షస్వామి చైత్రోత్సవ సందర్భంలో జాంబవతీ కల్యాణం ప్రదర్శించేవారని తెలుస్తుంది. అచ్యుతరాయలకాలంలో తిరుమలాంబ 'వరదాంబికాపరిణయం' (అచ్యుతరాయల వివాహ గాథ) రచిం చింది; మహామంత్రి సాళువ తిమ్మరుసు అగస్త్యుని బాల భారతంపై మనోరమా వ్యాఖ్యను, అతని మేనల్లుళ్ళు గోపరసులు, అప్పరసులు కృష్ణమిశ్రుని ప్రబోధ చంద్రోదయనాటకంపై వ్యాఖ్యానాలు రచించినారు. తంజావూరు రఘునాథ రాయలు సంస్కృతంలో మహాకవి. అతనిమంత్రి గోవిందదీక్షితులు వేదాంత గ్రంథాలతోబాటు సాహిత్యసుధను రచించినాడు.

అలంకార, నాట్య, సంగీతశాస్త్రాలపై గూడ పెక్కుగ్రంథాలు వెలువడి నాయి. అలంకారశాస్త్ర గ్రంథాలలో సాయణుని ధాతువృత్తి, భోగనాథుని ఉదాహరణమాల, గోపతిప్పని కావ్యాలంకారసూత్రాలపై వ్యాఖ్య ముఖ్యమైనవి. నాట్య, సంగీతశాస్త్రాలపై గ్రంథాలలో మహానాటకసుధానిధి, దేవనభట్టు 'సంగీత ముక్తావళి,' గోపతిప్పని తాలదీపిక, లక్ష్మీధరుని సంగీతసూర్యోదయము, రఘు నాదరాయలి సంగీతసుధ ఎన్నదగినవి. రఘునాథరాయలు జయంతసేన, రామానందములనే కొత్త రాగములను సృష్టించడమే గాక, రఘునాథవిలాస'మనే కొత్త నాట్యపద్ధతిని రూపొందించినాడు.

**తెలుగు :** విజయనగర యుగం ఆంధ్రభాషాచరిత్రలో స్వర్ణయుగమని సర్వసాధారణ అభిప్రాయము. ద్రావిడ, కర్ణాటాంధ్రదేశాలను కలిపి పాలిస్తున్న విజయనగరాధీశులు "దేశభాషలందు తెలుగులెస్స" అని గుర్తించినట్లు కన్పి స్తుంది. ఆంధ్రభాషాచరిత్రలో విజయనగరాస్థానానికి ప్రత్యేకస్థానం వుంది. అచటనే శ్రీనాథ కవిసార్వభౌముడు ఆంధ్రభాషావిజయధ్వజం ప్రతిష్ఠించి, ఆంధ్రవాణికి కనకాభిషేకం చేయించినాడు. రాయల ఆదరాభిమానాలతో ఆంధ్రం దాక్షిణాత్య భాషలకు మార్గదర్శకమయింది.

ఈ యుగపూర్వార్ధంలో వెలువడిన సారస్వతాన్ని రెడ్డియుగ సార స్వతంతో పోల్చవచ్చు. శైవులు, వైష్ణవులు తమ తమ సిద్ధాంతాలను ద్విపదల్లో

ప్రచారం చేసుకున్నారు. మతేతరములు, నీతిబోధకమునైన పంచతంత్రంవంటి కథానిక కావ్యాలు సయితం వెలువడినాయి. కృష్ణరాయల నుండి మార్పు వచ్చింది. నాటికి ముస్లిం దండయాత్రలు వెనుకాడి, రాజ్యం ప్రశాంతంగా అభివృద్ధి చెందసాగడమే ఈ మార్పుకు కారణమని చెప్పవచ్చు. ప్రబంధ పరమేశ్వరునిలో బీజప్రాయంగా కన్పించి శ్రీనాథ, పినవీరభద్రులు పోషించిన ప్రబంధ ప్రక్రియ కృష్ణరాయల కాలంలో వికసించినది. ఊహాశక్తికి, వర్ణనా సామర్థ్యానికి భాషావైచిత్రీ ప్రదర్శనకు ప్రబంధ ప్రక్రియ మంచి అవకాశం కలిగించింది. జైమినీ భారతం, పాండురంగ మాహాత్మ్యం, కాళహస్తి మాహాత్మ్యం వంటి పురాణాలు సయితం ప్రబంధ శైలిలో నడిచినాయి. ఈ పరిణామ ఫలితంగా సారస్వతానికి ప్రజా జీవితానికి సంబంధం లేకుండాపోయింది. వాస్తవానికి ప్రబంధ కవుల్లో నన్నయ్యలోని ఆధ్యాత్మికతగాని, తిక్కనలోని జాతీయస్పృహగాని, శివకవుల్లోని సాంఘిక దృష్టిగాని లేవని చెప్పవచ్చు. శృంగార ప్రియుడనే అపప్రథకు గురియైన శ్రీనాథుని కవిత్వానికి "ఆంధ్రక్ష్మామండలాఖండలుండైన వేమభూపతి కృపావీక్షణంబు (అంటే రాజభక్తి) వేదాద్రినరసింహ విపులవక్షస్థలీ కల్హారమాలికాగంధలహరి (దైవభక్తి)" కారణములు, ఉద్బోధకములుకాగా అల్లసాని పెద్దన్నకు 'రమణీప్రియదూతిక తెచ్చియిచ్చు కప్పురవిడె మాత్మకింపయిన భోజనమూ యెలమంచ" ముంటేగాని కవిత్వం రాదట! కావ్య ప్రయోజనం చాలవరకు ప్రభువుల సంతోషము, కవుల ఉదరపోషణ అయిపోయింది. రాక్షసి తంగడి యుద్ధంతో భాషాచరిత్రలో క్షీణయుగం ప్రారంభమై, సారస్వతగుణం నీరసించింది. విజయనగరం నుండి ఆంధ్ర సరస్వతి దాక్షిణాత్యనాయక రాజ్యాల నాశ్రయించింది. సామ్రాజ్య విచ్ఛిన్నంతో సుల్తానులదాడులతో ప్రజలలో నైతిక దౌర్బల్యం చోటుచేసుకున్నది. భావనాపటిమ సన్నగిల్లింది. ప్రక్రియలో వైవిధ్యం ఉన్నప్పటికీ శబ్దచిత్రణపై దృష్టినిలిచిన గారడీ కవిత్వం ఎక్కువయింది. పచ్చి శృంగారం మితిమీరింది.

నాచన సోమునితో విజయనగర ఆంధ్ర భాషాచరిత్ర ప్రారంభమవుతుంది. ఇతడు అష్టభాషామహాకవి; కవిసార్వభౌముడు. రెండో బుక్కరాయలు ఈతనికి పంచాకల దిన్నెను అగ్రహారంగా యిచ్చి (క్రీ.శ. 1344) సత్కరించినాడు. ఈతడు తన ఉత్తరహరి వంశాన్ని హరహరదేవునకు అంకితం చేసినాడు. "పరిహాసాస్పదవాదమోద మదిరా పానంబునన్ మత్తులై హరి మేలంచు హరుండు మేలనుచు" శైవవైష్ణవులు చేసే వాదోపవాదాలను నిరసించినాడు. ఎర్రాప్రగడకు సమకాలికుడై ఆతనితోబాటు పురాణాన్ని అలంకారిక శైలితో నింపినవాడు. కవితాగుణంలో కవిత్రయం తరువాత నెన్నదగినవాడు.

పదిహేనో శతాబ్దంలో విజయనగరంలోకంటె ఉదయగిరిలోని గజపతుల ఉద్యోగులనుండి తెనుగుభాషకు ఎక్కువ ఆదరం లభించింది. క్రీ.శ. 1470 ప్రాంతంలో ఉదగిరినేలే పూసపాటి బసవరాజుకు దూబగుంట నారాయణ కవి 'పంచతంత్రం' అంకితం చేసినాడు. నారాయణకవి గూడ హరిహరదేవుని భక్తుడే. బసవరాజుమంత్రి పెనరువాయ గంగన్నకు దగ్గుపల్లిదుగ్గన నాసికేతోపాఖ్యానాన్ని నంది మల్లయ, ఘంట సింగయలు, ప్రబోధ చంద్రోదయాన్ని అంకితమిచ్చి నారు. సంస్కృత నాటకాన్ని తెలుగుకావ్యంగా మొట్టమొదట రచించింది ఈ జంట కవులే.

సాళువ నరసింహుని కాలంలో విజయనగరాస్థానంలో తెలుగుభాష నిల దొక్కుకున్నది. పిల్లలమర్రి పినవీరభద్రుడు జైమినీ భారతాన్ని తెనిగించి రాయలకు అంకితం చేసినాడు. శాకుంతల నాటకాన్ని శృంగార శాకుంతలమనే పేర కావ్యంగా వ్రాసినాడు. బహుశా మల్లయ సింగయజంటకవులీతనికి ఆదర్శ మయివుంటారు. పినవీరభద్రుడు 'వాణి నారాణి' అని చెప్పుకొన్నాడట! నరసింహ రాయలచే అగ్రహారాదులు పొందిన ప్రోలుగంటి చెన్నమంత్రి అష్టభాషాకవి, నారసింహ పురాణాన్ని ద్విపద కావ్యంగా, బాలభారతాన్ని వచనంగా, విష్ణుపురాణంలోని సౌభరి చరిత్రను యక్షగానంగా వ్రాసినాడు "తెలుగు భాషలో ఇప్ప టికి పేరు తెలిసిన ప్రప్రథమ యక్షగానంగా సౌభరిచరిత్ర, దాని రచయితగా ప్రోలుగంటి చెన్నయమంత్రి ఆంధ్రసాహిత్య చరిత్రలో ఒక విశిష్టస్థానాన్ని అలంకరిస్తారు" (ఆరుద్ర) బహుశా ఉదయగిరిని సాళువ నరసింహరాయలు ఆక్ర మించిన తరువాత మల్లయ సింగయ జంటకవులు తుళువ నరసనాయకుని ఆశ్ర యించి ఆతనికి అంకితంగా వరాహపురాణం చెప్పినారు. నరసింహరాయల కాలా నికే తాళ్ళపాక అన్నమాచార్యులు తిరుపతి చేరి పద రచన ప్రారంభించినాడు.

ఇదేకాలంలో తెలంగాణా ప్రాంతంలో ఇద్దరు ప్రసిద్ధ కవులు కన్పిస్తారు. నాడు ఓరుగల్లును పాలించే చితాప్‌ఖాన్ మంత్రియైన ఎల్లపెద్దను ఆశ్రయించి చరిగొండ ధర్మన్న 'చిత్ర భారతం' రచించినాడు. ఇతడు 'శతలేఖినీ సుర త్రాణ' బిరుదం ధరించినాడు. బహుశా ఇతనికి సమకాలికుడే కొరవి గోపరాజు 'సింహాసనద్వాత్రింశత్సాలభంజిక'ను హరిహరునకు అంకితం చేసినాడు. "వేపోకల బోనియట్టి సిరిపుట్టిన ఇంటికి ఓరుగంటికిన్'' అన్న ఈతని వర్ణనను బట్టి క్రీ.శ. 1500 ప్రాంతానికి ఓరుగల్లు పూర్తిగా ధ్వంసం కాలేదని తెలుస్తుంది.

కృష్ణరాయలు సింహాసనం ఎక్కడంతో కొత్త శకం ఆరంభమయింది. అతడు కవితాప్రావీణ్య ఫణీశుడు; సాహితీసమరాంగణ సార్వభౌముడు; ఆంధ్ర భోజుడు, అతని భువన విజయసభను అలంకరిస్తూ అష్టదిగ్గజాలనే కవులున్నట్లు ప్రసిద్ధి. వీరిలో సంస్కృతాంధ్రకర్ణాట భాషాకవులున్నారని భావించడం సమం

జనం. కాని అష్టదిగ్గజాలు ఆంధ్రభాషాకవులేనని సంప్రదాయం. ఆ కవులు: అల్లసాని పెద్దన, నంది తిమ్మన; మాదయగారి మల్లన, ధూర్జటి, అయ్యలరాజు రామభద్రుడు, తెనాలి రామకృష్ణుడు, పింగళి సూరన, భట్టుమూర్తి అని పండితుల అభిప్రాయం. వీరిలో పెద్దన, తిమ్మనలు మాత్రమే తమ కృతులను రాయలకు అంకితం ఇచ్చినారు. పెద్దన ఆస్థానకవి, ఆంధ్రకవితాపితామహుడు; ప్రబంధ పరమేష్ఠి. అతడంటే రాయలకు అపారమైన అభిమానం. పెద్దన చేతిలో ప్రబంధ ప్రక్రియ సర్వాంగసుందరంగా రూపొందింది. అందుచేతనే ''స్వారోచిష మనుసంభవం'' తెలుగులో ప్రథమప్రబంధంగా ప్రసిద్ధి చెందింది. నంది తిమ్మన ప్రబంధం "పారిజాతాపహరణం." ఈ రెండు ప్రబంధాలు బహుశా కళింగదైత్రయాత్ర అనంతరం రాయచూరు యుద్ధానికి పూర్వం రాయలు అంకితం పొందివుంటాడు. మిగిలిన కవులు రాయలను స్మరించనైనా లేదు. మాదయ్యగారి మల్లన్న రాయలకు సమకాలికుడే కాని, తన "రాజశేఖరచరిత్ర"ను కొండవీటిసీమ నేలే నాదెండ్ల అప్పరుసుకు అంకితం చేసినాడు. అయితే 'రాయ వాచకం' ప్రకారం మల్లన అష్టదిగ్గజాల్లోనివాడే "రాజుల్ మత్తులువారిసేవ నరక ప్రాయంబు"అని ధూర్జటి తన'శ్రీకాళహస్తీశ్వరశతకము''శ్రీకాళహస్తీశ్వర మహాత్మ్యము'లను తన ఇష్టదైవానికి అంకితం ఇచ్చినాడు ధూర్జటి రాయల ఆస్థానంలో ఉన్నట్లు కొన్ని చాటువులున్నాయి. అంతేగాక తన ''కృష్ణరాయవిజయ" కావ్యంలో కుమార ధూర్జటి కృష్ణరాయలు ధూర్జటిని ఆదరించినట్లు చెప్పినాడు. అయ్యలరాజు రామభద్రుడు "రామాభ్యుదయ" కావ్యాన్ని గొబ్బూరు నరస రాజుకు అంకితం చేసినాడు (క్రి. శ. 1550). నరసరాజు అళియ రామరాయల మేనల్లుడు. రామభద్రుడు దిగ్గజాల్లో ఉండడానికి అవకాశం తక్కువ; అయితే దిగ్గజాల్లోనివాడు కృష్ణరాయల సకల కథాసారం తెనిగించిన పుత్తేటి రామభద్రుడయి వుండవచ్చునని కొందరి అభిప్రాయం పింగళి సూరన్న తెలుగు సాహిత్య చరిత్రలో విశిష్టస్థానం ఆక్రమిస్తాడు. కృష్ణరాయల కాలంలో అతడు బాలుడై వుండవచ్చు. అతని మొదటికావ్యం 'రాఘవ పాండవీయం' తెలుగు భాషలో మొదటి ద్వ్యర్థికావ్యం. అకువీటి పెదవెంకటాద్రికి అంకితం. రెండోది 'అపూర్వ కథాసంవిధానవైచిత్రి'తో రచించిన కళాపూర్ణోదయం. ఇది ''పద్యంలో నవల'' అని విమర్శకుల అభిప్రాయం; నంద్యాల ప్రభువు కృష్ణభూపతికి అంకితం. కృష్ణభూపతి అరవీటి వంశస్థుడు. అళియ రామరాయల దూరపు బంధువు. మూడోది 'ప్రభావతీ ప్రద్యుమ్నం'. రామకృష్ణుడు రాయల ఆస్థానంలో ఉన్నట్లు సూచించే చాటువుల్లో ఎంత సత్యం ఉందో అనుమానం. అతని అసలు పేరు గార్లపాటి రామలింగయ్య; తెనాలి స్వగ్రామం; శైవకుటుంబంలో జన్మించినాడు. నాదెండ్ల గోపరసుకు మంత్రియైన ఊర దేచయ్యకు అంకితంగా ఉద్భటారాధ్య

చరిత్ర చెప్పినాడు. విజయనగరంలో వైష్ణవం ప్రబలంగా ఉన్నందున రాయల అభిమానం సంపాదించడానికి వైష్ణవం స్వీకరించి రామకృష్ణుడై వుంటాడని ఒక అభిప్రాయం. వైష్ణవుడై వ్రాసిన మొదటి గ్రంథం 'ఘటికాచలమాహాత్మ్యం.' అనంతరం 'పాండురంగమాహాత్మ్యాన్ని' విరూరి వేదాద్రికి అంకితం ఇచ్చినాడు రాష్ట్రోద్యోగి దగ్గర వేదాద్రి రాయసంగా వుండేవాడు. భట్టుమూర్తి వసుచరిత్ర తరువాతనే (క్రీ.శ 1580) పాండురంగమాహాత్మ్యం వెలువడిందనడానికి అంతరంగికంగా సూచన ఉంది. భట్టుమూర్తి మొదటి గ్రంథం "కావ్యాలంకార సంగ్రహం" లేక నరసభూపాలీయం క్రీ.శ. 1557 ప్రాంతంలో ఓరగల్లు ప్రభువైన పోచిరాజు నరసరాజుకు అంకితం. నరసరాజు అళియరామరాయలి మేనల్లుడు. ఈ కావ్యం అవతారికనుబట్టి భట్టుమూర్తి ఉద్దండపండితుడని బహుముఖ ప్రజ్ఞాశాలి అని తెలుస్తుంది అనంతరం రామరాయల ఆశ్రయం పొంది భట్టుమూర్తి రామరాజభూషణుడయినాడు. రాక్షసి తంగడి యుద్ధానంతరం తిరుమలరాయలతో పెనుగొండ చేరినాడు. కేవల కల్పనాకథలు పీడి అవారిత కల్పనా విశేషంతో పూర్వవృత్తమైన "వసుచరిత్ర"ను సానబట్టిన జాతిరత్నంగా తీర్చి కవిత్వంలో సంగీతాన్ని మేళవించి రాయలకు అంకితం ఇచ్చినాడు. రామరాజ భూషణుడుగానీ, రామకృష్ణుడుగానీ రాక్షసి తంగడియుద్ధాన్ని విజయనగర దుస్థితినీ తలవకపోవడం ఆశ్చర్యం. భట్టుమూర్తి చివరిరచన "హరిశ్చంద్ర నలోపాఖ్యానం" ద్వ్యర్థికావ్యం.

నవరత్నాలనే సంస్కృతకవులు చంద్రగుప్త విక్రమాదిత్యుని కొలువులో ఉండే వారన్న సాంప్రదాయంలో వలెనే అష్టదిగ్గజ సంప్రదాయంలో కూడ చారిత్రక సత్యం లేదు. అయితే రాయలు స్వయంగా మహాకవి. 'విష్ణుచిత్తీయం' అనే నామాంతరం ఉన్న ఆముక్తమాల్యదను తిరుపతి వేంకటేశ్వరునకు అంకితంగా చెప్పినాడు. తెలుగులోని పంచకావ్యములలో ఒకటి ఆముక్తమాల్యద. అష్టదిగ్గజాల్లో లేని కవులు రాయలకాలంలో ఉన్నారు. వారిలో కొందర్ని రాయలు ఆదరించినాడు. కవికర్ణరసాయన కావ్యనిర్మాత సంకుసాల నరసింహకవి; రాధామాధవ కృతికర్త చింతలపూటి ఎల్లన ఎన్నదగినవారు. ఎల్లనకు 'రాధామాధవ కవి' అనే బిరుదం రాయలు ఇచ్చినాడట. కొండవీటిరాజ్యంలో ఉద్యోగియైన నాదెండ్ల గోపరుసు 'కృష్ణార్జున సంవాదం' పేర గయోపాఖ్యానం ద్విపదలో వ్రాసినాడు. ఉదయగిరిపాలకుడైన కంపరాయలు మనుమంచి భట్టుచే 'అశ్వలక్షణసారం' అంకితం పొందినాడు. అన్నమాచార్యుల కుమారుడు పెదతిరుమలయ్య రాయల కాలంవాడే. ఈ విధంగా అపారమైన సాహిత్య పరిశ్రమ జరిగినందునే కృష్ణరాయలి కాలం తెలుగుభాషా చరిత్రలో స్వర్ణయుగంగా ప్రసిద్ధమయింది.

కృష్ణరాయల మరణంతో చెలరేగిన వారసత్వ యుద్ధాలవల్ల విజయనగరంలో సారస్వత పరిశ్రమ క్షీణించి పింగళి సూరనాది మహాకవులు చిన్న చిన్న ప్రభువుల నాశ్రయించవలసి వచ్చింది. రాక్షసితంగడి యుద్ధానంతరం అరవీటివంశచరిత్ర సయితం అంతర్యుద్ధాలతో సుల్తానుల దాడులతో నిండి సారస్వతపోషణకు పరిస్థితులు అనుకూలించలేదు. అయితే అరవీటివంశ కాలంలోనే దక్షిణాన నాయకరాజ్యాలు బలపడి సుమారొక శతాబ్దికాలం ఆంధ్రభాషకు ప్రధాన రంగస్థలాలయినాయి. తెలుగు తమిళ నాయకులేగాక మహారాష్ట్ర ప్రభువులుసయితం తెలుగునాదరించినారు. దక్షిణదేశంలో ఆంధ్రం అధికారభాష అయినదా అనిపిస్తుంది. అందుచే ఆంధ్రభాషా చరిత్రలో ఈ యుగాన్ని నాయకరాజ యుగమని లేదా దాక్షిణాత్య యుగమని వ్యవహరిస్తారు.

దాక్షిణాత్య యుగానికి ఆంధ్రవాఙ్మయంలో కొన్ని ప్రత్యేక లక్షణాలు కన్పిస్తాయి. అన్యభాషల ప్రజలమధ్య వర్ధిల్లడంచే తెలుగులో తమిళ, కన్నడ, మహారాష్ట్ర పదాలు; పాశ్చాత్య భాషాపదాలు ఎక్కువగా ప్రవేశించినాయి. శివకవుల యుగంలోవలె ప్రజలకు సన్నిహితములైన జాతీయాలతో పలుకుబడులతో చమత్కారాలతో కావ్యాలు తయారయినాయి. నాటి సారస్వతంలో వైవిధ్యం ఎక్కువగా గోచరిస్తుంది. ప్రబంధాలు వెలువడినాయి. సంగీత, సాహిత్యాలు మేళవించిన గేయాలు, దృశ్యకావ్యశాఖ అయిన యక్షగానాలు అసంఖ్యాకంగా తయారయినాయి. వచన వాఙ్మయం ఈ యుగంలోనే క్రమ పరిణామం పొందింది. తంజావూరు యక్షగానానికి, మదుర వచనానికి పేరొందినది. శాస్త్రవిషయాలమీద కూడ గ్రంథాలు రచించినారు. వనవప్ప అనే కవి "ఖడ్గలక్షణం" పేర 132 ఆయుధాలను వర్ణిస్తూ పద్యకావ్యం వ్రాసినాడు. నాటి వాఙ్మయంనిండా చారిత్రక సంఘటనలు, ఆర్థిక, సాంఘిక పరిస్థితులను గురించిన వివరాలు కన్పిస్తాయి. అయితే దాక్షిణాత్య కవులలో శృంగార, హాస్యరస ప్రియత్వం ఎక్కువ. విలాసవంతులైన ప్రభువుల అభిరుచినిబట్టి పచ్చి శృంగారాన్ని సృష్టించడమే వీరి కావ్యరచనకు ప్రయోజనం అయింది. కేవలం కళా దృష్టితో రచన సాగించినారనడానికి వారి రచనల్లో ఉత్తమ కళాఖండా లనదగిన కావ్యాలు కూడా అరుదుగా కన్పిస్తాయి. అందుచేత పింగళి లక్ష్మీకాంతంగారి మాటల్లో "ఆ కావ్యాల్లో పెక్కింటికి ధర్మసౌందర్య లోపం వాటిల్లింది. మరి కొన్నింటికి కథా నిర్మాణమున బిగువులేక సొంపు చెడినది" మరొకవైపున భావానికి, వర్ణనకుకూడ ప్రాధాన్యం ఇవ్వని కేవల శబ్ద వైచిత్రితోకూడిన గారడీ కవిత్వం తయారయింది. ఇట్టి కవిత్వంలో రేపూరు కాళహస్తి దేవుడు చాల సమర్థుడు. అతడు "చలజిహ్వాకాచలజిహ్వాకా చలాచలజిహ్వాకా రచనా విశేష నిపుణుడు, ఓష్ఠ్యనిరోష్ఠ్యవర్ణోదర్ణ కల్పనుడు, కఠినత్రిపాద సంఘటన కుశలుడు."

నాయక రాజ్యాలు ఏర్పడడానికి పూర్వమే దక్షిణదేశంలో ఆంధ్రభాష ప్రవేశించింది. వీరకంపరాయల మధురావిజయ యాత్రలో పాల్గొని శ్రీరంగంలో దేవుని ప్రతిష్ఠించి దేశికాచార్యునిచే అభినందనలందుకొన్న జింజ్రిప్రభువైన గోపన మంత్రి తెలుగులో 'సింధుమతీ విలాసం' రచించినట్లు తెలుస్తుంది. అచ్యుత రాయల కాలంలో తిరువత్తూరు పాలిస్తున్న గోళ్ళ చినరామప్ప పచ్చకప్పురపు తిరువెంగళనాథునిచే 'చొక్కనాథ చరిత్ర'ను చెప్పించినాడు. ఇదే కాలంలో అరుణాద్రి మంగళం నివాసియైన జంగమదేవరకు అంకితంగా భద్రకవి లింగయ 'సానంద చరిత్ర'ను ద్విపదగా రచించినాడు..

దక్షిణదేశంలో ఈ విధంగా ప్రవేశించిన ఆంధ్రసారస్వతోద్యమం నాయక రాజ్యా లేర్పడడంతో బహుముఖంగా వికసించింది. నాయకరాజులందరిలో భాషా పోషణలో రఘునాథ నాయకునకు ఎవరూసాటిలేరు.తంజావూరునకాతడు శ్రీకృష్ణ రాయలు. రఘునాథుడు అళువుగా పారిజాతాపహరణంచెప్పి తండ్రిచేత కనకాభి షేకం చేయించుకున్నాడట. అతని ఆస్థానంలోని తెలుగు కవులలో చేమకూర వెంకటకవి అగ్రగణ్యుడు; సారంగధరచరిత్ర, విజయవిలాస కావ్యాలను రఘు నాథునకు అంకితం ఇచ్చినాడు. తెలుగుభాషలోని మార్దవాన్నీ లాలిత్యాన్నీ వెంకట కవి విజయవిలాసంలో పదగట్టినాడు. కృష్ణాధ్వరి తన నైషధపారిజాతం అనే శ్లేషకావ్యాన్ని రాయలకు అంకితం చేసినాడు. రఘునాథుడు వాల్మీకచరిత్రాది పెక్కు కావ్యాలను ద్విపదలను, యక్షగానాల్ని రచించినాడు. ఈతని ఆస్థానంలో రామభద్రాంబ, మధురవాణి అనే కవయిత్రులుండేవారు. మధురవాణి రాయలచే కనకాభిషేకం పొందింది. రఘునాథ నాయకుని కొడుకు విజయరాఘవుడు అష్ట భాషాధురీణుడై సాహిత్యరాయ పెండేరమును ధరించి అనేక యక్షగానాలను, పదాలను, కీర్తనలను రచించినాడు. ఈతని రఘునాథాభ్యుదయం పద్యగద్యాత్మ కమై తెలుగు నాటకాల్లో మొదటిదిగా ప్రసిద్ధి. చెంగళ్వ కాళకవిని విజయరాఘవుడు పోషించినాడు. విజయరాఘవుని ప్రియురాలు రంగాజమ్మ మన్నారుదాస విలాసాది యక్షగానాలు రచించింది. శృంగార రసభరితాలైన పదరచనలో సాటి లేని క్షేత్రయ్య విజయరాఘవుని ఆదరణకు పాత్రుడై అతనిపై వేయి పదాలు జెప్పినాడు. విజయరాఘవుని కొడుకు మన్నారుదాసు సయితం పెక్కు యక్ష గానాల రచయిత.

తెలుగు నాయకుల అనంతరం తంజావూరు నేలిన మహారాష్ట్రులు కూడ తెలుగు కవులై కవులను పోషించినారు. శహాజీ (1684 - 1712) తెలుగులో ఇరవై నాటకాలు రచించినాడట! ప్రతాపసింహుని (1739 - 62) ప్రియురాలు ముద్దుపళని 'రాధికాసాంత్వనము'న పచ్చి శృంగారాన్ని వెర్రితలలు వేయిం చింది. రెండో శరభోజికాలంలో (1798 - 1833) త్యాగరాజు ఉండేవాడు

(1764 - 1846). ఇతనిది కాకర్ల వంశం. ఈతడు శొంఠి వేంకటరమణయ్య శిష్యుడు. రామభక్తిపరుడు. భక్తి పారవశ్యంలో శ్రీరామునిపై త్యాగయ్య చెప్పిన కృతులు సుమారు వేయికి పైగా ఉన్నాయి. ఈ కృతులు కర్ణాట సంగీతానికి ప్రాణప్రదాలు.

మధురలో విశ్వనాథుని స్థానాపతి "రాయవాచకం" అనే వచన చరిత్ర ద్వారా తెలుగు భాషా సేవకు ప్రారంభం చేసినాడు. "విజయనగర వృత్తాంతము సుజనులచే విన్న యట్టి సూనృతవాక్కుల్, ప్రజలకు తేటపడంగా, సృజియించితి కృష్ణరాయశేఖర చరితల్" అని చెప్పుకున్నాడు. ఇతడు రెండవ కృష్ణప్ప నాయకుని తమ్ముడు విశ్వనాథుని స్థానావతియని చరిత్రకారుల నిర్ణయం. ఇంచు మించు ఇదే కాలంలో ఏకామ్రనాథుడు "ప్రతాప చరిత్ర" అనే పేర కాకతీయుల చరిత్ర వ్రాసినాడు. ప్రతాప చరిత్ర ఆధారంగా కాసె సర్వప్ప సిద్ధేశ్వర చరిత్రను ద్విపదలో రచించినాడు. తిరుమలనాయకుని కాలంలో అతని కొడుకు ముద్దళ గిరికి అంకితంగా లింగనమఖి కామేశ్వర కవి సత్యభామా సాంత్వనం చెప్పినాడు. ధేనుమాహాత్మ్యం అనే వచన కావ్యం కూడ రామేశ్వర కవి రచనయే. ఇదే కాలంలో వెలిదండల వెంకటపతి శృంగార రాధామాధవం రచించినాడు. విజయ రంగ చొక్కనాథుని కాలంలో మధురలో ఆంధ్ర భాష బాగా వికసించింది. చొక్కనాథుడు స్వయంగా గ్రంథకర్త. శ్రీరంగమాహాత్మ్యం, మాఘమాహాత్మ్యం అనేవి ఈతని వచన రచనలు, ఇతని సామంతుడైన సముఖము వెంకటకృష్ణప్ప నాయకుడు వచన జైమినీ భారతానికి, రాధామాధవ, అహల్యాసంక్రందన పద్య కావ్యాలకు కర్త. వీరి సమకాలికుడైన శేషము వెంకటపతి తారాశశాంక కావ్యాన్ని వంగల సీనయామాత్యునకు అంకితం చేసినాడు

పుదుక్కోటనేలిన రఘునాథతొండమాన్ పార్వతీ పరిణయం అనే తెలుగు ప్రబంధాన్ని రచించినాడు. ఈ ఆస్థానములోనే నుదురుపాటి కవివంశం వర్ధిల్లింది. వీరిలో నుదురుపాటి వెంకన్న తెలుగులో ప్రథమకోశం అనదగిన "ఆంధ్రభాషార్ణవం" తయారు చేసినాడు. మైసూరు-ప్రభువైన చిక్కరాయలి (1672-1704) దళవాయి కళువె వీరరాజు మహా భారతాన్ని తెలుగు వచనంలో వ్రాసినాడు.

సాహిత్యానికితోడు సంగీత, నాట్య, నాటక కళలను విజయనగరాధీశులు ప్రోత్సహించినారనడానికి నాడు వెలువడిన సంగీతశాస్త్ర గ్రంథములే నిదర్శనం. విద్యారణ్య మహర్షి తన 'సంగీతసారం'లో పెక్కు రాగాలను వర్ణించినాడు. కృష్ణరాయలు 'కృష్ణ' అనే విద్వాంసుని దగ్గిర వీణను అభ్యసించినట్లు తెలు స్తుంది. రామరాయలు తన కుమార్తెలకు రామయ మంత్రిచే సంగీతం నేర్పించి నాడు. రామయ మంత్రి 'స్వరమేళ కళానిధి' కర్ణాటక సంగీతానికి వేదం వంటిది.

సంగీత నాట్యకళలకు వేశ్యలు నిదులై దేవతా ఉత్సవాల్లో సాంఘికమైన వివాహాది శుభ కార్యాల్లో పాల్గొనేవారు. నాట్యంలో పలురకాలుండేవి. పెద్ద దేవాలయాల్లో ప్రత్యేకించి నాట్యమండపాలు నిర్మించినారు. "శుద్ధ పద్ధతి చిత్ర పద్ధతి ఘనదేశి పద్ధతులను.. ఆదిగాగల్గు నృత్య నృత్త్యైక ముఖ్య నాట్య విధములు సూచించి నయమొసర్ప జనులకెల్లను లోచనోత్సవముగాగ నాడె" అని మల్హాణచరిత్ర. మృదంగం, ఆవంజం, దండెతాళం, కిన్నెర, వీణ, ముఖవీణ, మౌరి, గౌరు, గుమ్మెట, డక్కి, చక్కి, చయ్యంకి మొదలైన వాయిద్యాలను కృష్ణరాయలు పేర్కొన్నాడు. అన్నింటిలో వీణకు జనాదరణ హెచ్చింది నాటకాలు ఆడడం ఎక్కువయింది. మాచుపల్లి కైఫీయతునుబట్టి వీరనరసింహరాయలికాలానికే కూచిపూడి భాగవతులు దేశసంచారం చేస్తూ నాటకాలు ఆడుతుండేవారు. నాట్య సంగీతాలకు ప్రాధాన్యం ఉన్న యక్షగానాలకు ఆదరణ హెచ్చుగా కన్పిస్తుంది. విజయనగరాధీశులు ప్రతి సంవత్సరం జరిపిన వసంతోత్సవాలలో ఈ కళకు ప్రోత్సాహం లభించింది.

చిత్రలేఖనాన్ని గురించిన ప్రస్తావన గూడ వాఙ్మయంలో ఎక్కువగా కన్పిస్తుంది. సంగీతంతోబాటు చిత్రలేఖనాన్ని స్త్రీలు అభ్యసించేవారు. "పసిడి గచ్చుమర సోపానముల్ మూట దుంగితయు, విశాంతయు, చిత్రితయునైన సభ" అని ఆముక్తమాల్యద. గచ్చుచేసి మాలికతో చిత్రాలు వ్రాసేవారు. అంతః పురంలో నరసానాయక, కృష్ణరాయల నిలువెత్తు వర్ణచిత్రాలున్నట్లు పేస్ వ్రాసినాడు. నాట్యమందిరాల గోడలపై చిత్తరువులు వ్రాసేవారని తెలుస్తుంది. చిత్రాలలో ఇతిహాస, పురాణగాథలు, కృష్ణలీలలు, రతీ మన్మథలీలలతో బాటు సామాజిక జీవిత దృశ్యాలుకూడా వుండేవి. హంపీ విరూపాక్షస్వామి ఆలయ మండపంలోను, లేపాక్షి ఆలయాలలోను ఈ యుగ చిత్రాలను చూడవచ్చు.

విజయనగరంలో, దక్షిణదేశం అంతటా విరివిగా ఆలయ నిర్మాణం జరిగింది. సామ్రాజ్య విస్తృతికి, ఐశ్వర్యానికి నాటి ఆలయాలు నిదర్శనాలుగా వుండేవి. రాజ్యం తొలిదశల్లోని ఆలయాల్లో చాళుక్యశైలి స్పష్టంగా కన్పిస్తుంది. క్రమంగా శైలిలో చోళశైలీ సంప్రదాయాలు చోటు చేసుకున్నాయి. సువిశాల మైన ప్రాంగణంలో ఎత్తైన గోపురాలతోడి ప్రాకారాల మధ్య గంభీర విమానా లతో దేవీఆలయంతో రంగ, కళ్యాణమండపాలతో విజయనగరాలయం సర్వాంగ సుందరంగా రూపొందింది. సాధారణంగా నాటి మండపాలు విశాలంగా వుండి 'సహస్రస్తంభ మండపాలు'గా ప్రసిద్ధి చెందినాయి. ఈ స్తంభాలను ఏకశిలతో వ్యాళ అశ్వారూఢులైన యోధులు స్తంభం నుండి వెలికి దుముకుతున్నారా అన్న ట్లుగా మలిచేవారు. విజయనగర ఆలయాల్లో ఎక్కువ భాగం రాజధానీ నగరం (హంపీ)లోనే ఉన్నాయి. వానిలో విరూపాక్ష, విఠల, హజార రామాలయాలు

సుప్రసిద్ధములు. హజార రామాలయ కుడ్యాలపై రామాయణ గాథలను శిల్పీకరించినారు. విజయనగర ఆలయ వాస్తువుకు విఠలాలయం మకుటప్రాయం. ఇందలి కళ్యాణమండపంలో సప్తవిభాగాలుగా మలచిన ఏకశిలా స్తంభాలు సప్తస్వరా లీనుతాయి. ఈ మండపానికి ఎదురుగా రాతిరథం ఉంది. ఈ రథమూ వినాయక, లక్ష్మీనరసింహ విగ్రహాలూ ఒకే శిలలో చెక్కిన పెద్ద శిల్పాలు. ఇవి గంభీర సౌందర్యానికి నిదర్శనలు. విజయనగర మందిరాల్లో - ముఖ్యంగా పద్మమహలులోనూ పట్టపు ఏనుగుల శాలలోనూ ముస్లిం వాస్తు ప్రభావం స్పష్టంగా కన్పిస్తుంది. ఆంధ్రదేశంలో పుష్పగిరి, తాడిపత్రి, లేపాక్షి, చంద్రగిరి, పెనుగొండ మొదలైనచోట్ల విజయనగర ఆలయాలున్నాయి. విజయనగరాధీశులు తిరుపతి, శ్రీశైలం, కాళహస్తి ఆలయాలకు గోపురాలు సమకూర్చినారు. అహోబలం, మార్కాపురం, సింహాచలాలలో మండపాదులు నిర్మించినారు వీనిలో తాడిపత్రి రామలింగేశ్వర ఆలయ గోపురాలు విఠలాలయ గోపురాల కంటె సుందరములైనవని విమర్శకుల అభిప్రాయం తాడిపత్రి ఆలయాలు ఉబ్బెత్తు శిల్పసంపదకు, లేపాక్షి వీరభద్రాలయం వర్ణచిత్రాలకు నిధులు. విఠలాలయంలోని ఏకశిలా రథం వంటిది తాడిపత్రి ఆలయంలోకూడ ఉంది. 'లేపాక్షి బసవన్న' పెద్దశిల్పం. 'సుందరమైన శిల్పసంపదకు బేలూరు, హళెబీడుల ఆలయాలతో పోటీగా విజయనగరాలయాల్లో నిలువగలిగింది ఒక తాడిపత్రియే' నని పెర్గూసన్ అభిప్రాయం. యస్. డబ్ల్యు. వాక్‌స్టాప్‌మాటల్లో 'నిధులు కట్టిన శిల్పసంపద....వస్తువిన్యాస రచనలో శిల్పసామర్థ్యంలో ఆత్మవిశ్వాసంలో విజయనగర శిల్పానికి ఈడైన శిల్పం లేదని మనం చెప్పవచ్చు' అన్నాడు.

## కొన్ని ఉపయుక్త గ్రంథాలు


1. Arudra — సమగ్ర ఆంధ్ర సాహిత్యం, 6, 7, 8, 9
2. Desai, P.B. (ed) — History of Karnataka
3. Habib (ed) — Comprehensive History of India V
4. Heras — Beginnings of Vijayanagara History.
5. Mahalingam — Administration and Social life under Vijayanagara
6. Ramachandraiah — Studies in Sri Krishnadevaraya
7. Sastri & Venkataramanaiah — Further Sources of Vijayanagara History.
8. Sathianathiyar — The Nayaks of Madura
9. Sewell R. — Forgotten Empire of Vijayanagara
10. Sherwani & Joshi — History of Medieval Deccan I, II
11. Sherwani — History of the Qutab shahis Dynasty

# కుతుబ్ షాహీ యుగం

కాకతీయ రాజ్య పతనంతో ఆంధ్రదేశంలో ముస్లిం అధికార స్థాపన జరిగింది. ఆరవీటి, ముసునూరి, రెడ్డినాయకులు నడిపిన 'స్వాతంత్ర్య ఉద్యమ' ఫలితంగా క్రీ.శ. 336 నాటికి ఆంధ్రదేశం నుండి ముస్లిం అధికారం అస్తమించింది. కాని క్రీ.శ. 1347 లో గుల్బర్గాలో బహమనీ రాజ్యస్థాపన కాలం నుండి ఆంధ్ర నాయక రాజ్యాలకు ముస్లిం ప్రమాదం ఏర్పడి, క్రమంగా తెలంగాణా, తీరాంధ్ర ప్రాంతాలు ముస్లిముల వశమయినాయి. క్రీ.శ. 1500 సం॥ ప్రాంతానికి బహమనీ రాజ్యం విచ్ఛిన్నమై ఐదు స్వతంత్ర ముస్లిం రాజ్యా లేర్పడినాయి. వానిలో గోల్కొండ రాజధానిగా పాలించిన కుతుబ్‌షాహీ వంశస్థులు రాకాసిగండి యుద్ధానంతరం క్రమంగా విస్తరించి ఆంధ్రదేశాన్ని సమైక్యం చేసి సుమారొక శతాబ్దంన్నర కాలం పాలించి ఆంధ్ర సంస్కృతిని పోషించి తెలుగు ప్రజల ఆదరాభిమానాలు బడసినారు. క్రీ.శ. 1687 లో కుతుబ్‌షాహీ రాజ్యం మొగలాయీల వశమై దక్కన్ సుబాలో అంతర్భాగమయింది. నాటికే ఆంగ్లేయులు దేశంలో స్థావరా లేర్పరచుకొన్నారు. పాశ్చాత్య సంస్కృతీ ప్రభావం ప్రజల్లో వ్యాపించసాగింది. అందుచే కుతుబ్‌షాహీలతో ఆంధ్రుల చరిత్రలో మధ్యయుగం అంతరించి ఆధునిక యుగారంభమైనదని నిర్ణయిస్తారు.

## కుతుబ్‌షాహీలు

### సుల్తాన్ కులీ

గోల్కొండ రాజ్యస్థాపకుడైన సుల్తాన్ కులీ మధ్యఆసియాలోని కారాకునీల్ తెగకు చెందినవాడు. హమ్దన్ (దక్షిణ ఇరాన్) కేంద్రంగా వీరు మధ్య ఆసియా రాజకీయాల్లో ఒక శతాబ్ది కాలం ప్రముఖపాత్ర వహించినారు. సుల్తాన్ కులీ తండ్రి షేర్ కులీ, తల్లి మలిక్‌సాలె. అకునేవ్ తెగతోటి సంఘర్షణలో కారాకునీల్ తెగ ప్రాబల్యం కోల్పోయి రాకుమారులకు ప్రాణాపాయం ఏర్పడ్డ పరిస్థితుల్లో సుల్తాన్ కులీ తన పినతండ్రియైన అల్లా కులీతో కలిసి భారతదేశానికి వచ్చినాడు. ఢిల్లీ సుల్తానేట్ క్షీణించి ఉత్తర భారత రాజకీయాలు ఆశాజనకం కానందున ఉభయులు బహమనీ రాజ్యం చేరినారు. నాటికే షియాబ్ ఉద్దీన్ మహమూద్ పాలనలో బహమని రాజ్యం కూడ అంత్యదశలోనే వుంది. కాని ఉత్తర

భారతదేశం నుండి మాత్రమేగాక అరేబియా, పర్షియా, టర్కిస్థాన్‌ల నుండి కాందిశీకులసంఖ్యాకంగా బిదర్ వస్తుండేవారు. కులీ బిదర్‌లో గుర్రాల వ్యాపారం చేయ నిశ్చయించినాడని, బానిసగా బహమనీ ఆస్థానంలో ప్రవేశించినాడనీ భిన్న అభిప్రాయాలున్నాయి. ఏమైనా అచిరకాలంలోనే తన పాండిత్యంతో ధైర్య శౌర్యాలతో సుల్తాన్ మహమూద్ అభిమానం సంపాదించి సుల్తాన్ కులీ ఆస్థాన ఉద్యోగి బృందంలో చేరి ఖవాస్‌ఖాన్ బిరుదం పొందినాడని తారిఖ్ ఇకుర్బియా మొదలైన స్థానిక కుతుబ్‌షాహీ చరిత్రవల్ల తెలుస్తున్నది.

సుల్తాన్ కులీ సమర్థుడైన సేనాపతి. బహమనీ రాజ్యంలో చెలరేగిన అలజడుల్లో మహమూద్‌షా పట్ల విధేయుడై అపారమైన సేవ చేసినాడు. దారి దోపిడి దొంగల వల్ల సామంత అవిధేయత వల్ల తెలంగాణా ప్రాంతాల్లో ప్రబలిన అరాజకం అణచి శాంతి నెలకొల్పినాడు. క్రీ. శ. 1487 లో బిదర్ నగరంలో దక్కనీ అఫాకీముస్లిం వర్గాల మధ్య తీవ్ర సంఘర్షణ జరిగి సుల్తాన్ ప్రాణానికే ప్రమాదం వాటిల్లగా అఫాకీ వర్గనాయకుడుగా కులీ మహమూద్‌షాను రక్షించినాడు. అనంతరం క్రీ శ. 1493లో గోవా పాలిస్తున్న బహాదూర్ జిలానీ తిరుగుబాటు చేసి జంబుఖండి దుర్గం కేంద్రంగా సుల్తాన్ సైన్యాలను ప్రతిఘటించినాడు. అతనితోటి యుద్ధంలో తెలంగాణా పాలకుడైన కుతుబ్ ఉల్ ముల్క్ దక్కనీ మరణించడంతో ధక్కనీ స్థానంలో మహమూద్‌షా కులీని నియమించినాడు. జంబుఖండితోబాటు మిరాజ్ మొదలైన దుర్గాలను పట్టుకొని, జీలానీ తిరుగుబాటును కులీ పూర్తిగా అణచినాడు. సుల్తాన్ సంతోషించి కులీకి కుతుబ్ ఉల్ ముల్క్ బిరుదమిచ్చి అతణ్ణి గోల్కొండ జాగీర్‌దార్‌గా చేసినాడు. కుతుబ్ ఉల్ ముల్క్ బిరుదమే కుతుబ్‌షా వంశనామమయింది.

గోల్కొండకు ప్రాచీనమైన చరిత్ర ఉంది. చాళుక్యయుగంలో ఈ ప్రాంతాన్ని మంగళవరం అనేవారని తెలుస్తుంది. కాకతీయులీ కొండపై దుర్గం నిర్మించినారు. ఈ కొండపై గోవులను మేపేవారనీ అందుచే దీనికి గోల్కొండ అనే పేరు వచ్చిందనీ ఒక అభిప్రాయం. క్రీ శ. 1496 లో జాగీర్దారయినప్పటి నుండి సుల్తానీ కులీ ఇచటి దుర్గాన్ని మరమ్మత్తు చేయించి రక్షణశ్రేణులు, పౌర జననివాస ప్రాంతాలు నిర్మించి దుర్భేద్యమైన దుర్గంగా ఆకర్షణీయమైన నగరంగా రూపొందించి తనకు రాజధానిగా చేసుకున్నాడు. క్రమంగా దక్షిణదేశంలో మిక్కిలి ఐశ్వర్యవంతమైన నగరమై సుమారు రెండు శతాబ్దాల కాలం గోల్కొండ దాక్షిణాత్యరాజకీయాలకు వాణిజ్యానికి సంస్కృతికి కేంద్రమయింది.

సుల్తాన్‌కులీ కూడ యూసఫ్‌ఆదల్‌షా (బిజాపూర్), అహమ్మద్‌నైజాంషా (అహమ్మద్‌నగర్) లతో బాటు క్రీ.శ. 1489 ప్రాంతములోనే స్వతంత్రించినాడని ఒక అభిప్రాయం వుందిగాని దానికి ఆధారంలేదు. క్రీ. శ. 1512లో అతడు

స్వతంత్రించినాడని మరొకవాదం. కాని క్రీ.శ. 1518 లో సుల్తాన్ మామూద్‌షా మరణించే వరకు కులీ అతనికి విధేయుడై యున్నట్లు గోల్కొండ దుర్గంలో నిజామీ మసీదు శాసనం సూచిస్తున్నది. కాబట్టి మామూద్‌షా మరణానంతరం క్రీ. శ. 1518 చివర్లో సుల్తాన్ కులీ స్వతంత్రించినాడు. స్వతంత్రించినప్పటికీ స్వతంత్ర ప్రతిపత్తి సూచించే 'షా' బిరుదం ధరించక 'కుతుబ్‌ఉల్‌ముల్క్' బిరుదుతోనే తృప్తిపడినట్లు తెలుస్తుంది. ప్రజ లాతణ్ణి ప్రేమతో 'బారెమాలిక్' (పెద్ద సర్దార్) అని పిలిచేవారు.

కులీ స్వతంత్రించినప్పుడు గోల్కొండ జాగీరు కోహిర్ ఓరుగల్లు మధ్య ప్రాంతానికి మాత్రమే పరిమితం. ఓరుగల్లునుండి తూర్పుతీరం వరకు గజపతుల సామంతుడుగా చితాబ్‌ఖాన్ పాలిస్తున్నాడు. తెలంగాణాలోని రాజకొండ, దేవర కొండ, నల్గొండ మొదలైన దుర్గాధిపతులు స్వతంత్రులు. క్రీ. శ. 1518-19 లో కృష్ణరాయలు కళింగ దండయాత్రలో చితాబ్‌ఖాన్‌తోసహా పెక్కుమంది దుర్గాధిపతులను జయించినాడుగాని అనంతరం వారాతని ఆధిపత్యం అంగీకరించ లేదు తీరాంధ్రంకూడ గజపతుల స్వాధీనమయింది. సుల్తాన్‌కులీ రాజ్యవిస్తరణ కాంక్ష ఉన్న మహాయోధుడు. తెలంగాణాన్ని తన పాలనలో సమైక్యం చేయాలని అతని కనీస ఆశయం. కాని, కృష్ణరాయల జీవితకాలంలో అది సాధ్యం కాదనే భావంతో రాజ్యవిస్తరణకు పూనుకొనలేదు. రాయల మరణానంతరం (క్రీ. శ. 1529) విజయనగరంలోని అంతఃకలహాలు అతనికి మంచి అవకాశమయినాయి.

కృష్ణరాయల మరణానంతరం తీరాంధ్రంపై గజపతి దండెత్తిన సమయం లోనే బహుశా కులీ కొండవీడుపై దండెత్తినాడుగాని, వెలుగోటి (గని) తిమ్మా నాయడు గోల్కొండ సైన్యాన్ని ఓడించి మరలించినాడు. అయితే, గోల్కొండ రాజ్యవిస్తరణ రాజకొండదుర్గాక్రమణతో ప్రారంభమయింది. అనంతరం దేవర కొండ, పానగల్లు, ఘనపుర దుర్గాలాతని వశమయినాయి. ఇస్మాయిల్ ఆదిల్షాతో ఘోర యుద్ధం జరిగిన తరువాత కోవిలకొండ కులీ స్వాధీనమయింది. ఈ యుద్ధా నంతరం అనతికాలానికే ఆదిల్‌షా మరణించినాడు. (క్రీ.శ. 1534) ఈ విజయా లతో కృష్ణానది వరకు పశ్చిమ తెలంగాణము కులీ వశమయింది. కులీ ఈ దండ యాత్రల్లో ఉన్న సమయంలో కివామ్ ఉఖాముల్క్ అనే తురుష్క సర్దారు ఎల్గందల, మలంగూర్ మొదలైన దుర్గాలను ఆక్రమించి తిరుగుబాటొనర్చినాడు. అతనికి బీరార్ సుల్తాన్ దర్యాఇమాద్ ఉల్‌ముల్క్ సహాయం వుంది. కులీ దండెత్తి, అతని వశంలో ఉన్న దుర్గాలను ఆక్రమించడమేగాక, రాంగీర్ యుద్ధంలో బీరార్ సైన్యాలను ఓడించి పారదోలినాడు. దీనితో ఉత్తర తెలంగాణా అధిక భాగం అతని పాలనలోకి వచ్చింది. హరిచంద్ తిరుగుబాటు నణచి నల్గొండను కులీ ఆక్రమించినాడు.

అనంతరం కులీ తూర్పు తెలంగాణంపై దృష్టి మరల్చినాడు. కొండపల్లి, ఇంద్రకొండ, ఏతగిరి దుర్గాధీశులను కూడగట్టుకొని బలవంతుడై చితాబ్‌ఖాన్ కులీ రాజ్య విస్తరణనరికట్టడానికి సన్నాహాలు చేస్తున్నాడు. అతనికి ఖమ్మమ్మెట్టు దుర్గం బలమైన కేంద్రంగా వుండేది. కులీ దండెత్తి చితాబ్‌ఖాన్ కూటమినోడించి ఖమ్మమ్మెట్టు నాక్రమించినాడు. చితాబ్‌ఖాన్‌కు సహాయంగా గజపతి కులీ నెదిరించినాడు. కాని, ఉభయులు గోదావరీ యుద్ధంలో పూర్తిగా పరాజయం పొందినారు. కృష్ణా - గోదావరీ డెల్టాలమధ్య తీరాంధ్రం గోల్కొండ రాజ్యంలో చేరింది.

సుమారు అర్ధశతాబ్దిపాటు విరామం లేకుండా యుద్ధాలు చేసి, కృష్ణానదికి ఉత్తరంగా ఉన్న తెలుగు ప్రాంతాలన్నింటిని చాలవరకు కులీ గోల్కొండ రాజ్యంలో తన పాలన కింద సమైక్యం చేసినాడు. ''నిశితఖడ్గధారినై అరవై డెబ్బయి దుర్గాలను స్వయంగా ఆక్రమించినా''నని చెప్పుకున్నాడు. కులీ షియా మతస్థుడు. నాటికే బీజాపూర్, అహమ్మద్‌నగర రాజ్యాలలో షియా మతం ప్రచారంలో వుంది. మత విషయాల్లో కులీ ఉదార భావాలున్నవాడు. నాటి రాజకీయాలదృష్ట్యా సున్నీయైన బహమనీ సుల్తాన్‌తో చేరి, బీజాపూర్‌తో పోరాడినాడు. అతని ఆస్థానంలో హిందువులు ఉన్నత పదవులు నిర్వహించినారు. అరవీటి రామరాయ లాతనికి కొంతకాలం కుడిభుజంగా ఉన్నాడు. కులీ చివరకు తొంబయియేండ్లు దాటిన వృద్ధుడై, కొడుకు జంషీద్ కుట్రకు క్రీ. శ 1543 లో బలి అయినాడు.

## జంషీద్ (1543 - 1570)

సుల్తాన్ కులీకి ఆర్గురు కొడుకులు. యువరాజైన హైదర్ కులీ తండ్రికి ముందే మరణించినాడు. రెండోవాడైన కుతుబ్‌ఉద్దీన్‌కు రాజకీయాల్లో శ్రద్ధలేదు, పాలనాదక్షుడు కూడ కాదు. తరువాతి ముగ్గురు జంషీద్, అబ్దుల్ కరీం, దౌలత్ కులీలు తండ్రి కాలంలోనే సింహాసనం కాంక్షించినారు.అబ్దుల్ కరీం తిరుగుబాటు చేసి బీజాపూర్ పారిపోయి అచటనే మరణించినాడు. జంషీద్ గోల్కొండకోటలోను, దౌలత్ కులీ భువనగిరిలోను బందీలయినారు. చివరివాడైన ఇబ్రాహిం మంచి సమర్థుడు, తండ్రిపట్ల విధేయుడు. అనేక బాధ్యతాయుత పదవులు నిర్వహించి తండ్రి మరణ సమయంలో దేవరకొండలో రాజప్రతినిధిగా ఉన్నాడు.

జంషీద్‌ను గోల్కొండలోనే బందీగా వుంచడం ప్రమాదమయింది. జైలు అధికారుల కండ్లుగప్పి రాజధానిలో తన వర్గాన్ని బలపరచుకొని మీర్‌మహమ్మద్ హందనీ ద్వారా, మసీదులో ప్రార్థన చేస్తున్న తండ్రిని చంపించినాడు. అనంతరం బయల్పడి అంతఃపురాన్ని ఆక్రమించి, అన్న కుతుబ్ ఉద్దీన్ కండ్లు పొడిపించి బందీచేసి సింహాసనం ఎక్కినాడు.

జంషీద్ సమర్థుడేగాని పరమ క్రూరుడు. ప్రజలకుగాని ఆస్థానంలోని సర్దారులకుగానీ ఆతనిపట్ల సదభిప్రాయం లేదు. చిన్న నేరాలకు సయితం మరణ శిక్షల వంటి క్రూరశిక్షలు విధించేవాడని ఫెరిస్టా వ్రాసినాడు. చదువుకున్నవాడు. కవిత్వం కూడ చెప్పేవాడట. ఆతని పట్టాభిషేక సందర్భంలో ఒక్క నిజాంషా మాత్రమే అభినందనలు పంపినాడు. జంషీద్ పాలనలో గోల్కొండ రాజ్యం అభివృద్ధి పొందలేదు. కాని క్షీణించకపోవడం ఆశ్చర్యమని చరిత్రకారులంటారు. ఆతని కాలంలో దక్కన్ సుల్తానుల మధ్య సంబంధాలు దారుణంగా క్షీణించి రక్తపాతం జరిగింది.

జంషీద్ పట్టాభిషేకానంతరం ఇబ్రాహిం కులీ బిదర్ పారిపోయి మాలిక్ బరీద్ సాయంతో గోల్కొండపై దండెత్తినాడు. జంషీద్‌కు బుర్హాన్ నిజాంషా సహాయం లభించింది. ఇబ్రాహిం గోల్కొండ ముట్టడి విరమించి విజయనగరం పారిపోయినాడు. ఈ సంఘటనతో గోల్కొండ, అహమ్మదనగర్‌ల మధ్య మైత్రి బలపడింది. ఇది జరిగిన అనతికాలానికే బుర్హాన్ నిజాంషా, జంషీద్, ఉమాద్ ఉల్‌ముల్క్ (బీరార్) కలిసి బిజాపూర్‌పై దండెత్తినారు (1544). ఇబ్రాహిం ఆదిల్‌షా గత్యంతరంలేక మాలిక్ బరీద్ సాయం అర్థించినాడు. కాని, ఉభయులు పరాజయం పొందినారు. మాలిక్ బరీద్‌ను బిదర్ వరకు తరిమి అపారధనరాశులతో జంషీద్ గోల్కొండకు మరలినాడు.

ప్రతీకారకాంక్షతో మాలిక్ బరీద్ పలుమార్లు గోల్కొండపై దండెత్తినాడు. క్రీ.శ. 1545 లో పటాన్‌చెరువు, కొల్పగూర్‌ల మధ్య జరిగిన యుద్ధంలో ఓడి, తిరోగమించినాడు. మరుసంవత్సరమే దండెత్తివచ్చి మెదక్ దుర్గం ఆక్రమించినాడుగాని, నారాయణఖేడ్ యుద్ధంలో ఓడినాడు. అనంతరం బుర్హాన్ నిజాంషా, జంషీద్‌లు కలిసి బిదర్ రాజ్యనిర్మూలనం చేయ నిశ్చయించి బిదర్‌పై దండెత్తినారు. బరీద్‌కు ఇబ్రాహింషా సహాయం లభించింది. కౌలాస్ యుద్ధరంగమయింది. జంషీద్ సేనాని జగదేవరావు యుద్ధంలో ప్రముఖపాత్ర వహించి విజయం సాధించినాడు. నారాయణఖేడ్, హసనాబాద్‌లు జంషీద్ వశమయినాయి.

క్రీ.శ. 1547 లో దక్కన్ సుల్తానుల మధ్య సంబంధాల్లో కొత్త పరిణామం జరిగింది. జంషీద్, బుర్హాన్ నిజాంషాలు ఇబ్రహిం ఆదిల్‌షాను రెచ్చగొట్టి తమ కూటమిలో చేర్చుకొన్నారు. బిదర్ రాజ్యనిర్మూలనమే వీరి ఆశయం. నైజాంషా బిదర్ మీద, ఆదిల్‌షా విజయనగరం మీద దండెత్తడానికి నిర్ణయం జరిగింది. దీని ప్రకారం నిజాంషా దండెత్తి కంధార్ దుర్గం ముట్టడించగా ఆదిల్‌షా సహాయం అర్థించడానికై బరీద్‌షా స్వయంగా బిజాపూర్ చేరినాడు. కాని, బరీద్‌ను ఖైదుచేసి ఆదిల్‌షా విజయనగరంపై దండెత్తినాడు. విజయనగర ప్రాంతాల నాక్రమించి ఆదిల్‌షా బలవంతుడు కాగలడనే భయంతో నైజాంషా

బిదర్ దండయాత్ర విరమించి బిజాపూర్ రాజ్యంలోని షోలాపూర్‌పై దండెత్తినాడు. విజయనగర దండయాత్ర నుండి అదిల్‌షా మరలక తప్పలేదు. షోలాపూర్ దగ్గిర ఘోర యుద్ధం జరిగింది ఈ పరిస్థితుల్లో అదిల్‌షా, నిజాంషా, బరీద్‌షాలు ముగ్గురు జంషీద్ సహాయం అర్థించినారు. దక్కన్ రాజకీయాల్లో మధ్యవర్తిగా గోల్కొండకు కీలక స్థానం లభించింది గోల్కొండ గౌరవ ప్రతిష్టలు ఇనుమడించినాయి. బరీద్ విముక్తిని సాధించి అదిల్‌షా, నైజాంషాల మధ్య సమాధానం కుదిర్చి జంషీద్ బిదర్ వరకు నడచినాడు. కృతజ్ఞతతో బరీద్ అమూల్యములైన బహుమతులిచ్చి జంషీదును గౌరవించినాడు. ఈ పరిణామాల అనంతరం అనతికాలానికే జంషీద్ రాజయక్ష్మ వ్యాధితో బాధపడి మరణించినాడు.

## ఇబ్రాహీం కుతుబ్ ఉల్‌ముల్క్ (1550-80)

జంషీద్ మరణానంతరం గోల్కొండ తిరిగి అరాజకంలో మునిగింది. రాణి బిల్ కీస్‌జమాన్ తన కొడుకు సుభాన్ కులీని సింహాసనం ఎక్కించింది. సుభాన్ ఏడేండ్ల పసిబాలుడు. విదేశీ ముస్లిం నాయకులైన ముస్తఫాఖాన్, సలాబత్‌ఖానులు ఆమె అండగా ఉన్నారు. రాజ్యవ్యవహారాలను సైఫ్‌ఖాన్ అయినుల్ ముల్క్ నిర్వహించినాడు. ఈ యేర్పాట్లు ఆస్థానంలోని సర్దారులలో చాలమందికి నచ్చలేదు. ముఖ్యంగా జగదేవరావూ అతని అనుచరులూ భువనగిరికోటలో బందీగా ఉన్న దౌలత్ కులీని సుల్తాన్‌గా ప్రకటించడంతో అంతర్యుద్ధం ప్రారంభమయింది. సైఫ్‌ఖాన్ తిరుగుబాటుదార్లనణచి దౌలత్‌ను తిరిగి భువనగిరిలో బందీ చేసి జగదేవరావును బందీగా గోల్కొండకు తెచ్చినాడు. కాని, విజయగర్వంతో సైఫ్‌ఖాన్ సర్దారులపట్ల అహంకారంతో ప్రవర్తించడంతో వారందరూ విసిగిపోయి, విజయనగరంలో ప్రవాసిగా వున్న ఇబ్రాహీంను బలపరచసాగినారు. చివరకు ముస్తఫా,సలాబత్‌ఖాన్లుకూడ ఇబ్రాహీంతో మంతనాలు ప్రారంభించారు.

గోల్కొండ పరిస్థితి గ్రహించి రామరాయల సైనిక సహాయంతో ఇబ్రాహీం బయలుదేరినాడు. అతనివెంట రామరాయల (రాయ్‌అజాం) సోదరుడైన వెంకటాద్రి వెళ్ళినట్లు తెలుస్తుంది. పానగల్, కోయిలకొండ ప్రజలాతని పక్షం వహించినారు. ముస్తఫా, సలాబత్‌ఖానులు సయితం తమ బలాలతో ఇబ్రాహీంతో చేరినారు. ఇబ్రాహీం నెదిరించడానికై సైఫ్‌ఖాన్ పెద్ద సైన్యంతో కోయిలకొండపై నడచినాడు. ఇంతలో గోల్కొండలో తిరుగుబాటు జరిగింది. జగదేవరావు బంధవిముక్తుడై సుభాన్‌కులీని ఖైదుచేసి, అతనిపక్షం వారిని హతమార్చినాడు. గత్యంతరంలేక సైఫ్‌ఖాన్ బీరార్ పారిపోయినాడు. ఇబ్రాహీం పురోగమించి గోల్కొండ నాక్రమించి, క్రీ. శ. 1550 లో పట్టాభిషేకం జరుపుకున్నాడు.

గోల్కొండ సుల్తాను లందరిలో ఇబ్రాహీం కులీ విశిష్టమైన వ్యక్తిత్వం ఉన్నవాడు. సమర్థుడు. షిరాజ్ మొదలైన సమకాలిక రచయితలు అతని పాలనా దక్షతను ప్రశంసించినారు. చిరకాలం విజయనగరాస్థానంలో ఉన్నందున రాజనీతి చాతుర్యమేగాక ఆంధ్ర భాషా సంస్కృతుల్లో అతనికి అభిమానం ఏర్పడింది. సంక్షుభితమైన గోల్కొండ పాలనా యంత్రాంగాన్ని మాలిక్ పటిష్టం చేసినాడు. తెలంగాణా ప్రాంతాల్లో కల్లోలానికి కారణమైన దోపిడి దొంగలను దారుణంగా శిక్షించి దేశంలో శాంతిభద్రతలు నెలకొల్పినాడు. గూఢచారి దళాన్ని ఏర్పరచి స్థానిక సమాచారం సేకరించి అవసర చర్యలు తీసుకొనేవాడు. అతని కాలంలో న్యాయశాఖ పునర్వ్యవస్థీకరణ జరిగింది. ఆలీబిన్ ఆజీజుల్లా అభిప్రాయంలో న్యాయశీలతలో ప్రపంచరాజు లందంకీ ఇబ్రాహీం ఆదర్శప్రాయుడు.

పరిపాలన కట్టుదిట్టంచేసి ఇబ్రాహీం దాక్షిణాత్య రాజకీయాలపై దృష్టి మరల్చినాడు. ఇబ్రాహీం శాంతికాముకుడని ముస్లించరిత్రకారు లభివర్ణిస్తారు. సుల్తానులమధ్య కొంతవర కాతడు మధ్యవర్తిగా వ్యవహరించి, తుల్యప్రాబల్య సిద్ధాంతం అనుసరించే ప్రయత్నం చేసి, వారిమధ్య అనవసర రక్తపాతాన్ని నివారించినాడు. అతని విధానాలవల్లనే కొత్త పరిణామా లేర్పడి, విజయనగరానికి వ్యతిరేకంగా సుల్తానుల కూటమి ఏర్పడినదనడం చాలవరకు యథార్థం.

చిరకాలంగావున్న అహమ్మద్‌నగర్, గోల్కొండలమధ్య మైత్రి పాటిస్తూ గుల్బర్గాను నిజాంషా రాజ్యంలో చేర్చే ఉద్దేశ్యంతో హుస్సేన్ నిజాంషాతో కలిసి ఇబ్రాహీం బిజాపూర్‌పై దండెత్తినాడు. (క్రీ.శ. 1557) ఇబ్రాహీం ఆదిల్‌షా విజయనగర సహాయం అర్థించినాడు. రామరాయలు ఐక్యం కలిగించుకొని సుల్తానులమధ్య సమాధానం కుదిర్చినట్లు తెలుస్తుంది. గుల్బర్గాను ఆక్రమించి నైజాంషా బలవత్తరుడవుతాడనే భయంతోనే ఇబ్రాహీం యుద్ధవిరమణ చేసినాడని ఫెరిస్టా కథనం.

బిజాపూర్‌లో ఇబ్రాహీం ఆదిల్‌షా మరణానంతరం ఆలీ ఆదిల్‌షా సింహాసనం ఎక్కినాడు. రామరాయలు ఆలీ ఆప్తమిత్రుల్లోనివాడు. ఆలీ యుద్ధప్రియుడు; రాజ్యవిస్తరణ కాంక్ష ఉన్నవాడు అందుచే సుల్తానులమధ్య యుద్ధాలు తిరిగి ప్రారంభమయినాయి. రామరాయలతో సంధి కుదుర్చుకొని కొల్హాపూర్ కల్యాణ్ ప్రాంతాల నాక్రమించే ఆశయంతో ఆలీ అహమ్మద్ నగర్‌పై యుద్ధానికి సన్నద్ధుడయినాడు. ఈ కూటమిలో ఇబ్రాహీం చేరినాడు. విజయనగరంతో వైరం ప్రమాదకరమని ఇబ్రాహీం అభిప్రాయమై యుండవచ్చు. పరోక్షంగా నైజాంషాకు సహాయం చేసే ఉద్దేశ్యంతోనే ఇబ్రాహీం కూటమిలో చేరినాడని కొందరి అభిప్రాయం. కూటమి సైన్యాలు అహమ్మద్ నగర్‌ను ముట్టడించగా హుస్సేన్ నిజాంషా రాజధానిని విడిచి పరాజయ భయంతో పారిపోయినాడు.

బిజాపూర్, విజయనగర సైన్యాలు అహమ్మద్‌నగర్‌ను దోచుకొని చాలా నష్టం కలిగించినాయి. చివరకు ఇబ్రాహిం జోక్యం కలిగించుకొని వారిని మరలించినాడు. కల్యాణి దుర్గం బిజాపూర్ వశమయింది.

ఇదే సమయంలో బహుశా ఇబ్రాహింపై జగదేకరావు తిరుగుబాటు చేసినాడు. బీరార్ సుల్తాన్ సహాయంతో దౌలత్ కులీని సింహాసనం ఎక్కించాలని అతని ప్రయత్నం. అతనికి ఎల్గందల కేంద్రం. ముస్తఫాఖాన్ దండెత్తి జగదేవరావు నోడించి ఎల్గందల ఆక్రమించినాడు. జగదేకరావు విజయనగరం పారిపోయినాడు. రామరాయ లాతణ్ణి ఆదరించి ఉన్నతోద్యోగంలో నియమించినాడు రామరాయలచర్య ఇబ్రాహింకు ఆగ్రహకారణమయింది.

రామరాయ, ఆదిల్‌షాలమీద ఆగ్రహం ఇబ్రాహిం కుతుబ్‌షా, హుస్సేన్ నిజాంషాలను సన్నిహిత పరచింది. ఉభయులమధ్య సంధి కుదిరింది. ఈ సంధికి కుతుబ్-షాయే కారణమని ఫెరిస్టా వ్రాసినాడు. నైజాంషా తన చెల్లెలు బీబీ జమాల్‌ను ఇబ్రాహిం కిచ్చి కల్యాణి దుర్గం సమీపంలో పెండ్లి చేసి ఉభయులూ కలిసి (క్రీ. శ. 1562) కల్యాణి దుర్గంపై దండెత్తినారు. ఆలీ ఆదిల్‌షాకు సహాయంగా రామరాయల తమ్ముడు వెంకటపతి, జగదేకరావు, ఐన్‌ఉల్‌ముల్క్, చందాఖాన్‌లతో గోల్కొండపై దండెత్తగా రామరాయలు అహమ్మద్‌నగర్‌పై దండెత్తి ఆ రాజ్యంలో బీభత్సం సృష్టించినాడు. ఇబ్రాహిం, హుస్సేన్‌షాలకు కల్యాణి దుర్గం ముట్టడి విరమించక తప్పలేదు. కల్యాణి దుర్గం ఆదిల్‌షా వశమయింది. తిరోగమిస్తున్న కుతుబ్‌షాహీ సైన్యాలను వెన్నంటి విజయగర సైన్యాలు గోల్కొండవరకు తరిమి, దేశాన్ని దోచినాయి. దీనికితోడు జగదేకరావు ప్రోత్సాహంతో ఇంద్రకొండ పాలించే కేశవరావు; కోయిలకొండ, ఘనపుర పానగల్లు సామంతులు కుతుబ్‌షాపై తిరుగుబాట్లు చేసినారు. ఇదే సమయంలో రామరాయల కోరికపై కొండవీటి సామంతుడు గనితిమ్మానాయుడు కొండపల్లిపై దండెత్తినాడు. శత్రు దండయాత్రలతో, సామంతుల తిరుగుబాట్లతో గోల్కొండ రాజ్యం విచ్ఛిన్నమయ్యే ప్రమాదం ఏర్పడింది.

ఇట్టి క్లిష్ట పరిస్థితిలో ఇబ్రాహిం ధైర్యంతో, రాజనీతితో వ్యవహరించి రాజ్యానికి ప్రమాదం తప్పించినాడు. ముస్తఫాఖాన్ సలహాపై శత్రువులతో సంప్రదింపులు ప్రారంభమయినాయి. అదృష్టవశాత్తు అహమ్మద్‌నగర్, గోల్కొండ రాజ్యాలలో రామరాయల విశృంఖల వీరవిహారంతో ఆలీ ఆదిల్‌షా, ఆలీ బరిద్‌షాలకు విజయనగరప్రాబల్యంపట్లభయాందోళనలు హెచ్చి ఇబ్రాహింతో స్వయంగా సంప్రదింపులకు సిద్ధమయినారు. ఇందు ముస్తఫాఖాన్ ప్రముఖ పాత్ర నిర్వహించినట్లు తెలుస్తుంది. పానగల్, ఘనపుర దుర్గాలతో తృప్తిపడి రామరాయలు విజయనగరానికి మరలినాడు.

శత్రుభయం తప్పిన తర్వాత ఇబ్రాహిం శత్రువులతో చేరిన కేశవరావు మొదలైన సామంతుల నణచి శాంతి భద్రతలు నెలకొల్పినాడు. గోల్కొండ దుర్గానికి కొత్త రక్షణ శ్రేణులు నిర్మించి దుర్భేద్యంగా చేయడం జరిగింది.

విజయనగరం పట్ల ఏర్పడిన భయాందోళనలు క్రమంగా సుల్తానుల కూటమికి దారి తీసినాయి. కూటమి నిర్మాణంలో ఆదిల్‌షా ప్రముఖ పాత్ర నిర్వహించినట్లు ఫెరిస్టా వ్రాయగా; నైజాంషా, కుతుబ్‌షాలు కారణమని కుతుబ్‌షాహీ చరిత్రకారుల కథనం. ఏమైనా, కుతుబ్‌షాహీ మంత్రియైన ముస్తఫాఖాన్ సుల్తానుల మధ్య రాయబారాలు నిర్వహించి అనుకూల వాతావరణం కల్పించినాడు. ఇంతకు పూర్వమే ఆదిల్‌షా, కుతుబ్‌షాహీ వంశాల మధ్య వివాహ సంబంధం ఏర్పడింది. ప్రస్తుతం ఆదిల్‌షా, నైజాంషాల మధ్య వివాహ సంబంధం కుదిరింది. తన కూతురు ప్రసిద్ధురాలైన చాంద్‌బీబీని హుస్సేన్‌షా అలీ - ఆదిల్‌షా కిచ్చి పెండ్లి చేసినాడు. అలీ ఆదిల్‌షా చెల్లెలు హదియా సుల్తానాను నైజాంషా యువరాజు మూర్తుజా పెండ్లాడినాడు. ఆదిల్‌షా నైజాంషాల మధ్య యుద్ధాలకు కారణమైన షోలాపూర్ బిజాపూరుకు దత్తమయింది. ఈ సంబంధాలతో ఆదిల్‌షా, నైజాంషా, కుతుబ్‌షాల మధ్య మైత్రి బలపడింది.

ముస్లిం చరిత్రకారుల ప్రకారం ఆదిల్‌షా, నైజాంషా, కుతుబ్‌షా, బరీద్‌షాలు మాత్రం కూటమిలో చేరినారని, బీరార్ సుల్తాన్ ఖుర్షాన్ ఇమాద్‌షా చేరలేదని తెలుస్తుంది. తెలుగులోని స్థానిక చరిత్రలు 'పంచ పాదుషాల'ను పేర్కొంటున్నాయి. సుల్తాను కూటమి విజయనగరంపై యుద్ధం ప్రకటించి తళ్లికోటకు తమ సైన్యాలను నడిపించింది. రామరాయలు యుద్ధానికి సిద్ధమయినాడు. యుద్ధం కృష్ణానదికి దక్షిణంగా జరిగిందని ముస్లిం చరిత్రకారులు వ్రాసినారుగాని స్థలనిర్దేశం చేయలేదు. వారి రచనలపట్ల విశ్వాసంతో ఆచార్య షేర్వాణీ యుద్ధం మూసీ - హుక్కేరి నదుల సంగమ స్థలంలో బట్టిహట్టి దగ్గిర జరిగినట్లు నిర్ణయించినాడు. ఇది కేవలం ఊహపై ఆధారపడి, ఇతర ఆధారాలను పరిగణింపని నిర్ణయం. రాబర్ట్ సూయల్ యుద్ధం తళ్లికోట సమీపంలో జరిగిందని నిర్ణయించి, దాన్ని తళ్లికోట యుద్ధంగా వ్యవహరించినాడు. హీరాస్ పండితుడు యుద్ధం కృష్ణానదికి ఉత్తరంగా రాక్షసి - తంగడి గ్రామాల మధ్య జరిగిందనగా, నేలటూరు వెంకటరమణయ్యగారు ఆ నిర్ణయాన్ని బలపరిచినారు. తెలుగు, కన్నడ భాషల్లోని స్థానికచరిత్రలు సుల్తానులకు రాయలకు మధ్య యుద్ధం కృష్ణామలప్రభా సంగమ స్థలంలో రాక్షసి - తంగడి గ్రామాల మధ్య జరిగిందని ముక్తకంఠంగా చెబుతున్నాయి.

రాకాసిగండి యుద్ధంలో రామరాయలు మరణించి, విజయనగర సైన్యాలు సర్వనాశనమయినాయి. విజయగర్వంతో ముస్లిం సైన్యాలు విజయనగరంలో ప్రవేశించి ప్రధాన నిర్మాణాలను ధ్వంసం చేసినాయి. హిందూ రాజకీయాధికార కేంద్రంగా విజయనగరాన్ని నిర్మూలించాలనే సుల్తానుల ఆశయం ఫలించింది.

రాకాసిగండి యుద్ధానంతరం అచిరకాలానికే సుల్తాన్ కూటమి విచ్ఛిన్నమై వారి మధ్య అంతర్యుద్ధాలు చెలరేగినాయి. విజయనగర రాజ్యంలోని కల్లోలిత పరిస్థితి అవకాశంగా తీసుకొని ఆదిల్‌షా కర్ణాటకంలో విస్తరించడానికి ప్రయత్నించినాడు. బీరార్ రాజ్యాన్ని ఆక్రమించాలని నైజాం షా ఆశయం. ఇబ్రాహిం అనుసరించిన తుల్యప్రాబల్య విధానం పూర్తిగా విఫలమయింది. రాకాసిగండి యుద్ధం ముగిసిన వెంటనే ముస్తఫాఖాన్ రాయచూరు అంతర్వేదిని ఆక్రమించి అలీఆదిల్‌షా పరం చేయడం హుస్సేన్ నిజాంషాకు ఆగ్రహం కలిగించింది. అతణ్ణి తృప్తిపరచడానికై ముస్తఫాఖాన్‌ను పదవి నుండి ఇబ్రాహిం తొలగించవలసివచ్చింది. ఇంతలో హుస్సేన్ మరణించి, మూర్తుజా అహమ్మద్ నగర్ సింహాసనం ఎక్కినాడు. మూర్తుజా రాజనీతిలో చతురుడు, మంచి యోధుడు. కాని, చపలచిత్తుడని ప్రసిద్ధి. కేవలం స్వార్థంతో వ్యవహరించేవాడు. అతనితోటి మైత్రివల్ల ఇబ్రాహింకు లాభంకంటె నష్టమే ఎక్కువగా కలిగింది.

సుల్తానుల కూటమిలో చేరని నేరానికి ఇమాద్‌షాను శిక్షించే ఉద్దేశంతో క్రీ.శ. 1566 లో అలీ ఆదిల్‌షా, మూర్తుజాలు కలిసి బీరారుపై దండెత్తగా బీరార్ మంత్రి తుఫాల్‌ఖాన్ వారికి యుద్ధ పరిహారం చెల్లించి మరలించినాడు. బిజాపూర్, అహమ్మద్‌నగర్‌ల మధ్య మైత్రి ఎంతో కాలం కొనసాగలేదు. క్రీ. శ. 1567 లోనే అలీ ఆదిల్ షా అహమ్మద్‌నగర్ పైదండయాత్రలు ప్రారంభించినాడు. ఇబ్రాహిం మూర్తుజాపక్షం వహించినాడుగాని, క్రీ. శ. 1569 లో ఆదిల్‌షా కుతంత్రాన్ని గ్రహించలేక కుతుబ్‌షా సైన్యంపైనే దాడిచేసి మూర్తుజా 150 ఏనుగులను సంగ్రహించినాడని ఫెరిస్టా వ్రాసినాడు. కర్ణాటకంలో ఆదోని, బంకాపుర, దార్వాడ దుర్గాలను ఆక్రమించి ప్రబలుడవుతున్న అలీ ఆదిల్‌షాను, తిరుమల రాయలు, మూర్తుజాలతో కలిసి అరికట్టాలని ఇబ్రాహిం చేసిన ప్రయత్నం కూడ మూర్తుజా మొండితనంవల్ల విఫలమయింది.

బీరార్ స్వాతంత్ర్యాన్ని నిర్మూలించి అహమ్మద్‌నగర్‌లో కలిపివేయాలనే ప్రయత్నం మూర్తుజా విరమించలేదు. అలీ ఆదిల్‌షా, అలీబరీద్‌షాలతో కలిసి మూర్తుజాను ప్రతిఘటించడానికై ఇబ్రాహిం చేసిన కృషి ఫలించకపోగా మూర్తుజా, అలీ ఆదిల్‌షాలు చేసుకొన్న ఒప్పందం ప్రకారం బీరారను మూర్తుజా, కర్ణాటక ప్రాంతాలను ఆదిల్‌షా ఆక్రమించడానికి అంగీకరించినారు. అలీ బరీద్, బుర్హాన్ ఇమాద్‌షాలను కూడగట్టుకొని ఇబ్రాహిం మూర్తుజా దురాక్రమణ నరికట్టే

ప్రయత్నం చేసినాడు. నైజాంషాహి సైన్యాలు తెలంగాణంపై దాడులు జరిపినాయి. కౌలాస్ దుర్గం పరశురామ ప్రీతి అయింది. క్రీ. శ. 1574 లో బీరార్ అహమ్మదనగరంలో లీనమయింది. ఇది ఇబ్రాహిం రాజనీతికి పెద్ద పరాజయం. క్రీ.శ. 1579 లో అలీ ఆదిల్‌షా మరణానంతరం బిజాపూర్ రాజకీయాలు కల్లోలితం కాగా మూర్తుజాతో కలిసి బిజాపూర్ రాజ్యాన్ని విచ్ఛిన్నం చేయాలని కుతుబ్‌షా చేసిన ప్రయత్నాలు విఫలమయినాయి.

అలీఆదిల్‌షా, మూర్తుజాల రాజ్య విస్తరణను ఇబ్రాహిం అరికట్టలేకపోయినాడు. కర్ణాటక రాజులైన తిరుమల, శ్రీరంగరాయలులకు (క్రీ శ. 1576) సాయంచేసి ఆదిల్‌షా దురాక్రమణను ఆపడం కూడ అతనికి సాధ్యం కాలేదు. అతని తుల్యాభార విధానం ఫలించలేదు. అందుచే బిజాపూర్‌కు సమవుజ్జీగా గోల్కొండ రాజ్యాన్ని ఆంధ్ర ప్రాంతంలో విస్తరింపజేయడం సముచితమని ఇబ్రాహిం నిర్ణయించినట్లు కన్పిస్తుంది. గజపతి రాజ్యంలో అంతర్యుద్ధం చెలరేగి ఉత్తరతీరాంధ్ర రాజకీయ పరిస్థితి ఇబ్రాహిం రాజ్య విస్తరణకు అనుకూలించింది. క్రీ.శ. 1572 లో అయినుల్‌ముల్క్, సలాబత్‌ఖాన్‌ల నాయకత్వంలో కుతుబ్‌షా సైన్యం రాజమహేంద్రవరం, కళింకోట · వీరఘట్టాలను ఆక్రమించింది. దక్షిణ కళింగ గోల్కొండ రాజ్యాంతర్భాగమయింది అనంతరం ఇబ్రాహిం దృష్టి కొండవీటి రాజ్యంపై మరలింది. క్రీ. శ. 1575 లో అహోబల ప్రాంతాన్ని జయించినాడు గాని, తిరిగి కోల్పోయినాడు. తరువాత వినుకొండ, కంభం, కొచ్చర్ల కోటలను పట్టుకొని గోల్కొండ సేనాని మీర్‌షామీర్ కొండవీటిని ఆక్రమించినాడు. విజయనగరాధీశులు కొండవీడును శాశ్వతంగా కోల్పోయినారు. తెలుగువారిలో అధిక భాగం గోల్కొండ పాలన కిందికి వచ్చినారు.

ఇబ్రాహిం కుతుబ్‌షా క్రీ. శ. 1580 లో మరణించినాడు. గోల్కొండ సేనాని మురహరిరావు అహోబల దేవాలయాన్ని బంగారు విగ్రహాలతోసహా దోచి సుల్తాను ముందు ప్రదర్శింపగా ఇబ్రాహిం ఖిన్నుడై స్వస్థతచెడి మరణించినాడని ఒక గాథ. ఏమైనా ఇబ్రాహిం మరణం చాల ఆకస్మిక సంఘటన అని చరిత్రకారుల అభిప్రాయం. ఇబ్రాహిం కాలంలో గోల్కొండ సర్వతోముఖాభివృద్ధి చెందినదనడం నిర్వివాదం. రాజ్యంలో శాంతిభద్రతలు నెలకొన్నాయి. 'పెట్టెడు బంగారంతో వృద్ధురాలైనా గోల్కొండ నుండి బెంగాలుగాని, బిజాపూర్‌గాని నిర్భయంగా వెళ్ళగలిగేది' అని ఫెరిస్తావంటివారు వ్రాసినారు. ఇబ్రాహిం సారస్వత ప్రియుడు; ఉరుదు, పారశీక, తెలుగు కవుల నాదరించి పోషించినాడు. ఇబ్రాహిం ఇభరాముడని ప్రసిద్ధిచెందినాడు. అతని ధైర్య శౌర్యాలు, విద్యాపోషణను గురించి తెలుగులో పెక్కు చాటువులున్నాయి. అతని మరణాన్ని విని విలపిస్తూ ఒక కవి అంటాడు :

రార విధాత! యోరి వినరా! తగురా! తలకొట్లమారి! ని
స్సారపు లోభిరాజులను జంపక మల్కిభరాముభూవరున్
జారుయశోధనున్ సుగుణి జంపితి వర్థులకేమి దిక్కురా!
చేరిక నింత రాజును సృజింపగ నీ తరమా వసుంధరన్?

## ముహమ్మద్ కులీకుతుబ్‌షా (1580-1612)

ఇబ్రాహిం ఆర్గురు కొడుకుల్లో అబుల్ కాదర్ పెద్దవాడు. తండ్రిపట్ల అవిధేయత వల్ల దేవరకొండలో ఖైదీగా-తండ్రికంటేముందే మరణించినాడు. రెండోవాడైన హుస్సేన్ కులీ మంచి విద్వాంసుడు. తర్కవేదాంత శాస్త్రాల్లో పండితుడు. మూడో కొడుకు ముహమ్మద్ కులీ పదునాలుగేండ్ల బాలుడు. ఇతణ్ణే ఇబ్రాహిం తనకు వారసుడుగా నిర్ణయించినట్లు తెలుస్తుంది. యుక్తవయస్కుడు, విద్వాంసుడునైన హుస్సేన్‌ను కాదని ముహమ్మద్ సింహాసనానికి రావడం అంతఃపుర కుట్రవల్ల జరిగివుండవచ్చని షేర్వాణీవంటి చరిత్రకారుల అభిప్రాయం.

ముహమ్మద్ కులీ బాలుడయినప్పటికీ రాజ్యవ్యవహారాల్లో మంచి శిక్షణ పొందినట్లు కన్పిస్తుంది. ఇతడు సయితం మంచి విద్వాంసుడు. దక్కనీభాషలో గ్రంథకర్త. తెలుగులోకూడ కవిత్వం చెప్పేవాడట! సాహిత్యంలో, వాస్తుకళలో గొప్ప అభిమాని. హైదరాబాద్‌నగర నిర్మాత. ఈతని కాలంలో సోదరులు, సామంతులు తిరుగుబాట్లు జరిపినారు. రెండో వెంకటపతితో సుదీర్ఘమైన యుద్ధం జరిగింది. దక్కన్ రాజ్యాలకు మొగలాయీ విస్తరణ ప్రమాదం ఏర్పడింది. అయితే, తన పేష్వా మీర్‌ముమిన్ అర్దిస్తానీ, మీర్‌జుమ్లా అమీన్ ఉల్‌ముల్క్‌ల సహాయంతో తిరుగుబాట్లనణచి ప్రజలకు శాంతి భద్రతలు చేకూర్చినాడు. విద్యలకు, కళలకు అతని స్థానంలో విశేష ఆదరణ లభించింది. అందుచే ముహమ్మద్ కులీ కాలాన్ని స్వర్ణయుగంగా చరిత్రకారులు వర్ణిస్తారు.

ముహమ్మద్ సింహాసనం ఎక్కిన సమయంలో నల్‌దుర్గ్ దగ్గిర బిజాపూర్‌తో యుద్ధం సాగుతున్నది. బిజాపూర్‌ను విచ్ఛిన్నం చేయాలన్న ఇబ్రాహిం సంకల్పం నెరవేరలేదు. అందుచే బిజాపూర్‌తో సమాధానం కుదుర్చుకొని (క్రీ.శ. 1581) ముహమ్మద్ గోల్కొండ సైన్యాలను ఉపసంహరించినాడు. ఇదే సమయంలో అలీఖాన్ లూర్ సేనాని తిరుగుబాటుచేసి, వెంకటపతిరాయల సాయంతో కొండవీడునాక్రమించడానికి ప్రయత్నించినాడు గాని, లాభం లేకపోయింది. కుతుబ్‌షా సామంతుడుగా కొండవీడు పాలిస్తున్న రాయ్‌రావ్ ధైర్యసాహసాలవల్ల కొండవీడు లూర్‌కు లొంగలేదు. ఈలోగా గోల్కొండ సైన్యాలు లూర్ తిరుగుబాటు నణచినాయి. అనంతరం ముహమ్మద్ కులీ తన చెల్లెలు చాంద్‌సుల్తాన్ (మాలికా-ఇ-జహాన్)ను ఇబ్రాహిం అదిల్‌షాకిచ్చి పెండ్లిచేసి, బిజాపూర్ గోల్కొండల [illegible] ఆసి పటిష్ఠం చేసినాడు.

అలీఖాన్ బార్‌కు వెంకటపతి సహాయం చేయడంతో విజయనగర, గోల్కొండల మధ్య సంఘర్షణ ప్రారంభమయింది. అమీన్ ఉల్‌ముల్క్ నాయకత్వంలో కుతుబ్‌షాహీ సైన్యాలు కర్నూలు, గుత్తి, ఉదయగిరి, గండికోటలాక్రమించి, పెనుగొండపై నడిచినాయి. వెంకటపతిరాయలు సంధి సంప్రదింపులతో సుల్తానును నమ్మించి సామంత సైన్యాలు కూర్చుకొని హటాత్తుగా గోల్కొండ సైన్యాలపై పడినాడు. కృష్ణానదిలో వరదలు ప్రారంభించడంతో గోల్కొండ సైన్యాలు మరలక తప్పలేదు. కొండవీడుమినహా మిగిలిన దక్షిణ ఆంధ్రప్రాంతాలను వెంకటపతి ఆక్రమించినాడు.

విజయనగరంతోటి యుద్ధకాలంలోనే గోల్కొండ సామంతులు రాజ్యం నలుమూలలా తిరుగుబాట్లు ప్రారంభించినారు. కొండవీటి ప్రాంతంలో భవేరావ్, అలంఖాన్‌వతాల్లను అమీన్‌ఉల్‌ముల్క్ అణచినాడు. ఇంతలో (క్రీ. శ. 1590) కళింకోట పాలకుడైన ముకుందరాజబాహుబలేంద్రుని తిరుగుబాటు జరిగింది. ఈతనితో కొండవీడు, ఏలూరు, రాజమహేంద్రవర సర్దారులుచేరి, తీరాంధ్రం మొత్తం తిరుగుబాటు ప్రభావానికి గురిఅయింది. సుదీర్ఘమైన పోరాటం తర్వాత అమీన్ ఉల్‌ముల్క్ (సర్‌నోబత్) చంఘిజ్‌ఖాన్లు ఈ తిరుగుబాటు నణచి శాంతి నెలకొల్పినారు.

ముహమ్మద్ కులీ కాలంలోనే దాక్షిణాత్యరాజ్యాలకు మొగలాయీ విస్తరణ ప్రమాదం ఏర్పడింది. ఇంచుమించు ఆదేకాలానికి (క్రీ.శ. 1606) పాశ్చాత్య వర్తక సంఘాలు ఆంధ్రదేశంలో ప్రవేశించి వాణిజ్యం ప్రారంభించినాయి డచ్చి కంపెనీవారు మచిలీపట్టణం, నిజాంపట్టణం, పులికాట్ రేవుల్లో స్థావరా లేర్పరచుకున్నారు. వారి అనంతరం ఆంగ్లేయులు ప్రవేశించినారు. పాదుషా అక్బర్ భారతదేశం అంతటినీ మొగలాయీ అధికారంలోనికి తీసుకురావాలని ఆశించినాడు. గుజరాత్, మాళవలు ఆతని సామ్రాజ్యంలో చేరినాయి. ఖాన్‌దేష్‌పాలకు డాతని సామంతుడయినాడు. ఇక అక్బర్ దృష్టి దాక్షిణాత్యరాజ్యాలపై ప్రసరించడం సహజం. మూర్తుజా నైజాంషా కాలంనుండి అహమ్మద్‌నగర రాజకీయాలు అల్లకల్లోలమై, ఇబ్రాహీం నైజాంషా మరణానంతరం (క్రీ. శ. 1595) మరింత దిగజారినాయి. ఇబ్రాహిం కొడుకు బహదూర్‌ను సింహాసనం ఎక్కించి చాంద్ బీబీ పరిపాలన నిర్వహించసాగింది. ఆమెకు వ్యతిరేకంగా అహమ్మద్ అనే రాకుమారుని సుల్తాన్‌గా ప్రకటించి, పేష్వా మియాన్‌మంజూ తనకు సాయంగా గుజరాత్‌ను పాలిస్తున్న మొగల్ రాకుమారుడు మురాద్‌ను ఆహ్వానించినాడు. అవకాశంకోసం నిరీక్షిస్తున్న అక్బర్‌పాదుషా ఆజ్ఞపై మురాద్ క్రీ. శ. 1595 లో అహమ్మద్‌నగర్‌పై దండెత్తినాడు. చాంద్‌బీబీ ఓడిపోయి, బీరార్‌ను మొగలాయీలకు దత్తంచేసి క్రీ.శ. 1586 లో సంధి చేసుకొన్నది. [illegible]ర్ ఆక్రమణలో

మొగలాయి సైన్యాలు జరిపిన దుండగాలవల్ల యుద్ధం తిరిగి ప్రారంభమయింది. చాంద్‌బీబీ ఆదిల్‌షా కుతుబ్‌షాల సాయం అర్థించింది. తాహిర్‌ఖాన్ నాయకత్వంలో కుతుబ్‌షాహీ సైన్యం చాంద్‌బీబీకి సహాయపడింది. కాని దాక్షిణాత్య సైన్యాలు సోనేపట్ యుద్ధంలో (క్రీ.శ. 1597) పరాజయం చెంది చెల్లాచెదరయినాయి. మొగలాయి సైన్యాలు అహమ్మద్‌నగర్‌పై పురోగమించినాయి. చాంద్‌బీబీ ఆత్మహత్య చేసుకొన్నది. అహమ్మద్‌నగర్ మొగలాయీల వశమయింది. (క్రీ.శ. 1600) ఆదిల్‌షా, కుతుబ్‌షాలు తమకు సన్నిహితమైన ప్రమాదం గుర్తించినారు; కాని బలవత్తరుడైన మొగల్‌పాదుషాతో వైరంకూడ ప్రమాదమే అక్బర్‌కూడ బిజాపూర్, గోల్కొండల మైత్రినాశించినట్లు కన్పిస్తుంది. మసూద్ బేగ్‌అనే రాయబారిని అక్బర్ గోల్కొండ ఆస్థానానికి పంపినాడు. ముహమ్మద్ కుతుబ్‌షా అమూల్యములైన బహుమతులిచ్చి తన మైత్రిని ప్రకటించినాడు. మరొకమారు క్రీ.శ. 1604 లో కూడ కుతుబ్‌షా మొగల్‌పాదుషాకు కానుకలు పంపినట్లు తెలుస్తుంది.

ముహమ్మద్ కులీ క్రీ శ. 1612 లో మరణించినాడు. అతని కాలంలో గోల్కొండ సంస్కృతీ నిలయం అయింది. ఆతని కొలువులో హిందువులనేకులు ఉన్నతోద్యోగాలు నిర్వహించినారు. పారశీకంనుండి కవులు, పండితులు అసంఖ్యాకంగా గోల్కొండ చేరి అతని ఆదరణ పొందినారు. ముహమ్మద్ కులీకి శాశ్వత కీర్తి చేకూర్చింది. కొత్త రాజధాని నగరం హైదరాబాద్, అందలి చార్ మినార్ మొదలైన భవనాల నిర్మాణము. భాగమతి అనే హిందూ 'ప్రియవల్లి' పేర భాగ్యనగరంగా హైదరాబాదును ముహమ్మద్ కులీ నిర్మించినాడన్నగాథలో సత్యంలేదని చారిత్రకులు నిర్ధయిస్తున్నారు.

## సుల్తాన్ ముహమ్మద్ కులీ (1612-16)


ముహమ్మద్ కులీకుతుబ్‌షాకు కుమారులు లేరు. అందుచే సోదరుడైన మీర్జా అమీన్ కొడుకైన సుల్తాన్ ముహమ్మద్‌ను పెంచుకొని తన కూతురు హయాత్‌బక్షీబేగంనిచ్చి పెండ్లిచేసి తన వారసుడుగా ప్రకటించినట్లు తెలుస్తుంది. సుల్తాన్ ముహమ్మద్ సింహాసనం ఎక్కిన సందర్భంలో ఆదిల్‌షా, నైజాంషాలే గాక పారశీక చక్రవర్తి రెండో షా అబ్బాస్‌కూడ అభినందనలంపినాడు. పారశీక రాయబారి మీర్ జయినుల్ అబిదీన్ 1614 లో హైదరాబాద్‌ను దర్శించినట్లు తెలుస్తుంది.

సుల్తాన్ ముహమ్మద్ శాంతి కాముకుడు. అతని కాలంలో ప్రజలు సుఖశాంతులతో ఉన్నారని చరిత్రకారులు వర్ణిస్తారు. అయితే, దాక్షిణాత్యరాజ్యాలకు మొగలాయీ ప్రమాదం మరింత హెచ్చింది. ఈ సమయంలో దాక్షిణాత్యరాజ్య రాజకీయాల్లో మాలిక్ యాంబర్ కీలకమైన పాత్ర నిర్వహించినాడు. యాంబర్

అబిసీనియా దేశస్థుడు. దాక్షిణాత్య రాజ్యాల్లో పెక్కు పదవులు నిర్వహించి అనుభవం గడించినాడు. మొగలాయిలు ఆక్రమించగా మిగిలిన నైజాంషాహీ రాజ్యంలో మూర్తుజా అనే రాకుమారుణ్ణి పారెంద నగరంలో సింహాసనం ఎక్కించి అహమ్మదనగర్ గౌరవ ప్రతిష్ఠలు పునరుద్ధరించడానికి సంకల్పించినాడు. మరాటా అశ్వికులను సైన్యంలో చేర్చుకొని వారికి గెరిల్లా యుద్ధపద్ధతిలో శిక్షణ ఇచ్చి మొగలాయిలతో తలపడినాడు. క్రీ.శ. 1610 నాటికి అహమ్మదనగర్ నుండికూడ మొగలాయిలను పారదోలి ఆక్రమించి, పాదుషా జహాంగీర్ చేసిన దాడులను తిప్పికొట్టినాడు. పరోక్షంగా ఆదిల్‌షా కుతుబ్‌షాలాతనికి సాయ పడినట్లు తెలుస్తుంది. చివరకు జహాంగీర్ తన కుమారుడైన ఖుర్రంను యాంబర్‌పై పంపినాడు. యాంబర్ ఓడి (క్రీ.శ. 1616) మొగలాయిలతో సంధి చేసుకున్నాడు. బిజాపూర్, గోల్కొండ సుల్తానులు ఖుర్రం విజయంతో హడలిపోయినారు. మొగల్ రాయబారి మీర్‌మక్కి గోల్కొండ దర్శించగా పాదుషాతో తన మైత్రికి నిదర్శనంగా సుల్తాన్ 15 లక్షల రూపాయలు విలువ చేసే బహుమతులు సమర్పించినాడు. షాజహాన్ ఉత్తరాదికి మరలినంతనే క్రీ.శ. 1620 ప్రాంతంలో మాలిక్ యాంబర్ తిరిగి విజృంభించి అహమ్మదనగర్, బీరారులను ఆక్రమించి, బుర్హాన్‌పూర్‌ను ముట్టడించినాడు. మరల షాజహాన్ దండెత్తిరాగా వలుయుద్ధాల్లో యాంబర్ పరాజయం పొందినాడు. మొగలాయి సైన్యాలు అహమ్మద్ నగర్‌ను దోచి, ధ్వంసం చేసినాయి (క్రీ.శ. 1621). యాంబర్ షాజహాన్‌తో సంధి చేసుకొన్నాడు. మొగల్ మహారాణి నూర్జహాన్ కుట్రల ఫలితంగా షాజహాన్ తండ్రిపై తిరుగుబాటు చేయడంతో తాత్కాలికంగా దాక్షిణాత్య రాజ్యాలకు ప్రమాదం తప్పింది. షాజహాన్ యాంబర్‌తో, చేరి కుతుబ్‌షా సాయం అర్థించినాడు. షాజహాన్‌కు సాయం చేసి మొగల్‌పాదుషా ఆగ్రహానికి గురికావడానికి కుతుబ్‌షా సాహసించలేదు. కాని, మొగల్ సేనాపతి మొహబత్‌ఖాన్ చేతిలో ఓడిన షాజహాన్ గోల్కొండ, మచిలీపట్టణాలమీదుగా బెంగాల్ చేరడానికి అనుమతించడమేగాక, ప్రయాణంలో అతనికి ధనధాన్యాలు సహాయం చేయవలసిందిగా గ్రామోద్యోగులను ముహమ్మద్ కుతుబ్‌షా ఆజ్ఞా పించినట్లు ఇక్బల్‌నామాజహాంగీరి మొదలైన గ్రంథాలనుండి తెలుస్తుంది.

సుల్తాన్ ముహమ్మద్ క్రీ.శ. 1526 లో మరణించినాడు. అతని పాలన కాలం అన్ని విధాలా ముహమ్మద్ కులీ కాలానికి అనుబంధం అని చెప్పవచ్చు. సుల్తాన్ మంచి విద్యావంతుడు. కవి. అతని ఆస్థానంలో పారశీక, దక్కనీ భాష లకు పోషణలభించింది. పారశీకభాషలో పెక్కుశాస్త్ర గ్రంథాల రచన జరి గింది. మీర్‌ముహమ్మద్ ముమీన్ తూనికలు కొలతల మీద 'రిసాలామిక్దరియ' అనే గ్రంథం రచించినాడు. హకీం తకియుద్దీన్ వైద్యశాస్త్రంపై 'మిజానుత్

తబాయీ కుతుబ్‌షాహీ' రచించినాడు. 'తారీఖ్ ఇ ముహమ్మద్ కుతుబ్‌షా' అనే చారిత్రక గ్రంథం తయారయింది. ముహమ్మద్ కులీకివలె సుల్తాన్ ముహమ్మద్‌కి




గూడ భవన నిర్మాణంలో ఆసక్తి ఎక్కువ. అతని పోషణలో భవనాలతో, తటాకాలతో (మాన్‌సాహిబ్ కా తాలబ్) హైదరాబాదు సుందరమైన నగరంగా రూపొందింది. ఖైరతాబాద్ మాస్కును నిర్మించడమేగాక ప్రసిద్ధమైన మక్కామసీదుకు సుల్తాన్ పునాదులు వేసినాడు. సుల్తాన్ మరణానంతరం అనతికాలానికి హైదరాబాద్ దర్శించిన టవర్నియర్ అనే ఫ్రెంచి నగల వ్యాపారి మక్కా మసీదును 'భారతదేశ ప్రసిద్ధ నిర్మాణాలలో ఒకటి' అని ప్రశంసించినాడు. దాని నిర్మాణంలో 2000 మంది రాలు చెక్కేవారు, 2000 మంది తాపీ మేస్త్రీలు, 4000 కూలీలు సంవత్సరాల తరబడి పనిచేసినారని తెలుస్తుంది.

### అబ్దుల్లా కుతుబ్‌షా (1662-1672)

అబ్దుల్లా కుతుబ్‌షా సుల్తాన్ కులీ కొడుకు. ఇతని కాలంలో గోల్కొండ రాజ్య క్షీణదశ ప్రారంభమయింది. అయితే గోల్కొండ, బిజాపూర్‌లు కలిసి జీర్ణకర్ణాటక రాజ్యాన్ని పంచుకొని విస్తరించినాయి. ఇదే కాలంలో ఆంధ్రదేశంలో ఆంగ్లేయులు బలపడి అలజడులు కలిగించసాగినారు.

సింహాసనం ఎక్కేనాటికి (1626) అబ్దుల్లా పన్నెండేళ్ళ బాలుడయి నందున తల్లి హయత్‌బక్షీ బేగం సంరక్షకురాలుగా పరిపాలన నిర్వహించింది. హయత్‌బక్షీకి కులీకాలం నుండి ప్రభుత్వ వ్యవహారాలు పరిశీలించడంలో మంచి అనుభవం వుంది. అయినప్పటికీ క్రమంగా పాలనాయంత్రాంగం స్వార్థపరులైన ఉద్యోగుల హస్తగతం కావడం వల్ల రాజ్యంలో అలజడులు చెలరేగినాయి. వానికి అబ్దుల్లా నిర్లక్ష్యమూ విలాస ప్రియత్వమూ తోడయినాయి. అల్లర్లకు కారకుడు మీర్‌జుమ్లాగా ఉన్న మన్‌సూర్‌ఖాన్ 1628 లో మరణించడము, విదేశీయుడైన షేక్ మొహమ్మద్ పేష్వా కావడం (1629) తో రాజ్యంలో శాంతి నెలకొన్నది. ఇంతలో గోల్కొండకు మొగలాయి విస్తరణ ప్రమాదం ఏర్పడింది.

పాదుషా జహంగీర్ మరణించి, క్రీ శ. 1628 లో షాజహాన్ మొగల్ సింహాసనం అధిష్ఠించినాడు షాజహాన్ దాక్షిణాత్య రాజకీయాలు క్షుణ్ణంగా తెలిసిన వాడు. షియా మతాన్ని ద్వేషించేవాడు. సాధ్యమైనంతవరకు దాక్షిణాత్యరాజ్యాలను మొగల్‌సామ్రాజ్యంలో చేర్చడమే అతని ఆశయం. అందుకు అవకాశంగా దాక్షిణాత్యరాజకీయాలు అసమర్థులు నిర్వహించసాగినారు మాలిక్ యాంబర్ మరణించి (క్రీ శ. 1627) అతని కొడుకు ఫతేఖాన్ కుత్సితస్వార్థ విధానాలవల్ల అహమ్మదనగర్ రాజ్యం కల్లోలితమయింది. దీనికితోడు మొగల్ దక్కన్ రాజప్రతినిధియైన ఖాన్ జహాన్‌లోడీ షాజహాన్‌పై తిరుగుబాటుచేసి, మూర్తుజా నైజాంషాను ఆశ్రయించినాడు. ఇది కారణంగా మొగల్ సైన్యాలు నైజాంషా రాజ్యంపై దండెత్తినాయి రాజ్యంలో అంతఃకలహాల వల్ల నైజాంషా మొగలాయీలను ప్రతిఘటించలేకపోయినాడు. క్రీ.శ. 1633 లో మూడో హుస్సేన్ నిజాంషా మొగలాయీలకు బందీగా చిక్కినాడు. మొగల్ సైన్యం దౌలతాబాదు నాక్రమించి దోచింది. అనంతరం మహారాష్ట్ర నాయకుడైన షాజీ భాన్స్లే మొదలైన వారు షాజహాను నెదిరించినారుగాని, వారి ప్రతిఘటన అనతికాలంలోనే పీగిపోయింది. నైజాంషాహీ రాజ్యం మొగల్‌సామ్రాజ్య అంతర్గతమై బిజాపూర్, గోల్కొండ రాజ్యాలకు మొగల్‌ప్రమాదం మరింత చేరువయింది.

నైజాంషాతోడియుద్ధంలో జోక్యం పెట్టుకోవద్దని షాజహాన్ బిజాపూర్, గోల్కొండలకు రాయబారాలు పంపినాడు. పాదుషా కోర్కెను ధిక్కరించి తన వ్యక్తిత్వం నిలుపుకోడానికి ప్రయత్నించడమే గాక బిజాపూర్ కుతుబ్‌షాను కూడ ప్రోత్సహించింది ఈ మూడు రాజ్యాలు సమైక్యంగా మొగలాయిలను ప్రతిఘటించినట్లయితే దక్షిణదేశ చరిత్ర భిన్నంగా ఉండేదని ఆచార్య షేర్వాణి వంటి చరిత్రకారుల అభిప్రాయం, కాని, అబ్దుల్లా కుతుబ్‌షా భయపడ్డాడు. మొగల్ రాయబారులను సగౌరవంగా ఆహ్వానించి అమూల్యములైన బహుమానా

లతో సత్కరించి పాదుషాకోరికలను మన్నించడానికి అంగీకరించినాడు. అయి నప్పటికి మొగల్‌సైన్యాలు కుతుబ్‌షాహీ ప్రాంతాలైన కళింకోట, మన్‌సూర్ ఘర్‌లపై రెండుమార్లు దాడి జరిపి గోల్కొండ సైన్యాలను చెల్లాచెదరుచేసినాయి. దౌలతాబాద్ ఆక్రమణ అనంతరం షాజహాన్ బిజాపూర్, గోల్కొండలను కప్పం చెల్లించవలసిందని ఆజ్ఞాపించినాడు. క్రీ.శ. 1636 ప్రారంభంలో ఆదిల్‌షా సంధి చేసుకొని మొగల్ సామంతుడైనాడు. అదే సంవత్సరం మొగల్‌రాయబారి యైన అబ్దుల్ లతీఫ్‌తో సంధి చేసుకొని అబ్దుల్లా సామంతుడై ప్రతి సంవత్సరం రెండున్నర లక్షలు కప్పం చెల్లించడానికి, తన రాజ్యంలోని శుక్రవారం ప్రార్థన లలో పారశీక చక్రవర్తి పేరుకు బదులు మొగల్ పాదుషా పేరు నమోదు చేయ డానికి అంగీకరించినాడు. గోల్కొండ మొగల్‌సామంతరాజ్యమయింది.

మొగలాయిలతో సంధి అనంతరం కుతుబ్‌షా కర్ణాటక రాజ్యంపై దృష్టి మరల్చినాడు. కర్ణాటక రాజ్యాన్ని నిర్మూలించవలసిందిగా పాదుషా ఇచ్చిన ఆదేశానుసారమే ఆరాజ్యంపై బిజాపూర్, గోల్కొండలదాడులు జరిగినాయని ఆచార్య షేర్వాణీ పరిశీలన. కర్ణాటకంలో గోల్కొండ విస్తరణకు నాయకత్వం వహించింది మొహమ్మద్ సయ్యద్. ఈతని జన్మభూమి అర్దిస్థాన్. నగలవ్యాపారి బానిసగా గోల్కొండకు వచ్చినాడు. ఆ వ్యాపారి మరణించడంతో అతని ఆస్తికి వారసుడై గోల్కొండలో ప్రముఖవ్యక్తి కావడమేగాక ఆస్థానంలో ప్రవేశించి క్రమంగా మీర్‌జుమ్లా, సేనాపతి పదవులు నిర్వహించసాగినాడు. మొహమ్మద్ సయ్యద్ విశ్వాసఘాతకుడైన స్వార్థపరుడు. కుతుబ్‌షా అతణ్ణి కంభంప్రాంతా లపై రాజప్రతినిధిగా నియమించి కర్ణాటకాన్ని జయించవలసిందిగా ఆజ్ఞా పించినాడు. మీర్‌జుమ్లా పెద్ద సైన్యం సమకూర్చుకున్నాడు ఇరవైవేల కాల్బలం ఐదువేల గుర్రాలు, మూడువందల ఏనుగులు, ఫ్రెంచి, ఇంగ్లీషు, ఇటాలియన్ ఉద్యోగుల కిందనున్న శతఘ్నిదళం అతని సైన్యంలో ఉన్నట్లు, ఈ శతఘ్ని దళసాయంతోనే గండికోట మొదలైన దుర్గాల నాతడాక్రమించినట్లు టవర్నియర్ మొదలైనవారి వ్రాతలనుండి తెలుస్తుంది. గండికోటను స్థావరంగా చేసుకొని మూడో వేంకటపతి, మూడో శ్రీ రంగ రాయులులను పలుయుద్ధాల్లో ఓడించి మద్రాసు పర్యంతం తూర్పు ఆంధ్ర ప్రాంతాలను మీర్‌జుమ్లా స్వాధీనం చేసు కున్నాడు. కర్ణాటక రాజ్య విధ్వంసనం పూర్తయింది.

మీర్‌జుమ్లా విజయ పరంపరలతో గోల్కొండ రాజ్యం విస్తరించి, గౌరవం పెరిగింది కాని, అతని స్వార్థ చింతన ప్రమాదకరంగా పరిణమించింది. తాను జయించిన కర్ణాటక ప్రాంతాలను సుల్తాన్ పరం చేయక మీర్‌జుమ్లా తన స్వంతరాజ్యంగా పరిగణిస్తూ సుల్తాన్ ఆదేశాలను ధిక్కరించసాగినాడు. రాజధానిలో మీర్‌జుమ్లా కొడుకు అమీన్ సయితం అవిధేయత ప్రదర్శించడంతో

సుల్తాన్ ఆగ్రహించి అతడ్ని ఖైదు చేసినాడు. మీర్‌జుమ్లా సుల్తానుకు లొంగడానికి బదులు దక్కన్‌లో మొగల్ రాజప్రతినిధియైన ఔరంగజేబుతో సమాధానం కుదుర్చుకొని, అతడ్ని గోల్కొండపై దండెత్తమని కోరినాడు.

దక్షిణ రాజ్యాలపట్ల షాజహాన్, ఔరంగజేబుల విధానాలలో వ్యత్యాసం లేదనే చెప్పవచ్చు. వానిపై దండెత్తే అవకాశం కోసం నిరీక్షిస్తున్న ఔరంగజేబుకు మీర్‌జుమ్లా ఆహ్వానం మంచి ప్రోత్సాహమయింది. తండ్రి అనుమతితో ఔరంగజేబు తన కొడుకు మహమ్మద్ సుల్తాన్‌ను గోల్కొండపై దండు పంపినాడు. అబ్దుల్లా కుతుబ్‌షా హైదరాబాదును విడిచి గోల్కొండలో తలదాచుకొన్నాడు. మొగల్‌సైన్యాలు హైదరాబాదును ఆక్రమించి దోచుకున్నాయి. (క్రీ శ. 1656.) ఔరంగజేబుతో అబ్దుల్లా జరిపిన సంధి సంప్రదింపులు ఫలించలేదు. అందుచే అబ్దుల్లా చక్రవర్తిని అర్థించాడు. షాజహాన్ జోక్యంతో ఔరంగజేబు సంధికి అంగీకరించినాడు. మొగలాయీలకు కోటి రూపాయలు చెల్లించడానికి, తన కూతురిని మహమ్మద్ సుల్తాన్ కిచ్చి పెండ్లిచేసి, అతడ్ని తనవారసుడుగా ప్రకటించడానికి అబ్దుల్లా కుతుబ్‌షా అంగీకరించినాడు. గోల్కొండ గౌరవప్రతిష్ఠలు అడుగంటినాయి. మీర్‌జుమ్లా మొగల్ సైన్యంలో మన్సబ్‌దారై, గోల్కొండ నుండి నిష్క్రమించినాడు.

మీర్‌జుమ్లాతిరుగుబాటు, మొగలాయిలతోడి యుద్ధం ఫలితంగా కర్ణాటకంలోని పరిస్థితులు అస్తవ్యస్తమయినాయి. నాటికే ఫ్రెంచి, డచ్చి, ఇంగ్లీషు వాణిజ్య సంఘాలు తూర్పు తీరంలో స్థావరా లేర్పరచుకున్నాయి. వారిపట్ల కుతుబ్‌షాహీలు ఉదారంగా ప్రవర్తించినారు. క్రీ.శ. 1636 లో అబ్దుల్లా ఆంగ్లేయులకు 'బంగారు ఫర్మానా' ద్వారా అనేక సౌకర్యాలు కలిగించినాడు అయినా రాజ్యంలోని కల్లోలాలు అవకాశంగా తీసుకొని ఐరోపా కంపెనీలు అవిధేయంగా ప్రవర్తించసాగినాయి. డచ్చివారు శాన్‌థోం ఆక్రమించినారు. మచిలీపట్టణం, చెన్నపట్టణంలో ఆంగ్లేయులు అద్దెలు, సుంకాలు చెల్లించడం మానినారు. పరిస్థితులను చక్కబరచడానికై అబ్దుల్లా కర్ణాటక రాష్ట్ర పాలకుడుగా రజాక్ కులీ నెక్నాంఖాన్‌ను నియమించినాడు (క్రీ.శ. 1663) నెక్నాంఖాన్ మంచి సమర్థుడు. కర్ణాటకంలోని తిరుగుబాటుదార్ల నణచి డచ్చివారినుండి శాన్‌థోమ్ న్నాక్రమించినాడు. అతని బలసామర్థ్యాలకు వెరచి చెన్నపట్టణంలోని ఆంగ్లేయులు పన్నెండు వేలు అద్దెగాను, 4200 రూపాయలు సుంకంగాను చెల్లించడానికి అంగీకరించినారు. ఈ ఒప్పందం తర్వాత అనతికాలానికే అబ్దుల్లాకుతుబ్‌షా మరణించినాడు. మీర్‌జుమ్లా ద్రోహంవంటి పరిస్థితుల ప్రభావంతోబాటు అబ్దుల్లా అనుసరించిన దూరదృష్టిలేని దుర్బలవిధానాల ఫలితంగా గోల్కొండ మొగల్ సామంతరాజ్యం కావడమేగాక పతనోన్ముఖమయింది.

## అబుల్ హసన్ (1672-1687)

అబ్దుల్లా మరణానంతరం అతని మూడో అల్లుడు, తానాషా (తానీషా)గా ప్రసిద్ధుడు నైన అబుల్ హసన్ సుల్తానయినాడు. అబుల్ హసన్ సిద్ధిపేట వాస్తవ్యుడైన సాలె అనీ, అక్కన్న మాదన్నలా తణ్ణి పెంచి పెద్దచేసినారనే స్థానిక గాథ యదార్థంకాదు. దేశీయ,విదేశీయ రచనలవల్ల అబుల్ హసన్ ఇరానీయుడని, కుతుబ్‌షా వంశానికి దూరపు బంధువనీ, వ్యాపార నిమిత్తం గోల్కొండ వచ్చి నాడని తెలుస్తున్నది అబుల్ హసన్ ఆధ్యాత్మిక చింతన ఉన్నవాడు. చాల కాలం అతడు షారజూకట్టాల్ అనే సూఫీ గురువు ఆశ్రమంలో పొద్దుపుచ్చినాడు. ఆ గురువే అబుల్ హసన్‌కి తానాషా (బాలయోగి) అనే బిరుదం ఇచ్చినాడట. అబ్దుల్లా పెద్దల్లుడైన సయ్యద్ మహమ్మద్ ప్రోత్సాహంతో అబుల్ హసన్ సుల్తానుకు అల్లుడయినాడు. అబుల్ హసన్ భార్యను బాద్‌షాబీబీ అనేవారు. అబ్దుల్లా మరణా నంతరం సయ్యద్ ముజఫర్, మూసాఖాన్, అక్కన్న, మాదన్న మొదలైన ఉద్యోగుల మద్దతుతో సయ్యద్ మహమ్మద్‌ను కాదని అబుల్ హసన్ సింహాసనం ఎక్కినాడు.

అబుల్ హసన్ వ్యసనపరుడనీ అసమర్థుడనీ వర్ణించే రచనల్లో సత్యం కన్పించదు. అతడు విద్యావంతుడు, ఆలోచనాపరుడు. అతని చర్యల్లో రాజనీతి ప్రతిఫలిస్తుంది పరిపాలనలో శ్రద్ధ వహించి తరచు దేశాటనం చేస్తుండేవాడు. సింహాసనం ఎక్కిన అచిరకాలానికే సయ్యద్ ముజఫర్ అహంకారంతో ఆస్థాన ఉద్యోగులపట్ల నిరంకుశంగా వ్యవహరిస్తుండడం గమనించి అతణ్ణి తొలగించి (1674) అతని స్థానంలో మాదన్నను మీర్‌జుమ్లాగా నియమించినాడు. మీర్ జుమ్లా అయినప్పటికీ సమస్త రాజ్య వ్యవహారాలూ మాదన్న మంత్రియే నిర్వ హించసాగినాడు. మొగలాయి విస్తరణ ప్రమాద భీతి ఉన్న ఆ రోజుల్లో గోల్కొండ స్వాతంత్ర్యాన్ని రక్షించడానికి హిందూ మంత్రియే హృదయ పూర్వకంగా ప్రయత్నించగలడని అబుల్ హసన్ భావించి వుంటాడు.

అక్కన్న - మాదన్నలు ఆంధ్రులనీ, కన్నడిగులనీ, మహారాష్ట్రులనీ భిన్న అభిప్రాయాలున్నాయి. వీరు పింగళి వంశస్థులు. అన్మకొండ వాస్తవ్యులు అని తెలుస్తుంది. ఈ సోదరులు బహు భాషల్లో పండితులు. ఆస్థాన ఉద్యోగానికి నాడు అవసరమైన విద్యల్లో శిక్షణపొందినారు. మొదట్లో సయ్యద్ ముజఫర్ కింద ఉద్యోగాల్లో చేరినారు. సయ్యద్ ముజఫర్ సర్వ సైన్యాధ్యక్షుడయినప్పుడు అతనికి మాదన్న పేష్కారు కాగా, మాదన్నకు అక్కన్న కార్యదర్శి అయినాడు. క్రీ.శ. 1674లో 'సూర్యప్రకాశరావు' అనే బిరుదంతో మాదన్నను మీర్‌జుమ్లా చేసి అబుల్ హసన్ రాజ్య వ్యవహారాలన్నీ అతనికి అప్పగించినాడు.

మాదన్న ప్రముఖ శక్తిపరుడు. పాలనాదక్షుడు. కొండవీడు, కొండపల్లి, ఓరుగల్లు మొదలైన దుర్గాల రక్షణ శ్రేణులు బలపరచి సైన్యాన్ని వృద్ధి చేసినాడు. పాలనా యంత్రాంగాన్ని సంస్కరించి ఆర్థిక వనరులు పెంచినాడు. మద్రాస్‌లోని ఆంగ్లేయుల ఆగడాలు కట్టించి, వారు చెల్లించవలసిన అద్దెలు, సుంకాలు బకాయీలతోసహా వసూలు చేయగలిగినాడు. అయితే, మాదన్న హిందూ పక్షపాతియై, తన బంధుమిత్రులను ఉన్నతోద్యోగాల్లో నియమించినాడు. అతని అన్న అక్కన్న సర్వసైన్యాధ్యక్షుడై (సర్‌లష్కర్) అంతరంగిక వ్యవహారాలు చక్కబెట్టేవాడు. తమ్ముడు వెంకన్న రుస్తుంరావు అనే బిరుదంతో సైనికోద్యోగి అయినాడు. మేనల్లుడు పొదిలి లింగన్న కర్ణాటక పాలకుడు కాగా, మరొక మేనల్లుడు కంచర్ల గోపన్న భద్రాచలం తరఫ్‌దారయినాడు మాదన్న ముస్లిములపట్ల - ముఖ్యంగా విదేశీ ముస్లిములపట్ల ప్రతీకార కాంక్షతో వ్యవహరించినాడనీ, లంచగొండియనీ, కొన్ని సందర్భాల్లో రాజ్య గౌరవ భద్రతలకు భంగకరంగా స్వార్థంతో వ్యవహరించినాడనీ సమకాలిక ముస్లిం, పాశ్చాత్య రచయితల వ్రాతల్లో సత్యం లేకపోలేదని జదునాథ్ సర్కార్, కృష్ణస్వామి అయ్యంగార్, షేర్వాణీవంటి చరిత్రకారుల అభిప్రాయం. మాదన్న ముస్లిం గురువులకు, సంస్థలకు దానధర్మాలు చేయకపోలేదు. కాని, ముస్లిములపట్ల మరికొంత ఉదారంగా విచక్షణతో వ్యవహరించివుంటే అతణ్ణి ప్రధాని చేయడంలోని అబుల్ హసన్ ఆశయం ఫలించి వుండేది.

అబుల్ హసన్ పాలన కాలంలో- దాక్షిణాత్య రాజకీయాలు క్లిష్టరూపం ధరించినాయి. పాదుషా ఔరంగజేబు (1658-1707) దాక్షిణాత్య రాజ్యాలను నిర్మూలించవలెననే దీక్షతో అవకాశం లభించినపుడల్లా దాడులు పంపుతున్నాడు. బిజాపూర్‌లో అలీ అదిల్‌షా మరణించి (1672) బాలుడైన సికందర్ ఆదిల్‌షా సింహాసనం ఎక్కడంతో స్వదేశీ విదేశీ ముస్లింవర్గాలమధ్య సంఘర్షణ విజృంభించి రాజ్యం కల్లోలితమయింది. క్రీ.శ. 1650 ప్రాంతం నుండి మహారాష్ట్ర వీరుడు శివాజీ సాహసకృత్యాలు ప్రారంభమయినాయి. మొదట్లో బిజాపూర్ గోల్కొండ రాజ్యాలపై దాడులు జరిపి శివాజీ దేశాన్ని కొల్లగొట్టినాడు. క్రీ. శ. 1672 లో గోల్కొండవరకు దాడిచేసి రెండు లక్షల హొన్నులు వసూలు చేసినట్లు తెలుస్తుంది (షేర్వాణీ). క్రమంగా బీజాపూర్, గోల్కొండలతో సమాధానపడి మొగలాయిల నెదిరించడానికి శివాజీ ప్రయత్నించినట్లు కన్పిస్తుంది. క్రీ. శ. 1674 లో 'స్వరాజ్యం' అనే పేర స్వతంత్ర మహారాష్ట్ర రాజ్యాన్ని శివాజీ స్థాపించినాడు. స్వరాజ్య విస్తరణాభివృద్ధులపట్ల వహించినంతగా మొగలాయి విస్తరణకు సమైక్య ప్రతిఘటనను సంఘటితం చేయడానికి శివాజీ శ్రద్ధ వహించలేదు. మాదన్న

మంత్రి ప్రోత్సాహంతో క్రీ.శ. 1676 లో శివాజీ గోల్కొండను దర్శించి అబుల్ హసన్‌తో సంధి చేసుకున్నాడు. శివాజీ సాగించనున్న దక్షిణ దిగ్విజయ యాత్రలో ప్రతినిత్యం సైన్యపోషణకై మూడువేల హొన్నులు సుల్తాన్ చెల్లించేటట్లు, శివాజీ కర్ణాటకంలో జయించిన ప్రాంతాలను సుల్తానుతో పంచుకునేటట్లు ఒప్పందం జరిగింది. క్రీ.శ. 1677 లో బళ్లారి, వెల్లూరు, ఆరణి, జింజి మొదలైన ప్రాంతాలను శివాజీ జయించినాడు. ఒప్పందం ప్రకారం శివాజీకి అబుల్ హసన్ డబ్బు చెల్లించినాడు. కాని, శివాజీ మాత్రం తాను జయించిన ప్రాంతాలేవీ సుల్తాన్ పరం చేయలేదు. ఇది మోసంగా, తనకు జరిగిన పరాభవంగా సుల్తాను, రాజకుటుంబము, ముస్లింప్రభు వర్గీయులు భావించినారు. ఒప్పందానికి కారకుడైన మాదన్నపట్ల రాజకుటుంబానికి, ముస్లింలకు అనుమానము, ద్వేషమూ పెరగడంలో ఆశ్చర్యం లేదు.

శివాజీ క్రీ.శ. 1680 లో మరణించి శంభూజీ ఛత్రపతి అయినాడు. శంభూజీలో రాజనీతి మృగ్యం. అందుచే ఔరంగజేబ్‌కు దక్షిణదేశం జయించడానికి నాటివరకూ వున్న ఆటంకం తొలగి అవకాశం హెచ్చింది. క్రీ.శ. 1685 లో ఔరంగజేబు దక్షిణదిగ్విజయయాత్ర ప్రారంభమయింది. ప్రత్యక్షంగానూ పరోక్షంగానూ మహారాష్ట్రులకు సహాయకారులుగా ఉన్న బిజాపూరు, గోల్కొండలను ఆక్రమించి, అనంతరం స్వరాజ్యాన్ని జయించాలనే పథకం ప్రకారం క్రీ. శ. 1686 లో ఔరంగజేబు బిజాపూర్‌పై దండెత్తినాడు. బిజాపూర్‌కు గోల్కొండ సైనికసహాయం అందకుండా మొగల్ సేనలు ఆటకాయించినాయి. అబుల్ హసన్ ప్రయత్నాలు గుర్తించి ఔరంగజేబు బిజాపూర్, గోల్కొండలపై ఒకే మారు దాడులు జరిపినాడు. మొగల్, కుతుబ్‌షాహీ సైన్యాలు మాల్‌ఖేడ్ దగ్గర తారసిల్లినాయి. మొగల్ సైన్యం రాకుమారుడు మవుజాం (షాఆలం) నాయకత్వంలో నడిచింది. మొదట్లో గోల్కొండకే విజయం లభించింది కాని, చివరకు గోల్కొండ సైన్యాలు ఓడి చెల్లాచెదరయినాయి ఇబ్రాహీం, దావూద్, మొహమ్మద్ తాకీ, షరీఫ్ ఉల్‌ముల్క్ మొదలైన కుతుబ్‌షాహీ సేనాపతులు మొగలాయీలతో చేరినారు. అబుల్ హసన్ హైదరాబాదు విడిచివెళ్ళి గోల్కొండ కోటలో తలదాచుకొన్నాడు. నిస్సహాయమైన హైదరాబాద్‌లో మొగల్ సైన్యాలు ప్రవేశించి విచక్షణ లేకుండా దోపిడి చేసినాయి చివరకు షాఆలం విధించిన షరతులతో అబుల్ హసన్ సంధి చేసుకున్నాడు సంధి ప్రకారం బకాయీలకింద అబుల్ హసన్ మొగలాయీలకు కోటిహొన్నులు, సాలుసరికప్పం రెండు లక్షలు చెల్లించవలె. మాల్‌ఖేడ్ ప్రాంతాన్ని మొగలాయీలకు అప్పగించవలె. అక్కన్న మాదన్నలను ఉద్యోగనుండి తొలగించవలె.

మొగల్ సైన్యం నిష్క్రమించిన తరువాత అక్కన్న మాదన్నలను తొల గించడానికి సుల్తాన్ జాప్యం చేసినాడు. ఔరంగజేబుకు కోపకారణం హిందూ సోదరులేనని కుతుబ్‌షాహీ అంతఃపురము, ముస్లిం ప్రముఖవర్గమూ భావించినారు. అంతఃపుర ప్రోత్సాహంతో షేక్ మిన్హాజ్ నాయకత్వంలో అక్కన్న మాదన్నల హత్యకు కుట్ర సిద్ధమయింది. క్రీ.శ. 1686 మార్చి 24 వ తేదీ రాత్రి సుల్తాన్‌తో సంప్రదించి, ఇంటికి మరలుతున్న అక్కన్న మాదన్నలను గోల్కొండ నడివీధిలో హత్య చేసినారు. సుల్తానే స్వయంగా వారిని వధించినాడనే సమాచారం యథార్థం కాదని చరిత్రకారులు భావిస్తున్నారు. అక్కన్న మాదన్నల తలలు ఔరంగజేబుకు కాన్కగా సమర్పించడం జరిగింది.

అక్కన్న మాదన్నల నిష్క్రమణతో ఔరంగజేబు తృప్తి వహించలేదు. గోల్కొండలో హిందూ ప్రాబల్యం అనేది అబుల్ హసన్‌ను నిందించడానికి ఉపయోగించిన సాకు మాత్రమే. గోల్కొండ విధ్వంసమే ఔరంగజేబు ఆశయం. అక్కన్న మాదన్నల హత్యతో గోల్కొండ రక్షణ మరింత దుర్బలమయింది. బిజాపూర్ ఆక్రమణ పూర్తయినంతనే క్రీ.శ. 1687 లో ఔరంగజేబు స్వయంగా గోల్కొండ దుర్గాన్ని ముట్టడించినాడు. ముట్టడి ఎనిమిది మాసాలు సాగింది. గోల్కొండ సైన్యాలు ధైర్యసాహసాలతో పోరాడి మొగలాయిలకు అపార నష్టం కలిగించినాయి. ఔరంగజేబుకు విజయం అనుమానాస్పదమయింది. చివ రకు గోల్కొండ సేనాపతుల్లో అబ్దుల్లా పాణి అనే ద్రోహికి లంచం ఇచ్చి అర్ధ రాత్రివేళ కోట తూర్పుద్వారం తెరిపించి మొగల్ సైన్యాలు కోటలో ప్రవేశించి నాయి. ప్రభు భక్తిపరులైన రజాక్ లారీ వంటివారు ఆమరణాంతం మొగల్ సైన్యాలతో తలపడి పోరాడినారుకాని, లాభం లేకపోయింది. కోట మొగలాయీల వశమయింది. అబుల్ హసన్ బందీ అయినాడు. అతణ్ణి సకుటుంబంగా గాల్వియర్ కోటకు పంపినారు. కోటలోని ఏడుకోట్లకుపైగా ధనం, అపారములైన సువర్ణ వజ్ర వైడూర్య రాశులను ఔరంగజేబు దోచుకున్నాడు. గోల్కొండ రాజ్యం మొగల్ సామ్రాజ్యం అంతర్భాగమయింది. తిరిగి ఆంధ్రదేశం వ్యక్తిత్వాన్ని కోల్పోయింది.

## దేశ కాల పరిస్థితులు

కుతుబ్‌షాహీలకు ఆంధ్రుల చరిత్రలోనేగాక యావద్భారత చరిత్రలోనే ఒక వైశిష్ట్యం వుంది. కుతుబ్‌షాహీలు పారశీక ముస్లిములు. అయినా, తాము విదేశీయులమని వారెన్నడూ భావించలేదు. కర్నూలు, అనంతపురం ప్రాంతాలు మినహా మిగిలిన ఆంధ్రప్రాంతాలను జయించి సమైక్యంచేసి ఆర్థిక సంస్కృతా భివృద్ధికి కృషి చేసినారు. స్థానిక వేషభాషలపట్ల ఆదరాభిమానాలు ప్రదర్శించ డమేగాక స్వయంగా అనుసరించినారు. తెలుగు కవులను పోషించడమేగాక

స్వయంగా తెలుగును అభ్యసించినారు. తెలుగులో ఫర్మానాలు జారీ చేసినారు; వానిని నాగరి లిపిలో వ్రాయించినారు. ఉద్యోగుల నియామకంలో విచక్షణ చూప లేదు. వారి పాలనలో హిందువులకు పూర్తి మతస్వాతంత్ర్యం వుండేది. తాము విదేశీయుల పాలనకింద వున్నామనే భావమే ప్రజలకు ఉండేదికాదు. కుతుబ్ షాహీలు - ముఖ్యంగా మాలిక్ ఇబ్రాహింషా, తానాషాలు ప్రజల స్మృతిపథంలో చెరగని ముద్ర వేసుకున్నారు. ముస్లిం పాలకులకు స్థానిక హిందూ ప్రజలకు మధ్య ఇంతటి పరస్పరాభిమానం భారతదేశంలో మరే ప్రాంతంలోనైనా ఉండేదా అనేది అనుమానం. అందుచే కుతుబ్‌షాహీలను తెలుగు రాజులని వర్ణించడంలో విశేషం లేదు.

**పాలన విధానం**

కుతుబ్‌షాహీలు బహమనీ సుల్తానుల పాలనవిధానమే చాలవరకు అనుసరించినారు. ప్రభుత్వ యంత్రాంగంలో సుల్తానుది కీలకస్థానం. తాము దైవాంశ సంభూతులమని సుల్తానులు విశ్వసించినారు. న్యాయతః వారు నిరంకుశులు. ప్రభుత్వ విధానాలను రూపొందించి సుల్తానే ఫర్మానాలు జారీ చేసేవాడు. ఉన్నతోద్యోగులను రాయబారులను నియమించేవాడు. గోల్కొండ రాజ్యం ఐశ్వర్యానికి తమ అధికారానికి అనుగుణంగా రాజాస్థానం ఆడంబర విలాసాలతో నిండివుండేది. కుతుబ్‌షాహీలు విద్యావంతులు, ఉన్నత సంస్కారం వున్నవారు. ప్రజాక్షేమాన్ని గుర్తించి పాలించినారు. తరచు రాజ్యంలో పర్యటించి ప్రజల కష్టసుఖాలు విచారించేవారు. ఈ పర్యటనల్లో రాజశిబిరం 'నడుస్తున్న రాజధాని నగరమా' అనిపించేటంత ఆడంబరంగా ఉండేదని సమకాలిక రచనలవల్ల తెలుస్తుంది.

సుల్తాన్‌కు సలహా ఇవ్వడానికి మజ్లిస్ దివాన్‌దరి అనే పరిషత్తు వుండేది. దీనిలో మతాచార్యులు, విద్వాంసులు, రాజనీతిపరులు, ఉన్నతోద్యోగులు సుమారు ఇరవైమంది సభ్యులుగా వుండేవారు. వీరిని సుల్తాన్ నియమించేవాడు. వీరు రాజధానిలోనే వుంటూ తరచుగా సమావేశమై రాజ్య వ్యవహారాలు చర్చించి విధాన నిర్ణయంలో సుల్తానుకు తోడ్పడేవారు.

సుల్తాన్ తరువాత రాజ్యంలో అధికారి పేష్వా లేక ప్రధాని. అన్ని విధాలా పేష్వా సుల్తానుకు అండదండగా వుండేవాడు. ప్రభుత్వం అతని పర్యవేక్షణలో జరిగేది. పేష్వానే అబుల్ హసన్ కాలంలో దివాన్ అన్నారు. పేష్వా తర్వాత అధికారి మీర్‌జుమ్లా - ఆర్థిక శాఖామంత్రి; అందుచే తరచు పేష్వాకంటె ఎక్కువ అధికారం చలాయిస్తూ వుండేవాడు. సైనిక శాఖామంత్రి ఐనుల్ ముల్క్. పేష్వాకింద వజీర్లనే పన్నెండుమంది మంత్రులుండేవారు. వీరికి జాగీర్లుండేవి. ఈ జాగీర్లు రాజధానికి దూరంగా ఇచ్చేవారు. అందుచే వీరు బలవంతులై

సుల్తాన్ అధికారాన్ని ధిక్కరించకుండా వీరి చర్యలను మెలకువతో పరిశీలిస్తుండేవారు, పేష్వాకింద 'దబీర్' అనే ఇద్దరు కార్యదర్శులుండేవారు. ఫర్మానాలు తయారుచేయడం, వానిని అమలుపరచడం వీరివిధి వీరిలో ఒకరు తప్పనిసరిగా హిందువై వుండేవాడు. ఈతడు ఫర్మానాలను స్థానిక భాషల్లో తర్జుమా చేసేవాడు. మజుందార్ గణాంకశాఖాధ్యక్షుడు. కొత్వాల్ రక్షక భటశాఖాధికారి. శాంతిభద్రతల రక్షణ ఈతని ఉద్యోగ ధర్మం. కొన్ని సందర్భాల్లో ఈతనికి న్యాయావిచారణాధికారం వుండేది. గోల్కొండ రాజ్యంలో రక్షకభటశాఖ సమర్థంగా పనిచేస్తున్నదని టవర్నియర్ మొదలైన పాశ్చాత్య యాత్రికులు వ్రాసినారు.

కుతుబ్‌షాహీలు న్యాయనిర్వహణలో శ్రద్ధవహించినారు. గ్రామంమొదలు రాజధాని వరకు భిన్న అంతస్తుల్లో న్యాయస్థానాలుండేవి. కాజీలు, పండితులు నేరాలు విచారించి శిక్షణ విధించేవారు. న్యాయం జరగనిపక్షంలో సుల్తానుకు పిర్యాదు చేసుకొనే అవకాశం వుంది. మహమ్మద్‌కులీ 'దాద్‌మహల్'ను, అబ్దుల్లా కుతుబ్‌షా 'అమన్ మహలు'ను న్యాయస్థానాలుగా నిర్మించినారు. వారానికొకమారు సుల్తాను ఈ భవనాలలో సమావేశమై వివాదాలు పరిష్కరించి న్యాయం జరిపేవాడని టవర్నియర్ వ్రాసినాడు. బిజాపూర్ వాస్తవ్యుడైన మీర్జా ఇబ్రాహిం జుబేరి తన 'బసాటిన్ సలాటిన్' (దస్తూర్ ఉల్ అమర్) అనే రాజనీతి గ్రంథంలో న్యాయనిర్వహణ ఆదర్శప్రాయంగా వుండాలని ఇచ్చిన సలహా కుతుబ్‌షాహీలు పాటించినారు.

గోల్కొండ రాజ్యాన్ని ఆరు రాష్ట్రాలుగా విభజించినారు. రాష్ట్రాన్ని తరఫ్ అనేవారు. రాష్ట్రపాలకుడు తరఫ్‌దార్. రాష్ట్రాలలో కర్ణాటకం చాలా ముఖ్యమయింది. మద్రాస్, పులికాట్ వంటి రేవులు ఇంగ్లీషు, డచ్చి స్థావరాలు ఉండి ఐశ్వర్యవంతమయినందున కర్ణాటకపాలన పట్ల సుల్తానులు శ్రద్ధ వహించి, నెక్నంఖాన్, అక్కన్న, లింగన్న వంటి సమర్థులను పాలకులుగా నియమించేవారు. సమతులు రాష్ట్రంలోని విభాగాలు. క్రమంగా గోల్కొండ రాజ్యంలో మొగల్‌పాలన విధానాన్ని అనుసరించి సర్కారు, పరగణా అనే విభజన అమలు జరిగింది. అబుల్ హసన్ కాలంలో 37 సర్కారులు, 517 పరగణాలు ఉండేవి. సర్కార్‌లోనూ పరగణాలలోనూ ఫౌజ్‌దార్లు, న్యాయనిర్వహణకు కాజీలు ఉండేవారు. ఖలీల్ అనే స్థానికోద్యోగి ఫర్మానాలు ప్రజలకు తెలియజెప్పి, అవి అమలు జరగడంలో తోడ్పడేవాడు. రేవుపట్టణాల్లో షాబందర్, హవల్‌దారులు సుంకాలు వసూలు చేసి శాంతిభద్రతలు పరిరక్షించేవారు. గ్రామవ్యవహారాలను పూర్వంవలెనే బారాబలవంతులనే పన్నిద్దరు ఆయగాండ్రు నిర్వహించేవారు.

శిస్తు వసూలుకు సయితం సర్కారు ప్రమాణంగా ఉండేది. శిస్తు వసూలు అధికారాన్ని వేలంపాటల్లో అమ్మేవారు. అధికారం కొన్నవారికి 'ముస్తజీర్లు' అని పేరు. వీరు సర్కారు కేంద్రంలో నివసిస్తూ సర్కారును కొన్ని ప్రాంతాలుగా విభజించి తమ ఇష్టులకు శిస్తు వసూలు అధికారాన్ని పంచేవారు. ఈ విధంగా ప్రభుత్వానికి రైతుకు మధ్య ఇద్దరు ముగ్గురు మధ్యవర్తు లేర్పడడంతో రైతుపై శిస్తు భారం పెరిగింది. ముస్తజీర్లలో అధిక సంఖ్యాకులు హిందువులు. వారిలో బ్రాహ్మణులు, వైశ్యులు ఎక్కువ. మూర్తజానగర్ సర్కారునుండి 11,67,709, ముస్తఫా నగర్ నుండి 12,00,160 వరంగల్ నుండి 7,78,491, గోల్కొండ నుండి 15, 57, 573 హూన్నులు శిస్తురూపంలో వసూలయినట్లు తెలుస్తున్నది.

కుతుబ్‌షాహీలకు ఐదు లక్షల సైన్యం ఉన్నట్లు క్రీ.శ. 1660 ప్రాంతంలో గోల్కొండ దర్శించిన థేవనట్ వ్రాసినాడు. గోల్కొండ సైన్యం ఐనుల్ ముల్క్ పర్యవేక్షణలో వుండేది. అతని తరువాతి సైనికోద్యోగి బక్షి ఉల్‌ముల్క్. సైన్యంలో సిద్ధసైన్యం, జాగీర్‌దార్ సైన్యం ఉండేవి. అబుల్ హసన్ కాలంలో రాజధానిలో 55 వేల అశ్వదళం, 96 వేల పదాతిదళం ఉన్నట్లు గిరిధర్‌లాల్ వ్రాసిన 'తారీఖీ జఫ్రా' అనే గ్రంథం చెబుతున్నది. ఇదిగాక సుల్తాన్‌లు అంగ రక్షకదళాన్ని (ఖాసాఖైల్) పోషించినారు అబుల్ హసన్ కాలంలో అంగరక్షక దళంలో ఆరువేల ఆశ్వికులు సర్‌ఖైల్ నాయకత్వంలో ఉండేవారు సిద్ధసైన్యా నికి, అంగరక్షకదళానికి సుల్తాన్ జీతాలిచ్చేవాడు. మంత్రులు, జాగీర్దార్లు సైన్యాలు పోషించి సుల్తాన్‌కు సరఫరా చేసేవారు. కర్ణాటక తరఫ్‌దార్ సైన్యంలో 5 వేల అశ్వదళం, 40 వేల పదాతిదళం ఉండేది. సైన్యాలను పోషిస్తున్నందువల్లనే తరఫ్‌దార్లను షర్‌లష్కర్‌లనేవారు. సైనికులకు ఒకే రకం దుస్తులు (Uniforms) ఉండేవి. ఆశ్వికులు ఎర్రపంట్లాములు, నల్ల తలపాగాలు ధరించేవారు. కుతుబ్‌షాహీలు శతఘ్నిదళ పోషణలో శ్రద్ధ వహించినారు. ఇందులో ఎక్కువ మంది యూరోపియన్లు. అబుల్‌హసన్ కాలంలో శతఘ్నిదళానికి సాలుకు సుమారు తొమ్మిది లక్షల హూన్నులు వ్యయమయ్యేది. మొగల్ సైన్యాన్ని ఎనిమిది మాసాలు నిలువరించి పోరాడిన గోల్కొండసైన్యంలోని శక్తిసామర్థ్యాలను, క్రమ శిక్షణను బేరీజు వేయడం సాధ్యం కాదు.

**ఆర్థిక పరిస్థితులు**

కుతుబ్‌షాహీలు క్రీ.శ. 1636 నుండి మొగలాయీలకు చెల్లించిన నజ రానాలు, యుద్ధనష్టపరిహారాలు, సాలుసరి కప్పాలనుబట్టి గోల్కొండ రాజ్యం సిరిసంపదలను ఊహించవచ్చు. 1686 లో హైదరాబాదును దోచిన మొగల్ సైన్యాలు నగర ఐశ్వర్యానికి 1687 లో గోల్కొండను దర్శించిన మొగల్ రాకుమారుడు దర్బారు వైభవానికి దిగ్భ్రాంతి చెందినట్లు సమకాలిక రచనలు

చెబుతున్నాయి. ప్రభుత్వ ఆదాయం 5 కోట్ల హొన్నులని అందులో సాలుకు 19 లక్షలు నికరాదాయంగా ఖజానాలో చేరేదని మెథోల్డ్ పేర్కొన్నాడు. వ్యవసాయం, పరిశ్రమలు, వాణిజ్యం సుల్తానుల ప్రధాన ఆదాయ మార్గాలు. ప్రజల్లో అధిక సంఖ్యాకులకు వృత్తి వ్యవసాయమే. భూమిశిస్తుద్వారా ప్రభుత్వానికి రెండుకోట్ల ఆదాయం వచ్చేది అయితే, రైతులపై పన్నులభారం ఎక్కువగా వుండేది.

అనాదిగా ఆంధ్రదేశం వజ్ర పరిశ్రమకు పేరుపొందింది. 'గోల్కొండ వజ్రాలు' ప్రపంచఖ్యాతి నార్జించినాయి. కృష్ణాతీరంలో కోల్లూరు (గుంటూరు), పరిటాల (కృష్ణా), రామళ్ళకోట, వజ్రకరూరు (అనంతపురం) వజ్రాల గనులు ప్రసిద్ధమైనవి. ఈ గనులను ప్రభుత్వం 'కౌలు'కు ఇచ్చేది. కోల్లూరు గనిని మూడులక్షల పణాలకు కౌలుకు ఇచ్చినట్లు, అందులో 30 వేలమంది పనిచేస్తున్నట్లు మెథోల్డ్ వ్రాసినాడు. జగత్ప్రసిద్ధమైన కోహినూర్ వజ్రం కోల్లూరు గనుల్లోనే దొరికింది. మొదట్లో ఆ వజ్రం బరువు 750 ఇంగ్లీషు కారట్లట! వజ్రాలే గాక ఆంధ్రదేశంలో పచ్చలు వైడూర్యాలు కూడ దొరికేవని తెలుస్తుంది.

వజ్రాల తరువాత చెప్పదగింది ఇనుము-ఉక్కు పరిశ్రమ. 'ఇనుము విరిగెనేని ఇరుమారుముమ్మారు కాచి అతకనేర్చు కమ్మరీడు' అనే వేమన్న వాక్యం వల్ల ఇనుముపరిశ్రమలో కమ్మర్లుసాధించిన నైపుణ్యం వెల్లడవుతుంది ముఖ్యంగా నిర్మల్, ఇందూర్‌లు ఆయుధ పరిశ్రమకు కేంద్రాలు. ఇందల్‌వాయ్‌లో తయారైన కత్తులు, బాకులకు దేశంలోని విపణివీధులన్నిటా మంచిగిరాకీ వుందని థేవ్‌నట్ వ్రాసినాడు గోల్కొండ నుండి ఇనుము పంజాబుకే గాక పర్షియాకు సయితం ఎగుమతి అయ్యేది. కొండపల్లి, నరసాపురాలు దారుపరిశ్రమకు ప్రధాన కేంద్రాలు. రాజ్యం వివిధ ప్రాంతాల్లో వస్త్ర పరిశ్రమ విరివిగా సాగింది. వస్త్ర పరిశ్రమలో ఉపయోగించే నీలిమందును నల్గొండ ప్రాంతంలో ఎక్కువగా తయారుచేసి విదేశాలకుకూడ ఎగుమతి చేసేవారు. మచిలీపట్టణం నాడొక గొప్ప పారిశ్రామిక వాణిజ్యకేంద్రం. అక్కడ కలంకారీ బట్టలేగాక, తెరచావగుడ్డ, తుపాకిమందు, తూటాలు తయారుచేసేవారు. మచిలీపట్టణం, నరసాపురాలలో ఓడల నిర్మాణం జరిగేది. స్థానికులేగాక ఇంగ్లీషు, పోర్చుగీసువారు సయితం తమ ఓడల్ని ఈ రేవుల్లో తయారుచేయించుకొనేవారు. తమ వర్తకులు భారత దేశంలో ఓడలు నిర్మించుకోరాదని ఆంగ్ల ప్రభుత్వం ఆదేశించింది!

వస్తూత్పత్తి కేంద్రాల్లోనే వాణిజ్యం విరివిగా సాగింది. వాణిజ్యం కేంద్రాలను, రేవుపట్టణాలను కలుపుతూ రహదారులుండేవి. హైదరాబాద్ నుండి నల్లగొండ కొండపల్లి, బెజవాడల మీదుగా మచిలీపట్టణానికి; హైదరాబాద్ నుండి సూరత్‌కు; హైదరాబాద్ కోళ్ళూరుల మధ్య, విజవాడ నుండి కొండవీడు గండి

కోటల మీదుగా చెన్నపట్టణానికి; మచిలీపట్టణం, పులికాట్‌ల మధ్య రహదారులు ముఖ్యమైనవి. నరసాపురం, మచిలీపట్టణం, నిజాంపట్టణం (పెదపల్లి), పులికాట్, చెన్నపట్టణాలు ముఖ్యమైన రేవు పట్టణాలు. ఈ రేవులనుండి పశ్చిమాన అరేబియా, టర్కీ, పర్షియా, ఐరోపాదేశాలతోనూ; తూర్పున అరకాన్, పెగూ, మలయా మొదలైన దేశాలతోనూ వాణిజ్యం జరిగింది. డచ్చి, ఇంగ్లీషు వర్తక సంఘాలు ఈ రేవు ప్రాంతాలను కౌలుకు తీసుకొని గిడ్డంగులు నిర్మించి వాణిజ్యం సాగించేవి. వారిరాకతో విదేశవాణిజ్యం పెరిగింది కాని, క్రమంగా విదేశీయుల హస్తగతమయింది వాణిజ్య సుంకాలు ప్రభుత్వానికి ప్రధాన ఆదాయ మార్గాలున్నాయి. ఎగుమతి, దిగుమతులమీద సాధారణంగా 3½శాతం సుంకం విధించేవారు. పులికాట్ రేవులోమాత్రం 2 శాతమే సుంకం. రేవులో లంగర్ వేసిన ప్రతి నౌక 15 హూన్నులు చెల్లించవలె. నిజాంపట్టణం పర్గణా నుండి వాణిజ్యసుంకాల ద్వారా ఆరు లక్షల హూన్నులు లభించేవి. ఎగుమతుల్లో ధాన్యం, వస్త్రాలు, వజ్రాలు, ఇనుము-ఉక్కు సామాగ్రి; దిగుమతుల్లో చందనం కస్తూరి, పట్టు, లక్క, గాజు ముఖ్యమైనవి.

గోల్కొండలో ప్రధాన నాణెం హూన్ను ఇది బంగారు నాణెం. విదేశీయులు దీన్నే పెగొడా అనేవారు. హూన్ను తరువాతిది ఫణం - హూన్నులో పదారోవంతుది; తరువాతివి 'తార్', 'కాస్'లు. ఫణంలో 32వ వంతు 'తార్'; తార్‌కు రెండు కాసులు. క్రమంగా మొగల్‌రూపాయి, అణాలు వాడుకలోనికి వచ్చినాయి. రూపాయి విలువ హూన్నులో నాలుగో వంతు. రూపాయి వెండి నాణెం. రూపాయి ఎత్తు తులం ఉంటుందని, విలువలో ఒక షిల్లింగు ఆరు పెన్నీలని థేవ్‌నట్ వ్రాసినాడు. దిగుమతియైన పట్టు, కస్తూరి మొదలైన విలాస వస్తువుల ధరలు ఎక్కువగా వున్నా నిత్యావసర వస్తువులు చవకగానే లభించేవి. ఒక రూపాయకు బియ్యం 40 శేర్లు; నెయ్యి అర్ధమణుగు. వ్యవసాయపు ఎద్దు ఖరీదు 5 రూపాయలు; మేక వెల 12 అణాలు. కార్ఖానాల్లో పనిచేసే కూలీకి రోజుకు మూడణాలు వేతనం. నాటిధరలను బట్టి ఈ వేతనంతో సాధారణ జీవితం గడపవచ్చు.

**సాంఘిక పరిస్థితులు**

కుతుబ్ షాహీలు పారశీకంనుండి వచ్చిన షియా మతస్థులు. పర్షియా గోల్కొండల మధ్య రాయబారాలు తరచు నడుస్తుండేవి, గోల్కొండలో శుక్రవారం ప్రార్థనల్లో పర్షియా చక్రవర్తి పేరు చెప్పేవారు. షియా సంప్రదాయానికి సహజమైన సహనం కుతుబ్‌షాహీలు ప్రదర్శించినారు. రాజ్యం నలుమూలల్లో సుల్తానులు, వారి సామంతులు మసీదులు నిర్మించి, మాన్యాలిచ్చి పోషించినారు. అందులో పెద్దూరం లేదుగాని, హిందూ దేవాలయాలకు, బ్రాహ్మణులకు అగ్రహారా

లిచ్చి ఆదరించడం గమనార్హం. అబుల్ హసన్ భద్రాద్రి రామాలయానికి భద్రాచలం, శంకరగిరి, పాల్వంచ గ్రామాలను; కృష్ణాతీరంలోని మల్లేశ్వరస్వామి ఆలయానికి భోగాపురం, చెరుకూరు, వీరన్నపట్టడాలను దానం చేసినాడు. మహమ్మద్ కులీ ఉద్యోగియైన లాల్‌ఖాన్ ఉప్పునూతుల గ్రామం బ్రాహ్మణులకు దానం చేసినాడు. అబ్దుల్లా కాలంలో మీర్‌జుమ్లా ఒక బ్రాహ్మణునకు మదురాపురం అగ్రహారంగా ఇచ్చినాడు. ఇక ఉద్యోగుల నియామకంలో సుల్తానులు విచక్షణ చూపలేదు. వారికాలంలో హిందువులు ఉన్నతోద్యోగాలు నిర్వహించినట్లు పై చరిత్ర స్పష్టం చేస్తున్నది. మిరాశీదార్లు, జాగీరుదార్లు, దేశముఖ్‌లు, దేశపాండేలుగా బ్రాహ్మణ, రెడ్డి, వెలమ, కమ్మకులాలవారు అధికసంఖ్యలో ఉండేవారు. తర్వాతి కాలంలో తీరాంధ్రలోని ప్రసిద్ధ జమీందారులందరూ కుతుబ్‌షాహీ కాలంలో మిరాశీదార్లే. అయితే, మహమ్మద్ కులీమాత్రం షియమతాభిమానంతో సున్నీ మతస్థులను నిరసించినట్లు తెలుస్తుంది. దూరదృష్టిలేని ఈ విధానంవల్ల గోల్కొండలో సున్నీ - షియా వైషమ్యం ప్రబలి, సంఘర్షణలకు దారితీసింది. కుతుబ్‌షాహీల షియా అభిమానమూ హిందువులను ఉద్యోగాల్లో నియమించడమూ ఔరంగజేబు గోల్కొండపై దండెత్తడానికి సాకులయినాయి.

బహమనీల కాలంలో చాలవరకు తెలంగాణకు పరిమితమైన ముస్లింజనాభా గోల్కొండ యుగంలో ఆంధ్రదేశం అంతటా విస్తరించి వృద్ధిచెందింది. సుల్తానులెవ్వరూ పెద్ద ఎత్తున మతాంతరీకరణను ప్రోత్సహించిన నిదర్శనాలు లేవు. పర్షియా, మధ్య ఆసియా ప్రాంతాలనుండి ఉద్యోగార్థం, వ్యాపార నిమిత్తం ముస్లిము లనేకులు గోల్కొండ వచ్చి స్థిరపడినారు.

> "షేకు సైదు మొగలు చెలగిపఠానులు
> తురకలు దొరతనము తొలుతచేసి
> రాగ రాగవిడిచి రౌతులై కొలిచిరి"

అనే వేమన సూక్తివల్ల ముస్లిములలో పలు తెగలున్నాయనీ క్రమంగా వారిలో తాము పాలక వర్గానికి చెందిన వారమనే అహంకారం తొలగి చిన్న చిన్న ఉద్యోగాలు ఇతర వృత్తులు అవలంబించసాగినారని తెలుస్తున్నది.

హిందువుల్లో షణ్మతాలు ప్రచారంలో ఉండేవిగాని వానిలో స్మార్త, శైవ వైష్ణవాలు ముఖ్యమైనవి. స్మార్త బ్రాహ్మణులు చెదురుగా యజ్ఞాలు చేస్తుండేవారు. బహుదేవతారాధన, విగ్రహారాధనతోపాటు మత సంబంధమైన అనేక మూఢాచారాలుండేవి. కొలుపులు, జంతుబలులు యథాప్రకారం కొనసాగినాయి. ''బ్రతుకుతెరువు కొరకు బడుగులందరు పెద్దయోగివరులమనుచు'', ''లింగధారులందు దొంగలు గలరయా'' మొదలైన వేమన సూక్తులనుబట్టి మతం పేరుతో అమాయక ప్రజలను మోసగించడం జరుగుతుండేది. జాతకాలు, ముహూ

్రాలు, శకునాలలో హిందువులకు, ముస్లిములకుగూడ విశ్వాసం ఉండేది. బ్రాహ్మణ క్షత్రియ వైశ్యులతోబాటు కమ్మ, వెలమ, రెడ్డి పట్ర, చొల్ల, బలిజ, కుమ్మర, బెస్త, కమ్మరి, వడ్రంగి, కాసె, కంచర, అగసాల, సాలె, సాతాని, కటిక, జెట్టి, జాంద్ర, తొగట, గాండ్ల మొదలైన కులాలను హంస వింశతి కావ్యం పేర్కొంటున్నది. ఉద్యోగులుగా మిరాశిదార్లుగా బ్రాహ్మణుల పరిస్థితి కొంత మెరుగయింది. హిందువుల్లోనూ, ముస్లిముల్లోనూ బహుభార్యాత్వం, వేశ్యా లోలత్వం ఎక్కువగా వుండేవి. హైదరాబాద్ నగరంలోనే రెండువేలమంది వేశ్య లున్నారని టవెర్నియర్ వ్రాసినాడు. వేశ్యలకు ప్రభుత్వ ఆదరం, సమాజంలో గౌరవం ఉండేవి. హిందువుల్లో సతీసహగమనం తరచు కన్పిస్తుంది. కొందరు స్వచ్ఛందంగా సహగమనం చేసేవారనీ కొందర్ని బంధువులు, బ్రాహ్మణులు బలవంతంగా సహగమనం చేయించేవారనీ వెర్నియర్ మొదలైన విదేశ యాత్రికులు వ్రాసినారు.

హిందూ ముస్లిం సామరస్య పురోగతి ఈ యుగ సాంఘిక పరిణామాల్లో గమనించదగింది. పాలకుల సహనం, సామరస్యదృష్టి ప్రజల్లో ప్రతిఫలించి' పరస్పర అవగాహనకూ సంస్కృతీ సమ్మేళనానికి దోహదం చేసింది. వాస్తవానికి దక్షిణ భారతంలో హిందూ ముస్లిం సామరస్యం ముస్లిం సూఫీ మతగురువుల బోధనలతోనే ప్రారంభమయింది. సూఫీల్లో చిస్తీశాఖకు చెందిన గురువులు అల్లా ఉద్దీన్ ఖిల్జీ దండయాత్రలకు పూర్వమే దక్షిణ దేశంలో ప్రవేశించి తమ మఠాలు (కంఖాలు) స్థాపించినారు. ముస్లిములు, హిందువులు ఉభయులు వీరికి శిష్యు లయినారు. క్రీ.శ. 1294 లో మరణించినట్లు తెలుస్తున్న షేక్ ఫక్రుద్దీన్ పెను గొండలో కంఖాను నిర్మించినాదని తెలుస్తుంది. షేక్‌బాబాషర్‌ఫుద్దీన్, షియా బుద్దీన్ అనే సోదరులు నేటి హైదరాబాద్ సమీపంలో స్థిరపడినారు. బహమనీల కాలంనాటి సూఫీయోగులందరిలో బందెనవాబ్ గిసూదరాజ్ ప్రసిద్ధుడు. ఈతడు లౌకికదృక్పథం ప్రదర్శించి, మానవులందరూ సోదరులని బోధించినాడు. సూఫీ యోగులందరూ మతసహనానికి, హిందూముస్లిం సామరస్యానికి కృషిచేసి, హిందూ ముస్లిం సంప్రదాయాల సమ్మేళనానికి దారి తీసినారు. హిందువులకువలె ముస్లిములు సూఫీ యోగులకు సాష్టాంగ ధండప్రణామం చేసేవారు. మొహరం, రంజాన్ పండుగల్లో హిందువులు పాల్గొనేవారు. తెలుగులో మొహరం పాటలు చాల వున్నాయి .రంజాన్‌కు ముందురోజు జరిపే షబీరాత్‌లో ముస్లిములు తమ ఇండ్లను దీపాలతో అలంకరించుకొనేవారు. నౌరోజ్ హిందువుల వసంతోత్సవం వంటిదే. వివాహ సమయాల్లో తెరసెల్లాపట్టే ఆచారం హిందువులు, ముస్లిములు ఆచరించినారు. ముస్లిం నిర్మాణాల్లో పూర్ణకుంభం, లతాపద్మాలు, హంసలు, ఏనుగులవంటి హిందూ శిల్ప సంప్రదాయాలు ప్రవేశించినాయి. కంఖాలను

హిందువులు, దేవాలయాలను ముస్లిములు దర్శించేవారు. "తిరుపతికినిబోవ తురక దాసరిగాడు'' అంటాడు వేమన.

**లలితకళలు - సాహిత్యం**

కుతుబ్‌షాహీలకు లలితకళల్లోనూ సాహిత్యంలోనూ అభిమానం ఎక్కువ. వారిలో చాలమంది నిర్మాతలున్నారు. వారి నిర్మాణాలు షియామత సూత్రాలకు అనుగుణంగా పారశీక, పఠాన్, హిందూసంప్రదాయాల సమ్మేళనమైన మిశ్రమ శైలిలో వుంటాయి. ఈ శైలిలోనే గోల్కొండ, హైదరాబాద్, హాయత్‌నగర్, వినుకొండ, కంబం మొదలైనచోట్ల కుతుబ్‌షాహీలు, వారి సర్దారులు అనేక మసీదులు నిర్మించినారు. ఈ శైలిని ప్రారంభించింది కులీ కుతుబ్ ఉల్‌ముల్క్; అబుల్ హసన్ కాలంలో ఈశైలి ఉన్నతస్థితికి చేరింది. ఈ శైలిలో గుమ్మటాలు, కమానులు, మీనారెట్లు వైదేశికం; పక్షి, పుష్పలతాది అలంకారాలు భారతీయం. గోల్కొండ, హైదరాబాదుల్లో కుతుబ్‌షాహీలు నిర్మించిన రాజప్రాసాదాలు ప్రభుత్వ కార్యాలయ భవనాలు చాలవరకు శిధిలమయినాయి. అబ్దుల్లా కుతుబ్‌షా తన తల్లిపేర హయత్‌నగర్‌ను, అందులో ఒక రాజప్రాసాదాన్ని నిర్మించినాడు. ఈ అంతఃపురం పారిస్‌లోని ఫ్రెంచి రాజప్రాసాదమంతటి మనోహరంగా ఉంటుందని టవర్నియర్ వ్రాసినాడు. కుతుబ్‌షాహీలకు శాశ్వతమైన కీర్తి తెచ్చింది హైదరాబాద్ నగర నిర్మాణమే. నగరంలోను, నగరాన్ని పరివేష్టించి ఉద్యానవనాలు, పండ్లతోటలు ఉన్నవనీ అందుచేతనే హైదరాబాద్‌కు బాగ్‌నగర్ అనే పేరు వచ్చిందనీ థెవ్‌నట్ పేర్కొన్నాడు. బాగ్‌నగర్(ఉద్యానవన నగరం) భాగ్యనగర్‌గా సంస్కృతీకరణ పొంది వుండవచ్చును. మూసీనదిపైన ఈ నగరానికి రేఖాశాస్త్ర పద్ధతిపై నిర్మాణ ప్రణాళికను మహమ్మద్ కులీ తయారుజేసి పునాదులు వేసినాడు. కుతుబ్‌షా నిర్మాణాలలో ప్రశస్తమైన చార్‌మినార్‌ను నిర్మించిందికూడ అతడే. అరవై అడుగుల చతురశ్ర ప్రణాళికపై 60' ఎత్తు. 30'-6'' వెడల్పు ఉన్న కమానులపై నాల్గు అంతస్తుల్లో దీన్ని నిర్మించినారు. పై అంతస్తులో మాస్క్ ఉంది. పై అంతస్తును 146 మెట్లద్వారా చేరవచ్చు. 186' ఎత్తున్న నాల్గు మినారెట్లు ఈ నిర్మాణానికి అందమూ, హుందాతనము ఇస్తున్నాయి. చార్‌మినార్ నడిబొడ్డుగా ఉండి హైదరాబాద్ నాల్గుదిశలకు విస్తరించాలని ముహమ్మద్ కులీ ఉద్దేశం. చార్‌మినార్‌కు కొద్దిదూరంలో చార్‌కమాన్ నిర్మాణం జరిగింది. అరవై అడుగుల ఎత్తునవున్న ఈ కమానులు చాల గంభీర్యమైన కట్టడాలు. వీని ఉద్దేశ్యం స్పష్టంగా తెలియదు. కుతుబ్‌షాహీల మరొక ప్రసిద్ధ నిర్మాణం హైదరాబాద్‌లోని మక్కామసీదు. మక్కాలోని 'కాబా' ఆలయంలో వలె ఈ మసీదులో కూడ అన్నివేళలా ప్రార్థనలు జరుగుతూ ఉన్నందున

దీనికి పేరు వచ్చింది. దీనిలో సాంప్రదాయకమైన మినారెట్లు లేకపోవడం విశేషం. షేర్వాణీ అభిప్రాయంలో మక్కామసీదును ఢిల్లీలోని జామీమసీదుతో పోల్చవచ్చు.

కుతుబ్‌షాహీల చిత్రలేఖనంలో హిందూ పారశీక పద్ధతుల సమ్మేళనంతో బాటు పాశ్చాత్య సంప్రదాయ ప్రభావంకూడ కన్పిస్తుంది. దీన్ని దక్కనీవర్ణ చిత్రకళ అని వ్యవహరిస్తారు. గ్రంథాలను సూక్ష్మచిత్రాలతో అలంకరించే పద్ధతి కూడ దక్షిణదేశంలో ప్రచారం పొందింది. నైజాంషా కొలువులో తయారయిన "తారిఫ్ హుస్సేన్‌షాషాద్ షాహీదక్కన్" అనే గ్రంథంలో 14 సూక్ష్మ చిత్రాలున్నాయి. దక్షిణాపథంలో సూక్ష్మవర్ణ చిత్రాలకు మొదటి ఉదాహరణగా వీనిని పేర్కొంటారు. ఈ చిత్రాలన్నీ రాక్షసితంగడి యుద్ధానికి సంబంధించినవి. గోల్కొండ ఆస్థానంలోని మీర్‌హాషిం అనే చిత్రకారుని పనితనం మెచ్చుకొని మొగల్‌పాదుషా లాతణ్ణి తమ ఆస్థానానికి రప్పించుకున్నాడట! దక్కనీ వర్ణ చిత్ర శైలికి అతడే పితామహుడు. ఈ శైలి అబ్దుల్లా, తానాషాల కాలంలో పరిపుష్టినందింది. అబ్దుల్లా, కాలంనాటి ఊరేగింపు చిత్రంలో మీర్‌జుమ్లా, అక్కన్న మాదన్నల ముఖాకృతులు సహజంగా కన్పిస్తాయి. ఈ చిత్రంలో అజంతా చిత్ర ఛాయలున్నాయని విమర్శకుల అభిప్రాయం. తానాషా కాలంలో అర్ధముఖాకృతిలో చిత్రించిన సుల్తానుల - ముఖ్యంగా అబ్దుల్లా, తానాషాల రూపపటాలు ఇటీవల బయల్పడినాయి.

నృత్య సంగీతాలకు కుతుబ్‌షాహీకాలంలో విశేష ఆదరణ లభించింది. హైదరాబాద్ నగరంలో రెండువేల మంది వేశ్యలుండే వారని, వారు సంగీత నృత్య కళలలో ఆరితేరినవారని పాశ్చాత్య బాటసారులు వ్రాసినారు. సుల్తానుల దర్బారులోను, సామంతుల ఆస్థానాల్లోను తరచు నృత్య ప్రదర్శనలు జరిగేవి. మత, సాంఘిక కార్యక్రమాలకు జంట కళాప్రదర్శనతోనే నిండుదనం వచ్చేది. నాటకాల ప్రదర్శనలో కూడిపూడి భాగవతులు బాగా ప్రసిద్ధి చెందినారు. కూచిపూడి గ్రామాన్ని అగ్రహారంగా చేసి తానాషా భాగవతులకిచ్చినాడు.

కుతుబ్‌షాహీలలో చాలమంది స్వయంగా బహుభాషల్లో పండితులు, కవులు. వారి ఆస్థానానికి పర్షియా, మధ్య ఆసియా ప్రాంతాలనుండి కవిపండితులు వస్తుండేవారు. గోల్కొండ సుల్తానులు పారశీకాన్ని అధికార భాష చేసినారు. కాని, ఉర్దూభాషా చరిత్రలో గోల్కొండకొక ప్రత్యేక స్థానం వుంది. అరబీ, తుర్కీ, పారశీక, హిందీ భాషాపదాల సమ్మేళనంతో సైనిక శిబిర భాషగా ఉత్తర భారతంలో ఉర్దూ జన్మించినప్పటికి దక్షిణ రాజ్యాల్లో విశేష ఆదరణ పొంది దక్కనీగా ప్రసిద్ధి చెందింది. ఉర్దూ పారశీకాలతోబాటు స్థానికమైన తెనుగుకుకూడ గోల్కొండలో సముచిత స్థానం లభించింది. ముఖ్యంగా ఇబ్రహీం

భాషావేత్త అయిన మాలిక్ ఇబ్రాహింషా కాలంలో గోల్కొండ సాహిత్య రంగ స్థలమయింది. ఖుర్షా అనే పారశీక కవి "తారీఖ్ఎల్చినిజాంషా' అనే చారిత్రక గ్రంథాన్ని సుల్తానుకు అంకితమిచ్చినాడు. మాలిక్ ఆస్థాన ఉర్దూకవుల్లో ముల్లాఖియా, ఫిరోజ్ అనేవారు ప్రముఖులు ఆంధ్రదేశ ఉర్దూ కవుల్లో ఖియా అద్యుడని షేర్వాణి అభిప్రాయం. మహమ్మద్ కులీ, సుల్తాన్ కులీ కాలంలో పేష్వాగా ఉన్న మీర్ ముహమ్మద్ ముమీన్ గొప్ప పారశీక కవి; కవిపోషకుడు. వీరి ఆస్థానాల్లో పెక్కుమంది పారశీక, ఉర్దూ కవులకు ఆశ్రయం లభించింది. పెక్కు కావ్యాలు, చారిత్రక గ్రంథాలు తయారయినాయి. ఆలీవుర్సీ అనే కవి ఉర్దూలో 'నసబ్నామా కుతుబ్షాహీ'ని పద్యాల్లో రచించినాడు. ముహమ్మద్ కులీ ఆస్థానంలో ఉన్నతోద్యోగాలు నిర్వహించిన మీర్జా మహమ్మద్ అమీన్ రచించిన పెక్కుకావ్యాల్లో లైలామజ్నూ ముఖ్యమయింది. సుల్తాన్ కులీ కాలంలోనే 'తారీఖ్ ఇ మహ్మద్ కుతుబ్షాహీ' తయారయింది. క్రీ.శ. 1617 వరకు కుతుబ్ షాహీల చరిత్రకిది చాల ఉపకరిస్తుంది. సుల్తాన్ కులీ స్వయంగా కొన్ని వందల పద్యాలు రచించినాడు వర్ణనాత్మక కవిత్వంలోనూ గజల్రచనలలోనూ అతడు సిద్ధహస్తుడు. పారశీక, తెలుగు, ఉర్దూ పదాలను ధారాళంగా ప్రయోగిస్తూ ముస్లిం హిందూపండుగల నాతడు కళ్ళకుగట్టినట్లు వర్ణించినాడు. అతని పద్యాల్లో నాటి హైదరాబాదు సాంఘిక జీవితం ప్రతిఫలిస్తుంది. ఉర్దూభాషకు సుల్తాన్ కులీ ఇంగ్లీషుభాషకు చాసర్వంటివాడని షెర్వానీ అభిప్రాయం. అబ్దుల్లా కుతుబ్షాకు పేష్వాగా ఉన్న మహమ్మద్ ఇబన్ఖాటూన్ కొరాన్ మొదలైన గ్రంథాలకు పారశీకంలో వ్యాఖ్యానాలు వ్రాసినాడు. 'ఖుర్హన్ఖాటూన్' అనే పారశీక నిఘంటువు తయారయింది. సుప్రసిద్ధ ఉర్దూకవి గవాసీని అబ్దుల్లా ఆదరించినాడు. "సైపుల్ముల్క్ నాబదియుల్ జమాల్" అనే కావ్యాన్ని రచించడమేగాక గవాసీ అనేక అనువాదాలుకూడ జేసినాడు. వానిలో "తూతీనామా" ముఖ్య మయింది; సంస్కృత శుకసప్తతికి పారశీక అనువాదం ఆధారంగా వ్రాసింది. అబ్దుల్లా స్వయంగా ఉర్దూలో అనేక ద్విపదలు రచించినాడు. అబుల్ హసన్ ఆస్థానంలో ఆలీబిన్తైఫూర్ అనే పారశీక కవి 'హద్దైఖుల్సలాతిన్' (Garden of Kings) రచించినాడు. ఉర్దూకవుల్లో షాకులీఖాన్, గులాం ఆలీ ముఖ్యులు. జాయ్సే రచనయైన పద్మావతీ కావ్యాన్ని గులాం ఆలీ ఉర్దూలోకి అనువదించి నాడు. అబుల్ హసన్కాలంలో అరబీభాషలోకూడ విశేష పరిశ్రమ జరిగింది.

కుతుబ్షాహీయుగ తెలుగుసాహిత్యంలో చాలావరకు తంజావురసాహిత్య లక్షణాలు కన్పిస్తాయి. సుల్తానులు, వారి సామంతులు తెలుగు కవుల నాదరించి, వారి గ్రంథాలు అంకితం పుచ్చుకున్నారు. ఈ యుగ సారస్వత చరిత్ర శంకర

కవి హరిశ్చంద్రోపాఖ్యానంతో ప్రారంభమయిందని చెప్పవచ్చు. ఈ కావ్యం గోల్కొండ రాజ్యస్థాపకుడైన కులీ కుతుబ్ ఉల్ ముల్క్ కాలంలో కోర్కొలను జాగీర్దారయిన ఈడూరు ఎల్లయ్యకు అంకితం ఇబ్రాహిం కుతుబ్‌షాపై తెలుగులో అనేక చాటువులున్నాయి. వీనివల్ల మాలిక్ ఇబ్రాహీం (మల్కిభరాముని) మాతృభాష తెనుగా అనే సందేహం కలుగుతుంది. అతని తెనుగు ఆస్థానకవి అద్దంకి గంగాధరుడు. తన 'తపతీసంవరణోపాఖ్యానం' అంకిత మిస్తూ మాలిక్ ఆస్థానాన్ని వేదపురాణ వ్యాకరణ శాస్త్ర విద్వాంసులు అలంకరించినట్లు గంగాధరుడు వర్ణించాడు. కందుకూరి రుద్రకవికి ఇబ్రాహిం చింతలపాలెం అగ్రహారం ఇచ్చి సత్కరింపనాడు. ఈతడు నిరంకుశోపాఖ్యానం, సుగ్రీవ విజయ యక్ష గానం రచించిన రుద్రకవి కాదనీ అతని వంశంలోనే తరవాతి వాడనీ చరిత్ర కారులు నిర్ణయిస్తున్నారు. మరింగంటి వైష్ణవ పండితవంశం వారుకూడ ఇబ్రాహిం కొలువులో వుండేవారు. వీరిలో అప్పన్న సిఫారసుపై ఇబ్రాహిం సామంతుడుగా పటాన్ చెరువునేలే అమీన్‌ఖాన్‌కు పొన్నెగంటి తెగలనార్యుడు తన యయాతి చరిత్ర'ను అంకితం చేసినాడు. యయాతి చరిత్ర అచ్చతెలుగులో రచించిన మొదటి గ్రంథం; అనంతర కావ్యాలకు మార్గదర్శకమయింది. ఓష్ఠ్య, నిరోష్ఠ్య, ద్వర్థి, అచల జిహ్వాకాది గారడీ కవిత్వానికి ఉదాహరణ. అయినప్పటికి కవిత్వం రసవంతంగా ఉందని విమర్శకుల అభిప్రాయం.

అమీన్‌ఖాన్ కుటుంబంలోని వారంతా బహు భాషావేత్తలు, సాహితీ ప్రియులు. ఇతని తమ్ముడు గఠాతఖాన్ అరబీ, పారశీక, ఘూర్జర, తమిళ, కర్ణాటాంధ్రభాష లెరిగినవాడు. అమీన్‌ఖాన్ పేద విప్రులకు పెండిండ్లు చేసినాడట. అతని పెద్ద భార్య బడేబీబీ దయాధర్మగుణాల్లో హిందూ గృహిణుల కేమాత్రం తీసిపోయేదికాదు. మహమ్మద్ కులీ కాలంలో తెలుగు కవియైన గణేశ పండితుడు ఆస్థాన విద్వాంసుడు. ముహమ్మద్ కులీ నాటి తెలుగు కవులందరిలో సారంగు తమ్మయ్య ప్రసిద్ధుడు ఈతడు గోల్కొండ కరణీకం నిర్వహిస్తూ సుల్తానుకు ఇష్టుడయినాడు. ఈతని వైజయంతీ విలాసం శృంగార రస ప్రధానమైన కావ్యం. కులీకాలానికి భిక్కనవోలు సంస్థానం తెనుగు సాహిత్యానికి కేంద్రమయింది. భిక్కనవోలు రాజ్యానికి మూలపురుషుడు కామినేని కాచారెడ్డి మొదట్లో విజయనగర రాజ్యంలో ఉద్యోగి. కులీ కుతుబ్ ఉల్‌ముల్క్ కాచారెడ్డి నాహ్వానించి మెదకు దుర్గాధీశుణ్ణి చేసినాడు. కాచారెడ్డి సంతతివారు భిక్కనవోలు నగరం నిర్మించి, కేంద్రంగా చేసుకున్నారు.

కాచారెడ్డి మునిమనుమడు ఎల్లారెడ్డి బాలభారతం, కిరాతార్జునీయం అనే కావ్యాలు అంకితం తీసుకున్నట్లు తెలుస్తుంది. కాని, ఆ గ్రంథాలు లభించలేదు

ఎల్లారెడ్డి మనుమడు కామిరెడ్డి మహమ్మద్ కులీ సమకాలికుడు. పట్టమట్ట సోమనాథ సోమయాజి ఆంధ్రీకరించిన స్కాంద పురాణంలోని సూతసంహితను కామిరెడ్డి; అతని తమ్ముడు ఎల్లారెడ్డి సోమయాజి రచించిందే బ్రహ్మోత్తరఖండం అంకితం తీసుకున్నారు. ఎల్లారెడ్డి తమ్ముడు మల్లారెడ్డి బహుగ్రంథకర్త; షట్చక్రవర్తి చరిత్ర, శివధర్మోత్తరం, పద్మ పురాణం అతని కృతులు, అబ్దుల్లా ఆస్థానాన్ని ప్రసిద్ధ పదకర్త క్షేత్రయ్య దర్శించి, సుల్తాన్‌పై వేయి పదాల దాకా చెప్పినాడు. క్షేత్రయ్య పదాలనే మువ్వగోపాల పదాలు అంటారు. క్షేత్రయ్యది కృష్ణాజిల్లా మువ్వగ్రామం. మువ్వలోని గోపాలకృష్ణునిపై చెప్పినవయినందున మువ్వగోపాల పదాలుగా ప్రసిద్ధిచెందినాయి. క్షేత్రయ్య పేరు వరదయ్య అనీ; తిరుపతి, కంచి, శ్రీరంగం మొదలైన క్షేత్రాలను దర్శించినవాడయినందున క్షేత్రయ్య అనే పేరు వచ్చిందనీ చెబుతారు క్షేత్రయ్య పదాలు శృంగార భూయిష్టములు. తానీషా కాలంలో జటప్రోలు, గద్వాల సంస్థానాలలో కూడ తెలుగు సారస్వత సృష్టి జరిగింది. ఈ కాలంలోనే భద్రాద్రి తాసీల్‌దారైన కంచర్ల గోపన్న శిస్తు ప్రభుత్వానికి చెల్లించక అచట రామాలయ నిర్మాణానికి ఖర్చుచేయగా ప్రభుత్వం అతణ్ణి నిర్బంధంలో ఉంచిందనీ, బంధ విముక్తికై గోపన్న భద్రాద్రి రామునిపై భక్తి ఆవేశంలో కీర్తనలు రచించి రామదాసుగా ప్రసిద్ధిచెందినాడనీ సంప్రదాయం. త్యాగరాజు కృతులంత ప్రశస్తములు కావుగాని రామదాసు కీర్తనలు లయతాళబద్ధంగావుండి, భజన కీర్తనలుగా విశేష జనాదరణ పొందినాయి. తన 'దాశరథీ శతకం'లో "దుర్వ్యసనముజెంది కావ్యము దురాత్ముల కిచ్చితి మోసమయ్యె" నంటాడు గోపన్న. కాని, ఆ కావ్యమేమో, అంకితం పుచ్చుకొన్న "దురాత్ములు" ఎవరో తెలియదు.

క్షేత్రయ్యలో "పచ్చి శృంగారా"నికి రామదాసులో భక్తిపారవశ్యానికి సాధనమైన కవిత్వం వేమనలో నీతిబోధకు సంఘసంస్కార ప్రబోధానికి సాధనమయింది. వేమన క్రీ.శ. 1625 ప్రాంతంవారని చరిత్రకారుల నిర్ణయం. అందుకు అతని పద్యాల్లోనే సాక్ష్యం ఉంది దేశాటనంచేస్తూ తేటయైన ఆటవెలది వృత్తంలో ధారాశుద్ధితో సులభంగా అర్థమయ్యే తేటతెనుగుమాటల్లో తన శిష్యులకు వేమన వేయికి పైగా పద్యాలు చెప్పినాడు. వేమనపద్యాలు నాలుగువేలు పైగా ఉన్నాయంటారు. భారతీయ ప్రాచీన సారస్వతంవలెనే మనకు మూడువందల ఏండ్ల ముందు జీవించిన వేమన పద్యాల్లో కూడ కూర్పులుచేరి వాస్తవ చరిత్రకాంశాలు మరుగునపడిపోవడం విచారకరం. వేమన బోధించింది వీరశైవమనీ శూన్యవాద బౌద్ధమనీ సామ్యవాదసిద్ధాంతమనీ వివాదాలు చెలరేగాయి. ఇందుకు రెండు కారణాలు కన్పిస్తాయి. మొదటిది పైన పేర్కొన్న ప్రక్షిప్తాలు. రెండోది మధ్యయుగం చివర్లో సామాన్య ప్రజానీకం ఆర్థికదైన్యత, మత సాంఘికకరంగాల్లో

ప్రబలిన అరాజకత వేమన పద్యాల్లో ప్రతిఫలించడం. ఏసిద్ధాంతమైనా సమకాలిక ఆలోచనతో ప్రభావితమై నాటి సమస్యలకు సమాధానంగా రూపొందుతుందనేది నిర్వివాదాంశం. నాటి తెలుగుసారస్వతంలోకల్లా ఇస్లాం ప్రభావం కన్పించేది వేమన పద్యాల్లో మాత్రమే. వానిలో కబీర్, నానక్‌ల బోధనల ఛాయలు కన్పిస్తాయి. వేమన వేదాలు వేశ్యలవంటివి, ఎంగిలివిద్యలు అని నిరసిస్తాడు; సోమయాజికాదు కామయాజి అని పరిహసిస్తాడు; పురాణగాథల్లోని వైరుధ్యాలను హేళన చేస్తాడు; విగ్రహారాధన, తీర్థాటన, శ్రాద్ధకర్మలు, వర్ణవ్యత్యాసాలు, అస్పృశ్యత మొదలైన సాంప్రదాయక మతసాంఘిక విశ్వాస ఆచారాలను ఖండిస్తాడు. మానవతాదృక్పథం పెంచుకొని నిరాడంబరమైన కృషిద్వారా ఆత్మజ్ఞానం సాధించమని వేమన బోధిస్తాడు. నాటికీ నేటికీ ఎంతో ప్రయోజనం ఉన్న ప్రబోధం.

## కొన్ని ఉపయుక్త గ్రంథాలు


1. Arudra — సమగ్ర ఆంధ్ర సాహిత్యం 8,9.
2. Habib — Comprehensive History of India
3. Zadunath Sarkar — History of Aurangazeb.
4. Sherwani — History of the Qutb Shahi Dynasty.
5. Siddiqui — History of Golkonda.
6. Venkataramanaiah — Further Sources of Vijayanagara History.

# ఆంధ్రుల చరిత్ర

(ఆధునిక యుగము
క్రీ. శ. 1900 వరకు)

★

★

## రెండవ భాగం

# ఆంధ్రుల చరిత్ర
## ఆధునిక యుగారంభం

గోల్కొండ రాజ్య పతనంతో ఆంధ్రజాతి చరిత్రలో ఒక ముఖ్యమయిన అధ్యాయం ముగిసింది. కాకతీయుల అనంతరం తెలుగు భాషా ప్రాంతము లన్నింటిని ఒక రాజ్యాంగంలోకి తెచ్చినవారు "కుతుబ్ షాహీలు." వీరు అన్యదేశీయులు. అన్యమతస్థులే అయినా స్థానిక సంప్రదాయాలను, సంస్కృతినీ ప్రోత్సహించి ప్రజల ఆదరాభిమానాలు చూరగొన్నారు. వారి పతనంతో ఆంధ్రదేశం వ్యక్తిత్వం కోల్పోయి మొగల్ రాజ్యంలో లీనమయింది. ఆంధ్ర జాతి విచ్ఛిన్నమయింది. ఆంధ్రుల చరిత్ర యావద్భారత చరిత్రలో అంతర్లీనంగా నడువసాగింది.

పాలకులు దూర ప్రాంతీయులు కావడంచేత, పాలనాధికార కేంద్రం ఆంధ్రదేశానికి వెలుపల ఉన్నందున దేశ ఆర్థికాభివృద్ధికి, సాంస్కృతిక అభివృద్ధికి అవసరమయిన ప్రోత్సాహం లేకపోయింది. ఔరంగజేబు కాలంలోనే మొఘల్ సామ్రాజ్యం క్షీణింప సాగింది. భౌగోళికంగా సామ్రాజ్యం విస్తరించినప్పటికి, ఆర్థికంగా నైతికపరంగా క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొనవలసివచ్చింది. అతని సున్నీ సామ్రాజ్య విస్తరణ విధానము, దేశ వ్యాప్తంగా జరుగుతున్న తిరుగుబాట్లు అరాచక శక్తుల విజృంభణకు దోహదం చేసాయి.

ఆంధ్ర దేశంలో మొఘల్ పాలన సుమారు నలభయి సంవత్సరాలు సాగింది [1688 – 1724]. ఈ కాలాన్ని కేవలం అరాచక యుగంగా వర్ణించటంలో తప్పు లేదు. మహారాష్ట్ర వీరుడయిన శివాజీ స్వరాజ్యం స్థాపించటమే గాక మొఘల్ సామ్రాజ్య పునాదులు కదిలించి దాని విచ్ఛిన్నానికి కారణమయినాడు. శివాజీ అనంతరీకుల కాలంలో అతడు ప్రారంభించిన దోపిడి దాడులు మితిమీరి ఇరుగు పొరుగు హిందూ పాలకులలో సయితం మహారాష్ట్రుల పట్ల స్నేహభావం నశించి, ద్వేష, అసూయలు పెరిగినాయి అందుచేత భారత దేశానికి రాజకీయ సమైక్యాన్ని చేకూర్చి భారత జాతీయ భావాలకి అంకురార్పణ చేసిన మొఘల్ సామ్రాజ్య స్థానాన్ని ఆక్రమించటానికి దీటుగా స్వరాజ్ ఎదగ

లేకపోయింది. బాజీరావ్ ఆశించిన "హింద్ పద్ పాద్‌షాహి" కేవలం పగటి కలగా అంతరించింది. శివాజీ మరణానంతరము అనతి కాలంలోనే అతడు మహారాష్ట్రుల్లో సాధింగచల్గిన ఐకమత్యం క్షీణించిపోయింది. మొగలాయి సామ్రాజ్యం విచ్ఛిన్నం కావడంతో మహారాష్ట్ర నాయకుల్లో స్వార్థం వెర్రితలలు వేసింది. అంతః కలహాలు మితిమీరినాయి. వారి దోపిడి దాడులతో దక్షిణ మధ్య భారతాలు కల్లోలములై నిస్సహాయులయిన ప్రజలు ధన ప్రాణ రక్షణను అన్వేషించ సాగినారు.

Iswari Prasad Calls Akbar "The first national monarch of India", జగన్నాధ పండితరాయలు "ఢిల్లీశ్వరోవా జగదీశ్వరోవా" అని ప్రశంసించాడు. మొగలాయీలు, భారతదేశానికి "Imperial oneness" ఇచ్చారని చరిత్రకారులు అంగీకరిస్తారు. "Sense of oneness is the hall mark of nationalism" అంటారు రాజనీతివేత్తలు. ఔరంగజేబును "Victim on the altar of India's oneness" అంటారు సర్దార్ K. M. పణిక్కర్.

ఈ పరిస్థితులు నాటికి దేశంలో వాణిజ్య, సైనిక స్థావరాలు ఏర్పరుచుకొని లాభసాటి వాణిజ్యం సాగిస్తూ దేశ రాజకీయాల్లో తల దూరుస్తున్న పాశ్చాత్య కంపెనీలకు మంచి అవకాశాలుగా పరిణమించినాయి; ముఖ్యంగా ఇంగ్లీషు, ఫ్రెంచి కంపెనీల ఉద్యోగుల ఆశలకు పదును పెట్టినాయి. వారి జోక్యంతో ఆర్థికరంగంలో అపూర్వమయిన మార్పులు ప్రారంభమయి సాంఘిక సంబంధాలకు సయితం కదలిక ఏర్పడింది. అందుచేత గోల్కొండ పతనం [1687] ఆంధ్రుల చరిత్రలో ఆధునిక యుగానికి నాంది వాక్యంగా భావింపవచ్చు.

## ఆంధ్రదేశంలో మొగల్ పాలన

గోల్కొండ పతనంతో ఆంధ్రులు తిరిగి స్వాతంత్ర్యం కోల్పోవటమే కాక ఆంధ్రదేశ ఐక్యత విచ్ఛిన్నమయింది. గోల్కొండ మొగల్ సామ్రాజ్యంలో విలీనమయినది. గోల్కొండ బీజాపూర్‌ల వ్యక్తిత్వం నిర్మూలించటమే ఔరంగజేబు ఆశయం. అవి పూర్వ ఔన్నత్యం తిరిగి సాధించి మొగల్ సార్వభౌమాధికారానికి ప్రమాదంగా పరిణమించని విధంగా వానిని బలహీన పరచాలని అతని సంకల్పం. అందుకు అనుగుణంగా రెండు రాజ్యాలను కలిపి తెలంగాణా కోస్తా ఆంధ్రులను హైదరాబాదు - కర్ణాటకంగానూ, 'రాయలసీమ'ను మిగిలిన ప్రాంతాలను బీజపూర్ కర్ణాటకంగానూ రూపొందించినాడు. దీనితో మొగలాయి దక్కన్‌లో ఆరు సుబాలు ఏర్పడినాయి. (1) ఖాన్‌దేశ్ (2) బిరార్

(3) ఔరంగాబాదు (4) బిదర్ (5) హైదరాబాదు (6) బిజాపూర్. తరువాత హైదరాబాదును బాలాఘాట్ అనీ పైన్‌ఘాట్ అనీ వ్యవహరించేవారు. బాలాఘాట్ సుబాలో సిద్ధవటం, గంజికోట, గుర్రంకొండ, గుత్తి, కంభం సర్కారు లుండేవి. క్రమంగా సిద్ధవటం, గంజికోట, కంభంలు కలిపి కడప రాజ్యంగా ఏర్పడి వతాన్ రాజుల పాలనలో ఉండేవి. రెండో సుబా గుంటూరు నుండి కోరమండల తీరంలో కలెరూన్ వరకు విస్తరించి ఆర్కాటు సుబా అయింది. వెల్లూర్, జింజి, తిరుచునాపల్లి ప్రాంతాలు కూడా ఇందులో ఉండేవి.

మొగలాయి దక్కన్‌కు ఔరంగాబాదు రాజధాని. అచటి రాజ ప్రతినిధికి ప్రతినిధిగా ప్రతి సుబాలోనూ ఒక ఫౌజుదారు ఉండేవాడు. గోల్కొండ సైనిక స్థావరమయింది. హైదరాబాదు రాజకీయ వ్యక్తిత్వం కోల్పోయింది. ఆర్థికంగా కూడా అపార నష్టానికి గురి అయింది. మొగలాయి ముట్టడి సుదీర్ఘ కాలం జరిగి నందున గోల్కొండ పరిసరాల్లో వ్యవసాయం సాగలేదు. స్థానిక పరిశ్రమలు నశించాయి. రాజధాని ఔరంగాబాదు కావడం వలన పూర్వం గోల్కొండకు లభించిన పన్నులు కప్పాలు ఔరంగాబాదుకు తరలినాయి. వజ్రాల గనులు మూత పడినాయి. దోపిడి దొంగల బెడదలో రహదారులపై భద్రత నశించి వాణిజ్యం స్తంభించిపోయింది. దక్షిణాపథంలోనే ప్రసిద్ధ వాణిజ్య కేంద్రమయిన గోల్కొండ దివాలా తీసింది. దోపిడి దొంగలకు తోడు మరాటీ దండులు తరచుగా రాజ్యంలో ప్రవేశించి గ్రామాలు పట్టణాలు దోచి భీభత్సం సృష్టించేవి. కంచయే చేను మేసినట్లు స్థానిక జమీందార్లు గ్రామాలపైకి తమ సైన్యాలను పంపి రైతులను దోచుకునేవారు. ఈ పరిణామాల వలన సుభిక్షంగా ఉన్న గోల్కొండలో స్వల్పకాల వ్యవధిలోనే దుర్భరక్షామం విలయతాండవం చేసింది. 1688 లో సంభవించిన క్షామాన్ని దాని వెంట వచ్చిన విషూచి వ్యాధిని మార్టిన్ అనే ఫ్రెంచి వర్తకుడు వర్ణిస్తాడు.

"గ్రామాలు నిర్జనమయినాయి. ప్రజల స్థితి దుర్భరంగా వుంది. ఇళ్లు, వీధులు, మానవ కళేబరాలతో నిండిపోయినాయి. చనిపోగా మిగిలినవారు అస్థి పంజరాలుగా ఉన్నారు. కొన వూపిరితో ఉన్నవారు స్వగ్రామాలను వీడి ఇతర ప్రాంతాలకు వలస వెళుతున్నారు." ఈ పరిస్థితులు తూర్పు తీరంలో స్థావరాలు ఏర్పరుచుకున్న పాశ్చాత్య వర్తక సంఘాలకు అనుకూలించాయి. 'ఫాక్టరీ'లన బడే తమ స్థావరాల్లో పాశ్చాత్యులు అగచాట్లు పడుతున్న స్థానికులకు ఆశ్రయం ఇచ్చి పరిశ్రమలను నెలకొల్పి వాణిజ్యం పెంచుకోసాగారు.

దేశంలోని వాణిజ్యం సమస్తమూ వారి స్థావరాలకు మరలించి.

విశాఖపట్టణం, మచిలీపట్టణం, పులికాట్, మద్రాస్, పాండిచ్చేరి పట్టణాల జనసమ్మర్దమూ, ప్రాముఖ్యమూ పెరిగినాయి. దేశీయ పరిశ్రమలు, వాణిజ్యం ఐరోపా వర్తక సంఘాల పరం కావడం మొదలయింది.

## పాలనాయంత్రాంగ పునర్ వ్యవస్థీకరణ

హైదరాబాదులో పటిష్ఠమయిన పాలనా యంత్రాంగాన్ని రూపొందించటానికి ఔరంగజేబుకు వ్యవధి లేకపోయింది. గోల్కొండ ఆక్రమణ తరువాత అతడు మహారాష్ట్రపై దండెత్తాడు. అయినా సామ్రాజ్యంలో అంతర్లీనంలో చేసే విధానానికి అనుగుణంగా మొగల్ పాలనా యంత్రాంగం దక్కన్‌కు విస్తరించింది. కుతుబ్ షాహీల కాలంలో ఆ స్థానంలో ప్రముఖ స్థానా లాక్రమించిన హిందువుల ప్రాబల్యం అంతరించింది. స్థానిక ముస్లిములు కూడా నిరాదరణకు గురి అయినారు. అయితే స్థానిక రాజకీయ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని పలుకుబడి ఉన్న సర్దారుల ఉద్యోగుల, సహాయ సహకారాలు అవసరమని గుర్తించి షియా, సున్నీ విభేదాలు కూడా పాటించక, కుతుబ్‌షాహి, అహమ్మద్ షాహీ సుల్తానులకు వ్యతిరేకులై తనతో చేరిన ముస్లిములను ఉన్నతోద్యోగాల్లో నియమించాడు. బాబూ పండిట్ వంటి సమర్థులయిన హిందువులకు సయితం పదవులు లభించినాయి. వీరందరూ మొగలాయి మున్సబుదార్లయినారు. కాని స్థానిక యంత్రాంగంలో వీరి నియామకం తాత్కాలికమే అయింది. క్రమంగా వీరు బలపడి మొగల్ అధికారానికి ప్రమాదంగా పరిణమిస్తారనే భయంతో వీరిని ఉత్తర దేశంలోని దూర ప్రాంతాలకు బదిలీ చేసి ఔత్తరాహులను నియమించడం జరిగింది. కుతుబ్‌షాహి సైన్యం రద్దయింది. ఆ సైన్యంలో వెలమ, రెడ్డి, కమ్మ కులాలవారు ఎక్కువగా ఉండేవారు. వారు బర్తరఫ్ అయినారు. గోల్కొండలో నామమాత్రమయిన సైన్యం ఉండేది. అందలి ఉద్యోగులు ఔత్తరాహులే. రాజ్యంలో శాంతి భద్రతల రక్షణకు గూడ ఈ సైన్యం చాలినంతగా లేదు. 1687 లో ఔరంగజేబు గోల్కొండ నుండి మరలడంతోనే మహారాష్ట్రులు దండెత్తి వచ్చి హైదరాబాదు పరిసర గ్రామాలను కొల్లగొట్టినారు. వీరిని ఎదురించడానికి చాలినంత సైన్యం లేనందున తాత్కాలిక రాజ ప్రతినిధి రాహుల్లాఖాన్ గోల్కొండ కోటలో తల దాచుకోవలసి వచ్చింది!

కుతుబ్ షాహీల పాలనా వ్యవస్థ వికేంద్రీకరణపై ఆధారపడింది, మొగలాయీలది కేంద్రీకరణ విధానం. అందుచే మొగల్ విధానాన్ని హైదరాబాదులో అమలుచేయాలనే ఔరంగజేబు ప్రయత్నం విఫలమయింది హైదరాబాదు సుబా ప్రభుత్వం కేంద్రీకరణ, వికేంద్రీకరణాల మిశ్రమమై క్లిష్టంగా రూపొందింది.

హైదరాబాదులో ఒక సుబేదారుండేవాడు. అతడు ఔరంగాబాదులోని పాదుషా ప్రతినిధికి ప్రతినిధి. గోల్కొండ దుర్గ సైన్యాధ్యక్షుడు, హైదరాబాదు నగర ఫౌజుదారు, కొత్వాలు, చార శాఖాధికారి (బక్షీ) మొదలయినవారు సుబేదారుకు సహాయంగా ఉండేవారు. తాత్కాలిక సుబేదారు రూహుల్లాఖాన్ 1687 చివర్లో ఢిల్లీకి మరలడంతో, సుబేదారుగా జాన్‌సిపర్‌ఖాన్ నియామకం జరిగింది. బిజాపూర్ సుబేదార్‌గా కొంతకాలం వ్యవహరించిన సిపర్‌ఖాన్ మంచి సేనానిగా పాలనా దక్షుడుగా పేరు పొందాడు. అచిర కాలంలోనే మరాటీ దాడుల నరికట్టి హైదరాబాద్ ప్రభుత్వాన్ని పటిష్ఠం చేసాడు.

సైనికంగా హైదరాబాద్‌ను బలపరచడం సిపర్‌ఖాన్ ప్రథమ కర్తవ్యం అయింది. అందుకై హైదరాబాద్ రాజ్యంలోని కౌలాస్, ఎల్లందల్, కోయిల కొండ, వరంగల్, పానగల్, ముస్తఫానగర్, మూర్తజా నగర్ (కొండవీడు) దుర్గాలను మరమ్మతు చేయించి వానిలో బలమయిన సైన్యాలను నిలిపినాడు. ఈ దుర్గాల ఫౌజుదారులు (సేనాపతులు) చాలా వరకు దక్కనీ ముసల్మానులే. కుతుబ్ షాహీల కొలువు చేసినవారే. ఈ దుర్గాలను పరివేష్టించి పది మైళ్ళ వరకు విస్తరించిన భూములను హవేలీ పరగణాలు (రాజ క్షేత్రం) గా పరిగణించేవారు. వీనిపై శిస్తు ఫౌజుదారు వసూలు చేసేవాడు. ఈ దుర్గాలే గాక స్థానిక పితూరీదార్లను, అదుపులో ఉంచడానికి గోదావరి డెల్టాలోనూ, ఖమ్మమ్మెట్టు, శ్రీకాకుళం పరగణాల్లోనూ, అశ్వదళంతో ఠానాలు నెలకొల్పినాడు.

హైదరాబాదు కర్ణాటకంలో తొమ్మిది ఫౌజుదారీ లుండేవి. కౌలాస్, ఎల్లందల్, నర్సపూర్ (మెదక్), కోహిర్, భోన్‌గిరి, వరంగల్, ఖమ్మమ్మెట్, శ్రీకాకుళం, (చికాకోల్) నర్సపూర్ (తూ. గోదావరి); రాయలసీమ ప్రాంతంలో కడప, కర్నూలు, ఆదోని, నెల్లూరు ఫౌజుదారీలు. తూర్పు తీర ప్రాంతంలో ప్రత్యేకంగా నాలుగు (నాల్గు) సర్కారులు ఏర్పడినాయి. చికాకోల్, రాజమండ్రి, మచిలీపట్టణం, నిజాం పట్టణం. మచిలీ పట్టణం, నిజాం పట్టణాలు ఓడ రేవు లయినందున వారి పాలన ప్రత్యేకంగా దేశ్‌ముఖ్ ఆధీనంలో ఉండేది.

ప్రతి సర్కారులోనూ కొన్ని జిల్లా లుండేవి. జిల్లా అధికారి దేశ్‌ముఖ్ జమిందార్లలో చాలామంది వెలమ, కమ్మ, రెడ్డి కులాలకు చెందిన నాయకులు

---

హైదరాబాదు రాజ్యం 21 సర్కారులుగా విభజింపబడింది. (1) కౌలాస్ (2) ఎల్లిందల్ (3) మెదక్ (4) మలంగూర్ (5) వరంగల్ (6) కోయిల్‌కొండ (7) గోల్కొండ (8) భోన్‌గిర్ (9) నల్గొండ (10) ఖమ్మమ్మెట్ (11) ఏలూర్ (12) రాజమండ్రి (13) చికాకోల్ (14) పానగల్ (15) ఘనపూర్ (16) దేవర కొండ (17) గుంటూరు (18) కొండపల్లి (19) మచిలీపట్టణం (20) నిజాం పట్టణం (21) కంబం.

పంట పొలాలు శిస్తు మొదలయిన వాని వివరాలలో చిట్టాలను దేశపాండేలు తయారుచేసేవారు. ఫౌజుదార్లు, దేశ్‌ముఖ్‌లు పన్ను వసూలు చేయుటకు హవల్‌దార్లను నియమించేవారు. పన్ను వసూలు చేయడంలో హవల్‌దార్లకు స్థానిక జమీందారులు సాయం చేసేవారు.

ప్రతి జిల్లాలోనూ ఒకరిద్దరు జమీందార్లుండేవారు. వీరు కుతుబ్ షాహీల కాలంలో పన్ను వసూలు చేసే అధికారం (ఇజరా) సంపాదించి మన్నె-సుల్తాన్ మొదలయిన బిరుదులు, గౌరవాలుపొంది స్థానికంగా బలపడి పాలనా యంత్రాంగంలో భాగమయినారు. వీరిలో చాలామంది కమ్మ, వెలమ, రెడ్డి నాయకులు. గోల్కొండ పతనానంతర దేశంలో చెలరేగిన అరాచకత్వం, మరాటీ దాడులు, అవకాశంగా తీసికొని జమీందార్లు బలవంతులయినారు. ఈ జమీందార్లు మొగల్ అధికారంతో సమాధాన పరచటానికి నిరాకరించి తమ ప్రాంతాల రైతులపై దౌర్జన్యాలు జరుపసాగినారు. తెలంగాణాలో కౌలాస్, పాల్వంచ, జటప్రోలు, నూర్ కోయల్ జమీందార్లు చాలా బలవంతులు. తీరాంధ్రంలో విజయనగరం, పెద్దాపురం, మొగల్ తుర్రు, నూజివీడు, గుంటూరు ప్రాంతంలో వినుకొండ, (మల్రాజు) కొండవీడు (మాణిక్యారావు) సంస్థానాలు ముఖ్యమయినవి. కుతుబ్ షాహీల కాలంలో చికాకోల్ సర్కారును షేర్ మొహమ్మద్ ఖాన్ పాలిస్తుండేవాడు. షేర్ అంటే పులి అని అర్థం. ఆ అర్థం వచ్చేటట్లు పెద్దరాయుడు 1652 లో బొబ్బిలి కోటను నిర్మించినట్లు తెలుస్తుంది. బొబ్బిలిలో వెలమ జమీందార్లు ప్రసిద్ధులయినారు. కొండపల్లి పరగణాలలో వాసిరెడ్డివారు చింతపల్లిని కుతుబ్ షాహీల నుండి సంపాదించారు. మల్రాజు, మాణిక్యారావు, కుటుంబాల మధ్య ఘర్షణను అవకాశంగా తీసికొని వాసిరెడ్డివారు గుంటూరు సర్కారులో కొన్ని గ్రామాలు ఆక్రమించారు. వీరిలో ప్రసిద్ధుడయిన వెంకటాద్రినాయుని కాలం నుండి అమరావతి వాసిరెడ్డి వారికి కేంద్రమయింది. నెల్లూరులో వెంకటగిరి, చుండి, ముత్యాలపాడు జమీందార్లు బలవంతులు. రాయలసీమ ప్రాంతంలో జమీందార్ల స్థానంలో పాళెగార్లు వుండేవారు. పాళెయగారి విధానం విజయనగర కాలం నుండి వస్తున్నదే! రుస్తుం దిక్‌ఖాన్ పెద్ద సైన్యాన్ని కూర్చుకొని తిరుగుబాటు చేసిన జమీందార్ల నణచి వారితో సమాధానం కుదుర్చుకున్నాడు. ఆ ఒప్పందం ప్రకారం ప్రతి జమిందారుకు కొన్ని పరగణాల భూమి శిస్తులో కొంత నిర్దిష్ట శాతం లభిస్తుంది. వీరు తమ ప్రాంతాలలో కోటలు కట్టుకొని సైన్యాలు కూర్చుకొని శాంతి భద్రతలు కాపాడే బాధ్యతలు స్వీకరించారు. దీనితో జమీందార్లు తృప్తిపడి మొగల్ ప్రభుత్వ యంత్రాంగంతో సహకరించసాగారు. ఈ విధంగా మొగలాయి ఆక్రమణ అనంతరం సుమారు 15 సంవత్సరాలకు హైదరాబాదు

తిరిగి రాజకీయంగా గౌరవ ప్రతిష్ఠలు సాధించడానికి అనుకూల వాతావరణం ఏర్పడింది.

గోల్కొండ ఐశ్వర్యమే మొగలాయీల నోరూరించి దండయాత్రకు పురికొల్పింది. అందుచే ఆ రాజ్యంనుంచి అధిక ఆదాయం సంపాదించాలని పాదుషా నిర్ణయించాడు. మరోవైపున ప్రభుత్వ సైనికావసరాలకు, జమీందార్ల జాగీర్దార్ల ఆడంబరాలకు వ్యయం అధికం కాసాగింది. ఈ అవసరాలకు అనుగుణంగా రాజ్య ఆర్థిక విధాన సంస్కరణ జరిగింది. మొహమ్మద్ షాఫీ హైదరాబాద్ దివాన్‌గా వున్న కాలంలో 'ఇజరా' పద్ధతి రద్దయింది. ప్రతి జిల్లా నుండి ప్రభుత్వానికి రావలసిన శిస్తు మొత్తం నిర్ణయిస్తూ జామ్-ఇ-కమీర్ అనే చిట్టా తయారయింది (1689-90). సుమారు ఒక శతాబ్దకాలం ఈ చిట్టాయే అమలులో ఉండి ఆంగ్లేయులకు సయితం మార్గదర్శకమయింది. దీని ప్రకారం కోస్తా జిల్లాల్లో రైతులపై శిస్తు 10 నుండి 13 శాతం వరకు పెరిగింది. వాణిజ్య సుంకాలు పెరిగాయి. అమ్మకం పన్ను రహదారి సుంకం, సంత పన్ను వసూలు చేసేవారు. పన్నులు వసూలు చేసే చౌదర్లు పలురకాల మామూళ్ళు వసూలు చేసేవారు. ఔరంగజేబు కాలంలో ప్రథమంగా హైదరాబాదులో జిజియా విధించటం జరిగింది. కాని జిజియా వసూలును ప్రజలు ప్రతిఘటించినట్లు తెలుస్తుంది. క్రీ.శ. 1691 నాటి పులివెందల (కడప జిల్లా) శాసనాలను బట్టి మొగలాయి ఉద్యోగుల దౌర్జన్యాలు సహించలేక వర్తకులు. తెలికులు నగరం విడిచి వెళ్ళినారని, మొహమ్మద్ జాఫర్ అనే స్థానిక పాలకుడు వారికి మినహాయింపులు, హామీలు ఇచ్చి తిరిగి పులివెందల రప్పించినాడని తెలుస్తుంది. హైదరాబాదు, బిజాపూర్‌లపై సాలీనా కప్పం 2.20 కోట్లకు పెరిగింది. ఒక్క మచిలీపట్టణం, తత్పరిసరాలలోని పల్లెలు 4 లక్షల 86 వేల రూపాయలు చెల్లించేవి.

## కాంబక్ష్

రాజకీయంగా శాంతి భద్రతలు నెలకొని ఆర్థికంగా పుంజుకుంటున్న హైదరాబాదు మొగల్ సర్దారులను ఆకర్షించసాగింది. ముఠా రాజకీయాలు ప్రబలుతున్న ఢిల్లీ దర్బారుపై ఆసక్తి క్షీణించి హైదరాబాద్ ఫౌజుదారీ పదవికై వారిలో పోటీ ప్రారంభం కావడంతో హైదరాబాద్ రాజకీయ ఎత్తుగడలకు కేంద్రమయింది.

ఖాన్ సిపర్ ఖాన్ 1700 సంవత్సరంలో మరణించగా కాంబక్ష్ రాకుమారుని పాదుషా హైదరాబాదు సుబేదారుగా నియమించాడు; అతనికి

సాయం (నాయబ్) గా నిషర్ ఖాన్ కుమారుడు రుస్తుం నియామకం జరిగింది. కాంబక్ష్‌ను హైదరాబాద్ బీజాపూర్‌ల (కర్ణాటక) పాలకుని చేయాలని పాదుషా సంకల్పం. కాని చిరకాలంగా హైదరాబాద్‌లో (1689 నుండి) ఉన్నతోద్యోగం నిర్వహిస్తూ సుబా రాజకీయ పునరుజ్జీవనానికి కారకుడయిన రుస్తుం హైదరాబాద్ సుబేదారు పదవిపై ఆశలు పెంచుకోవడం సహజం. కాంబక్ష్ నియామకం రుస్తుంకి ఆశాభంగం కలిగించింది. అందుచే రుస్తుం సుబాలో శాంతి భద్రత పట్ల అశ్రద్ధ వహించటమే కాక కాంబక్ష్‌తో సంఘర్షణకు సిద్ధమయినాడు. దీనికి తోడు పాదుషా ఆరోగ్యం క్రమంగా క్షీణించి, మొగలాయి శిబిరంలో అంతః కలహాలు ప్రారంభమయినాయి. పరిస్థితులు మరాటీలకు మంచి అవకాశాలై, అవకాశం లభించినపుడల్లా దాడిచేసి దోచుకోసాగినాయి. 1702 లో హైదరాబాదుపై దండెత్తి మూడు రోజులపాటు ప్రజలను దారుణంగా దోచుకున్నారు. మరాటీ దాడులను ప్రతిఘటించే బదులు రుస్తుం వారితో రహస్య ఒప్పందాలు కుదుర్చుకొని ఖజానానుండి ఏడు లక్షలు చెల్లించి మరలించినట్లు తెలుస్తున్నది. మరాటీ దాడులు ముఖ్యంగా ముస్లిములలో చాలా ఆందోళన కలిగించినాయి. ఔరంగజేబు చర్యలకు ప్రతీకారంగా మరాటీలు తమ స్త్రీలకు, మత సంస్థలకు హాని కలిగిస్తారని భయకంపితులయినారు. హైదరాబాదులోని ప్రవక్త-పాద చిహ్నానికి ధర్మకర్తగా నున్న షేక్ మొహమ్మద్‌షా ఆ చిహ్నాన్ని నగర శివార్లలో అంబర్‌పేట తోటలో చాలాకాలం ఉంచినాడట.

తాము సాగించిన దోపిడి దాడుల వలన మరాటీలు స్థానిక హిందూ జమీందార్ల సానుభూతి కోల్పోయినారు. మొగలాయి విస్తరణకు సుసంఘటిత హిందూ ప్రతిఘటనావకాశాలు నశించినాయి. మరాటీ దాడుల నరికట్టడంలో హిందూ జమీందార్లు మొగలాయి ఉద్యోగులతో సహకరించసాగినారు.

రుస్తుం ఉపేక్షా భావంవల్ల సామ్రాజ్య పాలనా యంత్రాంగం సడలింది. స్వలాభాపేక్షతో స్థానిక మొగలాయి ఉద్యోగులు దాడులు జరుపుతున్న మరాటీలతో చేతులు కలపడం ఎక్కువయింది. ఈ పరిస్థితులు రాజ్యంలోని దుండగులకు ప్రోత్సాహకరంగా ఉన్నాయనడానికి రిజాఖాన్ వృత్తాంతం మంచి నిదర్శనం. ఔరంగజేబు ఈతణ్ణి బీదర్‌లోని రామగిరి ఫౌజుదారుగా నియమించాడు. కాని రిజాఖాన్ ఆ పదవిని స్వీకరించక పదివేల సైన్యాన్ని కూర్చుకొని పాదుషాపై తిరుగుబాటు చేసి హైదరాబాద్ మచిలీపట్టణం మధ్య ప్రాంతాల్ని వలుమార్లు దోచుకొని అరాచకం సృష్టించాడు. రిజాఖాన్ దుండగాలతో, మరాటీ దోపిడి దాడులతో సుబా ఆర్థిక పరిస్థితి దుర్భరమయింది. దీనికితోడు 1701-2లో తీవ్ర

అనావృష్టివల్ల దుర్భిక్ష పరిస్థితులు ఏర్పడి ధరలు విపరీతంగా పెరిగి ప్రజలు పడరాని కష్టాలు పడ్డారు. క్షామమూ, దాని తరువాత ప్లేగువ్యాధి వ్యాపించి 20 లక్షల మందికి పైగా మరణించినట్లు పాశ్చాత్యుల రచనలనుండి తెలుస్తుంది. ఈ పరిస్థితులవలన సామ్రాజ్య పాలనా యంత్రాంగం విచ్ఛిన్నం అయినట్లు స్పష్టం కావడంతో స్థానిక ఉద్యోగులలో విశ్వాసం నశించి తూర్పుతీర రేవు పట్టణాలలో బలపడుతున్న పాశ్చాత్య కంపెనీలవారు తమ స్థావరాల రక్షణకు స్వయంగా ఏర్పాట్లు చేసికోవలసి వచ్చింది. 1704 లో హైదరాబాదు శివార్లను దోచుకున్న మరాటీ ధండు మచిలీపట్టణం వైపుకు పురోగమిస్తున్నట్లు వార్త అందగానే అచటి డచ్చి, ఇంగ్లీషు వర్తకులు మొగల్ ఫౌజుదారుని తరమివేసి పట్టణ రక్షణ బాధ్యత స్వీకరించి పట్టణం చుట్టూ ఐదు బురుజులు నిర్మించి వానిపై 25 ఫిరంగులు నిలిపినారట! వారి కార్యక్రమాల్లో దేశీయ వర్తకులు పూర్తి సహకారం అందించినారు. ఈ సంఘటనతో స్థానిక ప్రజల్లో సయితం మొగల్ సైన్యాల కంటె విదేశీ కంపెనీ సైన్యాలే సమర్థవంతములనే నమ్మకం ఏర్పడినట్లు స్పష్టమవుతున్నది.

## వారసత్వ యుద్ధం

ఔరంగజేబు 1707 లో మరణించాడు. అతని కొడుకులు అజంషా, షా ఆలం, కాంబక్ష్‌ల మధ్య వారసత్వ యుద్ధం తప్పలేదు. అజంషా, గుజరాత్‌లో, షా ఆలం కాబూల్‌లో రాజ ప్రతినిధులుగా ఉండేవారు. తన కుమారుల శక్తి సామర్థ్యాలలో ఔరంగజేబుకు విశ్వాసం లేనందున అతడే సామ్రాజ్య విభజనను వూహించాడు. అజంషా, షా ఆలంలు సామ్రాజ్య ఉత్తర ప్రాంతాలను పంచుకొని కాంబక్ష్ దక్కన్ పాలకుడు కాగలడని అతడు వూహించాడు. ఆ ఉద్దేశ్యంతోనే 1700 లో కాంబక్ష్‌ను దక్కను సుబేదారుగా నియమించి అతని అధికారం స్థిరం కావడానికి అనుకూల పరిస్థితులు కల్పించినాడు. దక్కన్ పాలకులందరూ తమ పరగణాల వివరాలు కాంబక్ష్‌కు నివేదించాలని పాదుషా హుకుం జారీ చేసినాడు. కాంబక్ష్ కుమారుడు ముహియల్ సున్నాకు సయితం రాజగోపాలపూర్, మలంకూర్, ఏలూరు కలిపి సుమారు 5.7 లక్షల ఆదాయం లభించే జాగిర్ ఇచ్చాడు. ఏమైనా రాకుమారులు మాత్రం ముఖ్యంగా అజంషా, షా ఆలంలు అవిభాజ్యమయిన మొగల్ సామ్రాజ్యానికి పాదుషా కావాలని ఆశించారు.

హైదరాబాదులో కాంబక్ష్ తన పదవిని సుస్థిరం చేసికోవడానికి రుస్తుం ఆటంకంగా పరిణమించాడు. కాంబక్ష్‌కు వ్యతిరేకంగా రుస్తుం తన బలాన్ని

కూడదీసుకోవడానికి ప్రయత్నాలు సాగించాడు. స్థానిక జమీందార్లను జాగీర్దారులను హింసించి 35 లక్షలకు పైగా మొహర్లు, అపార సంఖ్యతో వజ్ర వైడూర్యాలు సంపాదించాడు. మహారాష్ట్రులతో రిజాఖాన్ రహస్య ఒప్పందాలు చేసికొన్నాడు. గోదావరీ ప్రాంతంలో బలవంతుడైన విజయనగరం పూసపాటి ఆనంద గజపతి అభిమానం సంపాదించాడు. కాంబక్ష్‌ను ప్రతిఘటించడానికి సన్నాహాలు చేసాడు. గోల్కొండ దుర్గాన్ని ఆక్రమించే ప్రయత్నం చేసాడు గాని అతనికి స్వాధీనం కాలేదు.

మొగల్ వారసత్వ యుద్ధంలో మొదటి రంగం ఉత్తర ఇండియాలో జరిగింది. ఆగ్రా సమీపంలో జాజౌ దగ్గర జరిగిన యుద్ధంలో అజంషా ఓడి మరణించాడు. బహదుర్‌షా అనే బిరుదంతో షాఆలం మొగల్ సింహాసనాన్ని అధిష్టించాడు. ఉత్తర దేశంలో తన అధికారం సుస్థిరం చేసుకోవడానికి బహదుర్‌షా నిమగ్నుడై వుండగా కాంబక్ష్ హైదరాబాద్‌లో 1708 గోల్కొండ సుల్తాన్‌గా పట్టాభిషేకం జరుపుకున్నాడు. స్వతంత్ర్య గోల్కొండ రాజ్య పునరుద్ధరణ జరిగింది. కుతుబ్‌షాహీ రాజ్య ప్రాంతాలన్నీ తిరిగి ఒక పాలన లోనికి వచ్చినాయి. పాదుషాకు కప్పం చెల్లిస్తూ స్వతంత్ర్య రాజ్యంగా హైదరాబాదు పూర్వ గోల్కొండ వైభవాన్ని పునరుద్ధరించగలదని చాలామంది ఆశించారు.

ప్రజల ఆశలు అడియాసలయినాయి. కాంబక్ష్‌కు పక్కలో బల్లెంగా రుస్తుం తయారయినాడు. సింహాసనం ఎక్కిన వెంటనే బహదూర్‌షా రుస్తుం హోదాను పెంచి అతని తండ్రి బిరుదు ఖాన్ సిపర్‌ఖాన్ అతనికి ఇచ్చి గౌరవించాడు. దీనితో రుస్తుం ఆశలు బలపడి కాంబక్ష్‌ను ఎదిరించటానికి అతడు వెనకాడలేదు. బహదుర్‌షా ఫర్మానాలు దక్కన్ సుబాకు చేరసాగినాయి. జాగీర్దార్లు సయితం కాంబక్ష్‌ను ధిక్కరించటం మొదలయింది. అయితే కాంబక్ష్ స్నేహం నటిస్తూ రుస్తుంతో ఒక ఒప్పందం కుదుర్చుకున్నాడు. కాని అన్నిటి కంటె ఆర్థిక ఇబ్బందులు కాంబక్ష్ అధికారం బలపడడానికి ఆటంకమయినాయి. అతని దృష్టి రుస్తుం ఖజానాపై పడింది. రుస్తుంపై రాజద్రోహ నేరం మోపి అతణ్ణి పట్టుకొని వధించాడు. అతని ఆస్తిని స్వాధీనం చేసుకున్నాడు. సైన్యాన్ని పంపి మచిలీపట్టణంలోని సామ్రాజ్య ఖజానాను దోచుకున్నాడు. అయినా అతని ఇబ్బందులు తీరలేదు. నగరవాసులపై పన్నులు పెంచటమేకాక జిజియా విధించడం, నిర్బంధంగా ఋణాలు సేకరించటం వంటి చర్యలకు దిగాడు. హైదరాబాదు వర్తకులు ఈ చర్యలకు నిరసనగా బంద్ పాటించారు. రుస్తుం

హత్య, జిజియా విధింపు వంటి చర్యలతో కాంబక్ష్ పూర్తిగా జనాదరణ కోల్పోయాడు. ప్రభుత్వోద్యోగులు కాంబక్ష్ ఆజ్ఞలను మన్నించడం మానినారు. జమీందార్లు సయితం పన్నులు, కప్పాలు చెల్లింపక మొగలాయి అధికారులను ధిక్కరించసాగినారు. ఈ అరాచక పరిస్థితులు దారి దోపిడి దొంగలకు మంచి అవకాశమయింది.

ఆనాటి దొంగల నాయకుల్లో సర్వాయి పాపన్న ముఖ్యుడు. ధనికుల్ని దోచి పేదలను పోషించిన మహావీరుడనీ, గొప్ప దేశభక్తుడనీ వర్ణిస్తూ పాపన్నను గురించి జానపద సాహిత్యం తయారయింది. కాని యధార్ధ చరిత్ర ఆ గాధలకు భిన్నంగా ఉంది. పాపన్న తండ్రి కల్లు అంగడి నడిపేవాడు. చిన్నతనం నుండి పాపన్న మంచి ధైర్య సాహసాలున్నవాడు. తండ్రి వృత్తిని నిరసించి నాటి అరాచక పరిస్థితులు అవకాశంగా తీసికొని రాజకీయ ప్రాముఖ్యం సంపాదించాలని ఆశించినవాడు. వితంతువులయిన తల్లిని సోదరిని హింసించి వారి ధనాన్ని తస్కరించి చిన్న మట్టికోట కట్టుకొని తన కార్యక్రమాలు ప్రారంభించినాడు. పరిసర గ్రామాల రైతులను దోచుకోవడం, అందంగా ఉన్న స్త్రీలను తన కోటకు చేర్చడం అతని చర్యలు.

లంబాడీ తండాలను నిర్బంధించి వారు సరఫరా చేస్తున్న ధనాన్ని పశువులను స్వాధీనం చేసుకొని లంబాడీ ఖైదీల చేత కోటలు కట్టించేవాడు, పరిసర భూములను సాగు చేయించేవాడు. కొంతకాలం ఎల్లందల జమీందారు కొల్వులో సైనికోద్యోగిగా ఉంటూ జమీ ప్రజలను వేధించడంతో జమీందారు పాపన్నను ఖైదు చేసాడు. బందీ నుండి తప్పించుకొని భోన్‌గిరి చేరి మరొక దారి దోపిడి అయిన సర్వాయితో చేరి సర్వాయి పాపన్నగా పేరు పొందాడు. ఉభయులు కలిసి హైదరాబాద్‌కు 50 మైళ్ళ దూరంలో షాపూర్, తిరుగొండ లలో షాపూర్ దుర్గం నిర్మించారు. వారి చర్యలతో పరిసర గ్రామాల రైతులు, వర్తకులు గగ్గోలెత్తిపోయినారు. పాపన్నను పట్టుకోవడానికి రిజాఖాన్ సాయంతో రుస్తుం చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. బహదుర్‌షా హైదరాబాద్‌లో వున్న సమయంలో పాపన్న పాదుషాను దర్శించి 14 లక్షల కప్పం చెల్లించి జమీం దారుగా గుర్తింపు పొందినట్లు తెలుస్తుంది.

ఢిల్లీలో తన అధికారాన్ని పదిలపరుచుకొని పెద్ద సైన్యంతో బహదుర్‌షా కాంబక్ష్‌పై దండెత్తాడు. జ్ఞాతి శేషం వుంచరాదని అతని సిద్ధాంతం. హైదరాబాద్ సమీపంలో జరిగిన యుద్ధంలో (1708) కాంబక్ష్ ఓడి మరణించాడు. దక్కన్ సుబాలు బహాదుర్‌షా వశమయ్యాయి.

బహదుర్‌షా దక్కన్ సుబాలపై తన ప్రధాని జుల్ ఫీకర్ ఖాన్‌ను సుబేదారుగా నియమించాడు. జుల్ ఫీకర్ ఢిల్లీలోనే వుంటూ తన ప్రతినిధి దావూద్‌ఖాన్ పన్ని ద్వారా, దక్కన్ వ్యవహారాలు నిర్వహించే ఏర్పాటు జరిగింది. అఫ్ఘన్ మున్సబుదారయిన యూసఫ్‌ఖాన్ హైదరాబాద్ ఫౌజు దారయినాడు. చాలాకాలం కర్నూలు ఫౌజుదారుగా స్థానిక రాజకీయాలలో యూసఫ్ మంచి అనుభవం సంపాదించాడు. న్యాయశీల అని, పరిపాలనా దక్షుడని పేరు పొందినాడు.

## యూసఫ్‌ఖాన్ – ఇబ్రహీంఖాన్

యూసఫ్‌ఖాన్ ఫౌజుదారుగా ఉన్న రెండు సంవత్సరాలు పాపన్నతోటి సంఘర్షణతో గడిచిపోయాయి. బహదుర్‌షా ఢిల్లీకి మరలిన తరువాత పాపన్న దురాగతాలు మితిమీరినాయి, 1708 లోనే మొహరం పర్వదినాల్లో అర్ధరాత్రి ఓరుగల్లుపై దాడిచేసి 12 వేలమంది పౌరజనాన్ని వధించి నగరాన్ని దోచుకొని చాలా మందిని బంధీలుగా తీసికొని వెళ్ళాడు. వీరిలో ఓరుగల్లు కాజీ భార్యను తన అంతఃపురానికీ, కూతుర్ని భోగం మేళంలోనూ చేర్చినాడు. అనంతరం కొద్ది రోజులకే భోనగిరి దోపిడి జరిగింది. ఓరుగల్లు కాజీ అవమాన భారంతో క్రుంగిపోయి మరణించాడు. ఈ వార్త విన్న పాదుషా మండిపడి పాపన్నను పట్టి శిక్షించ వలసిందిగా యూసఫ్‌ఖాన్‌ను ఆదేశించాడు.

12 వేల మంది అశ్వదళం, 20 వేలమంది పదాతి దళం వున్న మొగల్ సైన్యాన్ని యూసఫ్ తరిగొండ పైకి పంపాడు. సుమారు ఆరునెలలు ముట్టడి తరువాత తరిగొండ మొగలాయీల స్వాధీనం అయింది. పాపన్న పారిపోయి నాడు. చివరకు హసనాబాద్ దగ్గర కల్లు అంగడి యజమాని పాపన్నను మొగలాయిలకు పట్టి ఇచ్చినాడు. మొగల్ సైనికులు పాపన్నను క్రూరంగా వధించారు. దీనితో హైదరాబాద్ పరిసరములలో శాంతిభద్రతలు నెలకొని మొగల్ అధికార ప్రతిష్టలు ఇనుమడించాయి.

యూసఫ్‌ఖాన్ 1711 లో మరణించడంతో దేశంలో తిరిగి అరాచక శక్తులు విజృంభించాయి. మరాటీలు దండెత్తి వచ్చి హైదరాబాద్ నగరాన్ని, షాపూర్, పానగల్లు, కర్నూలు మొదలయిన దుర్గాలను దోచుకొని అపార నష్టం కలిగించారు. మొగలాయి ఉద్యోగులు దోపిడిగాండ్ర కంటె క్రూరంగా ప్రవర్తించసాగారు. దక్షిణ కోస్తా పరగణాలపై ఫౌజుదారయిన ముహమ్మద్ అయిర్ మీర్జాబేక్ పెద్దాపురం, మొగలితుర్రు, నూజివీడు జమీం దారులను దారుణంగా హింసించి డబ్బులు వసూలు చేయసాగినాడు. ఉత్తర

కోస్తాలో ఫౌజుదారయిన అబిబ్ ఖాన్ రాజమండ్రిని కేంద్రంగా చేసికొని విజయ నగరం మొదలు మొగలితుర్రు వరకు జమీందార్లను దోచుకున్నాడు. మీర్జాబేక్ క్రిందనున్న సైన్యానికి జీతాలు లేకపోవడంతో తిరుగుబాటు చేసి హైదరాబాదు, మచిలీపట్టణం మధ్య గ్రామాలను దోచి ప్రజలను చిత్రహింసలకు గురిచేసేవారు. ఆ రోజుల్లో హైదరాబాద్ తరువాత ఐశ్వర్యవంతమయింది మచిలీపట్టణం. అందుచే మీర్జా సైన్యాలు మచిలీపట్టణం వైపుకు పురోగమించాయి. స్థానిక హిందూ ముస్లిం వర్తకులు పాశ్చాత్య వర్తక సంఘాలు ఉమ్మడిగా మొగల్ సైన్యాలను ప్రతిఘటించాయి. పాశ్చాత్య ఫిరంగి గుండ్ల వర్షానికి మొగల్ సైన్యాలు చెల్లాచెదురై మచిలీపట్టణానికి ప్రమాదం తప్పిపోయింది.

ఢిల్లీలో ఇదే సమయంలో విపరీతమయిన పరిణామాలు జరిగినాయి. బహదుర్‌షా అనంతరం సింహాసనం ఎక్కిన జహందర్‌షాను ఫరూక్‌సియర్ ప్రతిఘటించాడు. ఫరూక్‌సియర్ దుర్బలుడు, అందుచే అధికారం హసన్ అలీ, హూస్సేన్‌అలీ అనే సోదరుల పరమయింది. పాదుషా అయినంతనే జహందర్‌షా పక్షీయులైన వారిని పదవిచ్యుతులను గావించినాడు. ముఖ్యంగా దావూద్‌ఖాన్ పన్నిని దక్కన్ నుంచి బర్తరఫ్ చేసి, తనకు తోడ్పడిన తురానీ పక్ష నాయకుడు కమ్రుద్దీన్‌కు నైజాం ఉల్ ముల్క్ అనే బిరుదం ఇచ్చి దక్కన్ ఆరు సుబాలపైన సుబేదార్‌గా నియమించినాడు. ఇది దేశ చరిత్రలో చాలా ముఖ్యమయిన సంఘటన. స్వతంత్ర హైదరాబాద్ రాజ్య స్థాపనకు నాంది అని చెప్పవచ్చు. రాజ ప్రతినిధిగా కమ్రుద్దీన్‌లో దక్కన్‌తో తన భవిష్యత్తు ముడిపడి ఉందనే అభిప్రాయం ఏర్పడింది.

## నైజాం ఉల్ ముల్క్

నైజాం ఉల్ ముల్క్ పూర్వులు మధ్య ఆసియా నుంచి వలస వచ్చి మొగలాయి కొల్వులో ఉద్యోగులుగా చేరారు. తాము మొదటి ఖాలీఫా అబూ బకర్ సంతతి వారమని వారి విశ్వాసం. వీరి మూల పురుషుడు ఖ్వాజా అబిద్ బుఖారో రాజ్యంలో సమర్కండ్ ప్రాంత వాసి. షాజహాన్ చివరి రోజులలో జరిగిన వారసత్వ యుద్ధంలో (1657) అబిద్ ఔరంజేబు పక్షం వహించాడు. రాజపుత్రులతో యుద్ధాలలో ఔరంగజేబుకు అండగా వుండి చిన్‌లిలిచ్ ఖాన్ బిరుదం పొందాడు. చివరకు గోల్కొండ ముట్టడిలో ఫిరంగి గుండు తగిలి 1687 లో మరణించాడు.

ఖ్వాజా అబిద్‌కు ఐదుగురు కొడుకులు. వారిలో షిహాబుద్దీన్ ఖాన్ 1649 లో సమర్కండ్‌లో జన్మించాడు. 1669 లో భారత దేశానికి వచ్చి

మొగల్ దర్బారులో చేరి తండ్రితో బాటు రాజపుత్రులతోటి యుద్ధాల్లో పాల్గొన్నాడు. అతని ధైర్య సాహసాలను అభినందించి పాదుషా అతనికి మాజీ ఉద్దీన్ ఖాన్, ఫిరోజ్‌జంగ్ బిరుదులిచ్చాడు షిహాబుద్దీన్ బీజాపూర్, గోల్కొండ ఆక్రమణలో ప్రముఖపాత్ర నిర్వహించాడు. అనంతరం ఆదోని, మెదక్, (గుల్షనాబాద్) దుర్గాలను ఆక్రమించి బీరారు పాలకుడయినాడు. పాలనలో సయితం ఫిరోజ్ మంచి సమర్థుడు.

ఫిరోజ్ జంగుకు షాజహాన్ చక్రవర్తి మంత్రి సాదుల్లా కుమార్తె సఫియా ఖానమ్‌తో పెండ్లి జరిగింది. వీరి ఏకైక పుత్రుడు కమ్రుద్దీన్. 1671 లో జన్మించాడు. బాల్యం నుండి కమ్రుద్దీన్ తండ్రితో బాటు యుద్ధాల్లో పాల్గొనేవాడు. ఆదోని ఆక్రమణలో (1691) అసాధారణ ధైర్య సాహసాలు ప్రదర్శించినందున ఔరంగజేబు సంతసించి కమ్రుద్దీన్‌కు చిన్‌లిలిచ్ ఖాన్ బిరుదం ఇచ్చి ఆదరించాడు. క్రమంగా కమ్రుద్దీన్ మొగల్ దర్బారులోని తురానీ వర్గానికి నాయకుడయ్యాడు. 1702 లో కమ్రుద్దీన్ బిజాపూర్ సుల్తానయినాడు.

ఔరంగజేబు తర్వాత జరిగిన వారసత్వ యుద్ధంలో కమ్రుద్దీన్ తాటస్థ్యం వహించాడు. బహదుర్‌షా ప్రధానియైన జుల్‌ఫీకర్ ఖాన్‌కు కమ్రుద్దీన్ అంటే భయం. అసూయ. అతణ్ణి ఢిల్లీ నుండి దూరంగా పంపివేయాలనే సంకల్పంతో కమ్రుద్దీన్‌కు ఖాన్-ఇ-దౌర్యా బహదుర్ బిరుదు ఇచ్చి అయోధ్యపై రాజ ప్రతినిధిగా లక్నో ఫౌజుదారుగా పంపే ఏర్పాటు చేశాడు. కాని మొగల్ దర్బారు వ్యవహారాలలో తన ప్రత్యర్థియైన జుల్‌ఫీకర్ ప్రాబల్యం పెరగడం సహించలేక కమ్రుద్దీన్ లక్నో ఫౌజుదారీ పదవిని త్యజించడమే గాక రాజకీయాల నుండి తాత్కాలికంగా విరమించినాడు. 1710 లో అతని తండ్రి ఫిరోజ్‌జంగ్ మరణం కమ్రుద్దీన్‌ను మరింతగా క్రుంగదీసింది.

జుల్‌ఫీకర్ పతనానంతరం కమ్రుద్దీన్‌ను దక్కన్ సుబేదారుగా నియమించడం జరిగింది. సిరోంజ్, ఉజ్జయిని, బుర్హాన్‌పూర్‌ల మీదుగా 1713 జూన్ మాసంలో నైజాం ఉల్‌ముల్క్ ఔరంగాబాద్ చేరినాడు. ఇదే సమయంలో ఖ్వాజా ముహమ్మద్‌ను హైదరాబాద్ ఫౌజుదార్‌గా ఫరూక్‌సియర్ నియమించాడు. ఈతడు కూడా తురానీ జాతీయుడే. బలక్ ఈతని జన్మస్థలం. బాల్యంలోనే భారత దేశానికి వచ్చి ఔరంగజేబు ఆస్థానంలో చిన్న ఉద్యోగిగా చేరి కాంబక్ష్ కింద సైనికోద్యోగిగా (బక్షీ) అయినాడు.

తరువాత సూరత్ ఫౌజుదారీ పదవి, గుజరాత్, మాళవ సుబేదారు పదవులు నిర్వహించి యుద్ధ నిర్వహణలో పరిపాలనలో మంచి సమర్థుడనిపించు

కున్నాడు. అందుచే అతని హోదాను పెంచి ముబారిజ్‌ఖాన్ అనే బిరుదాన్నిచ్చి హైదరాబాదు ఫౌజుదారునిగా నియమించినందున కోస్తా ప్రాంతాల ఫౌజుదారులపై అధికారం అతనికి సంక్రమించింది.

నైజాం ఉల్‌ముల్క్, ముబారిజ్‌లు దక్కన్ చేరిన సమయంలో దక్కన్ పరిస్థితులు దారుణంగా ఉన్నాయి. జుల్‌ఫీకర్‌తో సమాధానం కుదుర్చుకున్న నాటి నుండి మహారాష్ట్రులు దేశాన్ని కొల్లగొట్ట సాగినారు. ఆరు సుబాల్లోనూ తమ కమైష్‌దార్లను (శిస్తు వసూలు చేసే ఉద్యోగులు) నియమించి చౌత్ సర్దేశ్ ముఖీలనే కాక వాణిజ్య సుంకాలు, రహదారి సుంకాలు బలవంతగా వసూలు చేసేవారు. రైతులకు, వర్తకులకు రక్షణ లేకుండా పోయింది. దీనికి తోడు కృష్ణయలాల్ వంటి మరాటీ దోపిడీగాండ్రు తరచు గ్రామాలపైబడి దోచుకునే వారు. ఇక కోస్తా ప్రాంతాల్లోని జమీందారులు, మొగలాయి ఉద్యోగులు జరిపిన అరాచకాలు వర్ణనాతీతం. జమీందార్లు సుమారు 4 సంవత్సరాల కప్పం బకాయి పడినట్లు తెలుస్తుంది.

నైజాం ఉల్‌ముల్క్, మహారాష్ట్రులపై దృష్టి కేంద్రీకరించి హైదరాబాద్ వ్యవహారాలలో ముబారిజ్ చర్యల్లో జోక్యం కలిగించుకోలేదు. మరాటా రాజ్యంలో సాహూ (సతారా) తారాబాయ్ (కొల్హాపూర్) ల మధ్య చెలరేగిన అంతర్యుద్ధం నైజాంకు అనుకూలమయింది. చౌత్ సర్దేశ్ ముఖీలను చెల్లించడానికి నిరాక రించటమే కాక రాజ్యంలోని ప్రధాన నగరాలను సందర్శించి కీలక స్థావరాల్లో సైన్యాలు నెలకొల్పినాడు. అతనికి దివాన్‌గా దియానత్‌ఖాన్ చాల సహాయం చేశాడు.

ఇక కోస్తాలో ముబారిజ్‌ఖాన్ మొగలిత్తుర్రు, నూజివీడు జమీందార్లను అణచి వారి నుండి కప్పం వసూలు చేశాడు. చికాకోల్ సర్కారులో అరాచకం సృష్టిస్తున్న అబిద్‌ఖాన్‌ను గండికోటకు తరిమివేశాడు. ముబారిజ్ ఖాన్ దివా నయిన తువారాత్ కొండవీడు సర్కారు పరిస్థితులు చక్కబరిచినాడు. మర్రాజా, వాసిరెడ్డి, మానూరు జమీందార్లు ముబారిజ్ పట్ల విధేయులై పన్నులు కప్పము చెల్లించడానికి అంగీకరించినారు.

ఢిల్లీలో రాజనిర్మాతల ప్రాబల్యం పెరిగింది. రాజ కుటుంబంలో సయ్యద్ సోదరుల పట్ల విముఖత పెరిగి వారిని అణచడానికి ఆలోచనలు సాగి నాయి. దీనికి తోడు దక్కన్‌లో నైజాం ఉల్ ముల్క్ దక్షతతో ప్రజాదరణ సాధించి బలవంతుడు కావడాన్ని సయ్యద్ సోదరులు సహించలేక పోయినారు. ఈ పరిణామాల ఫలితంగా 1715లో నైజాం ఉల్ ముల్క్‌ను దక్కన్ నుండి

బర్తరఫ్ చేసి సయ్యద్ సోదరులలోని హుస్సేన్ అలీ ఖాన్‌ను దక్కన్ సుబే దారుగా నియమించడం జరిగింది. కాని పాదుషా ఫరూక్ సియార్ ఖాందేష్ ఫౌజుదారయిన దావూద్‌ఖాన్ పన్నికి హుస్సేన్ అలీ ఔరంగాబాద్ చేరకుండా అటకాయించమని రహస్య సందేశం పంపినాడు. బుర్హాన్‌పూర్ దగ్గిర జరిగిన యుద్ధంలో దావూద్ ఓడి మరణించినాడు హుస్సేన్ ఔరంగాబాద్ చేరినాడు (1716.)

హుస్సేన్ అలీ తానా దక్కన్‌లో బలపడి ఢిల్లీలో సయ్యద్‌ల బలాన్ని ఇనుమడింపచేసే ప్రయత్నం చేశాడు. ఆ ఆశయంతోనే 'పీష్వా బాలాజీ విశ్వ నాథ్‌తో 1717 లో హుస్సేన్ అలీ ఒడంబడిక చేసుకున్నాడు. దీని ప్రకారం దక్కన్ సుబాలపై చౌత్ సర్దేశ్‌ముఖీలనే గాక 35 శాతం రహదారి సుంకాలను సయితం మహారాష్ట్రులు వసూలు చేసుకోవడానికి సయ్యద్ సోదరులు అంగీక రించారు. దక్కన్‌లో మొగలాయీలకు లభించే ఆదాయం చాలావరకు తగ్గింది. ఇందుకు ప్రత్యామ్నాయంగా 15 వేల మరాటీ అశ్వదళం సయ్యద్ సోదరుల పరం చేయడానికి ఛత్రపతి సాహూ అంగీకరించాడు. ఈ సంధి వలన మొగలు ప్రభుత్వానికి పోటీ ప్రభుత్వం వంటిది దక్కన్‌లో ఏర్పడింది. ఆరు సుబాల్లోనూ ప్రతి జిల్లాలో మహారాష్ట్రులు పన్ను వసూలుకై తమ గుమాస్తాలను నియమించి వారి చర్యలు పర్యవేక్షించడానికి ఔరంగాబాద్‌లో ఇద్దరు వకీళ్ళను నియమించి నారు. హైదరాబాద్ కర్ణాటకంలో మహారాష్ట్రుల పోటీ పాలనా యంత్రాంగాన్ని ముబారిజ్‌ఖాన్ తీవ్రంగా ప్రతిఘటించాడు. కాని 1718 చివర్లో మొగల్ సైన్యం మద్దతుతో మరాటీ సైన్యం గోల్కొండను ముట్టడించింది. గత్యంతరం లేక ముబారిజ్ చౌత్ చెల్లించి యుద్ధాన్ని నివారించినాడు.

సయ్యద్ సోదరుల నిరంకుశత్వం నుండి బయల్పడడానికి ఫరూక్ సియర్ అతని అంతఃపురం పన్నుతున్న కుట్రలను పసిగట్టిన హసన్ అలీ దక్కన్‌నుండి హుస్సేన్ అలీని ఢిల్లీకి రావలసిందిగా కోరినాడు. తన కుమారు డయిన ఆలమ్ అలీఖాన్‌ను తన ప్రతినిధిగా ఔరంగాబాద్‌లో నియమించి హుస్సేన్ ఢిల్లీ చేరినాడు. సయ్యద్ సోదరులు ఫరుక్‌సియర్‌ను తొలగించి అబుల్ బరాకత్ రఫీఉద్ దరాజాను, అతణ్ణి తొలగించి రఫీ ఉద్దౌలాను, అతని మరణానంతరం మహమ్మద్ షాను గద్దె నెక్కించారు. ఈ రాజకీయ పరిణా మాల్లో తురానీ నాయకుడయిన నిజాం ఉల్ ముల్క్ సహాయాన్ని సయ్యద్ సోదరులు ఆశించినారు గాని నైజాం పూర్తి తాటస్థ్యం వహించాడు. అయితే అధికార దాహంతో కూడిన రాజనిర్మాతల కుతంత్రాలతో సామ్రాజ్య రాజకీ

యాలు కలుషితమయిన ఈ సమయంలోనే నైజాం ఉల్ ముల్క్ స్వతంత్ర్య హైదరాబాద్ రాజ్య స్థాపనకు పునాదులు వేశాడు.

నైజాం ఉల్ ముల్క్, సయ్యద్ సోదరుల మధ్య స్పర్థలు నానాటికీ తీవ్రతరం కాసాగింది. అదిగాక తురానీ పక్ష నాయకుడైన నైజాం ఢిల్లీలో ఉండటం రాజ నిర్మాతలకు కంటకమయింది. అతణ్ణి ఢిల్లీ నుండి దూరంగా పంపే ఉద్దేశ్యంతో 1719 లో అతణ్ణి మాళవకు సుబేదారుగా నియమించినారు. సయ్యద్ సోదరుల ఆశయం, స్వభావం పూర్తిగా గ్రహించిన నైజాం మాళవలో తన బలాన్ని పటిష్ఠం చేసుకోవడానికి శక్తికొలది ప్రయత్నించాడు. సయ్యద్ సోదరుల పట్ల ద్వేషం వహించిన సేనాపతులు, జాగీర్దార్లు నైజాం పక్షం వహించసాగినారు, మాళవలో నైజాం బలం పెరగడంతో సయ్యద్ సోదరులు అసూయాపరులై 1720 మే నెలలో నైజాంను మాళవ నుండి బర్తరఫ్ చేస్తూ ఫర్మానా జారీ చేసారు. ఈ పర్మానా ఆంతర్యాన్ని గ్రహించిన నైజాం సయ్యద్ సోదరులను ప్రతిఘటించడానికి నిశ్చయించినాడు. సయ్యద్ సోదరుల కుతంత్రాలతో విసుగెత్తిన దక్కన్ పాలకుల నుండి నైజాంకు మంచి ప్రోత్సాహం లభించింది. కొల్హాపూర్‌లోని రాణా రాజస్‌బాయ్, హైదరాబాదు ఫౌజుదారు ముబారిజ్ ఖాన్ కూడా నైజాంకు మద్దతు నిచ్చారు. ఈ ప్రోత్సాహంతో సయ్యద్ సోదరుల పర్వానాను ధిక్కరించి నైజాం దక్కన్ సుబాలను జయించడానికి బయలుదేరినాడు. అసీర్‌ఘర్, బుర్హాన్‌పూర్‌లను వశపర్చుకొని బర్హన్‌పూర్‌లో మకాం చేశాడు ఈలోగా సయ్యద్ సోదరుల ఆజ్ఞమేరకు దిలావర్ అలీఖాన్ నైజాం (బుర్హన్‌పూర్) పై దండెత్తాడు. ఈ పరిణామాన్ని నైజాం.వూహించియే ఉన్నాడు.

బుర్హన్‌పూర్‌కు ఉత్తరంగా 32 మైళ్ళ దూరంలో ఖండ్వా దగ్గర దిలావర్‌ఖాన్, నైజాం ఉల్‌ముల్క్‌ల మధ్య పెద్ద యుద్ధం జరిగింది. దిలావర్‌ఖాన్ సైన్యంలో చాలా భాగం నశించింది. అతడు మరణించాడు. నైజాంకు పూర్తి విజయం లభించింది. ఖండ్వా విజయం నైజాం స్వతంత్రాధికారానికి పునాది వేసిందని చెప్పవచ్చు. ఈలోగా ఆలమ్ అలీఖాన్ ఔరంగాబాద్ నుండి బర్హాన్‌పై దండెత్తినాడు. బాలాపూర్ దగ్గర జరిగిన యుద్ధంలో ఆలీఖాన్ ఓడి మరణించినాడు. ఈ విజయంతో నైజాం అధికారానికి తిరుగు లేకపోయింది. నైజాం ఔరంగాబాద్ చేరడంతో హైదరాబాదు ఫౌజుదారు ముబారిజ్‌ఖాన్, బిజాపూర్ ఖిల్లాదారు రాహుల్లాఖాన్ కడప (అబ్దుల్ నబీఖాన్) కర్నూలు (ఇబ్రహీంఖాన్ పన్నీ) ఫౌజుదారులు అతనికి తమ మద్దతు ప్రకటించి అతణ్ణి దక్కన్ సుబేదారుగా అంగీకరించాడు

నైజాం ఉల్‌ముల్క్‌పై తమ కుతంత్రాలు ఫలించకపోవడంతో సయ్యద్ సోదరులు దిగ్భ్రాంతి చెందారు. ఐనా నైజాంను అభినందిస్తూ హుస్సేన్ అలీ జాబు వ్రాసి పాదుషాతో దక్కన్‌కు బయలుదేరినాడు. ఈ యాత్ర ఉద్దేశ్యం స్పష్టంగా తెలియదు. ఈలోగా రాజస్థాన ఉద్యోగులు మొగల్ అంతఃపుర ప్రోత్సాహంతో సయ్యద్ సోదరులను హతమార్చడానికి కుట్ర తయారుచేశారు. మొగల్ సైన్యం జయపూర్ సమీపంలో మజిలీ చేసిన సమయంలో హుస్సేన్ అలీని హత్య చేశారు. ఈ వార్త తెలిసిన వెంటనే హసన్ అలీ ఢిల్లీపై నడచి నాడు. హసన్‌పూర్ దగ్గర మొగల్ సైన్యం హసన్ అలీని ఓడించి బంధీచేసింది. కొద్ది రోజుల్లోనే విష ప్రయోగంతో హసన్ మరణించినాడు. పాదుషాకు రాజ్యానికి దేశానికి సయ్యద్ సోదరుల బెడద తీరింది.

పాదుషా మహమ్మద్‌షా నైజాం ఉల్‌ముల్క్‌ను తన వజీర్‌గా నియమిస్తూ వెంటనే ఢిల్లీకి రావలసిందిగా ఫర్మానా జారీ చేశాడు (1722) వజీర్‌గా నైజాం రాజ్యాస్థానాన్ని సంస్కరించి పాదుషా అధికార ప్రతిష్ఠలను పునరుద్ధరించడానికి విశ్వప్రయత్నం చేశాడు. స్వార్థపరులు, అవినీతిపరులయిన రాజ్యాస్థానోద్యోగుల కుతంత్రాల వలన నైజాం ప్రయత్నాలు ఫలించలేదు. సర్దారులు, జాగీర్దారులు యథాప్రకారం ప్రజలను పీడించడం మానలేదు. పాదుషా కూడా నైజాం సంస్కరణలను సమర్థించలేదు. ఢిల్లీ పరిస్థితులతో విసుగెత్తి నైజాం దక్కన్‌కు తరలినాడు.

నైజాం చర్యను అవిధేయతగా భావించి మహమ్మద్‌షా ఆగ్రహంతో ముబారిజ్ ఖాన్‌ను దక్కను సుబేదారుగా నియమించి ఆతడు నైజాంను ఎదిరించవలసిందిగా ఆజ్ఞాపించాడు. ఫర్మానా అందినప్పటినుండి ముబారిజ్ నైజామును ప్రతిఘటించడానికి సన్నద్ధుడయినాడు. కడప (అబ్దుల్ ఫతేఖాన్) కర్నూలు (ఇబ్రహీంఖాన్ పన్ని) కర్ణాటక (సాదుల్లా ఖాన్) ఫౌజుదారులు ఆతనితో చేరినారు. పెద్ద సైన్యంతో ముబారిజ్ నైజాంపై నడచినాడు. ఉభయ సైన్యాల మధ్య షకర్ ఖేరా (బీరార్‌లో, ఔరంగాబాద్‌కు 80 మైళ్ళ దూరంలో) దగ్గర భీకరమైన యుద్ధం జరిగింది. (1724).

భారతదేశ చరిత్రలో చరిత్రాత్మకమైన యుద్ధాల్లో ఒకటిగా దీనిని పేర్కొనవచ్చు. ఈ యుద్ధ ఫలితంగానే హైదరాబాద్ స్వతంత్ర రాజ్యంగా రూపొందింది. యుద్ధంలో ముబారిజ్‌ఖాన్ ఓడి మరణించాడు. ఆతని కుమారుడు ఖ్వాజా అహ్మద్ ఖాన్ గోల్కొండను స్థావరంగా చేసుకొని నైజాంను ప్రతిఘటించడానికి చేసిన ప్రయత్నం ఫలించలేదు. దక్కన్ సుబా పూర్తిగా నైజాం స్వాధీనమయింది. తెలంగాణాలో కొందరు ఫౌజుదారులు, ముఖ్యంగా భోన్‌గిరి

ఫౌజుదారు కాశింరజ్వీఖాన్ హిందూ జమీందారయిన అప్పారావు కలిసి నైజాంను ఎదిరించి పరాజితులయినారు. హైదరాబాదు పరిసర ప్రాంతాలన్నీ నైజాం ఆధీనంలోకి వచ్చాయి.

నైజాం ఉల్‌ముల్క్ తన రాజధానిని ఔరంగాబాద్ నుండి హైదరాబాదుకు మార్చినాడు. పాదుషా మహమ్మద్‌షా నైజాంతో రాజీ పడడం కంటె గత్యంతరం లేకపోయింది. నైజాం విజయాన్ని గుర్తించి అతనికి 'అసఫ్‌జా' బిరుదాన్నిచ్చి పాదుషా గౌరవించాడు. స్వతంత్ర హైదరాబాదు రాజ్యం ఉద్భవించింది. నాటి హైదరాబాద్ రాజ్యం ఉత్తరాన తపతి నది నుండి దక్షిణాన తిరుచునాపల్లి, తూర్పున కోస్తావరకు విస్తరించింది. మహారాష్ట్ర రాజ్యం దాని పశ్చిమ సరిహద్దు తిరుచునాపల్లి రాజు, కర్ణాటక నవాబు నైజాంకు లోబడి పాలించేవారు.

హైదరాబాదు రాజ్య పాలనాయంత్రాంగాన్ని సంస్కరించి పునర్నిర్మించడానికి అసఫ్‌జా ప్రయత్నం చేశాడు కాని అతనికి మరాఠీల బెడద ఎక్కువయింది. పేష్వా బాలాజీ విశ్వనాథ్‌తో చేసుకొన్న ఒడంబడిక ప్రకారం దక్కన్ సుబాల్లో చౌత్ సర్దేశ్‌ముఖీలను వసూలు చేసుకొనే అధికారం మరాటీలకు సంక్రమించింది విశ్వనాథ్ కుమారుడు పేష్వా బాజీరావు నాయకత్వంలో "హింద్ పద్‌పాద్ షాహి" (హిందూ సామ్రాజ్యం) ఆశయంతో మరాటీలు విజృంభించి ఉత్తర దక్షిణ భారతాలపై దాడులు ప్రారంభించారు మొదటినుండి మహారాష్ట్రలకు పన్నులు చెల్లించడానికి నైజాం పూర్తిగా వ్యతిరేకి. మహారాష్ట్రలో సాహూ (సతారా) రెండో శంభూజీ (కొల్హాపూర్-రాజస్‌బాయ్ కొడుకు) ల మధ్య సదవగాహన లేకపోవడం అవకాశంగా తీసుకొని శంభూజీని ఛత్రపతిగా గుర్తించి పేష్వాకు (సాహూకు) పన్నులు చెల్లించడానికి అసఫ్‌జా నిరాకరించాడు. పేష్వా ఆగ్రహించి అహ్మదాబాదు గోదావరీ మధ్య హైదరాబాదు రాజ్య ప్రాంతాన్ని ఆక్రమించే ప్రయత్నం చేశాడు. దాన్ని ప్రతిఘటించడానికి, శంభూజీని ఛత్రపతిగా ప్రకటించి అసఫ్‌జా పూనాపై దండెత్తినాడు. కాని పాల్‌ఖేడ్ యుద్ధంలో (25 ఫిబ్రవరి 1727) పూర్తి పరాజయం పొంది పేష్వాతో సంధి చేసుకున్నాడు. దీని ప్రకారం సాహూను ఛత్రపతిగానూ, దక్కన్‌లో చౌత్ వసూలు చేసుకునే మరాటీల అధికారం అసఫ్‌జా గుర్తించక తప్పలేదు.

విజయ పరంపరలతో ఆత్మవిశ్వాసం బలపడిన పేష్వా బాజీరావు ఉత్తర ఇండియాపై విజృంభించి తరచు దాడులు సాగించినాడు. 1737 లో ఒక మెరుపు దాడిలో ఢిల్లీ రక్షణ శ్రేణుల వరకూ నడచి భయోత్పాతం సృష్టించాడు. మహారాష్ట్ర విజృంభణను అరికట్టే యత్నంలో పాదుషా నైజాంను ఢిల్లీకి

రప్పించి పేష్వాపై యుద్ధానికి పురికొల్పినాడు. ఢిల్లీ నుండి పెద్ద సైన్యంతో బయలుదేరిన నైజాం భోపాల్ దగ్గర జరిగిన యుద్ధంలో పూర్తిగా ఓడిపోయినాడు. (1739)

ఇంతలో 1739 లోనే ఇండియాపై నాదిర్‌షా దండయాత్ర జరిగింది. నాదిర్‌షా సామర్కండ్ పాలకుడు. అతణ్ణి ఎదిరించడానికై పాదుషా కోరికపై నైజాం ఢిల్లీ వెళ్ళినాడు. హైదరాబాదు పాలన అసఫ్‌జా రెండో కొడుకయిన నాజర్ జంగ్‌కు అప్పగించబడినది. మొగల్ సైన్యం నాదిర్‌షా చేతిలో పూర్తిగా ఓడిపోయింది. ఢిల్లీని నాదిర్‌షా ఆక్రమించకుండా నైజాం జరిపిన మధ్యవర్తిత్వం అయోధ్య నవాబు సాదత్ ఆలీ కుట్రవలన విషమయింది. నాదిర్‌షా ఢిల్లీని దారుణంగా దోచుకొని వేలాది పౌరులను హతమార్చి అపార ధనరాశులతో స్వదేశం మరలినాడు. అసఫ్‌జా ఢిల్లీలో ఉండగా హైదరాబాద్‌పై పేష్వా దండెత్తి వచ్చినట్లు అతణ్ణి నాజర్ జంగ్ ఓడించి మరలించినట్లు తెలుస్తోంది. (1740) బహుశ ఈ విజయంతో నాజర్‌జంగ్‌కు తన శక్తిసామర్థ్యాలపై విశ్వాసం కుదిరి తన తండ్రిపై తిరుగుబాటు చేసి సింహాసనం ఆక్రమించే ప్రయత్నాలు చేసాడు. నాజర్‌జంగ్ కుట్రను విశ్వాసపాత్రులయిన ఉద్యోగుల ద్వారా తెలుసుకొని అసఫ్‌జా హైదరాబాదుకు మరలినాడు. తండ్రితో యుద్ధానికి నిర్ణయించి నాజర్ పెద్ద సైన్యంతో బయలుదేరాడు. ఉభయ సైన్యాలకూ దౌలతాబాద్ దగ్గర యుద్ధం జరిగింది. (జులై 1741) నాజర్‌జంగ్ పరాజయం పొంది ఖైదీగా పట్టుబడ్డాడు. అంతిపురి ప్రార్థనపై అసఫ్‌జా అతణ్ణి క్షమించాడు.

హైదరాబాద్ చేరిన అసఫ్‌జా దృష్టి కర్ణాటక రాజకీయాలు ఆకర్షించాయి. ఆర్కాటు నవాబు డోస్ట్ ఆలీ. అతని కుమారుడు సఫ్దరాలీ, అల్లుడు చందా సాహేబ్. చందా సాహేబ్ దివాన్‌గా ఉంటూ తిరుచునాపల్లిని పాలిస్తుండేవాడు. వీరి అండతో డోస్ట్ ఆలీ తాను పాదుషాకు మాత్రమే బాధ్యుడననే భావం పెంచుకొని నైజాం ఆధిపత్యం గుర్తించక ఇంచుమించు స్వతంత్రంగా వ్యవహరించసాగినాడు. కర్నాటక, కర్నూలు ఫౌజుదారులు పరస్పరం కలహించుకుంటూ హైదరాబాద్ పట్ల అవిధేయులుగా ఉన్నారు. నాలుగయిదు సంవత్సరాల కప్పం బకాయి పడ్డారు. వీరిని శిక్షించి కర్ణాటక రాజ్యంతో దండయాత్రకు అసఫ్‌జా సన్నాహాలు ప్రారంభించినాడు.

ఇంతలో మహారాష్ట్ర నాయకుడైన రఘూజీ భోన్స్లే కర్ణాటకంపై దండెత్తినాడు. దామల్ చెరువు యుద్ధంలో డోస్ట్ ఆలీ ఓడి మరణించాడు. సఫ్దరాలీ, చందా సాహేబ్‌లు తమ కుటుంబాలను ఫ్రెంచివారి ఆధీనంలో

ఉన్న పుదుచ్చేరికి పంపినారు. పుదుచ్చేరి గవర్నర్ డ్యూమస్ వారికి రక్షణ కల్పించినాడు. చౌత్ చెల్లించే షరతుపై సఫ్దరాలీ, మహారాష్ట్రులకు రహస్య ఒప్పందం కుదిరింది. దాని ప్రకారం రఘూజీ తిరుచునాపల్లిపై దాడిచేసి చందాసాహేబ్‌ను బందీచేసి సతారాకు తీసికొనిపోయినాడు. కర్ణాటకంలో సఫ్దరాలీకి పోటీ తొలగిపోయింది. తనకు 60 లక్షలు కప్పం చెల్లించాలని, చందాసాహేబు కుటుంబాన్ని అప్పగించాలనీ రఘూజీ ఆదేశాన్ని డ్యూమస్ ధైర్యంతో తిరస్కరించాడు. తిరుచునాపల్లి పాలకుడుగా మురారీరావు ఘోర్పాడేను నియమించి రఘూజీ స్వదేశానికి మరలినాడు. మహారాష్ట్రుల నెదిరించిన డ్యూమస్ ధైర్యసాహసాలను మహమ్మద్‌షా (పాదుషా), అసఫ్‌జా ప్రశంసించినారు. వారికి ఫ్రెంచివారి పట్ల ఆదరాభిమానాలు పెరిగినాయి.

సఫ్దరాలీ అసమర్థుడు; మహారాష్ట్రులకు చౌత్, యుద్ధ నష్ట పరిహారాలు చెల్లించడంతో అతని ఖజానా వట్టిపోయినందున ప్రజలపై విపరీతంగా పన్నులు విధించవలసి వచ్చింది. దానితో సఫ్దరాలీ పట్ల ప్రజలలో ద్వేషం పెరిగి కర్ణాటకం అరాచకం పాలయింది. కర్ణాటకంలోని అశాంతి వెల్లూరు ఫౌజుదారు, సఫ్దరాలీ బావగారు అయిన ముర్తిజా ఆలీలో దురాశ పురిగొల్పింది. తన భార్య ప్రోత్సాహ సహాయాలతో సఫ్దరాలీని హతమార్చి ముర్తిజా ఆలీ కర్ణాటక నవాబుగా ప్రకటించుకున్నాడు. కాని ఆస్థాన ఉద్యోగులూ, సైన్యమూ, ముర్తిజాను ప్రతిఘటించి (1742) సఫ్దరాలీ కుమారుడైన సయ్యదాలీని నవాబుగా గద్దెనెక్కించారు.

సయ్యదాలీ పసి ప్రాయంవాడు. మదరాసులో ఉండేవాడు. మదరాసు లోని ఇంగ్లీషు కంపెనీ కూడా అతనికి మద్దతునిచ్చింది. అందుచే ఆంగ్లేయుల పట్ల కృతజ్ఞతతో సెంటుజార్జి కోట సమీపంలో ఉన్న పూనమల్లి మొదలయిన ఐదు గ్రామాలను ఆంగ్లేయులకు దత్తం చేయటమే కాక చింతాద్రిపేటలో ఆర్కాటు రూపాయలు, బంగారు నాణాలు ముద్రించుకునే హక్కు సయితం ఆంగ్లేయుల కిచ్చినాడు.

ఈ విధంగా అల్లర్లకు అశాంతికి తరచు లోనవుతున్న కర్ణాటకం నుండి మహారాష్ట్రులను పారద్రోలి అచటి ఫౌజుదారులు బకాయిపడ్డ కప్పం వసూలుచేసే ఉద్దేశ్యంతో అసఫ్‌జా కర్ణాటకంపై దండెత్తాడు. సయ్యద్ మహమూద్ నైజాం పట్ల విధేయతను ప్రకటించాడు. ఆరు మాసాల ముట్టడి తరువాత తిరుచునాపల్లి నైజాం స్వాధీనమయింది. (1743) సయ్యద్ ఆలీ బాలుడైనందున అతనికి సంరక్షకుడుగా కర్ణాటక వ్యవహారాలు నిర్వహించడానికి అన్వరుద్దీన్‌ఖాన్‌ను నియమించినాడు. నైజాం హైదరాబాదుకు మరలిన (1744) అచిర కాలంలోనే

అన్వరుద్దీన్ ముర్తజా కలిసి కుట్రపన్ని ఒక విందు సందర్భంలో బాలుడైన సయ్యద్ ఆలీని హత్య చేయించారు. ఈ వర్తమానం విన్న అసఫ్‌జా ఆగ్రహానికి అంతు లేకపోయింది. కాని అన్వరుద్దీన్ కుట్రలో తనకేమాత్రం ప్రమేయం లేదని అసఫ్‌జాను నమ్మించడానికి ప్రయత్నించాడు. గత్యంతరం లేక అసఫ్‌జా కర్ణాటక నవాబుగా అన్వరుద్దీన్‌ఖాన్‌ను నియమించాడు.

అసఫ్‌జా కర్ణాటకలోనే మకాం చేస్తున్న సమయంలోనే ఫ్రెంచి, ఇంగ్లీషు వర్తక సంఘాలు అతని అభిమానం పొందే ప్రయత్నం చేసాయి. నాటికే ఆంగ్లేయులు మద్రాసులోనూ, ఫ్రెంచివారు పుదుచ్చేరిలోనూ కోటలు కట్టి సైన్యాన్ని నిలిపి స్థానిక ప్రభువుల సహాయం సంపాదించి ఒకరిని మరొకరు దేశం నుండి వెడలగొట్టి స్వీయ ప్రాబల్యం నెలకొల్పాలని ఆశిస్తున్నారు. 1744 లో ఐరోపాలో ఆస్ట్రియా వారసత్వ యుద్ధము ఆరంభమై ఫ్రాన్సు, ఇంగ్లండు పోరాడుకో సాగినై. దక్షిణ దేశంలో కూడా ఫ్రెంచి, ఇంగ్లీషు కంపెనీలు యుద్ధానికి సన్నద్ధమవుతున్నాయి. ఉభయులు దక్కన్ సుబేదారుకు విలువయిన కానుకలతో రాయబారాలు పంపినారు. రఘూజీ బాన్‌స్లే దండయాత్ర కాలం నుండి అసఫ్‌జాకు ఫ్రెంచి వారి పట్ల అభిమానం పెరిగి మచిలీపట్టణం మున్నగు నగరాల్లో వారికి చాలా సౌకర్యాలు కలిగించాడు. ఆంగ్లేయులకు మద్రాసు పరిసర ప్రాంతాలలోని గ్రామాలని సయ్యద్ ఆలీ ఇవ్వడాన్ని ధృవపరిచాడు. గానీ వారికి నాణేలు ముద్రించే హక్కును నిరాకరించాడు. దోస్త్ ఆలీ కుటుంబంపట్ల ఫ్రెంచి వారు మైత్రి వహించినారనే కారణం వలన ఫ్రెంచివారి పట్ల అన్వరుద్దీన్ ముఖావంగా ఉండేవాడు నైజాం కుమారుడు నాజరుద్దీన్‌కు ఆంగ్లేయుల పట్ల అభిమానం. ఆస్ట్రియా వారసత్వ యుద్ధ కాలంలో ఇంగ్లీషు ఫ్రెంచి కంపెనీల మధ్య మొదటి కర్ణాటక యుద్ధం పేర జరిగిన సంఘర్షణలో కర్ణాటక నవాబు తల దూర్చక తప్పలేదు. దీనితో దక్షిణదేశ రాజకీయ పరిస్థితులు క్లిష్టరూపం ధరించినాయి. యుద్ధం 1748 లో ముగిసింది. తొంబది ఏండ్లపైబడిన అసఫ్‌జా అదే సంవత్సరంలో మరణించాడు.

ఆంధ్రదేశం సమస్తమూ కలిసిన హైదరాబాదు రాజ్య నిర్మాతగా అసఫ్‌జాకు ఆంధ్రుల చరిత్రలో ఉన్నత స్థానం ఉన్నది. అసఫ్‌జా సమర్థుడైన సేనాని, దూరదృష్టి ఉన్న రాజనీతి పరుడు. తగాదాలు మాని సామరస్యంతో, సమైక్యంగా వ్యవహరించడం అవసరమని లేనిచో ప్రమాదంతప్పదని తమ కుటుంబ సభ్యులకు అసఫ్‌జా చివరి సందేశం ఇచ్చాడు. అతని వారసులు ఆ సందేశాన్ని నిర్లక్ష్యం చేసారు. ఫలితంగా వారసత్వ యుద్ధం ప్రారంభమయి సమయంకోసం ఎదురు చూస్తున్న ఇంగ్లీషు, ఫ్రెంచి కంపెనీలవారు హైదరాబాదు రాజకీయాల్లో ప్రవేశించడంతో ఆ రాజ్య స్వతంత్ర వ్యక్తిత్వానికి ప్రమాదం ఏర్పడింది.

# పాశ్చాత్యుల ఆగమనం

అనాదిగా భారతదేశం సాగించిన విదేశీ వాణిజ్యంలో ఆంధ్రదేశం ముఖ్య భాగస్వామినిగా ఉండేది. "ది పెరిప్లస్ ఆఫ్ ది ఎర్రిత్రియన్ సీ" అనే గ్రీకు గ్రంథం నుండి టాలెమీ రచనలనుండి, ఘంటసాల, కోడూరు మొదలయిన రేవు పట్టణాలను గురించి వాటి ఎగుమతి దిగుమతులను గురించి వివరాలు లభిస్తున్నాయి ఆ వాణిజ్యానికి, తద్వారా ఆంధ్రదేశం ఆర్జించిన లాభాలకు నిదర్శనంగా ఆంధ్రదేశం నలుమూలలా రోమన్ చక్రవర్తుల నాణేలు లభించాయి. కాకతీయ రెడ్డి యుగాల్లో మోటుపల్లి విదేశ వాణిజ్యానికి కేంద్రం కాగా కుతుబ్ షాహీల కాలంలో మచిలీపట్టణం, నర్సపూర్ రేవులు విదేశీ వాణిజ్యం ద్వారా అంతర్జాతీయ ప్రఖ్యాతి నార్జించాయి. మధ్యయుగంలో తూర్పు పశ్చిమ దేశాల మధ్య వాణిజ్యం చాలా వరకు అరబ్బుల చేతుల్లో ఉండేది. ఐరోపా విపణి వీధుల్లో అరబ్బు వర్తకులు పెద్ద యెత్తున లాభాలు గడిస్తుండేవారు. నాటి వాణిజ్యం కొంత సముద్ర మార్గాల ద్వారా మరికొంత భూమార్గాల ద్వారా జరుగుతూ వుండేది. ఈ మార్గాలకు నల్ల సముద్ర ముఖ ద్వారంలో తూర్పు రోమన్ (బైజాన్ టయిన్) సామ్రాజ్య రాజధానియైన కాన్‌స్టాంట్ నోపిల్ నగరం కూడలి. ఐరోపా వర్తకులు అరబ్ మధ్యవర్తులను తొలగించి తూర్పు దేశాలకు సముద్ర మార్గం పరిశోధించాలని తీవ్ర ప్రయత్నాలు ప్రారంభించారు. ఇదే సమయంలో అటోమన్ తురుష్కులు 1452 లో కాన్‌స్టాంట్ నోపిల్ నగరాన్ని ఆక్రమించి తూర్పు పశ్చిమ దేశాలమధ్య వాణిజ్యానికి అటంకం కలిగించారు. ఇది జరిగిన అనతి కాలానికే ఐరోపా నావికుల ప్రయత్నాలు ఫలించి పోర్చుగీసు నావికుడైన వాస్కోడిగామా 1498 లో ఆఫ్రికా ఖండం చివరనున్న గుడ్‌హోప్ అగ్రాన్ని చుట్టి హిందూ మహాసముద్రంలోకి ప్రవేశించి గుజరాత్ వర్తకుల సాయంతో భారతదేశం పశ్చిమ తీరంలోని కళ్ళికోట రేవు చేరినాడు. ఐరోపాకు, ఇండియాకు మధ్య గుడ్‌హోప్ మార్గం ఏర్పడింది. ఇది ప్రపంచ చరిత్రలోనే ప్రముఖ సంఘటన. నాటి నుండి క్రమంగా ప్రపంచ వాణిజ్యం అరబ్బుల చేతినుండి ఐరోపా జాతీయుల పరమయింది. మధ్యధరా సముద్ర ప్రాంత రాజ్యాలు ప్రాధాన్యం కోల్పోయి అట్లాంటిక్ మహాసముద్ర తీర దేశాల ప్రాధాన్యం పెరిగి

నూతన ప్రపంచ (అమెరికా ఖండ) పరిశోధనకు దారితీసింది, రాజకీయంగా, సాంస్కృతికంగా ఐరోపా విస్తరించడానికి గుడ్‌హోప్ మార్గం తోడ్పడినందున ఆ మార్గ పరిశోధనతోనే ప్రపంచ చరిత్రలో ఆధునిక యుగారంభం జరిగిందని కొందరు చరిత్రకారుల అభిప్రాయం.

## పోర్చుగీసువారు

వాస్కోడిగామా 1498 మే నెలలో కళ్ళికోట చేరినాడు. పోర్చుగీసులు భారతదేశానికి వచ్చిన "సమయం సందర్భం" వారికి బాగా అనుకూలించినాయి. పశ్చిమ తీరంలోని కళ్ళికోట, కొచ్చిన్ మొదలయిన చిన్న చిన్న స్వతంత్ర రాజ్యాలు పరస్పరం అంతః కలహాల్లో మునిగి ఉండేవి. వాటి ఆదాయానికి విదేశీ వాణిజ్యమే ప్రధాన ఆధారం. వారి రాజ్యాల్లో అరబ్ వర్తకులు స్వేచ్ఛగా వాణిజ్యం సాగిస్తుండేవారు. క్విలన్ కన్ననూర్ మొదలయిన రాజ్యాలు విజయనగరానికి నామమాత్రమయిన సామంత రాజ్యాలు. విజయనగర రాజులు అంతః కలహాలలోనూ (సాళువవంశం సింహాసనం ఆక్రమించినకాలం) బహమనీ, గజపతి రాజ్యాలతోటి యుద్ధాల్లోనూ మునిగితేలుతూ పశ్చిమతీర ప్రాంతాలపై తగినంత శ్రద్ధ వహించేవారు కాదు. ఇంచుమించు ఇదే సమయానికి బహమనీ రాజ్యం ఐదు స్వతంత్ర్య రాజ్యాలుగా విచ్ఛిన్నమై అవి పరస్పరం కలహించుకుంటూ ఉండేవి. బీజాపూర్ విజయనగర రాజ్యాల మధ్య తరచు పోరాటం సాగుతుండేవి. వీరుభయులు తాము భారతీయులమనీ, పోర్చుగీసులు విదేశీయులనీ తామిద్దరికి సమానంగా శత్రువులనీ గ్రహించి తదనుగుణమయిన విధానాలను అనుసరించక పోవడం శోచనీయం. ఇట్టి స్థానిక రాజకీయ వాతావరణం పోర్చుగీసుల ఆశలకు ముంది ప్రోత్సాహాన్నిచ్చింది.

తూర్పు దేశాలతోటి వాణిజ్య రంగంలో పోర్చుగీసుల ప్రవేశం అరబ్బులకు మలబార్ తీరంలో వారి మిత్రులయిన మాప్లాలకు కన్నెర్ర చేసింది. కాని మొదట్లో వారి ఆగ్రహావేశాలనుండి పోర్చుగీసులకు జామొరిన్ రక్షణ ఇచ్చినాడు. క్రమంగా పోర్చుగీసులు వాణిజ్య లాభాలతో తృప్తి పడక స్థానిక రాజకీయాలకు జోక్యం కలిగించుకొని తమ ప్రాబల్యం నెలకొల్పడానికి, కాథలిక్ మత ప్రచారానికి పూనుకున్నారు. అచిర కాలంలోనే జామొరిన్‌తో కలహించి పోర్చుగీసులుకొచ్చిన్ రాజా స్నేహం చేశారు. 1502 లో వాస్కోడిగామా రెండోమారు భారతదేశం వచ్చి భాట్కల్ రాజాను వత్తిడి చేసి వాణిజ్య సౌకర్యాలు సంపాదించినాడు. 1505 లో పోర్చుగీసు గవర్నర్ అల్మీడా వత్తిడికి తట్టుకోలేక హానోవర్ రాజా పోర్చుగీసు వారి ఆధిపత్యాన్ని అంగీకరించాడు. భాట్కల్,

హానోవర్ రాజ్యాలు విజయనగర సామంత రాజ్యాలు. నాడు విజయనగరాన్ని, ఇమ్మడి నరసింహరాయలు పాలిస్తున్నాడు. అతనికి తుళువ నరసనాయకుడు సంరక్షకుడు. వీరు భాట్కల్, హానోవర్ రాజ్యాలలో జరుగుతున్న దౌష్ట్యాలను ఆపడానికి ప్రయత్నించకపోవడం ఆశ్చర్యకరం.

పోర్చుగీసు గవర్నర్లందరిలో అగ్రగణ్యుడు అల్ఫోంజో అల్బూకర్క్. గోవా కేంద్రంగా ఆసియాలో పోర్చుగీస్ సామ్రాజ్యం నిర్మించాలని అతని ఆశయం. తన ఆశయ సిద్ధికి నాడు దక్షిణ భారతంలో ప్రబలంగా ఉన్న విజయనగర రాజ్య సహాయం అవసరమని గుర్తించి శ్రీకృష్ణదేవరాయలితో (క్రీ॥ శ॥ 1509-10) సంధి సంప్రదింపులు జరిపాడు. ఈ రాయబారం నడిపిన పోర్చుగీస్ ఉద్యోగి ఫ్రెయర్ లూయీ. పోర్చుగీస్ - రాయల మధ్య జరిగిన సంధి సంప్రదింపులను గూర్చి చాల అభిప్రాయ భేదాలున్నాయి. విజయనగరం లోనే ఫ్రెయర్‌ను తురుష్కుడు హత్య చేశాడు. ఈ తురుష్కుడు ఆదిల్‌షా ప్రేరణతో హత్య చేశాడా లేక రాయలే తురుష్కునిచే హత్య చేయించాడా అనే అనుమానాలున్నాయి. ఏమైనా అల్బూకర్క్ 1510లో గోవాను ఆక్రమించ డంతో కృష్ణరాయలు ప్రత్యక్షంగా పోర్చుగీసులకు సహాయం చేయలేదు. కాని ఈ సందర్భంలో రాయల చర్యలు వారికి పరోక్షంగా సాయపడినాయి. పశ్చిమ తీరంలో విజయనగర నౌకా దళాధిపతియైన తిమ్మోజా ప్రోత్సాహం పోర్చుగీసు వారికి లభించినట్లు అల్బూకర్క్ గోవాపై దండెత్తిన సమయంలోనే రాయలు బిజాపూర్ రాజ్యంపై దండెత్తినట్లు తెలుస్తుంది. ఈ చర్యలోనే గోవా పోర్చు గీసుల వశమై ప్రాచ్యసీమల్లో వారి సామ్రాజ్య కార్యకలాపాలకు కేంద్రమయింది.

శ్రీకృష్ణరాయల అనంతరం అచిర కాలానికే ఉత్తర తీరాంధ్రం గోల్కొండ సుల్తానుల వశమయింది. రాకాసిగండి యుద్ధానంతరం మద్రాస్ వరకు తీరాన్ని గోల్కొండ ఆక్రమించింది. తూర్పు తీరంలో నర్సీపట్టణం, మచిలీపట్టణం, శాన్‌థోమ్ లలో పోర్చుగీస్‌లు వర్తక స్థావరాలు నెలకొల్పు కున్నారు. మచిలీపట్టణంలో స్థానిక క్రైస్తవుల ఉపయోగార్థం చర్చిని నిర్మించి ప్రార్థనలూ, ప్రచారమూ సాగించారు. రేవు పట్టణంగా మద్రాసు ప్రాముఖ్యాన్ని గుర్తించింది పోర్చుగీసువారే. అయితే గోల్కొండ రాజ్యంలో ప్రధాన రేవు పట్టణం మచిలీపట్టణం. ఫ్రెంచి కంపెనీ ఉద్యోగి మార్టిన్ మాటల్లో "భారత దేశంలో మరే పట్టణంలోను లేనంతటి స్వేచ్ఛను విదేశీయులు మచిలీపట్టణంలో అనుభవించేవారు. అందుకు విదేశ వాణిజ్యంలో గోల్కొండ సుల్తానులు ప్రదర్శించిన శ్రద్ధాసక్తులే కారణం. విదేశ వర్తకుల శ్రేయోరక్షణ పట్ల సుల్తానులు

అప్రమత్తులై ఉండేవారు. గోల్కొండ తీరంలో 1623 లో పోర్చుగీస్ నౌకకు డచ్చివారు నష్టం కలిగించగా గోల్కొండ ఉద్యోగులు డచ్చివారిని కఠినంగా శిక్షించినట్లు తెలుస్తుంది.

ప్రాచ్య పాశ్చాత్య ఖండాలమధ్య వాణిజ్యంలో అరబ్బుల గుత్తాధిపత్యాన్ని నిర్మూలించి వారిని హిందూ మహాసముద్రంనుండి తరిమివేసినారు పోర్చుగీసులు. వారి ఆగమనంతో ఆసియా ఐరోపాల మధ్య వాణిజ్యం అనూహ్యంగా అభివృద్ధి చెందింది. కాని ఈ వాణిజ్యంపై పోర్చుగీసులు గుత్తాధిపతులయినారు. పోర్చుగీస్ స్థావరాల్లోని దేశీయ వర్తకులు సయితం వాణిజ్యం సాగించడానికి పోర్చుగీసు అధికారులనుండి అనుమతి పత్రాలు పొందవలసిన దుస్థితి యేర్పడింది. తమ పెట్టుబడులపై పోర్చుగీసులు 800 శాతం వరకు లాభాలు గడిస్తుండగా స్థానిక వర్తకులు దివాలా తీయసాగినారు. కాని 17 వ శతాబ్ది మధ్య కాలానికి ఇండియాలో వారు అనుసరించిన విధానాల ఫలితంగానూ, ఐరోపాలో జరిగిన రాజకీయ పరిణామాల వల్లనూ ఇండియాలో పోర్చుగీసుల ప్రాబల్యం క్రమంగా క్షీణించసాగింది. తమ వాణిజ్య స్థావరాలను కేంద్రాలుగా చేసుకొని పోర్చుగీస్‌లు బలప్రయోగంతో కాథలిక్ మత ప్రచారానికి పూనుకోనడమేకాక పోర్చుగీస్ పాదరీలు స్థానిక మతసంస్థలకు నష్టం కలిగించడానికి ప్రయత్నించారు. దక్షిణదేశంలో శ్రీరంగం దేవాలయాన్ని తిరుమల వేంకటేశ్వరాలయాన్ని దోచుకునే ప్రయత్నం చేసారు. రామేశ్వరం మొదలయిన పుణ్యక్షేత్రాలను దర్శించే యాత్రికులను హింసించేవారు. అరేబియా సముద్రంపై పయనించే 'హజ్' యాత్రికులపై అత్యాచారాలు జరిపేవారు. వారి పడవలు ముంచి చెప్పలేనంతటి 'భీతావహం' సృష్టించారు. స్థానిక పోర్చుగీసు జనాభాను పెంచే వుద్దేశ్యంతో అల్బూకర్క్ ప్రోత్సహించిన 'సంకర వివాహ' విధానం ఫలితంగా భారతీయ స్త్రీలను అపహరించి బలవంతంగా పోర్చుగీసులతో వివాహాలు జరిపేవారు. ఈ విధానాల వలన దేశీయ ప్రభువులు, ప్రజలు పోర్చుగీసులను గర్హించసాగినారు. దీని ఫలితంగా పోర్చుగీసుల ప్రాబల్యానికి తోడ్పడిన విజయనగరాధీశులు వారి సామంతులు వారిపై యుద్ధాలు చేయవలసి వచ్చింది. అళియరామరాయలు, తంజావూరు నాయకుడు, రఘునాథరాయ పోర్చుగీసులపై యుద్ధాలు చేశారు. షాజహాన్ రాణి ముంతాజ్ బేగం చెలికత్తెలను అపహరించిన కారణంగా పాదుషా బెంగాల్ బీహారులలోని పోర్చుగల్ స్థావరాలపై దండెత్తి వేలకొలది పోర్చుగీసులను హతమార్చి అపారనష్టం కలిగించాడు. తెలుగువారు పోర్చుగీసులకు ఉపయోగించిన 'బుడత కీచు' పదంలో పోర్చుగీసుల పట్ల తెలుగువారి ద్వేషం ప్రతిఫలిస్తుంది. దీనికి తోడు

ఐరోపాలో కొత్తగా రాజకీయ స్వాతంత్ర్యం సాధించిన ఉత్సాహంలో డచ్చివారు (హాలెండు దేశస్థులు-హూందులు) తూర్పు దేశంలో వర్తకం ప్రారంభించారు. డచ్చివారు నౌకాయానంలో మంచి సమర్థులు. వారితో పోటీకి పోర్చుగీసు వారు నిలువలేకపోయినారు. క్రమంగా తూర్పు దేశాలలోని వారి స్థావరాలు డచ్చి, ఇంగ్లీషు కంపెనీల వశమయ్యాయి.

## డచ్చివారు

ప్రాచ్యదేశాల్లో పోర్చుగీసు ప్రాబల్యాన్ని ధిక్కరించి దెబ్బతీసిన డచ్చివారు 1595 నుండి ఆసియా రాజ్యాలకు వాణిజ్య యాత్రలు సాగించారు. డచ్చి తూర్పు ఇండియా వర్తక సంఘం 1602 లో ఏర్పడింది. నాడు మొదలు డచ్చివారికి పోర్చుగీసులకు తూర్పు సముద్రాల్లో తీవ్ర సంఘర్షణ జరిగింది. మొదట్లో డచ్చివారు ఆంగ్లేయులు కలిసి పోర్చుగీసులతో తలపడినారు. క్రమంగా వారి ఉభయుల మధ్య స్పర్ధ ఏర్పడి కలహించుకోసాగినారు. 1603 లోనే డచ్చి నౌకాదళం పోర్చుగీసువారి కేంద్రమయిన గోవాను ముట్టడించి నష్టం కలిగించింది. 1606 లో శాన్‌థోమ్ తీరంలో మూడు పోర్చుగీసు నౌకలను డచ్చివారు ముంచివేశారు.

మలాకాపెగు వంటి ఆగ్నేయాసియా రాజ్యాల్లోనూ తూర్పు ఇండియా దీవుల్లోనూ భారతీయ నూలు వస్త్రాలకు మంచి గిరాకీ వుండడం గమనించి ఆ వస్త్రాల వాణిజ్యం లాభసాటి అని గ్రహించి డచ్చివారు తూర్పు తీరం పైనా, తూర్పు ఇండియా దీవులతోటి వాణిజ్యం పైనా తమ దృష్టిని కేంద్రీకరించారు. గోల్కొండ కోరమండల్ తీరాల్లో శ్రీకాకుళం నుండి నాగపట్టణం వరకు అనేక ప్రదేశాల్లో సన్నసూలు బట్టలు, కలంకారీ వస్త్రాలు తయారవుతుండేవి. మచిలీపట్టణానికి 4 మైళ్ళ ఎగువన మదపొల్లం అనే రేవులో నౌకా నిర్మాణం జరుగుతుండేది. తూర్పుతీరంలో పోర్చుగీసు గుత్తాధిపత్యం విస్తరించకపోవడం కూడా డచ్చివారి కార్యకలాపాలకు అనుకూలమయింది. క్రమంగా గోల్కొండ ఆస్థాన ఉద్యోగులకు, రేవు పట్టణాలలో అధికారులైన షౌబందర్లకు నజరానాలూ లంచాలు ఇచ్చి వర్తక సౌకర్యాలను సంపాదించసాగినారు. 1606 లో మచిలీపట్టణం నిజాం పట్టణాల్లో వర్తక స్థావరాలు నెలకొల్పుకోవడానికి అనుమతి పొందినారు. గోల్కొండ రాజ్యంలో మచిలీపట్టణం గొప్ప పారిశ్రామిక కేంద్రమేగాక అంతర్జాతీయ ఖ్యాతి చెందిన రేవు పట్టణం, 14వ శతాబ్దం నుండి అరబ్బు వర్తకులు మచిలీపట్టణంతో వాణిజ్యం సాగించినట్లు తెలుస్తుంది. నిజాం పట్టణ ప్రాముఖ్యాన్ని డచ్చి వర్తకుడు పీటర్ ఫ్లోరిన్ గుర్తించాడు. నిజాం పట్టణానికి

1679 వరకు పేరు "పెదపల్లి"; అసఫ్ జాహీల కాలంలో నిజాం పట్టణం అయి వుంటుంది. పాశ్చాత్యుల వ్రాతల్లో 'పెంటపోలి' అని కనిపిస్తుంది. పారశీక వర్తకులు ఎక్కువమంది వుండేవారు. వీరు పింగాణీ సామాన్లతో వాణిజ్యం సాగించేవారు. పరిసర గ్రామాలలో నూలు వస్త్రాలు, మురుమాళ్ళు విరివిగా నేసే వారనీ దేశం వివిధ ప్రాంతాల నుండి ఇనుము, ఉక్కు, పెట్లుప్పు విదేశాలకు ఎగుమతికై నిజాం పట్టణానికి చేరుతుంటాయని ఫ్లోరిన్ గమనించాడు. పులికాట్‌లో రక్షణ శ్రేణులతో వర్తక స్థావరం నిర్మించుకోవడానికి 1610 లో డచ్చి వారికి అనుమతి లభించింది. పులికాట్ సమీపంలోని మున్నేరు పైనున్న కరేడు రేవు వస్త్ర పరిశ్రమకు పెద్ద కేంద్రం కరేడు వస్త్రాలు పులికాట్ రేవు ద్వారా తూర్పు ఇండియా దీవులకు డచ్చివారు ఎగుమతి చేసేవారు. పులికాట్‌లో కూడా వస్త్ర పరిశ్రమ విరివిగా సాగేది. దానితోపాటు డచ్చివారు తుపాకీ మందు పరిశ్రమ నెలకొల్పినారు. అందుకు అవసరమయిన పెట్లుప్పును బెంగాల్ నుండి దిగుమతి చేసుకునేవారు.

పులికాట్‌లో డచ్చివారికి పోర్చుగీసులకు మధ్య తీవ్ర సంఘర్షణ జరిగింది. పోర్చుగీసువారు 1612 లో దండెత్తి డచ్చివారిని ఓడించి పులికాట్‌ను ఆక్రమించారు. కాని పోర్చుగీసు విజయం తాత్కాలికమే అయింది. డచ్చివారి అభ్యర్థనపై కర్ణాటక రాజ్యాధీశుడైన ఇమ్మడి వెంకటపతిరాయలు కల్పించుకొని పోర్చుగీసులనుండి పులికాట్ ఆక్రమించి డచ్చివారి పరం చేశాడు. ఇమ్మడి వెంకటపతిరాయలి మరణానంతరం 1642 నాటికి మద్రాస్ వరకు తూర్పు తీరం గోల్కొండ సుల్తానుల వశమయింది. 1642 లోనే పోర్చుగీసుల నుండి నాగ పట్టణాన్ని డచ్చివారు ఆక్రమించారు కర్ణాటక గవర్నరయిన నెక్నంఖాన్ 1661 లో శాన్‌థోమ్‌ను ఆక్రమించి అక్కడ డచ్చివారు కోట కట్టుకోవడానికి అనుమతించినాడు.

గోల్కొండ కుతుబ్‌షాహీ ఆస్థానంలో డచ్చివారికి మంచి పలుకుబడి ఏర్పడింది. డచ్చి కంపెనీ ప్రతినిధి ఆస్థానంలో వుండేవాడు తమ ప్రతినిధి ద్వారా డచ్చి కంపెనీ 1610-23 సం॥ మధ్య కొల్లూరు వజ్రాల గనులను సాలుకు మూడు లక్షల హొన్నులకు కౌలుకు తీసికొంది. ఈ కౌలువల్ల కంపెనీకి అపారంగా లాభాలు వచ్చినాయి. మొదట్లో డచ్చి కంపెనీ గోల్కొండరాజ్యం రేవు పట్టణాల్లో 4½ శాతం ఎగుమతి సుంకం 11 శాతం సముద్ర సుంకం చెల్లించేవారు. 1613 లో జరిగిన ఒప్పందం ప్రకారం పై సుంకాలకు బదులు సాలుకు 3000 హొన్నులు చెల్లించి గోల్కొండ రాజ్యంలో స్వేచ్ఛగా వర్తకం

చేసుకొనే హక్కు సంపాదించారు. హుగ్లి, సూరత్, పులికాట్, మచిలీపట్నం, బాలాసోర్ మొదలైన చోట్ల ఉన్న వారి కేంద్రాలను ఇంకా బలపరచుకోగలిగారు. మచిలీపట్నంలో కూడా దచ్చివారు రక్షణ శ్రేణులతో వర్తక స్థావరాలు కర్మాగారాలు నిర్మించుకున్నారు. 1665 ప్రాంతంలో గోల్కొండలో కూడా దచ్చి కర్మాగారం వెలసింది.

దచ్చి కంపెనీ ఇండియాలో అనుసరించిన ఆర్థిక విధానాలవలన వారి లాభాలు దినదినాభివృద్ధి చెందాయి. 1636 లో దచ్చి కంపెనీకి వచ్చిన లాభం 30 వేల పౌండ్లు. 1684 నాటికి వారి లాభం 12 లక్షల 70 వేలకు పెరిగింది. పెరిగినట్లే దచ్చి ప్రాబల్యం పెరిగింది. 1630 నాటినుండి దచ్చివారికి కష్టాలు ప్రారంభమయినాయని చెప్పవచ్చు. ఆ సంవత్సరం దక్షిణదేశంలో పెద్ద క్షామం సంభవించి నాలీలు, అద్దకం పనివారు అధిక సంఖ్యలో మరణించడమే కాక మిగిలినవారు గ్రామాంతరాలకు తరలిపోవడం వలన దచ్చి పరిశ్రమలకు చాలా నష్టం సంభవించింది. దచ్చివారి దృష్టి కేవలం తూర్పు ఇండియా దీవుల వాణిజ్యంపైనా, వస్త్ర వాణిజ్యం పైనా కేంద్రీకరించినందువల్ల వారి వాణిజ్యం విస్తృతం కావడానికి అవకాశం లేకపోయింది. ఒక చరిత్రకారుడన్నట్లు ప్రపంచ సామ్రాజ్యాధికారం నుండి దచ్చివారిని తూర్పు ఇండియా దీవులు దారి మళ్ళించినాయి. దచ్చివారి పరిస్థితి గమనించిన గోల్కొండ ఉద్యోగులు వాణిజ్యరంగంలో ప్రవేశించి స్థానిక ఉత్పత్తిదారులనుండి సరుకు ఖరీదు చేసి విదేశాలకు ఎగుమతి చేయసాగినారు. వీరి పోటీని తట్టుకొని దచ్చి కంపెనీ కొంతవరకు నిలబడింది కాని గోల్కొండలో జరిగిన రాజకీయ పరిణామాలు దచ్చివారికి ప్రతికూలంగా పరిణమించాయి.

సుల్తాన్ అబ్దుల్లా కుతుబ్‌షా కాలం (1626-72) నుండి గోల్కొండలో మొగలాయీల బెడద ఎక్కువయింది. మొగలాయీలతోటి యుద్ధాల వలన వారికి చెల్లించాల్సిన నజరానాలు పెరగడం వలన గోల్కొండ రాజ్యం ఆర్థికంగా నీరసించింది. చివరకు కుతుబ్‌షా కాలంలో గోల్కొండ ప్రభుత్వం దచ్చి కంపెనీ నుండి ఖరీదు చేసిన రాగి లోహానికి చెల్లించవలసిన లక్ష ఇరవై వేల హొన్నులు చెల్లించలేకపోయింది.

ఈ పరిస్థితులలో దచ్చివారికి ఆంగ్లేయుల పోటీ మితిమీరింది. క్రమంగా భారత వాణిజ్యరంగంనుండి దచ్చివారు విరమించక తప్పలేదు.

పోర్చుగీసుల రాకతో భారతీయ వాణిజ్యం చాలావరకు పాశ్చాత్యుల హస్తగతం కాగా దచ్చివారి రాకతో భారతీయ పరిశ్రమలు సయితం విదేశీయుల వశం కాసాగి దేశ ఆర్థిక జీవితంలో అనారోగ్యకరమయిన పరిణామాలకు దారి తీసింది. దచ్చివారు తమ ప్రాబల్యం వున్న రేవు పట్టణాల చుట్టుపట్ల ప్రత్తి,

పొగాకు, నీలిమందు వంటి వాణిజ్య పంటల్ని ప్రోత్సహించారు. వర్తకులకు హస్తకళాకారులకు మదుపు పెట్టి సరుకును గుత్తుగా తమకే విక్రయించే ఏర్పాట్లు చేసుకొన్నారు. పులికాట్‌లో అద్దకం పనివారు మచిలీపట్టణంలో సాలెవారు నేరుగా డచ్చి వర్తకులకే తమ సరుకును అమ్మేవారు. కొద్దిరోజులలోనే ఈ పరిస్థితిలో మార్పువచ్చింది. డచ్చివారు తమ స్థావరాల్లో కర్మాగారాలు నెలకొల్పి స్థానిక కార్మికులతో వస్తూత్పత్తి చేయించే విధానం ప్రారంభించారు. తమ కర్మాగారాలు నడవడానికి దేశీయ ధనిక వర్తకులనుండి ప్రభుత్వోద్యోగుల నుండి పెట్టుబడిని అప్పుగా తీసుకొనేవారు. మచిలీపట్టణం హవాల్‌దారయిన సిద్దప్ప డచ్చివారికి 20 వేల హొన్నులు అప్పు ఇచ్చినాడు. పెట్టుబడి దేశీయం, ముడిసరుకు దేశీయం, కార్మికులు దేశీయులు కాని పరిశ్రమల అధిపత్యం మాత్రం విదేశీయులైన డచ్చివారిది. నాడు నేతకు స్వతంత్రంగా వస్తూత్పత్తి చేస్తుండిన కర్మకారులు వాణిజ్యం సాగిస్తున్న వర్తకులు, డచ్చి కంపెనీకి కూలీలుగా, వర్తకులు డచ్చి కంపెనీకి రైతులకు మధ్య దళారులుగా వడ్డీ వ్యాపారులుగా మారినారు తమ ధనంతో స్వతంత్రంగా పరిశ్రమలు నెలకొల్పి నిర్వహించవలెననే ఆలోచన వీరికి రాకపోవడం చాలా శోచనీయం

## 17 వ శతాబ్దంలో భారతదేశ పరిస్థితి

## ఫ్రెంచివారు

మొగల్ సామ్రాజ్యం ఉచ్చ దశలో ఉన్న కాలంలోనే ఫ్రెంచి వర్తకులు భారతదేశం రాసాగినారు. మొగల్ దర్బారు వైభవం గోల్కొండ ఐశ్వర్యం కన్నులార జూచి ముగ్ధులవుతూ వుండేవారు. వారిలో నగల వర్తకులైన బెర్నియర్, టవర్నియర్ రచనలు నాటి భారతీయ అర్థిక సాంఘిక స్థితిగతులు తెలుసుకోవడానికి చాలా ఉపకరిస్తున్నాయి. అయితే పెద్ద ఎత్తున భారతదేశంలో వాణిజ్యం చేయడానికి చొరవ చూపలేదు. చివరకు ప్రభుత్వ ప్రోత్సాహంతో, ధన సహాయంతో 1664 లో ఫ్రెంచి తూర్పు ఇండియా వర్తక సంఘం ఏర్పడినది.

ఫ్రెంచివారు 1670 ప్రాంతంలో గోల్కొండ తీరం చేరినారు. నాటికే డచ్చివారు, ఇంగ్లీషువారు గోల్కొండ రాజాస్థానంలో పలుకుబడి సంపాదించి వర్తక సౌకర్యాలు కలిగివున్నారు. ఫ్రెంచివారు కూడా గోల్కొండ రాజ్యంలో స్వేచ్ఛగా వాణిజ్యం సాగించడానికి, మచిలీపట్టణంలో కర్మాగారం నిర్మించు కోవడానికి కుతుబ్‌షాహీలనుండి 1671 లో ఫర్మానా సంపాదించారు. మచిలీ పట్టణంలో ఫ్రెంచి వర్తక స్థావరం ఏర్పడింది కాని వారి స్థావరానికి డచ్చివారి

వలన ప్రమాదం కలగడంతో 1672 లోనే ఫ్రెంచివారు మచిలీపట్టణం నుండి ఉపసంహరించుకోవలసి వచ్చింది. డచ్చివారికి వున్న పలుకుబడివలన గోల్కొండ ఉద్యోగులు ఫ్రెంచివారిని అభిమానించలేదు. శాన్‌థోమ్‌లో నెల కొల్పుకున్న తమ స్థావరాన్ని బలపర్చుకోవాలని ఫ్రెంచివారు విశ్వప్రయత్నం చేశారు. 1672 ప్రాంతంలోనే శాన్‌థోమ్‌ను గురించి ఫ్రెంచివారికి గోల్కొండ సైన్యాలకు సంఘర్షణ జరిగింది. శాన్‌థోమ్ ఫ్రెంచివారి వశమయింది. గోల్కొండకు తగినంత నౌకాబలం లేకపోవడమే ఫ్రెంచివారి విజయానికి కారణమని చెప్పవచ్చు. కాని 1674 లో గోల్కొండ సేనాని నెక్నంఖాన్ డచ్చి వారి సహాయంతో శాన్‌థోమ్‌ను ఆక్రమించి డచ్చివారి వశం చేశాడు. అయినా ఫ్రెంచివారు శాన్‌థోమ్‌లో గోల్కొండ సైన్యాలపై సాధించిన విజయానికి సంతసించి బిజాపూర్ కర్ణాటంలో రాజప్రతినిధి అయిన షేర్‌ఖాన్‌లోడీ ఫ్రెంచి వారిని తన రాజ్యంలో స్థావరాలు నెలకొల్పుకోవడానికి ఆహ్వానించాడు. అతని అనుమతితోనే ఫ్రెంచి కంపెనీ ఉద్యోగి మార్టిన్ పుదుచ్చేరిలో కోటను నిర్మించాడు. స్థానిక ప్రభువుల మధ్య రగులుతున్న అసూయా ద్వేషాలు పాశ్చాత్యుల కేవిధంగా ఉపకరించబడింది ఈ సంఘటన వలన స్పష్టమవుతుంది. భారత దేశంలో ఫ్రెంచివారికి ప్రధాన స్థావరంగా పుదుచ్చేరి రూపొందింది.

గోల్కొండను మొగలాయీలు ఆక్రమించిన తరువాత హైదరాబాదు సుబాలో కర్ణాటక సుబా ప్రముఖ స్థానం ఆక్రమించింది. మద్రాస్ ప్రాంతాలు కర్ణాటక నవాబీలో ఉండేవి. కర్ణాటకానికి ఆర్కాటు రాజధాని అయినందున కర్ణాటక నవాబును ఆర్కాటు నబాబని వ్యవహరించేవారు. పుదుచ్చేరిలోని ఫ్రెంచివారు ఆర్కాటు నాబాబుతో స్నేహసంబంధాలు ఏర్పరుచుకొని అతని అభిమానం సంపాదించారు. 1724 నుండి అసఫ్‌జా నైజాం ఉల్ ముల్క్ హైదరాబాదునుండి దక్కన్ సుబాను స్వతంత్రంగా పాలించసాగినట్లు పరిశీ లించినాము. అసఫ్‌జాకు ఫ్రెంచివారి పట్ల అభిమానం ఉండేది. మచిలీపట్టణం సమీపంలో వారు గ్రామం నిర్మించి అందులో కర్మాగారం నెలకొల్పుకోవడానికి ఫ్రెంచివారు పుదుచ్చేరిలో ముద్రిస్తున్న రూపాయలు చికాకోల్, యానాం, మచిలీ పట్టణాలలో సయితం ద్రవ్యంగా అంగీకరించాలని ఫర్మానాలు జారీచేశాడు.

## ఇంగ్లీషు తూర్పు ఇండియా కంపెనీ

ఇంగ్లీషు తూర్పు ఇండియా వర్తక సంఘం 1600 సం॥ చివరి రోజున ప్రాచ్య దేశాలతో వాణిజ్యం సాగించడానికై ఎలిజబెత్ రాణి నుండి అనుమతి

వర్తాన్ని సంపాదించింది. వీరు కూడా మొదట్లో తూర్పు ఇండియా దీవులతో వర్తకం ప్రారంభించి క్రమంగా భారతదేశంపై తమ దృష్టిని కేంద్రీకరించినారు. ప్రాచ్య వాణిజ్య రంగంలో ఆంగ్లేయుల ప్రవేశాన్ని పోర్చుగీసులు ప్రతిఘటించడంతో ఉభయులకు తీవ్ర సంఘర్షణ తప్పలేదు. 1602 లోనే అమూల్యమయిన సరుకుతో పోర్చుగీసు నౌకను ఆంగ్లేయులు పట్టుకున్నారు. అయినప్పటికి మొగల్ దర్బారులో పోర్చుగీసుల ప్రాబల్యం ఎక్కువగా ఉండేది. 1608 లో ఆంగ్ల నౌకాదళాధిపతి హాకిన్స్ మొగల్ దర్బారును దర్శించాడు. కాని పోర్చుగీసువారి కౌక్యం వలన సూరత్‌లో ఆంగ్లేయులకు వాణిజ్య సౌకర్యాలు సంపాదించలేక పోయినాడు. 1610 లో మిడిల్‌టన్ అనే మరో ఆంగ్ల నావికుడు పోర్చుగీసు ప్రతిఘటనను లెక్కచేయక సూరత్ సమీపంలోని స్వాలీ దగ్గర తీరంచేరి వర్తక స్థావరం నెలకొల్పుకోవడానికి హక్కు సాధించాడు. ఇంగ్లీషు పోర్చుగీసుల మధ్య సంఘర్షణ నౌకాయుద్ధంగా పరిణమించింది. 1612 లో బెస్ట్ అనే ఆంగ్ల నావికుడు సూరత్ సమీపంలో పోర్చుగీస్ నౌకాదళాన్ని పూర్తిగా ఓడించాడు. అరేబియా సముద్రంపై పోర్చుగీస్ ఆధిపత్యానికి ఈ పరాజయం పెద్ద అఘాత మయింది. ఆంగ్లేయులు సూరత్‌లో వర్తక స్థావరం నిర్మించుకోగలిగారు.

గ్లోబ్ అనే ఆంగ్లనౌక ప్రథమంగా తూర్పుతీరంలో మచిలీపట్టణం రేవును 1611 లో చేరింది. హిప్పన్ ఈ నౌకాదళాధిపతి. స్థానిక ప్రభుత్వోద్యోగుల అభిమానం పొంది మచిలీపట్టణంలో ఆంగ్లేయులు వర్తక స్థావరం నెలకొల్పుకున్నారు. కానీ తూర్పుతీరంలో ఆంగ్లేయులకు తీవ్రమయిన డచ్చి ప్రతిఘటనను ఎదుర్కోవలసి వచ్చింది. 1614 లో మచిలీపట్టణంలో ఆంగ్లేయులకు డచ్చివారికి సంఘర్షణ జరిగి ఆంగ్లేయులు అపారనష్టానికి గురి అయినారు ఈలోగా పులికాట్‌లో వర్తక స్థావరం నెలకొల్పుకోవడానికి ఆంగ్లేయులు చేసిన ప్రయత్నాలను సయితం డచ్చివారు విఫలం చేశారు. డచ్చి - ఆంగ్ల సంఘర్షణ 1623 లో తారాస్థాయికి చేరి 'అంబాయినా హత్య'గా పరిణమించింది. తూర్పు ఇండియా దీవుల్లోని అంబాయినా చెంత ఆంగ్ల వర్తకులను డచ్చివారు హత్య చేశారు. తూర్పు దేశాల్లో ఉభయ జాతుల చరిత్రలో పెద్ద మలుపుకు ఈ సంఘటన కారణమయింది. ఆంగ్లేయులు తూర్పు ఇండియా దీవులపై ఆశ వదులుకొని ఇండియాపై దృష్టి కేంద్రీకరించి పెద్ద సామ్రాజ్యం స్థాపించారు. డచ్చివారు ఆ అవకాశం కోల్పోయినారు.

మచిలీపట్టణంలో కూడ డచ్చి-ఇంగ్లీషు సంఘర్షణ సాగుతూనే ఉంది. ఈ సంఘర్షణలో 1624 లో ఇంగ్లీషు వారిని 24 లక్షల పౌండ్లవరకు నష్టము

సంభవించింది. ఇది భరించలేక ఆంగ్లేయులు మచిలీపట్టణాన్ని విడిచిపెట్టి 1626 లో పులికాట్‌కు 40 మైళ్ళు ఉత్తరంగా ఆర్మగాన్‌లో వర్తక స్థావరం నెలకొల్పుకున్నారు. ఈ ప్రాంతం వెంకటగిరి జమీందారీలో ఉండేది. కరణమైన ఆర్మగం మొదలి దగ్గర ఆ ప్రాంతాన్ని కొనడంచేత "ఆర్మగం"గా ప్రసిద్ధి చెందింది. ఇక్కడ హార్బర్‌ను బ్లాక్‌వుడ్ నిర్మించినందున బ్లాక్‌వుడ్ హార్బరు అనికూడా పిలిచేవారు.

ఈ హార్బరులో నౌకలకు రక్షణ ఉండేది కాని వాణిజ్యానికి అనుకూలంగా లేదు. తూర్పు ఇండియా దీవులతో వాణిజ్యానికి మచిలీపట్టణం మంచి అనుకూలమయింది. అందుచేత ఆంగ్లేయులు స్థానిక ఉద్యోగుల అభిమానంతో మచిలీపట్టణం వాణిజ్య కేంద్రం సాధించారు. వీరవాసరం, నిజాం పట్టణం, మోటుపల్లిలో కూడా వారి కేంద్రాలు ఏర్పడినాయి. వారి వాణిజ్యం కూడా మెరుగు పడసాగింది.

కోస్తా ఆంధ్ర ప్రాంతంలో 1630 లో వచ్చిన క్షామం వలన పాశ్చాత్య వర్తక సంఘాలకు విపరీత నష్టం సంభవించింది. ఆంగ్లేయుల మచిలీపట్టణం, ఆర్మగం స్థావరాలు బాగా దెబ్బ తిన్నాయి. దీనికి తోడు గోల్కొండ ఉద్యోగుల అండదండలు సంపాదించిన స్థానిక వర్తకుల పోటీ ఎక్కువయింది. ఈ పరిస్థితులలోనే థామస్ జాయిస్ అనే కంపెనీ ఉద్యోగి కుతుబ్‌షాహిని దర్శించి 1636 లో ఒక ఫర్మానా సంపాదించాడు. దీని ప్రకారం సాలుకు 12 వేల హొన్నులు సుల్తానుకు చెల్లించి స్వేచ్ఛగా వర్తకం చేసుకునే హక్కు ఆంగ్లేయులకు లభించింది. దీనినే 'బంగారు ఫర్మానా' అని వర్ణించారు. ఈ ఫర్మానా ఫలితంగా మచిలీపట్టణంలో ఆంగ్లేయుల వాణిజ్యం ఆశించిన దానికంటె అభివృద్ధి చెందినట్లు విలియం ఫాస్టర్ వ్రాసినాడు. మద్రాస్ పట్టణం అభివృద్ధి అయ్యేవరకు తూర్పుతీరంలో మచిలీపట్టణమే ఆంగ్లేయులకు ప్రధాన కేంద్రమయింది.

మచిలీపట్టణంలోని కంపెనీ సంఘ సభ్యుడైన ఫ్రాన్సిస్‌డే 1639 లో స్థానిక జమీందారు అయిన దామెర్ల వెంకటాద్రి అనుమతితో శాన్‌థోమ్ సమీపంలోని మద్రాసులో సెయింట్ జార్జికోటను నిర్మించాడు. ఆరోజుల్లో ఈ ప్రాంతం వెల్లూరు రాజధానిగా కర్ణాటక రాజ్యాన్ని పాలిస్తున్న అరవీటి మూడో వెంకటపతి స్వాధీనంలో ఉండేది. సెయింట్ జార్జి కోట సమీపంలో స్థానిక ప్రజలు స్థావరాలు ఏర్పరుచుకొనడంతో మరొక నగరం వెలిసింది. కోటలోనిది 'తెల్లనగరం' స్థానిక నగరం నల్లపట్టణం రెండూ కలిసి మద్రాస్ లేక చెన్న పట్టణంగా ప్రసిద్ధమయింది. కర్ణాటక ప్రభువు (మూడో శ్రీరంగరాయలు) 1643 లో

ఎగుమతి దిగుమతి సుంకాలు లేకుండా ఆంగ్లేయులు వాణిజ్యం చేసుకోడానికి హక్కు నిచ్చాడు. 1646 లో కోరమండల తీరం గోల్కొండ సుల్తానుల వశమయింది. గోల్కొండ సేనాని మీర్‌జుమ్లా మొదట్లో ఆంగ్లేయుల పట్ల సాదరంగానే వ్యవహరించాడు. మద్రాస్ దినదినాభివృద్ధి చెందింది. 1658 నాటికి భారతదేశంలో మద్రాస్ ఆంగ్లేయుల ప్రధాన స్థావరమయింది.

పదిహేడో శతాబ్దం చివరి నుండి ఇంగ్లీషువారి పరిస్థితి మెరుగు పడింది. డచ్చి వనరులు క్షీణించి వారి కంపెనీలు బలహీనం కావడంతో వారి పోటీ చాలా వరకు తగ్గింది. గోల్కొండ రాజ్యంలో స్వేచ్ఛగా వాణిజ్యం జరుపుకోవడానికి హక్కులిస్తూ అబుల్ హసన్ కుతుబ్‌షా ఇంగ్లీషువారికి 1676 లో మరొక ఫర్మానా ఇచ్చినాడు. స్ట్రెయిన్ షాం మాస్టర్ 1675 లో మద్రాస్ గవర్నరయినాడు. ఈతడు మంచి సమర్థుడు, దూరదృష్టి ఉన్నవాడు. మద్రాస్ నుండి తీరం వెంబడి పారిశ్రామిక కేంద్రాలు దర్శిస్తూ మచిలీపట్టణంవరకూ ప్రయాణం చేసి ఆయా కేంద్రాలలో సాలీలను - వర్తకులను స్వయంగా కలుసుకొని వారి సహకార సానుభూతులను సంపాదించినాడు. డచ్చి వారిని అనుకరిస్తూ మచిలీపట్టణం, రాజమహేంద్రవరం మొదలయిన చోట్లు స్థానిక వర్తకులతో చిన్న చిన్న కంపెనీలను ఏర్పరిచి ఆ కంపెనీల ద్వారా వస్తువులు విక్రయించుకొని వాణిజ్యం సాగించినాడు. ఈ పద్ధతి వలన కంపెనీకి లాభాలు పెరిగాయి. ఇదే సమయంలో విశాఖపట్టణంలో కర్మాగారం నిర్మించుకోవడానికి వాణిజ్యం సాగించడానికి చికాకోల్ ఫౌజుదారు ఆంగ్లేయులకు అనుమతి నిచ్చాడు, అచిర కాలంలోనే మద్రాస్, మచిలీపట్టణాలతోసహా సమానంగా విశాఖపట్టణం అభివృద్ధి చెందింది. గంజాం, నర్సపూర్, బిమిలిపట్టణం ఇంజరం మొదలయిన పట్టణాల్లో ఇంగ్లీషు స్థావరాలు ఏర్పడినాయి. కంపెనీ ఆర్థిక పరిస్థితిని మెరుగుపర్చడానికై ఇంగ్లీషువారు మద్రాసులో స్థానికులపై ఇంటి పన్ను మొదలయిన పన్నులు విధించి వసూలు చేయటం మొదలెట్టారు. 1687 నాటికి మద్రాసు పరిసరాల్లో జనాభా మూడు లక్షల వరకు పెరగడం కంపెనీ స్థావరాల అభివృద్ధికి నిదర్శనం! ఇంగ్లండులో 1702 నాటికి పోటీ వర్తక సంఘాలు విలీనమై సంయుక్త తూర్పు ఇండియా సంఘమేర్పడడం కూడ కంపెనీ అభివృద్ధికి దోహదకారి అయింది.

పదిహేడో శతాబ్దం చివర్లోనే ఆంగ్లేయులకు మొగలాయీలకు ఘర్షణ జరిగి ఆంగ్లేయులకు సుఖాంతంగా ముగిసింది. గోల్కొండ రాజ్యాన్ని 1687లో ఔరంగజేబు ఆక్రమించిన సమయంలో ఆంగ్లేయులకు, మొగలాయీలకు మధ్య

బెంగాలులో యుద్ధం చెలరేగుతోంది, 1687 లోనే హుగ్లీ, బాలసోర్ మొదలయిన నగరాల మొగలాయి రక్షణ శ్రేణులు ఆంగ్లేయులు ధ్వంసం చేశారు. అందుచేత గోల్కొండ నాక్రమించిన మొగల్ సైన్యాలు కొండపల్లిపై నడవడంతో భయ పడి ఆంగ్లేయులు మచిలీపట్టణం ఖాళీ చేశారు. 1689 లో మొగల్ సైన్యాలు సెయింట్ జార్జి కోటను, అచటి ఇంగ్లీషువారి గోదాములను, విశాఖపట్టణాన్ని ఆక్రమించాయి. కాని ఇదే సమయంలో మొగలాయీలు దక్షిణదేశంలో మహారాష్ట్రులతో ఎడతెగని యుద్ధంలో మునిగివున్నారు. ఛత్రపతి రాజారాం తమిళనాడులోని జింజి కోటలో తలదాచుకున్నాడు. జింజిని ఆక్రమించాలని మొగలాయీలు తీవ్ర ప్రయత్నం చేస్తున్నారు. అందుచేత మొగలాయీలు ఆంగ్లే యులతో సమాధానపడాలని నిశ్చయించారు. జింజి ముట్టడిలో మొగలాయీలకు ఆంగ్ల సైన్యాలు తోడ్పడినాయి. అదీ గాక 1692 లో మహారాష్ట్రుల చేతుల్లో పరాజయం పొందిన మొగల్ సైన్యాలకు మద్రాస్‌లో రక్షణ లభించింది. అందుకు సంతసించి దక్కన్ సుబాదారయిన జుల్ ఫీకర్‌ఖాన్ ఫర్మానా జారీ చేసి తిరిగి కోరమండల తీరంలో ఆంగ్లేయులు పూర్వం అనుభవిస్తున్న హక్కులను పునరుద్ధరించటమే కాక వారి సహాయానికి కృతజ్ఞతతో మద్రాస్ సమీపంలోని ఎగ్మూర్, పరశువాకం మొదలయిన గ్రామాలను ఆంగ్లేయుల కిచ్చినారు. మొగలాయీలకు ఆంగ్లేయులకు మధ్య స్నేహ బంధాలు పునరుద్ధ రింపబడి ఆంగ్లేయుల పరిస్థితి మెరుగుపడింది.

# రాజ్యస్థాపన - విస్తరణ

పదునెన్మిదో శతాబ్ది ఆరంభానికి భారతదేశంలో పోర్చుగీస్ డచ్చివారల ప్రాముఖ్యం నశించి ఇంగ్లీషు ఫ్రెంచి కంపెనీలు కక్షదారులుగా మిగిలినారు. కోరమండల తీరంలో మద్రాస్, పుదుచ్చేరి నగరాలు కేంద్రాలుగా ఇంగ్లీషు ఫ్రెంచి కంపెనీలు తమ బలాన్ని పెంచుకోసాగినారు. కోరమండల ప్రాంతములపై అధిపతియైన హైదరాబాద్ సుబాదార్ అభిమానం సంపాదించడానికి ఉభయులు ప్రయత్నించారు. నైజాంకు ఫ్రెంచి వారి పట్ల అభిమానం. అతని కుమారుడు నాజర్ జంగ్‌కు ఆంగ్లేయులపట్ల ఆదరం ఎక్కువ. ఇదే కాలంలో భారతదేశంలో రాజకీయంగా అరాచకత ప్రబలింది. మొగల్ సామ్రాజ్యం విచ్ఛిన్నమై బెంగాల్, అయోధ్య, హైదరాబాదు సుబాలు ఇంచుమించు స్వతంత్ర రాజ్యాలయినాయి. మొగల్ సామ్రాజ్య విచ్ఛిన్నానికి కారకులైన మహారాష్ట్రులు దాని స్థానంలో కేంద్రీకృతమై, బలమైన రాజ్యాన్ని నిర్మించలేక పోయినారు. 'హిందు పద్ పాద్ శాహి' అనే బాజీరావు నినాదం అతనితోనే అంతరించి మహారాష్ట్ర కూటమి ఇంచుమించు విచ్ఛిన్నమై మహారాష్ట్రుల్లో అంతఃకలహాలు చెలరేగినాయి. తమ దోపిడి దాడులలో మహారాష్ట్రులు పొరుగువారి సానుభూతి కోల్పోయినారు. వారి దాడులకు భీతిల్లిన ప్రజలు విదేశీ స్థావరాల్లో తల దాచుకునేవారు. వాయువ్య సరిహద్దులు అఫ్గనుల దాడులకు అబ్దాలీ గురి అవుతున్నాయి. ఇట్టి అరాచక పరిస్థితులు పాశ్చాత్యులలో రాజకీయమైన ఆశలు పురిగొల్పడం సహజం.

ఐరోపాలో ఆంగ్లేయులు, ఫ్రెంచివారు గర్భశత్రువులు. ఇండియాలోనేకాక అమెరికాలోనూ, ఆఫ్రికాలోనూ తమ ప్రాబల్యం నెలకొల్పుకొని ఒకరి నొకరు ఆ ప్రాంతాల నుండి తరిమివేయాలని ప్రయత్నిస్తున్నారు. ఆ రోజుల్లో ఐరోపా లోని ప్రతి రాజ్యమూ స్వయం సమృద్ధి సాధించడమే గాక దిగుమతులు తగ్గించి ఎగుమతులు పెంచడానికి కృషి చేస్తుండేది. ఈ కృషికి విరుద్ధంగా ఇండియా నుండి అనేక వస్తువులు ఐరోపా వారు దిగుమతి చేసుకుంటున్నందున అపార ధనరాశులు ఇండియాకు చేరుతుండేవి. ఈ ధన ప్రవాహం ఆపడానికై ఇండియాలో రాజ్యం స్థాపించి దాని వలన వచ్చే ఆదాయంతో తమ దేశస్థులకు

అవసరమయిన ఇండియా సరుకును విక్రయించి ఎగుమతి చేయాలని ఫ్రెంచి ఆంగ్ల కంపెనీ వుద్యోగులు ఆశించినారు. రాజ్య సంపాదన విషయంలోనే ఉభయ కంపెనీలకు సంఘర్షణలు జరిగినాయి. ప్రపంచంలో ఏ ప్రాంతంలో సంఘర్షణ ప్రారంభమయినా అన్ని ప్రాంతాల్లోనూ ఆంగ్లేయులు ఫ్రెంచి వారు యుద్ధాలు చేస్తుండేవారు. వీరి మధ్య ఇండియాలో 1740 - 65 సం॥ మధ్య కాలంలో మూడు యుద్ధాలు జరిగినాయి. వీరికి కర్ణాటక రంగస్థలమయినందున కర్ణాటక యుద్ధాలుగా ప్రసిద్ధి చెందినాయి. కర్ణాటక రాజకీయ పరిస్థితులు ఉభయ వర్తక సంఘాల ఆశలకు పదునబెట్టి, స్థానిక రాజకీయాల్లో జోక్యం కలిగించుకొని తమ ఆశయాలు సాధించడానికి తోడ్పడినాయి. ఉభయులు హైదరాబాద్ సుబాదార్ అభిమానం పొందడానికి ప్రయత్నాలు సాగించారు.

కర్ణాటకం హైదరాబాదు సుబాలో భాగం. కర్ణాటకానికి ఆర్కాటు రాజధాని. అందుచే కర్ణాటక నబాబును ఆర్కాటు నబాబని కూడా వ్యవహరించే వారు. అతని అధికారం నెల్లూరు జిల్లా వరకు విస్తరించి ఉండేది. ఆర్కాటు నబాబయిన సాదుల్లాఖాన్ హైదరాబాదు సుబాదారయిన అసఫ్జా అధికారాన్ని గుర్తింపక నేరుగా పాదుషాతో లావాదేవీలు జరుపుతుండేవాడు. ఇది అసఫ్జాకు ఆగ్రహం కలిగించింది. సాదుల్లాఖాన్ అనంతరం అతని పెంపుడు కుమారుడైన దోస్త్ ఆలీ సైతం అలాగే వ్యవహరించేవాడు. దోస్త్ ఆలీ పరిపాలనా దక్షుడు కాడు. అతని కొడుకు సఫ్దరాలీ, మేనల్లుడు చందాసాహెబు ప్రభుత్వ వ్యవహారాలు నిర్వహిస్తుండేవారు. ఇద్దరి మధ్యా ద్వేషాలు అసూయా రగులుతుండేవి. ఒకరిని కాదని మరొకరు కర్ణాటక నాబాబీ పదవిని ఆక్రమించాలనే ఆశయంతో తమతమ బలాలను కూడదీసుకుంటుండేవారు. ఇదే సమయంలో తిరుచునాపల్లి రాజు మరణించగా ఆ రాజ్యాన్ని కర్ణాటక నబాబీలో కలిపి చందాసాహెబు తిరుచునాపల్లి రాజుగా ప్రకటించుకున్నాడు. చందాసాహెబు బలం పెరిగింది.

దోస్త్ ఆలీ కుటుంబం ఆగడాలను ఆపి వారు తమ అధికారాన్ని గుర్తింపచేసే సంకల్పంతో అసఫ్జా కర్ణాటకంపై దండెత్తడానికి సన్నాహాలు చేస్తున్న సమయంలో మహారాష్ట్రులు కర్ణాటకంపై దండెత్తినారు. రఘూజీభాన్లే, ఫతేసింగ్ ఈ దండయాత్రకు నాయకులు. దామల్‌చెర్వు యుద్ధంలో దోస్త్ ఆలీ పరాజయం పొంది మరణించాడు. తమ కుటుంబాలను పుదుచ్చేరికి పంపి సఫ్దరాలీ వెల్లూరుకు, చందాసాహెబు తిరుచునాపల్లికి తిరోగమించారు. వారి కుటుంబాలకు పుదుచ్చేరి గవర్నర్ డ్యూమస్ రక్షణ నిచ్చాడు. మహారాష్ట్రులు ఆర్కాటు

న్రాక్రమించి రాజ్యాన్ని కొల్లగొట్టినారు. సఫ్దరాలీ వారితో సంధి చేసికొని చౌత్ చెల్లించడానికి అంగీకరించాడు. అతణ్ణి కర్ణాటక నబాబుగా రఘూజీ గుర్తించాడు. సఫ్దరాలి సకుటుంబంగా ఆర్కాటుకు మరలినాడు. బహుశ సఫ్దరాలీతో చేసుకున్న రహస్య ఒప్పందం ప్రకారం రఘూజీ తిరుచునాపల్లిపై దండెత్తి చందా సాహేబును బందీగా పట్టుకున్నాడు. చందాసాహేబు కుటుంబాన్ని తమపరం చేయవలసిందిగా డ్యూమస్‌ను రఘూజీ ఆదేశించాడు. రఘూజీ ఆదేశాన్ని డ్యూమస్ తిరస్కరించాడు. అతని ధైర్య సాహసాలకు మెచ్చుకున్న హైదరాబాదు సుబాదారు, మొగల్ పాదుషాలు అతణ్ణి అభిమానించారు. స్థానిక ప్రభుత్వ వర్గంలో ఫ్రెంచివారిపట్ల అదరాభిమానాలు పెరిగినాయి. చందాసాహేబును మహారాష్ట్రులు బందీగా తీసుకొని పోయినారు.

సఫ్దరాలీ విలాసప్రియుడు, పాలన పట్ల శ్రద్ధ వహించినవాడు కాదు. అందుచే కర్ణాటకంలో అరాజకం ప్రబలింది. వెల్లూరు పరగణాలను పాలిస్తున్న అతని బావ మూర్తజా అలీ ఇతర జమీందార్లతో కుట్రపన్ని సఫ్దరాలీని హత్య చేసి కర్ణాటక నబాబుగా ప్రకటించుకున్నాడు. కాని సైన్యం తిరుగుబాటు చేసి (1742) సఫ్దరాలీ కుమారుడైన సయ్యద్ మహమ్మద్ అలీని కర్ణాటక నబాబుగా ప్రకటించింది. సయ్యద్ బాలుడు. మద్రాసులో అంగ్లేయుల రక్షణలో ఉంటున్నాడు. అంగ్లేయులిచ్చిన రక్షణకు కృతజ్ఞతతో సయ్యద్ వారికి సెయింట్ జార్జికోట సమీపంలోని వేపేరి మొదలైన ఐదు పల్లెలు బహూకరించటమేగాక చింతాద్రిపేటలో టంకసాల నెలకొల్పి ఆర్కాటు రూపాయీలు ముద్రించుకోడానికి అనుమతించాడు.

అసఫ్‌జా 1742 చివర్లో కర్ణాటకలో ప్రవేశించి బిజాపూర్ సుబేదారు కర్నూలు నబాబు మొదలైనవారు బకాయిపడిన కప్పం వసూలుచేసి ఆర్కాటుపై దండెత్తినాడు. సయ్యద్ అలీ అసఫ్‌జాకు లొంగినాడు. ఆరు మాసాల ముట్టడి అనంతరం మురారిరావు ఘోర్పాదే ఓడి తిరుచునాపల్లి నైజాం వశమయింది (1743) అసఫ్‌జా కర్ణాటకంలోవున్న సమయంలోనే (1742-44) అతని అభిమానం సంపాదించడానికై అంగ్లేయులాతనికి నజరానాలు పంపినారు. మద్రాస్‌లో అంగ్లేయులనుభవిస్తున్న సాధారణ హక్కులను అసఫ్‌జా ఖరారు పరచాడుకాని నాణేలు ముద్రించుకోడానికి అనుమతించలేదు. అయినా ఉద్యోగులకు లంచాలిచ్చి అంగ్లేయులు రహస్యంగా నాణేలు ముద్రించేవారు.

కర్ణాటక నబాబ్ సయ్యద్ అలీకి సంరక్షకునిగా అన్వరుద్దీనును నియమించి అసఫ్‌జా హైదరాబాద్ మరలినాడు. ఏలూరు రాజమండ్రి సర్కారుల

పాలనను నిర్వహించి తీరాంధ్ర రాజకీయాల్లో మంచి అనుభవం ఉన్నవాడు అన్వరుద్దీన్. కాని దురాశాపరుడు. కర్ణాటకం నుండి ఆసఫ్‌జా మరలిన కొద్ది రోజులకే సయ్యద్ అలీ హత్యకు గురి అయినాడు. అన్వరుద్దీన్ మూర్తజా ఆలీలే హత్యకు కారకులని సర్వత్రా అనుమానించారు కాని కర్ణాటక నవాబుగా అన్వరుద్దీన్‌ను అంగీకరించక తప్పలేదు. చిరకాలంగా దోస్ట్ ఆలీ కుటుంబంపట్ల విధేయులుగా ఉన్న కర్ణాటక ప్రజల్లో అన్వరుద్దీన్‌కు వ్యతిరేకత బలపడసాగింది.

## ఫ్రెంచి ఇంగ్లీషు కంపెనీల స్పర్ధ

పద్దెనిమిదో శతాబ్దం మధ్యకాలానికి ఫ్రెంచి ఇంగ్లీష్ వర్తక సంఘాలు భారతదేశంలో కక్షిదారులైనారు. అమెరికాలో సయితం వారిమధ్య తీవ్ర స్పర్ధ ఉంది. సాంప్రదాయకంగా ఐరోపాలో వీరుభయులు శత్రువులు. అందుచే ఎక్కడ ఏ స్వల్ప అవకాశం లభించినా ప్రపంచవ్యాప్తంగా వీరిరువురూ పోరాటం సాగించినారు. అమెరికా, ఇండియాలనుండి పరస్పరం తరిమివేసి స్వీయ సామ్రాజ్యం స్థాపించాలని వారి సంకల్పం. ఇదే సమయానికి దక్షిణ ఇండియా పరిస్థితులు అస్తవ్యస్తంగా ఉన్నట్లు పరిశీలించినాము. కొత్తగా కర్ణాటక నవాబైన అన్వరుద్దీన్ ఆదరాభిమానాలు సంపాదించాలని ఫ్రెంచివారు ఆంగ్లేయులు ఉభయులూ ప్రయత్నించడం సహజం దోస్ట్ ఆలీ కుటుంబంతో ఫ్రెంచివారికి చిరకాలంగా మైత్రి ఉంది. అందుచేత అన్వరుద్దీన్‌కు వారిపట్ల అనుమానంగా ఉండేది. ఫ్రెంచివారాతని అనుమానాలు తొలగించడానికి ప్రయత్నాలు చేశారు; ఆంగ్లేయులు కొత్త నబాబుకు కానుకలు పంపి కప్పం చెల్లించి అతని ఆదరాభి మానాలు సంపాదించారు. ఇట్టి పరిస్థితుల్లో ఐరోపాలో ఆస్ట్రియా వారసత్వ యుద్ధం ప్రారంభమై ఫ్రెంచి-ఇంగ్లీషు స్పర్ధ ప్రత్యక్ష రూపం ధరించి 1742-1763 సంవత్సరాలమధ్య మూడు యుద్ధాలు జరిగినాయి. వీటికి కర్ణాటకం రంగస్థలమయినందున ఇవి కర్ణాటక యుద్ధాలుగా చరిత్రల్లో ప్రసిద్ధమయినాయి. మూడో యుద్ధం చివరకు ఫ్రెంచి కంపెనీ పూర్తిగా నీరసించి భారతదేశంలో రాజకీయ ప్రాధాన్యం కోల్పోయింది.

## ఆస్ట్రియా వారసత్వ యుద్ధం
## (మొదటి కర్ణాటక యుద్ధం)

ఆస్ట్రియా వారసత్వ యుద్ధంలో (1744-48) ఆంగ్లేయులు ఫ్రెంచివారు విరోధ కూటముల్లో చేరి తలపడినందున ఉభయులమధ్య అమెరికా ఇండియాలలో కూడ సంఘర్షణ తప్పలేదు. నాటికి పుదుచ్చేరి గవర్నరైన డూప్లే మంచి రాజ

నీతిపరుడు. భారతదేశం తోటి వాణిజ్యంవల్ల ఫ్రాన్స్‌నుండి ఇండియాకు తరలు తున్న ధన ప్రవాహాన్ని నిలుపుచేయడానికి ఆంగ్లేయులను దేశంనుండి పారద్రోలి ఇండియాలో ఫ్రెంచి సామ్రాజ్యం స్థాపించడమే మార్గమని నిర్ణయించి ఆశయ సాధనకు కృషి చేయసాగినాడు. అతని భార్య పోర్చుగీసు వనిత; ఇండియాలో పుట్టి పెరిగింది. భారతీయ రాజకీయాలు క్షుణ్ణంగా తెలిసిన వ్యక్తి. అందుచే స్థానిక రాజకీయాల్లో డూప్లేకు సలహాదారయింది. డూప్లే కూడ భారతీయ స్థితి గతులు పరిస్థితుల్లో భారతీయ రాజ్యాలతోనూ ఆంగ్లేయులతోనూ యుద్ధాలు తప్పవని గ్రహించి పుదుచ్చేరి రక్షణ శ్రేణులను పటిష్టం చేసినాడు. సైన్యంలో భారతీయులను చేర్చుకొని పాశ్చాత్య పద్ధతులపై వారికి శిక్షణనిచ్చి ఫ్రెంచి బలాన్ని ఇనుమడింపజేసే ప్రయత్నాల్లో ఉన్నాడు.

ఈ సమయంలో ఆస్ట్రియా వారసత్వ యుద్ధం ప్రారంభమయింది. ఆంగ్లేయులతో యుద్ధానికి తలపడడానికి ఫ్రెంచివారు సన్నద్ధులైనారు. అందుచేత పరస్పరం దాడులు జరుపుకోమనే ఒప్పందం చేసుకోవాలని డూప్లే ఆంగ్లేయులకు సూచించాడు. ఆంగ్లేయులా సూచనను తిరస్కరించడమేగాక, ఫ్రెంచి నౌకలను పట్టుకోవలసిందనే ఆజ్ఞలతో నౌకాదళాధికారి (కామడోర్) బార్నెట్‌ను ఆంగ్ల ప్రభుత్వం ఇండియాకు పంపింది. మద్రాస్ పుదుచ్చేరీల మధ్య ఫ్రెంచి నౌకలను పట్టుకొని బార్నెట్ అలజడి కలిగించాడు. ఆంగ్లేయుల ఈ దౌర్జన్యాల నరికట్టి కర్నాటకంలో శాంతిభద్రతలను పరిరక్షించవలసిందిగా అన్వరుద్దీన్‌కు డూప్లే విజ్ఞాపన చేశాడు. అయినా, డూప్లే శాంతి భద్రతలపట్ల శ్రద్ధ వహించినాడనడం అనుమానం! ఇంతలో ఫ్రెంచివారి మారిషస్ దీవులనుండి లాబోర్డ్‌నోయ్ అనే ఫ్రెంచి నౌకాదళాధిపతి మద్రాస్ నగరాన్ని ముట్టడించి పట్టుకున్నాడు. లాబోర్డ్ నోయ్ విజయాన్ని డూప్లే హర్షించాడు కాని మద్రాస్ భవిష్యత్తును గురించి ఉభయులమధ్య అభిప్రాయ భేదాలేర్పడినాయి. ఆంగ్లేయులనుండి పదకొండు లక్షల పగోడాలు లంచం పుచ్చుకొని, డూప్లే సూచనలకు వ్యతిరేకంగా మద్రాస్‌ను ఆంగ్లేయుల పరంచేసి లాబోర్డ్‌నోయ్ మారిషస్ దీవులకు మరలినాడు. డూప్లేకిది పెద్ద ఆశాభంగం. ఈ విధంగా ఫ్రెంచి ఉద్యోగులమధ్య సదవ గాహన, సహకారమూ లోపించడం ఇండియాలో ఫ్రెంచి పరాజయానికి ముఖ్య కారణం! డూప్లే నిరుత్సాహపడక అన్వరుద్దీన్‌తో సమాధానం కుదుర్చుకొని అతని ఆమోదంతో మద్రాస్ పట్టణాన్ని తిరిగి వశపరచుకున్నాడు. ఒప్పందం లోని షరతుల ప్రకారం మద్రాస్‌ను డూప్లే నబాబు పరం చేయవలె! అందుకు విరుద్ధంగా సెంట్ జార్జి కోటపై ఫ్రెంచి పతాకం ప్రతిష్ఠించడం జరిగింది.

అన్వరుద్దీన్ ఇది సహించలేకపోయినాడు. ఇంగ్లీషువారు సయితం ఫ్రెంచి దురాగతాలనరికట్టి మద్రాస్‌ను తమకు ఇప్పించవలసిందిగా నవాబును అర్థించారు. అన్వరుద్దీన్ ఫ్రెంచివారితో యుద్ధానికి సన్నద్ధుడయినాడు; అతని కుమారుడు మహూజ్‌ఖాన్ నాయకత్వంలో పదివేల సైన్యం మద్రాస్‌పై నడిచింది. సెయింట్ జార్జి కోటను ముట్టడించిన నవాబు సైన్యాన్ని ఫ్రెంచి సైన్యం తిప్పికొట్టింది. శాన్‌థోమ్ దగ్గిర జరిగిన మరొక యుద్ధంలో మహూజ్‌ఖాన్ పూర్తిగా పరాజయం చెందాడు.

శాన్‌థోమ్ యుద్ధం (1744) పెద్ద యుద్ధం కాదు. దానివల్ల కలిగిన ఫలితాలు గణనీయములు కావు. కాని భారత చరిత్రలో ఆ యుద్ధానికి చాల ప్రాముఖ్యం వుంది. స్థానిక రాజకీయాలపై ఆ యుద్ధ ప్రభావం అపారమయింది. బలవంతుడుగా పరిగణిస్తున్న స్థానిక ప్రభువు సైన్యాన్ని ఐరోపా వర్తక సంఘానికి చెందిన చిన్న సైన్యం ఓడించింది. దీనితో భారతీయ సైనిక బలహీనత లోకానికి వెల్లడి అయింది. రాజా స్థానాల వైభవ దర్పాలకు వాని సైనిక సామర్థ్యానికి పొంతన లేదని ఐరోపావారు గ్రహించారు. దేశీయ సైన్యాలపై ఐరోపా సైన్యాల ఆధిక్యతను భారతీయ ప్రభు వర్గం గుర్తించింది. ఐరోపా సైన్యాలలోని క్రమశిక్షణ, ఆయుధ పాటవం, యుద్ధ నైపుణ్యం వారి నాకర్షించింది. తమ తమ సైన్యాలకు ఈ గుణాలు అలవరచే ప్రయత్నాలు చేయడానికి బదులు తమ అంతఃకలహాలలో ఐరోపా సైనిక సహాయం అర్థించడం ప్రారంభమయింది.

## రెండో కర్ణాటక యుద్ధం

ఆస్ట్రియా వారసత్వ యుద్ధం ముగిసీ (1748) ముగియక పూర్వమే రెండో కర్ణాటక యుద్ధం ప్రారంభమయింది. ఈ యుద్ధం కేవలం స్థానికం. అందే ఐరోపా అమెరికాలకు ఆ యుద్ధం విస్తరించక భారతదేశానికి మాత్రమే పరిమితమయింది. దేశ రాజకీయాల్లో జోక్యం కలిగించుకొని ఫ్రెంచివారు ఆంగ్లేయులు తమ బలా బలాలను తేల్చుకోడానికి చేసిన ప్రయత్నంగా ఆ యుద్ధం జరిగింది. స్థానిక రాజకీయాల్లో తల దూర్చే పద్ధతికి ఆంగ్లేయులే మార్గదర్శకులయినారు. తంజావూరు రాజ్యంలో సాహూజీ, ప్రతాప్‌సింగ్‌ల మధ్య సింహాసనానికై జరిగిన పోరాటంలో ప్రతాప్‌సింగ్‌కు సహాయంచేసి దేవికోట రేవు పట్టణాన్ని ఆంగ్లేయులు బహుమతిగా గ్రహించారు. ఫ్రెంచివారి విధానాన్ని మరింత చురుకుగా అనుసరించే ప్రయత్నం చేశారు.

అసఫ్‌జా మరణంతో (1748) హైదరాబాద్, కర్ణాటకాలలో వారసత్వ తగాదాలు రావడంతో అరాచకశక్తులకు ప్రోత్సాహం లభించి విదేశీ కంపెనీలకు మంచి అవకాశమయింది. అసఫ్‌జా పెద్ద కొడుకు ఘాజీవుద్దీన్ ఢిల్లీలో మొగల్ ఆస్థానంలో వున్నందున రెండో కొడుకు నాజర్‌జంగ్ సుబేదార్‌గా ప్రకటించుకొని మొగల్ పాదుషా నుండి ఫర్మానా సంపాదించినాడు. నాజర్‌జంగ్‌ను ధిక్కరించి అసఫ్‌జా దౌహిత్రుడు ముజఫర్‌జంగ్ హైదరాబాదు గద్దెకు తానే వారసుడనని వాదించసాగినాడు. రాయచూర్, ఆదోని సర్కారులకు పాలకుడుగా ముజఫర్ పెద్ద సైన్యాన్ని కూర్చుకొని నాజర్‌జంగ్‌తో యుద్ధానికి సన్నద్ధుడైనాడు.

హైదరాబాద్ సుబాలో మరింత అలజడి సృష్టించే ఆశయంతో మహారాష్ట్రులు చందా సాహేబ్ బంధవిముక్తుని చేసి కర్ణాటకానికి పంపినారు. మహారాష్ట్రుల ఈ చర్యకు డూప్లే ప్రోత్సాహం వున్నట్లు తెలుస్తుంది. చందా సాహేబ్ ముజఫర్‌జంగ్‌లు మిత్రులు. చందాసాహేబ్‌కు ఫ్రెంచివారి ప్రోత్సాహ సహకారాలున్నాయి. అందుచే ముజఫర్‌జంగ్‌తో కలిసి ఫ్రెంచివారి సహాయంతో చందా సాహేబ్ అన్వరుద్దీన్‌తో యుద్ధానికి తయారయినాడు. అంబూర్ దగ్గిర జరిగిన యుద్ధంలో (1749) అన్వరుద్దీన్ ఓడి మరణించినాడు. అతని కొడుకు మొహమ్మద్ అలీ పారిపోయి తిరుచునాపల్లి కోటలో తల దాచుకొన్నాడు. చందా సాహేబ్‌ను ఆర్కాటు నబాబుగా ముజఫర్‌జంగ్ ప్రకటించడం జరిగింది. తిరుచునాపల్లిపై దండెత్తి ఆక్రమించినచో చందా సాహేబ్ పదవి సుస్థిరమై వుండేది. ధనాభావంవల్ల చందా సాహేబ్ ఆ ప్రయత్నం విరమించవలసి వచ్చింది.

ఆంగ్లేయులూ, నాజర్‌జంగూ ఉపేక్ష వహించక రంగప్రవేశం చేశారు. మొహమ్మద్ అలీ తమ పరం చేసిన శాన్‌థోమును ఆక్రమించి అతనికి సాయంగా తిరుచునాపల్లిపైకి ఆంగ్లేయ లోక సైన్యాన్ని పంపారు. నాజర్‌జంగ్ కూడ పెద్ద సైన్యంతో కర్ణాటకంలో ప్రవేశించాడు. ముజఫర్‌జంగ్ మేనమామకు లొంగిపోయినాడు. నాజర్‌జంగ్‌తో సంధికై డూప్లే, చందా సాహేబ్‌లు ప్రయత్నించారు గాని లాభం లేకపోయింది. అయితే డూప్లే ఇచ్చిన లంచాలకు లొంగి కడప, కర్నూల్, సవనూర్ పఠాను నబాబులూ నాజర్‌జంగ్ దివానైన షా నవాజ్‌ఖాన్, పేష్వా రామదాస్ పండిట్‌లు ఫ్రెంచివారి పక్షం వహించారు. విజయోత్సాహంతో జింజి సమీపంలోని తన శిబిర రక్షణ పట్ల శ్రద్ధ వహించని నాజర్‌జంగ్‌పై ఫ్రెంచి సైన్యం హటాత్తుగా దాడి జరిపింది. కర్నూల్ నబాబ్ నాజర్‌జంగ్‌ను కాల్చి చంపాడు. ముజఫర్‌జంగ్‌ను బంధ విముక్తుణ్ణి చేసి

హైదరాబాద్ సుబాదారుగా ప్రకటించారు. (1750) కృతజ్ఞతతో ముజఫర్ జంగ్ డూప్లేను కృష్ణానదికి దక్షిణాన వున్న సుబా ప్రాంతాలపై తన ప్రతినిధిగా నియమించాడు. భారతదేశంలో ఫ్రెంచి వారి గౌరవ ప్రతిష్ఠలు మిన్నంటినాయి.

బుస్సీ నాయకత్వంలోని ఫ్రెంచి సైన్యం మద్దతుగా రాగా ముజఫర్ జంగ్ హైదరాబాదు ప్రయాణమైనాడు. (1751), కడప, కర్నూలుల మీదుగా అతడు ప్రయాణం చేయాలి. నాజర్ జంగ్ హత్య అనంతరం తమకు అందిన ముడుపుల పట్ల అసంతృప్తులైన కడప కర్నూలు నబాబులు అతనితో యుద్ధానికి తలపడినారు. రాయచోటి దగ్గిర ముజఫర్ జంగ్ హతుడైనాడు. బుస్సీకి దిక్కు తోచలేదు. కాని సమయస్ఫూర్తితో ముజఫర్ జంగ్ సోదరుడైన సలబత్ జంగ్‌ను హైదరాబాద్ సుబాదారుగా ప్రకటించి అతనితో హైదరాబాద్ ప్రయాణం సాగించాడు. ఫ్రెంచి పలుకుబడికి ప్రమాదం తప్పింది.

ఈ లోగా తిరుచునాపల్లిలో ఉన్న మహమద్ అలీ సూచనపై, మద్రాస్ గవర్నరైన సాండర్స్ రాబర్ట్ క్లైవ్ నాయకత్వంలో ఒక సైన్యాన్ని ఆర్కాటు పైకి పంపినాడు. ఆర్కాటు క్లైవు వశమయింది. (1751) ఆర్కాటు ఆక్రమణ క్లైవు ఘనతకు పునాది వేయడమే గాక ఫ్రెంచి ప్రాబల్యానికి గొడ్డలిపెట్టు అయింది. ఆర్కాటును వశపరచుకొన్న అనంతరం క్లైవు కావేరిపాక్, శ్రీరంగ పట్టణం యుద్ధాల్లో ఫ్రెంచి సైన్యాల నోడించి తిరుచునాపల్లిపై దండెత్తినాడు. ఫ్రెంచి సైన్యాలోడి చందా సాహేబు పట్టుబడినాడు. చందా సాహేబును వధించి మహమ్మదాలీని కర్ణాటక నబాబుగా ప్రకటించడం (1752) జరిగింది. కర్ణాటకంలో ఫ్రెంచి ప్రాబల్యం అంతరించింది.

హైదరాబాద్ గద్దె నెక్కిన సలబత్ జంగ్ సమర్థుడు కాదు; సుబాదార్ కాగలనని కలలో కూడ వూహించినవాడు కాదు. అతనికి ఫ్రెంచి సైన్యం అండదండలు తప్పనిసరి. అందుచే ఫ్రెంచివారిపట్ల విశ్వాసంతో వారికి నిజాం పట్టణం, కొండవీడు, నర్సాపూర్‌లను దత్తంచేసి కృష్ణానదికి దక్షిణ ప్రాంతంపై డూప్లేను తనకు ప్రతినిధిగా ప్రకటించాడు. బుస్సీ నాయకత్వంలో ఫ్రెంచి సైన్యం హైదరాబాద్‌లో నిలవడం జరిగింది. తరువాత ఇంగ్లీషు గవర్నర్ జనరల్ వెల్లస్లీ అనుసరించిన సైన్య సహకార పద్ధతి ఛాయలీ యేర్పాటులో కన్పిస్తాయి.

సలాబత్ జంగ్ దివానైన సయ్యద్ లష్కర్‌ఖాన్ ఫ్రెంచి వారిపట్ల వైరం వహించాడు. సలాబత్ జంగ్ స్థానంలో ఘాజీ వుద్దీన్‌ను గద్దె నెక్కించి హైదరాబాద్ నుండి ఫ్రెంచి వారిని పారదోలాలని అతని సంకల్పం. అందుకై

మహారాష్ట్రులతో సమాధానం కుదుర్చుకొన్నాడు. దాని ప్రకారం పేష్వా సహాయం చేసిన లక్ష సైన్యంతో ఘాజీ వుద్దీన్ ఔరంగాబాద్ చేరుకున్నాడు. (1752) కాని అతని ఆకస్మిక మరణంతో పరిస్థితి తారుమారయింది. మరాటీ సైనికులు గ్రామాలను కొల్లగొట్టి అరాచకం సృష్టించసాగినారు.

బుస్సీ జోక్యం కలిగించుకొని నబాబు పేష్వాల మధ్య భల్కి దగ్గిర ఒడంబడిక కుదిర్చి మహారాష్ట్రులను వెనుకకు మరల్చినాడు. ఇందుకు ప్రతి పలంగా మచిలీపట్టణ పరిసర ప్రాంతాలు ఫ్రెంచివారికి లభించినాయి. (1752) మూర్తజానగర్, ముస్తఫానగర్, ఏలూరు, రాజమంద్రి, చికాకోల్ సర్కారులు పొందడానికి బుస్సీ ప్రయత్నించాడు కాని నబాబు అంగీకరించలేదు.

హైదరాబాదు నుండి ఫ్రెంచి వారిని పారదోలే ప్రయత్నాలను లష్కర్ ఖాన్ విరమించలేదు. మద్రాస్ ఇంగ్లీషు గవర్నరైన సాండర్స్‌తోనూ, రఘూజీ బాన్‌స్లే వంటి మరాటా నాయకులతోనూ సంప్రదింపులు సాగించాడు. లష్కర్ చర్యలు గ్రహించిన డూప్లే ఆదేశానుసారం బుస్సీ ఔరంగాబాదుపై దండెత్తాడు. తన బలహీనతను గుర్తించిన లష్కర్ బుస్సీతో ఔరంగాబాద్ సంధి చేసుకున్నాడు (23-11-1753). సంధి ప్రకారం నాల్గు ఉత్తర సర్కారులు (ముస్తఫానగర్, ఏలూరు, రాజమండ్రి, చికాకోలు) ఫ్రెంచి వారికి దత్తమయినాయి. ఈ సార్కారుల్లో విజయనగరం, బొబ్బిలి, పెద్దాపురం, పిఠాపురం, మొగలితుర్రు, నూజివీడు, జమీందారీలు ముఖ్యమైనవి. రాజమండ్రి సర్కారును విజయ రామరాజుకు; చికాకోల్‌ను ఇబ్రాహీం గార్దిలి హుస్సేన్ ఆలీకి; ఏలూరు, ముస్తఫా నగరాలను బుస్సీ కౌలుకు ఇచ్చినాడు. రెవెన్యూ విధానంలో మాత్రం మారా జరగలేదు. ఈ సర్కారులపై సాలుసరి ఆదాయం 31 లక్షలు. ఔరంగాబాద్ సంధి తర్వాత బుస్సీ నిరంకుశత్వం మితిమీరడంతో లష్కర్‌ఖాన్ దివాన్ పదవి నుండి విరమించి షా నవాజ్ దివానయినాడు.

షా నవాజ్ సయితం ఫ్రెంచి వారి పట్ల ద్వేషం వహించినవాడే. సుబా లోని వివిధ వర్గాల్లో ఫ్రెంచివారిపట్ల అసంతృప్తి ప్రబలడం అతనికి ప్రోత్సాహ కరమయింది. సర్కారులను ఫ్రెంచివారికి బదిలీ చేయడం అచటి ఫౌజుదారులకు గానీ విజయరామరాజుకు గానీ సమ్మతం కాదు. ముఖ్యంగా రాజమండ్రి ఫౌజు దారైన జాఫర్ ఆలీ బుస్సీపై పగబట్టి వున్నాడు. వీరినీ, నబాబు సోదరులైన నైజాం ఆలీ, బసలత్‌జంగ్‌లను కూడగట్టుకొని మహారాష్ట్రుల, ఆంగ్లేయుల సాయంతో హైదరాబాదు నుండి ఫ్రెంచివారిని తరలించాలని షా నవాజ్ ప్రయత్నాలు ప్రారంభించాడు.

ఈ పరిస్థితుల్లో డూప్లేను బర్తరఫ్ చేసి స్వదేశానికి పంపడం జరిగింది. ఫ్రెంచి వారి పలుకుబడికి ఇది పెద్ద దెబ్బ. షా నవాజ్‌కు మంచి అవకాశ ముంది. వెంటనే బుస్సీని బర్తరఫ్ చేసి సైన్యంతో హైదరాబాదు విడిచి వెళ్ళవల సిందిగా సలాబత్‌జంగ్ ఫర్మానా జారీ చేశాడు. బుస్సీ సైన్యాన్ని కూర్చుకొని (5000 సిపాయీలు, 2000 అశ్వదళం, 800 మంది యూరోపియన్లు) హైదరా బాద్‌నగరం చేరి మూసీపై నున్న చార్‌మహల్, ఘోషామహలులు ఆక్రమించి నబాబుపై యుద్ధానికి సిద్ధమయినాడు. మహారాష్ట్రులు, కర్నూలు పఠానులు రహస్యంగా ఆతనితో ఒప్పందాలు కుదుర్చుకున్నారు. ఒక చిన్న సంఘర్షణలో నబాబు సైన్యాలు బుస్సీ చేతిలో పరాజయం చెందినాయి. నబాబు, దివానూ బుస్సీతో రాజీ పడి ఆతని పదవిని (ఆగస్టు 1756) పునరుద్ధరించినారు.

బుస్సీ విజయం సాధించాడు కాని ఆతని ఆర్థిక పరిస్థితి ఆందోళనకరంగా పరిణమించింది. విజయరామరాజు మినహా సర్కార్లలోని జమీందార్లు శిస్తు చెల్లించడం మానినారు. రాజమండ్రి మొదలైనచోట్ల సిపాయీలు, ఫ్రెంచి అధికార్లపై తిరుగుబాట్లు ప్రారంభించారు. బొబ్బిలి రాజా రంగారావు శిస్తు చెల్లించకపోగా రాజమండ్రి సిపాయీ పితూరీకి కారణమైన చికాకోల్ ఫౌజుదారు ఇబ్రాహింఖాన్‌కు ఆశ్రయం ఇచ్చాడు. ఈ జమీందార్లను శిక్షించి శిస్తు వసూలు చేయడానికి బుస్సీ నిర్ణయించాడు. విజయనగరం బొబ్బిలి జమీందారీలమధ్య చిరకాలంగా వైరం ఉంది. బొబ్బిలిపై పగ దీర్చుకోడానికిది మంచి అవకాశమని విజయరామరాజు బొబ్బిలిపై దండెత్తడానికి బుస్సీని ప్రోత్సహించినాడు. అంతేగాక 10 వేల సైన్యంతో, దివాన్ హైదర్‌జంగ్‌తో సహా బుస్సీతో చేరినాడు. పెద్దాపురం జమీందారు కూడ బుస్సీ పక్షం వహించాడు. 1757 జనవరిలో బొబ్బిలి యుద్ధం జరిగింది. పరాజయం తప్పదని గ్రహించి బొబ్బిలి కోటలోని స్త్రీలందరు ఆత్మాహుతి చేసుకున్నారు. రాజా రంగారావుతో సహా బొబ్బిలి సైన్యం పోరాడుతూ అంతరించింది. బొబ్బిలికోట పూర్తిగా ధ్వంసమయింది. తర్వాత రెండు రోజులకు రాజా రంగారావు బంధువు తాండ్రపాపారాయుడు రహస్యంగా గుడారంలో ప్రవేశించి విజయరామరాజును వధించాడు. యుద్ధానికి ముందు రహస్యంగా కోటనుండి తప్పించిన రాజా రంగారావు కుమారుని బొబ్బిలి జమీందారుగా పునరుద్ధరించి బుస్సీ విశాఖపట్టణంపై దండెత్తి ఇంగ్లీషు వారినోడించి పట్టణాన్ని వశపరచుకున్నాడు. బొబ్బిలి పతనంతో సర్కారుల్లోని జమీందార్లందరూ బుస్సీకి లొంగి కప్పం చెల్లించసాగినారు. సర్కారుల్లో ఫ్రెంచి వారి అధికార గౌరవాలు తారస్థాయికి చేరినాయి.

# మూడో కర్ణాటక యుద్ధం

నబాబు సలాబత్‌జంగ్ ఇంచుమించు బుస్సీ చేతిలో బందీయేగాని హైదరాబాదులో నానాటికి ఫ్రెంచివారిపట్ల వ్యతిరేకత బలపడసాగింది. దివాన్ షానవాజ్ ఖాన్, నైజాం ఆలీ, బసాలత్ జంగ్‌లు ఫ్రెంచి వ్యతిరేక కూటమి నాయకులు. ఇది ఇలా ఉండగా హైదరాబాదులోని అరాజక పరిస్థితులు అవకాశంగా తీసుకొని మరాఠీ సైన్యాలు దేశాన్ని దోపిడీ దాడులకు గురి చేసినాయి. బుస్సీ మరాఠీ దాడులను తిప్పికొట్టి కుట్రదారులకు కేంద్రమైన దౌలతాబాదు నాక్రమించాడు. కాని అతని దివానైన హైదర్‌జంగ్‌ను నైజాం ఆలీ హత్య చేయించాడు. బుస్సీ కుడిభుజం కూలినట్లయింది. ఈ పరిణామాలన్నీ సలాబత్‌జంగ్, నైజాం ఆలీల మధ్య కలతలకు కారణమైనాయి.

ఇంతలో ఐరోపాలో ఇంగ్లండ్ ఫ్రాన్సులమధ్య ఏడు సంవత్సరాల యుద్ధం (1757-63) ప్రారంభమయింది. పుదుచ్చేరి గవర్నరైన లాలీ మద్రాస్‌పై పెద్దయెత్తున దాడి తలపెట్టి అందుకు బుస్సీ సహాయం అవసరమని అతణ్ణి హైదరాబాదునుండి పుదుచ్చేరి రావలసిందిగా ఆజ్ఞాపించాడు. తాను హైదరాబాదును వీడితే ఫ్రెంచి పలుకుబడి నశించగలదని బుస్సీ ఎంత వాదించినా ప్రయోజనం లేకపోయింది. 1758 జులైలో బుస్సీ హైదరాబాద్ విడిచి వెళ్ళాడు. అనతి కాలంలోనే బుస్సీ జోస్యం ఫలించింది. హైదరాబాదులో ఫ్రెంచి ప్రాబల్యం నశించి ఫ్రెంచివారిపట్ల ద్వేషం ప్రబలింది. సలాబత్‌జంగ్ రక్షణ కోల్పోయినాడు; నైజాం ఆలీ ఆశలు ఫలించి అవకాశం బలపడింది.

సప్త సంవత్సర సంగ్రామ ప్రారంభంలోనే బెంగాలులో నబాబు సురాజ్ ఉద్దౌలాకు, ఆంగ్లేయులకు మధ్య సంఘర్షణ జరిగింది. నబాబు కొలువులోని మీర్జాఫర్‌వంటి ఉద్యోగులు ద్రోహబుద్ధితో ఆంగ్లేయుల పక్షం చేరారు. వీరిని కూడగట్టుకొని రాబర్ట్ క్లైవ్ 1757 లో ప్లాసీ యుద్ధంలో సురాజ్ ఉద్దౌలా నోడించి పారదోలి మీర్జాఫర్‌ను బెంగాల్ నబాబుగా గద్దెనెక్కించాడు. కృతజ్ఞతతో క్లైవుకు 24 పరగణాలు (క్లైవు జాగీర్) ఇతర ఆంగ్లోద్యోగులకు పెద్ద పెద్ద నజరానాలు ఇచ్చి మీర్జాఫర్ సత్కరించాడు. బెంగాల్ నబాబు ఆంగ్లేయుల చేతి కీలుబొమ్మ అయినాడు. భారతదేశంలో ఆంగ్ల సామ్రాజ్యాధికారానికి అంకురార్పణ జరిగింది. బెంగాల్‌నుండి ఆంగ్ల సైన్యాన్ని సర్కారులపైకి పంపడానికి క్లైవు అవకాశం కోసం నిరీక్షిస్తున్నాడు.

సర్కారులనుండి ఫ్రెంచి వారిని తరిమివేయాలని స్థానిక జమీందారులు ఆంగ్లేయులతో సహకరించడానికి సంసిద్ధులైనారు. వీరిలో విజయరామరాజు

మరణానంతరం విజయనగర జమీందారైన ఆనందగజపతిరాజు ముఖ్యుడు. విజయరామరాజు హత్యలో బుస్సీకి ప్రమేయం ఉన్నట్లు వ్యాపించిన వదంతితో అతని నిర్ణయం బలపడి మద్రాస్ గవర్నర్‌తోను బెంగాల్‌లోని క్లైవుతోను ఉత్తర ప్రత్యుత్తరాలు సాగించాడు. ఇది సదవకాశంగా గ్రహించి ఫోర్డు సేనాని నాయకత్వంలో ఒక సైన్యాన్ని క్లైవు సర్కారుల పైకి పంపాడు. ఈలోగా, ఆనందగజపతి విశాఖపట్టణాన్ని ఫ్రెంచివారినుండి ఆక్రమించాడు. ఫోర్డు, గజపతి సమాధానం కుదుర్చుకొని రాజమహేంద్రవర ఫ్రెంచి స్థావరంపై దండెత్తినారు. చందుర్తి దగ్గిర జరిగిన యుద్ధంలో (7-12-1758) ఫ్రెంచి సైన్యం పరాజయం పొంది ఫ్రెంచి సైనికులు అధిక సంఖ్యలో ఖైదీలుగా పట్టుబడ్డారు. రాజమహేంద్రవరం ఆంగ్లేయుల వశమయింది. దీనితో సర్కారుల్లో ఆంగ్లేయాధికార స్థాపనకు సుగమ మార్గమేర్పడింది; అంతేగాక ఇతర హైదరాబాద్ ప్రాంతాలనుండి సర్కారులను ప్రత్యేకించి మద్రాస్‌లో చేర్చడానికి ఆంగ్లేయులకు అవకాశం కల్పించింది. చందుర్తి యుద్ధమని చరిత్రకారుల అభిప్రాయం. మార్గమధ్యంలో నర్సాపూర్‌ను ఆక్రమించి, గజపతి, ఫోర్డు సైన్యాలు మచిలీపట్టణంపై దండెత్తినాయి. నెలరోజుల ముట్టడి అనంతరం మచిలీపట్టణం ఫోర్డు వశమయింది (8-4-1759). ఈలోగా సలాబత్‌జంగ్ మచిలీపట్టణం చేరినాడు. నైజాం అలీ ఖాన్ ఆంగ్లేయులనభినందిస్తూ జాబులు వ్రాసినాడు. సర్కారుల్లో ఫ్రెంచివారి పలుకుబడి అస్తమించింది. సలాబత్‌జంగ్ ఆంగ్లేయులతో ఒప్పందం చేసుకొని (14-5-1789) వారికి మచిలీపట్టణం, నిజాం పట్టణం, కొండవీడు, అకులమన్నాడు సర్కారులను బహూకరించాడు. ఫ్రెంచివారి పక్షం వహించనని సలాబత్‌జంగ్ వాగ్దానం చేశాడు; అతనికి అండగా ఉండడానికి ఆంగ్లేయులు అంగీకరించారు. ఈ (మచిలీపట్టణం) సంధియే ఆంగ్లేయులకు హైదరాబాద్ సుబాదారుకు మధ్య జరిగిన మొదటి ఒప్పందం; హైదరాబాదులో ఆంగ్ల ప్రాబల్యానికి గట్టి పునాది వేసింది.

దక్షిణదేశంలో కూడ లాలీ బుస్సీల ప్రయత్నాలు ఫలించలేదు. ఆంగ్లేయులు ఫ్రెంచి సైన్యాలను వందవాసి యుద్ధంలో (1761) ఓడించి పుదుచ్చేరి నాక్రమించారు. లాలీని బందీగా పట్టుకొని ఇంగ్లండు పంపారు. పారిస్ సంధితో (1763) సప్త సంవత్సర సంగ్రామం ముగిసింది. ఇండియాలో ఫ్రెంచి ప్రాబల్యం అంతరించింది. తరువాత ఫ్రెంచి విప్లవ సమయంలోను (1789-1804) నెపోలియన్ యుద్ధాల కాలంలోనూ (1804-1814) ఫ్రెంచి

సైనికోద్యోగులు మైసూరు, మరాటా ప్రభువులతోచేరి వారిని ఆంగ్లేయులపైకి పురికొల్పారు. కాని దేశంలో పాదుకొంటున్న ఆంగ్లాధికారానికి ప్రయత్నాలు ప్రమాదంగా పరిణమించడానికి బదులు పరోక్షంగా విస్తరణకు దోహదంచేసినాయి.

## ఆంధ్రదేశంలో ఆంగ్లాధికారం

### ఉత్తర సర్కారుల ఆక్రమణ

హైదరాబాద్ సుబా మొదటినుండి మరాటీ దాడులకు గురి అవుతూ వచ్చింది. పేష్వా విశ్వనాథ్ పాదుషాతో చేసుకొన్న ఒడంబడికవల్ల చౌత్‌కూడ చెల్లించవలసి వచ్చింది. చౌత్ వసూలును ప్రతిఘటించడానికి సుబాదార్ చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. మరాటీ దాడులవల్ల ప్రజలకు సుఖశాంతులు కరువయినాయి. ఈ పరిస్థితులే హైదరాబాద్ ప్రభువులు ఫ్రెంచి ఇంగ్లండు సైనిక సహాయంపై ఆధారపడడానికి ముఖ్య కారణమైనాయి. సలాబత్‌జంగ్ వ్యక్తిగతంగా బలహీనుడు. మహారాష్ట్రులతో యుద్ధాల్లోను, కుటుంబ కలహాల్లోనూ హైదరాబాద్ సైన్యం చాలావరకు క్షీణించింది. అతనికి, తమ్ముడైన నైజాం అలీ, బసాలత్‌జంగ్‌లకూ మధ్య సదవగాహన లేదు. అందుచేత సలాబత్‌జంగ్ ఫ్రెంచి సైనిక సహాయంపై పూర్తిగా ఆధారపడి బుస్సీ చేతిలో కీలుబొమ్మ అయినాడు. అయితే బుస్సీ కుటిల రాజనీతిలో సమర్థుడు. దేశంలో బలాధికులైన మహారాష్ట్రులకు వ్యతిరేకంగానే హైదరాబాద్‌ను బలపరచవలె. కాని సలాబత్‌జంగ్ బలపడి ఆత్మవిశ్వాసం సాధించకూడదు; అతడు శాశ్వతంగా ఫ్రెంచి సహాయంపై ఆధారపడాలి అన్న ఆశయంతో బుస్సీ రహస్యంగా మహారాష్ట్రులతో మంతనాలు సాగిస్తూ వారిని హైదరాబాదుపై పురికొల్పేవాడు. బుస్సీ కుదిర్చిన భాల్కీ-ఒడంబడికవల్ల బీరార్ పశ్చిమ ప్రాంతాలను హైదరాబాద్ కోల్పోయింది. మరొక మారు 1760 లో నైజాం అలీ మహారాష్ట్రపై దండెత్తి పరాజయం చెంది ఉద్గిర్ సంధిలో మహారాష్ట్రులు విధించిన నిబంధనలు అంగీకరించక తప్పలేదు. అయితే మూడోసారి పానిపట్ యుద్ధం (1761) మహారాష్ట్ర సామ్రాజ్యవాదానికి గొడ్డలి పెట్టయింది. వారి సైన్యం సర్వనాశనమయింది. వారి నాయకులందరూ హతులయినారు. ఇది అవకాశంగా తీసుకొని పూర్వ పరాజయాలకు ప్రతీకారం చేయడానికి సలాబత్‌జంగ్, నైజాం అలీలు చేసిన ప్రయత్నాలు సయితం ఫలించలేదు.

నైజాం అలీ కూడ సమర్థుడు కాదు. అతడు తీవ్రమైన సమస్యలు ఎదిరించాల్సి వచ్చింది. హైదరాబాద్ శత్రుపరివేష్టితం. ఉత్తరం నుండి నిరంతరం మహారాష్ట్రుల దోపిడీ దురాక్రమణ దాడులు జరిగేవి 1760 నుండి

మైసూర్‌లో హైదర్, టిప్పులు బలవంతులై దురాక్రమణకు పూనుకున్నారు. నైజాం అలీ తమ్ముడు కొండవీడు నబాబునైన బసాలత్ జంగ్ హైదర్‌తో చేతులు కలిపినాడు. సర్కారుల్లో ఎదురుతిరుగుతున్నారు. నైజాం అలీకి ఫ్రెంచి వారిపట్ల గానీ ఆంగ్లేయులపట్ల గానీ సుహృద్భావం లేదు. ఫ్రెంచి బెడద తప్పింది. కాని ఆంగ్లేయుల వత్తిడి తీవ్రతరం కాసాగింది. అందుచేతనే నైజాం అలీ విధానాలు నిలకడలేనివిగా కన్పిస్తాయి.

నైజాం అలీ గద్దెకెక్కిన వెంటనే సర్కారులపై దృష్టి మరలించాడు. జమీందార్ల అంతఃకలహాలవల్ల సర్కారుల్లో అరాజకం చెలరేగింది. ఆనంద గజపతి మరణించడంతో (1760) విజయనగరం జమీందారైన విజయరామరాజు బాలుడు. ఆనంద గజపతి తమ్ముడు సీతారామరాజు జమీందారును ప్రతిఘటించి రాజ్యంలో అలజడి సృష్టిస్తున్నాడు. నైజాంకు చెల్లించాల్సిన శిస్తు మూడు సంవత్సరాలుగా బకాయి పడింది. నైజాం అలీ విజయరామరాజును జమీందారుగా గుర్తించి సీతారామరాజును దివాన్‌గా నియమించాడు. చికాకోల్ పరగణాపై శిస్తు వసూలు అధికారం వారికి అప్పగించాడు. ఈ సందర్భంలోనే ఆంగ్లేయులకు సర్కారులను దత్తం చేస్తూ సలాబత్ జంగ్ జారీచేసిన సనద్‌లను నైజాం అలీ చేత ఖరారు చేయించడానికి ఆంగ్లేయులు ప్రయత్నించారు. మహారాష్ట్రులతో తాను జరిపే ప్రతీకార యుద్ధాల్లో ఆంగ్లసైనిక సహాయాన్ని సర్కారులకు నిబంధనగా నైజాం సూచించాడు. మహారాష్ట్ర బలాన్ని అణచడం ఆంగ్లేయులకు కూడ ముఖ్యమే; కాని మూడో కర్ణాటక యుద్ధంలో నిమగ్నులై వున్నందున నైజాం నిబంధనను ఆంగ్లేయులు అంగీకరించలేదు. అందుచేత సర్కారుల్లో శిస్తు వసూలుచేసే అధికారాన్ని హుస్సేన్ అలీఖాన్ పరం చేసి నైజాం హైదరాబాద్‌కు మరలినాడు. హుస్సేన్ అలీ అసమర్థతను అవకాశంగా తీసుకొని ఆతనికి సహాయంగా సైన్యాన్ని పంపి ఆంగ్లేయులు సర్కారుల నాక్రమించే ప్రయత్నం చేశారు. సీతారామరాజు ఆగడాలు మితిమీరి చికాకోల్ సర్కారు మరాటీ దాడికి గురి అయింది. పరిస్థితులను చక్కదిద్దడానికై నైజాం అబ్దుల్ రహ్మాన్‌ఖానును నియమించాడు.

సర్కారుల నుండి ఆంగ్ల సైన్యాలను మరలించాలని అబ్దుల్ రహ్మాన్, సర్కారులను సాధించాలని ఆంగ్లేయులు ప్రయత్నించారు. సర్కారులను ఆంగ్లేయులు సాధించడంలో కాంద్రేగుల జోగిపంతులు చాలా సహాయం చేశాడు. జోగిపంతులు రాజమహేంద్రవరం జమీందారీ వంశంవాడు. 1759 నుండి మచిలీపట్టణం ఫాక్టరీ అధికారికి దుబాసిగా స్థానిక వ్యవహారాల్లో సలహాదారుగా

కంపెనీ ఉద్యోగంలో ప్రవేశించాడు. కంపెనీ నైజాంల మధ్య జరిగిన సంప్రదింపులు జోగిపంతులు నిర్వహించినవే. అతడు సాధించిన మొదటి ఒడంబడిక రహ్మాన్‌తో. ఆ ఒడంబడిక ప్రకారం సర్కారుల నుండి కంపెనీ తన సైన్యాలను ఉపసంహరించుకొంటుంది. నాటివరకు ఆ సైన్యానికయిన వ్యయాన్ని నైజాం చెల్లిస్తాడు. ఈలోగా నైజాంకు ప్రతికూలంగా కంపెనీకి అనుకూలంగా కొన్ని పరిణామాలు జరిగినాయి. విజయనగరం దివాన్ సీతారామరాజు జమీందారుని నామమాత్రుని చేసి రాజమహేంద్రవరం కేంద్రంగా తన బలాన్ని పెంచుకో సాగినాడు. అబ్దుల్ రహ్మాన్ గానీ, చికాకోల్ ఫౌజుదార్ ఫతేఉద్దౌలా గానీ సీతారామరాజును అణచలేకపోయినాడు. సర్కారులపై అబ్దుల్ రహ్మాన్ స్థానంలో తిరిగి హుస్సేన్ అలీ నియామకం జరిగింది. ఇదే సమయంలో కంపెనీ జోగిపంతులుకు హైదరాబాద్ రాయబారం పంపింది. కంపెనీ సూచనలు నైజాం అలీ తిరస్కరించాడు. అయితే, జోగిపంతులు హుస్సేన్ అలీతో ఒప్పందం కుదుర్చుకున్నాడు. సీతారామరాజు నణచి సర్కారుల్లో శాంతిభద్రతలు నెలకొల్పడానికి, జమీందార్ల నుండి శిస్తు బకాయిలు వసూలు చేయడానికి కంపెనీ సైనిక సహాయం చేస్తుంది; సైన్యపోషణ ఖర్చును నైజాం భరిస్తాడు. ఈ ఒప్పందమే చివరకు నైజాంతోటి ఒప్పందానికి నాంది అయింది.

ఉత్తర భారతంలో 1764 లో బక్సార్ యుద్ధం జరిగింది. ఇది కంపెనీకి చాలా ప్రతిష్ఠాత్మకమైన యుద్ధం. మొగల్ పాదుషా షా అలీ అతని దివానూ అయోధ్య నబాబూనైన షుజాఉద్దౌలా బెంగాల్ నబాబైన మీర్కాసీమూ కంపెనీ చేతిలో ఓడిపోయినారు. చక్రవర్తి ఇంచుమించు కంపెనీకి బందీ అయినాడు. దేశంలో కంపెనీ ప్రతిష్ఠ తారాస్థాయికి చేరింది. ఇండియాకు మరలివచ్చిన రాబర్ట్ క్లైవు పాదుషాతో అల్లహాబాద్ సంధి చేసుకున్నాడు (1765). ఆ సంధి ప్రకారం సర్కారులను ఆంగ్లేయులకు దత్తం చేయడాన్ని ఖరారు చేస్తూ సనద్‌లు జారీ అయినాయి. సర్కారులపై ఆంగ్లేయుల హక్కు బలపడింది.

పాదుషా సనదులను ప్రతిఘటించడానికి నైజాం అలీ ప్రయత్నించాడు. కాని మైసూర్, మహారాష్ట్ర, హైదరాబాద్ రాజ్యాల మధ్య ద్వేషాసూయలు నానాటికీ తీవ్రతరం కాసాగినాయి. 1763లోనే మహారాష్ట్రులతో రక్షాభువన్ దగ్గర జరిగిన యుద్ధంతో నైజాం అలీ పరాజయం పొంది ప్రతికూలమైన సంధి షరతులను అంగీకరించవలసి వచ్చింది. మహారాష్ట్రులకు వ్యతిరేకంగా మైసూర్, హైదరాబాద్, కంపెనీలతో త్రిపాక్షిక కూటమిని హైదరాలీ సూచించాడు. కాని దానివల్ల హైదరాలీ బలపడగలడని నైజాం తిరస్కరించాడు. మైసూర్,

మహారాష్ట్ర రాజ్యాలు నిరంతరం జరుపుతున్న దోపిడి, దురాక్రమణ దాడులవల్ల ఆంగ్లేయుల సైనికావసరాన్ని నైజాం ఆలీ గుర్తించసాగినాడు.

కంపెనీ సయితం సంప్రదింపులు సాగిస్తూ బలప్రదర్శనం ద్వారా సర్కారులను ఆక్రమించడానికి ఉపక్రమించారు. మచిలీపట్టణం నుండి జోగి పంతులు హైదరాబాద్ చేరాడు. మరొకవైపు కైలాడ్ సేనాని తన సైన్యంతో కొండపల్లి దుర్గాన్ని ఆక్రమించి నైజాంతో సంప్రదింపులు ప్రారంభించాడు. ఈలోగా జోగిపంతులు హుస్సేన్ ఆలీల మధ్య సర్కారులలో శిస్తు వసూలును గురించి మూడు సంవత్సరాల ఒప్పందం కుదిరింది. కైలాడ్ కొండపల్లి ఆక్రమణ సమాచారం తెలిసిన నైజాం ఆలీ మచిలీపట్టణానికి బయలుదేరాడు. అతని వెంట జోగిపంతులున్నాడు. నైజాం ఆలీ గొల్లపూడి ప్రాంతానికి చేరుకున్నాడు. నాటికీ బకాయి వున్న జీతం చెల్లించవలెనని నైజాం ఆలీ సైన్యం తిరుగుబాటు చేసింది. సమయం కనిపెట్టి జోగిపంతులు కంపెనీ నుండి 7 లక్షలు తీసుకొని సర్కారులను కంపెనీకి కవులుకు ఇవ్వవలసిందిగా ప్రోత్సహించాడు. గత్యంతరం లేక పై ఒప్పందం ఆధారంగా, నైజాం ఆలీ కైలాడ్‌తో 1766 నవంబర్‌లో సంధి చేసుకున్నాడు. చికాకోల్, రాజమండ్రి, ఏలూరు, ముస్తఫా నగర్ సర్కారులను నైజాం కంపెనీకి దత్తం చేశాడు; నైజాం కోరినప్పుడు కంపెనీ సైనిక సహాయం చేయవలె. బసాలత్‌జంగ్ మరణానంతరం మూర్తజా నగర్ కంపెనీ పరమవుతుంది. పై నాల్గు సర్కారులకు కంపెనీ 7 లక్షలు కప్పంగా చెల్లించవలె. దీన్ని 'పరస్పర స్నేహ సహకార సంధి'గా వర్ణించారు. ఆంధ్రదేశంలో సారవంతమై, ఐశ్వర్యవంతమైన ప్రాంతం ఆంగ్లేయుల స్వాధీనమయింది. ఈ వ్యవహారంలో ప్రముఖ పాత్ర వహించిన జోగిపంతులుకు 'రాజా' బిరుదంతోబాటు ముజుందార్, షేర్ సిరస్తాదార్ ఉద్యోగాలేకాక రాజమహేంద్రవర సర్కారు నబాబుకు సహోద్యోగిగా నియమించి కంపెనీ గౌరవించింది.

## గుంటూరు సర్కారు

గుంటూరు సర్కారును సాధించడానికి సయితం కంపెనీ విశ్వప్రయత్నం చేసింది; నైజాం కంపెనీని సాధ్యమైనంతవరకు ప్రతిఘటించాడు. పై సంధి జరిగిన వెంటనే నైజాం, కంపెనీ, పేష్వా (మాధవరావు)ల కూటమి మైసూర్‌పై దండెత్తింది. ఈ సందర్భంలో హైదరాలీ నైజామాలీలు రహస్య ఒప్పందం కుదుర్చుకున్నారు. కనీసం దక్షిణాపథం నుండి ఆంగ్లేయులను పారదోలడమే దాని ఆశయం. కొండవీడు నబాబైన బసాలత్‌జంగ్ సయితం

హైదరాలీతో మంతనాలు జరుపుతూ తన కొలువులో ఫ్రెంచి సైనికాధురలను నియమించసాగినాడు. వీరి చర్యలను గ్రహించిన కంపెనీ నైజాం అలీని తొలగించే ప్రయత్నం చేసింది. కంపెనీ సైన్యం ఖమ్మమ్మెట్టు దుర్గాన్ని ఆక్రమించి హైదరాబాద్‌పై పురోగమించే సన్నాహంలో వుంది. నైజాం అలీ తన నిస్సహాయతను గుర్తించి కంపెనీతో (మద్రాస్) సంధి చేసుకొని (1768) కర్ణాటకంపై తన హక్కులు వదులుకొని బసాలత్‌జంగ్‌ను అదుపులో వుంచే ప్రయత్నం చేశాడు.

ఈలోగా హైదరాలీ విజృంభించి (1774-78) గుత్తి, బళ్లారి, కడప, కర్నూలు, అదోని, కంభములను ఆక్రమించాడు. కృష్ణా, తుంగభద్రా, అంతర్వేదిలో చాలా ప్రాంతాలాతని వశమయినాయి. హైదర్ దురాక్రమణలతో బసాలత్‌జంగ్ సయితం ఆందోళన చెందాడు. ఇది అవకాశంగా తీసుకొని, మద్రాస్ గవర్నరైన రుంబోల్డ్, బెంగాల్ గవర్నర్ జనరలైన వారన్ హేస్టింగ్సును సయితం లక్ష్యం చేయక, 1779 లో బసాలత్‌జంగ్‌తో సంధి చేసుకొని గుంటూరు సర్కారును స్వాధీనం చేసుకొని కర్ణాటక నవాబుకు 10 సంవత్సరాల కౌలుకు ఇచ్చాడు.

రుంబోల్డ్ చర్య నైజాం అలీ ఆగ్రహానికి కారణమయింది. కంపెనీపై యుద్ధానికి ఆయత్తం కండని కిలాదారులను ఆజ్ఞాపించాడు. ఇదే సమయంలో మహారాష్ట్ర రాజకీయాల్లో ఆందోళన చెలరేగింది. పేష్వా నారాయణరావును హత్యచేసి, పినతండ్రి రఘునాథరావు పేష్వాగా ప్రకటించుకున్నాడు. రగోబాను ప్రతిఘటించి, నానా ఫడ్నవీస్ నాయకత్వంలో బారాబాయ్ కూటమి పసివాడైన రెండో మాధవరావును పేష్వాగా ప్రకటించింది. రగోబా బొంబాయిలోని కంపెనీ అధికారులతో సూరత్‌సంధి (1775) చేసుకొని వారి సాయం సంపాదించాడు. సూరత్ సంధికి వ్యతిరేకంగా నానా ఫడ్నవీస్ నైజాం అలీ, హైదర్ అలీలతో కలిసి త్రైపాక్షిక కూటమిని సిద్ధం చేశాడు. ఆంగ్లేయుల అధికారానికి పెద్ద ప్రమాదం ఏర్పడింది.

వారన్ హేస్టింగ్స్ ప్రమాదాన్ని గుర్తించి త్రైపాక్షిక కూటమి విచ్ఛిన్నానికి ప్రయత్నించాడు. అతని ఆదేశానుసారం మద్రాస్ ప్రభుత్వం గుంటూరు సర్కారును బసాలత్‌జంగ్‌కు పునరుద్ధరించింది. నైజాం అలీ త్రైపాక్షిక కూటమి నుండి తప్పుకొనడంతో వారన్‌హేస్టింగ్స్ పథకం ఫలించి కూటమి విచ్ఛిన్నమయింది. మొదటి మహారాష్ట్ర యుద్ధంలో ఆంగ్లేయులు విజయం సాధించారు.

బసాలత్‌జంగ్ 1782 లో మరణించాడు. కానీ నైజాం అలీ గుంటూరును

కంపెనీ పరం చేయడానికి నిరాకరించాడు కాని మైసూర్‌లో ఫ్రెంచి ప్రాబల్యం పెరుగుతున్నందున, టిప్పు నైజాం ఆలీలు ఆంగ్ల వ్యతిరేక కూటమిగా ఏర్పడే ప్రమాదం ఉన్నందున గవర్నర్ జనరల్ కారన్‌వాలీసు సత్వరచర్య తీసుకోలేక పోయినాడు. 1788 నాటికి పరిస్థితులు మారినాయి. నైజాం ఆలీ టిప్పుకు వ్యతిరేకంగా మహారాష్ట్రులతో చేరినాడు. ఐరోపాలో ఇంగ్లండు ఫ్రాన్స్‌లమధ్య సమాధానం కుదిరింది. పరిస్థితి గమనించిన కారన్‌వాలీస్ బెదరింపుకు లొంగి నైజాం ఆలీ గుంటూరును (1788 జూలై) ఆంగ్లేయుల స్వాధీనం చేశాడు.

ఆంగ్లేయుల దౌర్జన్యాలను దురాక్రమణలను నైజాం ఆలీ సహించలేక పోయినాడు. కంపెనీపై ఆతని ఆగ్రహద్వేషాలు తారాస్థాయికి చేరినాయి. పుదుచ్చేరిలోని ఫ్రెంచి వారితో మంతనాలు ప్రారంభించాడు. నైజాం ఆలీ, టిప్పు సుల్తాన్‌లమధ్య సమాధానం కుదర్చడానికి ఫ్రెంచివారు ప్రయత్నించారు. శ్రీరంగపట్టణం, హైదరాబాద్‌ల మధ్య అనేక రాయబారాలు నడిచినాయి. అహంకారంతో అసఫ్‌జా వంశ రాకుమార్తెను తనకిచ్చి పెండ్లి జరిపినప్పుడే నైజాం ఆలీతో మైత్రి సంభవమని టిప్పు పట్టు పట్టడంతో ఈ ప్రయత్నాలు ఫలించలేదు.

టిప్పు సుల్తాన్ సాగిస్తున్న ఆంగ్ల వ్యతిరేక చర్యలను కారన్‌వాలీస్ సహించలేకపోయినాడు. పిట్టు ఇండియా చట్టం నిర్దేశించిన తటస్థ విధానాన్ని కారన్‌వాలిస్ బలపరిచాడు. కాని ఆ విధానంవల్ల కంపెనీ శ్రేయస్సులకు భంగం కలగరాదని ఆతని ఆశయం. కంపెనీ శ్రేయస్సుల రక్షణకు టిప్పుతో యుద్ధం తప్పదని గ్రహించిన కారన్‌వాలిస్, మహారాష్ట్రులతో, నైజాం ఆలీతో కలిసి టిప్పు వ్యతిరేక త్రైపాక్షిక కూటమిని రూపొందించడానికి ప్రయత్నించాడు. హైదరాలీ, టిప్పులు ఆక్రమించిన ఆదోని, కర్నూలు ప్రాంతాలను తిరిగి ఆక్రమించవచ్చునని ఆశతో నైజాం ఆలీ టిప్పు వ్యతిరేక కూటమిలో చేరి, 25 వేల సైన్యంతో మైసూరుపై దండెత్తాడు. మిత్రకూటమి సైన్యాలు శ్రీరంగపట్టణాన్ని ముట్టడించడంతో టిప్పు సంధి చేసుకొని తన రాజ్యంలో సగభాగం మిత్ర కూటమికి దత్తం చేశాడు. గుర్రంకొండ, కడప, గండికోట, కంబం, బళ్ళారి జిల్లాలు, కృష్ణాతీరంలో భద్రా అంతర్వేది నైజాం పరమయినాయి; కర్నూలును మాత్రం నైజాం పరం చేయడానికి టిప్పు అంగీకరించలేదు.

మూడో మైసూర్ యుద్ధానంతరం మహారాష్ట్రులకు నైజాంకు మధ్య సంఘర్షణ ప్రారంభమయింది. మహారాష్ట్ర నాయకులైన నానాఫడ్నవీస్, మహదాజీ సింధియాలమధ్య జాతినాయకత్వానికై పోటీ ఉన్నంతకాలం నైజాంకు

మహారాష్ట్రుల బెడద తప్పింది. బీరార్‌ను గురించి సింధియా నైజాంల మధ్య అభిప్రాయభేదాలు రావడంతో ఉభయులమధ్య స్నేహ సంబంధాలు క్షీణించినాయి. మహారాష్ట్ర నాయకులు సమైక్యమై నైజాం బకాయిపడిన చౌత్ సర్‌దేశ్‌ముఖి మొత్తం చెల్లించవలెనని పట్టుబట్టారు. మహారాష్ట్రులు యుద్ధానికి దిగరనీ, యుద్ధమే సంభవిస్తే ఆంగ్లేయుల సహాయం తనకు లభిస్తుందని నమ్మకంతో దివాన్ అజీం ఉల్ ఉమ్రా ప్రోత్సాహంతో నైజాం మహారాష్ట్రుల కోరికను తిరస్కరించాడు. కారన్‌వాలీస్ తరువాత గవర్నర్ జనరలైన సర్ జాన్ షోర్ తటస్థ విధానాన్ని తు.చ తప్పక అనుసరించడానికి నిర్ణయించి నైజాం అలీ కోరికను నిరాకరించాడు. మహారాష్ట్రులు 1794 లో నైజాంపై యుద్ధం ప్రకటించారు. ఉభయ సైన్యాలకు ఖర్దా దగ్గిర యుద్ధం జరిగింది (11-3-1795). నైజాం అలీ ఓడిపోయి సుమారు 35 లక్షల ఆదాయం వచ్చే దౌలతాబాద్, అహమ్మద్‌నగర్, షోలాపూర్ ప్రాంతాలను, యుద్ధ నష్ట పరిహారంగా 3 కోట్ల రూపాయలనూ మహారాష్ట్రులకిచ్చి సంధి చేసుకొన్నాడు.

నైజాం అలీకి ఆంగ్లేయులపట్ల ద్వేషం మితిమీరింది. ఖర్దా పరాభవానికి ఆంగ్లేయుల మిత్రద్రోహమే కారణమనే ఉద్దేశంతో తన కొలువులోని ఆంగ్ల పటాలాలను బర్తరఫ్‌చేసి ఫ్రెంచి సేనాని రేమండ్ నాయకత్వంలో ఫ్రెంచి పటాలాలను పెంచుకున్నాడు. హైదరాబాదులోని ఇంగ్లీష్ రెసిడెంట్ కిర్క్‌పాట్రిక్ నిస్సహాయుడైనాడు. సర్‌జాన్‌షో తటస్థ విధానం ఆంగ్లేయుల బలహీనతకు నిదర్శనంగా భావించి మహారాష్ట్ర నాయకులు సయితం ఫ్రెంచి సైనికోద్యోగులను నియమించిన తమతమ సైన్యాలకు శిక్షణనిప్పించసాగినారు. దేశం సర్వత్రా ఆంగ్ల వ్యతిరేకత ఫ్రెంచివారిపట్ల అభిమానమూ ప్రబలసాగినాయి.

## దత్త మండలాలు

సర్‌జాన్ షోర్ స్థానంలో గవర్నర్ జనరలైన లార్డ్ వెల్లస్లీ సామ్రాజ్య వాదం మూర్తీభవించిన అధికారి. భారతదేశంలో బ్రిటిష్ సామ్రాజ్య విస్తరణయే లక్ష్యంగా కృషి చేసినాడు. నాడు ఐరోపాలో నెపోలియన్ యుద్ధాలు ముమ్మరంగా సాగుతున్నాయి. "ఆంగ్లేయులు దుకాణదారుల జాతి" అని నెపోలియన్ అభిప్రాయం. వాణిజ్యమే ఆంగ్లేయుల బలానికి కారణం. వారిది వాణిజ్య సామ్రాజ్యం. దానికి ఇండియా కీలకమయింది. అందుచే ఇండియాను జయిస్తే ఆంగ్ల సామ్రాజ్యం విచ్ఛిన్నం కాక తప్పదు అనే అభిప్రాయంతో నెపోలియన్ ఇండియాపై దండెత్తే సన్నాహాలు చేస్తున్నాడనే వదంతి వ్యాపించి ఉంది. ఆ పరిస్థితుల్లో ఇండియాలో ఫ్రెంచివారి గౌరవం పెరగడం ఆంగ్లాధికారానికి పెద్ద

ప్రమాదం. అందుచే ఇండియానుండి ఫ్రెంచి పటాలాలను పారదోలి ఆంగ్లాధికారాన్ని సుస్థిరంచేసి విస్తరింప చేయడానికై వెల్లస్లీ నిర్ణయించి అందుకు సాధనంగా సైన్య సహకార సంధి విధానాన్ని రూపొందించినాడు. ఆంగ్ల సామ్రాజ్య విస్తరణకు సైన్య సహకార విధానం తోడ్పడినట్లు మరే విధానమూ తోడ్పడలేదని చెప్పవచ్చు. ఆ విధానం విజయవంతం కావడానికి భారత రాజకీయాల్లో అనైక్యము భారతీయ ప్రభువులమధ్య అంతఃకలహాలు కారణము. సైన్య సహకార ఒప్పందం చేసుకొన్న స్వదేశ ప్రభువు తన కొలువులోని ఆంగ్లేతర ఐరోపాదేశ ఉద్యోగులను బర్తరఫ్ చేయవలె; ఆంగ్ల సైన్యాన్ని తన రాజ్యంలో నిలుపుకొని దానికగు ఖర్చు భరించవలె; తన ఆస్థానంలోని ఆంగ్ల ఉద్యోగి (Resident) ద్వారా మాత్రమే పొరుగు రాజ్యాలతో లావాదేవీలు జరుపుకోవలె; ఆంగ్లేయుల అనుమతితోనే యుద్ధాలుగానీ ఒడంబడికలుగానీ చేసుకోవలె. ఒక్క మాటలో ఈ ఒప్పందం చేసుకొన్న ప్రభువులు భారతీయులకు సామంతులవుతారు. దీనివల్ల ఆంగ్లేయులకు కొత్త సైనిక స్థావరాలేర్పడుతాయి; సైనిక సరిహద్దులు విస్తరించి సామ్రాజ్య విస్తరణకు అనుకూల వాతావరణం ఏర్పడుతుంది.

టిప్పు సుల్తాన్ ఆంగ్లేయులకు ప్రమాదంగా పరిణమించినట్లు వెల్లస్లీ గుర్తించాడు. శ్రీరంగపట్టణ సంధి తర్వాత ఆంగ్లేయులపై ప్రతీకారం తీర్చుకోడానికై టిప్పు సర్వవిధాలా ప్రయత్నిస్తున్నాడు. తన సైన్యంలో ఫ్రెంచి పటాలాలను ఫ్రెంచి నెపోలియన్‌తో సంప్రదింపులు సాగిస్తున్నారు. ఫ్రెంచివారి అభిమానం సంపాదించడానికై విప్లవకారులు ధరిస్తున్న టోపీ ధరించి తన రాజధానిలో జాకోబిన్ క్లబ్ స్థాపించాడు. ఈ చర్యలవల్ల టిప్పుతో యుద్ధం తప్పదనే అభిప్రాయంతో నైజాం అలీతో సంధికి నిర్ణయించి అతనికి సైన్య సహకార ఒప్పందాన్ని వెల్లస్లీ సూచించాడు. నైజాం అలీకూడ ఆంగ్లేయులతో దృఢమైన మైత్రికి సంసిద్ధమై ఉన్నాడు. దేశంలో ఫ్రెంచివారి బలం నానాటికి క్షీణిస్తున్నది; టిప్పు సుల్తాన్ దురహంకారి; మహారాష్ట్రుల దౌర్జన్యాలు, దురాక్రమణలు మితిమీరుతున్నాయి. వీరుభయులపై ప్రతీకారం తీర్చుకోడానికి హైదరాలీ టిప్పులు ఆక్రమించిన తన రాజ్యభాగాలు తిరిగి స్వాధీనపరుచుకోడానికి ఆంగ్లేయులతో మైత్రి ఒక్కటే సాధనం. అందుచే రెసిడెంట్ కిర్క్‌పాట్రిక్ సూచనపై 1798 సెప్టెంబర్‌లో నైజాం అలీ సైన్య సహకార సంధికి అంగీకరించాడు. సంధి ప్రకారం తన కొలువులోని ఫ్రెంచి ఉద్యోగులను నైజాం బర్తరఫ్ చేశాడు. హైదరాబాద్‌లో ఆంగ్ల సైనిక బలం పెరిగింది. ఆంగ్ల సైన్యం ఖర్చుకై నైజాం

2417 వేల రూపాయీలు చెల్లించడానికి అంగీకరించాడు. మహారాష్ట్రులతో లావాదేవీలు ఆంగ్లేయులద్వారా నిర్వహించడానికి అంగీకరించాడు. స్వతంత్ర ప్రతిపత్తిని కోల్పోయి హైదరాబాద్ బ్రిటిష్ రక్షిత రాజ్యంగా మారింది.

మహారాష్ట్రులు సైన్య సహకార సంధికిగానీ టిప్పుతో యుద్ధానికిగానీ అంగీకరించలేదు. వెల్లస్లీ, నైజాం ఆలీలు 1799లో టిప్పుపై యుద్ధం ప్రకటించారు. ఉభయుల సైన్యాలు శ్రీరంగపట్టణంపై నడిచి ముట్టడించినాయి. టిప్పు పరాజయం చెంది మరణించాడు. మైసూర్ సంధి ప్రకారం అనంతపురం, బళ్లారి, కడప, కర్నూలు, చిత్తూరు జిల్లాల ప్రాంతం నైజాం ఆలీ పరం చేయబడింది. మైసూర్‌లో వడయార్ రాజవంశాన్ని పునఃప్రతిష్ఠించారు. మైసూర్ కూడ బ్రిటిష్ రక్షిత రాజ్యం అయింది.

ఈ పరిణామాలతో ఆంగ్లేయులు బలపడడం మహారాష్ట్రులకు ఆందోళన కలిగించింది. అందుచే వారితో యుద్ధం తప్పదని గ్రహించిన వెల్లస్లీ నైజాం ఆలీతోటి సంబంధాన్ని బలపరచే ఆశయంతో 1800 లో మరొక సంధిని సూచించాడు. ఆ సంధి ప్రకారం హైదరాబాద్‌లో ఆంగ్ల పటాలాల సంఖ్య పెరిగింది. ఆంగ్ల పటాలాల ఖర్చుకై మైసూర్ సంధివల్ల తనకు సంక్రమించిన జిల్లాలను నైజాం ఆంగ్లేయులకు దత్తం చేశాడు. నాటినుండి ఆ ప్రాంతం "దత్తమండలం"గా ప్రసిద్ధమయింది. ఆంగ్లేయుల అనుమతి లేకుండా నైజాం ఎవరితోనూ యుద్ధం చేయడు, ఒడంబడికలు చేసుకోడు. ఈ సంధితో నైజాం ఆంగ్లేయులకు సామంతుడు (Subsidiary ally) అయినాడు. దత్తమండలాలు ఆంగ్లపాలన కిందికి వచ్చినాయి.

## నెల్లూరు

నెల్లూరు మండలం కర్ణాటక నబాబీలో భాగంగా ఉండేది. ఇంగ్లీషువారి సాయంతో మొహమ్మద్ ఆలీ కర్ణాటక నబాబైన తర్వాత అతని తమ్ముడు నజీబుల్లా నెల్లూరు పాలించేవాడు. అయితే సోదరుల మధ్య సఖ్యత లేదు. ఆర్థిక ఇబ్బందుల వల్ల నజీబుల్లా కర్ణాటక నబాబు అధికారాన్ని, నైజాం అధికారాన్ని ధిక్కరిస్తూ ఉండేవాడు. 1781 లో కర్ణాటకాన్ని ఆంగ్లేయులపరం చేయడానికి నైజాం సిద్ధమైనాడు. కాని స్థానిక ఫౌజుదార్లు, అమీర్‌దార్లు అంగీకరించలేదు. 1795లో మొహమ్మద్ ఆలీ మరణించి అతని కొడుకు ఉమ్దత్ ఉల్ ఉమ్రా నబాబయినాడు. ఉమ్రా ప్రజా కంటకుడు. అతడు టిప్పుతో సంప్రదింపులు జరుపుతున్నట్లు 1799 లో వెల్లస్లీకి తెలిసింది. అతనిపై చర్య తీసుకొనక పూర్వమే ఉమ్రా 1801 లో మరణించాడు. ఉమ్రా కుమారుడు ఆలీ

హాంస్సేన్‌కు అతని దాయాది అజీముద్దౌలాకుమధ్య వచ్చిన తగాదా అవకాశంగా తీసుకొని ఆంగ్లేయులు కర్ణాటకాన్ని తమ రాజ్యంలో లీనం చేశారు. అజీముద్దౌలాకు భరణం ఇచ్చి 'ఆర్కాటు నవాబ్' బిరుదు మాత్రం అనుమతించారు. నెల్లూరు మండలం ఆంగ్ల సామ్రాజ్యంలో చేరింది.

## యుగ విశేషాలు

ఆంధ్రదేశంలో 1802 నాటికి తిరిగి రెండు ప్రధాన విభాగాలేర్పడినాయి. కోస్తా జిల్లాలు దత్త మండలమూ కంపెనీ పాలన కిందికి వచ్చి మద్రాస్ రాష్ట్రంలో భాగాలయినాయి. తెలంగాణా ప్రాంతం కన్నడ మరాఠాప్రాంతాలతో కలిసి నైజాం సంస్థానంలో భాగమయింది. నైజాంలోని తెలంగాణా ప్రాంతాన్ని వరంగల్, మహబూబ్‌నగర్ సుబాలుగా విభజించారు. మద్రాస్ రాష్ట్రంలోని తెలుగు ప్రాంతాలను 'ఆంధ్ర' అనీ నైజాంలోని తెలుగు ప్రాంతాలను తెలంగాణమనీ అనడం సాధారణమయింది. ఈ విభజన ఏర్పడినప్పటి నుండి రెండు ప్రాంతాలలో పాలన విధానంలో సామాజిక సంస్కృతీ పరిణామాల్లో తీవ్రమైన వ్యత్యాసా లేర్పడినాయి. కారణాలేమయినప్పటికీ మద్రాస్ రాష్ట్రంలో వలస పాలకులు కొత్త పాలనా విధానాన్నీ ఆధునికీకరణకు తోడ్పడే అంశాలనూ ప్రవేశపెట్టడం జరిగింది. నైజాం సంస్థానంలో మధ్యయుగ భూస్వామ్య విధానమే కొనసాగింది.

## ఆంధ్రలో పరిణామాలు

ఆంధ్ర ప్రాంతంలో సర్కారులకు బదులు జిల్లాలేర్పడినాయి. చికాకోల్, రాజమండ్రి, ఏలూర్, ముస్తఫానగర్, మూర్తజానగర్ సర్కారులు గంజాం, విశాఖపట్టణం, గోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాలయినాయి. చాలకాలం కృష్ణా, గుంటూరు జిల్లాలు కలిసివుండేవి. 1801 లో కర్ణాటక నబాబు నుండి పల్నాడు గ్రహించి గుంటూరులో కలిపినారు. సర్కారు జిల్లాల్లో 1769 నుండి కంపెనీ ప్రభుత్వ విధానం అమలు జరిగింది. దత్త మండలాలను ప్రిన్సిపల్ కలెక్టర్ పాలనలో వుంచి అతని కింద బళ్ళారి, రాయదుర్గ్, అనంతపూర్, కడపలతో సహాయోద్యోగులను నియమించారు.

సర్కారు జిల్లాలలో 1794 లో కలెక్టర్ల నియామకం జరిగింది. జిల్లాలోని అధికారం కలెక్టర్లలో కేంద్రీకృతమయింది. కారన్ వాలీసు ప్రభువు ప్రభుత్వాధికారం నుండి న్యాయనిర్వహణాధికారాన్ని వేరుచేసి జిల్లా న్యాయాధికారులను నియమించాడు కాని ఆ విధానం ఎంతో కాలం అమలులో లేదు. కలెక్టర్

మేజిస్ట్రేట్ విధులు కూడా నిర్వహించేవాడు. జిల్లాలోని వైద్య, విద్య, మరమ్మతుల శాఖల అధిపతులు కలెక్టర్ పర్యవేక్షణలో పని చేసేవారు. ప్రతి జిల్లాలోను సివిల్, క్రిమినల్ కోర్టులు ఏర్పాటు చేశారు. బెంటిక్ ప్రభువుల కాలం నుండి న్యాయస్థానాలలో స్థానిక భాషలకు అనుమతి లభించింది. పన్నుల బకాయీలు, వారసత్వ తగాదాలవల్ల ప్రజలలో వ్యాజ్యబుద్ధి పెరిగి వ్యయ ప్రయాసలకు గురి అయినారు. ప్రతి జిల్లాలోను పోలీసుశాఖ కూడ ఏర్పడింది. గ్రామాలలోని కావలిగార్ల పద్ధతి మరుగున పడింది. చేతి వృత్తులు క్షీణించడం, స్థానిక సైన్యాలు బర్తరఫ్ కావడం వల్ల నిరుద్యోగం ప్రబలి దొంగతనాలు దోపిడీలు ఎక్కువయినాయి. వీటిని నిలుపు చేయడంలో విఫలం కావడమే కాక జిల్లా పోలీసు సిబ్బంది ప్రజాకంటకంగా తయారయినట్లు పరిశీలకుల అభిప్రాయం. "The Police establishment has become the bane and pest of the society, the terror of the community and the origin of half the misery and discontent that exists among the subjects of the govt. Corruption and bribery reign paramount through out the whole establishment; violence, torture and cruelty are their chief instruments for detecting crime, implicating the innocent and extorting money. Robberies are daily and rightly committed and unfrequently with their connivance."

జిల్లా పాలనా యంత్రాంగంలో చిన్న స్థాయి ఉద్యోగులు స్థానికులైన విద్యావంతులే. వీరి జీతాలు చాలా స్వల్పంగా ఉండేవి. అందుచేత వీరిలో లంచగొండితనం ప్రబలమయింది. ఈ పరిణామంవల్ల కూడ సాధారణ పౌర జీవితం కష్టనష్టాలకు గురి కాసాగింది.

కలెక్టర్ పదానికి (శిస్తు) వసూలుచేయువాడు అని అర్థం. శిస్తు వసూలుకు ప్రమాణంగానే జిల్లాలు ఏర్పడినాయి. అయితే రాబర్ట్ క్లైవ్ సూచించిన 'పరిమిత బాధ్యతా' (Limited responsibiliy) విధానాన్ని బట్టి. శిస్తు వసూలులో స్థానిక సంప్రదాయాలను కొనసాగించడానికి కంపెనీ నిర్ణయించి కుతుబ్ షాహీ, మొగల్ యుగాలలో శిస్తు వసూలు చేస్తుండిన జమీందార్లకే ఆ బాధ్యతలు అప్పగించింది. సర్కారు జిల్లాలలో జమీందార్లు, దత్త మండలాలలో పాళెగార్లు శిస్తు వసూలు చేయసాగినారు. 1793 లో కారన్‌వాలిస్ ప్రభువు బెంగాలులో ప్రవేశపెట్టిన శాశ్వత శిస్తు బందోబస్తు సర్కారులకు

(1800-1802) విస్తరింపజేశారు. 1801 లో జరిగిన నిర్ణయం ప్రకారం జమీందార్లకు ముత్తాదారీ (వారసత్వపు) హక్కులు సంక్రమించినాయి. శిస్తు వసూలు చేసే వుద్యోగులు భూస్వాములయినారు. రైతులు భూమిపై హక్కులు కోల్పోయి కేవలం జమీందారుల దయాదాక్షిణ్యాలపై ఆధారపడిన సేద్యగాండ్రు (కౌలుదార్లు) అయినారు.

శాశ్వత శిస్తు నిర్ణయం ప్రకారం జమీందార్లు కంపెనీకి చెల్లించాల్సిన మొత్తాలు నిర్ణయమయినాయి. రైతు జమీందారుకు చెల్లించాల్సిన మొత్తం నిర్ణయం కాలేదు. సాధారణంగా పంటలో సగం రైతునుండి వసూలుచేసి అందులో మూడోవంతు మాత్రం ప్రభుత్వానికి చెల్లించవలెనని తరతరాలుగా వున్న సంప్రదాయం. జమీందారులా సంప్రదాయాన్ని మన్నించలేదు. రైతులు జమీందారుల నిరంకుశత్వానికి బలి అయినారు. సర్కారులలో కొన్ని ప్రాంతాలలో ఐదింట నాల్గు వంతుల వరకు (బొబ్బిలి, నెల్లూరు) జమీందార్లు వసూలు చేసినట్లు తెలుస్తుంది. శిస్తు మాత్రమేగాక అనేక సందర్భాలలో నజరానాలు, మామూళ్లు రైతులు జమీందారుకు చెల్లించవలె. (ఈ మొత్తాలను ఎక్కువగానే నిర్ణయించారు. అయితే, జమీందార్లు, గ్రామోద్యోగులు ఏకమై గ్రామాలలో శిస్తు చెల్లించనక్కరలేని ఈనాము, మాన్యం భూముల విస్తీర్ణం పెంచి కంపెనీని మోసం చేయడం జరిగింది.) శిస్తు బకాయిపడిన రైతులను భూములనుండి తొలగించే హక్కు జమీందారుకు వున్నందున రైతులు నిస్సహాయులైనారు.

## జమీందార్ల తిరుగుబాటు

జమీందార్లలో చాలామంది సంప్రదాయక రాజ కుటుంబాలకు చెందిన వారు. ఆదినుండి వారికి ఆంగ్లేయుల పట్ల సద్భావం లేదు. రాజ మహారాజ బిరుదాలు ధరించి కొలువులు దీర్చే వీరికి కేవలం లాభదృష్టితో వ్యవహరించే కంపెనీ విధానాలు అవమానకరంగా వుండేవి. కంపెనీ వుద్యోగులకు స్థానిక సంప్రదాయాలు తెలియవు. భాషలతో పరిచయం లేదు. అందుచే 'దుబాసీ'లపై ఆధారపడేవారు. వీరు స్వార్థ బుద్ధితో వుభయ పక్షాలను మోసం చేస్తూండేవారు. వీరి చర్యలవల్ల ఉభయుల మధ్య అనుమాన ద్వేషాలు పెరిగేవి. ఫలితంగా తమ కుటుంబ గౌరవాన్ని హక్కులను రక్షించుకోడానికై సర్కారుల్లో చాలా మంది జమీందార్లు కంపెనీ విధానాలను ప్రతిఘటించి తిరుగుబాట్లు చేశారు. కంపెనీ పాలనవల్ల స్థానిక ఆటవిక జాతుల జీవిత విధానానికి భంగం వాటిల్లింది.

అందుచేత ముఖ్యంగా గంజాం ప్రాంతాల్లోని సవరులు, ఖోండులు తిరుగుబాటు జమీందార్లతో చేరి ఆంగ్లేయులతో పోరాడినారు. ఈ తిరుగుబాట్లలో ప్రధానమైనవి విజయనగరం, పర్లాకిమిడి, ఘుంసూర్, పాలకొండలలో జరిగినాయి.

## విజయనగరం (1794) :

కర్ణాటక యుద్ధకాలంలో విజయనగర పాత్రను పైన పరిశీలించినాము. ఆనందగజపతి అనంతరం గద్దెనెక్కిన విజయరామరాజు సమర్థుడు కాడు. అతని సవతి తమ్ముడు సీతారామరాజు ఇంగ్లీషువారి మద్దతుతో దివాన్ పదవిని ఆక్రమించగలిగాడు. ఈతడు సమర్థుడే కాని దురాశాపరుడు. సైన్యాన్ని కూర్చుకొని జయపూర్, శృంగవరపుకోట, కురుపాం, అనకాపల్లి, పాలకొండ, ఆంధ్ర, రాజాం, బొబ్బిలి మొదలైన సంస్థానాల నాక్రమించి పర్లాకిమిడి రాజును నరసన్నపేట యుద్ధంలో ఓడించి విజయనగరానికి సామంతునిగా చేశాడు. విజయనగర ప్రతిష్ఠ ఇనుమడించింది. కాని సీతారామరాజు పాలన ప్రజాదరణ పొందలేదు. కొలువులోని వుద్యోగులాతణ్ని వ్యతిరేకించారు. విజయరామరాజుకు కూడా అతనిపట్ల సద్భావం లేదు.

సంస్థాన ఆడంబరాల ఫలితంగా విజయరామరాజు చెల్లించాల్సిన పేష్కస్ బకాయి నానాటికీ పెరిగిపోయింది. అందుచే సీతారామరాజును దివాన్ పదవి నుండి తొలగించి, విజయరామరాజు తన సిబ్బందిని తగ్గించుకొని పేష్కష్ పెంచవలసిందిగా 1782 లో కంపెనీ ఆదేశించింది. ఈ ఆదేశాలను విజయరామరాజు నిరాకరించడంతో 1793 లో కంపెనీ సైన్యాలు విజయనగరాన్ని ఆక్రమించినాయి. పన్నెండు వందల రూపాయిల భరణం మీద విజయరామ రాజును మచిలీ పట్టణానికి పంపడానికి నిశ్చయించింది.

అవమానం భరించలేని విజయరామరాజు సైన్యాన్ని కూర్చుకొని విజయ నగరం బిమిలి పట్టణాల మధ్య పద్మనాభం దగ్గిర కంపెనీతో యుద్ధానికి సిద్ధమయినాడు. స్థానిక జమీందారులు పెక్కుమంది అతని పక్షం వహించారు. 1794 జులై 10 న జరిగిన యుద్ధంలో విజయరామరాజు ఓడి మరణించాడు. అతని కొడుకు నారాయణబాబు పారిపోయినాడు. కాశీపురం జమీందారు, కొండ జాతి పీరులు అతని పక్షం వహించారు. కొండప్రాంతాల్లో యుద్ధం అసాధ్యమని కంపెనీ నారాయణబాబుతో సమాధానం కుదుర్చుకొన్నది. 1802 లో విజయ నగరంలో శాశ్వత సిస్తు విధానం అమలు జరిగింది. పద్మనాభ యుద్ధాన్ని ఫ్లాడెన్‌ఫీల్డు యుద్ధంతో పోలుస్తారు. ఫ్లాడెన్‌ఫీల్డు యుద్ధంలో స్కాట్లండ్ పూర్తిగా పరాజయం చెంది ఇంగ్లాండ్‌లో చేరిపోయింది.

**పర్లాకిమిడి :**

పద్మనాభ యుద్ధం జమీందారులకు హెచ్చరిక అయినప్పటికి వారు కంపెనీపై తిరుగుబాట్లు మానలేదు. ఉత్కళాధీశులైన గజపతుల వారసులమని చెప్పకొనే పర్లాకిమిడి జమీందార్లు 1765 నుండి కంపెనీకి సమస్యగా పరిణమించారు. వారి సైన్యంలోని బిస్సోయీలనే జవానులు వారికి అండగా వుండేవారు. 1768 లో నరేంద్రదేవుని తొలగించి అతని కొడుకు గజపతిని కంపెనీ గద్దె నెక్కించింది. కాని గజపతి విజయనగరంతో చేరి ఆంగ్లేయుల నెదిరించాడు. అతని మరణానంతరం (1802) రాణి కుట్రలవల్ల సంస్థానం అల్లకల్లోల మయింది. కొంతకాలం సైనిక శాసనం అమలు జరిగింది. చివరకు 1832 లో ఆంగ్ల సైన్యాలు తిరుగుబాటుదారులను పట్టుకొని గుమ్మ, రాయగుడ్డ, జెరింగి కోటలను ఆక్రమించింది. పర్లాకిమిడిలో శాంతి నెలకొన్నది.

**గుంసూర్ :**

గంజాం జిల్లాలోని గుంసూర్ చాల ప్రాచీన సంస్థానం. గుంసూర్ రాజులు ఫ్రెంచి వారిని సైతం ధిక్కరించగా బుస్సీ వీరిపై దండెత్తవలసి వచ్చింది. కప్పం చెల్లించడానికి నిరాకరించిన విక్రమభంజ్‌ని ఆంగ్లేయులు (1778) తొలగించి అతని తమ్ముడు లక్ష్మణభంజ్‌ని గద్దెనెక్కించారు. అతని కొడుకు శ్రీకరభంజ్ విజయనగర ప్రతాపగిరి జమీందార్లతో చేరి 1800 సం॥లో కంపెనీపై ధ్వజమెత్తాడు. అతని కొడుకు ధనంజయభంజ్ మరణానంతరం (1835) వారి వారసులు ఖోండులను గూడగట్టుకొని కంపెనీతో పోరాటం సాగించారు. వీరిపై కంపెనీ రెండు దాడులు నిర్వహించవలసి వచ్చింది. చివరకు తిరుగుబాటుదారులను పట్టుకొని నెల్లూరు జైలుకు పంపింది. జమీందారీ కంపెనీ వశమయింది.

మద్రాస్ గవర్నరైన మన్రో (1820) సర్కారులలో పర్యటిస్తూ (1822) తిరుగుబాటు కారణంగా కంపెనీ ఆక్రమించిన సంస్థానాలను తిరిగి పునరుద్ధరించరాదు" అని ప్రకటించాడు. అయినా 1830-34 మధ్య కాలంలో కాశీపురం అనకాపల్లి, గోలుకొండ, పాలకొండ సంస్థానాధీశులు తిరుగుబాట్లు చేశారు. తిరుగుబాటుల నణచి ఆ జమీందారులను సర్కారు జిల్లాలలో విలీనం చేశారు. గోలుకొండ ఆక్రమణకు నిరసనగా ఆ ప్రాంతంలోని ఆదివాసులు 1845 ప్రాంతంలో విజృంభించి పట్టణాలు పల్లెలు దోచుకున్నారు. 1848 నాటికి ఆ పితూరీ చల్లారింది.

## పాళెగార్ల తిరుగుబాటు

దత్త మండలాలు ఆంగ్లేయుల పరమైనప్పుడు (1802) ఆ జిల్లాలలో ఎనభయి మందికి పైగా పాళెగార్లున్నారు. విజయనగర రాజుల కాలంలో వీరు సరిహద్దు రక్షణోద్యోగులు. ప్రతి పాళెగారు కొన్ని గ్రామాల ఆదాయం అనుభవించేవాడు. క్రమంగా వీరు రక్షణ విధులతో బాటు న్యాయ నిర్వహణాధికారాన్ని కూడ నిర్వహిస్తూ జమీందారులను పోలివుండేవారు. 'కావలి రుసుము' మొదలైన పలు రకాల పన్నులు వసూలు చేస్తూ ప్రజలను పీడించేవారు. తమ ప్రాంతాలు కంపెనీకి దత్తం కావడాన్ని నిరసించి కంపెనీకి చెల్లించాల్సిన కప్పం చెల్లించడానికి నిరాకరించారు. వీరి పోషణలో సుమారు ముప్పది వేలకు పైగా సాయుధ సిబ్బంది వుండేది.

పాళెగార్ల దురాగతాలను అణచి దత్తమండలంలో కంపెనీ అధికారాన్ని పటిష్ఠం చేయడానికి ప్రధానాధికారియైన మన్రో నిర్ణయించాడు. "కావలి రుసుం వసూలు చేసినా, కంపెనీకి శిస్తు చెల్లించక పోయినా, అమల్‌దారులను ధిక్కరించినా, కోటల్లో సైనిక సిబ్బంది నిలుపుకున్నా తిరుగుబాటుదారులుగా ప్రభుత్వం పరిగణిస్తుంది" అని మన్రో ప్రకటించాడు. ఈ ప్రకటనను ధిక్కరించి పాళెగార్లు సుసంఘటితంగా కంపెనీని ఎదిరించడానికి ప్రయత్నించారు. మన్రో సైనిక చర్యలు జరిపి రెండు సంవత్సరాలలో పాళెగార్లను అదుపులోకి తెచ్చాడు. కాని వుయ్యాలవాడ జమీందారులకు వారసుడైన నరసింహారెడ్డి తనకు కంపెనీ నిర్ణయించిన భరణంతో తృప్తిపడక 1846 లో తిరుగుబాటు చేశాడు. సుమారు పదివేల సైన్యాన్ని కూర్చుకొని రుద్రవరం, కృష్ణంసెట్టిపల్లె, ముండ్లపాడు మొదలైన గ్రామాలను, కోయిలకుంట్ల తాలూకా ఖజానాను దోచి బీభత్సం సృష్టించాడు. అనంతరం అతని సైన్యం గిద్దలూరుపైన నడిచింది. గిద్దలూరు దగ్గిర యుద్ధంలో నరసింహారెడ్డి ఓడిపోయి తప్పించుకున్నాడు. చివరకు పెర్సోమెళ్ళ కొండ దగ్గిర బందీగా పట్టుకున్నారు. సైనిక న్యాయస్థానం (ఫైజుదారీ అదాలత్) విచారించి నరసింహారెడ్డికి వురిశిక్ష విధించింది. 1847 జనవరి తొమ్మిదో తేదీన అతణ్ణి వురితీశారు. పాళెగార్ల సమస్య పరిష్కార మయింది.

## రైతువారీ విధానం

కంపెనీ పాలనలో నష్టానికి గురియైన వారు ముఖ్యంగా రైతులు చేతి పనులవారు 19 వ శతాబ్దం మధ్యకాలంవరకూ స్థిరమైన భూమిశిస్తు విధానం అమలు జరగలేదు. జమీందారీ రైతువారీ విధానాల్లో ప్రయోగాలు జరుపుతూ

రైతులను ఇబ్బందులకు గురిచేశారు. జమీందారీ భూములలో శాశ్వత శిస్తు విధానం అమలు జరగడంవల్ల జమీందారు ప్రభుత్వానికి చెల్లించే మొత్తం మాత్రం నిర్ణయమై రైతు చెల్లించే శిస్తు ప్రమాణం నిర్ణయించకపోవడంతో జమీందారు నిరంకుశత్వానికి రైతు గురి అయినాడు. కొన్ని ప్రాంతాలలో మూడింట రెండువంతులు ఐదింట నాల్గువంతులు (నెల్లూరు, బొబ్బిలి) వసూలు చేశారు. శిస్తుగాక పెక్కు సందర్భాలలో రైతులు జమీందారుకు నజరానాలు చెల్లించవలసి ఉండేది.

జమీందారీలలో రైతుల ఇక్కట్లపట్ల కలెక్టర్ మన్రో సానుభూతి వహించాడు. తమిళనాడులో బారామహల్, దత్త మండలాల కలెక్టర్‌గా మన్రో దేశ పరిస్థితులను గ్రహించడమే గాక పాలనా విషయాల్లో అనుభవం గడించాడు. దుబాసీల సహాయం లేకుండా దత్త మండల గ్రామాల్లో పర్యటించి రైతుల బాగోగులు స్వయంగా తెలుసుకున్నాడు. జమీందారీ విధానం రద్దుచేసి రైతువారీ విధానం అమలు చేయాలనే అతని నిర్ణయాన్ని కంపెనీ ఉద్యోగులు అంగీకరించారు. ఈ విధానంలో భూమిపై రైతుకు హక్కు సంక్రమిస్తుంది. అతడు ప్రభుత్వానికి చెల్లించవలసిన శిస్తును ప్రభుత్వోద్యోగులకు నేరుగా చెల్లించే అవకాశం ఏర్పడుతుంది. ఈ విధానం 1802 నుండి దత్త మండలాలలో అమలు జరిగింది. మన్రో మద్రాస్ గవర్నరైన తరువాత 1822 నుండి కోస్తాంధ్ర ప్రాంతాల్లో జమీందారీలు రద్దయి రైతువారీ విధానం అమలు జరిగింది. 1845 నాటికి మద్రాస్ రాష్ట్రంలో షుమారు 650 జమీందారీలు రద్దయినాయి. అయితే గ్రామాల్లో దిట్టాలు సరిగాలేనందున, గ్రామోద్యోగులు జమీందార్ల ప్రోత్సాహంతో గ్రామాల్లోని ఈనాము, మాన్యం భూముల విస్తీర్ణం పెంచడంవల్ల పంటపొలంలో మూడింట ఒక్క వంతు మాత్రమే రైతుకు మిగిలింది; కంపెనీ ఉద్యోగులు నిర్ణయించిన శిస్తు ప్రమాణం (rate) కూడ చాల ఎక్కువ, అని మన్రోయే అంగీకరించాడు. అంతే గాక, పది సంవత్సరాల కొకమారు శిస్తు పునఃపరిశీలన జరిగి (revision)న సందర్భాలలో శిస్తు ప్రమాణం పెరిగేది. అందుచేత జమీందారీ భూములలోని రైతుకంటె రైతువారీ విధానంలోని రైతుకు పెద్దగా మేలు జరిగినట్లు కన్పించదు. వ్యవసాయ పద్ధతులలో గానీ సాధనల్లో గానీ నీటి వనరుల్లో గానీ అభివృద్ధి జరగలేదు. భూమి శిస్తులో నూరింట ఒక వంతు కూడ కంపెనీ నీటి వనరుల మరమ్మతుకు వెచ్చించలేదు. సర్ ఆర్థర్ కాటన్ సూచనలపై గోదావరి (1847) కృష్ణా (1854) ఆనకట్టలు నిర్మించే వరకూ

కంపెనీ కొత్త నీటి వనరులు కల్పించడానికి పూనుకోలేదు. 1834 నుండి రైతులు ధన రూపంలో శిస్తు చెల్లించవలసి వచ్చింది. ధాన్యం ధరలు క్రమంగా పడిపోసాగినై; రైతు ఆర్థికస్థితి దిగజారసాగింది. పూర్వం గ్రామాల్లో ఆయగాంధ్ర పద్ధతి వల్ల కాపు (munisif) కరణం, తలారి గ్రామ వ్యవస్థలో సభ్యులై గ్రామ ఆదాయంలో భాగస్వాములయ్యింది. వారికి రైతులకు మధ్య సానుభూతి సహకారాలుండేవి. కొత్త వ్యవస్థలో కేంద్రీకృత జిల్లా పాలనా యంత్రాంగంలోనివారై ప్రభుత్వ జీతాలు స్వీకరించడం ప్రారంభమైనందున స్థానికులపట్ల – సానుభూతికి ఆధారం నశించి గ్రామ వ్యవస్థ విచ్ఛిన్నమై రైతుకు అపకారం పరిణమించింది.

కరణాలటంటను కైల కట్టల యిప్పి
కాస్లంట గీస్లంథ కలయిలేనివి కొన్ని
సెల్లులు బాకీలు సెప్పుకొంట
దయ్యమా! కాయ కసరైన దక్కనీయ
రేమి సేయుదు?
యెద్దు మందను గూర్చి యెగసాయమిడితేను
తుదినది యధికారి దోచుకొనియె....
దావు దప్పులటంచు ధర్మకర్చులకంట
కాసు పీసములాగె కరణమయ్య.

దేశంలో జరిగే ఆర్థిక రాజకీయ పరిణామాల ఫలితంగా అనేక రకాల చేతి పరిశ్రమలకు నష్టం వాటిల్లింది. 17, 18 శతాబ్దాలలో ప్రసిద్ధి వహించిన నేత పరిశ్రమ క్షీణించింది. ఇంగ్లండులో పారిశ్రామిక విప్లవం జరగడంతో ఆంగ్ల వర్తకులీ పరిశ్రమ మదుపులో పెట్టడం నిలిచిపోయింది. ఇంగ్లండు ప్రభుత్వ సుంక విధానం కూడ పరిశ్రమకు ప్రతికూలమయ్యింది. ఇంగ్లండులో భారతదేశ వస్త్రంపై సుంకం 20 శాతంగా, ఇండియాలో ఇంగ్లీషు వస్త్రంపై సుంకం 10 శాతం మాత్రమే! దీనికితోడు సాలీలు మగ్గం పన్ను చెల్లించాల్సి ఉండేది. మద్రాస్ రాష్ట్ర ప్రభుత్వానికి సాలీనా 10 లక్షలు మగ్గం పన్ను ద్వారా సాలీనా 10 లక్షలు ఆదాయం వచ్చేది. అదీ గాక ప్రజల్లో నానాటికీ మిల్లు బట్టల పట్ల ఆకర్షణ పెరిగింది. నేత బట్ట కంటె మిల్లు బట్ట నాణ్యమైనదిః ధర తక్కువ; ఎక్కువకాలం మన్నుతుంది. క్రమంగా విపణివీధులు మిల్లువస్త్రాలతో నిండిపోయింది; స్థానిక వస్త్ర పరిశ్రమ నీరసించింది. 1800 సం॥ ప్రాంతాలలో మచిలీపట్టణం 10 లక్షల రూపాయిాలు విలువచేసే వస్త్రం ఎగుమతి చేసింది;

1834 లో ఆరేవు నుండి కేవలం 2750 రూపాయల వస్త్రం మాత్రమే ఎగుమతి అయిందిI

క్రిస్టఫర్ హట్టన్ అనే ఆంగ్ల వర్తకుడు 1657 లో మచిలీపట్టణం దర్శించాడు. "ఆ రేవు నుండి స్థానిక వర్తకులకు చెందిన 20 నౌకలు అరకాన్ పెగూ, పర్షియా, మలకా, మాలా దీవులకు వివిధ సామగ్రితో ప్రతి నిత్యం బయలుదేరుతుంటాయి; జావా, సింహళాల నుండి 15 ఏన్గుల వరకు దిగుమతి చేయగల నౌకలీ రేవులో నిర్మిస్తున్నారు. అని వ్రాశాడు. ముఖ్యంగా మచిలీ పట్టణం, నరిసీపట్టణం రేవులో నౌకా నిర్మాణం ముమ్మరంగా సాగింది. ఆంగ్ల వర్తకులు కూడ ఈ రేవుల్లో నౌకలు నిర్మించుకొనేవారు. దీన్ని అరికట్టడానికై ఇంగ్లండు రాజైన రెండో చార్లెస్ ఇంగ్లీషు వర్తకులు ఇండియా రేవుల్లో నౌకలు తయారు చేయించుకోరాదనీ, మరమ్మతు చేయించుకోరాదనీ శాసనం చేసినాడు. వాణిజ్యం ఆంగ్లేయుల హస్తగతమై వారిసొంత నౌకల్లోనే వాణిజ్యం జరగడంతో నౌకా పరిశ్రమ క్షీణించింది. హట్టన్‌కు ఇంచుమించు సమకాలికుడైన మరొక ఆంగ్ల వర్తకుడు "భిన్న దేశాల నుండి బంగారు నదులు భారతదేశానికి ప్రవహిస్తున్నాయి" అని అసూయ పడినాడు. 19 వ శతాబ్దం మధ్యకు పరిస్థితి పూర్తిగా తారుమారయింది.

వస్త్ర నౌకా నిర్మాణ పరిశ్రమలు నశించడంతో వానికి అనుబంధములైన రంగుల తయారీ, వడ్రంగం, లోహ పరిశ్రమలు వెనుకాడినాయి. స్థానిక సైన్యాల స్థానాన్ని కంపెనీ సైన్యాలు ఆక్రమించడంతో ఆయుధకవచ నిర్మాణ పరిశ్రమలు నశించినాయి. రాజమహేంద్రవరం, మచిలీపట్టణం, పాలకొల్లు, నెల్లూరులలో కొలుములు మూత పడినాయి. సంస్థానాలు, జమీందారీలు రద్దు కావడంతో గృహాలంకరణకై జమీందార్లు పోషిస్తున్న హస్తకళలకు ఆదరణలేక అంతరించినాయి

పరిశ్రమలు వాణిజ్యం క్షీణించడంతో నిరుద్యోగం ప్రబలింది. గవర్నర్ జనరల్ కారన్‌వాలీస్ (1786-93) కాలం నుండి ఆంగ్లీకరణ విధానం అమలు జరిగింది. భారతీయుల శక్తి సామర్థ్యాలతో ఆంగ్లేయులకు నమ్మకం లేదు. విజితులైన భారతీయులు విజేతలైన ఆంగ్లేయులపట్ల విశ్వాసం వహించరనే భయం కూడ ఉంది. అందుచేత ప్రభుత్వ ఉద్యోగాలను ఆంగ్లేయులవరం చేయడమే ఈ విధానం. దీనితో విద్యావంతులలో కూడ నిరుద్యోగం ప్రబలింది. వ్యవసాయంపై వత్తిడి నానాటికి హెచ్చింది. నీటి వనరులు పెంచడంలో, కనీసం మరమ్మతులు చేయడంలో ప్రభుత్వం శ్రద్ధ వహించనందున వ్యవసాయ

విస్తరణకు అభివృద్ధికి అవకాశాలు లేవు. దీనికితోడు అతివృష్టి అనావృష్టివంటి ఈతి బాధలు తరచు సంభవించి పంటలు నష్టమయి భిన్న ప్రాంతాల్లో క్షామం తాండవించింది. సర్కారు, దత్త మండలం జిల్లాల్లో 1805 - 07 మధ్య కాలంలో పంటలు నష్టమయినాయి. 1811 లో నెల్లూరు జిల్లాలో కరువు ఏర్పడింది. 1823 - 24 సం॥లో కడప, కర్నూలు, విశాఖ, గుంటూరు, నెల్లూరు జిల్లాల్లో కరువు పరిస్థితు లేర్పడి ప్రజలు బాధలకు గురి అయినారు. 1833 లో గుంటూరు కరువు దారుణ బీభత్సాన్ని సృష్టించింది. దీన్నే పెద్దలు బహుశా "డొక్కల కరువు" అనేవారు. కాప్టెన్ వాల్టర్ కాంప్‌బెల్ నాటి బీభత్సాన్ని కండ్లకు గట్టినట్లు వర్ణించాడు. వస్తులతో నీరసించిపోతున్న ప్రజలు చేతికి జిక్కిన ఆకలములు జంతువుల కళేబరాలను పీక్కుతినేవారని అతడు వ్రాశాడు. జిల్లాలో కరువు వల్ల మూడింట రెండు వంతుల జనాభా నశించింది. ఇతర జిల్లాల పరిస్థితులు మెరుగుగా లేవు. 1830 సం॥లో సుమారు ఏడు లక్షలున్న గోదావరి జిల్లా జనాభా 1840 నాటికి ఐదు లక్షల ముప్పైయైదు వేలకు పడిపోయినట్లు సర్ హెన్రీ మాంట్ గోమరీ వ్రాశాడు. దేశంలో దారిద్ర్యం తాండవించటంచేత అన్ని వర్గాలలో యాచక వృత్తి ప్రబలింది. యాచకవృత్తి నవలంబించిన బ్రాహ్మణులలో "ఉపనయనము నాటి మాట (భవతీ భిక్షాందేహి") ఉన్నది. అనే నానుడి వ్యాపించింది. వాడుకలోనికి వచ్చింది. యాచక బ్రాహ్మణులు ఏ విధంగా అపహాస్యానికి గురి అయిందీ చంద్రశేఖర శతకం నుండి తెలుస్తుంది. బ్రాహ్మణులే కాదు, సాతానులు, జంగము దాసర్లు చివరకు పంచములలో కూడ మాలదాసర్లు సయితం యాచక వృత్తితో జీవించేవారు.

# సాంఘిక సాంస్కృతిక పరిస్థితులు

మొగలాయీ కుంఫిణీ యుగాల్లో ఆంధ్రదేశ మత సామాజిక పరిస్థితుల్లో మౌలికమైన మార్పులు రాలేదనే చెప్పవచ్చు. అయితే, సాంఘిక సంబంధాలు క్లిష్టతరమయినాయి. సాంప్రదాయకమైన కులవృత్తులు ఏనాడో నశించాయి. గువ్వల చెన్నవంటి సనాతనులు "వెల విద్యలెన్ని యున్నను కులవిద్యకు సాటి రావు" అని హెచ్చరించడం జరిగింది. హిందూ సమాజానికి సిద్ధాంతపరంగా పునాదియైన వర్ణ వ్యవస్థ క్షీణించి నిరాదరణకు గురి అయింది. మొగలాయి యుగంలోకంటె కుంఫిణీ యుగంలో బ్రాహ్మణుల ఆర్థిక పరిస్థితి కొంత మెరుగయినట్లు కన్పిస్తుంది. జమీందారులు అధిక సంఖ్యలో అగ్రహారాలిచ్చినట్లు తెలుస్తుంది; మాన్యాలు, ఈనాములు కూడ పెరిగినాయి. అందుచే గ్రామాల్లో బ్రాహ్మణుల గౌరవం ఇనుమడించడానికి అవకాశం కలిగింది. సాంప్రదాయ రీత్యా బ్రాహ్మణులు విద్యావంతులు. ప్రభుత్వ విధి నిర్వాహణలో అనుభవం ఉన్నవారు అయినందున పాశ్చాత్య విద్యను సులభంగా అభ్యసించి కంపెనీ ఉద్యోగాల్లో చురుకుగా ప్రవేశించి ఆంగ్ల ప్రభుత్వ అభిమానాన్ని కూడ పొందసాగారు.

క్రమంగా పందొమ్మిదో శతాబ్దం మధ్యకాలానికి మరొక పరిణామం జరిగింది. పాశ్చాత్య వర్తకులు, కంపెనీ ఉద్యోగులు తమ లావాదేవీలలో, విధి నిర్వాహణలో స్థానికుల అవసరాన్ని గుర్తించి తమకు సహాయకులుగా నియమించుకొనసాగారు. దుబాషీ (ద్విభాషి=translator) లుగా, మధ్య వర్తులుగా, గుమాస్తాలుగా, వకీళ్ళుగా స్థానికులు కంపెనీల కెంతగానో తోడ్పడినారు. డూప్లే దుబాసీ ఆనందరంగ పిళ్ళె చాల ప్రసిద్ధుడు. బుస్సీ దగ్గర లక్ష్మన్న దుబాసీగా ఉండేవాడు. బొబ్బిలియుద్ధ కథలో లక్ష్మన్న ప్రసక్తి కన్పిస్తుంది. కాండ్రిగుల జోగివంతులు, ఏనుగుల వీరాస్వామి, రాయసం (లంగరు) పావన్న పోడి జగ్గన్న. కొల్లి వెంకటాద్రి, భేరు తిమ్మన్న, కాళీ వీరన్న కావలి సోదరులు నాటి ఇంగ్లీషువారి దుబాసీలలో ఉద్యోగులలో ప్రముఖులు. ఒక విశేషం. ఈ ఉద్యోగులు ఏ ఒక కులానికీ పరిమితంకాదు. వీరిలో బ్రాహ్మణులున్నారు; వైశ్యులున్నారు; శూద్రులలో భిన్న కులాల

వారున్నారు. ప్రధానంగా రేవు పట్టణాలు వాణిజ్య కేంద్రాలలో వీరి సంఖ్య గణనీయంగా ఉండేది. వీరికితోడు జిల్లా ప్రభుత్వ యంత్రాంగంలో ఉద్యోగాలు నిర్వహిస్తున్న స్థానికులు. క్రమక్రమంగా ఈ వర్గం బలపడసాగింది. వీరు పాశ్చాత్య భాషలు అభ్యసించారు. మొదట్లో చాలాకాలం వరకు పోర్చుగీసు భాష ప్రచారంలో ఉండేది; పాశ్చాత్య వేషధారణ అలవరచుకున్నారు. ఈ కాలంలోనే పొగత్రాగే అలవాటు ఈ కొత్త వర్గంలో ప్రవేశించి సమాజంలో విస్తరించి ఉంటుంది. "పదపడి ధూమపానమున ప్రాప్తము తా పదమూడు చేటులు" అని కొందరు హెచ్చరించగా ఒక కవి ధూమపానాన్ని శ్లాఘిస్తూ పెద్ద దండకం వ్రాసి ఇంద్రాది దేవతలకు కూడ పొగ త్రాగడం, నస్యం పీల్చడం అంటగట్టాడు. పాశ్చాత్య వేషధారణను గువ్వల చెన్నవంటి కవులు నిరసించారు. పాశ్చాత్య విద్యలతో సంస్కృతితో పరిచయమేర్పడిన ఈ వర్గంవారే క్రమంగా విదేశ పాలనవల్ల దేశానికి కలుగుతున్న నష్టాన్ని ప్రజలకు కలుగుతున్న అన్యాయాన్ని గుర్తించి 19 వ శతాబ్దంలో ప్రారంభమైన విజ్ఞానోద్యమానికి జాతీయ స్వాతంత్ర్య ఉద్యమానికి నాయకత్వం వహించారు.

## విద్య – సారస్వతం

కుతుబ్‌షాహీ వంశ పతనానంతరం చెలరేగిన అరాచక పరిస్థితుల్లో స్థానిక విద్యలు ఆదరాభిమానాలు కోల్పోయినాయి. అగ్రహారాల్లో సాంప్రదాయక విద్యలైన వేద వేదాంగ పురాణ ఇతిహాస ధర్మశాస్త్రాలలోనూ లౌకిక విద్యలైన తర్క, జ్యోతిష, వ్యాకరణ ఆయుర్వేద గాంధర్వ విద్యలలోనూ అధ్యయన అధ్యాపనలు కొనసాగినట్లు తెలుస్తుంది. నాటి జమీందారు లీ విద్యలను పోషించారు. తిరుపతి, మంథెన, కాళేశ్వరం, దివి, కోనసీమలు వేద విద్యకు ప్రసిద్ధి చెందినాయి వేద విద్యతో పరిపూర్ణత సాధించడానికై విద్యార్థులు వారణాసి, నవద్వీపాలకు వెళుతుండేవారు. ఉర్లాం, పిఠాపురం జమీందార్లు వేద విద్యలలో పరీక్షలు పెట్టి పండితులను గౌరవిస్తుండేవారు. బీజ గణితము, క్షేత్ర గణితము, దృక్సిద్ధాంతము వస్తు తత్త్వము, తర్కము, భూగోళ ఖగోళ శాస్త్రములు. జ్యోతిషము సంగీతములలో కూడ పరిశ్రమ జరిగేది. విశాఖపట్టణం జమీందారైన గోడే జగ్గారావు ఈ విద్యలన్నీ నేర్చినాడట! అయితే విద్యలన్నీ మతంతో ముడిపడి మూఢ విశ్వాసాల భారంతో మగ్గుతుండేవి. ఆధునిక శాస్త్ర విజ్ఞానానికిగానీ, సృజనాత్మక మానసిక పరిశ్రమకు గానీ నాటి విద్యా విధానంలో స్థానం లేదు. క్రమంగా ఈ పరిస్థితులపట్ల ప్రజలలో అసంతృప్తి పెరిగింది. పాశ్చాత్య భారతీయ విజ్ఞానాన్ని బేరీజు వేయడానికి ప్రయత్నించిన అల్లాడి

రామచంద్రయ్య అనే జ్యోతిష విద్వాంసుడు 1836 ప్రాంతంలో ఈ విధంగా వ్రాశాడు. "ప్రాచీన వచనము ప్రత్యక్ష విరుద్ధముగా ఉన్నాగానీ అదే సత్యమని (ఈ దేశ ప్రజలు) నమ్ముతారు. (ఆంగ్ల పాలకులు) ఇటీవలనే బుద్ధిమంతులై విమర్శ చేసిరి....లెస్సగా విచారించి ఏది సత్యమో అదే చెప్పుదురుగాని యసత్యమును బుద్ధిచేత కల్పించి చెప్పరు....సిద్ధాంత పురాణ హూణ మతములలో ఎక్కడ ఏది సత్యమో యేది మిధ్యో తెలుసుకొని యెవరి ముఖబిడియం ఉంచక వాస్తవార్థ నిర్ణయం వ్రాస్తే అందరికిన్నీ తెలిసి బహూపయోగం అయ్యేవి. చదివిన చదువుకు సార్థకం ఇదే...." దీన్నిబట్టి విద్యావంతులైనవారు ఆంగ్లవిద్యను, పాశ్చాత్య శాస్త్ర విజ్ఞానాన్ని బలపరచసాగినారని స్పష్టంగా తెలుస్తున్నది.

పాశ్చాత్య విద్యా విధానం 17 వ శతాబ్దం మధ్యకాలానికి దేశంలో ప్రవేశించింది. ఐరోపా కంపెనీలు తమ వాణిజ్య అవసరాలకై తమ స్థావరాలలో పాఠశాలలు నెలకొల్పి తమ భాషలలోను వాణిజ్య లావాదేవీలను తమ ఉద్యోగులకు తర్ఫీదునిచ్చేవారు. వాణిజ్యం పెరిగిన కొలది కంపెనీల ఉద్యోగుల సంఖ్య పెరగడం సహజం. ఈ పాఠశాలల్లో 'ఫరంగీ' అనే మిశ్రమ భాష తయారయింది. ఇందులో చాలభాగం పోర్చుగీసు పదాలుండేవి. స్థానికులకు పాశ్చాత్యులకు 'ఫరంగీ' యే మాధ్యమంగా ఉపకరించింది. మచిలీపట్టణం యానాం, పులికాట్ పట్టణాలలో ఫరంగీ పాఠశాలలుండేవి. సెయింట్ జార్జి కోటలో (మద్రాస్) 1673 లో పాఠశాలను స్థాపించినారు. ఏమైనా కంపెనీల నిర్వాహకులు విద్యావ్యాప్తి పట్ల శ్రద్ధ వహించలేదు. కాని క్రైస్తవ మత ప్రచారములు ఉత్సాహంతో ప్రజలలో విద్యావ్యాప్తికి కృషి చేశారు. ప్రజల్లో నైతిక విలువలు దిగజారిపోయినవనీ అజ్ఞానం అంధ విశ్వాసాలు వెర్రితలలు వేస్తున్నాయని వీనికి విరుగుడు క్రైస్తవ మత ప్రచారమే సాధనమని ఛార్లెస్ గ్రాంట్ వంటివారు వ్రాశారు. రాజకీయ సాంస్కృతిక సామ్రాజ్యవాదాన్ని సమర్థించే తెల్లవాని బాధ్యత (white man's burden) సిద్ధాంత ప్రచారమయింది. పోర్చుగీస్ వారు 1670 లోనే మచిలీపట్టణంలో చర్చి నిర్మించి మతాంతీకరణ చురుకుగా సాగించారు. వారి ననుసరించి డచ్చి, ఫ్రెంచి, ఇంగ్లీషువారు దేశంలో పలుచోట్ల ప్రచారక స్థావరాలు నెలకొల్పినారు. వాటికి అనుబంధంగా పాఠశాలలు చిన్న చిన్న గ్రంధాలయాలు వెలిసినాయి. మిషనరీ పాఠశాలల ద్వారా విద్యా విధానంలో కొత్త పద్ధతులు ప్రవేశించినాయి : నిర్దిష్టమైన బడి సమయం, (school hours) తరగతుల పద్ధతి (class system); చరిత్ర భూగోళం

వంటి కొత్త పాఠ్యాంశాలు; నీతి బోధ (మతబోధ); వారానికి ఒకరోజు (ఆదివారం) అనధ్యయనం (సెలవు) మొదలైన నియమాలు ఏర్పడినాయి. 1678 లోనే మచిలీపట్టణంలోని గ్రంథాలయంలో 78 పుస్తకాలున్నట్లు తెలుస్తుంది. కంపెనీ అధికారులు ప్రభుత్వమూ కూడ క్రమంగా తమ దృక్పథం మార్చుకోసాగినారు. 1813 ఛార్టర్ చట్టంలో, ఇండియాకు మత ప్రచారకులను పంపవలెనని విధించడమేగాక సాలుకు లక్ష రూపాయలు దేశంలో విద్యా విషయంల మీద ఖర్చు చేయవలెనని విధించింది.

భారతదేశంలో అనుసరించవలసిన విద్యా విధానంమీద ఇంగ్లండులో పెద్ద వివాదం ఏర్పడింది. ఆధునిక పద్ధతులద్వారా ఆంగ్ల భాషద్వారా విద్యాబోధన జరిపి ప్రజలను విజ్ఞానవంతులను చేయడం ప్రభుత్వ ధర్మమని ఉదారభావులు వాదించారు. "ఆధునిక భావ ప్రచారంవల్ల ఆంగ్ల ప్రభుత్వానికి ముప్పు వాటిల్లుతుంది. అట్టి పరిణామాలవల్లనే అమెరికాను కోల్పోయినాము. అదీగాక ప్రాచ్య విజ్ఞానం చాలా ఉత్కృష్టమైనది. అందుచేత స్థానికమైన విద్యా విధానాన్ని మాత్రమే బలపరచవలెన"ని సామ్రాజ్యవాదుల అభిప్రాయమయింది. సంస్కారవాదులైన రాజా రామమోహనరాయ్‌వంటి భారతీయులు ఆంగ్లభాషద్వారా ఆధునిక విజ్ఞాన ప్రచారానికి ఆందోళన చేశారు. ఆంధ్రులలో వెన్నెలకంటి సుబ్బారావు, ఏనుగుల వీరాస్వామయ్యవంటి కంపెనీ ఉద్యోగస్తులు ఆంగ్లవిద్య అవసరాన్ని గుర్తించి ప్రచారం చేశారు. 1820 లోనే సుబ్బారావు విద్యా సంస్కరణల ఆవశ్యకతను గురించి ప్రభుత్వానికి ఒకలేఖ రూపంలో నివేదిక సమర్పించాడు. రైత్వారీ పద్ధతి ప్రవేశపెట్టిన మన్రో మద్రాస్ గవర్నర్‌గా ఉన్న కాలంలోనే తాలూకా, జిల్లా స్థాయీలలో పాఠశాలలు నెలకొల్పి ఆంగ్ల భాషను మాధ్యమం చేసే ప్రయత్నం చేశాడు. ఈ పరిస్థితుల్లో మెకాలే నివేదిక ననుసరించి గవర్నర్ జనరల్ బెంటింక్ ప్రభువు 1835 లో స్థానిక పండితులకు పాఠశాలలకు ధన సహాయం నిలుపుచేసి ఆంగ్లభాష ఆంగ్లవిద్యా విధానం అమలు పరచడానికి నిర్ణయం చేశాడు. ఆంగ్ల సామ్రాజ్య వినాశనానికి పునాది వేశాడని ఆంగ్లేయులు, భారతీయులను గుమాస్తాలుగా, ఆంగ్ల మానసపుత్రులుగా తయారు చేయడం అతని లక్ష్యం అని భారత జాతీయ వాదులు మెకాలేను విమర్శిస్తారు. "ఆంగ్లభాషవల్ల భారతీయులు స్వాతంత్ర్యాన్ని కాంక్షించిన రోజు బ్రిటిష్ (ప్రజాస్వామ్య) చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖింపదగిన రోజు" అని స్వదేశంలోని విమర్శకులకు అతని సమాధానం గమనించదగింది. భారత జాతీయ భావ పరిణామంలోనూ, స్వాతంత్ర్యోద్యమంలోనూ, విజ్ఞాన సంస్కృతి వికాసంలోను

ఆంగ్లభాషా సంస్కృతుల ప్రభావాన్ని నిరసించడం ఆత్మవంచన అవుతుంది. బెంటింక్ నిర్ణయాన్ని మద్రాస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో అమలు చేయలేదు. మద్రాస్ రాష్ట్ర పౌరులు 1839 నవంబర్ నెలలో 60 వేల సంతకాలతో ప్రభుత్వానికి ఉన్నత విద్యాభివృద్ధి ద్వారా ప్రజల మానసిక వికాసానికి దోహదం చేయగోరుతూ ఒక విన్నపాన్ని సమర్పించారు. ప్రతి గవర్నర్ కాలంలోనూ విద్యా విధానం గురించి ఆలోచనలు జరిగేవి; నివేదికలు తయారయ్యేవి; కాని ఆచరణలో అశ్రద్ధవల్ల స్థిరమైన విధానం రూపొందలేదు.

## భాషా సారస్వతాలు

గోల్కొండరాజ్య పతనానంతరం సంస్థానాలు జమీందారీలు అసంఖ్యాకంగా వెలసినాయి; కంపెనీ ప్రభుత్వం నెలకొని విస్తరించసాగింది. ఈ జమీందారీ – కుంఫినీయుగం (1700 - 1857) లో ఆంధ్ర భాషా సారస్వతాల్లో చాల పరిణామాలు జరిగినాయి. విజయనగరం, పిఠాపురం, ఉర్లాం, పెద్దాపురం, అనకావల్లి, పార్వతీపురం, వెంకటగిరి (ఆంధ్ర ప్రాంతం) గద్వాల, వనపర్తి, జటప్రోలు (తెలంగాణము) మొదలైన సంస్థానాధీశులలో చాల విద్యావంతులై సాహిత్యాభిమానులై కవులకు, పండితులకు ఆశ్రయం ఇచ్చి పోషించారు. జమీందారులు, జమీందారిణీలలో కూడ ఉత్తమ శ్రేణికి చెందిన కావ్య రచన చేసినవారున్నారు. ఈ యుగంలో అగ్రహారాల సంఖ్య పెరగడం ఒక విశేషం. పండితులకు ఈనాములు, మాన్యాలు ఉదారంగా ఇవ్వడం జరిగింది. అందుచేత ప్రత్యేకించి ప్రభుపోష నాశించక స్వస్థలంలోనే వుండి స్వతంత్రంగా సాహిత్య సేవ చేసిన కవులు కూడ లేకపోలేదు. నన్నయ యుగంలో ఇద్దరు, ముగ్గురు, తిక్కన యుగంలో నల్గురైదుగురు కవుల పేర్లు మాత్రమే తెలుస్తున్నాయి. రాయల యుగంలో అష్టదిగ్గజాలనే సంప్రదాయమే గాని వారందరూ రాయల పోషణ నందినవారు కాదనేది సత్యం. కాని ఈ యుగంలో కవుల సంఖ్య విపరీతంగా పెరిగిపోయింది. వారిలో చాలమంది పేర్లు తెలుస్తున్నాయి; వారి రచనలలో చాల భాగం లభ్యమవుతున్నాయి. "కవిత్వం చెప్పనివాడు, రాగం తీయనివాడు అనే నానుడి" ఈ యుగానికి సార్థకమేమో! "కొండవీటిలో! గాడిద నీవుమన్ కవివి గాదు గదా! అనుమాన మయ్యెడన్" అనే చాటువు అడిదం సూరకవిది (18 వ శతాబ్దం) అని ప్రచారంలో వుంది. వీరిలో కొందరు యాచక వృత్తికి కవిత్వం ముసుగు వేసి జీవితం గడుపుకొనేవారనడానికి "కాసుకు కంద పద్య మరగాసుకు వృత్తిమల గ్రుడ్డి గవ్వకున్ సీసముగా నిటుల్ చవక చెందె కవిత్వము" అనే పద్య భాగమే నిదర్శనం. ఆదరించి సన్మానించిన అనర్హులను

సయితం ఇంద్రుడు, చంద్రుడు అని కీర్తించేవారు. "కవులు కక్కుర్తి నిసుమంత కడుపు కొరకు పొగడుచుండుదుర వివేక బుద్ధులగుచు". నిరాద రించినవారిని నిందించడం సహజమే కదా! "తన్నాశ్రయించు మనుజుని మన్నించని ప్రభువు కంటె మహిషము మేతా దున్ని ఫలంబిచ్చును" అని ఒక కవి అనగా మరొక కవి "ఇయ్యగల నిప్పించంగల అయ్యలవేగాక మీస మన్యుల కేలా రొయ్యకు లేవా బారెడు" అంటాడు. మరొక కవి స్పష్టంగా పేరు పెట్టి నిందించడం గమనించదగింది. "యాచమ నాయని త్యాగము। గోచులకే గాక కట్టు కోకల కగునా। రేచెర్ల గోత్రమందున నీచుం డుదయించి కులము నీరుగ జేసెన్." వేరే సంపాదనకు అవకాశం లేనందున ఆర్థిక దైన్యం వల్ల కవి వందితుల్లో నిస్పృహ పెరిగి తిట్టు కవిత్వం మితిమీరి వుంటుంది." "దిట్ట కవి రామచంద్రుడు దిట్టిన రాయైన బగులు దీవించిన యాచెట్టైన చెట్టు చిగురగు" అని ఒక కవి గొప్ప చెప్పుకొనగా మరొకరు "నే దిట్టితినా వతాలుమని తూలు నిర్వాన్ క్షులశైల రాజముల్" అని ప్రగల్భించాడు. ప్రజల విజ్ఞానం, భయ విశ్వాసాలు వీరికి బాగా ఉపకరించి ఉంటాయి.

నాటి సారస్వతంలో అపారమైన వైవిధ్యం కన్పిస్తుంది. పురాణాలను అనువదించారు; భగవద్గీతకు గూడా తెనుగు అనువాదాలు రాసాగినాయి. సంస్కృతాంధ్రాలలో స్వతంత్ర కావ్యాలు వ్రాశారు. తర్క వ్యాకరణ, అలంకార, జ్యోతిష, మీమాంస శాస్త్రాల గ్రంథ రచన జరిగింది. యక్షగానాలు, దండకాలు, కాలజ్ఞానాలు, కందార్థాలు, తత్త్వాలు అసంఖ్యాకంగా రచించారు. పాశ్చాత్య సారస్వత ప్రక్రియల ప్రభావంతో ఏనుగుల వీరాస్వామయ్య కాశీ యాత్ర చరిత్ర, బేతవూడి సుందరరాయుని నీలగిరి (యాత్ర) చరిత్ర రచింప బడినాయి.

ఇక నాటి శతకాలు శతాధికాలు ప్రతి కవీ ఒక శతకం చెప్పినట్లు కన్పిస్తుంది. శతకాలను నీతి శృంగార భక్తి వేదాంత వైరాగ్య శతకాలని విభజించవచ్చు. ఈ శతకాలలో చాల భాగం రాజా స్థానాలకోసం ప్రభువులను ఆనందపరచడానికి వ్రాసినవి కావు. సామాజిక పరిస్థితులకు స్పందించి నిర్భయంగా యదార్థ పరిస్థితులను కవులీ శతకాల్లో వర్ణించినట్లు తెలుస్తుంది. నాటి జమీందారుల దుష్పరిపాలన గురించిన విశేషాలీ శతకాల్లో ప్రతిఫలిస్తాయి. "అగ్రహారములు నామావశిష్టములయ్యె మాన్యంబు లన్నియు మంటగలిసె....... ధార్మిక స్థానముల కిట్టి తక్కు బుట్టె కఠినచిత్తుని రాజ్యాధికారి చేసి ఇంత పీడించితివి" అని ఒక శతకం రాశాడు దేవునితో మొర పెట్టుకుంటాడు.

"గంగిరెద్దుకు మూర్ఖ భూకాంతునకును భేదమించుకయుగా గానుపించ" దని స్పష్టంగా మరొక కవి వర్ణిస్తాడు. ఎండిన వూళ్ళ గోడు ఎవ్వరూ వినరు, పండిన వూళ్ళకే ప్రభువులంతా అని మరొక కవి వాపోతాడు. విలాస జీవితం గడుపుతూ దేవాలయాలలో పూజాదికాలను గూడ నిర్లక్ష్యం చేసేవారని ఆంధ్ర నాయక శతకం నుండి తెలుస్తుంది.

వంచనగాదె దివ్యక్షేత్ర వతులలో
మంత్రార్ధ కృత్యముల్ మానియున్న
నగుబాటుగాదె యన్యమతస్థ జనులలో
నిజదాసకోటి మన్నింపకున్న.

"ఇది యాంధ్ర కవిత్వంబని/మదిరోయందగదు దీని మర్మ మరయుడీ పదియారు వన్నె పసిడిని/ముదమున తోల్పెట్టెనుంచ ముట్టకుండుదురా/లోకులు పట్టకుండుదురా" అనే కందార్థాన్ని అనుసరించి పందొమ్మిదో శతాబ్దంలో కూడ తెలుగుపట్ల తెలుగు వారిలోనే చిన్నచూపు ఉన్నట్లు తెలుస్తున్నది. అంతేగాదు విద్యా విషయాల్లో బ్రాహ్మణులలో నియోగి వైదిక విభేదాలేర్పడినట్లు స్పష్టమవుతున్నది. పాండిత్యం అంటే తర్క వ్యాకరణ జ్యోతిష మీమాంసాదులను బట్టీయం చేయడం, ఆ స్థానాల్లో వర్ణించడం వైదికం; కవిత్వం నియోగం; అయినట్లే క్రింది పద్యాలు సూచిస్తున్నాయి.

తర్క కర్కశబుద్ధులై తగినవారి కేమసాధ్యమటంచు నూహించరాదె?
తెలుగు మాటలు నాల్గైదు తెలిసి తాము కవులమనుకొన్న" రాణిస్తారా

అని ఒక కవి హేళన చేయగా మరొక కవి

ఇలలో వైదిక విద్వత్తిల కంబులకేమి దిక్కు తెలిపితివమ్మా!
జిలిబిలి పలుకుల వెలదీ! వలుగాకిన కారగుళ్ళ పాలై తిగదే!

అని వాపోతాడు.

కంపెనీ ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఆంగ్లోద్యోగులకు స్థానిక భాషల నభ్యసించవలసిన అవసరం ఏర్పడింది. మొదట్లో స్థానికులైన పండితుల దగ్గిర భాషాధ్యయనం చేశారు. అందుకు అవసరమైన వ్యాకరణాలు, నిఘంటువులు, పదగుచ్ఛాలు తయారు చేయించారు; కొందరు ఆంగ్లోద్యోగులే స్వయంగా సంకలనం చేశారు. మామిడి వెంకయ్య అనే పండితుడు 1806 లో ఆంధ్రదీపిక అనే నిఘంటువు వ్రాశాడు. మద్రాస్ కాలేజీ బోర్డు కార్యదర్శి గావున కాంప్‌బెల్ స్థానిక సంస్కృతాంధ్ర పండితుల సహకారంతో వ్యాకరణం రచించాడు. ఇక C.P. బ్రౌన్ తెలుగు భాషకు చేసిన సేవ అపారమైంది. సంస్కృతాంధ్రాల్లో

బ్రౌన్ మంచి పాండిత్యం సంపాదించాడు. జిల్లాలలో పర్యటన చేసి పండితుల నుండి వందలకొలది గ్రంథాలు సేకరించాడు. భిన్న ప్రతులను బేరీజు వేసి శుద్ధ ప్రతులను నిరూపించి మను, వసు చరిత్రాది ప్రబంధాలకు వ్యాఖ్యానాలు వ్రాయించి ప్రచురించాడు. ప్రజల్లో ప్రచారంలో ఉన్న వేమన పద్యాలను సేకరించి, కవిగా, మత సంఘ-సంస్కరణాభిలాషిగా వేమన ఘనతను ఆంధ్రులకు చాటి చెప్పాడు; ఆ పద్యాలను ఆంగ్లీకరించి ప్రపంచానికి చాటాడు. తెనుగుకు ఇంగ్లీషులో వ్యాకరణం వ్రాశాడు. తెలుగు-ఇంగ్లీషు, ఇంగ్లీషు-తెలుగు నిఘంటువులు (బ్రౌణ్యము) తయారు చేశాడు. బ్రౌన్‌కు పూర్వమే దత్త మండలాలు, మైసూర్, హైదరాబాద్ మద్రాస్‌లలో సర్వేయర్‌గా పనిచేసి సర్వేయర్ జనరల్ అయిన (1816) కలొనెల్ కాలిన్ మెకంజీకి స్థానిక చరిత్రలపట్ల అభిమానం. కావలి సోదరుల (బొర్రయ్య, లక్ష్మయ్య, వెంకటస్వామి) సహాయంతో స్థానిక చరిత్రలను సేకరించాడు. వీనిలో గ్రామ కైఫియతులు, దండ కవిలెలు, దేవాలయ శాసనాల ప్రతులు మొదలైనవి ఉన్నాయి. ఈ స్థానిక చరిత్రలను 70 సంపుటాలుగా వర్గీకరించి ప్రాచ్య లిఖిత పుస్తక భాండాగారంలో బ్రౌన్ భద్రపరిచాడు. ఈ విధంగా ఆంధ్రుల సారస్వతానికి చరిత్రకూ ఎనలేని సేవచేసిన బ్రౌన్ పండితుడు ఆంధ్రులకు చిరస్మరణీయుడు. వసు చరిత్రకు వ్రాసిన వ్యాఖ్యలో మురుపాక బుచ్చన్న శాస్త్రి :

> నూరార్లు లెక్కసేయక పేర్లదిన విబుధ జనుల పిలిపించుచు వే
> నూర్లర్థమిచ్చు వితరణి చార్లీసు ఫిలిప్సు బ్రౌను సాహెబు కరుణన్

అని శ్లాఘించాడు.

పౌర ఉద్యోగులేగాక క్రైస్తవ మత ప్రచారకులు సయితం దేశభాషలను నేర్చుకొనే అవసరాన్ని గుర్తించారు. అట్టివారిలో పోర్చుగీస్ పాదరీ అయిన కాల్డ్‌వెల్ పండితుని ద్రావిడ భాషలకు తులనాత్మక వ్యాకరణం గొప్ప పరిశ్రమ. ఇంగ్లండులో 17 వ శతాబ్ది చివర్లోనే మత ప్రచారక సంఘాలు నెలకొన్నాయి. క్రైస్తవ విజ్ఞానాభివృద్ధి సంఘము (1699) సువార్తా ప్రచారక సంఘము (1701) ఏర్పడినాయిగాని ఇంగ్లీషు కంపెనీవారు మతప్రచారాన్ని నిరుత్సాహపరచడంవల్ల ఆంగ్ల మత ప్రచారకులు ఆంధ్ర దేశానికి వచ్చినట్లు కన్పించదు. డచ్చివారు మాత్రం తమ ప్రభుత్వ ప్రోత్సాహంతో తమిళనాడు లోని తరంగంబాడి కేంద్రంగా మత ప్రచారం సాగించారు. 1711-13 మధ్య కాలంలో అచ్చు యంత్రాన్ని నెలకొల్పి పుస్తక ప్రచురణకు గూడ పూను కున్నారు. 1719 లోనే మద్రాస్ సెయింట్ జార్జి కోట గ్రంథాలయంలో తెలుగు

బైబుల్ ఉన్నట్లు తెలుస్తున్నది. తెలుగు భాషకు సేవ చేసిన నాటి మతప్రచార కులలో జర్మన్ దేశీయుడైన షూల్జ్ ప్రథమ గణ్యుడు. ఈతడు 1719 లో ఇండియా వచ్చి కడలూర్, మద్రాస్, పులికాట్ ప్రాంతాలలో పర్యటించి తెలుగు నేర్చుకొని తెలుగు వ్యాకరణం తెలుగులో వ్రాశాడు; బైబిల్‌ను తెలుగులోనికి అనువదించినాడు (1727); 1743 లో స్వదేశం తిరిగివెళ్ళి 1746-47 సంవత్స రాలలో హావే నగరంలో నాలుగు తెలుగు క్రైస్తవ గ్రంథాలు ప్రచురించినాడు. బెంగాలులో శ్రీరాంపూర్‌లో మరొక ముద్రణాలయం నెలకొల్పి దచ్చివారు 19 వ శతాబ్ది ఆరంభంలో (1807-1810) తెలుగు బైబుల్ గ్రంథాన్ని అచ్చు వేశారు. ఈ తెలుగు బైబుల్ తయారీలో సుబ్బరాయడు తోడ్పడినట్లు తెలుస్తుంది. ఈతడు తెలుగుదేశంలో స్థిరపడిన దేశస్థ బ్రాహ్మణుడు. క్రైస్తవ మతం స్వీకరించి ఆనందరావు అనే పేరు ధరించి విశాఖపట్టణంలో మిషనరీ పాఠశాలను సయితం నిర్వహించాడు. ఇదే కాలంలో మంగళగిరి ఆనందరావు 'వేదాంత రసాయనం' అనే మరొక క్రైస్తవ గ్రంధాన్ని రచించాడు. క్రైస్తవ పురాణాలు ఆధారంగా కావ్యాలు వెలువడసాగినాయి.

ఇంగ్లీషు కంపెనీవారు సెయింట్ జార్జి కోటలో 1812 నాటికి అచ్చు యంత్రం నెలకొల్పి వ్యాకరణాలు, పదకోశాలు, ఇతర పాఠ్య పుస్తకాలు అచ్చు వేయనారంభించారు. అచ్చు యంత్రం రావడంతో వార్తా పత్రికా ప్రచురణకు ప్రోత్సాహం లభించింది. బెంగాల్ గవర్నర్ జనరల్ వారన్ హేస్టింగ్స్ (1773-1783) కాలంలోనే ఆంగ్లేయులు బెంగాలులో ప్రారంభించిన వార్తా పత్రికలు బొంబాయి, అలహాబాద్, మద్రాస్ నగరాలకు మార్గదర్శకము లయినాయి. మద్రాస్‌లో ఎథీనియం, ఈవెనింగ్ మెయిల్, స్పెక్టేటర్, ఎగ్జామినర్ మొదలైన ఇంగ్లీషు పత్రికలుండేవి. స్థానిక విద్యావంతులు కొందరు కలిసి 1833 నుండి 'మద్రాస్ క్రానికల్' అనే పత్రికను తెలుగు తమిళ భాషల్లో వెలువరించినట్లు తెలుస్తుంది. 1838 లో మండిగల వెంకటరాయశాస్త్రి సంపాద కుడుగా 'వృత్తాంతిని' అనే తెలుగు పత్రికను ప్రారంభించారు. 'వర్తమాన తరంగిణి' అనే పత్రికను సయ్యద్ రహింతుల్లా సాహేబు 1841 లో స్థాపించాడు. భాషా పరిజ్ఞానం విజ్ఞానాభివృద్ధి, యుక్తాయుక్త విచక్షణా జ్ఞానం, దేశ విదేశ వ్యవహార పరిచయం, ఆత్మస్థైర్యం. దేశాభిమానం ప్రజల్లో కలిగించడమే తన పత్రిక ఆశయాలుగా రహింతుల్లా ప్రకటించాడు. క్రైస్తవ మత ప్రచారకులు సయితం పత్రికలు నిర్వహించారు. జాన్ ఎడ్మండ్ షార్కీ అనే పాదరీ బందర్‌లో "హితవాది" పత్రికను నిర్వహించాడు. ఆంధ్రదేశంలో

అచ్చయి వెలువడిన మొదటి తెలుగు పత్రిక 'హితవాది' యేనని చెప్పవచ్చు. క్రమంగా తెలుగు పత్రికల సంఖ్య నానాటికి పెరిగి భిన్న నగరాలనుండి వెలువడసాగినాయి.

ఇక, భాషలో పాశ్చాత్య భాషా పదాలు విశేషంగా ప్రవేశించినాయి. పెద్ద పెద్ద పండితులు సయితం జాబుల్లో, నివేదికలో యాత్రా చరిత్రలలో సజీవమైన వ్యవహారిక భాషనే వాడేవారు. పండితులది గ్రాంధిక భాష అనే భావం ఏర్పడిన సూచనలు లేవు.

## మత పరిస్థితులు

క్రైస్తవ పాదరీల గ్రంధ రచనకు పత్రికా ప్రచురణకు స్వీయమత ప్రచారం ప్రధాన లక్ష్యం. దేశంలో ముఖ్యంగా హిందూ మతంలోను, సమాజం లోను అనేక మూఢ విశ్వాసాలు దురాచారాలు ప్రబలి ఉండడం క్రైస్తవ మత వ్యాప్తికి అనుకూలించినాయి. వేమన కాలానికే హిందూమతంలో అరాచక పరిస్థితులేర్పడినట్లు గమనించాము. అంటరానితనం సమాజాన్ని పీడిస్తున్న ఘోర దురాచారం. వేమన తరువాత వీరబ్రహ్మంవారి పదునెన్మిదో శతాబ్దం పూర్వార్ధంలో (1700-1750) హిందూమత సాంఘిక సంస్కరణలకై ప్రచారం చేశాడు. కడప జిల్లాలోని కందిమల్లయపల్లి ఈతని నివాస స్థలం; కమ్మరం వడ్రంగం వృత్తులైన విశ్వకర్మ కులస్థుడు. కులమత భేదాలు కృత్రిమములని బోధిస్తూ అనేక తత్త్వాలు, కాల జ్ఞానాలు రచించాడు. వీరబ్రహ్మం తత్త్వాలకు "శివ గోవింద గోవిందా। హరి గోవింద గోవిందా" అనే 'పంత' ఉంటుంది. అన్ని కులాలవారు, మతాలవారు అతని శిష్యులయినారు. వారిలో సిద్దయ్య మహమ్మదీయుడు; కక్కయ్య అంత్యజుడు, వీరబ్రహ్మం సిద్ధాంతం 'అచల' సిద్ధాంతంగా ప్రసిద్ధమయింది. బ్రహ్మ పదార్థమే నిత్యం, శాశ్వతం, నిర్గుణం; దాన్ని గ్రహించడమే జీవి పరమార్థం అని అతని బోధనలసారం. అచల సిద్ధాంతానికి శంకరాద్వైతానికి ఎక్కువ భేదం కన్పించదు. వీరబ్రహ్మం శిష్యులు కూడ అదే సిద్ధాంతంలో తత్త్వాలు వ్రాశారు. వేమన పద్యాలవలె వీరి తత్త్వాలు ప్రజల్లో విరివిగా ప్రచారమయినాయి. కాని ప్రజల మానసిక పరివర్తనకు సాంఘిక సంస్కరణకు ఎంతవరకు దోహదం చేసినవి అనేది అనుమానం. చివరకు విశ్వకర్మ కులగురువుగా మాత్రమే వీరబ్రహ్మం మిగిలిపోవడం దురదృష్టకరం!

సమకాలిక మత సాంఘిక పరిస్థితులవట్ల ప్రజల్లో ప్రబలిన అసంతృప్తికి వేమన వీరబ్రహ్మమూ ప్రతినిధులు. ఆ పరిస్థితుల్లోనే క్రైస్తవ పాదరీలు దేశంలో

ప్రవేశించారు. గోవానుండి పోర్చుగీస్ జెస్యూట్లు 1597 లోనే రెండో వెంకటపతి రాయల కొలువులో చాలాకాలం ఉన్నారు. కాని మత ప్రచారానికి అనుకూల పరిస్థితులు లేకపోయినాయి. 1626 లో మదురైకు వచ్చి రాబర్ట్ ది నోబిలీ కొత్త ప్రచార పద్ధతి అవలంబించి జనాన్ని ఆకర్షించినాడు. హిందూ సన్యాసి వేషం ధరించి తత్త్వ బోధానంద స్వామి అనే పేర జనాదరణ సాధించాడు. పాదిరీలను రోమపురి సన్యాసులుగా గౌరవింపబడినారు. మచిలీపట్టణంలో 1670 లోనే పోర్చుగీసులు చర్చి నిర్మించారు. 1700 ప్రాంతంలో ఫ్రెంచి జెస్యూట్లు పుదుచ్చేరిలో కర్ణాటక మిషన్ నెలకొల్పినారు; ఈ మిషన్ శాఖోపశాఖలుగా విస్తరించి విస్తృత ప్రచారం సాగించింది. చిత్తూరు జిల్లా పుంగనూరు, గుంటూరు జిల్లా ఫి (ప) రంగిపురం వీరి ప్రధాన కేంద్రాలయినాయి. క్రమంగా ప్రొటెస్టెంటు పాదిరీలు రంగప్రవేశం చేశారు.

ఇంగ్లండులో 17 వ శతాబ్దం చివర్లోనే మత ప్రచారక సంఘాలేర్పడినాయి. కాని వాణిజ్యానికి భంగం వాటిల్లుతుందనే భయంతో కంపెనీ మత ప్రచారాన్ని నిరుత్సాహపరిచింది. పారిశ్రామిక వర్గాల ప్రభావంవల్ల ప్రభుత్వ ఆశయం సామ్రాజ్య నిర్మాణంగా మారింది. మత ప్రచారం సామ్రాజ్య విస్తరణకు సాధనంగా భావించేవారు. అందుచే కంపెనీ ఇండియాకు మత ప్రచారకులను పంపవలెనని 1813 చార్టర్ చట్టం విధించడంతో మత ప్రచారానికి మంచి ప్రోత్సాహం లభించింది. లండన్ మిషన్‌వారు విశాఖపట్టణం కేంద్రంగా సర్కారు జిల్లాలలో ముఖ్యంగా భద్రాచలం మన్య ప్రాంతాల్లోని కొండజాతి ప్రజల్లో ప్రచారాన్ని కేంద్రీకరించారు. అమెరికన్ లూథరన్ మిషన్ నాయకుడైన రాబర్ట్ నోబుల్ సర్కారులలో పర్యటించి మచిలీపట్టణంలో పాఠశాల స్థాపించాడు (1841); గుంటూరు లూథరన్ మిషన్ ప్రధాన కేంద్రమయింది. కెనడియన్ బాప్టిస్టు ఒంగోలును కేంద్రంగా చెబుతున్నారు. హైదరాబాదులో ప్రధానంగా చర్చి మిషన్ సొసైటీ జనానా మిషన్‌వారు ప్రచారం సాగించారు.

దేశీయులు క్రైస్తవ మత ప్రచారాన్ని మొదట్లో ప్రతిఘటించారు. అట్టి హిందువులలో మాల మాదిగ దాసర్లు ముఖ్యులు. వీరు వైష్ణవం స్వీకరించినవారు; తమతమ కులాల్లో పూజారులు క్రైస్తవమత వ్యాప్తితో తమ జీవనోపాధికి భయం కలుగుతుందని వీరి భయం అయి ఉండవచ్చు. ఇక ముస్లిముల సంగతి వేరుగా చెప్పనక్కరలేదు. అనాదిగా క్రైస్తవ-ముస్లిం సంఘర్షణ పశ్చిమాసియాలో జరుగుతూనే ఉంది. నైజాం సైన్యాలు రాయలసీమలో కంబాలదిన్నె, మాదిగుబ్బ, కృష్ణాపురం మొదలైనచోట్ల చర్చిలను నేలమట్టంచేసి అపారమైన నష్టం

కలిగించారు. టిప్పు సుల్తాన్ కూడ క్రైస్తవులను హింసకు గురిచేసినాడు. ఇక హిందువులలో అగ్రవర్ణాలవారు మొదట్లో క్రైస్తవాన్ని ఆదరించారు. "ఈ దేశంలో అంత్యజులను మార్చడం చాలా కష్టం; అగ్రవర్ణాలను మతంలోకి మార్చుకోవడం సులభం" అని ఒక ఫాదిరీ వ్రాశాడు (Telugu Mission). అగ్రవర్ణాలలో బ్రాహ్మణుడైన సుబ్బారావనే ఆనందరావును గురించి పైన పేర్కొన్నాము. పులిపాక జగన్నాథం, పురుషోత్తమ చౌదరి (బెంగాలీ బ్రాహ్మణుడు) క్రైస్తవం స్వీకరించి ఆ మత ప్రచారానికి అనుకూలంగా (రామదాసు) నాచోలి భక్తి కీర్తనలనేకం వ్రాశారు. శూద్ర వర్ణంలో మెలమ, రెడ్డి, కమ్మ, సాలె కులాలవారు అసంఖ్యాకంగా మతం స్వీకరించారు.

ఫాదిరీలు క్రమంగా పాఠశాలలు, వైద్యశాలలు నెలకొల్పి వానిలో మతం మార్చుకొన్న వారికి విద్య వైద్య ఉద్యోగావకాశాలు కల్పించి అంత్యవర్ణాలను ఆకర్షించారు. వీరుకూడ తమ ఆర్థిక పరిస్థితి మెరుగుపడడానికి తద్వారా సాంఘిక హోదా పెరగడానికి క్రైస్తవం సాధనమని గ్రహించారు. ప్రభుత్వం కూడ పాఠశాలల్లో జైళ్ళలో మత ప్రచారానికి అవకాశాలు కల్పించింది. ప్రభుత్వ పాఠశాలల్లో బైబిల్ పాఠ్యగ్రంథమయింది. "భారతదేశంలో ఆంగ్లవిద్యను ఆశయం క్రైస్తవ జ్ఞానాన్ని బోధించడమే" అని 1792 లో సర్ చార్లెస్ గ్రాంట్ వ్రాశాడు. ఈ చర్యలవల్ల క్రైస్తవం చురుకుగా వ్యాపించి విద్యావంతులైన హిందువులలో భయాందోళనలు కలిగించింది. గాజుల లక్ష్మీనరసు సెట్టివంటి వారు ప్రభుత్వ చర్యలను పాదిరీల ప్రచార విధానాన్ని తీవ్రంగా విమర్శించ సాగినారు. క్రైస్తవ ప్రచారం ప్రభుత్వంపట్ల అగ్రహావేశాలకు మంచి కారణ మయింది.

# హైదరాబాద్ సంస్థానం

హైదరాబాద్ రాజ్యంలో మధ్యయుగ భూస్వామ్య పాలనా విధానం కొనసాగింది. అసఫ్‌జా నైజాం ఉల్‌ముల్క్ తన సుబాలో మొగల్ సంప్రదాయాలను ప్రవేశపెట్టాడు. నైజాం నిరంకుశుడు. ఆస్థాన ఉద్యోగులను నియమించడానికి తొలగించడానికి అతనికి పూర్తి హక్కులున్నాయి. ఉత్తర దేశం నుండి తనవెంట వచ్చిన విశ్వాసపాత్రులైన ముస్లిం, కాయస్థ సర్దారులకు తన సుబాను జాగీరులుగా పంచి ఇచ్చాడు. జాగీరులుగాక జటప్రోలు, వనపర్తి, గద్వాల, అమరచింత వంటి పురాతన సంస్థానాలు సుబాలో ఉండేవి. మిగిలిన ప్రాంతం ఖాల్సాభూమి. దివాన్ పర్యవేక్షణలో ఉండేది. దివాన్, పేష్కార్, కాజీ, కొత్వాల్ వంటి పౌర పాలనోద్యోగులను నైజాం నియమించుకొనేవాడు. సైనికోద్యోగుల్లో మున్సబ్‌దార్, జమాదార్ ముఖ్యులు. దఫ్తర్-ఇ-దివానీ, దఫ్తర్-ఇ-మాల్ అనే రెవెన్యూ ఉద్యోగులు పశ్చిమ, తూర్పు వరగణాలలో రెవెన్యూ వసూలుకు బాధ్యులు. నిజాం నిరంకుశత్వంవల్ల, జాగీర్‌దారీ విధానం వల్ల కలిగిన ఆర్థిక సాంఘిక పరిణామాలను ముందుముందు పరిశీలిద్దాం.

అసఫ్‌జా మరణానంతరం (1748) నైజాం ఆలీఖాన్ (1761-1803) గద్దెనెక్కేవరకూ హైదరాబాద్ చరిత్రను పరిశీలించాము. నైజాం ఆలీ మహారాష్ట్రులతో, మైసూర్ పాలకులతో నిరంతరం పోరాడవలసి వచ్చింది; అంగ్లేయులపట్ల అతనికి అభిమానంలేదు. ఉత్తర సర్కారులను తిరిగి సాధించాలని అతడు చేసిన ప్రయత్నం ఫలించకపోగా గుంటూరు సర్కారును కంపెనీ వరం (1788) చేయవలసి వచ్చింది. సర్ జాన్‌షోర్ అవలంబించిన తటస్థ విధానంవల్ల షక్కర్ ఖేడా యుద్ధంలో ఓడిపోయి బిరార్, బిజాపూర్ ప్రాంతాలను నైజాం మహారాష్ట్రుల వరం చేశాడు; కాని పేష్వా మాధవరావు మరణానంతరం, ఫ్రెంచివారి సాయంతో ఆ ప్రాంతాలను తిరిగి వశపరచుకున్నాడు. మైసూర్‌తో కలిసి అంగ్ల వ్యతిరేక కూటమి నిర్మించాలనే అతని ప్రణాళిక టిప్పు అహంకారంవల్ల విఫలమయింది. ఈ పరిస్థితుల్లోనే 1799 లో వెల్లస్లీ సూచించిన సైన్య సహకార సంధికి అంగీకరించి నైజాం ఆలీ నాలుగో మైసూర్ యుద్ధంలో

పాల్గొన్నాడు. టిప్పు సామ్రాజ్య విచ్ఛిన్నంతో నైజాం అలీకి సంక్రమించిన ప్రాంతాలను సైన్య సహకారం ఒప్పందాన్ని అనుసరించి కంపెనీకి దత్తం చేశాడు (1800). ఈ సంధితోనే నైజాం స్వాతంత్ర్యాన్ని కోల్పోయి కంపెనీకి సామంతుడయినాడు. నైజాం రాజ్య విచ్ఛిన్నం ప్రారంభమయింది.

నైజాం అలీ కుమారుడు సికందర్‌జా కాలంలో (1803-1829) నైజాం అధికారాలు మరింత క్షీణించినాయి. ఆర్థిక సంక్షోభంతో జాగీర్‌దార్ల తిరుగుబాట్లతో సంస్థానం అల్లకల్లోలమై పరిపాలనపై కంపెనీ అదుపు పెరగడానికి తోడ్పడింది. సికందర్ జా కుగానీ అతని సేనాపతియైన రాజా మహీపత్‌రాం (బీరార్ జాగీర్‌దారు) కు గానీ ఆంగ్లేయులపట్ల సదభిప్రాయంలేదు. అందుచే రెండో మరాటా యుద్ధంలో (1803-1805) నైజాం హృదయపూర్వకంగా వెల్లస్లీతో సహకరించలేదు. ఇందుకు ఆగ్రహించి వెల్లస్లీ నైజాంపై ఒక అనుబంధ సంధిని విధించి (1803) యుద్ధ సమయాల్లో నైజాం సైన్యాలు కంపెనీ ఆధీనంలో ఉంచే ఏర్పాటు చేశాడు. 1804 లో దివాన్ అరస్తుంజా మరణించాడు. తనకు మిత్రుడైన మహీపత్‌రాంను దివాన్‌గా నియమించడానికి సికందర్ ప్రయత్నించాడు. కాని రెసిడెంట్ కిర్క్ ప్యాట్రిక్ జోక్యం కలిగించుకొని కంపెనీకి అనుకూలుడైన మీర్ ఆలంను దివాన్‌గా నియమించడం జరిగింది. దివాన్ ప్రాబల్యం తగ్గించే ఉద్దేశంతో మహీపత్‌రాంను పేష్కారుగా నియమించడానికి సికందర్ ప్రయత్నించాడు. కాని కంపెనీకి అనుకూలుడైన చందూలాల్ పేష్కార్ అయినాడు (1806). దీనితో నైజాంకు తన ఆస్థాన ఉద్యోగులను నియమించుకొనే స్వాతంత్ర్యం కూడా లేదని స్పష్టమయింది. మీర్ ఆలం కాలంలో (1804-1808) హైదరాబాద్ నుండి మద్రాస్, బొంబాయి నగరాల మధ్య రహదారులు మరమ్మతు చేయబడినాయి. ఫ్రెంచి ఇంజనీర్ల సహకారంతో హైదరాబాద్ సమీపంలో సుందరమైన 'మీర్ ఆలం' తటాకం నిర్మించబడింది. మీర్ ఆలం తర్వాత అతని అల్లుడు మునీర్ ఉల్‌ముల్క్ దివాన్ అయినాడు. కాని అధికారం చందూలాల్ హస్తగతమయింది.

సైన్య సహకార సంధి ద్వారా నైజాం కంపెనీ కీలుబొమ్మ కావడాన్ని సంస్థానంలోని జాగీర్‌దార్లు సహించలేకపోయినారు. కొప్పల్, బిదర్, ఉద్గిర్‌లలో జమీందార్లు తిరుగుబాట్లు చేశారు. నగరంలోనూ, నగర పరిసరాల్లోనూ భిన్న వర్గాల మధ్య సంఘర్షణలు ప్రారంభమయినాయి. వీనికి తోడు భిల్లులు, పిండారీలు దాడులుచేసి ప్రజలను హింసించసాగినారు. ఈ అల్లర్లనణచే బాధ్యత సైన్య సహకార సైన్యానిదికాదు, అందుచేత ప్రత్యేక సైనిక దళాన్ని నిర్మించ

దానికి రెసిడెంట్ రస్సెల్ ప్రయత్నించాడు. గవర్నర్ జనరల్ ఆమోదంతో 'రస్సెల్ దళం' (Russel Brigade) ఏర్పడింది. ఇందులోని అధికారులు, సిబ్బంది ఆంగ్లేయులు. వీరి ఖర్చును నైజాం భరించవలె! క్రమంగా రస్సెల్ దళం ప్రమాణం విపరీతంగా పెరిగింది. వీరు స్థానికంగా చెలరేగిన అల్లర్లనణచి శాంతి భద్రతలు నెలకొల్పడమేగాక, పిండారీలతో యుద్ధంలో, మూడో మరాటా యుద్ధంలోను ప్రముఖ పాత్ర నిర్వహించారు.

సికందర్ కాలంలో హైదరాబాద్‌లో ఆర్థిక సంక్షోభం తారాస్థాయికి చేరింది. అంతఃపుర ఆడంబరాలకు విపరీతంగా దుబారా జరిగేది. రస్సెల్ దళంపై ఖర్చు భరించలేనంతగా పెరిగింది. ఫలితంగా ఆర్థిక పాలనలో అనారోగ్యకర పరిణామాలు జరిగినాయి. శిస్తు వసూలు చేసే అధికారాన్ని విక్రయించే సంప్రదాయం (Farming) ప్రారంభమయింది. ఈ దళారులు ప్రజలను పీడించి శిస్తు వసూలు చేసేవారు. శిస్తులో అధికభాగం వారి హస్తగత మవుతుండేది. శిస్తు చెల్లించలేని రైతులు అరబ్ వడ్డీ వ్యాపారుల నుండి అప్పులు తీసుకొనేవారు. పంట పొలాలు వారి స్వాధీనమవుతుండేవి. రైతులు రుణ భారంతో దారిద్ర్యంతో క్రుంగిపోసాగినారు. ప్రభుత్వ ఆదాయం నానాటికి క్షీణించింది. ఉద్యోగులకు జీతాలు కూడ చెల్లించలేని పరిస్థితి యేర్పడింది. ఈ పరిస్థితుల్లోనే పామర్ కంపెనీ అనే బ్యాంకింగ్ సంస్థను నెలకొల్పారు.

## పామర్ బ్యాంకింగ్ కంపెనీ

పామర్ కంపెనీ స్థాపకుడైన విలియం పామర్ తండ్రి పూనాలో రెసిడెంట్‌గా వుండేవాడు; తల్లి లక్నో వాసియైన ముస్లిం వనిత. విలియం నైజాం సైన్యంలో ఉద్యోగి; చాల దురాశాపరుడు; కోటీశ్వరుడు కావాలనే ఆశయంతో ఉద్యోగం మాని బాంకింగ్ కంపెనీ ద్వారా నైజాంను దోచుకొనే ప్రయత్నం చేశాడు. విలియం పామర్‌తోబాటు హేస్టింగ్స్ పామర్, విలియం కర్రీ, శామ్యూల్ రస్సెల్, గుజరాతీ వ్యాపారి బంకంటిదాస్ మొదలైనవారు కంపెనీలో సభ్యులు. హైదరాబాద్‌లో రెసిడెంట్ అయిన రస్సెల్‌కు ఇతర ఉన్నతోద్యోగులకు కంపెనీలో వాటా లున్నాయిట! నౌకా నిర్మాణానికి గోదావరి అడవుల నుండి కలప సరఫరా చేయడం, నదిపై నౌకాయానాన్ని అభివృద్ధి పరచడం, సంస్థానంలో బ్యాంకింగ్ విధానాన్ని మెరుగుపరచడం కంపెనీ ఆశయాలుగా పేర్కొన్నారు గాని ఈ కార్యక్రమాలను కంపెనీ చేపట్టిన దైనం తెలియదు రెసిడెంట్ రస్సెల్ సిఫారసుపై గవర్నర్ జనరల్ హేస్టింగ్స్

పామర్ కంపెనీకి అనుమతి ఇచ్చాడు. రస్సెల్ దళానికి జీతాలు చెల్లించే బాధ్యత కంపెనీ పరమయింది. ఔరంగాబాద్‌లో కంపెనీ శాఖను నెలకొల్పారు.

గవర్నర్ జనరల్ సిబ్బందిలోనివాడైన రంబోల్ట్ 1816లో కంపెనీలో వాటా దారుగా చేరినాడు రంబోల్ట్ భార్య గవర్నర్ జనరల్ పెంపుడుకూతురు; రంబోల్ట్‌కు గవర్నర్ జనరల్ దగ్గిర పలుకుబడి వుండడంతో కంపెనీ ప్రతిష్ఠ పెరిగింది. ఇది గమనించి పేష్కార్ చందూలాల్ సంస్థానంలోని ఆర్థికపరమైన లావాదేవీలు కంపెనీ పరంచేసి లాభం పొందసాగినాడు. పామర్ కుటుంబ సభ్యులకు సాలీనా 80 వేల ఉపకార వేతనాలు చెల్లించేవాడు. స్థానిక సంస్థలకు సంస్థానంలోని ధనవంతులకు నైజాంతో లావాదేవీలు నిలిచిపోయినాయి. కంపెనీయే ధనవంతుల నుండి 12 శాతం వడ్డీకి అప్పు తీసుకొని ప్రభుత్వానికి 25 శాతానికి అప్పు ఇవ్వసాగింది. నైజాం రుణం ఒక కోటి 70 లక్షలకు చేరింది. రస్సెల్ దళం జీతాలకు (నెలకు రెండు లక్షలు) గాను బీహారులో సాలుకు 30 లక్షల ఆదాయంలభించే జిల్లాలు కంపెనీ పరమయినాయి. కంపెనీ వుద్యోగులు దౌర్జన్యంగా రైతుల నుండి శిస్తు వసూలు చేసేవారు. బకాయిపడిన రైతులు అడవులకు పారిపోయేవారు. క్రమంగా గ్రామాలు నిర్జనములయినాయి. "రైతుల దైన్యం అంటువ్యాధిలా గ్రామ గ్రామానికి వ్యాపిస్తున్నది" అని మెట్‌కాఫ్ జీవిత చరిత్రలో థామ్సన్ వ్రాశాడు.

పామర్ కంపెనీ దురాగతాలు, నిజాం రుణ భారం, ప్రజల దయనీయమైన స్థితిగతులు గవర్నర్ జనరల్ కౌన్సిల్‌లోనూ, పార్లమెంటులోనూ కూడ చర్చనీయాంశాలయినాయి. హేస్టింగ్స్ ప్రభువు తీవ్ర విమర్శకు గురిఅయినాడు, రస్సెల్ స్థానంలో మెట్‌కాఫ్‌ను రెసిడెంటుగా నియమించారు; (1820). 1824 లో జాన్ యాడమ్స్ తాత్కాలిక గవర్నర్ జనరలయినాడు. మెట్‌కాఫ్, యాటమ్స్ వుభయులకూ పామర్ కంపెనీ వ్యవహారాలు క్షుణ్ణంగా తెలుసు. అందుచే నైజాం కంపెనీకి చెల్లించాల్సిన రుణాన్ని 80 లక్షలకు తగ్గించి ఆ మొత్తాన్ని రెసిడెంట్ ఖజానా నుండి చెల్లించే యేర్పాటు చేశారు. పామర్ కుటుంబ సభ్యులకు చెల్లిస్తున్న వుపకార వేతనాలు రద్దయినాయి. కంపెనీ దివాలా తీసింది. చందూలాల్ తీవ్రమైన అభిశంసకు గురి అయినాడు; ఐనా తెలివిగా తన పదవిని రక్షించుకున్నాడు. 1823 లో నైజాం రెసిడెంట్‌తో ఒడంబడిక చేసుకొని తాను కంపెనీకి చెల్లించాల్సిన మొత్తానికి బదులుగా ఉత్తర సర్కారులపై కంపెనీ తనకు చెల్లిస్తున్న పేష్కష్‌ను శాశ్వతంగా మినహాయింపు చేశాడు. సర్కారులు బ్రిటిష్ సామ్రాజ్యంలో లీనమయినాయి.

## ప్రభుత్వ సంస్కరణలో ప్రయోగాలు

మెట్‌కాఫ్ రాజ్యంలో పర్యటించి ప్రజల స్థితిగతులు స్వయంగా పరిశీలించాడు. పాలనా యంత్రాంగం పూర్తిగా విచ్ఛిన్నమయింది. అతనికి పూర్వమే రస్సెల్ ప్రభుత్వాన్ని సంస్కరించవలసిన ఆవశ్యకతను నొక్కి చెప్పాడు. రెవెన్యూ న్యాయ నిర్వహణాధికారాలు తాలూకాదారుల చేతుల్లో కేంద్రీకృతం కావడం వల్ల, శిస్తు వసూలులో దళారుల దౌర్జన్యాలవల్ల "దేశంలో సగభాగం ఎడారిగా మారింది. మిగిలిన ప్రాంతంలో కూడ రైతు తన అవసరాలకు సరిపడే వరకు మాత్రమే పండిస్తున్నాడు. అందుచే రాజ్య ఆదాయం క్రమంగా క్షీణించింది. బ్రిటిష్ ప్రభుత్వం జోక్యం కలిగించుకొనడం తప్పనిసరి. తాలూకాను ప్రమాణంగా తీసుకొని ప్రభుత్వ యంత్రాంగాన్ని పునర్వ్యవస్థీకరించడం వారి నైతిక బాధ్యత. లేదా ప్రజలు పొరుగు ప్రాంతాలకు వలస వెళ్ళడంగాని గత్యంతరం లేక ప్రభుత్వంపై తిరుగుబాటు చేయడం తథ్యం" అని రస్సెల్ వ్రాశాడు. మెట్‌కాఫ్ సంస్కరణలకు పూనుకున్నాడు. (1) ప్రభుత్వంలో దుబారా ఖర్చులు తగ్గించాడు. (2) రాజ్య స్వపాలనకు గ్రామాన్ని ప్రమాణంగా నిర్ణయించి ప్రతి గ్రామము చెల్లించవలసిన శిస్తు మొత్తాన్ని నిర్ణయించాడు. (3) శిస్తు వసూలును పర్యవేక్షించడానికి ఇంగ్లీషు అధికారులను నియమించాడు. ఈ సంస్కరణలు ఆశించిన ఫలితాల నిచ్చినాయి. ప్రభుత్వం పట్ల రైతులలో విశ్వాసమేర్పడసాగింది; గ్రామాలు కళకళలాడసాగినాయి. కాని చందూలాల్ ఈ సంస్కరణలను వ్యతిరేకించాడు. 1825 లో రెసిడెంట్‌గా వచ్చిన మార్టిన్ కూడ సంస్థాన వ్యవహారాల్లో కంపెనీ జోక్యానికి విముఖుడు. అందుచే మెట్‌కాఫ్ సంస్కరణల పునఃపరిశీలన ప్రారంభమయింది.

## నాసిర్ ఉద్ దౌలా 1829 - 1857

సికందర్ జా 1829 లో మరణించగా ఆతని కొడుకు నాసిర్ ఉద్ దౌలా నవాబ్ అయినాడు. కొన్ని రోజుల్లోనే దివాన్ మునీర్ ఉల్ ముల్క్ మరణించడంతో చందూలాల్ దివాన్ అయినాడు. కొత్త ప్రభుత్వం తీసుకొన్న మొదటి చర్య గవర్నర్ జనరల్ బెంటింక్ అనుమతితో మెట్‌కాఫ్ సంస్కరణలను రద్దు చేయడం. దీనితో శిస్తు వసూలుపై ఇంగ్లీషు పర్యవేక్షకులు బర్తరఫ్ అయినారు. స్థానిక అమీనుల నియామకం జరిగింది. యథాప్రకారం రైతులు వీరి దౌర్జన్యాలకు ఎర అయినారు. జమీందార్లు సాధ్యమైనంత మొత్తాలు వసూలు చేసుకొని నైజాముకు చెల్లించక సమీపంలోని మచిలీపట్టణం, బళ్ళారి మొదలైన

కంపెనీ నగరాల్లో కాలక్షేపం చేయడం ప్రారంభించారు. దీనికి తోడి రాజ్యంలో దారి దోపిడి దొంగలు మితిమీరారు. కొప్పల్, మునగాల, ఖిర్, చింతగని, మహదేవపురం జమీందార్లు తిరుగుబాటు చేశారు. రాజ్యం అల్లకల్లోలమయింది. ఈ తిరుగుబాట్లను రస్సెల్ దళం అణచివేసింది. ఈ సందర్భంలోనే 1857 తిరుగుబాటుకు నాంది వంటి సంఘటన 1827 లో జరిగింది. సిపాయిలపై అధికారియైన లెఫ్టినెంట్ కల్నల్ ఇవాన్ డేవిస్ సిపాయీలు ధరించే దుస్తుల్లో మార్పులు చేయడానికి ప్రయత్నించాడు. అందుకు ఆగ్రహించిన సిపాయీలు డేవిస్‌ని మొమినాబాద్ దగ్గిర కాల్చి చంపారు.

ఈ పరిస్థితుల్లోనే హైదరాబాద్ వహబీ ఉద్యమానికి కేంద్రమయింది. అరేబియా వాస్తవ్యుడైన అబ్దుల్లా వాహబ్ ప్రారంభించినందున వహబీ ఉద్యమంగా ప్రసిద్ధమయింది. ప్రవక్త బోధనలకు విరుద్ధములైన ఆచారాలను తొలగించి ఇస్లామును పరిశుద్ధ మతంగా సంస్కరించడమే వహబీ ఉద్యమ లక్ష్యం. కాని ఇండియాలో వహబీ ఉద్యమంలో రాజకీయాలు ప్రవేశించినాయి. పంజాబులో సిక్కు ప్రభుత్వాన్ని, దేశంలో ఆంగ్ల ప్రభుత్వాన్ని కూలద్రోసి ముస్లిం సార్వభౌమత్వం నెలకొల్పడమే వహబీ ఉద్యమ ఆశయమయింది. ఉత్తర దేశంలో ఉద్యమానికి సయ్యద్ అహమ్మద్ బ్రెల్వీ నాయకత్వం వహించాడు. వాయవ్య సరిహద్దు రాష్ట్రాలు, సంయుక్త రాష్ట్రాలు, బెంగాలులలో చెలరేగి ఉద్యమం దక్షిణాదికి విస్తరించింది. 1831 లో బ్రెల్వీ మరణించిన తరువాత అతని అనుచరులైన ఆలీ, సలీమ్ అనేవారు బొంబాయి, బెంగుళూర్, మద్రాస్ లలో ప్రచారం సాగించారు. హైదరాబాద్‌లో నైజాం సోదరుడు ముబారిజ్ ఉద్దౌలా నాయకత్వంలో ఉద్యమం సాగింది. మొదటినుండి ముబారిజ్ బ్రిటిష్ వారిని ద్వేషించేవాడు. బ్రిటిష్ వ్యతిరేక చర్యలకై అతణ్ణి 1815 లో గోల్కొండలో నిర్బంధంలో ఉంచారు; కాని 1820 లో విడుదల అయినాడు. వహబీ నాయకుడుగా టోంక్, కర్నూలు, జోధపూర్, సతారా, భోపాల్, ప్రభువులను కూడగట్టి దేశ వ్యాప్తమైన బ్రిటిష్ వ్యతిరేక ఉద్యమాన్ని సంఘటితం చేయడానికి ప్రయత్నించాడు. ముఖ్యంగా కర్నూల్ నవాబైన గులాం రసూల్ ఖాన్ ముబారిజ్‌కు కుడి భుజంగా పని చేశాడు. అతణ్ణి రైసుల్ ముస్లిమీన్ బిరుదుతో వ్యవహరించేవారు. తన ఉద్యానవనాలను, సౌధాలను కూడ మందు గుండు సామగ్రి కార్ఖానాలుగా మార్చి పెద్ద పెద్ద ఫిరంగులను రసూల్‌ఖాన్ తయారు చేయించినట్లు తెలుస్తుంది. వీరి రహస్య కార్యకలాపాలను నెల్లూరు కలెక్టరయిన స్టోన్ హౌస్ గమనించి రెసిడెంట్ ఫ్రేజర్‌కు తెలియజేశాడు.

ముబారిజ్‌ను తిరిగి గోల్కొండలో నిర్బంధించాడు. (అతడు అక్కడే 1854 లో మరణించాడు) కర్నూలు నవాబు బ్రిటిష్ సైన్యాలతో పోరాడి బందీగా పట్టుబడ్డాడు. అతణ్ణి నెల్లూరులో నిర్బంధించి కర్నూలును బ్రిటిష్ సామ్రాజ్యంలో లీనం చేశారు. వహాబీ ఉద్యమం అంతరించింది.

## బీరార్ దత్తత (1853)

వహాబీ తిరుగుబాటునణచిన తరువాత సంస్థాన ఆర్థిక పరిస్థితులను చక్కదిద్దడానికి ఫ్రేజర్ ప్రయత్నించాడు. నైజాం ఆర్థిక ఇబ్బందులకు ప్రధాన కారణం సంస్థానంలోని సైనిక బలం. నైజాం సొంత సైన్యంలోని అరబ్, రోహిల్లా దళాలకు 94 లక్షలు, రస్సెల్ దళానికి 42 లక్షలు వ్యయమవుతుండేది. సైన్యంలో విదేశీయుల స్థానంలో సమర్థులైన స్థానికులను నియమించి ఖర్చు తగ్గించాలని ఫ్రేజర్ చేసిన ప్రయత్నాలను చందూలాల్, గవర్నర్ జనరల్ ఉభయులు వ్యతిరేకించారు. ఈలోగా నైజాం రుణం విపరీతంగా పెరిగిపోయింది; కంటింజెంట్ దళాలకు ఆరు నెలల జీతం బకాయి పడింది. సంస్థానంలో కొంత భూభాగాన్ని ఆంగ్లేయులకు విక్రయించడానికి చందూలాల్ సిద్ధమైనాడు. నైజాం వ్యతిరేకించడంతో గత్యంతరంలేక చందూలాల్ రాజీనామా చేశాడు. సిరాజ్ ఉల్‌ముల్క్ దివానై కొన్ని సంస్కరణలు ప్రవేశపెట్టాడు. నైజాం సైన్య ప్రమాణం తగ్గించాడు; పరిపాలనలో జిల్లాదారీ పద్ధతి అమలు జరిగింది. జిల్లాదారు జిల్లా కేంద్రంలోనే ఉండి ప్రభుత్వ విధులు నిర్వహించాలనే కట్టడి జరిగింది. ప్రభువుల ఖర్చులపై కూడ పర్యవేక్షణకు సిరాజ్ ఆలోచించాడు. దీనితో మున్సబ్‌దారులు, జాగీర్దారులు, తాలూక్‌దార్లు అలజడి ప్రారంభించారు. సంస్కరణలను నైజాం వ్యతిరేకించడంతో సిరాజ్ రాజీనామా చేశాడు కాని తిరిగి 1851 లో దివాన్ అయినాడు.

గవర్నర్ జనరల్ డల్‌హౌసీ (1848-56) తిరుగులేని సామ్రాజ్యవాది బ్రిటిష్ సామ్రాజ్య విస్తరణే అతని లక్ష్యం. రాజ్య సంక్రమణ విధానం అమలు పరిచి అనేక చిన్న సంస్థానాలను బ్రిటిష్ సామ్రాజ్యంలో లీనం చేశాడు. 1851 నాటికి నైజాం చెల్లించాల్సిన బాకీ బదులు సంస్థానంలో సారవంతమైన ప్రాంతాన్ని శాశ్వతంగా ఆక్రమించాలని అతని ప్రయత్నం. నాటికి నైజాం రుణం 70 లక్షల రూపాయిలు దాటింది. రుణం చెల్లింపును గురించి, రస్సెల్ దళం జీతాలను గురించి డల్‌హౌసీ బెదిరింపులు ఎక్కువయినాయి. 1851 ఆగస్టులో నైజాం 34 లక్షలు చెల్లించి మిగిలిన మొత్తాన్ని సంవత్సరాంతానికి చెల్లిస్తానని రస్సెల్ దళానికి జీతాలు చెల్లిస్తానని కబురు పంపాడు. సంవత్స

రాంతంలో నైజాం 9 లక్షలు మాత్రమే చెల్లించాడు. మిగిలిన మొత్తానికి దివాన్ సిరాజ్, రెసిడెంట్ ఫ్రేజర్ కలిసి ఒక ప్రణాళిక ఆలోచించారు. స్థానిక షాహూ కార్లతో బ్యాంక్‌ను నెలకొల్పి సంస్థానంలోని 'జవారీ' హామీగా వారినుండి అప్పు తీసుకొనవలెనని వారి ప్రణాళిక. సంస్థాన భూభాగం ఆక్రమించాలనే పట్టుదలతో నున్న డల్‌హౌసీ పై ప్రణాళికను తిరస్కరించాడు. ఫ్రేజర్ రాజీనామా చేశాడు (నవంబర్ 1852); డల్‌హౌసీకి అనుకూలుడైన కర్నల్ జాన్‌తో రెసిడెంట్ అయినాడు. బాకీ చెల్లించడానికి నైజాం చేసిన సూచనలన్నీ డల్‌హౌసీ తిరస్కరించాడు. గత్యంతరంలేని నైజాం 1853 లో బీరార్ సంధి చేసుకొని సాలుకు 41 లక్షల ఆదాయం వచ్చే బీరార్, రాయచూర్, ఉస్మానాబాద్ జిల్లాలను కంపెనీ వరం చేశాడు. రస్సెల్ దళం "హైదరాబాద్ కంటింజెంట్"గా వ్యవహరింపబడింది. బీరార్ వ్యవహారం డల్‌హౌసీ నిరంకుశ దురాక్రమణ విధానానికి నిదర్శనం. ఈ ఉదంతాన్ని గురించి వ్రాస్తూ "న్యాయదేవత చెవుల్లో దూదికుక్కి ఆమెను (ఆంగ్లేయులు) చెవిటిదాన్ని గుడ్డిదాన్ని చేశారు అని బ్రూస్ నార్టన్ (The Rebellion in India) అంటాడు. బీరార్ సంధి జరిగిన కొద్దిరోజులకే సిరాజ్ ఉల్‌ముల్క్ మరణించాడు. ఆతనికి సన్నిహితుడైన సాలార్‌జంగ్‌ను దివాన్‌గా, రాజా నరేందర్‌ను పేష్కారుగా నైజాం నియమించాడు.

## 1857 తిరుగుబాటు

కంపెనీ పాలన పట్ల పందొమ్మిదో శతాబ్దం మధ్యకాలానికి అన్ని వర్గాల భారతీయుల్లోను తీవ్రమైన అసంతృప్తి ద్వేషం ప్రబలింది. జమీందారీ రైత్వారీ ప్రాంతాలు రెంటిలోనూ అమలు జరిగిన భూమిశిస్తు విధానంవల్ల సామాన్య రైతులపై పన్నుల భారం పెరిగి రైతులు ఋణగ్రస్తులు కాసాగినారు. నీటి పారుదల సౌకర్యాలలోగానీ, వ్యవసాయ పద్ధతుల్లోగానీ అభివృద్ధికరమైన మార్పులు జరగలేదు. ప్రభుత్వం అనుసరించిన ఆంగ్లీకరణ విధానం విద్యావంతుల్లో నిరుద్యోగాన్ని పెంచింది. సంస్థానాలు నశించడంతో స్థానిక విద్యలకు, కళలకు పోషణలేక పలువర్గాలవారు జీవనోపాధిని కోల్పోయినారు. ప్రభుత్వ యంత్రాంగం క్రింది స్థానాల్లో భారతీయులకు ప్రవేశం లభించింది. కాని వారి జీతాలు చాలా తక్కువయినందున వారిలో లంచగొండితనం బలిసింది. పోలీసు వ్యవస్థ ప్రజలకు శాపంగా పరిణమించిందని ఆంగ్ల పరిశీలకులే వ్రాశారు. పన్నుల భారం, ఉద్యోగుల లంచగొండితనం, పోలీసు దౌర్జన్యం ప్రజలను కుంగదీసి వారిలో పరాయి ప్రభుత్వం పట్ల విశ్వాసం నశించి, ద్వేషం నానాటికి పెచ్చు పెరిగింది.

ఆంగ్ల ప్రభుత్వం అమలుపరిచిన సతీసహగమన నరబలి నిషేధంవంటి సాంఘిక సంస్కరణలు సనాతన వర్గాల్లో ఆందోళనకు కారణమయినాయి. దీనికితోడు కొత్తగా వచ్చిన రైలు బండ్లలో అగ్రజాలు అంత్యజాలు కలిసి ప్రయాణం చేయవలసి వచ్చింది. ఆంగ్లవిద్యను ప్రవేశపెట్టడంతో సాంప్రదాయక విద్యలకు ఆదరణ నశించింది. సనాతన సామాజిక వ్యవస్థను కూలద్రోయడమే ప్రభుత్వం సంకల్పమనే భయం ఏర్పడింది. ఈ వాతావరణంలోనే క్రైస్తవ మత ప్రచారం ముమ్మరంగా సాగింది. పాదరీలు హిందూ ముస్లిం దేవతలను మతాచారాలను అసభ్యకరంగా విమర్శించేవారు; వారికి ప్రభుత్వ ప్రోత్సాహం ఉండేది. ఇదే సమయంలో వితంతు వివాహాన్ని చట్టబద్ధం చేశారు; మతాంతరీకరణ అనంతరం కూడ ఉమ్మడి ఆస్తిలో భాగం ఇస్తూ చట్టం చేయబడింది. హిందూ దేశం క్రైస్తవ దేశంగా మారిపోతుందనే భయం బలపడింది.

సమాజంలో చెలరేగిన భయాందోళనలు సిపాయి శిబిరాల్లో ప్రతిధ్వనించినాయి. ప్రభుత్వ విధానాలపై సిపాయీలకు నాటికే అసంతృప్తి ఉంది. వారి వేతనాలు చాలా స్వల్పం; ఉద్యోగంలో ఉన్నతికి అవకాశాలు తక్కువ; ఆంగ్ల సైనిక శిబిరాల్లో అన్ని వసతులూ ఉండేవి; సిపాయి శిబిరాల్లో కనీస సౌకర్యాలు సయితం ఉండవు. అనేక రకాల క్రమశిక్షణా నిబంధనలుండేవి. కవాతు సమయాల్లో గడ్డం చేసుకోవలె; బొట్టు ధరించరాదు; తలపాగలు ఒకే పద్ధతిలో ఉండవలె. ఆఫ్ఘన్ యుద్ధాల్లో హిందూ సిపాయీలు దేశాంతరం వెళ్ళడమేగాక అక్కడ ముస్లిముల చేతి వంటకాలు తినవలసి వచ్చింది; బర్మా యుద్ధంలో శాస్త్ర విరుద్ధమైన సముద్రయానం చేయక తప్పలేదు. ముస్లిం సిపాయీలు ఆఫ్ఘన్ యుద్ధాల్లో కాఫర్ల (ఇంగ్లీషువారి) కోసం ముస్లిములతో పోరాడవలసి వచ్చింది. ఇది కొరాన్ నిబంధనాలకు విరుద్ధం.

దేశంలో ముఖ్యంగా సిపాయిల్లో విదేశపాలకులపట్ల ద్వేషం ప్రబలుతున్న ఈ సమయంలో గవర్నర్ జనరల్ హౌసీ రాజ్య సంక్రమణ విధానం అమలు జరిపి వారసులు లేని చిన్న చిన్న రాజ్యాలు పెక్కింటిని ఆంగ్ల సామ్రాజ్యంలో లీనం చేశాడు. ఈ విధంగా నష్టపోయిన ప్రభువర్గ సభ్యుల నాయకత్వం సిపాయీలకు లభించింది. వీరు తిరుగుబాటుకు సన్నద్ధమవుతున్న సమయంలో గవర్నర్ జనరల్ కానింగ్ ప్రభుత్వం తీసుకున్న రెండు చర్యలతో సిపాయీలు రెచ్చిపోయినారు. కానింగ్ చర్యలు : (1) సైన్యంలో చేరిన సిపాయీలు ప్రపంచంలో ఏ ప్రాంతానికైనా వెళ్ళడానికి సంసిద్ధులై వుండవలెననే శాసనం (2) సైన్యంలో కొత్త రైఫుల్ ప్రవేశపెట్టారు. దీనిలో ఉపయోగించే తూటాలపై

ఆవు, పంది క్రొవ్వు పూత పూస్తున్నారనే వదంతి హిందూ ముస్లిం సిపాయీలను కలవరపరిచి ప్రతిఘటనకు పురికొల్పింది. బారక్‌పూర్‌లో మంగళ్‌పాండే ఆంగ్ల సైనికోద్యోగిని కాల్చి చంపడంతో తిరుగుబాటు ప్రారంభమయింది.

తిరుగుబాటు ప్రభావం చాలవరకు ఉత్తర భారతంలో కొన్ని కేంద్రాలకు - ఢిల్లీ, మీరట్, లక్నో, కాన్పూర్, గ్వాలియర్, ఝాన్సీ ప్రాంతాలకు పరిమితమయింది. అంతే గాక ముస్లిం, మరాటీ వర్గాలకే పరిమితం కావడం కూడ గమనార్హమైన విషయం. దీని ప్రభావం దక్షిణదేశంలో చెప్పుకోదగినంతగా లేదు. ఆంధ్రదేశంలో ముస్లింప్రభు పూజారి వర్గాలు బలంగావున్న హైదరాబాద్ సంస్థానంలో కొంత సంచలనం కలిగించి ఘర్షణలు జరిగినాయి. సర్కారు, రాయలసీమ ప్రాంతాల్లో తిరుగుబాటు ప్రభావం లేదనే చెప్పవచ్చు.

## హైదరాబాద్

సంస్థానంలో తీవ్రమైన బ్రిటిష్ వ్యతిరేకత వున్నదనడానికి పైన పేర్కొన్న వహాబీ వుద్యమమే తార్కాణం. సైన్యం నుండి బర్తరఫ్ అయిన అరబీ, రోహిల్లా సైనికుల్లో అసంతృప్తి నానాటికీ పెరుగుతున్నది. అయినా బ్రిటిష్‌వారితో వైరం వివేకం కాదని నైజాం నవాబ్ నాసిరుద్దౌలా తన వారసుడైన అఫ్జల్ ఉద్దౌలాను హెచ్చరించి 1857 లో మరణించాడు. ఆ సలహాను కొత్త నైజాం యథావిధిగా పాటించాడు. అతని దివాన్ సాలార్‌జంగ్ బ్రిటిష్ వారిపట్ల విధేయుడు. నైజాం స్నేహం, దివాన్ విధేయత, తిరుగుబాటు దక్షిణాదికి విస్తరించకుండా అడ్డుకొని భారతదేశంలో ఆంగ్ల సామ్రాజ్యాన్ని రక్షించినాయి. అయినా హైదరాబాద్ పూర్తి ప్రశాంతంగా లేదు. అరబ్బులు, రోహిల్లాలు, అజంతా ప్రాంతంలోని భిల్లులు కొంత అలజడి సృష్టించారు. సంస్థానం ఆస్థానంలోని సోనాజీ పండిట్ వంటి మరాటా వుద్యోగులు రహస్యంగా నానాసాహెబ్‌తో మంతనాలు సాగించి స్థానిక జమీందారులను రెచ్చగొట్టడానికి ప్రయత్నించారు.

ఢిల్లీలో తిరుగుబాటు సమాచారం అందిన వెంటనే హైదరాబాద్‌లో మసీదులపైన ఇతర భవనాల మీద బ్రిటిష్ వ్యతిరేక నినాదాలు ప్రత్యక్షమయినాయి. "కాఫర్‌లను (ఆంగ్లేయులను) పారద్రోలి ఢిల్లీపైకి నైజాం పురోగమించాలి; ధైర్యం లేకపోతే గాజులు తొడుక్కొని ఇంట్లో కూచూవాలి" అనీ "తిరుగుబాటు చేయనిచో ముస్లిములు పంది మాంసం తిన్నట్లే, హిందువులు గో మాంసం తిన్నట్లే" అంటూ రెచ్చగొట్టే వ్రాతలతో ప్రజలను ఉద్బోధించారు.

మక్కామసీదునుండి 'జీహద్' ప్రకటించే ప్రయత్నం జరిగింది. ఈ ఉద్యమంలో మౌల్వీ ఇబ్రాహిం ప్రముఖ పాత్ర వహించారని తెలిసి నైజాం ఆతణ్ణి మంద లించాడు. మక్కామసీదులో కుత్బా చదవడం ఆపివేశారు. మక్కామసీదుపై ముస్లిం పతాకాన్ని నెలకొల్పదానికి మౌల్వీ అగ్బర్ చేసిన ప్రయత్నం ఫలించ లేదు.

ఉత్తర భారతంలో సిపాయీల విజయాల వర్తమానం దక్షిణదేశానికి వ్యాపించడంతో ఔరంగాబాద్‌లోని పటాలంలో అశాంతి చెలరేగింది. తమ దళాలను ఉత్తరదేశం పంపుతారనే అనుమానంతో సేనాపతి యాబట్ ఆజ్ఞలను ధిక్కరించసాగినారు. యాబట్‌ను చంపడానికి మీర్ ఫిదా చేసిన ప్రయత్నం విఫలమయింది. మీర్ ఫిదాతోబాటు తిరుగుబాటుదార్లు ఇరవై నొక్కరిని విచారించి మరణశిక్ష అమలు జరిపారు.

ఖుల్‌దనాలోని పటాలంలో కూడ అశాంతి చెలరేగింది. జమేదార్ చిదాఖాన్ నాయకత్వంలో కొందు ఆశ్వికులు పటాలం నుండి తప్పించుకొని హైదరాబాద్ పారిపోయినారు. చిదాఖాన్‌ను నిర్బంధంలోకి తీసుకొని విచారణ జరిపించడానికి సాలార్‌జంగ్ ప్రయత్నించాడు. దివాన్ చర్యకు నిరసనగా మక్కామసీదులో పెద్ద సమావేశం జరిగింది. మసీదు నుండి రెసిడెన్సీపై దాడి చేయడానికి సన్నద్ధులైనారు. ప్రమాదాన్ని గుర్తించిన సాలార్‌జంగ్ రెసిడెంట్‌ను హెచ్చరించాడు. ఈలోగా ఐదువందల మంది రోహిల్లాలు తురాబజ్‌ఖాన్, మౌల్వీ అలావుద్దీన్ నాయకత్వంలో రెసిడెన్సీపై దాడి జరిపారు. రెసిడెన్సీ సైనికాధికారి మేజర్ బ్రిగ్స్ అప్రమత్తంగా వుండి దాడిని తిప్పికొట్టాడు. తురాబజ్‌ఖాన్ పట్టుబడి పారిపోవడానికి చేసిన ప్రయత్నంలో మరణించాడు. మౌల్వీ అలావుద్దీన్ మైసూర్‌లో పట్టుబడ్డాడు. ఆతనికి ద్వీపాంతరవాస శిక్ష విధించారు. అండమానుల్లోనే మౌల్వీ 1884 లో మరణించాడు.

ఈ సంఘటనల అనంతరం కూడ సంస్థానంలో శాంతి నెలకొనలేదు. నానాసాహెబ్, తాంతియా తోపేల గూఢచారులు జమీందార్లను, రోహిల్లా అరబ్ జాతులను రెచ్చగొట్టడంతో జిల్లాలలో అలజడులు చెలరేగినాయి. షోరాపూర్, ముందర్గి, నార్గుంద, కౌలాస్ జమీందార్లు సైన్యాలు కూర్చుకొని అంగ్లేయుల నెదిరించారు షోరాపూర్ జమీందారు రాజా వెంకటప్పయ్య నాయకుని బందీగా పట్టుకొని నాల్గు సంవత్సరాలు జైలుశిక్ష విధించారు. ముందర్గి భీమారావు అంగ్లే యులతో పోరాడుతూ మరణించాడు. పెక్కుమంది అరబ్, రోహిల్లా నాయకులు మరణశిక్ష అనుభవించారు. చివరకు కౌలాస్ జమీందారు రంగారావును అండ మానులకు పంపడంతో 1859 నాటికి సంస్థానంలో అల్లర్లు అణగినాయి.

తిరుగుబాటు సమయంలో నైజాం, ఆతని దివాన్ పూర్తి విధేయతతో ఆంగ్లేయులతో సహకరించారు. "హైదరాబాద్‌ను కోల్పోయినచో సర్వమూ (ఇండియా) కోల్పోయే వాళ్ళము" అని రెసిడెంట్ వ్రాసింది యథార్థం. ఇది గుర్తించి తిరుగుబాటు సమసిన తరువాత ఆంగ్ల ప్రభుత్వం రాయచూర్ అంతర్వేదిని, నల్‌దుర్గ్‌ను, షోరాపూర్‌ను నైజాముకు తిరిగి ఇవ్వడమే గాక "స్టార్ ఆఫ్ ఇండియా" అనే బిరుదాన్ని ఇచ్చి నైజాంను సత్కరించారు.

## సర్కారు, రాయలసీమ ప్రాంతం

ఆంధ్ర ప్రాంతంలో తిరుగుబాటు ప్రభావం వల్ల స్వల్పమైన మార్పులు జరిగినాయి. హైదరాబాద్ సంస్థాన సరిహద్దు గ్రామాలపై రోహిల్లా అరబ్ సైనికులు దాడులు జరిపి దోచుకున్నారు. జగ్గయ్యపేట, కడప కర్నూలు జిల్లాల్లోని గ్రామాలు ఈ దోపిడీలకు గురి అయినాయి. వర్దాకిమిడి జమీందారీ ప్రాంతంలో దుండుసేన అనే గైబా నాయకుడు సవరులను కూడగట్టుకొని అల్లర్లు సృష్టించాడు. అతణ్ణి పట్టుకొని ఉరితీశారు. గోదావరి మన్య ప్రాంతంలో కొరటూరు గ్రామ నాయకుడైన కోరుకొండ సుబ్బారెడ్డికి బుట్టాయగూడెం గ్రామాధికారి సుంకర స్వామికి మధ్యవచ్చిన తగాదా ఫలితంగా సుబ్బారెడ్డి కొన్ని గ్రామాలు దోచుకొని అశాంతి సృష్టించాడు. రాజమండ్రి నుండి బయలు దేరిన పటాలం ఎర్నగూడెం ఆక్రమించి తిరుగుబాటుదార్లపై దాడి చేశారు. సుబ్బారెడ్డి పట్టుబడినాడు. విచారణ సందర్భంలో నానాసాహెబ్ దక్షిణ దేశం మీద దండెత్తుతున్నాడనీ ఇంగ్లీషు వారిపై తిరుగుబాటు చేసిన వారికి లాభిస్తుందనీ వర్తమానం అందడంవల్ల తాను తిరుగుబాటు చేసినట్లు సుబ్బారెడ్డి పేర్కొన్నాడట! సుబ్బారెడ్డిని ఉరితీశారు. తిరుగుబాటు అంతరించింది.

ఈ అల్లర్లు మినహా రాష్ట్రం ప్రశాంతంగా ఉంది. సామాన్య ప్రజలు సమావేశాలు జరిపి తిరుగుబాటుదార్లను నిరశిస్తూ ప్రభుత్వాన్ని అభినందిస్తూ తీర్మానాలు చేశారు. ప్రజలకు శాంతి భద్రతలు ప్రసాదించిన కుంఫినీ ప్రభుత్వాన్ని ప్రశంసించారు. ఒక చాటు కవి

కుంభినివంటి ప్రభుత్వము
(రంభా భోగమ్మువంటి రతి సౌఖ్యంబున్)
జంభారివంటి విభవము
శంభో! వినుకొండవంటి షహరాన్ గలదే!

అని కీర్తించాడు. అయితే అనతి కాలంలోనే విదేశ పాలనవల్ల నష్టాలను ప్రజలు గుర్తించారు. విద్యావ్యాప్తితోబాటు దేశభక్తి స్వాతంత్రేచ్ఛ కలిగి జాతీయోద్యమానికి అంకురార్పణ జరిగింది.

# జాతీయోద్యమం

1857 తిరుగుబాటు అనేక పరిణామాలకు దారితీసింది. బ్రిటిష్ పార్ల మెంటు కంపెనీని రద్దుచేసి ఇండియా పరిపాలనా బాధ్యతను సార్వభౌముల పరం చేసింది. ఇండియా గవర్నర్ జనరల్‌కు వైస్రాయి హోదా లభించింది. భారతీయుల నుద్దేశించి విక్టోరియా మహారాణి ఒక ప్రకటన చేసింది. ఆ ప్రకటన ప్రకారం : ఆంగ్ల ప్రభుత్వం రాజ్య విస్తరణ విధానానికి స్వస్తి చెప్పి స్వదేశ రాజుల, సంస్థానాధీశుల హక్కులను మన్నిస్తుంది (తిరుగుబాటు కాలంలో సంస్థానాలు బ్రిటిష్ ప్రభుత్వంపట్ల విధేయులై ఉన్నందున తమ సామ్రాజ్యానికి అవి రక్షణశ్రేణిగా ఉపకరించగలవని ఆంగ్లేయులు గుర్తించడమే ఈ ప్రకటనకు కారణం అని చెప్పవచ్చు) : భారతీయుల మత సాంఘిక వ్యవహారాలలో జోక్యం కలిగించుకొనదు; జాతి, మత, వర్ణ విచక్షణ పాటించక భారతీయులను అధిక సంఖ్యలో ప్రభుత్వపు ఉద్యోగాల్లో నియమిస్తుంది; ప్రజల విజ్ఞానాభివృద్ధికి, దేశ ఆర్థిక పురోగతికి కృషి చేస్తుంది. విక్టోరియా ప్రకటనను 'భారతీయుల హక్కుల పత్రం' అని వర్ణించడం జరిగింది. కానీ దీనివల్ల రెండు ప్రధానమైన దుష్ఫలితాలు జరిగినాయని చెప్పవచ్చు : (1) దేశ సమైక్యతా క్రమానికి భంగం వాటిల్లింది; సంస్థానాలలోని ప్రజలు మధ్యయుగ రాజకీయ ఆర్థిక నిరంకుశత్వానికి గురి అయినారు. సమైక్యమై దేశం అంతటా ఒకే రకమైన రాజ్యాంగ సాంస్కృతిక పురోగతి సాధించి వున్నచో, జాతీయతకు ప్రాణప్రద మైన భావ సమైక్యత ప్రజలలో కలగడానికి అవకాశం ఉండేది. ఈ ప్రకటనతో ఆ అవకాశం నశించింది. (2) మత సాంఘిక సంస్కరణలకు ప్రభుత్వ సహాయం లభించకపోవడంతో సంస్కరణోద్యమాలు కేవలం పౌర జనోద్యమా లయినాయి. వెంటనే సాంఘిక పరివర్తన సాధించకపోయినా ప్రభుత్వ శాసనా లకు ప్రజలలో మానసిక చైతన్యం సంస్కరణల కనుగుణమైన పరివర్తన కలిగించే గుణం వుంది. అందుచేత శాసనస్థములైన సంస్కరణలు క్రమంగా అమలు జరిగే అవకాశం ఉంది. విక్టోరియా ప్రకటనతో ఆ అవకాశం పోయింది. అందుచేతనే స్వాతంత్ర్యం వచ్చిన తరువాత కూడ దేశ సమైక్యతా సమస్య, సాంఘిక దురాచారాల సమస్య జాతి ఎదుర్కొనవలసి రావడానికి విక్టోరియా

ప్రకటన ఎంతవరకు కారణము, వాస్తవానికి అది భారతీయుల హక్కుల పత్రమా అనేవి - ఆలోచించవలసిన చారిత్రకాంశాలు.

"జాతీయ భావ ఫలితంగా 1857 తిరుగుబాటు జరగలేదు; తిరుగుబాటు విఫలం కావడంవల్ల భారతీయుల్లో జాతీయ భావోదయం జరిగింది. అన్న R. C. మజుందార్ మాటల్లో ఎంతో సత్యం వుంది. తిరుగుబాటు కాలంలో భారతీయులు, ఆంగ్లేయులు పరస్పర ద్వేషంతో క్రూరకృత్యాలకు పాల్పడినారు. ముఖ్యంగా ఆంగ్ల సేనానులు తిరుగుబాటుదారులను ఫిరంగి మూతులకు కట్టి ప్రేల్చారు. ఇట్టి రాక్షసత్వ ప్రదర్శనవల్ల భారతీయుల్లో ఆంగ్లేయులపట్ల అగ్రహ ద్వేషాలు ప్రజ్వరిల్లడం సహజం. ఆ ద్వేషంలో నుండే భారత జాతీయ భావం జనించింది. దీనికితోడు విక్టోరియా ప్రకటనలో చేసిన వాగ్దానాలను ఆంగ్ల ప్రభువులు చిత్తశుద్ధితో అమలు చేయలేదు. దేశీయుల్లో నిరుద్యోగం నానాటికి పెరిగింది. పన్నుల భారంతో రైతులు కుంగిపోసాగినారు. ఆర్థికాభివృద్ధికి కృషి జరగలేదు. జాతి విచక్షణ, పాదిరీల దుష్ప్రచారము యథావిధిగా కొనసాగినాయి. ఈ పరిస్థితులే భారతీయుల్లో జాతీయ భావాన్ని బలపరచి స్వాతంత్ర్య ఉద్యమానికి దారితీసినాయి.

తమ సామ్రాజ్య శ్రేయస్సుల రక్షణార్థమే కావచ్చు. ఆంగ్ల ప్రభుత్వం భారతీయులకు కొన్ని సౌకర్యాలు సమకూర్చింది, రైల్వేలవంటి సులభ ప్రయాణ సాధనాలు, వార్తా ప్రసారానికి తంతి తపాలాలు ఏర్పడినాయి. భారత ఉపఖండంలో భిన్న ప్రాంతాలు సన్నిహితం కావడానికి ఇవి తోడ్పడినాయి. ఆంగ్ల భాష రాజభాషయై భాషా భిన్నత్వం అనే ఆటంకం తొలగి వివిధ ప్రాంత ప్రజలలో పరస్పర అవగాహనకు ఉపకరించింది. భారతీయులలో ఐక్యతా భావానికి ఈ పరిణామాలు దోహదం చేసినాయి. ఇంచుమించు తిరుగుబాటు సమయంలోనే కలకత్తా, బొంబాయి, మద్రాస్ విశ్వవిద్యాలయాలేర్పడినాయి; నాటికే దేశంలో ఇంగ్లీషు పాఠశాలలు, కళాశాలలు పనిచేస్తున్నాయి. ఆంగ్ల విద్యాలయాలు కేంద్రాలుగా జాతీయ భావ చైతన్యంతో కొత్త యువతరం తయారు కాసాగింది. ఆంగ్ల భాషద్వారా కొత్త తరానికి పౌరహక్కులు, స్వయం నిర్ణయాధికారం జాతీయైక్యత, ప్రజాస్వామ్యంవంటి ఆధునిక పాశ్చాత్య రాజకీయ సిద్ధాంతాలతో పరిచయం ఏర్పడింది. స్వేచ్ఛ, సమత, సౌభ్రాతృత్వం అనే ఫ్రెంచి విప్లవనినాదాలు, జర్మనీ, ఇటలీ బాల్కన్ రాజ్యాలలో జరుగుతున్న జాతీయోద్యమ లక్ష్యాలు భారతీయుల్లో నూతనోత్తేజాన్ని కలిగించినాయి. ఈ నూతనోత్తేజంతోనే వృత్తాంతిని, దినవర్తమణి, ఆంధ్రభాషా సంజీవిని, వివేకవర్ధని, లోకరంజని,

స్వదేశి, పురుషార్థ ప్రదాయిని, వార్తాలహరి మొదలైన పత్రికలు వెలిసినాయి. ప్రభుత్వ చర్యలను విమర్శిస్తూ, విక్టోరియా వాగ్దాన భంగాన్ని వివరిస్తూ, జాతి విచక్షణా విధానాన్ని నిరసిస్తూ నానాటికి దిగజారుతున్న ఆర్థిక పరిస్థితిని విపులీకరిస్తూ పత్రికలు విదేశ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజాభిప్రాయాన్ని సంఘటితపరచడానికి కృషి చేసినాయి.

ప్రేరణ (inspiration), రోషమూ (irritation) భారత జాతీయ భావోదయానికి కారణాలుగా పెర్సివాల్ స్పియర్ వ్రాశాడు. ఆంగ్ల ప్రభుత్వ స్థాపన జరిగినప్పటినుండి భారత చరిత్రలో, సంస్కృతిలో విశేష పరిశ్రమ జరిగి తమ ప్రాచీన సాంస్కృతిక వారసత్వాన్ని భారతీయులు గుర్తించసాగినారు. ఆ గుర్తింపే వారికి మంచి ప్రోత్సాహాన్నిచ్చింది. దేశభక్తికి సాధనంగా చరిత్రను హొరొడొటస్ కాలంనుండి గుర్తించారు. భారతీయుల్లో కలుగుతున్న చైతన్యానికి క్రైస్తవ ఫాదిరీల దుష్ప్రచారమూ, ప్రభుత్వ జాతి విచక్షణ విధానము రోషాన్ని కలిగించడంలో ఆశ్చర్యంలేదు. ఈ నేపథ్యంలోనే భారతీయులు ఆత్మపరిశీలనకు ఉపక్రమించారు. తమ మతాలలో, సామాజిక వ్యవస్థలలో చిక్కబడి గట్టుకుపోయిన దురాచారాలను తొలగించి ఆధునీకరణ సాధించినగాని జాతి పురోగతికి సాధ్యం కాదని గ్రహించారు. పందొమ్మిదో శతాబ్ది ఆరంభంలోనే రాజా రామమోహన రాయ్ బ్రహ్మ సమాజాన్ని స్థాపించి సతీసహగమన నిర్మూలనకు, ఆంగ్ల విద్యా విధానం ప్రవేశపెట్టడానికి బెంటింక్ ప్రభుత్వంతో సహకరించాడు. విగ్రహారాధన వంటి మూఢాచారాలను నిరసించాడు. ఏకేశ్వరోపాసన, నిర్గుణోపాసన వంటి ఉదాత్త సంప్రదాయాలను నెలకొల్పాడు. అందుచేతనే భారతీయ భూత భవిష్యత్ సంస్కృతీ సంప్రదాయాలమధ్య, ప్రాచ్య పాశ్చాత్య సంస్కృతుల మధ్య వారధి రామమోహనరాయ్ అని వర్ణిస్తారు. ఒక విధంగా పాశ్చాత్య సంప్రదాయాల ఆమోదానికి నిరసనగా దయానంద సరస్వతి ఆర్య సమాజాన్ని స్థాపించాడు. స్త్రీ జనోద్ధరణ, వర్ణనిర్మూలన, అస్పృశ్యతా నివారణవంటి ఉదార సాంఘిక సంస్కరణలను ప్రోత్సహించినప్పటికీ దయానందుడు వైదిక మత సంస్కృతాల పునరుద్ధరణకు పిలుపునిచ్చినాడు. 'శుద్ధి' ద్వారా హిందూమతంలో చేర్చుకొనే వీలు కల్పించాడు. ముస్లిం, క్రైస్తవ మతాల తాకిడికి తట్టుకోడానికి 'హిందూ సంఘటన' ఆవశ్యకతను గుర్తింపజేశాడు. రామకృష్ణ పరమహంస శిష్యుడైన వివేకానందుడు రామకృష్ణ మఠాన్ని స్థాపించాడు. పాశ్చాత్యులది కేవల భౌతిక (materialist) సంస్కృతియనీ, భారతీయులది ఆధ్యాత్మిక (spiritualist) సంస్కృతియనీ దానికి 'వేదాంతం' కిరీటప్రాయమనీ అందుచే 'విశ్వ వేదాంతం' (Universal Vedanta) ద్వారా భారతదేశం ప్రపంచాన్ని

జయించి మానవజాతి నుద్ధరించే తరుణమాసన్నమయిందనీ వివేకానందుడు ప్రబోధించాడు. మదాం బ్లావ్‌స్కీ అనే రష్యన్ వనిత దివ్యజ్ఞాన సమాజాన్ని (Theosophical Society) స్థాపించి భారతీయ ఆధ్యాత్మిక సంస్కృతీ వైశిష్ట్యాన్ని ప్రపంచానికి చాటింది. ఈ ఉద్యమాల ఫలితంగా క్రైస్తవ ప్రచారకుల దౌర్జన్యం వెనుకాడింది. భారతీయుల్లో ఆత్మ విశ్వాసం పెంపొందింది. భారతీయుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందింది. ఈ మత-సాంఘిక సంస్కరణోద్యమ-(నవహిందూ-Neo-Hindu) నినాదాలు ఆంధ్రదేశంలో ప్రతిధ్వనించాయి.

ఈ ఉద్యమాన్ని విజ్ఞాన పునరుజ్జీవనోద్యమం అంటూ ఐరోపాలో 12-14 శతాబ్దాల్లో జరిగిన 'రినెశాన్స్' ఉద్యమంతో పోల్చడం జరుగుతున్నది. 'రినైశాన్స్' ఫలితంగా ఐరోపావారు వ్యవస్థాపిత మతం (చర్చి విధిస్తున్న నిబంధనలను తిరస్కరించి హేతు దృక్పథం, మానవతా వాదాన్ని అలవరచుకొని శాస్త్ర సాంకేతిక విజ్ఞానాన్ని పెంపొందించి అపూర్వమైన ప్రగతిని సాధించి ప్రపంచానికే పాలకులు కాగలిగారు. కాని భారతదేశంలో జరిగిన ఉద్యమానికి అత్యంత ప్రాచీనములైన వేదాలు—సంహితలు కానీ, ఉపనిషత్తులుగానీ-మూలములయినాయి. అందుచేత భారతీయోద్యమాన్ని విజ్ఞానోద్యమం అనడం కంటె "నవహిందూ మతోద్యమం" (neo-Hinduism) అనడం సమంజసం. భారతజాతి-భిన్న మతాలతో కూడిన — నిర్మాణ దశలో ఉన్న క్లిష్ట సమయంలో ఇట్టి మతోద్యమంవల్ల జరిగిన మేలుకీడులను అంచనా వేయడం అవసరం.

నానాటికి దేశ ఆర్థిక పరిస్థితి ఆందోళనకరంగా పరిణమించింది. గోదావరీ (       ) కృష్ణా (       ) పెన్నా నదులపై ఆనకట్టలు నిర్మించడంతో తీరాంధ్రంలో వేలకొలది యకరాల భూమి సాగులోనికి వచ్చింది. వ్యవసాయ ఉత్పత్తులు పెరిగి రైతు జనంలో సాంఘిక రాజకీయ చైతన్యం కలగడానికి దారితీసింది. కాని ధాన్యం ధర తగ్గడంతో శిస్తురేటు రెండింతలు మూడింతలుగా పెరిగినట్లయింది. తరచుగా క్షామాలు సంభవించి జన నష్టం జరిగింది. గంజాం-గోదావరీ బళ్ళారి జిల్లాలలో 1865-66 లో సంభవించిన క్షామంవల్ల వేలకొలది మరణించినారు. 1871 లో కర్నూలు, కడప జిల్లాలలో తీవ్రమైన క్షామం సంభవించింది. చేతివనులు ఇంతకు పూర్వమే నశించినాయిగదా! ఆకలి బాధకు తాళలేని ప్రజలు బర్మా, మారిషస్, దక్షిణాఫ్రికాలకు వలస బోవసాగినారు. కంపెనీ కాలంలోనే దేశంలోని రైతుల పరిస్థితి మెరుగుగా వుండేదని 1875 లో లోకరంజని అనే పత్రిక వ్రాసింది.

ఉద్యోగ నియామకాలలో విక్టోరియా వాగ్దానాలను మన్నించకపోగా భారతీయుల ప్రవేశాన్ని అరికట్టే ప్రయత్నాలు జరిగినాయి. సైన్యంలో భారతీయు

వైద్యులు అనర్హులనే ఉత్తర్వు జారీ అయింది. ఇట్టి జాతి విచక్షణ విధానం లిట్టన్ ప్రభువు కాలంలో (          ) స్పష్టమయింది. ఆయుధ శాసనంద్వారా భారతీయులను పూర్తి నిరాయుధులను చేశాడు లిట్టన్. దేశ భాషల్లో వెలువడే పత్రికల స్వాతంత్ర్యాన్ని అరికట్టాడు. పౌర ఉద్యోగాల్లో ప్రవేశ పరీక్ష వయస్సు 21 నుండి 19 సంవత్సరాలకు తగ్గించాడు. ఇది భారతీయులకు వ్యతిరేకంగా తీసుకొన్న చర్య అని వేరే చెప్పనక్కరలేదు. లిట్టన్ చర్యలను దేశంలోని పత్రికలు తీవ్రంగా విమర్శించినాయి. జీతాల రూపంలో ఉపకార వేతనాల రూపంలో అపార ధనరాశులు ఇంగ్లండుకు తరలడాన్ని తద్వారా భారతదేశం దారిద్ర్యంలో క్రుంగడాన్ని పత్రికలు వివరిస్తూ వ్రాసినాయి. ఆంగ్లేయుల జాతి విచక్షణ విధానం ఇన్‌బర్ట్ బిల్‌పై జరిగిన ఆందోళనలో పరాకాష్టకు చేరుకున్నది. నాటివరకు భారతీయ న్యాయాధీశులను శ్వేతజాతి నేరస్థులను విచారించి శిక్షించే హక్కు వుండేదికాదు. న్యాయశాఖలోని ఈ అన్యాయం తొలగించే ఉద్దేశంతో రిప్పన్ ప్రభువు సూచనపై న్యాయ విషయాల సభ్యుడైన ఇన్‌బర్ట్ ఈ చట్టాన్ని తయారుచేశాడు. ఈ చట్టం ప్రకారం భారతీయ న్యాయాధీశులకు శ్వేత జాతీయులతో సమానమైన హక్కులు లభించినాయి. దీనికి వ్యతిరేకంగా శ్వేత జాతీయులు జరిపిన ఆందోళన ఫలితంగా వారి ప్రత్యేకత హక్కులకు భంగం రాని విధంగా చట్టం సవరించబడింది. ఈ చర్యను దేశంలోని పత్రికలన్నీ ఖండించినాయి. శ్వేత జాతీయులను విచారించి శిక్షించడానికి తెల్లవారే అర్హులైనప్పుడు భారతీయులను భారతీయులే శిక్షించడం న్యాయం గదా" వివేకవర్ధని అనే పత్రిక (మార్చి 1884) ప్రశ్నించింది. ఇన్‌బర్ట్ చట్టవివాదం భారతీయులకు రెండు గుణపాఠాలు నేర్పింది :

(1) విదేశ పాలనలో భారతీయులకు న్యాయం జరగడం అసంభవం;

(2) సుసంఘటితమైన ఆందోళన ద్వారా ప్రభుత్వాన్ని లొంగదీయవచ్చు.

## జాతీయ మహాసభ - తొలిదశలు

నాటికే కలకత్తా, బొంబాయి, పూనా మొదలైన ప్రధాన నగరాలలో స్వదేశీ పౌర సంఘాలేర్పడి ఆందోళన ప్రారంభించినాయి. మద్రాస్‌లో తెలుగు వణిజుడైన గాజుల లక్ష్మీనరసు సెట్టి (1806-1868) మద్రాస్ స్వదేశీ సంఘాన్ని (Madras Native Association) స్థాపించి 'క్రిసెంట్' అనే పత్రికను నిర్వహించాడు (1844). పాదిరీల అసత్య ప్రచారాన్ని, ప్రభుత్వంలో

స్థానికులకు జరుగుతున్న అన్యాయాన్ని, న్యాయ, పోలీసు శాఖలలోని అవినీతిని, రెవెన్యూ అధికారుల దౌర్జన్యాలను రోడ్లు మొదలైన కనీస ప్రజావసరాల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని ఖండిస్తూ 'క్రిసెంట్' ద్వారా ప్రజాభిప్రాయాన్ని సమీకరించడానికి కృషి చేశాడు; 1855 లో 14 వేల సంతకాలతో ఒక మహజర్‌ను పార్లమెంట్‌కు సమర్పించాడు. దేశంలో ఆంగ్ల విద్యావశ్యకత, వితంతు వివాహం, స్త్రీవిద్య మొదలైన సంస్కరణలను ప్రచారం చేశాడు; బాలికలకు ప్రత్యేకించి పాఠశాలను అతడు నెలకొల్పినట్లు తెలుస్తుంది. ఇందుచేతనే లక్ష్మీనరసును మద్రాస్‌కు రామమోహనరాయ్‌వంటివాడని శ్లాఘిస్తారు.

మద్రాస్‌లోనే ఆంధ్ర తమిళ పౌరులు 1882 లో మరొక నేటివ్ అసోసియేషన్ స్థాపించారు. మొదట్లో ఈ సంఘం కలకత్తాలోని బెంగాల్ ఇండియన్ అసోసియేషన్‌తో కలిసి పని చేసింది. తర్వాత స్వతంత్రంగా వ్యవహరించ సాగింది. పి. రంగయ్యనాయుడు అధ్యక్షుడుగా 1884 లో మద్రాస్ మహాజన సభ ఏర్పడింది. దీనికి పి. ఆనందాచార్యులు కార్యదర్శి. 1884 లో జరిగిన సమావేశానికి జిల్లాలనుండి ప్రతినిధులు హాజరయినారు. "దేశంలో బలపడుతున్న జాతీయ చైతన్యాన్ని సంఘటితపరచి సరియైన మార్గంలో నడిపించడమే మహాజనసభ లక్ష్యం" అని ఆనందాచార్యులు ప్రథమ సమావేశంలో స్పష్టం చేశాడు. మహాజన సభకు అనుబంధంగా జిల్లాలలో పౌర సంఘాలు ఏర్పడినాయి. వాటిలో కాకినాడ లిటరరీ సొసైటీ ముఖ్యమయింది. ఈ సొసైటీ 1884-85 లో I.C.S. పరీక్షకు వయోపరిమితి పెంచవలెననీ, రైతులపై శిస్తుభారం తగ్గించవలెననీ కోరుతూ బ్రిటిష్ పార్లమెంటుకు ఒక వినతి పత్రం సమర్పించింది.

ఈలోగా బెంగాల్ అసోసియేషన్ స్థాపకుడైన సురేంద్రనాథ బెనర్జీ 1878 లో, దేశంలో పర్యటించి ప్రభుత్వం చేస్తున్న అన్యాయాలను గురించి భారత వ్యతిరేక విధానాలను గురించి ప్రజలను ఉత్తేజపరిచాడు. అతని ఉపన్యాసం చివర 'స్వేచ్ఛ, సమత, సౌభ్రాత్రం' అనే నినాదాలతో సభలు మార్మ్రోగేవి. దేశవ్యాప్తమైన మహోద్యమ నిర్మాణానికి ప్రయత్నాలు ప్రారంభమయినాయి. ప్రభుత్వం పట్ల దేశంలో ప్రజ్వరిల్లుతున్న ఆగ్రహద్వేషాలు హింసాత్మకంగా పరిణమించే ప్రమాదం ఉందని గుర్తించారు. వారిలో ఇండియాలో ఉద్యోగం నుండి విరమించిన ఆక్టేవియన్ హ్యూం అగ్రగణ్యుడు. ప్రభుత్వ వ్యతిరేకత చట్టబద్ధమైన విధానాల ద్వారా వ్యక్తం చేయడానికి వీలైన సాధనంగా ఒక మహాసభను స్థాపించాలనే సంకల్పంతో అతడు చేసిన విజ్ఞప్తికి

దేశభక్తులైన యువకులు స్పందించారు. పూనాలో 1885 డిసెంబర్‌లో మహాసభా సమావేశానికి నిర్ణయం జరిగింది. కాని ఆ సమయంలో పూనాలో అంటువ్యాధి వ్యాపించి వున్నందున బొంబాయిలో గోకుల్‌దాస్ సంస్కృత విద్యాలయంలో మహాసభ జరిగింది. సభకు 72 మంది ప్రతినిధులు హాజరయినారు వారిలో మద్రాస్, బరంపురం, మచిలీపట్టణం, కడప, బళ్ళారి, అనంతపురం నుండి ఆంధ్ర ప్రతినిధులున్నారు. ఉమేశ్ చంద్ర బెనర్జీ సభకు అధ్యక్షత వహించాడు. భారత జాతీయ మహాసభ ఉదయించింది.

# ఆంధ్రదేశంలో సంస్కరణోద్యమాలు

## 1. హైదరాబాద్ సంస్థానం :

బ్రిటిష్ ఇండియా ప్రాంతాల్లో ప్రభుత్వ యంత్రాంగంలోను మత విద్యా సాంఘిక రంగాలలోను జరుగుతున్న పరిణామాల ప్రభావం హైదరాబాద్ సంస్థానంపై ప్రసరించింది. సంస్థాన పాలనా యంత్రాంగం సామాజిక పరిస్థితులు మధ్యయుగ భూస్వామ్య వ్యవస్థకు అనుగుణ్యమైనవి. వాటి వరకు దఫ్తర్ ఇమాల్, దఫ్తర్ దివానీ దారుల్ ఇన్ షా అనే మూడు కార్యాలయాలు దివాన్ పర్యవేక్షణలో జాగీర్దార్ల ఇనాందార్ల వ్యవహారాలు, భూమిశిస్తు, ఆంగ్ల ప్రభుత్వంతో లావాదేవీలు. నైజాం పర్మానాలను అమలువరచడం వీరి విధులు. వీనిలో సిబ్బంది కొరతవల్ల ప్రభుత్వ కార్యకలాపాల నిర్వహణ కుంటువడు తుండేది. స్థానిక పాలనా శిస్తు వసూలు విధానాలు సయితం అస్తవ్యస్తంగా వుండేవి. సంస్థాన ప్రభుత్వ విధానాలను సంస్కరించడానికి బ్రిటిష్ రెసిడెంట్లు గతంలో చేసిన ప్రయత్నాలు స్థానిక అధికారుల స్వార్థ చింతనవల్ల విఫలము లయినాయి. ఈ నేపథ్యంలో 1853 లో దివానైన సాలార్‌జంగ్ మంచి సమర్థుడు. ముగ్గురు నైజాముల కాలంలో — నాజర్ ఉద్దౌలా (1829-57) అఫ్జల్ ఉద్దౌలా (1857-69) మీర్ మహబూబ్ అలీఖాన్ (1869-1911) దివాన్ పదవి నిర్వహించిన గౌరవం అతనికి లభించింది. సాధారణంగా సంధి యుగంనాటి వ్యక్తులలో కన్పించే వైరుధ్యాలు సాలార్‌జంగ్‌లోనూ కనిపిస్తాయి. కాని సంస్థానాన్ని ఆధునీకరణ చేయాలని అతని సంకల్పం. ఈ కృషిలో అతడు నైజాం అఫ్జల్ ఉద్దౌలా ఆగ్రహానికి గురి అయినాడు; స్వార్థపరులైన సర్దారులు అతణ్ణి నిరసించారు; రెండుమార్లు అతనిపై హత్యా ప్రయత్నాలు జరిగినాయి. అయినప్పటికీ అతడు దీక్షను విరమించలేదు. 1869 లో అఫ్జల్ ఉద్దౌలా మరణించి పసివాడైన మహబూబ్ అలీ నైజాం కావడంతో సాలార్‌జంగ్‌కు స్వేచ్ఛ లభించింది. సాలార్‌జంగ్ సాంప్రదాయ ప్రియుడే కాని సంస్కరణాభి లాషి. బ్రిటిష్ ప్రాంతాలలో అమలు జరుగుతున్న విధానాలను సంస్థానంలో అనుసరించాలని అతని లక్ష్యం; అందుచే కేంద్రీకరణ వికేంద్రీకరణ విధానాల సమన్వయం అతని సంస్కరణల్లో కన్పిస్తుంది. ఆర్థిక విధానం, ప్రభుత్వ

యంత్రాంగం పూర్తిగా సంస్కరించి, నూతన విధానాన్ని నిర్వహించగల సమర్థులను తర్ఫీతు చేసే విద్యా విధానాన్ని రూపొందించి ఆధునిక హైదరాబాద్ పునాదులను గట్టిపరిచే కృషి సాలార్‌జంగ్ చేశాడు.

సంస్థాన ఆర్థిక పరిస్థితిని మెరుగుపరచడం సాలార్‌జంగ్ తక్షణ కర్తవ్య మయింది. ఈ రంగంలో అతని లక్ష్యాలు : నానాటికీ క్షీణిస్తున్న ఆదాయాన్ని పెంచడం, పెరుగుతున్న ప్రభుత్వ వ్యయాన్ని తగ్గించడం; రుణభారం నుండి సంస్థానాన్ని విముక్తి చేయడం. నాటికి పరగణాలకు పరగణాలు అరబ్బు, పఠాన్ వడ్డీ వ్యాపారుల తనఖాలో వుండేవి. తమ ఇలాకాలోని గ్రామాలపై వీరు దాడులు జరిపి రైతులను హింసించి డబ్బు వసూలు చేస్తుండేవారు. ఈ తనఖా భూములన్నింటినీ స్వాధీనం చేసుకొని అరబ్బు పఠాన్ రోహిల్లా మూకలను నిర్దాక్షిణ్యంగా అణచివేశాడు; బ్రిటిష్‌వారి ఆక్రమణలో నున్న ధారా శివ, రాయచూర్, నవ్‌దుర్గ్ జిల్లాలు 1857 తిరుగుబాటు తరువాత నైజాం పరమైనాయి. దీనితో 20 వేల చ॥ మైళ్ళకు పైగా విస్తీర్ణంవున్న భూమి ఖాల్సాలో కలిసింది. భూములను రైతులకు కౌలు (ఇజరా) ఇచ్చి పత్తి మొదలైన వాణిజ్య పంటలను సాలార్‌జంగ్ ప్రోత్సహించాడు; స్వచ్ఛందంగా తన వేతనాన్ని 25 వేల నుండి 15 వేల వరకు తగ్గించుకొని ఇతర ఉన్నతో ద్యోగుల వేతనాలు సైనిక ఖర్చులు తగ్గించాడు. అబ్కారీ, వాణిజ్య సుంకాలు, రహదారి పన్నులు, క్రయ విక్రయాలపై రుసుములు (Stamp duty) అడవులు మొదలైన వానిద్వారా ఆదాయం క్రమబద్ధం చేశాడు. కేంద్ర ఖజానాను ఏర్పర చాడు; ద్రవ్య విధానాన్ని సంస్కరించి 'హాలీసిక్కా'ను ప్రవేశపెట్టాడు. హాలీ రూపాయి, బ్రిటిష్ రూపాయికంటె విలువలో 15 శాతం తక్కువ. చెల్లింపులు హాలీ సిక్కాలో చేయడంద్వారా సంస్థానానికి కొంత లాభం వచ్చేది. ఈ చర్య లన్నింటి ఫలితంగా 1853-54 లో 68 లక్షలున్న సంస్థాన ఆదాయం 1880-81 నాటికి మూడు కోట్ల రూపాయలకు పెరిగింది.

ప్రభుత్వాదాయానికి భూమిశిస్తు ముఖ్య ఆధారం. శిస్తు వసూలు విధానంలో అనేక లోపాలుండేవి. శిస్తు వసూలుచేసే అధికారాన్ని బిల్ మక్తాదారులనే మధ్యవర్తులకు విక్రయించేవారు. శిస్తు ధాన్య రూపంలో వసూలు చేయడం మరొక లోపం. అమాయకులైన రైతులను బిల్ మక్తాదార్లు మోసంచేసి విపరీ తంగా ధాన్యం శిస్తుగా వసూలు చేసేవారు. ప్రభుత్వ ఆదాయాభివృద్ధికీ, వ్యవ సాయాభివృద్ధికీ ఈ విధానాలు ప్రతిబంధకాలయినాయి. రైతులు విపరీత నష్టా లకు గురియై వ్యవసాయంపట్ల నిర్లక్ష్యం వహించేవారు. సాలార్‌జంగ్ అధికారం లోకి రాగానే బిల్ ముక్తాదార్లకు నష్టపరిహారం చెల్లించి వారిని తొలగించి రైతు

వారి విధానం అమలుపరిచాడు. పాత చిట్టాలు (records) ఆధారంగా సాగులో నున్న భూమి విస్తీర్ణాన్ని నిర్ణయించి శిస్తు (జిమా) అంచనా వేయబడింది. గ్రామాలలోని పటేల్, పట్వారీల సాయంతో తహశీల్‌దార్లు ప్రతి రైతు చెల్లించ వలసిన శిస్తును నిర్ణయించాడు. ముప్పది సంవత్సరాల వరకు ఈ నిర్ణయంలో మార్పులుండవు. పంట పొలాలపై శిస్తు మినహాయింపు వుండదు. పంట వేయని మెట్ట మాగానీ పొలాలపై మినహాయింపు వుంటుంది. శిస్తు ధనరూపంలో చెల్లించ వలె. జిల్లావారీ శిస్తు వసూలు పర్యవేక్షణకు రెవెన్యూ బోర్డు (1864) రెవెన్యూ సర్వేశాఖ (1875) నెలకొల్పబడినాయి. ఈ చర్యలవల్ల రైతులకు మంచి ప్రోత్సాహం లభించి వ్యవసాయాభివృద్ధి జరిగింది. సాలుసరి పంట దిగుబడి పెరిగింది; శిస్తు రూపంలో సంస్థాన ఆదాయం పెరిగింది.

శిస్తు వసూలుకు స్థానిక పాలనా విధానానికి సన్నిహిత సంబంధం వుంది. అందుచేత స్థానిక పాలనా విధానం సంస్కరించి 'జిల్లా బందు' అని ప్రసిద్ధమైన పద్ధతి అమలు చేశాడు. దీని ప్రకారం 1867 లో సంస్థానాన్ని ఏడు 'డివిజన్లు'గా విభజించడం జరిగింది. డివిజన్‌పై అధికారి 'సాదర్ తాలూకాదార్' డివిజన్‌లో రెండు మూడు జిల్లా లుండేవి; జిల్లా అధికారి 'అవ్వల్ తాలూకాదార్ (ప్రథమ తాలూకాదార్), ఈతనికి సహాయంగా ఇద్దరు తాలూకాదార్లుండేవారు. జిల్లాలో శిస్తు వసూలు, శాంతి భద్రతల పరిరక్షణ, నేర విచారణాధికారాలు అవ్వల్ తాలూకాదారు చెలాయించేవాడు. తాలూకా అధికారి తహశీల్‌దార్. ఈ వుద్యోగు లందరికి జీతాలు ఇచ్చేవారు. ప్రతి జిల్లాలోను సివిల్ క్రిమినల్ న్యాయస్థానా లేర్పడినాయి. జిల్లా పరిపాలన సాదర్ తాలూకాదార్ పర్యవేక్షణలో వుండేది.

సాలార్‌జంగ్ కాలానికి సంస్థానంలో క్రమబద్ధమైన న్యాయస్థానాలు లేవనే చెప్పవచ్చు. నైజాం మాట శాసనం, అతని కొలువు ఉన్నత న్యాయ స్థానం; నామ మాత్రంగా రాజధానిలో న్యాయస్థానా లుండేవి. దివాన్ దర్బారు లోనే నేరస్థులను విచారించి శిక్షించేవారు. క్రిమినల్ తగాదా లన్నింటిలో ఇస్లాం శిక్షాస్మృతి (షారా) అమలు జరిగేది. హిందువుల వారసత్వ (సివిల్) తగాదాల్లో మాత్రం హిందూ ధర్మశాస్త్రాన్ని అనుసరించేవారు. దివాన్ సిరాజ్ ఉల్ ముల్క్ (1846 - 48) న్యాయ పాలనలో కొన్ని సంస్కరణలు చేశాడు. పౌర నేర విచారణాధికారాలను విభజించాడు; మరణ శిక్షను, కాలు చేతులు నరకడం వంటి క్రూర శిక్షలను, సతీ సహగమనాన్ని నిషేధించాడు; హైదరాబాద్‌లో కొన్ని ప్రత్యేక న్యాయస్థానాలు నెలకొల్పినాడు. కాని క్రమంగా న్యాయ పాలనలో అరాచకం ప్రబలి న్యాయస్థానాల తీర్పులను మన్నించని పరిస్థితి యేర్పడింది.

బ్రిటిష్ ప్రాంతాలలోని విధానం నమూనాగా సాలార్‌జంగ్ సంస్థానంలో న్యాయ పాలన విధానం సంస్కరించడానికి ప్రయత్నించాడు. ధర్మసమత (**equality before law**) నెలకొల్పడం అతని ఆశయం. సంస్థానంలో అరాచకం సృష్టిస్తున్న రోహిల్లా, అరబ్, పఠాన్ దుండగులను శిక్షించి అదుపులో వుంచడానికి నగరంలో ప్రత్యేక న్యాయస్థానాలు ఏర్పాటు చేశాడు. తాలూకా జిల్లా కేంద్రాలలో సివిల్. క్రిమినల్ కోర్టు లేర్పడినాయి; వాటి విధులు స్పష్టంగా నిర్వచించడం జరిగింది. గ్రామాలలో పటేల్, పట్వారీలు న్యాయ విచారణచేసి దోషులను శిక్షించేవారు. హైదరాబాద్‌లో ఉన్నత న్యాయస్థానం నెలకొల్పబడింది. ఇందులో ఒక నజీం (**President**) ఐదుగురు న్యాయాధీశులు వుండేవారు. జిల్లా కోర్టుల తీర్పులపై అప్పీళ్ళను ఈ న్యాయస్థానం విచారించేది. హిందువుల మధ్య తగాదా లన్నింటిలో ధర్మశాస్త్రాలను అనుసరించే పద్ధతి ఏర్పడింది. ఖూనీ నేరాల సందర్భంలో కాజీ నుండి అనుమతి అవసరం. మరణ శిక్షను నైజాం అనుమతించవలె.

సంస్థానంలో శాసన సభను ఏర్పరచడానికి సాలార్‌జంగ్ ప్రయత్నం ఫలించలేదు. కాని మంత్రివర్గ (**Cabinet**) పద్ధతి నాతడు ప్రవేశపెట్టాడు. పరిపాలనను నాల్గు శాఖలుగా విభజించి నల్గురు మంత్రులను నియమించాడు : (1) రెవెన్యూ శాఖ — ఇందులో వ్యవసాయం, వాణిజ్యం, స్టాంపు పన్నులు, రహదారి సుంకాలు, అడవులు, అబ్కారి మొదలైన విషయా లుండేవి; (2) న్యాయశాఖ (3) పోలీసు శాఖ. నగరానికి పూర్వం నుండి కొత్వాల్ అనే పోలీస్ అధికారి వుండేవాడు. అతనికుండే నేర విచారణాధికారం రద్దయింది: (4) ఇతర కార్యక్రమాల శాఖ. ఇందులో ప్రజా సౌకర్యాలు (**Public works**), విద్య, వైద్యం, ఆరోగ్యం, పురపాలక సంఘాలు మొదలైనవి వుండేవి. ప్రతి మంత్రి క్రింద కార్యదర్శు లుండేవారు. మంత్రులకు విధాన నిర్ణయాధికారం లేదు. కార్యదర్శులు నేరుగా దివాన్‌తోనే వ్యవహరించేవారు. అంటే అధికారం దివాన్‌లో కేంద్రీకృతమై వుండేది. ఏమైనా సంస్థానంలో మంత్రివర్గ (**Cabinet**) పద్ధతులకు అంకురార్పణ జరిగింది.

ఆధునిక విద్యా విధానానికి గూడ సంస్థానంలో సాలార్‌జంగే అంకురార్పణ చేశాడు. గోల్కొండ రాజ్య పతనంతో పోషణలేక మదర్సాలు క్షీణించినాయి. ప్రజల విద్యాబుద్ధులపట్ల శ్రద్ధ వహించినవారు లేరు. ధనికులు, నవాబులు, జాగీర్‌దార్లు తమ బిడ్డలకు తమ ఇండ్లలోనే ఉపాధ్యాయులను నియమించుకొనేవారు. సాలార్‌జంగ్ సంస్కరణలతో ప్రభుత్వ యంత్రాంగం

విస్తరించడంతో దానిని నిర్వహించడానికి అధిక సంఖ్యలో విద్యావంతులు సమర్థులునైన ఉద్యోగుల అవసరం పెరిగింది. దీన్ని దృష్టిలో వుంచుకొని సాలార్‌జంగ్ పెక్కు విద్యాసంస్థలను నెలకొల్పినాడు. క్రైస్తవ మతప్రచారకుల (Church of England) 1834 లోనే హైదరాబాద్‌లో ఒక ఇంగ్లీషు పాఠశాలను నెలకొల్పారు. 1853 - 54) లో సాలార్‌జంగ్ ఓరియంటల్ కాలేజి (దారుల్ ఉలూమ్) ని స్థాపించాడు; అందులో 160 మంది విద్యార్థులు చేరారు. అరబిక్, పర్షియన్, ఇంగ్లీషు, తెలుగు, మరాటీ భాషలలో విద్యాబోధన జరిగేది. "ప్రభుత్వోద్యోగాలు నిర్వహించగల సమర్థులు ఈ కాలేజిలో తయారు కాగలరని" సాలార్‌జంగ్ స్వయంగా వ్రాశాడు. 1860 నాటికి తాలూకా, జిల్లా కేంద్రాలన్నింటిలో పాఠశాలలు స్థాపించారు విద్యా శాఖలో కార్యదర్శిగా పని చేసిన W. H. విల్ కిన్‌సన్ (1869 - 70) పాఠశాలల్లో నూతన బోధనాంశా లను ప్రవేశపెట్టాడు. 1860 లోనే ప్రజా సౌకర్యాల శాఖ క్రిందే సివిల్ ఇంజనీరింగ్ కాలేజీ దానికి అనుబంధంగా ఇంగ్లీషు బోధనకు పాఠశాల నెలకొల్ప బడినాయి. 1872 నాటికి ఈ పాఠశాల చాదర్‌ఘాట్ ఆంగ్లో - వర్నాక్యులర్ పాఠశాలగా అనంతరం హైదరాబాద్ కాలేజిగా రూపొందింది. ఈ కాలేజిని 1884 లో మద్రాస్ విశ్వవిద్యాలయంలో చేర్చారు. ప్రభు వర్గాల బాలురకై సాలార్‌జంగ్ 1878 లో మద్రసా-ఇ-అలియా స్థాపించగా అతని మేనల్లుడు నగరంలోని ఉన్నత వర్గాల వారికై మద్రసా-ఇ-అజియా అనే పాఠశాల నెల కొల్పాడు. మొత్తంమీద 1884 నాటికి 'దివానీ భూమి' (నైజాం ప్రత్యక్ష పాలన) లో 162 పాఠశాల లుండేవి. వీనిలో 13 నగరంలోనే వున్నాయి. వీనిలో 105 పర్షియన్, 35 మరాటీ, 19 తెలుగు 3 ఇంగ్లీషు పాఠశాలలు ఉపాధ్యాయుల శిక్షణకై (Training) హైదరాబాద్‌లో ఒక పాఠశాల (Normal School) నెలకొల్పారు.

నైజాముకు గానీ, దివాన్‌కు గానీ పాశ్చాత్య వైద్యంలో విశ్వాసం లేదు. ఆ మందులను వారెన్నడూ వాడలేదు. కాని రెసిడెన్సీలోని ఆంగ్లేయులనిమిత్తమై పాశ్చాత్య వైద్యం హైదరాబాద్‌లో ప్రవేశించింది. జనరల్ ఫ్రేజర్ రెసిడెంట్‌గా వున్న కాలంలో డాక్టర్ మెక్లీన్ 1846 లో ఒక మెడికల్ కాలేజి స్థాపించాడు. క్రమంగా ముస్లిం విద్యార్థు లీ కాలేజిలో తర్ఫీదు పొందసాగినారు.

డల్‌హౌసీ కాలంలో దేశవ్యాప్తంగా రాకపోకలకు సమాచార ప్రసారానికి సౌకర్యాల నిర్మాణానికి కృషి ప్రారంభమయింది. నాడు బొంబాయి, మద్రాస్‌ల నుండి సమాచారం హైదరాబాద్ చేరడానికి ఏడు ఎనిమిది రోజులు పట్టేది.

అందుచేత సంస్థానానికి ఈ సౌకర్యాల విస్తరణకు సాలార్‌జంగ్ కృషి చేశాడు. బ్రిటిష్‌వారు తమ సౌకర్యం నిమిత్తమై హైదరాబాద్‌లో కొన్ని తపాలా కార్యాలయాలు నిర్వహిస్తుండేవారు. 1856 - 57 లో బొంబాయి - హైదరాబాద్, హైదరాబాద్ - కర్నూలు మధ్య తంతి సౌకర్యం ఏర్పడింది. 1862 నాటికి జిల్లా కేంద్రాలలో తపాలా కార్యాలయాలు నెలకొల్పడం జరిగింది. 1871 లో తంతి తపాలా శాఖ ఏర్పడి ప్రధాన తపాలా అధికారి (Post Master General) నియామకం జరిగింది. జిల్లా, తాలూకా కేంద్రాలకు ప్రతి రోజు ఉత్తరాల బట్వాడా ప్రారంభమయింది. ఇక రైలు మార్గ నిర్మాణం గురించి నైజాం, బ్రిటిష్ ప్రభుత్వాల మధ్య అనేక లావాదేవీలు జరిగినాయి, ఇంతవరకు నైజాం స్టేట్ రైల్వే ఏర్పడింది. గుల్బర్గా సమీపంలోని వాడి నుండి సికిందరాబాద్‌కు రైలు మార్గం 1874 నాటికి పూర్తయింది. బొంబాయి నుండి హైదరాబాద్‌గుండా మద్రాస్‌కు గ్రాండ్ పెనిన్సులార్ రైలు మార్గ నిర్మాణానికి సికిందరాబాద్ నుండి విజయవాడకు, సింగరేణి గనుల గుండా గోదావరీ ముఖద్వారానికి రైలు మార్గ నిర్మాణానికి ప్రణాళికలు వేశారు. రెసిడెన్సీలో డాక్టర్ స్మిత్ 1856 లో ఒక వస్తు ప్రదర్శనాన్ని (Exhibition) ఏర్పాటు చేశాడు. దీనికి సాలార్‌జంగ్ నుండి మంచి ప్రోత్సాహం లభించింది. సంస్థానంలో తయారవుతున్న అనేక వస్తువులను ఇందులో ప్రదర్శించారు. హైదరాబాద్ పరిశ్రమలకు ప్రచారమూ ప్రోత్సాహమూ లభించినాయి. ఈ కార్యక్రమాల ద్వారా హైదరాబాద్‌కు ఇతర ప్రాంతాలతో సన్నిహిత్వం ఏర్పడి మధ్య యుగ పరిస్థితులనుండి త్వరగా బయల్పడడానికి వీలయింది.

డల్‌హౌసీ కాలంలో అంగ్లేయులపరమైన బీరారు పరగణాను తిరిగి స్వాధీనం చేసుకొని కంటిజెంట్ సైన్యం స్థానంలో హైదరాబాదు సైన్యాన్ని పెంచి సంస్థానానికి సాధ్యమైనంత ఎక్కువ ప్రతిపత్తి చేకూర్చాలని సాలార్‌జంగ్ తీవ్రమైన ప్రయత్నాలు చేశాడు. ఈ ప్రణాళికల వల్ల అంగ్లేయులకు దివాన్‌కు మధ్య పూర్వం వున్న స్నేహాభిమానాలు నశించి సాలార్‌జంగ్ పట్ల అంగ్లేయులకు అనుమానమూ ద్వేషమూ ప్రబలినాయి. 1875 లో వేల్సు రాకుమారుడు (ఏడవ ఎడ్వర్డు) భారతదేశం సందర్శించిన సందర్భంగా స్వాగతం చెప్పడానికి పిన్నవయస్కుడనే నెపంతో మహబూబ్ అలీఖాన్‌ను పంపడానికి దివాన్ నిరాకరించడంతో అంగ్లేయులకు మరింత కోపం కలిగించింది. సాలార్‌జంగ్‌ను తొలగించడానికి ప్రయత్నాలు జరిగినాయి. ఆతనికి బద్ధశత్రువైన వకీర్ ఉల్ ఉమ్రానును సహాయ సంరక్షకుడుగా నియమించారు. అయినా

సాలార్ జంగ్ జీవించినంత కాలం ఆతని పలుకుబడి, అధికారానికి ఏ మాత్రం నష్టం వాటిల్లలేదు. చివరకు 1883 లో కలరా వ్యాధి సోకి సాలార్ జంగ్ మరణించాడు.

వసంతకుమార్ బావా చెప్పినట్లు సర్ సయ్యద్ అహ్మద్‌ఖాన్ వలె సాలార్ జంగ్ కేవలం ముస్లిం నాయకుడు కాదు; భారత జాతీయోద్యమ నాయకులకు ఆతనికి పోలిక లేదు. సాలార్ జంగ్ దృష్టి కృషి హైదరాబాద్ సంస్థానాభివృద్ధిపై మాత్రమే కేంద్రీకృతమైనదనడం సమంజసం. సంస్థానాన్ని రుణ విముక్తం చేశాడు; అరాచకాన్ని అణచి ఆదాయం పెంచి రైతులకు కొంత మేలు చేకూర్చాడు; ప్రభుత్వ యంత్రాంగాన్ని ఆధునికీకరణంచేసే ప్రయత్నాలు ప్రారంభించాడు. ప్రజల్లో న్యాయస్థానాల పట్ల గౌరవాన్ని పెంచి న్యాయ సమతను నెలకొల్పాడు. విద్యాసౌకర్యాలు, రాకపోకల సౌకర్యాలు చేకూర్చాడు. తాను నెలకొల్పిన సంస్థల నిర్వహణకు సమర్థులైన స్థానికులు లేనప్పుడు బ్రిటిష్ ప్రాంతాల నుండి నిపుణులను ఆహ్వానించాడు. హైదరాబాద్‌లోని నక్వీ, మాథుర్ మొదలైన కుటుంబాల వారు ఈ కాలంలోనే వచ్చారు. ఈ విధానం వల్ల సంస్థానంలో 'ముల్కీ' (భూమి పుత్రులు sons of the soil) అంటే స్థానికులకే ఉద్యోగాల నీయవలె అనే వుద్యమం తలెత్తింది. కాని బ్రిటిష్ ప్రాంతాల నుండి వచ్చిన వారు స్థానికులలో ఆధునిక భావ చైతన్యానికి కారణ మైనారు. అట్టి వారిలో అఘోరనాథ చటోపాధ్యాయ సుప్రసిద్ధుడు. ఉపాధ్యా యుడుగావచ్చిన అఘోరనాథ్ నవ చైతన్యోద్యమ ప్రగతికి కేంద్రమయినాడు. ఈ విధంగా అన్ని రంగాలలో సంస్థాన ఆధునీకరణకు సాలార్ జంగ్ గట్టి పునాదులు కల్పించినాడనడం అతిశయోక్తి కాదు.

## బ్రిటిష్ ఆంధ్ర ప్రాంతంలో సంస్కరణోద్యమం

యావద్భారతంలో విస్తరిస్తున్న మత సాంఘిక సంస్కరణోద్యమాలకు సమాధానంగా నినాదాలు బ్రిటిష్ ఆంధ్ర ప్రాంతంలో ఉద్యమాలు సాగినాయి. పందొమ్మిదో శతాబ్ది పూర్వార్థంలోనే రాష్ట్ర రాజధానియైన మద్రాస్ పట్టణమూ, రాజమహేంద్రవరం, కాకినాడ, విశాఖపట్టణాలీ ఉద్యమాలకు కేంద్రాలయినాయి. ఏనుగుల వీరాస్వామి, వెన్నెలకంటి సుబ్బారావు మత సాంఘిక దురాచారాలను, వాటిని తొలగించవలసిన ఆవశ్యకతను, అందుకు సాధనం విద్యావ్యాప్తి అని గుర్తించినట్లు పేర్కొన్నారు; మద్రాస్‌లో వణిక్ప్రముఖుడైన గాజుల లక్ష్మీ నరుసు క్రైస్తవమత ప్రచారాన్ని ప్రతిఘటించడమేగాక స్త్రీవిద్యను వితంతు వివాహాన్ని ప్రోత్సహించాడు; లక్ష్మీ నరుసు బాలికలకు పాఠశాలను నెలకొల్పి

నట్లు తెలుస్తుంది. స్త్రీవిద్య సాంఘిక సంస్కారానికి ప్రగతికి అత్యవసరమనే పరిజ్ఞానం కలిగినట్లు కన్పిస్తుంది. రాజమండ్రి వాస్తవ్యుడైన సామినేని ముద్దు నరసింహనాయుడు భూతవైద్యం మొదలైన మూఢ విశ్వాసాలను ఖండిస్తూ స్త్రీలకు అన్యాయం చేస్తున్న హిందూ వివాహ విధానం సంస్కరించాలని బోధిస్తూ 'హితసూచని' అనే గ్రంథం వ్రాశాడు. విభాగ వాస్తవ్యుడు ప్రభుత్వ విద్యా శాఖలో ఉద్యోగియైన వేదాంతాచారి బాల్య వివాహాలను నిషేధిస్తూ, హిందూ వివాహ విధానంలోని లోపాలను సవరిస్తూ శాసనాలు చేయాలని ప్రభుత్వానికి విన్నవించాడు (1870). ప్రజల్లో ఈవిధంగా సంస్కరణాభిలాష ప్రబలుతున్న వాతావరణంలో రాజమండ్రిలో జన్మించిన కందుకూరి వీరేశలింగం (1848-1919) ఆధునిక ఆంధ్రలో భిన్న రంగాలలో నవయుగ వైతాళికుడుగా మధ్య తరగతిలోని నూతన చైతన్యానికి ప్రతీకగా ప్రసిద్ధి చెందాడు.

వీరేశలింగం సంస్కృతాంధ్రాల్లో మంచి పండితుడు. ఆంగ్ల భాషలో న్యాయశాస్త్రంతో పరిచయం సంపాదించాడు. ఉపాధ్యాయ వృత్తిలో వుంటూ సమాజంలోని దురాచారాలకు ముఖ్యంగా స్త్రీల దుస్థితికి స్పందించి సంఘ సంస్కరణే తన జీవిత లక్ష్యంగా కృషి ప్రారంభించాడు. ఈ లక్ష్యాలతోనే రామమోహనరాయ్ స్థాపించిన బ్రహ్మ సమాజ ప్రభావం వీరేశలింగం నిర్ణయా లను బలపరిచి వుంటుంది. 1861 లో కేశవ చంద్రసేన్ ఉద్బోధతో మద్రాస్‌లో వేద సమాజ స్థాపన జరిగింది. ఈ సమాజం 1869-70 నాటి శ్రీధరులు నాయని నాయకత్వంలో దక్షిణదేశ బ్రహ్మ సమాజంగా పెంపొందింది. వీరేశలింగం రాజమండ్రిలో 1874 లో ప్రార్థనా సమాజాన్ని నెలకొల్పి ఏకేశ్వరోపాసన, నిర్గుణోపాసన వంటి బ్రహ్మ సమాజ సిద్ధాంతాలను ప్రచారం చేశాడు. ఏమైనా భావ చైతన్యం లేనిదే, భావాల్లోను దృక్పథంలోను అనుగుణమైన మార్పులు రానిదే సంస్కరణలు శాశ్వత ప్రయోజనాన్ని చేకూర్చవు. భావ చైతన్యానికి ప్రచారము, ప్రచారానికి సాహిత్యము సాధనాలు. అది గ్రహించిన వీరేశలింగం సాహిత్యాన్ని మత సాంఘిక సంస్కరణకు మౌలిక సాధనంగా రూపొందించి ఆంధ్రభాషా చరిత్రలో యుగపురుషుడయినాడు.

వీరేశలింగం తన సిద్ధాంత ప్రచారానికి ప్రహసనాలు, నాటకాలు, పత్రిక లను ప్రధాన సాధనాలుగా గ్రహించాడు. తెలుగులో క్రమబద్ధమైన పత్రికా రచనకు నాంది పలికినవాడు వీరేశలింగం అనడంలో అతిశయోక్తిలేదు. మూఢ విశ్వాసాలను, పురోహితుల దౌష్ట్యాన్ని, ఉద్యోగులలోని లంచగొండితనాన్ని నిరసిస్తూ తిర్యగ్విద్వాన్ మహాసభ, మూషికాసుర విజయం మొదలైన ప్రహసనాలు

రచించాడు వ్యవహార ధర్మబోధిని (ప్లీడరు నాటకం) పెద్దయ్యగారి పెళ్ళి అనే నాటకాలు రచించి ప్రదర్శించాడు. వివేకవర్ధిని అనే పత్రికను స్థాపించి (1874) దానికి హాస్య సంజీవని జోడించాడు; స్త్రీలకోసం ప్రత్యేకంగా సతీహిత బోధిని (1883) అనే పత్రికను ప్రజలలో నైతిక విలువలు పెంపొందడానికి సత్య సంవర్ధిని (1891) సత్యవాదిని (1905) అనే పత్రికలు నిర్వహించాడు. ఈ ఆశయాలతోనే రాజమండ్రిలో ఆస్తిక ఉన్నత పాఠశాల (Thiestic High School) ను స్థాపించాడు. ఈ పాఠశాలలో బాలబాలికలను పుత్రయులను చేర్చుకోవడం నాటికి విప్లవాత్మకమైన చర్యయే అని చెప్పవచ్చు.

బాల వితంతు వివాహాలకు బెంగాల్, బొంబాయి, మద్రాసులలో ఉద్యమాలు జరుగుతున్నాయి బెంగాల్‌లో ఈశ్వరచంద్ర విద్యాసాగర్, బొంబాయిలో పండిత రమాబాయ్ ఉద్యమ నిర్వాహకులు. మద్రాస్‌లో రంగనాథరావు, చంచలావు మొదలైనవారు 1874 లో వితంతు పునర్వివాహ సంఘం స్థాపించారు. ఈ వాతావరణం వీరేశలింగానికి నూతనోత్తేజం కలిగించింది; 1878 లో అతడు సంఘ సంరక్షణ సమాజం స్థాపించాడు. గౌతమ, పరాశర, ఆపస్తంబ ధర్మసూత్రాలను క్షుణ్ణంగా పరిశీలించి సనాతనుల విమర్శలకు సమాధానంగా వితంతు వివాహాలు ధర్మ సమ్మతములని చాటి చెప్పాడు. 1881 డిసెంబర్ 11 వ తేదీన తన ఇంట్లో మొదటి వితంతు వివాహం జరిపించాడు. సంస్కరణాసక్తులైన యువకులు అతనికి అండగా నిలిచి ప్రోత్సాహం ఇచ్చారు. తరువాత, విజయనగరం, గుంటూరు, బళ్ళారి, బెంగుళూరులలో వితంతు వివాహాలు జరిగినాయి. ఈ ఉద్యమానికి సుస్థిరత చేకూర్చే లక్ష్యంతో మద్రాస్ లోను రాజమండ్రిలోను వితంతు (వసతి) గృహాలు నెలకొల్పి వారిలో విద్యాభివృద్ధికి ఏర్పాట్లు గావించాడు.

సంస్కరణోద్యమంలో తల మునకలవుతూనే వీరేశలింగం సాహిత్యసేవ మరవలేదు. అతని నాటకాలను ప్రహసనాలను పైన పేర్కొన్నాము. అతని రాజశేఖర చరిత్ర తెలుగుభాషలో మొదటి నవల; ఆంధ్ర కవుల చరిత్రద్వారా సాహిత్య చరిత్రకు వీరేశలింగం శ్రీకారం చుట్టాడు కాళిదాసు నాటకాలను, షేక్స్పియర్ నాటకాలను అనువదించాడు. గలివర్స్ ట్రావెల్స్‌ను అనుసరిస్తూ సత్యా పూర్వ దేశయాత్ర రచించాడు. ప్రహసన నాటక, నవలా రచయితగా, అనువాదకుడుగా, సాహిత్య చరిత్రకారుడుగా, పాత్రికేయుడుగా, వ్యవహార భాషకు గౌరవస్థానం కల్పించిన పండితుడుగా సాహిత్యాన్ని సంస్కరణ సాధనం గావించిన మార్గదర్శకుడుగా ఆధునిక ఆంధ్ర భాషా చరిత్రలో వీరేశలింగం అద్వితీయ స్థానం ఆక్రమిస్తాడు.

స్వాతంత్ర్య ఉద్యమానికి వీరేశలింగం మద్దతునీయలేదనే ప్రథ వుంది. దేశ స్వాతంత్ర్యాన్ని అతడు కాంక్షించలేదనడం పొరబాటు. నాటి జాతీయోద్యమ నాయకుల్లో చాలామంది బ్రిటిష్ ప్రభుత్వం పట్ల విశ్వాసం వహించిన వారుండే వారు. జాతీయ మహాసభలు బ్రిటిష్ జాతీయగీతంలో ప్రారంభమవుతుండేవి. అట్టి మితవాదుల్లో మితవాది వీరేశలింగం అనడం మంచిది. అయితే సాంఘిక దురాచారాల మూఢ విశ్వాసాలు సమసి సమాజం చైతన్యవంతం కానిదే రాజకీయ స్వాతంత్ర్య ప్రయోజనం ప్రజలు అనుభవంలోకి రాదని అతని సిద్ధాంతం!

వీరేశలింగం ధైర్య సాహసాలతో పుంజుకొన్న సంస్కరణోద్యమం క్రమంగా విస్తరించింది. బ్రహ్మ సమాజ కార్యకర్తలిందుకు తోడ్పడినారు. శ్రీధరులు నాయుడు తరువాత మన్నవ బుచ్చయ్య కార్యదర్శియై బ్రహ్మ సమాజ సిద్ధాంత ప్రచారానికి విశేషమైన కృషి జేశాడు. అతనికి దేశిరాజు పెదబాపయ్య అండగా వుండేవాడు. వీరు సహపంక్తి భోజనాలు కూడ నిర్వహించేవారని తెలుస్తుంది. మచిలీపట్టణంలో ఆత్మూరి లక్ష్మీనరసింహం కాకినాడలో రఘుపతి వెంకటరత్నం బ్రహ్మసమాజ భావ ప్రచారం సాగించారు. విజయనగరం, నర్సాపురం, భీమిలిపట్టణం, భీమవరం, ఏలూరు, పిఠాపురం, గుడివాడ, విజయ వాడ, బాపట్ల, గుంటూరులలో బ్రహ్మ సమాజ శాఖలేర్పడినాయి. స్థానికులకు మద్దతుగా బెంగాల్‌నుండి బ్రహ్మసమాజ ఉద్యమ నాయకులైన పండిత శివనాథ శాస్త్రి (1879) బిపిన్ చంద్రపాల్ (1901) హేమచంద్ర సర్కార్ మొదలైన వారు ఆంధ్రదేశంలో పర్యటించి ప్రజలను ఉత్తేజపరచారు. స్థానికులు బెంగాలీ అభ్యసించి బ్రహ్మ సమాజ సిద్ధాంత గ్రంథాలు తెలుగులోనికి అనువదించారు; ధర్మసాధని (తెలుగు), సాధన (ఇంగ్లీషు) అనే పత్రికలు ప్రచురించారు. పిఠాపురం రాజావంటి ఉదారుల ధన సహాయంతో విద్యార్థుల, అంతిమవర్ణం వారితో సహా, వసతి గృహాలు, అనాథ శరణాలయాలు నిర్వహించారు. ఆశ్రమాలు అనే పేర ప్రచార కేంద్రాలు నెలకొల్పినారు; సాంఘికంగా కులతత్వ నిర్మూలన, స్త్రీ జనోద్ధరణ, హరిజనోద్ధరణ ఆశయాలుగా కృషి సాగించారు.

ఆంధ్రదేశంలో బ్రహ్మ సమాజ సిద్ధాంత ప్రచారకులలో రఘుపతి వెంకటరత్నం నాయుడు (1862-1939) సుప్రసిద్ధుడు. వెంకటరత్నం గొప్ప పండితుడు; మహావక్త, మద్రాస్ (పచ్చయ్యప్ప కళాశాల) మచిలీపట్టణం, రాజమండ్రి, సికిందరాబాద్ కళాశాలల్లో ఉపన్యాసకుడుగా పని చేశాడు. అనంతరం కాకినాడలోని పిఠాపురం రాజా కళాశాల ప్రధానాచార్యులయినాడు. ముఖ్యంగా స్వచ్ఛమైన తన నీతి వర్తనతో విద్యార్థులను ఆకర్షించేవాడు. బ్రహ్మ

సమాజంలో చేరి ప్రధానంగా వేశ్యావృత్తి నిర్మూలన హరిజనోద్ధరణలపట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి కృషి చేశాడు. పిఠాపురం జమీందారు ధన సహాయంతో హరిజన విద్యార్థులకు వసతిగృహం ఏర్పాటు చేశాడు. వ్యక్తి జీవితంలో తద్వారా సమాజంలో నైతిక విలువలు పెంచే ఆశయంతో 'స్వచ్ఛతా ఉద్యమం' నిర్వహించాడు. వివాహం చేసుకోకుండా సాంసారిక జీవితాన్ని సాగిస్తున్న ఆంగ్ల యువతీ యువకుల జంట మద్రాస్ కాంగ్రెస్ మహాసభకు హాజరు కావడానికి నిరసనగా వెంకటరత్నం మహాసభ నుండి నిర్గమించినట్లు కొండా వెంకటప్పయ్య తన స్వీయ చరిత్రలో వ్రాశాడు.

ఏమైనా బ్రహ్మ సమాజ ఉద్యమం ఆంధ్రదేశంలో విజయవంతమయిన దని చెప్పలేము. సమాజంలో సభ్యుల సంఖ్య చాల పరిమితం. వారిలో అధిక సంఖ్యాకులు బ్రాహ్మణులు. వీరి ప్రచార కార్యక్రమాలు చాలవరకు నగరాలకు పరిమితమై వుండేవి. ప్రార్థనా సమాజం, వేద సమాజం, నైష్టిక సమాజం, సాధారణ సమాజం మొదలైన శాఖోపశాఖలుగా చీలిపోవడం కూడ సమాజాన్ని బలహీనపరిచింది. సనాతన ప్రయత్నానికి సంస్కరణాభిలాషకు మధ్య ఊగిస లాటకు నైష్టిక సమాజం దర్పణం అని చెప్పవచ్చు ఇంచుమించు ఇరవయ్యో శతాబ్ది ఆరంభంనుండి బ్రాహ్మణేతర వుద్యమాలు, కుల సంఘాలు ప్రారంభ మయినాయి. అనిబిసెంట్ అడయార్‌లో దివ్యజ్ఞాన సమాజ కేంద్రం నెలకొల్పి ప్రచారం సాగించింది. అనిబిసెంట్ వైదిక సంస్కృతికి బ్రహ్మరథం పట్టింది. అందుచేత మద్రాస్‌లోని బ్రాహ్మణులామెకు మద్దతుగా నిలిచారు. దీని ఫలితంగా నాటి సాంస్కృతికోద్యమాలను కేవలం బ్రాహ్మణోద్యమాలుగా బ్రాహ్మణేతర ఉద్యమాలు పరిగణించినాయి. వెంకటరత్నం వంటి సంస్కరణోద్యమ నాయకులు సయితం బ్రాహ్మణేతరోద్యమాలలో చేరడం బ్రహ్మ సమాజానికే గాక సాంఘిక సంస్కరణోద్యమాలకే విఘాతమయినట్లు చెప్పవచ్చు.

వీరేశలింగం వెంకటరత్నం మొదలైన ప్రముఖులు - విద్య, బాల్య వివాహాలు, కన్యాశుల్కం నిర్బంధ వైధవ్యం, వేశ్యావృత్తి మొదలుగా దురాచారాలను వెలుగులోకి తెచ్చి వాటి పరిష్కారానికి కృషి చేయడం స్త్రీలలో సయితం సంస్కారపరమైన చైతన్యానికి తోడ్పడింది. స్త్రీలలో అవిద్యను నిర్మూలించవలసిన ఆవశ్యకతను 19 వ శతాబ్ది ఆరంభంలోనే గుర్తించారు. కాని ఈ రంగంలో కూడ క్రైస్తవమత ప్రచారకులే ముందంజవేసినట్లు కన్పిస్తుంది; మద్రాస్ పట్టణంలో 1842 లోనే బాలికలకై ప్రత్యేక పాఠశాల నెలకొల్పినారు. క్రమంగా విజయనగరం, అనకాపల్లి పిఠాపురం జమీందార్లు బాలికా

పాఠశాలలు నెలకొల్పి పోషించారు. వీరేశలింగం 1874 లో ధవళేశ్వరంలో బాలికా పాఠశాల స్థాపించాడు; స్త్రీలకై 'సతీహితబోధిని' అనే ప్రత్యేక పత్రికనే గాక వారిలో శాస్త్ర విజ్ఞానం పెంపొందించే గ్రంథాలు వ్రాసి ప్రచురించాడు. తరువాతి కాలంలో 'హిందూ సుందరి', 'తెలుగు జనానా', 'చింతామణి' మొదలైన స్త్రీల పత్రికలు వెలువడినాయి. స్త్రీలలో విద్యా చైతన్యాలు ప్రబోధించే రచనలు చేసే లక్ష్మీ నరసమాంబలవంటి విదుషీమణులు, రచయిత్రులు బయలు దేరారు.

> కొటికలపూడి సీతమ్మ అహల్యాబాయి చరిత్రలో
> స్త్రీలు విద్యనేర్వ చెడిపోదురను మాట
> కల్లయనుచు దోవ నెల్లరకును
> విశదపరతు నొక్క విద్యావతి చరిత్ర
> సంగ్రహమున మీరు చదువుడయ్య!

ఈ వుద్యమంలో మచిలీపట్టణం వాస్తవ్యురాలైన బండారు అచ్చమాంబ సేవ గణనీయమయింది. 'అబలా సచ్చరిత్రమాల' అనే గ్రంథం రచించి ప్రచురించడమేగాక రాష్ట్రంలో పర్యటించి ఉపన్యాసాల ద్వారా స్త్రీలను తేజపరిచింది; మహిళా సంఘాలు, గ్రంథాలయాలు స్థాపించడాన్ని ప్రోత్సహించింది. నగరాలలోనేగాక గ్రామాలలో సయితం మహిళా సంఘాలు స్థాపించారు; జిల్లా మహిళా సంఘాలు ఏర్పడినాయి. ఈ సంఘాలు తరచు సమావేశమై స్త్రీల సమస్యలను చర్చించేవి. పిఠాపురం జమీందారిణి రాణీ చిన్నమాంబ నాడు సుప్రసిద్ధులైన కవయిత్రులను విదుషీమణుల ప్రత్యేక సమావేశాలు నిర్వహించినట్లు తెలుస్తుంది. 1910 లో అఖిలాంధ్ర మహిళా మహాసభ గుంటూరులో లక్ష్మీ నరసమాంబ అధ్యక్షత క్రింద జరిగింది. ఆంధ్రదేశంలో మహిళా చైతన్యాన్ని గురించి 'హిందూ' వంటి ప్రముఖ దినపత్రికలు ప్రశంసిస్తూ వ్రాసినాయి.

ఈ వాతావరణంలోనే విజయనగర (పిఠాపుర) సంస్థాన విద్వాంసుడైన గురజాడ అప్పారావు 'కన్యాశుల్కం' అనే నాటకం వ్రాశాడు. 'ముత్యాలసరాలు' అనే కొత్త మాత్రా ఛందము నేర్పరచి అందులో 'పూర్ణమ్మ కథ' వంటివి వ్రాశాడు. సమకాలిక భారత సాహిత్యంలోని అగ్రశ్రేణి రచనల్లో కన్యాశుల్కం చేరుతుంది. నాటి ఛాందస బ్రాహ్మణ కుటుంబాల్లోని సంప్రదాయ ప్రియత్వంతో బాటు బాల్యవివాహం, కన్యాశుల్కం, నిర్బంధ వైధవ్యం వంటి దురాచారాల వల్ల కలుగుతున్న అనర్థాలను, కుహనా సంస్కర్తల వంచకత్వాన్ని

కన్యాశుల్కం ప్రతిఫలిస్తుంది; అయినా సంధియుగానికి లక్షణమైన సంప్రదాయానికి సంస్కరణకు మధ్య మానసిక సంఘర్షణ, వ్యక్తావ్యక్తంగా ఈ నాటకంలో కన్పిస్తుంది. అప్పారావు సంస్కరణోద్యమాలలో పాల్గొన్న జాడలేదు. సాహిత్యం ద్వారా సంస్కరణాభిలాష కలిగించడానికి కృషి చేశాడు. అంతేగాక మానవతావాదంతో కూడిన దేశభక్తి నుద్బోధిస్తూ అతడు రచించిన "దేశమును ప్రేమించుమన్నా మంచి యన్నది పెంచుమన్నా....దేశమంటే మట్టి కాదోయ్ దేశమంటే మనుషులోయ్" అనే గేయం చాల ప్రసిద్ధి చెందింది. కొంచెం తరువాతి కాలానికి చెందిన చిలకమర్తి లక్ష్మీ నరసింహం విదేశపాలన వల్ల భారతీయులకు కలుగుతున్న కష్ట నష్టాలను మృదువుగా వర్ణిస్తాడు:

భరత ఖండంబు చక్కని పాడియావు। తెల్లవారలు గడుసరి గొల్లవారు
హిందువులు లేగదూడలై యేడ్చుచుండ। బతుకుచున్నారు మూతులు
బిగియగట్టి.

## జాతీయోద్యమం

భారత జాతీయ మహాసభ దేశ స్వాతంత్ర్య సాధనకు ప్రధాన ఆయుధంగా రూపొందసాగింది. మహాసభ చరిత్రలో మొదటి రెండు దశాబ్దాలను మితవాద యుగంగా వర్ణిస్తారు. వుమేష్‌చంద్ర బెనర్జీ, సురేంద్రనాథ్ బెనర్జీ, ఫిరోజ్‌షా మెహతా, దాదాభాయ్ నౌరోజీ వంటి వయోవృద్ధులు, ఆంగ్లేయులకు ప్రజాస్వామ్య విలువలలో విశ్వాసం వున్నదని నమ్మిన వారి నాయకత్వంలో మహాసభ నడిచింది రాజ్యాంగబద్ధమైన విధానాల ద్వారా సువరిపాలన (Good government) సాధించడం వీరి లక్ష్యం శాసన సభలలోను, ప్రభుత్వోద్యోగాలలోను భారతీయులకు అధిక ప్రాతినిధ్యం, ఇండియన్ సివిల్ సర్వీస్ పరీక్షలు ఇండియాలోను ఇంగ్లండులోను నిర్వహించడం, పరీక్షలకు వయోపరిమితిని పెంచడం, విద్యాభివృద్ధిపట్ల ఎక్కువ శ్రద్ధ, సాంకేతిక విద్య ప్రోత్సహించడం వంటివి వీరికోర్కెల్లో ప్రధానమైనవి. అర్థించడం, అర్జీలు పెట్టడం, అసంతృప్తిని నిరసన ద్వారా వ్యక్తం చేయడం (pray, petition and protest) వీరి విధానాలనీ, కాంగ్రెస్ చరిత్రలో ఇది 'యాచకదశ' (perid of onendicancy) అనీ తరువాత అతివాదులు హేళన చేశారు. అయినా మితవాదులు బ్రిటిష్ సామ్రాజ్యవాద విధానాలను తీవ్రంగా విమర్శిస్తూ వానివల్ల దేశానికి కలుగుతున్న కష్ట నష్టాలను ప్రజల దృష్టికి తెచ్చారు. దాదాభాయ్ నౌరోజి (Poverty and the un - British Rule in India) అనే గ్రంథంలో భారతదేశ సంపత్తి

అనేక విధాలుగా బ్రిటన్‌కు తరలింపబడుతున్నదని (drain theory) వివరించాడు. ఇంగ్లండులో స్థాపించిన భారతీయ సమితి ద్వారా బ్రిటిష్ ప్రభుత్వం భారతదేశంలో ఏ విధంగా ప్రజాస్వామ్యాన్ని కాలరాస్తున్నదో వివరించి బ్రిటిష్ రాజకీయవేత్తల సానుభూతిని కాంగ్రెస్ ఉద్యమానికి సాధించడానికి ప్రయత్నించాడు. ప్రతి సంవత్సరం భిన్న ప్రాంతాల్లో జరుగుతున్న మహాసభా సమావేశాల వల్ల ప్రజలలో చైతన్యంకలిగి మహాసభా సభ్యత్వం పెరిగింది. 1893 లో సభ్యుల సంఖ్య 1893 కు పెరగడం విశేషం. కాంగ్రెస్ జరుపుతున్న ఆందోళన ఫలితంగా 1892 లో ప్రభుత్వం భారతదేశ శాసన సభా చట్టం చేసి శాసన సభలోని సభ్యుల సంఖ్య పెంచింది. దీనివల్ల మితవాదులకు గూడ సంతృప్తి కలగలేదు.

ఆంధ్ర ప్రాంతంలో కాంగ్రెస్ సభ్యుల సంఖ్య గణనీయంగా పెరుగసాగింది. 1886 లోనే కాంగ్రెస్ మహాసభ ననుకరిస్తూ విశాఖపట్టణం, గుడివాడ, రాజమండ్రి, నెల్లూరు, పెనుగొండ, గుత్తి మొదలైన నగరాలలో సభలు జరిపి కాంగ్రెస్ ఆశయాలు ప్రజల్లో విస్తరింపజేశారు. 1891 లో చిత్తూరు వాస్తవ్యుడైన పి. ఆనందాచార్యులు నాగపూర్ మహాసభకు అధ్యక్షుడుగా ఎన్నికయినాడు. ఆవేశపూరితమైన తన అధ్యక్షోపన్యాసంలో ప్రజల కష్ట నష్టాలపట్ల ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని నిశితంగా విమర్శిస్తూ, మత భాషా విభేదాలను విస్మరించి సమైక్యంగా జాతీయోద్యమాన్ని బలపరచవలసిన అవసరాన్ని నొక్కి చెప్పాడు. జిల్లా స్థాయి రాజకీయ సభల స్థాపన ఈ యుగంలోని విశేషం. 1892 లో ఏర్పడిన కృష్ణా జిల్లా రాజకీయ సభ బహుశా దేశంలోనే మొదటి జిల్లా స్థాయి సభ అనీ రాష్ట్ర కాంగ్రెస్ సంఘాలకు (P. C. C.) నాంది యనీ చెప్పవచ్చు. క్రమంగా గోదావరి, విశాఖపట్టణం, ఉత్తర ఆర్కాటు మొదలైన జిల్లాలలో రాజకీయ సభ లేర్పడినాయి. ఈ సభల విధులు: (1) కాంగ్రెస్ మహాసభకు అనుబంధంగా కృషి చేయడం (2) ప్రజలలో ముఖ్యంగా విద్యాగంధానికి నోచుకోని వారిలో స్వాతంత్ర్య కాంక్షను కలిగించి కార్యోన్ముఖులను చేయడం. ఈ సభలు ప్రతి సంవత్సరం సమావేశమై స్థానిక సమస్యలను చర్చించడమేగాక కాంగ్రెస్ మహాసభలో ప్రవేశపెట్టవలసిన తీర్మానాలను ఖరారుచేసి మహాసభకు తమ ప్రాంత ప్రతినిధులను ఎంపిక చేసేవి.

ప్రజలలో ఆంగ్ల పాలన పట్ల నిరసన స్వాతంత్ర్యకాంక్ష కలిగించడంలో నాటి పత్రికలు గణనీయమైన కృషి చేసినాయి. అట్టి పత్రికలలో కృష్ణాపత్రికది

అగ్రస్థానం. కృష్ణాపత్రికను (దేశభక్త) కొండా వెంకటప్పయ్య మచిలీపట్టణంలో స్థాపించాడు. ముట్నూరు కృష్ణారావు సంపాదకుడు. పత్రికా కార్యాలయంలో రాజకీయవేత్తలు, నాయకులు సాహితీ ప్రియులు స్రష్టలు తరచు సమావేశాలు జరిపి వివిధ అంశాలను చర్చిస్తుండేవారు. ప్రభుత్వం న్యాయ నిర్వహణలో కూడ అనుసరిస్తున్న జాతివిచక్షణ విధానాన్ని, దోపిడి విధానాలను, ప్రభుత్వంలో ప్రబలుతున్న అవినీతిని లంచగొండితనాన్నీ నిర్భయంగా ఖండిస్తూ కృష్ణా పత్రిక వ్రాస్తుండేది. ఇతర పత్రికలలో కూడ ప్రభుత్వ విధానాల విమర్శ ప్రముఖంగా కన్పించేది. ఇంగ్లండులోని ఇండియా కార్యాలయం సాలుసరి వ్యయం 65 లక్షల పౌండ్లు భారత ఖజానా నుండి చెల్లించడం అన్యాయమనీ, విదేశ పాలనలో భారతీయులు న్యాయాన్ని కాంక్షించడం ఎండమావుల వేట అనీ, అందుచే సమైక్యంగా ప్రభుత్వాన్ని ఎదిరించడమే కర్తవ్యమనీ 'వృత్తాంత చింతామణి' వ్రాసింది. ప్రజలు నానాటికీ దారిద్ర్యంలో, ఋణ బాధలో కూరుకు పోవడానికి వలస ప్రభుత్వ విధానాలే కారణమనీ దీనికితోడు ప్రభుత్వం హిందూ ముస్లిం విభేదాలను, కుల విద్వేషాన్ని రెచ్చగొట్టుతున్నదని ఈ విధానాలను ప్రజలు ప్రతిఘటించాలని స్థానిక పరిశ్రమలను ప్రోత్సహించాలని ఉద్బోధిస్తూ సూర్యోదయ ప్రకాశిక, గౌతమి, శశిరేఖ మొదలైన పత్రికలు వ్రాసినాయి.

రాజకీయ సభల కార్యక్రమాలు, పత్రికా ప్రచారము ఫలితంగా ప్రజల్లో కలిగిన చైతన్యానికి నిదర్శనగా 1894 లో ఒక సంఘటన జరిగింది. ప్రభుత్వం నీటి తీరువ పెంచింది. అందుకు నిరసనగా ఏలూరులో కృష్ణాజిల్లా రైతులు మహాసభ జరిపి తీరువ తగ్గించే వరకు పన్ను చెల్లించరాదని నిర్ణయించి అమలు జరిపినారు. గుడివాడ మొదలైన చోట్ల రైతులు అరెస్టు కావడానికి కూడ సిద్ధ పడినారు. దీన్ని చిన్న ఎత్తున జరిగిన పన్నుల నిరాకరణ–సత్యాగ్రహోద్యమంగా నిర్ణయించవచ్చు.

## అతివాద దశ : వందేమాతరం

ఇరవయ్యో శతాబ్ది ఆరంభం నుండి దేశీయ విదేశీయ పరిణామాల కారణంగా కాంగ్రెస్‌లో అతివాద ధోరణులు ప్రబలినాయి. దేశ ఆర్థిక పరిస్థితిలో మార్పు లేదు; నిరుద్యోగ సమస్య నానాటికి తీవ్రతరమవుతున్నది; ప్రతి సంవత్సరం ఏదో ఒక ప్రాంతంలో క్షామమూ అనంతరం వ్యాధులు తాండవించి జన నష్టం జరుగుతూనే వుంది. ప్రజల విద్య, ఆరోగ్య సమస్యలపట్ల ప్రభుత్వ నిర్లక్ష్యంలో మార్పు లేకపోవడంతో ప్రభుత్వంపట్ల ద్వేషం పెరుగుతూనేవుంది. కాంగ్రెస్‌లో సభ్యత్వం విస్తరించి కొత్తగా చేరిన యువకులకు మితవాదుల

విధానాలు తృప్తి నీయలేదు. సత్వర దేశ విముక్తి సాధనాలను అన్వేషింప సాగినారు. బాల్కన్ రాజ్యాలు తురుష్క సామ్రాజ్యంపై జరుపుతున్న జాతీయ పోరాటాలు, 1895 లో ఇటలీపై అబిసీనియా విజయము వీరికి ఉత్తేజాన్ని కలిగించినాయి. ముఖ్యంగా అబిసీనియా విజయం "యూరోపియన్లు అజేయులు" అని ఆసియాలో వ్యాపించియున్న భ్రమను పూర్తిగా తొలగించింది. దీనికితోడు 1905 లో సువిశాల సామ్రాజ్యాధిపత్యం వహించిన రష్యాను ఆసియాలో చిన్న దేశమైన జపాన్ ఓడించడం ఆసియా ప్రజల్లో ఆత్మవిశ్వాసం కలిగించి అతివాద విజృంభణకు దోహదం చేసింది. అతివాదుల ఆశయాలకు అనుగుణమైన నాయకత్వం లభించడం ఒక విశేషం. పంజాబ్‌లో లాలాలజపతి రాయ్, బెంగాల్‌లో అరవింద ఘోష్, బిపిన్ చంద్రపాల్, బొంబాయిలో బాల గంగాధరతిలక్ దేశభక్తికి జాతీయోద్యమానికి ఇచ్చిన కొత్త వ్యాఖ్యానం వల్ల అతివాద దోరణులకు మంచి ప్రోత్సాహమయింది. వైదిక నాగరికతయే ఉత్త మోత్తమని ఉద్ఘాటించి క్రమంగా ముస్లిం వ్యతిరేకోద్యమంగా రూపొందిన ఆర్య సమాజానికి నాయకుడు లజపతిరాయ్; రక్త పిపాసియైన కాళీమాతతో భారత దేశాన్ని సమన్వయంచేసి, జాతీయ భావం కాళీమాత వరప్రసాదం అంటూ ఉద్బోధించాడు అరవింద ఘోష్. అతని శిష్యులు కాళీ ఆలయంలోగాని, గంగా నదీ జలాలలో కుత్తుక ఒంటి వరకు దిగి దేశభక్తి ప్రమాణాలు చేసేవారు. మొగల్ సామ్రాజ్య విచ్ఛిన్నానికి కారకుడైన శివాజీ ఉత్సవాల ద్వారా, గణపతి ఉత్సవాల ద్వారా ప్రజల్లో దేశభక్తి కలిగే ప్రయత్నం బాలగంగాధర తిలక్ చేశాడు. 'గీత రహస్యం' అనే వ్యాఖ్యానం ద్వారా విదేశ పాలకులపై బల ప్రయోగం సమర్థనీయమంటూ రాజకీయ కార్యాచరణకు ఆధారంగా భగవద్గీతను ప్రచారం చేశాడు. "దారితప్పి రాజకీయాల్లోనికి వచ్చిన పండితుడు" అని తిలక్‌ను గురించి ఒక రచయిత అభిప్రాయం. అతని నాయకత్వంలో దేశ రాజకీయాలు కూడ మలుపు తిరిగినవా అనిపిస్తుంది. ఈ విధంగా అతివాదవర్గాల నాయకులు భారత జాతీయ నిర్మాణ సమస్యను విస్మరించి హిందూ జాతీయతపై దృష్టి కేంద్రీకరించినట్లు కన్పిస్తుంది. స్వాతంత్ర్యోద్యమం హిందూమతం రంగు పులుముకొన్నది. ఇట్టి పరిస్థితుల్లో కర్జన్ ప్రభువు బెంగాల్‌రాష్ట్రాన్ని విభజించాడు. తూర్పు బెంగాలులో ముస్లిములు పశ్చిమ బెంగాలులో హిందువులు అధిక సంఖ్యాకులు. వీరిని రెండు రాష్ట్రాలలో విభజించడం ద్వారా బెంగాల్‌లో ముమ్మరంగా సాగుతున్న జాతీయోద్యమాన్ని అణచివేయవచ్చని ప్రత్యేకరాష్ట్రం ప్రసాదించడంద్వారా ప్రభుత్వానికి ముస్లిముల మద్దతు సాధించవచ్చుననీ కర్జన్ ఎత్తుగడ. విభజనకు వ్యతిరేకంగా బెంగాలులో తీవ్రమైన ఉద్యమం ప్రారంభ మయింది బంకించంద్ రచించిన 'ఆనందమఠం' అనే నవలలోని గేయానికి

మొదటి చరణమైన 'వందేమాతరం' ఉద్యమకారులకు నినాదం కావడం వల్ల దీనికి వందేమాతరం ఉద్యమని పేరు వచ్చింది. దేశమాత కాళీమాతల సమన్వయాన్ని దృష్టిలో వుంచుకొనే బంకించంద్ 'వందేమాతరం' గీతాన్ని వ్రాసినాడని విమర్శకుల అభిప్రాయం. ముస్లిములకు ప్రత్యేక రాష్ట్రాన్ని ప్రసాదిస్తున్న బెంగాల్ విభజనను వ్యతిరేకిస్తున్నందున వందేమాతరం ఉద్యమాన్ని ముస్లిం వ్యతిరేక ఉద్యమంగా వ్యాఖ్యానించడానికి అవకాశమయింది. ఇదే నేపథ్యంలో 1906 లో ముస్లిం లీగ్ స్థాపన జరగడం ఆలోచనీయమైన సంఘటన.

వందేమాతరం ఉద్యమం బహుముఖంగా సాగింది. అందొకటి హింసాయుతమైన దౌర్జన్య (Terrorist) చర్యలు. అనుశీలన సమితివంటి రహస్య సంఘాలేర్పడి బాంబులు ఆయుధాలు తయారుచేసి ఆంగ్లోద్యోగులను వారిపట్ల అభిమానులైన దేశీయులను నిర్దాక్షిణ్యంగా వధించడం రెండో అంశం. బాయ్‌కాట్ అంటే బహిష్కరణ. ఇది తిరిగి ద్విముఖంగా నడిచింది. విదేశ వస్తు బహిష్కరణ; ఇంగ్లండులోని కర్మాగార వస్తువుల విక్రయానికి భారతదేశం మార్కెట్‌గా మారిపోయింది. ఇంగ్లండు ఘనత ఆదేశ పరిశ్రమమీద వాణిజ్యం మీద ఆధారపడింది. బాయ్‌కాట్‌వల్ల వాటికి నష్టం వాటిల్లి తీరుతుంది. ఇక, దేశంలో ప్రభుత్వ కార్యాలయాలను, న్యాయస్థానాలను, విద్యాలయాలను బహిష్కరించవలె. దీనివల్ల దేశంలో ప్రభుత్వం స్తంభించిపోతుంది. ఆంగ్ల ప్రభుత్వానికి భారతీయుల కోర్కెలను కాదనలేని పరిస్థితి యేర్పడుతుంది. బాయెకాట్‌కు అనుబంధంగా స్వదేశీ వుద్యమం సాగింది. దేశ వ్యాప్తంగా పరిశ్రమలు నెలకొల్పి ప్రజ నిత్యావసర వస్తువులను తయారు చేయవలె; వాటి వాడకాన్ని ప్రోత్సహించవలె. స్వదేశ వస్తువుల వాడకం దేశభక్తికి ముఖ్య లక్షణమయింది. జాతీయ విద్యాలయాలు నెలకొల్పి భారతీయ సంస్కృతికి సామాజిక అవసరాలకు అనుగుణమైన విద్యను బోధించవలె. బెంగాల్‌లో జాతీయ విద్యా విధాన సంఘం ఏర్పడింది. బొంబాయిలో తిలక్, బెంగాల్‌లో అరవింద ఘోష్‌లు బహిష్కరణ స్వదేశీ వుద్యమాలను నిర్వహించారు. వీనికి దేశవ్యాప్తంగా ప్రచారం జరిగింది.

కాంగ్రెస్‌లో ముఖ్యంగా బాయ్‌కాట్ విషయంలో అతివాదులకు మితవాదులకు అభిప్రాయభేదం ఏర్పడింది. బహుశా ప్రజలలో అలజడి చెలరేగవచ్చునని ప్రభుత్వాన్ని రెచ్చగొట్టడమవుతుందనే ఉద్దేశంతో మితవాదులు బాయ్‌కాట్‌ను వ్యతిరేకించారు; కాని స్వదేశీ వుద్యమాన్ని ప్రోత్సహించారు. నాటికి ఆంధ్ర రాజకీయ నాయకులలో మితవాదులే ఎక్కువ. మద్రాస్‌లో విద్యార్థులుగా వుంటున్న అయ్యదేవర కాళేశ్వరరావు, గొల్లపూడి సీతారామశాస్త్రి, గాడిచర్ల హరి

సర్వోత్తమరావు, కొమర్రాజు లక్ష్మణరావు, చక్రయ్య సెట్టి, సీతారామశాస్త్రి నాయుడు మొదలైనవారు మద్రాస్ బీచ్‌లో సమావేశమై (సెప్టెంబర్ 1905) వందేమాతరం ఉద్యమాన్ని, ముఖ్యంగా స్వదేశీ వుద్యమాన్ని బలపరచడానికి తీర్మానించారు; సభకు స్వదేశీ మిత్రన్ పత్రికా సంపాదకుడు సుబ్రహ్మణ్య అయ్యర్ అధ్యక్షత వహించాడు; మహాకవి సుబ్రహ్మణ్య భారతి దేశభక్తి గీతాలు పాడాడు. మద్రాస్ మహాజనసభ పారిశ్రామిక సంస్థలతోబాటు స్వదేశీ సంఘం ఏర్పడింది. జాతీయ నిధికి ఏర్పాట్లు జరిగినాయి. స్వదేశీ లక్ష్యాలను ప్రచారం చేయడానికి కె. వెంకటరమణారావు నాయకత్వంలో స్వచ్ఛంద కార్య కర్తలు ఏర్పడినారు ఉత్తర ఆంధ్ర జిల్లాలలో 'స్వదేశీ' ప్రచారానికి న్యాపతి సుబ్బారావు, వెంకటరమణారావులు అంగీకరించారు. భారతీయ పారిశ్రామిక మహాసభ కార్యదర్శి సి. వై. చింతామణి వీరికి తోడైనాడు. నెల్లూరు, గుంటూరు, కాకినాడ విజయనగరాలలో మహాసభలు నిర్వహించారు. విశాఖపట్టణం జిల్లా రాజకీయ మహాసభ, గుంటూరు-కృష్ణా జిల్లా మహాసభ (నూజివీడు) 'స్వదేశీ'ని బలపరచినాయి. గుంటూరులోని కోమట్లు విదేశీ వస్తువులను దిగుమతి చేయమని శపథం చేశారు.* పెక్కు నగరాల్లో స్వదేశీ దుకాణాలు ఏర్పడినాయి. పరిశ్రమలు నెలకొల్పే ప్రయత్నాలు ప్రారంభించారు. బెజవాడలో మునగాల రాజా ఒక బట్టల మిల్లును నెలకొల్పాడు. మద్రాస్ రాష్ట్రంలోనే బెజవాడ నూలు మిల్లు మొదటిది. స్వదేశీ వుద్యమ నిర్వహణకు జాతీయ నిధికి విరాళాలు ముమ్మరంగా వసూలయినాయి. ఈ పరిస్థితుల్లో బారిసాల్‌లో జరిగిన మహా సభలో 'స్వరాజ్య సంపాదనకు స్వదేశీ ఉద్యమం ప్రధాన సాధనం' అని ఉద్ఘా టించిన సురేంద్రనాథ బెనర్జీని ప్రభుత్వం నిర్బంధించింది. ఈ చర్యకు నిరసనగా మద్రాస్, గుత్తి రాజమండ్రి, కాకినాడ, విజయనగరం మొదలైనచోట్ల సభలు నిర్వహించారు ప్రజలలో పెల్లుబుకుతున్న రాజకీయ చైతన్యానికి స్వాతంత్ర్య కాంక్షకు ఈ కార్యక్రమాలు మంచి నిదర్శనం.

అతివాద ఉద్యమానికి జపాన్ నుండి లభించిన స్ఫూర్తిని గురించి పేర్కొన్నాము. పారిశ్రామిక రంగంలో కూడ జపాన్ అభివృద్ధి సాధించి

---

* రాజమండ్రిలో పారిశ్రామిక సంస్థను స్థాపించి దేశీయ వస్తువులను మాత్రమే విక్రయించాలని తీర్మానించారు; కడపలో జంగం హరియప్ప, భద్రాచలం వెంకటేశ్వర్లు స్వదేశీ వస్త్రాలయం స్థాపించారు; నెల్లూరులో మహంకాళి శ్రీనివాస శాస్త్రులు స్వదేశీ సమాజం స్థాపించగా వెన్నెలకంటి నరసయ్య రాత్రి పాఠశాల నిర్వహించాడు.

పాశ్చాత్య దేశాలతో పోటీ పడసాగింది. అందుచే స్వదేశవాదులు జపాన్‌పై దృష్టి మరలించసాగినారు. గుంటూరు వాస్తవ్యుడైన వింజమూరి భావనాచారి యువకులను పరిశ్రమలలో శిక్షణ పొందడానికి యువకులను జపాన్ పంపవలెనని సూచించడమేగాక గుంటూరు వాస్తవ్యుడైన భావనాచారి కొంత నిధిని సమకూర్చాడు. కాకినాడ వాస్తవ్యుడైన మల్లాది వెంకట సుబ్బారావు పెన్సిల్ తయారీలో శిక్షణ పొందడానికి జపాన్ వెళ్ళాడు. ఈతని ఖర్చును గుంటూరు వారు భరించారు. బళ్ళారి నుండి యస్. రామారావును రాజమండ్రి నుండి మామిడి దేవేంద్రుడు వివిధ పరిశ్రమల్లో తర్ఫీదు పొందడానికి వెళ్ళాడు. ఈతని ఖర్చులు మద్రాస్ పారిశ్రామిక సంఘము, జాతీయ నిధి భరించినాయి. అట్ట పెట్టెల తయారీ నేర్వడానికి ఒసాకా వెళ్ళిన గోటేటి జానకిరామయ్య ఖర్చును రాజమండ్రి వాస్తవ్యుడైన భాస్కర రామయ్య భరించాడు.

జాతీయ విద్యాలయ స్థాపన స్వదేశీ వుద్యమంలోని భాగమే. రాజమండ్రిలో జాతీయ ఉన్నత పాఠశాలను ప్రారంభిస్తూ న్యాపతి సుబ్బారావు దేశీయ విద్యాలయం అంటూ వర్ణించాడు. దీనికి కరణం గున్నేశ్వరరావు వేయి రూపాయలు పేర్రాజు 40 వేల రూపాయలు విరాళంగా ఇచ్చారు. 'వందేమాతరం రాత్రి పాఠశాల' కూడ నిర్వహించారు. కోవల్లె హనుమంతరావు ప్రధానాచార్యుడుగా మచిలీపట్టణంలో జాతీయ కళాశాల స్థాపించారు. కొండా వెంకటప్పయ్య, భోగరాజు పట్టాభి సీతారామయ్య, ముట్నూరు కృష్ణారావులు కళాశాల అభివృద్ధికి కృషి చేశారు.

## పాల్ పర్యటన

వందేమాతరం ఉద్యమ ప్రచారంలో భాగంగా బిపిన్ చంద్రపాల్ 1907 లో ఆంధ్రదేశంలో పర్యటించాడు. పాల్ పర్యటనతో ఆంధ్రలోని జాతీయోద్యమం క్రొత్త జీవం పోసుకొన్నది. పాల్ బ్రహ్మ సమాజ మతస్థుడు; కాని బహుశా అరవిందుని ప్రభావంవల్ల కాళీమాత ఆరాధనలో విశ్వాసం వున్నవాడు. జాతీయ భావానికి కాళీమాత ఆరాధనకు అవినాభావ సంబంధం అని విశ్వసించినాడు; అదే అతని ప్రచారంలోని సారాంశంగా వుండేది.

పాల్ ఆంధ్రదేశ పర్యటనను కృష్ణాపత్రిక సంపాదకుడు ముట్నూరు కృష్ణారావు నిర్వహించాడు. మొదట్లో విజయనగరం, విశాఖ పట్టణాలలో ఆతని ఉపన్యాసాలు ఏర్పాటు చేశారు. జమీందారుల, మితవాదుల ప్రాబల్యం ఎక్కువగా వున్న ఆ నగరాలలో పాల్ ఉపన్యాసాలకు ఎక్కువ ప్రతిస్పందన లేదనే చెప్పవలె. తరువాత రాజమహేంద్రవరం, కాకినాడ, బెజవాడ మచిలీపట్టణాలు

దర్శించాడు. ఈ నగరాల్లో పాల్‌కు ఘన స్వాగతం లభించింది; వందేమాతరం నినాదాలు వ్రాసిన పతాకాలతో ఊరేగింపులు జరిగినాయి. రాజమంద్రిలో మహా శివరాత్రినాడు కోటి లింగాల తీర్థంలో మహాసభ నిర్వహించారు. కౌతా శ్రీరామ శాస్త్రి ఈ సభలలో వందేమాతరం గీతాన్ని శ్రావ్యంగా ఉద్రేకపూరితంగా గానం చేసేవాడు. స్వరాజ్, వందేమాతర స్వదేశీ ఉద్యమాలు, బ్రహ్మసమాజ సిద్ధాంతాలేగాక, దేశభక్తులు కాళీమాతను ఆరాధించడంలోని వైశిష్ట్యాన్ని గురించి కూడ ఈ సభలలో పాల్ ఉపన్యసించేవాడు. చిలకమర్తి లక్ష్మీ నరసింహం ఈ ఉపన్యాసాలసారంగా "భరతఖండంబు చక్కని పాడియావు" అనే పద్యాన్ని పాడేవాడు. ఆంధ్రకేసరి, కృష్ణా పత్రికలు పాల్ పర్యటనకు, అతని ప్రసంగాలకు విశేష ప్రచారాన్ని ఇచ్చినాయి. పోలీసుల నివేదికలలో పాల్ ప్రసంగాలు ప్రభుత్వ వ్యతిరేకతకు, స్వాతంత్ర్య కాంక్షకు బీజాలు వేసినవని పాల్ సమావేశాలు కేవలం బ్రాహ్మణులకు మాత్రమే పరిమితములని వ్రాసినాయి. కంచుమర్తి రామచంద్రరావు ఒక్కడు మినహా శూద్రులుగానీ ముస్లిములుగానీ వందేమాతరం సమావేశాలకు హాజరు కాలేదని పోలీస్ రిపోర్టులు పేర్కొంటున్నాయి.

## రాజమంద్రి కళాశాల సంఘటన

పాల్ పర్యటనానంతరం ముఖ్యంగా విద్యార్థులలో దేశభక్తి పురకలు వేయసాగింది. 'వందే మాతరం' నినాదం సర్వసాధారణమై వీధుల్లో ప్రతిధ్వనించేది. పాశ్చాత్యులు కన్పించగానే వందేమాతరం నినాదం చేసేవారు, వారికీ నినాదం కంపరమెత్తించేది. వందేమాతరం జెండాలు, బిళ్ళలుధరించి కాలేజీలకు హాజరయ్యేవారు. రాజమంద్రిలోని ఆర్ట్సుకాలేజీ ట్రెయినింగ్ కాలేజీల ప్రిన్సిపాల్ మార్క్ హంటర్ కాలేజి విద్యార్థులు బాలభారతి సమాజంలో చేరరాదనీ, కాలేజి ఆవరణలో వందేమాతరం నినాదం చేయరాదనీ ఆ జెండాలు, బిళ్ళలు ధరించరాదని ఆజ్ఞాపించాడు. రామచంద్రరావు, అనే ఆర్ట్సు కాలేజి విద్యార్థి బాలభారతి నిర్వహిస్తున్న రాత్రి పాఠశాలలో పని చేస్తున్నాడని తెలిసి హంటర్ అతనిపై చర్య తీసుకున్నాడు. బిపిన్ చంద్రపాల్ రాజమంద్రిలో నున్న సమయంలో హంటర్ మద్రాస్ వెళ్ళడం తటస్థించింది. గాడిచర్ల హరి సర్వోత్తమరావు పాల్‌కు సన్మాన పత్రం సమర్పించాడు. రామచంద్రరావు, సర్వోత్తమరావు విద్యార్థి నాయకులుగా గుర్తింపు పొందారు. వీరి ప్రోత్సాహంతో విద్యార్థులు హంటర్ ఆజ్ఞలను ధిక్కరిస్తూ వందేమాతరం నినాదాలను కొనసాగించారు. రామచంద్రరావును, హరి సర్వోత్తమరావును కాలేజీల నుండి బహిష్కరించారు; 138 మంది విద్యార్థులను రెండు సంవత్సరాలు పరీక్షకు హాజరు కాకుండా నిలిపి

వేయడం జరిగింది. (కాలేజీ విద్యార్థుల సంఖ్య 222. బయ్యా నరసింహ శర్మ, న్యాపతి సుబ్బారావులు విద్యార్థుల తరఫున జోక్యం కలిగించుకున్నారు; కాని లాభం లేకపోయింది. హంటర్ నిర్ణయాలను ప్రభుత్వం ఆమోదించడమే గాక హరి సర్వోత్తమరావును ప్రభుత్వ ఉద్యోగాలకు అనర్హుడని ప్రకటించింది.

కిందులో మేలన్నట్లు ప్రభుత్వ నిర్ణయం వల్ల హరి సర్వోత్తమరావు తన జీవితాన్ని స్వాతంత్ర్య ఉద్యమానికి అంకితం చేయడానికి తోడ్పడింది. అతడు బెజవాడ చేరి 'స్వరాజ్' అనే పత్రికను నిర్వహించాడు. దేశంలోని హిందూ మొదలైన పత్రికలు హంట్ చర్యలను గర్హిస్తూ వ్రాసినాయి. "విద్యార్థులారా, అధైర్యపడకండి. భారత స్వాతంత్ర్యానికి మీరు పునాదులువేయాలని భగవంతుని సంకల్పమయి వుంటుంది" అని కృష్ణా పత్రిక వ్రాసింది.

## కాకినాడ సంఘటన

అదే సంవత్సరం (1907) కాకినాడలో ఒక దుర్ఘటన జరిగింది. జిల్లా వైద్య అధికారి కెంప్ అనే ఆంగ్లేయుడు బండిలో వెళ్ళడం చూచిన ముగ్గురు యువకులు 'వందేమాతరం' నినాదం చేశారు. ఆగ్రహావేశుడైన కెంప్ వారిలో కోవల్లె కృష్ణారావును పట్టుకొని స్పృహ కోల్పోయేటట్లు కొట్టి తన దారిన వెళ్ళిపోయాడు. కృష్ణారావు తండ్రి పిఠాపురం జమీందారీలో ఉద్యోగి. కొడుకును ఇంటికి తీసుకువెళ్లాడు. కెంప్‌వల్ల భయంతో కృష్ణారావుకు మరునాటికిగాని వైద్య సహాయం లభించలేదు.

కెంప్ దురాగతం వల్ల కోపోద్రిక్తులైన పురజనులు సుమారు మూడు వందలమంది సమావేశమై రోడ్ల వెంట ఊరేగుతూ కెంప్ మిత్రులతో విందు ఆరగిస్తున్న క్లబ్‌పై దాడి చేసి ధ్వంసం చేశారు. కెంప్ అతని మిత్రులు చీకటి గదుల్లో దాక్కొన్నారు. క్లబ్ సమీపంలో ఉన్న జిల్లా కలెక్టర్ కుమ్మింగ్ పోలీసు సిబ్బందితో క్లబ్ ఆవరణలో ప్రవేశించగానే అతని నుదురుపై సోడా బుడ్డి తగిలి గాయమయింది. గుంపు చెల్లాచెదురై పారిపోయింది. అర్ధరాత్రి కెంప్‌ను సామర్లకోట ద్వారా స్పెషల్ మీద రాజమండ్రికి అటునుండి మద్రాస్‌కు పంపివేశారు. ఈ సంఘటనలో గమనించవలసిన అంశం : పురజనులు వీధుల వెంట ఊరేగుతుండగా, క్లబ్‌పై దాడి చేస్తున్నప్పుడు పోలీసులు జోక్యం కలిగించుకొనకుండడం!

మరునాటినుండి పోలీసులు కేవలం అనుమానంమీద నిర్బంధాలు మొదలు పెట్టారు. నిర్బంధానికి గురైన వారిలో కార్మికులుండడంతో కార్మికులు సమ్మె ప్రారంభించారు. వాణిజ్య లావాదేవీలు స్తంభించిపోయినాయి. యూరోపియన్

వర్తకుల అభ్యర్థన మేరకు అసిస్టెంట్ కలెక్టర్ హామీ ఇవ్వడంతో కార్మికులు సమ్మె విరమించారు. నిర్బంధంలోకి తీసుకున్న పుర ప్రముఖుల్లో అరిపిరాల లక్ష్మీనరసింహారావు స్వదేశీ విక్రయశాల నిర్వహిస్తుండేవాడు; అతని తరఫున కోర్టులో న్యాపతి సుబ్బారావు వాదించాడు. కాని మేజిస్ట్రేటు నరసింహారావుకు రెండు సంవత్సరాల కఠినకారాగారశిక్ష, 500 రూపాయీల జరిమానా విధించాడు; జిల్లా కోర్టులో న్యాయమూర్తి పార్థసారథి అయ్యర్ అతణ్ణి నిర్దోషిగా నిర్ణయించి శిక్ష రద్దు చేశాడు.

ఈ సంఘటనతో కాకినాడలోని యూరోపియన్లు భయభ్రాంతులైనారు. వారి రక్షణగా ప్రత్యేక పోలీసు సిబ్బందిని నియమించవలసి వచ్చింది; కాని ఈ సిబ్బంది ఖర్చు, క్లబ్ మరమ్మతుల ఖర్చు పురజనులపై విధించారు. కృష్ణారావును కొట్టినందుకు కెంప్ మూడువందల రూపాయిలు చెల్లించాడు.

## కోటప్పకొండ సంఘటన

గుంటూరు జిల్లా నరసరావుపేట సమీపంలోని కోటప్పకొండ శివాలయంలో ప్రతి సంవత్సరం శివరాత్రినాడు గొప్ప ఉత్సవం జరుగుతుంది. దూర ప్రాంతాల నుండికూడ జనులు వేలాదిగా ఆలయాన్ని దర్శించడానికి వినోదాల్లో పాల్గొనడానికి వస్తారు. యథాప్రకారం 1909 ఫిబ్రవరిలో వేలాది ప్రజలు కోటప్పకొండ చేరారు. ప్రజలు ఆరోగ్యనిబంధనలు పాటించడానికి, ప్రశాంతంగా ఉత్సవం పరిసమాప్తం కావడానికి పోలీసు బందోబస్తు ఏర్పాటయింది. నాటికీ నేటికీ పోలీసులు పోలీసులే! దురుసుగా ప్రవర్తించకపోతే ప్రజల దృష్టిలో చులకన అయిపోతామని వారి మనస్తత్వం అయి వుంటుంది. మన ప్రజలుకూడ క్రమశిక్షణారాహిత్యానికి పెట్టింది పేరు గదా! తాగిన మత్తులో చెన్నపరెడ్డి అనునాతడు పోలీసు జవానుతో ఘర్షణపడి జవానును క్రిందికి తోసేస్తాడు. చనిపోయినాడనే అభిప్రాయంతో పోలీసులు చెన్నపరెడ్డిని నిర్బంధంలోకి తీసుకుంటారు. ప్రజలు రెచ్చిపోయి 'వందేమాతరం' అంటూ పోలీసు స్టేషను (తాటి ఆకుల పాక) కు నిప్పంటించారు. ఉప్పుకొటూరు ఉద్యోగులిద్దర్ని చంపారు. తొక్కిడిలో ఇద్దరు బాలురు మరణించారు. (డిప్యూటీ పోలీసు సూపరింటెండెంట్ (D.S.P. సుబ్బారావు గానీ సబ్ కలెక్టర్ కెర్షాప్ గానీ ప్రజలను శాంతింప చేయలేక పోయినారు.) చాలమంది పోలీసులు గాయపడ్డారు. ఈ సందర్భంలో 45 మందిని పోలీసులు నిర్బంధంలోకి తీసుకున్నారు. వారిలో ఇరవైయొక్కరిపై నేరాలు రుజువయినాయి. చెన్నారెడ్డికి మరణశిక్ష విధించారు; నల్గురికి యావజ్జీవ కారాగారశిక్ష, మిగిలినవారికి వారి వారి నేరాలనుబట్టి శిక్ష విధించారు.

ప్రభుత్వానికి అనుకూలమైన పత్రికలు సంఘటనకు సంబంధించిన వుద్యోగులను తీవ్రంగా విమర్శించింది. శాంతి భద్రతలను పరిరక్షించడంలో స్థానికులు అసమర్థులని వ్యాఖ్యానించింది. కెర్షాప్, సుబ్బారావుల హోదాను ప్రభుత్వం తగ్గించింది. తాసీల్దారు బ్రహ్మానందనాయుడు సబ్ మాజిస్ట్రేటు సుబ్బారావు నాయుడు ఉద్యోగాలు కోల్పోయినారు. స్థానిక పత్రికలు ప్రభుత్వం విధించిన కఠిన శిక్షలను నిశితంగా విమర్శించింది.

కోటప్ప కొండ సంఘటన స్వాతంత్ర్య పోరాటంలోగానీ వందేమాతరం ఉద్యమంలోగానీ భాగం కాదు. చెన్నపరెడ్డి పూర్వాపరాలు అతడు దేశభక్తుడని రుజావు చేయవు. కాని అతడు మహావీరుడని గొప్ప దేశభక్తుడని పాటలు, పద్యాలు వ్రాసి కీర్తించసాగినారు.*

## ఆంధ్రదేశంలో దౌర్జన్య చర్యలు

వందేమాతరం ఉద్యమ కాలంలోనే సర్కార్ అనే బెంగాల్ దౌర్జన్యవాది (terrorist) బెజవాద వచ్చి అయ్యదేవర కాళేశ్వరరావుకు అతిథిగా వున్నట్లు కాళేశ్వరరావు జీవితచరిత్ర నుండి తెలుస్తున్నది. ఈతని పేరు చక్రవర్తిగా పోలీసు సమాచారంలో నమోదయింది. బాంబులు ఆయుధాలు తయారుచేయడం నేర్పి ప్రజలను విధ్వంసక చర్యలకు పురికొల్పడమే సర్కార్ లక్ష్యం. రాజమండ్రి, బెజవాద, మచిలీపట్టణం, గుంటూరు నగరాల్లోని ప్రముఖ స్వాతంత్ర్య ఉద్యమ నాయకులతో సర్కార్ లావాదేవీలు జరిపాడు. కాని ఆంధ్ర నాయకులెవ్వరూ దౌర్జన్యవాదానికి సుముఖంగా లేనందున నిరాశతో సర్కార్ మరలి పోయినాడు. పోలీసు సమాచారాన్నిబట్టి ఆంధ్రలో రహస్య సంఘ స్థాపనగానీ ఆయుధాల తయారీగానీ జరగలేదు. అయితే కలకత్తాలో వైద్య విద్యనభ్యసించడానికి వెళ్ళిన దంటు సుబ్బావధానీ అతని మిత్రులు రహస్యంగా బెంగాల్‌నుండి ఆయుధాలు తెచ్చినట్లు కృష్ణా పత్రిక (1904) వ్రాసింది. వీరి కార్యక్రమాన్ని

---

* 1930 నాటి ఉప్పు సత్యాగ్రహోద్యమంలో కల్లు అంగళ్లు మూయించే కార్యక్రమంలో అడవి బాపిరాజు మొదలైన వారిని పోలీసులు నిర్బంధంలోనికి తీసుకున్నారు. బాపిరాజుగారు వున్న గది ప్రక్క గదిలో యల్లమంద అనే దారి దోపిడి దొంగ వున్నాడట. పల్నాడు ప్రాంతంలో యల్లమంద పోలీసులను ముప్పతిప్పలు పెట్టినాడట! ఒకరిద్దరు పోలీసులు అతని చేతిలో ప్రాణాలు కోల్పోయినారట! అందుచేత బాపిరాజుగారి దృష్టిలో యల్లమంద దేశ స్వాతంత్ర్య వీరుడు. అతనిపై "ఓ పలనాటి యల్లమందా! పలవరిస్తుంటివ జైలుకొట్లల్లో" అంటూ ఒక గేయం వ్రాశారు.

గురించిన వివరాలు తెలియవు. ఆలమూరు, అనపర్తి, అత్తిలి, నెల్లూరు మొదలైనచోట్ల ఆయుధాలు తయారవుతున్న వదంతులు వ్యాపించినాయి. కృష్ణా జిల్లా వంతలపాలెంలో వందిమీద బాంబు ప్రయోగం జరిగినట్లు పోలీసులు వర్తమానం సేకరించారు. బాంబులు తయారుచేసే విధానాలను వివరిస్తూ కరపత్రాలను ప్రజలకు పంచిపెట్టారు. అట్టి కరపత్రం ఒకటి గుంటూరు పోలీసులకు దొరికింది. గూడూరు రైల్వే స్టేషన్‌లో ప్రేలుడు సామగ్రి వున్న పెట్టెను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఏమైనా ఆంధ్రదేశ రాజకీయాల్లో అతివాదులు, మితవాదులు వున్నారుగాని దౌర్జన్యవాదులు లేరనే చెప్పవలె.

## కతెవరం బాంబు సంఘటన

ఈ పరిస్థితుల్లో (1909) తెనాలి సమీపంలో కంచెర్లపాలెం దగ్గిర బాంబుప్రేలి ఒక మాలతను మరణించాడు. మద్రాస్ - కలకత్తా రైలు మార్గాన్ని ప్రేల్చివేయడానికి జరిగి ప్రయత్నంగా ఇది ప్రచారమయింది. ఈ సందర్భంగా కంచెర్లపాలెం రైతు చుక్కపల్లి రామయ్యను నిర్బంధంలోకి తీసుకున్నారు. సమీప గ్రామమైన కతెవర వాస్తవ్యులైన లక్కరాజు బసవయ్యను, కోటంరాజు వెంకట్రాయుడిని కూడా ప్రభుత్వం పైకి ప్రజలను రెచ్చగొట్టి సారస్వతాన్ని ప్రచారం చేస్తున్నారనే అభియోగంమీద నిర్బంధంలో వుంచారు. విచారణ సమయంలో "తాను నిర్దోషిననీ తనపై వగబట్టిన కరణం, మునిసిఫ్‌లు ఈ నేరంలో తనను ఇరికించారనీ" రామయ్య వివరించాడు. కాని మేజిస్ట్రేటు ఆతనికి మరణశిక్ష విధించాడు. బసవయ్య, వెంకట్రాయుడులు నిర్దోషులుగా విడుదలయినారు. రామయ్య అప్పీలు చేసుకొనగా హైకోర్టు న్యాయమూర్తి అతనికి పది సంవత్సరాల ద్వీపాంతరవాస శిక్ష విధించాడు. ఇటీవలి పరిశోధనలలో ఇది వ్యక్తిగత తగాదాలవల్ల జరిగిన సంఘటనగా దీనికి వందేమాతరం ఉద్యమానికి సంబంధంలేదని తెలుస్తుంది. అందుచేతనే మామిడిపూడి వెంకటరంగయ్యగారు అంటారు. "రామయ్య రాజకీయ నేరస్థుడో కాడో భగవంతునికే తెలియాలి."

## అతివాదులు - మితవాదులు

కాంగ్రెస్‌లో అతివాద మితవాద వర్గాల మధ్య అభిప్రాయ భేదాలు తీవ్రతరమై సూరత్ మహాసభ (1907) లో తారాస్థాయికి చేరినాయి. ఆంధ్ర ప్రాంతం నుండి గాడిచర్ల హరి సర్వోత్తమరావు, పెద్దిబొట్ల వీరయ్య, కోపల్లె హనుమంతరావు, పేరి నారాయణమూర్తి మొదలైనవారు హాజరయినారు. మహాసభలో వీరు నిర్వహించిన పాత్రను గురించి తెలియదు కాని వీరందరూ అతివాద

వర్గాన్ని బలపరచారు. ఉభయ వర్గాలకు సమాధానం కుదరక సభ రసాభాసగా ముగిసింది. మొదటిసారిగా కాంగ్రెస్ రెండుగా విచ్ఛిన్నమై జాతీయోద్యమం కుంటుపడింది. మితవాదులు అలహాబాద్‌లో సమావేశమై కొత్త రాజ్యాంగ నిబంధనలు రూపొందించుకున్నారు. వీనిలో బాయ్‌కాట్, స్వరాజ్ పదాలులేవు; జాతీయ సమైక్యత, దేశ ఆర్థిక వనరులను పెంచడం, రాజ్యాంగ విధానాల ద్వారా స్వపరిపాలన సాధించడం లక్ష్యాలుగా ప్రకటించారు.

ఆంధ్రదేశ రాజకీయ సభల్లో అతివాద మితవాద విధానాలపై తీవ్రమైన చర్చలు జరుగుతుండేవి. 1907 లో మద్రాస్ రాష్ట్ర మహాసభ విశాఖపట్టణంలో న్యాపతి సుబ్బారావు అధ్యక్షతన జరిగింది. లాలా లజపతిరాయ్‌కి ద్వీపాంతర వాస శిక్ష విధించడాన్ని నిరసిస్తూ తీర్మానించారు. బాయ్‌కాట్ తీర్మానాన్ని గోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లా ప్రతినిధులు బలపరిచారు కాని తీర్మానం వీగిపోయింది. స్వదేశీ తీర్మానం నెగ్గింది.

నందిగామలో జరిగిన గుంటూరు - కృష్ణా జిల్లాల మహాసభలో స్వరాజ్, స్వదేశీ, బాయ్‌కాట్, జాతీయ విద్య అనేవి స్వాతంత్ర్య ఉద్యమకారులకు నాలుగు వేదాలుగా వర్ణించాడు; కాని బాయ్‌కాట్‌కు అనుకూలంగా తీర్మానం జరిగినట్లు తెలియదు. తెనాలిలో కొండా వెంకటప్పయ్య అధ్యక్షతన జరిగిన గుంటూరు జిల్లా రాజకీయ సభలో అతివాద మితవాద వర్గాలమధ్య తీవ్ర వాదోపవాదాలు జరిగినాయి. చివరకు గ్రామ సంఘాలు నెలకొల్పాలనీ, తాలింఖానా లేర్పరచి యువకులకు శిక్షణనివ్వాలనీ స్వదేశీ పరిశ్రమలను పోషించాలనీ తీర్మానించారు.

## మింటో - మార్లే సంస్కరణలు

అతివాద మితవాద సంఘర్షణ కాలంలో ప్రభుత్వం వింత వాదులను తృప్తిపరుస్తూ అతివాదులనణచే విధానం (Kisses and Kicks) అనుసరించింది. లజపతిరాయ్, తిలక్‌లకు ద్వీపాంతరవాస శిక్ష విధించింది. బిపిన్ చంద్రను నిర్బంధించింది వార్తాపత్రికల స్వాతంత్ర్యాన్ని హరిస్తూ, దౌర్జన్య చర్యల నరికట్టడానికి తీవ్రమైన (News Papers Act, Explosive Substances Act, Prevention of Seditions Meetings Act) శాసనాలు చేసింది. 1908 లో తిరునెల్వేలి జిల్లా మేజిస్ట్రేట్ యాష్‌ను చంపినాడనే నేరంపై చిదంబరం పిళ్ళెకు యావజ్జీవ కారాగార శిక్ష విధించారు. ఈ సందర్భంలోనే ఒక ఆంగ్లేయుడు ఇద్దరు భారతీయులను కాల్చి చంపాడు. హరి సర్వోత్తమరావు తన స్వరాజ్ పత్రికలో ఆంగ్లేయుల దురాచారాలను

విమర్శిస్తే హరి సర్వోత్తమరావుకు మూడేండ్ల కఠిన కారాగార శిక్ష, పత్రికా సంపాదకుడైన బోడి నారాయణరావుకు తొమ్మిది నెలల శిక్ష విధించారు. ఆంధ్రదేశంలో వీరిద్దరే ప్రథమ రాజకీయ బాధితులు.

ఇక మితవాదులను తృప్తిపరచడానికై 1909 లో ప్రభుత్వం మింటో-మార్లే సంస్కరణలు అమలు జరిపింది. ఈ చట్టంలో రెండు నూతనాంశాలున్నాయి. ఒకటి రాజ్యాంగరీత్యా పురోగమనాంశం; రెండోది జాతి నిర్మాణ క్రమంలో తిరోగమన చర్య. ఎన్నికల విధానం (పరోక్షమే అయినా) ప్రవేశ పెట్టడం మొదటి అంశం. విశ్వ విద్యాలయాలు, స్థానిక సంస్థలు, వాణిజ్య సంస్థలు శాసన సభకు తమ ప్రతినిధులను ఎన్నుకొనే పద్ధతి. ఈ ప్రతినిధుల సంఖ్య చాలా స్వల్పం. అందుచేత 'ఆంధ్రకేసరి' వంటి పత్రికలు వ్రాసినట్లు శాసన సభల్లో అధికార (ప్రభుత్వం ఎన్నిక చేసిన) సభ్యుల సంఖ్య అధికంగా వున్నంత కాలం ప్రజా ప్రతినిధులు దేశానికి చేయగల మేలు శూన్యం. ఇక రెండోది ముస్లిములకు ప్రత్యేక నియోజక వర్గాలనేర్పరచడం. ఇది అధికారికంగా ప్రజలను మత ప్రాతిపదికపై విభజించడానికి చేసిన ప్రయత్నం. "విభజించి పాలించు" విధానానికి మంచి ఉదాహరణ! అయితే 1911 లో బెంగాల్ విభజన రద్దు చేయబడింది.

భీమవరం, విశాఖపట్టణం, బరంపురం మొదలైనచోట్ల జరిగిన రాజకీయ మహాసభలు సంస్కరణలకు ప్రభుత్వాన్ని అభినందిస్తూ, ప్రత్యేక నియోజక వర్గాలను నిరసిస్తూ తీర్మానాలు చేసినాయి. వందేమాతరం ఉద్యమ నినాదాలను నాయకులు పూర్తిగా మరచినట్లే* ప్రభుత్వ ఆశయం ఫలించి రాజకీయాల్లో మితవాదులది పైచేయి అయింది. అయితే మచిలీపట్టణంలో ఆంధ్ర జాతీయ విద్యా పరిషత్ (1907) తలపెట్టిన జాతీయ కళాశాల 1910 ఆరంభానికి పని చేయడం ప్రారంభించింది.

## ఆంధ్రోద్యమానికి నాంది

ఆంధ్రులలో పందొమ్మిదో శతాబ్ది అంతం నుండి రాజకీయ చైతన్యం ప్రస్ఫుటమయింది. వందేమాతరం ఉద్యమం, ఆ చైతన్యానికి పదును పెట్టి

* వందేమాతరం ఉద్యమ కార్యక్రమాన్ని గూర్చి నాయకుల్లోని అభిప్రాయ భేదాల ఫలితంగా కాంగ్రెస్ చీలిపోవడం, ముస్లింలీగ్ రూపంలో మతప్రోక్త రాజకీయాలు తలెత్తడం, ప్రభుత్వం అనుసరించిన ద్విముఖ విధానంవల్ల వందేమాతరం ఉద్యమం విఫలమవడం జరిగింది.

ప్రజలను కార్యోన్ముఖులను చేసింది. కానీ 1910 నుండి జాతీయ రాజకీయాల్లో స్తబ్ధత ఏర్పడడంతో ఆంధ్రులలో వికసిస్తున్న చైతన్యం ఆంధ్రోద్యమంగా రూపు దిద్దుకోసాగింది. ఆంగ్లేయులు దేశాక్రమణ క్రమంలో జయించిన ప్రాంతాలను జయించినట్లుగా కలిపి రాష్ట్రాలుగా రూపొందించారు కాని భాష, సంస్కృతి మొదలైన అంశాల ప్రాతిపదికగా రాష్ట్రాలను నిర్మించలేదు. అందుచేత భిన్న భాషా ప్రజలు ఒక రాష్ట్రంలో ఉండటం, ఒకే భాషా ప్రజలు భిన్న రాష్ట్రాలలో ఉండటం తటస్థించింది. (ఒరియా భాషా ప్రజలు మద్రాసు రాష్ట్రాల్లోనూ, కన్నడ ప్రజలు మద్రాస్, హైదరాబాద్, బొంబాయి రాష్ట్రాల్లోను) మద్రాస్ రాష్ట్రంలో ఒరియా, తెలుగు, కన్నడం, తమిళం, మళయాళ భాషల ప్రజలుండే వారు. రాజధాని ఏ భాషా ప్రాంతంలో ఉంటే ఉద్యోగాలను, ఇతర సదుపాయాలను స్థానికులు చేజిక్కించుకొనడంతో ఇతరులకు అన్యాయం జరుగుతుంది. మద్రాసు రాష్ట్రంలో తమిళ ప్రాబల్యం అధికంగా ఉండేది. మద్రాస్ రాష్ట్ర జనాభాలో తమిళ, కన్నడ, మళయాళ భాషా ప్రజలకంటే తెలుగువారి సంఖ్య ఎక్కువ అయినా ప్రభుత్వ ఉద్యోగాల్లో (జిల్లా అధికారులు మొదలు బంట్రోతు వరకు) అధిక సంఖ్యలో తమిళులుండేవారు. తమిళ జిల్లాలతో పోలిస్తే ఆంధ్ర ప్రాంతంలో విద్యావకాశాలు చాల తక్కువ ప్రాథమిక పాఠశాలల్లో సయితం ఉపాధ్యాయులలో తమిళులదే అధిక సంఖ్య.

ఈ నేపథ్యంలో గుంటూరు నుండి వెలువడుతున్న దేశాభిమాని పత్రిక ఒక వ్యాసం ప్రచురించింది (19-1-1910). ఆంధ్రులకు ప్రత్యేక సమస్యలున్నాయని ఆంధ్రులు సమైక్యంగా ఆ సమస్యలను ఆలోచించాలని హెచ్చరించింది. శరీరంలోని అవయవాలు ఆరోగ్యంగా పనిచేసినప్పుడే దేహం పుష్టిగా ఉండగలదు; అదేవిధంగా దేశంలోని ప్రజలు తమ తమ ప్రాంతాల అభివృద్ధికి కృషి చేసినప్పుడే సమగ్ర దేశాభివృద్ధి జరుగుతుందని – ఆంధ్రులు భిన్నప్రాంతాల్లో– నైజాం రాజ్యంలో, ఉత్తర సర్కారుల్లో, ఉత్తర ఆర్కాటులో చిన్నాభిన్నంగా ఉన్నారు. మింటో మార్లే సంస్కరణల ఫలితంగా కృష్ణా, గోదావరి, గుంటూరు జిల్లాలు నియోజకవర్గంగా మద్రాసు శాసనసభకు ప్రతినిధిని ఎన్నుకోవలె. దేశాభిమాని (4-2-1910) సుదీర్ఘమైన వ్యాసం వ్రాస్తూ మద్రాసు రాజకీయ సభ ఆంధ్రుల శ్రేయస్సులను రక్షించదని, ఆంధ్రులు ప్రత్యేక రాజకీయ సభ జరుపుకోవాలని సూచించింది.

[గ్రంథకర్త అకాల మరణంవల్ల వ్రాతప్రతి అసంపూర్తిగా ఇంతటితో ముగిసింది.
–ప్రచురణకర్తలు]